# భాగవత సుధాలహరి

## తృతీయ స్కంధము : ప్రథమ సంపుటము

వ్యాఖ్యాత

డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు



# భాగవత సుధాలహరి

## తృతీయ స్కంధము : ప్రథమ సంపుటము


వ్యాఖ్యాత

సరస్వతీపుత్ర

డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు

సంపాదకుడు

విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2007

**BHAGAVATA SUDHALAHARI**
Tritiya Skandha - Vol. I

***Commentary***
Saraswatiputra
**Dr. Puttaparthi Narayanacharyulu**

***Edited by***
**Mudivarthi Kondamacharyulu**
Controller of Publications, T.T.D

© All Rights reserved

T.T.D Religious Publications Series No. : 753

First Edition : 2007

Copies : 2000

***Published by***
**Sri K.V. Ramanachary,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***Printed at***
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507.

# ముందుమాట

వేదములు, ఇతిహాసములు, పురాణములు భారతీయ సంస్కృతికి మూలాధారాలు. లోకక్షేమాన్ని కాంక్షించి వ్యాసమహర్షి వేదరాశిని విభజించి, వేదార్థాలను భారతంలో వివరించాడు. అయినా ఆయనకు సంతృప్తి కలుగలేదు. అట్టి స్థితిలో నారదప్రేరితుడై భగవంతుని గుణ కర్మ నామాలను కీర్తించే శ్రీమద్భాగవత పురాణాన్ని రచించి సంతుష్టుడై తన కుమారుడైన శుకయోగిచే చదివించాడు.

అష్టాదశ పురాణాల్లో భాగవతానికున్న బహుళవ్యాప్తి మరే పురాణానికీ లేదు. ఈ గ్రంథంలో శాస్త్ర వేదాంతాది విషయాలే కాక మోక్షప్రాప్తికి హేతువులైన కర్మ భక్తి జ్ఞాన మార్గాల్లో మిక్కిలి సులభంగా అనుసరించదగిన భక్తితత్త్వం చక్కగా ప్రబోధించబడింది. జనన మరణశీలమైన సంసారసాగరంలో కూలి దరిగానక పరితపించే మానవాళికి భాగవత పురాణం సంతరణ నౌక అనడంలో సందేహం లేదు.

ఇట్టి శ్రీమద్భాగవత పురాణాన్ని క్రీ.శ. పదిహేనవ శతాబ్దిలో పరమ భాగవతోత్తముడు, సహజపాండిత్యుడు అయిన బమ్మెరపోతనామాత్యులు తెనిగించాడు. లలిత లలిత సంస్కృత సమాసాలతో, తేటతెనుగు నుడికారంతో, శబ్దాలంకార శోభితమై పోతనగారి భాగవతం ఆబాలగోపాలాన్ని ఎంతో అలరిస్తుంది. భాగవతంలోని ఒక పద్యమైనా నోటికిరాని తెలుగువాడుండడు అనటం అతిశయోక్తి కాదు.

డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులవారు వ్యాసప్రణీత భాగవత పురాణంలోని శ్లోకాలకు ప్రతిపదార్థ తాత్పర్య విశేషాలతోపాటు పోతనగారి భాగవత పద్యగద్యాలకు కూడా టీకా తాత్పర్యములు జతపరుస్తూ ప్రథమ

ద్వితీయ తృతీయస్కంధాలకు నిరుపమానమైన సురుచిర వ్యాఖ్యాన సంపుటాలను "భాగవత సుధాలహరి" అనే పేరుతో రూపొందించారు. వాటిలో ప్రథమ ద్వితీయ స్కంధాలకు సంబంధించిన ఏడుసంపుటాలు ఇదివరకే విద్వత్కవి ముదివర్తి కొండమాచార్యులవారి సంపాదకత్వాన వెలువడి లెస్సగా పాఠకుల మన్నన చూరగొన్నాయి.

పండితప్రకాండులు, బహుభాషావేత్తలు, మహాకవులు, విశేషించి సరస్వతీపుత్రులయిన డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులవారు భాగవత తృతీయ స్కంధానికి సమకూర్చిన మూడు వ్యాఖ్యాన సంపుటాలలో ఇది ప్రథమ సంపుటం. దీని సంపాదకుడు కూడ శ్రీముదివర్తి కొండమాచార్యులే.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు ధర్మప్రచారసాధనంగా చేపట్టి ఇప్పటికెన్నో ఉత్తమగ్రంథాలు ప్రచురించారు. ఎప్పటిలాగే పుట్టపర్తివారి భాగవతసుధాలహరిలోని ఈ ఎనిమిదవ తరంగం రసజ్ఞులైన ఆంధ్రపాఠకులకు ఆమోదం చేకూర్చగలదని మావిశ్వాసం.

(భూమన కరుణాకర రెడ్డి)

ధర్మకర్తల మండలి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# భాగవత సుధాలహరి
## తృతీయస్కంధము
## ప్రథమాధ్యాయము

**శ్రీశుక ఉవాచ -**

ఏవ మేతత్పురా పృష్టో మైత్రేయో భగవా న్కిల,
క్షత్త్రా వనం ప్రవిష్టేన త్యక్త్వా స్వగృహ మృద్ధిమత్. 1

యద్వా అయం మంత్రకృద్వో భగవా నఖిలేశ్వరః,
పౌరవేంద్రగృహం హిత్వా ప్రవివేశాత్మసాత్కృతమ్. 2

**రాజోవాచ -**

కుత్ర క్షత్తు ర్భగవతో మైత్రేయేణాస సంగమః,
కదా వా సహ సంవాదః ఏత ద్వర్ణయ నః ప్రభో. 3

న హ్యల్పార్థోదయ స్తస్య విదురస్యామలాత్మనః,
తస్మి న్వరీయసి ప్రశ్న స్సాధువాదోపబృంహితః. 4

**శ్రీసూత ఉవాచ -**

స ఏవ మృషివర్యోఽథ పృష్టో రాజ్ఞా పరీక్షితా,
ప్రత్యాహతం సుబహువి త్ప్రీతాత్మా శ్రూయతా మితి. 5

**శ్రీశుక ఉవాచ -**

యదా తు రాజా స్వసుతా నసాధూ
న్పుష్ణ న్నధర్మేణ వినష్టదృష్టిః,
భ్రాతుర్యవిష్ఠస్య సుతా న్విబన్ధూ
న్ప్రవేశ్య లాక్షాభవనే దదాహ. 6

యదా సభాయాం కురుదేవదేవ్యాః
కేశాభిమర్శం సుతకర్మ గర్హ్యమ్,
న వారయామాస నృప స్స్నుషాయా
స్స్వాస్త్రైర్హరంత్యాః కుచకుంకుమాని. 7

ద్యూతే త్వధర్మేణ చ తస్య సాధో
స్సత్యావలంబస్య వనాగతస్య,
న యాచతో౽దా త్సమయేన దాయం
తమోజుషాణో య దజాతశత్రోః 8

యదా చ పార్థప్రహిత స్సభాయాం
జగద్గురు ర్యాని జగాద కృష్ణః,
న తాని పుంసా మమృతాయనాని
రాజోరుమేనే క్షతపుణ్యలేశః. 9

య దోపహూతో భవనం ప్రవిష్టో
మంత్రాయ పృష్టః కిల పూర్వజేన,
అథాహతం మంత్రదృశాం వరీయా
న్యన్మంత్రిణో వైదురికం వదంతి. 10

శ్రీవిదుర ఉవాచ-

అజాతశత్రోః ప్రతియచ్ఛ దాయం
తితిక్షతో దుర్విషహం తవాగః.
సహానుజో యత్ర వృకోదరా౽హి
శ్శ్వసన్రుషాయ త్త్వ మలం బిభేషి 11

పార్థాం స్తు దేవో భగవా న్ముకుందో
గృహీతవా న్స క్షితిదేవదేవః,
ఆస్తే స్వపుర్యాం యదుదేవదేవో
వినిర్జితాశేషన్ను దేవదేవః. 12

స ఏష దోషః పురుషద్వి డాస్తే
గృహా న్ప్రవిష్టో౽యు మపత్యమత్యా.
పుష్ణాసి కృష్ణా ద్విముఖో గతశ్రీ
స్త్యజా౽శ్వసేనం కులకౌశలాయ. 13

ఇత్యూచివాం స్తత్ర సుయోధనేన
ప్రవృద్ధకోపస్ఫురితాధరేణ,
అసత్కృతస్సన్ స్పృహణీయశీల:
క్షత్తా స కర్ణానుజసౌబలేన. 14

క ఏన మత్రోపజుహావ జిహ్మం
దాస్యా స్సుతం యద్బలి నైవ పుష్ట:,
తస్మి న్ప్రతీప: పరకృత్య ఆస్తే
నిర్వాస్యతా మాశు పురాచ్ఛ్వసాన:. 15

స ఇత్థ మత్యుల్బణకర్ణబాణై
ర్భ్రాతు: పురో మర్మసు తాడితోఽపి,
స్వయం ధను ర్ద్వారి నిధాయ మాయాం
గతవ్యథోఽయా దురుమానయాన:. 16

స నిర్గత: కౌరవపుణ్యలబ్ధో
గజాహ్వయా త్తీర్థపద: పదాని,
అన్వాక్రమ త్పుణ్యచికీర్షయోర్వ్యా
మధిష్ఠితో యాని సహస్రమూర్తి:. 17

పురేషు పుణ్యోపవనాద్రికుంజే
ష్వపంకతోయేషు సరిత్సరస్సు,
అనంతలింగై స్సమలంకృతేషు
చచార తీర్థాయతనే ష్వనన్య:. 18

గాం పర్యట న్మేధ్యవివి క్తవృ త్తి
స్సదాఽఽప్లుతోఽధశ్శయనోఽవధూత:,
అలక్షిత స్స్వై రవధూతవేషో
వ్రతాని చేరే హరితోషణాని. 19

ఇత్థం వ్రజ న్భారత మేవ వర్షం
కాలేన యావ ద్గతవా న్ప్రభాసమ్,
తావ చ్ఛశాస క్షితి మేకచక్రా
మేకాతపత్రా మజితేన పార్థ:. 20

తత్రైవ శుశ్రావ సుహృద్వినష్టిం
వనం యథా వేణుజవహ్నిసంశ్రయమ్.
సంస్పర్ధయా దగ్ధ మథానుశోచన్
సరస్వతీం ప్రత్య గియామ తూష్ణీమ్. 21

తస్యాం త్రిత స్యోశనపో మనో శ్చ
పృథో రథాఖ ౖ గ్నే రసితస్య వాయోః,
తీర్థం సుదాసస్య గవాం గుహస్య
య చ్ఛ్రాద్ధదేవస్య స ఆసిషేవే. 22

అన్యాని చై వం ద్విజదేవదేవైః
కృతాని నానాయతనాని విష్ణోః,
ప్రత్యఙ్గముఖ్యాంకితమందిరాణి
యద్దర్శనా త్కృష్ణ మనుస్మరన్తి. 23

తత స్త్వతివ్రజ్య సురాష్ట్ర మృద్ధం
సౌవీరమత్స్యాన్ కురుజాంగలాం శ్చ,
కాలేన తావ ద్యమునా ముపేత్య
తత్రోద్ధవం భాగవతం దదర్శ. 24

స వాసుదేవానుచరం ప్రశాంతం
బృహస్పతేః ప్రాక్తనయం ప్రతీతమ్,
ఆలింగ్యగాఢం ప్రణయేన భద్రం
స్వానా మపృచ్ఛ ద్భగవత్ప్రజానామ్. 25

కచ్చి త్పురాణౌ పురుషౌ స్వనాభ్య
పాద్మానువృత్త్యేహ కిలాఖవతీర్ణౌ,
ఆసాత ఉర్వ్యాః కుశలం విధాయ
కృతక్షణౌ కుశలం శూరగేహే. 26

కచ్చి త్కురూణాం పరమ స్సుహృన్నో
భావ స్స ఆస్తే సుఖ మంగ శౌరిః,
యో వై స్వస్రూణాం పితృవ ద్దదాతి
వరా న్వదాన్యో వరతర్పణేన. 27

కచ్చి ద్వరూధాధిపతి ర్యదూనాం
ప్రద్యుమ్న ఆస్తే సుఖ మంగవీర:,
యం రుక్మిణీ భగవత్తో౽భిలేభ
ఆరాధ్య విప్రాన్స్మర మాదిసర్గే. 28

కచ్చి త్సుఖం సాత్వతవృష్టిభోజ
దశార్హకాణా మధిప స్స ఆస్తే,
య మభ్యషించ చ్ఛతపత్రనేత్రో
నృపాసనాశాం పరిహృత్య దూరాత్. 29

కచ్చి ద్ధరే స్సౌమ్యసుత స్సదృక్ష
ఆస్తే౽గ్రణీ రథినాం సాధు సాంబ:,
అసూత యం జాంబవతీ వ్రతాఢ్యా
దేవం గుహం యో౽౦బికయా ధృతో౽గ్రే. 30

క్షేమం స కచ్చి ద్యుయుధాన ఆ స్తే
య: ఫల్గునా ల్లబ్ధధనూరహస్య:,
లేభే౽౦జసా౽ధోక్షజసేవ యైవ
గతిం తదీయాం యతిభి ర్దురాపామ్. 31

కచ్చి ద్బుధ స్స్వస్త్యన మీవ ఆస్తే
శ్వఫల్గుపుత్రో భగవత్ప్రపన్న:,
య: కృష్ణపాదాంకితమార్గపాంసు
ష్వవేష్టత ప్రేమవిభిన్నధైర్య:. 32

కచ్చి త్సుఖం దేవకభోజపుత్ర్యా
విష్ణుప్రజాయా ఇవ దేవమాతు:,
యా వై స్వగర్భేణ దధార దేవం
త్రయీ యథా యజ్ఞవితాన మర్థమ్. 33

అపి స్విద౽దాస్తే భగవాన్ సుఖం వో
య స్సాత్వతాం కామదుఘో౽నిరుద్ధ:,
య మామనంతి స్మ హి శబ్దయోనిం
మనోమయం సత్త్వతురీయతత్త్వమ్. 34

అపిస్వి దన్యే చ నిజాత్మదైవ
మనన్యవృత్త్యా సమనువ్రతా యే,
హృదీకసత్యాత్మజచారుదేష్ణ
గదాదయ స్స్వస్తి చరంతి సౌమ్య. 35

అపి స్వదోర్భ్యాం విజయాచ్యుతాభ్యాం
ధర్మేణ ధర్మః పరిపాతి సేతుమ్,
దుర్యోధనోఽతప్యత యత్సభాయాం
సామ్రాజ్యలక్ష్మ్యా విజయానువృత్త్యా. 36

కిం వా కృతాఘే ష్వఘ మత్యమర్షీ
భీమోఽహివ ద్దీర్ఘతమం వ్యముంచత్
యస్యాఽంఘ్రిపాతం రణభూ ర్న సేహే
మార్గం గదాయా శ్చరతో విచిత్రమ్. 37

కచ్చి ద్యశోధా రథయూధపానాం
గాండీవధన్వోపరతారి రాస్తే,
అలక్షితో య చ్ఛరకూటగూఢో
మాయాకిరాతో గిరిశ స్తుతోష. 38

యమా వుతస్విత్ స్త నపౌ పృథాయాః
పార్థై ర్వృతౌ పక్ష్మభి రక్షిణీవ,
రేమాత ఉద్దాట్య మృధే స్వరిక్థం
సుధాం సుపర్ణా వివ వజ్రివక్త్రాత్. 39

అహో పృథాపి ధ్రియతేఽ ర్భకార్థే
రాజర్షివర్యేణ వినాపి తేన,
యస్త్వేకవీరోఽతిరథో విజిగ్యే
ధనుర్ద్వితీయః కకుభ శ్చతస్రః. 40

సౌమ్యాఽనుశోచే త మధఃపతంతం
భ్రాత్రే పరేతాయ విదుద్రుహే యః,
నిర్యాపితో యేన సుహృ త్స్వపుర్యా
అహం స్వపుత్రా న్సమనువ్రతేన. 41

సోఽహం హరే ర్మర్త్యవిడంబనేన
దృశో నృణాం చాలయతో విధాతుః,
నాఽన్యోపలక్ష్యః పదవీం ప్రసాదా
చ్చరామి పశ్య న్గతవిస్మయోఽత్ర. 42

నూనం నృపాణాం త్రిమదోత్పథానాం
మహీం పున శ్చాలయతాం చమూభిః,
వధా త్ప్రపన్నార్తిజిహీర్షయేశో
ప్యుపైక్షతాఽఘం భగవా న్కురూణామ్. 43

అజస్య జన్మోత్పథనాశనాయ
కర్మా ణ్యకర్తు గ్రహణాయ పుంసామ్,
న త్వన్యథా కోఽర్హతి దేహయోగం
పరో గుణానా ముత కర్మతంత్రమ్. 44

తస్య ప్రపన్నాఖిలలోకపానా
మవస్థితానా మనుశాసనే స్వే,
అర్థాయ జాతస్య యదుష్వజస్య
వార్తాం సఖే కీర్తయ తీర్థకీ ర్తేః. 45

ఇతి శ్రీమద్భాగవతే, మహాపురాణే, పారమహంస్యాం, సంహితాయాం,
తృతీయస్కంధే, ప్రథమోఽధ్యాయః

**అర్థములు :**

**1. శ్లో :** బుద్ధిమత్ = సమస్త సమృద్ధులు గల, స్వగృహం = తనయింటిని, త్యక్త్వా = ఉపేక్షించి, వనం = అరణ్యమును, ప్రవిష్టేన = ప్రవేశించి యున్నట్టి, క్షత్రా = క్షత్రియుఁడైన విదురునిచేత, పురా = ముందు, భగవాన్ = జ్ఞానాది పరిపూర్ణుఁడైన, మైత్రేయః, మైత్రేయమహర్షి, ఏతత్ = ఇది, ఏవం = ఈ ప్రకారము, పృష్టః = అడుగఁబడినాఁడు.

మూడవస్కంధమందు ముప్పది మూఁడధ్యాయములతో సర్గములని పిలువఁబడెను. ఈశ్వరుని మొదటిలీలను శుకమహర్షి పరీక్షిత్తున కుపదేశించుచున్నాఁడు. సృష్టింపవలెననెడు నిచ్ఛ యీశ్వరున కేర్పడినది. అప్పుడు తనయందు

లయించియున్న ప్రకృతిగుణములైన సత్త్వాదుల కాతఁడు బహిర్గమనమును గలిగించెను. ఆ యిచ్ఛతో నాతఁడు ప్రకృతిని దయాపూర్వకముగాఁ గటాక్షించె నని వేదము చెప్పుచున్నది. స ఐచ్ఛత బహుస్యాం ప్రజాయేయః" అని యా వేదవచనము, ఈశ్వరుని కటాక్షముతో, మాయాగుణములు క్షోభించెను. ఆ పరిణామముతో బ్రహ్మాండ మేర్పడెను. ఈ క్రమమును వివరించుటకే సర్గమని పేరు.

మొదటియధ్యాయమందు ఇల్లువిడచివచ్చిన విదురునకు ఉద్ధవునితో జరిగిన సంభాషణము వివరింపఁ బడినది. భాగవతసంప్రదాయము రెండురీతులుగాఁ బ్రవర్తించును. ఒకానొక విషయమును గూర్చి మొదట సూక్ష్మముగాఁ జెప్పుట జరగును. తరువాత తద్వివరణము. శ్రీనారాయణుఁడు బ్రహ్మకును, బ్రహ్మ నారదునకును ఉపదేశించినట్లుగా సృష్టిప్రకారము సంక్షేపముగా వివరింపఁబడినది. తరువాత సనత్కుమారున కాదిశేషుఁడును, ఆ సనత్కుమారుఁడు సాంఖ్యాయనుఁడను మహర్షికిని విస్తృతముగా వర్ణించి యుపదేశించిరి. ద్వితీయస్కంధమందు శ్రీనారాయణ బ్రహ్మసంవాదముగా భాగవతము సంక్షేపముగా వివరింపఁబడినది. అదియే బ్రహ్మనారద సంవాదముగాఁ బూర్వముకంటెఁ గొంత విపులముగా వర్ణింపఁబడినది. ఆ విషయమునే యాదిశేషుఁ డధికముగా విస్తరించి చెప్పెను. ఈ సంగతి మూఁడవ స్కంధమునుండి యారంభమగును. మూఁడవస్కంధమందు మొదటినాల్గధ్యాయములలో విదురమైత్రేయ సమాగమము వర్ణింపఁబడినది. ఆపై నెనిమిది యధ్యాయములలో కారణాది సృష్టిసహితమైన సర్గము విస్తరింపఁబడినది. తరువాతి యేడధ్యాయములలో విసర్గమనెడు లీలావర్ణనము. దానియందే వరాహావతార లీలావర్ణనము వచ్చును. ఒకయధ్యాయములో విసర్గసమాహారము. నాలుగధ్యాయములలో దానియొక్క ప్రసంగావసరములోఁ దటస్థించిన కపిలావతారమును జెప్పఁబడినది. తరువాత తొమ్మిదియధ్యాయములలోఁ గపిలచరిత్రము వచ్చును. ఈ రీతిగా ముప్పదిమూఁడధ్యాయములలోఁ దృతీయస్కంధము ముగియును.

**అవతారిక** : కాలపరిణామము కల్పలక్షణము. పద్మమనెడు కల్పమును గూర్చిన వివరము వచింతు నని శుకమహర్షి ప్రతిజ్ఞచేసినాఁడు. తన్నిర్వహణమునకై కథ నారంభించుచున్నాఁడు. ఐశ్వర్యసమృద్ధి గల స్వగృహమును వదలి విదురుఁడు కాననముల కేగెను. అప్పు డచ్చట మైత్రేయమహాముని దర్శన మైనది. ఓ

పరీక్షిద్రాజా! నీవు న న్నడిగిన ప్రశ్ననే విదురుఁడు మైత్రేయు నడిగినాఁడు. ప్రపంచమందు వైరాగ్య మేర్పడియే విదురుఁడు వనప్రవేశ మొనర్చెననుటను సూచించుటకే "బుద్ధిమత్" - అను విశేషణము వాడఁబడినది. అప్పుడు మైత్రేయుని దర్శించెడి భాగ్య మేర్పడినది. జ్ఞానోత్పత్తి కాచార్యలాభము ప్రధాన కారణము.

**2. శ్లో** : నః = మీకు, మంత్రకృత్ = ఆయాసమయములందుఁ గర్తవ్యము నుపదేశించునట్టి భగవాన్ = సకలైశ్వర్య పూర్ణుఁడైన, అఖిలేశ్వరః = సమస్తమును నియమించెడు కృష్ణపరమాత్మ, పౌరవేంద్రగృహం = తన యాతిథ్యమునకై యేర్పాటు చేయఁబడిన ధృతరాష్ట్రుని మందిరమును, హిత్వా = ఉపేక్షించి, యద్వా = ఏ గృహమును, ఆత్మసాత్కృతం = తన గృహమనియే యెంచి, ప్రవివేశ = ప్రవేశించెనో,

**అవతారిక** : విదురగృహము యొక్క పరిశుద్ధిని బ్రకాశింపఁజేయుచుఁ బూర్వము నడచిన యొకకథ నుదాహరించుచున్నాఁడు.

**తాత్పర్యము** : ఓ రాజా! నీ పితామహులైన పాండవులకు సర్వోపదేశకుఁడును గృష్ణపరమాత్మయేగదా! ఆతఁడు షడ్గుణైశ్వర్యపరిపూర్ణుఁడైన భగవంతుఁడు. సర్వజగన్నియంత. కృష్ణపరమాత్మ రాయబారమునకు వెళ్లినాఁడు. దుర్యోధనుఁ డాతనియాతిథ్యమునకై సర్వసంపదుద్భాసితమైన యొకగృహము నేర్పాటు చేసినాఁ డు. కృష్ణుఁడచ్చట దిగలేదు. ఆతఁడు విదురునింటి కేగెను. ఆ గృహమందున్న సమృద్ధి - పరిశుద్ధి అట్టిది! అట్టి గృహమును వదలి విదురుఁ డడవులఁ బ్రవేశించినాఁ డు. ఆతనివైరాగ్య మెంతటిదో యూహించికొనుము.

**3. శ్లో** : కుత్ర = ఎక్కడ; క్షత్తుః = క్షత్రియుఁడైన విదురునకు, భగవతామైత్రేయేణ = భగవంతుఁడైన మైత్రేయునితో, సంగమః = సమాగమము. ఆస = ఏర్పడినది, సహసంవాదః = అన్యోన్యసంభాషణము, కదా = ఎప్పుడు, ఆస. ఏతత్ = దీనినంతయు, ప్రభో! = ఓ శుకమహర్షీ! నః = మాకు, వర్ణయ = వివరించి చెప్పుము".

**తాత్పర్యము** : రాజనుచున్నాఁడు. "ఓ పవిత్రుఁడవైన శుకమహర్షీ! మైత్రేయవిదురులకు సమాగమము ఎప్పుడు ఎచ్చట నేర్పడినది? వారినడుమ సాఁగిన సంవాద మేమి? ఈ విషయములను స్పష్టముగా మాకు వివరించి చెప్పుము.

**4. శ్లో** : అమలాత్మనః = నిర్మలమైన మనస్సుతోఁగూడిన, అస్య విదురస్య = ఈ విదురునకు, వరీయసితస్మిన్ = శ్రేష్ఠుఁడైన మైత్రేయునందు, ప్రశ్నః = ప్రశ్నము, అల్పార్థోదయః = అల్ప విషయములకు సంబంధించినదిగా, నహి = ఉండదుగదా! సాధువాదోపబృంహితః = ఏదైన నుత్తమ విషయమును గూర్చిన సంవాదముగనే యుండియుండును.

**అవతారిక** : అన్యవిషయములను విడచి విదురమైత్రేయ సంవాదమునే వర్ణించుటకుఁగల కారణమును జెప్పుచున్నాఁడు.

**తాత్పర్యము** : పరమనిర్మలమైన చిత్తముగలవాఁడు విదురుఁడు. జ్ఞానులలో శ్రేష్ఠుఁడు మైత్రేయుఁడు. వీరిర్వురి సంవాదము గొప్పవిషయములను గూర్చియే యుండును. అ ఇర్వురు గొప్పవారు. అల్పవిషయములను గూర్చి మాటాడికొని యుండరుగదా!

**5. శ్లో** : పరీక్షితా రాజ్ఞా = రాజైన పరీక్షిత్తుచేత, ఏవం పృష్టః = ఈ రీతిగా నడుగఁబడిన, ఋషివర్యః = ఋషిశ్రేష్ఠుఁ డైనట్టియు, సుబహువిత్ = బ్రహ్మజ్ఞానియునైన, అయం = శుకమహర్షి, ప్రీతాత్మా = సంతోషముగొన్న మనస్సుగలవాఁడై, శ్రూయతాం ఇతి = విను మని, తం = ఆ రాజునుగూర్చి, ప్రత్యాహ = ఉత్తరము చెప్పఁబూనెను.

**తాత్పర్యము** : సూతుఁడన్నాఁడు. శుకుఁడు బ్రహ్మజ్ఞానులలో నుత్తముఁడు. మహర్షులలో శ్రేష్ఠుఁడు. పరీక్షిన్మహారాజు ప్రశ్నతో నాతని కెంతయో సంతోషమైనది. చెప్పెదను వినుమని యుత్తర మారంభించెను.

**6. శ్లో** : వినష్టదృష్టిః = బయటిరెండు కండ్లును అవివేకముతో నాంతరికమైన జ్ఞానమనెడులోచనము నశించిన, రాజా = రాజైన విదురుఁడు, అసాధూన్ = అయోగ్యులైన, స్వసుతాన్ = తనపుత్రులను, అధర్మేణపుష్ణన్ = అధర్మముతో నభివృద్ధిఁ బొందించుచున్నవాఁడై, యవిష్ఠస్య = తనకంటెఁ జిన్నవాఁడైన, భ్రాతుః = సహోదరుఁడైన పాండురాజుయొక్క, విబంధూన్ = బంధు జాలములేని, సుతాన్ = కొడుకులను, లాక్షాభవనే = లాక్షా గృహమందు, దదాహ = దహించెను.

**అవతారిక** : విదురుఁడు వనములకు వచ్చుటకుఁ గారణములను తెల్పుచుఁ కౌరవుల దురాగతములను వివరించుచున్నాఁడు.

**తాత్పర్యము** : ధృతరాష్ట్రుఁడు జాత్యంధుఁడు. దానికిఁ దోడు వివేకమను లోచనముగూడ నశించినది. ఆతనిపుత్రులు దుస్స్వభావులు. తండ్రి వారిపోకడలనే

యవలంబించినాఁడు. అధర్మముతో వారినిఁ బరిపుష్టి నందించుచు వచ్చెను. పాండవులు దన తమ్ముని కొడుకులు. ఆ యభిమానము నాతఁడు దొలఁగించికొన్నాఁడు. వారిని లాక్షాగృహమునందుంచి దహింపఁజేసెను. అవియన్నియు దుర్యోధనుని కృత్యములే. కాని వాని యన్నిటికిని ధృతరాష్ట్రుని తోడ్పాటున్నది.

7. శ్లో : నృపః = రాజైన ధృతరాష్ట్రుఁడు, సభాయాం = సభయందు, కురుదేవదేవ్యాః = కురురాజుల భార్యయు, కుచకుంకుమాని = ఎదకుఁబట్టించికొన్న కుంకుమపూఁతలను, స్వాస్రైః = తనకన్నీటిచేత, హరంత్యాః = తొలఁగించుచున్నదియునైన, స్నుషా = తనకోడలైన ద్రౌపదియొక్క, గర్హ్యం = సర్వలోక నిందితమైన, కేశాభిమర్శం = వెంట్రుకలనుబట్టి యీ డ్చుటయనెడు, సుతకర్మ = దుర్యోధనుని చెయిదమును, యదా న వారయామాస = ఎప్పుడు ప్రతిషేధింపక యుపేక్షించెనో.

**తాత్పర్యము** : నిండుసభ. ఆ సభలోనికి ద్రౌపదినీడ్చికొనివచ్చినాఁడు. ఆమె దనవక్షమునకుఁ బూసికొన్న కుంకుమమును, గన్నీటితోఁ దడుపుచు సభలో నిలువఁబడినది. ఆమె కురువంశ శ్రేష్ఠుఁడైన ధర్మరాజు పట్టమహిషి. దుశ్శాసనుఁ డామె వెంట్రుకలను బట్టి యీడ్చెను. ఇది సర్వలోకములును గర్హించిన కర్మ. ఐనను ధృతరాష్ట్రుఁడు నివారింపలేదు. ఉపేక్షించి యూరకున్నాఁడు.

8. శ్లో : ద్యూతే = జూదమందు, అధర్మేణ = అధర్మముగా, జితస్య = జయింపఁబడినవాఁడును. సత్యావలంబస్య = సత్యమునే యాశ్రయించి నిలిచినవాఁడును. సాధోః = శాంత్యాది గుణములు గలవాఁడును. వనాగతస్య = చేసికొన్న యొప్పందము ప్రకారము వనములనుండి తిరిగివచ్చినవాఁడును, సమయేన = చేసికొన్న నియమము ననుసరించి, యాచతః = రాజ్యభాగమును యాచించుచున్న, అజాతశత్రోః = ధర్మరాజునకు, తమోజుషాణః = అజ్ఞానపూర్ణుఁడైన ధృతరాష్ట్రుఁడు, దాయం = చెల్లింపవలసిన భాగమును, యదా న అదాత్ = ఎప్పు డీయఁడయ్యెనో:

**తాత్పర్యము** : కురుపాండవులకు జూదము జరిగెను. ఆ జూదములో ధర్మరా. జోడినాఁడు. ఆ యోటమియు, మోసముతో నేర్పడినది. ధర్మరాజు శాంత్యాదిగుణము లవలంబించినవాఁడు. సత్యమును మాత్రమే యాశ్రయించినవాఁడు. ఆతఁడు చేసికొన్నప్రతిజ్ఞప్రకారము వనవాసమును అజ్ఞాతవాసమును ముగించివచ్చెను. తిరిగివచ్చి తనరాజ్యభాగ మడిగెను. కాని ధృతరాష్ట్రుఁడజ్ఞానావిష్టుఁడు. చేసికొన్న యొప్పందము ననుసరించి రాజ్యభాగ మొసఁగఁడయ్యెను.

**9. శ్లో** : పార్థప్రహితః = రాజైనధర్మజునిచేఁ బంపఁబడినవాఁడును, జగద్గురుః = సమస్తలోకగురునైన, కృష్ణః = శ్రీకృష్ణుఁడు, సభాయాం = సభయందు యాని జగాద = ఏ విషయములను జెప్పెనో, పుంసాం = పురుషులకు అమృతాయనాని = అమృతమును వర్షించుచున్నట్టి, తాని = ఆ వాక్యములను, క్షతపుణ్యలేశః = క్షీణించిన పుణ్యలేశముగల, రాజా = రాజైన ధృతరాష్ట్రుఁడు, యదా ఉరుమేనే = ఎప్పుడు గౌరవింపకపోయెనో-

**తాత్పర్యము** : కుంతీపుత్రులు కృష్ణుని రాయబారిగా నంపినారు. ఆతఁడు జగద్గురువు. నిండుసభలో నాతఁడు హితవు చెప్పెను. కృష్ణపరమాత్ముని మాటలు భీష్మాదుల చెవులలో నమృతము వర్షించునవై యుండెను. కాని ధృతరాష్ట్రుని చెవుల కవి యెక్కలేదు. వానికున్న యల్పపుణ్యముగూడ నశించియున్నది. వాఁడాతనిమాటలు తృణీకరించినాఁడు.

**10. శ్లో** : పూర్వజేన = జ్యేష్ఠుఁడైన ధృతరాష్ట్రునిచేత, ఉపహూతః = ఆహ్వానింపఁబడిన వాఁడును, భవనం = ధృతరాష్ట్రభవనమును, ప్రవిష్టః = ప్రవేశించినవాఁడును, మంత్రాయ = కార్యాకార్యవిచారమునుగూర్చి, పృష్టః = అడుగఁబడినవాఁడును, మంత్రదృశాం = ఆలోచనము చెప్పువారిలో, వరీయాన్ = శ్రేష్ఠుఁడైనవిదురుఁడు, అథ = అన్నతోఁ బ్రశ్నింపఁబడినవాఁడై, తం = అతనిని గూర్చి, ఆహ = పలికెను, యత్ = ఏపలుకుటను, మంత్రిణః = సదుపదేశకులు, వైదురికం = విదురసంబంధమైన దానినిగా, వదంతి = పలుకుదురో.

**తాత్పర్యము** : అనంతరము ధృతరాష్ట్రుఁడు విదురునిఁగార్యాలోచనమునకై పిలిచినాఁడు. అన్నపిలుపునందుకొని తమ్ముఁడు రాజగృహమునకేగెను. అతఁడు కర్తవ్యాకర్తవ్యములుపదేశించినాఁడు. ఆయుపదేశము సామాన్యమైనదిగాదు. సర్వాతిశయమైయుండెను. విదురునియుపదేశము నేటికిని విద్వాంసులలో వైదురికమనుపేరఁ బ్రసిద్ధమైయున్నది.

**11. శ్లో** : దుర్విషహం = అతికష్టముతో సహింపఁదగిన, తవ ఆగః = నీయపరాధమును, తితిక్షతః = ఓర్చుకొనుచున్నట్టి, అజాతశత్రోః = ధర్మరాజునకు, దాయం = చెల్లించవలసిన రాజ్యభాగమును, ప్రతియచ్ఛ = ఇమ్ము. యత్ర = ఏ పక్షమందు, రుషా = అత్యంతకోపముచేత, శ్వసన్ = బుసకొట్టుచున్నవాఁడై, సహానుజ = తమ్ములతోఁగూడిన, వృకోదరాహిః = భీమసేనుఁ డనెడు మహాసర్పము, ఆస్తే = ఉన్నాఁడో, యత్ = దేనినిజూచి, త్వం = నీవు, అలంబిభేషి = ఎక్కువగా భయపడుచుందువో.

**అవతారిక** : విదురుఁడు చెప్పిన యుపదేశమును, సూక్ష్మముగా వర్ణించుచున్నాఁడు.

**తాత్పర్యము** : అన్నా! నీ వొనర్చిన యపరాధము ఎవ్వరికైనను సహింపరానిది. అట్టిదోషమును ధర్మరాజు అత్యంతమైన యోర్పుతో క్షమించినాఁడు. తక్కిన సోదరులకు ఓర్పు సమ్మతముగా లేదు. భీమసేనుఁడు మహాకోపి. అతఁడు తమ్ములను కూడఁగట్టుకొన్నాఁడు. గొప్పసర్పమువలెఁ బ్రతీకారమునకై బుసలుకొట్టుచున్నాఁడు. నిజమునకు వానినిఁదలఁచికొన్నంతనే నీకు మహాభయము.

**12. శ్లో** : సద్విజదేవః = దేవతలతోను, బ్రాహ్మణులతోను గూడికొన్నవాఁడైన, యదుదేవ దేవః = యాదవులలో నత్యంతప్రముఖులకుఁగూడ సేవింపఁదగినవాఁడును, వినిర్జితాశేషనృదేవ దేవః = తన పరాక్రమముచే జయింపఁబడిన, ప్రసిద్ధులైన సకలదేశాధీశ్వరులు గలవాఁడునునైన, ముకుందః = తన్నుఁగొల్చువారికి మోక్షమీయఁగలిగిన, భగవాన్ = జ్ఞానాది పరిపూర్ణుఁడైన, దేవః = దేవుఁడైన కృష్ణపరమాత్మ, పార్థాన్ = కుంతీపుత్రులను, గృహీతవాన్ = తన వారినిగా గ్రహించినవాఁ డయ్యెను. స్వపుర్యాం = తనపట్టణమైన ద్వారకాపురిలో, ఆస్తే = ఉన్నాఁడు.

**తాత్పర్యము** : ధర్మపుత్రాదులకు బలముగలసాయములేదని తలఁపకుము, వారికి సహాయమున్న యొక్కవ్యక్తితో త్రైలోక్యమును జయించుటకును సాధ్య మగును. మిమ్ములను జయించుట కష్టమా? కృష్ణపరమాత్ముఁ డెవరనుకున్నావు? తన్ను సేవించువారికి ముక్తినీయఁగలిగిన షడ్గుణైశ్వర్య పరిపూర్ణుఁడు. ఆ కృష్ణుఁడు కుంతీనందనులను స్వజనులనుగా స్వీకరించినాఁడు. ఆతనివెనుక మహాతపస్సులైన బ్రాహ్మణు లున్నారు. ఇంద్రాదిదేవత లున్నారు. యదుప్రవీరు లంద రాతనికిఁ బెట్టనికో టలు. భూలోకమందలి సమస్తరాజులు నాతని పరాక్రమమునకు దాసోహమన్నవారే. అతఁడు దూరమం దెచ్చటను లేఁడు. కతిపయ ప్రయాణములతోఁ జేరఁదగిన ద్వారకాపట్టణమందే విలసిల్లుచున్నాఁడు. కనుక పాండవులతో వైరమును గట్టికొనకుము. వారికి న్యాయమైన రాజ్యభాగము నిమ్ము. లేకున్న మహాభయసంప్రాప్తి తప్పదు. కృష్ణుని మనుష్యమాత్రునిగా నను కొనకుము. అతఁడు భూలోకమున నవతరించిన భగవంతుఁడు.

**13. శ్లో** : పురుషద్విట్ = పరమపురుషుని ద్వేషించుచున్నవాఁడును, గృహాన్‌ప్రవిష్టః = నీనగళులలో సంచరించుచున్నవాఁడును నైన, సః ఏషః = ఈ దుర్యోధనుఁడనెడువాఁడు, దోషః = సర్వదోషస్వరూపుడుఁగా, ఆస్తే = ఉన్నాఁడు, యం =

ఎవనిని, అపత్యమత్యా = పుత్రభావముతో, పుష్ణాసి = పోషించుచున్నావో, అశౌచం = అమంగళకరుఁడైన, తం = వానిని, ఆశు = శీఘ్రముగా, కులకౌశలాయ = వంశముయొక్క క్షేమమునకై, త్యజ = వదలిపెట్టుము, అన్యథా = అట్లు చేయకున్నచో, కృష్ణాత్ = కృష్ణపరమాత్మ నుండి, విముఖః = విరోధము దెచ్చిపెట్టికొన్నవాఁ డవుగను, గతశ్రీః పోయినరాజ్యముగలవాఁడవుగను, భవిష్యసి = కాఁగలవు.

**తాత్పర్యము** : అవః పాండుపుత్రులకు రాజ్య మిమ్మని నన్నేటికి నిర్బంధింతువు?. నాపుత్త్రుఁడైన దుర్యోధనున కనిష్టము నే నెట్లొనర్పఁగలను? "అను ధృతరాష్ట్రుని చాపల్యమును దొలఁగించుటకై చెప్పుచున్నాఁడు. పుత్రుఁడనఁగా తండ్రిని నరకదుః ఖమునుండి తప్పించువాఁడు. నీపుత్రుఁ డట్టివాఁడు గాఁడు. వానిని పుత్రుఁడని పరమాదరముతోఁ జూచుచున్నావు. నీ యాదరమును బంచికొని నీ గృహములలో సంచరించుచున్నాఁడు దుర్యోధనుఁడు. నిజముగా నీకుఁ బుత్త్రుఁడుగాఁడు. శత్రువు. శరీరమును నశింపఁజేయు త్రిదోషములవలె సర్వదోషములును ఆకారమును దీసికొన్నవాఁడు దుర్యోధనుఁడు. నీ కులమును రక్షించికొనుటకు వానిపై నున్న ప్రేమను దొలఁగించికొనుము. "త్యజేదేకం కులస్యార్థే" అనునది నీతి. నీ వట్లుచేయకున్నచో ఈశ్వరద్వేషియైన యీ దుర్యోధనుఁడు నీవంశమునంతయు నాశ మొనర్చును.

**14. శ్లో** : ఇతి = ఇట్లు, ఊచివాన్ = చెప్పినవాఁ డయ్యెను. సత్+స్పృహణీయ శీలః = సత్పురుషు లాచరింపఁదగిన స్వభావమున్నవాఁడును. క్షత్తా = క్షత్రియుఁ డైన విదురుఁడు, తత్ర = అక్కడ, ప్రవృద్ధకోపస్ఫురితాధరేణ - ప్రవృద్ధ = ఎక్కువయైన, కోప = కోపముచేత, స్ఫురిత = చలించుచున్న, అధరేణ = పెదవులుగలట్టియు, సకర్ణానుజసౌబలేన = కర్ణుఁడు అనుజుఁడగు దుశ్శాసనుఁ డు, శకుని - వీరితోఁ గూడినవాఁడైన, సుయోధనేన = దుర్యోధనునిచేత, అసత్కృతః = అవమానింపఁబడినవాఁ డయ్యెను.

**తాత్పర్యము** : విదురుఁడు సత్పురుషులందఱును గౌరవించి యాచరింపఁదగిన ప్రసిద్ధమైన శీలముగలవాఁడు. ఆతఁడు ధృతరాష్ట్రునకుఁ బరమహితమైన యుపదేశ మిచ్చినాఁడు. ఈ మాటలు దుర్యోధనునకు సహింపరాని వయ్యెను. ఆతఁడు కోపమయమహావృక్షము. కర్ణుఁడు, తమ్ముఁడైన దుశ్శాసనుఁడు, మేనమామయైన శకుని - వీరందరు వానికోపము నెగద్రోయుచుండిరి. రోషముతో దుర్యోధనుని పెదవులు చలించుచుండినవి. వాఁడు నిండుసభలో విదురు నవమానించినాఁడు.

**15. శ్లో** : జిహ్మం = కుటిలస్వభావము గలిగిన, దాస్యాస్సుతం = దాసీపుత్రుఁడైన, ఏనం = వీనిని, అత్ర = ఇచ్చటికి, కః = ఎవఁడు, ఉపజుహావ = ఆహ్వానించినాఁడు. యద్బలినా ఏవ = ఎవరియొక్క అన్నపానములతో, పుష్టః = శరీరమును బెంచికొన్నాఁడో, తస్మిన్ = వానివిషయమందే, ప్రతీపః = విరుద్ధమైన బుద్ధిగలవాఁడుగా, ఆస్తే = ఉన్నాఁడు. ఆశు = శీఘ్రముగా, శ్వసానః = ప్రాణమాత్రముతో శేషించినవాఁడుగా, పురాత్ = పట్టణమునుండి, నిర్వాస్యతాం = వెడలఁగొట్టుఁడు.

**తాత్పర్యము** : దుర్యోధనుఁడు విదురు నవమానించినరీతిని జెప్పుచున్నాఁడు. వీఁడు క్షత్రియుఁడా? దాసీపుత్రుఁడు. క్షత్రియవర్యులున్న యీ సభలోనికి మంత్రాలోచనామహాకార్యమునకై వీనినిఁ బిలిపించిన దెవ్వరు? వీఁడు కపటస్వభావుఁడు. నా యన్నమును దిని శరీరమును బెంచికొన్నాఁడు. ఆ కృతజ్ఞతాలేశమునులేక నావైపుననేయుండి నిరంతరము శత్రుకార్యములను సాధించుటకై శ్రమించుచున్నాఁడు. వాని సమస్తసంపదను బెటికికొని ప్రాణములతో మాత్రము బయటికి వెళ్లగొట్టుఁడు. విదురుని సభకుఁ బిలిపించినవాఁడు ధృతరాష్ట్రుఁడని దుర్యోధనునకుఁ దెలియును. ఈమాట లనుటతోఁ దండ్రియైన ధృతరాష్ట్రుని గూడ నాతఁడు చులుకగనే చూచినట్లైనది.

**16. శ్లో** : భ్రాతుః = అన్నయైన ధృతరాష్ట్రునియొక్క, పురః = కనులయెదుటనే, ఇత్థం = ఈ ప్రకారము, అత్యుల్బణ కర్ణబాణైః = అతికఠినములైన వాగ్బాణములతో, మర్మసు = మర్మస్థానములందు, తాడితః అపి = కొట్టఁబడినవాఁడైనను. సఃవిదురః = ఆ విదురుఁడు, ధనుస్సును, ద్వారి = వాఁకిటియందు, స్వయం నిధాయ = తానేయుంచినవాఁడై, గతవ్యథః = దుఃఖరహితుఁడై, మాయాం = ఈశ్వరునిమాయను, ఉరు = ఎక్కువగా, మానయానః = గౌరవించుచున్నవాఁడై, అయాత్ = వెడలిపోయెను.

**తాత్పర్యము** : అన్నయైన ధృతరాష్ట్రునియెదుటనే జరగిన దీ యవమానము. దుర్యోధనుఁడాడినమాటలు కర్ణశూలములై యుండెను. అవి మర్మస్థానములను దాఁకి మిగుల నొప్పించుచుండెను. దుర్యోధనుని మాటలకు ధృతరాష్ట్రుఁడేమియు బదు లీయలేదు. కాని విదురుఁ డేమియు దుఃఖించినవాఁడు గాదు. అతఁడు మనస్సులో నిట్లనుకొన్నాఁడు. "ఓహో! భగవన్మాయ యెంత బలిష్ఠమైనది! దానిమూలముననేగదా వీరు, కన్నులయెదుట భగవంతుఁ డున్నను గానలే కున్నారు. నే నిన్ని దినములును బంధుస్నేహముతో వదలలే కుంటిని, ఇప్పు డా బంధుస్నేహమునకే భగవత్కటాక్షము తీవ్రమైన దెబ్బ గొట్టినది. ఆతనిమహిమ

నెవ్వ రెఱుఁగుదురు?". ఇట్లు దలపోసి తన ధనుస్సును వారి వాఁకిటనే వదలి ముందుకు నడచెను. వారి నెదిరించుటకు విదురునకు శౌర్య మున్నది. కాని, యాతఁ డాపని చేయలేదని యర్థము.

**17. శ్లో** : కౌరవపుణ్యాలబ్ధః = కౌరవుల పుణ్యముతో లబ్ధుఁడైన, సః = ఆ విదురుఁడు, గజాహ్వాయాత్ = హస్తినాపురినుండి, నిర్గతః = బయలుదేరినవాఁడై, పుణ్యాచికీర్షయా = పుణ్యము సంపాదింపవలెనను కోర్కితో, ఉర్వ్యాం = భూమి యందు, సహస్రమూర్తిః = అనేకమూర్తులలోఁ గలభగవంతుఁడు, యానిపదాని = ఏ స్థానములను, స్వధిష్ఠితః = శోభనముగా నధిష్ఠించెనో, తీర్థపదఃతాని = తీర్థములు పాదములయందుఁగల యా స్వామికి సంబంధించిన స్థానమును, అన్వాక్రమత్ = వరుసగా సంచరించెను.

**తాత్పర్యము** : అవతారిక : విదురుఁడు బంధువుల త్యజించెను. పట్టణముల వదలెను. తర్వాత నేమిచేసెనో చెప్పుచున్నాఁడు విదురుఁడు కౌరవులను వదలిపోవుటతోనే వారిపుణ్యముగూడ వదలిపోయెను. కౌరవులలో జన్మించిన పూర్వరాజులు సాధించిన పుణ్యముతోనే యా వంశమందు యమధర్మరాజు విదురుఁడుగా జన్మించినాఁడు. ఆతఁడు వారిని వదలిపోవుటతో తద్వంశపుణ్యశేషము నశించిన ట్లైనది. భగవంతునితోడి యైక్యమును సాధించుటకు బాధకములైయున్న పాపములను దొలఁగించికొనుటకునై తత్ప్రాప్తిసాధకములైన పుణ్యములను సంపాదించికొనుటకై యాతఁడు తీర్థయాత్ర లొనర్చెను. బహురూపములు ధరించి వాసుదేవుఁడేయేస్థానములందు వెలుఁగొందెనో స్వయంవ్యక్తములైన యా క్షేత్రముల నాతఁడు దర్శింప నేగెను.

**18. శ్లో** : పురేషు = పట్టణములు, పుణ్యోపవనాద్రికుంజేషు = పుణ్యములైన యుపవనములు, పర్వతములు, కుంజములు - వీనియందును, అపంకతోయేషు = పంకరహితములైన జలములుగల, సరిత్సరస్సు = నదులు హ్రదములు మొదలగు వానియందు, అనంతలింగైః = భగవంతునిమూర్తి విశేషములచేత, సమలంకృతేషు = అలంకరింపఁబడిన, తీర్థాయతనేషు, పుణ్యస్థానములందును, అనన్యః = ఏకాకియై, చచార = తిరిగెను.

**తాత్పర్యము** : భగవంతుని యవతారములతో, సంచారములతో, నివాసములతో, విహారములతో సంబంధముగల తీర్థము లన్నిటినాతఁడు సేవించెను. మధురాదిపట్టణములు, బృందావనాద్యుపవనములు, గోవర్ధనాదిపర్వతములు, పుష్కరాది తటాకములు అన్ని ప్రదేశముల నాతఁడు తిరిగినాఁడు. ఆతని మనస్సునందు విచారము లేదు. అన్యాశ్రయము లేదు. కేవలుఁడై సంచరించెను.

**19. శ్లో** : గాం = భూమిని, పర్యటన్ = తిరుగుచున్నవాఁడును, మేధ్యవివిక్తవృత్తిః = పరిశుద్ధమై, యేకాంతమైన జీవితముతోఁ గూడినవాఁడును, సదాప్లుతః = నిరంతరమును నియమితకాలములో స్నానము లొనర్చుచున్నవాఁడును, అధశ్శయనః = నేలపై పవళించువాఁడును, స్వైః = తనకు సంబంధించినవారిచేత, అలక్షితః = గమనింపఁబడని వాఁడును, అవధూతవేషః = అవధూతలవేషమును గలవాఁడై, హరితోషణాని = విష్ణుప్రీతిని గల్గించునట్టి వ్రతములను, చేరే = ఆచరించెను.

**తాత్పర్యము** : విదురుఁ డొకేభాగమున నిలువక యెల్లయెడలను సంచరించుచుండెను. అన్యాపేక్షలేశమును లేని వృత్తి నవలంబించినాఁడు. నియతకాలములందు స్నానాదు లొనర్చుచుండెను. నేలనే యాతని శయ్య. శరీరరక్షణమం దౌదాసీన్యమును వహించెను. అతని బంధువులు గూడ గమనింపనేరని దా వేషము. సర్వభూతదయ, ప్రాప్తమైనదాన సంతుష్టి, ఇంద్రియనిగ్రహము మొదలైన వాతని వ్రతములై యుండెను.

**20. శ్లో** : ఇత్థం = ఈ ప్రకారము, భారతవర్షం = భారతవర్ష మంతటను, వ్రజన్ ఏవ = సంచరించుచునే, యావత్ కాలేన = ఏ సమయమునకు, ప్రభాసంగతవాన్ = ప్రభాసతీర్థమును ప్రాప్తించెనో, తావత్ = ఆ కాలమందే, ఏకచక్రాం = ఒకేశాసనబద్ధమైన సైన్యముచేఁ జుట్టఁబడినదియు, ఏకాతపత్రాం = ఒకటేగొడుగు నీడయందున్నదియునైన, క్షితిం = భూమిని, అజితేన = ఎవరిచేతను జయింప సాధ్యముగాని బలిమిగల కృష్ణునితో, పార్థః = ధర్మపుత్రుఁడు. శశాస = పరిపాలించెను.

**తాత్పర్యము** : ఈ రీతిగా వ్రతముల నాచరించుచున్నవాఁడై విదురుఁడు భారతమునంతయుఁ జుట్టినాఁడు. అతఁ డొకనాఁడు ప్రభాసతీర్థమునకు వచ్చెను. అప్పుడు ధర్మరాజు చక్రవర్తి. సమస్తభూమియు నాతనిగొడుగుక్రిందనే యుండెను. సమస్తరాజులు నాతనిచే జితులు. భూమిపై నంతయు నాతనియాధిపత్యము. ధర్మరాజు చక్రవర్తియై యుండెను. కృష్ణపరమాత్ముఁ డాతనికి తోడు.

**21. శ్లో** : తత్ర = అక్కడ, అథ = అనంతరము, వేణుజవహ్నిసంశ్రయం = వెదురుల నుండిపుట్టిన, అగ్నిః = ఆశ్రయమై, దగ్ధం = దహింపఁబడిన, వనంయథా = మహావనమువలె. సంస్పర్ధయా = అన్యోన్యమత్సరములతో నేర్పడిన, సుహృద్వినష్టిం = బంధువుల నాశమును, శుశ్రావ = వినెను. అథ = ఆ తరువాత,

అనుశోచన్ = బంధువధనుగూర్చి దుఃఖించినవాఁడై, తూష్ణీం = ఏమియును పలుకక, ప్రత్యక్ = పశ్చిమదిక్కునను న్న, సరస్వతీం = సరస్వతీనదినిగూర్చి, ఇయాయ = వెళ్లెను.

**తాత్పర్యము** : వేణువులు పరస్పర మొరసికొనుటచే వహ్నిపుట్టును. ఆ వహ్ని సమస్తవనమును గాల్చును. అట్లుగా కౌరవవంశము పరస్పరము పొడిచికొని చచ్చిరి. ఈ వార్తను విదురుఁడు విన్నాఁడు. అతఁడు బయటి కేమియుఁ బలుకలేదు. కాని లోపలఁ దీవ్రమైన వ్యధ యున్నది. అతఁడు ప్రభాసమందుండి పశ్చిమదిశను బట్టి పోయెను. సరస్వతీనది కాతని గమనము.

**22. శ్లో** : తస్యాం = ఆ సరస్వతీనది యందున్న, త్రితస్య = త్రితునియొక్కయు, ఉశనసః = శుక్రునియొక్కయు, మనోశ్చ = మనువుయొక్కయు, పృథోశ్చ = పృథువుయొక్కయు, అథ, అగ్నేః = అగ్ని యొక్కయు, అసితస్య = అసితుఁ డనుపేరుగల ఋషియొక్కయు, వాయోః = వాయువుయొక్కయు, సుదాసస్య = సుదాసుఁడను పేరుగల రాజుయొక్కయు, గవాం = గోవులయొక్కయు, గుహస్య = గుహునియొక్కయు, శ్రాద్ధదేవస్య = శ్రాద్ధదేవుని యొక్కయు, తీర్థం=తీర్థమును, సః = విదురుఁడు, ఆసిషేవే = సేవించెను.

**తాత్పర్యము** : సరస్వతీనదియందు పదునొకండు ప్రధానతీర్థము లున్నవి. త్రిత, ఉశనా, మను, పృథువు లని, అగ్ని, అసిత, వాయు సుదాసులని, గో గుహ శ్రాద్ధదేవులని. ఈ తీర్థములయం దంతట నాతఁడు స్నానాదుల నొనర్చినాఁడు.

**23. శ్లో** : ఇహ = ఈ లోకమందు, ద్విజదేవదేవైః = బ్రాహ్మణశ్రేష్ఠులు, దేవతాశ్రేష్ఠులు-వీరిచేత, కృతాని = నిర్మింపఁబడినట్టి, ప్రత్యంగముఖ్యాంకిత మందిరాణి = అన్నిఅవయవములయందు ధరించు నాయుధములలో ముఖ్యమైన చక్రాయుధము చేతఁ గూడినవియు, యద్దర్శనాత్ = వేని దర్శనముచేత, కృష్ణం = శ్రీకృష్ణుని, అనుస్మరంతి = స్మరింతురో, విష్ణోః = శ్రీమహావిష్ణువుయొక్క, అన్యాని = ఇతరములైన, నానాయతనాని = బహువిధములైన ఆలయములను, ఆసిషేవే = సేవించెను.

**తాత్పర్యము** : కొన్ని క్షేత్రములు ఋషులచేఁ బ్రతిష్ఠచేయఁబడినవి. కొన్ని దేవతలచేఁ బ్రతిష్ఠితములు. అన్ని యాయుధములలో విష్ణువునకుఁ జక్రము ముఖ్యము. ఆ చక్రాయుధధారియైన విష్ణువు వ్యక్తమైనస్థలములను విదురుఁడు దర్శించినాఁడు. ఆ క్షేత్రములను జూచినంతనే చూచువారి మనస్సులలో శ్రీమహావిష్ణువు నిలుచును. కనుక నా క్షేత్రములు చాల పూజనీయము లైనవి.

**24. శ్లో** : తతః = అనంతరము, ఋద్ధం = సమృద్ధితోఁగూడిన, సురాష్ట్రం = సురాష్ట్రమనుదేశమును, సౌవీరం = సౌవీరమును, మత్స్యాన్ = మత్స్యదేశములను, కురుజాంగలాంశ్చ = కురుదేశమందున్న ఊషరక్షేత్రములను, అతివ్రజ్య = అతిక్రమించి, కాలేన = కొంతకాలమునకు, యమునాన్ ఉపేత్య = యమునను సమీపించి, తావత్ = అప్పుడు, తత్ర = అచ్చట, భాగవతం ఉద్ధవం = పరమభాగవతుఁడైన యుద్ధవుని, దదర్శ = చూచెను.

**తాత్పర్యము** : సమృద్ధితోఁ గూడిన సురాష్ట్రము నాతఁడు చూచెను. సౌవీరమును జూచెను. మత్స్యదేశమునఁ బర్యటించినాఁడు. కురుదేశమును, ఆ ప్రాంతములలోనున్న ఊషరములను దర్శించినాఁడు. యమునాప్రాంతముల కాతఁడు వచ్చెను. ఆ యమునాతీరమందు పరమభాగవతుఁడైన యుద్ధవునిఁ జూచినాఁడు.

**25. శ్లో** : ప్రశాంతం = పరమశాంతమైన చిత్తవృత్తితోఁ గూడినట్టియు, బృహస్పతేః = బృహస్పతియొక్క, ప్రాక్తనయం = పూర్వజన్మలో శిష్యుఁడును, వాసుదేవానుచరం = శ్రీకృష్ణునకు పరమభృత్యుఁడును, ప్రతీతం = ప్రసిద్ధుఁడైన యుద్ధవుని, ప్రణయేన = ప్రేమతో, గాఢం ఆలింగ్య = గాఢముగాఁ గౌఁగిలించికొని, స్వానాం = తనబంధువులైన, భగవత్ప్రజానాం = కృష్ణపరమాత్మకు సంబంధించిన ప్రజలనుగూర్చిన, భద్రం = క్షేమమును, అపృచ్ఛత్ = ప్రశ్నించెను.

**తాత్పర్యము** : ఉద్ధవుఁడు వాసుదేవున కత్యంతప్రియుఁడైన భృత్యుఁడు. కామక్రోధాదులనుండి పూర్తిగా విడివడినవాఁడు. నీతిశాస్త్రాధ్యయనమందు పూర్వజన్మములో బృహస్పతికి శిష్యుఁడు. పరమప్రసిద్ధుఁడు. అతఁడు గన్పించినంతనే విదురుఁ డాతనిని గాఢముగాఁ గౌఁగిలించి కొన్నాఁడు. భగవంతునకును దనకును బంధువులైన యాదవులక్షేమమును గూర్చిన ప్రశంస మొదలుపెట్టెను.

**26. శ్లో** : స్వనాభ్యపాద్మానువృత్యా = తననాభిమండలమునం దుత్పన్నమైన, పద్మజుని ప్రార్థన ననుసరించి, ఇహ అవతీర్ణౌ = భూమియందు జన్మించినవారును, పురాణౌ పురుషౌ = సనాతనపురుషులైన బలరామకృష్ణులు, ఉర్వ్యాః = భూమియొక్క, కుశలంవిధాయ = క్షేమమును నిర్వహించుచు, కృతక్షణౌ = నిత్యజాగరూకులై, శూరగృహే = వసుదేవునిగృహమందు, కుశలం ఆసాతే కచ్చిత్ = సౌఖ్యముగ నున్నారా?

**తాత్పర్యము** : పరమపురుషుని నాభికమలము నుండి బ్రహ్మదేవుఁడు జన్మించెను. భూభారహరణార్థమై యవతరింపవలసినదిగా నాతఁడు పరాత్పరుని వేఁడికొన్నాఁడు. ఆ ప్రార్థన నంగీకరించి స్వామి బలరామకృష్ణులై ప్రపంచమున నవతరించెను. నిత్యజాగరూకులై వారు ప్రపంచక్షేమమును రక్షించుచున్నారు. వసుదేవుని గృహమందు వారిర్వురును సుఖముగ నున్నారా?

**27. శ్లో** : కురూణాంనః = కురువంశజాతులమైన మాకు, పరమసుహృత్ = గొప్పస్నేహితుఁడైనట్టియు, సః భావః శౌరిః = చెల్లెలిమగఁడైన యా వసుదేవుఁడు, అంగ = ఓ పూజ్యుఁడైన యుద్ధవుఁడా! సుఖం ఆస్తే కచ్చిత్ = సుఖముగ నున్నవాఁడా? వదాన్యః యః = దానశీలుఁడైన యెవఁడు. స్వస్రూణాం = తనచెలియండ్రకు, వరతర్పణేన = శ్రేష్ఠమైనవస్తువుల నిచ్చుటచేత, పితృవత్ = తండ్రివలె, వరాన్ దదాతి కచ్చిత్ = వరముల నిచ్చుచున్నాఁడా? వై = నిజముగా నట్లే చేయును.

**తాత్పర్యము** : ఓ పూజ్యుఁడైన యుద్ధవుఁడా! కురువంశమందు జన్మించినమాకు, పరమస్నేహితుఁడు వసుదేవుఁడు. మాసోదరిభర్త. పూజ్యులలో నగ్రగణ్యుఁడు. అతఁడు సుఖియేనా? దానశీలుఁడైన యాతఁడు దన చెల్లెండ్రకు అమూల్యములైన వస్తువుల నెప్పుడు నిచ్చుచుండును. అతఁడు వారికిఁ దండ్రివంటివాఁడు. వారేమి యడిగినఁ గాదనఁడు. ఇది నిశ్చయము.

**28. శ్లో** : యదూనాం = యదువులయొక్క, వరూధాధిపతిః = సైన్యాధినాథుఁడు, వీరః = పరాక్రమశాలియునైన, ప్రద్యుమ్నః = ప్రద్యుమ్నుఁడు, సుఖం ఆస్తే కచ్చిత్ = సుఖముగ నున్నవాఁడేనా? ఆదిసర్గే = పూర్వజన్మమందు, స్మరంయం = మన్మథుఁడుగానున్న యెవనిని, విప్రాన్ ఆరాధ్య = బ్రాహ్మణులను బూజించిన పుణ్యమునకు ఫలముగా, రుక్మిణీ = రుక్మిణీదేవి, భగవతః = భగవంతుఁడైన కృష్ణునినుండి, ఉపలేభే = పొందినదో.

**తాత్పర్యము** : రుక్మిణీదేవి సంతానేచ్ఛతో దేవబ్రాహ్మణులను మహాభక్తితో సేవించినది. తత్ఫలముగా భగవంతుఁడు రుక్మిణీదేవికిఁ బుత్రోదయమును గలుగునట్లు చేసెను. ఆతఁడు మహాపరాక్రమశాలి. సమస్తయాదవసైన్యమున కధిపతి. పూర్వజన్మమం దాతఁడు మన్మథుఁడుగా నున్నవాఁడు.

**29. శ్లో** : శతపత్ర నేత్రః = వేయిరేకులుగల తామరలవలె విశాలములైన కన్నులుగల కృష్ణుఁడు, నృపాసనాశాం = రాజసింహాసనమును, బొందవలెననుకోరికను,

దూరాత్పరిహృత్య = దూరమునుండి యే తొలఁగఁద్రోసి, యంఅభ్యషించత్ = ఎవని నభిషేకించి సింహాసనమున నిలిపెనో సాత్వత వృష్ణి భోజ దాశార్హాణాం = సాత్వతులు, వృష్ణులు, భోజులు, దాశార్హులు అను యాదవులయొక్క, అధిపః సః = నాథుఁడైన యుగ్రసేనుఁడు, సుఖం ఆస్తే కచ్చిత్ = సుఖముగ నున్న వాఁడేనా?

**తాత్పర్యము** : తాను రాజై, రాజ్యభారమును వహింపవలెనను నాసను గృష్ణుఁడు దగ్గరకే రానీయ లేదు. తామరసనేత్రుఁడైన యాతఁడు ఉగ్రసేనుని సింహాసనముపై నభిషేకించినాఁడు. తత్ఫలముగా నుగ్రసేనుఁడు వృష్ణి భోజ దాశార్హాది యాదవుల కధినాథుఁడయ్యెను. అట్టి యుగ్రసేనుఁడు సుఖియేనా?.

**30. శ్లో** : సౌమ్య! = ఓసౌమ్యుఁడవైన యుద్ధవుఁడా! హరేః = హరికి, సదృక్షః సుతః = సమానుఁడైన కుమారుఁడును, రథినాం అగ్రణీః = మహారథులలో నగ్రగణ్యుఁడైనవాఁడును, సాంబః = సాంబుఁడు, సాధు ఆస్తే కచ్చిత్ = సుఖంఆస్తే కచ్చిత్ = సుఖముగ నున్నవాఁడేనా? అగ్రే = పూర్వజన్మమందు, యః = ఎవఁడు, అంబికయాధృతః = పార్వతీదేవిచేత ధరింపఁబడినవాఁడో, వ్రతాఢ్యాజాంబవతీ = వ్రతానుష్ఠానముచేత యోగ్యతనుగాంచిన జాంబవతీదేవి, దేవం యం గుహం = దేవుఁడగు నే సుబ్రహ్మణ్యుని, అసూత = కనెనో.

**తాత్పర్యము** : ఓ సౌమ్యుఁడైన యుద్ధవా! సాంబుఁడు పూర్వజన్మమందు పార్వతీదేవికుమారుఁడైన సుబ్రహ్మణ్యుడు. అనేకవ్రతముల నాచరించి యాతనిని బుత్రునిగాఁ బడయుటకుఁ దగిన యోగ్యతను గాంచిన జాంబవతి యాతనిని గుమారునిగాఁ గన్నది. ఆ సాంబుఁడు సుఖియై యున్నాఁడా?

**31. శ్లో** : ఫల్గునాత్ = అర్జుననినుండి, లబ్ధధనూరహస్యః = పొందఁబడిన ధనుర్వేద రహస్యములు గలవాఁడైన, యః యుయుధానః = ఏ సాత్యకి గలఁడో, అతఁడు, క్షేమం ఆస్తే కచ్చిత్ = క్షేమముగ నున్నాఁడా? సః = అతఁడు. అధోక్షజసేవయా ఏవ = కృష్ణపరమాత్ముని సేవచేతనే, యతిభి ర్దురాపాం = సన్యాసులచేతఁ గూడఁ బొందుట కసాధ్యమైన, తదీయాం గతిం = కృష్ణుని పాదపద్మప్రాప్తిని, అంజసా = అనాయాసముగా, లేభే = పొందెను.

**తాత్పర్యము** : సాత్యకి మహాయోధుఁడు. అతఁ డర్జునుని నుండి ధనుర్వేదరహస్యములనెల్ల గ్రహించెను. పరమభక్తుఁడు. భక్తిమాహాత్మ్యము చేతనే యాతఁడు కృష్ణపదయుగ్మసద్గతి నందినాఁడు. అతఁడు సాధించినభక్తి పరమవిరక్తులు గూడ సాధింప లేనిది.

**32. శ్లో** : అనమీవః = దోషరహితుఁడును, భగవత్ప్రపన్నః = సర్వభావముతో భగవంతుని శరణుఁజొచ్చినవాఁడును, బుధః = తత్త్వవేత్తయు నైన, శ్వఫల్కపుత్రః = శ్వఫల్కని కుమారుఁడైన యక్రూరుఁడు, స్వస్తి ఆస్తే కచ్చిత్ = సుఖముగ నున్నవాఁడేనా? యః = ఎవఁడు, ప్రేమవిభిన్నధైర్యః = కృష్ణప్రేమచే శిథిలిత ధైర్యుఁడై, కృష్ణ పాదాంకిత మార్గపాంసుషు = కృష్ణపదముద్రా చిహ్నితములైన మార్గములందలి ధూళులలో, అవేష్టత = పొరలాడెనో.

**తాత్పర్యము** : ఉద్ధవా! తత్త్వవేత్తలలో నగ్రగణ్యుఁడక్రూరుఁడు. జ్ఞానాభిమానమును వదలి సర్వరీతుల భగవంతునకుఁ బ్రపన్నుఁడైనవాఁడు. పాపలేశమును లేనివాఁడు. ఆతని భక్తి మహాతీవ్ర మైనది. భక్తి శిథిలితుఁడైన యాతఁడు కృష్ణపదపాంసువులచే నంకితములైన వీథులలో వివశుఁడై పొరలాడుచుండెను. అట్టి యక్రూరుఁడు సుఖియేనా?.

**33. శ్లో** : దేవకభోజపుత్ర్యాః = దేవకుఁడను భోజరాజపుత్రికయైన దేవకికి, విష్ణుప్రజాయాః = విష్ణువే కుమారునిగాఁ గన్న, దేవమాతుః ఇవ = దేవమాతయైన యదితివలె, సుఖంకచ్చిత్ = సుఖియేనా, యాపై = ఎవతె త్రయీ = వేదము, యజ్ఞవితానం అర్థం = యాగముచే విస్తరింపఁబడెడు వస్తుతత్త్వమువలె, దేవం = భగవంతుఁడైన విష్ణువును, స్వగర్భేణ = తనగర్భమున, దధార = ధరించెను.

**తాత్పర్యము** : వేదము యజ్ఞముయొక్కవిస్తారరూపమైన యర్థము. అనఁగా వస్త్వైక్యమును ధరించినట్లుగా తన గర్భమందు భగవంతుని ధరించి పుత్రభావముతో భగవంతుని బొంది దేవమాతయైన యదితివలె నున్నట్టియు, దేవకుఁడను పేరుగల భోజరాజునకుఁ బుత్రికగా జన్మించిన దేవకీదేవి క్షేమముగ నున్నదా?

**34. శ్లో** : సాత్వతాం వః = పరమభక్తులైన మీకు, కామదుఘః = అభీష్టప్రదాన మొనర్చువాఁడును, భగవాన్ = ఐశ్వర్యపరిపూర్ణుఁడునునైన, యః అనిరుద్ధః = ఏ అనిరుద్ధుఁడు గలఁడో, అతఁడు, సుఖం అస్తే అపి స్విత్ = సుఖముగ నున్నవాఁడేనా? యః = ఎవఁడు, సత్త్వతురీయతత్త్వం = అంతఃకరణములలో నాలవదాని కధిదైవమనియు, మనోమయం = మనస్స్వరూపుఁడనియు, శబ్దయోనిం = సమస్తశాస్త్రముల కుత్పత్తిస్థాన మనియు, ఆమనంతి = వేదములు చెప్పుచున్నవో.

**తాత్పర్యము** : వేదము లనిరుద్ధుని సమస్తశాస్త్రముల కుత్పత్తిస్థానముగా వర్ణించును. మనస్సును బ్రేరేచున దాతఁడే, చిత్తము అహంకారము, బుద్ధి, మనస్సు, అంతః

కరణము అని నాల్గువిధములు. వానిలో మనస్సున కధిదైవత మనిరుద్ధుఁడు. ఇట్టిమహిమగలవాఁడును, తనభక్తుల మనోరథములను సంపూర్తిగ నెరవేర్చువాఁడును, నీకు బంధువైన యనిరుద్ధుఁడు క్షేమముగ నున్నాఁడా?

**35. శ్లో** : సౌమ్య = శోభన స్వభావముగల యుద్ధవ! నిజాత్మదైవం = తమ యాత్మలకు ప్రకాశము గల్పించుచున్న కృష్ణపరమాత్మను, అనన్యవృత్యా = అన్యచింతలేక, యే సమనువ్రతాః = ఎవరు సేవింతురో, తే హృదీకసత్యాత్మజ చారుదేష్ణ గదాదయః = అట్టి హృదీకుఁడు, సత్యభామాదేవి పుత్రుఁడు, చారుదేష్ణుఁడు. గదుఁడు, మొదలైనవారు, అపి స్విత్ స్వస్తి చరంతి = సుఖముగాఁ దిరుగుచున్నారా?.

**తాత్పర్యము** : అవతారిక. తక్కినయాదవులక్షేమమును విచారింపుచున్నాఁడు. ఓ సౌమ్యుఁడైనయుద్ధవా! దేహాదులకంటె భిన్నముగానున్న జీవాత్మకు నుత్తమజ్ఞానప్రకాశమునుగల్గించు శ్రీకృష్ణపరమాత్మను ఏకాగ్రమైన మనస్సుతో సేవించుచుండు హృదీకుఁడు, సత్యభామాసుతుఁడు చారుదేష్ణుడు, గదుఁడు మొదలైనవా రందఱును సుఖముగ నున్నవారేనా?

**36. శ్లో** : ధర్మః = ధర్మపుత్రుఁడు, స్వదోర్భ్యాం విజయాచ్యుతాభ్యాం = తనకు బాహువులతో సమానమైన కృష్ణార్జునుల సాహాయ్యముతో, సేతుం = లోకమర్యాదను, ధర్మేణ = ధర్మమునకు భంగమేర్పడనట్లుగా, అపి పరిపాతి? = పరిపాలించుచున్నాఁడా? యత్ సభాయాం = ఏ సభయందు విజయానుభృత్యా = అర్జునునిసేవా హేతువుగాఁ బ్రాప్తమైన, సామ్రాజ్యలక్ష్మ్యా = చక్రవర్తి యోగ్యమైన యైశ్వర్యముతో, దుర్యోధనః = దుర్యోధనుఁడు, అతప్యత = దుఃఖించెనో.

**తాత్పర్యము** : యాదవుల క్షేమమును విచారించిన తర్వాత పాండవుల యొక్క కుశలమును బృచ్ఛించుచున్నాఁడు. ధర్మరాజునకు మయసభ ప్రాప్తించినది. దానిలోనున్న యైశ్వర్యము చక్రవర్తుల కనుగుణమైనది. ఆ సౌభాగ్యము అర్జునునియొక్క నిరంతరసేవాఫలముగా లభించినదే. ఆ సౌభాగ్యమును జూచి దుర్యోధనుఁడు మనస్సులోఁ గుమిలిపోయెను. ధర్మరాజునకుఁ గృష్ణార్జును లిర్వురును రెండుభుజములు. వారితోఁగూడిన ధర్మరాజు ధర్మముదప్పక ప్రజాపాలన మొనర్చుచు లోకమర్యాదను నిలుపుచున్నాఁడా?

**37. శ్లో** : గదాయాః = గదయొక్క, విచిత్రం మార్గంచరతః = అద్భుతకరమైన సంప్రదాయమును బ్రకాశింపఁజేయునట్లు చరించుచున్న, యస్య అంఘ్రిపాతం

= ఎవనిపాదప్రక్షేపణములను, రణభూః = యుద్ధభూమి, నసేహే = ఓర్చుకొనలేకపోయెనో, అహివత్ = సర్పమువలె, అత్యమర్షీ = అతిక్రుద్ధుఁడైన, భీమః = భీమసేనుఁడు, కృతాఘేషు = సాపరాధులైనవారియందు, దీర్ఘతమం అఘం = బహుకాలముగా వేచియుండిన శిక్షను, అపివ్యముంచత్ = వినియోగించినవాఁడేగదా!

**తాత్పర్యము** : భీమసేనుఁడు గదాయుద్ధమునకు సంబంధించిన సంప్రదాయములో నెన్నియో మెలఁకువ లెఱుఁగును. అవి యెవ్వరికైన నాశ్చర్యమును గొలుపును. అతఁడట్టి పాదప్రక్షేపములతో యుద్ధభూమిలో సంచరించునపుడు ఆ పదాఘాతములకుఁ దట్టుకొనలేక యుద్ధభూమి చలించెను. తమ కపకారమొనర్చిన దుర్యోధనాదులపైఁ బగదీర్చికొను టెపు డెపుడని యతఁడు నిరంతరమును దీర్ఘముగ నిట్టూర్చుచుండెడువాఁడు. అతఁ డెంతకాలమో వేచెను. కడకుఁ దన రోషమును శత్రువులయందుఁ బండించికొన్నాఁడు. ఆత డిపుడు దుఃఖరహితుఁడేనా?

**38. శ్లో** : రథయూథపానాం = రథికులైనవారిలో, యశోధాః = అగ్రగణ్యుఁడని కీర్తిని సంపాదించికొన్న, గాండీవధన్వా = గాండీవమనువింటిని ధరించిన యర్జునుఁడు, ఉపరతారిః = శత్రువులను సంహరించినవాఁడై, ఆస్తే కచ్చిత్ = సుఖముగ నున్నవాఁడా? యచ్ఛరకూటగూఢః = ఏ యర్జునుని శరములచేఁ గప్పఁబడినవాఁడై, మాయాకిరాతః గిరిశః = మాయాకిరాతుఁడైన పరమశివుఁడు, తుతోష = సంతోషించెనో.

**తాత్పర్యము** : పాశుపతాస్త్రమును సంపాదించుటకుఁ బోయినప్పుడు పరమశివుఁడు మాయాకిరాతుఁడై వచ్చినాఁడు. ఆతఁ డర్జునుని బాణములచే సంపూర్ణముగ సంఛన్నదేహుఁడై కవ్వడిపరాక్రమమునకు సంతోషించెను. అతిరథులలో శ్రేష్ఠుఁ డన్నకీర్తిని గడించినవాఁ డర్జునుఁడు. గాండీవ మనెడు వింటిని ధరించిన విలుకాడు. ఆ యర్జునుఁడు శత్రుసంహార మొనర్చి సుఖముగ నున్నాఁడా?

**39. శ్లో** : పక్ష్మభిః = కంటిఱెప్పలచేత, అక్షిణీ ఇవ = రెండునేత్రములవలె పార్థైః = కుంతీపుత్రులచేత, వృతౌ = సంరక్షింపఁబడుచున్నట్టి, యమౌ = కవలలైన నకులసహదేవులు, పృథాయాః తనయౌ = కుంతీపుత్రులవంటి వారేగదా! వజ్రివక్త్రాత్ = ఇంద్రునిముఖమునుండి, స్వరిక్థం = తమభాగమైన యమృతమును, సుపర్ణావివ = ఇద్దరు గరుడులవలె, పరాత్ = శత్రువునుండి, స్వరిక్థం = తమభాగమైన రాజ్యమును, ఉద్ధృత్య = గ్రహించి, ఉత స్వైత్ రేమాతే = సుఖముగ సంచరించుచున్నారా?

**తాత్పర్యము** : నకులసహదేవులు కవలలు. వారు మాద్రీపుత్రులైనను కుంతిచేతనే పెంపఁబడిరి. అందుచే పృథాసూనులే. వారిని పాండవు లెప్పుడును నేత్రములను గంటితెప్పలవలె రక్షించు చుందురు. వారు ఇంద్రముఖమునుండి తమభాగమును లాగికొన్న రెండుగరుడపక్షులవలె తమభాగమును శత్రువులనుండి లాగికొని సుఖముగ నున్నవారేనా? ఉన్నది గరుడుఁ డొక్కఁడే. ఇద్దరు గరుడులు లేరు. ఒకవేళ నిద్దరు గరుడు లున్నచో నని యర్థము. ఇట్టివానికే అభూతోపమలని పేరు.

**40. శ్లో** : అతిరథః = రథయుద్ధమందు శ్రేష్ఠుఁడును, ఏకవీరః = తనతో సమానులులేని పరాక్రమముగలవాఁడును, ధనుర్ద్వితీయః = కేవలము ధనుస్సు మాత్రమే సహాయముగాఁగలవాఁడై, యః = ఏ పాండురాజు, చతస్రఃకకుభః = నాల్గుదిక్కులను, విజిగ్యే = జయించెనో, తేనరాజర్షివర్యేణ = రాజర్షులలోశ్రేష్ఠుఁడైన పాండురాజు, వినా అపి = గతించిపోయినను, పృథా అపి = కుంతియు, అర్భకార్థే = చిన్నపిల్లల సంరక్షణార్థము, ధ్రియతే =ప్రాణములతో జీవించియున్నది. అహో = అయ్యో!

**తాత్పర్యము** : రథమునెక్కి యుద్ధ మొనర్చుటలోఁ బాండురాజునకు సరి యెవ్వరును లేరు. అతఁడు లోకమం దేకవీరుఁడు. ధనుర్మాత్ర సహాయుఁడై నాల్గుదిక్కులను జయించెను. రాజర్షులలో శ్రేష్ఠుఁ డాయన. ఆతఁడు స్వర్గమున కేగినను కుంతీదేవి జీవించియే యున్నది. శిశువులైన పాండవుల నభివృద్ధికిఁ దెచ్చుటయే యామె జీవించియుండుటకుఁ గారణము. ఆమెజీవితమే దుఃఖభాజనము. పాపము!

**41. శ్లో** : సౌమ్య! = ఓ ఉద్ధవా! స్వపుత్రాన్ = తనకొడుకులైన దుర్యోధనాదులను, సమనువ్రతేన = అనుసరించి నడుచుచున్న, యేన = ఏ ధృతరాష్ట్రునిచేత, సుహృత్ అహం = హితము నుపదేశించిననేను, స్వపుర్యాః = తనపట్టణమైన హస్తిననుండి నిర్యాపితః = వెడలగొట్టఁబడితినో, పరేతాయభ్రాత్రే = మరణించినపాండురాజువిషయమందు, యః = ఏ ధృతరాష్ట్రుఁడు, విదుద్రుహే = ద్రోహమును దలఁచెనో, అధఃపతం తం = అధఃపతనముఁ జెందుచున్న యా ధృతరాష్ట్రునిగూర్చి, అనుశోచే = దుఃఖించుచున్నాను.

**తాత్పర్యము** : ఉద్ధవా! ధృతరాష్ట్రుఁడు పరిపూర్ణముగా నధఃపతితుఁ డైనాఁడు. మరణించినతమ్ముఁడు పాండురాజున కతఁడు ద్రోహ మొనర్చెను. అతనికుమారులను హింసించినచోఁ బాండురాజునకు ద్రోహ మొనర్చినట్లేగదా? ఆ ధృతరాష్ట్రుఁడు దుష్టులైన పుత్రులనే యనుసరించెను. అతనికి నేను హితముఁ జెప్పితిని. అందుకై న న్నూరు వెడలనడచెను. అతని కెట్టి నరకములు ప్రాప్తింప నున్నవో! ఎంత చేసినను అన్న. అతనికై దుఃఖించుచున్నాను.

**42. శ్లో** : సః అహం = ఆ నేను, మర్త్యవిడంబనేన = మర్త్యులచరిత్ర ననుకరించుచు, నృణాం దృశః = మనుష్యులదృష్టులను, చాలయతః = భ్రమింపఁ జేయుచున్నవాఁడును, విధాతుః = సృష్టికర్తయైన, హరేః = హరియొక్క, ప్రసాదాత్ = అనుగ్రహముహేతువుగా, గతవిస్మయః = ఆశ్చర్యములేనివాఁడనై, నాన్యోపలక్ష్యః = ఇతరులచే గుర్తింపఁబడనేరని పద్ధతిలో నున్నవాఁడనై, పదవీం పశ్యన్ = ఈశ్వరమాహాత్మ్యమును గ్రహింపఁబూనినవాఁడనై, అత్ర చరామి = ఈ లోకమందు చరించుచున్నాను.

**తాత్పర్యము** : కృష్ణుఁడు సృష్ట్యాదికర్తయైన పరమాత్మ. కాని యాతఁడు మనుష్యభావము నంగీకరించి వారికన్నులుగప్పి చరించుచున్నాఁడు. ఆతని యనుగ్రహమువల్లనే తన్మహిమ కొంతకొంత యర్థ మొనర్చికొనుచున్నవాఁడనై తిరుగుచున్నాను. ఏది ప్రాప్తించినను నే నాశ్చర్యపడుటలేదు. ఇతరులు కనుఁ గొనుట కశక్యమైన వేషమును బూనినాను. ధృతరాష్ట్రుఁడు రాజధాని నుండి నన్ను వెడలఁగొట్టుట ఈశ్వరానుగ్రహ మనియే నా యభిప్రాయము. నన్నుగూర్చి నీవు శోకింపకుము. ఒకచోట స్థిరముగా నుండక సంచారశీలుఁడనై యున్నచో - భగవంతుని మహిమ నెక్కువగాఁ గనుగొనుట కవకాశముండును.

**43. శ్లో** : త్రిమదోత్పథానాం = మూఁడువిధములైన మదముచేత మర్యాద నుల్లంఘించి వర్తించువాఁడును, చమూభిః = సైన్యములతో, మహీం = భూమిని, ముహుః చాలయతాం = మాటికిఁ జలింపఁజేయునట్టి, నృపాణాం = రాజులయొక్క, వధాత్ = సంహారము వలన, ప్రపన్నార్తి జిహీర్షయా = శరణాగతులదుఃఖమును దీర్పవలెనను కోర్కెతో, ఈశః భగవాన్ అపి = సర్వసమర్థుఁడైన శ్రీకృష్ణుఁడుగూడ, కురూణాం అఘం = కౌరవులపాపపు వృత్తిని, ఉపైక్షత = ఉపేక్షించెను.

**తాత్పర్యము** : విద్య, ధనము, వంశము-ఇవి మనుష్యులను వేధించు మూఁడుమదములు. ఈ మదములతో రాజులు మర్యాద నతిక్రమించిరి. తమసైన్యములతో భూమిని మాటికిని జలింపఁజేయుచుండిరి. ఇట్టి దుష్టరాజులను సమూలముగ నశింపఁజేసి తన్ను శరణుఁజొచ్చినవారిని రక్షింపవలెనను గోర్కెతో సర్వసమర్థుఁడైన శ్రీకృష్ణుడుగూడ కౌరవులయపరాధములను జిరకాల ముపేక్షించినాఁడు. తిన్నగ సమస్తదుష్టరాజవంశములను నశింపఁజేయుటకే యీ యుపేక్ష.

**44. శ్లో** : అజస్య = జన్మాదిరహితుఁడైన వానికి, జన్మ = జననము ఉత్పథనాశాయ = ధర్మము నుల్లంఘించి చరించువారి వినాశముకొఱకు, అకర్తుః = కర్తగాని వానికి, కర్మాణి = కర్మములును, పుంసాం గ్రహణాయ = పురుషుల జ్ఞానాభివృద్ధి కొఱకే. అన్యథా = అట్లుగాకున్నచో, గుణానాంపరః = గుణముల కతీతుఁడైన వాఁడు, కః = ఎవఁడు? దేహయోగం = శరీరముతోడి సంబంధమును, ఉత కర్మతంత్రం = కర్మాధీనతయును, అర్హతి = సేవించును.

**తాత్పర్యము** : భగవంతుఁడైన కృష్ణుఁడు జన్మాదివికారములు లేనివాఁడు. కాని జన్మను స్వీకరించెను. ఆ స్వీకరించుట మర్యాద నుల్లంఘించి వర్తించువారివినాశముకొఱకే. అకర్తయైనను గర్మను స్వీకరించెను. ఎందు కనఁగా జనులను గర్మిష్ఠులనొనర్చుటకు; వాఁడు గుణాతీతుఁడైనవాఁడు. ఐనను స్వేచ్ఛగా దేహసంబంధము నంగీరించినాఁడు. శరీరసంబంధముతో నేర్పడెడు కష్టము లన్నిటి నోర్చినాఁడు. ఇవన్నియు లోకానుగ్రహమునకే.

**45. శ్లో** : ప్రపన్నాఖిలలోకపానాం = శరణాగతులైన సకలదిక్పాలకులు స్వ, అనుశాసనే = తనయాజ్ఞయందు, అవస్థితానాం = నిల్చినట్టివారు, వీరియొక్క, అర్థాయ = ప్రయోజనమునకై, యదుషు ఉపజాతస్య = యదువులందు జన్మించినవాఁడును, తీర్థకీర్తేః = పరిశుద్ధమైన కీర్తిగలిగిన, అజస్య = జన్మాదిరహితుఁడైన శ్రీకృష్ణునియొక్క, వార్తాం = వృత్తాంతమును, సఖే కీర్తయ = ఉద్ధవా! వర్ణింపుము.

**తాత్పర్యము** : ఉద్ధవా! జన్మరహితుఁడైనను శరణాగతులైన దిక్పాలకులను రక్షింపను దన యాజ్ఞారూపమైన వేదవిధులను అనుసరించి వర్తించుచున్న వంశమందుఁ గృష్ణుఁ డవతరించెను. పరిశుద్ధమైన కీర్తిగల యా కృష్ణపరమాత్మ వృత్తాంతమును విస్తరించి వర్ణింపుము.

## శ్రీధరీయము

శ్లో : తృతీయే తు త్రయస్త్రింశదధ్యాయై స్సర్గవర్ణనమ్,
ఈశేక్షయా గుణక్షోభా త్సర్గో బ్రహ్మాండసంభవః.
"తత్ర తు ప్రథమాధ్యాయే బంధూన్ హిత్వా గతాయుషః,
నిర్గత స్యోద్ధవేనాదౌ సంవాదః క్షత్తు రుచ్యతే.
"భగవద్బ్రహ్మసంప్రోక్తం సంక్షిప్తం వర్ణితం పురా,
ప్రాహ భాగవతం శేష ప్రోక్తం విస్తరతః పునః.

**తాత్పర్యము** : తృతీయస్కంధమందు ముప్పదిమూఁడధ్యాయములతో సర్గవర్ణన మొనర్పఁబడుచున్నది. గుణక్షోభముచేత బ్రహ్మాండసంభవమే సర్గము. అది యట్లుసంకల్పించిన పరమేశ్వరుని యిచ్ఛతో నేర్పడుచున్నది. ప్రథమాధ్యాయమందు ఆయువు క్షీణించిన బంధువులను వదలివచ్చిన విదురునకు మైత్రేయునితో జరగిన సంభాషణము వర్ణింపఁబడుచున్నది. భగవద్బ్రహ్మసంవాదమందు సర్గము సంక్షేపముగాఁ జెప్పఁబడినది. అదియే శేషప్రోక్తముగా విస్తరించి చెప్పఁబడఁ బోవుచున్నది. భాగవత సంప్రదాయ ప్రవృత్తి రెండురీతులు. శ్రీనారాయణ బ్రహ్మసంవాదమందు "అహమేవాసమేకోఽగ్రే" - ఇత్యాది చతుశ్శ్లోకరూపముగా భాగవతము సంక్షేపముగా వివరింపఁబడినది. అదే బ్రహ్మనారదసంవాదములో కొద్దిగా విపులీకరించి చెప్పఁబడినది. ఆ విషయమే దశలక్షణ వర్ణనాపూర్వకముగా శేషునిచేత విపులముగా విస్తరింపఁ బడుచున్నది. అందుకే తృతీయస్కంధారంభము. తృతీయస్కంధములో ప్రథమాధ్యాయమున విదురమైత్రేయసంవాదము వర్ణితము. ఈ కథ నాలుగధ్యాయములు, తరువాత నెనిమిదియధ్యాయములలో సవిసర్గప్రపంచవర్ణనము. ఆపైన విసర్గ ప్రస్తావముతో నేడింటితో వరాహావతార వర్ణనము. ఆపైనొక యధ్యాయముతో విసర్గ సమాహారము. ఆ ప్రసంగములో నాలుగధ్యాయములు కపిలావతారము. మఱితొమ్మిదింటితోఁ గపిలాఖ్యానము, ఈ రీతిగా తృతీయస్కంధమందు ముప్పదిమూఁడధ్యాయములు, ద్వితీయ స్కంధాంతమందు.

"పరిమాణం చ కాలస్య, కల్పలక్షణవిగ్రహమ్,
యధా పురస్తాద్వ్యాఖ్యాస్యే, పాద్మం కల్పమథో శృణు.

-ఇత్యాదిగా ప్రతిజ్ఞాతమైన యర్థమును విస్తరముగా వివరించుటకు ఇదిహాసము నారంభించుచున్నాఁడు. ఆ యారంభణము రెండుశ్లోకములు.

1. శ్లో : బుద్ధిమత్ = సర్వసంపత్తులతో నిండినది.

2. శ్లో : అతిశ్లాఘ్యము, త్యాగానర్హమైనది అని చెప్పుచున్నాఁడు. మంత్రకృత్ = ద్యూతకర్తయైన, అయం = శ్రీకృష్ణుఁడు, బుద్ధిసన్నిధానుఁడైనదానివలన 'అయం' అను శబ్దము చేత నిర్దేశము, పౌరవేంద్రః = దుర్యోధనుఁడు. వానియింటిని వదలి అనాహూతుఁడైనను విదురునింటికి వచ్చినాఁడు. దానికిఁ గారణమును జెప్పుచున్నాఁడు. ఆత్మసాత్కృతం = ఆత్మీయమని తలఁపఁబడినది. అనఁగా దుర్యోధనుఁడు కృష్ణునకు సర్వసన్నాహములతోఁ గూడిన గృహము నేర్పాటు చేసియుండినాఁడు. కృష్ణుఁడు దానిని వదలి అనాహూతుఁడైనను విదురునింటికే వచ్చినాఁడు. అనఁగా విదురునియింటినిగూర్చి కృష్ణునకు అది తనయిల్లే యను భావముండినది.

3. శ్లో : కుత్ర సంగమః ఆస = ఏ స్థలమందు విదురమైత్రేయుల సమాగమ మేర్పడినది?

4. శ్లో : వరీయసి = శ్రేష్ఠుఁడైన వానియందు, అల్పార్థోదయః = అల్పమైన విషయమునుగూర్చినప్రసంగము. అల్పస్యఅర్థస్య ఉదయోయస్మాత్ అనిసమాసము. సత్పురుషులకు సమ్మతమైన విషయమును గూర్చియే వారి సంభాషణముండునని భావము. శ్రూయతాం = శ్రవణమొనర్పుమని భావము.

6. శ్లో : త్యాగముసేయుట కనర్హమైనను దన గృహమును విడచి విదురుఁడు వచ్చినాఁడు. దానికిఁ గారణమైన కౌరవాపరాధములను ఏకాదశశ్లోకములతో వర్ణించుచున్నాఁడు. యవిష్ఠుఁ డనఁగాఁ దనకన్నఁ జిన్నవాఁడు. విబంధువు లనఁగా పితృహీనులు.

7. శ్లో : కురుదేవస్య = యుధిష్ఠిరునియొక్క, దేవ్యాః = ద్రౌపదియొక్క స్నుషాయాః = తనకోడలైన దానియొక్క కుచకుంకుమానిస్వాస్రైః = హరంత్యాః = రోదనముచేత (దనయెదకుఁ బూసికొన్న కుంకుమపూఁత కరగిపోవునట్లుగా నేడ్చుచున్నదని భావము. లేక తన కన్నీటిచేత శత్రువులను వధించి తద్భార్యల కుచకుంకుమములను హరించుచున్నదని యైన నర్థము.

8. శ్లో : సత్యావలంబస్య = సత్యమునే యాశ్రయించినవాఁడు. వనాగతస్య = వనము నుండి తిరిగివచ్చినవాఁడు, సమయేన = పూర్వము చేసికొన్న యేర్పాటు ననుసరించి, దాయం = రాజ్యభాగమును, యత్ = ఎప్పుడు, న అదాత్ = ఈయలేదో, తమోజుషాణః = మోహమునందినవాఁడు.

**9. శ్లో** : పుంసాం = భీష్మాదివివేకవంతులకు, అమృతాయనాని = అమృతమును స్రవించు కృష్ణుని వాక్యములను, రాజా = ధృతరాష్ట్రుఁడు, లేక దుర్యోధనుఁడు, ఉరు న బహుమేనే = గొప్పగాఁ దలఁపక పోయెను. క్షతపుణ్యలేశః = నష్టమైన పుణ్యలేశముగల వాఁడు. పుణ్యలేశము కౌరవులకు సుఖ కీర్తి ధర్మార్థాదిహేతువు గాలేదు. కేవల రాజ్యప్రాప్తికి మాత్రమే హేతువైనదని భావము.

**10. శ్లో** : ఆరు శ్లోకములతో విదురునకే యొనర్చిన యుపకారమును జెప్పుచున్నాఁడు. యదా = ఎప్పుడు, పూర్వజేన = తనయన్నయైన ధృతరాష్ట్రునిచేత, మంత్రాయఉపహూతః = కర్తవ్యాకర్తవ్యవిచారమునకుఁ బిలిపింపఁబడినవాఁడై, అంతర్గృహమును బ్రవేశించిన విదురుఁడు, మంత్రం వృష్టః = ఆలోచనమునుగుఱించి యడుఁగబడినవాఁడై, అథ = తరువాత, మంత్రిణః = వివేకులైనవారు ఇప్పటికిని, వైదురికం = విదురవాక్యమని ప్రసిద్ధముగాఁ జెప్పికొనుచుందురో.

**11. శ్లో** : ఆ విదురోపదేశమును మూఁడుశ్లోకములతోఁ జెప్పుచున్నాఁడు తవ = నీయొక్క, ఆగః = అపరాధమును సహించుచున్నట్టి ధర్మరాజునకు, దాయం = రాజ్యభాగమును, ప్రతియచ్ఛ = ఇమ్ము, ఏ యపరాధ విషయమందు అనుజులతోఁ గూడికొన్న వృకోదరుఁడను కాలసర్పము క్రోధముతో బుసలు కొట్టుచున్నదో, ఎవనినుండి, అలం = ఎక్కువగా, బిభేషి = భయపడుచున్నావో!

**12. శ్లో** : నాకు లోకోత్తమమైన పరాక్రమముగల పుత్రు లనేకు లున్నారుగదా యని గర్వింపకు మనుచున్నాఁడు కృష్ణపరమాత్ముఁడు, ముకుందః ముకుందుఁడు. తన్నునమ్మినవారికి మోక్ష మొసఁగసమర్థుఁడు. వాఁడే దైవము. అందునను, భగవాన్ = షడ్గుణైశ్వర్య పరిపూర్ణుఁడు. ప్రాకృతుఁడు గాఁడు. క్షితిదేవులచేతను, ఇంద్రాదిదేవతలచేతను గూడికొన్నవాఁడు. వారంద రాతనిప్రయత్నమునకు బాసటయని యర్థము. ఎచటఁ గృష్ణుఁ డుండునో అచ్చట విప్రులును దేవతలు నుందురని భావము. అట్టి కృష్ణుఁడు, స్వపుర్యాంసుఖమాస్తే = తనపట్టణమునందే యున్నాఁడు. ఎచ్చటికిని బోలేదని తాత్పర్యము. యదుదేవదేవః = యాదవులకుఁ బూజ్యుఁడు, ఎచ్చట నాతఁ డుండునో అచ్చటనే యాదవసైన్యము లుండునన్నమాట. నృదేవేషు = మండలేశ్వరులందు దీప్యంతే ప్రకాశంతే ఇతి నృదేవదేవాః = మండలేశ్వరులను జయించి వారిలో మిక్కిలిగాఁ బ్రకాశించుచున్నవారు రాజులు. వినిర్జితాః = అశేషాః నృదేవాః యేన సః =

నృదేవదేవః అని సమాసము, అట్టి మహారాజులందరిని కృష్ణుఁడు తనబాహుపరాక్రమముతో జయించినవాఁడు. గనుక నా మహారాజు లందఱును గృష్ణుఁ డేవైపున నుండునో ఆ పక్షముననే యుందురు.

13. శ్లో : మఱియీ విషయమును దుర్యోధనుఁ డెందు కాలోచించుటలేదు? దానికి సమాధానము. స ఏష దోషః = ఆ దుర్యోధనుఁడు కరచరణాదులు ధరించిన దోషస్వరూపుఁడు. వాఁడు నీయింటిలోఁ దిరుగుచున్నాఁడు. వాఁడు దోషస్వరూపుఁడనుటకుఁ గారణమేమి? పురుషద్విట్ = కృష్ణుని ద్వేషించుచున్నాఁడు. అపత్యబుద్ధితో నెవ్వనిఁ బోషించుచున్నావో వాఁడు నీ కపత్యముగాదు. నపతత్యస్మాదిత్యపత్యం. ఎవనినుండి తండ్రి నరకమునఁ బడఁడో వాని కపత్యమనిపేరు. గతశ్రీః యస్మాత్సః - లక్ష్మి యేవాఁడో వాని యింటినుండి తొలఁగినది. ఈ రీతిగా నమంగళకరుఁడైనవానిని వదలు మనుచున్నాఁడు. ఎందుకు? కులకౌశలాయ = వంశముయొక్కక్షేమము కొఱకు. కౌశల మనుచోట స్వార్థమందు తద్ధితము.

శ్లో॥ త్యజే దేకం కులస్యార్థే, గ్రామస్యార్థే కులం త్యజేత్ ।
గ్రామం జనపదస్యార్థే ఆత్మార్థం పృథివీం త్యజేత్ ॥

అని న్యాయము.

14. శ్లో : ఇత్యూచివాన్ = ఈ రీతిగఁ బలికినవాఁడై, అసౌ = విదురుఁడు, స్పృహణీయ శీలః = సత్పురుషులు గోరఁదగిన శీలముగలవాఁడు, అసత్కృతః = తిరస్కరింపఁబడినవాఁడు.

15. శ్లో : ఆ తిరస్కారస్వరూపమును జెప్పుచున్నాఁడు. దాసీసుతః = దాసీసుతుఁడగుటచేత సభ కాహ్వానింపఁదగనివాఁడు. జిహ్మః = కుటిలుఁడు. ఆ కౌటిల్యమునే చెప్పుచున్నాఁడు. యస్య = ఎవనియొక్క బలినా = అన్నముచేత, పుష్టః = పోషింపఁబడినాఁడో- అతని విషయమందే, ప్రతీపః = ప్రతికూలుఁడు; పరకృత్యేఆస్తే = శత్రుకార్యమును సాధించుటలో జాగరూకుఁడు. కనుక, పురాత్ నిర్వాస్యతాం = పట్టణమునుండి వెడలఁ గొట్టుఁడు. శ్వసానః = జీవమాత్రశేషునిగా పాఠాంతరమందు శ్మశానః = శ్మశానమువలె నమంగళకరుఁడని భావము. ధనాదు లన్నియుఁ బెఱికికొని గృహమునుండి వెడలఁగొట్టవలెనని యభిప్రాయము.

16. శ్లో : అత్యుల్బణకర్ణబాణైః = మిగులక్రూరములై చెవులకు బాణములవలె దగులుచున్నవి. మర్మసు తాడితోఽపి, గతవ్యథః = మర్మస్థానములందుఁ గొట్టఁ

బడినవాఁడ నైనను వ్యధనుబొందక, దానికిఁగా రణము- మాయాం = మాయను, గురు = గొప్పగా, బహుమానయన్ = తలఁచినవాఁడై, ఓహో! మాయ యెంతటిదని మాయనే జరగినసన్నివేశమునకు హేతువుగాఁ దలఁచినవాఁడై, వెడలఁగొట్టఁబడుటకు ముందు విదురుఁడు తానే వచ్చినాఁడు. పోవునప్పుడు ధనుస్సును వాఁకిటనేబెట్టి పోయెను. ఎట్లును కౌరవులు మరణింతురు. ఇఁక ధనువుతో నాకేమి పని యని భావము. లేక భీమాదులతోఁజేరి మాతోఁ బోరునేమోయని సందేహమును గలిగించుటకు.

**17. శ్లో** : అక్కడనుండి బయలుదేరినవిదురుని తీర్థాటనమును ఎనిమిదిశ్లోకములతోఁ జెప్పుచున్నాఁడు. తీర్థపదః = గంగయనుతీర్థము పాదమునందుఁగల, హరేఃపదాని = విష్ణుక్షేత్రములను, పుణ్యచికీర్షయా = పుణ్యమును సంపాదించికొనుకోరికతో, అన్వక్రమత్ = క్రమముగాఁ దిరిగెను. కౌరవపుణ్యలబ్ధః = కౌరవు లొనర్చినపుణ్యముతోనే విదురుఁడు వారికి లభించియుండెను. సహస్రమూర్తిః = బ్రహ్మరుద్రాద్యనేకమూర్తులు గలవాఁడై యేయే క్షేత్రములను విష్ణు వధిష్ఠించియుండెనో అట్టివాని నని భావము.

**18. శ్లో** : పుణ్యోపవనాద్రికుంజేషు = పుణ్యములైన యుపవనాదులందు, అపంక తోయములు గలిగిన నదులు సరస్సులు తీర్థములు. ఆయతనము లనఁగా క్షేత్రములు. అనంతునిలింగము లనఁగా మూర్తులు. వానిచే నలంకృతములు. ఎట్లు? అనన్యః = ఏకాకియైనవాఁడై.

**19. శ్లో** : గాంపర్యటన్ = భూమిని జుట్టుచున్నవాఁడై, హరితోషణాని వ్రతాని చేరే = హరికి సంతోషము గల్గించు వ్రతముల నాచరించెను. మేధ్యవివిక్తవృత్తిః = పవిత్రమై అసంకీర్ణమైన జీవితము గలవాఁడు; అధశ్శయనం యస్య = నేలపైననే పండుకొనువాఁడు. అవధూతః = అసంస్కృతమైన దేహముగలవాఁడు. అవధూతవేషః = వల్కలాజినములు ధరించినవాఁడు. అందుచేతనే యాత్మజనులచేఁ గూడ గుర్తింపరానివాఁడు.

**20. శ్లో** : ఏకచక్రాం = ఒకటే సైన్యముగలది, ఏకాతపత్రాం = రాజచిహ్నమైన శ్వేతాతపత్రమొక్కటే గలది. అజితేన = కృష్ణుని సాహాయ్యముతో.

**21. శ్లో** : తత్ర = ప్రభాసతీర్థమందు సరస్పరస్పర్ధయే నిమిత్తముగా నేర్పడిన వినాశమును గూర్చి విన్నాఁడు. పరస్పరనాశమందు, దృష్టాంతమందు వేణుజః = వెదురులనుండి పుట్టినయగ్ని యేవనము నాశ్రయించునో ఆ వన మావహ్నిచే దహింపఁబడునట్లు.

**22. శ్లో** : తస్యాం = ఆ సరస్వతీనదీతీరమందు త్రితాదులైన పదునొకండు తీర్థములు. వీని నన్నిటిని సేవించినాఁడు.

**23. శ్లో** : ద్విజదేవైః = ఋషులచేత దేవైశ్చ = దేవతలచేతను అంగమంగంప్రతివర్తంత ఇతి = ప్రత్యంగాని = ప్రత్యవయవము నాశ్రయించికొని యుండునవి. వానిలో ముఖ్యమైనది చక్రము. ఆ చక్రముచేఁగూడికొన్నవి. ఉత్తమములైన హేమకలశములతోఁగూడినవియైన విష్ణువునకు సంబంధించిన క్షేత్రములను జూచినాఁడు. తీర్థములందు మునిఁగినాఁడు. చక్రాంకితములైన మందిరములను జూచునప్పుడు గృష్ణుఁడు స్మరణకు వచ్చును.

**24. శ్లో** : అతివ్రజ్య = అతిక్రమించి ఉద్ధవుఁడు యమునకు జేరునంతలోపల తానుగూడ నా నదిని సమీపించినాఁడు.

**25. శ్లో** : ఆ విదురుఁ డుద్ధవునిఁజూచెను. ఉద్ధవుఁడు-ప్రాక్తనయం = నీతిశాస్త్రమందు బృహస్పతికి శిష్యుఁడు, "ప్రాప్తనయం"-అని పాఠాంతరము. అనఁగా పొందఁబడిన నీతిశాస్త్రవిజ్ఞానముగలవాఁడు. ప్రతీతం = ప్రఖ్యాతుఁడు. అతనినిఁజూచి తన జ్ఞాతులక్షేమమునుగూర్చి విచారించినాఁడు. ఎందుకు? భగవత్ప్రజానాం = భగవంతునకు సంబంధించిన బంధు లగుటవలన.

**26. శ్లో** : మొట్టమొదలు - రామకృష్ణులకుశలమును గూర్చి యడుగుచున్నాఁడు. స్వనాభౌభవః - స్వనాభ్యః - తన బొడ్డునందున్న పద్మమునుండి జన్మించినవాఁడు. అతనియొక్క, అనువృత్యా = ప్రార్థనచేత, ఇహావతీర్ణౌ = ఈ లోకమందు జన్మించినవారు. కుశలం ఆసాతే = క్షేమముగ నున్నవారేనా? కృతక్షణౌ = తమలోకమునకు వేంచేయుటకై యవసరమును బ్రతీక్షించుచున్నవారు. లేక తమ బంధువుల కందఱికిని సంతోషమును గల్గించుచున్నవారు, రామకృష్ణులు నిరంతరమును గుశలురే; ఐనను లోకవ్యవహారము ననుసరించి యడిగినారు.

**27. శ్లో** : తొమ్మిదిశ్లోకములతో యాదవులక్షేమము నడుగుచున్నాఁడు. భావః = పూజ్యుఁడు ఐన - శౌరిః = వసుదేవుఁడు లేక. భావః = భగినీభర్త. కుంతీదేవి వసుదేవునిచెల్లెలు. దానినిబట్టి దేవకి పాండురాజు చెల్లెలని లోకవ్యవహారము. వరాన్ అర్థాన్ = శ్రేష్ఠములైన పదార్థములనిచ్చెడు, వదాన్యః = అత్యుదారుఁడు, వరతర్పణేన = శ్రేష్ఠములైన పదార్థముల నొసఁగుటమూలముగా.

**28. శ్లో** : వరూథాధిపతిః = సేనానియైనవాఁడు, ఆదిసర్గే = పూర్వజన్మమందు, స్మరం = కాముఁడుగా నున్నవాఁడు. వానినే రుక్మిణీదేవి యీ జన్మములోఁ బుత్రునిగాఁ బడసినది.

**29. శ్లో** : సాత్వతాదులైనయాదవాదుల కధిపతి యుగ్రసేనుఁడు. అతనిని శతపత్రనేత్రః శ్రీకృష్ణపరమాత్మ, నృపాసనాశాం = రాజు గావలెననెడు కోర్కెను, పరిహృత్య = శాపభయముతో దూరముగా వర్జించినవాఁడై.

**30. శ్లో** : హే సౌమ్య! హరేఃసుతః = కృష్ణునికుమారుఁడును, సదృక్షః = అతనికి సమానుఁడునునైనవాఁడు, సుఖమాస్తే = సుఖముగ నున్నాఁడా? పూర్వజన్మమందుఁ గుమారస్వామియై పార్వతీదేవిగర్భమున ధరింపఁబడినవాఁడు.

**31. శ్లో** : యుయుధానః = సాత్యకి, ఫల్గునాత్ = అర్జుననినుండి, లబ్ధధనూరహస్యః = పొందఁబడిన సర్వశాస్త్రార్థరహస్యములుగలవాఁడు, దురాపాం = యాదవులకుఁ బొందుటకు సాధ్యముగాని గతిని, భక్తిసాహాయ్యముతో నందినవాఁడు.

**32. శ్లో** : శ్వఫల్కపుత్రః = అక్రూరుఁడు, బుధః = విద్వాంసుఁడు, అందుచేతనే, భగవత్ప్రపన్నః = భగవంతునకుఁ బ్రపత్తియొనర్చినవాఁడు. అనమీవః = నిష్పాపుఁడు, భక్తికిచిహ్నము; అవేష్టతః = పొరలాడెనో ప్రేమచే విదీర్ణమైన ధైర్యముగలవాఁడు. అట్టి యక్రూరునకు క్షేమమేనా?

**33. శ్లో** : దేవకుఁడను పేరుగల భోజవంశమునకుఁ జెందిన యాదవుఁడు. అతనిబిడ్డ దేవకి. విష్ణుః ప్రజాః యస్యాస్సా = శ్రీమహావిష్ణువు కుమారుఁడుగాఁ గలది. ఆమె దేవమాతయైన యదితివలె యజ్ఞవితానరూపమైన యర్థమును వేదము ప్రకాశింపఁ జేయునట్లుగాఁ గృష్ణపరమాత్మను దనయుదరమునుండి ప్రకాశింపఁ జేసెను.

**34. శ్లో** : సాత్వతానాం = ఉపాసకులయొక్క, కామాన్దోగ్ధి - పూరయతీతికామధుక్ = కోరికలను బితుకువాఁడు భగవంతుఁ డనుటలోనిది హేతువు. యం = ఏయనిరుద్ధుని, శబ్దస్య = శాస్త్రమునకు, యోనిం = కారణముగా దేవతలు పిలుచుచున్నారో-ఎందువలన? మనోమయం = మనస్సును బ్రవర్తింపఁజేయువాఁడు. ఎట్లు? చతుర్విధమైన సమస్తాంతఃకరణమునకును, తురీయం తత్త్వం = నాల్గవదియైన దైవము, చిత్త, అహంకార, బుద్ధి, మనస్సులని యంతఃకరణ భేదములు నాలుగు. వీనికి వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్నానిరుద్ధు లధిష్ఠాతలు, మనస్సునకు శబ్దయోనిత్వము ప్రసిద్ధము. "మనః పూర్వం, వాగుత్తరరూపం మనసావాఅగ్రే నంకల్పయుత్యధవాచావ్యవహరతి" అని శ్రుతి. దానిని "అన్యోంతరఆత్మా మనోమయః" అని పొగడి "తస్య యజురేవశిరః ఋుగ్దక్షిణః పక్షః సామోత్తరః పక్షః" అని శ్రుతులు, శిక్షకూడ "ఆత్మాబుధ్యా సమే త్యర్థాన్ మనోయుంక్తే వివక్షయా, మనఃకాయాగ్ని మాహంతి సప్రేరయతిమారుతం మారుతస్తూరసిచరన్, మంద్రం జనయతి స్వరమ్" అనుచున్నది.

35. శ్లో : నిజస్య = దేహాదివ్యతిరిక్తులైన, ఆత్మనః దైవం = కృష్ణపరమాత్మను, అనన్యవృత్త్యా = ఏకాంతభావముతో, సమ్యగనువ్రతాః = అనుసృతులై, హృదీకుఁడు సత్యభామకొడుకు, చారుదేష్ణుడు, గదుఁడు మొదలైనవా రందరు క్షేమమేనా?

36. శ్లో : ఇప్పు డారుశ్లోకములతోఁ గౌరవుల నడుగుచున్నాఁడు. స్వదోర్భ్యాం కృష్ణార్జునులచేత, ధర్మేణ = ధర్మమార్గముచేత, ధర్మః = ధర్మస్వరూపుఁడైన యుధిష్ఠిరుఁడు, సేతుం = ధర్మమర్యాదను, పరిపాతి = పాలించుచున్నాఁడా? ఏ ధర్మజుని సభయందు విజయానువృత్త్యా = విజయపరంపరలచేత లేక అర్జునునిసేవచేతనైన అని యర్థము.

37. శ్లో : కృతాఘేషు = కృతాపరాధులైన దుర్యోధనాదులందు, దీర్ఘతమం = బహుకాల మోర్చికొనియున్న, అహివత్‌అత్యమర్షీ = పామువలె నెక్కువ క్రోధముగల భీముఁడు కిం వ్యముంచత్ = దుర్యోధనాదులందుఁ, దనకోపమును సార్థక మొనర్చికొన్నాఁడా? గదయా = గదచేత, ఆ భీముఁడు వివిధమార్గములందు చరించుచుండఁగా నా భారమునకు భూమి తట్టుకొనలేకపోయినదని భావము.

38. శ్లో : రథయూథపానాం = మహారథులలో, యశోధాః = గొప్పకీర్తిగలవాఁడు లేక తనవిక్రమముతో నన్నదమ్ములకుఁ గీర్తిని సంపాదించిపెట్టినవాఁడు. ఆ యర్జునునియొక్క శరములచేత సంపూర్ణముగాఁ గప్పఁబడినవాఁడై పరమశివుఁడు అర్జునుని పరాక్రమమునకు సంతసించినాఁడని భావము.

39. శ్లో : యమౌ = నకులసహదేవులు, పృథాయాఃస్తనపౌ = మాద్రీసుతు లైనవారు, కుంతిపాలనుద్రావి పెరిగినవారు, సుపర్ణావివరేమాతేకిం? = గరుడద్వయమువలెఁ బ్రకాశించుచున్నారా? పరాత్ = దుర్యోధనునినుండి స్వరిక్థం, గరుడ ఇవ = దేవేంద్రునినుండి యమృతమును లాగికొన్న గరుడునివలె; ఇరువురు గరుడు లమృతము దెచ్చినచో నెట్లుండునో యట్లుండెనని తాత్పర్యము.

40. శ్లో : కుంతీదేవి కుశలము నేమని యడుగుదును? పాండురాజును వదలి యామె జీవించియుండుటే యాశ్చర్య మనుచున్నాఁడు. ఆమె సంతానము కొఱకై జీవించి యున్నది. భోగములకొఱకుఁ గాదు. అట్లు జీవించి యుండుటగూడ నాశ్చర్య మనుచున్నాఁడు. పాండురా జెట్టివాఁడు? అతఁడు రాజర్షి, ఏకవీరుఁడు ,అతిరథుఁడు, తనధనుస్సే సహాయముగా నాల్గుదిక్కులు గెల్చినవాఁడు.

41. శ్లో : కుంతి జీవించుటలో నర్థమున్నది. ధృతరాష్ట్రునిజీవితమే శోచనీయ మనుచున్నాఁడు. అధః పతంతం = క్రమముగా నధోలోకములకుఁ బోవుచున్నవాఁ

డు. పరేతాయ = మరణించిన పాండురాజునకు ద్రోహముచేసినవాఁడు. ఆతనిపుత్రుల నేడ్పించినవాఁడు. నన్నుఁ బట్టణమునుండి వెడలనడచి నప్పుడు మూఁగ వానివలె నున్నవాఁడు.

**42. శ్లో :** నేను శ్రీహరియనుగ్రహవిశేషముతో భూమిపైన అన్యోపలక్ష్యః = ఇతరులచే గుర్తింపఁబడనివాఁడనై సుఖముగఁ జరించుచున్నను. కృష్ణుఁ డెట్టివాఁడు? మర్త్యవిడంబనముతోఁ దన యైశ్వర్యాదులను గప్పిపుచ్చుకొని లోకదృష్టిని భ్రమింపఁ జేయుచున్నవాఁడు.

**43. శ్లో :** తన భక్తులైన పాండవులు వనవాసాదిక్లేశముల ననుభవించిరి. తానును దౌత్య మంగీకరించి బంధనాదిపరాభవము లందినాఁడు. ఇట్టి లీల లాతనికెందుకు? అటుతర్వాతఁ గౌరవు లపరాధ మొనర్చినపుడే శిక్షించినాఁడు. అపరాధమును సహింపరాదుగదా? త్రిభిర్మదైః ఉత్పథానాం = ముప్విధములైన మదములచే ధర్మమును వదలినవారు. ప్రపన్నార్తిజిగీషయా = ప్రపన్నుల దుఃఖమును బోఁ గొట్టుటకై, ఈశోఽపి =అఘసమయమందే వధించుటకు సమర్థుఁ డైనను, ఉపైక్షత = కౌరవులపాపము నుపేక్షించెను. కౌరవుల నప్పుడే చంపినచో సర్వదుష్టరాజన్యవధ యేర్పడదుగదా!

"విద్యామదో ధనమద స్తథైవాభిజనో మదః,
ఏతే మదా మదాంధానాం ఏతఏవ సతాం దమాః".
అని మూఁడు విధములైన మదము లున్నవి.

**44. శ్లో :** సర్వదుర్వృత్తవధార్థము భగవంతునికి జన్మకర్మ లనుచున్నాఁడు. అజస్య = జన్మహీనునకు జన్మయు, అకర్తకుఁ గర్మలును, పుంసాం గ్రహణాయ = పురుషులను గర్మ మార్గమందుఁ బ్రవర్తింపఁజేయుటకు, లేకున్నచో, గుణానాంపరః = గుణాతీతుఁడైన పురుషుఁడు, దేహయోగం = కర్మవిస్తారమునకు న అర్హతి = యోగ్యుఁడు కాఁడుగదా!

**45. శ్లో :** కనుక నిట్టి యతీంద్రియమాయా వినోదనకథలు చెప్పుమనుచున్నాఁడు ప్రపన్నాః యే = అఖిలలోకపాలాః = తనకుఁ బ్రపన్నులైన దిక్పాలకులు. అట్లే తన యాజ్ఞ ననుసరించి వర్తించెడువారియొక్క అర్థాయ = ప్రయోజనముకొఱకు, యదువంశమందుఁ బుట్టినవానికథలు వర్ణింపు మనుచున్నాఁడు. తీర్థకీర్తేః =సంసారమునుండి తరింపఁజేయునట్టి కీర్తిగలవాఁడు.

## విజయధ్వజాలు

**1. శ్లో :** ముముక్షువులకు వారివారియోగ్యతకుఁ దగినట్లుగా భగవంతుని యపరోక్షజ్ఞాన మేర్పడవలె నన్నచో ప్రధానసాధనము భక్తియే. తక్కిన దంతయు నట్టిభక్తి యేర్పడుటకు మార్గమమాత్రమే యనియిచ్చట వివరించుచున్నాఁడు. దానియందుఁగూడ సూతుఁడు శౌనకుఁ డడిగిన ప్రశ్న కుత్తర మిచ్చుటకై శుకపరీక్షిత్సంవాదమును జెప్పుచున్నాఁడు. నీవీప్రమేయమునుగూర్చి న న్నెట్లడిగితివో- ఏవం = అట్లే, ఏతత్ = ఈ ప్రమేయమును, పురా = ముందు, బుద్ధిమత్స్వగృహం = తనయింటిని విడచి, సజ్జనసహవాసమునకై యరణ్యమందు, ప్రవిష్టేన = ప్రవేశించిన, క్షత్రా = విదురునిచేత, భగవాన్ = త్రికాలజ్ఞానియైన మైత్రేయః, పృష్టఃకిల = ప్రశ్నింపఁబడినాఁడుగదా? "సంపత్సమృద్ధమైన గృహమును వదలి" అని చెప్పుటచేత, వైరాగ్యమే మొదటిసాధనమని సూచించిన ట్లైనది.

**2. శ్లో :** విదురమైత్రేయ సంవాదమును బొందుపఱచుటకై విదురుని తీర్థయాత్రాకాలము నుపదేశించుచు, ప్రశ్న యొనర్చుటకుఁ గారణమును జెప్పుచున్నాఁడు. యదా వః = నీ పితామహులకొఱకై, మంత్రకృత్ = సంధియొనర్చుటకై బయలుదేఱిన, అయం = ఈ, అఖిలేశ్వరః = లక్ష్మీమొదలైన సమస్తజగత్తునకును నియామకుఁడైన, భగవాన్ = కృష్ణుఁడు, సంధి సఫలము గాకుండుటచే, కౌరవేంద్రపురం = హస్తినాపురమును, హిత్వా = వదలి, ఆత్మసాత్కృతం = తనయూరివలెనే యున్న, ఉపప్లావ్యపట్టణమును, ప్రవివేశ = ప్రవేశించెనో - అప్పుడు విదురుఁడు, తీర్థయాత్రకై బయలుదేఱెనని చేర్చికొనవలెను. తు = అనుశబ్దముచేత

"యుద్ధకాలేతువిదుర స్తీర్థయాత్రాం గతోఽపిసన్,
ప్రాయ ఆస్తే గజపురే, పాండవానాం హితేచ్ఛయా".

-అనెడు శ్లోకమును సూచించిన ట్లైనది. అందుచేత విదురుఁడు తీర్థములను సేవించినది స్వల్పకాలమేయని యుద్ధముమొదలై ముగియువఱకుఁ గాదని చెప్పిన ట్లైనది.

**3. శ్లో : అవతారిక :** తీర్థయాత్ర యొనర్చుచున్న విదురునకు మైత్రేయునితో నేర్పడిన సంభాషణాకాలము సామాన్యముగాఁ దెలిసినను బరీక్షిత్తు ఆ సంభాషణ యెచ్చట జరిగెనో తెలిసికొనునిచ్చతోఁ బ్రశ్నించుచున్నాఁడు. ప్రభో! సమర్థుఁడవైన శుకాచార్యా! క్షత్తుః, భగవతా, మైత్రేయేణ,సంగమః = చేరిక, కుత్ర = ఏ

తీర్థవిశేషమందు, ఆస = అయినది. సహసంవాదః = అతనితో సంభాషణమును, కదావా ఆస = ఎప్పు డేర్పడినది? ఏతత్, నః వర్ణయ. విదురుఁడు హస్తినాపురమును వదలిపోయినకారణముతోఁబాటు విస్తరించి చెప్పుము.

**4. శ్లో** : ఈ ప్రశ్నకుఁ గారణమును జెప్పుచున్నాఁడు హి = ఏ కారణముచేత తస్య అమలాత్మనః = ఆ పరిశుద్ధమైన మనస్సుగల, విదురస్య = విదురునకు, అనల్పార్థోదయః = అతిశయమైనఫల మేర్పడుచున్నదో, ఆ కారణముచేత దానిని వర్ణింపవలెనని భావము. బహుఫలమౌటకు గారణమును జెప్పుచున్నాఁడు. వరీయసి = భగవద్భక్తులలో శ్రేష్ఠుఁడైన, తస్మిన్ = ఆ విదురుని విషయమందు, ప్రశ్నః = అతఁ డొనర్చిన ప్రశ్న, సాధువాదోపబృంహితః = భగవద్భక్తుల కుచితమైన తత్త్వముతోఁ గూడియుండును.

**తాత్పర్యము** : "శుకాచార్యా! నీవు పరమసమర్థుఁడవు. విదురుఁడు త్రికాలజ్ఞానియైన మైత్రేయునితో నే తీర్థమందుఁ జేరెను? వారిసంభాషణ యెప్పుడు నడచినది? హస్తినావతిని వదలి విదురుఁడు పోవుటకుఁ గారణమేమి? భగవద్భక్తులలో శ్రేష్ఠుఁ డైన విదురుఁ డొనర్చిన ప్రశ్నగూడ భగవద్భక్తులు దెలిసికొనఁదగిన తత్త్వముతోఁ గూడినదై యుండును. శుద్ధమనస్కుఁడైన విదురునకు అతిశయమైన ఫలమును గలిగించునదిగఁ గూడ నుండును. అందుచే నా విషయ మంతయు విస్తృతముగా వర్ణించి చెప్పవలెను.

**5. శ్లో** : సూతుఁడు శౌనకుని ప్రశ్న కుత్తర మిచ్చుటకై శుకాచార్య పరీక్షిత్సంవాదము నారంభించుచున్నాఁడు. సుబహువిత్ = దేవతలు మొదలైన సజ్జనులతో సేవింపఁ బడుచున్న పరిపూర్ణుఁడైన శ్రీహరిని దనయోగ్యతకుఁ దెలిసికొనఁదగినంత తెలిసికొనియున్నట్టియు, ప్రీతాత్మా = (1) అందుచేత ప్రీతుఁడైన శ్రీహరిగలిగిన (2) ప్రసన్నమైన మనస్సుగల ఋషివర్యః = జ్ఞానులలో శ్రేష్ఠుఁడైన, సోఽయం = ఆ శుక్రాచార్యుఁడు, పరీక్షితారాజ్ఞా = పరీక్షిద్రాజుచేత, ఏవం = పైనిఁజెప్పినట్లు పృష్టః = ప్రశ్నింపఁబడినవాఁడై, ఇతి = కారణవిశిష్ట మగుటచేత, శ్రూయతాం = వినుమని, తం = ఆరాజును గుఱించి, ప్రత్యాహ = బదులు పల్కెను. "ప్రియం హి జ్ఞానినోఽత్యర్థం అహం" అనెడు గీతావాక్యముచేత జ్ఞానులకు శ్రీహరి ప్రియుఁ డు. శ్రూయతాం అనుట తోఁ దానుఁ జెప్పఁబోవువిషయమం దాదరమును గల్గించుచున్నాఁడు.

6. శ్లో : విదురుని తీర్థయాత్రాకారణమును జెప్పఁబోవుచున్నాఁడు వినష్టదృష్టిః = భగవద్విషయకమైన జ్ఞానము సంపూర్ణముగా నశించిన, రాజా = ధృతరాష్ట్రుఁడు, అసాధూన్, స్వసుతాన్ = అధర్మేణ తు ధర్మవిరుద్ధమైన పనులచేతనే, పుష్ణన్, విబంధూన్ = లౌకికబంధువులులేని, యవిష్టస్య, భ్రాతుః, సుతాన్, లాక్షా భవనే, ప్రవేశ్య, యదా = ఏ కారణముచేత, దదాహ = ఇదిగూడ విదురుఁడు తీర్థయాత్రకుఁ బోవుటకుఁ గారణమైనదని చెప్పిన ట్లైనది.

7. శ్లో : మఱొక్క కారణమును జెప్పుచున్నాఁడు. నృపః అస్రైః కుచకుంకుమాని, హరంత్యాః, స్నుషాయాః భూదేవదేవ్యాః, సభాయాం, కేశాభిమర్శం, గర్హ్యం, సుతకర్మ, యదా = ఏ కారణముచేత, నవారయామాస.

8. శ్లో : మూఁడవకారణమును జెప్పుచున్నాఁడు. తమోజుషాణః = యథార్థజ్ఞానమునుబోఁగొట్టెడు, దుర్యోధనుని వచనమనెడు చీఁకటి నంగీకరించుచున్న, నృప = ధృతరాష్ట్రుఁడు, ద్యూతే, అధర్మేణ, య, జితస్యసాధోః , సత్యావలంబస్య, వనాగతస్య, సమయేన, యాచతః అజాతశత్రోః దాయం, యత్, న అదాత్. "సాధోః", మొదలైనవిశేషములచేత ధర్మరాజు తండ్రియాస్తి నందుట కర్హుఁడని చెప్పిన ట్లైనది. ధృతరాష్ట్రుఁడు, భాగ మీకుండుటకుఁ గారణము - తమోజుషాణః - అనునది తెలుపును.

9. శ్లో : నాల్గవకారణమును జెప్పుచున్నాఁడు. పార్థప్రహితం, జగద్గురుః కృష్ణః, సభాయాం, పుంసాం = జీవులకు, అమృతాయనాని, మోక్షాదిపురుషార్థములకు సాధనములైన, యాని, ఏ మాటలను జగాదతాని, హతపుణ్యలేశః = ఉన్న స్వల్పపుణ్యమును బోఁగొట్టుకొన్న, రాజా, యదా = ఏ కారణముచేత న అనుమేనే = ఒప్పలేదో, ఆ కారణముచేత ఇదే ధృతరాష్ట్రుని యల్పసుఖమునకుఁ గారణమని చెప్పిన ట్లైనది. పుణ్యలేశః అనుటచేత - పాపమే బహుళము; పుణ్యము స్వల్పము. అది గూడ నష్టమైనదని చెప్పినాఁడు. గురువాక్యమునే యాదరింపవలెనని యున్నప్పుడు జగద్గురువుమాట తిరస్కరింపవచ్చునా? యనుటను జగద్గురోః = అనుటచే సూచించుచున్నాఁడు.

10. శ్లో : విదురుని తీర్థయాత్రకు మఱొక్క విశేషకారణమును దెల్పుచున్నాఁడు. కిల - కృష్ణుడు సంధికార్యము సిద్ధింపక ఉపప్లావ్యపట్టణమునకుఁ బోఁగా, పూర్వజేన, ఉపహూతః. భవనం = ధృతరాష్ట్రునింటిని, ప్రవిష్టః, యదా = ఎప్పుడు, మంత్రాయపృష్టః, అథ, మంత్రదృశాం, వరీయాన్, తం, ఆహ, యత్ = ఏ నీతిని, మంత్రిణః = మంత్రజ్ఞులు, వైదురికం = విదురనీతియని, వదంతి. ఆ కారణముతో విదురుఁడు మంత్రజ్ఞులలో శ్రేష్ఠుఁడని తెలియవలెను.

**11. శ్లో** : విదురుఁడుచెప్పిన నీతిని వర్ణించుచున్నాఁడు దుర్విషహం, తవ అగః, తితిక్షతః, అజాతశత్రోః, దాయం, ప్రతియచ్ఛ, హి = ఎందుకనఁగా యత్ర = ధర్మజునియొక్క యిష్టార్థమును సాధించియిచ్చుటయందు సహాయకుఁడై, స్వశత్రుహా = ఆస్తి నపహరించిన వారిని సంహరించునట్టివాఁడైన, సహానుజః = తమ్ముఁడైన యర్జునునితోఁగూడిన, వృకోదరః = భీముఁడు, వర్తతే = ఉన్నాఁడో, "వాఁడంతగొప్పవాఁడా? అనుటకు సమాధానము. యం, త్వం, అలంబిభేషి = దుర్యోధనాదులను భీముఁడు సంహరించుట నిశ్చయ మగుటచే" శత్రుహా అని ప్రయుక్తము. ధృతరాష్ట్రుని భయమున కిదియేకారణము. అట్టి "భీమసేనుఁడు ధర్మరాజునకు సహాయకుఁడై యుండుటచే ఆస్తిని తప్పక పంచియిమ్మని యర్థము." "సహానుజో యత్రవృకోదరాహిశ్శ్వసన్నషా యత్త్వమలం బిభేషి అని శ్రీధరులపాఠము" యత్రవృకోదరోహి, స్వశత్రుహా యం త్వమలం బిభేషి అని విజయధ్వజులు.

**12. శ్లో** : రాజ్యమును వెనుక కిచ్చుటకు మఱియొక ప్రబలమైన కారణమును జెప్పుచున్నాఁడు. క్షితిదేవదేవః = బ్రాహ్మణులచేఁ బూజింపఁబడుచున్న, భగవాన్ ముకుందః, పార్థాన్ = ధర్మజాదులను, యదా =ఏ కారణముచేత, గృహీతవాన్ తు = రక్షింతునని గ్రహించియున్నాఁడో, ఆ కారణముచేత, వినిర్జితాశేషనృదేవదేవః = యదుదేవదేవః, సః, స్వపుర్యాం = తనవా రగు పాండవుల పట్టణమైన యుపప్లావ్యమందే, ఆస్తే = ఏ కారణముతోనున్నాఁడో, ఆ కారణముచేతను రాజ్యమును పంచియిమ్మని యర్థము. ముక్తినే యిచ్చు భగవంతునకు రాజ్య మిప్పించు టొక లెక్కయా యని సూచించుటకై ముకుందః అను పదము; సమీపమం దే యున్నవాఁ డనుటకు, స్వపుర్యాం అనుపదము. ఇప్పుడు రాజ్య మిప్పించుటకుఁ గృష్ణున కవకాశ మున్నదని తెలుపుటకే "వినిర్జితాశేష నృదేవదేవః" అను పదము.

**13. శ్లో** : "దుర్యోధనున కసమ్మత మనుటచే ధర్మరాజునకు రాజ్యభాగము నీలేదు". ఈ ధృతరాష్ట్రుని యభిప్రాయమును గమనించిన విదురుఁడు విష్ణువును విష్ణుభక్తులను ద్వేషించెడు దుర్యోధనుని వదలుటయే శ్రేయస్కరమని చెప్పుచున్నాఁడు. హే జ్యేష్ఠ యం = ఏ దుర్యోధనుని, అపత్యమత్యా = పుత్రుఁడనుబుద్ధితో వంశమును పతన మొనర్పఁడను నభిప్రాయముతో, పుష్ణాసి, సః, ఏషః, పురుషద్విట్ = పూర్ణసద్గుణుఁడైన శ్రీహరిని ద్వేషించువాఁడు. కృష్ణాద్విముఖః = కృష్ణునకు విముఖుఁడు. తద్భక్తులకు విరోధి. అందుచేతనే, గతశ్రీః = లక్ష్మీప్రసాదరహితుఁ

డు. ఇట్టి, దోషః = పాపి, గృహం = నీ యింటిని, ప్రవిష్టః ఆస్తే. అథ = ఈ కారణములతో, ఆశు = కాలవిలంబన మొనర్పక, కులకౌశలాయ = వంశక్షేమమునకై, ఏనం త్యజ.

**14. శ్లో** : తనమాటను, ధృతరాష్ట్రుఁడు వినలేదు అనుటొక్కటే విదురుని తీర్థయాత్రకును వైరాగ్యమునకుఁ గారణమా? లేక వేఱు కారణమున్నదా? అనఁగాఁ జెప్పుచున్నాఁడు. ఇది యీ ప్రకారముగా, ఊచివాన్, సత్, స్పృహణీయ శీలః, క్షత్తా, సకర్ణానుజసౌబలేన, ప్రవృద్ధకోపస్ఫురితాధరేణ, సుయోధనేన, తత్ర = అన్నయైన ధృతరాష్ట్రుని యెదుటనే, అసత్కృతః, = ధిక్కృతుఁడుగ అభూత్ = అయ్యెను.

**15. శ్లో** : ధిక్కారరీతిని జెప్పుచున్నాఁడు. జిహ్మం = కపట హృదయుఁడైన, దాస్యాస్సుతం = దాసీసుతుఁడైన, ఏనం : వీనిని అత్ర, కః ఆజుహావ, ఏషః, యద్బలినా = ఎవని యన్నముచేత, పుష్టః తస్మిన్, ప్రతపస్సన్ పరకృత్యే, ఆస్తే, (తస్మాత్) ఆశు, శ్వసానః = ప్రాణమాత్రావశిష్టుఁడుగా, పురాత్ నిర్వాస్యతాం.

**16. శ్లో** : మర్యాదగలవాఁడు అది జాఱకముందే అచ్చటినుండి తొలఁ గిపోవుట శ్రేయస్కర మను నభిప్రాయమును రెండు శ్లోకములతో సూచించుచున్నాఁడు. ఇత్థం, భ్రాతుః పురః అత్యుల్బణ కర్ణబాణైః మర్మసు = దేహముయొక్క ముఖ్యభాగములగు జీవకేంద్రములందు, తాడితః అపి గతవ్యథః, సః, స్మయన్ = చిఱునవ్వుచు, ధనుః, ద్వారినిధాయ, మాయాం, కొడుకను నభిమానమునకు లోఁబఱచిన శ్రీహరియొక్క బంధకశక్తి, ఉరుమానయానః = చాల బలిష్ఠమని తెలిసినవాఁడై, ఆయాత్ = తీర్థయాత్రకు బయలుదేఱెను. "స్వయం"- అని శ్రీధరుఁడు, స్మయన్" - అని విజయధ్వజమను మారుపేరుగల పదరత్నావళి.

**17. శ్లో** : కౌరవపుణ్యాలబ్ధగజాహ్వాయాత్ = కురువంశరాజులచేఁ జేయఁబడిన పుణ్యఫలముగా సిద్ధించిన హస్తినావతి యనెడు రాజధాని నుండి (దీనివలన హస్తినావతియు నొక పుణ్యక్షేత్రమని తెలిపిన ట్లైనది) నిర్గతః = బయలుదేఱిన, సః = విదురుఁడు, సహస్రమూర్తిః = అనంత రూపములు గల శ్రీహరి. యాని = ఏ పుణ్యక్షేత్రములందు, అధిష్ఠితః = విశేషసన్నిధానముతో నుండునో, తాని = అట్టి, ఉర్వ్యాం, తీర్థపదః పదాని = గంగను పాదములయందుఁ గలిగిన శ్రీహరినివాసము లనిపించికొన్న పుణ్య క్షేత్రములను, పుణ్యచికీర్షయా = పుణ్యమును సంపాదించికొనవలెనను నభిప్రాయముతో, అన్వాక్రమత్ = సంచరించెను. కౌరవపుణ్యలబ్ధః = అని శ్రీధరులు. ఇది విదురునకు విశేషణము. విజయధ్వజము కౌరవపుణ్యబ్ధగజాహ్వాయాత్" - అని యొకటే సమాసము.

18. శ్లో : దీనినే వివరించుచున్నాఁడు. అనన్యః = ఏకాకియైన విదురుఁడు, అనంతలింగైః = పరమేశ్వరుని యనంతమూర్తులచేత, సమలంకృతేషు, తీర్థాయతనేషు = (1) పవిత్రమైన నీరుగల, (2) నిత్యశుద్ధుఁడైన శ్రీహరి సన్నిధానముగల, (పుణ్యశబ్దమును ప్రతియొక్కదానికి నన్వయించికొనవలెను). పుణ్యకరములైన యూళ్లసమీపమందుఁగల, యుద్యాన వనములందును, శ్రీశైలాది పర్వతములందును, సింహాచల గిరివ్రజాది చిన్నపర్వతములందు, వనేషు = బృందావనాదులందు, అపంకతోయేషు, సరితస్సరస్సు = గోదావర్యాదులందు, పుష్కరాదిసరస్సులందు, చచార.

19. శ్లో : సంచారమును వివరించుచున్నాఁడు. గాంపర్యటన్ = మేధ్యవివిక్తవృత్తిః (1) పవిత్రములైన చెట్లనుండిరాలిన పండ్లు ఆకులు మొదలైనవి తినుచున్నవాఁడై, (2) పవిత్రములైన యేకాంతస్థలములందు వసించుచున్నవాఁడై, సదా ప్లుతః = అధశ్శయానావధూతః = నేలమీఁదఁబండుకొనుటతో ధూళిమొదలైన వంటుకొన్న శరీరముగలవాఁడై, స్వైః అలక్షితః, అవధూతకేశః. హరితోషణాని, వ్రతాని, చేరే. విదురుఁడాచరించిన వ్రతము లన్నియు శ్రీహరిప్రసాదమును సంపాదించికొనుటలో సమర్థములైనవి. దీనిచేత వ్రతము ఉద్దిష్టమైన దేవతను వశపఱచికొనుటకు సమర్థమని చెప్పినటు లైనది. అవధూతవేషః 'శ్రీధరుఁడు. అవధూతకేశః = పదరత్నావళి.

20. శ్లో : ఇత్థం భారతవర్షం, ఏవ, వ్రజన్, కాలేన యావత్ = ఎప్పుడు, ప్రభాసం, గతవాన్, తావత్ = అప్పుడు, ఏకచక్రాం = ఏకాతపత్రాం, క్షితిం, అజితేన, పార్థః, శశాస. "ఇత్థం" అనుటచేత నియమములను దప్పక యాచరించుచున్నవాఁడై యనియు, ఏవ అనుటతో కర్మభూమియైన భారతమందే తిరిగెనుగాని భోగభూములకుఁ బోలేదనియు, 'క్షితిం' అనుటచేత ధర్మరాజురాజ్యమందు నెచ్చటనైనను సుఖముగా నివసించుటకు వీలుండె ననియు, చోరతస్కరాదిభయములు లేకుండె ననియుఁ జెప్పిన ట్లైనది.

21. శ్లో : ప్రభాసమునకు వచ్చెననుటతో నేదోవిశేషము సూచించిన ట్లైనది. ఆ విశేషమును జెప్పుచున్నాఁడు. అథ, తత్ర = అచ్చటనే వసించుచు వేణుజవహ్నినా ఆశ్రయం = ఆ వెదుళ్లకాశ్రయమైన, వనం = అరణ్యము, యథా = ఎట్లు, సంస్పర్ధయా = బ్రాహ్మణశాపముతోఁ బరస్పరమర్మభేదకములైన మాటలమూలకముగా నేర్పడిన కలహమనెడు వహ్నిచేత, దగ్ధం, సుహృద్విసష్టిం = జరుగఁబోయెడు యాదవుల వినాశమును గూర్చి, శుశ్రావ = సంక్షేపముగా వినెను. అథ = ఆ విషయము దెలిసినతర్వాత, అనుశోచన్, తూష్ణీం, ప్రత్యక్, సరస్వతీం = పశ్చిమదిక్కుగాఁ బాఱుచుండెడు సరస్వతీనదిని గూర్చి, ఇయాయ = బయలుదేఱెను.

"విదురస్తు ప్రభాసస్థః, శాపం సంక్షేపతోఽశృణోత్,
యదూనాం విస్తరాత్ పశ్చాత్ ఉద్ధవాద్యమునామను".

అనెడు ప్రమాణముచేత రాఁగల యాదవులనాశమును దెలిసికొనెనని యర్థము. అట్లు చెప్పకున్నచో మహాభారతమునకు విరుద్ధ మగును. సరస్వతీనదికిఁ బోయెనని చెప్పుటవలన శాపవృత్తాంతమును దెలియుటకు ద్వారకకుఁ బోలేదని చెప్పినటులైనది.

22. శ్లో : తస్యాం = త్రితాదితీర్థములను, సః = విదురుఁడు, ఆసిషేవే = సేవించెను. ఆ తీర్థములందు స్నాన మాడెనని యర్థము. దీనినుండి విదురునకు శాస్త్రజ్ఞానము గొప్పగానుండెనని సూచింపఁ బడినది. సంసార మల్పకాలములో నాశమగునది. అందుచేత తీర్థస్నానము మొదలైనవానితో మనస్సును శుద్ధమొనర్చికొనవలెను. అట్టివానికి భగవంతుని యపరోక్షజ్ఞాన మేర్పడును. దానితో మోక్షసిద్ధి.

23. శ్లో : నదీతీర్థములను మాత్రమేకాదు. ఆ దేశములందున్న పుణ్యక్షేత్రములను గూడ దర్శించెనని చెప్పుచున్నాఁడు. ఇహ = నదియందును, సురాష్ట్రదేశమందును. యద్దర్శనాత్, కృష్ణం, అనుస్మరంతి. కాని, ద్విజదేవదేవైః, కృతాని, ప్రత్యంక ముఖ్యాంకిత మందిరాణి = చక్కని లక్షణములతోఁ గూడిన బ్రహ్మ మొదలైన దేవతలందుఁ బ్రధానుఁడైన విష్ణుమూర్తులతోఁగూడినట్టి దేవస్థానములు గల, విష్ణోః = విష్ణుసంబంధియైన, అన్యాని, ఆయతనాని, చ = కూడ, ఆసిషేవే. "బ్రహ్మ ప్రత్యంకవాన్ సమ్యక్ విష్ణుర్లక్షణవత్తమః" అనెడు ప్రమాణముతో పైయర్థమునే చెప్పవలెను. 'ఆయుధశ్రేష్ఠమైన చక్రముచేత చిహ్నితమైన' అనునర్థమును జేయరాదు. ఏ నిఘంటువులుగూడ నా యర్థమును జెప్పలేదు. "ప్రత్యంగముఖ్య" అని శ్రీధరులు. ప్రత్యంకముఖ్య అని విజయధ్వజులు.

24. శ్లో : తతః = కాలేన, ఋద్ధంతు = సర్వసంపత్తితోఁగూడిన, సురాష్ట్రం = సౌరాష్ట్రదేశమును, అతివ్రజ్య = సౌవీర, మత్స్య, కురు, జాంగలదేశములను వదలి పయనించి యమునానదిని సమీపించి, తత్ర = అచట - తావత్ = మొదలు, భాగవతం ఉద్ధవందదర్శ, 'ఋద్ధం' అనుటచేత, విదురునకుఁ దీర్థయాత్రలందే తాత్పర్యముగాని సుఖములందుగాదని సూచిత మైనది.

25. శ్లో : అచ్చటఁ దీర్థస్నాన మొనర్పకయే యుద్ధవునిగాంచివ విదుర ఁడేమి యొఁనర్చెను? అనెడు పరీక్షిత్తుమనస్సునందున్న ప్రశ్న కుత్తర మిచ్చుచున్నాఁడు. సః ప్రశాంతం = అతిశయముగా భగవన్నిష్ఠగల, బృహస్పతేః = బృహస్పతినుండి,

ఆప్తనయం = శాస్త్రజ్ఞానమును బొందిన, ప్రతీతం, వాసుదేవానుచరం = శ్రీకృష్ణుని జతలోనే దిరిగిన యుద్ధవుని, ప్రణయేన, గాఢం, ఆలింగ్య, భగవత్ప్రజానాం = శ్రీహరినే ప్రజగాఁ బొందినట్టి, స్వానాం = తనవారైన యాదవుల యొక్క, భద్రం = క్షేమమును గూర్చి (ఉద్ధవం), అపృచ్ఛత్. "ప్రశాంతం" మొదలైన మూఁడు విశేషణములను జెప్పుటచేత ఉద్ధవునియందు భగవన్నిష్ఠ వైరాగ్యము శాస్త్రజ్ఞానము అతిశయముగా నుండె ననియు, వీనితోఁ బ్రఖ్యాతుఁ డనియుఁ జెప్పినట్లైనది. "బృహస్పతేఃప్రాక్తనయం" అని శ్రీధరుఁడు. ఆప్తనయం అని విజయధ్వజుఁడు.

**26. శ్లో** : స్వనాభ్యపాద్మానువృత్యా, కృతక్షణౌ = అవతరించినట్టియు, ఇహ = భూలోకమందు, శూరగేహే, కలయా అవతీర్ణౌ, పురాణౌ = పురాతన పురుషులు, శ్రీహరియవతారమైన కృష్ణుఁడు అతని శుక్లకేశావేశయుక్తుఁడై శేషావతారుఁడైన బలుఁడును, ఉర్వ్యాః, కుశలం = భూభారమును దగ్గించెడు దైత్యసంహారరూపమైన కార్యమును, విధాయ, కుశలం = క్షేమముగా, కచ్చిత్ ఆసాతే = ఉన్నవారేనా? వేఱుగా కుశల శబ్దముండుటచేత ఇచ్చట కచ్చిత్ అనునది కేవల ప్రశ్నార్థకము. లోకానాం సుఖకర్తృత్వ మపేక్ష్య కుశలం విభోః పృచ్ఛ్యతే సతతానందాత్ కథం తస్యైవ పృచ్ఛ్యతే "అనెడు ప్రమాణముతో నిరంతరమును ఆనందరూపియైన శ్రీహరి కుశలమే యని ప్రశ్నించుట. అతఁడు జగత్తునకుఁ గుశలము చేయుచున్నాఁడా? అని ప్రశ్నించుట మాత్రమే.

**27. శ్లో** : అంగ! ఓ యుద్ధవుఁడా! కురూణాంనః పరమః సుహృత్, భౌమః = పూజ్యుఁడైన. సః. శౌరిః = శూరసేనుని కొడుకైన వసుదేవుఁడు, సుఖంకచ్చిత్ ఆస్తే, వదాన్యః యః వై, వరతర్పణేన = చెల్లెంద్రమగంద్రను సంతృప్తి పఱచుటచేత, స్వసౄణాం = చెల్లెంద్రకు, పితృవత్ వరాన్ = శ్రేష్ఠ వస్తువులను దదాతి.

**28. శ్లో** : రుక్మిణీ, ఆదిసర్గే. స్మరం. యం. విప్రాన్. ఆరాధ్య. భగవతః, అభిలేభే, సః వీరః. యదూనాం. వరూధాధిపతిః. ప్రద్యుమ్నః, సుఖంకచ్చిత్ ఆస్తే. బ్రాహ్మణులను పూజించి అని చెప్పుట లోకమందు స్త్రీలు బ్రహ్మజ్ఞానుల యనుగ్రహముతోఁ దమ యభీష్టమును బడయుదురని చెప్పుటకొఱకే. అంతేగాని రుక్మిణీదేవికి నితరుల యనుగ్రహముతోఁ బుత్రసంతాన మయ్యెనని చెప్పుటకాదు. ఆమె లక్ష్మీదేవికదా!

**29. శ్లో** : శతపత్రనేత్రః. నృపాసనాశా. దూరాత్, పరిహృత్య, యం, అభ్యషించత్, సః, సాత్వత వృష్ణిభోజ దశార్ణకాణామధిపః కచ్చిత్సుఖం ఆస్తే.

**30. శ్లో** : సౌమ్య, అగ్రే = పూర్వజన్మమందు, యః = ఎవఁడు, అంబికయా = (గర్భే) ధృతః = గర్భమందు ధరింపఁబడెనో, యం దేవం గుహం వ్రతాఢ్యా, జాంబవతీ, అసూత = కన్నదో, సదృక్షః =పుత్రుఁడై జన్మించుటకు యోగ్యతగల, రథి నాం అగ్రణీః హరేః సుతః, సాధు సాంబః = భగవద్భక్తుఁడైన సాంబుఁడు లేక సాధు ఆస్తే కచ్చిత్.

**31. శ్లో** : యః. ఫల్గునాత్, లబ్ధధనూరహస్యః, అంజసా = నిర్వ్యాజమైన యధోక్షజుని, సేవయైవ = సేవచేతనే, యతిభిర్దురాపాం. తదీయాంగతిం లేభే, సః యుయుధానః = ఆ సాత్యకి, కచ్చిత్ క్షేమం ఆస్తే. దీనిచేత, ధనుర్విద్యయందు గొప్పజ్ఞానమును బొంది యుండుటయు శ్రీహరికృపకుఁ బాత్రుఁడై యుండుటయుఁ గుశలప్రశ్నకుఁ గారణము లైనవని యర్థము.

**32. శ్లో** : ప్రేమ విభిన్నధైర్యః = విష్ణువునం దుంచఁబడిన భక్తిచేత, నష్టమైన రజోవికారమగు నహంకారముగల, యః = ఎవఁడు, కృష్ణపాదాంకితమార్గపాంసుషు, అవేష్టత = పొరలాడెనో, అనమీవః, భగవత్ప్రపన్నః = శ్రీహరినే శరణుఁ జొచ్చిన, బుధః సః శ్వఫల్కపుత్రః, కచ్చిత్ స్వస్తి ఆస్తే.

**33. శ్లో** : యథా = ఎట్లు, త్రయీ = మూఁడువేదములు, యజ్ఞవితానం = (1) విష్ణువు యొక్క విభూతిని (2) యాగమును, అర్థం = ప్రతిపాదించెడు నర్థముగాఁ బొందియున్నదో, తథా = అట్లు, స్వగర్భేణ, దేవం బభార (తస్యాః అట్టి) దేవమాతుః ఇవ = అదితిదేవివలె, విష్ణు ప్రజాయాః = విష్ణువునే కొడుకుగాఁగలిగిన, దేవకభోజపుత్ర్యాః, కచ్చిత్శివంస్యై, అనుటచేత దేవకిగర్భమందుఁ బరమాత్మను ధరించినది యెప్పుడో ఒకసారి. వేద మన్ననో శ్రీహరిని సర్వకాలములందును బ్రతిపాదించుచుండును. కనుక నీ యుదాహరణము సరిపోలదని చెప్పుటకు వీలు లేదు. దృష్టాంతమందుఁ గొంచెము సాదృశ్యమున్నను జాలును. ఇదియే యాలంకారిక సంప్రదాయము.

**34. శ్లో** : యః = ఎవఁడు, సాత్వతాం వః = ఆశ్రితులైన యాదవులకు, కామదుఘః = వారివారి కోర్కుల నిచ్చునట్టి కామధేనువువలె నున్నాఁడో, యం = ఎవనిని, శబ్దయోనిం = "భద్రంనో అపివాతయమనః" అనెడు వేదమే దెలియపఱచునని (వేదముచేఁ దెలియఁదగినవాఁడని) ఆమనంతి స్మ = వేదములను దెలిసిన ఋషులు చెప్పుచుందురో, యం = ఎవనిని, మనోమయం = సమస్తకార్యములందును మనస్సుప్రేరణ మొనర్చుటచేత మనోభిమానిదేవత యగుటచేత మనస్సనియే, ఆమనంతి స్మ = పిలుచుచున్నారో, యం = ఎవనిని,

సత్త్వతురీయం అర్థం = (1) మనస్సు, బుద్ధి, అహంకారము, చిత్తము అనువానియందు చిత్తమునుండి నాల్గవదియైన మనస్సనుదానికర్థమని (2) బలవిజ్ఞానపూర్ణులైన వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధులను నాల్గుమూర్తులందు నాల్గవదియైన అనిరుద్ధరూపముచే నావిష్టుఁ డగుటచే యనిరుద్ధుఁడని, "అమనంతి" - పిలుతురో (సః) అట్టి, భగవాన్ = పూజ్యుఁడైన, అనిరుద్ధః, సుఖం = సుఖముగా, ఆస్తే అపిస్విత్ = ఉన్నాఁడా? మొదటి విశేషణముచేత అనిరుద్ధశబ్దార్థమును సూచించియున్నాఁడు. తాను కామములచే నాక్రమింపఁబడనివాఁడు. ఇంతమాత్రమే కామదుఘశబ్దమున కర్థముగాదు. ఆశ్రితుల కిష్టార్థము లిచ్చువాఁడని దాని యర్థము "భద్రంనో అపి వాతయ మనః" అను వేదవాక్యమునకు, హే మనః! ఓ మనస్సా! త్వం = నీవు, క్రతుం = జ్ఞానరూపుఁడైనట్టియు దక్షం = దర్శనవిషయమైన, భద్రం = మంగళరూపియైన విష్ణువు యొక్క ప్రతి = వైపునకు, వాతయ = నన్నుఁజేర్పుము అని యర్థమైన విష్ణువుయొక్క, ప్రతి = వైపునకు, వాతయ = నన్నుఁజేర్పుము - అని యర్థము. లేక హేనాథ! = ఓ స్వామీ! నో మనః = మామనస్సును మంగళరూపియైన శ్రీహరివైపునకుఁ జేర్పుము." అని గూడఁ జెప్పికొనవచ్చును. మనః = మనస్సునకు స్వామియైన యనిరుద్ధుఁడా! నః = మాయొక్క క్రతుం = సంకల్పమును, దక్షం = జ్ఞానముగను - భద్రంకురు = సత్త్వవిషయముగా నొనర్పుము అనియు నర్థాంతరము. కొందరు నో మనః = దక్షం = సమర్థమైన, క్రతుం చ = యజ్ఞమును, భద్రం = మంగళకరమైన శ్రీహరియందు, వాతయ = చేర్పుము అని గూడనర్థముఁ జెప్పుదురు. మఱి యీశ్రుతికి అనిరుద్ధుఁడు విషయమని యెట్లు చెప్పుట? "మనసా వా అగ్రే సంకల్పయతి" - "మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" ఇత్యాది సూక్తుల కనుకూలముగా మనస్సే కర్మరూపమైనదిగాఁ జెప్పినప్పుడు అనిరుద్ధునకు మనశ్శబ్దార్థమును దెలుపుటకు "సత్త్వతురీయం" అనివాడఁబడినది. "మనోబుద్ధిరహంకారశ్చిత్తమిత్యంతరాత్మనః । యద్విదు ర్హ్యనిరుద్ధాఖ్యం హృషీకాణామధీశ్వరమ్. శారదేందీవరశ్యామం సంరాధ్యంయోగిభిశ్శనైః" అనెడు వచనముగూడ నిందుకుఁ బ్రమాణము. సత్త్వతురీయం అనుటకు రెండర్థములు ముందుఁ జెప్పినాము. ఆ రెండవయర్థమువనుసరించి అనిరుద్ధునియందు శ్రీహరి యావేశ మున్నది. అందుచే ననిరుద్ధుఁడు శ్రీహరియందుఁ దప్ప వేఱుచోటలేని కామదుఘత్వాది గుణములను బొంది యుండుట యుక్తమే. పృథురాజు మొదలగువారి యందును శ్రీహరి యావేశముతో నతిశయమైన మహిమ యుండుట విన్నదేగదా!.

35. శ్లో : అడిగిన కుశలప్రశ్నను ప్రసిద్ధు లందును, అప్రసిద్ధులందును బొందించుచున్నాఁడు. యః = ఎవరు, నిజాత్మదైవం = తమస్వామియైన శ్రీహరిని, అనన్యవృత్త్యా = అనన్యభక్తిచేత, సమనువ్రతాః = అనుసరించి సేవించుచుందురో, తే = అట్టి, అన్యే ఇతరులైన, హార్దిక్య = కృతవర్మ సత్యాదేవికొడుకైనచారుదేష్ణుఁడు గదుఁడు మొదలైనవారు, స్వస్తి చరంతి అపి స్విత్ = సుఖముగ నున్నవారేనా?

36. శ్లో : యత్సభాయాం = విజయానువృత్త్యా = (1) దిగ్విజయముతో సంపాదించిన, (2) అర్జునునితో నేర్పడిన, (3) శ్రీహరియిచ్ఛతోఁ గలిగిన, సామ్రాజ్యలక్ష్మ్యా = చక్రాధిపత్యసంపత్తితో, దుర్యోధనః అతవ్యత = మాత్సర్యముతోఁ గాల్చఁబడెనో! సః ధర్మః, విజయాచ్యుతాభ్యాం, స్వదోర్భ్యాం, సేతుం = ధర్మసేతువును, ధర్మేణ = ధర్మశాస్త్రమును మీరక, పరిపాతి = పాలించుచున్నాఁడా? ఇతరులు ఐశ్వర్యమదముతో ధర్మము నతిక్రమింపవచ్చును. ధర్మరా జట్టివాఁడు కాఁడు అని తెలుపుటకే ధర్మ శబ్దము వాడఁబడినది.

37. శ్లో : గదాయాః, విచిత్రం, మార్గం, చరతః, యస్య, అంఘ్రిపాతం రణభూః , నసేహే. సః. అహివత్, అత్యమర్షీ, భీమః. కృతాఘేషు, దీర్ఘతమం అఘం. = అపరాధ బుద్ధిని. కింవావ్యముంచత్ = వదలినాఁడా? అత్యమర్షీ అనుటచేత, ప్రశ్నకు నిమిత్తమును 'యస్యాంఘ్రిపాతం' - అనుటతో నతనిపరాక్రమమును 'మార్గం' అనుటతో అంఘ్రిపాతకారణమును జెప్పినాఁడు.

38. శ్లో : యచ్ఛరకూటగూఢః, అలక్షితః, మాయాకిరాతః, గిరిశః, తుతోష, సః, రథయూధపానాం, యశోధాః, గాండీవధన్వా, ఉపరతారిః ఆస్తే కచ్చిత్.

39. శ్లో : పక్ష్మభిః అక్షిణీఇవ, పార్థైః, వృతౌ, మాద్ర్యాః తనయౌ, యమౌచ సుపర్ణౌ, వజ్రివక్త్రాత్, సుధామివ, మృధే, వైరవక్త్రాత్ = తమ శత్రువుల కడనుండి, స్వరిక్థం = తమరాజ్యమనెడు ధనమును, ఉద్ధృత్య = పెటికికొని రేమాతే ఉతస్విత్, 'సుపర్ణౌ' అనుటతో ద్వివచనము మాద్రీపుత్రుల కనుగుణముగా వాడఁబడినది. నకులసహదేవు లిర్వురు గదా! "యమా ఉతస్విత్ స్తనపౌ పృథాయాః" అని విజయధ్వజము.

40. శ్లో : యః తు = ఏ పాండురాజు, ఏకవీరః, అతిరథః, ధనుర్ద్వితీయః చతస్రః కకుభః, విజిగ్యే, తేన, రాజర్షివర్యేణ, వినాఅపి, పృథాఅపి సహఅర్భకార్థే, ధ్రియతే, అహో!.

41. శ్లో : సౌమ్య!, యః, పరేతాయ, భ్రాత్రే, విదుద్రుహే, స్వపుత్రాన్, సమను వ్రతేన, యేన, సుహృత్, అహం, స్వపుర్యాః, నిర్యాపితః, తం, అధః, పతంతం, అనుశోచే.

**42. శ్లో** : సః అహం = ఈ రీతిగా పట్టణమునుండి వెడలఁగొట్టఁబడిన నేను, నాన్యోపలభ్యః (సంసారిణాం క్లేశం) పశ్యన్, గతవిస్మయః, ప్రసాదాత్ = శ్రీ హరియనుగ్రహముచేత, అత్ర = ఇచ్చట, మర్త్యవిడంబనేన, నృణాం దృశః, భావయతః = కనఁబడుచున్న, విధాతుః, హరేః, పదవీం పొందుటకుఁ గారణమైన నివృత్తిమార్గమును, చరామి = అనుసరించుచున్నాను.

**43. శ్లో** : కంసాదులను జంపినట్లుగా కౌరవులనుగూడఁ బరమాత్ముఁడు తొందరగా నెందుకుఁ జంపలేదు? లేక చంపింప లేదు? అని యాశంకించి ప్రయోజనాంతరముండుటచేతఁ జంపుట కుపేక్షించె నని చెప్పుచున్నాఁడు. భగవాన్ ఈశః, ప్రపన్నార్తి జిగీషయా = శరణు జొచ్చిన దేవావతా రులైన వసుదేవాదుల దుఃఖమును బరిహరింపవలెనను నిచ్చతో, త్రిమదోత్పథానాం = విద్య, ధన, కుల, మదములతో సన్మార్గమును వదలి చరించుచున్నట్టియు, చమూభిః, ముహుః, మహీం, చాలయతాం నృపాణాం = కంసాదిరాజులయొక్క, వధాత్ = వధింపవలెననెడి కారణముచేతనే, కురూణాం, అఘం, ఉపైక్షత హి = ఉపేక్షించెను. నూనం = నిశ్చయము, ఈశః అనుటచేత సమర్థుఁ డనియు, ప్రపన్నారి అనుటచేతఁ గంసాదులను దొలుత వధించుటకుఁ గారణమును శ్రీహరియొక్క ప్రవృత్తి భక్తులయభీష్టము ననుసరించి యుండె ననియు సూచింపఁబడినది.

**44. శ్లో** : భూభారకులైన దుష్టుల సంహారమే భక్తుల యభీష్టము. అదే శ్రీహరియవతారప్రయోజన మను నభిప్రాయముతోఁ జెప్పుచున్నాఁడు. అజస్య. జన్మ. ఉత్పథనాశనాయ, = దుర్మార్గులైన కంసాదిదైత్యుల సంహారమునకు వేఱుప్రయోజనముగూడ మున్నదని చెప్పుచున్నాఁడు. అకర్తుః = ఫలాపేక్ష లేక స్వాభావికముగా సృష్ట్యాదు లొనర్చు పరమాత్మునియొక్క, కర్మాణి = సృష్ట్యాదులు, పుంసాం = అధికారి చేతనులయొక్క. గ్రహణాయ, శ్రవణ. మనన. నిధి. ధ్యాసరూపమైన జిజ్ఞాసకొఱకు, అన్యథా = శ్రవణమననాది జిజ్ఞాసతప్ప - వేఱు కారణము, నతు = కానేకాదు. కః = ఏ పురుషుఁడు తానే, దేహయోగం = శుక్రశోణిత సంబంధముచే నేర్పడెడు భౌతికదేహబంధమును, అర్హతి = పొందన పేక్షించును? గుణానాం = ప్రాకృతగుణములకు, పరః = సంబంధింపక ఉత్తముఁ డుగా నుండునట్టి పరమాత్మ, కర్మతంత్రం = ప్రారబ్ధకర్మానుగుణమైన మనుష్యాదిదేహమును గాని, ఉత = దేవతాదేహమును గాని, అర్హతి = పొందుట

కర్తృఁడగునా? "హరిఃకర్తా వ్యకర్తేతి ఫలాభావేన భణ్యతే" అనెడు ప్రమాణము ననుసరించి శ్రీహరి యకర్తయనిపించికొనుచున్నాఁడు. 'గుణానాం' - అనెడు షష్ఠ్యంత ప్రయోగముతో గుణములసంబంధమే లేదని తెలిపిన ట్లైనది. సద్దేహః అని శ్రీహరికి దేహసంబంధము వేఱుచోటఁ జెప్పఁబడియుండుటచే, దేహమే లేదనుట యెట్లు? దీనికి సమాధానమే 'కర్మతంత్రం' అనెడు ప్రమాణముతో ప్రాకృతదేహమును బొందుననుట సమంజసముగాదు.

**తాత్పర్యము** : కంసాదులను జంపినట్లు శ్రీహరి కౌరవులను తొందరగాఁ జంపి యుండును. లేక చంపించి యుండును. కాని విద్యా, ధన, కుల, మదములతో నున్మార్గులైనట్టియు, అనేకాక్షౌహిణీసైన్యసమేతులైనట్టియు దుష్టరాజులను మొదలు నంహరింపవలెనని యూహించినాఁడు. ఇట్లూహించుట దేవతల దుఃఖపరిహారమునకు. అందుకే దుర్యోధనాదుల దుర్మార్గములను గొంతకాల ముపేక్షించినాఁడు. భక్తాభీష్టపూర్ణతకే శ్రీహరి ప్రవర్తించును. కంసాదిదుష్టులను సంహరింపను శ్రీహరి యవతరించినాఁడు. కాకున్నచో జననమరణరహితుఁడైనవాఁడు వ్యక్తుఁ డగుటకుఁ గారణమే లేదు. అధికారి చేతనులు శ్రవణాదులతో నన్ను గమనింతురుగాకయని యాతఁ డవతరించును. క్రీడార్థమై జన్మ ధరించు ననుట సరికాదు. వాఁడు ప్రాకృతగుణములనుండి యత్యంతము దూరముగ నున్నవాఁడు. శుక్లశోణిత సంబంధముగల దేహమును బరమాత్ముఁడు క్రీడార్థమై ధరించు ననుట పొసఁగదు. విధినిషేధములు లేని వానికి ప్రారబ్ధకర్మానుగుణమైన దేహ మెట్లు ప్రాప్తించును? కనుక, దనయాజ్ఞానుసారము ప్రవర్తించుచున్న శరణాగతులైన లోకాధిపతుల ప్రయోజనమునకుఁగానే యాతఁడజుఁడైనను యాదవులలో జన్మించెను.

**45. శ్లో** : సఖే! స్వే, అనుశాసనే, అవస్థితానాం, ప్రపన్నాఖిలలోకపానాం, అర్థాయ, యదుషు = జాతస్య = వ్యక్తుఁడైయున్న, తీర్థకీర్తేః, అజస్య, వార్తాం కీర్తయ.

ఇతి శ్రీమద్భాగవతే, మహాపురాణే, అష్టాదశసహస్రికాయాం,
సంహితాయాం, పారమహంస్యాం, శ్రీవైయాసిక్యాం,
శ్రీహయగ్రీవబ్రహ్మవిద్యాయాం, తృతీయస్కంధే
ప్రథమోధ్యాయః

## పోతన భాగవతము

క. శ్రీమహిత వినుత దివిజ
స్తోమ! యశస్సోమ! రాజసోమ! సుమేరు
స్థేమ! వినిర్జిత భార్గవ
రామ! దశానన విరామ! రఘుకులరామా! 1

వ. మహనీయగుణగరిష్ఠులగు న మ్మున శ్రేష్ఠులకు నిఖిలపురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుండైన సూతుం డిట్లనియె. అట్లు ప్రాయోపవిష్టుండైన పరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుం డిట్లనియె. 2

ఉ. పాండునృపాల నందనులు బాహుబలంబున ధార్తరాష్ట్రులన్
భండనభూమిలో గెలిచి పాండుర శారద చంద్ర చంద్రికా
ఖండ యశః ప్రసూన కలికావళిఁ గౌరవ రాజ్యలక్ష్మి నొం
డొండ యలంకరింపుచు జయోన్నతి రాజ్యము సేయుచుండఁగన్. 3

క. మనుజేంద్ర! విదురుఁ డంతకు
మును వనమున కేఁగి యచట మునిజనగేయున్,
వినుత తపో ధౌరేయున్,
ఘను, ననుపమ గుణవిధేయుఁ గని మైత్రేయున్. 4

క. కనుఁగొని తత్పాదంబులు
దన ఫాలము సోక మ్రొక్కి తగ నిట్లనియెన్
మునివర! సకల జగత్పా
వనచరితుఁడు గృష్ణుఁ డఖిల పంద్యుం డెలమిన్. 5

క. మండిత తేజోనిధి యై
పాండవ హితమతిని దూతభావంబున వే
దండపురి కేగి కురుకుల
మండనుఁ డగు ధా ర్తరాష్ట్ర మందిరమునకున్. 6

తే. చనఁగ నొల్లక మద్గృహంబునకు భక్త
వత్సలుం డగు కృష్ణుండు వచ్చు టేమి
కతము? నాకది యెఱిఁగింపు కరుణతోడ
ననుచు విదురుండు మైత్రేయు నడిగె ననిన. 7

క. విని వెఱఁగంది పరీక్షి
న్మనుజవరేణ్యుండు విమలమతి నిస్తంద్రున్
మునికుల జలనిధి చంద్రున్
సునిశిత హరిభక్తిసాంద్రు శుకయోగీంద్రున్. 8

క. కని యిట్లనె మైత్రేయుని
ననఘుండగు విదురుఁ డే రహస్యము లడిగెన్?
ముని యేమి చెప్పె? నే పగి
దిని దీర్థము లాడె? నెచటఁ దిరుగుచు నుండెన్? 9

తే. ఇన్ని దెలియంగ నానతి యిచ్చి నన్ను
నర్థి రక్షింపవే విమలాంతరంగ!
ఘన దయాపాంగ! హరిపాద కమలభృంగ!
మహిత గుణసంగ! పాపతమః పతంగ! 10

చ. అనవుడు బాదరాయణి ధరాధిపుతో ననుఁ బూరువంశ వ
ర్ధన! విను కష్టుఁడైన ధృతరాష్ట్రనృపాలుఁడు పెంపుతో సుయో
ధనముఖపుత్రులం గడు ముదంబునఁ బెంపుచుఁబాండురాజా ద
ప్పినపిదపన్ దదాత్మజులు పెల్కుఱి తన్నని చేర వచ్చినన్. 11

వ. ఇట్లు వచ్చిన పాండవులయెడ నసూయా నిమగ్నులై
సుయోధనాదులు. 12

క. పెట్టిరి విషాన్న; మంటం
గట్టిరి ఘనపాశములను; గంగానదిలో
నెట్టిరి; రాజ్యము వెడలం
గొట్టిరి; ధర్మంబు విడిచి కుటిలాత్మకులై. 13

క. క్రూరాత్ము లగుచు లాక్షా
గారంబున వారు నిద్ర గైకొని యుండన్
దారుణ శిఖి దరికొలిపిరి
మారణ కర్మముల కప్రమత్తులు నగుచున్. 14

తే. సూరిజనగేయ మగు రాజసూయ యజ్ఞ
విలస దవభృథస్నాన పవిత్రమైన
ద్రౌపదీ చారు వేణీభరంబు పట్టి
కొలువు లోపల నీడ్చిరి కుత్సితమున. 15

క. కావున వారల కపకృతిఁ
గావింపని దొక దినంబు గలుగదు, తమ జ
న్మావధి నిజ నందనులను
వావిరి న య్యంధనృపతి వలదనఁ డయ్యెన్. 16

తే. మాయజూదంబు వన్ని దుర్మార్గవృత్తిఁ
బుడమిఁ గొని యడవులకుఁబో నడువ నచటఁ
దిరిగి వారలు సమయంబు దీర్చి యేఁగు
దెంచి తమ యంశ మడిగినఁ బంచి యిడక. 17

వ. ఉన్న యెడ. 18

చ. సకల నియంతయైన హరి సర్వశరణ్యుఁడు మాధవుండు సే
వక నవ కల్పకంబు భగవంతుఁ డనంతుఁ డనంతశక్తి నం
దకధరుఁ డబ్జలోచనుఁడు ధర్మతనూభవుచే నియుక్తుఁడై
యకుటిల భక్తి యోగమహితాత్మకుఁడై ధృతరాష్ట్రుపాలికిన్. 19

క. చని యచట భీష్మ గురు త
త్తనయ కృపాచార్య నిఖిల ధాత్రీపతులున్
విని యనుమోదింపఁగ ని
ట్లనియెన్ ధృతరాష్ట్రుతోడ నవనీనాథా! 20

క. కౌరవ పాండవు లిరువురు
నారయ నీకొక్క సమమ యవనీవర! నీ
వే రీతి నైన బాండు కు
మారుల పాలొసఁగి తేని మను నుభయంబున్. 21

క. అని ధర్మబోధమునఁ బలి
కిన మాటలు చెవుల నిడమి గృష్ణుఁడు విదురున్
ఘన నీతిమంతుఁ బిలువం
బనిచినఁ జనుదెంచెఁ గురుసభాస్థలమునకున్. 22

వ. చనుదెంచి యచటి జనంబులచేత నుపస్థితంబైన కార్యంబు
దెలుపఁబడినవాఁడై ధృతరాష్ట్రు నుద్దేశించి యిట్లనియె. 23

మ. ధరణీనాయక! పాండుభూవిభుఁడు నీ తమ్ముండు; దత్పుత్రులన్
బరిరక్షించిన ధర్మముం దగవునుం బాటిల్లు; వంశంబు సు
స్థిర సౌఖ్యోన్నతిఁ జెందు; శత్రుజయమున్ జేకూరు; గోపాల శే
ఖరు చిత్తంబును వచ్చు నట్లగుట యోఁ గౌరవ్యవంశాగ్రణీ! 24

ఆ. వారి తండ్రి పాలు వారికి నొసఁగి నీ
పాలు సుతుల కెల్లఁ బంచియిచ్చి
చలము విడిచి ధర్మ మలవడ నీ బుద్ధిఁ
జొనుపవయ్య! కులము మనుపవయ్య! 25

చ. వినుము నృపాల! నా పలుకు; వేయును నేల సమీరసూతి నీ
తనయుల పేరు విన్నఁ బదతాడిత దుష్టభుజంగమంబు చా
డ్పునఁ గనలొందు; నింతయును మున్నునుఁ జెప్పితిఁగాదె వానిచే
తన భవదీయపుత్రులకుఁ దప్పదు మృత్యు వదెన్ని భంగులన్. 26

వ. అదియునుం గాక. 27

క. నీపుత్త్రుల శౌర్యంబును
చాపాచార్యాపగాత్మజాత కృప భుజా
టోపంబును గర్ణు దురా
లాపంబును నిజముగాఁ దలంతె మనమునన్ 28

వ. అట్లేని వినుము. 29

ఉ. ఏ పరమేశుచే జగము లీ సచరాచరకోటితో సము
ద్దీపిత మయ్యె; నే విభుని దివ్యకళాంశజు లబ్జగర్భ గౌ
రీపతి ముఖ్యదేవ ముని బృందము; లెవ్వఁ డనంతుఁ డచ్యుతుం
డా పురుషోత్తముండు కరుణాంబుధి గృష్ణుఁడు వో నరేశ్వరా! 30

ఉ. అట్టి జగన్నివాసుఁడు మురాసురభేది పరాపరుండు చే
పట్టిసఖుండువియ్యమును బాంధవుఁడున్ గురుఁడున్విభుండునై
యిట్టుల మైన ప్రేమమున నెప్పుడుఁ దోడ్పడుచుండు వారలన్
జుట్టన ప్రేల నెవ్వరికిఁ జూపఁగ వచ్చును పార్థివోత్తమా! 31

ఉ. కావునఁ బాండునందనులఁ గాఱియ పెట్టక రాజ్యభాగమున్
వా౽రి నిచ్చి రాజ్యమును వంశముఁ బుత్త్రుల బంధువర్గమున్
గావుము; కాక లోభియగు కష్ట సుయోధను మాట వింటివే
భూవర! నీ యుపేక్ష నగుఁబోకులనాశము బంధునాశమున్. 32

తే. ఒకనికై యిట్లు కుల మెల్ల నుక్కడంప
నెత్తుకొనఁ జూచె దిది నీతియే నృపాల!
వినుము నామాట; నీ సుయోధనుని విడిచి
కులము రాజ్యంబుఁ దేజంబు నిలుపవయ్య! 33

క. అని యిట్లు దఱిమి చెప్పిన
విని దుర్యోధనుఁడు రోషవివశుండై తా
నినతనయ శకుని దుశ్శా
సనుల నిరీక్షించి తామసంబునఁ బలికెన్. 34

క. దాసీపుత్త్రుని మీర లు
దాసీనుం జేయ కిటకుఁ దగునె పిలువఁగా?
నాసీనుండై ప్రేలెడు
గాసిలి చెడిపోవ వెడలఁగా నడువుఁ డీఁకన్. 35

వ. అని యిట్లు దుర్యోధనుం డాడిన దురాలాపంబులు దనకు మనస్తాపంబు సేయం గార్యంబు విచారించి ధైర్యం బవలంబించి యొండు వలుక నొల్లక శరశరాసనంబులు విడిచి క్రోధంబు నడఁచి వనంబునకుం జని యందు. 36

సీ. విష్ణుస్వయంవ్య క్త విమలభూములను బ
విత్రంబులగు హరిక్షేత్రములను
నెలకొని దేవతానిర్మితహరిదివ్య
భూముల గంగాది పుణ్యనదుల
సిద్ధపురాణప్రసిద్ధ పుణ్యాశ్రమ
స్థలముల నుపవనస్థలములందు
గంధమాదన ముఖక్ష్మాభృత్తటంబుల
మంజులగిరి కుంజ పుంజములను

తే. వికచ కైరవ పద్మ హల్లక మరంద
పాన పరవశ మధుకర గాన బుద్ధ
రాజహంస విలాస విరాజమాన
మగుచుఁ జెలువొందు పంకేరుహాకరముల. 37

క. మఱియును ఋష్యాశ్రమ వన
సరి దుపవన నద పుళింద జనపద గిరి గ
హ్వర గోష్ఠ యజ్ఞశాలా
పుర దేవాయతన పుణ్యభూముల యందున్. 38

క. కూరలుఁ గాయలు నీళ్ళా
హారముగాఁ గొనుచు నియమ మలవడఁగ నసం
స్కారశరీరుం డగుచు ను
దారత నవధూతవేషధరుఁడై వరుసన్. 39

క. హర్షము గదురఁగ భారత
వర్షమునం గలుగు పుణ్యవరతీర్థము లు
త్కర్షం జూచుచు విగతా
మర్షుండై సంచరించె మనుజవరేణ్యా! 40

వ. ఇట్లు సంచరించుచుఁ బ్రభాస తీర్థమ్మునకు వచ్చునపుడు. 41

చ. అరుగుచు దైత్యభేదన దయాపరిలబ్ధ సమస్త మేదినీ
భరణధురంధరుం డగుచుఁ బాండుసుతాగ్రజుఁ డొప్పుచుండ న
త్తఱి విదురుండుఁ దత్పురి దుదంచిత సాల రసాల మాధవీ
కురవక మాలతీ వకుళ కుంజ లసత్తట మందు నున్నెడన్. 42

చ. నరవర వేణుజానలవినష్ట మహాటవి మాడ్కిఁ బాండు భూ
వర ధృతరాష్ట్ర సూను లనివార్య నిరూఢ విరోధ మెత్తి యొం
డొరుల జయింపఁ గోరి కదనోర్విఁ గురుక్షితిపాలముఖ్యు లం
దఱు మృతు లౌటయున్ విని ఘనంబుగ శోకనిమగ్నచిత్తుఁడై. 43

ఉ. ఆ యెడఁ గాలు దన్నక రయంబున నేఁగి సరస్వతీనదీ
తోయములందుఁ గ్రుంకి మునితుల్యుఁడు వే చనియెం దనూనపా
త్త్రోయరుహా ప్త భార్గవ పృథుత్రిత సోమ సుదాస శక్తిభృ
ద్వాయు యమాభిధానయుత వాహినులం దనురక్తిఁ గ్రుంకుచున్. 44

ఉ. వెండియుఁ బుణ్యభూములఁ బవిత్రసరిత్తులఁ జూచుచున్ రమా
మండనుఁ డుండు దివ్యరుచిమన్మణిచారుకవాట గేహాళీ
మండిత సౌధగోపుర విమానము లున్నత భక్తిఁ జూచుచున్
నిండిన వేడ్కఁ గృష్ణ పద నీరజ చింతనుఁడై క్రమంబునన్. 45

**విదురుం డుద్ధవుం గని కృష్ణాదుల వృత్తాంతం బడుగుట**

చ. చని చని తొంటి మత్స్య కురుజాంగలభూము లతిక్రమించి చ
య్యన యమునానదిం గదిసి యచ్చట భాగవతున్ సరోజలో
చన దృఢభక్తు సద్గుణవిశారదు శాంతుని దేవమంత్రి శి
ష్యుని మహిత ప్రసిద్ధుఁ బరిశోషితదోషుఁ బ్రబుద్ధునుద్ధవున్. 46

క. కని యనురాగ వికాసము
దన మనమునఁ దొంగలింపఁ దగ గాఢాలిం
గన మాచరించి నెయ్యం
బునఁ గుశలప్రశ్న సేసి ముదమునఁ బలికెన్. 47

క. హరిభక్తులు పుణ్యాత్ములు
దురితవిదూరులు విరోధిదుర్దమబలులుం
గురుకులతిలకులు గుంతీ
వరసూనులు గుశలులే యవారిత భక్తిన్. 48

చ. హరి దన నాభిపంకరుహమందు జనించిన యట్టి భారతీ
శ్వరుఁ డతిభక్తి వేఁడ యదువంశమునన్ బలకృష్ణమూర్తులై
పరఁగ జనించి భూభరముఁ బాపిన భవ్యులు రేవతీందిరా
వరు లట శూరసేనుని నివాసమునన్ సుఖ మున్నవారలే? 49

చ. కురుకులు లాదరింపఁగ సఖుండును నా పృ్తఁడునై తనర్చి సో
దర తరుణీజనంబులను దత్పతులం గడు గారవంబునం
గరుణ దలిర్ప నాత్మజులకంటెఁ బ్రియోన్నతిఁ బ్రోచువాఁడు సు
స్థిరమతి నున్నవాఁడె వసుదేవుఁడు వృష్ణికులప్రదీపకా! 50

శా. కందర్పాంశమునం దనూజుఁ బడయం గామించి భూదేవతా
బృందంబున్ భజియించి తత్కరుణ దీపింపం బ్రభావంబు పెం
పొందన్ రుక్మిణి గన్ననందనుఁడు ప్రద్యుమ్నుండు భాస్వచ్చమూ
సందోహంబులు దన్నుఁ గొల్వ మహితోత్సాహంబునన్ మించునే 51

క. సరసిజలోచన కరుణా
పరిలబ్ధ సమ స్త ధరణిపాలన మహిమం
బరమప్రీతి సుఖించునె?
చిరవిభవోదారుఁ డుగ్రసేనుఁడు జగతిన్. 52

చ. లలిత పతివ్రతామణి విలాసవతీతిలకంబు పార్వతీ
లలన గుమారుఁ గన్నటు సులక్షణ జాంబవతీ లలామ ని
ర్మల గతిఁ గన్న పట్టి సుకుమారతనుండు విరోధిభంజనో
త్కలిక సుఖించునే గుణకదంబుఁడు సాంబుఁడు వృష్ణిపుంగవా! 53

క. హరిపదసేవకుఁ డరి భీ
కరుఁ డర్జును వలన మిగులఁ గార్ముక విద్యల్
దిరముగఁ గఱచిన సాత్యకి
వరసుఖ విభవముల నున్నవాఁడె ధరిత్రిన్? 54

మ. జలజాతాంకుశ చక్ర చాప కులిశ చ్ఛత్రాది రేఖాంకితో
జ్జ్వల గోవింద పదాబ్జ లక్షిత విరాజన్మార్గ ధూళిచ్ఛటా
కలితాంగుండు విధూతకల్మషుఁడు నిష్కామైక ధర్ముండు స
త్కులజాతుండన నొప్పు నట్టి ఘనుఁ డక్రూరుండు భద్రాత్ముఁడే? 55

క. శ్రుతులును గ్రతుజాతము స
మ్మతిఁ దాల్చినయట్టి వేదమాతగతిన్ శ్రీ
పతిఁ దనగర్భమ్మున ర
క్షితుఁ జేసిన గరిత దేవకీసతి సుఖమే? 56

వ. మఱియు మహాత్మా! మహితోపాసకు లగువారల కోర్కులు నిండింపంజాలిన భగవంతుండును, శబ్దశాస్త్రంబునకుం గారణం బని తన్ను నఖిలదేవతాజనంబు లగ్గింప గల మేటి యగుటంజేసి మనోమయుండును. సకలజీవ చతుర్విధాంతఃకరణంబు లయిన చిత్తాహంకారబుద్ధి మనంబులకుం గ్రమంబున వాసుదేవ సంకర్షణ ప్రద్యు మ్నానిరుద్ధు లధిదైవతంబు లగుదు రట్టి చతుర్విధ తత్త్వంబులకుఁ దుర్యంబైన తత్త్వంబుననైన యనిరుద్ధ కుమారుండు సంతోషచిత్తుం డగునే యని. 57

మ. ఇతరారాధన మాని కృష్ణుఁ గమలాధీశుం బయోజాసనా
ర్చితు భక్తిన్ నిజనాథుఁగా సతతమున్ సేవించుపుణ్యుల్ జగ
న్నుతు లధ్యాత్మవిదుల్మహాభుజులు మాన్యుల్ధర్మమార్గుల్ సము
న్నతి సత్యాత్మజచారుదేష్ణగదు లానందాత్ములే యుద్ధవా! 58

తే. క్రోధమాత్సర్యధనుఁడు సుయోధనుండు
వొలుచు నెవ్వనిసభఁ జూచి కలుష మొదవి
మనములోన నసూయానిమగ్నుఁ డయ్యె
నట్టి ధర్మజుఁ డున్నాఁడె యనఘచరిత! 59

తే. ఘనగదాభ్యాస చిత్ర సంగతుల మెఱసి
కురుకుమారుల భూరి సంగరములోన
హతులఁ గావించి వెలసినయట్టి జెట్టి
వాయుతనయుండు కుశలియై వఱలునయ్య! 60

చ. హరికరుణాతరంగిత కటాక్ష నిరీక్షణ లబ్ధ శౌర్య వి
స్ఫురణఁ దనర్చి తన్ను నని బోయగతిన్ గిరిశుం డెదిర్చినన్
బరవస మొప్పఁగా గెలిచి పాశుపతాస్త్రముఁ గొన్న శత్రు భీ
కరుఁడు ధనంజయుండు సుభగస్థితి మోదము నొందుచుండునే? 61

మ. తెఱఁగొప్పన్జననీవియోగమునఁ గుంతీస్త న్యపానంబు సో
దరసంరక్షయుఁ గల్గి దేవవిభు వక్త్రస్థామృతంబుం ఖగే
శ్వరుఁ డర్థిం గయికొన్న మాడ్కిఁ గురువంశ శ్రేణి నిర్జించి త
ద్ధరణీరాజ్యముఁ గొన్న మాద్రికొడుకుల్ ధన్యాత్ములే? యుద్ధవా! 62

తే. పాండుభూమీశ్వరుండు సంప్రాప్త మరణుఁ
డైన శిశువులఁ బ్రోచుటకై నిజేశుఁ
గూడి చనకున్న యట్టి యా కుంతిభోజ
తనయ జీవించునే నేఁడు? మనుచరిత్ర! 63

వ. అని వెండియు. 64

మ. అనుజాతుండగుపాండుభూవిభుఁడునిర్యాణంబునంబొంద నా
తని పుత్త్రుల్ దనుఁజేర వచ్చినను మాధ్యస్థంబుఁ బోఁ దట్టి యె
గ్గొనరించెన్ ధృతరాష్ట్ర భూమివిభుఁడ ట్లూహింపఁగా నెగ్గు సే
సిన వాఁడే యగుఁ గాక మేలు గలదే చింతింపఁగా నుద్ధవా! 65

క. అనుజుఁడు వీఁ డనకయ తన
తనయులు నను వెడల నడువఁ దా నూరక యుం
డిన ధృతరాష్ట్రుఁడు నరకం
బునఁ బడు నాద్దై న దుఃఖమున ననఘాత్మా! 66

వ. అదియునుం గాక పరమశాంతుండ వైన నీ మనంబున దుఃఖంబ గర్తవ్యంబు గాదంటేని. 67

క. నరలోక విడంబనమున
హరి పరమపరుండు మానవాకృతితో ని
ద్ధరఁ బుట్టి యాత్మమాయా
స్ఫురణన్ మోహింపఁజేయు భూజనకోటిన్. 68

ఉ. కావున నమ్మహాత్ముని వికార విదూరుని సర్వమోహ మా
యావిల మానసుండ నగు నప్పుడు సంసృతి దుఃఖి నౌదు; న
ద్దేవుని సత్కృపామహిమ దేలిన వేళ సుఖింతు; నేన కా
దా విధి శంకరప్రభృతు లప్పిభుమాయఁ దరింప నేర్తురే? 69

వ. అయిన నమ్మహాత్ముని కరుణాతరంగి తాపాంగ పరిలబ్ధ విజ్ఞాన దీపాంకుర నిరస్త సమస్త దోషాంధకారుండ నగుటంజేసి మదీయచి త్తంబు హరిపదాయత్తం బయిన కారణంబునను దత్త్వంబు సతతంబు నిరీక్షించుచునుండుదు; మఱియును. 70

సీ. అట్టి సరోజాక్షుఁ డాత్మీయ పదభక్తు
లడవుల నిడుమలఁ గుడుచుచుండ
దౌత్యంబుసేయఁ గొందఱు విరోధులు పట్టి
బద్ధునిఁజేయ సన్నద్ధులైన
బలహీనుమాడ్కి మార్పడలేఁడ యసమర్థుఁ
డని తలంచెదవేని నచ్యుతుండు
పరుల జయింప నోపక కాదు విద్యాభి
జన ధనమత్తులై జగతిఁ బెక్కు
తే. బాధల నలంచు దుష్టభూపతుల నెల్ల
సైన్య యు క్తంబుగా నని సంహరించు
కొఱకు సభలోన నప్పు డా కురుకుమారు
లాడు దుర్భాషణములకు నలుగఁడయ్యె. 71

మ. జననం బందుట లేని యీశ్వరుఁడు దా జన్మించు టెల్లన్ విరో
ధి నిరాసార్థము; వీతకర్ముఁడగు నద్దేవుండు గర్మప్రవ
ర్తనుఁ డౌటెల్లఁ జరాచర ప్రకట భూత శ్రేణులం గర్మ వ
ర్తనులం జేయఁదలంచి కాక కలవే దైత్యారికిం గర్మముల్. 72

క. హరి నరుల కెల్లఁ బూజ్యుఁడు
హరి లీలామనుజుఁడును గుణాతీతుఁడు నై
పరఁగిన భవ కర్మంబులఁ
బొరయం డఁట; హరికిఁ గర్మములు లీల లగున్. 73

క. మదిఁ దన శాసన మిడి నిజ
పదములు సేవించు లోకపాలాదుల పెం
పొదవింప యదుకులంబున
నుదయించెను భువిని బలసహోదరుఁ డగుచున్. 74

తే. చలన మందక భూరి సంసరణ తరణ
మైన సత్కీర్తి దిక్కుల నతిశయిల్లి
వఱల సమమతియై యున్నవాఁడె కృష్ణుఁ
డనుచు నుద్ధవుని విదురుఁ డడుగుటయును. 75

**అర్థములు :**

1. శ్రీమహిత = లక్ష్మీదేవిచేత శ్రేష్ఠుఁడైనవాఁడా! వినత దివిజస్తోమ = వినయముతో నమస్కరించుచున్న దేవతాసమూహముగలవాఁడా! యశస్సీమ! = గొప్పకీర్తిగలవాఁడా! రాజసోమ! = రాజులలో చంద్రునివంటివాఁడా! సుమేరుస్థేమ = మేరుపర్వతమువలె చలించనివాఁడా! నిర్జితభార్గవరామా! = పరశురాముని జయించినవాఁడా! దశాననవిరామ = రావణుని సంహరించినవాఁడా!, రఘుకులరామా = రఘువంశమందుఁ బుట్టినవాఁడా!

**తాత్పర్యము** : లక్ష్మీదేవికి భర్తయైనవాఁడా! సమస్తదేవతలచేతను వినుతింపఁబడినవాఁడా! గొప్ప కీర్తిగలవాఁడా! రాజులలో శ్రేష్ఠుఁడా! మేరుపర్వతము వలె నెట్టిపరిస్థితులందును జలింపనివాఁడా! పరశురాముని జయించినవాఁడా! భాగవతము నవధరింపు మని యర్థము.

2. వ. మహనీయ గుణగరిష్ఠులు = గొప్పగుణములచేత గొప్పవారు, ప్రాయోపవిష్టులు = ప్రాయోపవేశము నవలంబించినవారు.

**తాత్పర్యము** : గొప్పగుణములచేత గౌరవింపఁ దగిన మహర్షులకు సమస్తపురాణరహస్యము లెఱిఁగిన సూతుఁ డిట్లన్నాఁడు అట్లు ప్రాయోపవేశమును బొందిన పరీక్షిన్మహారాజును జూచి శుకబ్రహ్మ యిట్లు పలికెను.

3. ఉ. ధార్తరాష్ట్రులన్ = దుర్యోధనాదులను, భండనభూమిలోన్ = యుద్ధమందు, పాండుర = తెల్లనైన, శారదచంద్ర = శరత్కాలమందలిచంద్రునియొక్క, చంద్రికా = వెన్నెలవంటి, అఖండ = సంపూర్ణమైన, యశః = కీర్తి యనెడు, ప్రసూనకలికాతతిన్ = పూలమొగ్గలచేత, కౌరవరాజ్యలక్ష్మి = కౌరవరాజ్యమును, ఒండొండ = పైపైన, అలంకరింపుచున్, జయ + ఉన్నతిన్ = సంపూర్ణవిజయములతో

**తాత్పర్యము** : పాండవులు బాహుబలముతో దుర్యోధనాదులను యుద్ధమందు గెలిచిరి. వారికీర్తి దిక్కులందు వ్యాపించెను. జయలక్ష్మి వారిని వరించెను. వారియశస్సు శరత్కాలచంద్రుని వెన్నెలలవలె నుండెను. అఖండములై స్వచ్ఛములైన పూలమొగ్గలవలె నుండెను.

4. క. మనుజేంద్ర! = ఓ పరీక్షిత్తూ, అంతకు మునున్ = ఈ వృత్తాంతమునకంటె ముందే విదురుఁడు, వనమునకున్, ఏగి, అచటన్, మునిజనగేయున్ = మునులచేతఁ గీర్తింపఁ బడినట్టియు, వినుతతపోధౌరేయున్ = పొగడఁదగిన గొప్ప

తపస్సును వహించి నట్టియు అనుపమగుణవిధేయున్ = గొప్పగుణములచేతఁ గూడియున్నట్టియు, మైత్రేయున్.

**తాత్పర్యము :** ఓ పరీక్షిద్రాజా! విదురుఁ డంతకుముందే వనముల కేగెను. అతఁడు మైత్రేయమహామునినిఁ జూచినాఁడు. ఆ ముని గొప్పతపస్సంపన్నుఁడు. అనేకములైన సద్గుణములు గలవాఁడు. అతనిని మును లందఱును గీర్తించుచుండిరి.

5. క. కనుఁగొని, తత్ + పాదంబులు = అతనియడుగులు, ఫాలము = నుదురు, సకలజగత్పావనచరితుఁడు = సమస్తజగములను బవిత్ర మొనర్చు చరిత్రగలవాఁడు, ఎలమిన్ = సంతోషముతో, అఖిలవంద్యుండు = ఎల్లరిచేతను నమస్కరింపఁదగినవాఁడు.

**తాత్పర్యము :** విదురుఁడు మైత్రేయుని పాదములకు నమస్కరించెను. అతఁడు ప్రశ్నించెను. ఓ మైత్రేయా! సమస్తజగత్తులను బవిత్ర మొనర్చెడి చరిత్రగలవాఁడు కృష్ణుఁడు. అందఱిచేతను నమస్కరింపఁదగినవాఁడు అతఁడు.

6. క. మండిత తేజోనిధియై = గొప్ప తేజస్సు గలవాఁడై, పాండవ హితమతిన్ = పాండవులకు మేలుచేయు నుద్దేశముతో, ద్యూతభావంబునన్ = దౌత్యముతో, వేదండపురికిన్ ఏగి = హస్తినావతికిపోయి, కురుకులమండనుఁడు = కౌరవ వంశమునకు సొమ్ముతో సమానమైన, ధార్తరాష్ట్ర మందిరమునకున్ = దుర్యోధనుని యింటినిగూర్చి-

7. తే. చనఁగన్ ఒల్లక = పోవుట కంగీకరింపక, మత్ + గృహంబునకున్ = నా యింటిని గూర్చి, భక్తవత్సలుఁడు = భక్తులయందు ప్రేమగలవాఁడు, ఏమి కతము = ఏమి కారణము.

**తాత్పర్యము :** సమస్తతేజస్సులకును ఆశ్రయమైన కృష్ణపరమాత్మ పాండవులకు మేలుగలిగించు నుద్దేశముతో దూతయై హస్తినావతికి వచ్చినాఁడు. దుర్యోధనుఁ డాతని యాతిధ్యమునకు వైభవోపేతమైన గృహము నొకదాని నేర్పాటు చేసెను. కాని కృష్ణుఁ డాయింటిలోఁ బ్రవేశింపలేదు. అతఁడు నా యింటికి వచ్చెను. దీనికేమి కారణము? ఈ ప్రశ్న మైత్రేయునిగూర్చి విదురుఁడువేసెను. ఆ వృత్తాంతమును బరీక్షిత్తు విన్నాఁడు.

8. క. వెఱఁగంది = ఆశ్చర్యపడి, పరీక్షిత్ + మనుజవరేణ్యుండు = రాజర్షులలో శ్రేష్ఠుఁడైన పరీక్షిత్తు, విమలమతినిస్తంద్రున్ = పరిశుద్ధమైన బుద్ధితో గొప్పవాఁ

డును, మునికులజలనిధిచంద్రుఁన్ = మహర్షుల వంశములను క్షీరసాగరమునఁ బుట్టిన చంద్రుని వంటివాఁడు, సునిశిత హరిభక్తిసాంద్రున్ = గాఢమైన హరిభక్తిచేత గొప్పవాఁడును ఐన, శుకయోగీంద్రున్ = శుకమహర్షిని.

9. క. కని యిట్లనియెన్ = చూచి యిట్లు పలికెను. అనఘుండగు విదురుఁడు = పాకనిపరహితుఁడైన విదురుఁడు. మైత్రేయునిన్ = మైత్రేయ మహర్షిని, ఏ రహస్యము లడిగెను. ముని యేమి చెప్పెన్, ఏ పగిదినిన్ = ఏ రీతితో, తీర్థములాడెన్ = తీర్థములలో స్నాన మొనర్చెను.

10. తే. ఇన్ని = ఇన్ని విషయములు, తెలియంగన్ = నాకు స్పష్టమగునట్లు, ఆనతిచ్చి = తెలియఁబఱచి, అర్థిన్ = ప్రేమతో, విమలాంతరంగ = పరిశుద్ధమైన మనస్సుగలవాఁడా! ఘనదయాపాంగ = గొప్పదయచేఁ గూడిన కడగంటిచూపులుగలవాఁడా! హరిపాదకమలభృంగ = పరమాత్ముని పాదపద్మములయందలి తుమ్మెదవంటివాఁడా!, మహితగుణసంగ! = గొప్పగుణములు గలవాఁడా! పాపతమఃపతంగ = పాపమను చీఁకటికి సూర్యుఁడా!

**తాత్పర్యము** : ఈ మాట విని పరీక్షిత్తున కాశ్చర్యము గలిగినది. ఆతఁడు శుకయోగీంద్రు నిట్లు ప్రస్తుతిపూర్వకముగాఁ బ్రశ్నించెను. శుకమునీ! నీ మనస్సు పరిశుద్ధ మైనది. కరుణాపూరితములైన కటాక్షములుగలవాఁడవు నీవు. శ్రీహరి పాదములకు భృంగము నీ మనస్సు. పాపములు నీచెంత చేరఁజాలవు. అఘములనెడు చీఁకటికి నీవు సూర్యుఁడవు. మైత్రేయవిదురసంవాద మెట్లు సాఁగినది. ఆతని ప్రశ్నలకు మైత్రేయుఁ డొసఁగిన యుత్తరము లేవి? అటుతరువాత విదురుఁ డేయే తీర్థములలో సంచరించెను? ఎచ్చటఁ దిరుగుచుండెను? ఈ విషయము లన్నియు నాకు సమగ్రముగ నానతిమ్ము, మునివంశము లను క్షీరసముద్రమునకుఁ జంద్రుఁడవు నీవు. విమలమైన నీ బుద్ధిలో నన్నియును భాసించును.

11 చ. అనవుడున్ = అనఁగా, బాదరాయణి = వ్యాసపుత్రుఁడైన శుకయోగి, ధరాధిపుతోన్ = రాజుతో ననుచున్నాఁడు: పూరువంశవర్ధనా = పూరుఁడను రాజు పుట్టిన గొప్పవంశమునకు అనంతమైన కీర్తిని సంపాదించిపెట్టినవాఁడా! విను = వినుము. కష్టుఁడైన ధృతరాష్ట్రన్నపాలుఁడు = అశుద్ధమైన చరిత్రగల ధృతరాష్ట్రుఁడు, పెంపుతోన్ = వైభవముతో, సుయోధనముఖ పుత్రులన్ =

దుర్యోధనాది కుమారులను, కడుముదంబునన్ పెంపుచున్, పాండురాజు తప్పిన పిదపన్ = పాండురాజు మరణించిన తర్వాత, తత్ + ఆత్మజాలు = అతనికొడుకులైన పాండవులు పెల్కురి = బంధుసంతతిలేనివారై, తన్నని = తాను పెద్దతండ్రిగదా యనుభావముతో చేరవచ్చినన్ = ఆశ్రయింపఁగా.

**తాత్పర్యము** : శుకబ్రహ్మ పరీక్షిత్తుతో నన్నాడు. ఓ పరీక్షన్మహారాజా! నీవు సామాన్యుడవు గావు. నీ తోఁ బూరువంశము గొప్ప కీర్తిని సంపాదించికొన్నది. నీ వడిగిన ప్రశ్న కుత్తరమును జెప్పెదను వినుము. ధృతరాష్ట్రుఁడు సర్వవైభవములతో రాజ్య మేలుచుండెను. దుర్యోధనాదు లాతని పుత్రులు. ఇంతలో పాండురాజు మరణించెను. అతనికి బంధుసంతతి లేదు. పెద్దతండ్రిగదా యని ధృతరాష్ట్రుని వారు చేర వచ్చినారు.

12. వ. అసూయా నిమగ్నుఁడై = అసూయలో మునిఁగినవాఁడై, సుయోధనాదులు = దుర్యోధనుఁడు మొదలైనవారు.

**తాత్పర్యము** : పాండవులయెడ కౌరవుల కసూయ. వారు ధృతరాష్ట్రునిఁ జేరవచ్చుట సుయోధనాదులకు కంటగింపుగా నుండెను.

13,14. క. విషాన్నము పెట్టిరి, ఘనపాశములనున్ = గొప్పత్రాళ్ళచేత, అంటంగట్టిరి = కట్టివేసిరి, గంగానదిలోన నెట్టిరి = గంగలో ద్రోసిరి, ఈ మూఁడును భీమునకుఁ జేసిన యపకారములు. కుటిలాత్మకులై = దుష్టబుద్ధి గలవారై, ధర్మంబువిడిచి = ధర్మమును త్యజించి, రాజ్యము వెడలన్ కొట్టిరి = రాజ్యమునుండి వెడల నడచిరి. క్రూరాత్ము లగుచున్, లాక్షాగారంబునన్ = లక్కయింటిలో, వారు నిద్రగైకొనియుండన్ = పాండవులు, నిద్రించుచుండఁగా దారుణశిఖిన్ దరికొలిపిరి = గొప్పమంటలు పెట్టిరి. మారణకర్మములకున్ = పాండవులను వధించు కార్యములందు, అప్రమత్తులు నగుచున్ = నిరంతరమును జాగ్రత్తగలవారై.

**తాత్పర్యము** : విషముగలిపిన యన్నమును బెట్టిరి పాశములతోఁగట్టి గంగలోఁ ద్రోయించిరి. ఇవి భీమున కొనర్చిన యపకారములు. శకునిసాయముతో నధర్మద్యూతమున వారి నోడించి రాజ్యమునుండి వెడలఁగొట్టిరి. లక్కతోఁజేసిన యింటియందు వారిని వసింపఁజేసి పాండవులు నిద్రించుచున్నపు డగ్గిపెట్టిరి. విదురుని సాయముతో పాండవులు బయటఁబడినారు. వారి కపకార మొనర్చుటలో దుర్యోధనాదు లెప్పుడును జాగ్రత్తగ నే యుందురు.

15. తే. సూరిజనగేయము = గొప్పవారిచేత పొగడఁబడినది. విలసత్ = ప్రకాశించుచున్న, అవభృధ స్నాన పవిత్రము = అవభృధ మనెడు యజ్ఞాంతమందొనర్చెడు స్నానముచేత పవిత్రమైన, చారువేణీభరంబు = రమణీయములైన వెండ్రుకలను, కుచ్ఛితమునన్ = దుష్టబుద్ధితో.

**తాత్పర్యము :** ధర్మరాజు రాజసూయయాగ మొనర్చినాఁడు. ఆ యజ్ఞ మొనర్చుట చాలఁ గష్టమైన పని. పండితులు దానిని బ్రశంసింతురు. యజ్ఞాంతమందు యజమానుఁడు భార్యాసమేతముగా నొనర్చెడు స్నానమున కవభృథ మని పేరు. ద్రౌవది యా స్నాన మొనర్చినది. ఆ పుణ్యముతో నామెకేశములు మహాపవిత్రములు. అట్టి కేశభరమును వట్టికొని దుర్యోధనునిపంపుతో దుశ్శాసనుఁడు సభ కీడ్చి తెచ్చినాఁడు. మూలములో రాజసూయయాగముకథలేదు. "స్వాస్రైర్హరంత్యాః కుచకుంకుమాని" అని మాత్రమే గలదు. ఇదియంతయుఁ బోతన్నయొనర్చిన పెంపు.

16. క. కావునన్ = ఇట్టికారణములతో, వారలకున్ = పాండవులకు అపకృతి = అపకారము, తమ జన్మావధి = తమపుట్టుక మొదలు, వావిరిన్ = క్రమముగా, ఆ + అంధనృపతి = అయ్యంధనృపతి = ఆ ధృతరాష్ట్రుఁడు.

**తాత్పర్యము :** దుర్యోధనాదులకు జన్మమొదలుకొని పాండవుల కపకార మొనర్చెడు చింతయే, వా రొక్కదినముగూడ ధర్మరాజాదుల కపకార మొనర్పక యూరకుండలేదు ఇన్ని విశేషములు జరుగుచున్నను ధృతరాష్ట్రుఁడు దన కుమారుల దుశ్చేష్టల నడ్డగింపలేదు.

17, 18. తే. మాయజూదంబు పన్ని, = కపటద్యూతమునేర్పాటుచేసి, దుర్మార్గవృత్తిన్ = చెడుప్రవృత్తితో, పుడమిన్ కొని, అడవులకున్ పోనడువన్ = అడవులకు తరుమగా, అచటన్, వారలు = పాండవులు, తిరిగి = అడవులలో సంచరించి, సమయంబున్ తీర్చి = చేసికొన్నయేర్పాటులు పూర్తిగావించి, ఏఁగుదెంచి = వచ్చి, తమ అంశము అడిగినన్ = తమభాగ మడుగఁగా, పంచియిడక = పంచియివ్వక ఉన్నయెడన్ = ఉండఁగా.

**తాత్పర్యము :** కౌరవులు కపటద్యూత మేర్పాటు సేసిరి, దుర్మార్గముతో రాజ్యము నాక్రమించి వారి నడవులకుఁ దరిమినారు. వారు వనములలో సంచరించిరి, జూదమునకు ముం దేర్పాటుచేసికొన్ననేమము నక్షరక్షరమును దీర్చినారు. వారు వెనుకకు వచ్చి తమ రాజ్యము నడిగిరి. దుర్యోధనాదులు పంచి యీయలేదు.

19. చ. సకల నియంతయైన హరి = సమస్తమును నియమించువాఁడైన పరమాత్ముఁడు, సర్వశరణ్యుఁడు = అందరికి నాశ్రయింపఁ దగినవాఁడు. మాధవుండు = లక్ష్మీపతి, సేవకనవకల్పకంబు = భక్తులకుఁ గల్పవృక్షముతో సమానుఁడు, అనంతశక్తి = గొప్పశక్తులు గలవాఁడు, నందకధరుఁడు = నందకమను ఖడ్గమును ధరించినవాఁడు, అబ్జలోచనుఁడు = పద్మములవంటి కన్నులుగలవాఁడు, నియుక్తుఁడై = నియమింపఁబడినవాఁడై, అకుటిల = కపటములేని, భక్తియోగ = భక్తియోగమునకు, మహిత = ఉపకారము లొనర్చెడు, ఆత్మకుఁడై = మనస్సుగలవాఁడై.

**తాత్పర్యము** : కృష్ణపరమాత్మ సమస్తలోకములను నియమించువాఁడు. సర్వుల కాశ్రయింపఁదగినవాఁడు. సేవకులకుఁ గల్పవృక్షమువంటివాఁడు. అనంతశక్తులు గలవాఁడు. నందకమను ఖడ్గమును ధరించినవాఁడు పద్మపత్రనేత్రుఁడు. ధర్మరాజు ప్రార్థింపఁగా ధృతరాష్ట్రునికడకు దూతగా బయలుదేఱెను. ఎందుకు? ధర్మరాజు కాపట్యములేని భక్తియోగము ననుసరించినవాఁడు. కృష్ణపరమాత్మ భక్తియోగవిషయమం దుదారముగాఁ బ్రవర్తించువాఁడు అందుచేఁ దనయోగ్యతకుఁ దగని దైనను దౌత్యము నాతఁ డంగీకరించినాఁడు.

20. క. చని = ధృతరాష్ట్రునిసమీపించి, తత్తనయ = ద్రోణునికొడుకైన యశ్వత్థామయు, నిఖిలధాత్రీపతులున్ = సమస్తరాజులును, అనుమోదింపఁగన్ = సమ్మతింపఁగా, ధృతరాష్ట్రుతోడన్, ఇట్లనియెన్, అవనీనాథా! = ఓ పరీక్షిద్రాజా!

**తాత్పర్యము** : పరీక్షిద్రాజా! కృష్ణుఁడు సంధికైపోయి సభలోనికిఁ బ్రవేశించినాఁడు. అచ్చట కురువృద్ధుఁడైన భీష్ముఁ డుండెను. ధనురాచార్యుఁ డుండెను. ఆతని తనయుఁడైన యశ్వత్థామ, మాననీయుఁడైన కృపాచార్యుఁడు వారందఱును గృష్ణుని మాటలకు సమ్మతించిరి.

21. క. అవనీవర! = ఓ ధృతరాష్ట్రుఁడా! కౌరవపాండవు లిరువురున్, ఆరయన్ = చూడఁగా, నీకున్ ఒక్కసమము = నీకు సమానులే, ఏ రీతినైనన్ = ఎట్లైన, కొడుకుల నొప్పించి, పాండుకుమారులపాలు = రాజ్యభాగము, ఒసఁగితి + ఏనిన్ = ఇచ్చినచో, ఉభయంబున్ = రెండువంశములును, మనున్ = బ్రదుకును.

**తాత్పర్యము** : ధృతరాష్ట్రమహారాజా! పాండవకౌరవు లిరువురును నీకు సమానులే. భేదమును బాటింపకుము. ఏ రీతిగా నైనను నీ కొడుకుల నొప్పించి పాండవులరాజ్యభాగ మిప్పించినచో రెండువంశములును జీవించును.

22. క. అని = ఈ రీతిగా, ధర్మబోధమునన్ = ఉత్కృష్టమైన ధర్మమును దెలుపుచు. పలికిన మాటలున్, చెవులన్ ఇడమి = చెవిలో వేసికొనకపోవుటచేత, ఘననీతి మంతున్, విదురున్ , కృష్ణుఁడు పిలువన్ పనిచినన్ = పిలిపింపఁగా, కురుసభాస్థలమునకున్ = కౌరవసభకు, చనుదెంచెన్ = వచ్చెను.

**తాత్పర్యము** : ఎన్ని ధర్మములు చెప్పినను ధృతరాష్ట్రుఁడు వినలేదు. అప్పుడు గృష్ణుఁడు నీతిమంతుఁడైన విదురుని సభాస్థలమునకుఁ బిలిపించినాఁడు. మూలములో మంత్రాయ పృష్టః కిల పూర్వజేన అనికలదు.

23. వ. ఉపస్థితము = ప్రసక్తిలో నున్నది, కార్యంబు = చేయవలసిన పని.

**తాత్పర్యము** : విదురుఁడు సభ కరుదెంచిన వెంటనే జరుగుచున్న చర్య యే మని విచారించినాఁడు. అతఁ డన్నయైన ధృతరాష్ట్ర నుద్దేశించి యిట్లు పలికెను.

24. మ. కౌరవ్య వంశాగ్రణీ! కౌరవులలో శ్రేష్ఠుఁడవైన, ధరణీనాయక! = ఓ రాజా!, పాండు భూవిభుఁడు = పాండురాజు నీతమ్ముండు, తత్ + పుత్రులన్ = ఆతనికొడుకులను, పరిరక్షించినన్ = ఆపదలపాలుగాకుండ రక్షించినచో, ధర్మమున్ తగవునున్ పాటిల్లున్ = ధర్మమును లోకన్యాయమును నేర్పడును. వంశంబు సుస్థిర సౌఖ్యోన్నతిన్ చెందున్ = వంశము స్థిరమైన సుఖమును బొందును. శత్రుజయమున్ చేకూరున్, గోపాలశేఖరుచిత్తంబునున్ వచ్చున్ = కృష్ణునిమనస్సు గూడ ప్రసన్న మగును. అట్లగుటన్ = అందుచేత.

25. ఆ. వారి తండ్రిపాలు వారికిన్ ఒసఁగి, నీపాలు = నీ రాజ్యభాగము, సుతుల కెల్లన్ పంచియిచ్చి = నీ కుమారులకు పంచియిచ్చి, చలమువిడచి = శత్రుత్వమును వదలి, ధర్మము అలవడన్ నీబుద్ధి, చొనుపవయ్య, కులమున్ మనుపవయ్య = కులమును నిలుపుము.

**తాత్పర్యము** : కౌరవవంశశ్రేష్ఠుఁడవైన యో ధృతరాష్ట్రా! పాండురాజు నీతమ్ముఁడు, ధర్మరాజాదు లాతనిపుత్రులు అందుచేత వారికిఁ జెందవలసిన సగము రాజ్యమును వారికిఁ బంచియిమ్ము. అట్లైనచో ధర్మము నుద్ధరించినవాఁడ వగుదువు. లోకులుగూడ నిన్ను మెత్తురు. రెండువంశములును సుఖముగ బ్రదుకును. ఈ యుభయులును గలిసికట్టుగా నున్నచో శత్రు వెవ్వఁడును వీరిని దేరిచూడలేఁడు. పరమధర్మావతారుఁడైన కృష్ణుని మనస్సుగూడఁ బ్రసన్న మగును. ఇన్నికారణములతో వారిపాలు వారి కిమ్ము. నీపాలు నీకొడుకుల కందఱికిని బంచిపెట్టుము. పాండవులపై శత్రుత్వమును వదలుము. ధర్మము ననుసరించి యుభయవంశములను రక్షించికొమ్ము.

26. చ. నృపాల! వినుము. వేయునున్ ఏల = చాలమాట లెందులకు? సమీరసూతి = వాయునంశమునఁ బుట్టిన భీముఁడు, పదతాడిత = కాలిచేతఁ ద్రొక్కఁబడిన, దుష్టభుజంగమంబు చాడ్పునన్ = ఘోరమైన పామువలె, కనలు + ఒందున్ = కోపమును బొందును. ఇంతయును = ఈ విషయ మంతయును, మున్నునున్ చెప్పితిన్ కాదె = ఇంతకుముందుఁ గూడఁ జెప్పినానుగదా! ఎన్ని భంగులన్ = ఎట్లు చూచినను, భవదీయపుత్రులకున్ = నీ కుమారులకు, వానిచేతన = వానితోనే, మృత్యువు దప్పదు.

**తాత్పర్యము** : రాజా! వేయిమాట లెందుకు? ఆ భీముఁడు నీ కుమారులపేరు విన్నంతనే కాలిచేఁ ద్రొక్కఁబడిన పామువలె రుసరుసలాడును. ఈ విషయము నీ కింతకుముం దెన్నిసారులో చెప్పినాను. ఎన్నిరీతుల నాలోచించినను నీపుత్రులకు వానిచేతనే చావు తప్పదు.

27. వ. అదియునుంగాక-

28. క. నీపుత్రులశౌర్యంబును = నీ సుతుల పరాక్రమమును, చాపాచార్య = ద్రోణుఁడు, ఆపగాత్మజాత = గంగాపుత్రుఁడైన భీష్ముఁడు, కృప = కృపాచార్యుఁడు - వీరియొక్క, భుజాటోపంబున్ = భుజపరాక్రమమును, కర్ణుదురాలాపంబునున్ = కర్ణుని ముందువెన్క లరయని వాగ్విజృంభణమును, మనమునన్, నిజముగాన్ తలంతె?

**తాత్పర్యము** : ధృతరాష్ట్రా! నీ సుతులైన దుర్యోధనాదులు నీముందట వీరాలాపములు పలుకుచుందురు. పాండవుల నెదిరించుశౌర్యము వారి కున్నదని నమ్ముచున్నావా? ద్రోణుఁడు, కృపుఁడు, భీష్ముఁడు వీరిశౌర్యము ప్రసిద్ధమే కాని నిజమునకు వీరిపరాక్రమము పాండవులకుఁ జాలదు. వీరిని నమ్ముచున్నావా? కర్ణుఁడు ముందువెన్క లరయక తనకుఁ దోఁచినట్లు వాగుచుండును. అతనిమాటలు సత్యము లనుకొనుచున్నావా?.

29. వ. అట్లేనిన్ వినుము = అట్టైనచో వాకర్ణింపుము

30. ఉ. ఏ పరమేశుచేన్ = ఏ సర్వనియంతయైన భగవంతునిచేత, ఈ సచరాచరకోటితోన్ = ఈ చరాచరజీవులతో, జగములు, సముద్దీపిత మయ్యెన్ = ప్రకాశింపఁజేయఁ బడెనో, అబ్జగర్భ = బ్రహ్మదేవుఁడు, గౌరీపతి = శివుఁడు, ముఖ్య = మొదలైన, దేవముని బృందములు = దేవతలు, మునులసమూహములు, ఏ విభునిదివ్యకళాంశజులు = ఏ కృష్ణపరమాత్మయొక్క శ్రేష్ఠములైన యంశములతో

జన్మించినవారో, అనంతుఁడు, అచ్యుతుండు, ఆ పురుషోత్తముండు = ఆ భగవంతుఁడె, కరుణాంబుధి కృష్ణుఁడువో! = దయాశాలియైన కృష్ణుఁడే.

**తాత్పర్యము** : మనుష్యరూపముతో మన కన్నులయెదుటఁ బాఱాడుచున్న యీ కృష్ణుఁ డెవరనుకొన్నావు? ఎవనిచే నీ చరాచరరూపమైన ప్రపంచము ప్రకాశింపఁ జేయఁబడెనో ఆ పరమాత్ముఁడే యతఁడు. బ్రహ్మ శివుఁడు మహామునులు తక్కిన దేవతలగుంపు అందఱును ఆ పరమేశుని యంశలతో జన్మించినవారే. దేహమును స్వీకరించి ప్రపంచమునకు వచ్చిన పురుషోత్తముఁడే కృష్ణపరమాత్మ. ఇదినిజము.

31. ఉ. జగన్నివాసుఁడు = జగత్తుల కాధారమైనవాఁడు, మురాసురభేది = మురాసురునిఁ జంపినవాఁడు, పరాపరుండు = నిర్గుణ సగుణ స్వరూపములు గలవాఁడు నైన కృష్ణుఁడు, చేపట్టి = స్వీకరించి, సఖుండునున్, వియ్యమునున్ =బావమఱఁదియు, బాంధవుఁడును నిజమైన బంధువును, గురుఁడున్ = కర్తవ్యాకర్తవ్య ముపదేశించువాఁడునున్ = విభుండునున్ఐ = సర్వాధికారియునై, ఇట్టులమైనప్రేమతో, ఎప్పుడున్ తోడ్పడుచుండున్ = వారికి సహాయముగా నుండును. ఇట్టివారిని, ఎవ్వరికినిన్ = ఎవ్వరికైనను, జుట్టనవ్రేలన్ = చూపుడువ్రేలితో, చూపఁగన్ వచ్చునే?

**తాత్పర్యము** : సమస్తజగముల కాధారమైనవాఁడు కృష్ణుఁడు. మురాసురుని భేదించినవాఁడు. సగుణనిర్గుణస్వరూపము లాతనివే, అట్టికృష్ణుఁడు వారిని పరమప్రేమతో రక్షించుచున్నాఁడు. మిత్రుఁడై కలసి తిరుగును. బావమఱఁదియై పరియాచకము లాడును. నిజమైన బంధువై కష్టములలో నాదుకొనును. గురువై కర్తవ్యాకర్తవ్యములను బోధించును. ఈ రీతిగా వారిని వెన్కవేసికొని వచ్చును. ఇట్టి పాండవులను ఎవ్వరి కైనను వ్రేలుపెట్టి చూపుటకు సాధ్యమా?

32. ఉ. కావునన్, కాఱియవెట్టక = బాధింపక, వావిరిన్ = ధర్మముగా, కష్టసుయోధనుమాట = దుర్మార్గుఁడైన దుర్యోధనునిమాట వింటివి+ఏన్ = నీవు విన్నచో, నీ ఉపేక్షన్ = నీ యుదాసీనత చేత.

**తాత్పర్యము** : అందుచేత, పాండవులను బాధింపకుము. వారి కివ్వవలసిన రాజ్యభాగమును ధర్మముగా నిచ్చివేయుము. ఇట్లు చేయుటతో వంశమును గుమారులను బందుగులను రక్షించికొన్నవాఁడ వగుదువు. అట్లుగాక మూర్ఖుఁ డైన దుర్యోధనుని మాటలవెంట నడచిన నీయుదాసీనతచేతనే కులనాశము, బంధునాశము దప్పక యేర్పడును.

33. తే. ఇట్లు ఒకనికై = ఆ ఒక్క దుర్యోధనుని కొఱకు, కులమెల్లన్ = వంశమంతయు, ఉక్కణంపన్, ఎత్తికొనన్ చూచెడిదినీతియే = శౌర్యమున వీఁగిపోవునట్లుగాఁ జేయఁదలఁచియున్నావు. ఇదినీతియే = ఇదిధర్మమేనా? ఈ సుయోధనునిన్ విడచి = ఈ దుర్యోధనుని వదలుకొని, తేజంబు = పరాక్రమము.

**తాత్పర్యము** : ఓ ధృతరాష్ట్రా! దుర్యోధను నొక్కని రక్షించికొనుటకు నీసమస్తవంశమును నాశ మొనర్పఁదలఁచుచున్నావు. ఇదినీతిగాదు. "త్యజే దేకం కులస్యార్థే" అనెడు నీతివాక్యమును దలఁపుము. నీవంశముయొక్క శౌర్యమును రాజ్యమును కడకుఁ గులమును వదలుకొనుటకు బదులుగా వీనిని వదలిపెట్టుము.

34. క. అనియిట్లు తఱిమిచెప్పినన్ విని = ఈ రీతి నిర్బంధించి చెప్పఁగా విన్నవాఁడై, రోషవివశుండయి = రోషమునకు లోఁబడినవాఁడై, ఇనతనయ = కర్ణుఁడు, శకుని దుశ్శాసనులన్ = శకుని, దుశ్శాసనుఁడు-వీరలను నిరీక్షించి = చూచి, తామసంబునన్ = కోపముతో.

35. క. ఉదాసీనుం జేయక = ఉపేక్షింపక, ఇటకున్, పిలువగాఁన్ తగునే? ఆసీనుండై = కూర్చున్నవాఁడై, ప్రేలెడున్ = వదరుచున్నాఁడు, గాసిలిచెడిపోవన్ = ఎక్కువగా నలసి సుఖజీవితమును బోఁగొట్టుకొన్నవాఁడు కాఁగా, వెడలఁగాన్ నడువరనా! = తఱిమివేయుఁడు. 'అనా!' అనునది సంబుద్ధి.

**తాత్పర్యము** : విదురుఁ డీ మాటలను మిగుల నిర్బంధించి చెప్పెను. వానిని వినుచున్న దుర్యోధనునకుఁ గోప మెక్కువైనది. కర్ణశకునిదుశ్శాసనులు వానితోఁ జేరినారు. వాఁడు కోపముతో నిట్లనెను. "వీఁడు దాసీపుత్రుఁడు. రాచకార్యములలో వీనికిఁ జొఱవ యెందుకు? వీనిని గొప్పగా నెంచి మీరు సభకుఁ బిలిపించినారు. వీనియాస్తిని లాగికొని ప్రాణమాత్రావశిష్టునిఁగాఁ బురమునుండి వెడలఁగొట్టుఁడు.

36. వ. దుస్ + ఆలాపంబులు - దురాలాపములు = చెడ్డమాటలు మనస్ + తాపము - మనస్తాపము = మనోదుఃఖము, కార్యంబు విచారించి = తానప్పుడు చేయఁదగినపనిని నిశ్చయించికొని, అవలంబించి = పూని‌కొని, ఒండుపలుకనొల్లక = మఱియేమియుఁ జెప్ప నిష్టపడక, శరశరాసనంబులు = ధనస్సు బాణములను ద్వారమందే వదలినాఁడు. యుద్ధమందుఁ దాను పాల్గొనవలె నను‌భావమునుగూడ విడిచిపెట్టినాఁడు. అతఁడు వనములలోఁ బ్రవేశించెను.

37. సీ. విష్ణుస్వయంవ్యక్త విమల భూములనున్ = విష్ణువు సాలగ్రామాది రూపముగా స్వయంవ్యక్తమైన చోటులందు, పవిత్రంబులగు హరిక్షేత్రములను = పవిత్రములైన హరికి సంబంధించిన క్షేత్రములను, నెలకొని = స్థిరమై, దేవతానిర్మిత హరిదివ్యభూములన్ = దేవతలచేత నిర్మింపఁబడిన దివ్యములైన భూములందు, గంగాదిపుణ్యనదులనున్ సిద్ధపురాణప్రసిద్ధపుణ్యాశ్రమపదములన్ = సిద్ధులకు సంబంధించిన పురాణప్రసిద్ధములైన యాశ్రమభూములందు, ఉపవన స్థలములందున్ = ఉప వనములందును, గంధమాదన ముఖ క్ష్మాభృత్తటంబులన్ = గంధమాదనము మొదలైన పర్వతప్రదేశములందును, మంజుల = అందమైన, గిరికుంజపుంజములనున్ = పర్వతములయందున్న పొదరిండ్లయందును, వికచ = వికసించిన, కైరవ = తెల్లకలువలు, పద్మ = పద్మములు, హల్లక = ఎఱ్ఱకలువలు-వీనియందలి, మరందపానపరవశ = తేనియలు ద్రావుటచే నొడలుమఱచిన, మధుకర = తుమ్మెదల యొక్క, గాన = గానములచేత, బుద్ధ = మేల్కొల్పఁబడిన రాజహంసలచేత, విలోల, చలించుచు, విరాజమాన మగుచున్ = ప్రకాశించుచు, పంకేరుహ + ఆకరములన్ = సరస్సులందు.

**తాత్పర్యము** : విష్ణుక్షేత్రము లనేకములు. కొన్ని స్వయంవ్యక్తము లైనవి. అనఁగా భగవంతుఁడే సాలగ్రామ మయమైన దేహముతో నవతరించిన స్థలములు శ్రీరంగము, తిరుపతి, కంచి, పండరీక్షేత్రము ఇత్యాదులు. కొన్ని దేవతలు సిద్ధులు మహర్షులు మొదలైనవారిచేతఁ బ్రతిష్ఠింపఁబడిన మూర్తులు గలవి. ఇట్టి స్థలము లన్నిటిని విదురుఁడు దర్శించినాఁడు. గంగాదిపుణ్యనదులను సమీపించెను. సిద్ధులు నివసించెడి నైమిశాది పురాణ ప్రసిద్ధములైన పుణ్యక్షేత్రములను జూచినాఁడు. అచటనుండు నుపవనములలో సంచరించెను. గంధమాదనము మొదలైన పుణ్యపర్వతములయందుఁ దిరిగినాఁడు. అచ్చట నెలకొన్న రమణీయ కుంజపుంజములలోఁ గొంతకాలము ధ్యానాసక్తుఁడై గడపెను. అనేకములైన సరస్సులను దర్శించినాఁడు. ఆ సరస్సులు మోక్షప్రదములే గాదు, అందమైనవిగూడ. ఆ సరస్సులనిండ వికసించినపద్మములు, వ్యాపించియున్న తెల్లకలువలు. "సితేకుముదకైరవే" - అని యమరము. సర్వత్ర దట్టముగాఁ బెరిగిన హల్లకములు అనఁగా నెఱ్ఱకలువలు. 'హల్లకం రక్తసంధ్యకం' అని యమరము. వీనినుండి తొఱఁగెడుతేనెను ద్రావి తుమ్మెదలు ఝుంకారము సలుపుచుండెను. ఆ ఝుంకారములతో నిద్రలేచి రాజహంసలు తరంగములపై నొయ్యారముగా నూఁగుచుండినవి. అట్టి నేత్రపర్వములైన సరస్సులను విదురుఁడు గాంచెను.

38. క. నరవర = ఓ పరీక్షిద్రాజా! ఋష్యాశ్రమ = ఋషుల యాశ్రమములు, వనములు, సరిత్ = నదులు, ఉపవన = వాని సమీపమునందున్న ఉద్యానములు, నద = పడమటిదిక్కుగాఁ బాఱునదులు, పుళిందజనపద = అడవిజాతివారలుండు ప్రదేశములు, గిరిగహ్వరపర్వతగుహలు, గోష్ఠ = గోశాలలు, పురదేవాయతన = పట్టణములందుండెడి ప్రసిద్ధాలయములు, పుణ్యాభూములయందున్ = మొదలైన పుణ్యాభూములలో.

39. క. కూరలున్ కాయలున్ నీళ్ళున్, ఆహారముగాన్ కొనుచున్, నియమము, అలవడఁగన్, అసంస్కార శరీరుం డగుచున్ = ఏ సంస్కారమును లేని శరీరముగలవాఁడై, ఉదారతన్ = గొప్పగా, అవధూతవేషధరుఁడై అవధూతలు ధరించు వేషముగలవాఁడై, తిరిగెన్.

40. క. హర్షము గదురఁగన్ = సంతోషముతో, భారతవర్షమునన్ కలుగు పుణ్యవరతీర్థములు = భారతవర్షమందున్న శ్రేష్ఠములైన తీర్థములు, ఉత్కర్షన్ చూచుచున్ = ఆసక్తితో వీక్షించుచు, విగత + అమర్షుండై = క్రోధమును వదలినవాఁడై.

**తాత్పర్యము** : ఓ పరీక్షిన్మహారాజా! విదురుఁడు ఋష్యాశ్రమములను జూచెను. వనములను దర్శించెను. సరిత్తులను దరిసెను. ఉపవనములలో సంచరించెను ప్రాక్ పశ్చిమనదులను జూచినాఁడు. కిరాతజనపదములలో సంచరించినాఁడు. గిరిగహ్వరములందుఁ గాలము గడపెను. గోశాలలు చూచెను. యజ్ఞవాటికలు సేవించెను. పట్టణములందలి యాలయములను గాంచెను. అతనియాహారము కూరలు కాయలు నీళ్లు. అనేక నియమముల ననుసరించినాఁడు. అతనిశరీరము సంస్కృతము. అవధూతవేషమును ధరించినవాఁ డయ్యెను. ఈ రెండును మూలములోనివే. "అధశ్శయనోఽవధూతః" "అలక్షితస్స్వైరవధూతవేషః" అని గలవు. ఈ రెంటికిని శ్రీధరుఁడు భిన్నార్థములిచ్చి పొసఁగించినాఁడు. అవధూతః = అసంస్కృతదేహః, అవధూతవేషః = వల్కలాజినధారీ అని యాతనివ్యాఖ్య. పోతన్న యా వ్యాఖ్యనే యనుసరించినాఁడు. ఆతఁడు భారతదేశమందున్న సమస్తతీర్థములను సేవించెను. ఉత్కర్షతోఁ దిరిగెను. కౌరవులయం దాతనికిఁ గ్రోధలేశమును లేదు.

41. వ. ఇట్లు సంచరించుచు ప్రభాసతీర్థమునకు వచ్చునపుడు,

42. చ. అరుగుచున్ = పోవుచు, దైత్యభేదన = కృష్ణునియొక్క, దయా = దయచేత, పరిలబ్ధ = పొందఁబడిన, సమస్తమేదినీభరణ ధురంధరుండగుచున్ = ఏకాతపత్రసామ్రాజ్యమును భరించుచున్నవాఁడై, పాండుసుతాగ్రజుఁడు

ఒప్పుచుండన్, అత్తఱిన్ = ఆ సమయమునందు, తత్పరిత్ = ఆ నదీసమీపమందు, ఉదంచిత = ఒప్పుచున్న, సాల = వేగిచెట్లు, రసాల = మామిడి, మాధవి = పూవులగురివింద, కురవక = పెద్దగోరంట, మాలతీ = సెంటుజాజులు, వకుళ పుంజ = వకుళములపొదలచేత, లసత్తటమందున్ = ప్రకాశించుచున్నతీరమందు, ఉన్నయెడన్ = ఉన్న సమయమందు.

**తాత్పర్యము :** ప్రభాసతీర్థమందు విదురుఁడున్నప్పుడు ధర్మరాజే చక్రవర్తి. ఆతని కాసామ్రాజ్యమంతయు దుష్టరాక్షససంహారకుఁడైన కృష్ణుని యనుగ్రహముచేతనే సిద్ధించినది. ప్రభాసతీర్థముయొక్క యొకానొకతీరమందు విదురుఁ డుండెను. ఆ తటమం దనేకవృక్షములు. అవి పరస్పర మల్లుకొని సంగ్రథితములైయుండెను.

43. చ. నరవర : రాజా! వేణుజ = వెదురులనుండిపుట్టిన, అనల = అగ్నిచేత, వినష్ట = కాలిపోయిన, మహాటవిమాడ్కిన్ = గొప్పయరణ్యమువలె, పాండుభూవర ధృతరాష్ట్రసూనులు = కురుపాండవులు, అనివార్య = వారింపరానట్లుగా, నిరూఢ = చాలదినములనుండి పాదుకొన్న, విరోధమెత్తి = పగలు దరికొని, ఒండొరులన్ జయింపన్ కోరి = పరస్పరము జయమునం దిచ్ఛగలవారై, కదన + ఉర్విన్ = యుద్ధభూమియందు, కురుక్షితికులముఖ్యులందఱున్ = కౌరవు లందఱును, శోకనిమగ్నచిత్తుఁడై = దుఃఖమున మునిఁగిన మనస్సుగలవాఁడై.

**తాత్పర్యము :** అడవులలో వెదుళ్లు - పరస్పరము రాచికొనును, వానిలో నగ్నిపుట్టును. ఆ యగ్ని వనము నంతయు దహించును. కురు పాండవులకుఁ జాలదినములనుండి గూఢముగా మనస్సులలో పగలు నెలకొనియుండెను. ఎవ్వరు వారించినను అవి పోవునట్లు గన్పడలేదు. పరస్పరవిజిగీషతో వారు యుద్ధమునకుఁ దలపడిరి. ఫల మేమైనది? కౌరవశ్రేష్ఠు లందఱు ప్రధనమున మరణించిరి. ఈ విషయమును విదుర్థుఁడు విన్నాఁడు. అతనిదుఃఖమునకు మేరలేక పోయినది.

44. ఉ. ఏగి = తొందరగాపోయి, మునితుల్యుఁడు = మునులతో సమానమైనవాఁడు సరస్వతీనదీతోయములందున్ = సరస్వతీ నదీజలములలో, క్రుంకి = స్నానముచేసి, తనూనపాత్ = అగ్నిదైవత్యమైనదియు, తోయరుహాప్త = సూర్యదైవత్యము, భార్గవ.... వాహినులన్ = భార్గవాదితీర్థములలో, అనురక్తిన్ = శ్రద్ధగా, క్రుంకుచున్ = స్నాన మొనర్చుచు.

**తాత్పర్యము :** విదురుఁ డక్కడ నుండలేకపోయినాఁడు. అతఁడు తొందరగా, సరస్వతీనదిని జేరెను. దానిలో స్నాన మొనర్చెను. ఆ నదీతీరమందు పదనొకండు

తీర్థము లున్నవి. ఒకదాని కగ్ని దేవత, మఱియొకదానికి రవి. వేరుదానికిఁ జంద్రుఁడు, స్కందుఁ డొకదానికి. ఆ తీర్థము లన్నిటి నాతఁడు గౌరవించి సేవించినాఁడు.

**45.** ఉ. వెండియున్ = మరల, పవిత్రసరిత్తులన్ = పుణ్యనదులను రమామండనుఁడు = లక్ష్మీదేవికి సొమ్మువంటివాఁడు లేక-లక్ష్మీదేవిని సొమ్ముగా వక్షమున ధరించినవాఁడు, దివ్యరుచిమత్ = ఎక్కువకాంతిగల, మణి = మణులతో, చారు = అందమైన, కవాట = ద్వారములు, దేహళీ = గడపమానులు-వీనిచేత, మండిత = అలంకరింపఁబడిన, సౌధగోపురవిమానములు = సౌధములు గోపురములు విమానగృహములు మొదలైనవానిని, ఉన్నతభక్తిన్‌చూచుచున్, కృష్ణపదనీరజచింతనుఁడై = కృష్ణుని పాదములు స్మరించుచున్నవాఁడై.

**తాత్పర్యము :** విదురుఁ డింకను పుణ్యభూములను దర్శించుచున్నవాఁడై నదులను సేవించెను. విష్ణువునకు సంబంధించిన క్షేత్రములను జూచినాఁడు. ఆ దేవాలయములకు రత్నకవాటములు. రత్నదేహళులు సౌధగోపురవిమానములు. వీనినిఁ జూచునంతతడవు నాతనిమనస్సు కృష్ణపరమాత్మయందే నిమగ్నమై యుండినది.

**46.** చ. చనిచని = ఇట్లుపోయి, మత్స్య = మత్స్యదేశము, కురుజాంగలభూములు, అతిక్రమించి = గడచి, చయ్యనన్ = శీఘ్రముగా, యమునానదిన్‌దరిసి అచ్చటన్ భాగవతున్ = భగవద్భక్తులకు భక్తుఁడు, సరోజలోచనదృఢభక్తున్ = కృష్ణునియందు దృఢమైన భక్తిగలవాఁడు. దేవమంత్రిశిష్యునిన్ = బృహస్పతినుండి నీతిశాస్త్రమును నేర్చినవాఁడు. మహితప్రసిద్ధున్ = గొప్పవారలలోఁ బ్రసిద్ధుఁడు, పరిశోషితదోషున్ = దోషహీనుఁడు, ప్రబుద్ధున్ = నిత్యజ్ఞానియు; నైన ఉద్ధవున్ చూచినాఁడని పై కన్వయము.

**తాత్పర్యము :** అతఁడు మత్స్యదేశములు దాఁటి వెళ్ళెను కురుజాంగలము లతిక్రమించెను యమునానదికి వచ్చినాఁడు. అచ్చట నుద్ధవుని గలిసికొనెను. ఉద్ధవుఁడు భగవద్భక్తులకు భక్తుఁడు. కృష్ణునియందు గాఢానురాగము గలవాఁడు. సద్గుణముల కాశ్రయభూతుఁడు పూర్వజన్మమందు బృహస్పతినుండి నీతిశాస్త్రము నభ్యసించినవాఁడు. ప్రసిద్ధులలోఁ బ్రసిద్ధుఁడు. దోషహీనుఁడు. నిత్యజ్ఞాని యైనవాడు.

**47.** క. అనురాగవికాసము = ప్రేమచే నేర్పడిన కాంతి, తన మనమునన్ తొంగలింపన్ = తన మనస్సులో నతిశయింపఁగా, గాఢ + ఆలింగనమాచరించి

= దృఢముగా గౌఁగిలించి, నెయ్యంబునన్ కుశలప్రశ్నవేసి, ముదమునన్ పలికెన్.

**తాత్పర్యము** : ఉద్ధవునిఁ జూచినంతనే విదురునిమనస్సు ప్రేమమయ మైనది. అతనిని గాఢముగాఁ గౌఁగిలించెను. కుశలప్రశ్న లొనర్చి సంతోషముతో నిట్లన్నాఁడు.

48. క. హరిభక్తులు పుణ్యాత్ములు, దురితవిదూరులు = పాపమునకు దూరముగా నుండువారు, విరోధిదుర్దమబలులున్ = శత్రువులకు జయింపరాని బలము గలవారు. కురుకులతిలకులు = కౌరవులవంశములో శ్రేష్ఠులు, అవారితభక్తిన్ = కృష్ణునియందలి అతిశయభక్తిచేత, కుంతీవరసూనులు = కుంతికుమారులు, కుశలులే = క్షేమముగ నున్నారా?

**తాత్పర్యము** : పాండవులు హరియందు భక్తిగలవారు. ఆ భక్తియే వారిక్షేమమునకుఁ బ్రధానకారణము. వారు పుణ్యాత్ములు, పాపదూరులు, శత్రుభయంకరులు. పరాక్రమశాలులు. కురుకుల శ్రేష్ఠులు. అట్టి యా పాండవులు సుఖులేనా?

49. చ. తననాభి పంకరుహమందున్ = తన నాభియందుఁగల పద్మమునుండి, జనించినయట్టి భారతీశ్వరుఁడు = పుట్టినబ్రహ్మదేవుఁడు, అతిభక్తిన్ వేఁడన్ = ఎక్కువభక్తితోఁ బ్రార్థింపఁగా, యదువంశమునన్ బలకృష్ణమూర్తులై హరి పరఁగన్‌జనించెన్ = ప్రసిద్ధముగా జన్మించెను. భూభరము పాపిన శూరులు = భూభారమును దగ్గించినవారైన రేవతీందిరావరులు = రేవతిమగఁడైన బలరాముఁడు, లక్ష్మ్యంశమునఁ బుట్టిన రుక్మిణీనాథుఁడైన కృష్ణుఁడును, అటన్ = ద్వారాకానగరమందు, శూరసేనునివాసమునన్ = శూరసేనునింటియందు, సుఖమున్నవారలే! = సుఖముగ నున్నారా?

**తాత్పర్యము** : భూభార మెక్కువ యయ్యెను. శ్రీమహావిష్ణువునాభిపద్మము నుండి జన్మించిన బ్రహ్మ భూభారహరణార్థమై యవతరింపవలెనని పరమాత్మను బ్రార్థించినాఁడు. ఆ ప్రార్థనను మన్నించి పరమాత్ముఁడు బలరామకృష్ణులుగా యదువంశమం దవతరించినాఁడు. రేవతీపతి బలరాముఁడు. లక్ష్మ్యంశజయగు రుక్మిణిని జేపట్టినవాఁడు కృష్ణుఁడు. వీ రిర్వురును భూభారమును దొలఁగించుచు ద్వారకలో శూరసేనుని గృహమందు సుఖముగ నున్నారా?

50. చ. కురుకులులు ఆదరింపఁగన్ = కురువంశస్థులైన బంధువు లాదరపుఁతోఁ జూడఁగా, సఖుండునున్ ఆప్తుఁడునున్ ఐ తనర్చి = వారికిఁ జెలికాఁడును, పోరానిచుట్టమునునై, వెలఁగుచు, సోదరతరుణీ జనంబులనున్ =

అక్కచెలియండ్రను, తత్పుతులన్ = వారిమగలను, కరుణదలిర్పన్ = దయ చిగురింపఁగా, ఆత్మజాలకంటెన్ = తన కుమారులకంటెను, ప్రియ+ఉన్నతిన్ = ప్రేమాతిశయముతో, ప్రోచువాఁడై, వసుదేవుఁడు సుస్థిరమతిన్ ఉన్నవాఁడె? కులప్రదీపక! = వృష్ణివంశమును వెలిఁగించువాఁడా!

**తాత్పర్యము** : ఓ వృష్ణికులమును వెలిగించు నుద్ధవా! వసుదేవుఁడు కురుకులమున కంతటికిని మాననీయుఁడు, చెలికాఁడు, పోరానిచుట్టము. అక్కచెలియండ్రపై నాతని కెంతయో ప్రీతి, తత్పుతులన్న గొప్పగౌరవము. వారిని తన గర్భమందుఁ బుట్టిన సంతానమునకంటెను బ్రేమతోఁ జూచువాఁడు. అట్టి వసుదేవునికి సుఖమేనా?

51. శా. కందర్ప + అంశమునన్ = మన్మథుని యంశముచేత, తనూజున్ పడయన్ కామించి = కుమారుని గనవలెనని యాశించి, భూదేవతాబృందమున్ భజించి = బ్రాహ్మణుల నుపాసించి, తత్కరుణ దీపింపన్ = వారిదయ అతిశయించునట్లుగా, ప్రభావంబు పెంపొందన్ = తన గౌరవ మినుమడింపఁగా, భాస్వత్చమూసం దోహంబులు = ప్రకాశించుచున్న సైన్యములు, తన్నున్ కొల్వన్, మహిత + ఉత్సాహంబునన్ = గొప్ప ఉత్సాహముతో, మించునే?

**తాత్పర్యము** : మన్మథాంశముతోఁ గుమారునిఁ గనవలెనని రుక్మిణి గోరినది. ఆ యుత్సాహముతో నామె భూదేవులను భజించెను. వారికరుణతోఁ గుమారుని గన్నది. వాఁడే ప్రద్యుమ్నుఁడు. ఆ కుమారునితో రుక్మిణిగౌరవము రెట్టించినది. అతఁడు యాదవసైన్యములకు సేనాపతి. అట్టి ప్రద్యుమ్నుఁడు ఉత్సాహముతో నున్నాఁడా? మూలమందు "భగవత్తోఽభిలేభే ఆరాధ్య విప్రాన్" - అని కలదు. విప్రులదయను సంపాదించి కృష్ణునినుండి కుమారునిగన్నదని భావము. భూదేవతా పూజనముతోఁ గృష్ణుఁడు ప్రీతుఁ డైనాఁడనియు కుమారజన్మమందుఁ గృష్ణునిదయ ప్రధానకారణ మనియు నభిప్రాయము. పోతన భూదేవతల యనుగ్రహమును బ్రధానకారణ మన్నాఁడు. అనఁగా శ్రీమహావిష్ణువుగూడఁ దవస్వులైన భూదేవులయనుగ్రహముచేత నియమింపఁబడుచున్నాఁడని భావము.

52. క. చిరవిభవోదారుఁడు = ఎక్కువ వైభవములతో నుదారుఁడైన, ఉగ్రసేనుఁడు = కంసునితండ్రియగు నుగ్రసేనుఁడు, సరసిజలోచన = శ్రీమహావిష్ణువుయొక్క, కరుణాపరిలబ్ధ = దయచేఁ బొందఁబడిన, సమస్తధరణిపాలనమహిమన్ = సమస్తభూమిని బరిపాలించుటచేఁ గలిగిన వైభవముతో, జగతిన్, పరమప్రీతిన్, సుఖించునే = సుఖములు పొందుచున్నాఁడా?

**తాత్పర్యము** : కంసుని వధించి కృష్ణపరమాత్మ యుగ్రసేనునకుఁ బట్ట ముగట్టినాఁడు. ఆతనిరాజ్యపాలన కృష్ణుని యనుగ్రహమే. అట్టి కృష్ణుఁడు రక్షింపఁగా నుగ్రసేనుఁడు పరమప్రీతితో సుఖముల ననుభవించుచున్నాఁడా?

53. చ. లలితపతివ్రతామణి = పతివ్రతలలో గొప్పది, విలాసవతీతిలకంబు = స్త్రీలలో నందమైనది. పార్వతీలలన = పార్వతీదేవి, కుమారుఁగన్నటుల్ = స్కందునిఁ గన్నయట్లుగా, సులక్షణ = శుభలక్షణములుగల, జాంబవతీలలామ = కృష్ణుని యష్టభార్యలలో నొకతెయైన జాంబవతి, నిర్మలమతిన్, కన్నపట్టి = కన్నకుమారుఁడు, సుకుమారతనుండు = సుకుమారమైన శరీరము గలవాఁడు, గుణకదంబుఁడు = గొప్పసద్గుణములుగలవాఁడు. ఐన సాంబుఁడు, విరోధిభంజనోత్కలికన్ = శత్రుసంహార మొనర్చుటలోని యుత్సాహముతో, సుఖించునే = సుఖముగ నున్నాఁడా?

**తాత్పర్యము** : జాంబవతీదేవి కృష్ణుని యష్టభార్యలలో నొకతె. ఆమె పార్వతీదేవి స్కందకుమారుని గన్నట్లుగా సాంబుఁడను కుమారునిఁ గనెను. అతఁ డెంత సుకుమారుఁడో అంత పరాక్రమము గలవాఁడు. సద్గుణమూర్తి. అట్టివాఁడు శాత్రవసేనల భంగించు నుత్సాహముతో సుఖముగ నున్నాఁడా? మూలములో "అసూత యం జాంబవతీవ్రతాఢ్యా దేవం గుహం యోఽంబికయా ధృతోఽగ్రే" అని కలదు. పూర్వజన్మమున సాంబుఁడు స్కందుఁడే యని యభిప్రాయము. దానిని పోతన్న యుపమానముగా మార్చినాఁడు. వ్రతాఢ్యా అనునది తెనుఁగునఁ బోయినది.

54. క. హరిపదసేవకుఁడు, హరిభక్తుఁడు = అరిభీకరుఁడు = శత్రువులకు భయంకరుఁడు, అర్జునువలనన్ = అర్జునునినుండి, మిగులన్ = సరహస్యముగా, కార్ముకవిద్యల్ = ధనుర్విద్యలను, తిరముగన్ కఱచిన సాత్యకి = స్థిరముగా నభ్యసించిన సాత్యకి, ధరిత్రిన్ = భూమియందు వరసుఖవిభవములన్ = గొప్ప సౌఖ్యములతో, ఉన్నవాఁడె?

**తాత్పర్యము** : సాత్యకి హరిభక్తుఁడు. శత్రువులకు భీకరుఁడు. అర్జునునినుండి ధనుర్విద్యల నభ్యసించినవాఁడు. అతఁడు సమస్తవైభవముల ననుభవించుచు సుఖముగనున్నాఁడా? "అధోక్షజసేవయైవ గతిం తదీయాం యదుభిర్దురాపాం అని మూలము. సేవారూపమైన పూజచేత నితరయాదవులకుఁ బొందరాని శాశ్వతమైన పదవిని బొందినాఁ డని యర్థము. పోతన్న హరిభక్తుఁడు అని యొక్కమాటతో దాఁటవేసినాఁడు.

55. మ. జలజాత = పద్మము, అంకుశ = అంకుశము, చక్ర = చక్రము, చాప = ధనుస్సు, కులిశ = వజ్రాయుధము, ఛత్ర = గొడుగు, ఆది = మొదలైన, రేఖాంచిత = రేఖలతోఁ గూడికొన్న, ఉజ్జ్వల = ప్రకాశించుచున్న, గోవిందపదాబ్జ = కృష్ణపరమాత్ముని యడుగులచేత, లక్షిత = చిహ్నముగలదిగాఁ చేయఁబడిన, మార్గ = మార్గములందలి, ధూళిచ్ఛటా = ధూళిసమూహముతో, కలితాంగుఁడు = కూడిన శరీరము గలవాఁడు. విధూతకల్మషుఁడు = ఊడ్చివేయఁబడిన పాపములు గలవాఁడు, నిష్కామ + ఏకధన్యుండు, కోరికలేక పను లొనర్చుటచే పుణ్యపాపపరిలిప్తుఁడు = గాకుండుటతో ధన్యుఁడైనవాఁడు. సత్కులజాతుండు + అనన్ + ఒప్పునట్టి ఘనుఁడు = ఉత్తమకులజాతుఁడని ప్రశంసింపఁ బడినవాఁడు, అక్రూరుండు, భద్రాత్ముఁడే = సుఖియేనా?

**తాత్పర్యము** : మహాపురుషుల పాదతలములందు శంఖ చక్రాది చిహ్నము లుండును. అట్టి సమస్తచిహ్నములతోఁ గూడినవి కృష్ణుని పాదాబ్జములు. ఆతఁడు మార్గమున నడచునప్పుడు ఆతని పాదచిహ్నము లా రాజమార్గములందుఁ జిత్రింపఁ బడెడివి. అక్రూరుఁడు భూమిపైఁ బొరలాడును. కృష్ణునిపాదపద్మములపై నాతని కంతటి భక్తి. ఆతని సమస్తకార్యములు నిష్కామములే. అందుచే నాతఁడు ధన్యుఁడు. పాపలేశ మంటనివాఁడు ఉత్తమకులసంజాతుఁడు. అట్టి యా యక్రూరుఁడు సుఖియేనా?

"యః కృష్ణపాదాంకితమార్గ పాంసుషు అవేష్టతప్రేమవిభిన్నధైర్యః" అని మూలము. పోతన్న కృష్ణుని పాదములను గొప్పగాఁ జిత్రించినాఁడు. "ప్రేమవిభిన్నధైర్యః" అను స్వారస్యము పోయినది. అక్రూరుఁడు శ్వఫల్కుపుత్రుఁడు.

56. క. శ్రుతులున్ = వేదములును, క్రతుజాతములున్ = యజ్ఞసమూహములును, మతిన్ తాల్చినయట్టి, వేదమాతగతిన్ = బుద్ధియందుఁదాల్చిన వేదమాతవలె, శ్రీపతిన్ తనగర్భంబునన్ రక్షితున్ చేసిన గరిత = విష్ణువును దన గర్భమందు ధరించిన స్త్రీయైన దేవకీసతి సుఖమే?

**తాత్పర్యము** : వేదమాత శ్రుతులను క్రతుజాతములను దన గర్భమున ధరించుచున్నది. అట్లు దేవకి తన గర్భమున శ్రీపతిని ధరించినది. అట్టి యామెకు సుఖమేనా? మూలములో "విష్ణుప్రజాయాఇవ వేదమాతుః"అని యున్నది. విష్ణువును గర్భమందు ధరించిన దేవమాతయైన యదితి వలె నని భావము, తెనుఁగులో దేవమాత వేదమాత యైనది, "త్రయీయథా యజ్ఞవితానమర్థం అని మూలము.

యజ్ఞవితానరూపం అర్థం". త్రయీయథా "ప్రకాశకతయా బిభర్తి తథా దధార" అని వ్యాఖ్య. వేదము యజ్ఞవితానరూపమైన యర్థమును ధరించినట్లుగా నని భావము. పోతన్న మూలమునుండి భేదించినాఁడు.

57. వ. మహాత్మా! మహిత + ఉపాసకుఁడు = గొప్ప యుపాసకుడు, అగ్గింపన్ కలమేటి = పొగడఁ దగినవాఁడు, మనోమయుఁడు = మనస్ + మయుఁడు, సకలజీవ = సకలజీవులయొక్క, చతుర్విధ = నాల్గురీతులైన, అంతఃకరణములు, అంతరింద్రియములు = అధిదైవతంబులు = అధిష్ఠానదేవతలు.

తాత్పర్యము : ఓ యుద్ధవా! అనిరుద్ధుఁడు తన్నుఁగొల్చువారి కోర్కులఁ దీర్చు భగవంతుఁడు. శబ్దశాస్త్రమునకుఁ దన్నుకారణముగా దేవత లందఱును దన్నుఁ బొగడునట్టి మేటి.

అంతఃకరణములు నాలుగు; చిత్త అహంకార బుద్ధి మనస్సులు. వీనికి వరుసగా వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధు లధిదైవతములు. ఆ చతుర్విధ తత్త్వములలోఁ దురీయమైన తత్త్వ మనిరుద్ధుఁడు. అతఁడు సుఖియేనా? యం ఆమనంతి స్మ హి శబ్దయోనిం "అని మూలము. శ్రీధరుఁడు శబ్దస్య శాస్త్రస్య యోనిం కారణ మామనంతి" అన్నాఁడు. శాస్త్రజ్ఞానమునకుఁ గారణభూతుఁ డని యాతని యభిప్రాయము. పోతన్న శబ్దశాస్త్రమున కన్వయించినాఁడు. వ్యూహావతారము లిచటఁ జెప్పఁబడినవి. వీనివిషయ మింతకుముందే కొంత చర్చించియున్నాము.

58. మ. ఇతరారాధనమాని = ఇతరులను సేవించుట వదలిపెట్టి. కమలా + అధీశున్ = లక్ష్మీదేవికి భర్తయును, పయోజ + ఆసన = పద్మమే, ఆసనముగాఁ గలిగిన బ్రహ్మదేవునిచేత, అర్చితున్ = పూజింపఁబడినట్టి, కృష్ణున్ = కృష్ణుని, నిజనాథుగాన్ = తనకు నాథునిగా, సతతమున్ సేవించు, పుణ్యుల్, జగత్ + నుతులు= ప్రపంచముచేఁ బొగడఁబడినవారు, అధ్యాత్మ విదుల్ = ఆత్మస్వరూపమును జక్కగా నెఱిఁగినవారు, మహాభుజాలు = యుద్ధక్షమములైన భుజములు గలవారు. మాన్యుల్ = గౌరవమున కర్హులు, ధర్మమార్గుల్ = ధర్మము ననుసరించువారు అయిన, సత్యాత్మజచారుదేష్ణగదులు = సత్యాదేవికొడుకు చారుదేష్ణుఁడు గదుఁడు మొదలైనవారు, సమున్నతిన్ ఆనందాత్ములే = గౌరవములతో ఆనందాత్ములై బ్రదుకుచునారా?

**తాత్పర్యము :** ఇతరదేవతలను గొలుచుట మాని బ్రహ్మాదిస్తుతుఁడైన కమలానాథునే తమకు దైవముగా నితరమును సేవించనట్టివారును, జగన్నుతులును, ఆత్మతత్త్వ మెఱిఁగినవారును, ధర్మమును వీడని వారును నైన వారుధేష్ణగదాదులు సుఖమున్నవారేనా?

59. తే. క్రోధమాత్సర్యధనుఁడు = కోపము అసూయ యీరెండే నిజమైన ధనములుగాఁ గలవాఁడైన, సుయోధనుండు = దుర్యోధనుఁడు, పొలుచు, నెవ్వనిసభన్‌చూచి = సర్వాతిశయముగా వెలుఁగుచు మయకృతమైన యెవ్వని సభను రాజసూయసందర్భమున విలోకించి, కలుషము ఒదవి = మనఃకశ్మలము జనించి, మనము లోనన్, అసూయానిమగ్నుఁడు = అసూయతోఁ గూడినవాడు, అయ్యెన్, అనఘచరిత, అట్టిధర్మజుఁడు ఉన్నాఁడే?

**తాత్పర్యము :** మయుఁడు ధర్మరాజున కొక సభనుజేసి యిచ్చినాఁడు. అది లోకోత్తరమైన సౌందర్యముగలది. ధర్మరా జొనర్చిన రాజసూయమందు దుర్యోధనుఁ డు దానినిఁ జూచినాఁడు. వెంటనే వానిమనస్సంతయుఁ గశ్మలమై పోయినది. క్రోధమాత్సర్యములే వానిస్వరూపము. అట్టి సర్వోత్తమమైన వైభవముగల ధర్మరాజునకు సుఖమేనా?

60. తే. ఘన = గొప్పదైన, గదాభ్యాస = తన గదాభ్యాసములందు, చిత్రసంగతులన్ = తానునేర్చికొన్న చిత్రములైన పద్ధతులతో, మెఱసి = వెల్గుచున్నవాఁడై, కురుకుమారులన్ = కౌరవుల నందఱిని, భూరిసంగరములోనన్ = ఏర్పడిన గొప్పయుద్ధమందు, హతులన్ కావించి, వెలసినయట్టి, జెట్టి = వరుసగాఁ జంపి ప్రకాశించు వీరుఁడు, వాయుతనయుఁడు = భీముఁడు, కుశలియై వరలునయ్య.

**తాత్పర్యము :** భీముఁడు గొప్పగా గదాయుద్ధము నొనర్చినవాఁడు. ఆ యుద్ధమున నాతని కెన్నియో మెలకువలు దెలియును. కురుపాండవయుద్ధమం దా మెలఁ కువల నన్నిటిని యతఁడు పచరించెను. గదాసహాయముతోఁ గౌరవుల నందఱి నాతఁడు వధించినాఁడు. అట్టి జగజెట్టి భీముఁడు. అతనికి సుఖమేనా?

61. చ. హరికరుణాతరంగిత = హరిదయచేఁ గూడుకొన్న, కటాక్షనిరీక్షణ, చూపులచేఁ జూచుటచేత, లబ్ధ = పొందఁబడిన, శౌర్యవిస్ఫురణన్ = గొప్ప పరాక్రమముచేత, తనర్చి, తన్నున్ = తనను, అనిన్ = యుద్ధమందు, బోయగతిన్ = బోయవానివలె, గిరిశుండు ఎదిర్చినన్ = ఈశ్వరుఁ డెదిరింపఁగా, బరవసమొప్పఁ గాన్ నిలిచి = సాహసమున నెదిరించి, పాశుపతాస్త్రముగొన్న శత్రుభీకరుఁడు

ధనంజయుండు, సుభగస్థితిన్ = గొప్పమంగళములతో, మోదమున్ = సంతోషమును, ఒందుచుండునే = పొందుచుండునా?

**తాత్పర్యము :** అర్జునుఁడు పాశుపతాస్త్రమును సంపాదించుటకు వెళ్లెను. కైలాసమం దాతని తపస్సు. పరమశివుఁడాతని పరాక్రమమును బరీక్షింప నెంచి మాయాకిరాతుఁ డై బోయువాని వలె నిష్కరుణముగ నెదిర్చినాఁడు. శివుని మెప్పించి పాశుపతాస్త్రమును గొనెను. అతఁడు సంపాదించికొన్న శౌర్య మంతయును శ్రీహరికరుణా కటాక్షములతో నేర్పడినదే. శత్రుభీకరుఁడైన యట్టి యర్జునుఁడు సుఖముగ నున్నాఁడా?

62. మ. జననీ వియోగమునన్ = తమ్ముఁగన్నట్టి మాద్రి మరణింపఁగా, తెఱఁగు + ఒప్పన్ = ధర్మానుకూలముగా, కుంతీస్తన్యపానంబున్ = కుంతీదేవి చనుబాలు ద్రావుటయును, సోదరసంరక్షయున్ = పాండవులనుండి రక్షింపఁ బడుటయు, కల్గి, దేవవిభువక్త్రస్థఅమృతంబున్ = దేవేంద్రుని రక్షణములోనున్న యమృతమును, ఖగేశ్వరుఁడు = గరుడుఁడు, అర్థిన్ కైకొన్నమాడ్కిన్, కురువంశశ్రేణిన్ నిర్జించి = కౌరవులను జయించి, తత్ + ధరణీరాజ్యము = వారివశమున నున్న తమ యర్ధరాజ్యమును, కొన్నమాద్రికొడుకుల్ ధన్యాత్ములే ఉద్ధవా!

**తాత్పర్యము :** చిన్ననాఁడే తమ్ముగన్న మాద్రి మరణించినది. అప్పుడు నకులసహదేవులను గుంతీదేవి తన స్తన్యపానముతోనే పెంచెను. ముప్పురన్నలును వారిని జాగ్రత్తగా రక్షించికొనుచుండిరి. అట్టి యా నకులసహదేవులు ఇంద్రునివశ మందున్న యమృతమును సాధించికొన్న గరుడునివలె దుర్యోధనువశమైన తమ రాజ్యమును సాధించికొని సుఖముగ నున్నవారేగదా! "రేమాతఉద్వాట్య మృధే స్వరిక్థం సుధాం సుపర్ణా విప వజ్రివక్త్రాత్" అని మూలము. నకులసహదేవు లిర్వురు గనుక వ్యాసభగవానుఁడు ఇద్దరుగరుడులతోఁ బోల్చినాఁడు. ఇర్వురు గరుడులు లేరుగనుక నిది యభూతోపమ. పోతనామాత్యుఁడు అమృతహరణకథను మనసునఁబెట్టికొని యొక్కగరుడునే చెప్పినాఁడు. ఉపమానము బాగుగనే యున్నది. కాని ఉపమానోపమేయములకు భిన్నవచనత్వము దప్పలేదు. మూలమందుఁ గూడ-'వజ్రివక్త్రాత్' - అని కలదు. దాని ననుసరించి 'వక్త్రస్థామృతంబున్ = అని పోతన్న పరివర్తించినాఁడు. ఇక్కడ వక్త్రశబ్దమునకు అధీనములోనున్న అనిచెప్పుటయే సముచితమని నా యూహ".

63. తే. పాండుభూమీశ్వరుండు, సంప్రాప్తమరణుఁడైనన్ = మరణించినవాఁడు కాఁగా, శిశువులన్ ప్రోచుటకై, నిజేశున్ = తన భర్తయైన పాండురాజుతోఁ గూడ సహగమనము సేయక నిలిచియున్న కుంతీదేవి నేఁడు జీవించునే? బ్రదికియున్నదా? మనుచరిత్ర! = మనువువలె ధర్మము ననుసరించువాఁడా!

**తాత్పర్యము** : పాండురాజు మరణించెను. కుంతీదేవి యాతనితో సహగమన మొనర్పలేదు. శిశువులను రక్షించుటకై యాతనివిరహము నోర్చికొన్నది. అట్టి కుంతిభోజుని కొమార్తెయైన కుంతీదేవి సుఖముగ నున్నదా?

64. వ. అని, వెండియు = అని మఱియు

65. మ. అనుసంభూతుఁడు = తనవెనుకఁ బుట్టినవాఁడు, పాండుభూవిభుఁడు నిర్వాణంబునన్ బొందినన్ = మరణింపఁగా, ఆతనిపుత్రుల్ = పాండురాజకుమారులు, తనుఁ జేరవచ్చినన్ = త న్నాశ్రయింపఁగా, మాధ్యస్థంబున్, పోదట్టి = ఇరువురియందును సమభావము గల్గియుండుటను మఱచి, ధృతరాష్ట్రభూవిభుఁడు ఎగ్గొనరించెన్ = పాండవుల కపకార మొనర్చినాఁడు. అట్లు + ఊహింపఁగాన్ = నిజమును విచారింపఁగా, ఎగ్గుసేసినవాఁడేయగుఁగాక = చెడ్డచేసినవాఁడే యైనాడు గాని, చింతింపఁగాన్ మేలుగలదే? = తన ప్రవర్తనతో మేలేర్పడినదా?

**తాత్పర్యము** : పాండురాజు ధృతరాష్ట్రునకుఁ దమ్ముఁడు. అతఁడు మరణింపఁ గా పాండవులు దమకుఁ బెద్దతండ్రి యని ధృతరాష్ట్రుని సమీపించిరి. అప్పుడు ధృతరాష్ట్రుఁడు తనవారియందును, పాండవులయందును సమానభావము గలవాఁ డై రాజ్యమును బంచి యీవలసి యుండెను. కాని యతఁ డట్లు సేయలేదు. పాండవుల కపకారమే చేసినాఁడు. దానితోఁ దానేమి మూటగట్టికొనెను? తనకు మేలేమి యేర్పడినది? చేసినయపకారమే మిగిలినది.

66. క. అనఘాత్మ = పాపదూరుఁడా! అనుజుఁడని యనక = తమ్ముఁడని భావింపక, నిజతనయులు = తన కుమారులు, ననున్ వెడల నడువన్ = నన్ను వెడలఁగొట్టఁగా తానూరకయుండిన ధృతరాష్ట్రుఁడు = మౌనముగా నుండిన యతఁడు, నాదైనదుఃఖమునన్ = నాదుఃఖముతో, నరకంబునన్ పడున్.

**తాత్పర్యము** : దుర్యోధనుఁడు హీనముగా మాటలాడి యూరు వెడలనడచెను. నేను తన తమ్ముఁడనుగదా! ఆ విషయమునుగూడ మఱచి ధృతరాష్ట్రుఁడు మౌనముగ నుండినాఁడు. అప్పుడు నే నెంతయో దుఃఖపడితిని. ఈనాదుఃఖముతో

నాతనికి నరకవాసము దప్పదు. "సోమ్యానుశోచేతమధఃపతంతం" - అని మూలము. నరకమునఁ బడెడు ధృతరాష్ట్రునికొఱకై నేను దుఃఖించుచున్నానని మూలభావము. పోతన్న మూలమునుండి భేదించినాఁడు. ఆ భేదించుటయు విదురునిపాత్రకు శోభ నిచ్చునదిగా లేదు.

67. వ. పరమశాంతుండవు = ఎక్కువ శాంతిగలవాఁడవు. కర్తవ్యంబు = ఆచరింపవలసినది.

**తాత్పర్యము** : నీవు పరమశాంతుఁడవుగదా! నీకీదుఃఖము తగదందువా? దానికి సమాధానము.

68. క. నరలోకవిడంబనమునన్ = మానవలోకము ననుసరించు నటనము తో, పరమపరుండు = సర్వోత్తముఁడైన హరి, మానవాకృతితోన్ = మానవశరీరముతో, ఇద్ధరన్‌పుట్టి = ఈ ప్రపంచమందు జన్మించి, భూజనకోటిన్ = మానవులను, ఆత్మమాయాస్ఫురణన్ = తన మాయావిశేషముతో, మోహింపన్ చేయున్ = మభ్యపెట్టును. శ్రీమన్నారాయణుఁడు సర్వోత్తముఁడు. ఆతఁడు దేహమును ధరించి మానవాకృతితోఁ బ్రపంచమునకు వచ్చినాఁడు. వచ్చి మానవలోకమునే విడంబించుచుఁ దన మాయచేత సమస్తజనులను మోహింపఁజేయుచున్నాఁడు.

69. ఉ. కావునన్ వికారవిదూరునిన్ = సమస్తవికారములనుండి దూరముగానున్న, అ మ్మహాత్ముని = ఆ కృష్ణపరమాత్మయొక్క, సర్వమోహా = సర్వులను మోహింపఁ జేసెడు, మాయా = మాయచేత, ఆవిల = కశ్మలితమైన, మానసుండనగు నప్పుడు = మనస్సు గలవాఁడనైనప్పుడు, సంస్మృతిన్ = గడచిన విషయము జ్ఞాపకమునకువచ్చుటచేత, దుఃఖిన్ ఔదున్ = దుఃఖముగలవాఁడ నౌదును. అ ద్దేవుని సత్కృపామహిమన్ = ఆ భగవంతుని దయామహిమయందు, తేలిన వేళన్ సుఖింతున్, నేనకాదు = నేనేకాదు. ఆ విధిశంకరప్రభృతులు = బ్రహ్మదేవుఁడు శివుఁడు మొదలైనవారును, అవ్విభుమాయన్ తరింపన్ నేర్తురే?

**తాత్పర్యము** : కృష్ణుఁడు సర్వవికారవిదూరుఁడు. అట్టి యా పరమాత్మునిమాయచే మోహితమైన మనస్సుగలవాఁడ నైనప్పుడు గడచిన విషయములు జ్ఞాపకమునకుఁ దెచ్చికొని దుఃఖింతును. ఆతనికరుణతో మాయ తొలఁగినప్పుడు సుఖింతును. నేనేమి! బ్రహ్మరుద్రాదులును నిట్టివారే. ఎవ్వరు గూడ నాతనిమాయ దరింపలేరు. పోతన్న యీ రచనాభాగము మూలమునుండి సర్వథా భేదించినది. మూలశ్లోక మీ క్రిందిది.

"సోఽహం హరే ర్మర్త్య విడంబనేన, దృశోన్నృణాం చాలయతో విధాతుః,
నాఽన్యోపలక్ష్యః పదవీం ప్రసాదా చ్చరామి పశ్యన్ గతవిస్మయోఽత్ర".

హరిప్రసాదముచేత నాతని మాహాత్మ్యమును జూచుచు నితరులచే గుర్తింపఁ బడనివాఁడనై తిరుగుచున్నాను. ఆతఁడు సమస్తైశ్వర్యములను గూఢముగా నుంచికొని మనుష్యుల ననుకరింపుచు మానవులను మోహింపఁజేయుచున్నాఁడు.

70. వ. అమ్మహాత్ముని = ఆ కృష్ణపరమాత్మునియొక్క, కరుణాతరంగితాపాంగ = కరుణచేఁ గూడికొన్న కటాక్షములతో, లబ్ధ = పొందఁబడిన, విజ్ఞానదీపాంకుర = విజ్ఞానమను దీపముచేత, నిరస్త = పోగొట్టఁబడిన, సమస్తదోషాంధకారుండన్ = సమస్తములైన దోషములనెడు చీఁకటులు గలవాఁడను. మదీయచిత్తంబు = నామనస్సు, హరిపద, ఆయత్తంబై = పరమాత్మునిపాదములకు లోఁబడినదై, తత్ + మార్గంబున్, = ఆ కృష్ణుని మార్గమును, సతతంబు నిరీక్షింపుచుండుదున్ = ఎల్లప్పుడును జూచుచుందును.

**తాత్పర్యము** : ఆ కృష్ణపరమాత్మునిదయచేఁ గూడికొన్న కడగంటిచూపులచే నాకు విజ్ఞానమనెడి దీపము సిద్ధించినది. దాని తేజస్సుతో దోషములనెడు చీఁకట్లు నశించినవి. అందుచే నాహృదయము నిరంతరము భగవంతుని పాదపద్మములందే లగ్నమై యుండును. సంతతమును ఆతనిమార్గమునే యెదురుచూచుచుందును.

71. సీ. అట్టి సరోజాక్షుఁడు = అట్టి కృష్ణుఁడు, ఆత్మీయపదభక్తులు = తన పాదభక్తులైన పాండవులు, అడవులన్, ఇడుమలఁబడుచునుండన్ = కష్టపడుచుండఁగా, దౌత్యంబుసేయన్ = దౌత్యకార్యమును చేపట్టఁగా, కొందఱు విరోధులు = దుర్యోధనాదులైన కొందఱు శత్రువులు, పట్టిబద్ధునిఁజేయన్, సన్నద్ధులు అయినన్ = తయారుకాఁగా, బలహీనుమాడ్కిన్ = బలహీనునివలె. మార్పడఁగన్ లేఁడు = బదులు చేయలేఁడు. అసమర్థుఁడు అని తలంచెదవు ఏనిన్ = చేతకానివాఁడని యనుకొందువేమో! అచ్యుతుండు = పరులన్ జయింపన్ ఓపక కాదు, విద్యా, అభిజన = వంశము, ధనమత్తులై = ధనము వీనిచేత మదించినవారై, జగతిన్ = లోకమును, పెక్కుబాధలన్, కలంచు దుష్టభూపతులన్ ఎల్లన్ సైన్యయుక్తులుగాన్ అనిన్ సంహరించుకొఱకు, సభలోనన్ అప్పుడు, ఆకురుకుమారులాడు దుర్భాషణములకు అలుగఁడు అయ్యెన్.

**తాత్పర్యము :** భగవంతుఁడైన కృష్ణుఁడు తనకు భక్తులైన పాండవులు అడవులలోఁ గష్టములను బడుచుండఁగా. వారికష్టములను దొలఁగించుటకై దౌత్యభారమును వహించి కౌరవులకడకు వెళ్లెను. అప్పు డా సభలో దుర్యోధనాదులైన కౌరవులు కృష్ణుని బంధించుటకై సిద్ధమైనారు. వారికిఁ బ్రతీకార మొనర్చుటకుఁ గృష్ణుఁడు చేతగానివాఁడు గాఁడు. సమర్థుఁ డైనను వారిదుర్భాషణములు సహించినాఁడు. విద్య, వంశము, ధనము - వీనిచే మత్తులైన రాజులు లోకములకు బాధ గల్గించుచుండిరి. సైన్యయుక్తముగా వారి నందఱను ఒక్కయూకుతోనే నాశన మొనర్పవలెనని కృష్ణుఁ డెంచినాఁడు. అందుచేత నా కౌరవులాడు దుర్భాషణము లన్నియు నాతఁడు సహించెను.

72. మ. జననంబందుటలేని యీశ్వరుఁడు తా జన్మించుట + ఎల్లన్ = తాను జనించుట, విరోధినిరాసార్థము = విరోధులను సంహరించుటకొఱకు. వీతకర్ముఁ డు = కర్మబంధములు లేనివాఁడు అగు, ఆ + దేవుండు అయిన యా భగవంతుఁ డు, కర్మప్రవర్తనుఁడౌటన్ = కర్మముల నాచరించు వాఁడగుట, చరాచరప్రకట భూతశ్రేణులన్ = చరాచరములుగా జన్మించిన సమస్తప్రాణులను, కర్మవర్తనులన్ చేయన్ తలంచికాక = కర్మమార్గము ననుసరించినవారినిగాఁ జేయుట కొఱకే. అట్లుగాదేని దైత్యారికిన్ కర్మముల్ కలవే?

**తాత్పర్యము :** భగవంతునకు జన్మకర్మములు లేవు. మఱి యాతఁడు జన్మము లెత్తినాఁడు. ఎందుకు? చరాచరములుగాఁ బ్రకటమైన యీ సమస్త భూతములను గర్మమార్గమునఁ బ్రవర్తింపఁజేయుటకే. ఇవి కారణములు గాకున్నచో జన్మకర్మములు ధరించుటకు హేతువే లేదు.

73. క. హరి నరులకెల్లన్ పూజ్యుఁడు = భగవంతుఁడు మనుష్యులందఱకుఁ బూజ్యుఁడు = పూజింపఁదగినవాడు. గుణాతీతుఁడు = గుణముల నతిక్రమించినవాఁడు ఐ = ఇట్టివాడై, పరఁగిన భవకర్మంబులన్ = ఒప్పుచున్న జన్మములను, కర్మములను, పొరయుండట = పొందఁడట, హరికిన్ కర్మములు = భగవంతునకుఁ గర్మలన్నియు, లీలలగున్ = లీలలు.

**తాత్పర్యము** : కృష్ణపరమాత్మ మనుష్యులకుఁ బూజ్యుఁడు. లీలగా మానవుల ననుకరించి వర్తించువాఁడు. గుణాతీతుఁడు. అట్టి పరమాత్మకు గుణములును కర్మలును లీలలు మాత్రమే.

**74.** క. మదిన్‌తనశాసనమున్ ఇడి = మనస్సులలోఁ దన యాజ్ఞలను ధరించి, నిజపదములన్ సేవించు లోకపాలాదులనున్ = తనపాదములను ధ్యానించు లోకపాలురను, పెంపు + ఒదవింపన్ = వృద్ధిబొందిన వారినిగాఁ జేసి పాలించుటకొఱకు, భువినిన్ = భూమిపైన, భగవంతుఁడు బలసహోదరుఁ డగుచున్ = బలరామునితోఁ గూడినవాఁడై, యదుకులమునన్ ఉదయించెన్ = యాదవులలోఁ బుట్టినాఁడు.

**తాత్పర్యము** : లోకపాలురు మొదలైనదేవతలు దన యాజ్ఞలను మనస్సులో నుంచికొని వాని ననుసరించువారు దనపదములను గొల్చుభక్తులు. అట్టివారికి సమస్తములైన యభివృద్ధుల నొదవించుటకొఱకై భగవంతుఁడు బలరామునితోఁ గూడి. యాదవకులమున నవతరించినాఁడు.

**75.** తే. భూరిసంసరణతరణమైన సత్కీర్తి దిక్కుల నతిశయిల్లి వఱలన్ = దిక్కులం దెక్కువగా వ్యాపించి వర్తింపఁగా, చలనమందక = ఏమాత్రమును జలనములేక, సమమతియై = సుఖదుఃఖములందు సమానమైన బుద్ధిగలవాఁడై, కృష్ణుఁడు ఉన్నాఁడే = కృష్ణపరమాత్మ యున్నవాఁడేనా? అనుచున్ = ఈ రీతిగా, ఉద్ధవునిన్, విదురుఁడు అడుగుటయును.

**తాత్పర్యము** : ఓ యి యుద్ధవా! తన్నుఁ దలంచువారికి, సంసారమునుండి సులభముగ దాఁటికొనెడు మార్గమును జూపించున దాతని స్వచ్ఛమైనకీర్తి. తన యశము దిక్కుల నతిశయిల్లఁగా నా కృష్ణుఁడు కుశలియేనా? సుఖములలో దుఃఖములలో సమానముగా వర్తించెడి యాతని మనస్సునకుఁ జాంచల్య మెప్పుడును గలుగలేదుగదా!" అని యుద్ధవుని విదురుఁడు ప్రశ్నించెను.

**ఇది పుట్టపర్తినారాయణదాస విరచితమైన**
**భాగవతసుధాలహరియందు. తృతీయ**
**స్కంధమున ప్రథమాధ్యాయము.**

# భాగవత సుధాలహరి
## తృతీయస్కంధము
## ద్వితీయాధ్యాయము

**శ్రీశుక ఉవాచ -**

ఇతి భాగవతః పృష్టః క్షత్త్రా వార్తాం ప్రియాశ్రయామ్,
ప్రతివక్తుం న చోత్సేహ ఔత్కణ్ఠ్యా త్స్మారితేశ్వరః. 1

యః పంచహాయనో మాత్రా ప్రాతరాశాయ యాచితః,
తన్నైచ్ఛ ద్రచయ న్యస్య సపర్యాం బాలలీలయా. 2

స కథం సేవయా తస్య కాలేన జరసం గతః,
పృష్టో వార్తాం ప్రతిబ్రూయా ద్భర్తుః పాదా వనుస్మరన్. 3

స ముహూ ర్త మభూ త్తూష్ణీం కృష్ణాంఘ్రిసుధయా భృశమ్,
తీవ్రేణ భ క్తియోగేన నిమగ్న స్సాధు నిర్వృతః. 4

పులకోద్భిన్నసర్వాంగో ముంచ న్మీలద్దృశా శుచః,
పూర్ణార్థో లక్షిత స్తేన స్నేన ప్రసరసంప్లుతః. 5

శనకై ర్భగవల్లోకా న్నృలోకం పున రాగతః,
విమృజ్య నేత్రే విదురం ప్రత్యాహోద్ధవ ఉత్స్మయన్. 6

**ఉద్ధవ ఉవాచ -**

కృష్ణద్యుమణి నిమ్రోచే గీర్ణే ష్వజగరేణ హ,
కిం ను నః కుశలం బ్రూయాం గతశ్రీషు గృహే ష్వహమ్. 7

దుర్భగో బత లోకోఽయం యదవో నితరా మపి,
యే సంవసంతో న విదు ర్హరిం మీనా ఇవోడుపమ్. 8

ఇంగితజ్ఞాః పురుప్రౌఢా ఏకారామా శ్చ సాత్వతాః,
సాత్వతా మృషభం సర్వే భూతావాస మమంసత. 9

దేవస్య మాయయా స్పృష్టా యే చాన్యే హ్యసదాశ్రితాః,
భ్రామ్యతే ధీ ర్న తద్వాక్యై రాత్మ న్యుప్తాత్మనో హరౌ. 10

ప్రదర్శ్య త ప్తతపసా మవితృప్తదృశాం నృణామ్,
ఆదాయాఽంతరధాఽఽద్య స్తు స్వబింబం లోకలోచనమ్. 11

యన్మర్త్యలీలౌపయికం స్వయోగ
మాయాబలం దర్శయతా గృహీతమ్,
విస్మాపనం స్వస్య చ సౌభగర్ధేః
పరం పదం భూషణభూషణాంగమ్. 12

య ద్ధర్మసూనో ర్బత రాజసూయే
నిరీక్ష్య దృక్స్వస్త్యయనం త్రిలోకః,
కార్త్స్న్యేన చాద్యేహగతం విధాతు
రర్వా క్సృతౌ కౌశల మిత్యమన్యత. 13

యస్యానురాగప్లుతహాసరాస
లీలావలోక ప్రతిలబ్ధమానాః,
వ్రజస్త్రియో దృగ్భి రనుప్రవృత్త
ధియోఽవతస్థుః కిలకృత్య శేషాః. 14

స్వశాంతరూపేష్వితరైః స్వరూపై
రభ్యర్ద్యమానే ష్వనుకంపితాత్మా,
పరావరేశో మహదంశయుక్తో
హ్యజోఽపి జాతో భగవాన్యథాగ్నిః. 15

మాం ఖేదయ త్యేత దజస్య జన్మ
విడమ్బనం య ద్వసుదేవగేహే,
వ్రజే చ వాసోఽరిభయా దివ స్వయం
పురా ద్వ్యవాత్సీ ద్యదనంతవీర్యః. 16

దునోతి చేత స్స్మరతో మమైత
ద్య దాహ పాదావభివంద్య పిత్రోః,
తాతాంబ కంసాదురుశంకితానాం
ప్రసీదతాం నోఽకృతనిష్కృతీనామ్. 17

కో వా అముష్యాం ఘ్రిసరోజ రేణుం
విస్మర్తు మీశేత పుమా న్విజిఘ్రన్,
యో విస్ఫురద్భ్రూవిటపేన భూమే
ర్భారం కృతాంతేవ తిర శ్చకార. 18

దృష్టా భవద్భి ర్నను రాజసూయే
చైద్యస్య కృష్ణం ద్విషతో౾పి సిద్ధిః,
యాం యోగిన స్సంస్పృహయంతి సమ్య
గ్యోగేన క స్తద్విరహం సహేత. 19

తథైవ చాన్యే నరలోకపాలా
య ఆహవే కృష్ణముఖారవిందమ్,
నేత్రైః పిబంతో నయనాభిరామం
పార్థాస్త్రపూతాః పదమాపు రస్య. 20

స్వయం త్వసామ్యాతిశయస్త్ర్యధీశ
స్స్వారాజ్యలక్ష్మ్యాప్తసమ స్తకామః,
బలిం హరద్భి శ్చిరలోకపాలైః
కిరీటకోట్యేడితపాదపీఠః. 21

త త్తస్య కైంకర్య మలంభృతాన్నో
విగ్లాపయ త్యంగ యదుగ్రసేనమ్,
తిష్ఠ న్నిషణ్ణం పరమేష్ఠిధిష్ణ్యే
న్యబోధ యద్దేవ నిధారయేతి. 22

అహో బకీయం స్తనకాలకూటం
జిఘాంసయా౾పాయయ దప్యసాధ్వీ,
లేభే గతిం ధాత్ర్యుచితాం తతో౾న్యం
కం వా దయాళుం శరణం భజేమ. 23

మన్యే సురా న్భాగవతాం స్త్ర్యధీశే
సంరంభమార్గాభినివిష్టచిత్తాన్,
యే సంయుగే౾చక్షత తార్క్ష్యపుత్ర
మంసే సునాభాయుధ మాపతంతమ్. 24

వసుదేవస్య దేవక్యాం జాతో భోజేంద్రబంధనే,
చికీర్షు ర్భగవా నస్యా శ్శమజే నాభియాచితః. 25

తతో నందవ్రజ మితః పిత్రా కంసా ద్విబిభ్యతా,
ఏకాదశసమా స్తత్ర గూఢార్చి స్సబలోఽ వసత్. 26

పరితో వత్సపై ర్వత్సాం శ్చారయన్ వ్యహర ద్విభుః,
యమునోపవనే కూజద్ద్విజసంకులితాంఘ్రిపే. 27

కౌమారీం దర్శయం శ్చేష్టాం ప్రేక్షణీయాం వ్రజౌకసామ్,
రుదన్నివ హస న్ముగ్ధబాలసింహావలోకనః. 28

స ఏవాధివయో లక్ష్మ్యా నికేతం సితగోవృషమ్,
చారయ న్ననుగాంగోపా న్రణద్వేణు రరీరమత్. 29

ప్రయుక్తా న్భోజరాజేన మాయినః కామరూపిణః,
లీలయా వ్యనుద త్తాం స్తాన్ బాలః క్రీడనకానివ. 30

విపన్నా న్విషపానేన నిగృహ్య భుజగాధిపమ్,
ఉత్థాప్యాపాయయ ద్గావ స్తత్తోయం ప్రకృతిస్థితమ్. 31

అయాజయ ద్గోసవేన గోపరాజం ద్విజో త్తమైః,
విత్తస్య చోరుభారస్య చికీర్షు స్స ద్వ్యయం విభుః. 32

వర్షతీంద్రే వ్రజః కోపా ద్భగ్నమానేఽ తివిహ్వలః.
గోత్రలీలాతపత్రేణ త్రాతో భద్రానుగృహ్ణతా. 33

శరచ్ఛశికరై ర్మృష్టం మానయ న్రజనీముఖమ్,
గాయన్ కలపదం రేమే స్త్రీణాం మండలమండనః. 34

ఇతి శ్రీమద్భాగవతే, మహాపురాణే, పారమహంస్యాం, సంహితాయాం,
తృతీయస్కంధే, విదురోద్ధవసంవాదే, ద్వితీయోఽ ధ్యాయః

**అర్థములు :** శ్రీశుక ఉవాచ : శుకుఁడన్నాఁడు.

**1. శ్లో :** క్షత్రా = విదురునిచేత, ప్రియాశ్రయాం = ప్రియుని యాశ్రయించియున్న, వార్తాం = వార్తను గుఱించి, పృష్టః = అడుగఁబడిన, భాగవతః = భగవద్భక్తుఁడైన యుద్ధవుఁడు, స్మారితేశ్వరః = విదురునిప్రశ్నచే జ్ఞాపకమునకు వచ్చిన

కృష్ణపరమాత్మగలవాఁడై, ఔత్కంఠ్యాత్ = విరహదుఃఖముకారణముగా, ప్రతివక్తుం = వెంటనే బదు లిచ్చుటకు, న ఉత్సేహే = ఉత్సుకతను జూపలేదు.

**తాత్పర్యము** : శుకముని యన్నాఁడు. కృష్ణుని గూర్చిన వృత్తాంతమును విదురుఁడడిగెను. వెంటనే పరమప్రియుఁడైన కృష్ణపరమాత్మ యుద్ధవునిమనస్సులో మెదలినాఁడు. అతని విరహదుఃఖము హృదయము నాక్రమించినది. గొంతు తడఁబడెను. కన్నులనిండుగా నీరు నిలిచినవి. విదురునిప్రశ్నకు వెంటనే యుత్తర మొసఁగ నుత్కంఠితుఁడుగాలేదు.

**2. శ్లో** : పంచహాయనః = ఐదువర్షములప్రాయముగల, యః = ఏ యుద్ధవుఁడు, మాత్రా = తల్లిచేత, ప్రాతరాశాయ = ప్రొద్దుట చల్దితినుటకు, యాచితః = పిలువఁబడినవాఁడై, బాల్యలీలయా = బాల్యక్రీడచేత, యస్య = ఏ కృష్ణపరమాత్మయొక్క, సపర్యాం = పూజను, రచయన్= చేయుచున్నవాఁడై, తత్ = ఆ చలిఁదిని, న ఐచ్ఛత్ = ఇష్టపడలేదో!

**తాత్పర్యము** : ఉద్ధవునిభక్తి కృత్రిమముగాదు; జన్మసిద్ధమైనదని చెప్పుచున్నాఁడు. ఉద్ధవున కప్పుడు వయస్సు ఐదుసంవత్సరములు మాత్రమే, బాలక్రీడలో నాతఁడు కృష్ణవిగ్రహమును బెట్టికొని పూజించుచున్నాఁడు. ప్రొద్దుట చలిది తినుటకు రావలసినదని యాతని తల్లి పలుమారు ప్రార్థించినది. పూజాసక్తుఁడైన యా బాలకుఁడు పోలేదు. జన్మాంతరసంస్కారముతో నేర్పడిన యా కృష్ణభక్తి ప్రాయము గడచుకొలఁదియు వర్ధిల్లినది. కృష్ణవిరహ మాతని కసహ్యమై యుండెను.

**3. శ్లో** : తస్య = ఆ కృష్ణపరమాత్ముని యొక్క, సేవయా = సేవతోనే జరసంగతః = ముసలితనమును బొందిన, సః = ఆ యుద్ధవుఁడు, పృష్టః = విదురునిచేఁ బ్రశ్నింపఁబడినవాఁడై, భర్తుః = తన స్వామియొక్క, పాదౌ = పాదములను, అనుస్మరన్ = స్మరించుచున్నవాఁడై, కథం = ఎట్లు, ప్రతిబ్రూయాత్ = బదులిచ్చును?

**తాత్పర్యము** : ఆ కృష్ణునిసేవతోనే యుద్ధవునకు ముసలితనము వచ్చినది. విదురుని ప్రశ్నతో నాతనికిఁ గృష్ణపరమాత్మపాదములు జ్ఞాపకము వచ్చినవి. విరహదుఃఖము గమిచెను. అందుచే విదురునిప్రశ్నకు వెంటనే యుత్తర మివ్వలేదనుటలో నాశ్చర్యము లేదు.

**4. శ్లో** : సః = ఆ యుద్ధవుఁడు, కృష్ణాంఘ్రిసుధయా = కృష్ణపాదస్మరణముతో నేర్పడిన పరమానందరూపమైన యమృతముచేత, సాధునిర్వృతః = సంపూర్ణముగా నానందము ననుభవించినవాఁడును, తీవ్రేణ భక్తియోగేన = తీవ్రమైన

శ్రీకృష్ణప్రేమరూపభక్తియోగమందు, నిమగ్నః = మునిఁగినవాఁడై, ముహూర్తం = అల్పకాలము, తూష్ణీం అభూత్ = మౌనమును వహించెను.

**తాత్పర్యము** : కృష్ణునిపాదము లాతని హృదయమందు నిలిచినవి. మనస్సు నిశ్చల మయ్యెను. ఆనందామృతము ప్రవాహ మైనది. ఉత్కటప్రేమరూపమైన భక్తియోగమునందు నిమగ్నుఁడైనాఁడు. విషయాంతర మాతనికిఁ దోపలేదు. కొంతసేపు మౌనమును వహించినాఁడు.

5. శ్లో : పులకోద్భిన్నసర్వాంగః = పులకలచే నాక్రమింపఁబడిన సర్వాంగములును గలవాఁడై, మీలద్దృశా = కన్నులు మూసికొని, శుచః = బాష్పములను, ముంచన్ = వదలుచున్నవాఁడై, తేన = దానిచేత, స్నేహప్రసరసంప్లుతః = స్నేహప్రసారమందు మునిఁగినవాఁడై, పూర్ణార్థః = పూర్ణమైనయర్థముతోఁగూడినవాఁడుగా, లక్షితః = చూడఁబడెను.

**తాత్పర్యము** : ఉద్ధవుఁడు సమాధిస్థితిలోనికి వెళ్లినాఁడు. శరీరమంతయును రోమాంచ మాక్రమించినది. నేత్రము లర్ధనిమీలితము లయ్యెను. దుఃఖమున కతీతములై, పరిపూర్ణానందస్వరూపద్యోతకములుగా బాష్పములు ప్రవహించినవి. అతఁడు పరమప్రేమసముద్రమందు మునిఁగిపోయెను. ఆ యనుభవమునుండి బాహ్యస్మృతి వచ్చుట కెంతయోసేపు పట్టెను. "ఆహా! యుద్ధవునకు జన్మసాఫల్య మేర్పడినది" యని చూచినవారు భావించెడునట్లు ఆ స్థితి యుండెను.

6. శ్లో : భగవల్లోకాత్ = భగవత్స్మరణరూపమైన యా లోకమునుండి, శనైః = మెల్లమెల్లఁగా, నృలోకం = మనుష్యలోకమునుగూర్చి, పునః ఆగతః ఉద్ధవః = మరల క్రిందికివచ్చిన యుద్ధవుఁడు, నేత్రే = రెండుకన్నులను, విమృజ్య = తుడిచికొన్నవాఁడై, ఉత్స్మయన్ = చిఱునవ్వుమధరించి, ప్రత్యాహ = బదులు పలికెను.

**తాత్పర్యము** : భగవంతుని ధ్యానించిన సమయమందుఁ బరమాత్మతో నద్వైత మేర్పడును. అదియొక విభిన్నమైన ప్రపంచము. ఉద్ధవుఁ డా స్థాయినుండి క్రమముగాఁ గ్రిందికి దిగివచ్చినాఁడు. అతనికి స్వశరీరభావన మేర్పడినది. కన్నులు దెఱచెను. కన్నీటిని దుడిచికొన్నాఁడు. తన కేర్పడిన సమాధిస్థితిలోని సుఖమును దెలిపికొని మందహాస మొనర్చినాఁడు. తిన్నగా నుత్తర మొసఁగ దొరకొనెను.

**ఉద్ధవ ఉవాచ** : ఉద్ధవుఁ డన్నాఁడు.

7. శ్లో : కృష్ణద్యుమణినిమ్రోచే = కృష్ణుఁడనెడు సూర్యుఁ డస్తమింపఁగా, అజగరేణ = కాలమనెడు మహాసర్పముచేత, గీర్ణేషు = శిథిలితములును, గతశ్రీషు = సమృద్ధులు నశించినవియు నైన, నః గృహేషు = మాగృహములయందు, కిం ను కుశలం బ్రూయాం = ఏ కుశలమును బల్కెదను?

**తాత్పర్యము** : కృష్ణుఁడనెడి సూర్యుఁ డస్తమించినాఁడు. కాలస్వరూపుఁడైన మహాసర్పము యాదవగృహములను గ్రసింప నారంభించెను. ఆ గృహములలో వసించుచున్న యాదవుల సర్వసమృద్ధులును లుప్తప్రాయము లైనవి. ఇఁక వారిసుఖమునుగూర్చి నే నేమని వివరింతును? సర్వతేజోవిహీనులైనవారికి సుఖ మెచ్చటనుండి వచ్చును?

8. శ్లో : అయంలోకః = ఈలోకము, దుర్భగః బత = అదృష్టహీన మైనది. అయ్యో! నితరామపి = ఎక్కువగా, యదవః = యదువులు, (భాగ్యహీనులైనవారు) యే = ఎవ్వరు, సంవసంతః = కృష్ణునితో ఁగలసి మెలసి జీవించినవారై, మీనాః = మత్స్యములు, ఉడుపమ్ఇవ = చంద్రునివలె, హరిం = కృష్ణునిగూర్చి, న విదుః = తెలియలేకపోయిరి.

**తాత్పర్యము** : భూలోకవాసులైన మనుష్యులు దురదృష్టవంతులు. అందరికంటె యాదవులు ఎక్కువ దురదృష్టవంతులు. వారు భగవంతునితోఁ గలసిమెలసి జీవించిరి. కాని కృష్ణుని భగవంతుఁడని తెలియలేక పోయినారు. పాలసముద్రమందు మత్స్యములువసించినవి. వానితోఁ గూడఁ జంద్రుఁడు నుండెను. అవి యా చంద్రుని గమనింపలేకపోయినవి. తమతో వానినిగూడ నొక్కజలజంతువని భ్రమించెను. యాదవులస్థితి యట్టిదనది. వారి దురదృష్ట మేమనవలెను?

9. శ్లో : ఇంగితజ్ఞాః = పరాభిప్రాయము నెఱిఁగినవారు, పురుప్రౌఢాః = గొప్ప ప్రౌఢిమగలవారును, ఏకారామాః చ = ఎప్పుడు నేకాంతమందు రమించువారును నైన, సాత్వతాః = భక్తులు, సర్వే = అందరును. సాత్వతాం ఋషభం = భక్తులకు స్వామియు, భూతావాసం = సర్వభూతములకు నివాసస్థాన మనియు, (కృష్ణుని) అమంసత = తలఁచిరి.

**తాత్పర్యము** : భక్తులు పరేంగితజ్ఞులైనవారు. కార్యకారణముల యాంతర్యమును బరిశోధించి తెలియువారు. ఏకాంతమందు వసించి పరతత్త్వమందే రమించువారు. వారు పరమధన్యులు, శ్రీకృష్ణుని భక్తులకు స్వామిగా గుర్తించి సర్వభూతములకు లయస్థానముగా గమనించిరి. పరబ్రహ్మమని విచారించిరి.

**10. శ్లో** : దేవస్య = భగవంతునియొక్క, మాయయా = మాయచేత, స్పృష్టాః = తాకఁబడినవారును, అన్యత్ అసత్ = భగవద్విషయమైన యసద్విషయమును, ఆశ్రితాః = ఆశ్రయించినవారును, ఆత్మని హరౌ = ఆత్మస్వరూపుఁడైన కృష్ణునియందు, ఉప్తాత్మనః = ఉపేక్షతోఁ గూడిన బుద్ధిగలవారైన, యే = ఎవరుగలరో, తద్వాక్యైః = వారివాక్యములచేత, ధీః = బుద్ధి, నభ్రామ్యత్ = భ్రమింపఁజేయఁ బడదు.

**తాత్పర్యము** : యాదవు లెందుకు గమనింపలేకపోయిరి? దానికి సమాధానము. సృష్ట్యాదిలీలలతోఁ గ్రీడించుచున్న యా భగవంతుని మాయాశక్తిచేత నాక్రమింపఁ బడిన అంతఃకరణవృత్తులు గలవారు యాదవులు. వారికి ఆత్మభిన్నమైన శరీరాదిభావములం దాసక్తి. ఆత్మస్వరూపుఁడైన శ్రీహరియందే మనస్సు నిక్షేపించికొనియున్న భక్తులకు యాదవునాటలతోఁ జాంచల్య మేర్పడలేదు. అందుచేతనే భగవన్మాహాత్మ్యమును వా రెఱుఁగఁ గల్గిరి. యాదవులు గమనింపలేకపోయిరి.

**11. శ్లో** : అతప్తతపసాం = తపస్సుచేయనివారును, అవితృప్త దృశాం = తృప్తిపడని కన్నులు గలవారునునైన, నృణాం = మనుష్యులకు, స్వబింబం = తనరూపమును, ప్రదర్శ్య = కన్పింపఁజేసి, లోకలోచనం = లోకముయొక్క నేత్రమును, ఆదాయ = స్వీకరించి, యః తు = ఏ యొకఁడు, అంతరధాత్ = అంతర్ధాన మయ్యెనో!

**తాత్పర్యము** : భాగ్యమునకు మూలకారణము తపస్సు. ఎప్పుడును భగవంతునితోఁ గలసియుండి వసించుటకును ఆ దివ్యమంగళ శరీరమును జూచి తృప్తిఁ బొందుటకును జాలినంత తప స్సొనరింపకున్నను మనుష్యులకుఁ గృష్ణపరమాత్మ తన స్వరూపమును దర్శింపఁ జేసెను. ఆ తరువాత వారినేత్రములనుగూడ నపహరించి యా రూపముతో నదృశ్యుఁ డైనాఁడు.

**12. శ్లో** : మర్త్యలీలౌపయికం = మనుష్యలీల కుపకరించునట్టి, స్వయోగమాయాబలం = తన యోగమాయాశక్తిని, దర్శయతా = చూపించుచున్నవానిచేత, గృహీతం = గ్రహింపఁబడినదియు, సౌభగర్ద్ధేః = సౌందర్యసమృద్ధిహేతు వైనదియు, స్వస్యచ = తనకును, విస్మాపనం = ఆశ్చర్యజనకమైన, పరంపదం = ఉత్కృష్టస్థానభూతమును, భూషణభూషణాంగం = సొమ్ములకును సొమ్ములైన యంగములతోఁ గూడినదియు నైన, యత్ = ఏది.

**తాత్పర్యము** : కృష్ణపరమాత్మ తన యోగమాయాబలమును లోకమందుఁ బ్రత్యక్షముగాఁ బ్రకటింపభావించినాఁడు. అతఁడు దివ్యవిగ్రహమును స్వీకరించెను. అది మనుష్యలీలల ననుకరించుటకు మహాసమర్థ మైనది. సౌందర్యము లన్నిటి కవధియై తనకుఁగూడ నాశ్చర్యమును గలిగించునదిగా నుండెను. అట్టి సౌందర్యము దానిది. భూషణములకును భూషణమైన యవయవములు దానివి. ఉత్కృష్టమైన ప్రాప్యస్థానము.

**13. శ్లో** : ధర్మసూనోః = ధర్మరాజుయొక్క, రాజసూయే = రాజసూయయాగమునందు, దృక్ స్వస్త్యయనం = నేత్రముల కానందము గల్గించునదైన, యత్ = ఏ విగ్రహమును, నిరీక్ష్య = చూచి, త్రిలోకః = ముజ్జగములును, విధాతుః = బ్రహ్మయొక్క, అర్వాక్స్రుతౌ = ఇదివఱకు నొనర్చిన సృష్టిలోనున్న, కౌశలం = సామర్థ్యము, ఇహ = వీనియందు కార్త్స్న్యేన = పూర్ణముగా, అద్య = ఇప్పుడు, గతం = వచ్చినది, ఇతి అమన్యత = అని తలఁచెను.

**తాత్పర్యము** : ధర్మరా జొనర్చెడు రాజసూయమందు అగ్రపూజ నంగీకరించిన కృష్ణుఁడు సింహాసనమందుఁ గూర్చున్నాఁడు. ఆ దివ్యశరీరము సకలజగన్మోహకమై యుండినది. నేత్రానందకరమైన యీ శరీరము నిర్మించుటలో సృష్టికర్త తా నింతవఱ కభ్యసించిన సృష్టికౌశలము నంతయుఁ గన్పింపఁజేసినాఁ డని జను లనుకొన్నారు. అది త్రిలోకస్వస్త్యయనమై యుండెను.

**14. శ్లో** : యస్య = ఎవనియొక్క, అనురాగ = అనురాగముచేత, ప్లుత = తడిసిన, హాస = చిఱునవ్వు, రాసలీలా = రాసక్రీడ, అవలోక = చూచుట - వీనిచేత, ప్రతిలబ్ధ = సిద్ధించిన, మానాః = సమ్మానముగలవారై, వ్రజస్త్రియః = గోపస్త్రీలు, దృగ్భిః = నేత్రములచేత, అనుప్రవృత్తధియః = అనుసరించి వెళ్లిన బుద్ధిప్రవృత్తులు గలవారై, కృత్యశేషాః = చేయవలసినపనులు మిగిలినవారుగా, అవతస్థుః = ఉండిరి.

**తాత్పర్యము** : రాసక్రీడ జరుగుచుండెను. అతఁడు అనురాగప్లుతములైన చిఱునవ్వులు నవ్వుచున్నాఁడు. లీలావలోకనము లొనర్చుచుండెను. అవన్నియు గోపస్త్రీల నుద్దేశించియే. భగవానుని యీ సత్కారములతో వారి కత్యానంద మైనది. వారు తమ నేత్రములను ఆతనియందే సమర్పించిరి. బుద్ధివృత్తు లన్నియు నాకన్నులనే యనుసరించియున్నవి. వారికి బాహ్యజ్ఞానమే లేదు. అంతకుముం దారంభించిన పనులు ఎక్కడి వక్కడే నిలిచిపోయినవి.

15. శ్లో : అజః అపి = జన్మములేనివాఁ డైనను, భగవాన్ = ఈశ్వరుఁడు, అగ్నిః యథా = అగ్నివలె, ఇతరైః స్వరూపైః = వేఱుస్వరూపములచేత, స్వశాంతరూపేషు = తన శాంతస్వరూపములు, అభ్యర్ద్య మానేషు = పీడింపఁబడిన వగుచుండఁగా, అనుకంపితాత్మా = శాంతరూపములందు దయతోఁగూడిన మనస్సుగలవాఁడై, పరాఽవరేశః = సర్వేశ్వరుఁడైన తాను, మహదంశయుక్తః = గొప్పయంశముతోఁ గూడినవాఁడై, జాతః = పుట్టినవాఁ డైనాఁడు.

తాత్పర్యము : జన్మాది వికార రహితుఁడైన భగవంతుని యవతారప్రయోజనమును సూచించుచున్నాఁడు. కన్పించుచున్న స్వరూపము లన్నియు భగవంతుని రూపములే. అవి మూఁడురీతులు, శాంతములు, ఘోరములు, మూఢములు. ఇవి యసంఖ్యములుగా లోకమందున్నవి. ఘోరములైన యారూపములను దుర్జను లందురు. శాంతములైన రూపములను సత్పురుష లందురు. దుర్జనులు గల్పించు నుపద్రవములతోఁ దన శాంతరూపములైన సాధువులు బాధలు పడుచున్నప్పుడు వారి ననుగ్రహించుటకును ఇతరులను నిగ్రహించుటకును జననమరణహీనుఁడైన పరమాత్మ స్వేచ్ఛగా దేహమును ధరించి ప్రపంచమునకు వచ్చును. జ్ఞానస్వరూపుఁ డైన భగవంతుఁడు జ్ఞానమనెడు నుపాధిని జనులదృష్టులలోఁ బ్రత్యక్షపఱచును. అరణియం దంతర్భూతమైయున్న యగ్ని యింధనముతోఁ బ్రకాశ మగునుగదా! భగవంతుఁడు సర్వవ్యాపిగా నుండును. నిరుపాధికుఁడై యుండును. కాని దుష్టనిగ్రహ శిష్టపరిగ్రహము లనెడు కృత్యములను నిర్వహింపవలసివచ్చినప్పుడు మాత్రము సచ్చిదానందవిగ్రహము మనుష్యులదృష్టులకు విషయ మగునని సారము.

16. శ్లో : అజస్య = జన్మరహితుఁడైన భగవంతునకు వసుదేవ గేహే = వసుదేవుని గృహమందు, జన్మవిడంబనం = జన్మానుకరణమును, వ్రజే = గోకులమందు, వాసశ్చ = నివాసముననుట, యత్ = ఏదికలదో, అది అనంతవీర్యః = అనంతశౌర్యముగల భగవంతుఁడు, అరిభయాత్ ఇవ = శత్రువులనుండి భయముచేతవలె, పురాత్ = రాజధానినుండి, స్వయం = తానే, వ్యవాత్సీత్ = బయలుదేఱివెళ్లెననుట, యత్ = ఏదికలదో, ఏతత్ = అదియును, మాం ఖేదయతి = నన్ను ఖేదపెట్టుచున్నది.

తాత్పర్యము : జన్మాదివికారరహితుఁడైన భగవంతుఁడు జన్మమును గ్రహించి వసుదేవునియింటియం దుద్భవించెను. చిన్ననాఁడు గోకులమందు గోపాలకులతోఁ గలిసి జీవించినాఁడు. జరాసంధాది శత్రువులకు భయపడినవానివలె మధురను వదలి ద్వారకకుఁ బోయినాఁడు. ఆతని యీ విడంబనము లన్నియు నామనస్సున కెంతయో దుఃఖమును గల్గించుచున్నవి.

**17. శ్లో** : పిత్రోః = మాతాపితలయొక్క, పాదౌ = పాదములనుగూర్చి, అభివంద్య = నమస్కరించి, హే తాత! హేఅంబ! = ఓ తల్లీ! ఓ తండ్రీ! కంసాత్ = కంసునినుండి, ఉరుశంకితానాం = ఎక్కువగా శంకించుచున్నట్టియు, అకృతనిష్కృతీనాం = ప్రత్యపకారము చేయలేని వారమై చిరకాలమూరకున్న, నః = మమ్ములనుగూర్చి, ప్రసీదతాం = క్షమింపుఁడు ఇతి యత్ ఆహ = ఇట్లని యేది పలికెనో అది, స్మరతః = చింతించుచున్న, మమచేతః = నామనస్సు, ధునోతి = దుఃఖించుచున్నది.

**తాత్పర్యము** : కంసవధానంతరము కృష్ణుఁడు దేవకీవసుదేవుల పాదపద్మములను బట్టికొన్నాఁడు. పాదాభివందన మొనర్చి నిల్చికొన్న కృష్ణుఁడు "ఓ తల్లిదండ్రులారా! మిమ్ము గంసుఁ డెన్నియో బాధలు పెట్టెను. అవన్నియు మాకుఁ దెలియును. వానికిఁ బ్రతీకార మొనర్పలేక చాలదినము లూరకుండవలసి వచ్చినది. కంసునిదుర్మార్గములు నిరంకుశముగా సాఁగినవి. ఈమా యపరాధములు క్షమింపవలె" నని వేడికొన్నాఁడు. అతఁడు భగవంతుఁ డయ్యును సామాన్యమానవునివలె వేఁడికొనుట నా మనస్సున కెంతయో కష్టమును గల్గించుచున్నది.

**18. శ్లో** : యః = ఎవఁడు, విస్ఫురద్భ్రూవిటపేన = చలించుచున్నట్టి లతవంటిబొమముడియనెడు, కృతాంతేన = అంతకునితో, భూమేః = భూమియొక్క, భారం = భారమును, తిరశ్చకార = తిరస్కరించెనో, అముష్య = వీనియొక్క, అంఘ్రిసరోజరేణుం = పాదపద్మధూళిని, విజిఘ్రన్ = ఘ్రాణ మొనర్చువాఁడై, కోవా పుమాన్ = ఏ పురుషుఁడు, విస్మర్తుం = ఆ యనుభవమును మఱచిపోవుటకు, ఈశేత = శక్తిగలవాఁ డగును?

**తాత్పర్యము** : భగవంతుని యసాధారణపౌరుషము నేడుశ్లోకములతో వర్ణించుచున్నాఁడు. తీఁగవలె వక్రములైన యొవని భ్రూభంగము లనెడి అంతకునిచే భూభారము నిశ్శేషముగా నశింపఁజేయఁబడునో, అట్టి సర్వశక్తుఁడైన భగవంతుని పాదధూళిని ఆఘ్రాణించిన యే పురుషుఁడు దానిని మఱచిపోవుటకు శక్తుఁ డగును?

**19. శ్లో** : రాజసూయే = ధర్మరా జొనర్చిన రాజసూయయాగమునందు, కృష్ణం ద్విషతః చైద్యస్య = కృష్ణుని ద్వేషించుచున్న చేదిదేశపురాజైన శిశుపాలుని యొక్క, సిద్ధిః = పరగతిలాభము, భవద్భిః = మీచేత, దృష్టా = చూడఁబడినదిగదా!, యాం = ఏ స్థితిని, యోగినః = యోగులు, సమ్యగ్యోగేన = శ్రేష్ఠమైన యోగసాధనచేతఁ బొందుటకు, సంస్పృహయంతి = ఆశపడుచున్నారో, దానిని శిశుపాలుఁడు పొందెను. తద్విరహం = అట్టి యా కృష్ణునివియోగమును, కః సహేత = ఎవ్వఁడు సహించును?

**తాత్పర్యము** : ధర్మపుత్రుని రాజసూయయాగమందు చైద్యుఁడైన శిశుపాలుఁ డుపస్థితుఁ డైనాఁడు. వాఁ డెప్పుడును గృష్ణుని ద్వేషించుచుండును. ఆ సభలో నగ్రపూజ గైకొనుచున్న కృష్ణుని వాఁడు తూలనాడెను. చక్రధారతోఁ గృష్ణపరమాత్మ వానితల నఱికినాఁడు. ఆ తేజము గృష్ణునియందే లీనమైనది. ఈ స్థితిఁ బ్రత్యక్షముగ నందఱును జూచినదేగదా! పరమయోగులు యోగసాధనతోఁ గాంక్షించునదా స్థితి. దానిని వాఁడు గృష్ణద్వేషియయ్యును బొందెను. అంతటికరుణామయుఁడు యదువంశస్వామి. ఆతనివిరహము నెవ్వ రోర్చికొందురు?

**20. శ్లో** : తథాఏవ = అట్లే, ఆహవే= యుద్ధభూమియందు, అన్యే యే నరలోకవీరాః = పాల్గొనినట్టి నరలోకమునకు సంబంధించిన యితరరాజులు, నయనాభిరామం = నేత్రముల నానందింపఁ జేయుచున్నట్టి, కృష్ణముఖారవిందం = కృష్ణపరమాత్మముఖపద్మమును, నేత్రైః = కన్నులతో, పిబంతః = త్రాగుచున్నవారై, పార్థాస్త్రపూతాః = పార్థునిబాణములచే మరణించినందువలన పవిత్రులై, అస్య పదం = కృష్ణునకు సంబంధించిన పరమస్థానమును, ఆపుః = పొందిరి.

**తాత్పర్యము** : కురుపాండవయుద్ధము జరిగెను. దానిలో ననేకులు మధ్యమలోక పాలకులు పాల్గొన్నారు. వా రందఱును శిశుపాలుఁడు పొందిన సద్గతినే పొందిరి. మరణకాలమందు సారథియైయున్న కృష్ణపరమాత్ముని ముఖారవిందమును గన్నులతోఁ గ్రోలుచు వారు మరణించినారు. అర్జునునిబాణములతోఁ జచ్చుటయు వారిపవిత్రతకుఁ గారణ మైనది. వారు కృష్ణపరమాత్ముని పరమపదమే పొందిరి.

**21. శ్లో** : స్వయంతు = ఆ కృష్ణుఁడు స్వయముగా, అసామాన్యాతిశయః = తనకు సమానుఁడుగాని, యధికుఁడుగాని లేనట్టివాఁడు, త్ర్యధీశః = ముల్లోకములకు నధికారి, స్వారాజ్యలక్ష్మ్యా = స్వరూపానందమనెడు నైశ్వర్యముచేత, ఆత్త సమస్తకామః = పొందఁబడిన సమస్తకామములు గలవాఁడు. అట్టివాఁడు, బలిం హరద్భిః = బలిని నమర్పించుచున్న, చిరలోకపాలైః = అనాదిగా లోకమును పాలించు లోకపాలకులచేత, కిరీటకోట్యా = కిరీటాంచలముచేత, ఈడిత పాదపీఠః = వందింపఁ బడిన పాదపీఠము గలవాఁడు.

**తాత్పర్యము** : భగవంతుఁడైన కృష్ణపరమాత్మ తనకు సమానుఁడుగాని యధికుఁ డుగాని లేనట్టివాఁడు. త్రైలోక్యాధీశుఁడు. తనస్వరూపానందము చేతనే పొందఁబడు నమస్తకామములు గలవాఁడు. నిత్యతృప్తుఁడు. అవాప్త నమస్తకాముఁడు. ఆజ్ఞాపరిపాలనరూపమైన కప్పము నాతనికి దేవేంద్రాదు లెప్పుడును జెల్లించుచుందురు. అతనిపాదపీఠమునకు వారికిరీటాంచలములు నిత్యమును బూజలు చెల్లించుచుండును నర్వలోకములచేత స్తుతింపఁబడిన దాతని యతిశయము.

**22. శ్లో :** పరమేష్ఠిధిష్ణ్యే = సింహాసనమునందు, నిషణ్ణం = కూర్చున్నట్టి, ఉగ్రసేనం = ఉగ్రసేనునితోఁబాటు, తిష్ఠన్ = ఉచితాసనమునఁ గూర్చున్నవాఁడై, దేవ = ఓరాజా! నిధారయ = ఈ మాట నాలకింపుము. ఇతి న్యబోధయత్. యత్ = ఈ రీతిగా సంబోధించెనను టేదిగలదో, తస్య = ఆ కృష్ణునిదైన, తత్కైంకర్యం = ఆ సేవ, భృత్యాన్నః = భృత్యులైన మమ్ము, అంగ! = పూజ్యుఁడైన విదురుఁడా! అలం విగ్లాపయతి = ఎక్కువగా దుఃఖింపఁజేయును.

**తాత్పర్యము :** అట్టిమహిమగల భగవంతుఁడు సింహాసనస్థుఁడై యుగ్రసేనుఁ డున్నప్పుడు సమీపమున నిల్చున్నవాఁడై "మహారాజా! ఈ మనవిని వినుఁడు. తమ రీ విషయమున నిట్లు చేయవచ్చును" - ఈ రీతిగా మనవు లొనర్చున్నవాఁడై యుగ్రసేనునకుఁ గైంకర్యము లొనర్చుచుండెను. సర్వేశ్వరుఁడైన కృష్ణుఁడు ఇట్లు ప్రవర్తించుచుండుట ఆ భగవంతునిసేవకులమైన మా కెంతయో బాధాకరముగా నుండును.

**23. శ్లో :** అహో! ఆశ్చర్యము, అసాధ్వీ = దుష్టురాలైన, బకీ = పూతన, యం = ఏ కృష్ణుని జిఘాంసయా = సంహరింపవలెనను నిచ్ఛతో, స్తనకాలకూటం = చన్నులకుఁ బట్టించిన విషమును, అపాయయత్అపి = త్రాగించిన దైనను, ధాత్ర్యుచితాం = పెంచినతల్లికి రావలసిన, గతిం = స్థానమును, లేభే = పొందెను, తతః = వానిని వదలి, అన్యం దయాళుం కం వా = దయగలఁవాడని యితరు నెవనిని, శరణం వ్రజేమ = శరణుఁ బొందెదము?

**తాత్పర్యము :** ఉగ్రసేనునకుఁ గైంకర్య మొనర్చుట భగవంతునకుఁ గల కారుణ్యమువల్లనే యని తెలుపుటకు మఱియొక్కవిషయము నుదాహరించుచున్నాను. పూతనయనురాక్షసి కృష్ణునిఁ జంపుటకై వచ్చెను. అది దాదివలె నేషమును ధరించి స్తనములకు విషమును బూసికొని వచ్చినది. అది వచ్చి బలవంతముగా పాపని దీసికొని చన్నుగుడిపినది, భగవంతుఁడు చన్నుగడుచు నెపముతో దానిప్రాణములను లాగివేసెను. లాగివేసి తన్నుఁ బెంచిన తల్లి కీయవలసిన పరమపదము నొసఁగినాఁడు. ఇతకన్నను దయాశాలి యెవ్వఁడు? సర్వులచేతను భరింపఁదగినవాఁడు పరమేశ్వరుఁడు.

**24. శ్లో :** త్ర్యధీశే = త్రిలోకాధిపతియైన సర్వేశ్వరునివిషయమందు సంరంభమార్గాభినివిష్టచేతాన్ = క్రోధావేశముచే నాక్రమింపఁబడిన చిత్తముగల, అసురాన్ = రాక్షసులను, భాగవతాన్ = భగవద్భక్తులుగానే, మన్యే = తలఁతును,

యే = ఎవరు? సంయుగే = యుద్ధమందు, తార్క్ష్యపుత్రం = గరుడుని, అంసే = ఆతనిస్కంధమందున్న, ఆపతంతం = తమ కభిముఖముగా వచ్చుచున్న, సునాభాయుధం = చక్రధారియైన కృష్ణపరమాత్మను, అచక్షత = వీక్షించిరో,

**తాత్పర్యము** : సృష్టిస్థితిసంహారాదికార్యము లొనర్చి త్రిలోకములను శాశ్వతముగా నుండున ట్లొనర్చెడు భగవంతునియందు అసురులు ద్వేషమును దాల్చిరి, ఆ ద్వేషముతో నాతనిని సంహరించుటకై నిరంతరమును వానినే స్మరించుచుందురు. ఇదియు నొక్క ధ్యానప్రకారమే. నేనా రాక్షసులనుగూడ భగవద్భక్తు లనియే యందును. వారు మరణసమయమందు గరుడస్థితుఁడై, చక్రమును ధరించి, తమ కెదురుగా వచ్చుచున్న భగవంతుని వీక్షించుచునే మరణింతురుగదా! ప్రేమభక్తితో భక్తులు భగవంతుని శాంతరూపమును వీక్షింతురు. ఏ రీతిగా నైనను భగవంతునందు మనస్సు నిక్షేపించువారు భగవద్భక్తు లనియే నాయభిప్రాయము.

**25. శ్లో** : అజేన = బ్రహ్మచేత, అభియాచితః = ప్రార్థింపఁబడినవాఁడై, అస్యాః = ఈ భూమికి, శం = క్షేమమును, చికీర్షుః = కలిగింప నిచ్ఛించినవాఁడై, వసుదేవస్య = వసుదేవునియొక్క, దేవక్యాం = భార్యయైన దేవకియందు, భోజేంద్రబంధనే = కంసుని చెఱసాలలో, జాతః = జన్మించెను.

**తాత్పర్యము** : బ్రహ్మదేవుఁడు భగవంతుని యాచించెను. దాని ననుసరించి యాతఁడు భూభారమును దగ్గింప నవతరింతునని చెప్పినాఁడు. అందుకై కంసునిచెఱసాలలో వసుదేవునిభార్య దేవకియందు జన్మించెను.

**26. శ్లో** : కంసాత్ = కంసునినుండి, విభ్యతా = భయపడుచున్నట్టి, పిత్రా = తండ్రిచేత, నందవ్రజం = నందవ్రజమును, ఇతః = పొందింపఁబడినవాఁడై, తత్ర = అచ్చట, ఏకాదశసమాః = పదునొకండు సంవత్సరములు, సబలః = బలరామునితోఁబాటు, గూఢార్చిః = గుప్తముగా, నుంచికొన్న మహిమగలవాఁడై, అవసత్ = నివసించెను.

**తాత్పర్యము** : వసుదేవుఁడు కంసునకు భయపడినాఁడు. ఆతఁడు కృష్ణుని నందవ్రజమును జేర్చెను. అచ్చటఁ గృష్ణపరమాత్మ పదునొకండు వత్సరముల కాలముండెను. ఆ కాలమందుఁ దన మహిమ నాతఁడు గుప్తముగా నుంచికొన్నాఁడు.

**27. శ్లో** : వత్సపైః = మందలను గాచెడు గోపాలకులచేత, పరీతః = చుట్టఁబడినవాఁడై, వత్సాన్ = దూడలను, చారయన్ = మేపుచున్నవాఁడై, విభుః = భగవంతుఁడు,

కూజద్విజసంకులితాంఘ్రిపే = వివిధముగా శబ్దించుచున్న పక్షులచేత నిండిన వృక్షములుగల, యమునోపవనే = యమునానదీ సమీపమందు, వ్యహరత్ = విహరించెను.

**తాత్పర్యము** : తనచుట్టును మందలు గాచెడి గోపాలురు. తనకును మందలఁ గాచుటే పని. సర్వశక్తుఁడైన యా కృష్ణుఁడు మందలను గాచికొనుచు నానావిధ విహగ నాదితములైన వృక్షములుగల యమునాకూలములలో సంచరించినాఁడు.

**29. శ్లో** : సః ఏవ = అతఁడే, లక్ష్మ్యాఃనికేతం = లక్ష్మీదేవికి నివాసస్థానమును, సితగోవృషం = తెల్లని స్వచ్ఛమైనగోవులును, వృషభములును గలిగినట్టి, గోధనం = పశువులగుంపును, చారయన్ = అడవిలో మేపుచున్నవాఁడై, రణద్వేణుః = మ్రోయించుచున్న వేణువుగలవాఁడై, అరీరమత్ = క్రీడించెను.

**తాత్పర్యము** : కొంతవయస్సు వచ్చిన తర్వాత నా భగవంతుఁడు ఐశ్వర్యముయొక్క యుత్పత్తిస్థానమును, స్వచ్ఛమైన గోవులు, వృషభములును గలిసియున్న గోధనమును బరిపాలించువేళయందు గోపకులను గూర్చికొని వేణునాదములతో విహరించెను.

**30. శ్లో** : భోజరాజేన = భోజరాజైన కంసునిచేత, ప్రయుక్తాన్ = పంపఁబడినట్టి, కామరూపిణః = ఇచ్ఛానుసారముగా రూపములను ధరించుచున్న మాయినః = మాయావులైన, తాన్ తాన్ = ఆయా రాక్షసులను, బాలః = పిల్లవాఁడు, క్రీడనకాన్ ఇవ = ఆటవస్తువులను వలె, లీలయా = లీలతో, వ్యనుదత్ = నశింపఁజేసెను.

**తాత్పర్యము** : గోవ్రజమందున్న కృష్ణునిగూర్చి కంసుఁడు విన్నాఁడు. అతనిని హింసింప వలెనని వానియుద్దేశము. వాఁడు మాయావులైన రక్కసుల నెందఱనో పంపెను. వారు కామరూపులు. కృష్ణుఁ డా వచ్చిన రాక్షసుల నందఱను బాలకుఁ డాటవస్తువులనువలె అవలీలగా సంహరించినాఁడు.

**31. శ్లో** : విషపానేన = విషపానముచేత, విపన్నాన్ = మరణించినట్టి, గావః = గోవులను, ఉత్థాప్య = లేపినవాఁడై, భుజగాధిపం = సర్పరాజైనకాళీయుని, నిగృహ్యా = నిగ్రహించి, ప్రకృతిస్థితం = విషరహితముగాఁ జేయఁబడిన, తత్తోయం = ఆ నీటిని, అపాయయత్ = గోగోపాలకులతోఁ ద్రావించెను.

**తాత్పర్యము** : కాళిందీహ్రదమును, కాళీయుఁ డాశ్రయించికొనియుండెను, వానివిషముచే నాజలములు విషమయ మైనవి, ఆ నీటిని ద్రావి గోగోపాలకులు మరణించినట్లు మూర్ఛ నందిరి. వారి నందఱను గటాక్షామృతముతోఁ గృష్ణపరమాత్మ బ్రదికించినాఁడు. కాళీయుని గర్వ మణఁచి కృష్ణుఁ డా హ్రదమునుండి పారదోలెను. గోగోపాలకు లా జలము నిప్పుడు నిర్భయముగాఁ ద్రావఁదొడఁగిరి.

**32. శ్లో** : ఉరుభారస్యవిత్తస్య = అధికముగా నున్న ధనముయొక్క సద్వ్యయం = ఉపయుక్తమైన వ్యయమును, చికీర్షన్ = చేయఁగోరినవాఁడై, విభుః = ప్రభువైన కృష్ణపరమాత్మ, ద్విజోత్తమైః = శ్రేష్ఠులైన బ్రాహ్మణులతో, గోసవేన = సుసంతృప్తికరమైన యజ్ఞముచేత గోపరాజగు నందగోపుని, ఆయాజయత్ = యజింపఁ జేసెను.

**తాత్పర్యము** : పశుసమృద్ధిచేత నందగోపుని భండారము సుసంపన్నముగా నుండెను. కృష్ణపరమాత్మ యా ధనమును సద్వ్యయమును చేయఁదలఁచినాఁడు. అతఁడు నందగోపునిచే 'గోసవ' మను యజ్ఞమును జేయింపఁ దలఁచెను. వేదవిత్తములైన బ్రాహ్మణులను రావించి నందగోపునిచే నా యజ్ఞము నొనర్పఁజేసినాఁడు. నందవ్రజము నభివృద్ధికై యొనర్పఁబడిన దా యజ్ఞము.

**33. శ్లో** : హేభద్ర! = ఓ విదురుఁడా! భగ్నమానే = ఇంద్రయాగము నిషేధింపఁ బడుటచేత గర్వము దెబ్బదిన్నట్టి, ఇంద్రే = ఇంద్రుఁడు, కోపాత్ = క్రోధముతో, వర్షతిసతి = ఎక్కువగా వర్షించుచున్నవాఁ డగుచుండఁగా, అతివిహ్వలఃవ్రజః = ఎక్కువ భయపడినట్టి నందవ్రజము, అనుగృహ్ణాతా = అనుగ్రహించునట్టి కృష్ణునిచేత, గోత్రలీలాతపత్రేణ = పర్వతమనెడు లీలార్థమైన గొడుగుచేత, త్రాతః = రక్షింపఁ బడినది.

**తాత్పర్యము** : ఇంద్రయాగమును గృష్ణుఁడు మాన్పించినాఁడు. దానితో నింద్రునియభిమానమునకు దెబ్బతగిలెను. అతఁడు పుష్కలావర్తకాదులను బ్రేరేచి నందవ్రజమును వానలతో ముంచెత్తినాఁడు, గోగోపాలకులు ఎక్కువగా భయపడిరి. అప్పుడు కష్ణుఁడు గోవర్ధనమునెత్తి యా పర్వతమనెడు నాతపత్రము క్రింద వారిని రక్షించెను.

**34. శ్లో** : శరచ్ఛశికరైః = శరత్కాలమునందలి చంద్రకిరణములచేత, మృష్టం రజనీముఖం = ఆక్రమింపఁబడి స్వచ్ఛముగాఁ బ్రకాశించు ప్రదోషసమయమును, మానయన్ = గౌరవించుచున్నవాఁడై, కలపదం = మనోహరములైన శబ్దములుగల గీతములతో, గాయన్ = పాడుచున్నవాఁడును, స్త్రీణాం = స్త్రీలయొక్క మండలమండనః = గుంపును అలంకరించుచున్నవాఁడై, రేమే = క్రీడించెను.

**తాత్పర్యము** : శరత్కాలచంద్రుఁడు స్వచ్ఛముగాఁ బ్రకాశించుచుండెను, ఆ వెన్నెలలో రజనీముఖము ఎక్కువగా వెల్గుచున్నది. ఆ ప్రదోషమును గౌరవించుచున్నవానివలెఁ గృష్ణుఁడు కలపదగీతములతో మురళిని మ్రోయింప నారంభించెను. గోపికలాతనిచుట్టును జేరిరి. ఆ స్త్రీలగుంపున కలంకారభూతుఁడైన కృష్ణుఁ డా ప్రదోషసమయమునఁ గ్రీడించెను.

## శ్రీధరీయము

1. శ్లో ॥ ద్వితీయే కృష్ణవిశ్లేషా దనుశోచన్నథోద్ధవః,
క్షేత్రే బాలచరిత్రాణి కృష్ణస్యావర్ణయచ్ఛ్వసన్.

ద్వితీయాధ్యాయమందు ఉద్ధవుఁడు రాసక్రీడాంతము కృష్ణుని బాల్యక్రీడలను గుఱించి చెప్పుచున్నాఁడు. కృష్ణ విశ్లేషణముతో నాతనికి మహాదుఃఖ మేర్పడినది. కొంతసేపునకు సమాధానపడి బదులు చెప్పుచున్నాఁడు. ప్రియాశ్రయాంవార్తాంపృష్టః = పరమ ప్రియుఁడైన కృష్ణునకు సంబంధించిన వార్తను అడుగఁబడినవాఁడై శ్రీకృష్ణ విరహౌత్కంఠ్యావేశముతో వెంటనే బదులు చెప్పలేకపోయినాఁడు. ఆ ఔత్కంఠ్యమునే యారుశ్లోకములతో వర్ణించుచున్నాఁడు. స్మారితేశ్వరః = స్మారితః ఈశ్వరః ఏన సః = ఎవరిచే నీశ్వరుఁడు స్మరింపఁబడినాఁడో అతఁడు ఉద్ధవుఁ డన్నమాట.

2. శ్లో : ఈ విషయమునే కైముతికన్యాయముచేఁ జెప్పుటకు కైశోరమును వర్ణించుచున్నాఁడు. యః = ఎవఁడు, పంచవర్షోఽపి = ఐదేండ్లప్రాయము వాఁడైనను, బాలలీలయా = బాలలీలచేత, శ్రీకృష్ణంకంచిత్పరికల్ప్య = ఒకానొకవస్తువును గృష్ణుఁ డనుకొని, కల్పితైరేవసాధనైః, పరిచర్యాం కుర్వన్ = కల్పింపఁబడిన సాధనలచేఁ గృష్ణసేవ నొనర్చుచున్నవాఁడై, ప్రాతరాశాయ = ప్రాతర్భోజనమునకై తల్లి పలుమాఱు పిలిచినను దానియం దుపేక్ష వహించెనని భావము.

3. శ్లో : కాలేన జరసంగతః = కాలక్రమమున వృద్ధుఁడై కృష్ణసేవతోనే ముసలివాఁడైనాఁడని భావము. అనఁగా నతనిజీవితములోఁ గృష్ణసేవయే ప్రధానమైనదని చెప్పుచున్నాఁడు.

4. శ్లో : కృష్ణాంఘ్రిసుధయా = కృష్ణుని పాదసేవాస్మరణ మనుటయే యమృతప్రవాహము. అది మధురాతిమధుర మగుటచే దానినుండి గడ్డకు వచ్చుట కష్టము. సాధునిర్వృతః = ఎక్కువగా నిమగ్నమైన చిత్తముగలవాఁడై, కృష్ణపాదస్మరణ ఎక్కువగా వివశత్వమును గల్గించును. ఆ వివశత్వమందు సంపూర్ణముగా మున్గినాఁడని యర్థము, "తీవ్రేణ భక్తియోగేన" - తీవ్రమైన భక్తియోగమున్ననే యిట్టిది సాధ్యము. భక్తియోగులలో నుద్ధవుఁడు పరమోత్తముఁడని చెప్పినట్లైనది.

5. శ్లో : పులకోద్భిన్నసర్వాంగః = పులకలచే విజృంభించుచున్న సర్వాంగములుగలవాఁడై, మీలద్దృశా = తెరువఁబడిన కన్నులచేత, అశ్రూణి ముంచన్ = కన్నీటిని వదలినవాఁడై, విదురునిచేత, పూర్ణార్థః లక్షితః = జీవితసాఫల్యమును సంపూర్ణముగాఁ

బొందినవాఁడై కనుగొనఁబడెను. స్నేహప్రసరసంప్లుతః = కృష్ణునియందే స్నేహప్రసరము అనఁగా పూరము, దానియందు నిమగ్నుఁడైనాఁడు. ఇది పూర్ణార్థః అనుటకు హేతువు. కృష్ణనామమునుగాని కృష్ణుని జ్ఞాపకము దెచ్చు నేయే సన్నివేశముగాని విన్నప్పుడు, చూచినప్పుడు శరీరమును మఱచి కృష్ణస్నేహమందు పరమనిమజ్జితుఁ డగుటయే జన్మకుఁ గృతార్థత్వమని భావము.

6. శ్లో : భగవల్లోకాత్ = భగవంతుఁ డనెడు ప్రపంచము. దానినుండి, నృలోకం = దేహానుసంధానరూపమైన మానవలోకము, ఉత్స్మయన్ = యదుకులసంహారాదిరూప చాతుర్యాదిస్మరణముచేత విస్మయమును బొందినవాఁడై.

7. శ్లో : కృష్ణుని విరహముతో సంతప్యమానుఁడై, ప్రత్యాహ = బదులుపలికెను. కృష్ణద్యుమణినిమ్రోచే = కృష్ణ ఏవ ద్యుమణిః. కృష్ణుఁ డనెడు సూర్యుఁడు, అతఁడు నిమ్రోచే, అస్తమయమును బొందఁగా = అజగరేణ = కాలమహాసర్పముచేత, గిలితేషు = ఆక్రాంతములైన, నః గృహేషు = మాయిండ్లయందు, నీచే నడుగఁ బడిన బంధుగులకుశలము నేమని చెప్పుదు ననుచున్నాఁడు.

8. శ్లో : బత! = అయ్యో అని యర్థము. అనుకంపాద్యోతకము లేక ఖేదమైనను గావచ్చును. అయం జనః = ఈ లోకమందు నివసించుచున్న జననికాయము, 'లోకస్తు భువనే జనే' - అని యమరము. దుర్భగః = భాగ్యహీన మైనది. యదవః నితరామపిదుర్భగాః = యాదవు లీలోకజనుల కన్నను దురదృష్టవంతులు, యే సంవసంతః హరిం న విదుః = కృష్ణునితోఁ గూడి నివసించుచున్నను అతనినిఁ బరమాత్ముఁడని తెలిసికొనలేకపోయినారు. యాదవులు పరమదుర్భగు లనుట కిది కారణము. ఎట్లు దెలిసికొనలేకపోయి రనుట కుదాహరణ మిచ్చుచున్నాఁడు. క్షీరసముద్రమందు జన్మించిన ఉడుపం = చంద్రుని, దానియందున్న మీనములు కేవలము కమనీయమైన యొకజలజంతువనియే తలఁచినవి. అమృతమయుఁడైన వానిగా నర్థము చేసికొనలేదు లేక జలేప్రతిబింబితం చంద్రం యథా = జలప్రతిబింబితుఁడైన చంద్రుని జలదమనియే భావించినవి.

9. శ్లో : జ్ఞానసామగ్రి యభావముతోఁ గాదు. భాగ్యహీనత్వముచేతనే తెలిసికొనలేకపోయి రనుచున్నాఁడు. ఇంగితజ్ఞాః = చిత్తస్థితమైన విషయమును బాహ్యావలోకనమాత్రముచేతనే గ్రహింపఁగలవారు పురుప్రౌఢాః = గొప్పనైపుణ్యము గలవారు. ఏకారామాః ఏకస్మిన్నేవస్థానే ఆరమంతి = ఏకారామాః - ఒకచోటనే యుండి రాజ్యసుఖము లనుభవించువారు. ఇట్టివా రైనప్పటికిని, భూతావాసం = సమస్తభూతముల కాశ్రయభూతుఁడైన స్వామిని, సాత్వతాంబుషభం అమంసత.

ఇచ్చట సాత్వతు లనఁగా యాదవులు. యాదవులలో శ్రేష్ఠుఁడైనవానిగా మాత్రమే భావించిరి. సర్వాధీశ్వరుఁడైన భగవంతునిగా భావింపలేకపోయి రనిభావము.

**10. శ్లో** : భాగ్యవంతులై యెవ్వరింగితాదులచేత నాతని నీశ్వరునిగాఁ గనుగొన్నారో వారుగూడ నీశ్వరునిగా గమినింపనివారి మాటలచేత మోహితులు గావచ్చునుగదా! అట్టిచో వారి కదృష్టముతో నేమిసిద్ధించినది? అని ప్రశ్నించికొని సమాధాన మిచ్చుచున్నాఁడు యే = ఏ యాదవులు, దేవమాయయావ్యాప్తా: = దేవమాయతో నాక్రమింపఁబడినవారై ఈ కృష్ణుఁడు యాదవుఁడే; మాకు బంధువుగూడ, అని పల్కుచున్నారో, యే చ = తక్కిన యే శిశుపాలాదులు, అసదేవ = కృష్ణుని భిన్నముగా నర్థమొనర్చికొన్నవారై, అసత్ ఆశ్రితా: = అన్యథాజ్ఞానమైన వైరము నాశ్రయించి నిందించుచున్నారో వారివాక్యములచేత, హరౌఉప్తాత్మాన: = ఆత్మస్వరూపుఁడైన కృష్ణపరమాత్మయందే లగ్నమైన మనస్సుగల నావంటివారియొక్క, ధీ: = బుద్ధి, నభ్రామ్యతే = మోహమును బొందదు. తక్కినవా రందఱును మూఢులని చెప్పుచున్నాఁడు.

**11. శ్లో** : ఆ హరియెట్టివాఁడో వివరించుచున్నాఁడు అతప్తతపసాం = గాఢములైన తపస్సు లొనర్పనివారు, అవితృప్తదృశాం = కృష్ణునిఁజూచుటయందుఁ దృష్టిలేనివారు, అట్టివారికొఱకు. స్వబింబం = తనమూర్తిని, ఇంతకాలమును, ప్రదర్శ్య = చూపించి, లోకస్యలోచనం ఆదాయ = లోకముయొక్కకంటిని పెఱికికొన్నవాఁడై అనఁగా విలోకనీయమైన యట్టి పదార్థాంతరము లేకుండుటచేత వారిలోచనములు వ్యర్థము లని భావము.

**12. శ్లో** : ఆ కృష్ణుని రూపసౌభాగ్యమును మూఁడుశ్లోకములతో వర్ణించుచున్నాఁడు. మర్త్యలీలోపయికం = మర్త్యలీలలను బ్రదర్శించుటకు యోగ్యమైన స్థానమును, విస్మాపనం = తనకుఁ గూడ నాశ్చర్యమును గల్గించునదియు, సౌభగర్ధే:పరంపదం = సౌభాగ్యాతిశయమునకు పరాకాష్ఠరూప మైనది. భూషణం భూషణానాం = సొమ్ములకుఁ గూడ సొమ్మునునైన శరీరావయవములు గలది. అనఁగాఁ గృష్ణుని శరీరము మానవచేష్టల ననుకరించుటకు యోగ్య మైనది. ఆ శరీరసౌందర్యము తనకుఁ గూడ విస్మయము గొలుపునదిగ నుండెను. సౌభాగ్యాతిశయమునకుఁ బరాకాష్ఠ యా దేహము. భూషణము లాతనిదేహమునకు శోభ నిచ్చుటలేదు. ఆతని యవయవసంయోగముచేత భూషణములే శోభాతిశయము నందుచుండెను. స్వామి తనయోగమాయాబలమును బ్రదర్శించుటకు నాశరీర మన్నివిధముల నుపయుక్తమై యుండినదని భావము.

**13. శ్లో** : దృక్స్వస్త్యయనం = మానవులనేత్రములకుఁ బరమానందకర మైనది. త్రిలోకం = మూఁడులోకములయందున్న ప్రాణిమాత్రము, అర్వాక్స్రృతా = గడచిపోయిన సంసార నిర్మాణమందు లేక మనుష్యనిర్మాణమందు, యత్కౌశలం = ఏ నైపుణ్యముగలదో అది, కార్ష్ణ్యేన, గతం = ఉపేక్షణీయమైనదిగా, అమన్యత.

**తాత్పర్యము** : బ్రహ్మదేవుఁ డింతకు ముందు మనుష్య శరీరనిర్మాణములో సంపాదించికొన్న పరిణతమైన కౌశలము నంతయుఁ గృష్ణశరీరనిర్మాణమందు వినియోగించినాఁడు. ఇంతకన్నను మించి బ్రహ్మకుఁ గౌశలములేదని భావము, భగవచ్ఛరీరము సచ్చిదానందఘనమైనది. ఆతఁడు స్వేచ్ఛగనే శరీరమును ధరించును. ఆ దేహము బ్రహ్మనిర్మితముగాదు. భగవచ్ఛరీరనిర్మాణ కౌశలము బ్రహ్మకు లేదు. మఱి యీ శ్లోకమం దిట్లు చెప్పుట లోకదృష్టి ననుకరించుటకు.

**14. శ్లో** : యస్య = ఎవనియొక్క, అనురాగప్లుత: = ప్రేమచే వ్యాప్తమైన, హాస: = హసనము. రాస: = వినోదము, లీలాఅవలోక = సలీలవీక్షణము - వీనిచేత, ప్రతిలబ్ధమానా: = పొందఁబడిన గర్వాతిరేకముగలవారై, "కృష్ణుఁడు నావైపుఁ జూచి నవ్వెను. నాతో హాస్యమాడెను. నావైపు సానురాగముగ వీక్షించెను" ఇత్యాద్యభిమానములు గలవారై, అనుప్రవృత్తధియ: = కృష్ణునిచూపులు మొదలైనవాని ననుసరించి వెళ్లెడు బుద్ధిగలవారై అనఁగా నాతనిచేష్టలచేత గోపికలబుద్ధి అపహరింపఁ బడినదని యర్థము. వారు అతనిచూపులవెంటనే పోవుచున్నారు. ఖిలకృత్యశేషా: = అసమాప్తములైన కరణీయకృత్యములతో నున్నారు. అనఁగాఁ దాముచేయవలసిన యింటిపనులను మఱచి బుద్ధిని గోల్పడి యట్లే యున్నారని భావము.

**15. శ్లో** : ఇట్టి బింబప్రదర్శనమునకుఁ గారణమును జెప్పుచున్నాఁడు. శాంతములు అశాంతములు - ఈరెండు విధములైన రూపము లాతనివే, వీనిలో అశాంతరూపములతో శాంతరూపములు బాధింపఁబడఁగా, అనుకంపిత: = దయఁ బూనిన, ఆత్మా = మనస్సుగలవాఁడై, అజోఽపిజాత: = జన్మకర్మములతో సంబంధము లేనివాఁడైనను ఆవిర్భూతుఁ డైనాఁడు. మహాభూతరూపముగా నిత్యసిద్ధమైనయగ్ని కాష్ఠాదులందుఁ బ్రకాశమాన మగునట్లు జన్మను స్వీకరించినాఁ డని భావము. మహదంశముక్త: = మహత్తత్త్వనిర్మాణము ఎవ్వని కార్యలేశమో, అట్టివాఁ డు. అవ్యక్తుఁడైన పరమాత్మునకు మహత్తత్త్వాదినిర్మాణము వ్యక్తరూపాధాయకమని అర్థము.

**16. శ్లో :** "పరాపరేశుఁడైన భగవంతున కీ పారతంత్ర్య మెందుకు? నాకుఁ గూడ నిదేసమస్య. నాతర్కమున కందనిది. అది నన్ను ఖేదపఱుచుచున్నది". అని యుద్ధవుఁ డనుచున్నాఁడు. ఆ పారతంత్ర్యమునే రెండు శ్లోకములతో వివరించుచున్నాఁడు. వసుదేవగేహే = బంధనాగారమందు, యజ్జన్మనోవిడంబనం = జన్మయను విడంబన మేదిగలదో, అది, నృసింహాద్యవతారములవలె యావిర్భావముగాదు. అరిభయాదివ = కంసునినుండి భయముచేతవలె, పురాత్ = మధురనుండి, వ్యవాత్సీత్ = పరువెత్తిపోయెను.

**17. శ్లో :** ఈ రెండవవిధమైన హరిచరిత్రగూడ నా మనస్సునకు సంకటము గల్గించుచున్నది అనుచున్నాఁడు. హేతాత! హేఅంబ! యువాం ప్రసీదతాం = మీరు ప్రసాదింతురుగాక, అకృతనిష్కృతీనాం = మీ శుశ్రూషణ మొనర్పక యూరకున్నట్టి మమ్ము క్షమింపవలెనని భావము. ఇచ్చటి బహువచనము రామాద్యభిప్రాయముతోఁ జెప్పఁబడినది.

**18. శ్లో :** ఇట్టినచోఁ గృష్ణుఁ డనీశ్వరుఁడేగదా! ఆతనిఁ బరమాత్ముఁ డనుట కేవలము నీశ్రద్ధామాత్రమే. దానికి మూఁడుశ్లోకములతో సమాధానముఁ జెప్పుచున్నాఁడు. కోవా అంఘ్రిసరోజయోః యో రేణుః = పాదము లనెడు సరోజములయం దే రేణువు గలదో దానిని, విజిఘ్రన్ = సేవించుచున్నవాఁడై, విస్మర్తుం ఈశేత = మఱచిపోవుటకు శక్తుఁ డగును, విస్ఫుర ద్భ్రూవిటపః = చలించుచున్న భ్రూభంగ మనునదే తీఁగ వంటిది. అనఁగా తీఁగవలె వక్రసుందరమై చలించుచున్నదనుట. ఆ భ్రూలత యనునదే కృతాంతుఁడు = యముఁడు. తత్సాహాయ్యముతో భూభారమును దిరస్కరించుచున్నాఁడని పిండితార్థము.

**19. శ్లో :** ఆతని ఈశ్వరత్వము అనుమానముతో సాధింపఁదగినదిగాదు. అది ప్రత్యక్షప్రమాణముతోనే సిద్ధించును అనుచు నాప్తవాక్యమును బ్రమాణముగా స్వీకరించుచున్నాఁడు. రాజసూయే, ద్విషతోఽపి, చైద్యస్యసిద్ధిః ఆసీత్. శిశుపాలుఁ డెప్పుడును గృష్ణుని ద్వేషించువాఁడే. వాఁడు గూడ రాజసూయయాగమునందు సిద్ధిని బొందినాఁడు. ఆ సిద్ధి సామాన్యముగాదు. మహాయోగులు గొప్పసాధనములచేత నే సిద్ధిని బొందఁగోరుచున్నారో అట్టి దా సిద్ధి.

**20. శ్లో :** మఱియొకదానినిఁగూడఁ జెప్పుచున్నాఁడు. ఆహవే = యుద్ధమందు, నరలోకపాలాః = మధ్యమలోకపాలకులు, నయనాభిరామం కృష్ణముఖారవిందం విలోకయన్ = కమనీయమగు కృష్ణుని ముఖపద్మమును, నేత్రైఃపిబంతః = కన్నులతోఁ

ద్రావుచున్నవారై, అనఁగాఁ గన్నులు విశాలముగాఁ దెఱచి తృప్తిలేనట్లుగాఁ బానముసేయుటన్నమాట. పార్థాస్త్రపూతాః = విజయునిబాణములచే మృతులు. అందుచే వారిపాపము లన్నియు నర్జునుని శస్త్రాస్త్రములచే దహింపఁబడినవి. అస్య పదం ఆపుః = ఆ భగవంతునిపాధపద్మములను బొందిరి. వారు ముక్తులగుటలోఁ గారణములు రెండు. ఒకటి. కవ్వడిబాణములచే నిహతు లగుట. రెండవది మరణసమయమందు కృష్ణ ముఖారవిందమును విలోకించుచు మరణించుట. అర్జున బాణములు పాపరాహిత్యమునకుఁ గారణము లైనవి. కృష్ణముఖారవిందదర్శనము మోక్షకారణ మైనది.

**21. శ్లో** : ఇట్టి పరమైశ్వర్యమున్నను నాతఁ డుగ్రసేను ననువర్తించుట మా కత్యంత వ్యథాకారణమైనదని చెప్పుచున్నాఁడు. అసామ్యాతిశయః = తనతో సమానులు లేనివారు. సమానుఁడే లేనప్పుడు అతిశయితుఁ డెక్కడనుండి వచ్చును? అసామ్యాతిశయుఁ డగుటలో హేతువును వివరించుచున్నాఁడు. త్ర్యధీశః = త్రయాణాం పురుషాణా మధీశః = త్రిమూర్తులకంటెను గొప్పవాఁడు. స్వారాజ్యలక్ష్మ్యా = పరమానందస్వరూపసంపత్తి మాత్రముతో ఆప్త సమస్తకామః = ప్రాప్తములైన సమస్తభోగములును గలవాఁడు. బలిం హరద్భిః = తన యాజ్ఞానువర్తనరూపమైన కప్పము నిచ్చుచున్నట్టి, చిరలోకపాలైః = చిరకాలీనులైన లోకపాలకులచేత, కిరీటాగ్రములతో, ఈడితం = స్తుతమైన పాదపీఠముగలవాఁడు. లోకపాలకు లాతనికి నమస్కరించుచున్నప్పుడు కిరీటసంఘట్టనములతో నేర్పడెడు ధ్వనినే స్తుతిగా నుత్ప్రేక్షించినాఁడు.

**22, 23. శ్లో** : అంగ! ఓ విదురుఁడా! భృతాన్ = భృత్యులైన మమ్ము వేధించుచున్నదని భావము. ఉగ్రసేనునియందు (గృష్ణుని కైంకర్యమును వివరించుచున్నాఁడు. పరమేష్ఠి ధిష్ణ్యే = సార్వభౌమాసనమందు, నిషణ్ణం = ఉగ్రసేనుఁడు గూర్చుండి యుండఁ గా, తిష్ఠన్ = తానును సమీపమునఁ గూర్చున్నవాఁడై, హే దేవ! నిధారయ! = మహారాజా! అవధరింపుము. ఇతిన్యబోధయత్ = ఈ రీతిగా విజ్ఞాపించికొన్నాఁడు, ఇ ట్లుగ్రసేను ననువర్తించుటలోఁ గారణము పరమేశ్వరుని కృపావిశేషమే యని భావము. తన కపకారమొనర్చినవారియందు (గూడ నాతనికున్న దయావిశేషమును సూచించుచున్నాఁడు. అహో! ఇది పరమాశ్చర్యమైనది గదా! జిఘాంసయా = కృష్ణుని సంహరింపవలె నను బుద్ధితో, స్తనకాలకూటం = స్తనములయందు సంభృతమైన కాలకూటము అనఁగా విషము, దాని నామె ద్రావించినది. అందుచేత నా, బకీ = పూతన, అసాధ్వీ = దుష్టురాలు, ఐనను ఆమె, ధాత్ర్యాః = తనకుఁ బాలిచ్చిపెంచిన

యశోదాదేవి కుచితమైన స్థానమును బొందినది. భక్తవేషమాత్రముతో నామెకు సద్గతి ననుగ్రహించినాఁడు. అట్టి భగవంతుఁడు దప్ప శరణుఁబొందుట కర్హమైనవాఁ డెవఁడు?

**24, 25. శ్లో** : భగవంతుఁడు భక్తులనే యనుగ్రహించెనని ప్రసిద్ధి, నిజమే కాని అసురులనుగూడ భాగవతులనుగా నేను భావించుచున్నాను. వారును భాగవతులవలెనే భగవద్ధ్యానాభినివేశముతో నాతనిని బ్రత్యక్షముగాఁ గనుచున్నారు. సంరంభమార్గాభినివిష్టచిత్తాన్-సంరంభ = క్రోధావేశముయొక్క, మార్గ = మార్గముచేత, అభినివిష్ట= ఆక్రమింపఁబడిన, చిత్తం యేషాం తే = చిత్తము గలవారు. తార్క్ష్యపుత్రం = తార్క్ష్యుఁడనఁగాఁ గశ్యపుఁడు. అతనిపుత్రుఁడు గరుడుఁడు. అతని, అంసే = స్కంధభాగమందుఁ గూర్చొని, ఆపతంతం = తమ కభిముఖముగా వచ్చుచున్న, తం అచక్షత్ = భగవంతుని దర్శించిరి. కనుక నిరంతరతీవ్రధ్యానముతో వారియందుఁ గూడ ననుగ్రహము యుక్తమే యని భావము''. తస్మాత్కేనాప్యుపాయేన, మనః కృష్ణే నివేశయేత్'' అని భాగవతమే చెప్పుచున్నది. కృష్ణుని యంతర్ధానప్రకారమును జెప్పుటకై జన్మమొదలుకొని యాతనిచరిత్రను సంక్షేపముగా నుడువుచున్నాఁడు. వసుదేవస్యదేవక్యాం = వసుదేవునిభార్యయైన దేవకియందు, జాతః = జన్మించినవాఁ డయ్యెను. భోజేంద్రుఁ డనఁగాఁ గంసుఁడు. వాఁడు వసుదేవ దేవకులను బంధింపఁగా స్వామి యా బంధనాగారమందే జన్మించెను. ఎందువలన? అస్యాః = ఈ భూమికి, శం = సుఖమును, చికీర్షుః = కలుగఁజేయుట కిచ్ఛించుచున్నవాఁడై, అజేన అభియాచితః = బ్రహ్మదేవునిచేఁ బ్రార్థింపఁబడినవాఁడు. భూభారము నణఁచుట కవతరింపవలెనని బ్రహ్మ స్వామిని యాచించెను. ఆ యాచన ననుసరించి భూభారహరణార్థమై యదుస్వామి జన్మించెను. ఆతని కుచ్చనీచము లొకటే గనుక బంధనాగారమందే పుట్టు వందెను.

**26. శ్లో** : పిత్రా = నిమిత్తభూతుఁడైన తండ్రిచేత, నందవ్రజం = నందవ్రజమును, ఇతః = పొందింపఁబడినవాఁడై, వసుదేవుఁడు నందవ్రజమున కెందుకంపెను? కంసాద్విభిద్యతా = కంసునినుండి భయము నందినవాడై, సబలః తత్రగూఢార్చిః = వ్యక్తముగాని మహిమలు గలవాఁడై, ఏకాదశసమాః, అవసత్ = పదునొకండువత్సరములు వసించెను.

**27. శ్లో** : విభుః = సర్వసమర్థుఁడైనను, పరితః వత్సపైః = గోపాలకులతోఁ గూడినవాఁడై, వత్సాన్ చారయన్ = పశువులను మేపుచున్నవాఁడై, కూజద్విప సంకులితాంఘ్రిపే = నిరంతరమును నదించుచున్న పక్షుల ధ్వనులతో సంకులితములైన వృక్షములుగల, యమునోపవనే = యమునానది నాశ్రయించిన యుపవనములందు, వ్యహరత్ = క్రీడించెను.

28. శ్లో : రుదన్నివ = ఏడ్చుచున్నవానివలె, ఇవశబ్దమును యథాయోగ్యముగా సర్వత్ర అన్వయించికొనవలెను. రుదన్నివ, హసన్నివ = ఏడ్చుచున్నవానివలె, నవ్వుచున్నవానివలె, ముగ్ధః = బాలకుఁడై, బాలసింహావలోకనః = చిఱుప్రాయమందున్న సింహమువంటి చూపులుగలవాఁడై.

29. శ్లో : స ఏవ = ఆ ముగ్ధగోపాలకుఁడే, అధికం వయః ప్రాప్తస్సన్ = వయస్సులో మఱికొంత యెదిగినవాఁడై, లక్ష్మ్యాః = శోభాదిసంపదలకు, నికేతనం = స్థానమైనట్టియు, సితగోవృషం = తెల్లనిగోవులును, ఎద్దులును గలిగినట్టి నానావర్ణమైన గోసంఘమునందు, రణన్ = వేణువును ధ్వనింపఁజేయుచున్నవాఁడై. రణద్వేణుః అని పాఠాంతరము. ధ్వనించుచున్న వేణువుగలవాఁడై అని కృష్ణుని కన్వయము. అరీరమత్ = నందవ్రజవాసులను రమింపఁజేసెను.

30. శ్లో : వ్యనుదత్ = చంపెను. క్రీడనకా నివ = తృణాది నిర్మితములైన మృగములనువలె - ఈ యుపమానముతోఁ జంపుటలోని యతిలాఘవము ధ్వనించుచున్నది.

31. శ్లో : విపన్నాన్ గోపాన్ = విపన్నులైన గోపులను, గావః ద్వితీయకు ప్రథమగాశ్చ = గోవులను, ఉత్థాప్య = లేపి, ఆ తోయమునే, ప్రకృతిస్థితం = నిర్విషముగా నొనర్చి, అపాయయత్ = త్రావించెను.

32. శ్లో : ఇంద్రపూజాభంగము నొనర్చిన భగవంతుఁడు గోవులపూజయే గోసవము. గోపరాజుచేత గోసవమును జేయించెను. విత్తస్యచోరుభారస్య అనుచోటనున్న చ కారముతో నింద్రునకుఁ గూడ మానభంగ మొనర్చి యను నర్థము సిద్ధించుచున్నది. ఉరుభారస్య విత్తస్య = సద్వ్యయం చకీర్షుః = ఎక్కువగా నున్న ధనమునకు సద్వ్యయమును గల్పింపఁ గోరినవాఁడై.

33. శ్లో : కోపాత్ ఇంద్రే వర్షతి సతి = కోపముతో నింద్రుఁడు వర్షించుచుండఁగా, భగ్నమానః, అతివిహ్వలః = ఈ రెండును దేవేంద్రునకే యన్వయించి కొనవలెను. గోత్రలీలాతపత్రేణ = పర్వతమనెడు సితచ్ఛత్రముతో.

34. శ్లో : మృష్టం = ఉజ్జ్వలమైనది. స్త్రీణాంమండలమండనః = మండలం మండయతీతి మండలమండనః = స్త్రీలయొక్క మండలమును శోభింపఁ జేయుచున్నవాఁడు.

## విజయధ్వజము

మూఁడధ్యాయములలో విదురుఁ డడిగిన ప్రశ్న కుత్తరముగా నుద్ధవుఁడు కృష్ణావతారకథను సంక్షేపముగాఁ దెలుపుచున్నాఁడు. ఆ సందర్భములోఁ దొలుత నుద్ధవునకు శ్రీహరియందు భక్తి యెక్కుువైన లక్షణమును శుకాచార్యుఁడు పరీక్షిత్తునకుఁ దెలిపె నని సూతుఁడు శౌనకాదులకుఁ జెప్పుచున్నాఁడు. ఇతి = ఇట్లు, క్షత్త్రా - ప్రియాశ్రయాం = ఆత్మాదిసమస్త వస్తువులకంటెను బ్రియతముఁడైన శ్రీహరికి సంబంధించిన, వార్తాం, పృష్టః, భగవతః, స్మారితేశ్వరస్సన్, ఔత్కంఠ్యాత్, ప్రతివక్తుం చ = బదు లిచ్చుటకును గూడ, న ఉత్సేహే.

2. శ్లో : ఏకాంతభక్తుల కిది యుక్తమే యని చెప్పుచున్నాడు. మాత్రా, ప్రాతరాశాయ, యాచితః, పంచహాయనః, యః, బాలలీలయా, యస్య, సపర్యాం రచయన్, తత్ = ఆ ప్రాతఃకాలభోజనమును, న ఐచ్ఛత్ = ఇచ్చింపలేదో, అట్టి యుద్ధవుఁడు గద్గదకంఠుఁ డగుట యుక్తమే యని భావము.

3. శ్లో : కా లేన, తస్య సేవయా, జరసంగతః సః పృష్టః, భర్తుః, పాదౌ అనుస్మరన్ వార్తాం, ప్రతిబ్రూయాత్ కథం?

4. శ్లో : తీవ్రేణభక్తియోగేన, భృశం = ఎక్కువగా, కృష్ణాంఘ్రి సుధయా = కృష్ణునిపాదములనెడు సుధను (సప్తమ్యర్థమందు తృతీయాప్రయోగము) నిమగ్నస్సన్, సాధు, నిర్వృతః = పరమానందమందిన, సః, ముహూర్తం, తూష్ణీం, అభూత్.

5. శ్లో : ఉద్ధవునిలోని యవస్థను జూచిన విదురున కేమి లోఁచినదని తెలుపుచున్నాఁడు. పులకోద్భిన్నసర్వాంగః = రోమాంచితములైన దేహమునందలి సర్వావయవములుగల, స్నేహప్రసరసంవృతః = భక్తియనెడు నదీప్రవాహమందు స్నానమొనర్చిన, సః మీలద్దృశా = అఱమూసిన కనులతో, అశ్రు ముంచన్, పూర్ణార్థః = జీవితకృతార్థత్వమును బొందినవాఁడుగా, తేన = ఆ విదురునిచేత, లక్షితః = చిహ్నములతోఁ దెలిసికొనఁబడినవాఁడు.

6. శ్లో : అనంతరము, విదురునకే యిష్టార్థసిద్ధి యయినది అని యాశంకించికొని విదురునిప్రశ్న కుత్తర మిచ్చుటయే సిద్ధి యని చెప్పుచున్నాఁడు. భగవల్లోకాత్ = అసంప్రజ్ఞాతసమాధిరూపమైన శ్రీహరిధ్యానావస్థనుండి, శనకైః = మెల్లఁగా, నృలోకం = మనుష్యదేహాభిమానావస్థకు, పునః, ఆగతః, ఉద్ధవః, నేత్రే విమృజ్య, ఉత్స్మయన్ = చిఱునవ్వుచు, విదురం ప్రత్యాహ = విదురునకు ఉత్తరమిచ్చెను. ఆ సిద్ధియు నెట్టిదన్నచో చెప్పుచున్నాఁడు. కృష్ణద్యుమణినిమ్లోచేసతి = కృష్ణుఁడనెడు సూర్యుఁ డస్తమింపఁగా "నిమ్రోచే" - అని శ్రీధరులు

7. శ్లో : గతశ్రీషు = కాంతిహీనులైనట్టి, అజగరేణ = కాలమను నజగరసర్పముచేత, గీర్ణేషు = గ్రస్తులైన, నః = మాసంబంధులైన, యదుషు = యాదవులవిషయమందు, అహం కింను కుశలం బ్రూయాం? = హా! కుశలప్రశ్న ప్రతివచనము - వీని యారంభమే చేయఁదగినది గాదని యర్థము. "బ్రాహ్మణశాపముతో యాదవనాశ మేర్పడె ననుట ప్రసిద్ధమే. "గతశ్రీషు గృహేష్వహం" అని శ్రీధరులు. "గతశ్రీషు యదుష్వహం" అని విజయధ్వజులు.

8. శ్లో : దుష్టజనుల వధను నిమిత్తముగా నొనర్చికొని జ్ఞానోపదేశమునకై యవతరించిన కృష్ణునకు సంబంధించిన జ్ఞానముచేత, నాశమును బొందరాని యాదవులకును. మూఁడులోకములకును శ్రేయస్సు సిద్ధించినట్లేగదా! అని యాశంకించికొని 'జ్ఞానమున్ననేగదా శ్రేయస్సు! ఆ జ్ఞానోదయమే లేదుగదా!' యని పశ్చాత్తాప మందిన యుద్ధవుఁడు ఇట్లనుచున్నాఁడు. అయం లోకః, దుర్భగః, యదవః అపి, నితరాందుర్భగాః బత!, సంవసంతః, యే, మీనాః, ఉడుపం ఇవ, హరిం = దాఁటరాని సంసారసాగరమును దాఁటించువాఁడుగా శ్రీకృష్ణుని, న విదుః = తెలియలేరైరి. అందుచేత నెక్కువ భాగ్యహీనులని తాత్పర్యము.

9. శ్లో : తెలిసికొనక పోవుటయేగాదు. మిథ్యాజ్ఞానులుగూడ నైనారని చెప్పుచున్నాఁడు. ఇంగితజ్ఞాః = జనులచేష్టలచేతనే హృదయములోని భావమును గ్రహించికొనువారును, పురుప్రౌఢాః = దేహాభిమానపూర్ణులైన, ఏకారామాః = కేవలక్రీడాసక్తులైన, సర్వే చ, సాత్వతాః = యాదవులును, సాత్వతాంపతిం = బ్రహ్మాదిసమస్తభక్తులకును, ఋషభం = స్వామియైన శ్రీహరిని, భూతావాసం = ప్రాకృతుఁడైన ముఖ్యమనుష్యునివలె కొంతమందికి మాత్రమే యాశ్రయభూతునిఁగా, అమంసత = తెలిసికొన్నారు. లేక భూతావాసం = ముఖ్యదేవుఁడని ప్రతిపాదితుఁడై ప్రసిద్ధమైన సకలజగత్తునందును నొక్కరీతిగా వ్యాపించియున్న భగవంతుని, సాత్వతాంఋషభం = యాదవులలో శ్రేష్ఠునిఁగా, అమంసత = ఇది యన్యథా జ్ఞానము.

10. శ్లో : ప్రాసంగికముగా జ్ఞానుల లక్షణములను దెలుపుచున్నాఁడు. దేవస్య మాయయా = బంధకశక్తిచేత, స్పృష్టాః = నష్టమైన జ్ఞానముగలవారగుటచే నన్యథాజ్ఞానమునుబొంది యున్న, యే చ, అన్యే, = ఏ భక్తిలేని జనులు, అసదాశ్రయాః = (1) అసజ్జనుల కాశ్రయులో, (2) అశుభములైన విషయముల కాశ్రయులో, తద్వాక్యైః = అట్టి యజ్ఞానులమాటలచేత, హరౌ = సచ్చిదానందస్వరూపుఁడైన, ఆత్మని = సర్వస్వామియైన విష్ణువునందు, ఉప్తాత్మనాం = ఎప్పుడు నిక్షేపింపఁ

బడిన పరిశుద్ధమైన మనస్సుగల జ్ఞానులయొక్క, ధీః = బుద్ధి, న భ్రామ్యతి = భ్రమింపఁజేయఁబడదు. దీనితో సరియైన జ్ఞాను లిట్లే యందురని చెప్పిన ట్లైనది. హరియను పదములోని 'హ' కారము జ్ఞానమును, 'ర' కారము నిరతిశయసుఖమును దెలుపుటచేత సచ్చిదానందరూపుఁడైన విష్ణువని యర్థము.

**11. శ్లో :** జ్ఞానుల జ్ఞానమునకు విషయుఁడైన శ్రీహరియే కృష్ణుఁడని చెప్పుచున్నాఁడు. అతప్తతపసాం = ఈ జన్మయందు తపస్సొనర్పని (అనఁగాఁ బూర్వజన్మమందుఁ దపస్సొనర్చినాఁడని యర్థము). అవితృప్తదృశాం = జ్ఞానవ్యత్యాసములేని, అవితృప్తదృశః అని శ్రీధరులపాఠము, నృణాం = జనులకు, లోకలోచనం = సర్వజనుల కన్నులకును విషయమైన జనరంజకమైన యని భావము. స్వబింబం = తన సచ్చిదానంద స్వరూపమును, దనప్రతిమారూపమును, ప్రదర్శ్య = చూపించి, జ్ఞానులకు సాక్షాద్రూపమును అజ్ఞానులకు ప్రతిమారూపమును జూపించినాఁడని భావము. ఆదాయ = ఆ రూపము నుపసంహరించికొని, యః = ఏకృష్ణుఁడు, అంతఃఅధాత్ = కన్పింపకుండఁ జేయునో అట్టి కృష్ణుని, బంధకశక్తిచేత, అని వెన్కకుఁ జేర్చికొనవలెను. తు = ఇది శ్రుతిప్రసిద్ధము. "ద్వేవావబ్రహ్మణోరూపే" - ఇత్యాదిశ్రుతులలో స్వరూపరూపము, ప్రతిమారూపము అని రెండు రూపములు చెప్పఁబడినవి.

**12. శ్లో :** పై శ్లోకములలో నారూపమునే విశేషముగాఁ జెప్పుచున్నాఁడు. యత్ = ఏ శరీరము, స్వయోగమాయాబలం = తన స్వరూపభూతమైన ఇచ్ఛాసామర్థ్యమును, దర్శయతా = చూపించుచున్న శ్రీకృష్ణునిచేత గృహీతం = గ్రహణ మొనర్పఁబడినదో, యత్ చ = ఇంకను నే దేహము, మర్త్యలీలౌపయికం = మానుషలీలలయైన బాల్యకౌమారాది వ్యత్యాసమును తోపింపఁజేయుటకు యుక్తమైనదో (దీనిచేత స్వయముగా నది యొకటే ప్రకారముగా నుండునది యనియుఁ జెప్పినట్లైనది), స్వస్యచ = కృష్ణుఁడైన తనకును, విస్మాపనం = విస్మయకరమో, సౌభగర్ధేః = పరంపదం, భూషణభూషణాంగం = అట్టి యలంకారములకును అలంకారములైన యవయవములుగలదో, అట్టి తన బింబమునని వెనుక కన్వయము.

**13. శ్లో :** ధర్మసూనోః = రాజసూయేన, దృక్స్వస్త్యయనం = చూచుచున్న జనులకు నేత్రానందమున కాశ్రయమైన యే దేహమును, నిరీక్ష్య, త్రిలోకః, విధాతుః = బ్రహ్మయొక్క, అర్వాక్, శ్రుతౌ = అంత్యసృష్టియందు, కార్త్స్న్యేన = సమస్తమైన, కౌశలం = నైపుణ్యమును, అత్ర = ఈ కృష్ణుని దేహమందు, ఉపగతం = సంపూర్ణముగా నున్నది. ఇతి = అని, అమన్యత = తలఁచెను. బత! = ఇది

యాశ్చర్యము, ఈ భావము సత్యముగాదనియు, మూఁడులోకములకును నున్న యీ యజ్ఞాన మాశ్చర్యకరమనియు సూచించినాఁడు. "ఆనందరూపం దృష్ట్వాऽపి, లోకోభౌతికమేవతు మన్యతేవిష్ణురూపం చ అహో! భ్రాంతిర్బహుస్థితా" అనెడు ప్రమాణము ఈ బహుజనులయందున్న యజ్ఞానము దెల్పుచున్నది. ఈ శ్లోకమందలి 'చ' కారము జ్ఞానులను అజ్ఞానులను జేర్చి చెప్పుచున్నది. జ్ఞానులుదెలిసికొన్న పద్ధతినిగూడ నీ శ్లోకమందే తెలుపుచున్నాఁడు. అప్పుడి ట్లర్థము సేయవలెను. అత్ర = ఈ జీవరాసులలో, త్రిలోకః = వేదత్రయముచేతనే జ్ఞానమును బొందిన, వేదమునే ముఖ్యప్రమాణముగా నుంచికొన్న ధర్మరాజు రాజసూయయాగమందు, ఉపగతం = అందఱికంటె నధికముగానున్న యే కృష్ణుని దేహమునుజూచి, శ్రుతౌ = మనుష్యసృష్టియందుఁ బ్రవర్తించిన, విధాతుః = బ్రహ్మదేవునియొక్క, యత్కార్త్స్న్యేన కౌశలం = ఏ మంగళవిషయకమైన నిర్మాణ నిపుణత గలదో, తత్ = అది, అర్వాక్ = బలహీనమైనది, ఇతి, అమన్యత, కృష్ణునిసౌందర్యము కృతకము కాదుగదా! అందుచేతను ఆ సౌందర్య మనంత మగుటచేతను జ్ఞానుల జ్ఞానమందును, అజ్ఞానుల యజ్ఞానమందును ఆశ్చర్యమే యున్నదని తెలుపుచున్నాఁడు. నిరవధికసుందరుఁడైన పరమాత్మను జ్ఞానులైనను సాకల్యముగాఁ దెలియలేరుగదా!

**14. శ్లో** : యస్య = ఏ కృష్ణుని యొక్క, అనురాగ....మానాః = ప్రీతితోఁగూడిన చిఱునవ్వు, రాసక్రీడామయమైన లీలామయ కటాక్షము, వీనిచే నహంకృతినందిన, వ్రజస్త్రియః, దృగ్భిః =శ్రీకృష్ణుని గన్నులతోనే అనుప్రవృత్తధియః = అనుసరించి వెడలిపోయిన మనస్సుగలవారై, కృత్యశేషాః, అవతస్థుః, కిల! హాస-రాస అనుటకు హాస్యముతోఁగూడిన అనియైన నర్థము చెప్పికొనవచ్చును.

**15. శ్లో** : అవతారప్రయోజనమును జెప్పుచున్నాఁడు. స్వశాంతరూపేషు = తన సాత్త్వికప్రతిబింబభూతులైన దేవతలు మొదలైనవారు, ఇతరైః రూపైః = రాజసతామసప్రకృతులైన యసురులచేత, అభ్యర్ద్యమానేషు సత్సు = బాధింపఁ బడినవా రగుచుండఁగా, అనుకంపితాత్మా = ఆ సాత్త్వికజీవులపైఁ గరుణ వహించి, మహదంశయుక్తః = ముఖ్యప్రతిబింబరూపమైన బ్రహ్మదేవునిప్రార్థనచేత నవతారమును స్వీకరించిన, పరావరేశః భగవాన్, అజోऽపి = జన్మలేనివాఁడైనను (దారుణః) అగ్నిర్యథా = చెట్టునుండి అగ్ని వ్యక్తమగునట్లు, జాతః = వ్యక్తుఁడైనాఁడు. దీనిచేత, జనిప్రాదుర్భావే - అని ధాత్వర్థము వివరింపఁబడిన ట్లైనది.

16. శ్లో : "బ్రహ్మాదులజ్ఞానమే అప్పు డప్పుడు సంచలితమౌచున్నప్పుడు మాజ్ఞాన మేపాటిది?" అను నభిప్రాయముతోఁ జెప్పుచున్నాఁడు. అజస్య = వసుదేవగేహే = వసుదేవునిభార్యయైన దేవకియందు, యజ్జన్మవిడంబనం = పుట్టినవానివలె నొనర్చిన యనుకరణమును, అరిభయాదివ = శత్రువైన కంసునినుండి భయపడి యో యన్నట్లు, వ్రజేవాసశ్చ = గోకులమున నివసించుటయు, అనంతవీర్యః = గొప్పపరాక్రమముగలవాఁడు, అరిభయాదివ = జరానంధాదుల నుండి భయముచేతవలె, స్వయం = తాను, పురాత్ = మధురనుండి, యద్వ్యాత్సీత్ = ద్వారకకు ప్రయాణమై పోయెననుట యేదికలదో, అదియును, మాం ఖేదయతి = నన్నుబాధ పఱచుచున్నది. "అనంతవీర్యః" అనుటచేత గోకులవాసమును, ద్వారకావాసమును జనుల ననుకరించుటయేగాని వేఱుగాదని చెప్పినట్లైనది.

17. శ్లో : తాత! అంబ! కంసాత్, ఉరుకంపితానాం, అకృతనిష్కృతీనాం = కంసుఁ డొనర్చిన యపకారములకు బదులుసేయనేరని, నః = మావిషయమందు, ప్రసీదతాం = ప్రసన్ను లగుదురుగాక!, ఇతి, పిత్రోః = తల్లిదండ్రులయొక్క, పాదౌ = పాదములను, అభివంద్య = నమస్కరించి, యత్ఆహ = ఏది చెప్పెనో, ఏతత్ = కంసవధానంతర మొనర్చిన యీపని, స్మరతః = స్మరించుచున్న, మమ, చేతః, ధునోతి.

18. శ్లో : యః, కృతాంతేన = యమునితో సమానమైన, విస్ఫురత్ = చలించుచున్న, భ్రూవిటపేన = భ్రుకుటి యొక్క స్వల్పభాగము చేతనే, భూమేః, భారం, తిరశ్చకార, అముష్య అంఘ్రిసరోజరేణుం = విజిఘ్రన్ కః, పుమాన్ వా = ఏ చేతనుఁడు, విస్మర్తుం ఈశేత.

19. శ్లో : రసజ్ఞుఁడైనమనుష్యుఁడు శ్రీహరివిరహమును దాళలేఁడని చెప్పుచున్నాఁ డు. యోగినః = ఉపక్రమము మొదలైన తాత్పర్యలింగములను, యుక్తులచేత వేదార్థములను దెలిసికొననమర్థులైన జ్ఞానులు సమ్యక్‌యోగేన = దోషరహితమైనభక్తితో యాం = ఏ, సిద్ధిం = శ్రీహరిని జేరుటయను ప్రయోజనమునే, సంస్పృహయంతి = ఆశపడుదురో, సాసిద్ధిః = ఆకృష్ణ ప్రవేశరూపమైనసిద్ధి, రాజసూయే, కృష్ణం, ద్విషతఃఅపి, అసురావేశముతో ద్వేషించుచున్న, చైద్యస్య = శిశుపాలుఁడుగాఁబుట్టిన జయుఁడనెడు భక్తున కేర్పడిన, భవద్భిశ్చ = మీచేతఁగూడ, దృష్టానను = చూడఁబడినదిగా, తద్విరహం = దైత్యావేశముతో ద్వేషించినను భక్తులనాదైత్యులనుండి వేఱుచేసి, దైత్యులకు తమస్సును, భక్తులకు మోక్షమును

నొసఁగి యుద్ధరించెడు దయామయుఁడైన శ్రీహరియొక్క వేర్పాటును, కః = ఏభక్తుఁడు, సహేత = సహించును, అపి శబ్దముచేతఁ గృష్ణద్వేషము నిందిత మనియు, హేయమనియు జెప్పినాఁడు, భక్తిచేతమాత్రమే లభించునట్టి శ్రీకృష్ణప్రవేశము - నిందితమైనవేషముతో నెట్లేర్పడినది? ఈ ప్రశ్నను 'నను' అనుటచేతఁ బరిహరించినాఁడు. ప్రమాణమునకుఁ దగినట్లుగా నంగీకరింపవలెనని యర్థము.

"అసురా అపి యే విష్ణుం శంఖచక్రధరం రణే,
భక్తిపూర్వ మవేక్షంతే జ్ఞేయా భాగవతా ఇతి".
"విద్విషంతి తు యే విష్ణుం ఋషిపుత్రా అపి స్ఫుటమ్,
అసురాస్తేఽ పి విజ్ఞేయాః గచ్ఛంతి చ సదా తమః"

అనెడు ప్రమాణము ద్వేషముతో మోక్షమేర్పడినదని చెప్పుచున్నది. అందుకే "సమ్యగ్యోగేన" అను మాటతో సిద్ధికి సాధనమును దోఁపఁజేసినాఁడు "సర్వథా భక్తితో ముక్తిః ద్వేషాత్తమ ఉదీరితం" - అనెడు ప్రమాణముగూడ నీ విషయమునే తెలుపుచున్నది. అందుచేతఁ గృష్ణుని ద్వేషించువారలకు మోక్షము చెప్పఁబడిన స్థలములందు జీవద్వయావేశమని తెలియవలెను. "జీవద్వయసమా యోగాత్, హిరణ్యకముఖాఃపరే" - ఇత్యాది ప్రమాణము లున్నవి.

**20. శ్లో** : శిశుపాలునివలెనే యితరులుగూడఁ దమకు యోగ్యమైనగతినిఁ బొందిరని చెప్పుచున్నాఁడు. యే = దుర్యోధనపక్షపాతులైన అన్యేనరలోకవీరాః = కర్ణాదులైన యితర మహాపరాక్రములు, ఆహవే నయనాభిరామం = కన్నులకానందమును గల్గించెడు, కృష్ణముఖారవిందం = కృష్ణుని ముఖకమలమును, నేత్రైః పిబంతః, పార్థాస్త్రపూతాః = అర్జునుని పాశుపతము మొదలైన యస్త్రములచేత తలలు గత్తరింపఁబడినవారై (పుంభేదనే అనెడు ధాత్వర్థము ననుసరించియీ యర్థము. "పూఙ్పవనే-" అనెడు ధాత్వనుసారమైనచో ద్వేషమును విడచి భక్తితోఁ బరిశుద్ధులై యని యర్థము) మరణించిరో (తేఅపి) వారుగూడ, తథైవ = ఆ శిశుపాలునివలెనే, అస్య = శ్రీహరియనుగ్రహముతో తదధీనమ్మైనట్టి, పదం = తమకు యోగ్యమైనస్థానమును, ఆపుః చ = తమస్థానమును బొందిన తర్వాత మోక్షముగూడ నందిరి.

**21. శ్లో** : ఇంతటి మహిమోపేతుఁడైన వైకుంఠుఁడు మత్స్యాద్యవతారములు ధరించుటకుఁ గారణము భక్తులయందలి దయయే దప్ప వేఱుప్రయోజనము లేదని యర్థము. స్వయం తు = తాను, అసామ్యాతిశయః = తనకు సమానుఁడును,

అధికుఁడును లేనివాఁడు. "ఏకమేవాద్వితీయం" - అనెడు స్మృతియును నీ యర్థమునే తెలుపుచున్నది. త్ర్యధీశః = ముల్లోకములకును నియామకుఁడు. స్వారాజ్యలక్ష్మ్యా = స్వరూపానుభవ మనెడు సంపత్తితో, ఆప్త సమస్తకామః = పొందఁబడిన సమస్తకామములు గలవాఁడు-పరిపూర్ణకాముఁడని యర్థము, "స్వే మహిమ్ని ప్రతిష్ఠితః" - అను శ్రుతిగూడ నీ యర్థమునే తెలుపుచున్నది, బలిం = పూజను, హరద్భిః = చేయునట్టి, సురలోకపాలైః = లోకపాలకు లనిపించికొన్న దేవతలచేత, కిరీట కోట్యా = వారికిరీటముల కొనలచేత, ఈడితపాదపీఠః = స్తుతింపఁబడిన పాదపీఠముగలవాఁడు.

22. శ్లో : అతనికార్యములు జ్ఞానులైనమాకును మోహమును గల్గించుచున్నవి. అదిగూడ నాతని మహిమాతిశయమునే తెలుపును అనెడు నభిప్రాయముతో వచించుచున్నాఁడు. అంగ = ఓ విదురుఁడా!. తిష్ఠన్ = తానునిలిచికొన్నవాఁడై, పరమేష్ఠిధిష్ణ్యే = సింహాసనమందు, నిషణ్ణం = కూర్చొనియున్న, ఉగ్రసేనం = ఉగ్రసేనునిగూర్చి, దేవ! నిధారయ! ఇతి, న్యబోధయత్, ఇతి యత్ = ఏమని విజ్ఞాపించికొనెనో, అది, తస్య = ఆ కృష్ణునియొక్క, కైంకర్యం = దాసభావమును, అలం = మాయోగ్యతకుఁ దగినట్లుగా, భృతాన్ = పొందియున్న, నః = మమ్ము, విగ్లాపయతి = మాహాత్మ్య విషయమందు అజ్ఞానరూపమైనగ్లాని నేర్పఱచుచున్నది.

23. శ్లో : ఇంతకుముందుఁ దాత్పర్యముతోఁ జెప్పిన శ్రీహరి దయాళుత్వమును ఇప్పుడు వశ్యముగనే చెప్పుచున్నాఁడు. అసాధ్వీం = పతివ్రతగాని, ఇయం = ఈ, బకీం = భక్షణస్వభావముగల పూతనను, జిఘాంసయా స్తనకాలకూటం, అపాయయత్, ధాత్ర్యుచితాం = శుభకరులైనవారి యొక్క యోగ్యతానురూపమైన, గతిం = సద్గతిని, లేభే = పొందెను, అపి = తాటకకు నీ యోగ్యత లేకపోవుటచేత నిందింపఁ దగినది. తతః = పూతనయందున్న ఊర్వశీవిషయమందు దయను గన్పింపఁజేసిన శ్రీహరికంటెను, అన్యం = వేఱైన, దయాళుం = దయావంతుఁడైన, కంవా = ఎవనిని, శరణం వ్రజేమ:

కంసపూతనికాద్యాశ్చ బాంధవాదియుతా యతః,

జీవద్వయ సమాయోగాత్ గతిద్వయ జిగీషవః.

కంసుఁడు పూతనమొదలైనవారియందు, దైత్యులు దానవులను ద్వివిధ జీవులుండుటచేత రెండు విధములైన గతిని బొందుట కపేక్షగలవారై యుండిరి అనెడు ప్రమాణము పూతనకు సద్గతి యేర్పడిన దని తెల్పుచున్నది.

**తాత్పర్యము** : శిశువులను సంహరించి జీవించుచున్న పూతన శ్రీకృష్ణుని వధింప నేతెంచినది. ఆమె విషపూరితమైన స్తన్యమును గుడిపెను. కాని భగవంతుఁ డామె యం దావిష్టురాలైన యూర్వశియందు దయగలిగి యామెకు సద్గతి నొసఁగినాఁడు. అసురయోనియందు జన్మించినంత మాత్రమున భగవద్భక్తులకు కుందు లేదు. ద్వేషబుద్ధితో నారంభమైన హరిస్మరణ భక్తియందుఁ బరిణతమై వారిని భగవద్భక్తులుగనే యుంచును. అందుచేతనే శ్రీహరి చక్రధరుఁడై గరుడవాహనుడై వీరికిఁ గన్పించి తన జ్ఞానము నొసఁగును.

**24. శ్లో** : అసురజాతియందుఁ బుట్టుట భగవద్భక్తుఁ డనుటకు ఁగారణముగాదు. ద్వేషరహితమైన భక్తియే కారణమని చెప్పుచున్నాఁడు. యే = ఏయసురులు, సంయుగే అపతంతం సునాభాయుధం, తార్క్ష్యపుత్రస్య అంసే, అచక్షత = వీక్షించిరో, తాన్ = అట్టివారిని. త్ర్యధీశే = త్రిలోకాధిపతియైన శ్రీహరియందు, సంరంభమార్గాభినివిష్టచిత్తాన్ = మొదలు భేదబుద్ధితో స్మరించుచున్నను అనంతరము ద్వేషమును వదలి భక్తిచేతనే వానియందాసక్తమైన మనస్సుగల, అసురాన్ = అసురజాతిలో జన్మించిన దేవతలతోఁ గూడిన, భాగవతాన్ = భగవద్భక్తులనుగా, మన్యే = తలఁతును. తుమ్మెద పురుగును దెచ్చి గోడలోఁ బెట్టినపు డా పురుగు మొదలాభ్రమరమును ద్వేషించుచున్నను తరువాత నాహార మిచ్చుటతో దానియందు స్నేహముగలదై దానినే స్మరించుచు తత్సమానమైన రూపమును బొందునట్లుగా అసురయోనులలోఁ బుట్టిన సాత్త్వికజీవులు ద్వేషబుద్ధిని వదలి శ్రీహరిని స్మరించి భక్తియుక్తులై మోక్షము నందెదరు. వారు భగవద్భక్తు లని తెలుపుటకే యుద్ధరంగమందు శ్రీహరి గరుడవాహనుఁడై గన్పించెనని చెప్పఁబడినది. "అసురా అపి యే విష్ణుం శంఖచక్రధరం రణే" - ఇత్యాది ప్రమాణము లీ విషయమునే సమర్థించుచున్నవి.

**25. శ్లో** : ఇఁక త్వరలోనే కృష్ణపరమాత్మ యాదవులు తమతమ లోకములకుఁ బోదురని తెలుపుచు భక్త్యుద్రేకముతో శ్రీకృష్ణుని లీలలను క్రమముగాఁ దెలుపువాఁడై యుద్ధవుఁడు మొద లాతని యవతారమును జెప్పుచున్నాఁడు. భగవాన్ = భోజేంద్రబంధనే సతి = కంసునివలన దేవకీవసుదేవులకు కారాగృహప్రాప్తి సంభవింపఁగా, శర్మ = వారికి కారావాసమును దప్పించి కంసుని సంహరించి సుఖమును, చికీర్షుః = కల్గింప నిచ్ఛించినవాఁడై, అబ్జజేన = బ్రహ్మచేత, అభియాచితః = భూభారహరణమునకై జన్మింపవలెనని ప్రార్థింపఁబడినవాఁడై, వసుదేవస్య =

వసుదేవునినుండి, దేవక్యాం = దేవకీ దేవియందు, జాతః = వ్యక్తుఁ డయ్యెను. ఇట్లన్వయించుటచేత, నవతారమునకు రెండునిమిత్తములని చెప్పిన ట్లైనది.

26. శ్లో : కంసాద్విభిద్యతా పిత్రా, తతః = మధురాపట్టణమునుండి నందవ్రజం ఇతః. తత్ర, గూఢార్చిః, సబలః, ఏకాదశసమాః, అవసత్.

27. శ్లో : హరిః కూజద్ద్విజ సంకులితాంఘ్రిపే, యమునోపవనే, వత్సపైః = మందలను గాచికొనెడు గోపకులచేత, పరీతః, వత్సాన్, చారయన్, వ్యచరత్.

28. శ్లో : వ్రజౌకసాం, ప్రేక్షణీయాః, కౌమారాః చేష్టాః దర్శయన్ : రుదన్నివ, హసన్ = నవ్వుచు, ముగ్ధబాలసింహావలోకనః వ్యచరత్. "కౌమారాః" - అని - ఆకారాంతముగాఁ జెప్పుటతో నితనిచేష్టలు లోకవిలక్షణము లని చెప్పినట్లైనది. "కౌమారీం దర్శయన్ చేష్టాం" అని శ్రీధరులు.

29. శ్లో : స ఏవ, లక్ష్మ్యాః, నికేతం, సితగోవృషం = ముకుత్రాడుగట్టిన ముక్కులు, పలుపులచేఁ గూడిన గోకులం, అధితిష్ఠన్, చారయన్ = పశువులను ద్రిప్పికొనుచు, రణద్వేణుః, అనుగాన్, గోపాన్, అరీరమత్.

30. శ్లో : భోజరాజేన, ప్రయుక్తాన్, కామరూపిణః, మాయినః = మోసపుచ్చుటకై వేషాంతరముతో వచ్చిన, తాన్ తాన్ = ఆయాదైత్యులను, బాలః, క్రీడనకాన్ ఇవ = ఆటవస్తువులను జెఱిచినట్లుగా, లీలయా వ్యనుదత్.

31. శ్లో : భుజగాధిపం = కాళియుని, నిగృహ్యా = నిగ్రహించి, ఉత్థాప్య = యముననుండి పారద్రోలి, ప్రకృతిస్థితం = విషమిశ్రిత మగుటకు ముందున్నట్లుగా శుద్ధమైన, తత్తోయం, విషపానేన = విషయుక్తజలమును ద్రావుటచేత, విపన్నాన్ =మృతములైనట్లున్న, గావః = గోవులను, అపాయయత్.

32. శ్లో : విభుః, ఉరుభారస్య = బహుసం ఖ్యాకమైన, విత్తస్య, సద్వ్యయం, చికీర్షన్, గోపరాజం, ద్విజోత్తమైః, గోసవేన, అయాజయత్.

33. శ్లో : భద్ర!, భగ్నమానే = అభిమానము నష్టమైనట్టియు, దానిచే, అతివిహ్వాలే, కర్తవ్యము దోఁచక, వ్యాకులితుఁడైన, ఇంద్రే = ఇంద్రుఁడు, కోపాత్‌వర్షతిసతి, అనుగృహ్ణాతా = గోకులనివాసుల ననుగ్రహింపవలెనను మనస్సుగల కృష్ణునిచేత, వ్రజః = గోకులము, గోత్రలీలాతపత్రేణ, గోవర్ధనమనెడు పర్వతమునే అనాయాసముగా, గొడుగుగాఁ బట్టుటతో, త్రాతః = అతివృష్టి నుండి రక్షింపఁ బడినది.

34. శ్లో : శరచ్చశికరైః, మృష్టం = అలంకృతమైన, రజనీముఖం, మానయన్, కలపదంగాయన్, స్త్రీణాం మండలమండనః రేమే.

**ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే, అష్టాదశసహస్రికాయాం, సంహితాయాం, వైయాసిక్యాం, శ్రీహయగ్రీవబ్రహ్మవిద్యా యాం, తృతీయస్కంధే, ద్వితీయో-ధ్యాయః.**

## శ్రీ పోతన్నగారు

వ. అట్టి యెడ న య్యుద్ధవుండు 76

క. యదుకులనిధి యగు కృష్ణుని
పద జలజ వియోగ తాప భరమున మాటల్
ప్రిదులక హృదయం బెరియఁగఁ
బెదవులు దడుపుచును వగలఁ బెంపఱియుండెన్. 77

క. అని చెప్పి బాదరాయణి
మనుజేంద్రుని వలను సూచి మఱి యిట్లనియెన్
విను మొకనాఁ డీ యుద్ధవుఁ
డనయము నై దేండ్ల బాలుఁడై యున్న తఱిన్. 78

వ. మున్ను కృష్ణునిం గూడి యాడు బాలకులలో నొక్కబాలునిఁ గృష్ణునిఁగా భావించి పరిచర్య సేయుచుండ గుణవతీ మతల్లి యగు తల్లి సనుదెంచి "యాఁకొంటి; విదియేల రావన్న" యని పిలిచిన జననీవాక్యంబులు గైకొనక యఖండతేజోనిధియైన పుండరీకాక్షు పాదారవింద మకరంద సేవానురక్తిం జేసి యున్న యుద్ధవుండు నేఁడు కృష్ణవియోగతాపంబున హరివార్త విదురునకుఁ జెప్పఁజాలక యొప్పఱి యుండుట యేమి చిత్రంబని వెండియు నిట్లనియె. నంత నుద్ధవుండు సరోజాక్ష పాదారవింద మకరంద సుధా జలనిధి నిమగ్న మానసుండై సముత్కంఠం జింతించి యొక్క ముహూర్తమాత్రంబునకు బాష్పజల పూరితలోచనుండై గద్గదకంఠుం డగుచు. 79

క. ఘనముగ నెమ్మనమున మిం
చిన కృష్ణవియోగ జనిత శిఖి దరికొనఁగాఁ
గనుఁగవఁ బెడచే నొత్తుచుఁ
బెనుపొందిన దురిత శిఖరిభిదురున్ విదురున్. 80

వ. కనుంగొని యిట్లనియె. 81

క. యముఁడను ఘనకాలభుజం
గమ పుంగవుఁ డెగచి పట్టఁగా యదువంశో
త్తముల చరిత్రలుఁ దత్కుశ
లము లే మని చెప్పుదుం గలంగెడి మనమున్. 82

సీ. మునిజన ముఖపద్మములు ముకుళింపంగ
ఖలజన లోచనోత్పలము లలర
జార చోరుల కోర్కి సఫలత నొందంగ
దానవదర్పాంధ తమస మడర
వర యోగి జన చక్రవాకంబు లడలంగఁ
గలుషజనానురాగంబు పర్వ
భూరి దోషానల స్ఫూర్తి వాటిల్లంగ
నుదిత ధర్మ క్రియ లుడిగి యణఁగ
తే. మానుషాకార రుచికోటి మందపఱిచి
యనఘ! యే మన నేర్తుఁ గృష్ణాభిధాన
లోకబాంధవుఁ డుత్తమ శ్లోకమూర్తి
మించు తేజంబుతో నస్తమించె నయ్య! 83

వ. మఱియును. 84

క. హల కులిశ జలజరేఖా
లలిత శ్రీకృష్ణ పాదలక్షితయై ని
ర్మలగతి నొప్పెడు ధరణీ
లలనామణి నేఁ డభాగ్యలక్షణ యయ్యెన్. 85

క. యాదవుల వలన రాజ్య
శ్రీ దొలఁగెను: ధర్మగతి నశించెను; భువి మ
ర్యాదలు దప్పె నధర్మో
త్పాదనమున దై త్యభేది దప్పినపిదపన్. 86

వ. మఱియు లలిత నికషణ విరాజమాన మణిగణ కిరణసుషమా విశేష విడంబిత విమల సలిలంబులందుఁ బ్రతిఫలిత సంపూర్ణ చంద్రమండల రుచి నిరీక్షించి జలచర బుద్ధిం జేసి తజ్జల విలోలమీనంబు లనూన స్నేహంబునం దలంచు చందంబునఁ గృష్ణానుచరులైన యదు వృష్ణికుమారు లమ్మహనీయ మూర్తిం దమకు నగ్రేసరుం డని కాని లీలామానుష విగ్రహుండైన పరమాత్ముండని యెఱుంగక హరిమాయా జనితంబగు నసద్భావంబునం జేసి భోజన శయనాసనానుగమనంబులం జేరి సహోదరాది భావంబులం గూడి చరియింతు; ర ద్దేవుని మాయాపయోనిధి నిమగ్నులు గాకుండ నబ్జభవాదులకైనం దీఱదు. సర్వగుణగరిష్ఠులును, సత్పురుష శ్రేష్ఠులును నగు పరమభాగవతులకుం దక్కఁ దక్కినవారలకుం జెప్పనేల? అదియునుంగాక యభిజన విద్యాధన బలగర్వమదాంధీ భూత చేతస్కులై న శిశుపాలాది భూపాలకు లమ్మహాత్మునిం బరతత్త్వంబని యెఱుంగక నిందించు దుర్భాషలు దలఁచి మనస్తాపంబు నొందుచుండుదు నని వెండియు. 87

మ. అవితృప్తేక్షణధీ సమాహిత తపోవ్యాసంగు లై నట్టి భా
గవత శ్రేష్ఠుల కాత్మమూర్తి నిఖిలై క జ్యోతియైఁ జూపి శో
కవిశోకంబులు నిర్దహించి కమలాకాంతుండు శాంతుండు మా
నవరూపంబగుదేహమున్ వదలి యంతర్ధానుఁడయ్యెంజుమీ. 88

సి. మర్త్యవికాసైక మానమై తనకును
విస్మయ జనకమై వెలయునట్టి
యాత్మీయ యోగమాయాశక్తిఁ జేపట్టి
చూపుచు నత్యంత సుభగుఁ డగుచు
భూషణంబులకును భూషణంబై వివే
కముల కెల్లను బరాకాష్ఠ యగుచు
సకల కల్యాణ సంస్థానమై సత్యమై
తేజరిల్లెడునట్టి దివ్యమూర్తి

తే. తాన తనమూ ర్తి నిజశక్తిఁ దగ ధరింప
యమతమాభవు రాజసూయాధ్వరంబు
నందు నెవ్వని శుభమూర్తి నర్థితోడ
నిండు వేడుకఁజూచి వర్ణించి రెలమి. 89

క. ప్రకటముగఁ గమలభవ సృ
ష్టికిఁ గారణ మి మ్మహాత్ముఁడే యనుచును ను
త్సుకులై తన్మూర్తినిఁ ద
ప్పకచూచిరి గాదె తత్సభాజను లెల్లన్. 90

వ. మఱియు శాంతోగ్రరూపధరుండైన సర్వేశ్వరుండు శాంత రూపుండు గావునఁ బరకృతాపరాధి నిపీడ్యమాన మానసుండయ్యు ననుకంపాయత్త చిత్తుండై వర్తించు వరావరుండును, ప్రకృతికార్యం బైన మహత్తత్త్వరూపుండును, జననవిరహితుండయ్యును దారువులవలన ననలంబు దోఁచు చందంబున జననంబు నొందుచుండు; వట్టి సరోజనాభుని హాసరాస లీలానురాగ విలోకన ప్రతిలబ్ధమాన లైన గోప కామినులు తన్మూర్తిదర్శనానుషక్త మనీషలం గలిగి వర్తించి రదియునుంగాక. 91

చ. దివిజుల కోర్కిఁదీర్ప వసుదేవుని యింట జనించి కంస దా
నవుఁడు వధించునన్ భయమునంజని నందునియింటనుంటకున్
యవన జరా సుతాదులకు నాజి నెదుర్పడలేక సజ్జన
స్తవ మధురాపురిన్ విడిచి దాఁగుటకున్ మదిఁజింతనొందుదున్. 92

వ. అదియునుంగాక. 93

సీ. కడఁగి పెక్కిడుమలఁ గుడుచుచుఁ జి త్తముల్
గలఁగఁగ బంధనాగారములను
వనరిన దేవకీవసుదేవులను డాయఁ
జనుదెంచి భక్తి వందన మొనర్చి
తలిదండ్రులార! యేఁ గలుగంగ మీరలు
కంసుని నలజడి గ్రాఁగుచుండఁ
గడఁగి శత్రునిఁ జంపఁగా లేక చూచుచు
నున్న నా తప్పుఁ బ్రసన్ను లగుచుఁ

తే. గావుఁడని యానతిచ్చిన దేవదేవు
నద్భుతావహ మధుర వాక్యములఁ దలఁచి
తలఁచి నా చిత్తమునఁ బెద్ద గలఁగుచుందుఁ
బృథులపాతక భూమిభృద్భిదుర! విదుర! 94

క. విమలమతిఁ దలఁప నెవ్వని
బొమముడి మాత్రమున నిఖిల భూదేవీ భా
రము వాయు నట్టి హరిపద
కమల మరందంబు గ్రోలు ఘనుఁ డెవ్వాఁడో? 95

క. మందప్రజ్ఞుఁడనై గో
విందుని మురదైత్యహరునిఁ విష్ణునిఁ బరమా
నందుని నందతనూజుని
మందరధరుఁ జిత్తమందు మఱతునె యెందున్? 96

చ. అదియునుగాక మీరు నృపు లందఱుఁ జూడఁగ ధర్మసూతి పెం
పొదవిన రాజసూయసవనోత్సవ మందును జన్మమాదిగాఁ
బదపడి యెగ్గొనర్చు శిశుపాలుఁడు యోగిజనంబు లిట్టి ద
ట్టి దని యెఱుంగ నోపని కడిందిపదంబును బొందెనే కదా! 97

చ. కురునృప పాండు నందను లకుంఠితకేళిఁ జమూ సమేతు లై
యరిగి రణోర్వి నెవ్వని ముఖాంబురుహామృత మాత్మలోచనో
త్కరములఁ గ్రోలి పార్థు విశిఖప్రకర క్షత పూతగాత్రు లై
గురుతరమోక్షధామమునకుం జని సౌఖ్యమునొందిరో గదా! 98

సి. అట్టి సరోజాక్షుఁ డాద్యంత శూన్యుండు
సుభగుండు త్రైలోక్య సుందరుండు
కమనీయ సాగర కన్యకా కుచ కుంకు
మాంకిత విపుల బాహాంతరుండు
సకల దిక్పాల భాస్వత్కిరీటన్యస్త
పద్మరాగారుణ పాదపీఠుఁ
డజుఁ డనంతుఁడు సమానాధిక విరహితుం
డిద్ధమూర్తిత్రయాధీశ్వరుండు

తే. నైన హరి యుగ్రసేనుని నఖిలరాజ్య
రుచిర సింహాసనమునఁ గూర్చుండఁబెట్టి
భృత్యభావంబు నొంది సంప్రీతి నతని
పనుపుసేయుట కెపుడు నా మనము గుందు. 99

వ. అని వెండియు నిట్లనియె; ననఘా! పరాత్పరుండును యోగీశ్వరేశ్వరుండునునగు కృష్ణుండు భగద్భక్తుండును బరమభాగవతోత్తముండును నైన యుగ్రసేనుని సేవించుట యాశ్చర్యంబు కాదు. తన్ను హరియింపం దలంచి కుచంబుల విషంబు ధరియించి స్తన్యపానంబు సేయించిన దుష్టచేతన యైన పూతనకుం జన్నిచ్చి పెంచిన యశోదాదేవికి నైన నందరాని నిజపదంబు గారుణ్యాయత్తచిత్తుండై యొసంగె ననిన నిజపదధ్యానపరాయణులగు వారల ననుసరించి సేవించుట చెప్పనేల? అనిన నుద్ధవునికి విదురుం డిట్లనియె, భక్తవత్సలుండును, గారుణ్యజలనిధియునై భాగవతజనుల ననుగ్రహించు పుండరీకాక్షుండు నిజదాసలోకంబున కొసంగు పరమపదంబు లుగ్రకర్ములైన రాక్షసుల కెట్లొసంగె న త్తెఱం గెఱింగింపు మనిన విదురునకు నుద్ధవుం డిట్లనియె. 100

మ. దనుజానీక మనేక వారములు దోర్దర్పంబు సంధిల్లఁగా
వినతాసూను భుజావరోహుఁడగు నవ్విష్ణున్ సునాభాస్త్రుఁ దా
రనిలో మార్కొని పోకు పోకు హరి దైత్యారాతి యంచుం దదా
ననముం జూచుచుఁ గూలి మోక్షపదమున్ బ్రాపింతు రత్యున్నతిన్. 101

క. ధీరజనోత్తమ! నవసిత
సారసనేత్రుఁడగు కృష్ణు జననంబును ద
చ్చారిత్రము నెఱిఁగింతు ను
దారత నీ విపుడు వినుము తద్విధ మెల్లన్. 102

చ. ధరణిభరంబు వాపుటకు, దామరసాసను ప్రార్థనన్ రమా
వరుఁ డల కంసబంధన నివాసమునన్ వసుదేవదేవకీ
వరులకు నుద్భవింప బలవంతుఁడు గంసుఁడు హింససేయున
న్వెఱపున నర్ధరాత్రి సుతునింగొని య వ్వసుదేవుఁ డిమ్ములన్. 103

క. నందుని మందకుఁ జని త
త్సుందరి తల్పమునఁ బరులు సూడకయుండన్
నందనుని నునిచి యానక
దుందుభి మఱలంగ నేఁగెఁ దొల్లిటి పురికిన్. 104

క. హరి యేకాదశ సంవ
త్సరములు నందవ్రజమునఁ దను హరి యని యె
వ్వరు నెఱుఁగకుండ నా హల
ధరుతోఁ గ్రీడించుచుండెఁ దద్దయుఁ బ్రీతిన్. 105

క. గోపాలవరుల కైనను
నాపోవఁగఁ దన సముచితాకార మొగిన్
జూపని శ్రీపతివేడుక
గోపాలురఁగూడి కాచె గోవత్సములన్. 106

వ. అయ్యవసరంబునం గృష్ణుండు లీలావినోదంబులు
తోడిగోపాల బాలురకుం జూపం దలంచి. 107

చ. వరయమునానదీసలిల వర్ధిత సౌరభయుక్త పుష్ప మే
దుర మకరందపాన పరితోషిత భృంగ సురంగ మాధవీ
కురవక కుంద చందన నికుంజములందు మయూర శారికా
పరభృత రాజకీర మృదుభాషలభంగిఁ జెలంగి పల్కుచున్. 108

ఉ. శ్రీరమణీ మనోవిభుఁడు సింహ కిశోరముఁ బోలి లీలఁ గౌ
మారదశన్ రమావిమలమందిరముం బురుడించు గోతతిన్
వారక మేపుచుం దరళవంశరవస్ఫుట మాధురీ సుధా
సారముచేత గోపజనసంఘములన్ ముదమందఁ జేయుచున్. 109

వ. మఱియును. 110

మ. చిరకేళీరతి బాలకుల్ తృణములన్ సింహాది రూపంబులం
గరమొప్పన్ విరచించి వాని మఱలన్ ఖండించుచందంబునన్
గరుణాతీతులు కామరూపులగు న క్కంసప్రయుక్త క్షపా
చరులం గృష్ణుఁడు సంగరస్థలములన్ జక్కాడె లీలాగతిన్. 111

చ. వరయమునానదీ జలనివాస మహోరగ విస్తృతాస్య వి
స్ఫురిత విషానలప్రభల సోఁకున గ్రాఁగిన గోపగోధనో
త్కరముల నెల్లఁ గాచి భుజగప్రవరున్ వెడలంగఁ దోలి త
త్సరిదమలాంబు పానమున సంతస మందఁగఁజేసె గోతతిన్. 112

మ. దివిజాధీశుగుఱించి వానకొఱకై దీపింప నందాది వ
ల్లవు లేఁటేఁట ననూన సంపదల నుల్లాసంబునం జేయు ను
త్సవముం గృష్ణుఁడు మాన్పి గోపగణముల్ సంప్రీతినొందన్ శచీ
ధవుగర్వం బణఁపన్ ధనవ్యయముగాఁ దాఁ జేసె గోయాగమున్. 113

చ. హరిహయుఁ డంత రోషవివశావిలమానసుఁడై సరోరుహో
దరు మహిమం బెఱుంగక మదం బడరంగ వలాహకాది భీ
కరఘనపంక్తిఁ బంపిన నఖండశిలామయ భూరివర్షముల్
గురిసె నమానగర్జనల గోకుల మాకుల మంది కుందఁగన్. 114

ఉ. ఆ తఱి మంద గొందలము నందఁగ వల్లవు లెల్లఁ గృష్ణ యీ
చేతనులెల్ల నిట్టి జడిఁ జిందఱవందఱలై మనంబులన్
గాతరులైరి నీవు గృపఁగావు మహాత్మ! యనాథనాథ! ని
ర్ధూతకళంక! భక్తపరితోషణ భూషణ! పాప శోషణా! 115

మ. అని యిబ్బంగి విపన్నులై పలుకఁ గుయ్యాలించి కృష్ణుండు స
జ్జనవర్ధిష్ణుఁడు గోపగోనివహ రక్షా దక్షుఁడై దేవతా
జను లగ్గింపఁ గరాంబుజాతమున సచ్ఛత్రంబుగాఁ దాల్చె బో
రన గోవర్ధనశైలమున్ దటచరద్రమ్యామరీ జాలమున్. 116

వ. వెండియు. 117

సీ. శర దాగమారంభ సంపూర్ణ పూర్ణిమా
చంద్ర సాంద్రాతపోజ్జ్వలిత మగుచు
వెలయు బృందాటవీ వీథియం దొకనాఁడు
రాసకేళీ మహోల్లాసుఁ డగుచు
రుచిర సౌభాగ్య తారుణ్య మనోరమ
స్ఫూర్తిఁ జెన్నొందిన మూర్తి దనర
సలలిత ముఖచంద్రచంద్రికాతతి గోప
నయనోత్పలముల కానంద మొసఁగ

గీ. భవ్య చాతుర్యభంగిఁ ద్రిభంగి యగుచు
నబ్జనాభుండు సమ్మోద మతిశయిల్ల
లీలఁ బూరించు వరమురళీనినాద
మర్థి వీతేర విని మోహితాత్మ లగుచు. 118

చ. పతులు మఱందులున్ సుతులు బావలు నత్తలు మామలున్ సము
న్నతి వలదన్న మానక మనంబులఁ గృష్ణ పదాబ్జసేవనా
న్వితరతి గోపకామినులు వే చనుదేర దయాపయోధి శో
భితగతి రాసకేళిసలిపెం దరుణీనవపుష్పచాపుఁడై. 119

76. వ. అయ్యుద్ధవుండు = ఆ + ఉద్ధవుఁడు

77. క. యదుకులనిధి = యాదవవంశమునకు నిధివంటివాఁడైన కృష్ణుని, పద జలజవియోగ తాప భరమునన్ = పాదపద్మముల యెడఁబాటుచే నేర్పడిన యధికతాపముచేత, మాటల్ప్రిదులక = మాటలు గడ్డకురాక, హృదయంబు ఎరియఁ గన్ = మనస్సంతయు విపరీతబాధ నందుచుండఁగా, పెదవులు దడుపుచున్ = ఎండిపోయిన పెదవులను దడుపుచు, వగలన్ = దుఃఖములతో, పెంపు + అఱి + ఉండెన్ = తన యథాస్వరూపమును గోల్పడిన వాఁడై యుండెను.

**తాత్పర్యము** : కృష్ణపరమాత్మ యాదవవంశమునకు ఒక గొప్పనిధి వంటివాఁడు. అతనియెడబాటుతో నేర్పడిన దుఃఖము ఉద్ధవునకు మహాఘోరమైయుండెను. నోటినుండి మాట పెగలుట లేదు. దుఃఖముతోఁ బెదవు లెండిపోయియున్నవి. అతఁడు మాటిమాటికిని బెదవులు దడుపుకొనుచుండెను. ముఖమంతయు గాంతిహీనమై యుండెను.

78. క. బాదరాయణి = శుకబ్రహ్మ, వలనుచూచి = వైపుచూచి, ఏనేండ్లబాలుఁడై, ఉన్న యెడన్ = ఐదేండ్లబాలుఁడై యున్నప్పుడు.

**తాత్పర్యము** : ఈ రీతిగా శుకమహర్షి యుద్ధవునిమనఃస్థితిని గూర్చి వర్ణించి చెప్పెను. ఉద్ధవున కట్టిభక్తి యెట్లేర్పడినది? అని యాశంకించికొని సమాధానముగా బరీక్షిత్తువైపుఁ జూచి యిట్లనుచున్నాఁడు. పరీక్షిన్మహారాజా! ఉద్ధవునిభక్తి జన్మతోనే సిద్ధించినది. ఆతఁ డైదేండ్లవాఁడుగా నున్నప్పుడు జరగిన వృత్తాంతమును జెప్పుచున్నాను వినుము.

79. వ. పరిచర్యసేయుచుండన్ = సేవచేయుచుండఁగా, గుణవతీమతల్లి = శీలముగల వారలలో గొప్పదైనతల్లి, ఆకొంటివి = ఆకలిగొన్నావు. ఇది యేల = ఈ క్రీడ యెందుకు? జననీవాక్యంబులు = తల్లిమాటలు, కైకొనక = లెక్కసేయక, అఖండతేజోనిధి = సంపూర్ణమైన తేజస్సుల కాశ్రయభూతుఁడు అయిన శ్రీమహావిష్ణువుయొక్క, పాదారవిందసేవా + అనురక్తింజేసి = పాదపద్మముల సేవయందున్న యాసక్తి కారణముగా, శ్రీకృష్ణ వియోగ తాపంబునన్ = శ్రీకృష్ణుని యెడబాటుతో నేర్పడిన దుఃఖముతో, సరోజాక్ష = కృష్ణపరమాత్మయొక్క,

పాదారవింద = పాదపద్మములకు సంబంధించిన, మకరంద = తేనె లనెడు, సుధా = అమృతముయొక్క, జలనిధి = సముద్రమందు, నిమగ్నమానసుండయి = మునిఁగిన మనస్సు గలవాఁడై, సముత్కంఠన్ = ఎక్కువ, కౌతుకముతో ముహూర్తమాత్రంబునకున్ = ఒక్కముహూర్తకాలము, బాష్పజల = కన్నీటిచేత, పూరిత = నిండిన, లోచనుండై = కన్నులుగలవాఁడై, గద్గదకంఠుఁ డగుచున్ = మాటలు పెగలుటకుఁ గష్టపడుచున్న గొంతుగలవాఁడై.

**తాత్పర్యము** : ఉద్ధవుఁడు పిల్లలతోఁ గూడి యాడుచుండెను. వారిలో నొక్కబాలకునిఁ గృష్ణునిగా భావించి వానికిఁ బరిచర్యసేయుచుండినాఁడు. ఇంతలోఁ దల్లివచ్చి "చలిఁది బువ్వ తిందువు రమ్మని" - బతిమాలినది. నీ కాకలిగా నుండును. ఆకటిప్రొద్దులో నీ యాట లేమి?. రమ్మ ని పలుమారు పిలిచినది. ఆతఁడు తల్లిమాటలను సరకుసేయక పరిచర్యయందే నిమగ్నుఁడై యుండెను. అంతటి గాఢమైనభక్తి యాతనిది! అట్టివాఁడు కృష్ణవియోగతాపముతోనే దుఃఖించుటలో నాశ్చర్య మేమున్నది? ఆ తరువాత నుద్ధవుఁడు కృష్ణపాదములనే చింతించుచుఁ గొంతకాలము గడపినాఁడు. ఆ పాదారవిందములనుండి తొఱఁగిన తేనె యనునదే యమృతము. ఆ సముద్రములో నుద్ధవుఁ డోలలాడుచుండెను. ఒక ముహూర్తమాత్ర మట్లుగడపి నీటితో నిండిన కన్నులుగలవాఁడైగద్గదకంఠుఁ డైనాఁడు. వాస్తవమునకుఁ గృష్ణునిపాదములందుఁ దేనెయు లేదు. అది సుధయును గాదు. ఈ యలంకార మంతయుఁ గృష్ణపాదారవిందములనెడు రూపకానుప్రాణితమై వచ్చినది. పాదముల నరవిందములకుఁ బోల్చుటచేత నాతనిపాదములు సహజముగా నరుణము లైనవి. నిత్యప్రసన్నములైన వని యర్థము. సరోజమునుండి మృదుగంధము వెడలునట్లు మహాపురుషుఁ డగుటచే నాతనిపాదములనుండి యాకర్షకములైన పరిమళములు బయలుదేఱుచున్నవని తాత్పర్యము. ఉత్తమజాతిపురుషుల శరీరములందు సుగంధ ముండును. ఆతని పాదధ్యానము తేనెలవలె తీయనైనది. ఆ యానందము అమృతమువలె మధురాతిమధురము. మానవుని (జీవుని) నిరతి శయస్థితికిఁ గారణభూత మైనది. మూలములో నీ రెండువృత్తాంతములును వ్యాసుఁ డొక్క శ్లోకములోనే చెప్పినాఁడు.

"యః పంచహాయనో మాత్రా ప్రాతరాశాయ యాచితః,
తన్నైచ్ఛద్రచయన్ యస్య సపర్యాం బాలలీలయా"
పై శ్లోకమునకుఁ బోతన్న యొనర్చిన చక్కని పెంపు.

80. క. నెఱ + మనము. నెమ్మనము. కృష్ణవియోగజనితశిఖి = కృష్ణుని వియోగముచే నేర్పడినయగ్ని, దరికొనఁగాన్ = వ్యాపింపఁగా, దురితశిఖరిభిదురున్ = పాపములనెడు పర్వతములకు వజ్రాయుధమైన విదురుని.

81. వ. కనుంగొని = చూచి,

82. క. ఘన కాలభుజంగమ పుంగవుఁడు = కాలమనెడు మహాసర్పము. ఒడిసిపట్టఁగాన్ = తప్పించికొనుటకు వీలులేనట్లుగా, ఆక్రమించికొని పట్టగా, యదువంశ+ఉత్తమచారిత్రమున్ = కృష్ణునిచరిత్రమును, తత్కుశలములునున్ = అతనిక్షేమములును, మనమున్ కలంగెడిన్ = మనస్సు కలఁగుచున్నది.

**తాత్పర్యము** : కాలమనెడు మహాసర్పము కృష్ణునిఁ బట్టుకొన్నది. ఆతఁ డస్తమించెను. ఆతని నాశ్రయించియున్న యాదవుల క్షేమములుగూడఁ గృష్ణపరమాత్మతోనే యస్తమించినవి. ఇంకఁ గుశలము లేమని చెప్పెదను? ఆ విషయము దలఁచికొన్నంతనే నామనస్సు చీకాకై పోవుచున్నది.

83. సీ. మునిజనముఖపద్మములు = మహర్షులముఖము లనెడు పద్మములు, ముకుళింపఁగన్ = ముడుచుకొనిపోఁగా, ఖలజనలోచన + ఉత్పలములు = దుర్మార్గుల కన్ను లనెడు ఉత్పలములు వికసింపఁగా, జారచోరులకోర్కి = విటులు దొంగలు - వీరిమనోరథములు, సఫలతన్ పొందఁగన్ = సాఫల్యము నందఁగా, దానవదర్ప + అంధతమసము = రాక్షసుల గర్వమనుచీఁకటులు, అడరన్ = వ్యాపింపఁగా, వర = శ్రేష్ఠులైన, యోగిజన = యోగులను, చక్రవాకంబులు = చక్రవాకములు, అడలంగన్ = దుఃఖింపఁగా, కలుషజన + అనురాగంబు = దుర్మార్గుల ప్రేమసంబంధములు, పర్వన్ = వ్యాపింపఁగా, భూరి = ఎక్కువైన, దోష = పాపములనెడు, అనలస్ఫూర్తి = అగ్నియొక్క విజృంభణము, వాటిల్లంగన్ = ఏర్పడఁగా, ఉదిత ధర్మక్రియలు = గొప్పవైన ధర్మకార్యములు. ఉడిగి అణఁగన్ = అంతరింపఁగా, మానుషాకారరుచికోటిన్ = మానవాకారముతోనున్న కాంతిసమూహము, మందపఱిచి = మాయముచేసి, ఉత్తమశ్లోకమూర్తి = ఉత్తమకీర్తియే యాకారముగాఁగలిగిన, కృష్ణ + అభిధానలోకబాంధవుఁడు = కృష్ణుఁడనుపేరుగలసూర్యుఁడు, మించు తేజంబుతోన్ = గొప్ప తేజముతో, అస్తమించెన్అయ్యె = జీవితము వదలినాఁడు.

**తాత్పర్యము** : ఉద్ధవుఁ డనుచున్నాఁడు. విదురా! కృష్ణపరమాత్మయనెడు సూర్యుఁడు తనసమస్త తేజముల నుపసంహరించికొని యస్తమించినాఁడు. ఆతఁ డింతవఱకును మానుషాకారముతోఁ బ్రపంచమునఁ దిరుగుచుండెను. ఆతఁ డస్తమించినంతనే సూర్యాస్తమయమునఁ గమలములు ముకుళించినట్లుగా మహర్షులముఖపద్మములు ముకుళించెను. దుర్మార్గుల కన్ను లనెడు కలువలు విరిసినవి. అనఁగా దుష్టులకు సంతోష మయ్యెను అని తాత్పర్యము. జారులు చోరులు వీరికోర్కులు సిద్ధించినవి. కృష్ణుడు పోయిన తర్వాత నెవ్వఁడును దండించువాఁడు లేకపోయెను. జారచోరులు రాత్రులందు దిరుగుదురుగదా! సూర్యుఁడు లేనప్పుడు చీఁకట్లు వ్యాపించునట్లు కృష్ణుఁడస్తమింపఁగా రాక్షసుల గర్వమనెడు చీఁకటులు వ్యాపించినవి. గర్వముల కంధకారముతో రూపకము. యోగిజను లనెడు చక్రవాకములకు దుఃఖ మేర్పడినది. చక్రవాకములకు సూర్యాస్తమయము దుఃఖమును గల్గించుననుట కవిసమయసిద్ధము, రాత్రులయం దా మిథునములు విడిపోయి సూర్యోదయముతో మఱలఁ జేరుకొనును. దుర్మార్గుల అనురాగములు ప్రబలినవి. పాపము లనెడు నగ్నులు వ్యాపించినవి. ధర్మక్రియలు తగ్గిపోయినవి. ఈ పద్యములో లోకబాంధవుఁడు అనునది చాలసార్థకమైనమాట. సూర్యునకు లోకబాంధవుఁ డనిపేరు. ఆతనివలెనే కృష్ణుఁడును లోకబాంధవుఁడు. అస్తమించెన్ = అనునదియు లోకబాంధవరూపకమునకు సముచితమైనదిగా నున్నది. 'శ్లోక' మనఁగా కీర్తి, "పదేయశసి చ శ్లోకే" అమరము, మూలమందు "కృష్ణద్యుమణి నిమ్రోచే' అనునొక్క వాక్యమే గలదు. వ్యాసుఁడును కృష్ణునకు సూర్యునితో నభేదమునే చెప్పినాఁడు. ఆ రూపకము తెనుఁగులో రమణీయముగాఁ బెంపొందింపఁబడి సావయవరూపక మైనది.

84. వ. మఱియును = ఇంకను

85. క. హల = నాగలి, కులిశ = వజ్రము, జలజరేఖా = పద్మరేఖలు, వీనిచేత, లలిత = అందములైన కృష్ణునియొక్క, పాదలక్షితమై = పాదములచేఁ జూడఁబడినదై, నిర్మలగతిన్ = పరిశుద్ధముగా, ధరణీలలనామణి = భూమియనెడునుత్తమస్త్రీ, నేఁడు = ఈనాఁడు. అభాగ్యలక్షిత యయ్యెన్ = దురదృష్టముతోఁ గూడుకొన్నదిగా నయ్యెను.

**తాత్పర్యము** : మహాపురుషులపాదములలో, హలకులిశాదులైన యుత్తమరేఖలుండును. అట్టి శుభలక్షణములతోఁ గూడియుండినవి

కృష్ణపరమాత్మపాదములు. ఆ పాదములచే చిహ్నితమైన భూదేవి యింతవఱకుఁ బరమపవిత్రగా నొప్పెను. కృష్ణుఁ డస్తమించినంతనే యభాగ్యలక్షణ యైనది. ఇదిగూడ పోతన్న సొంతమే.

86. తే. యాదవులవలన రాజ్యశ్రీదొలఁగెన్ = యాదవులనుండి రాజ్యలక్ష్మి తొలఁగిపోయినది. ధర్మగతి నశించెన్ = ధర్మము నశించినది. భువిన్ మర్యాదలు తప్పెన్ = భూమియందు మానవులు మెలఁగవలసిన మేరలు దప్పినవి. దైత్యభేది తప్పినపిదపన్ = రాక్షససంహారకుఁడైన కృష్ణుఁ డస్తమింపఁగా, అధర్మోత్పాదనమునన్ = అధర్మ + ఉత్పాదనమునన్ = అధర్మముయొక్క ఆవిర్భావముచేత.

**తాత్పర్యము** : స్వామి యస్తమించినంతనే, లోకమం దధర్మము వ్యాపించినది. యాదవులకు రాజ్యసుఖము దప్పినది. ధర్మము పాడైనది. మనుష్యుల మర్యాదలు దప్పినవి.

87. వ. లలిత = అందమైన, నికషణ = ఒఱపెట్టుటచేత, విరాజమాన = ప్రకాశించుచున్న, మణిగణ = మణుల సమూహము యొక్క, కిరణ = కిరణములయొక్క, సుషమా విశేష = కాంత్యతిశయముచేత, విడంబిత = అనుకరింపఁబడిన, విమలసలిలంబులందున్ = స్వచ్ఛములైన జలములందు, ప్రతిఫలిత చంద్రమండల రుచిన్ = ప్రతిఫలితచంద్రునికాంతిని, నిరీక్షించి = చూచి, జలచరబుద్ధిన్‌చేసి = జలచరమను బుద్ధితో, తత్ + జలవిలోలమీనంబులు = ఆ జలములందు సంచరించెడు చేపలు, అనూనస్నేహంబునన్ = తక్కువకాని చెలిమితో, తలంచుచందంబునన్ = తలంచుటవలె, కృష్ణ + అనుచరులు = కృష్ణునితో సంచరించువారు, లీలామానుషవిగ్రహుండు = లీలగా మనుష్యదేహ మెత్తినవాఁడు, హరిమాయాజనితంబు = హరిమాయతో నేర్పడినది. అసత్ + భావము = అన్యధాబుద్ధి, అనుగమనము = వెంటనడచుట, సర్వగుణగరిష్ఠులు = ఉత్తమగుణములలో గొప్పవారు. అభిజన = గొప్పవంశము, విద్యా = విద్య, ధనబల = ధనము బలము - వీనిచే నేర్పడెడు మదముచేత, గ్రుడ్డివైన మనస్సులు గలవారు, పరతత్త్వంబు = బ్రహ్మస్వరూపము, మనస్ + తాపంబు = దుఃఖమును, వెండియున్ = మరల.

**తాత్పర్యము** : మూలములో "హరిం మీనా ఇవోడుపం" - అని పాతికపాదము మాత్రమే గలదు, దానిని పోతనామాత్యుఁడు గొప్పగా విస్తృతీకరించినాఁడు. సానఁబెట్టఁబడిన మణిగణములకాంతివిశేషములవలె పరిశుద్ధములైన జలములు - ఆ నీటిలోఁ జంద్రుడు ప్రతిఫలించినాఁడు. ఆ నీటియందే చేపలుగూడ నున్నవి.

ప్రతిఫలితుండైన యా చంద్రుని తమతోంబాటు వసించుచున్న యొక్క జలజంతువనియే మీనము లెంచెను. ఆతండమృతకరుం డని వాని కర్థము గాలేదు. కాని చూచుట కందముగా నుండుటచే తమ జాతిలో నుత్తమమైనదని చేప లా చంద్రునిం బ్రేమించుచుండెను. యాదవులస్థితిగూడ నిట్టిదే. వా రాతనితోం గలసి మెలసి తిరుగుచుండిరి. వైష్ణవమాయావశులై వారు కృష్ణునిం బరమాత్మగా గ్రహింపలేక పోయినారు. కేవల యాదవోత్తమునిగా మాత్రమే తలంచిరి. బాంధవ్యాదులు గల్పించికొని యాతనితోం గలసిమెలసి తిరుగుచుండిరి. వైష్ణవమాయ వారి కా యసద్భావమును గల్గంజేసినది. ఆ దేవునిమాయాప్రభావ మట్టిది! దానిలో మున్గకుండ నెవ్వరును దేరికొనలేరు. బ్రహ్మాదులగతిగూడ నింతే. ఎవ్వరో పరమభాగవతులకు మాత్రమే యర్థ మగును. మానవులకు కులము, విద్య, ధనము, బలము - వీనితో మద మేర్పడును. శిశుపాలాదు లట్టి మదముగలవారు. వానితో వారిమనస్సులు గ్రుడ్డివైనవి. వా రాతనిని బొత్తిగా గ్రహింపనే లేదు. మనుష్యశ్రేష్ఠునిగాం గూడం దలంపక నీచునింగా నెంచి యనేకదుర్భాష లాడిరి. వా రాడిన దుర్భాషలు దలంచికొని విదురా! మనస్సులో నెంతయో ఖేదపడుచున్నాను". ఉద్ధవుం డిట్లుపలికి యా పై ననుచున్నాండు.

88. మ. అవితృప్త = తృప్తిపొందనట్టి, ఈక్షణ = దృష్టి, బుద్ధి, వీనియందు, సమాహిత = ఉంచంబడిన, తపోవ్యాసంగుండు = తపస్సునందుం బరిశ్రమించునట్టి, భాగవతశ్రేష్ఠులకున్ = పరమభక్తులకు, నిఖిలైకజ్యోతియై = సమస్తములకన్నను నుత్కృష్టమైన ప్రకాశముగా, ఆత్మమూర్తి చూపి = తన స్వరూపమును బ్రత్యక్షపఱచి, లోకవిలోకంబులు నిర్దహించి = లోకములచూపులను నిష్ఫలములుగాం జేసి. ఈ పాఠమేమియు బాగుగ లేదు. "లోకవిశోకంబులునిర్వహించి" - అని క్రిందచూపిన పాఠము. అదియే బాగున్నది. లోకదుఃఖములను బోంగొట్టెడు కార్యము లొనర్చినవాండై యని యర్థము. శాంతుండు కమలాకాంతుండు = శాంత స్వరూపుండైన భగవంతుండు, మానవరూపంబగు దేహమున్ వదలి = మానవస్వరూపమును వదలిపెట్టి, అంతర్ధానుండయ్యెన్సుమీ = అవ్యక్తుండైనాండు.

**తాత్పర్యము** : బుద్ధిని చూపులను భగవంతునియందు నిలిపికొని నిశ్చంచలముగాం బరమాత్మునింగూర్చి తపించెడువారు భాగవతులు, వారు పరమభక్తులు, పరమాత్మునుండు అట్టివారి కాత్మరూపమును బ్రదర్శింపవలెనని తలంచెను. తనకాంతియే కాంతిగాం బ్రపంచమునకు విచ్చేసినాండు. తాను మధ్యమలోకమందున్నకాలమందు లోకదుః

ఖములను బొకార్చు కార్యక్రమములు నిర్వహించినాఁడు. తదనంతర మాతఁడు మానవదేహమును విడచి యవ్యక్తుఁడయ్యెను. ఈ పద్యములోఁ బోతన్న మూలమునుండి పూర్తిగా భేదించినాఁడు. దీనిమూలశ్లోక మీ క్రిందిది.

"ప్రదర్శ్యాతప్త తపసా మవితృప్తదృశాం నృణామ్,
ఆదాయాంతర ధాద్యస్తు స్వబింబం లోకలోచనమ్.

**తాత్పర్యము** : గొప్పతపస్సులు చేయలేని మానవులపై భగవంతుఁ డకారణమైన యనుగ్రహమును బొందెను. అతఁడు వారికిఁ దనరూపమును జూపించుతలఁపుతోఁ బ్రపంచమునకు మానుషదేహముతో వచ్చినాఁడు. అప్పుడు లోకజనులు ఆతని సౌందర్యమునకు ముగ్ధులై తదేకముగా నాతనిఁ జూచిరి. ఎంతచూచినను వారికిఁ దనివి లేదు. కృష్ణపరమాత్మలోకమునకు లోచనముతో సమానమైన తనశరీరమును వదలి యంతర్హితుఁ డైనాఁడని భావము. అనఁగాఁ గృష్ణపరమాత్మ దేహమును జాలించుటచేతఁ జూడఁదగిన యితరపదార్థములు లేకుండుటచే లోకలోచనములు నిష్ఫలము లయ్యెనని పిండితార్థము.

89. సీ. మర్త్యవికాసైకమానమై = మనుష్యుల మానసవికాసమునకు కొలఁత బద్దయై, తనకు విస్మయజనకమై = తనకుఁగూడ నాశ్చర్యమును గలిగించునదై, వెలయునట్టి ఆత్మీయయోగమాయాశక్తిన్ = తనయోగమాయాశక్తిని, చేపట్టి = గ్రహించి, చూపుచున్ = ప్రజలకు దాని ప్రభావము నప్పు డప్పుడు గన్పింపఁ జేయుచు, అత్యంతసుభగుఁ డగుచున్ = ఎక్కువ సౌందర్యముగలవాఁడై, భూషణంబులకును భూషణంబై = సొమ్ములకు సొమ్మునై, వివేకములకెల్లను బరాకాష్ఠ యగుచున్ = సకలవివేకములకును చరమసీమయై, సకలకల్యాణసంస్థానమై = సమస్త మంగళములకును నివాసస్థానమై, సత్యమై తేజరిల్లెడునట్టి, దివ్యమూర్తిన్ = ప్రకాశించెడు దివ్యమూర్తిని, తాన = తానే, నిజశక్తిన్ = యోగమాయాశక్తిచేత, నిజమూర్తిన్ = తన రూపమును, తగన్ ధరింపన్, యమతనూభవురాజసూయాధ్వరంబునందున్ = ధర్మరా జొనర్చిన రాజసూయ యాగమందు, ఎవ్వని శుభమూర్తిన్ = ఎవ్వని మనోహరాకారమును, అఖిలజనులున్. ఎలమిన్ = వికసించినమనస్సులతో, నిండువేడుకన్, చూచి, వర్ణించిరి = గొప్పవేడుకతోఁ జూచిరి.

**తాత్పర్యము** : మానవులమానసికవికాసమునకు కొలబద్దయగు తన యోగమాయాశక్తి తనకే యాశ్చర్యమును గొలిపినది. స్వామి యా యోగమాయను గ్రహించినాఁడు. గోవర్ధనోద్ధరణాది కార్యములందు ఆ యోగమాయాశక్తిని బ్రజల కప్పు డప్పుడు గన్పింపఁజేసెను. యోగమాయాశక్తితో నాతనిరూప మత్యంతసుందరముగా భాసించుచుండెను. ఆ శరీరము సమస్తభూషణములకును భూషణప్రాయమై; వివేకములకుఁ బరాకాష్ఠయైనది. సకల కల్యాణములకును నివాసస్థానము. అనశ్వరమైనది. అది బ్రహ్మాదులచే నిర్మితము గాదు. స్వామి తన యిచ్ఛతోఁ దానే సంకల్పించికొనెను. రాజసూయయాగమం దట్టి శరీరమును ధరించి యాతఁడు ప్రకాశించినప్పుడు సకలమానవులమనస్సులును నాతనియందే లగ్నమై పోయెను. ఆ శుభమూర్తి నందఱును సంతోషపూరితమనస్కులై యెంతయో స్తుతించిరి.

90. క. ప్రకటముగన్ కమలభవసృష్టికిన్ = బ్రహ్మసృష్టికి, కారణము, హేతువు ఇమ్మహాత్ముఁడే అనుచున్ = ఈ పరమపురుషుఁడే యని, తత్ + సభాజనులెల్లన్ = ఆ రాజసూయమందున్న జను లందఱును. ఉత్సుకులై ఆసక్తిగలవారై, తన్మూర్తిన్ = ఆ మూర్తిని, తప్పక చూచిరిగాదె! = నిశ్చలములైన చూపులతోఁ జూచిరిగదా!.

**తాత్పర్యము** : బ్రహ్మదేవుని సృష్టి కీ మహాత్ముఁడే కారణమని పరమాత్మగా నాతని గుర్తించి రాజసూయయాగములోని జను లందఱు నుత్సుకులై చూచి రని యర్థము. దీనికి మూలము "కార్త్స్న్యేన చాద్యేహగతిం విధాతుః. అర్వాక్సృతౌ కౌశల మిత్యమన్యత" - అని కలదు. 'అర్వాక్ సృతౌ' - అర్వాచీన సంసార నిర్మాణమందు, మనుష్యనిర్మాణమందని యైనను నర్థము. యత్ = ఏ కౌశలము గలదో, అది కృష్ణపరమాత్మదేహమును సృష్టించుటలో నుపక్షీణమును బొందిన దని యర్థము. అనఁగా కృష్ణపరమాత్ముని దేహనిర్మాణమందు బ్రహ్మదేవుఁడు తన సంపూర్ణకౌశలమును జూపించినాఁడు. ఆ నైపుణ్యపుచరమసీమ యది. ఇంతకు మించి యాతనికిఁ గౌశలము లేదని భావము. మఱి కృష్ణశరీరము బ్రహ్మనిర్మితము కాదుగదా! అని యాశంకించికొని శ్రీధరుఁడు 'ఈ మాట లోకదృష్టితోఁ జెప్పఁబడిన దని యన్నాఁడు. ఈ చిక్కును గమనించిన పోతనామాత్యుఁడు మూలమునుండి భేదించెను. ఆతనికల్పన సముచితముగనే యున్నది.

91. వ. శాంత ఉగ్రరూపధరుఁడు = శాంతములును, ఉగ్రములును నగు రూపములు ధరించినవాఁడు. పరకృతాపరాధనిపీడ్యమానమానసుఁడు = ఇతరులుచేసిన యపరాధములచేత పీడింపఁబడిన మనస్సుగలవాఁడైనను, అనుకంపా + ఆయతచిత్తుండె = దయకు లోఁబడిన మనసుగలవాఁడె, వర్తించున్, పరాపరుండును

= సగుణనిర్గుణముల కతీతుఁడైనవాఁడును, ప్రకృతికార్యంబయిన = ప్రకృతితో నేర్పడెడు మహత్తత్త్వరూపుండును = మహత్తత్త్వమే అంశగా గలవాఁడును, జనన విరహితుం డయ్యును = జన్మాదులు లేనివాఁడైనను, దారువువలనన్ = కట్టెలనుండి, అనలంబుదోఁచుచందంబునన్ = అగ్ని ప్రత్యక్షమగునట్లు, జననంబుపొందుచుండున్, అట్టిసరోజనాభుని యొక్క, హాసములు, రాసములు, లీలా = క్రీడాప్రాయమైన, అనురాగ = ప్రేమచేఁగూడిన, విలోకన = చూపులచేత, ప్రతిలబ్ధమానలు = గర్వాతిరేకమును బొందినవారు, తత్ + మూర్తి = ఆమూర్తియొక్క దర్శన అనుషక్త మనీషలన్ = చూచుటయందే లగించిన మనస్సు గలవాఁరై.

**తాత్పర్యము** : సర్వేశ్వరుఁడు నరసింహాద్యుగ్రరూపములను ధరించెను. రామకృష్ణాదిశాంతరూపములను ధరించెను. ఆ పరమాత్ముఁడు సహజముగఁ బరమశాంతుఁడు అగుటచే నితరులు దనయెడలఁజేయు నపరాధములచేతఁ బీడింపఁ బడిన మనస్సుగలవాఁ డయ్యును. వారియందుఁ దనకుఁ గల దయకు లోఁబడినవాఁ డై యుపేక్షనే వహించెను. సగుణ నిర్గుణముల కవ్వలివాఁడును, ప్రకృతి కార్యమైన మహదంశముచేఁ గూడినవాఁడైన పరాత్పరుఁడు జన్మాదిరహితుఁడు. అట్టివాఁడు దారువులనుండి యగ్ని యభివ్యక్తమైనట్లు జన్మాదులనందును. మహాభూతముగా నగ్ని యెప్పుడును నుండనే యున్నది. అది నిత్యసిద్ధము. కాని దారువులమూలమున నది యభివ్యక్త మగును. పరమాత్ముఁడుగూడ నట్లే నిత్యస్థిరుఁడై యుండును. ఒక్కొక్కసారి ప్రకటరూపమును ధరించును. అట్టి పరమపురుషుని చిఱునవ్వులు లీలావిలాసములు ప్రేమావలోకనములు - వీనిచేత గర్వాతిరేకమునందిన గోపకాంతలు నిరంతర మా మూర్తిని జూచుటయందే లగ్నమైన మనస్సులు గలవారుగా నుండిరి. ఇచ్చట - పోతనామాత్యులరచనయే వేఱుగా నున్నది ఈ వచనము వ్యాసుని రెండుశ్లోకముల సారాంశము. దీనికి మూలశ్లోక మిది.

"స్వశాంతరూపే ష్వితరై స్స్వరూపై, రభ్యర్ద్యమానే ష్వనుకంపితాత్మా,
పరావరేశో మహదంశయుక్తో, హ్యజోఽపి జాతో భగవాన్ యథాగ్నిః."

**అర్థము** : ప్రపంచమందున్న సర్వప్రాణులును భగవంతుని స్వరూపములే. శాంతరూపములుకొన్ని. ఉగ్రరూపములు కొన్ని. ఉగ్రరూపములచేత శాంతరూపములు పీడింపఁబడినప్పుడు వానియం దనుగ్రహమును వహించిన

భగవంతుఁడు వ్యక్తుఁ డగును. పోతనామాత్యుఁడు భగవంతుఁడే శాంతోగ్రరూపములు గలవాఁడని చెప్పినాఁడు. ఇంక తక్కినవిషయము మూలానుసారముగనేయున్నది. రెండవశ్లోకములో -

"వ్రజస్త్రియోదృగ్భిరనుప్రవృత్తిధియోఽవతస్థుఃకిలకృత్యశేషాః, "అని మూలము, గోవకాంతలు హానరాసాదులచే నేర్పడిన యభిమానముగలవా రై ఆతనిచూపులవెంటనే పోయినమనస్సుతోఁ దమపనులు సగము సగము చేసికొని ముగింపకయే వదలినా రని భావము.

92. చ. దివిజులకోర్కిదీర్పన్ = దేవతలకోర్కి దీర్చుటకు, వసుదేవునియింటన్ జనించి = వసుదేవునియింటిలోఁ బుట్టి, కంసదానవుఁడు వధించునన్ భయమునన్ = కంసుఁడు చంపుననుభయముతో, నందునియింటన్ ఉండుటకు, యవనజరాసుతాదులకున్ = కాలయవనుఁడు జరాసంధుఁడు మొదలైనవారిని, ఆజిన్ ఎదుర్పడలేక = యుద్ధమం దభిముఖముగా నిలువలేక, సజ్జనస్తవమధురాపురిన్ విడిచి = సజ్జనులు పొగడు మధురాపట్టణమును వదలి, దాఁగుటకున్ = ద్వారకలో దాఁగుటకును, మదిన్ చింతనొందెదున్ = మనస్సున దుఃఖింతును.

**తాత్పర్యము** : కృష్ణపరమాత్ముఁ డనంతవీర్యము గలవాఁడు. అతఁడు బ్రహ్మదేవుఁడు యాచింపఁగా భూభారహరణార్థమై ప్రపంచమున జన్మించెను. వసుదేవునిభార్య దేవకి కాతఁడు గుమారుఁడుగాఁ బుట్టినాఁడు. కంసదానవుఁడు తనకేమో యపకార మొనర్చునట్లు వానికి భయపడి నందగోకులమందు గూఢవీర్యుఁడై వసించినాఁడు. అట్లే కాలయవనుఁడు జరాసంధుఁడు మొదలైనవారికి భయపడిన వానివలె సర్వసజ్జనస్తుతమైన మధురానగరమును వదలి ద్వారకలో దాఁగికొన్నాఁడు. కృష్ణుని యీ లీల లన్నియు నా మనస్సునకు దుఃఖకరములుగనే యున్నవి.

93. న. అదియునుం గాక

94. సీ. పృథుల : గొప్పవైన పాతక = పాపములనెడు, భూమిభృత్ = పర్వతములకు, భిదుర = వజ్రాయుధమైనవాఁడా! విదురా!, కడఁగి, పెక్కిడుమలన్ కుడుచుచున్ = అనేక కష్టముల ననుభవించుచు, చిత్తముల్ కలఁగన్కన్ = చిత్తములు క్షోభింపఁగా, బంధన + అగారములనున్ = కారాగారములందు, వనరిన దేవకీవసుదేవులనున్ = కష్టపడిన వసుదేవదేవకులను, డాయన్చనుదెంచి = సమీపించి, భక్తిన్, వందనము ఒనర్చి, తలిదండ్రులారా! ఏన్ కలుగంగన్ = నేను జీవించియుండఁగా, మీరలు = మీరు, కంసుచేన్ అలజడిన్ క్రాగుచుండన్ = దుఃఖములచే తపించుచుండఁగా,

కణఁగి = యత్నించి, శత్రునిన్‌చంపఁగాన్ లేక = శత్రువును వధింపలేక, చూచుచునున్ననాతప్పున్ = ఉపేక్షించిన నాదోషమును, ప్రసన్నులగుచున్ = నాయందు దయగలవారై, కావుఁడు అని ఆనతిచ్చినన్ = మన్నింపుఁ డని వచించిన, దేవదేవునియొక్క అద్భుత + ఆవహ = ఆశ్చర్యమును గలిగించు, మధురవాక్యములు, తలఁచి, తలఁచి, నాచిత్తమునన్ చాలన్, కలఁగుచుందున్.

**తాత్పర్యము** : దేవకీవసుదేవులు కంసునిచేత, కారాగారమున బంధింపఁబడియనేక కష్టము లనుభవించిరి. కంససంహారమైన తరువాతఁ గృష్ణుడు వారిని సమీపించి "తల్లిదండ్రులారా! మీరు కంసునివలన పలుదుఃఖముల ననుభవించితి రని నాకుఁ దెలియును. ఇంతకుముందే నేను కంసుని సంహరించి మీకష్టములను దలఁగింపవలసియుండెను. కాని యింతకాల ముపేక్షించితిని. ఆ నాదోషమును మీరు ప్రసన్నచిత్తులై క్షమింపవలెను." ఇత్యాదిగా భగవంతుఁడు వినయానుసంధాన మొనర్చినాఁడు. ఆతఁడు పలికిన పలుకు లెంతయో మధురముగా నుండెను. సర్వనియంత యైన భగవంతుఁ డిట్లు పలుకుట గొప్ప యాశ్చర్యమును గలిగించునదిగా నుండెను. ఓ విదురా! అతని యీ వినయభూషణము నా మనస్సున కింతయో కష్టమును గలిగించినది. దీనికి మూలశ్లోక మీ క్రిందిది.

శ్లో ॥ ధునోతిచేతస్స్మరతోమమైత, ద్యదాహపాదా వభివంద్య పిత్రోః, తాతాంబ!
కంసాదురుశంకితానాం ప్రసీదతాం నోఽకృతనిష్కృతీనామ్.

పై శ్లోకమును పోతనామాత్యుఁడు కథామూలకముగ విస్తృతీకరించినాఁడు.

95. క. తలఁపన్ = ఆలోచింపఁగా, ఎవ్వనిబొమముడి మాత్రమునన్ = ఎవని భ్రూకుటిచేత, నిఖిలభూదేవీభారము = సమస్తమైన ధరణీభారము, పాయున్ = పోవునో, అట్టి హరిపదకమలమరందంబున్ = కృష్ణుని పాదాబ్జమకరందమును, విమలమతిన్ = పరిశుద్ధమైన మనస్సుతో, క్రోలుఘనుఁడెవ్వాఁడో = త్రాగెడు నదృష్టవంతుఁ డెవఁడో.

**తాత్పర్యము** : ఎవనిబొమముడిమాత్రముతో భూదేవి సమస్తభారమును దొలఁగునో అట్టి కృష్ణపరమాత్ముని పాదసరోజమకరందమును బరిశుద్ధమనస్సునఁ బానమొనర్చెడి యదృష్టవంతుఁ డెవఁడో! మూలములో "యో విస్ఫురద్భ్రూవిటపేన" - అను రూపక మున్నది. బొమముడిని వృక్షముగాఁ బోల్చుట అమాత్యునకు రమణీయముగాఁ దోపలేదు. అట్లే అంఘ్రిసరోజరేణుం విజిఘ్రన్" అనుటగూడ నాతనిదృష్టిలో సుందరముగా లేదు. కనుకనే యాతఁ డా రెంటిని దొలఁగించెను.

96. క. మందప్రజ్ఞుఁడనై = మందమైన బుద్ధిగలవాఁడనై, గోవిందునిన్, మురదైత్యహరునిన్ = మురాసురుని సంహరించిన వానిని, విష్ణునిన్ = సర్వమందును వ్యాపించినవానిని, పరమానందునిన్ = గొప్పయానందస్వరూపుఁడైనవానిని, మందరధరున్ = కచ్ఛపావతారమున మందరమును ధరించిన వానిని, నందతనూజునిన్ = నందాత్మజుఁడైన కృష్ణపరమాత్మను, ఎందున్ = ఏ సమయమందైనను, చిత్తమందున్, మఱతునె?

**తాత్పర్యము** : కృష్ణపరమాత్మ గోవిందుఁడు. మురాసురుని జంపినవాఁడు. సర్వమునందును వ్యాపించినవాఁడు. పరమానందమే స్వరూపమైనవాఁడు. కచ్ఛపావతారమున మందరపర్వతమును ధరించినవాఁడు. అట్టి యా కృష్ణపరమాత్ముని మందబుద్ధినై యెప్పుడైనను మఱతునా?

97. చ. అదియునున్ కాక, మీరు, నృపులందఱున్ చూడఁగన్, ధర్మసూతి = ధర్మరాజుయొక్క పెంపొదవిన = చాలగొప్పదైన, రాజసూయసవనోత్సవమందునన్ = రాజసూయయాగమనెడు గొప్ప యుత్సవమందున, జన్మమాదిగాన్ = తన జన్మ మొదలుకొని, ఎగ్గు + ఒనర్చి = దోషములే చేసి, శిశుపాలుఁడు, పదపడి = తర్వాత, యోగిజనంబులు = పరమయోగులు, ఇట్టి దట్టి దని యెఱుంగన్ ఓపని = ఊహింపను సాధ్యముగాని, కడిందిపదంబున్ = గొప్పస్థానమును, పొందెనేకదా!

**తాత్పర్యము** : శిశుపాలుఁడు కృష్ణపరమాత్మకుఁ దన జన్మమొదలపకారము లొనర్చినవాఁడే, అట్టివానిని కృష్ణుఁడు ధర్మ రాజరాజసూయయాగమందుఁ జక్రముచే ఖండించెను. వాఁడు యోగిజను లట్టిదిట్టిదని యూహించుటకుఁ గూడ సాధ్యపడని స్థానము నందినాఁడు. అట్టి కృష్ణునికంటెను దయాపరుఁడైన వాఁ డెవ్వఁడు?

98. చ. ఈ పద్యమందలి మొదటిపాదము నెట్లుగూడ నవ్వయించుటకు సాధ్యపడకున్నది. దీనిపాఠాంతరము దొరకినట్లు లేదు. అకాడమీప్రతిలోఁ దప్పుపాఠమే యున్నది. దానినిట్లు సవరించినాను. సవరించుటచేతనే మూలార్థమునకు సరిపోవుచున్నది. కురునృపపక్షభూతులు = కౌరవులవైపునిలిచి యుద్ధ మొనర్చిన రాజులు, అకుంఠిత దర్పచమూసమేతులై = అడ్డగింపరాని గర్వముచేతను సైన్యముల చేతను గూడినవారై, అరిదిరణోర్విన్ = భయంకరమైన కురుక్షేత్రసంగ్రామమందు, ఎవ్వనిముఖాంబురుహామృతము, ఆత్మలోచనోత్కరములన్ = తమ కన్నులచేత, క్రోలి = పానముచేసి, పార్థ = అర్జునునియొక్క, విశిఖప్రకర = బాణపరంపరచేత,

నేర్పడిన క్షత = గాయములచేత, పూతగాత్రులై = పవిత్రమైన శరీరము గలవారై, గురుతరమోక్ష ధామమునకుం జని = గొప్పదైన మోక్షపదవి నొంది, సౌఖ్యమునొందిరోకదా = సుఖము ననుభవించిరోకదా!

**తాత్పర్యము** : కౌరవులపక్షమందునిలిచి యుద్ధమొనర్చెడిరాజులు మహాదర్పముతో వచ్చిరి. అవి యసంఖ్యములైన సైన్యములు. సైన్యసమేతులైనవారు యుద్ధములో నర్జునుని బాణములచేఁ జచ్చినారు. వారుగూడ మోక్షము నందిరి. దీనికి రెండుకారణములు. మరణకాలమందుఁ గృష్ణునిముఖారవిందమును గన్నులతోఁ బానముఁ చేయుచుఁ జచ్చుట యొకటి; పార్థునిబాణములచేఁ గొట్టఁబడినవారై పాపములఁ బాయుట మఱి యొకటి. దీనిమూలశ్లోక మిట్లున్నది.

శ్లో: తథైవచాఽన్యేనరలోకపాలాః య ఆహవే కృష్ణముఖారవిందమ్,
నేత్రైః పిబంతో నయనాభిరామం పార్థాస్త్రపూతాః పదమాపురస్య.

99. స. అట్టి సరోజాక్షుఁడు, ఆద్యంతశూన్యుండు = ఆద్యంతములులేనివాఁడు. సుభగుండు = శోభాయుక్తుఁడు త్రైలోక్యసుందరుండు, = ముల్లోకములను సుందరుఁడైనవాఁడు, కమనీయ = రమణీయమైన సాగరకన్యకా = లక్ష్మీదేవి యొక్క, కుచకుంకుమ = కుచములపైని కుంకుమచేత, అంకిత = కూడుకొన్న, విపుల = విశాలమైన, బాహాంతరుండు = బాహువుల మధ్యప్రదేశము గలవాఁడు, సకలదిక్పాల = సమస్తదిక్పాలకులయొక్క భాస్వత్ = ప్రకాశించుచున్న, కిరీటన్యస్త = కిరీటములందున్న, పద్మరాగ = పద్మరాగముల చేత, అరుణ = ఎఱ్ఱనైన పాదపీఠుఁడు = పాద పీఠముగలవాఁడు, అజుఁడు, అనంతుఁడు, సమానాధిక విరహితుఁడు = తనతో సమానుఁడుగాని యధికుఁడుగాని లేనివాఁడు, ఇద్ధమూర్తి త్రయ + అధీశ్వరుండు = త్రిమూర్తులకంటె నధికుఁడు ఐన, హరి ఉగ్రసేనున్ అఖిలరాజ్యరుచిర సింహాసనమునన్ = రాజ్యసింహాసనమునఁ గూర్చుండఁబెట్టి, భృత్యభావంబునున్ పొంది = సేవకభావమునంది, అతనిపనుపుసేయుటకున్ = అతనియాజ్ఞను చెల్లించుటకు, ఎపుడున్ నామనము కుందున్.

**తాత్పర్యము** : కృష్ణుఁ డాద్యంతశూన్యుఁడు. సర్వోత్కృష్టమైన శోభగలవాఁడు. త్రిలోకసుందరుఁడు. లక్ష్మీదేవి కుచములకుఁ బూసికొన్న కుంకుమచే నంకితమైన బాహుమూలము గలవాఁడు, సకలదిక్పాలకుల కిరీటములందుఁ దాపఁబడిన ఎఱ్ఱనివజ్రకాంతులతో నరుణితమైన పదపీఠముగలవాఁడు. తనతో సమానుఁడు గాని, యధికుఁడుగాని లేనివాడు. ముమ్మూర్తులకును గొప్పవాఁడు. అట్టి కృష్ణపరమాత్మ

యుగ్రసేనుని సింహాసనమునఁ గూర్చుండఁబెట్టి, తాను భృత్యభావమునంది మనవు లొనర్చుచుండెను. ఆతనియాజ్ఞలు నిర్వహించుచుండును. సర్వేశ్వరుఁడైన యాతని యీ స్థితి నా మనస్సున కెంతయో వ్యథను గల్గించును.

100. వ. అని, వెండియున్ = మరల, పరమభాగవతోత్తముఁడు = గొప్పభక్తుఁడు, హరియింపం దలంచి = చంపుటకొఱకై, దుష్టచేతన = చెడ్డమనస్సు గలది. నిజపదధ్యానపరాయణులు = తన పాదములను తల చుటందే యాసక్తిగలవారు. ఉగ్రకర్ములు = దుష్టకార్యము లొనర్చువారు.

**తాత్పర్యము** : విదురా! ఉగ్రసేనుఁడు భగవంతునకు భక్తుఁడు. పరమభాగవతుఁడు. అట్టి యుగ్రసేనుని భగవంతుఁ డనుసరించుటలో నాశ్చర్యము లేదు. ఎందుకనఁగా పరమాత్ముఁ డెప్పుడును భక్తుల క్షేమమునే కోరువాఁడు. తన్ను సంహరింప నిశ్చయించికొని స్తనములకు విషముఁ బూసికొనివచ్చి తనకుఁ జన్ను గుడిపిన దుష్టబుద్ధియైన పూతనకుఁగూడ నాతఁడు దన్నుఁ బెంచిన యశోదాదేవికిఁగూడ నందరాని యుత్తమపదవి నిచ్చినాఁడు. అంతటిదయాశాలి యాతఁడు! అట్టిచో నాతఁడు తన పదభక్తుల ననుసరించుటలో నాశ్చర్య మేమున్నది? ఉగ్రసేనునిఁగూర్చి చెప్పిన యీ మాట లన్నియు నమూలకములే. తర్వాత విదురుఁ డిట్లు ప్రశ్నించినాఁడు. "ఓ యుద్ధవా! భగవద్భక్తులకొసంగు స్థానమును బుండరీకాక్షుఁడు ఉగ్రకర్ములైన రాక్షసుల కె ట్లొసఁగును? ఈ ప్రశ్న మూలములో లేదు. విదురోద్ధవసంవాదమున కొక యంద మిచ్చుటకే యీ ప్రశ్న నాతనితో వేయించినాఁడు. ఈ ప్రశ్నకు సమాధానము నుద్ధవుఁడు పైనఁ జెప్పఁబోవును.

101. మ. దనుజానీకము = రాక్షసులగుంపు, అనేకవారములు = చాలతడవలు, దోర్దర్పంబు - దోః + దర్పము = బాహువులపొగరు, సంధిల్లఁగాన్ = కుదురుకొనఁగా, వినతాసూనుభుజావరోహుఁడు = గరుడుని భుజములపై నెక్కినవాఁడు. సునాభాస్త్రున్ = చక్రాయుధమును ధరించినవాఁడు, అగు నవ్విష్ణున్ = అయిన యా విష్ణువును, తారు = తాము, అనిలోన్ = యుద్ధములో, మార్కొని = ఎదిరించి, హరి, దైత్యారాతి = రాక్షసులకు శత్రువైన ఓ వైకుంఠుఁడా! పోకు పోకు = పోవలదని, మార్కొని = ఎదుర్కొని, తదాననమున్ చూచుచున్ = ఆ కృష్ణుని ముఖమును చూచుచు, కూలి = మరణించి, అత్యున్నతిన్ = గొప్పతనముతో, మోక్షపదమున్ ప్రాపింతురు = మోక్షమును బొందెదరు.

**తాత్పర్యము** : రాక్షసు లనేక పర్యాయములు, భుజాగర్వముతో శ్రీమహావిష్ణువు నెదురింతురు. గరుడునిపై నెక్కి చక్రాయుధమును ధరించి తమతో యుద్ధమును సేయ వచ్చు కృష్ణస్వరూపమును వారు దర్శింతురు. ఓ హరీ! పోకు. పోకు మని సాహసముతో నెదిరించి చక్రాయుధలూనకంఠులై మరణకాలమం దా భగవంతుని దర్శించుచుఁ జచ్చుటచేత నుత్తమమైన మోక్ష మందెదరు. ఈ యధ్యాయమందలి మంచిశ్లోకములలో నిది యొకటి. ఆ మూలశ్లోక మీ క్రిందిది.

శ్లో : మన్యేఽ సురాన్ భాగవతాన్ త్ర్యధీశే,
సంరంభమార్గాభినివిష్టచిత్తాన్,
యే సంయుగేఽ చక్షత తార్క్ష్యపుత్ర
మంసే సునాభాయుధమాపతంతమ్.

**తాత్పర్యము** : ఉద్ధవుఁ డనుచున్నాఁడు. 'విదురా! రాక్షసులుగూడ భాగవతులనియే నాయూహ. ఎందుకనఁగా భగవంతునకు శాంత, ఘోరములని రెండురూపములను ముందే చెప్పితిని గదా! గరుడాధిరూఢుఁడై చక్రాయుధుఁడై వచ్చుట యాతని ఘోరరూపము. మరణకాల మం దా ఘోర రూపమును దర్శించుచువారు ముక్తి నందెదరు. భక్తులు శాంతరూపమును విలోకించుచు ముక్తిని బొందుదురు. తెనుఁగులో నీ స్వారస్యము స్పష్టముగా రాలే దనుకొందును. మూలకారుని యభిప్రాయమున కుపస్ఫోరకముగా "తస్మాత్కేనా ప్యుపాయేన కృష్ణే చిత్తం నివేశయేత్" - అని సప్తమస్కంధములో వచ్చును.

102. క. ధీరజనోత్తమ = ధీరుఁడైన విదురుఁడా! నవసితసారసనేత్రుఁడు = క్రొత్తగా వికసించిన తెల్లదామరలతో సమానమైన కన్నులుగలవాఁడు, జననంబును = పుట్టుకను, తత్ + చారిత్రమున్ = ఆ కృష్ణునిచరిత్రను, ఉదారతన్ = శ్రవణాసక్తిగల గొప్పమనస్సుతో, తద్విధమెల్లన్ = ఆ పద్ధతి యంతయు, వినుము.

**తాత్పర్యము** : ఓ విదురా! కృష్ణునిచరిత్రను సంక్షేపముగాఁ జెప్పుచున్నాను. వినుము.

103. చ. ధరణిభరంబుపాపుటకున్ = భూభారమును తగ్గించుటకు, తామరస + ఆసనుప్రార్థనన్ = బ్రహ్మదేవుని ప్రార్థనచేత, రమావరుఁడు = శ్రీ మహావిష్ణువు, అల కంసబంధన నివాసమునన్ = కంసుని చెఱసాలలో, ఉద్భవింపన్, వెఱపునన్ = భయముచేత.

**తాత్పర్యము** : "భూభారమును తగ్గించుటకై జన్మింపవలసినదని బ్రహ్మదేవుఁడు శ్రీమన్నారాయణుని ప్రార్థించెను. ఆతని మొఱవిని లక్ష్మీశ్వరుఁడు కంసుని బంధనాగారమందు దేవకీవసుదేవులకు జన్మించినాఁడు. బలవంతుఁడైన

కంసుఁ డా శిశువును హింసించునేమో యను భయమున వసుదేవుఁడు ఆ శిశువు పుట్టిన యర్ధరాత్రముననే మందకేగెను.

**104.** క. నందుని మందకున్ చని, తత్ + సుందరి - తత్సుందరి = ఆ నందునిభార్య, తల్పమునన్ పరులు సూడకయుండన్, ఆనకదుందుభి = వసుదేవుఁడు, తొల్లిటి పురికిన్ = మధురకు, మఱలంగన్ ఏగెన్.

**తాత్పర్యము** : వసుదేవుఁడు తనకుమారుని నందునిభార్య తల్పముపై నుంచి యాయోగమాయను దీసికొని వచ్చినాఁడు.

**105.** క. ఏకాదశ సంవత్సరములు = పదునొకండు వర్షములు, తనున్ హరియని ఎవ్వరున్ ఎఱుఁగకుండన్ = తన్నుఁ బరమాత్ముఁడని యెవ్వరు గుర్తింప కుండునట్లుగా, ఆ హలధరుతోన్ = ఆ బలరామునితో, క్రీడించుచుండెన్.

**తాత్పర్యము** : కృష్ణుఁడు నందవ్రజములో పదునొకండువర్షము లుండెను. త న్నెవ్వ రెఱుఁగకుండునట్లు గూఢార్చియై బలరామునితోఁ గ్రీడించుచు కాలము గడపుచుండినాఁడు.

**106.** క. గోపాలవరులకైననున్ = దేవతలలో శ్రేష్ఠులైనవారికైనను, అపోవఁగన్ = తృప్తిగా, తన సమంచితాకారమున్ = తన యుత్తమమైన యాకారమును, చూపని శ్రీపతి = ప్రత్యక్షపరుపని కృష్ణపరమాత్మ, వేడుకన్ = సంతోషముతో, గోపాలురన్ కూడి = గొల్లలతోఁ జేరి, గోవత్సములన్ = ఆవులను, దూడలను, కాచెన్ = మేపెను.

**తాత్పర్యము** : దేవతా శ్రేష్ఠులకైనను దృష్టిగలుగునట్లుగాఁ దన యాకారమును జూపని భగవంతుఁడు గోపాలురతోఁగూడి, మందలను మేపికొనుచు కాలము గడపెను. గోపాలురు అనఁగా దేవతాశ్రేష్ఠులు. "స్వర్గేషు పశువాగ్వజ్రదిఙ్నేత్రఘృణి భూజలే" - లక్ష్యదృష్ట్యా స్త్రియాంపుంసి గౌః" అని యమరము. గోశబ్దమునకు స్వర్గ, ఇషు, పశు. వాక్. వజ్ర. దిక్. నేత్ర, ఘృణి, భూ, జలములని యర్థము. లక్ష్యముల ననుసరించి యా శబ్దము పుం.స్త్రీ లింగములలో వర్తించునని తాత్పర్యము.

**107.** వ. లీలావినోదంబులు = తన యోగమాయా శక్తులు.

**తాత్పర్యము** : అప్పుడు కృష్ణుఁడు లీలావినోదములుగాఁ దన యోగమాయాశక్తులను గోపాలురకుఁ జూపఁదలఁచినాఁడు.

**108.** చ. వరయమునా.... ని కుంజములందున్ - వర = శ్రేష్ఠమైన, యమునా నదీ = యమునకు సంబంధించిన, సలిలవర్ధిత = నీటిచేత పెంపఁబడిన, సౌరభయుక్త = సువాసనలతోఁ గూడిన, పుష్ప = పూలయందలి, మేదుర = నిండియున్న, మకరందపాన = తేనెలుద్రావుటచేత, పరితోషిత = సంతోషపఱుపఁబడిన,

భృంగసురంగ = భృంగములకు నాట్యరంగములైన, మాధవీ, కురవక, కుంద = జాజులు, చందన, వీనికి సంబంధించిన, నికుంజములందున్ = పొదరిండ్లలో, మయూర = నెమళ్లు, శారికా = గొరవంకలు, పరభృత = కోయిలలు, రాజకీర = ఉత్తమములైన చిలుకలు, మృదుభాషలభంగిన్ = వీని యఱపులవలె, చెలంగి = సంతోషముతో నవ్వుచున్.

**తాత్పర్యము** : యమున గట్టులందున్న వృక్షము లనేకములు. పొదరిం డ్లనేకములు, కురవకములు, కుందములు చందనములు - ఇత్యాదులు. అవి యన్నియు యమునాజలములచేతనే పెంపఁబడినవి. ఆ వృక్షములసొబగులే వేఱు. ఆ ప్రదేశములందుఁ దిరుగాడుచుఁ గృష్ణుఁడు కోయిలలవలె, గోరువంకలవలె, మయూరములవలె, చిలుకలవలె నఱచుచు గోపాలురకు సంతోషమును గల్గించుచుండెను.

109. ఉ. శ్రీరమణీ మనోవిభుఁడు = శ్రీమహావిష్ణువు, సింహకిశోరమున్ పోలి = సింగపుఁగొదమవలె, కౌమారదశన్ = కౌమారావస్థయందున్ = బాల్యయౌవనముల నడిమి దశ కౌమారము, రమావిమలమందిరము లక్ష్మీనివాస స్థానమును, పురుడించుగోతతిన్ = పోలునట్టి గోసమూహమును, వారక మేపుచున్ = దినమును మేపుచు, తరళవంశ = ప్రకాశించుచున్న వేణువుయొక్క, రవ = ధ్వనులయందు, స్ఫుట = వ్యక్తమగుచున్న, మాధురీ సుధా + ఆసారముచేతన్ = మాధుర్యమనెడు నమృతప్రవాహముచేత, గోపజనసంఘములన్, ముదము + అందన్ఁజేయుచున్.

**తాత్పర్యము** : కౌమారదశలోఁ గృష్ణుఁడు సింహపుఁబిల్లవలె నుండెను. అతఁడు లక్ష్మీనివాస స్థానములైన గోసంతతులను దినమును మేపుకొనుచు వచ్చుచున్నాఁడు. రమణీయమైన తన మురళీనినాదము లనెడు నమృత ప్రవాహములతో గోపకులకు సంతోషమును గూర్చుచుండెను.

110. వ. మఱియును = ఇంకను

111. మ. చిరకేళీరతిన్ = ఆటలయందలి యాసక్తిఁతో, బాలకుల్, తృణములన్ గడ్డిపోచలను, సింహ + ఆదిరూపములన్, పెరికివేయుటవలె కరుణా + అతీతులు, దయలేనివారు కామరూపులు = కోరుకొన్నరూపములను ధరించెడువారు. కంసప్రయుక్త = కంసునిచేఁ బంపఁబడిన, క్షపాచరులన్ = రాక్షసులను, సంగరస్థలములన్ = యుద్ధములలో, చక్కాడెన్ = సంహరించెను, లీలాగతిన్ = క్రీడఁగా.

**తాత్పర్యము** : క్రీడాపరులైన బాలకులు గడ్డితో సింహాదిరూపము లొనర్తురు. కొంతసే పాడికొని వానిని మఱలఁ జీల్చివేయుదురు. అట్లే కృష్ణుఁడు కంసునిచేఁ బంపఁ బడిన రాక్షసులను లీలగాఁ జంపినాఁడు. వారేమాత్రమును దయలేనివారు. కోరుకొన్నరూపములు ధరించువారు. మూలములో 'బాలంక్రీడనకా నివ" అని యున్నది. దానికీ పద్యము పెంపు.

112. చ. వరయమునానదీ జలనివాస = యమునా నదికి సంబంధించిన కాళియహ్రదమందు నివసించుచున్న, మహా + ఉరగ = కాళియుఁడను గొప్పసర్పము యొక్క, విస్తృత = విశాలమైన, ఆస్య = ముఖమునందు, విస్ఫురిత = ప్రకాశించుచున్న, విష + అనల ప్రభలసోఁకునన్ = విషమనెడు నగ్నులు దాఁకుటచేత, క్రాఁగిన = తపింపఁజేయఁబడిన, గోప = గోపులను, గోధనోత్కరములన్ = వారిధనములైన గోవులను, ఎల్లన్ కాచి, భుజగప్రవరున్ = ఆ సర్పమును. వెడలంగన్‌తోలి = వెడలఁగొట్టి, తత్ + సరిత్ + అమల + అంబుపానమునన్ = ఆ కాళీయహ్రదముయొక్క పరిశుద్ధజలములను ద్రావించుటచేత, గోతతిన్ = గోవులను, సంతసము అందఁగన్ చేసెన్.

**తాత్పర్యము** : కాళిందీహ్రదమునందు కాళియుఁడను మహాసర్ప ముండెను. దానివిషముచేత నా జలములు గశ్మలము లైనవి. ఆ విషవహ్నులచే ననేకగోప గోగణములు తల్లడిల్లి పోయినవి. కృష్ణుఁ డా మహాసర్పమును వెళ్లఁగొట్టెను. పరిశుద్ధములైన యా నీటినిద్రావించి గోవులకు సంతసము నొడగూర్చినాఁడు.

113. మ. దివిజాధీశున్ గుఱించి = ఇంద్రు నుద్దేశించి, వానకొఱకై దీపింపన్ = ప్రకాశింపఁగా, నందాదివల్లవులు = నందుఁడు మొదలైనగోపులు, అనూనసంపదలన్ = గొప్పసంపదలతో, శచీ+ధవుగర్వంబుఅణఁపన్ = ఇంద్రుని గర్వముఁ బోఁ గొట్టుటకు, ధనవ్యయముగాన్ = ధనము కర్చగునట్లు, గోయాగమున్ చేసెన్.

**తాత్పర్యము** : ప్రతివర్షమును గోపు లింద్రయాగమును నిర్వర్తించుచుండిరి. ఆ యుత్సవ మొనర్చినచోఁ జక్కగా వానలు గురియు నని వారి విశ్వాసము. దానినిబట్టి ఇంద్రునకుఁ దానే సర్వాధికారి ననుగర్వ మేర్పడినది. దానిని బోఁగొట్టుటకై యింద్రోత్సవమును మాన్పించినాఁడు. గొప్పగా ధనములు ఖర్చువెట్టి గోయాగము నొనర్చెను. "ఆయాజయత్‌గోపరాజం" అని మూలము. నందునిచేఁ జేయించెనని భావము. కృష్ణుఁడే చేసినట్లు తెలుఁగులో నున్నది.

114. చ. హరిహయుఁడు = ఇంద్రుఁడు, రోషవివశ + ఆవిలమానసుఁడై = రోషమునకు లోఁబడిన కళంకితమైన బుద్ధిగలవాఁడై, సరోరుహ + ఉదరు మహిమంబున్ = శ్రీమహావిష్ణువు మహిమను, ఎఱుంగక మదంబు +అడరంగన్, వలాహక + అది భీకరఘనపంక్తిన్ = మేఘపుష్పము, వలాహకము మొదలైన ప్రళయకాలమందు వర్షించెడు మేఘములగుంపును బంపఁగా, అనూనగర్జనలన్ = గొప్ప గర్జనలతో, శిలామయభూరివర్షముల్ = రాళ్ళతోఁ గూడిన గొప్పవర్షమును, ఆకులమంది = దుఃఖించి, కుందఁగన్.

**తాత్పర్యము** : ఇంద్రునిమనస్సు కోపముతోఁ గలుషిత మైనది. వానికిఁ గృష్ణునిమహిమ దెలియలేదు. అతఁడు వలాహకాదిమేఘముల నాహ్వానించి నందవ్రజముపైఁ బంపినాఁడు. అవి రాలు రప్పలు వర్షించెను. గోపాలకు లందఱావర్షముతో విపరీతముగా భయపడినారు.

115. ఉ. అత్తఱిన్ = ఆ సమయమందు, మంద కొందలము నందఁగాన్ = నందవ్రజము క్షోభించుచుండఁగా, వల్లవులు ఎల్లన్ = గోపకు లందఱు ఈ చేతనులు+ఎల్లన్ = ఈ ప్రాణు లందఱును, ఇట్టి జడిన్ = నిలువక కురిసెడు నీ వానలలో, చిందఱ వందఱలై = అక్కడక్కడ చెదరిపోయినవారై, మనంబులన్, కాతరులైరి = భయపడినవా రైనారు. మహాత్మ! అనాథనాథ! = నాథులులేనివారిని రక్షించువాఁడా!, నిర్ధూతకళంక! = పోఁగొట్టఁబడిన పాపము గలవాఁడా! భక్తిపరితోషణభూషణ! = భక్తులను దృప్తిపఱచుటయే భూషణముగాఁ గలవాఁడా! పాపశోషణా! = పాపములను నశింపఁజేయువాఁడా!

ఇచ్చట నిర్ధూతకళంక! పాపశోషణా - ఈ రెండును ఏకార్థకములుగాఁ గన్పించుచున్నవి. మొదటిదానికి మనఃకృతపాపము లనియు, రెండవదానికి బాహ్యప్రవృత్తు లనియు, నర్థముచేసి కొనవచ్చును.

**తాత్పర్యము** : అప్పుడు నందవ్రజ మస్తధ్వస్త మైనది. గోపాలకు లెక్కడివా రక్కడ చెదరిపోయిరి. గోపాలకులు 'కృష్ణా'! గోపు లందఱు నెక్కువగా భయపడినారు. వీరిని దయతో రక్షింపుము అని కృష్ణుని వేఁడికొన్నారు. కడపటిపాద మంతయుఁ గృష్ణునిగూర్చిన సంబోధనము. యథాప్రకార మాయన యెప్పు డొనర్చెడు ప్రాససౌందర్యము.

116. మ. అని ఈ భంగిన్ = ఈ రీతిగా, విపన్నులు ఐ పలుకన్ = ఆపదలోఁ జిక్కినవారై మొఱవెట్టఁగా, సజ్జనవర్ధిష్ణుఁడు = సజ్జనులను వృద్ధిఁబొందించెడువాఁడైన కృష్ణుఁడు, గోపగోనివహరక్షాదక్షుఁడై = గోపకులు, గోసమూహములు - వీనిని రక్షించుటందు గొప్పసామర్థ్యము గలవాఁడై, దేవతాజను లగ్గింపన్ = దేవతలు పొగడునట్లుగా, కరాంబుజాతమునన్ = కరపద్మముతో, తటచరద్రమ్యామరీ జాలమున్ = కొండమధ్యప్రదేశములందు విహరించు దేవతాస్త్రీలతోఁ గూడిన దైన, గోవర్ధన శైలమున్ = గోవర్ధనపర్వతమును, బోరనన్ = వెంటనే, సత్ + ఛత్రంబుగాన్ = చక్కని గొడుగుగా, తాల్చెన్ = ధరించెను.

**తాత్పర్యము** : అప్పుడు కృష్ణపరమాత్మ గోపాలకులమొఱ నాలించి గోగోపనివహమును రక్షించుటయం దభినివేశము గలవాఁడై దేవతలు పొగడునట్లుగా తటభూములందు విహరించుచున్న నందరులైన దేవతాస్త్రీలుగల గోవర్ధనపర్వతమును గరపద్మముతో లీలగా గొడుగువలె నెత్తి వారిని రక్షించెను. ఈ మూఁడునాల్గు పద్యములుగూడ పోతనామాత్యుల విస్తరణము. మూలములో "గోత్రలీలాతపత్రేణ" అని మాత్రమే గలదు. అమాత్యుఁడు రమణీయముగాఁ గథాకథన మొనర్చినాఁడు.

117. సీ. ఒకనాఁడు = ఒకరోజు, శరదాగమ = శరదృతువుయొక్క ఆగమ = ఆరంభమునందలి, సంపూర్ణపూర్ణిమా = సంపూర్ణముగఁ జంద్రుఁడుగల, సాంద్ర = విరివియైన, చంద్రాతప = వెన్నెలచేత, ఉజ్జ్వలిత మగుచున్ = ప్రకాశించునట్టిదిగా, వెలయు = ఒప్పుచున్న, బృందాటవీవీథిన్ = బృందావన కాననములందు, రాసకేళీమహోల్లాసుఁడు అగుచున్ = రాసకేళియందు గొప్ప ఉల్లాసముగలవాఁడై, రుచిర = ప్రకాశించుచున్న, సౌభాగ్య = సౌభాగ్యముగల, తారుణ్యా= యౌవనముచేత, మనోరమనవ్వార్తిన్ = కమనీయమైన వర్తితితో, చెన్నొందినమూర్తి = ప్రకాశించునాకారము, తనరన్ = ఒప్పఁగా, సలలిత, ముఖచంద్ర చంద్రికాతతి = ముఖచంద్రునిచంద్రికలవంటి చిఱునగవు, గోపనయనఉత్పలములకున్ = గోపకుల కన్ను లనెడు కలువలకు, ఆనందము ఒసఁగన్, భవ్యచాతుర్యభంగిన్ = గొప్పకౌశలముతో, త్రిభంగి యగుచున్ = పాదములందు, నడుమునందు, శిరస్సునందు వంకరలుగల రూపముగలవాఁడై, అబ్జనాభుండు = కృష్ణుఁడు, సమ్మోదము అతిశయిల్లన్, లీలన్ పూరించు, వరమురళీనాదము = శ్రేష్ఠమైన పిల్లనగ్రోవిధ్వని, వీతేరన్ =రాఁగా, విని = విన్నవారై, మోహితాత్ములు అగుచున్.

**తాత్పర్యము :** శరత్కాల మారంభమైనది. శరత్కాలపువెన్నెలలు చాల రమ్యముగా నుండెను. ఆకాశము మేఘాక్రాంతముగాక స్వచ్ఛమై యుండుట వలన వెన్నెల లన్నియెడలను సాంద్రముగ వ్యాపించియుండెను. పైఁగా నానాఁడు పూర్ణిమ. ఇంకను జక్కఁగా వెన్నెల లలమియుండెను. పరమాత్మకు రాసకేళి యొనర్పవలెనని తోఁచినది. ఆతనిమూర్తిసంపద యమోఘము. నిత్యతారుణ్యము. ముఖమున కందములైన చిఱునవ్వులు. గోగోపాలుర కన్నులనెడు కలువల కానందకరములుగా నుండెను. ఆతఁడు త్రిభంగిగా నిలిచి సంతోషముతో వేణువు నూదెను. ఆ ధ్వనితో గోపులు గోపికలు అందరును మోహితాత్ములైనారు.

**118.** చ. పతులు, మఱందులున్ సుతులు, బావలు, అత్తలు, మామలున్, సమున్నతిన్ = తమతమయధికారములతో, వలదన్నన్, మానక, గోపకామినులు, కృష్ణపదాబ్జసేవన + అన్వితరతిన్ = కృష్ణుని పాదములందుఁ గూడికొన్న తీవ్రమైన భావనావేశముగలవారై, చనుదేరన్ = వేగమున రాఁగా బృందావీథులన్ = బృందావనవీథులను బొందగా, శోభితగతిన్ = అందముగా, తరుణీనవపుష్పచాపుఁడై = ఆ స్త్రీలకు నూత్నముగానున్న మన్మథునివంటివాఁడై, రాసకేళి సలిపెన్.

**తాత్పర్యము** : బంధువు లందఱును వలదన్నను గోవకామినులు కృష్ణునిపాదములందే తీవ్రమైన యభినివేశము గలిగినవారై పరువెత్తికొనివచ్చినారు. కృష్ణుఁడు వారిపాలికి నవమన్మథుఁడై పరమరమణీయముగా రాసకేళి యొనర్చెను.

ఈ రెండుపద్యములకును మూల మీక్రిందిది.

"శరచ్ఛశికరై ర్మృష్టం మానయన్ రజనీముఖమ్,

గాయన్ కలపదం రేమే, స్త్రీణాం మండలమండనః"

ఈ శ్లోక మాధారముగా నమాత్యుఁడు రమణీయమైనకథను అపురూపమైన భక్త్యావేశముతో నల్లినాఁడు. పదసౌందర్యము కొట్టవచ్చినట్లుగా నున్నది. పరమమనోహరము లీ రెండుపద్యములు. దశమస్కంధములోని యావేశలేశ మీ రచన నంటినట్లున్నది.

**ఇది పుట్టపర్తి నారాయణదాస విరచిత**
**భాగవతసుధాలహరియందు తృతీయస్కంధమున**
**ద్వితీయాధ్యాయము.**

# భాగవత సుధాలహరి
## తృతీయస్కంధము
## తృతీయాధ్యాయము

**ఉద్ధవ ఉవాచ -**

తత స్స ఆగత్య పురీం స్వపిత్రో
శ్చికీర్షయా శం బలదేవసంయుతః,
నిపాత్య తుంగా ద్రిపుయూథనాథం
హతంవ్యకర్ష ద్వ్యసుమోజసోర్వ్యామ్. 1

సాందీపనే స్సకృత్ప్రోక్తం బ్రహ్మాధీత్య సవిస్తరమ్,
తస్మై ప్రాదా ద్వరం పుత్రం మృతం పంచజనోదరాత్. 2

సమాహుతా భీష్మకకన్యయా యే
శ్రియ స్సవర్ణేన బుభూషయైషామ్,
గాంధర్వవృత్త్యా మిషతాం స్వభాగం
జహ్రే పదం మూర్ధ్ని దధ త్సుపర్ణః. 3

కకుద్మినోఽవిద్ధనసోదమిత్వా
స్వయంవరే నాగ్నజితీ ముపాహ,
తద్భగ్నమానానపి గృధ్నతోఽజ్ఞాన్
జఘ్నేఽక్షతశ్శస్త్రభృత స్స్వశ స్త్రైః. 4

ప్రియం ప్రభు ర్గ్రామ్య ఇవ ప్రియాయా
విధిత్సురార్చ ద్ద్యుతరుం యదర్థే,
వజ్ర్యా ద్రవత్తం సగణో రుషాంధః
క్రీడామృగోఽయం రచితో వధూనామ్. 5

సుతం మృధే ఖం వపుషా గ్రసంతం
దృష్ట్వా సునాభోన్మథితం ధరిత్ర్యా,
ఆమంత్రిత స్తత్తనయాయ శేషం
దత్వా తదంతఃపుర మావివేశ. 6

తత్రాఽఽహృతా స్తా నరదేవకన్యాః
కుజేన దృష్ట్వా హరి మా ర్తబంధుమ్,
ఉత్థాయ సద్యో జగృహుః ప్రహర్ష
వ్రీడానురాగ ప్రహితావలోకైః. 7

ఆసాం ముహూర్త ఏకస్మి న్నానాగారేషు యోషితామ్,
సవిధం జగృహే పాణిం పురురూప స్స్వమాయయా. 8

తాస్వపత్యా న్యజనయ దాత్మతుల్యాని సర్వశః,
ఏకైకస్యాం దశ దశ ప్రకృతే ర్విబుభూషయా. 9

కాలమాగధసాల్వాదీ ననీకై రుంధతః పురమ్,
అజీఘన త్స్వయం కాంశ్చి త్స్వపుంసాం తేజ ఆదిశన్. 10

శంబరం ద్వివిదం బాణం మురం పల్వల మేవ చ,
అన్యాం శ్చ దంతవక్త్రా దీ నవధీ త్తాం శ్చ ఘాతయత్. 11

అథ తే భ్రాతృపుత్రాణాం పక్షయోః పతితా న్నృపాన్,
చ చాల భూః కురుక్షేత్రం యేషా మాపతతాం బలైః. 12

సకర్ణ దుశ్శాసన సౌబలానాం
కుమంత్రపాకేన హతశ్రియాయుషమ్,
సుయోధనం సానుచరం శయానం
భగ్నోరు ముర్వ్యాం న ననంద పశ్యన్. 13

కియా న్భువోఽయం క్షపితోరుభారో
యద్ద్రోణభీష్మార్జునభీమమూలైః,
అష్టాదశాక్షౌహిణికో మదంశై
రాస్తే బలం దుర్విషహం యదూనామ్. 14

మిథో యదైషాం భవితా వివాదో
మాధ్వ్యా మదా తామ్రవిలోచనానామ్,
నై షాం వధోపాయ ఇయా నతోఽన్యో
మయ్యుద్యతేఽంతర్దధతే స్వయం స్మ. 15

ఏవం సంచింత్య భగవాన్ స్వరాజ్యే స్థాప్య ధర్మజమ్,
నందయామాస సుహృద స్సాధూనాం వర్త్మ దర్శయన్. 16

ఉత్తరాయాం ధృతః పూరో ర్వంశ స్సాధ్వభిమన్యునా,
స వై ద్రౌణ్యస్త్రసంఛిన్నః పున ర్భగవతా ధృతః. 17

అయాజయ ద్ధర్మసుత మశ్వమేధై స్త్రిభి ర్విభుః,
సోఽపి క్ష్మా మనుజై రక్ష న్రేమే కృష్ణ మనువ్రతః. 18

భగవా నపి విశ్వాత్మా లోకవేదపథానుగః,
కామాన్ సిషేవే ద్వార్వత్యా మస క్త స్సాంఖ్య మాస్థితః. 19

స్నిగ్ధస్మితావలోకేన వాచా పీయూషతుల్యయా,
చారిత్రేణానవద్యేన శ్రీనికేతేన చాఽఽత్మనా. 20

ఇమం లోక మముం చై వ రమయన్ సుతరాం యదూన్,
రేమే క్షణదయా దత్తక్షణస్త్రీక్షణసౌహృదః. 21

త స్యేత్థం రమమాణస్య సంవత్సరగణా న్బహూన్,
గృహమేధేషు యోగేషు విరాగ స్సమజాయత. 22

దై వాధీనేషు కామేషు దైవాధీన స్స్వయం పుమాన్,
కో విస్రమ్భేత యోగేన యోగేశ్వర మనువ్రతః. 23

పుర్యాం కదాచి త్క్రీడద్భి ర్యదుభోజదశార్హకైః,
కోపితా మునయ శ్శేపు ర్భగవన్మతకోవిదాః. 24

తతః కతిపయై ర్మాసై ర్వృష్ణిభోజాంధకాదయః,
యయుః ప్రభాసం సంహృష్టా రథై ర్దైవవిమోహితాః. 25

తత్ర స్నాత్వా పితౄ న్దేవా నృషీం శ్చైవ తదంభసా,
తర్పయిత్వాఽథ విప్రేభ్యో గావో బహుగుణా దదుః. 26

హిరణ్యం రజతం శయ్యాం వాసాం స్యజినకంబళాన్,
హయా న్రథా నిభా న్కన్యా ధరాం వృత్తికరీ మపి. 27

అన్నం చోరురసం తేభ్యో దత్వా భగవదర్పణమ్,
గోవిప్రార్థాసవ శ్శూరాః ప్రణేము ర్భువి మూర్ధభిః. 28

ఇతి శ్రీమద్భాగవతే, మహాపురాణే, పారమహంస్యాం, సంహితాయాం,
తృతీయస్కంధే, తృతీయోఽధ్యాయః.

**1. శ్లో** : తతః = అనంతరమందు, సః = ఆ కృష్ణుఁడు, పురీం = పట్టణమును గుఱించి. బలదేవసంయుతః = బలరామునితోఁ గూడినవాఁడై, ఆగత్య = ప్రవేశించి, స్వపిత్రోః = తమ తల్లిదండ్రులైన దేవకీవసుదేవులకు, శం = సంతోషమును, చికీర్షయా = కలిగించుకోరికతో, రిపుయూధనాథం = శత్రుసైన్యాధినాథులకు అధిపతియైన, కంసుని, తుంగాత్ = ఉన్నతమైన సింహాసనమునుండి, నిపాత్య = త్రెళ్లనేసి, హతం = హతుఁడైనట్టియు, వ్యసుం = ప్రాణరహితుఁడైన యా కంసుని, ఓజసా = పరాక్రమముచేత, ఉర్వ్యాం = నేలపైన, వ్యకర్షత్ = ఈడ్చెను.

**తాత్పర్యము** : కంసుఁడు కృష్ణుని తలిదండ్రులైన దేవకీవసుదేవులను అమితముగా బాధించినాఁడు. తన్ను మిక్కిలిగా ద్వేషించుచున్నవాఁడు. దేవకీవసుదేవులకు సంతోషమును గూర్పనెంచి కృష్ణుఁడు బలరామునితోఁబాటు మధురానగరమునకు వచ్చి తన శత్రువులైన ప్రబలరాక్షసుల కధిపతియైన యా కంసుని సింహాసనమునుండి క్రింది కీడ్చినాఁడు. ఈడ్చుటలోనే వానిప్రాణము పోయినది. అప్పు డా విగతప్రాణుఁ డైన కంసుని శరీరమును నేలపై నీడ్చివేసినాఁడు.

**2. శ్లో** : సకృత్ప్రోక్తం = ఒక్కసారిమాత్రమే చెప్పఁబడిన, బ్రహ్మ = వేదమును, సాందీపనేః = సాందీపనినుండి, సవిస్తరం = సవిస్తరముగా, అధీత్య = పఠించినవాఁ డై, మృతం పుత్రం = ఆ సాందీపనియొక్క మృతుఁడైన పుత్రుని, పంచజనోదరాత్ = పంచజనుఁడను రాక్షసుని యుదరమునుండి, వరం = గురుదక్షిణగా, ప్రాదాత్ = సమర్పించెను.

**తాత్పర్యము** : కృష్ణుఁడు సాందీపని శిష్యత్వము నంగీకరించెను. గురు వొక్కసారి యు చ్చరించినచోఁ జాలును. కృష్ణున కదియంతయు నవగత మగుచుండెను. ఇట్లు సాంగోపాంగముగా వేదమును పఠించినాఁడు. గురుదక్షిణ నీయవలసివచ్చినది. సాందీపనిపుత్రుఁడు సముద్రమున మునిఁగి మరణించియుండెను. వానిని పంచజనుఁ డను నొకరాక్షసుఁడు మ్రింగినాఁడు. కృష్ణపరమాత్మ వానియుదరముఁజీల్చి యా పుత్రునిదెచ్చి గురుదక్షిణగా సాందీపనికి సమర్పించెను.

3. **శ్లో** : భీష్మక కన్యయా = భీష్మకునిపుత్రికచేత, యే సమాహుతాః = ఏ రాజు లాహ్వానింపఁబడిరో, బుభూషయా = అనుభవింపవలెనను కోర్కిచేత, మిషతాం = రెప్పవాల్పక చూచుచున్న, ఏషాం = ఏ రాజులయొక్క, మూర్ధ్ని శిరస్సునందు, పదం = పాదమును, దధత్ = ఉంచినవాఁడై, సుపర్ణః ఇవ = గరుత్మంతునివలె, గాంధర్వవృత్త్యా = గాంధర్వవృత్తిచేత, స్వభాగం = తన భాగమును, జగ్రహే = గ్రహించెను.

**తాత్పర్యము** : భీష్మకరాజు తనకన్యకయైన రుక్మిణీదేవి వివాహార్థమై ఏ రాజుల నాహ్వానించి పిలిపించెనో వా రందఱును వివాహమునకై చనుదెంచినారు. రూపలావణ్యాదులలో రుక్మిణీదేవి లక్ష్మీసమానురాలు. ఆమె శ్రీదేవియవతారమేగదా! ఆ వచ్చిన రాజు లందఱును నామెరూపలావణ్య విమోహితులైనవారే. వా రంద రామె ననుభవింప నువ్విళ్లూరుచుండిరి. కృష్ణుఁ డచ్చటికి వచ్చెను. ఆ వచ్చుట తక్కిన రాజన్యుల శిరస్సులపైఁ గాలుపెట్టిన ట్లైనది. ఆమెలక్ష్యంశయగుటతో స్వాభావికముగాఁ గృష్ణపరమాత్మునిభార్యయే. దేవేంద్రాదిదేవతల నెల్లర జయించి గరుడుఁడు తన భాగమైన యమృతమును గైకొన్నట్లుగాఁ గృష్ణపరమాత్మ రుక్మిణీదేవి నెత్తికొనిపోయి గాంధర్వ వివాహముతో వరించి తన రాజధానిని జేర్చెను.

4. **శ్లో** : అవిద్ధనసః కకుద్మినః = ముకుద్రాడు బిగించుటకు సాధ్యముగాని విశృంఖలముగానున్న వృషభములను, దమిత్వా = స్వాధీనపఱచికొని, స్వయంవరే = స్వయంవరమందు, నాగ్నజితీం = నగ్నజిత్తుకొమార్తెను, ఉవాహ = పెండ్లాడెను, తత్ = అది నిమిత్తముగా, భగ్నమానానపి = దెబ్బదిన్న అహంకారముగలవా రయ్యును. గృధ్నతః = తన్ను మార్కొనుచున్నట్టి, అజ్ఞాన్ = అవివేకవంతులైన, శస్త్రభృతః = శస్త్రములనుధరించిన రాజులను, స్వశస్త్రైః = తన బాణములచేత, అక్షతః = క్షతముగాని శరీరముగలవాఁడై, జఘ్నే = వధించెను.

**తాత్పర్యము** : నగ్నజిత్తుకొమార్తె నాగ్నజితి. తండ్రి యామెకు వివాహ మొనర్ప నిశ్చయించెను. అతనివద్ద నేడువృషభము లుండినవి. వానికి ముకుత్రాడు లేదు. అవి మదించి స్వేచ్ఛగాఁ దిరుగుచుండెను. వానిని స్వాధీనమునకుఁ దెచ్చి ముకుద్రాడు నెవఁడుగట్టునో వానికిఁ దనపుత్రిక నిత్తునని మహారాజు ప్రకటన మొనర్చెను. అనేకరాజులు ప్రయత్నించిరి. సాధ్యముకాక మానివేసిరి. కృష్ణుఁ డా యేడు వృషభములను బంధించి తెచ్చి నాగ్నజితిని బెండ్లాడినాఁడు. తక్కిన రాజుల కిది కన్నెఱ్ఱయయ్యెను. భగ్నదర్పులైనవారు కృష్ణపరమాత్మ నెదిర్చినారు. అతఁ డక్షతశరీరుఁ డై తన శస్త్రములతో వారి నందఱ నాశ మొనర్చెను.

5. **శ్లో** : గ్రామ్యః = విషయసుఖములం దాసక్తిగలవాఁడు, ప్రియాయాః = ప్రియురాలియొక్క, ప్రియం = కోరికను, విధిత్సుః ఇవ = తీర్చుటకై యత్నించునట్లుగా, ప్రభుః = సర్వేశ్వరుఁడైన కృష్ణుఁడు, యదర్థే = ఏ సత్యాదేవికోరికను దీర్చుటకై, ద్యుతరుం = దేవవృక్షమైన పారిజాతమును పెఱికించెనో, రుషాంధః = కోపముచే గ్రుడ్డివాఁడైన, వజ్రీ = ఇంద్రుఁడు, సగణః = సైన్యసమేతుఁడై, తం = ఆ కృష్ణుని, ఆద్రవత్ = ఎదిరించెను, అయం = ఆ యింద్రుఁడు, వధూనాం = స్త్రీలయొక్క, క్రీడామృగః నూనం = పెంపుడులేడి. ఇది నిజము.

**తాత్పర్యము** : సర్వేశ్వరుఁడైన కృష్ణుఁడు ఇంద్రుని యహంకారమును జెరుపనెంచినాఁడు. అతఁడు ప్రియురాలైన సత్యాదేవి కోరికను దీర్పయత్నించువానివలె నటించెను. స్వర్గమున కేగి దేవతరువైన పారిజాతమును బెఱికించినాఁడు. దేవస్త్రీలచేఁ బ్రేరేపింపఁబడిన యింద్రుఁడు వజ్రాయుధమును ధరించి దేవసైన్యముతోఁ గృష్ణు నెదిర్చెను. దేవేంద్రుఁడు స్త్రీలకుఁ గ్రీడామృగము వంటివాఁడు. అందుచేఁ గృష్ణునిమహిమను మఱచిపోయినాఁడు.

6. **శ్లో** : వపుషా = తన శరీరముచేత, మృధే = యుద్ధమందు, ఖం = ఆకాశమును, గ్రసంతం = మ్రింగుచున్నట్లున్నట్టియు, సునాభోన్మథితం = చక్రాయుధముచే నిహతుఁడైనట్టి, సుతం = పుత్రుని, దృష్ట్వా = చూచి, ధరిత్ర్యా = భూదేవిచేత, ఆమంత్రితః = ప్రార్థింపఁబడినవాఁడై, తత్తనయాయ = నరకాసురుని కొడుకైన భగదత్తుని యంతఃపురమును, ఆవివేశ = ప్రవేశించెను.

**తాత్పర్యము** : నరకాసురుఁడు ప్రచండుఁడైన రాక్షసుఁడు. కృష్ణపరమాత్మ వానిపై వెడలినాఁడు. వాఁడు తన దేహముతో నాకాశమును మ్రింగు నటు లుండెను, అట్టియా నరకాసురుని స్వామి తన చక్రాయుధముతో హతమార్చెను. నరకుఁడు భూదేవికుమారుఁడు. ధరిత్రీదేవి కృష్ణపరమాత్మను బ్రార్థించినది. ఆ ప్రార్థనను మన్నించి కృష్ణుఁడు భగదత్తునకుఁ బట్టాభిషేక మొనర్చెను. ఒనర్చి వానియంతఃపురమును బ్రవేశించినాఁడు.

7. **శ్లో** : కుజేన = భూపుత్రుఁడైన నరకునిచేత, ఆహృతాః = అపహరించికొనిరాఁబడిన, నరదేవకన్యాః = మూర్ధాభిషిక్తులైన రాజులకన్యకలు, ఆర్తబంధుం = అనాథనాథుఁడైన, హరిం = హరిని, తత్ర = అచట, దృష్ట్వా = చూచి, సద్యః = అపుడే, ఉత్థాయ = లేచి, ప్రహర్ష = సంతోషము, వ్రీడా = లజ్జ, అనురాగ = అభిలాష - వీనిచేత, ప్రహిత = ప్రేరేపింపఁబడిన, అవలోకైః = కటాక్షములతో, జగృహుః = స్వీకరించిరి.

**తాత్పర్యము** : భూపుత్రుఁడైన నరకాసురుఁడు మూర్ధాభిషిక్తులైన రాజులకొమార్తెలను పెక్కుమంది నపహరించి తెచ్చినాఁడు. ఆ కన్యకలు అనాథనాథుఁడైన కృష్ణపరమాత్మ రక్షణమును గోరినారు. సంతోషము, లజ్జ, అనురాగము - వీనితోఁగూడిన చూపులతో మమ్ము గ్రహింపుమని ప్రార్థించిరి.

**8. శ్లో** : నానాగారేషు = అనేక భవనములందు వసించుచున్న, ఆసాంయోషితాం = ఆ స్త్రీలయొక్క, సవిధం = సమీపమునుబొంది, స్వమాయయా = తనమాయచేత, అనురూపః = వారిసౌందర్యములకుఁదగినవాఁడై, పాణీన్ = వారి హస్తములను, ఏకస్మిన్ముహూర్తే = ఒకటేముహూర్తమందు, జగృహే = స్వీకరించెను.

**తాత్పర్యము** : కృష్ణుఁడు వారి నా బంధనాగారములనుండి విడిపించినాఁడు. వారు వారు వేర్వేరు భవనములం దుండిరి. స్వయోగ మాయావిభవముతో నాతఁ డందఱ కన్నిరూపులై ఒకటేముహూర్తమందు వారిని పాణిగ్రహణ మొనర్చెను.

**9. శ్లో** : తాసు = వారియందు, ఏకైకస్యాం = ఒక్కొక్కతెయందు, ప్రకృతేః = మాయయొక్క, విబుభూషయా =వైవిధ్యము గన్పఱచుట కిచ్ఛగించినవాఁడై, సర్వతః = సర్వవిధములుగా, ఆత్మతుల్యాని = తనతో సమానులైన, దశదశ = పదిపదియైన, అపత్యాని = అపత్యములను, అజనయత్ = కల్గించెను.

**తాత్పర్యము** : ఆ భార్యలలో నొక్కొక్కదాని యం దాతఁడు పదిమందికుమారులను గన్నాఁడు. వారు సర్వవిధములఁ గృష్ణుని కనురూపులై యుండిరి. ఇదియంతయు స్వమాయాప్రభావమును లోకమునకుఁ గనఁబఱచవలెనని చేసిన చేష్టయై యుండెను.

**10. శ్లో** : అనీకైః = సైన్యములచేత, పురం = తన పట్టణమును, రుంధతః = మాటిమాటి కడ్డగించుచున్న, స్వపుంసాం = స్వభక్తులకు, దివ్యం స్వయంతేజః = దివ్యమైన స్వశక్తిని, ఆదిశన్ = ప్రకటించుచున్నవాఁడై, అజీఘనత్ = చంపింపఁ జేసెను.

**తాత్పర్యము** : సైన్యసహితులై కాలయవనుఁడు, జరాసంధుఁడు, సాల్వుఁడు మొదలైనవారు మాటికి మధురాపట్టణము నడ్డగించుచుండిరి. వారికిఁ దన దివ్యశక్తిని తోపింపఁజేసి స్వభక్తులైన ముచుకుందాదులచే వారిని జంపించినాఁడు లోకమందు దనభక్తులకు మహిమను బ్రకటించుటకీచేష్ట లొనర్చెను.

**11. శ్లో** : శంబరం, ద్వివిదం, బాణం, మురం, పల్వలం, దంతవక్త్రాదీన్, అన్యాంశ్చ = దంతవక్త్రాదులు మొదలైన యితరులను, అవధీత్ = కొందఱను తానే చంపెను. ఘాతయత్ = కొందఱి నితరులతోఁ జంపించెను.

**తాత్పర్యము** : శంబరుఁడు, ద్వివిదుఁడు, బాణుఁడు, ఇల్వలుఁడు - వీరిని ప్రద్యుమ్నాదులతోఁ జంపించెను. దంతవక్త్రాదులను దానే చంపెను.

**12. శ్లో** : తే = నీయొక్క, భ్రాతృపుత్రాణాం = సహోదరులసంతాన మైనట్టియు, పక్షయోః = రెండు వర్గములుగా, పతితాన్ = చేరిన, నృపాన్ = రాజులను, ఘాతయన్ = పరస్పరము చంపించినవాఁడై, కురుక్షేత్రం = కురుక్షేత్రమును, ఆపతతాం = పొందినట్టి, యేషాం = ఎవరియొక్క, బలైః = బలములచేత, భూః = భూమి, చచాల = చలించెనో.

**తాత్పర్యము** : ఓ విదురా! నీ సహోదరులైన ధృతరాష్ట్ర పాండురాజులకుమారులు యుద్ధమునకు సిద్ధమై నిలిచినారు. అనేకరాజు లిరువైపులఁ జేరిరి. వారిసైన్యములతోఁ గురుక్షేత్రము కంపించినది. ఆ కురుక్షేత్రమందుఁ గృష్ణపరమాత్మ సంచరించుచు క్రోధావిష్టులైన యా రాజులను బరస్పరము చంపించినాఁడు.

**13. శ్లో** : సకర్ణదుశ్శాసన సౌబలానాం = కర్ణునితోఁగూడిన దుశ్శాసనుఁడు, శకుని - వీరియొక్క, కుమంత్రపాకేన = దుర్మంత్రము యొక్క ఫలముగా, హతశ్రియాయుషం = నశింపఁజేయఁ బడిన లక్ష్మి ఆయుస్సులతోఁ గూడినవాఁడును, భగ్నోరుం = ఖండింపఁబడిన తొడగలవాఁడై, ఉర్వ్యాం = యుద్ధభూమియందు, శయానం = పడియున్నట్టి, సానుచరం = అనుచరులతోఁగూడియున్న, సుయోధనం = దుర్యోధనుని, పశ్యన్ = చూచినవాఁడై, న నంద = ఎక్కువగా సంతోషింపలేదు.

**తాత్పర్యము** : కర్ణుఁడు, దుశ్శాసనుఁడు, శకుని - వీరిదుర్మంత్రములతో దుర్యోధనుఁడు ఆకర్షింపఁబడినాఁడు. వీరిబోధలచే వాని యాయుస్సు లక్ష్మియు హరింపఁబడినవి. భీమసేనుఁడు గదాదండముతో వాని తొడవిఱిచెను. వాఁడు కురుక్షేత్రమునందు భూశయ్యాగతుఁడైనాఁడు. సానుచరముగా నశించిపోయిన దుర్యోధనునిఁజూచి కృష్ణుఁడెక్కువగ సంతోషింపలేదు. భూభార మెక్కువగా వీడలేదని యర్థము.

**14. శ్లో** : ద్రోణభీష్మార్జున భీమమూలైః = ద్రోణుఁడు భీష్ముఁడు అర్జునుఁడు మున్నగువారే ప్రధానకారణములతోఁ గూడిన, భువః = భూమియొక్క యత్ ఉరుభారః = ఏ మహాభారము, కియాన్ = ఎంతమాత్రము, క్షపితః = నశింపఁ జేయఁబడినది, మదంశైః = నాయంశములతోఁ గూడిన, యదూనాం = యాదవులయొక్క, దుర్విషహం = అసహ్యమైన, బలం = సైన్యము, ఆస్తే = ఉండనేయున్నది.

**తాత్పర్యము** : భగవంతుఁ డెక్కువగా సంతోషింపకుండుటకుఁ గారణమును జెప్పుచున్నాఁడు. ద్రోణుఁడు భీష్ముఁడు అర్జునుఁడు భీమసేనుఁడు- వీరి నాధారముగాఁ జేసికొని కృష్ణపరమాత్మ పదునెన్మిది యక్షౌహిణులసైన్యమును నాశ మొందించినాఁడు. ఈ యుద్ధముతో భూభార మెక్కువగనే తీఱిపోయినది. కాని ఇంకను బర్యాప్తముగఁ దీఱలేదు. దుస్సహమై నశింపఁదగిన సైన్యము మిగిలియే యున్నది. అది యాదవసైన్యము. యాదవులు తనయంశముతోఁ గూడినవారు. వారు తనతోఁ దప్ప మరొక్కరితోఁ జావరు. వారు గూడ నశించిననే భూభారముదీఱిన ట్లగును. ఈ యాలోచన మనస్సులో నుండుటచేతనే దుర్యోధనుఁడు చచ్చినంతమాత్రముతో స్వామి యెక్కువ సంతోష పడలేదు.

**15. శ్లో** : మాధ్వ్యాః = మద్యముయొక్క, మదాతామ్రవిలోచనానాం - మద = మదముచేత, ఆతామ్ర = ఎక్కువ యెఱ్ఱనైన, విలోచనానాం = కన్నులుగల, యేషాం = వీరికి, మిథః = పరస్పరము, వివాదః = కలహము, భవితా = ఏర్పడును. యేషాం = వీరియొక్క వధోపాయః = వధించుటకు మార్గము. ఇయాన్ = ఈ విధమైనదే, అతః. అన్యః న = దీనికన్న వేఱైనదిలేదు. మయి ఉద్యతే = నేనా ప్రయత్నమం దుండఁగా, స్వయం = తమకుఁదామే, అంతర్ధథతే = నశించిపోదురు.

**తాత్పర్యము** : యాదవకులజనితమైన, భూభారమును తగ్గించుటకు భగవంతుఁ డి ట్లాలోచించినాఁడు. మద్యపానముతో నాతామ్రములైన కన్నులుగల వీరు పరస్పరము పొడుచుకొని చత్తురు. వారిమాత్సర్యమే కలహకారణ మగును. ఈ మార్గముదప్ప వీరివినాశమునకు వేఱుపాయము లేదు. యాదవులు సన్మార్గరతులే కావచ్చును. కాని నా సంకల్పబలముతో వారి మనస్సులు క్రోధకలుషితములై పోవును. వీరు నశించినచో భూభారము మఱికొంత తొలఁగిపోవును.

**16. శ్లో** : ఏవం = ఇట్లు, సంచింత్య = ఆలోచించి, స్వారాజ్యే = కౌరవరాజ్యమందు, ధర్మజం = ధర్మరాజును, స్థాప్య = ప్రతిష్ఠించి, సాధూనాంవర్త్మ = సజ్జను లనుసరించెడు మార్గమును, దర్శయన్ = లోకమునకుఁ జూపించుచు, భగవాన్ = కృష్ణపరమాత్మ, సుహృదఃనందయామాస = బంధుగులను, స్నేహితులను ఆనందింపఁజేసెను.

**తాత్పర్యము** : భగవంతుఁ డీ నిర్ణయమునకు వచ్చెను. ఇట్లు నిశ్చయించికొని ధర్మరాజును కౌరవరాజ్యమునకుఁ బట్టాభిషిక్తు నొనర్చినాఁడు. తాను విధి నిషేధముల కతీతుఁడు. అయినను లోకశిక్షణార్థము సజ్జనులమార్గము ననుసరించి ప్రవర్తించెను. తన ప్రవర్తనతో బాంధవులను మిత్రులను ఆనందింపఁజేసినాఁడు.

**17. శ్లో** : అభిమన్యునా = అభిమన్యునిచేత, ఉత్తరాయాం = ఉత్తరాదేవియందు, పూరోః వంశః = పూరువంశాంకురము, ధృతః = ప్రతిష్ఠింపఁబడినది. ద్రౌణ్యస్త్రసంఛిన్నః, సః = అశ్వత్థామ అస్త్రములచే ఖండింపఁబడిన యా గర్భము, భగవతా = భగవంతునిచేత, పునః ధృతః = రక్షితమై పునః ప్రతిష్ఠింపఁబడెను.

**తాత్పర్యము** : అభిమన్యునిచే నుత్తరాగర్భమున పురువంశాంకుర ముంచఁబడెను. అశ్వత్థామ యా గర్భమును జెఱుపయత్నించినాఁడు ద్రౌణి ప్రయోగించిన యా యస్త్రమును గృష్ణపరమాత్మ తనచక్రముచే మలగించి మరల నా గర్భమును బరిరక్షించి పునః ప్రతిష్ఠించినాఁడు.

**18. శ్లో** : త్రిభిః అశ్వమేధైః = మూఁడశ్వమేధయాగములచేత, ధర్మసుతం = ధర్మరాజును, అయాజయత్ = యజింపఁజేసెను. కృష్ణం అనువ్రతః = కృష్ణపరమాత్మ ననుసరించిన, సః అపి = ఆ ధర్మరాజుగూడ, అనుజైః = తమ్ములతోఁబాటు, క్ష్మాం = భూమిని, రక్షన్ = రక్షించుచున్నవాఁడై, రేమే = రాజ్యసుఖముల ననుభవించెను.

**తాత్పర్యము** : చక్రవర్తులు మాత్రమే చేయఁదగిన అశ్వమేధయాగములను మూఁడింటిని గృష్ణపరమాత్మ ధర్మరాజుచేఁ జేయించినాఁడు. ధర్మపుత్రుఁడును గోవిందు నన్నిరీతుల ననుసరించెను. అతని నిత్యానుగ్రహమునకుఁ బాత్రుఁడై తమ్ములతోఁ గూడ రాజ్యసుఖముల ననుభవించినాఁడు.

**19. శ్లో** : విశ్వాత్మా = ఆత్మస్వరూపుఁడై, సమస్త ప్రపంచము నావరించియున్నట్టి, భగవానపి = కృష్ణపరమాత్మగూడ, లోకవేద పథానుగః = లోకమును, వేదమును సమన్వయించికొని ప్రవర్తించుచున్నవాఁడై, సాంఖ్యం = జ్ఞానమనెడు యోగమును, ఆస్థితః = అనుసరించుచున్నవాఁడై, అసక్తః = సుఖదుఃఖముల యం దనాసక్తుఁడై, ద్వార్వత్యాం = ద్వారకాపురియందు, కామాన్ = విషయసుఖములను, సిషేవే = సేవించెను.

**తాత్పర్యము** : ఆత్మస్వరూపుఁడుగా విశ్వమంతయు వ్యాపించియున్న భగవంతుఁడగు కృష్ణుఁడు అవతారనిమిత్తముగా శరీరమును ధరించినవాఁ డగుటచే లోకవేదపథములను సమన్వయించికొని తన జీవితమును నడపికొనెను. వేదము నతిక్రమింపక లోకము నలఁతిగాఁ జూడక సాంఖ్యయోగము నాశ్రయించి యాతఁడు మెలఁగినాఁడు. సుఖదుఃఖముల కతీతమైన చిత్తవృత్తిలో ద్వారవతియందు వసించుచు సుఖముల ననుభవించెను.

**20, 21 శ్లో :** స్నిగ్ధ = స్నేహయుక్తమైనట్టి, స్మిత = మందహాసము అవలోకేన = కంటిచూపుచేతను, పీయూషకల్పయా = అమృతకల్పయా, వాచా = అమృతకల్పమైన వాక్కుచేత, అనవద్యేన = దోషరహితమైన, చారిత్రేణ = ప్రవృత్తిచేతను, శ్రీనికేతేన = నిరంతర శోభ కాస్పదమైన, ఆత్మనా చ = శరీరము చేతను, ఇమం లోకం = ఈ లోకమును, అముం చ = పరలోకమును, సుతరాం = ఎక్కువగా, యదూన్ = యాదవులను, రమయన్ = సంతోషపెట్టుచున్నవాఁడై, క్షణదయా = రాత్రిచేత, దత్తక్షణస్త్రీక్షణసౌహృదః = దానముచేయఁబడిన స్త్రీలయొక్క స్నేహోత్సవములందు, ఆసక్తుఁడై, రేమే = రమించెను.

**అవతారిక :** లోకమం దుత్తముఁడైన యొక పురుషుఁ డనాసక్తుఁడై తన స్త్రీలతో రమించుచు కాలమును గడపునట్లు భగవంతుఁడు వసించెనని చెప్పుచున్నాఁడు. స్నేహయుక్తములైన మందహాసములు, అనురాగయుక్తములైన కటాక్షములు, అమృతాయమానములైన వాక్కులు, నిర్దోషమైన యాచరణము, అత్యుజ్జ్వలమై ప్రకాశించుచున్న దేహము - వీనితో భగవంతుఁడు ఉభయలోకములకు సంతోషము నొడగూర్చినాఁడు విశేషించి యాదవుల కమితానందము నొడగూర్చెను. రాత్రులలోఁ దన యాగమనమును నిరీక్షించుచున్న స్త్రీల ననాసక్తుఁడై రమింపఁజేసెను.

**22. శ్లో :** బహూన్సంవత్సరగణాన్ = అనేకసంవత్సరములు, ఏవం రమమాణస్య = ఈ రీతిగా నానందమునందుచున్న, తస్య = ఆ కృష్ణునకు, గృహమేధేషుయోగేషు = గృహస్థాశ్రమ విధులందు, విరాగః + సమజాయత = విరక్తి యేర్పడెను.

**తాత్పర్యము :** ఇ ట్లనేక వర్షములు గడచెను. కాలక్రమమున శ్రీకృష్ణునకు గృహమేధీయధర్మములందు విరక్తి జనించెను.

**23. శ్లో :** స్వయందైవాధీనః = స్వయముగాఁ దన కర్మఫలమున కధీనుఁడైన, పుమాన్ = పురుషుఁడు, కః = ఎవఁడు, యోగేన = భక్తియోగముచేత, యోగేశ్వరం = యోగఫలదాతయైన యీశ్వరుని, అనువ్రతః = అనుసరించుచున్నవాఁడై, దైవాధీనేషు = ప్రారబ్ధకర్మఫలముల ననుసరించి యేర్పడుచున్న, కామేషు = భోగములందు. విస్రంభేత = నమ్మియుండును.

**తాత్పర్యము :** భోగసాధనములు దైవాధీనములు. వాని ననుభవించు పురుషుఁడుగూడ నస్వతంత్రుఁడు. వాఁడు దైవమునకు లోఁబడినవాఁడు. యోగేశ్వరుఁడైన శ్రీకృష్ణుఁడు భోగసాధనములను అనుభవకర్తయైన తన్నుఁ దన యోగబలముచేత నీ లోకమందు సుస్థిరముగా నిలుపుకొనుటకు సమర్థుఁడే. అయినను

మనుష్యస్వభావమును అవలంబింపఁదలఁచినవాఁడై కొంతకాలము సుఖముల ననుభవించి తరువాత విరక్తుఁడైనాఁడు. భగవంతుని యీ మార్గము ననుసరించుచున్న యే యుత్తమపురుషుఁడైనను విషయసుఖములందు స్థిరమైన విశ్వాస ముంచికొనఁడు. నశ్వరములైన విషయసుఖములందలి యాశను వివేకబలముతో నుపసంహరించికొనును.

**24. శ్లో** : కదాచిత్ = ఒకానొకప్పుడు, పుర్యాం = ద్వారకయందు, క్రీడద్భిః = ఆడుకొనుచున్న, యదుభోజ కుమారకైః = యదు, భోజకుమారులచేత, కోపితాః = కోపముదెప్పింపఁబడిన, భగవన్మతకోవిదాః= భగవంతుని మతము నెఱిఁగిన, మునయః = మునులు, శేపుః = శపించిరి.

**తాత్పర్యము** : ఒకనాఁడు యదుకుమారకు లాడుకొనుచుండిరి. అప్పుడు కొందఱు మునులు వచ్చినారు. వీరిచేష్టలు వారికిన్కకుఁ గారణము లైనవి. వారు యాదవులను శపించిరి. వారు భగవంతునిమనస్సు నెఱిఁగినవారు.

**25. శ్లో** : తతః = అటు తర్వాత, కతిపయైః మాసైః = కొన్నిమాసములకు, దైవవిమోహితాః = దైవముచే మోహమునొందింపఁబడిన, వృష్టిభోజాంధకాదయః = వృష్ణులు, భోజులు, అంధకులు - మొదలైన యదుకుమారులు, సంహృష్టాః = అత్యంతసంతోషముతోఁ గూడినవారై, రథైః = రథములతో, ప్రభాసం యయుః = ప్రభాసతీర్థమునకు బయలుదేరిరి.

**తాత్పర్యము** : కొన్నిమాసములు గడచినవి. వృష్ణిభోజాంధకాదులు దేవమాయా విమోహితులు. వారు సంతోషయుక్తులై యొకనాఁడు రథముల నధిరోహించి ప్రభాసతీర్థమును జేరిరి.

**26. శ్లో** : తత్ర = అచ్చట, స్నాత్వా = స్నాన మొనర్చి, తదంభసా = ఆ జలముతో, పితౄన్ = పితరులను, దేవాన్ = దేవతలను, ఋషీంశ్చ ఏవ = ఋషులను, తర్పయిత్వా = తర్పణాదులతోఁ దృప్తుల నొనర్చి, విప్రేభ్యః =బ్రాహ్మణులకొఱకు, బహుగుణాః = అధికగుణ యుక్తములైన, గావః = పశువులను, దదుః = దాన మిచ్చిరి.

**తాత్పర్యము** : యాదవులు ప్రభాసస్నాన మొనర్చినారు. ఆ జలముతో పితరులను దృప్తుల నొనర్చిరి. దేవ ఋషి తర్పణము లొనర్చినారు. బహుగుణవిశిష్టములైన పశువులను విప్రులకు దాన మిచ్చిరి.

**27, 28. శ్లో** : హిరణ్యం = బంగారు, రజతం = వెండి, శయ్యాం = శయనము, వాసాంసి = వస్త్రములు, అజినకంబళాన్ = కృష్ణమృగచర్మములు, కంబళ్లు, రథాన్ = రథములును, కన్యాః = కన్యలును, ఉరురసం అన్నంచ = ఎక్కువ రుచికరమైన యన్నము, గోవిప్రార్థాసవః = గో, విప్రులు - వీరిసంతోషమునకై జీవించుచున్న, శూరాః = శూరులైన యాదవులు, అజినం = కృష్ణమృగచర్మము, యానం = వాహనము, ఇభం = ఏనుఁగు, వృత్తికరీంధరాం = జీవించుటకుఁ జాలినంతభూమి, తేభ్యః = ఆ విప్రులకొఱకు, భగవదర్పణందత్వా = భగవదర్పణముగా దానమొనర్చి, భువి = భూమిపైన, మూర్ధభిః = తలలు మోపి, ప్రణేముః = నమస్కరించిరి.

**తాత్పర్యము** : గోబ్రాహ్మణసుఖమునకే యాదవులు జీవించుచుండిరి. వారు మహాశూరులు, విప్రుల కనేకదానముల నొసఁగినారు. వెండి బంగారు మొదలైనవి. జీవించుటకుఁ దగినంతభూమి నిచ్చిరి. రుచిగలభోజనములు వెట్టిరి. ఈ దానము లన్నియు భగవదర్పితములుగానే యొనర్చినారు. వారు తలలు వంచి విప్రాదులకుఁ బ్రణమిల్లిరి.

## శ్రీధరీయము

శ్లో. తృతీయే మధురామేత్య వ్రజాత్కంస వధాదికమ్,
యత్కృతం ద్వారకాయాం చ కృష్ణేన తదవర్ణయత్.

తృతీయాధ్యాయములో నందవ్రజమునుండి కృష్ణుఁడు మధురా నగరమునకు వచ్చుటయును, కంస వధయును, ఆపై ద్వారకయం దొనర్చిన కృత్యములును సంక్షేపముగా వర్ణింపఁబడినవి.

**1. శ్లో** : వ్యసుః = విగతప్రాణుఁడైనను గంసుని సింహాసనమునుండి క్రింది కీడ్చుట దేవకీవసుదేవుల సుఖార్థమై అని తెలియవలెను.

**2. శ్లో** : బ్రహ్మ = వేదము, సవిస్తరం = షడంగాదిరూపమైనది. అనఁగా షడంగములతోఁబాటు వేదము నభ్యసించెనని తాత్పర్యము.

**3. శ్లో** : భీష్మక కన్యయా = రుక్మిణీదేవిచేత, యే రాజానః = ఏ రాజులు, సమాహుతాః = ఆహ్వానింపఁబడిరో, సమాహుతాః అనుచోట హ్రస్వత్వ మార్షము. "సమాహ్వాతాః" పాఠాంతరము. అప్పుడు ఆ కృష్ణులని యర్థము. ఏకారణముచేత? శ్రియః = లక్ష్మీదేవియొక్క, సవర్ణేన = సమానరూపముచేత. అనేకరాజు లాకర్షితు లగుటలో

లక్ష్మీదేవితో సమానమైన రుక్మిణి లావణ్యాదికము గారణము. రుక్మిణీదేవి యహ్వానించినది కృష్ణునొక్కనినే. లావణ్యముచే నాకర్షింపఁబడినవారు అని చెప్పక ఉపలక్షణముగా రుక్మిణీదేవిచేతనే యాహూతులని చెప్పినాఁడు. "తేషాం మిషతాం మూర్ధ్ని పదం దధత్"- వారి తలలపై నడుగునైచినవాఁడై అనఁగా వారి నందరిని ధిక్కరించి అని యర్థము. గాంధర్వవృత్యా = పరస్పర మేర్పాటుచేసికొన్న సమయరూపమైన గాంధర్వవృత్తిచేత, బుభూషయా భవితుమిచ్ఛయా భీష్మకకన్యయా. అనుదానికి విశేషణము. కృష్ణుని వివాహ మొనర్చికొని తన జీవితమును సార్థక మొనర్చికొనఁదలఁచిన దన్నమాట. జహార = హరించినాఁడు. ఎట్లు? సుపర్ణఇవస్వభాగంసుధాం = తనభాగమైనయమృతమును గరుడునివలె లేక శ్రియః సవర్ణేన = రుక్మిణీదేవితో సమానమైన వర్ణముగలవారు. అనఁగా వర్ణద్వయము వాచకముగాఁ గలవాఁడు. "రుక్మి" - వానిచేత సమాహూతులైన శిశుపాలాదులు. వారెందుకు వచ్చినట్లు?. వీఁడెందుకాహ్వానించినట్లు? భీష్మకకన్యయా సహ-తేషాం బుభూషయా = రుక్మిణీదేవిచేత వారికి భూతి - అనఁగానైశ్వర్య మేర్పడుటకు. శిశుపాలుఁడు వరుఁడుగా నాహ్వానింపఁబడినాఁడు. తక్కిన జరాసంధాదులు ఆవివాహోత్సవమునకై యాహ్వానింపఁబడిరి.

**4. శ్లో :** అవిద్ధనసః = కుట్టఁబడని ముక్కులు గలవి. అట్టి కకుద్మతః = వృషభములను, దమిత్వా = లోఁబఱచికొని వానిముక్కులకు త్రాడులుగట్టి యని యర్థము నగ్నజిత్తుకన్యయైన నాగ్నజితిని, స్వయంవరే = స్వయంవరమునందు ఉపయేమే = వివాహమొనర్చికొనెను. తైః వృషభైః, తద్దమనేనచ = ఆ వృషభములచేతను. వానిని వశపఱచికొన్న కృష్ణునిచేతను తక్కిన రాజుల మానము భగ్నమైనది. అనఁ గా వృషభములను బట్టికొనుటకు యత్నించినపుడు అవి కొమ్ములతోఁ జిమ్మి శరీరములను గాయపఱచినవి. ఆ రీతిగా వారిదర్పము హరింపఁబడినది. కృష్ణుఁ డు వానిని లోఁబఱచికొనుట వారిగర్వముపై దెబ్బదీసినది. అట్లయ్యును కన్యాంగృధ్నతః = నాగ్నజితిని వివాహమాడవలెనని కోరుచున్నారు. అందుచేతనే వారు, అజ్ఞాః = అజ్ఞానులు, అట్టి యజ్ఞానులైన, శస్త్రభృతః = శస్త్రములను ధరించి తనపైకెత్తి వచ్చిన రాజులను, తచ్ఛస్త్రైః అక్షత ఏవ = వారిబాణములతోఁ గేవల మక్షతుఁడుగనే, జఘాన = సంహరించెను.

**5. శ్లో : నరకాసురునిచే హరింపఁబడిన దేవమాతయగు నదితికుండలములను వెనుక కిచ్చుటకు స్వామి స్వర్గమున కేగినాఁడు. అప్పుడు ప్రభుః = తాను**

సర్వస్వతంత్రుఁడయ్యును, గ్రామ్యః = స్త్రీపరతంత్రునివలె, ప్రియాయాః = సత్యభామాదేవికి, ప్రియం విధాతు మిచ్ఛుః = ప్రియమొనరింపఁగోరుచున్నవాఁడై, ద్యుతరుం = పారిజాతమును, ఆర్ఛత్ = పెకలించెను. యదర్థే = పారిజాతమును హరించుటకారణముగా, దేవేంద్రః ఆద్రవత్ = అంతః పురముచేఁ బ్రేరేపింపఁ బడినవాఁడై యుద్ధముఁ జేయుటకు వచ్చెను. ఆ ఇంద్రుఁడు, క్రీడామృగః = స్త్రీలపాలికి, క్రీడామృగమువంటివాఁడు.

6. శ్లో : సునాభోన్మథితం = చక్రముచే హతుఁడు. అట్టి, భౌమం = భూపుత్రుఁడైన నరకాసురునిఁ జూచి, తస్యమాత్రా ధరిత్ర్యా = వానితల్లియైన భూదేవిచేత, ఆమంత్రితః = ప్రార్థితుఁడై, తత్తనయాయ = వానికొడుకైన భగదత్తునికి, శేషం = హృతశేషమైనరాజ్యము నిచ్చి, వానిని తండ్రి సింహాసనముపై నిలిపెనని భావము. తరువాత వానియంతఃపురమును బ్రవేశించెను.

7. శ్లో : తత్ర = ఆ యంతఃపురమందు, కుజేన = నరకాసురునిచేత, యాః ఆహృతాః = ఏ రాజకన్య లపహరించి కొనిరాఁబడినారో వారు, ప్రహర్ష వ్రీడా అనఁగా సిగ్గు, అనురాగము - వీనిచేత, ప్రహిత = ప్రేరేపింపఁబడిన, అవలోకాః = కటాక్షములు, అనఁగా వారు చూచిన చూపులలోఁ గృష్ణుఁడు దమ్ము విడిపించెనని సంతోషము, స్త్రీలకు సహజమైనలజ్జ, అతనిపైఁ గల యనురాగము - ఈ మూఁడును మిళితమై యున్నవన్నమాట. ఇట్టిచూపులతో, జగృహుః = కృష్ణుని స్వీకరించినారు.

8. శ్లో : ఆసాం = ఆ స్త్రీలయొక్క, పాణీన్ = కరములను, తత్తదనురూపస్సన్ = వయోరూపసౌందర్యములచేత వారివారికిఁ దగినవాఁడై, సవిధిం = వివాహోచితమైన ప్రకారముతోఁ గూడినట్లుగా, పాణీన్ జగృహే = వారిని బెండ్లాడెను.

9. శ్లో : సర్వశః = సర్వగుణములచేతను, స్వతుల్యాని = తనతో సమానమైన సంతానమును బడసె నని భావము. ప్రకృతేః = మాయచేత, విబుభూషయా = వివిధరూపములచేత, భవన మనఁగా విస్తారము తదిచ్ఛచేత అనఁగాఁ దానే యనేకరూపములుగా విలసిల్లెడికోర్కిచేత,లేక ప్రకృతేః హేతోః = ప్రకృతి కారణముగా, వివిధం భవితు మిచ్ఛయా = అనేకములుగాఁ గావలెననెడు కోర్కితో-

10. శ్లో : రుంధతః = తనముఖ్యపట్టణము నడ్డగించు, కాల మాగధసాల్వాదీన్ = కాలయవనుఁడు, జరాసంధుఁడు, సాల్వుఁడు మొదలైనవారిని, నిమిత్తభూతులైన ముచుకుందభీమాదులతోఁ దానే, అజీఘనత్ = చంపినవాఁ డయ్యెను. తేన =

అట్లు నిమిత్తమాత్రముగాఁ జంపించుటచేత, స్వపుంసాం = తన భక్తులయొక్క తేజః = ప్రభావము, కీర్తించ = కీర్తిని, ఆదిశత్ = ఇచ్చెను. అనగా భక్తుల తేజః కీర్తులను ప్రపంచమందు వ్యాపింపఁజేసెనని యర్థము.

**11. శ్లో** : శంబర, ద్వివిద, బాణ, పల్వలాదులను, ప్రద్యుమ్నరామాదు లనెడు నిమిత్తములచేత, ఘాతయత్ = కూల్చెను. "ఘాతయన్ " అని /యైనను బాఠాంతరము. దంతవక్త్రాదులను స్వయముగనే చంపెను.

**12. శ్లో** : తతః = ఆ కురుపాండవయుద్ధముచేత, నృపాన్ = రాక్షసాంశజులైన రాజులను, అఘాతయత్ - అని వెన్కనుండి అనువృత్తి. ఆ రాజు లెట్టివారు? కురుక్షేత్రం ఆపతతాం = కురుక్షేత్రమునుగూర్చి వచ్చినవారు. తమసైన్యములతో భూమినంతయు నాక్రమించినవారు. వారి సైన్యములచేత భూమియంతయుఁ గంపించినది.

**13, 14. శ్లో** : కర్ణదుశ్శాసనసౌబలానాం, కుమంత్రపాకేన = దురాలోచనలచేత, హతశ్రియాయుషం = నశింపఁ జేయఁబడిన సంపదయును, ఆయువును గలిగినట్టి, సుయోధనం = దుర్యోధనుని, భగ్నోరుం = ఊరువులుదెగిపడిన వానిని - అట్టి దుర్యోధనునిఁజూచియుఁ దనకార్యమింకను శేషించియుండుటచేత నెక్కువ సంతోషపడలేదని భావము, ద్రోణ భీష్మార్జున భీమ మూలైః = కారణభూతులైన వీరిచేత, యః అష్టాదశాక్షౌహిణీకః = పదునెనిమిది యక్షౌహిణులతోఁ జేరిన సైన్యము, క్షపితః = నశింపఁజేయఁబడినదో, "అక్షౌహిణీకః" అనుచోట హ్రస్వత్వ మార్షము, ఆ చంపుట, కియాన్ = అత్యల్పమాత్రమే యని తాత్పర్యము. ఎందుకనఁగా, మదంశైః = నాయంశభూతులైన ప్రద్యుమ్నాదులచేత, ఉరుభారః = గొప్పభూభారము, దుర్విషహం ఆస్తే = భరించుటకు దుస్సహముగా నింకను నుండనే యున్నది.

**15. శ్లో** : యాదవనాశమందు వేఱుపాయ మేదియు సిద్ధింపదు. ఉన్న ఉపాయ మొక్కటే యనుచున్నాఁడు. యదా = మధుపానముచే నేర్పడిన మదముచేత, ఆతామ్ర = అంతటనెఱ్ఱనైన, విలోచనానాం = కన్నులుగలిగిన యాదవులకు, మిథోవివాదః = పరస్పరకలహము, భవితా = ఏర్పడఁ బోవుచున్నది. ఇయానేవయేషాంవధోపాయః = ఇదియొక్కటే వారు మరణించుట కుపాయము. అతః అన్యోనాస్తి = దీనికన్న భిన్నమైనది లేదు. వారు పరస్పరానురాగసంపూరితులుగదా! వారెట్లు తమలోఁదాము గలహింతురు? దీనికి సమాధానము చెప్పుచున్నాఁడు. వారిలోనున్న పరస్పరానురాగము "మయ్యుద్యతే

సతి" నేను దానిని రక్షించువాఁడనుగా నున్నప్పుడే. "మయ్యుద్యతే సతి" నేను వారు వినాశము నొందవలెనని నిశ్చయించికొని యున్నప్పుడు, స్వయం అంతర్దధతే = వారిలోవారు గలహించికొని తప్పక మరణింతురు.

16. శ్లో : భగవాన్ ఏవం సంచింత్య - కృష్ణపరమాత్మ పైరెండుశ్లోకములలో వివరించినట్లుగా మనస్సులో నిర్ధరించికొన్నవాఁడై, స్వరాజ్యే = పైతృకమైన రాజ్యమునందు, ధర్మజం స్థాపయిత్వా నందయామాస.

17. శ్లో : ధృతః = ప్రక్షిప్తమైనది. వై = ఇదిప్రసిద్ధమైన విషయమే.

18, 19. శ్లో : అయాజయత్ = యజింపఁజేసెను. అనుజైస్సహ = తమ్ములతోఁ బాటు, సాంఖ్యమాస్థితః = ప్రకృతి పురుషవివేకరూపమైన జ్ఞానము నాశ్రయించినవాఁ డై.

20. శ్లో : స్నిగ్ధస్మితావలోకేన = స్నిగ్ధమై, స్మితసహితమైన యవలోకము. పీయూషకల్పయా వాచా = సుధాసదృశమైనవాక్కు, "పీయూషకుల్యయా" అని పాఠాంతరము, ఆత్మనా = దేహముచేతను, ఆ దేహము నిరంతర శ్రీనికేతన మైనది.

21. శ్లో : దత్త = ఇవ్వఁబడిన, క్షణ = అవసరము, లేక ఉత్సవము. యాసాం తాః = ఏ స్త్రీలకొఱకు రాత్రియం దుత్సవము కల్పింపఁబడినదో వారు. వారియందు, క్షణం సౌహృదం యస్య సః = క్షణమాత్రసౌహృదము గలవాఁడై.

22, 23. శ్లో : గృహమేధేషు = గృహధర్మములైన, యోగేషు = కామభోగోపాయములందు, విరాగః = ఔదాసీన్యము, జాతః = ఏర్పడినది. అన్నిభోగములు దనకు స్వాధీనములై యున్నను భగవంతునకు విరాగము గలిగినది. అట్టిచో దైవాధీనములైన విషయసుఖములపై, కోవిస్రంభేత = ఎవ్వఁడు విశ్వాసముంచును? విశ్వాసమునుంచువారని యర్థము, యోగేన యోగేశ్వరమనువ్రతః = భక్తియోగముచేతఁ గృష్ణు ననుసరించెడు వాఁడు. అనఁగాఁ గృష్ణభక్తుఁ డెప్పుడును విషయసుఖములం దత్యంతాసక్తుఁడు గాఁడని యర్థము.

24. శ్లో : శేపుః = మహర్షులు శాప మిచ్చిరి. వారు భగవన్మతకోవిదాః, భగవన్మత = భగవంతుని యభిప్రాయమును, కోవిదాః = ఎఱిఁగినవారు.

25, 26. శ్లో : వయశ్శీలాది బహుగుణోపేతములైన గోవులను దానమిచ్చి నారని తాత్పర్యము.

27, 28 శ్లో : ధరాంవృత్తికరం = జీవన పర్యాప్తమైన భూమి, భగవదర్పణం యథా భవతి తథా = భగవదర్పిత మగునట్లుగా, గోవిప్రార్థాసవః = గోవిప్రార్థం అసవః యేషాం తే = గోవులు, విప్రులు - వీరి ప్రయోజనములకే జీవించువారు.

## విజయధ్వజము

1. శ్లో : బలదేవసంయుతః, సః, స్వపిత్రోః, ఆశాం = ఆకాంక్షను, చికీర్షయా = నడపింపవలెను నిచ్ఛతో, తతః పుం, ఆగత్య, ఓజసా = తన సామర్థ్యముచేత, రిపుయూధనాథం, తుంగాత్, నిపాత్య, వ్యసుం ప్రాణహీనుఁడైన వాఁడు, హతం = చంపఁబడిన నీచుఁడునైన కంసుని, ఉర్వ్యాం వ్యకర్షత్. "చికీర్షయా శం" అని శ్రీధరుని పదవి భాగము. "చికీర్షయా ఆశాం - అని విజయధ్వజుఁడు.

2. శ్లో : విశేషము లేదు.

3. శ్లో : యే = ఏ రాజులు, సవర్ణేన = కేవలజాతిమాత్ర క్షత్రియులనెడు కారణముచేత, రుక్మిణినివరింప యోగ్యులుకాని వారు, భీష్మక కన్యయా = రుక్మిణీదేవికొఱకై, తాదార్థ్యమందు తృతీయావిభక్తి. సమాహ్వాతాః = స్వయంవరమున కాహ్వానింపఁ బడినారో, యేషాం = ఈ క్షత్రియరాజులయొక్క, శ్రియః = సంపత్తుయొక్క, జిహీర్షయా = పోగొట్టెడికోర్కితో, మిషతాం = వారుచూచుచుండఁగనే, మూర్ధ్ని పదం దధత్ = సుపర్ణః = పరమానంద రూపుఁడైన శ్రీకృష్ణుఁడు, గాంధర్వవృత్త్యా, స్వభాగం = తనకుఁజెల్ల వలసిన రుక్మిణీదేవిని, జహ్రే. "సపర్ణః" అనుటచేత అనాయాసముగా నీ పని యొనర్చెనని చెప్పినట్లైనది. గాంధర్వవృత్త్యా = అనుటతో ననేకవివాహప్రకారములు గలవని చెప్పినాఁడు. "సువర్ణస్స్వరానందాత్ కకుస్థోవాచిసంస్థితేః" అనునట్లుగా పరానందుఁడని యర్థము.

4. శ్లో : అవిద్ధనసః కకుద్మతః, దమిత్వా, స్వయంవరే, నాగ్నజితీం = నగ్నజిత్తుబిడ్డయైన నీలాదేవిని, ఉవాహ, భగ్నమానాన్ = అభిగృధ్నతః, అజ్ఞాన్, శస్త్రభృతః, తాన్చ. వివాహమునకు వచ్చిన రాజులను శస్త్రైః, స్వయం, రక్షతస్సన్ జఘ్నే.

5. శ్లో : పురా = ముందు, స్వార్థే = తనకొఱకై, త్రైస్సహ = దేవతలతోఁబాటు, ఆనత = నమస్కరించి, యం = ఏ కృష్ణుని, వజ్రీ = ఇంద్రుఁడు, అయాచత = ప్రార్థించెనో, ఆ యింద్రుఁడు, యదర్థే = ఏ పారిజాతవృక్షమునకై శచీదేవి యొక్క మాటప్రకారము, రుషా అంధః. సగణః. తం. ఆద్రవత్ = వెంటాడెనో, అట్టి ద్యుతరుం, ప్రభుః, గ్రామ్య ఇవ, ప్రియాయాః, ప్రియం విధిత్సుః, ఆర్భత్. శ్రీధరుని ప్రకారము నాల్గవపాద మీ క్రిందిది. "క్రీడామృగోనూనమయం వధూనాం". విజయధ్వజునిప్రకారము స్వార్థే పురాత్రైర్యమయాచతానతః"-

6. శ్లో : 7. శ్లో : 8. శ్లో : విశేషము లేదు.

**9. శ్లో** : ఆత్మతుల్యాని = తనకు స్వల్పమాత్రము సమానులైన దశదశ అపత్యాని జనయత్. "ఉత్తమై స్సర్వతస్స్వామ్యం - కించిత్స్వామ్యముదీరితం" అని ప్రమాణము.

**10. శ్లో** : అజీఘనత్ = సంహరించెను. ముచుకుందుఁ డొనర్చిన కాలయవనవధ - భీమసేనుఁ డొనర్చిన జరాసంధ వధ మొదలైనవి శ్రీహరియే చేసెనని యర్థము. వారు నిమిత్తమాత్రులు. అందుచే "అజీఘనత్" అని ప్రయోగము.

**11. శ్లో** : శంబరుని జంపినవాఁడు తానే.

**12. శ్లో** : లేదు.

**13. శ్లో** : పశ్యన్ = క్రిందఁబడిన దుర్యోధనునిజూచుచు సః = ఆ కృష్ణుఁడు (భీమాయ = సుయోధనుని జంపిన భీమునిగూర్చి, ననంద = ఎక్కువగా సంతోషించెను. అనఁగా దుర్యోధనుని సంహారముతో శ్రీకృష్ణుఁడు భీమునిపై నెక్కువ యనుగ్రహముంచెనని భావము.

**15. శ్లో** : మయి = ఉద్యతేసతి = నే నంతర్హితుఁ డగుట కుద్యుక్తుఁడు కాగా.

**19. శ్లో** : విశ్వాత్మా = సమస్తమునకును స్వామియైన లోకవేదపథానుగః = లౌకిక వైదిక మార్గముల ననుసరించెడి, భగవాన్ = శ్రీకృష్ణుఁడు, సాంఖ్యం = తన స్వరూపజ్ఞానమును, ఆస్థితస్సన్, ద్వార్వత్యాం, అసక్తః, కామాన్సిషేవే. 'అపి' అనుటతోఁ గృష్ణుఁడు గృహస్థ ధర్మానుసరణ మొనర్చినది లోకజనులకు మార్గమును జూపించుటకేగాని స్వప్రయోజనమునకుఁ గాదని తెలిపిన ట్లైనది. వాఁడు సత్యసంకల్పుఁడు. అసక్తః = అనుటతో విషయముల ననుభవించినను వానికి విషయసుఖముల లేపము లేదని చెప్పిన ట్లైనది. "కేవలం భగవద్జ్ఞానం సాంఖ్య మిత్యభిధీయతే" అనెడు ప్రమాణముతో స్వరూపజ్ఞాన మని యర్థము. "తద్బ్రహ్మవేదాహం బ్రహ్మాఽస్మి" అనెడు శ్రుతిగూడ పరబ్రహ్మవస్తువునకు దాను సర్వదా పరిపూర్ణుఁడ నను ననుభవ ముండుననియే చెప్పుచున్నది.

**20, 21. శ్లో : క్షణదయా = రాత్రియందు, దత్తక్షణః = ఈయఁబడిన యవసరమున్నవాఁడై, అనఁగా రాత్రికాలమందు "స్త్రీక్షణసౌహృదః" (1) స్త్రీలయందు క్షణకాలము స్నేహముగలవాఁడై, (2) రుద్రదేవుని సౌహార్ద మున్నవాఁడై "రుద్రగణములు సంచరించు కాలమందు స్త్రీలతో నెట్లు రమించెను?. అను ప్రశ్నకు రుద్రదేవుని సౌహార్ద ముండుటచే నది సాధ్య మయ్యెనని యుత్తరము.**

**22. శ్లో** : గృహమేధేషు యోగేషు విరాగస్సమజాయత ఇతి = ఇట్లుగా, దర్శయామాస = లోకమునకుఁ జూపెను. దీనికిఁ బ్రమాణము:

"సర్వదా పి విరక్తస్సన్ భాసయీత విరాగవత్
కాదాచిత్క: కుతస్తస్య లోకశిక్షా ర్థ మిష్యతే".

**23. శ్లో** : అవతారిక : సర్వదా విరక్తుఁడైన శ్రీహరి ఒకానొకకాలమందే విరక్తిని గన్పఱచుట లోకశిక్షార్థమేయని స్పష్టపఱచుచున్నాఁడు. యస్మాత్ = ఏ కారణముచేత, నిత్యవిరక్తుఁడైన శ్రీహరి వైరాగ్యమును గనఁబఱచెనో, తస్మాత్ = ఆ కారణముచేత, స్వయం = తాను, దైవాధీన: = శ్రీహరియిచ్ఛ కధీనుఁడైనట్టియు, యోగేన = ధ్యానమనెడు నుపాయముచేత, యోగేశ్వరం = సమస్తయోగులకును నియామకుఁడైన శ్రీహరిని, అనువ్రత: = అనుసరించిన, క: పుమాన్ = ఏ ముక్తియోగ్యజీవుఁడు, దైవాధీనేషు = శ్రీహరియిచ్ఛ ననుసరించి ప్రాప్తించెడు, కామేషు = విషయసుఖములందు, విస్రంభేత = విశ్వసించును? ఎవ్వరును నమ్మరని భావము. దైవాధీనేషు అనుటచేత శ్రీహరి నిత్యవిరక్తుఁడైనందునను విషయములు గొంతకాలముండి పోవుటచేతను నశ్వరములని తెలుపఁబడినది.

**24. శ్లో** : మునయ: = త్రికాలజ్ఞానులైన ఋషులు "భగవన్మతకోవిదా:" అనుటచేత మునిశబ్దమున కర్థము వివరించిన ట్లైనది.

**25. శ్లో** : ముందు జరుగఁబోవు యదువంశనాశమును దెలుపఁబోవుచున్నవాఁడై యాదవులు ప్రభాసయాత్రకు బయలుదేరిరని చెప్పుచున్నాఁడు. తత: = కతిపయై: మాసై: సంప్రాప్తా:, వృష్ణిభోజాంధ కాదయ:, దైవవిమోహితా:. రథై:, ప్రభాసం యయు:

"ఏష్యంతు నిశ్చితంయ త్తదతీతత్వేనభణ్యతే,
చక్రవత్పరివృత్తేర్వా దుష్టానాం మోహనాయ చ"

అనెడు ప్రమాణముతో నిశ్చయముగా ముందు జరుగఁబోవుదానిని గూర్చి ఐనట్లుగనే భూతకాలక్రియ వాడవచ్చును. లేక ప్రతికల్పమందు నిట్లే యగుటచేత నడచినదానివలెనే చెప్పినారు. లేక దుష్టజనమోహనార్థమై యట్లు వచించుటయుఁ గద్దు. అందుచే భూతకాలప్రయోగము, యయు: అనుటకు పోదురు అనియర్థము, అట్లే -

**26. శ్లో** : దదు:, ఇత్తురు, **27, 28, శ్లో** : ప్రణేము: = నమస్కరింపఁబోదురు. దు:ఖమును బోఁగొట్టి సుఖమును గల్గించుటచేత హిరణ్యమనిపేరు. రంజనము నభివృద్ధిపఱచుటచేత రజతము. అజితుని రప్పించికొనునది అజినము. సుఖమును

బలపఱచునది కంబలము. పోవలసినదారిని బోవునట్లు చేయునది హయము. పోవుట నొనర్చునది రథము. ఇష్టమును మెఱయించునది యిభము. ప్రకాశము నిచ్చునది కన్య. ధారణ మొనర్చునది ధర. ఈ గుణములుగల శ్రీహరినే ఆయాపదార్థములందు ధ్యానించి దాన మొనర్చుటచేత భగవదర్పణమయ్యెనని యర్థము. పరలోకమందు దాని కనుగుణమైన ప్రయోజనము బొందెద రని భావము.

ఇతి శ్రీ మహాభాగవతే దశసహస్రికాయాం, సంహితాయాం,
వైయాసిక్యాం, శ్రీహయగ్రీవ బ్రహ్మవిద్యాయాం,
తృతీయస్కంధే, తృతీయోఽధ్యాయః.

## శ్రీ పోతన్నగారు

ఉ. రాముఁడు దానుగూడి మధురాపురికిం జని యందు వైభవో
ద్దామ నృపాసనంబున ముదంబున నున్న దురాత్ముఁ గంసు దు
ష్టామరశత్రుఁ ద్రుంచి ముదమారఁగఁ దల్లిని దండ్రి నంచిత
శ్రీమహితాత్ముఁడై తనరఁజేసె సరోరుహనాభుఁ డున్నతిన్. 120

మ. నలువొప్పంగ షడంగయుక్త మహితామ్నాయంబు చౌషష్టి వి
ద్యలు సాందీపనిచే నెఱింగెఁ జెలువొంద న్విన్న మాత్రంబు లో
పలనే లోకగురుండు దాన తనకున్ భావింప నన్యుల్ గురు
ల్గలరే? లోకవిడంబనార్థమగు లీలల్గావె యమ్మేటికిన్. 121

ఉ. మించి ప్రభాసతీర్థమున మృత్యువశంబును బొంది పోయి యా
పంచజనోదరస్థుఁ డగు బాలుని దేశికనందనుం బ్రభో
దంచితలీల దెచ్చి గురుదక్షిణగా నతిభక్తియుక్తి న
ర్పించె గురుండు చిత్తమునఁ బెంపెసలార మురారి వేండియున్. 122

సీ. ఘనుఁడు విదర్భేశుఁ డన నొప్పు భీష్మకు,
వరసుతామణి నవ వారిజాక్షిఁ
బద్మాసమాన రూపశ్రీ విభాసితఁ
గమనీయభూషణఁ గంబుకంఠిఁ
జతుర స్వయంవరోత్సవ సమాగత చైద్య
సాల్వ మాగధ ముఖ జనవరేణ్య
నికరసమావృతఁ బ్రకటసచ్చారిత్ర
రుక్మిణి నసమాన రుక్మకాంతి.

తే. నమరగుప్తామృతము విహగాధివిభుఁడు
గొనిన కైవడి మనుజేంద్రకోటిఁ దోలి
కమలనాభుండు నిజభుజాగర్వ మలరఁ
దెచ్చి వరియించె నతని నుతింప వశమె? 123

చ. పరువడి పట్టి సప్తవృషభంబుల ముక్కులు గుట్టఁ దద్బల
స్ఫురణ సహింపఁజాలక నృపుల్ దలపడ్డ జయించి నగ్నజి
ద్ధరణిపునందనన్ వికచతామరసాక్షిఁ బ్రమోదియై స్వయం
వరమునఁ బెండ్లియాడె గుణవంతుఁడనంతుఁ డనంతశక్తితోన్. 124

మ. ప్రతివీరక్షయకారినా నెగడి సత్రాజిత్తనూజాహ్వాదీ
ప్సితముం దీర్పఁ దలంచి నాకమునకున్ బెంపారఁగా నేగి వ
ర్ణితశౌర్యోన్నతిఁ బారిజాత మిలకున్ లీలాగతిన్ దెచ్చె ను
ద్ధతి దేవేంద్రు జయించి కృష్ణుఁ డతఁ డేతన్మాత్రుఁడే చూడఁగన్? 125

సీ. మానితాఖిల జగన్మయ దేహమునఁ బొల్చు
ధరణి దేవికిఁ బ్రియతనయుఁడైన
నరకదానవుని సునాభాఖ్యఁ జెన్నొందు
ఘనచక్రధారా విఖండితోత్త
మాంగునిఁ జేయ న య్యవనీలలామంబు
వేఁడినఁ దత్పుత్రు విపులరాజ్య
పదమున నిల్పి లోపలి మందిరంబులఁ
జిరముగ నరకుండు చెఱలఁ బెట్టి

తే. నట్టి కన్యలు నూటఁబదాఱువేలు
నార్తబాంధవుఁడైన పద్మాక్షుఁ జూచి
హర్షబాష్పాంబుధారాప్రవర్ష మొదవఁ
బంచశరబాణనిర్భిన్నభావ లగుచు. 126

చ. లలిత తదీయ సుందరవిలాస విమోహితలైనవారి విం
పొలసిన కోర్కెఁ దీర్చుటకు నొక్కముహూర్తమునన్ వరించి క
న్యల లలితావరోధభవనంబుల నందఱ కన్నిరూపులై
కలసి సుఖస్థితిం దనిపెఁ గొంతల భక్తినితాంతచిత్తలన్. 127

క. చతురతతో నందొక్కొక
యతివకుఁ బదురేసి సుతుల నాత్మసముల ను
న్నత భుజశక్తులఁ గాంచెను
వితతంబై కీర్తి దిశల వినుతికి నెక్కన్. 128

సీ. మధురాపురము చతుర్విధబలౌఘములతో
నావరించిన కాలయవన సాల్వ
మగధభూపాలాది మనుజేంద్రలోకంబు
సైన్యయుక్తముగాఁగ సంహరించి
తన బాహుశక్తిఁ జిత్తముల నర్థించిన
భీమపార్థులకు నుద్దామ విజయ
మొసఁగి తద్వైరుల నుక్కణంగఁగఁ ద్రుంచి
బాణ శంబర ముర పల్వలాది

తే. దనుజనాయక సేనావితానములను
హలధరాది సమేతుఁడై హతులఁ జేసె
దంతవక్త్రాది దైత్యులు దన్ను నెదుర
భండనములోనఁ ద్రుంచె దోర్బలము మెఱసి. 129

130.వ. వెండియుం గృష్ణుండు గౌరవ పాండవ భండనమునకుం దోడ్పడి రాజన్యులన్యోన్య మాత్సర్యోత్సాహసమేతులై సైనికపాదఘట్టనంబుల ధరాచక్రంబు గంపింప. ననన్య సామాన్యంబు లైన శంఖ భేరీప్రముఖ తూర్యఘోషంబులు నింగి మ్రింగ దురంగమ రింఖా సముద్ధూత ధూళిపటల పరిచ్ఛిన్న భానుమండలంబుగాఁ జనుదెంచి కురుక్షేత్రంబున మోహరించిన నుభయపక్షబలంబులం దునుమాడి, నిఖిల రాజ్యవైభవ మదోన్మత్తుండైన సుయోధనుండు కర్ణ శకుని దుశ్శాసనాదుల దుర్మంత్రంబున నిరంతరంబు గుంతీనందనుల కెగ్గుచేసిన దోషంబునం జేసి సంగరంబున భీముగదాఘాతంబునం దొడలు విఱిగి పుడమింబడి గతాయు శ్శ్రీవిభవుండై యుండం జూచి యపరితుష్ట చిత్తుండై, యపరిమిత బాహుబలోత్సాహులైన భీష్మ ద్రోణ భీమార్జునులచేత నిఖిలధరావతుల

నష్టాదశాక్షౌహిణీబలంబులతోడం దునిమించి మఱియు స్వసమానబలు లయిన యదువీరుల జయింప నెంతవారలకైనం దీరదు (కాన) మధుపాన మదవిఘూర్ణిత తామ్రవిలోచనులై వర్తించు యాదవుల కన్యోన్యవైరంబు గల్పించి పోరించి యితరేతర కరాఘాతంబుల హతులై (వారు) దనుంగలసినం గాని భూభారం బుడుగ దని చిత్తంబునం దలంచి, యంత ధర్మనందనుచే నిస్సపత్నంబగు రాజ్యంబు పూజ్యంబుగాఁ జేయింపు చుండి, మర్త్యులకుం గర్తవ్యంబులైన ధర్మపథంబులు సూపుచు, బంధుమిత్రులనెల్లం బరితోషంబు నొందింపుచుం దత్పరోక్షంబున వారివంశం బుద్ధరింపందలంచి యభిమన్యువలన నుత్తరయందు గర్భంబు నిలిపి, గురుతనయ ప్రయుక్త మహిత బ్రహ్మాస్త్రపాతంబునఁ దద్గర్భదళనంబు గాకుండ నర్భకుని రక్షించి, నిజపదారవిందసేవారతుండైన ధర్మరాజుచేఁ గీర్తిప్రతాపంబులు నివ్వటిల్లం దురంగమేధంబులు మూఁడు సేయించి వెండియు.

సీ. వలనొప్ప లౌకిక వైదిక మార్గముల్
        నడుపుచు ద్వారకానగరమందు
    నవిదితాత్మీయ మాయాప్రభావమున ని
        స్సంగుఁడై యుండి సంసారి పగిదిఁ
    జెంది కామంబులచేత విమోహితుం
        డై సుఖింపుచు ముదితాత్ముఁ డగుచు
    నంచితస్నిగ్ధ స్మితావలోకముల సు
        ధాపరిపూర్ణసల్లాపములను

తే: శ్రీనికేతనమైన శరీరమునను
    పాండునందన యదుకులప్రకరములను
    లీలఁ గారుణ్య మొలయుఁబాలింపుచుండె
    నార్తరక్షణపరుఁడు నారాయణుండు 131

సీ. సంపూర్ణ పూర్ణిమాచంద్ర చంద్రిక నొప్పు
        రమణీయశారదరాత్రులందు
    సలలిత కాంచన స్తంభ సౌధోపరి
        చంద్రకాంతోపలస్థలములందు

మహిత కరేణుకా మధ్యదిగ్గజముల
గతిని సౌదామనీ లతలనడిమి
నీలమేఘంబులలీల ముక్తామధ్య
లాలిత శక్రనీలముల భాతి

తే. సతత యౌవనసుందరీయుత విహారుఁ
డగుచు సతు లెంద ఱందఱ కన్నిరూప
ములను గ్రీడించెఁ బెక్కబ్దములు సెలంగి
నందనందనుఁ డభినవానందలీల. 132

వ. అంత నొక్కనాఁడు. 133

చ. మునివరు లేగుదేర యదుభోజవరేణ్యులు గూడిముట్టఁ బ
ల్కిన గన లొంది వారు దమకించి శపించినఁ గొన్నిమాసముల్
చనువెడ దైవయోగముగ జాతరఁ బోసమకట్టి వేడుకల్
మనములఁ దొంగలింప గరిమ న్నిజయానము లెక్కి యాదవుల్. 134

ఉ. కోరి ప్రభాసతీర్థమువకుం జవి తన్నదిఁగ్రుంకి నిర్మలో
దారత నందు దేవముని తర్పణముల్ పితృతర్పణంబులున్
వారనిభక్తిఁజేసి నవవత్సలతోఁ బొలుపారు గోవులన్
భూరిసదక్షిణాకముగ భూసురకోటికి నిచ్చి వెండియున్. 135

క. అజినపట రత్నకంబళ
రజత మహారజత తిల ధరావరకన్యా
గజ తురగ రథములును స
ద్విజకోటికి నిచ్చెఁ బెంపు దీపింపంగన్. 136

వ. ఇట్లు సఫలంబులైన భూదానంబు మొదలుగాఁగల దానంబు లనూనంబుగా భగవదర్పణబుద్ధింజేసి యనంతరంబు. 137

**అర్థములు**

120.ఉ. రాముఁడున్ తానున్ కూడి మధురాపురికిన్‌చని, అందున్ = ఆ మధురయందు, వైభవ + ఉద్దామనృపాసనంబునన్ = వైభవముచే గొప్పదైన సింహాసనమునందు, ముదంబునన్ ఉన్న = సంతోషముతో నున్నట్టి, దుష్టామరశత్రున్ = దుష్టుఁడై దేవతలకు శత్రువైనట్టి, కంసున్ = కంసుని, త్రుంచి = సంహరించి, దుష్టామరశత్రువు, అమరుల శత్రువు, దుష్టుఁడైన అమరులశత్రువు ఈ రెండును గంసునికే విశేషణములు, ముదము + అరఁగన్ = సంతోషము వర్ధిల్లఁగా, సరోరుహనాభుఁడు, ఉన్నతిన్ = అంచితశ్రీమహితాత్ముఁడై, గొప్పమహిమచేతఁ గూడినవాఁడై, తల్లినిన్ తండ్రినిన్ తనరఁజేసెన్.

**తాత్పర్యము** : కృష్ణుఁడు బలరామునితోఁ గూడినవాఁడై మధురాపట్టణమున కేగెను. అందు సింహాసనమునఁ గూర్చుండి దుష్టరక్షణము శిష్టశిక్షణముఁ జేయుచున్న దుర్మార్గుఁడైన కంసుని వధించినాఁడు. వాఁడు దేవకీవసుదేవుల నెంతయో బాధించెను. వానినిజంపుట వారికి సంతోషకారణ మైనది.

121.మ. నలువు + ఒప్పంగన్ = అందముగూడికొనఁగా, షడంగయుక్త మహితామ్నాయంబున్ = ఆరంగములతోఁ గూడిన నాల్గువేదములను, చౌషష్టివిద్యలన్ = అఱువది నాలుగు కళలను, సాందీపనిచేన్ = సాందీపని నుఁ చెలువొందన్ = అంద మొప్పఁగా, లోకగురుండు = సమస్తలోకములకు గురువైన శ్రీకృష్ణుఁడు, విన్నమాత్రంబులోపలనే = ఒక్కసారి విన్నంతలోనే, ఎఱింగెన్ = తెలిసికొనెను. తాన = తనకుఁదానే, గురువుగాక, అన్యుల్ గురుల్ కలరే = గురువు లున్నారా? అమ్మేటికిన్, ఆ గొప్పవానికి, లోకవిడంబనార్థమగు లీలల్ కావె = లోకపద్ధతి ననుసరించి చేసెడు లీలలు గావా?

**తాత్పర్యము** : కృష్ణుఁడు సాందీపనికి శిష్యుఁడై యాతనినుండి, అంగసహితముగా నాలుగువేదములును, అఱువదినాలుగు విద్యలును గ్రహించినాఁడు. ఆ శిష్యత్వము విచిత్రముగా నుండెను. గురువునుండి యొక్కసారి వినును. విన్నంతమాత్రముతో నవి యన్నియు వశమై పోవుచుండెను. కృష్ణపరమాత్మ జగద్గురువు. తనకుఁదానే గురువు. మఱి సాందీపని నాశ్రయించు టెందుకు? ఇవన్నియు, లోకానుసరణార్థమై యొనర్చిన చేష్టలు.

122.ఉ. ప్రభాసతీర్థమునన్ = ప్రభాసతీర్థమనెడుసరస్సునందు, మృత్యువశంబున్ పొంది పోయి = మరణించినవాఁడై పోయి, ఆ పంచజన ఉదరస్థుఁడగు బాలునిన్ = పంచజనుఁడను రాక్షసుని కడుపులోనున్న, దేశికనందనున్ = సాందీపనికొడుకైన వానిని, ప్రభా + ఉదంచితలీలన్ = గొప్పమహిమాతిశయముతో, గురుండు, చిత్తమునన్ పెంపు ఎసలారన్ అర్పించెన్ = ఇచ్చెను. వెండియున్ = మఱియు.

**తాత్పర్యము** : సాందీపనికడ విద్య నేర్చెను. గురుదక్షిణ ఈయవలసి వచ్చెను. ఇంకను, ఆ గురుకుమారుఁ డొకఁడు ప్రభాసతీర్థమునకుఁ బోయి ఈతగొట్టుచు మునిఁగి మరణించినాఁడు. వాఁడు పంచజనుఁడను రాక్షసునికడుపులో నుండెను. కృష్ణుఁడు పోయి రాక్షసుని జంపి గురుపుత్రుని దెచ్చి గురుదక్షిణగా నిచ్చెను. సాందీపుఁ డెంతయో సంతసించినాఁడు.

123.సీ. విదర్భ + ఈశుఁడు, అనఁనొప్పిన భీష్మకు = విదర్భకురాజైన భీష్మకునియొక్క, వరసుతామణినిన్ = శ్రేష్ఠురాలైన యాడుబిడ్డను, నవవారిజాక్షిన్ = అప్పుడే వికసించిన పద్మములతో సమానమైన కన్నులుగలది, పద్మాసమాన = లక్ష్మీదేవితోసమానురాలు. రూపశ్రీవిభాసిత = గొప్పరూపముతోఁ గూడికొన్నది. కమనీయభూషణ = అందమైన సొమ్ములు గలది. కంబుకంఠి = శంఖముతో సమానమైన కంఠముగలది, చతురస్వయంవరోత్సవ సమాగత = గొప్పనైపుణ్యముతోఁగూడిన స్వయంవర మనెడు నుత్సవమునకు వచ్చిన, చైద్య = చేదిదేశపురాజైన శిశుపాలుఁడు, సాల్వ = సాల్వుఁడు, మాగధ = జరాసంధుఁడు, ముఖ = మొదలైన, జనవరేణ్యనికర = రాజశ్రేష్ఠులగుంపుచేత, సమావృత = కూడుకొని యున్నట్టి, ప్రకటసచ్చారిత్రన్ = ప్రసిద్ధమైన చరిత్రగలది. అమరగుప్త అమృతమున్ = దేవతలచే రక్షింపఁబడిన యమృతమును, విహగ + అధివిభుఁడు = పక్షులకురాజైన గరుత్మంతుఁడు, కొనిన కైవడిన్, మనుజేంద్రకోటిన్ = రాజులగుంపును, నిజభుజాగర్వము అలరన్ = భుజపరాక్రమము చెల్లఁగా, తెచ్చి వరియించెన్ అతనిన్ నుతింపన్ తరమే?

**తాత్పర్యము** : విదర్భరాజైన భీష్మకున కొకబిడ్డ యుండినది. అప్పుడే వికసించిన పద్మములవంటి వామె కన్నులు, లక్ష్మీదేవితో సమానమైనదామె రూపము. శంఖముతో సమానమైనది కంఠము. ఆమె ధరించిన భూషణములు మహోజ్జ్వలములై యుండెను. ఆమె స్వయంవరోత్సవమునకు శిశుపాలజరాసంధాది మహావీరు లెందరో ఆహ్వానింపఁ బడిరి. వా రంద ఱామెను జుట్టికొనియుండిరి. ఆమెదేహకాంతి, దిక్కులకు బంగారుపూఁత పూయుచుండెను. కృష్ణుఁ డా రాజులనందఱ జయించి దేవతలచే రక్షింపఁబడిన తన భాగమైన యమృతమును గరుడుఁడు గొన్నట్లుగా నామెను గ్రహించి తీసికొనివచ్చి వివాహమైనాఁడు. అతనిపరాక్రమ మెంతటిదని వర్ణింపఁ గలము!

124.చ. వరుసన్ = క్రమముగా, నప్తవృషభంబులముక్కులు కుట్టన్ తద్బలస్ఫురణన్ = ఆ పరాక్రమమును, నృపుల్ తలపడ్డన్ = రాజు లెదిరింపఁగా, నగ్నజిత్ + ధరణీపునందనన్ = నగ్నజిత్తనెడు వానిబిడ్డను, వికచ తామరస + అక్షిన్ = వికసించిన పద్మములవంటి కన్నులుగలదానిని, ప్రమోదియై = సంతోషముగలవాఁడై, అనంతశక్తితోన్ = గొప్పశక్తితో, స్వయంవరమునన్ పెండ్లియాడెన్.

**తాత్పర్యము** : నగ్నజిత్తనునొకరా జుండెను. వానికడ నేఁడువృషభము లుండినవి. అవి విపరీతముగ మదించియుండినవి. వానిని స్వాధీనపఱచికొని ముకుద్రాళ్లను గట్టఁగల వానికి నాబిడ్డ నిత్తునని వాఁడు ప్రతిజ్ఞ చేసెను. ఎందఱో రాజులు వచ్చిరి. వానిని జయించుటకు వారికి సాధ్యపడలేదు. కృష్ణుఁడు పోయి వానికి ముకుద్రాళ్ల గట్టినాఁడు. అప్పుడా నీళాదేవిని స్వామి గ్రహించెను. పరాజితులైన రాజు లందఱు అసూయతోఁ గృష్ణపరమాత్మ నెదిరించినారు. వారి నందఱ నాతఁడు జయించి నీళాదేవి మనస్సును చూఱగొన్నాఁడు.

125.మ. ప్రతివీర క్షయకారి = శత్రువులను వినాశమొందించువాఁడు. నాన్ నెగడి = అనునట్లుగా ప్రసిద్ధి వహించి, సత్రాజిత్తనూజాహృదీప్సితమున్ = హృత్ + ఈప్సితమున్ = సత్రాజిత్తు బిడ్డయైన సత్యభామ కోరికను, తీర్పన్ తలంచి, నాకమునకున్ పెంపారఁగాన్ ఏగి = స్వర్గమునకుఁబోయి, వర్ణితశౌర్యోన్నతిన్ = అందరిచేతను బొగడఁదగిన పరాక్రమముతో, ఉద్ధతిన్, దేవేంద్రున్ జయించి = త న్నెదిరించిన దేవేంద్రు నోడించి. ఇలకున్, పారిజాతము, లీలాగతిన్ తెచ్చెన్ = లీలామాత్రముగా పారిజాతమును భూమికిఁ గొనివచ్చెను. ఏతత్ + మాత్రుఁడే = ఇంత మాత్రుఁడేనా?

**తాత్పర్యము** : సత్యభామ దేవేంద్రునిపారిజాతమును గోరినది. కృష్ణుఁ డామెకోర్కిదీర్ప నెంచెను. నరకాసురుని నుండి గ్రహించిన దేవమాతయగు నదితి కుండలములను వెన్కకిచ్చుసాకుతో నాతఁడు స్వర్గమునకుఁ బోయినాఁడు. కుండలము లిచ్చి కృష్ణపరమాత్మ పారిజాతమును బెఱికించి తెచ్చుచుండెను. ఇంతలో దేవేంద్రుఁ డెదిర్చినాఁడు. అతనిని జయించి కృష్ణుఁడు పారిజాత మిలకుఁ దెచ్చెను. ఆ పరాక్రమ మింతటిదని మితివెట్ట నెవ్వరి తరము?

126.సీ. మానిత = గౌరవింపఁదగిన, అఖిలజగత్ + మాయాదేహమునన్, = జగదాత్మకమైన శరీరముచేత, పొల్చు = ఒప్పుచున్న, ధరణిదేవికిన్ ప్రియతనయుఁ

డైన, నరకదానవునిన్ = నరకుఁ డనెడు రాక్షసుని, సునాభాఖ్యన్‌చెన్నొందు = సునాభ మను పేరుగల, ఘనచక్రధారన్ = గొప్పదైన చక్రముచేత, విఖండితోత్తమాంగునిన్ చేయన్ = ఖండింపఁబడిన తలగలవానినిగాఁ జేయఁగా, తత్పుత్రున్ = తత్పుత్రుఁ డైన భగవదత్తుని, విపులరాజ్యపదమునన్ నిల్పి = రాజుగాఁ బట్టాభిషేక మొనర్చి, లోపలిమందిరంబులన్ = అంతఃపురములందు, ఆర్తబాంధవుఁడైన పద్మాక్షున్ చూచి, హర్షబాష్ప అంబుధారాప్రవర్షము + ఒదవన్ = సంతోషబాష్పములు గడలుకొనఁ గా, పంచశరబాణ = మన్మథబాణములచేత, నిర్భిన్నభావలు అగుచున్ = చీల్పఁ బడిన మనస్సులు గలవారై.

**తాత్పర్యము :** సమస్త జగమే భూమాతకు శరీరము. ఆమె కుమారుఁడు నరకాసురుఁ డు. స్వామికి వరాహావతారమున జన్మించినవాఁడు. వాఁడు లోకకంటకుఁ డయ్యెను. కృష్ణుఁడు వాని నెదిర్చి సునాభమనుపేరుగల తన చక్రముతో వానికంఠమును దునిమెను. భూదేవిప్రార్థనమును మన్నించి వానిపుత్రుఁడైన భగదత్తునకుఁ బట్టముగట్టినాఁడు. అతఁ డంతఃపురములలోనికిఁ బోయెను. అక్కడ నూటపదాఱువేల రాజకన్యక లుండిరి. వారి నందఱిని నరకుఁడు తెచ్చి బంధించియుండెను. యదుస్వామినిఁ జూచినంతనే వారికన్నుల నానందబాష్పము లావరించినవి. వారిమనస్సులను మన్మథుఁడు జయించినాఁడు.

127.చ. లలిత = లలితములైన, తదీయ = కృష్ణునియొక్క, సుందరవిలాస = రమణీయములైన విలాసములచేత, విమోహితలు = మోహింపఁజేయఁబడినవారు, లలిత అవరోధభవనంబులన్ = లలితములైన యంతఃపురములలో, భక్తినితాంతచిత్తలన్ = భక్తిచే నావరింపఁ బడినచిత్తముగల, కాంతలన్ = స్త్రీలను, సుఖస్థితిన్ తనిపెన్.

**తాత్పర్యము : ఆ కన్యకలు కృష్ణుని విలాసములచే విమోహితలైనారు. వారి కోర్కులు దీర్చుటకుఁ గృష్ణుఁడు వారందఱి వాక్యమువహార్తమువనే వరించెను. అందఱి కన్నిరూపులై అంతఃపురములలోఁ గ్రీడించి వారియాశలు నెఱవేర్చినాఁడు.**

**128.క. చతురతతోన్ = సామర్థ్యముతో, ఒక్కొక + అతివకున్ = ఒక్కొక్కరాజకుమారికిని, ఆత్మసమములన్ = తనతో సమానులైన వారిని, ఉన్నతభుజశక్తులన్ = గొప్పభుజాబలముగలవారిని, వితతంబై = విస్తారముగలదై, వినుతికిన్ = స్తోత్రమునకు.**

**తాత్పర్యము :** ఆ పెండ్లాడిన రాజకన్యకలయం దొక్కొక్కదానియందును పదిమంది సుతులను గల్గించెను. వా రందఱును రూపపరాక్రమాదులలోఁ గృష్ణునితో సమానులు. గొప్పభుజాబలము గలవారు. కృష్ణునికీర్తివలెనే వారికీర్తిగూడ సర్వసంస్తుత్యమై దిక్కులకుఁ బ్రాకి వెలసినది.

129.సీ. చతుర్విధబల + ఓఘములతోన్ = రథగజతురగ పదాతులను నాల్గువిధములైన సైన్యములతో, ఆవరించిన = ఆక్రమించిన, తన బాహుశక్తిన్ = తనయొక్కబాహుబలమును, చిత్తములన్, అర్థించిన = కోరినట్టి, భీమ, పార్థులకున్, ఉద్దామవిజయము = గొప్పవిజయమును తత్ + వైరులన్ = వారిశత్రువులను, ఉక్కు+అణగంగన్ త్రుంచి = పొగరు మానిపోవునట్లుగా చంపి, దనుజనాయకసేనావితానములనున్ = రాక్షససైన్యసమూహములను, హలధరాదిసమేతుఁడై = బలరాముఁడు మొదలైన వారితోఁ గూడినవాఁడై, భండనములోనన్ = యుద్ధమునందు, దోః+బలము = దోర్బలము.

**తాత్పర్యము :** మాటిమాటికిని మధురను కాలయవనుఁడు, సాల్వుఁడు, జరాసంధుఁడు మొదలైనవా రడ్డగించుచుండిరి. అట్టివారిని సైన్యయుక్తముగాఁ గృష్ణుఁడు నాశ మొందించినాఁడు. కాలయవనుని ముచుకుందునిమూలముగాఁ జంపించెను. జరాసంధునిఁ జంపినవాఁడు భీముఁడు. ఈ రెండును గృష్ణునిసంకల్పముచేతనే జరిగినవి. అందుచేత మూలమందుఁగూడ "అజీఘనత్" అని కృష్ణుఁడే చంపినట్లు తెల్పఁబడినది. తానే చంపక వారిచే నెందుకు జంపించినాఁడు? "స్వపుంసాంతేజ ఆదిశత్" అని మూలకారుని యుత్తరము. అనఁగా తనభక్తులతేజమును బ్రపంచమున వ్యాపింపఁ జేయుటకై యట్లొనర్చెనని తాత్పర్యము. అట్లే కౌరవులను జంపినది భీమపార్థులు. వారు కృష్ణునిబాహుశక్తి తమ్మావేశింప వలసినదని ప్రార్థింపఁగా పరమాత్మ వారిలో నావహిల్లి కౌరవసైన్యమును నశింపఁజేసినాఁడు. "యద్ద్రోణభీష్మార్జున భీమమూలైః" అని మూలము. ద్రోణభీష్ములయందుఁ గూడ నావేశించి జనక్షయము గావించినవాఁడు కృష్ణుఁడే. అట్లే శంబరుని జంపినవాఁడు ప్రద్యుమ్నుఁడు. కొందఱను బలరాముఁడు చంపెను. వీరిద్వారా సంహరింపఁజేసినవాఁడు కృష్ణుఁడేగనుక వారిమరణకారణముగూడ యదుస్వామియే యన్నాఁడు. శిశుపాలదంతవక్త్రాదులు స్వయముగాఁ గృష్ణు నెదిరించి హతులైనవారు.

130.వ. కౌరవపాండవ భండనంబునకున్ = కురుపాండవయుద్ధమునకు, రాజన్యులు = రాజులు, అన్య + అన్య (అన్యోన్య) = పరస్పరము, మాత్సర్య = అసూయ, ఉత్సాహము - వీనిచేఁ గూడినవారై, పాదఘట్టనంబులన్ = పాదములత్రొక్కిడులచేత, అనన్యసామాన్యంబులు = ఇతరులకు నిర్వహింప సాధ్యముగానివి, నింగిన్ మ్రింగన్ = ఆకాశమును మ్రింగఁగా, తురంగమ = గుఱ్ఱములయొక్క, రింఖా = గిట్టలచేత, సముద్ధూత = ఎగురఁ గొట్టఁబడిన, ధూళివటల = ధూళినమూహముచేత, పరిచ్ఛన్న = కప్పఁబడిన, భానుమండలంబుగాన్ = సూర్యమండల మగునట్లుగా, మోహరించు = ఎదిరించు, మద + ఉన్మత్తులు = మదముచే నొడలుమఱచినవారు, దుస్ + మంత్రము = చెడ్డదైన కార్యాలోచన, ఎగ్గుసేసిన = అపకార మొనర్చిన, సంగరంబునన్ = యుద్ధమందు, గతాయు శ్రీవిభవుఁడై = నాశమైన ఆయుస్సును రాజ్యవిభవమును గలవాఁడై, అపరితుష్టచిత్తుండై = సంతోషపడని మనస్సుగలవాఁడై, మధుపాన = మద్యముత్రాగుటచే నేర్పడిన, మద = మదముచేత, విఘూర్ణిత = తిరుగుడువడుచున్న, తామ్రవిలోచనులై = ఎఱ్ఱనికన్నులు గలవారై, పోరించి = యుద్ధ మొనర్చునట్లు చేసి, ఇతరేతర = పరస్పరము, కరాఘాతంబులన్ = భుజపరాక్రమముచేత, నిస్సపత్నము = శత్రువులులేనిది, పరితోషంబు = సంతోషము, తత్పరోక్షంబునన్ = వా రేగినతర్వాత, తురంగమేధంబులు = అశ్వమేధములు.

**తాత్పర్యము** : కృష్ణుఁడు కురుపాండవయుద్ధమునకుఁ దోడ్పడినాఁడు. ఆతనిసంకల్ప మొక్కటే భూభారహరణము. ఆ కార్యమును సాధించుటలో నాతనికి స్వపరభేదము లేదు. అందుచే నా పరమాత్మ రాజన్యుల చిత్తములందు, మాత్సర్యోత్సాహముల నభివృద్ధి నందఁజేసెను. వా రందఱు కురుక్షేత్రమున నిరుతెగలై నిలిచినారు. ఆ వీరుల పాదఘట్టనములచేత ధరాచక్రము కంపించుచుండెను. శంఖభేరీప్రముఖనాదములతో నాకాశము మ్రింగివేయఁబడెను. గుఱ్ఱముల గిట్టలనుండి రేఁగిన ధూళితో సూర్యమండల మావరింపఁబడెను. వారిలోఁ గృష్ణుఁడే యావేశించి యా బలముల నన్నిటిని దునుమాడినాఁడు. కౌరవ పాండవులసైన్యములను దునుమాడినది వారివారియం దావేశించిన కృష్ణుఁడే యని సారము. రాజ్యవైభవముచే మదించిన దుర్యోధనుఁడు పాండవుల కెన్నియో

యుపకారము లొనర్చెను. వాని ప్రవృత్తికి కర్ణ, శకుని, దుశ్శాసనాదుల దుర్మంత్రములే కారణము. వాఁడు కడకు భీమునిగదా ఘాతములచేఁ దొడలువిఱిగి పడినాఁడు. పదునెనిమిది యక్షౌహిణుల సైన్యము నాశ మైనది. యుద్ధకారణమైన దుర్యోధనుఁ డంతరించెను. కాని కృష్ణునకుఁ దృప్తి గలుగలేదు. మహాబలులైన యాదవు లింకను మిగిలియే యున్నారు. వారు తనతో సమానమైన బలముగలవారు. వారిని జంపుట కెవ్వరికిని సాధ్యముగాదు. వారు గతించిననఁగాని భూభార మణఁగదు. ఇది కృష్ణుని మనస్సులో నున్న యభిప్రాయము. అతఁడు ధర్మరాజునకుఁ బట్టముగట్టి మూఁ డశ్వమేధములను జేయించెను. పాండవవంశాంకురమును నాశ మొనర్ప నశ్వత్థామ యొనర్చిన బ్రహ్మాస్త్రప్రయోగరూపమైన యత్నమును వారించి పరీక్షిత్తును నిలిపినాఁ డు. కాల మిట్లుగాఁ గడచుచున్నది.

131.సీ. వలనొప్పన్ = క్రమముగా, లౌకిక వైదికమార్గముల్ నడపుచున్ = లోకరీతిని, వేదచోదితమైన ధర్మమును నడవుచు, అవిదిత ఆత్మమాయాప్రభావమునన్ = ఇతరులచే నర్థ మొనర్చికొనరాని యోగమాయాప్రభావముచేత, నిస్సంగుఁడైయుండి = సుఖములయం దిష్టములేనివాఁ డయ్యును, సంసారివగిదిన్ చెంది = సంసారివలె మెలఁగుచు, విమోహితుండై = మోహింపఁజేయఁబడినవాఁడై, ముదిత + ఆత్ముఁడు = సంతోషపడుచున్న మనస్సుగలవాఁడు", అంచిత స్నిగ్ధస్మితావలోకములన్ = చిఱునవ్వుచేఁగూడిన చూపులతో, సుధాపరిపూర్ణసల్లాపములన్ = అమృతముచేఁ గూడిన మాటలతో, శ్రీనికేతనమైన శరీరమునమున్ = లక్ష్మీనివాసమైన శరీరముచేతను.

**తాత్పర్యము** : కృష్ణుఁడు ద్వారకయందు వసించుచుండెను. అతఁడు లౌకిక వైదిక ధర్మముల ననుసరించుచు మెలఁగుచుండినాఁడు. ఆయనకు రెంటిలోను సంబంధము లేదు. ఆ రెంటి ననుసరించుట లోకశిక్షణార్థమే. అతని యోగమాయప్రభావ మెవ్వరికి నర్థముగా కుండెను. సుఖదుఃఖములం దాతఁడు నిస్సంగుఁడు. ఐనను సంగముగలవానివలెనే మెలఁగుచుండెను. చిఱునవ్వుతోఁ గూడిన చూపులతో, నమృతమయమైన సల్లాపములతో, నిత్యలక్ష్మీనివాసమైన శరీరముతోఁ గృష్ణపరమాత్మ పాండవులకు, యాదవులకు సంతోషమును గలిగించుచు సాధురక్షణాశీలుఁడై కాలమును గడపుచుండెను.

132.సీ. సంపూర్ణ పూర్ణిమాచంద్ర చంద్రికన్ = పున్నమనాటి చంద్రుని వెన్నెలచేత, ఒప్పు, రమణీయ శారదరాత్రులందున్ = శరత్కాలరాత్రులందు, సలలిత

కాంచనస్తంభ = బంగారుకంబములు గల, సౌధోపరి = సౌధములపైనున్న, చంద్రకాంతోపల స్థలములందున్ = చలువరాలతోఁగూడిన చోటులలో, మహిత = గొప్పనైన, కరేణుకామధ్యదిగ్గజములగతిన్ = ఆడయేన్గుల నడుమనున్న దిగ్గజములవలె. సౌదామనీలతలనడిమి నీలమేఘంబులలీలన్ = మెఱుపులమధ్యనున్న, నీలమేఘములవలె, ముక్తామధ్య = ముత్తెములమధ్యనున్న, లాలితశక్రనీలములభాతిన్ = అందమైన యింద్రనీలములవలె, సతతయౌవన సుందరీవిహారుఁడు అగుచున్ = నిత్యయౌవనముగల స్త్రీలనడుమ విహరించుచున్నవాఁడై, పెక్కు+ అబ్దములు = అనేకసంవత్సరములు, అభినవ + ఆనందలీలన్ = క్రొత్త క్రొత్తదైన సంతోషముతో, క్రీడించెన్.

**తాత్పర్యము** : అదిపున్నమరేయి. సంపూర్ణచంద్రుఁడు ప్రకాశించుచుండెను. దిక్కుల నాక్రమించిన వాతనివెన్నెలలు. కృష్ణుఁడు కాంచనస్తంభ సంభృతమైన సౌధోపరిభాగమున చంద్రకాంతశిలా సంఘటితమైన స్థలములో రాసక్రీడలాడుచున్నాఁడు. ఆ గోపికలు నిత్యయౌవనలు. వారిసౌందర్యమును నిత్యము. కృష్ణపరమాత్మ యోగశక్తితో నందఱ కన్నిరూపులై ప్రకాశించుచుండెను. గోపికలు కరేణువులవలె నుండిరి. అందఱ కన్నిరూపులై యొన్న కృష్ణుఁడు దిగ్గజముల వలెనుండెను. వారు మెఱుపుతీవెలు. కృష్ణుఁడు కారుమబ్బువలెనున్నాఁడు. అందఱ కన్నిరూపములనొప్పె కృష్ణుఁడు దిగ్గజము వలెనుండెను. వారు ముత్తెముల హారములు, ఇతఁడు వారిమధ్యనున్న, యింద్రనీలము. మొదటి యుపమానముతో గమనములలోని సౌందర్యమును వర్ణించినాఁడు. రెండవదానిలో గోపికలదేహప్రభలు సూచితములు. మూఁడవయుపమానము వారిశరీరలావణ్యమును దెలుపుచున్నది. ఇట్లు రాసక్రీడలతో ననేకసంవత్సరములు గడచెను. దినదినమును వారి యానందము క్రొత్తక్రొత్తగాఁ బ్రకాశించుచుండినది.

**133.వ.** అంత నొక్కనాఁడు -

**134.చ.** మునివరులు+ఏగుదేరన్ = మహర్షులురాఁగా, యదుభోజవరేణ్యులు = యాదవులు, భోజాలు అనువారిలో శ్రేష్ఠులు, కూడిముట్టఁబల్కినన్ = గుంపులుగూడి వారిని హాస్యములాడఁగా, కినుకఒంది = కోపముగొని, వారు తమకించి తొందరపడి యా మునులు శపించఁగా, కొన్నిమాసములేచనువెడన్ దైవయోగమునన్, జాతరపోన్ సమకట్టి వేడుకల్, మనమునన్ తొంగలింపన్, గరిమన్ నిజయానములెక్కి = తమ వాహనములెక్కి, యాదవులు.

**తాత్పర్యము** : ఒకనాఁడు ద్వారకాపురికిఁ గొందరుమహర్షులు వచ్చినారు. రాజ్యలక్ష్మీమదాంధులైన యాదవులు వారిని హాస్యమాడిరి. వారు శాపమిచ్చినారు. తరువాతఁ గొన్నిమాసములు గడచినవి. యాదవులు దైవప్రేరితులై జాతరబోవ సిద్ధపడిరి. ఈ పద్యములో "తమకించి శపింపఁగన్" అని ఋషులు తొందరపడి శాపమిచ్చినారని గలదు. మూలములో "భగవన్మతకోవిదాః" అని యున్నది. యాదవవినాశమును గాంక్షించుచున్న భగవంతుని యభిప్రాయము నెఱిఁగినవారై అని యర్థము పోతన మూలమునుండి భేదించినాఁడు. 132. సీసపద్యము - "రేమే క్షణదయాదత్తక్షణస్త్రీక్షణసౌహృదః" - అనుమూలమునకు అమాత్యుఁ లొనర్చినపెంపు, ఆ పెంపెంతయో రమణీయమైనది.

135. ఉ. తత్ + నదిన్ = ఆ నదిలో, క్రుంకి = స్నానముచేసి, నిర్మల + ఉదారతన్ = పరిశుద్ధమనస్సుయొక్క గొప్పతనముతో, నవవత్సలతోన్ = క్రొత్తగాఁ బుట్టినదూడలతో, భూరిసదక్షిణాకముగన్ = గొప్పదక్షిణలతోఁబాటు.

**తాత్పర్యము** : వారు ప్రభాసతీర్థమునకుఁ బోయినారు. దానిలో స్నానమొనర్చి దేవపితృతర్పణము లొనర్చిరి. అప్పుడే ప్రసవించి నూత్నములైన దూడలతోఁ గూడిన గోవులను గొప్పదక్షిణలతోఁబాటు బ్రాహ్మణులకు దాన మిచ్చినారు.

136. క. అజిన = కృష్ణాజినములు, పట = వస్త్రములు, రత్నకంబళ = రత్నకంబళములు రజత = వెండి, మహారజత = బంగారు, తిల = నూగులు, ధరా = భూమి, వరకన్యా = చక్కని కన్యలు, సత్ద్విజకోటికిన్ = వేదపారగులైన బ్రాహ్మణులకు, ఇచ్చెన్ = ఇచ్చెను. యాదవసమూహమని తెచ్చిపెట్టుకొనవలెను.

**తాత్పర్యము** : వారు కృష్ణాజినములు దాన మిచ్చిరి. వస్త్రములు రత్నకంబళాదు లొసఁగిరి. వీని నన్నిటిని సదక్షిణాకముగ నిచ్చినారు. దక్షణలేని దానమునకు విలువలేదు.

137.వ. సఫలంబులైన = సార్థకములైన భూదానంబు, అనూనంబుగాన్ = తక్కువగాకుండ, భగవత్ + అర్పణ, బుద్ధింజేసి = దానఫలమును భగవంతున కర్పించి, అనంతరంబు = తర్వాత.

ఈ దానము లన్నియు భగవంతున కర్పితములుగా నొనర్చినారు. అటు తరువాత

**ఇది పుట్టపర్తి నారాయణాచార్య విరచిత**
**భాగవతసుధాలహరి యందు తృతీయస్కంధమున**
**మూఁడవయధ్యాయము.**

# భాగవత సుధాలహరి
## తృతీయస్కంధము
## చతుర్థాధ్యాయము

ఉద్ధవ ఉవాచ -

అథ తే తదనుజ్ఞాతా భుక్త్వా పీత్వా చ వారుణీమ్,
తయా విభ్రంశితజ్ఞానా దురుక్తై ర్మర్మ పస్పృశుః. 1
తేషాం మైరేయదోషేణ విషమీకృతచేతసామ్,
నిమ్రోచతి రవా వాసీ ద్వేణూనా మివ మర్దనమ్. 2
భగవాన్ స్వాత్మమాయాయా గతిం తా మవలోక్య సః,
సరస్వతీ ముపస్పృశ్య వృక్షమూల ముపావిశత్. 3
అహం చోక్తో భగవతా ప్రపన్నార్తిహరేణ హ,
బదరీం త్వం ప్రయాహీతి స్వకులం సంజిహీర్షుణా. 4
తథాపి తదభిప్రేతం జాన న్నహ మరిందమ,
పృష్ఠతో ఽ న్వగమం భర్తుః పాదవిశ్లేషణాక్షమః. 5
అద్రాక్షం చైక మాసీనం విచిన్వన్ దయితం పతిమ్,
శ్రీనికేతం సరస్వత్యాం కృతకేత మకేతనమ్. 6
శ్యామావదాతం విరజం ప్రసన్నారుణలోచనమ్,
దోర్భి శ్చతుర్భి ర్విదితం పీతకౌశాంబరేణ చ. 7
వామఊరా వధిశ్రిత్య దక్షిణాంఘ్రిసరోరుహమ్,
ఉపాశ్రితార్భకాశ్వత్థ మకృశం త్యక్తపిప్పలమ్. 8
తస్మి న్మహాభాగవతో ద్వైపాయనసుహృ త్సఖా,
లోకా ననుచరన్ సిద్ధ ఆససాద యదృచ్ఛయా. 9
తస్యాఽనురక్తస్య మునే ర్ముకుందః
ప్రమోదభావానతకంధరస్య,
ఆశృణ్వతో మా మనురాగహాస
సమీక్షయా విశ్రమయ న్నువాచ. 10

శ్రీ భగవా నువాచ -

వేదా౽హ మంతర్మనసి స్థితం తే
దదామి య త్త ద్దురవాప మన్యైః,
సత్రే పురా విశ్వసృజాం వసూనాం
మత్సిద్ధికామేన వసో త్వయేష్టః. 11

స ఏష సాధో చరమో భవానా
మాసాదిత స్తే మదనుగ్రహో౽యమ్,
యన్మాం నృలోకా న్రహ ఉత్సృజంతం
దిష్ట్యా దదృశ్వా న్విశదానువృత్త్యా. 12

పురా మయా ప్రోక్త మజాయనాభ్య
పద్మే నిషణ్ణాయ మమా౽౽దిసర్గే,
జ్ఞానం పరం య న్మహిమావభాసం
యత్సూరయో భాగవతం వదంతి. 13

ఉద్ధవ ఉవాచ :

ఇత్యాదృతోక్తః పర మస్య పుంసః
ప్రతీక్షణానుగ్రహభాజనో౽హమ్,
స్నేహోర్ధ్వరోమాస్ఖలితాక్షర స్తం
ముంచం ఛ్ఛుచః ప్రాంజలి రాబభాషే. 14

కో న్వీశతే పాదసరోజభాజాం
సుదుర్లభో౽ర్థేషు చతుర్ష్వపీహ.
తథాపి నా౽హం ప్రవృణోమి భూమ
న్భవత్పదామ్భోజనిషేవణోత్సుకః. 15

కర్మా ణ్యనీహ స్యభవో౽భవస్య తే.
దుర్గాశ్రయో౽థారిభయా త్పలాయనమ్,
కాలాత్మనో యత్ప్రమదాయుతాశ్రమ
స్స్వాత్మ న్రతేః ఖిద్యతి ధీ ర్విదామపి. 16

మన్త్రేషు మాం వా ఉపహూయ య త్త
మకుంఠితాఖండసదాత్మబోధః,
పృచ్ఛేః ప్రభో ముగ్ధవదప్రమత్త
స్త న్నో మనో మోహయతీవ దేవ. 17

జ్ఞానం పరం స్వాత్మరహః ప్రకాశం
ప్రోవాచ కస్మై భగవాన్ సమగ్రమ్,
అపి క్షమం నో గ్రహణాయ భర్త
ర్వదాంజసా య ద్వృజినం తరేమ. 18

ఇత్యావేదితహార్దాయ మహ్యం స భగవాన్ గురుః,
ఆదిదేశారవిందాక్ష ఆత్మనః పరమాం గతిమ్. 19

స ఏవ మారాధితతీర్థపాదా
దధీతతత్త్వాత్మవిబోధమార్గః,
ప్రణమ్య పాదౌ పరివృత్య దేవ
మిహాగతోహం విరహాతురాత్మా. 20

సోఽహం తద్దర్శనాహ్లాదవియోగార్తియుతః ప్రభోః,
గమిష్యే దయితం తస్య బదర్యాశ్రమమండలమ్. 21

యత్ర నారాయణో దేవో నరశ్చ భగవా నృషిః,
మృదు తీవ్రం తపో దీర్ఘం తేపాతే లోకభావనౌ. 22

శ్రీశుక ఉవాచ -

ఇత్యుద్ధవా దుపాకర్ణ్య సుహృదాం దుస్సహం వధమ్,
జ్ఞానేనాశమయత్ క్షత్తా శోక ముత్పతితం బుధః. 23

స తం మహాభాగవతం వ్రజంతం కౌరవర్షభః,
విస్రంభా దభ్యధత్తేదం ముఖ్యం కృష్ణపరిగ్రహే. 24

విదుర ఉవాచ -

జ్ఞానం పరం స్వాత్మరహఃప్రకాశం
యదాహ యోగేశ్వర ఈశ్వర స్తే
వక్తుం భవా న్నోర్హతి యద్ధి విష్ణో
ర్భృత్యా స్స్వభృత్యార్థకృత శ్చరంతి. 25

ఉద్ధవ ఉవాచ. -

నను తే తత్త్వసంరాధ్యఋషిః కౌషారవోఽంతిమే,
సాక్షా ద్భగవతాదిష్టో మ ర్త్యలోకం జిహాసతా. 26

ఇతి సహ విదురేణ విశ్వమూర్తే
ర్గుణకథయా సుధయాప్లుతోరుతాపమ్,
క్షణ మివ పులినే యమస్వసు స్తాం
సముషిత ఔపగవి ర్నిశాం తతోఽగాత్. 27

రాజోవాచ-

నిధన ముపగతేషు వృష్ణిభోజే
ష్వధిరథయూథపయూథపేషు ముఖ్యః,
స తు కథ మవశిష్ట ఉద్ధవో య
ద్ధరి రపి తత్యజ ఆకృతిం త్ర్యధీశః. 28

శ్రీశుక ఉవాచ-

బ్రహ్మశాపాపదేశేన కాలేనాఽమోఘవాంఛితః,
సంహృత్య స్వకులం స్ఫీతం త్యక్ష్య న్దేహ మచింతయత్. 29

అస్మా ల్లోకా దుపరతే మయి జ్ఞానం మదాశ్రయమ్,
అర్హత్యుద్ధవ ఏవాఽద్ధా సంప్రత్యాత్మవతాం వరః. 30

నోద్ధవోఽణ్వపి మన్న్యూనో యద్గుణై ర్నార్దితః ప్రభుః,
అతో మద్వయునం లోకం గ్రాహయ న్నిహ తిష్ఠతు. 31

ఏవం త్రిలోకగురుణా సందిష్ట శ్శబ్దయోనినా,
బదర్యాశ్రమ మాసాద్య హరి మీజే సమాధినా. 32

విదురోఽప్యుద్ధవా చ్ఛ్రుత్వా కృష్ణస్య పరమాత్మనః,
క్రీడయోపాత్తదేహస్య కర్మాణి శ్లాఘితాని చ. 33

దేహన్యాసం చ తస్యైవ ధీరాణాం ధైర్యవర్ధనమ్,
అన్యేషాం దుష్కరతరం పశూనాం విక్లబాత్మనామ్. 34

ఆత్మానం చ కురుశ్రేష్ఠ కృష్ణేన మనసేక్షితమ్,
ధ్యాయ న్గతే భాగవతే రురోద ప్రేమవిహ్వలః. 35
కాళింద్యాః కతిభి స్సిద్ధో౽హూభి ర్భాగవతర్షభః,
ప్రాపద్యత స్వస్సరితం యత్ర మిత్రాసుతో మునిః. 36

ఇతి శ్రీమద్భాగవతే, మహాపురాణే, పారమహంస్యాం, సంహితాయాం,
తృతీయస్కంధే, చతుర్థోధ్యాయః

ఉద్ధవ ఉవాచ = ఉద్ధవుఁ డనెను

1. శ్లో : తదనుజ్ఞాతాః = ఆ బ్రాహ్మణులచేత ననుజ్ఞసేయఁబడినవారై, తే = ఆ యాదవులు, భుక్త్వా = భుజించి, అథ = అనంతరము, వారుణీం = మద్యమును, పీత్వా = త్రాగి, తయా = ఆ క్రియచేత, విభ్రంశితజ్ఞానాః = నిశ్శేషముగా నశించిపోయిన వివేకముగలవారై, దురుక్తైః = దుష్టములైన మాటలచేత, మర్మ = మర్మస్థానములను, పస్పృశుః = స్పృశించిరి.

**తాత్పర్యము** : చేయవలసిన కర్మకలాపములు దీరినవి. బ్రాహ్మణులాహారవిహారముల కనుజ్ఞ నిచ్చిరి. ఆ పిదప యాదవులు భోజనాదులు ముగించినారు. మద్యపానమునకుఁ దొడఁగిరి. అది విపరీత మగుటతో వివేకము పూర్తిగా నశించినది. పరస్పరాధిక్షేపములకు దిగినారు. ఆ యధిక్షేపములు మర్మస్థానములు దాఁకుచు రెచ్చగొట్టునవియై యుండెను.

2. శ్లో : మైరేయదోషేణ = మద్యదోషముచేత, విషమీకృతచేతసాం = వివేకముదప్పిన మనస్సులుగల, తేషాం = వారికి, రవౌ = సూర్యుఁడు, నిమ్లోచతిసతి = అస్తమించుచుండఁగా, వేణూనాం ఇవ = వెదుళ్లకువలె, మర్దన = పరస్పర సంఘర్షణము, ఆసీత్ = ఏర్పడినది.

**తాత్పర్యము** : మద్యపానముతో యాదవులమతులు వివేకము దప్పినవి. సూర్యుఁ డస్తమించుచుండెను. ఆ సమయమందు వేణువనములలోవలె వారికిఁ బరస్పరసంఘర్ష మేర్పడినది. వేణువులలో జనించిన యగ్ని విస్తరించి యా వెదురులనే గాల్చును.

3. శ్లో : భగవాన్ = సమస్తైశ్వర్యసంపన్నుఁడైన, సః = కృష్ణపరమాత్మ, స్వాత్మ మాయాయాః = తనమాయ యొక్క, గతిం = ప్రవృత్తిని, అవలోక్య = చూచి, సరస్వతీం = సరస్వతీనదిని, ఉపస్పృశ్య = ఉపస్పర్శించి, వృక్షమూలం = చెట్టుయొక్కమొదలునుగూర్చి, ఉపావిశత్ = కూర్చున్నవాఁడయ్యెను.

తాత్పర్యము : తనసంకల్పశక్తియైనమాయ, తన కులమునంతయు నాశ మొనర్చుచున్నది. దాని ప్రవృత్తిని గాంచి కృష్ణపరమాత్మ మనస్సులో సంతోషించినాఁడు. ఆతఁడు సరస్వతీనదిలో స్నానపానము లొనర్చికొనెను. ఒకానొక వృక్షమూలము నాశ్రయించినాఁడు.

4. శ్లో : స్వకులం = తనవంశమును, సంజిహీర్షుణా = నాశమొనరింపఁ గోరుచున్నట్టియు, ప్రపన్నార్తిహారేణ = శరణాగతులైనవారి దుఃఖమును బోఁగొట్టువాఁడునైన, భగవతా = భగవంతునిచేత, త్వం = నీవు, బదరీంప్రయాహి ఇతి = బదరీవనమును గుఱించి పొమ్మని, అహం = నేను, ఉక్తః చ = చెప్పఁబడితిని.

తాత్పర్యము : కృష్ణపరమాత్మ స్వకులమును సంహరించి భూభారమును హరింపఁ దలఁచెను. అతఁడు శరణాగతుఁడైన నాసంసారదుఃఖమును నిశ్శేషముగా ఁదొలఁగించి రక్షింపమన్నకరుణనిమిత్తముగా, "నీవు బదరికాశ్రమమునకు వెళ్లు" మని యాజ్ఞాపించినాఁడు.

5. శ్లో : అరిందమ = ఓమహావీరుఁడవైన విదురా! తదభిప్రేతం = ఆయనయభిప్రాయమును, జానన్ అహం = తెలిసినట్టి నేను, భర్తుః = స్వామియగుకృష్ణపరమాత్మునియొక్క, పాదవిశ్లేషణాక్షమః = పాదములను వదలిపోవుటకు నిష్టములేనివాఁడనై, పృష్ఠతః = వెంటవెంటనే, అన్వగమం = అనుగమించితిని.

తాత్పర్యము : నన్ను బదరికి వెళ్లుమన్న దెందుకో నా కర్థమైనది. కాని కృష్ణపాద సన్నిధానమును వదలిపోవుటకు నా కిష్టములేదు. అందుచే నాతనినే యనుగమించి వెళ్లితిని.

6. శ్లో : దయితం = ప్రేమస్వరూపుఁడు, పతిం = సర్వపరిపాలకుఁడు, శ్రీనికేతం = లక్ష్మికి సదా నివాసస్థానమైనవాఁడు, అకేతనం = తన కన్యమైన యాశ్రయము లేనివాఁడును. సరస్వత్యాం = సరస్వతీనదీతీరమందు, కృతకేతం = వసించుచున్నవాఁ

డును, అకేతనం = తనకుఁ బ్రత్యేకస్థానము లేనివాఁడును, ఏకం = ఏకాంతముగా, ఆసీనం = ఆసీనుఁడైన కృష్ణపరమాత్మను, విచివ్వన్ = ఆతనిమహత్త్వము నాలోచించుచున్నవాఁడనై, అద్రాక్షం = చూచితిని.

**తాత్పర్యము** : నాకుఁ బరమప్రేమాస్పదుఁ డతఁడు. సమస్తలోకములను బాలించువాఁడు. శ్రీదేవికి నిత్యనివాస మాతనివక్షఃస్థలము. తా నందరి కాశ్రయుఁడు. తన కాశ్రయ మొక్కటియు లేదు. ఆతఁడు సరస్వతీనదీ తీరము నాశ్రయించి యున్నాఁడు. తనకని ప్రత్యేకస్థానములేని విచిత్రవ్యక్తి ఆయన. అతఁడు ఏకాంతమునఁ గూర్చొనియుండెను. నే నాతని మహత్వమునుగూర్చి యాలోచించుచు నిర్నిమేష నయనములతోఁ జూచుచుంటిని.

7. **శ్లో** : శ్యామావదాతం = నీలివన్నెగలిగి పరమస్వచ్ఛమైన దాతనిశరీరము, విరజం = రజస్తమస్సుల లేశమును లేనివాఁడు. ప్రశాంతారుణలోచనం = అతని లోచనములు ప్రశాంతములై యుండెను. మహాపురుష లక్షణమైన యారుణ్య మాకన్నులం దుండెను. చతుర్భిః + దోర్భిః = నాల్గుభుజములతోఁ గూడినవాఁడు. పీతకౌశేయవసనం = పచ్చనిపట్టుపుట్టమును గట్టినవాఁడు.

**తాత్పర్యము** : శ్యామలకోమలమ్మైన యాతని శరీరము స్వచ్ఛముగాఁ బ్రకాశించుచుండినది. రజస్తమస్సుల స్పర్శయే లేదు. కన్నులెఱ్ఱనివై ప్రశాంతముగ నుండెను. నాల్గుభుజములు; కట్టినపట్టు పుట్టము.

8. **శ్లో** : దక్షిణాంఘ్రి సరోరుహం = కుడిదైన పాదపద్మమును, వామఊరౌ = ఎడమకాలితొడపైన, అధిశ్రిత్య = ఉంచికొన్నట్టియు, అకృశం = ఏ మాత్రము గృశత్వము లేనట్టియు, త్యక్తపిప్పలం = కర్మసంగములేనట్టియు, ఉపాశ్రితార్భకాశ్వత్థం = అశ్వత్థమూలము నాశ్రయించి యొఱఁగి కూర్చున్నవానిని, అద్రాక్షం : చూచితిని అని అన్వయము.

**తాత్పర్యము** : దక్షిణపాదమును వామపాదముతొడపై నానించియున్నాఁడు. కర్మఫల మొక్కటితోను సంబంధములేకుండుటతో కార్శ్యము, స్థౌల్యము, వ్యాధి మొదలైన యే బాధలును ఆతని నంటలేదు. ఆ స్వామి దివ్యమంగళ శరీరము ఒకానొక యశ్వత్థమూలము నాశ్రయించి యున్నది.

9. **శ్లో** : లోకాన్ = వివిధదేశములను, అనుచరన్ = వరుసగా సంచరించుచున్నవాఁడును, ద్వైపాయనసుహృత్సఖా = వ్యాసమహామునితోడఁ జదువుకొన్నవాఁడును,

స్నేహితుఁడును, మహాభాగవతః = పరమభాగవతుఁడు నైన మైత్రేయుఁడు, తస్మిన్ = ఆ స్థానమునుగూర్చి, యదృచ్ఛయా = దైవవశాత్తు, ఆససాద = చేరెను.

**తాత్పర్యము** : అప్పు డచ్చటికి దైవవశాత్తు మైత్రేయమహాముని వచ్చినాఁడు. ఆతఁడు వ్యాసుని సహాధ్యాయి, పరాశరునికడ సమస్తవిద్య లభ్యసించినవాఁడు. వ్యాసునకుఁ జెలికాఁడు. ఆతఁ డొక్కచో నిలుకడగ నిలుచుట లేదు. నిరంతరసంచారమే యాతని పని. పరమభక్తుఁడు.

**10. శ్లో** : ప్రమోదభారానత కంధరస్య = సంతోషాధిక్యముచే వంచిన శిరస్సుగలిగినట్టి, మునేః = మైత్రేయుఁడు. అశృణ్వతః = వినుచుండఁగనే, అనురాగహాససమీక్షయా = పరమప్రేమను సూచించుచున్న మందహాసముతోఁ గూడిన నిరీక్షణముతో, మాం = నన్ను, విశ్రమయన్ = విశ్రమింపఁజేయుచున్నవాఁడై, ఉవాచ = (కృష్ణుఁడు) పలికెను.

**తాత్పర్యము** : ముకుంద సందర్శనముతో మైత్రేయున కమితసంతోష మేర్పడినది. ఆతఁడు పరమభక్తితో నవనతశిరస్కుఁ డైనాఁడు. భగవంతుని పాదపద్మములకు మైత్రేయుఁడు నమస్కరించెను. ఆతనిసన్నిధానమందే ఆతఁడు వినుచుండఁగనే భగవంతుఁడు నా కనుజ్ఞ నొసఁగ మొదలుపెట్టెను. ఆ యనుజ్ఞకు ముం దాతని కరుణాకటాక్షములు నాపైఁ బ్రసరించినవి. ఆ విలోకనములు పరమప్రేమపిశునములై మందహాసముతోఁ గూడియుండినవి.

శ్రీభగవానువాచ : భగవంతునివాక్యములు.

**11. శ్లో** : తే = నీయొక్క, అంతర్మనః = హృదయమం దణఁగియున్న, ఈప్సితం = కోరికను, అహం = నేను, వేద = తెలియుదును, అన్యైః = ఇతరులచేత, దురవాపం = పొంద నశక్యమైనట్టి, తత్ = నీమనోవాంఛితమును, దదామి = ఇత్తును, పురా = నీపూర్వజన్మమందు, విశ్వసృజాం = లోకస్రష్టలైన, వసూనాం = వసువులయొక్క, సత్రే = సత్రయాగమందు, మత్సిద్ధికామేన = కేవలము నేను లభించుటకొఱకే, త్వయా = నీచేత, ఇష్టః = పూజింపఁబడితిని.

**తాత్పర్యము** : భగవంతుఁ డన్నాఁడు, "ఉద్ధవా! నీవు పూర్వజన్మమందు వసువులలో నొక్కఁడవు. అప్పుడు లోకస్రష్టలైన వసువులు సత్రయాగమును నిర్వహించుచుండిరి. ఆ సత్రమందు నీవుగూడ నున్నావు. పలువురు పలువిధములైన కోరికలతో న న్నప్పు డుపాసించిరి. నీవుమాత్రము నేను లభించుటకొఱకే నన్నుఁ బూజించితివి.

నేను దప్ప నితర మొల్లని నీ పూజాఫలముగా నీ కితరదురాపమైన జ్ఞానము నిచ్చుచున్నాను. దీనితో నీయాకాంక్ష పరిపూర్ణముగా సిద్ధింపఁగలదు.

**12. శ్లో** : సాధో! = పరమశాంతుఁడవైన యో యుద్ధవా!. సః ఏషః = ఆనీయొక్క యీజన్మ, భవానాం = నీజన్మలకు, చరమః = కడపటిది. తే = నీచేత, ఆసాదితః = పొందఁబడిన, యత్మదనుగ్రహః = ఏనాయనుగ్రహముగలదో దానివలన, నృలోకాత్ = మనుష్యలోకమును, ఉత్సృజంతం = వదలిపోవుచున్న, మాం = నన్ను, విశదానువృత్త్యా = నిర్మలభక్తితోఁగూడ, దదృశ్వాన్ = చూచినవాఁడవైతివి.

**తాత్పర్యము** : ఓసాధువైన యుద్ధవా! నాయనుగ్రహమునకు యోగ్యమైన చరమజన్మము నీది. అందుచేతనే యీ జీవలోకమును వదలిపోవుసంకల్పముతో నేకాంతము నపేక్షించిన నన్ను దర్శించుభాగ్యమును గంటివి. నీవు నాయందుఁ బరమప్రేమను బట్టినావు. దానిమహత్త్వమే యీనాదర్శనము.

**13. శ్లో** : ఆది సర్గే = మొట్టమొదటిసృష్టియందు, మమనాభ్యేపద్మే = నా నాభితామరయందు, నిషణ్ణాయ = స్థితుఁడైనట్టి, అజాయ = బ్రహ్మనుగూర్చి, మన్మహిమావభాసం = నామహిమను ప్రకాశింపఁజేయుచున్న, పరంజ్ఞానం = పరమజ్ఞానము, మయా = నాచేత, ప్రోక్తం = ఉపదేశింపఁబడినది. యత్ = దేనిని, సూరయః = మహర్షులు, భాగవతం = భగవత్సంబంధమని, వదంతి = చెప్పుదురో!

**తాత్పర్యము** : ఉద్ధవా! పూర్వకల్పమందు సృష్టికిముందు నా నాభిపద్మమందు బ్రహ్మదేవుఁడు జన్మించెను. అతని తపస్సుచేఁ బరితృప్తినందిన నేను నామహిమను బ్రకాశింపఁజేయు పరమతత్త్వజ్ఞానము నుపదేశించితిని. నే నతని కుపదేశించినదానినే భాగవత మని మహర్షులు వాకొందురు. సర్వోత్తమమైన యీ జ్ఞానము నే నీకిప్పు డుపదేశింతును.

**14. శ్లో** : పరమస్యపుంసః = పరమపురుషునియొక్క, ప్రతిక్షణానుగ్రహ భాజనః = అడుగడుగునను భాసించుచుండెడి యనుగ్రహమునకుఁ బాత్రుఁడనైన, అహం = నేను, ఇతి = ఈ రీతిగా, ఆదృతోక్తః = ఆదరింపఁబడి వచింపఁబడినవాఁడనై, స్నేహోత్థరోమస్ఖలితాక్షరః = పరమప్రేమచేత నేర్పడిన రోమాంచము దానిచేత తొట్రుపడుచున్న భాషణములు గలవాఁడనై, శుచః = బాష్పములను, ముంచన్ = వదలుచున్నవాఁడనై, ప్రాంజలిః = చేతులు మొగిడ్చి, ఆబభాషే = పలికితిని.

**తాత్పర్యము** : ఆ పరమపురుషుని యనుగ్రహము క్షణక్షణమునను నాపైఁ బ్రసరించుచుండెను. ఆతఁ డత్యంతాదరముతో నాతోఁ బ్రైమాట లన్నాఁడు. భక్తితో నాశరీరము రోమాంచిత మైనది. ఏమిపల్కుదమన్నను మాటలు తొట్రుపడుచుండెను. కన్నులలో నిండుకొన్న నీరు. చేతులు జోడించికొని స్వామి కిట్లు విన్నవించితిని.

**15. శ్లో** : తేపాదపరోజభాజాం = నీపాదపద్మములను భజించుచున్న వారికి, చతుర్ష్వ అర్థేషు = నాల్గుపురుషార్థములందును, కోను = ఏది, సుదుర్లభః = పొందుట కసాధ్యమైనది? తథాపి = అట్లున్నను, భవత్పదాంభోజనిషేవణోత్సుకః = నీ పద పద్మములను మాత్రమే సేవించుటయందాసక్తిగలవాఁడనై, అహం = నేను, నప్రవృణోమి = అంతకు భిన్నమైనదానిని కోరుట లేదు.

**తాత్పర్యము** : స్వామీ! నీ పాదపద్మములను భజించువారికి నాల్గుపురుషార్థములలోఁ బొందుట కశక్య మేదియు లేదు. ఐనను నేనుమాత్రము నీపాదపద్మముల భజనను దప్ప వేఱుదానిని గోరుటయే లేదు.

**16. శ్లో** : అనీహస్య = కర్తృత్వము లేనట్టి, తే = నీకు, కర్మాణి = కర్మలు, అభవస్య = జన్మరహితుఁడవైన నీకు, భవః = ఉత్పత్తి, కాలాత్మనః = కాలస్వరూపుఁడవైన నీకు, అరిభయాత్పలాయనం = శత్రుభయముతోఁ బరువెత్తుట. స్వాత్మన్రతేః = స్వరూపానందమందే రమించుచున్న నీకు, ప్రమదాయుతాశ్రయః = పలువురు స్త్రీలతోడి సంసర్గము, ఇహ = ఈవిషయములందు, విదాం = జ్ఞానులైన వారియొక్కయు, బుద్ధేః = బుద్ధికిని, ఖిద్యతి = బాధపడుచున్నది.

**తాత్పర్యము** : స్వామీ! నీ వకర్తవు, ఐనను గర్మాచరణ మొనర్చుచున్నావు, జన్మాదివికారములులేని నిత్యముక్తుఁడవు, కాని యవతరించుచున్నావు. కాలస్వరూపుఁడవు. కాని జరానంధాదుల కోడి పారిపోవుచున్నావు. స్వరూపానందమందే నిత్యమును రమింతువు. ఐనను స్త్రీగణపరివేష్టితుఁడవై వారితో రమించుచున్నావు. ఈ నీ విరుద్ధాచరణము జ్ఞానుల మనస్సులనుగూడఁ గలవరపఱుచుచున్నది.

**17. శ్లో** : అకుంఠితాఖండ సదాత్మబోధః = నీయాత్మజ్ఞాన మకుంఠమైనది. పరిపూర్ణమైనది. ఎల్లకాల మనువర్తించునది. త్రికాలాబాధితమై సత్యమైనది. ఇట్టివాఁడవు, త్వం = నీవు, ప్రభో! = సర్వసమర్థుఁడవైన స్వామీ! దేవ = నిరంతర ప్రకాశమానుఁడగువాఁడా! అప్రమత్తః = ఎప్పుడును పొరపాటనునది లేనివాఁడవు.

ఇట్టివాఁడవైనను, ముగ్ధఇవ = కొన్నివిషయములుదెలియనివానివలె. మంత్రేషు = రహస్యాలోచనముల యందు, మాం ఉపహూయ = నన్నుఁ బిలిపించికొని, పృచ్ఛేః = అడిగెదవు. తత్ = ఆనీప్రవృత్తి, నః మనః = మా మనస్సును, మోహయతి ఇవ = మోహింపఁజేయుచున్నదానివలె నున్నది.

**తాత్పర్యము** : సర్వనియామకుఁడవైన యో స్వామీ! నిత్యప్రకాశ మానుఁడవగు నోదేవా! నీ యాత్మజ్ఞానము సర్వవిషయములం దకుంఠితమై ప్రవర్తించును. నిత్యపరిపూర్ణమైనది. ఒకప్పుడును వీఁడకుండునది. ప్రమాద మనుటే యెఱుఁగని వాఁడవు. ఇట్టివాఁడవైనను గొన్నివిషయములు నీకేమో దెలియనట్లు నన్నుఁ బిలిపించి యడిగెదవు. ఈ నీప్రవృత్తి నామనస్సును బలుమాఱు మోహింపఁజేయుచుండును.

**18. శ్లో** : స్వాత్మరహః ప్రకాశం = నీస్వరూప రహస్యమును బ్రకాశింపఁ జేయునట్టిదియైన, పరం జ్ఞానం = పరమజ్ఞానమును, భగవాన్ = షడ్గుణైశ్వర్యవంతుఁడవైన నీవు, సమగ్రం = పూర్ణముగా, కస్మై = బ్రహ్మదేవునిగూర్చి, ప్రోవాచ = పలికితివి. భర్తః = ఓ స్వామీ! నః గ్రహణాయ = మాయొక్కగ్రహణమునకు, అపీక్షమం = యోగ్యమైన దైనచో, వద! = ఉపదేశింపుము. యత్ = ఏ జ్ఞానముచేత, అంజసా = ఏమియును గ్లేశములేక, వృజినం = పాపమును, తరేమ = తరింతుము.

**తాత్పర్యము** : షడ్గుణైశ్వర్యవంతుఁడవైన నీవు, స్వాత్మరహస్యమును బ్రకాశింపఁ జేయు పరమజ్ఞానమును బ్రహ్మదేవున కుపదేశించితివి. ఓ స్వామీ! ఆ యుపదేశమును గ్రహించుటకు నే నధికారినని నీవు దలఁచినచో దాని నుపదేశించెడు కారుణ్యమును జూపుము. దానివలన నే ననాయాసముగా జననమరణరూపమైన సంకటమును దరింతును.

**19. శ్లో** : ఇతి = ఇట్లు, ఆవేదితహార్దాయ = స్పష్టముగాఁ దెలియఁ జేయఁబడిన చిత్తప్రవృత్తిగల, మహ్యాం = నాకొఱకు, పరః = పరమపురుషుఁడైన భగవాన్ = భగవంతుఁడైన, అరవిందాక్షః = పుండరీకాక్షుఁడు, ఆత్మనః = తనయొక్క, పరమాం స్థితిం = ఉత్కృష్టమైన స్థితిని గుఱించి, ఆదిదేశ = వచించెను.

**తాత్పర్యము** : ఈ రీతిగా నామనోభిప్రాయమును స్వామికి స్పష్టముగా నివేదించితిని. పరమపురుషుఁడైన భగవంతుఁడు, అరవిందాక్షుఁడు ఆత్మస్వరూపస్థితిని గరుణతో నా కుపదేశించినాఁడు. సర్వజ్ఞుఁడైన భగవంతుఁడు భక్తులకోర్కెలను దీర్చువాఁ డని యభిప్రాయము.

**20. శ్లో** : ఏవం = ఈ రీతిగా, ఆరాధితపాదతీర్థాత్ = సర్వులచేతను పూజితమైన పరిశుద్ధమైన పాదద్వయమను తీర్థముగల, భగవంతునినుండి, అధీతతత్త్వాత్మ విబోధమార్గః = గ్రహింపఁబడిన పరమాత్మబోధ మనెడు నుపాయముతోఁగూడిన, సః అహం = ఆ నేను, పాదౌ ప్రణమ్య = పరమాత్ముని పాదములను గూర్చి నమస్కరించి, దేవం = కృష్ణపరమాత్మను గుఱించి, పరివృత్య = ప్రదక్షిణముగావించి, విరహాతురాత్మా = కృష్ణుని వియోగముచే దుఃఖించుచున్న మనస్సుగలవాఁడనై, ఇహ ఆగతః = ఇక్కడికి వచ్చితిని.

**తాత్పర్యము** : ఆ కృష్ణపరమాత్మపాదములు పరమతీర్థములవలె సర్వులకును బూజ్యము లైనవి. ఆ స్వామిపరమదయతో నా కుత్కృష్టమైన పరమార్థము నుపదేశించినాఁడు. ఆతని పాదములకు నమస్కరించి ప్రదక్షిణ మొనర్చినాను. ఆ స్వామివిరహము నాకెంతో దుఃఖకారణ మైనది. ఆ తరువాత నే నిటకు వచ్చితిని.

**21. శ్లో** : తద్దర్శనాహ్లాదవియోగార్తియుతః = ఆతనిదర్శనముచేతఁ గలిగిన సంతోషము, విరహముచే నేర్పడిన దుఃఖము - వీనితోఁగూడిన, సఃఅహం = ఆ నేను, ప్రభోఃతస్య = సర్వనియంతయైన యతనికి, దయితం = ప్రియస్థానమైన, బదర్యాశ్రమమండలం = బదరికాశ్రమముయొక్క ప్రాంతమునుగూర్చి, గమిష్యే = పోవుచున్నాను.

**తాత్పర్యము** : నా కాతనిదర్శనముతో మహానంద మేర్పడెను. ఎడఁబాటుతోఁ దీవ్రమైన దుఃఖము గల్గినది. ఈ ద్వంద్వభావములతో నేను ఆ సర్వేశ్వరునకుఁ బరమప్రియమైన బదర్యాశ్రమప్రాంతమునుగూర్చి పోవుచున్నాను.

**22. శ్లో** : భగవాన్ = సర్వైశ్వర్యసంపూర్ణుఁడును, ఋషిః = ఇంద్రియముల జయించినవాఁడును, నైన, దేవః నారాయణః నరశ్చ = నరుఁడును నారాయణుఁ డును, లోకభావనౌ = లోకానుగ్రహతాత్పర్యముగలవారై, మృదుతీవ్రం తపః, మృదువును తీవ్రమును నైన తపస్సును, యత్ర = ఏ స్థానమందు, తేపాతే = తపించుచున్నారో, ఆ బదర్యాశ్రమమందు స్వామి నరనారాయణులై యవతరించినాఁ డు, లోకానుగ్రహమునకై వారు హింసాదిదోషములులేని అన్యుల కాచరింప నశక్యమైన కఠినమును దీర్ఘమును నైన తపస్సునబట్టి యుందురు.

శ్రీశుక ఉవాచ = శుకబ్రహ్మ యన్నాఁడు.

**23. శ్లో** : సుహృదాం = సుహృత్తులైన కౌరవులయొక్క, దుస్సహం = ఓర్వరాని, వధం = మరణప్రకారమును, ఉద్ధవాత్ = ఉద్ధవునినుండి ఇతి = ఈ ప్రకారము, ఉపాకర్ణ్య = విని, బుధఃక్షత్తా = జ్ఞానవంతుఁడైన విదురుఁడు, ఉత్పతితం శోకం = ఏర్పడినదుఃఖమును, జ్ఞానేన = జ్ఞానముచేత, అశమయత్ = శమింపఁ జేసికొనెను.

**తాత్పర్యము** : ఈ ప్రకారముగా విదురుఁ డుద్ధవుని నుండి కౌరవ వంశక్షయమును గూర్చి విన్నాఁడు. ఆ వృత్తాంత మత్యంతదుస్సహమై యుండెను, కాని విదురుఁడు జ్ఞాని. జ్ఞానబలముతో నా దుఃఖమును అణఁచికొన్నాఁడు.

**24. శ్లో** : కౌరవర్షభః = కురువంశశ్రేష్ఠుఁడైన, సః = ఆ విదురుఁడు, మహాభాగవతం = భగవద్భక్తులలో శ్రేష్ఠుఁడును, కృష్ణపరిగ్రహే = కృష్ణుని యనుగ్రహమునకుఁ బాత్రులైనవారిలో, ముఖ్యం = ముఖ్యుఁడును, వ్రజంతం = బదర్యాశ్రమమును గుఱించిపోవుచున్నవాఁడును నైన, తం = ఆ యుద్ధవునిఁగూర్చి, విస్రంభాత్ = మనస్సు నందలివిశ్వాసము వలన, ఇదం = ఇట్లుగా, అభ్యధత్త = వచించెను.

**తాత్పర్యము** : కృష్ణానుగ్రహమును బొందినవారిలో నుద్ధవుఁడు ముఖ్యుఁడు. పరమభక్తులలో నగ్రేసరుఁడు. ఈ రీతిగ నాతఁడు విదురునితో భాషించి బదరికిఁ బోవుట కుద్యుక్తుఁ డైనాఁడు. ఆతనిపై విదురున కమితవిశ్వాసము. ఆ విశ్వాసముతో విదురుఁ డిట్లనెను.

**25. శ్లో** : యోగేశ్వరః = సమస్తయోగములకును ఫలదాతయైన, ఈశ్వరః = ఈశ్వరుఁడు. స్వాత్మరహఃప్రకాశం = ఆత్మరహస్యమును బ్రకాశింపఁజేయునదైన, యత్పరంజ్ఞానం = ఏ పరమజ్ఞానమును, తే = నీకు, ఆహ = ఉపదేశించెనో, భవాన్ = నీవు, తత్ = దానిని, నః వక్తుం = మాకుఁ జెప్పుటకు, అర్హతి = తగినవాఁడవు. యత్ = ఏ కారణమువలన, విష్ణోఃభృత్యాః = కృష్ణపరమాత్మకు దాసులైనవారు, స్వభృత్యార్థకృతః = తమభృత్యులకార్యమును సాధించుచున్నవారై, చరంతి హి = చరించుచున్నారు గదా!

**తాత్పర్యము** : విదురుఁడన్నాఁడు, "ఓయుద్ధవా! సమస్తయోగములకును ఫలదాతయైన కృష్ణపరమాత్మ నిగూఢమైన యాత్మరహస్యమును బ్రకాశింపఁజేయుచున్న పరమజ్ఞానమును నీ కుపదేశించె నని చెప్పితివి. ఆ జ్ఞానమును దయచేసి నా కుపదేశింపుము. విష్ణుభక్తులైనవారు తమదాసుల కాంక్షితమును సాధించు ప్రయోజనమునకే ప్రపంచమందుఁ దిరుగుచుందురుగదా!

**26. శ్లో** : మర్త్యలోకం = మనుష్యలోకమును, జిహాసతా = వదలఁగోరుచున్నట్టి, సాక్షాద్భగవతా = పూర్ణావతారుఁడైన శ్రీకృష్ణపరమాత్మచేత, మే అంతి = నాసమీపమందు, కౌషారవః ఋషిః = మైత్రేయమహర్షి, తే = నీకు, తత్త్వసంరాధ్యః = తత్త్వజ్ఞానమును ఉపదేశించుట కర్హుఁడని ఆదిష్టః = ఆదేశింపఁబడెను.

**తాత్పర్యము** : ఉద్ధవుఁడన్నాఁడు "ఓయివిదురా!, మనుష్యలోకమును వదలిపోవుచున్న పరమాత్ముఁడైన కృష్ణుఁ డాత్మజ్ఞానమును నా కుపదేశించినపుడు నాతోపాటు మైత్రేయమహర్షిగూడ నుండెను. నీ వే జ్ఞానమును విదురున కుపదేశింపవలెనని స్వామి మైత్రేయు న కాజ్ఞవెట్టినాఁడు. అందుచే నీకు మైత్రేయమహర్షియే జ్ఞాన ముపదేశింపఁగలఁడు.

**27. శ్లో** : శ్రీశుకఉవాచ : శుకుఁడన్నాఁడు.

ఇతి = ఈ ప్రకారము, విదురేణ సహ = విదురునితోఁగూడ, విశ్వమూర్తేః = విశ్వస్వరూపుఁడైన కృష్ణపరమాత్మయొక్క, గుణకథయా సుధయా = గుణకథా కథన మనెడు నమృతముచేత, క్షణం ఇవ = ఒక్కక్షణమువలె, ప్లావితోరుతాపః = మఱచిపోఁ బడిన కృష్ణవియోగజనితతాపముగలవాఁడై, ఔపగవిః = ఉద్ధవుఁడు, యమస్వసుః = కాళిందియొక్క, పులినే = ఇసుకనేలపైన, తాం నిశాం = ఆ రాత్రిని, సముషితః = కడపినవాఁడై, తతః = ఆ తరువాత, అగాత్ = పయనించెను.

**తాత్పర్యము** : ఆ రాత్రియంతయు విదురోద్ధవులకుఁ గృష్ణకథాకథనమనెడు నమృతమం దోలలాడుటతోనే సరిపోయినది. ఆ కథాకథనములో నుద్ధవునకుఁ గృష్ణవియోగతాపము మఱపునకు వచ్చినది. రాత్రి కాళిందీపులినములలోనేఁ గడచెను. తెల్లవారి యుద్ధవుఁడు బదరినిగూర్చి పయనించినాఁడు.

**28. శ్లో** : అతిరథ యూథపయూథపేషు = అతిరథులు, సేనాధిపతులు, వారి కధికారులు మొదలైన వృష్ణిభోజేషు = వృష్ణులు, భోజులు, మొదలైనవారు, నిధనం = నాశమును, ఉపగతేషు = పొందినవా రగుచుండఁగా, సః ఉద్ధవః తు = ఆ యుద్ధవుఁడు. కథంఅవశిష్టః = ఎట్లు మిగిలెను? యత్ = ఏ కారణముతో, ముఖ్యః = ప్రధాని, త్ర్యధీశః = త్రిగుణస్వామియైన, హరిః అపి = శ్రీనారాయణుఁడుగూడ, అకృతిం = స్వదేహమును, తత్యాజ = వదలెనో.

**తాత్పర్యము** : రాజన్నాఁడు. అతిరథులు, మహారథులునైన వృష్ణి భోజవంశ్యులు నశించి రనుటేగాదు. వారిలో ముఖ్యుఁడును, త్రిగుణముల కధీశ్వరుఁడునునైన కృష్ణుఁడుగూడ దేహమును వదలె నంటివి. వీ రందఱును పోఁగా నుద్ధవుఁ డెట్లుమిగిలెను?

**శ్రీశుక ఉవాచ :**

**29. శ్లో :** శ్రీశుకుఁడన్నాఁడు. బ్రహ్మశాపాపదేశేన = బ్రాహ్మణులశాపమనెడు వ్యాజమైన, కాలేన = కాలముచేత, అమోఘవాంఛితః = వ్యర్థముగాని సంకల్పముగల కృష్ణపరమాత్మ, స్వకులం సంహృత్య = తనవంశమును నాశ మొందించి, దేహం = దేహమును, త్యక్ష్యన్ = వదలుచున్నవాఁడై, అచింతయత్ = ఇట్లు తలఁచెను.

**తాత్పర్యము :** శుకబ్రహ్మ యన్నాఁడు. బ్రాహ్మణశాప మనుట యొకనెపము. వాస్తవముగాఁ గాలస్వరూపుఁడైన భగవంతుని యమోఘసంకల్పమే యాదవవంశమును నాశ మొనర్చెను. స్వకులనాశానంతరము దేహమును వదలుచుఁ గృష్ణపరమాత్ముఁ డిట్లు దలఁచెను.

**30. శ్లో :** మయి = నేను, అస్మాల్లోకాత్ = ఈ లోకమునుండి ఉపరతేసతి అంతర్హితుఁడను కాఁగా. మదాశ్రయం జ్ఞానం = నా పరమార్థస్వరూపమైన జ్ఞానమును, ఆత్మవతాం వరః = ఆత్మ నెఱిఁగినవారిలో శ్రేష్ఠుఁడైన, ఉద్ధవ ఏవ = ఉద్ధవుఁడే, అద్ధా = అర్హతి - సత్యముగా నెఱుఁగును.

**తాత్పర్యము :** నేనీలోకమును విడిచిపెట్టిపోఁగా మదాశ్రయమైన పరమజ్ఞానము సత్యముగా నెఱిఁగినవాఁడు ఉద్ధవుఁ డొక్కఁడే.

**31. శ్లో :** ఉద్ధవః = ఉద్ధవుఁడు, అణురపి = లేశమాత్రమును. మన్న్యూనః న= నాకంటె తక్కువవాఁడు గాఁడు. యత్ = ఎందుకనఁగా, ప్రభుః = సమర్థుఁడైన యుద్ధవుఁడు, గుణైః = గుణములచేత, న అర్దితః = పీడింపఁబడినవాఁడు కాదు. అతః = అందువలన, మద్వయునం = నాస్వరూపమునకు సంబంధించిన జ్ఞానమును, లోకం = లోకమునుగూర్చి, గ్రాహయన్ = గ్రహింపఁజేయుచున్నవాఁడై, ఇహ = ఇక్కడ, తిష్ఠ తు = ఉండుఁగాక!

**తాత్పర్యము :** ఉద్ధవుఁడు నాకంటె లేశమును దక్కువవాఁడు కాదు. ఎందుకనఁగా త్రిగుణముల కాతనిపై నేమాత్ర మధికారములేదు. అందుచేత నాస్వరూపమైన జ్ఞానమును బ్రపంచమున కెఱుకపఱచుచు నాతఁ డిందే యుండుఁగాక!

**32. శ్లో :** శబ్దయోనినా = వేదమునకుఁ గారణభూతుఁడైన, త్రిలోకగురుణా = మూఁడులోకములకును గురువైన కృష్ణునిచేత, ఏవం సందిష్టః = ఈ రీతిగా నిర్దేశింపఁ బడినవాఁడై, బదర్యాశ్రమం = బదరీప్రదేశమును, అసాద్య = పొంది, సమాధినా = సమాధియోగముచేత, హరిం = హరిని, ఈజే = పూజించెను.

**తాత్పర్యము** : జ్ఞానమును లోకములందు వ్యాపింపఁజేయుటకై వేదమును బ్రవర్తింపఁ జేయుటవలన మూఁడులోకములకును పరమగురువైన భగవంతునిచే నీ ప్రకారముగా నిర్దేశింపఁ బడినవాఁడై యుద్ధవుఁడు బదర్యాశ్రమమునుజేరి సమాధియోగముతో హరిని బూజించుచుండెను.

**33, 34, 35. శ్లో** : పరమాత్మనః = పరమాత్ముఁడై, క్రీడయా = లీలగా, ఉపాత్తదేహస్య = స్వీకృతమైన దేహముతోఁ గూడియున్న, కృష్ణస్య = కృష్ణునియొక్క శ్లాఘితాని కర్మాణి = శ్లాఘింపఁబడినకర్మములను, ధీరాణాం = ధీరులకు, ధైర్యవర్ధనం = ధైర్యమును వర్ధించునదియు, విక్లబాత్మనాం = వివశమైన మనస్సుగల, అన్యేషాం, పశూనాం = ఇతరులైన అజ్ఞులకు, దుష్కరతరం = అత్యంతము దుష్కరమైన, తస్య దేహన్యాసంచ = శ్రీకృష్ణపరమాత్ముని దేహత్యాగమును, ఉద్ధవాత్ = ఉద్ధవునినుండి, శ్రుత్వా = విని, కృష్ణేన = కృష్ణునిచేత, మనస్సుతో, ఈక్షితం ఆత్మానం = కటాక్షింపఁబడిన తన్ను, ధ్యాయన్ = తలఁచికొన్నవాఁడై, ప్రేమవిహ్వలః = ప్రేమచే వివశీకృతుఁడై, భాగవతే గతే = సద్భక్తుఁడైన యుద్ధవుఁడు పోఁగా, రురోద = ఎక్కువగా దుఃఖించెను.

**తాత్పర్యము** : ఓ కురుశ్రేష్ఠుఁడా! లోకానుగ్రహరూపమైన లీలను సాధించుటకొఱకై శరీరమును స్వీకరించిన పరమాత్ముఁడైన శ్రీకృష్ణుఁడొనర్చిన కార్యములును ప్రశంసాపాత్రములైన యాతని దుష్టశిక్షణ, శిష్టరక్షణాదులను గూర్చి విదురోద్ధవులు సంభాషించికొన్నారు. ఆతనిశరీరత్యాగపద్ధతిగూడ విషయవివశీకృతులైన జడులకు సహింపరానిది. ధీరులకు ధైర్యమును గలిగించునది. ఉద్ధవునినుండి కృష్ణచరిత్రను విన్న విదురుఁడు ధన్యోస్మి యనుకొనెను.

కృష్ణుఁ డవతారమును జాలించునప్పుడు దనకు జ్ఞానోపదేశ మొనర్పవలెనని మైత్రేయునితోఁ జెప్పెనఁట! తనయందుఁ బరమాత్మ కెంత యనుగ్రహము! ఈ విషయము జ్ఞాపకమునకువచ్చిన విదురునకుఁ గృష్ణుని వియోగము రెండింత లైనది. భగవంతునకు పరమభక్తుఁడైన యుద్ధవుని వియోగముగూడ విదురున కెంతయో మనఃక్లేశకారణ మైనది. (మయ్యెను).

**36. శ్లో** : సిద్ధః = భక్తియోగము పరిపూర్ణముగానున్న, భరతర్షభః = కురుశ్రేష్ఠుఁడైన విదురుఁడు, కతిభిః అహోభిః = కొన్నిదివసములలోనే, కాళింద్యాః = కాళిందినుండి, స్వస్సరితం = గంగానదిని, ప్రాపద్యత = పొందెను, యత్ర = ఎచ్చట, మిత్రాసుతః మునిః = మిత్రాసుతుఁడైన మైత్రేయుఁ డుండెనో.

తాత్పర్యము : శ్రీకృష్ణునందుఁ బరమ ప్రేమలక్షణమైన భక్తియోగము పరిపూర్ణముగా సిద్ధించిన కురుశ్రేష్ఠుఁడైన విదురుఁడు గొన్నిదినములకు మైత్రేయుని వాసస్థానమైన హరిద్వారమనుపేరుగల గంగానదీస్థానమును జెందెను.

## శ్రీధరీయము

శ్లో : చతుర్థే బంధునిధనం శ్రుత్వా తత్జ్ఞానలబ్దయే,
ఉద్ధవస్యోపదేశేన క్షత్తా మైత్రేయ మాగమత్.

- నాల్గవయధ్యాయమందు, బంధువులైన కౌరవులవధను విదురుఁడుద్ధవుని నుండి విన్నాఁడు. తర్వాత పరతత్త్వజ్ఞానమును బడయుటకై మైత్రేయు నాశ్రయించెను.

**1. శ్లో** : తదనుజ్ఞాతాః = బ్రాహ్మణులచే ననుజ్ఞాతులై, వారుణీం = పుష్టి నొసఁగుమదిరను, దురుక్తైః = కర్ణారుంతుదములైన వాక్యములచేత -

**2,3. శ్లో** : మైరేయదోషేణ = వారుణీదోషముచేత, నిమ్రోచతిసతి = సూర్యుఁడస్తమించుచుండఁగా, మర్దనం = కలహ మేర్పడినది. సరస్వతీం ఉపస్పృశ్య = సరస్వతీనదియం దాచమన మొనర్చి.

**4. శ్లో** : "నీవు బదరికాశ్రమమునకుఁ బొమ్ము" అని ద్వారకయందే యుద్ధవుఁడు భగవంతునిచే నాజ్ఞప్తుఁ డైనాఁడు.

**5. శ్లో** : అథాపి = అట్లాజ్ఞాపింపఁబడినను, తదభిప్రేతం = శ్రీకృష్ణునిచే నుద్దేశింపఁబడిన, కులసంహారాదిరూప కార్యమును, జానన్ = తెలిసికొన్నవాఁడనై, అహం = నేను, అతీంద్రితస్సన్ = జాగ్రత్తగలవాఁడనై.

**6,7. శ్లో** : దయితం = ఇష్టుఁడైనట్టియు, సరస్వత్యాం = సరస్వతీతటమందు, కృతకేతం = కృతావాసుఁడైనట్టియు, అకేతనం = అనాశ్రయుఁడైనట్టియు, ఏకం = అది విజనప్రదేశ మగుటచేత నొంటిగా నున్నవాఁడును, శ్రీనికేతం = కాంతి కధిష్ఠానభూతుఁడైన కృష్ణునిఁజూచితి నని యన్వయము. శ్యామావదాతం = శ్యామశబ్దము మతుబర్థమునందు వాడఁబడినది. అనఁగా శ్యామవత్ అని యర్థము. నీలవర్ణము గలది, అవదాతం = స్వచ్ఛమైనది. స్వచ్ఛార్థమం దవదాతశబ్దము ప్రసిద్ధము. విరజం = విగతమైన రజోగుణముగలవాఁడు. అందుచేతనే, ప్రశాంతం = ప్రకర్షముగా శాంతగుణముతోఁ గూడినవాఁడు. చతుర్భుజములచేత, విదితం = లక్షితుఁడైనవాఁడు. పీతకౌశాంబరేణ = పీతమై, కౌశేయమైన అంబరముతోఁ గూడిన వాఁడు.

**8. శ్లో :** అధిశ్రిత్య = ఉపరిస్థముగ నొనర్చి, అపాశ్రితార్భకాశ్వత్థం - అపాశ్రిత = ఆనుకొనుటకుఁ దగినదిగా నుపయోగింపఁబడిన, అర్భక = చిన్నదై కోమలమైన, అశ్వత్థం = అశ్వత్థవృక్షముగలవాఁడు, త్యక్తపిప్పలం బహువ్రీహి సమాసము. పరిత్యక్తమైన విషయసుఖముగలవాఁడు. ఐనను, అకృశం = ఆనంద పరిపూర్ణుఁడైనవాఁడు.

**9. శ్లో :** తస్మిన్ = ఆప్రదేశమందు, ద్వైపాయనసుహృత్సఖాచ = వ్యాసుఁడు గురుపుత్రుఁ డగుటచేత నాతనితోడిసౌహృదముగలవాఁడు. మైత్రేయుఁడు పరాశరశిష్యుఁడు.

**10. శ్లో :** ప్రమోదభావానతకంధరస్య = ప్రమోదముచేతను భావముచేతను ఆనతమైన కంధరముగలవాఁడు - బహువ్రీహి. "ప్రమోదభారానత కంధరస్య" - అని పాఠాంతరము, అనురక్తస్య = భక్తుఁడైన, మునేః = మైత్రేయమునియొక్క, అశృణ్వతః = వినుచున్నట్లుగనే మైత్రేయమహాముని సమీపమందే యని తాత్పర్యము. అనురాగముచేత నేర్పడిన హాసము, అట్టి హాసము గలిగిన, సమీక్షయా = నిండుగాఁ జూచుటచేత, విశ్రామయన్ = విగతశ్రమునిఁగా నొనర్చుచున్నవాఁడై.

**11. శ్లో :** తే అంతర్మనసి = నీ మనస్సులోనున్న, ఈప్సితం = కోరికను, అహం = నేను, వేద = తెలిసితిని, అతః = అందుచేత, అన్యైః = నాకు పరాఙ్ముఖులైన వారిచేత, దురవాపంయత్ = పొందుట కశక్యమైన యేజ్ఞానము గలదో, తత్ = దానిని, తుభ్యం దదామి = నీకొఱ కిచ్చుచున్నాను. దానమునకు హేతువును జెప్పుచున్నాఁడు. ఓవసువా! పురాజన్మని = నీపూర్వజన్మమందు, మిళితానాం = చేరియున్న, విశ్వసృజాం వసూనాం చ సత్రే = ప్రజాపతులయు, వసువులయు సత్రయాగమందు, మత్ప్రాప్తి కామేన = నన్నుఁ బొందవలెనను కోర్కెగల, త్వయా = నీచేత, అహం ఇష్టః = నేను పూజింపఁబడితిని, అతః = అందుచేత, తత్ స్థానం దాస్యామి = దానికి హేతువైన జ్ఞానము నిచ్చుచున్నాను.

**12. శ్లో :** ఆ యుద్ధవుని భాగ్యము నభినందించుచున్నాఁడు. అస్మిన్ జన్మని = ఈ జన్మమందు, మదనుగ్రహః = నాయనుగ్రహము, లబ్ధః = పొందఁబడినది. సఏషః = అట్టి యీ నీ జన్మ, సాధో! = సాధునైనట్టి యో యుద్ధవుఁడా!, తే = నీయొక్క, భవానాం మధ్యే = జన్మలందు, చరమః = కడపటిది. ఎందువలన? నృలోకాన్ ఉత్సృజంతం = నృశబ్దముచేత జీవు లుపలక్షితులు. వారికి సంబంధించిన లోకములను వదలిపోవుచున్నట్టి అని యర్థము. వైకుంఠమును బొందుచున్నవారని

తాత్పర్యము. అట్టి నన్ను, విశదానువృత్త్యా = ఏకాంతమైన భక్తిచేత, రహః = ఏకాంతస్థానమందు దైవయోగముచేత, దదృశ్వాన్ = చూచినవాఁడవైతివి. ఆ చూచుటచేత నీకు మంగళ మేర్పడినదని భావము.

13. శ్లో : "దదామి" అన్నట్టిజ్ఞానము ఎట్టిదో వివరించుచున్నాఁడు. పురా = ముందటి, పాద్మేకల్పే = పాద్మకల్పమందు, ఆదిసర్గే = సర్గో పక్రమమందు, నాభ్యే = నాభియందుఁబుట్టిన, పద్మేనిషణ్ణాయ = పద్మమందున్నట్టి, అజాయ = బ్రహ్మనుగూర్చి, మన్మహిమావభాసం మన్మహిమ = నాలీలలు, అవభాస్యతే యేన = నా మహిమను ప్రకాశింపఁజేయునట్టి పరజ్ఞానము, మయా ప్రోక్తం = నాచేఁ జెప్పఁబడినది. సూరయః = మహర్షులు, భాగవతమితి యద్వదంతి = భాగవతమని దేని నందురో అది. భగవత్సంబంధమైన జ్ఞానమని యర్థము.

14. శ్లో : ఇత్యేవం ఆదృతశ్చాసౌఉక్తశ్చ = ఈ రీతిగా నాదరింపఁబడి వచింపఁ బడినవాఁడనై, పరమస్యపుంసః = పరమపురుషునియొక్క, ప్రతిక్షణం అనుగ్రహస్య, పాత్రభూతోఽహం = ప్రతినిమేషమును అనుగ్రహమునకుఁ బాత్రభూతుఁడనైన నేను, ప్రతిక్షణమును గృపావలోకమనెడు యనుగ్రహమునకుఁ బాత్రభూతుఁడనైన యని యర్థాంతరము స్నేహోత్థరోమాస్ఖలితాక్షరః = స్నేహముచేత రోమాంచితమైన దేహముగలవాఁడను. తొట్రుపడుచున్న మాటలుగలవాఁడను నైన నేను, -శుచః అశ్రూణిముంచన్ = ఆనందబాష్పములు గార్చుచున్నవాఁడను, ప్రాంజలిశ్చ = మొగిడ్చిన చేతులుగలవాఁడనునై, ఆబభాషే = పలికితివి.

15. శ్లో : నేను నా యజ్ఞానమును బోఁగొట్టుమని కోరుటలేదు. నీసేవయే నా సర్వమును కనుక ధర్మాదులను గోరుట లేదనుచున్నాఁడు. ధర్మాదిషు = ధర్మములందును, తజ్జనితమోక్షమునందును నా కాసక్తి లేదు. తే పాద సరోజభాజాం = నీపాదములను సేవించువారికి, కోన్వర్థస్సుదుర్లభః = ఏప్రయోజనము దుర్లభము? తథాఽపి = ఆ కారణముచేత, భూమన్ = భూమ స్వరూపుఁడైనవాఁడా! భవత్పాదనిషేవణోత్సుకః = నీపాదపద్మసేవయందే యాసక్తిగలనేను ధర్మాదుల నడుగుట లేదు.

16. శ్లో : నీయుం దఘటమానములైన యాచరణములను జూచి నా కప్పు డప్పుడు మోహము జనించుచుండును. నాకు తత్త్వజ్ఞాన మొసఁగు మని ప్రార్థించుచు

అఘటమానములైన యాచరణము లేవియో తెలుపుచున్నాఁడు. అనీహస్య = నిష్క్రియుఁడైన, తే కర్మాణి = నీకుఁ గర్మలసంబంధము, అభవస్య = జన్మరహితుఁడవైన నీకు, భవః = జన్మము, కాలాత్మనస్తవ = కాలస్వరూపుఁడవైన నీకు, అరిభయాత్ = శత్రుభయముచేత, దుర్గాశ్రయః = బలవత్తరమైన దుర్గము నాశ్రయించుట, పలాయనం చ = పలాయనమును, స్వాత్మన్ రతేః = సప్తమ్యర్థమందు ప్రథమ. స్వాత్మని రతిః యస్య సః అని సమాసము. స్వరూపానందమందే రమించువాఁడు. అట్టివాఁడైన నీకు, ప్రమదాయుతేన = పెక్కుమందిస్త్రీలచేత, ఆశ్రయః = గృహస్థాశ్రమావలంబనము - ఇత్యాదిగానున్న, అస్మిన్విషయే = ఈ విషయమందు, విదుషామపిధీః ఖిద్యతి = వారు జ్ఞానులైనను వారిమనస్సు సంశయము నందుచున్నది. ఇచ్చట 'అపి' - శబ్దము అధ్యాహారము.

**17. శ్లో** : అకుంఠితాఖండసదాత్మబోధః - అకుంఠిత = కల్పాదులచే కుంఠితము గానట్టియు, సంతతము ననువర్తించుచున్నదని తాత్పర్యము, సంశయాదిరహితమైన ఆత్మబోధరూపమైన విద్యాశక్తిగలవాఁడు. అట్టి, త్వం = నీవు, ముగ్ధవత్ = అజ్ఞునివలె, అప్రమత్తః = జాగ్రత్తగలవాఁడవైనను, మంత్రేషు ప్రస్తుతేషుసత్సు = ఆలోచనలు గావలసినప్పుడు, రహః = ఏకాంతమందు, యాం ఉపహూయ = నన్నుఁ బిలిచి, వై = ఆశ్చర్యార్థకము. యత్ పృచ్ఛేః = సలహా లడుగుదువో, ఆ యడుగుట నామనస్సును మోహింపఁజేయుచున్నది.

**18. శ్లో** : స్వాత్మరహః ప్రకాశం = సర్వుల కాత్మస్వరూపమైన, రహః = రహస్యరూపమైన తత్త్వమును ప్రకాశపఱచునది, సమగ్రరూపమైన, పరంజ్ఞానం = ఉత్కృష్టజ్ఞానమును, కస్మై = బ్రహ్మదేవునికొఱకు, సర్వనామత్వ మార్షము, నః, గ్రహణాయాఽపిక్షమం = యోగ్యం నాగ్రహణమునకు యోగ్యమైనచో, వద = చెప్పుము. యత్ = దేనిచేత, వృజినం = సంసారదుఃఖమును, అంజసా తరేమ = అనాయాసముగాఁ దరింతుము.

**19. శ్లో** : అరవిందాక్షః గురుః సః భగవాన్, ఇతి = ఈ ప్రకారముగా, ఆవేదిత = చెప్పఁబడిన, హార్దః = హృదయస్థితమైన యభిప్రాయముగలవాఁడు.

**20. శ్లో** : ఆరాధితపాదః = భగవంతుఁడు - వాఁడే తారకుఁడగుటచేత, తీర్థః = గురువైనవాఁడు. అతనినుండి, అధీత = పొందఁబడిన, తత్త్వాత్మవిబోధ = పరమార్థమైన ఆత్మజ్ఞానముయొక్క, మార్గః = మార్గముగల నేను, పరివృత్య = ప్రదక్షిణ మొనర్చి.

**21. శ్లో** : తద్దర్శనాహ్లాదవియోగార్తియుతః = తద్దర్శనముచేత సంతోషమును, వియోగముచేత నార్తియుఁగల నేను అతని కిష్టమైన బదర్యాశ్రమమునుగూర్చి పోవుచున్నానని తాత్పర్యము.

**22. శ్లో** : లోకభావనొ = లోకానుగ్రహకారకులు, మృదు = పరోపద్రవశూన్యమును, తీవ్రం = దుశ్చరమైన తపస్సును దీర్ఘకాలికము అనఁగా నాకల్పాంతము తపస్సును జరించుచున్నారని తాత్పర్యము.

**23. శ్లో** : జ్ఞానేన = వివేకముచేత.

**24. శ్లో** : కృష్ణపరిగృహీతులైన జనులలో, ముఖ్యం = ముఖ్యభూతుఁడైన మహాభాగవతుఁడైన యుద్ధవుని గూర్చి, విస్రంభ = విశ్వాసముతో, అభ్యధత్త.

**25. శ్లో** : స్వాత్మరహః ప్రకాశం - స్వాత్మనః = నీయొక్క రహః = రహస్యరూపమైన తత్త్వముయొక్క ప్రకాశం = ప్రకాశకమైనట్టి, జ్ఞానం = ముందుచెప్పఁబడిన జ్ఞానమును. స్వభృత్యార్థకృతః = స్వభృత్యుల ప్రయోజనమును సాధించువారుగా, చరంతి = సంచరింతురు. కృతార్థులైనవారికిఁ జేయఁదగిన యన్యకృత్య మేదియు లేదుగదా! యని భావము.

**26. శ్లో** : కౌషారవుఁ డనఁగా మైత్రేయుఁడు. అతఁడు, తే = నీచేత, తత్త్వసంరాధ్యః = తత్త్వోపదేశమునకు ఆరాధిపఁదగినవాఁడు. అతఁడు నా కుపదేశించునో లేదో యని సందేహము నీకు వలదు. సతు = ఆ మైత్రేయుఁడు, మర్త్యలోకం జిహాసతా భగవతా = మర్త్యలోకమును వదలిపోవుచున్న భగవంతునిచేత, అంతిమే = అతనిసమక్షమందు నీ కుపదేశింపవలెనని, సాక్షాత్ ఆదిష్టః = ప్రత్యక్షముగనే యాజ్ఞాపింపఁబడినవాఁడు. స్మరణమాత్రముచేతనే భగవంతుఁడు నీకు తత్త్వ ముపదేశించినట్లే. అనఁగా తత్త్వము నీ కుపదిష్టప్రాయ మైనది. కేవలము అసంభావనానివృత్తికొఱకు మాత్రమే ఒకానొకజ్ఞాని ఆరాధ్యుఁడు గావలెను. నీకారాధ్యుఁడు మైత్రేయుఁడు. నాయెదుటనే విదురునకు నీవు జ్ఞాన ముపదేశింపవలెనని భగవంతుఁడు మైత్రేయునకుఁ జెప్పినదానివలన నాతఁడే నీకు గురువని భావము.

27. శ్లో : హరిగుణకధాకారమైన యమృతముచేత, ఆప్లుతోరుతాపః = పోఁగొట్టఁబడినతాపముగలవాఁడై, యమస్వసుః = యమునిచెల్లెలైన యమునానదీతీరమందు, సముషితఔపగవిః = ఉద్ధవుఁడు.

28. శ్లో : అతిరధయూధవులు, తద్యూధపులు, తద్యూధవులు, ఈ రీతి ముప్విధములుగానున్న వీరు, వారు మరణింపఁగా త్రిలోకాధిపతియును పరమాత్మయునైన కృష్ణుఁడును దేహమును వలదెను. మరి యుద్ధవుఁడెందుకున్నట్లు?

29. శ్లో : యదువులమరణములో బ్రాహ్మణశాప మొక నెపము మాత్రమే. భగవదిచ్ఛయే ప్రధానకారణము, ఆ పరమాత్మదేహమును వదలఁచోవుచు నిట్లనుకొన్నాఁడు.

30. శ్లో : మయిఉపరతేసతి = నేను తిరోహితుఁడను కాఁగా, మదాశ్రయం జ్ఞానం = నాకు సంబంధించిన జ్ఞానమును, అయమేవ అర్హతి = జ్ఞానయోగ్యుఁడుగా నగుచున్నాఁడు. అద్ధా! = ఈ విషయము ప్రత్యక్షసిద్ధము, ఆత్మవతాం = ధీమంతులలో, వరః = శ్రేష్ఠుఁడు.

31. శ్లో : అయి = ఈషత్తుగూడ, మత్ = నాకంటె, న్యూనగుణఃన భవతి = తక్కువవాఁడుకాదు, గుణైః = విషయములచేత, నార్దితః = క్షుభితుఁడు కానిదానివలన, మద్వయునం = నావిషయికమైన జ్ఞానమును.

32. శ్లో : శబ్దయోనినా = వేదప్రవర్తనకారణమైన పరమాత్మచేత, ఈజే = పూజించెను.

33. శ్లో : పశూనాం = పశుతుల్యులైనవారు, విక్లబాత్మనాం = అధీరచిత్తులు, ధీరాణాం = జ్ఞానులు.

34. శ్లో : విశేషము లేదు.

35. శ్లో : కృష్ణేన = కృష్ణపరమాత్మచేత, మనసా ఈక్షితం = మనస్సుచేత చింతింపఁబడిన

36. శ్లో : శ్రీకృష్ణానుగ్రహముచేత కృతకృత్యుఁడైన విదురుఁడు కాళిందినుండి గంగాద్వారమునకు వెళ్లెను. "సిద్ధః ఆహోభిః" అనుచోట సంధ్యభావము ఆర్షము.

## విజయధ్వజము

1. శ్లో : అధ. తే. తదనుజ్ఞాతాః, భుక్త్వా.వారుణీం చ, పీత్వా. తయావిభ్రం శితజ్ఞానాః . దురుక్తైః, మర్మ. పస్పృశుః.

2. శ్లో : మైరేయదోషేణ = మైరేయ మనిపిలువఁబడెడు మద్యపానముచేత నేర్పడినమదముతో, విషమీకృత చేతసాం, తేషాం రవౌ, నిమ్లోచతి సతి = సూర్యాస్తమాన సమయమందు = వేణూనాం ఇవ, మర్దనం = అన్యోన్యఘర్షణ రూపమైన వినాశకారి కలహము, ఆసీత్ = కాఁబోవును.

3. శ్లో : అప్పుడు శ్రీహరి యేమిచేసెనని చెప్పుచున్నాఁడు. సః భగవాన్ = యాదవుల వినాశము నాలోచించిన పరమాత్ముఁడు ఆత్మమాయాయాః = తనసామర్థ్యము యొక్క, తాగతిం = ఆ విధమైనస్థితిని, (ఆయాపదార్థమందుదానిదానియోగ్యతకుఁ దగినట్లుగా ప్రకటమగు తనయొక్కరీతిని, (పూర్వమందే) అవలోక్య = స్వర్గారోహణమున కిరువదియారువర్షములకు ముందే చూచి, సరస్వతీం = సరస్వతీనదినీటియందు, ఉపస్పృశ్య = ఆచమన మొనర్చి, వృక్షమూలం. ఉపావిశత్". జ్ఞాత్వాకలిపర్యైర్వస్త్రై: పూర్వమేవ జనార్దనః మౌసలం జ్ఞానసంతత్యా, ఉద్ధవం బదరీం నయత్ అనుప్రమాణముతో నుద్ధవునకు జ్ఞానోపదేశ మొనర్చి మొదలే యతనిని బదరికాశ్రమమునకుఁ బంపెను అని తెలియవలెను.

4. శ్లో : స్వకులంసంజిహీర్షుణా, ప్రపన్నార్తిహారేణ, భగవతా, త్వం, బదరీం ప్రయాహి. ఇతి, అహం = నేను (అనఁగా ఉద్ధవుఁ డన్నమాట) ఉక్తః చ. హ ఇదినామొదటిబదరీగమనము. "తత్‌జ్ఞానం, తత్రవిస్తీర్య, పునర్ద్వారతీమగాత్" - అనెడుప్రమాణముతో స్వర్గారోహణమునకు ముందే శ్రీహరిచే నాజ్ఞప్తుఁడై విదురుఁ డు బదరికివెళ్ళియుండెనని తెలియుచున్నది.

5. శ్లో : అరిందమ! = ఓవిదురుఁడా! అథాపి మొదలు బదరికిఁబోవలె నని శ్రీహరిచే నాజ్ఞప్తుఁడ నైనను, తదభిప్రేతం = మరల జ్ఞానోపదేశ మొనర్పవలెననెడు శ్రీహరియభిప్రాయమును, జానన్ = తెలిసినట్టి అహంభర్తుః పాదవిశ్లేషణాక్షమస్సన్ = పాదవియోగమును సహింపలేనివాఁడనై, బదరినుండి ద్వారకకు వచ్చి కృష్ణపరమాత్మ స్వర్గారోహణ సమయమందు, భర్తుః = భగవంతునియొక్క, పృష్ఠతః

14

, అన్వగమం, "తదభిప్రేతం" అనెడుమాటవలన అనుగమనము చెప్పఁబడినదిగదా! మరల ననుగమన మెందుకను నాశంక పరిహృత మగుచున్నది. పాదవిరహమును సహింపలేకయని చెప్పుటతో రెండవ ప్రయోజనమునుగూడ సూచించిన ట్లైనది.

6. శ్లో : అనుసరించి వెళ్లెదను అనుటచేత యాదవుల కలహకాలమందు శ్రీహరియచట లేఁడని తెలియవచ్చుచున్నది. కృష్ణుఁ డచ్చటలేనప్పు డాతనినుండి జ్ఞానోపదేశము సాధ్యపడదు. కనుక ముందుచెప్పినవిషయము తప్పగునుగదా? దానికి సమాధానము. అహం దయితం, పతిం = ఆత్మజ్ఞానము నుపదేశించి పాలకుఁ డైనట్టియు, అకేతనం = తనకాధారమైన మఱియొక వస్తువులేనట్టి అనఁగా వస్త్వంతరాపేక్షలేని యని తాత్పర్యము. శ్రీనికేతనం, విచిన్వన్ = వెదకుచు. సరస్వత్యాం కృతకేతనం = వసించుచున్న, ఆసీనం, ఏకం, అద్రాక్షం.

7,8. శ్లో : శ్యామావదాతం = (1) శ్యామవర్ణముగలవాఁడు, పరిశుద్ధుఁడు (2) రాత్రియందుఁగూడ సూర్యునివలె నరుణవర్ణముతోఁ బ్రకాశించువాఁడు. ప్రశాంతారుణలోచనం, చతుర్భిః, దోర్భిః, పీతకౌశాంబరేణవిదితం. అకృశం = పూర్ణుఁ డైనవాఁడు. త్యక్తపిప్పలం = కర్మఫలములేనివాఁడు. దక్షిణాంఘ్రిసరోరుహం వామ ఊరౌ అధిశ్రిత్య వామ ఊరౌ అధిశ్రిత్య. ఉపాశ్రితార్భకావస్థం = అవతారకాలమందు గ్రహించిన యాకారమునే మరల గ్రహించిన కృష్ణపరమాత్మనని యన్వయము. "అపాశ్రితార్భకాశ్వత్థం" అని శ్రీధరపాఠము. అధికారిజీవులకుఁ దగినట్లుగా శ్రీహరి నల్లగను ఎఱ్ఱగను గనుపించునని "శ్యామావదాతం" అనుదాని కర్థము. కౌశేయ మనుటకు బదులు "కౌశ" - అనుట "అణ్" ప్రత్యయాంతము.

9. శ్లో : తస్మిన్, ద్వైపాయనసుహృత్, సఖా, సిద్ధః, మహాభాగవతః, లోకాన్ అనుచరన్, యదృచ్ఛయా. ఆససాద.

10. శ్లో : ముకుందః = మోక్షదాతయైన కృష్ణపరమాత్మ. అనురక్తస్య = ప్రమోదభారానతకంధరస్య, తస్యమునేః = ఆ మైత్రేయునియొక్క. ఆశృణ్వతః సతః = వినుచుండఁగనే. దీనితో ననుగ్రహవిశేషము సూచితము. అనురాగహాస సమీక్షయా విశ్రమయన్ = సంసారదుఃఖమును బోఁగొట్టి, యానందము గల్గించుచు, మాం, ఉవాచ.

**11. శ్లో :** శ్రీహరిచెప్పినమాటలు చెప్పుచున్నాఁడు. హేవసో! తే, మనసి అంతః, ఈప్సితం, తత్, అహం, వేద, అన్యైః = నాభక్తులుగాని యితరులచేత, దురవాపం, తత్, తే. దదామి, నీముఖమునుండి బయలుదేరు పలుకులు వినవలెనన్నచో నతిశయమైన పుణ్యముండవలెనుగదా! పుణ్యకర్మ లొనర్పనివారి కిదెట్లు సాధ్య మగును? దానికి సమాధానము. పురా = పూర్వజన్మమందు, విశ్వసృజాం, తమతమయోగ్యతకుఁ దగినట్లుగా జగత్తును సృష్టించు సామర్థ్యముగల, మునీనాం = నిరంతరమును బరమాత్మను ధ్యానించుటచేత మును లనిపించికొన్న దేవతలయొక్క, సత్రే, మత్సిద్ధికామేన = నానుండి జ్ఞానముమొదలైన సిద్ధిని బొందనిచ్ఛించిన, త్వయా, ఇష్టః = పూజితుఁడనైనాను.

**12. శ్లో :** ఫలాంతరమును జెప్పుచున్నాఁడు. హే సాధో! తే = నీచేత, ఆసాదితః = పొందఁబడిన, యః, భవః, సః. ఏషః, = ఆయీజన్మ, భవానాం, చరమః, (భవాన్) రహః, నృలోకం, ఉత్సృజంతం, మాం, విశదానువృత్త్యా = శుద్ధమైనసేవచేత, దదృశివాన్ = చూచితి వనుట, యత్ = ఏదికలదో, అయం, మదనుగ్రహః = ప్రసన్నుఁడైన నేను నీకీ యవకాశమును గల్పించితినని తాత్పర్యము. దిష్ట్యా = దీనితో నీకు శుభ మేర్పడును.

**13. శ్లో :** తానుజెప్పిన విషయమందు గొప్పశ్రద్ధను గల్పించుటకై జ్ఞానమును బొగడుచున్నాఁడు. యత్, జ్ఞానం, పురా. ఆదిసర్గే మమనాభ్యే = నా నాభియందుఁ బుట్టిన, పద్మే, నిషణ్ణాయ, మయా ప్రోక్తం యత్ జ్ఞానం, పరం = శ్రేష్ఠమైన, మన్మహిమావభాసం = నామహిమను ప్రకాశపఱచునదో, యచ్చ, సూరయః, = జ్ఞానులైన బ్రహ్మాదులు, భాగవతం = భగవంతుఁ డొక్కఁడే ముఖ్యుఁడని చెప్పుటచేత భాగవతమని పిలుతురో, తత్ = తుభ్యం, ఉపదేక్ష్యామి.

**14. శ్లో :** ఇతి, ఆదరోక్తః, పుంసః, ప్రతిక్షణానుగ్రహభాజనః, అహం, స్నేహోత్థరోమా, శుచః = దుఃఖమును, ముంచన్ = వదలి, ప్రాంజలిః = భక్తితో చేతులు మొగిడ్చి, స్ఖలితాక్షరః, ఆబభాషే ఇతి, = అనిచెప్పుటచేత ఈ జ్ఞానము వేరువిశేషణములతోను గూడినదని సూచితమైనది. "ఆబభాషే" అనెడు పరోక్షభూతకాలికక్రియను వాడుటతో సమస్తేంద్రియములును భగవంతునే విషయముగాఁ బొందుటచే బాహ్యప్రవృత్తియే లేకుండెనని తెల్పిన ట్లైనది. "సుప్తోఽహం విలలాప" - ఇత్యాది వాక్యములలో నీ విధమైన ప్రయోగము ప్రసిద్ధము.

15. శ్లో : భగవంతుని యపరోక్షజ్ఞానమునకు సాధనమైన భగవత్పాదారవింద భక్తినిదప్ప వేరుదానిని నే నపేక్షించుటలే దనుచున్నాఁడు. ఈశః, తే పాదసరోజ భాజాం = ఇహ, చతుర్ష్వ అర్థేష్వపి కః,ను, సుదుర్లభః? తథాऽపి భూమన్, భవత్పదాంభోజ నిషేవణోత్సుకః, అహం నప్రవృణోమి = ఇతరమును దేనిని గోరుటలేదు. ఉత్సుకః అనుటచేతఁ గొందఱు "ఇంతవఱకును నేను నిన్నుఁ దప్ప మఱి దేని నాకాంక్షింప లేదు. ముందేమగునో తెలియలేము" అని వ్యాఖ్యానింతురు. అదితప్పు. అధ్యాహారము ప్రామాణికముగాదు. ఔత్సుక్యము ఒకకాలమందుండి మఱియొకప్పుడు లేనిదని ఇచ్చట భావనగాదు. అందుచేత నట్లు వ్యాఖ్యానింపరాదు.

16. శ్లో : జ్ఞానమం దంతరంగ మనిపించికొన్న శ్రీహరి యొక్క, గుణగణవిచార రూపమైన యుపాసనను వదలి భక్తి నపేక్షించుటలో నిమిత్త మేమి? అని యాశంకించికొని కృష్ణపరమాత్మగూడ సామాన్యజనులవలెనే కర్మ లొనర్చువానివలెఁ గన్పించుచుండుటచేత నాతని గుణగణముల యొక్క రహస్యమును దెలియుట సాధ్యమని చెప్పుచున్నాఁడు. అనీహస్య = ఏ యాశయములేని, నీయొక్క, కర్మాణి, అభవస్య = నిత్యముక్తుఁడవైన నీయొక్క, జన్మ, అదుర్గస్య = సరియైన దుర్గములేని, తే = నీయొక్క, దుర్గాశ్రయః = ద్వారకమొదలైన జలదుర్గము లాశ్రయించుటయును, కాలాత్మనః అరిభయాత్ పలాయనం = గోమంతక్షేత్రమునకుఁ బరువెత్తుటయును. స్వాత్మని రతేః యత్, ప్రమదాయుతాశ్రయః (పైఁజెప్పిన గుణము లన్నియు లోకవిరుద్ధములు), అతః = అందుచేత, విదాం = మీకు జన్మాదులు లేవని నిశ్చయముగాఁ దెలిసియున్న భక్తులయొక్క, ధీః అపి ఖిద్యతే. అపిశబ్దముచేతఁ గర్మాచరణాదులు లోకవిడంబనమాత్రమేనని తెలిపిన ట్లైనది.

17. శ్లో : ఇదిగూడ జ్ఞానదుర్బలులైన మనుష్యుల బుద్ధిని మోహము నొందించు ననుచున్నాఁడు. ప్రభో! దేవ! అకుంఠితాఖండసదాత్మబోధః = మిశ్రముగాని పూర్ణమై నిర్దోషమైన స్వరూపజ్ఞానముగల, త్వం = నీవు, మంత్రేషు, మాం, నై = అక్రూరుఁ డు మొదలైనవారిని, ఉపహూయ, ముగ్ధఇవ, యత్పృచ్ఛేః తత్. నః, మనః. మోహయతీవ.

18. శ్లో : జ్ఞానమనెడు అవ్యాకృతాకాశముగల నీవు, వారివారి భిన్నభిన్నములైన యోగ్యతలను దెలిసి తత్తదుచితమైనజ్ఞానమునే యుపదేశింతువు, ఐనను నాచాపల్యముతో నే నడుగుచున్నా ననుచున్నాఁడు. భగవాన్, స్వాత్మరహఃప్రకాశం,

పరం జ్ఞానం, కస్మై, ప్రోవాచ = బ్రహ్మాదే వుని యోగ్యతకుఁ దగినట్లుగా నుపదేశించితివి. సమగ్రం = అదియంతయు, నః = అల్పులైన మాయొక్క, గ్రహణాయ = తెలివికి, అపిక్షమం = సాధ్యమగునేని - సాధ్యముగాదని యర్థము, యోగ్యతాభేదముతో నెట్టిజ్ఞానమును జెప్పమందువు? దానికి సమాధానము. భర్తః = ఓస్వామీ! వేద = అధికారులైన మాకు నేది యోగ్యమని తెలియుదువో, యత్ = ఏజ్ఞానముచేత మేము, అంజసా = ముఖ్యముగా, వృజినం = సంసారదుఃఖమును, ఉపదిశ = బ్రహ్మమొదలైన యుత్తమాధికారిచేతనుల కుపదేశించిన జ్ఞానముయొక్క, ఏకదేశమే అల్పాధికారుల సంసారదుఃఖ నిర్మూలనమునకును సమర్థమని తెలిపినట్టినది. దానినే యుపదేశింపుమని యడిగినట్లు భావము.

**19. శ్లో** : దీనినే పరమాత్మ యుపదేశించెను. వేఱుదానిని గాదని చెప్పుచున్నాఁడు. ఇతి ఆవేదితహార్దాయ, మహ్యాం, పరః, భగవాన్, సః, అరవిందాక్షః ఆత్మనః, పరమాం స్థితిం = బ్రహ్మాదిజీవరాసులకన్నఁ దనయుత్కృష్టతయును, ఇతరజీవరాసులు దనకన్న నికృష్టులనెడు పరస్పరతారతమ్యమును, ఆదిదేశ.

**20. శ్లో** : ఆరాధితపాదతీర్థాత్ ఏవం అధీతతత్త్వాత్మ విబోధమార్గః = ఆరోపితముగాని సదృశము అధికము లేని జ్ఞానానందస్వరూపుఁడైన శ్రీహరిజ్ఞానముయొక్క, విశిష్టమార్గమును దెలిసికొన్న, సః అహం, పాదౌ ప్రణమ్య, దేవం పరివృత్య విరహాతురాత్మా సన్. ఇహ. ఆగతః.

**21. శ్లో** : ఇక్కడినుండి పయన మెక్కడికి? సమాధానము. ప్రభో! త్వద్దర్శనా హ్లాద వియోగార్తియుతః = నిన్నుఁ గన్గొనుటచేతఁ గల్గినసంతోషము, శ్రీహరి విరహముతో నేర్పడిన దుఃఖము, ఈ రెంటితోఁ గూడికొన్న, సః. అహం, తస్య, దయితం, బదర్యాశ్రమమండలం = బదరికాశ్రమసమీపమందున్న కలాపగ్రామమునకు, గమిష్యామి.

**22. శ్లో** : బదరీవనము శ్రీహరికిఁ బ్రియమనుటలోఁ గారణమును జెప్పుచున్నాఁడు. యత్ర = ఏ బదరికాశ్రమమందు, భగవాన్, ఋషిః = త్రికాలజ్ఞానియైన, దేవః = క్రీడమొదలైనగుణములతోఁజేరిన, నారాయణః = యమధర్ముని కుమారుఁడుగా నవతరించిన నారాయణాంశజుఁడైన, నారాయణుఁడనుపేరుగల శ్రీహరియు, నరశ్చ = శేషాంశజుఁడైన నరుఁడును, లోకభావనౌ = జనులకు మార్గదర్శకులై, మృదు =

లోకమునకు సుఖము గల్గించునదియు, తీవ్రం = ఇతరులకుఁ జేయుట కసాధ్యమైనదియు, దీర్ఘః = బహుకాల మొనర్పఁదగిన, తపః = ఆలోచనను, నారాయణుఁడును. శేషుఁడు తపస్సును, తేపాతే = చేయుచున్నారో అట్లగుటచేత శ్రీకృష్ణునకు బదరీవనము ప్రియమైన యాశ్రయ మని చెప్పిన ట్లైనది.

**23. శ్లో** : బుధః, క్షత్తా = విదురుఁడు. ఇతి, ఉద్ధవాత్ - సుహృదాం, దుస్సహం వధం = కాఁబోవు వినాశమును, ఉపాకర్ణ్య, ఉత్పతితం, శోకం, జ్ఞానేన, శ్రీహరియే స్వతంత్రుఁడు, జీవు లస్వతంత్రు లనెడు విశేషజ్ఞానముచేత, అశమయత్ = శాంతింపఁజేసికొనెను.

**24. శ్లో** : ఈ సందర్భములో జరుగఁబోవుచున్న యాదవనాశమునుగూర్చి వినుటచేఁ గల్గిన దుఃఖమును బోఁగొట్టుకొనుటకు మాత్రమే విదురుఁడు యత్నించెనా? లేక మఱి యేమైన నొనర్చెనా? అనుటకు సమాధానము, సః, కౌరవర్షభః, వ్రజంతం మహాభాగవతం. కృష్ణపరిగ్రహేముఖ్యం, తం = ఆ యుద్ధవునిగూర్చి, విస్రంభాత్ = ఉద్ధవుఁడు తన కిష్టమైన దానిని ఉపదేశించునను నుద్దేశముతో, అభ్యధత్త = ఈ రీతిగాఁ బలికెను.

**25. శ్లో** : విదురుఁ డేమడిగెనో చెప్పుచున్నాఁడు. యోగేశ్వరః ఈశ్వరః తే స్వాత్మరహః ప్రకాశం, పరంయత్‌జ్ఞానం, ఆహ. తత్. భవాన్, నః, వక్తుం అర్హతి, దానికిఁ గారణముఁ జెప్పుచున్నాఁడు, యత్ = ఎందుకనఁగా, విష్ణోఃభృత్యాః, స్వభృత్యార్థకృతః, హి.

**26. శ్లో** : ఉద్ధవుఁడు విదురుని మాట విని ఏమియుఁ బలుకక వెళ్లెనా అనుటకు సమాధానము. తత్త్వసంరాద్ధః = తత్త్వజ్ఞానమందు సిద్ధిని బొందిన, ఋషిః, అంతిమే = నాసమీపమందు (స్థితః = ఉన్నట్టి), కౌషారవః = మైత్రేయుఁడు, మర్త్యలోకం జిహాసతా = మర్త్యలోకమును వదలిపెట్టుచున్న భగవంతునిచేత, సాక్షాత్ = తానే, తే = నీకు, తత్త్వజ్ఞానము నుపదేశించుటకై ఆదిష్టః, నను = ఆజ్ఞప్తుఁడయ్యెనుగదా! కౌషారవశబ్దము - మైత్రేయునకు గుణప్రయుక్తమై వచ్చినను లోకమం దాపేరు ప్రసిద్ధమగుటచే వైశంపాయనుఁడన్నట్లుగా నాపేరే వాడఁబడినది. భగవంతుని యాజ్ఞతో మైత్రేయుఁడే నీకు జ్ఞానోపదేశ మొనర్పవలసిన వాఁడగుటచేత నీవతనినే యాశ్రయింపవలెనని యుద్ధవుని యభిప్రాయము.

27. శ్లో : సూతుఁడు శౌనకాదులకుఁ జెప్పుచున్నాఁడు. ఇతి = ఈ రీతిగా, విదురేణసహ, విశ్వమూర్తేః = సర్వత్ర వ్యాపించిన శరీరముగల శ్రీహరియొక్క, గుణకథయా, సుధయా, ప్లుతోరుతాపః, ఔపగవిః = ఉపగువు అనువాని కొడుకైన యుద్ధవుఁడు, యమస్వసుఃపులినే క్షణమివ, తాంనిశాం, సముషితః.

28. శ్లో : నీవు బదరికిఁ బొమ్ము అని శ్రీకృష్ణునిచే నుద్ధవుఁ డాజ్ఞాపింపఁబడినవాఁ డైనాఁడని తెలిసికొన్న పరీక్షిద్రాజు ఆ విషయ మింకను విశేషముగా నెఱుఁగవలెనని ప్రశ్నించుచున్నాఁడు. వృష్ణిభోజేషు, నిధనం ఉపగతేషు సత్సు, అతిరథయూథప యూథపేషు, ముఖ్యః = ముఖ్యుఁడైన, సః, ఉద్ధవస్తు = ఆ యుద్ధవుఁ డొక్కఁడే, కథం అవశిష్టః, ఎందుకనఁగా, త్ర్యధీశః హరిః అపి, ఆకృతిం, తత్యాజ = అవ్యక్తుఁ డయ్యెను, అతిరథయూ థపయూథపేషుముఖ్యః, అని యుద్ధవున కన్వయించుటలో నుద్ధవుఁడు వీరుఁడు గాకుండుటచే మిగిలెనను కారణము నిరాకృతమైనది, "హరిరపి తత్యజ" అనుటచేత శ్రీకృష్ణునికొఱకే బ్రదికెను అనుటగూడ సరియైన యుత్తరముగాదని తేలిపోయినది. త్రిలోకముల కింద్రుఁ డధిపతియైనను అతనికిని శ్రీహరినియామకుఁడని త్ర్యధీశశబ్దము చెప్పుచున్నది. దీనిచేతఁ గృష్ణపరమాత్మ ముల్లోకములం దవ్యక్తుఁడైనను స్వర్గాదులందు వ్యక్తుఁ డయ్యెనని సూచితము. ఆకృతిశబ్దమునకు వృధివ్యర్థమును జెప్పుట కోశనమ్మతము, యుక్తియుక్తముగూడనైయున్నది. ఎందుకనఁగా శ్రీహరి నిత్యానంద స్వరూపుఁ డగుటతో నాతనికి దేహత్యాగమే యుదుకదు. కనుక దేహత్యాగ మనుటతో భూలోకత్యాగమనియే యర్థము. అట్లైనచో నిశ్చేతనముగా నాతనిశరీరము పడియుండెననుట కర్థమేమి? అని ప్రశ్నింప వచ్చును. కృష్ణపరమాత్మ తనదేహమునకు సమానమైన యాకారముగల జడపదార్థమును అప్పుడే అక్కడే సృష్టించి వదలిపెట్టిపోయెనని భావము. ఇట్లొనర్చుటకుఁ గారణము దుష్టజనులను మోహింపఁజేయుటయే,

"పృథివీలోకసంత్యాగో దేహత్యాగో, హరేస్స్మృతః,
నిత్యానందస్వరూపత్వాదన్యోనైవోపలక్ష్యతే.

'దర్శయన్ జనమోహాయ సదృశీం - తత్తదాకృతం,
నలువద్భగవాన్ విష్ణుః పరబ్జానాకృతి స్తదా

అనుట ప్రమాణము.
అంతేకాక యీభాగవతమందే -

"రాజన్ పరస్య తనుభృజ్జననాప్యయేహాం
మాయావిడంబనమవేహి యథానటస్య"

అనికలదు, కనుక నాకృతిశబ్దమునకు పృథివి యనియే యర్థము సేయవలెను.

**29. శ్లో** : పరీక్షిత్తు ప్రశ్నకు శుకుఁ డుత్తర మిచ్చుచున్నాఁడు. అమోఘవాంఛితః = సార్థకమైన యిచ్ఛగల కృష్ణుఁడు, బ్రహ్మశాపాపదేశేన కాలేన, స్వకులం, సంహృత్య = సంహరించి - (భవిష్యదర్థమందు భూతకాలిక క్రియ). దేహం = తన శరీరమనిపించికొన్నభూమిని, "యస్యపృథివీశరీరం" అని యుపనిషత్తు. అచింతయత్.

**30, 31. శ్లో** : అస్మాల్లోకాత్, మయిఉపరతే సంప్రతి. ఆత్మవతాంవరః ఉద్ధవ ఏవ. అద్ధా = సరిగా, మదాశ్రయం = నావిషయకమైన జ్ఞానమును, (ఉపదేష్టుం అర్హతి). యద్గుణైః = ఏ యుద్ధవునిగుణములచేత, ప్రభుః = సర్వసమర్థుఁడైన నేను, నిర్జితః = వశీకృతుఁడ నైతినో, సః ఉద్ధవః, అణ్వపి = స్వల్పమైనను, మన్న్యూనఃన = (మత్ + న్యూనః) నాకు సంబంధించిన జ్ఞానమునుపదేశించుటలో నాకంటెఁ దక్కువవాఁడు గాదు. అతః, మద్వత్ = నావలెనే, పునః, లోకంగ్రాహయన్ = జనులకు జ్ఞానము నుపదేశించుచు, ఇహ = ఈ పృథివియందే, తిష్ఠతు, "అతోమద్వయునం" - అని శ్రీధరులపాఠము. "మద్వత్పునర్లోకం" - అని విజయధ్వజులపాఠము.

"ఉత్తమై రధికత్వం వాసామ్యం వాపి జయోఽపివా.
ఉచ్యతేఽపితు నీచానాం మోహార్థంవాప్యపేక్షయా".

-అనెడు ప్రమాణముతో దుష్టజనమోహనార్థమై యుద్ధవుఁడు నాతోసముఁడని పరమాత్మ యన్నాఁడు. తన జ్ఞానమునుగూర్చి యుపదేశించుటకు అందఱికంటె నుద్ధవుఁడే అర్హుఁడనియైనను భావార్థము. కనుక నుద్ధవుఁడు గృష్ణునితో సమానుఁడని చెప్పినది తత్త్వార్థముగాదు. ఉద్ధవుఁడు ప్రపంచమందున్నదానికి హేతు విదియే యని చెప్పినట్టైనది.

**32. శ్లో :** శబ్దయోనినా = వేదములచేఁ దెలుపఁబడు, త్రిలోకగురుణా, - ఏవం, సందిష్టః, బదర్యాశ్రమం, ఆసాద్య, సమాధినా, హరిం ఈజే".

**33, 34, 35 శ్లో :** ఉద్ధవుకథను ముగించి విదురునికథను జెప్పుచున్నాఁడు. విదురుఁడుగూడ నుద్ధవునినుండి క్రీడయా, ఉపాత్తదేహస్య, పరమాత్మనః కృష్ణస్య, శ్లాఘితాని, కర్మాణి, ధీరాణాం, ధైర్యవర్ధనం = జ్ఞానము నెక్కువ యొనర్చెడు, విక్లబాత్మనాం, పశూనాం = ఇతరాజ్ఞానులకు, దుష్కరతరం = తెలియ నసాధ్యమైన, తస్య, ఏవం = పైఁజెప్పినట్లున్న, దేహన్యాసంచ = భూలోకత్యాగమును, శ్రుత్వా, కురుశ్రేష్ఠ = ఓపరీక్షిద్రాజా! ఆత్మానం, కృష్ణేన, మనసా ఈక్షితం = స్మరింపఁబడినవానినిగా, ధ్యాయన్‌చ = యోచించుచు, ప్రేమవిహ్వలస్సన్, భాగవతే, గతే, సతి = ఉద్ధవుఁడు పోయినతర్వాత, రురోద.

**36. శ్లో :** భరతర్షభ!, విద్వాన్ = జ్ఞానియైన విదురుఁడు, కతిభిః, అహోభిః కాళింద్యాః = యమునాతీరమునుండి బయలుదేరి, యత్రమునిః, మిత్రాసుతః = మైత్రేయుఁడుండెనో అట్టి, స్వస్సరితం, ప్రాపద్యత.

ఇతిశ్రీ మహాభాగవతే, మహాపురాణే, శతసాహస్రికాయాం,
సంహితాయాం, వైయాసిక్యాం, శ్రీహయగ్రీవబ్రహ్మవిద్యాయాం,
తృతీయస్కంధే, చతుర్థోఽధ్యాయః

## శ్రీ పోతన్నగారు

తే. ఎసఁగు మోదంబు సంధిల్ల నిష్టమైన
రసిక మృదులాన్న మర్థిఁ బారణలుసేసి
మంజులాసవ రసపాన మత్తు లగుచుఁ
గణఁగి యన్యోన్యహాస్యవాక్యములఁ గలఁగి. 138

వ. తమలోన మదిరాపాన మదవిఘూర్ణిత తామ్రలోచనులై మత్సరంబుల నొండొరులం బొడిచి సమస్తయాదవులు వేణుజాతానలంబువఁ దద్వంశ పరంపరలు దహనంబునొందు చందంబునం బొలిసిరి. అంతయునుం గనుంగొని కృష్ణుం డప్పుడు. 139

క. చతురతతో నిజమాయా
గతిఁజూచి లసద్విలోలకల్లోల సమం
చిత విమల కమల సార
స్వతజలముల విహితవిధులు సలిపినవాఁడై. 140

క. ఒక వృక్షమూలతలమున
నకలంకగుణాభిరాముఁ డాసీనుండై
యకుటిలమతి బదరీవన
ముకు నను(బొమ్మనుచు మొఱఁగిపోయిన నేనున్. 141

క. క్రమమున నిజకులసంహా
రముసేయఁ గణంగు టెఱిఁగి రమణీయశ్రీ
రమణు చరణాబ్జయుగవిర
హమునకు మదినోర్వలేక యనుగమనుఁడనై. 142

క. హరి నరయుచుఁ జనిచని యొక
తరుమూలతలంబునందుఁ దనదేహరుచుల్
గిఱికొననున్నమహాత్ముని(
బరునిఁ బ్రపన్నార్తిహరుని భక్తవిధేయున్. 143

వ. మఱియును. 144

సీ. అస్మత్ప్రియస్వామి నచ్యుతుఁ బరు సత్త్వ
గుణగరిష్ఠుని రజోగుణవిహీను
సురుచిర ద్వారకాపుర సమాశ్రయు ననా
శ్రయు నీల నీరద శ్యామవర్ణు
దళ దరవింద సుందర పత్రనేత్రు ల
క్ష్మీయుతుఁ బీతకౌశేయవాసు
విలసిత వామాంక విన్యస్త దక్షిణ
చరణారవిందు శశ్వత్ప్రకాశు

తే. ఘనచతుర్బాహు. సుందరాకారు, ధీరుఁ,
జెన్నుగల లేఁతరావిపై వెన్ను మోపి
యున్న వీరాసనాసీనుఁ నన్నుఁగన్న
తండ్రి నానందపరిపూర్ణు దనుజహరుని. 145

మత్త కోకిల.
కంటిఁ గంటి భవాబ్ధిదాఁటఁగఁ గంటి నాశ్రితరక్షకున్
గంటి యోగిజనంబు డెందముఁగంటిఁ జుట్టముఁగంటి, ము
క్కంటికిం గనరాని యెక్కటిఁ గంటిఁ దామరకంటిఁ జే
కొంటి ముక్తినిధానముం దలకొంటి సౌఖ్యము లందఁగన్. 146

వ. అయ్యవసరంబునం బరమ భాగవతోత్తముండు, మునిజన సత్తముండు, ద్వైపాయనసఖుండు, పరమతపోధనుండు, నఘశూన్యుండు, నఖిలజనమాన్యుండు, బుధజనవిధేయుండు నగు మైత్రేయుండు దీర్ఘాచరణంబుసేయుచుం జని చని. 147

మ. కనియెం దాపసపుంగవుం డఖిలలోకఖ్యాతవర్ధిష్ణు శో
భనభాస్వత్పరిపూర్ణయౌవనకళాభ్రాజిష్ణు యోగీంద్ర హృ
ద్వనజాతైకచరిష్ణుఁ గౌస్తుభముఖోద్య ద్భూషణాలంకరి
ష్ణు నిలింపాహితజిష్ణు విష్ణుఁ బ్రభవిష్ణుం గృష్ణు రోచిష్ణునిన్. 148

క. తదనంతరంబ హరిఁదన
హృదయాబ్జమునందు ముకుళితేక్షణముల స
మ్మదమునఁ జూచుచు నానత
వదనుండై యుండె ముదము వఱలఁగ ననఘా! 149

వ. అంత డగ్గఱ నేతెంచి యున్న మైత్రేయుండు వినుచుండ దరహాసచంద్రికానుందరవదనారవిందుండును, నానంద నుధా నిష్యందకందళితహృదయుండును, భక్తానురక్త దయాసక్త విలోకనుండును నగు పుండరీకాక్షుండు నన్ను నిరీక్షించి యిట్లని యానతిచ్చె, పూర్వభవంబున వసుబ్రహ్మలుసేయు సత్త్రయాగంబున వసువై భవదీయహృదయంబున నితరపదార్థంబును గోరక మదీయపాదార విందసేవఁ గావించితివి. కావునఁ దన్నిమిత్తంబున. నేను నీ హృదయంబున వసియించి సమస్తంబునుం గనుంగొందు.

ఆత్మారాముండనైన నన్ను నెవ్వరేని సదసద్వివేకులై యెఱుంగంజాలరు వారలకు నేను నగోచరుండనై యుందు. మత్పరిగ్రహంబుగల నీకు నీజన్మంబెకాని పునర్భవంబు నొందకుండుటకు భవదీయపూర్వజన్మసుకృతవిశేషంబుకతన నీ యాశ్రమంబున మత్పాదార విందసందర్శనంబు గలిగె. అదియునుంగాక పద్మకల్పంబునందు మన్నాభిపద్మ మధ్య నిషణ్ణుండైన పద్మసంభవునకు (జన్మమరణాది సంసృతినివర్తకంబు నవిరతానశ్వరసౌఖ్యప్రవర్తకంబు నగు) మన్మహత్త్వంబు దెలియంజేసినట్టి దివ్యజ్ఞానంబు నీకు నెఱింగింతు నని య మ్మహనీయతేజోనిధి యానతిచ్చిన సుధాసమానసరసాలాపంబులు గర్ణకలాపంబులై మనస్తాపంబునంబాపిన రోమాంచ కంచుకిత శరీరుండను, నానందబాష్పధారాసిక్తకపోలుండను, పరితోష సాగరాంతర్నిమగ్న మానసుండను నై యంజలిపుటంబు నిటలతటంబున ఘటియించి యిట్లంటి. 150

క. పురుషోత్తమ! నీపద సర
సిరుహధ్యానామృతాభిషేక స్ఫురణం
గర మొప్పిన నాచిత్త మి
తరవస్తువులందు వాంఛఁదగులునె యెందున్? 151

చ. జననములేనినీవు భవసంగతినొందుట కేమికారణం
బనియును, గాలసంహరుఁడవై జగముల్ విలయించునీవు పా
యని రిపుభీతికై సరిదుదంచితదుర్గమునాశ్రయించు టె
ట్లనియును దేవ! నామనమునందుఁ దలంతు సరోజలోచనా! 152

వ. అదియునుంగాక. 153

క. శ్రీరమణీశ్వర! నీవా
త్మారాముఁడ వయ్యు లీలఁ దరుణీకోటిం
గోరి రమించితి వనియును
వారక యేఁ దలఁతు భక్తవత్సల! కృష్ణా! 154

క. పరతత్త్వజ్ఞులు కరుణా
కర! నీలోకావనైకఘనతఁ దలఁపఁగా
నరసి నముఁ గాచుటెంతది
కరమరుదే దలఁచిచూడఁ గమలాధీశా! 155

వ. దేవా! నీ వఖండితవిజ్ఞాన రూపాంతఃకరణుండ వయ్యును. ముగ్ధభావంబునం బ్రమత్తునిచందంబున, మోహికైవడిం బ్రవర్తింపుచు, నెందేనియు నొదిగి యుండుటందలంచి, నాడెందంబు గుందుచుండు, అరవిందలోచన!సురవందిత! ముకుంద! ఇందిరాసుందరీరమణ! సరస్వతీరమణునకుం గరుణించిన విజ్ఞానంబు ధరియించు శక్తి నాకుంగలదేనిఁ గృపసేయుము. భవదీయ శాసనంబు ధరియించి భూరిసంసార పారావారోత్తరణంబు సేయుదు నని విన్నవించి బహుభంగులం బ్రస్తుతించిన భగవంతుండును, ప్రపన్నపారిజాతంబును నైన కృష్ణుండు పరతత్త్వనిర్ణయంబు నెఱింగించిన. 156

క. సరసిజలోచన కరుణా
పరిలబ్ధ జ్ఞాన కలిత భావుఁడ నగుటన్
బరతత్త్వవేదినై త
చ్చరణ సరోజముల కెఱఁగి సమ్మతితోడన్. 157

క. హరిపద జలరుహ విరహా
తుర ఘనదుర్దాంత దుఃఖతోయధిఁ గడవన్
వెర వేది తిరుగవలసెను
సరసిజభవకల్పవిలయ సమయముదాఁకన్. 158

వ. ఇట్లు దిరుగుచు. 159

మ. నరనారాయణతాపసాశ్రమ పదౌన్నత్యంబునం బొల్చు భా
సుర మందార రసాలసాలవకుళాశోకామ్లపున్నాగ కే
సర జంబీర కదంబ నింబ కుటజాశ్వత్థస్ఫురన్మల్లికా
కరవీర క్షితిజాభిరామ బదరీకాంతారసేవారతిన్. 160

క. చనుచున్నవాఁడ నని ప
ల్కినపలుకుల కులికి కళవళింపుచు విదురుం
డనుపమశోకార్ణవమున
మునిఁగియు నిజయోగ సత్త్వమునఁ దరియించెన్. 161

వ. ఇట్లు విదురుండు శోకపావకునిం దనవివేకజలంబుల నార్చి యుద్ధవున కిట్లనియె. 162

మ. అనఘా! యుద్ధవ! నీకుఁ గృష్ణుఁ డసురేంద్రారాతి మన్నించి చె
ప్పిన యధ్యాత్మరహస్యతత్త్వ విమలాభిజ్ఞాన సారంబు బో
రన నన్నుం గరుణించి చెప్పినఁ గృతార్థత్వంబునుం బొందెదన్
విను పుణ్యాత్ములు శిష్యసంఘముల నుర్విం బ్రోవరే వెండియున్. 163

క. భగవద్భక్తులు సుజనులు
దగ వెదకిఁగి, పరోపకార తాత్పర్యవివే
క గరిష్ఠులై చరింతురు,
జగతిం బెంపొంది వృష్ణిసత్తమ! యెందున్. 164

క. అనవుడు నుద్ధవుఁ డ వ్విదు
రున కిట్లను ననఘ! మునివరుఁడు సాక్షాద్వి
ష్ణునిభుండగు మైత్రేయుఁడు
దన మనమున మనుజగతి వదలఁ దలఁచి తగన్. 165

క. హరి మురభేదిఁ బరాపరుఁ
గరుణాకరుఁ దలఁచునట్టి ఘనుఁ డమ్మునికుం
జరు కడకేగిన నాతఁడు
గర మర్థిం దెలుపు సాత్త్వికజ్ఞానంబున్. 166

వ. అని యుద్ధవుండు విదురుంగూడి చనిచని. 167

ఉ. ముందటఁగాంచె నంత బుధముఖ్యుఁడు హల్లక పుల్లపద్మ ని
ష్యంద మరందపాన విలసన్మదభృంగఁ, జలత్తరంగ, మా
కంద లవంగ లుంగ లతికా చయసంగ, సురాంగనాశ్రితా
నందితపుణ్యసంగ, యమునన్. భవభంగ, శుభాంగ, నర్మిలిన్. 168

క. కని డాయ నేగి మోదం
బునఁ, దత్సరిదమలపులినభూములఁ దగ నా
దినశేషము నివసించెను
వనజోదరపాదపద్మవశ మానసుఁడై. 169

క. మఱునాఁడు రేపకడ భా
సురపుణ్యుఁడు ఘనుఁడు మధు నిషూదన చరణ
స్మరణ క్రీడాకలితుఁడు
దరియించెన్ గలుషగహనదమునన్ యమునన్. 170

క. ఇట్లుద్ధవుండు యమునానది నుత్తరించి బదరికా(శమంబునకుం జనియె
ననిన విని రాజేంద్రుండు యోగీంద్రున కిట్లనియె. 171

క. శౌరియు నతిరథవరులు మ
హారథసమరథులు యదుబలాధిపు లెల్లన్
పోరి మృతిఁబొంద నుద్ధవుఁ
డేరీతిన్ బ్రదికె నాకు నెఱిఁగింపు తగన్. 172

సీ. నావుడు రాజేంద్రునకు శుకయోగీంద్రుఁ
డిట్లను మును పరమేష్ఠిచేత
సంప్రార్థితుండైన జలరుహనాభుండు
వసుమతిపై యదువంశమందు
నుదయించి తనుదాన మదిలోనఁ జింతించి
తెలివొంది యాత్మీయకులవినాశ
మొనరించి తాను బంచోపనిషణ్మయ
మగు దివ్యదేహంబునందుఁ జెందఁ

తే. దలఁచి విజ్ఞానతత్త్వంబుధరణిమీఁదఁ
దాల్చి జనకోటి కెఱిఁగింపఁదగిన ధీరుఁ
డుద్ధవుఁడు దక్క నితరులేనోప రితఁడు
నిర్జితేంద్రియుఁ డాత్మసన్నిభుఁ డటంచు. 173

క. క్షితిపై నిలిపిన కతమున
నతనికి మృతి దొరకదయ్యె నవనీశ! రమా
పతి యభిమానముగల్గిన
యతిపుణ్యుఁడు చనియె బదరికాశ్రమమునకున్. 174

వ. అంత. 175

క. ఉద్ధవుఁ డరిగినఁ బిదప స
మిద్ధపరిజ్ఞాను సుజనహితు మైత్రేయున్
వృద్ధజన సేవ్యుఁ దాపస
వృద్ధశ్రవుఁ, జూడఁగోరి విదురుఁడు గణఁకన్. 176

వ. యమునానది దాఁటి కతిపయ ప్రయాణంబులఁ బుణ్యనదులు, హరిక్షేత్రంబులు దర్శింపుచు నతిత్వరిత గమనంబున. 177

క. చని చని ముందటఁ గనుఁగొనె
ఘనపాపతమఃపతంగఁ గరుణాపాంగన్,
గనదుత్తుంగ తరంగన్,
జనవరనుత బహుళపుణ్యసంగన్, గంగన్. 178

క. అందు నరవిందసౌరభ
నందిత పవమాన ధూత నటదూర్మి పరి
స్పందిత కందళ శీకర
సందోహ లసత్ప్రవాహ జలమజ్జనుఁడై. 179

సీ. ఘనసారరుచి వాలుకా సముదంచిత
సైకత వేదికా స్థలమునందు
యమనియమాది యోగాంగక్రియానిష్ఠఁ
బూని పద్మాసనా సీనుఁ డగుచు
హరిపాదసరసీరుహన్యస్త చిత్తుఁడై
బాహ్యేంద్రియవ్యాప్తిఁ బాఱఁద్రోలి
సకల విద్వజ్జన స్తవనీయ సముచితా
చారవ్రతోపవాసముల గ్రుస్సి

తే. యున్న పుణ్యాత్ము విగతవయోవికారు
వినుతసంచారు భువనపావనవిహారు
యోగిజనగేయు సత్తతిభాగధేయు
నాశ్రితవిధేయు మైత్రేయు నపుడు గాంచె. 180

138.క. ఎసఁగుమోదంబు సంధిల్లన్ = అభివృద్ధిచెందిన సంతోష మొప్పుచుండఁగా. అర్థిన్ = ప్రీతితో, రసికమృదులాన్నపారణలు = రుచికరములైన చక్కగా వండఁబడిన భోజనములు చేసి, మంజుల = రుచికరములైన, ఆసవరసపాన = చెఱకులు, ఇప్పపూలు - మొదలైనవానితోఁ దయారుచేయఁబడిన మద్యములను సేవించుటచేత,

మత్తు లగుచున్ = మనస్సు నిలుకడతప్పినవా రగుచు, కణఁగి = పూనుకొని, అన్యోన్యహాస్యవాక్యములన్ = పరస్పరము హాస్యము లొనర్చుటచేత, కలఁగి = హాస్యము లెక్కువయగుటచే మనస్సులు క్షోభించినవారై.

**తాత్పర్యము** : బ్రాహ్మణులచే నాజ్ఞప్తులైన యాదవులు, రుచికరములైన చక్కగా వండఁబడిన యాహారములు భుజించినారు. తరువాత మద్యపాన మొనర్చిరి. ఆ మత్తుతో వారిమనస్సుల నిలుకడ చెడినది. వా రన్యోన్యహాస్యములకుఁ గడఁగిరి. అది పెరిగి పెరిగి పరస్పర తిరస్కారములలోనికి వచ్చినది.

139.వ. మదిరాపాన = మద్యపానముచే నేర్పడిన, మద = మదముచేత, విఘూర్ణిత = తిరుగుడువడుచున్న, తామ్రలోచనులై = ఎఱ్ఱనికన్నులు గలవారై, మత్సరంబులన్ = కచ్చితనములతో, ఒండొరులన్పొడిచి = పరస్పరము సంహరించికొని, సమస్తయాదవులు, వేణుజాతానలంబునన్ = వెదురులనుండి పుట్టిన యగ్నులచేత, తత్ + వంశపరంపరలు = ఆవెదుళ్లగుంపులు. ఇక్కడ వంశశబ్దము శ్లిష్టము. ఆ తెగకుఁ జెందిన వని యర్థము. యాదవుల వంశములని వేరర్థము. దహనంబు నొందుచందంబునన్ = కాలిపోవునట్లు, పొలిసిరి = నశించిరి.

**తాత్పర్యము** : మద్యముచే నేర్పడిన మత్తులో వారికండ్లు తిరుగుడువడుచుండెను. కన్ను లెఱ్ఱనైనవి. పరస్పరాధిక్షేపములతో వారు విజృంభించి కయ్యములకు దిగిరి. వెదురులనుండి పుట్టిన యగ్ని యా వెదురులనే దహించునట్లు యదువంశజనితములైన మత్సరములు తద్వంశమునే నాశ మొనర్చెను. అంతయునుఁ జూచి కృష్ణుఁడు.

140.క. చతురతతోన్ = నైపుణ్యముతో, నిజమాయాగతిన్చూచి = తనమాయాప్రభావమును గమనించి, లసత్ = ప్రకాశించుచున్న, విలోల = చలించుచున్న, కల్లోల = తరంగములచేత, సమంచిత = ప్రకాశించుచున్న, విమలకమల = స్వచ్ఛములైన కమలములుగల, సారస్వతజలములన్ = సరస్వతీనదీజలములతో, విహితవిధులు = శాస్త్రములచే విధింపఁ బడినకార్యములు, సలిపినవాఁడై = నిర్వహించి.

**తాత్పర్యము** : యదుస్వామి తన మాయావిశేషమును దానే యాశ్చర్యముతో గమనించినాఁడు. చలించుచున్న తరంగములు, విమలకమలములుగల సరస్వతీనదిలో శాస్త్రవిహితములైన కర్మ లొనర్చెను. "భగవాన్ స్వాత్మమాయాయాః గతిం తమవలోక్య సః" అని మూలము. సరస్వతీ ముపస్పృశ్య" అని మాత్రమే యున్న మూలమునకు పోతన్న సొమ్ములువెట్టినాఁడు.

**141.క.** అకలంకగుణాభిరాముఁడు = కళంకరహితములైన గుణములచేత మనోహరుఁడు. ఒక వృక్షమూల తలమునన్, ఆసీనుండై = కూర్చున్నవాఁడై, అకుటిలమతిన్ బదరీవనమునకున్ ననున్ పొమ్మనుచున్ మొఱఁగిపోయినన్ = నన్ను రప్పించి కొనిపోగా, నేనున్.

**తాత్పర్యము** : స్వామి యొకవృక్షమూలతలమం దాసీనుఁడైయుండి నన్ను బదరికిఁ బొమ్మని యాజ్ఞాపించెను. నన్ను మొఱఁగిపోయెను. అప్పుడు నేను.

**142.క.** నిజకులసంహారముసేయన్ కడంగుట యెఱింగి = నిజకులము సంహరించు నుద్యుక్తతను దెలిసి, రమణీయ = అందమైన, శ్రీరమణు = లక్ష్మీధవునియొక్క, చరణాబ్జయుగ = పాదపద్మములయొక్క, విరహమునకున్ = ఎడఁబాటునకు, మదిన్ ఓర్వలేక, అనుగమనుఁడనై = వెంటఁబోవుచున్నవాఁడనై.

**తాత్పర్యము** : కృష్ణపరమాత్మ యదుకులమును నిశ్శేషముగా నాశమొనర్పఁబూనినాఁడని గమనించితిని. ఆతనిపాదపద్మవిరహము నా కసహ్యముగా నుండెను. నే నతనినే యనుసరించి వెళ్లితిని

**143.క.** హరిన్ అరయుచున్ చనిచని = కృష్ణునివెదకికొనుచు పోయిపోయి, ఒకతరుమూలతలంబునందున్ = ఒకయశ్వత్థమూలమునందు, తనదేహరుచుల్ గిఱికొనన్ = తనదేహకాంతులు దిక్కులకు వ్యాపింపఁగా ఉన్న, మహాత్మునిన్, పరునిన్, ప్రపన్నార్తిహరునిన్ = తనకు శరణన్నవారి దుఃఖములను బోఁగొట్టువానిని, భక్తవిధేయున్ = భక్తులకు విధేయుఁడైన వానిని.

**తాత్పర్యము** : నన్ను మొఱఁగిపోయినకృష్ణుని వెదకికొనుచుఁ బోయినాను. ఒకవృక్షమూలతలమం దాతఁడు గూర్చొనియుండెను. ఆతని దేహకాంతులు దిక్కులకు వ్యాపించియుండెను. అతఁడు దాసులదుఃఖములను బోఁగొట్టువాఁడు, భక్తవిధేయుఁడు. వానిని జూచితి ననిపై కన్వయము.

**144.వ.** మఱియును.

**145.సీ.** అస్మత్ప్రియస్వామిన్ = నాకు ప్రియమైన స్వామియు, అచ్యుతున్ = తన మానసికస్థితి నుండి యెప్పుడును జారనివాఁడు. సత్త్వగుణ గరిష్ఠునిన్ = సత్త్వగుణముచేఁ గూడినవాఁడు, రజోగుణ విహీనున్ = రజోగుణ సంసర్గము లేనివాఁడు. సురుచిర ద్వారకాపుర సమాశ్రయున్ = శోభిల్లుచున్న ద్వారక రాజధానిగాఁ

గలవాఁడు, అనాశ్రయున్ = తానందఱ కైనను తన కెవ్వరును లేనివాఁడు. నీలనీరదశ్యామవర్ణున్ = మేఘమువలె నల్లనైన శరీరచ్ఛాయఁగలవాఁడు, దళదరవిందసుందర పత్రనేత్రున్ - దళత్ = అప్పుడే వికసించుచున్న, అరవింద = తామరలయొక్క, సుందరపత్రనేత్రున్ = అందములైన రేకులవంటి కన్నులుగలవాఁడు, లక్ష్మీయుతున్ = లక్ష్మీదేవిని గూడినవాఁడు. పీతకౌశేయవాసున్ = పచ్చని పట్టుపుట్టము గట్టినవాఁడు. విలసిత = ప్రకాశించుచున్న, వామాంక = ఎడమకాలితొడపై, విన్యస్త = ఉంచిన, దక్షిణచరణారవిందున్ = కుడికాలు గలవాఁడు, శశ్వత్ప్రకాశున్ = ఎక్కువ ప్రకాశముగలవాఁడు. ఘనచతుర్బాహున్, సుందరాకారున్, ధీరున్ చెన్నుగల లేతరావిపైవెన్నుమోపియున్న వీరాసనాసీనున్ = అతనివెన్ను ఒకయశ్వత్థవృక్షముయొక్క మూలమున కానుకొని యున్నది. ఆనంద పరిపూర్ణున్ = స్వాత్మానందముచేత నిత్యపరిపూర్ణుఁడైన వానిని, దనుజహరునిన్ -

**తాత్పర్యము** : కృష్ణపరమాత్మ నిత్యసత్త్వగుణవిశిష్టుఁడు. రజోగుణవిహీనుఁడు. లోకపద్ధతి ననుసరించి ద్వారకాపట్టణమను రాజధాని నాశ్రయించినవాఁడు. తానందర కైనను తన కెవ్వరును లేనివాఁడు. ఆతనిశరీరచ్ఛాయ నీరదశ్యామలము. అప్పుడే వికసించిన తామరరేకులతో సమానమైన కన్నులు, కట్టినపట్టుపుట్టము. అతఁడు ఎడమకాలితొడపై దక్షిణచరణమును మోపి వీరాసనాసీనుఁడైయున్నాఁడు ఆతనిప్రకాశము దేదీప్యమానమై యుండినది. నాలుగుచేతులు. ఆతనివీ పొక యశ్వత్థమూలము నానియున్నది. స్వాత్మానందముతో నాతఁ డెప్పుడును బరిపూర్ణుఁడు. నా కతఁడే ప్రియస్వామి. అట్టివానిని దర్శించితి నని పై కన్వయము.

146.మ. కంటిన్ కంటిన్ = సంతోషముతో వీప్స. భవాబ్ధిన్ దాటఁగన్ కంటిన్ = సంసారసముద్రమును దాటఁ గంటిని. ఆశ్రితరక్షకున్ కంటిన్ = భక్తులను రక్షించువానిని చూచితిని. యోగిజనంబుడెందమున్ కంటిన్ = మహాయోగులకు హృదయాకారమైన స్వామిని కంటిని, చుట్టమున్ కంటిన్ = నానిజమైన బంధువును గన్నాను. ముక్కంటికిన్ కనరానియొక్కటిన్ కంటిన్ = శివునకుఁ గూడ దర్శింపరాని యేకాంతవిహారియైన స్వామిని జూచినాను. తామరకంటిన్ కంటిన్ = పద్మనేత్రుని గన్నాను. ముక్తినిధానమున్ చేకొంటిన్ = ముక్తి కాశ్రయభూతుని గ్రహించితిని, లేక ముక్తియనునిధిని గ్రహించినాను. సౌఖ్యములు అందఁగన్ తలకొంటిన్.

**తాత్పర్యము** : ఓవిదురా! ఏకాంతమందున్ననాస్వామిని జూచినాను. ఆతనిని జూచుటే భవాబ్ధిని తరించుట. మహాయోగుల కాత్మస్వరూపుఁ డతఁడు. జీవులకు నిజమైనబంధువు. పరమశివునకుఁగూడ గనరాని యాస్వామిని దర్శించినాను. ఆ పద్మనేత్రుని జూచినాను. ముక్తినిధానము నందితిని. సమస్త సౌఖ్యముల సారమును గన్నాను.

147.వ. అయ్యవసరంబునన్ = పరమభాగవతోత్తముండు = పరమభక్తులలో శ్రేష్ఠుఁడు, మునిజనసత్తముండు = మునులలో గొప్పవాఁడు. ద్వైపాయనసఖుండు = వ్యాసునకు మిత్రుఁడు, పరమతపోధనుండు = గొప్పతపస్సే ధనముగాఁ గలవాఁడు. అఘశూన్యుండు =పాపములేనివాఁడు. అఖిలజనమాన్యుండు = సమస్తజనులచే గౌరవింపఁదగినవాఁడు, బుధజనవిధేయుండు = గొప్పవారికి దాసభూతుఁడు, తీర్థాచరణంబు సేయుచున్ = తీర్థదర్శన మొనర్చుచు.

**తాత్పర్యము** : అప్పుడు మాచెంతకు మైత్రేయమహర్షి యదృచ్ఛగా వచ్చినాఁడు. ఆతఁడు తీర్థాచరణము లొనర్చుచుండెను. మైత్రేయమహర్షి పరమతపోధనుఁడు. వ్యాసునకు స్నేహితుఁడు. పాపలేశమును లేనివాఁడు. సకలమహర్షులచేతను గౌరవింపఁబడినవాఁడు.

148.మ. అఖిలలోక ఖ్యాతవర్ధిష్ణున్ = సమస్త ప్రపంచములందును - ప్రఖ్యాతమైన యభివృద్ధిగలట్టియు, శోభనభాస్వత్ పరిపూర్ణ యౌవనకళాభ్రాజిష్ణున్ = సకలలోకములకును శోభనములు గలుగఁజేయునట్టి నిత్యపరిపూర్ణమైన యౌవనముతోఁ బ్రకాశించుచున్నట్టియు, యోగీంద్రహృద్వనజాతైకచరిష్ణున్ = యోగీశ్వరుల మనస్సు లనెడు పద్మములపైననే ముఖ్యముగా సంచరించెడునట్టియు, కౌస్తుభముఖ + ఉద్యత్ + భూషణ + అలంకరిష్ణున్ = కౌస్తుభము మొదలైన భూషణాలంకారములు గలట్టియు, జిష్ణున్ = జయశీలుఁడైనట్టియు, విష్ణున్ = సర్వత్ర వ్యాపించినట్టియు, రోచిష్ణునిన్ = ఎక్కువప్రకాశముగల, కృష్ణున్ = కృష్ణుని, తాపసపుంగవుండు కనియెన్.

**తాత్పర్యము** : మైత్రేయమహర్షి కృష్ణపరమాత్మను దర్శించెను. ఆ కృష్ణునిగూర్చి చెప్పవలసిన దేమున్నది? ఆయన నిత్యపరిపూర్ణుఁడు. సకలలోకప్రఖ్యాతమైనవృద్ధి యాతనిది. నిత్యయౌవనుఁడు. యోగీశ్వరులమనస్సు లనెడు పద్మములందే

ముఖ్యముగ నాతని సంచారము. కౌస్తుభాదిభూషణము లన్నియు జిగజిగ మెఱయుచుండెను. నిత్యజయ శీలుఁడాయన. ప్రపంచమున నాతఁడు లేనట్టిచోటులేదు. సదాతనుఁడు. అట్టికృష్ణుని మైత్రేయుఁడు చూచెను.

149.క. తనహృదయాబ్జమునందున్ = తనమనస్సనెడు పద్మమునందు, ముకుళిత + ఈక్షణములన్ = మూసికొన్నకన్నులతో, సమ్మదమునన్ చూచుచున్, ముదము వఱలఁగన్ = సంతోష ముప్పొంగగా, ఆనతవదనుండై = తలవంచి నిలుచుకొని యుండెను.

**తాత్పర్యము** : మైత్రేయమహర్షి కన్నులుమూసికొని భగవంతుని సన్నిధానమం దుండెను. ఆతఁడు కృష్ణపరమాత్ముని మనస్సునందు నిల్పికొని ధ్యానించుచున్నాఁడు. ఆ యానందము నిరవధికమై యుండినది.

150.వ. అంతన్, డగ్గఱన్ ఏతెంచియున్న మైత్రేయుండు = చాలసమీపమునకు వచ్చియున్న మైత్రేయుని, దరహాసచంద్రికా = చిఱునవ్వులను వెన్నెలలచేత, సుందరవదన + అరవిందుండు = సుందరమైన ముఖపద్మముగలవాఁడు. ఆనందసుధానిష్యంద = ఆనందమనెడు సమృతప్రవాహముచేత, కందళిత = పులకరించిన, హృదయుండు = మనస్సుగలవాఁడు. భక్తులయందున్, అనురక్త = ఎక్కువప్రేమతోఁగూడిన, దయా = దయయందు, సక్త = తగుల్కొన్న, విలోకనుఁడు = చూపుగలవాఁడు, భవదీయహృదయంబునన్ = నీమనస్సునందు, మదీయ = నాయొక్క, తత్ + నిమిత్తంబునన్ = ఆ కారణముచేత, ఆత్మా + ఆరాముండు = ఆత్మయందే ఆనందించెడువాఁడు, సత్ + అసత్వివేకులు = నిత్యానిత్య పదార్థముల వివేకముగలవారు. అగోచరుఁడనై = కనపడనివాఁడనై, మత్ + పరిగ్రహంబు = నాచేస్వీకరింపఁబడుట, పునర్భవంబున్ = మరుజన్మమును, కతనన్ = కారణముచేత, మత్ + నాభిపద్మ = నానాభియందుఁ బుట్టినపద్మముయొక్క, మధ్యమందు, నిషణ్ణుఁడు = కూర్చున్నవాఁడు, కర్ణకలాపంబులు = చెవులకు సొమ్ములవంటివి, రోమాంచకంచుకిత = పుల్క లనెడు కంచుకముచేతకూడిన శరీరముగలవాఁడు. ఆనందభాష్పధారా = ఆనందబాష్పములచేత, సిక్త = తడుపఁబడిన, కపోలుఁడు = కపోలములు గలవాఁడు. పరితోషసాగర + అంతర్ + నిమగ్నమానసుఁడు = సంతోషసముద్రమందు మునిఁగిన మనస్సుగలవాఁడు.

**తాత్పర్యము** : మైత్రేయుఁడు కృష్ణుని సమీపించి కూర్చొనియుండెను. అప్పుడు కృష్ణపరమాత్మముఖము చిఱునవ్వులనెడు వెన్నెలలచేత విరాజిల్లుచుండినది. ఆనందమను నమృతప్రవాహముచే నాతని హృదయము పొటమరించియుండెను. ఆ కన్నులనిండ దయ, ఆతనిదయ నిరంతరమును భక్తులయం దనురక్తిగలది. ఆ పుండరీకాక్షుఁడు నన్నుఁ గటాక్షించి యిట్లానతిచ్చినాఁడు. "ఓయీ! యుద్ధవా! నీవు పూర్వజన్మమున నొక్కవసువవు. వసుబ్రహ్మలందఱు సత్రయాగ మొనర్చుచుండిరి. నీవును నందుఁ బాల్గొన్నావు. వా రేవేవో కోరికలుగోరిరి. నన్నుఁ దప్ప నితరమును గోరక నాపాదసేవ గావించినావు. ఆ కారణముగా నేను నీ హృదయమధ్యమున వసించి సమస్తమును గనుఁగొనుచుంటిని. నాయానందమున కితరవస్త్వపేక్షలేదు. స్వాత్మానందమందే నేను నిమగ్నుఁడను. న న్నెవరు సదసద్వివేకముగలిగి పూజింతురో వారలకు వశుఁడనై యుందును. కాని వారలకుఁ గన్పింపను. నీయందు నాదయ ప్రసరించినది. అందుచే నిదియే నీకుఁ గడపటిజన్మ. ఆ పుణ్యవిశేషముననే నరలోకమును విడచిపోవుచున్న నన్ను దర్శించెడుభాగ్యము నీకుఁ గల్గినది. పద్మకల్పమందు నా నాభియందుఁబుట్టిన పద్మమునుండి జన్మించిన బ్రహ్మదేవుఁడు దిక్కులు నరాచుచుండెను. అప్పు డాతనికి నేను జన్మమరణాదులసంసారమును జ్ఞానమును నుపదేశించినాను. ఆ జ్ఞానమునే నీకు బోధించితిని, "అతని యా మాటలు సుధాసమానములై యుండినవి. నాకర్ణముల కవి కలాపములై యుండెను. నాశరీరమున రోమాంచ మెనసినది. ఆనందబాష్పధారలు నా కపోలములఁ గ్రమ్మినవి. నామనస్సు సంతోషసాగరమున నిమగ్నమై యుండెను. అంజలిపుటమును ఘటించి యిట్లు పల్కితిని.

**151.క.** పురుషోత్తమ = పురుషులలో శ్రేష్ఠుఁడా! నీయొక్క, పదసరసిరుహ = పాదపద్మములయొక్క ధ్యానామృత = ధ్యానమనెడు నమృతముయొక్క, అభిషేకస్ఫురణన్ = అభిషేకముచేత, కరము ఒప్పిన నాచిత్తము = ఇతరవస్తువులందున్, వాంఛన్ తగులునె?

**తాత్పర్యము** : స్వామీ! నిరంతరము నాచిత్తము నీపదధ్యానము అనెడు నభిషేకముతోఁ దర్పిత మగుచున్నది. అట్టినామనస్సునం దితరవస్తువులపై వాంఛ యెట్లు పొడసూపఁగలదు?

**152.చ.** దేవ! సరోజలోచనా! జననములేనినీవు = జన్మమరణాదులులేని వాఁడవు, భవసంగతిన్ ఒందుటకున్ = జన్మముతోడి సంబంధమునుబొందుటకు,

ఏమికారణంబు అనియును, కాలసంహారుఁడవై = కాలస్వరూపముతో సమస్తమును నాశమొందించువాఁడవై, జగముల్ వెలయించునీవు = మరల జగత్తులను గల్పించువాఁడవు. పాయనిరిపుభీతికై = మాటిమాటి కేర్పడుచుండెడు శత్రువులనుండిగలిగిన భయమునకై, సరిత్ + ఉదంచిత + దుర్గమున్ = జలదుర్గమైన ద్వారకను, ఆశ్రయించు టెట్లనియును నామనమునందున్ తలంతున్.

**తాత్పర్యము** : స్వామీ! నీవు జననమరణములు లేనివాఁడవు. కాని జన్మమునందుచున్నావు. ఇదెట్లు సంగతము? కాలస్వరూపుఁడవై సమస్తమును సంహరించి కాలక్రమమున జగత్తులను వెలయించువాఁడవు నీవు శత్రువులధాటికి వెఱచినట్లుగాఁ బరువెత్తిపోవుట, జలదుర్గము నాశ్రయించుట - వీనికి సమన్వయము గుదురుటలేదు. నామన స్సెప్పుడును వీని కెట్లు సమన్వయ మని శంకించుచునే యున్నది.

153.వ. అదియునుం గాక అంతే కాక -

154.క. శ్రీరమణీశ్వర! = లక్ష్మీవల్లభ! ఆత్మారాముండ వయ్యున్ = స్వానందపరిపూర్ణుఁడవయ్యును, లీలన్ = క్రీడగా, తరుణీకోటిన్ = స్త్రీలగుంపును, కోరి రమించితివనియును = రమింపఁజేయుదు వనియును, వారక = నిరంతరమును, ఏన్ తలఁతున్, భక్తవత్సల = భక్తులయందు వాత్సల్యముగలవాఁడా!

**తాత్పర్యము** : స్వామీ! నీ వాత్మారాముఁడవు. అట్లయ్యును అనేకస్త్రీసమూహములతోఁ జేరి రమించునట్లు నటింతువు. నీ విరుద్ధప్రవర్తనము నాకు సంగతముగాఁ దోఁచుటలేదు.

155.క. కరుణాకర!, పరతత్త్వజ్ఞులు = పరతత్త్వమును దెలిసినవారు, నీలోక + అవన + ఏక + ఘనతన్ = లోకములను రక్షించుటయనెడి ఘనతనుగూర్చి, మాటికి బ్రకటించుచుండఁగా, అరసి, ననున్కాచుట, ఎంత? = గమనించి నన్ను రక్షించుట యెంతపెద్దపని! అది కరమరుదే? = అది నీవంటివానికి పెద్దపనియా?

**తాత్పర్యము** : ఓ దయాకరుఁడైన వాఁడా! పరమార్థతత్త్వము నెఱిఁగినవారు లోకములను రక్షించుటయనెడు నీ ముఖ్యకార్యమునుగూర్చి నిరంతరమును బ్రకటించుచుందురు. అట్టియెడ నన్ను దయతోఁజూచి రక్షించుట నీ కెంత దొడ్డపని?

156.వ. అఖండిత = నిరంతరమును ధారావాహికముగా నున్న, విజ్ఞానరూప = జ్ఞానస్వరూపమైన, అంతఃకరణుఁడు = బుద్ధిగలవాఁడు. ప్రమత్తునిచందంబునన్ = మత్తుగొన్నవానివలె, విమోహికైవడిన్ =మోహితుఁడైనవానివలె, ఎందేనియున్ ఒదిగియుండుట = ఎచటనో యొకమూలనుండుట, నాడెందంబు = నామనస్సు, ఇందిరాసుందరీరమణ = లక్ష్మీపతీ! భూరి = గొప్పదైన, సంసారమనెడు, పారావారఉత్తరణంబున్ = సముద్రమునుదాఁటుట, బహుభంగులన్ = అనేకరీతులుగా, ప్రపన్నపారిజాతంబు = శరణుజొచ్చినవారికి కల్పవృక్షము, పరతత్త్వనిర్ణయంబున్ = పరమజ్ఞానమును.

**తాత్పర్యము** : స్వామీ! నీవు సదా సన్నిహితమైన విజ్ఞానమే మనస్సుగాఁ గలవాఁడవు. అట్టి నీవు ఏమో ముగ్ధునివలెఁ బ్రవర్తింతువు. ప్రమత్తునివలె నడయాడెదవు. వేనిచేతనో విమోహితుఁడ వైనట్లు సంచరించెదవు. అతిసామాన్యునివలె నెక్కడో యొకచోట నొదిగియుందువు. ఇవన్నియుఁ దలఁచి నామనస్సు దుఃఖించుచుండును. స్వామీ! బ్రహ్మదేవునకు దయచేసిన విజ్ఞానము ధరియించుశక్తి నామనస్సు నకున్నదని నీవు దలఁచినచో నా జ్ఞానమును నా కుపదేశింపుము. నీదయతో సంసారమను సముద్రమును దరింతును అని యనేకరీతులఁ బ్రస్తుతింపఁగా భక్తులకుఁ గల్పవృక్షమైన స్వామి పరతత్త్వనిర్ణయము నుపదేశించినాఁడు.

157.క. సరసిజలోచన! = పరమాత్మయొక్క, కరుణా = దయచేత, పరిలబ్ధ = పొందఁబడిన, జ్ఞాన = జ్ఞానముచేత, కలితభావుఁడన్, అగుటన్ = కూడినభావము గలవాఁడ నగుటచేత, పరతత్త్వవేదినై = పరతత్త్వమును గూర్చి నిర్ణయముగలవాఁడనై, తత్ + చరణసరోజములకున్ ఎఱఁగి = అతని పాదపద్మములకు నమస్కరించి, సమ్మతితోడన్.

**తాత్పర్యము** : ఆ పరమాత్మకరుణావిశేషముచే జ్ఞానము లభించినది. దానిచే నామనస్సానందపరిపూర్ణ మయ్యెను. నేను భగవంతుని పాదపద్మములకు వినయముతో నమస్కరించితిని.

158.క. హరిపదజలరుహ = కృష్ణునిపాదపద్మములయొక్క, విరహాతుర = విరహముచే, (ఎడబాటు) దుఃఖమందుచున్నవాఁడనై, ఘన = గొప్పదైన, దుర్దాంత

= దాఁటరాని, దుఃఖతోయధిన్ =దుఃఖసముద్రమును, కడవన్ = దాఁటుటకు, వెఱవు + ఏది = ఉపాయము తోఁచనివాఁడనై, సరసిజభవకల్ప = బ్రహ్మదేవుని కల్పకాలమైన, విలయసమయముదాఁకన్ = మహాప్రళయపర్యంతము.

**తాత్పర్యము** : ఈ కృష్ణవియోగదుఃఖ మనెడు సముద్రము దురంతమై యున్నది. దానిని దాఁటుటకుఁ నా కుపాయము దోఁచుటలేదు. అందుచే నిట్లు తిరుగుచున్నాను. బ్రహ్మ కల్పకాలము నే నిట్లు దిరుగవలసినదే!.

**159.వ.** ఇట్లు దిరుగుచు

**160.మ.** నరనారాయణ తాపసాశ్రమపద + ఔన్నత్యంబునన్ = నరనారాయణులు మొదలైన తపస్వుల స్థానమగుటచేత గొప్పసిద్ధిలోనున్న, బదరీకాంతారసేవారతిన్ = బదరికారణ్యములను దర్శించుకోరికతో.

**తాత్పర్యము** : బదరికాశ్రమము నరనారాయణులు మొదలగు గొప్పవారు తపస్సుచేసినచోటు. ఆ కాననములయం దనేకవృక్షములు, మందారరసాల సాలాదులు, అశోకములు, పున్నాగములు, కేసరములు, జంబీరములు, ఇంక నెన్నియో రకములైనవి.

**161.క.** పలుకులకున్ ఉలికి = పలుకులకు దుఃఖమునుజెంది, కళవళింపుచున్ = మనస్సులోఁ బరితాపమును బొందుచు, అనుపమశోకార్ణవమునన్ మునుఁగుచున్ = దుఃఖసముద్రమున మునిఁగినవాఁడయ్యును, నిజయోగసత్త్వమునన్ = తన యోగశక్తిచేత, తరియించెన్ = ఆ దుఃఖమును గడచెను.

**తాత్పర్యము** : బదరికాశ్రమమునకుఁ బోవుచున్నానన్న యుద్ధవునిమాటలకు విదురుఁ డెంతయో దుఃఖించినాఁడు. ఆ శోకము సముద్రమువలె నుండెను. కడ కాతఁడు తన యోగశక్తిచేతఁ దరించినాఁడు.

**162.వ.** శోకపావకుని = దుఃఖమనెడు నగ్నిని, తన వివేకజలంబునన్ = తన వివేకమను నీటిచేత నార్పికొన్నాఁడు.

**తాత్పర్యము** : విదురుఁడు తనదుఃఖాగ్నిని వివేకమనెడు నీటిచే నార్పికొన్నాఁడు. అతఁ డుద్ధవునితో నానెను.

**163.వ.** అసురేంద్రారాతి = రాక్షసరాజులకు శత్రువైన కృష్ణుఁడు, మన్నించిచెప్పిన అధ్యాత్మరహస్యతత్త్వ విమల అభిజ్ఞాన సారంబున్ = నీపై దయదలఁచి చెప్పినట్టి

ఆత్మనుగూర్చిన రహస్యమును, బోరనన్ = వెంటనే, కృతార్థత్వంబునన్ = కృతార్థత్వమును, పొందెదన్, శిష్యసంఘములన్ = శిష్యులగుంపును.

**తాత్పర్యము** : ఓ యుద్ధవా! నిన్నుఁ గరుణించి కృష్ణుఁ డుపదేశించిన యాత్మతత్త్వము నాకుఁ జెప్పుము. నీవు నా కుపదేశించినచో నేను గృతార్థుఁడ నయ్యెదను. భగవద్భక్తులకు శిష్యసంఘములను దరింపఁజేయుటకంటె వేరు కర్తవ్యము లేదుగదా!.

164.క. వృష్ణిసత్తమ! = ఉద్ధవా! ఎందున్ = లోకమం దెందుఁజూచినను, భగవద్భక్తులు సుజనులు = భగవద్భక్తులైన సజ్జనులు, తగవు ఎఱిఁగి = ధర్మము దెలిసికొని, జగతిన్‌పెంపువొంది = లోకమున మన్నింపఁబడువారలై, పరోపకార = ఇతరులకు మేలుచేయుటయందు, తాత్పర్య = ఆసక్తిగల, వివేకగరిష్ఠులై = వివేకమందు గొప్పవారై

**తాత్పర్యము** : ఉద్ధవా! భగవద్భక్తులు నిరంతర మితరులకు మేలుసేయుటందే యాసక్తిగలవారు. దానిచే వారికి లోకములో మాన్యత లభించుచున్నది. వారు జగత్తును బవిత్ర మొనర్చుచు నట్లు సంచరించుచుందురు.

165.క. అనవుడున్ = అనఁగా, ఉద్ధవుఁడు. అవ్విదురునకున్ ఇట్లనున్. అనఘ! పాపము లేనివాఁడైన యో విదురా! మునివరులున్ = మునులలో శ్రేష్ఠులును, సాక్షాత్, విష్ణునిభుండగు మైత్రేయుఁడును, నిభుడు = సమానుఁడు. తన మనమునన్ తగన్ మనుజగతిన్ వదలన్ తలఁచెన్.

**తాత్పర్యము** : ఉద్ధవుఁడు విదురునితో నన్నాఁడు. "విదురా! సాక్షాద్విష్ణుసమానుఁ లైన మైత్రేయమహర్షి తన మనస్సునందు మనుజగతిని వదలదలఁచినాఁడు.

166.క. హరిన్ మురభేదిన్ = మురాసురుని సంహరించినట్టియు, పరాపరున్ = సగుణనిర్గుణస్వరూపుఁ డైనట్టియు, కరుణాకరున్ = శ్రీకృష్ణుని తలఁచునట్టి, ఘనుఁ డు, అమ్మునికుంజరుకడకేగినన్ = ఆ మునిశ్రేష్ఠునివద్దకుఁ బోయినచో, ఆతఁడున్ = సాత్త్వికజ్ఞానంబున్, కరమర్థిన్ తెలుపున్ = సాత్త్వికజ్ఞానము నుపదేశించును.

**తాత్పర్యము** : మైత్రేయమహర్షి, నిరంతరమును భగవంతుని దలఁచునట్టి గొప్పవాఁ డు. నీవా మునిశ్రేష్ఠుని దర్శించినచో నాతఁడు నీకు సాత్త్వికమైన జ్ఞానము నుపదేశించును.

**167.వ. అని యుద్ధవుండు విదురం గూడిచని -**

168.ఉ. అంతటన్ బుధముఖ్యుఁడు యమునన్ కాంచెన్. ఆ యమున యెట్టిదో చెప్పుచున్నాఁడు. హల్లక = ఎఱ్ఱకలువలు, "హల్లకం రక్తసంధ్యకం" - అమరము, ఫుల్ల = వికసించిన, పద్మ = పద్మములనుండి నిష్యంద = జారుచున్న, మరందపాన = తేనెలుద్రావుటచేత, విలసత్ + మద = ఎక్కువగా మదించిన, భృంగ = తుమ్మెదలు గలట్టియు, చలత్తరంగన్ = చలించుచున్న అలలుగలట్టియు, మాకంద = మామిడి, లవంగ = లవంగములు, లుంగ = పుల్లమాదీఫలము - వీనియొక్క, లతికాచయ = లతాసమూహములతోఁ గూడియున్నట్టియు, సురాంగనాశ్రిత ఆనందితపుణ్యసంగన్ - సురాంగనా = దేవతాస్త్రీలచేత, ఆశ్రిత = ఆశ్రయింపఁ బడి, ఆనందిత = ఆనందింపఁజేయఁబడిన, పుణ్యసంగన్ = పుణ్యముతోడి సంబంధముగలదియు, భవభంగన్ = సంసారమును బోఁగొట్టునట్టిదియు, యమునన్ కాంచెన్.

**తాత్పర్యము** : ఆ విదురుఁడు యమునానదిని జూచెను. ఆ యమునలో వికసించిన హల్లకములు, ఫుల్లములైన పద్మములు, వానితేనెలను గ్రహించి మదించిన తుమ్మెదలు దిరుగుచుండెను. చలించుచున్న యలలు, గట్టులందు మాకంద లవంగాది లతాసమూహములు. దేవతాస్త్రీలు యమునలో స్నాన మొనర్చి పుణ్యము సంపాదించికొనుటకై వచ్చుచుండిరి. అట్టి పుణ్యముతోఁ గూడినది నది, స్నానపానాదులతో సంసారదుఃఖమును బోఁగొట్టును. అట్టి యమునను విదురుఁడు చూచెను.

169.క. కని డాయన్ ఏగి మోదంబునన్ = సంతోషముతో, తత్ సరిత్ + అమలపుణ్యభూములన్ = ఆ నదియొక్క యిసుకనేలలందు, వనజోదరపాదపద్మ వశమానసుఁడై = కృష్ణునిపాదపద్మములనే ధ్యానించుచున్న మనస్సుగలవాఁడై, ఆ దినశేషమున్ నివసించెను = ఆ దినమును గడపినాఁడు.

**తాత్పర్యము** : ఆ నదిని సమీపించి దాని విమలములైన పులినభూములలోఁ గృష్ణపరమాత్మను ధ్యానించుచు రాత్రి నచ్చట గడపినాఁడు.

170.క. మఱునాఁడు రేపకడన్ = మరుసటినాఁడు తెల్లవారి, భాసురపుణ్యుఁడు = గొప్పపుణ్యముగలవాఁడు. మధునిషూదన = శ్రీమహావిష్ణువుయొక్క, చరణస్మరణ = చరణములను స్మరించుటయనెడు లీలా = లీలచేత, కలితుఁడు = కూడికొన్నవాఁడు. కలుషగహనదహనన్ = పాపపుటడవులను గాల్చునట్టి, యమునన్ తరియించెన్ = యమునను దాఁటినాఁడు.

**తాత్పర్యము** : మరునాటి ప్రాతఃకాలమున నుద్ధవుఁడు పాపములనెడు నడవులను దహించునట్టి యమునను దాఁటివెళ్ళెను.

171.వ. ఉత్తరించి = దాటి.

**తాత్పర్యము** : ఇట్లుద్ధవుఁడు యమునానదినిదాఁటి బదరికాశ్రమమును జేరెనని విన్న పరీక్షిత్తు శుకు నిట్లు ప్రశ్నించినాఁడు.

172.క. శౌరియున్ = కృష్ణుఁడును, అతిరథవరులునున్ = మహారథ సమరథవరులును, యదుబలాధిపులు ఎల్లన్ = యదుశ్రేష్ఠు లందఱును, పోరి మృతిబొందన్ = కలహించి మరణింపఁగా, ఉద్ధవుఁడు ఏ రీతిన్ బ్రదికెన్ నాకున్ తగన్ ఎఱిఁగింపు.

**తాత్పర్యము** : యాదవులలోని అతిరథులు మరణించిరి. మహారథులు, సమరథులు అందఱును యుద్ధమున మరణించిరి. కృష్ణపరమాత్మ యా దేహమును వదలెను. మఱి యుద్ధవుఁ డెట్లు బ్రదికినాఁడు?

173.సీ. నావుడున్, రాజేంద్రునకున్, శుకయోగీంద్రుఁ డిట్లనున్, ముని పరమేష్ఠిచేతన్ = బ్రహ్మదేవునిచేత, సంప్రార్థితుండైన జలరుహనాభుండు = ప్రార్థింపఁబడిన శ్రీమహావిష్ణువు, జలరుహము నాభియందుగలవాఁడని వ్యధికరణబహువ్రీహి. వసుమతిపైన్, యదువంశమందున్, ఉదయించి తన్ను తాన మదిలోనన్ చింతించి = తనలో తానే యాలోచించుకొని, తెలివంది = నిశ్చయజ్ఞానముగలవాఁడై. ఆత్మీయ కులవినాశము ఒనరించి = తన యదుకులమును సంహరించి, తాను, పంచోపనిషన్మయమగు = ఐదుపనిషత్తుల స్వరూపమైన, దివ్యదేహంబునందున్, చెందం దలఁచి ధరణిమీఁదన్, విజ్ఞానతత్త్వంబున్ తాల్చి, జనకోటికిన్ ఎఱిఁగింపఁ దగిన ధీరుఁడు ఉద్ధవుఁడు దక్క ఇతరులు ఏను ఓవరు = శక్తులుగారు. ఇతఁడు నిర్జితేంద్రియుఁడు = ఇంద్రియములను జయించినవాఁడు. ఆత్మసన్నిభుఁడు = తనతో సమానుఁడు.

**తాత్పర్యము** : పరీక్షిత్తుతో శుకబ్రహ్మ యనుచున్నాఁడు, పరమేష్ఠిచే సంప్రార్థితుఁడైన శ్రీమహావిష్ణువు భూభారహరణార్థమై యదువంశమందు జన్మించెను. యాదవులు మహావీరులు, వీరి వినాశ మెట్లని యాతఁడు తలపోసెను. చింతించి యొకనిర్ణయమునకు వచ్చినాఁడు. మునిశాపవ్యాజముతో యదువంశమును నాశ మొనరించినాఁడు. తరువాతఁ దన దేహమును జాలింపఁ దలఁచెను. కాని తన తరువాత తనకు సంబంధించిన జ్ఞానమును జనులకు బోధింపఁగల శక్తిగలవాఁ డెవ్వఁడు? తా నుండుటకు వీలులేదు. ఇతరులకు ఆ యనుభూతి లేదు. ఉద్ధవుఁ డొక్కఁడే తగినవాఁడు. అతఁడు నిర్జితేంద్రియుఁడు. సర్వరీతులఁ దనతో సమానుఁడు.

174.క. క్షితిపై నిలిపిన కతమునన్ = భూమిపై నాతని నుండుమని కోరినందువలన, అతనికిన్ మృతిదొరకదయ్యెన్. అవనీశ రమాపతియభిమానము గల్గిన = భగవదనుగ్రహమును బొందిన, అతిపుణ్యుఁడు = పరమపుణ్యుఁడైన యుద్ధవుఁడు, బదరికాశ్రమమునకున్ చనియెన్.

**తాత్పర్యము** : ఉద్ధవుని భూమిపై నుండవలసినదని పరమాత్ముఁడు గోరెను. అందుకే యాతనికి మృత్యువు గలుగలేదు. పరమాత్మయనుగ్రహమును బొందిన యుద్ధవుఁడు బదరికాశ్రమమునకుఁ బోయెను.

175.వ. అంత.

176.క. ఉద్ధవుఁ డరిగిన పిదపన్, సమిద్ధపరిజ్ఞానున్ = గొప్పజ్ఞానము గలిగినట్టియు, వృద్ధజనసేవ్యున్ = జ్ఞానవయోవృద్ధులచేత పూజింపఁదగినట్టియు, తాపసవృద్ధశ్రవున్ = మునిశ్రేష్ఠుఁడైన, మైత్రేయున్ చూడన్ కోరి = మైత్రేయుని దర్శించుటకై విదురుఁడు, కడఁకన్ = యత్నముతో.

**తాత్పర్యము** : ఉద్ధవుఁడు చనిన యనంతరము విదురుఁడు మైత్రేయునిఁ జూడనెంచినాఁడు. మైత్రేయుఁడు పరిపూర్ణజ్ఞాని. జ్ఞానవయోవృద్ధులచే గౌరవింపఁబడినవాఁడు. మునిశ్రేష్ఠుఁడు.

177.వ. యమునానదిందాఁటి కతిపయప్రయాణంబులన్ = కొన్నిప్రయాణములతో, పుణ్యనదులు హరిక్షేత్రంబులు దర్శించుచు అతిత్వరితగమనంబునన్ = శీఘ్రములైన నడకలతో-

178.క. చనిచని ముందటన్, కనుఁగొనెన్, ఘనపాపతమఃపతంగన్ = గొప్పపాపములనెడు చీఁకటికి సూర్యునితో సమానమైనదియు, కరుణాపాంగన్ = దయతోఁగూడిన చూపులుగలదియు, కనత్ + ఉత్తుంగతరంగన్ = ప్రకాశించుచున్న గొప్పఅలలుగలదియు, జనవరనుతబహుళపుణ్యసంగన్ = జనులచే పొగడఁబడిన పుణ్యములు గల, గంగన్ కనుఁగొనెను.

**తాత్పర్యము** : అతడు గంగను జూచినాఁడు. ఆ నది పాపములను చీఁకటులకు సూర్యునితో సమానమైనది. జనులచేత పొగడఁబడెడు పుణ్యముల కాకరమైనది.

179.క. అందున్ = ఆ నదిలో, అరవింద = పద్మములయొక్క, సౌరభ = వాసనలచేత, నందిత = సంతోషమును గల్గించెడు, పవమాన = వాయువుచేత, ధూత = కదల్పబడిన, నటత్ + ఊర్మి = చలించుచున్న అలలచేత, పరిస్పందిత = కదల్పఁబడిన, కందళశీకర = మొలకలవంటి నీటితుంపురులయొక్క, సందోహ = గుంపుచేత, లసత్ = ప్రకాశించుచున్న, ప్రవాహజల = నదీజలములందు, మజ్జనుఁడై = స్నాన మొనర్చినవాఁడై.

**తాత్పర్యము** : పద్మములలోని సువాసనలచేత మారుతములు గూడియుండెను. అట్టిగాలు లానదియందలి తరంగములను జలింపఁజేయుచుండెను. ఆ తరంగములనుండి శీకరములు లేచుచుండెను. ఆ శీకరములు చల్లనివై మొలకలవలె శరీరములను దాఁకుచున్నవి. అట్టి యా గంగాప్రవాహమం దాతఁడు స్నాన మొనర్చినాఁడు.

180.స. ఘనసారరుచి = పచ్చకర్పూరమువంటి కాంతిగల, వాలుకా = ఇసుకచేత, సముదంచిత = కూడియున్న, సైకతవేదికాస్థలమునందున్ = ఇసుకదిబ్బలనెడు నరుగుపైన, యమ నియమాది యోగాంగక్రియానిష్ఠన్ పూని = యమము, నియమము మొదలైన యోగనియమముల ననుసరించుచున్నవాఁడై, పద్మాసనాసీనుఁడగుచున్ = పద్మాసనమునఁ గూర్చున్నవాఁడై, హరిపాదసరసీరుహ న్యస్త చిత్తుఁడై = విష్ణుపాదపద్మములందుంచఁబడిన మనస్సుగలవాఁడై, బాహ్య + ఇంద్రియవ్యాప్తిన్ పాఱన్‌తోలి = ఇంద్రియములను విషయములపైకిఁ బాఱనీక నియమించినవాఁడై, సకలవిద్వజ్జనస్తవనీయ = సమస్తజ్ఞానులచేఁ బొగడఁదగిన, సముచిత + ఆచార = తగిన ఆచారము, వ్రత = వ్రతములు, ఉపవాసములు - వీనిచేత, క్రుస్సి = కృశించి, ఉన్నపుణ్యాత్మున్, విగత వయోవికారున్ = వయస్సుచే నేర్పడెడు వికారములు లేనట్టివాఁడు. వినుతసంచారున్ = పొగడఁదగిన సంచారములుగలట్టియు, భువనపావనవిహారున్ = ప్రపంచమును బవిత్ర మొనర్చు విహారములు గలట్టియు, యోగిజనగేయున్ = యోగిజనులచేఁ బొగడఁబడినట్టియు, సత్ + **తతిభాగధేయున్** = సత్పురుషులకు భాగ్యమువంటివాఁడును.

**తాత్పర్యము** : పచ్చకర్పూరము కాంతిగల యిసుకతిన్నె. ఆ తిన్నెపై మైత్రేయుఁడున్నాఁడు. అతఁడు పద్మాసనమున నుండెను. యోగాంగములైన యమ నియమాదు లన్నిటిని జక్కగా ననుసరించినవాఁ డాయన. అతని మన స్సెప్పుడును గృష్ణపరమాత్మయందే లీనమై యుండెను. బాహ్యవిషయములనుండి యింద్రియములను మరలించికొన్నాఁడు. వ్రతములు, ఉపవాసములు, ఆచారములు - వీనితో నాతనిశరీరము కృశించియుండినది. ఆతనిశరీరముపై వయోవికారములు గన్పించుటలేదు. సత్పురుషుల కాతఁడు భాగ్యము. భువనపావనవిహారములు గలవాఁడు. అట్టి యా మైత్రేయుని విదురుఁడు దర్శించినాఁడు.

**ఇది పుట్టపర్తి నారాయణదాసకృత భాగవత సుధాలహరియందు తృతీయస్కంధమున నాల్గవయధ్యాయము.**

# భాగవత సుధాలహరి
## తృతీయస్కంధము
## పంచమాధ్యాయము

శ్రీ శుక ఉవాచ -

ద్వారి ద్యునద్యా ఋషభః కురూణాం
మైత్రేయ మా సీన మగాధబోధమ్,
క్షత్తోపసృత్యాఽచ్యుతభావశుద్ధః
పప్రచ్ఛ సౌశీల్యగుణాభితృప్తః. 1

శ్రీవిదుర ఉవాచ -

సుఖాయ కర్మాణి కరోతి లోకో
న తైః స్సుఖం వాఽన్య దుపారమం వా,
విన్దేత భూయ స్తత ఏవ దుఃఖం
యదత్ర యుక్తం భగవా న్వదే న్నః. 2

జనస్య కృష్ణా ద్విముఖస్య దైవా
దధర్మశీలస్య సుదుఃఖితస్య,
అనుగ్రహాయేహ చరంతి నూనం
భూతాని భవ్యాని జనార్దనస్య. 3

తత్సాధువర్యాదిశవర్త్మ శం న
స్సంసాధితో భగవా న్యేన పుంసామ్,
హృది స్థితో యచ్ఛతి భావపూతే
జ్ఞానం స్వతత్త్వాధిగమం పురాణమ్. 4

కరోతి కర్మాణి కృతావతారో
యా న్యాత్మతన్త్రో భగవాం స్త్ర్యధీశః,
యథా ససర్జాగ్ర ఇదం నిరీహ
స్సంస్థాప్య వృత్తిం జగతో విధత్తే. 5

యథా పున స్స్వే ఖ ఇదం నివేశ్య
శేతే గుహాయాం స నివృత్తవృత్తిః,
యోగేశ్వరాధీశ్వర ఏక ఏత
దనుప్రవిష్టో బహుధా యథాఽఽసీత్. 6

క్రీడ న్విధత్తే ద్విజగోసురాణాం
క్షేమాయ కర్మా ణ్యవతారభేదైః,
మనో న తృప్య త్యధిశృణ్వతాం న
స్సుశ్లోకమౌళే శ్చరితామృతాని. 7

యై స్తత్త్వభేదై రధిలోకనాథో
లోకా నలోకాన్ సహ లోకపాలాన్,
అచీక్ల్ప పద్యత్ర హి సర్వస త్త్వని
కాయభేదాధికృతః ప్రతీతః. 8

యేన ప్రజానా ముత ఆత్మకర్మ
రూపాభిధానాం చ భిదాం వ్యధత్త,
నారాయణో విశ్వసృగాత్మయోని
రేత చ్చ నో వర్ణయ విప్రవర్య. 9

పరావరేషాం భగవ న్వ్రతాని
శ్రుతాని మే వ్యాసముఖా దభీక్ష్ణమ్
అతృప్నుమః క్షుల్లసుఖావహానాం
తేషా మృతే కృష్ణకథామృతౌఘాత్. 10

క స్తృప్నుయా త్తీర్థపదోఽభిధానా
త్సత్రేషు వస్సూరిభి రీడ్యమానాత్,
యః కర్ణనాడీం పురుషస్య యాతో
భవప్రదాం గేహరతిం ఛిన త్తి. 11

ముని ర్వివక్షు ర్భగవద్గుణానాం
సఖాపి తే భారత మాహ కృష్ణః,
అస్మి న్నృణాం గ్రామ్యసుఖానువాదే
మతి ర్గృహీతాఽను హరేః కథాయామ్. 12

సా శ్రద్దధానస్య వివర్ధమానా
విర క్త మన్యత్ర కరోతి పుంసః,
హరేః పదానుస్మృతినిర్వృతస్య
సమ స్తదుఃఖాప్యయ మాశు ధ త్తే. 13

తాన్ శోచ్యశోచ్యా నవిదోఽనుశోచే
హరేః కథాయాం విముఖా నఘేన,
క్షిణోతి దేవోఽనిమిష స్తు యేషా
మాయు ర్వృథావాదగతిస్మృతీనామ్. 14

తదస్య కౌషారవశర్మదాతు
ర్హ రేః కథా మేవ కథాసు సారమ్,
ఉద్ధృత్య పుష్పేభ్య ఇవాఽఽర్తబంధో
శివాయ నః కీర్తయ తీర్థకీ ర్తేః. 15

స విశ్వజన్మస్థితిసంయమార్థే
కృతావతారః ప్రగృహీతశ క్తిః,
చకార కర్మాణ్యతిపూరుషాణి
యానీశ్వరః కీర్తయ తాని మహ్యమ్.

శ్రీ శుక ఉవాచ -

ఏవం స భగవాన్ పృష్టః క్షత్త్రా కౌషారవో మునిః,
పుంసాం నిశ్శ్రేయసార్థాయ త మాహ బహుమానయన్. 1"

మైత్రేయ ఉవాచ -

సాధు పృష్టం త్వయా సాధో లోకాన్ సాధ్వనుగృహ్ణతా,
కీర్తిం వితన్వతా లోక ఆత్మనాఽధోఽక్షజాత్మనః. 18

నై తచ్చిత్రం త్వయి క్షత్త ర్బాదరాయణవీర్యజే,
గృహీతోఽనన్యభావేన య త్త్వయా హరి రీశ్వరః. 19

మాండవ్యశాపా ద్భగవా న్ప్రజాసంయమనో యమః,
భ్రాతృక్షేత్రే భుజిష్యాయాం జాత స్సత్యవతీసుతాత్. 20

భవా న్భగవతో నిత్యం సమ్మత స్సానుగస్య హి,
యజ్ఞా నాదేశాయ చ మా మాదిశ ద్భగవా న్ప్రజన్. 21

అథ తే భగవల్లీలా యోగమాయోపబృంహితాః,
విశ్వస్థిత్యుద్భవాంతార్థా వర్ణయా మ్యానుపూర్వ్యశః. 22

భగవా నేక ఆసేద మగ్ర ఆత్మాఽఽత్మనాం విభుః,
ఆత్మేచ్ఛానుమతా వాత్మా నానామత్యుపలక్షితః. 23

స వా ఏష తదా ద్రష్టా నాపశ్య ద్దృశ్య మేకరాట్,
మేనేఽసంత మివాఽఽత్మానం సు ప్తశ క్తి రసు ప్తదృక్. 24

సా వా ఏతస్య సంద్రష్టు శ్శ క్తి స్సదసదాత్మికా,
మాయానామ మహాభాగ యయేదం నిర్మమే విభుః. 25

కాలవృత్త్యా తు మాయాయాం గుణమయ్యా మధోఽక్షజః
పురుషేణాఽఽత్మభూతేన వీర్య మాధ త్త వీర్యవాన్. 26

తతోఽభవ న్మహ త్తత్త్వ మవ్యక్తా త్కాలచోదితాత్,
విజ్ఞానాత్మాఽఽత్మదేహస్థం విశ్వం వ్యంజం స్తమోనుదః. 27

సోఽప్యంశగుణకాలాత్మా భగవద్దృష్టిగోచరః,
ఆత్మానాం వ్యకరో దాత్మా విశ్వ స్యాస్య సిసృక్షయా. 28

మహ త్తత్త్వాద్వికుర్వాణా దహం తత్త్వ మజాయత,
కార్యకారణకర్త్రాత్మా భూతేంద్రియమనోభవః. 29

వై కారిక స్తైజస శ్చ తామస శ్చే త్యహం త్రిధా,
అహం తత్త్వా ద్వికుర్వాణా న్మనో వై కారికా దభూత్. 30

వై కారికా శ్చ యే దేవా అర్థాభివ్యంజనం యతః,
తై జసా నీంద్రియా ణ్యేవ జ్ఞానకర్మమయాని చ. 31

తామసో భూతసూక్ష్మాది ర్యత స్తల్లింగ మాత్మనః,
కాలమాయాంశయోగేన భగవ ద్వీక్షితం నభః.
నభసోఽనుసృతం స్పర్శం వికుర్వ న్నిర్మమేఽనిలమ్,
అనిలోఽపి వికుర్వాణో నభసోరుబలాన్వితః. 32
ససర్జ రూపతన్మాత్రం జ్యోతిర్లోకస్య లోచనమ్. 33
అనిలే నాన్వితం జ్యోతి ర్వికుర్వత్పరవీక్షితమ్,
ఆధత్తా ఽమ్భోరసమయం కాలమాయాంశయోగతః. 34
జ్యోతిషాఽ మ్భోఽనుసంసృష్టం వికుర్వ ద్బ్రహ్మ వీక్షితమ్,
మహీం గంధగుణా మాధా త్కాలమాయాంశయోగతః. 35
భూతానాం నభఆదీనాం యద్య ద్భవ్య పరాత్పరమ్,
తేషాం పరానుసంసర్గా ద్యథాసంఖ్యం గుణా న్విదుః. 36
ఏతే దేవాః కలా విష్ణోః కాలమాయాంశలింగినః,
నానాత్వా త్స్వక్రియా నీశాః ప్రోచుః ప్రాంజలయో భృశమ్. 37

దేవా ఊచుః -

నమామి తే దేవ పదారవిందం
ప్రపన్నతాపోపశమాతపత్రమ్,
యన్మూలకేతాయతయోఽంజసోరు
సంసారదుఃఖం బహి రుత్క్షిపంతి. 38

ఋతే యద స్మిన్భవ ఈశ జీవా
స్తాపత్రయేణాఽభిహతా న శర్మ,
ఆత్మన్ లభంతే భగవం స్తవాంఘ్రి
చ్ఛాయాం స విద్యా మత ఆశ్రయేమ. 39

మార్గంతి య త్తే ముఖపద్మనీడై
శ్ఛందస్సుపర్ణై ర్ఋషయో వివి క్తే
యచ్ఛాఘమర్షో దసరిద్వరాయాః
పదం పరం తీర్థపదః ప్రసన్నాః. 40

యచ్ఛ్రద్ధయా శ్రుతవత్యా చ భక్త్యా
సంమృజ్యమానే హృదయేఽవధార్య,
జ్ఞానేన వైరాగ్యబలేన ధీరా
వ్రజేమ తత్తేంఘ్రిసరోజపీఠమ్. 41

విశ్వస్య సర్గస్థితిసంయమార్థే
కృతావతారస్య పదాంబుజం తే,
వ్రజేమ సర్వే శరణం యదీశ
స్మృతం ప్రయచ్ఛ త్యభయం స్వపుంసామ్. 42

య త్సానుబంధే సతి దేవ దేహే
మమాఽహ మిత్యూఢదురాగ్రహాణామ్,
పుంసాం సుదూరం వసతోపి పుర్యాం
వ్రజేమ త త్తే భగవ న్పదాబ్జమ్. 43

తా న్వా అసద్వృత్తిభి రక్షిభి ర్యే
పరాహృతాన్తర్మనసః పరేశ,
అథో న పశ్యంత్యురుగాయ నూనం
యే తే పదన్యాసవిలాసలక్ష్మ్యాః. 44

పానేన తే దేవకథాసుధాయాః
ప్రవృద్ధభక్త్యా విశదాశయా యే,
వై రాగ్యసారం ప్రతిలభ్య బోధం
యథాఽఞ్జసాన్వీయ రకుంఠధిష్ణ్యమ్. 45

అథాఽపరే చాత్మసమాధియోగ
బలేన జిత్వా ప్రకృతిం బలిష్ఠామ్,
త్వా మేవ ధీరాః పురుషం విశంతి
తేషాం శ్రమ స్స్యా న్నతు సేవయా తే. 46

త త్తే వయం లోకసిసృక్షయాఽఽద్య
త్వయాఽనుసృష్టా స్త్రిభి రాత్మని స్వే,
సర్వే నియుక్తా స్స్వవిహారతంత్రం
న శక్నుమ స్తత్ప్రతిహ ర్తవే తే. 47

యావ ద్బలిం తేஉజహరామ కాలే
యథా వయం చాన్న మదామ యత్ర,
యథోభయేషాం త ఇమే హి లోకా
బలిం హరన్తోஉన్న మద న్త్యనూహా:. 48

త్వం న స్సురాణా మపి సాన్వయానాం
కూటస్థ ఆద్య: పురుష: పురాణ:,
త్వం దేవ శక్త్యాం గుణకర్మయోనౌ
రేత స్త్వజాయాం కలి మాదధేஉజ:. 49

త త్తే వయం సత్త్రముఖా యదర్థే
బభూవి మాత్మన్ కరవామ కిం తే,
త్వం న స్స్వచక్షు: పరిదేహి శక్త్యా
దేవక్రియార్థే త్వదను గ్రహాణామ్. 50

ఇతి శ్రీమద్భాగవతే, మహాపురాణే, పారమహంస్యాం, సంహితాయాం,
తృతీయస్కంధే, పంచమోஉధ్యాయ:.

**1. శ్లో** : కురూణాం బుషభ: = కౌరవులలో శ్రేష్ఠుఁడును, అచ్యుతభావశుద్ధ: = కృష్ణుని యం దనుసరింపఁబడిన భక్తి చేత నిత్యపరిశుద్ధుఁడును, క్షత్తా = క్షత్రియుఁడైన విదురుఁడు, ద్యునద్యాఃద్వారి = గంగాద్వారమందు, ఆసీనం = ఉన్నట్టి, అగాధబోధం = అగాధమైన జ్ఞానముగలిగినట్టియు, మైత్రేయం = మైత్రేయమహామునిని గూర్చి, ఉపసృత్య = సమీపమునకు వచ్చి, సౌశీల్యగుణాభితృప్త: = ఆతని సౌశీల్యగుణముచే నెక్కువగాఁ బరితృప్తినందినవాఁడై ,పప్రచ్ఛ = ఇట్లని యడిగెను.

**తాత్పర్యము:** శుకబ్రహ్మయన్నాఁడు. "కురువంశమందు జన్మించినవారిలో శ్రేష్ఠుఁడును, కృష్ణభక్తితో విశుద్ధుఁడైన విదురుఁడు - హరిద్వారమను పేరుగల సుప్రసిద్ధమైన గంగాద్వారమందున్న పరమజ్ఞానియైన మైత్రేయుని సమీపించినాఁడు. ఆ మహర్షిసౌశీల్యాదులతో నుద్ధవుఁడెంతయో సంతుష్టుఁడయ్యెను. అతఁడిట్లు ప్రశ్నించెను. విదుర ఉవాచ = విదురుఁడనెను.

2. శ్లో : లోకః = లోకము, సుఖాయ = సుఖము కొఱకై, కర్మాణి = కర్మములను, కరోతి = చేయుచున్నది. తైః = ఆ చేయఁబడెడి కర్మల చేత, సుఖంవా = సుఖముగాని, అన్యదుపారమం వా = దుఃఖమునుండి విడివడిగాని, న విందతే = పొందుట లేదు. తత ఏవ = ఆ కార్యాచరణముచేతనే, దుఃఖం = దుఃఖముప్రాప్తించుచున్నది. అత్ర = ఈ లోకమందు, యత్‌యుక్తం = ఉచితమైనదేది యని, భగవాన్ = గొప్పవాఁడైన నీవు, నః = మమ్ము గూర్చి, వదేత్ = చెప్పుదువుగాక!

**తాత్పర్యము** : విదురుఁ డన్నాడు. గొప్ప వాఁడవైన మైత్రేయా! లోకమందు సుఖము నాకాంక్షించి జనులు కర్మప్రవృత్తు లగుచున్నారు. కాని యా కర్మాచరణముచే వారికి సుఖము లభించుట లేదు. దుఃఖనివృత్తియుఁగలుగుట లేదు. అంతమాత్రమే గాదు. ఆ కర్మాచరణముచేత మఱియొక క్రొత్తదుఃఖ మేర్పడుచున్నది. కనుక మానవుఁడీ లోకమం దెట్లు ప్రవర్తింపవలెను. దయచేసి నాకీ విషయము నుపదేశింపవలెను. 'నః' అను బహువచనము ప్రత్యక్షముగ నడుగుచున్నవాఁడు విదురుఁడే యైనను అనేకులకు సంబంధించిన దీ ప్రశ్న యని తెలుపుచున్నది.

3. శ్లో : తత్ = అందుచేత, సాధువర్య! = సత్పురుషులలో నుత్కృష్టుఁడైనవాఁడా! యేన = ఏ మార్గముతో, సంరాధితః = చక్కగా నారాధింపఁబడిన, భగవాన్ = భగవంతుఁడైన శ్రీహరి, భక్తిపూతే = భక్తితోఁబరిశుద్ధమైన, పుంసాం = పురుషుల యొక్క, హృది = మనస్సునందు, స్థితః = ఉన్నవాఁడై, సతత్త్వాధిగమం = తత్త్వము యొక్క జ్ఞానముచేఁ గూడిన, పురాణ = ప్రాచీనమైన, జ్ఞానం = జ్ఞానమును, యచ్ఛతి = ఇచ్చునో, శం = సుఖకరమైన, వర్త్మ = మార్గమును, నః = మాకు, ఆదిశ = ఉపదేశింపుము.

**తాత్పర్యము** : సాధువుల సంచారము లోకానుగ్రహము కొఱకే. అందుచేత సాధువులలో నుత్తముఁడవైన యో మైత్రేయ మహర్షీ! ఏ రీతిగా నారాధించినచో భక్తితో పరిశుద్ధమైన పుణ్యాత్ముల మనస్సులందున్న భగవంతుఁడు తత్త్వజ్ఞానమున కుపకరించెడు ప్రాచీన జ్ఞానము నుపదేశించును? సుఖకరమైన యా మార్గమును మీరు మాకుఁ జెప్పవలెను.

4. శ్లో : త్ర్యధీశః = త్రిమూర్తులనుగూడ నియమించు వాఁడును, ఆత్మతంత్రః = స్వతంత్రుఁడును, కృతావతారః = అవతారమును స్వీకరించినవాఁడునునైన, భగవాన్ నారాయణమూర్తి, యాని కర్మాణి = ఏ కర్మములను, కరోతి = ఆచరించునో, నిరీహః = ప్రవృత్తి రహితుఁడైన భగవంతుఁడు, ఇదం = ఈ ప్రపంచమును, అగ్రే

= ఆదియందు, యథా ససర్జ = ఏ విధముగా సృష్టించెనో, వృత్తిం = ఉపజీవనమును, జగతః = లోకమునకు, సంస్థాప్య = ప్రతిష్ఠాపించి, యథావిధత్తే = ఏ ప్రకారముగా రక్షించును.

**తాత్పర్యము** : త్రిగుణాధిష్ఠితమైన మాయకును త్రిగుణస్వరూపులైన త్రిమూర్తులకును అధీశ్వరుఁడైనవాఁడు నారాయణమూర్తి. మాయ నతిక్రమించియున్న వాఁడగుటతో సర్వస్వతంత్రుఁడు, ఏ కార్యము నొనర్పనివాఁడు. మఱి యవతారముల నెందుకు స్వీకరించినట్లు? ఆ యవతారములలోఁ గర్మము లెందు కొనర్చినట్లు? వీని రహస్యమేమి? ఆది యందు భగవంతుఁడీ లోకము నెందుకు సృష్టించినాఁడు? ఉపజీవనమార్గమును గల్పించిన పద్ధతి యెట్టిది? ఎట్లీ లోకములను రక్షించుచున్నాఁడు?

**5. శ్లో** : దైవాత్ = కర్మపరిపాకము నిమిత్తముగా, కృష్ణాత్ = కృష్ణపరమాత్మనుండి, విముఖస్య = విముఖుఁడును, అధర్మశీలస్య = అధర్మస్వభావము గలవాడును, సుదుఃఖితస్య = ఎక్కువ దుఃఖితుఁడునైన, జనస్య = జనుని యొక్క, అనుగ్రహాయ = అనుగ్రహము కొఱకే, జనార్దనస్య = కృష్ణపరమాత్మ యొక్క, భవ్యాని = మంగళస్వరూపములైన, భూతములు, ఇహ= ఈ లోకమందు, చరం = సంచరించుచుండునుగదా!

**తాత్పర్యము** : జన్మాంతరమం దొనర్చిన పుణ్యకర్మపరిపాకముతోఁ గృష్ణభక్తి యేర్పడును. పాపకర్మనిమిత్తముగా కృష్ణభక్తి సిద్ధింపక అధర్మములందుఁ దాత్పర్యము సిద్ధించి తన్నిమిత్తముగా నితరదుఃఖము లనుభవించి కళవళపడుచున్న జనసముదాయమును అనుగ్రహించి వారిని సన్మార్గమునఁ ద్రిప్పుటకొఱకై మంగళకరములైన కర్మములు మాత్రమే యొనర్చెడు భగవద్భక్తు లీ లోకమున సంచరించుచుందురు. అట్టి వారిలో శ్రేష్ఠుఁడవైన నీవు మ మ్మనుగ్రహింపవలెనని ప్రార్థన.

**6. శ్లో** : పునః = మరల, స్వేఖే = స్వరూపభూతమైన యాకాశమందు, ఇదం = దీనిని, నివేశ్య = ప్రవేశింపఁజేసి, నివృత్త వృత్తిః = సర్వధా నివృత్తమైన వ్యాపారముతోఁ గూడినవాఁడై, గుహాయాం = గుహయందు, యథా = ఏ రీతిగా, శేతే = శయనించును?, యోగేశ్వరాధీశ్వరః = యోగేశ్వరులకు నాథుఁడై యున్న, ఏకః = ఎక్కటియైన భగవంతుఁడు, ఏతత్ = దీనియందు, అనుప్రవిష్టః = అనుప్రవేశించినవాఁడై, యథా = ఏ రీతిగా, బహుధా = బహుప్రకారుఁడై, ఆసీత్ = అయ్యెను.

**తాత్పర్యము :** భగవంతుఁడైన సర్వేశ్వరుఁడు చక్షుర్విషయమైన యీ సర్వలోకమును దనస్వరూపమైన యాకాశమందు లయింపఁజేసి సకల వ్యాపారములను వదలి స్వానంద మనెడు గుహయందు నిదురించుటెట్లు? యోగీశ్వరుల కధీశ్వరుఁడును, ఎక్కటియునైన భగవంతుఁడు మరల దీనియందుఁ దాను అనుప్రవేశించి బహురూపములుగా గనుపించుట యెట్లేర్పడినది?

**7. శ్లో :** ద్విజగో సురాణాం = బ్రాహ్మణులు, గోవులు, దేవతలు- వీరియొక్క, క్షేమాయ = క్షేమము కొఱకై, అవతారభేదైః = ఒక్కొక్క యవతారరూపమును గ్రహించి, కర్మాణి = కర్మములను, క్రీడన్= లీలామాత్రముగా, విధత్తే = చేయుచున్నవాఁడైన, సుశ్లోకమౌళేః = సత్కీర్తిగలవారిలో శ్రేష్ఠుఁడుగా నున్న వాని యొక్క, చరితామృతాని = అమృతముతో సమానమైన చరితములను, శృణ్వతాం అపి = వినుచున్నవారమైనప్పటికిని, నః మనః = మా మనస్సు, నతృ ప్యతి = తృప్తి నందుట లేదు.

**తాత్పర్యము :** వేదానుసరణముగాఁ గర్మలనొనర్చు బ్రాహ్మణులు, తత్కర్మముల కుపయోగించు క్షీరాదిపదార్థముల నొసఁగెడు గోవులు, కర్మానుసారముగా సస్యాదిమూలమున ఫలముల నిచ్చెడు దేవతలు, వీరికి క్షేమమును గల్గించుటకై భగవంతుఁడప్పుడొక్కొక యవతారమును స్వీకరించును. ఆ యవతారములు ఆయా కాలముల కనుగుణములై యుండును. అతఁడు లీలగాఁ గర్మ లొనర్చును. ఆ కర్మల వివేచనమెట్లు? ఈ సంగతులన్నియు మాకు దయచేసి తెలుపవలెను. భగవచ్చరిత్రములు పరమానందమనెడు నమృతము నిచ్చును. వాని నెంత విన్నను మా మనస్సులకుఁ దృప్తి గలుగదు. ఒక్కొక్క యవతారమం దొనర్చిన కర్మలచేత భగవంతుఁడు పరిశుద్ధమైన కీర్తిని లోకములందు వ్యాపింపఁజేయును. ఆ చరిత్రములు లోకక్షేమమునకై మార్గమును జూపించునవిగా నుండును.

**8. శ్లో :** యత్ర = దేనియందు, అధికృతః = ఏర్పఱుపఁబడియున్న, సర్వసత్త్వనికాయ భేదః = సకలప్రాణుల సంఘభేదము, ప్రతీతః = ప్రత్యక్షముగాఁ గన్పించుచున్నదో, సహలోకపాలాన్ = లోకపాలకులతోఁజేరిన, లోకాన్ = లోకములను, అలోకాన్ = బహిర్లోకములను, అధిలోకనాథః = సకలలోకనాథుఁడైన పరాత్పరుఁడు, యైః తత్త్వభేదైః = ఏ యేతత్త్వభేదముల ననుసరించి, అచీక్లపత్ = ఏర్పఱచెను.

**తాత్పర్యము :** సూర్యప్రకాశ మెంతవఱకు వ్యాపించునో ఆ పరిధికి లోఁబడియున్న జీవరాసులు వసించెడు భాగమునకు 'లోక' మని పేరు. దానికి వేరుగా నున్న అంధకారావృతమైన భాగమునకు 'అలోక' మని పేరు. ఈ లోకమందు వసించెడు

జీవరాసులను సంరక్షించుచున్న యింద్రాది దేవతలకు లోక పాలకులని పేరు. ఈ లోకమందు నివసించెడు ప్రాణివర్గములకు జీవించుట కావశ్యక మైనది సూర్యకాంతి, దానిచేతనే సస్యాదికము లభివృద్ధము లగును. అంధకారావృతములైన లోకములలో నివసించు ప్రాణుల కది యక్కఱ లేదు. అంధకారమందే జీవించెడునట్లు గన్పడుట చేత లోకాలోకములందలి ప్రాణుల జీవనక్రమము విభిన్నముగానుండును. లోకములను సృష్టించెడు వాఁడును, లోకాధీశ్వరుఁడైన భగవంతుఁడు ఏయే జీవుల నేయే తత్త్వముల నెంతెంతపాలు గ్రహించి సృష్టించును? దేవసృష్టి కుపయోగించెడు మహత్తత్త్వము అహంకారతత్త్వము పంచతన్మాత్రలు, వీనిమేళనము- అన్ని జీవులలో నొక్కటిగా నుండదు. అట్లైనచో సృష్టింపఁబడిన ప్రాణివర్గ మంతయు నొక్కరీతిగనే యుండెడిది. బహువిధములుగా నుండుట కవకాశము లేదు. భిన్నధర్మముల ననుసరించెడు ప్రాణులను జూచుచున్నాము. అందుచేత తదుపాదాన కారణములైన భూతముల మేళనములో భేదముండి తీరవలెను. ఏయే భూతముల నెంతెంత పాలు గ్రహించి భగవంతుఁడీ బహువిధ ప్రాణులను సృష్టించినాఁడు? ఉపాదాన కారణమునకు సంబంధించిన దీప్రశ్న.

**9. శ్లో :** ఆత్మయోనిః = తనకుఁ దానే యుత్పత్తిస్థానమైన, విశ్వసృట్ = లోకస్రష్టయైన, నారాయణః = నారాయణుఁడు, ప్రజానాం = ప్రజలయొక్క, యేన = దేని నాస్పదముగా నొనర్చికొని, ఆత్మకర్మరూపాభిధానాం చ = జీవులు, కర్మ, ఆకృతి, నామధేయము - వీనియొక్క, భిదాం = భేదమును, విధత్తే = చేయుచున్నాఁడు? విప్రవర్య! = బ్రాహ్మణ శ్రేష్ఠుఁడా!, ఏతత్చ = దీనిని గూడ, నః = మా కొఱకు, వర్ణయ= వర్ణింపుము.

**తాత్పర్యము:** ప్రాణులు, జీవభేదము, కర్మభేదము, రూప నామ భేదములు ఇట్లుగా నున్న భేదములను లోకస్రష్టయు, స్వయముగా నావిర్భవించిన నారాయణుఁడు స్వసృష్టములైన లోకములందు దేని నాస్పదముగా నొనర్చికొని నిశ్చయించును? బ్రాహ్మణోత్తమా! ఈ విషయమును గూడ మాకు వివరింపుము.

**10. శ్లో :** భగవన్ = గొప్పవాఁడవైన మైత్రేయా! పరావరేషాం = ఉత్కృష్టులును, నికృష్టులునైన వారికి సంబంధించి, వ్రతాని = ధర్మములను, వ్యాసముఖాత్ = వ్యాసమహర్షి యొక్క ముఖము నుండి, అభీక్ష్ణం = ఎక్కువగా, శ్రుతాని = వినఁబడియే యున్నవి. కృష్ణకథామృతాత్ ఋతే = అమృతప్రవాహసదృశమైన కృష్ణకథను వదలి, క్షుల్లసుఖావహానాం = అల్పములైన సుఖములను గల్గించెడు, తేషాం = వానిని గూర్చి, అతృప్నుమః = తృప్తుల మైతిమి.

**తాత్పర్యము :** ఓ మైత్రేయా! బ్రాహ్మణాదులైన యుత్కృష్టుల యొక్కయు, నికృష్టుల యొక్కయు, ధర్మములను వ్యాసముఖము నుండి పలుమారు విన్నాము. తుచ్ఛసుఖముల కాకరమైన యా ధర్మముల నింక వినవలెనను నాశ లేదు. కృష్ణునికి సంబంధించిన చరిత్ర అమృతప్రవాహమువలె పరమానంద జనక మైనది. అందుచే నీవా కృష్ణుని కథలు వర్ణించి మాకుఁ జెప్పుము.

**11. శ్లో :** పురుషస్య = పురుషుని యొక్క, కర్ణనాడీం = కర్ణనాడిని, యాతఃయః = పొందింపఁబడిన యేది, భవప్రదాం = పలుమాఱు సంసారమును గల్గించెడు, గేహరతిం = గృహసుఖాసక్తిని, భినత్తి = నశింపఁజేయునో, వఃసత్రేషు = మీ సభలయందు, సూరిభిః = విద్వాంసులచేత, ఈడ్యమానాత్ = కీర్తింపఁబడుచున్న, తీర్థపదః = భగవంతునియొక్క, అభిధానాత్ = చరిత్రనుండి, కఃతృప్నుయాత్ = ఎవ్వఁడు తృప్తిఁజెందును?

**తాత్పర్యము :** మరల పుట్టుక, మరల మరణము- ఇదియే సంసారము. ఈ సంసార చక్రమునకుఁ గారణమైన గృహాసక్తిని గృష్ణకథాశ్రవణము సమూలముగా నశింపఁజేయును. ఈ శక్తి మఱి దేనికిని లేదు. అందుకే విజ్ఞానులు చేరిన సభలయందు సత్పురుషులు కృష్ణకథాశ్రవణమునే పలుమారు ప్రశంసింతురు. అట్టి యా కథలను వినుటతోఁ దనివిఁ జెందువాఁ డెవఁ డుండును?

**12. శ్లో :** తే సఖా = నీకు సఖుఁడైనవాఁడును, భగవద్గుణానాం = భగవంతుని గుణములను, వివక్షుః = వివరించి చెప్పఁగోర్కె గలిగిన, కృష్ణః మునిః = వ్యాసమహర్షి, భారతం ఆహ = భారతమును వర్ణించెను, యస్మిన్ = దేనియందు, గ్రామ్య సుఖానువాదైః = గ్రామ్యములైన సుఖములను అనువదించుటల చేత, నృణాం మతిః = మనుష్యుల బుద్ధి, హరేః కథాయాం = పరమాత్మకథలయందు, గృహీతా = ఆకర్షింపఁబడును, ను = ఇది నిశ్చయము.

**తాత్పర్యము :** నీకు సఖుఁడైన వ్యాసమహర్షి భారతమను వ్యాఖ్యానమును ముందు వివరించెను. తొట్టతొలుత భారతమును జెప్పినది దేనికి? గ్రామ్యసుఖములను దొలుత వివేచించి వాని పరమార్థము నిర్వచించి జనులను భగవదభిముఖులనుగాఁ జేయుట కొఱకే తొలుత భారతమును జెప్పినాడు. భగవద్గుణ కథాకథనముఁ దొలుతఁజేయలేదు. భారతమందుఁగ్రామక్రోధాది ప్రవృత్తులచేఁ బ్రేరేపింపఁబడిన రాజులు, తుచ్ఛములైన విషయసుఖములకై తమలోఁ దాము గలహింతురు. కడ కేమైనది? వారి జీవితములు నిరాశానిస్పృహలతో తుదముట్టినవి. లౌకిక సుఖములకై

ప్రాకులాడి పరిశ్రమించెడి వారి గతియంతయు నింతే. ఈ పరమార్థమును జనుల మనస్సునకు వచ్చునట్లు చేసి వారిని భగవదున్ముఖులుగాఁ జేయుటయే వ్యాసుని యభిప్రాయము. ఇందుకే యాతఁడు భారతమును దొలుతఁజెప్పినది.

**13. శ్లో :** శ్రద్ధధానస్య = తీవ్రమైన శ్రద్ధగలిగిన, పుంసః = పురుషునకు, సా = అది - హరినిష్ఠమైన బుద్ధి, నిబద్ధమానా = ఎక్కువగా నభివృద్ధినొందుచున్నదై, అన్యత్ర = ఇతర విషయమందు, విరక్తిం = రాగరాహిత్యమును, కరోతి = ప్రదర్శించుచున్నది, హరేః = హరి యొక్క, పదానుస్మృతినిర్వృతస్య = పాదములను క్రమముగా ధ్యానించుట చేత సుఖ మనుభవించుచున్నవానికి, సమస్తదుఃఖాప్యయం = సమస్తదుఃఖవినాశమును, ఆశు = శీఘ్రముగా, ధత్తే = ఏర్పడును.

**తాత్పర్యము :** శ్రద్ధతో హరిస్మరణ మాచరించువానికి నా స్మృతి క్రమముగా వర్ధిల్లుచుఁ బోవును. దానితో నిరతిశయమైన సుఖ మేర్పడును. లౌకిక సుఖభోగసంపాదనావిషయములం దభినివేశము క్రమముగాఁ దగ్గిపోవును. ఈ హరిపాదస్మరణము క్రమముగా నానందము నభివృద్ధిపఱచును. శరీరభావముతోఁ దాపము లేర్పడును. అది శీఘ్రముగ నశించుటచే తన్నిమిత్తకము లైన తాపము లన్నియు నశించును.

**14. శ్లో :** అఘేన = పూర్వజన్మపాపవిశేషముచేత, హరేఃకథాయాం = హరికథయందు, విముఖాన్ = తాత్పర్యములేనట్టి, శోచ్యశోచ్యాన్ = ఎక్కువగా శోచింపఁదగినట్టి, అవిదఃతాన్ = జ్ఞానహీనులైనట్టి వారిని గుఱించి, అనుశోచే = సానుభూతితోదుఃఖింతును. వృథావాదగతిస్మృతీనాం = నిష్ప్రయోజనముగా వాదించుట, అట్లు ప్రవర్తించుట, అట్లు తలఁచుట - ఈ పనులు చేయుచున్న, యేషాం = ఎవరి యొక్క, ఆయుః = ఆయుస్సు, అనిమిషదేవః = కనురెప్పవేయక కాచియున్న దైవము, క్షిణోతి = నశింపఁజేయును.

**తాత్పర్యము :** హరిస్మరణ మొనర్పవలెననెడు విశేషబుద్ధి లేనట్టి పశ్వాదులు శోచ్యములు, వానికాహారనిద్రాదులుదప్ప మఱొక్కటియుఁ దెలియదు. మనుష్య జన్మ మట్టిదిగాదు. దానికి విశేషబుద్ధి యున్నది. అట్టి మానవజన్మ లభించియు, భగవంతునందు భక్తిలేనట్టివారు ఎక్కువగా శోచింపఁదగినవారు. దుర్లభమైన మనుష్యజన్మ లభించియుండఁగా సంసార మహాభయమును నివర్తింపఁజేసి పరమానంద మొసఁగెడి కరుణానిధిని గూర్చి కీర్తించుట, ఈశ్వరప్రీత్యర్థము ప్రవర్తించుట , తత్స్వరూపమును స్మరించుట - మొదలగునవి యొనర్పక,

నిష్ప్రయోజనముగ వాదించుచుఁ గాలక్షేపణ మొనర్చువారి యాయుస్సును, గాలస్వరూపుఁడైన భగవంతుఁడు వారికిఁ దెలియకయే హరించికొనిపోవును. వారిజీవితము పరమపురుషార్థమును సాధించుట కుపయోగపడుట లేదు. వారెంతకాలము జీవించినను వారియాయువు దుర్వ్యయమైనట్లే. ఇట్టి వారిని గూర్చి నా కెక్కువ తాప మగుచున్నది.

**15.శ్లో :** తత్ = అందుచేత, శర్మదాతుః = పరమ సుఖమునిచ్చెడు వాఁడును, ఆర్తబంధోః = దుఃఖితులకు బంధువును, తీర్థకీర్తేః = పరిశుద్ధమైన కీర్తిగలవాఁడైన, హరేఃకథాం ఏవ = హరియొక్క కథనే, కథాసు = కథలయందు, పుష్పేభ్యఇవ = పుష్పముల నుండి వలె, సారంఉద్ధృత్య = సారమును సంగ్రహించి, నః = మా యొక్క, శివాయ = మంగళము కొఱకై, కీర్తయ= కీర్తింపుము.

**తాత్పర్యము :** అందుచేత, నోకౌషారవుఁడవైన మైత్రేయా! భగవంతుఁడనేకములైన యవతారముల నెత్తును. వాని యందుఁబరిశుద్ధములైన వ్యాపారము లెన్నియో యొనర్చును. వానితో నాతని నిర్మలకీర్తి, దిక్కుల వ్యాపించును. తదవతారవ్యాపారములను శ్రవణకీర్తనాదులతో సేవించుచున్న జనులకుఁ బరమానందము సిద్ధించును. నిశ్శేషముగ సంకటములు నశించును. అట్టివి శ్రీహరికథలు. వానిలో సారభూతమైనవానిని బుష్పములనుండి సారము నేర్పఱచెడు భృంగమువలె నీవేర్పఱచి మాకు వచింపుము. ఆ నీకరుణ మాకుఁ గైవల్యపదమును బ్రసాదించును.

**16. శ్లో :** విశ్వజన్మస్థితిసంయమార్థే = లోకము యొక్క యుత్పత్తి, స్థితి, సంహారము - వీని కొఱకై, కృతావతారః = అవతరించినవాఁడును, ప్రగృహీతశక్తిః = ఎక్కువగా గ్రహింపఁబడిన శక్తిచేఁగూడినవాఁడైన, సఃఈశ్వరః = ఆ సర్వేశ్వరుఁడు, అతిపూరుషాణి = మనుష్యచర్యనతిక్రమించెడు, యానికర్మాణి = ఏ కర్మములను, చకార = ఒనర్చెనో, తాని = వానిని, మహ్యం = నా కొఱకు, కీర్తయ = కీర్తింపుము.

**తాత్పర్యము :** లోకసృష్ట్యాదు లనెడు ప్రయోజనములకై ఆయా యవతారములను - వానివానిలో నొనర్పఁదగిన కార్యములను సాధించుటకుఁదగిన శక్తి యనుగ్రహించిన పరమాత్ముఁడు, మానవశక్తికి దుర్లభములైన కార్యము లొనర్చును. వాని నన్నిటిని దయచేసి నాకొఱకై కీర్తింపవలెను.

**17. శ్లో :** క్షత్త్రా = విదురుని చేత, ఏవం పృష్టః = ఈ ప్రకారము ప్రశ్నింపఁబడిన, సః భగవాన్ కౌషారవః మునిః = ఆ మైత్రేయమహర్షి, పుంసాం = పురుషుల యొక్క, నిశ్రేయసార్థేన = పరమపురుషార్థమునుద్దేశించి, తంబహుమానయన్ = అతనిని విశేషముగా నాదరించి, ఆహ = పలికెను.

**తాత్పర్యము :** శ్రీ శుకబ్రహ్మయనుచున్నాఁడు. విదురుని యీ ప్రశ్నను విని కౌషారవుఁడు చాలసంతోషించినాఁడు. ఈ ప్రశ్న కేవలము స్వార్థపరమైనదిగాదు. సకలజనులకును సంబంధించినది. సర్వులకును బరమ పురుషార్థమును సాధించిపెట్టునది. పరమలోకోపకారకము. అందుచే విదురు నాతఁ డెంతయో యాదరించి యిట్లు పలికెను.

**18. శ్లో :** అధోక్షజాత్మనః = అధోక్షజుని యందు మనస్సును సన్నివేశించిన, ఆత్మనః = నీ యొక్క, కీర్తిం = కీర్తిని, లోకే = లోకమందు, వితన్వతా = వ్యాపింపఁజేయుచున్నట్టియు, లోకాన్ = లోకములను, సాధు = చక్కఁగా, అనుగృహ్ణతా = అనుగ్రహించుచున్న, త్వయా = నీ చేత, సాధుపృష్టం = చక్కగాఁ బ్రశ్నింపఁబడినది.

**తాత్పర్యము :** మైత్రేయుఁడన్నాఁడు. ఓ విదురా! నీవు ఇంద్రియములచే గ్రహించుటకు సాధ్యపడని పరమాత్మయందే నిల్పఁబడిన మనస్సుగల భగవంతుఁడవు. లోకానుగ్రహార్థమై ప్రశ్నించిన ప్రశ్న యిది. కేవలము నీ స్వార్థమునకై వేసినది గాదు. దీనితో నీ కీర్తి నల్దిక్కుల వ్యాపించును.

**19. శ్లో :** క్షత్తః = ఓ విదురా! , బాదరాయణవీర్యజే = వ్యాసమహాముని వీర్యముతో జనించిన, త్వయి = నీయందు, ఏతత్ న చిత్రం = ఈ ప్రవర్తనము విచిత్రముగాదు, అనన్యభావేన = అన్యభావనారహితముగా, త్వయా = నీ చేత, ఈశ్వరః హరిః = ఈశ్వరుఁడైన హరి, గృహీతః యత్ = గ్రహింపఁబడెననుటేదిగలదో.

**తాత్పర్యము :** ఓ విదురా! అన్యభావనారహితముగా సర్వేశ్వరుఁడైన హరిని, నీవు మనస్సునందు నిలుపుకొన్నావు. నీ విషయమం దిదియాశ్చర్యముగాదు. ఎందుకనఁగా నీవు వ్యాసపుత్రుఁడవు. "యథాబీజంతథాంకురమ్" - బీజమున్నట్లే యంకురముగూడ నుండును. ఇది లోకసిద్ధముగదా!

**20. శ్లో :** మాండవ్యశాపాత్ = మాండవ్య మహర్షి శాపకారణముగా, ప్రజాసంయమనః = ప్రజలను న్యాయముగా దండించుచున్న, యమః = యముఁడు, భ్రాతుఃక్షేత్రే = సహోదరుని భార్యయైన, భుజిష్యాయాం = దాసియందు, సత్యవతీసుతాత్ = వ్యాసునినుండి, జాతః = ఏర్పడెను.

**తాత్పర్యము :** ఓయి విదురా! నీవు యమధర్మరాజు యొక్క అంశావతారుఁడవు. అందుకే అట్టి భగవద్భక్తి యేర్పడుటలో నాశ్చర్యము లేదు. మాండవ్యముని శాపకారణముగా భగవంతుఁడైన యముఁడు వ్యాసుని సహోదరుఁడైన విచిత్రవీర్యుని భార్యగానున్న దాసియందు - శూద్రస్త్రీయందు వ్యాసవీర్యమునుండి జన్మించినవాఁడవు. ఇట్టిది ప్రసిద్ధమైన నీ జన్మ.

**21. శ్లో :** సానుగస్య = పరివారసహితుఁడైన, భగవతః = పరమపురుషునకు, భవాన్ = నీవు, నిత్యం సమ్మతః = నిత్యసమ్మతుఁడవు, వ్రజన్ = పృథివిని వదలి పోవుచున్న, భగవాన్ = ఈశ్వరుఁడు, యస్య = ఎవని యొక్క, జ్ఞానాదేశాయ = జ్ఞానోపదేశము కొఱకు, మాం = నన్నుగూర్చి, ఆదిశత్ = ఆజ్ఞాపించెనో.

**తాత్పర్యము :** భగవంతుఁడైన కృష్ణుఁడు పరివారసహితుఁడై నీతోఁ గూడిమాడి ప్రవర్తించెను. నీవు నిరంతర మాతనికిఁ బరమసమ్మతుఁడవు. నరలోకమును వదలిపోవుచున్న కృష్ణపరమాత్మ నీకు జ్ఞానోపదేశ మొనర్పవలెనని నన్నాజ్ఞాపించినాడు. ఆయనకు నీపై నున్న యనుగ్రహవిశేష మట్టిది.

**22. శ్లో :** యోగమాయోపబృంహితాః = యోగమాయచేత నభివృద్ధిని బొందినదియు, విశ్వస్థిత్యుద్భవాంతార్థాః = లోకము యొక్క రక్ష,యుత్పత్తి, సంహారము- ఈ ప్రయోజనములతోఁ గూడినవియునైన, భగవల్లీలాః = భగవంతుని లీలలను, ఆనుపూర్వ్యశః = క్రమముగా, తే = నీకు, వర్ణయామి = నేను వర్ణింతును.

**తాత్పర్యము :** అందుచేత యోగమాయాప్రభావముతో నభివృద్ధిగాంచినవియు, లోకముల రక్షాదులే ప్రయోజనముగాఁ గలవియునైన శ్రీహరిలీలలను నీకుఁ గ్రమముగా వివరించెదను.

**23.శ్లో :** ఆత్మనాం = జీవులకు, విభుః = ప్రభువైనవాఁడును, ఆత్మా = ఆత్మస్వరూపుఁడును, భగవాన్ = ఐశ్వర్యసంపూర్ణుఁడును, అనానామత్యుపలక్షితః = నానాత్వబుద్ధినిమిత్తముగాఁగనుపడనివాఁడైయున్నట్టి, ఆత్మా = ఆత్మ, ఆత్మేచ్ఛానుగతౌసత్యాం = తన యిచ్ఛప్రవర్తించెడు విషయముగా, అగ్రే = సృష్టికి ముందే, ఇదం = ఈ కన్పించు సమస్తమును, ఏకః = కేవలుఁడుగనే, ఆస = ఉండెను.

**తాత్పర్యము :** సమస్త జీవాత్మల కాతఁడే ప్రభువు, పరమార్థస్వరూపభూతుఁడు నాతఁడే. సమస్తైశ్వర్యపరిపూర్ణుఁడు, ప్రాణుల నానాత్వబుద్ధితో వారికిఁ గన్పడకుండునట్టివాఁడు. మాయ తన యందే లయించియుండఁగాఁ దనకు మాయాబంధము లేకుండుఁగాక అనెడు నిచ్ఛననుసరించి భగవంతుఁడు కేవలుఁడుగ నుండెను. ఈ కన్పించుచున్న లోకమంతయు సృష్టికి ముందు భగవంతుని యందే యంతర్లీనమై యుండెను.

**విశేషములు :** "ఆత్మావాఇదమేక ఏవాగ్ర ఆసీత్" - అనెడు శ్రుతివాక్యసారము నిక్కడ వివరించుచున్నాఁడు. సృష్టికి ముందు భగవంతుఁడు మాత్రమే యున్నవాఁ

డు, నిత్యమై పరమార్థభూతమై యాత్మస్వరూపుఁడైన భగవంతుఁడు కేవలుఁడు. ఇప్పుడు గన్పించుచున్న యీ సమస్త లోకమును కేవలుఁడుగ నున్న భగవంతునందే యడఁగియుండెను. కేవలుఁడు గానున్న వాఁడును నతఁడే. నానారూపములుఁగా గన్పించుచున్నవాఁడును నతఁడే. ఇట్లు రెండు రూపములుగా నుండుటకుఁ గారణము భగవంతుని యిచ్ఛయే. సృష్టికి మొదలు ఏకరూపుఁడుగా నుండ నిచ్ఛించిన పరమాత్మయే సృష్టికిఁ దరువాత బహురూపుఁడుగా నుండ నిచ్ఛించినదియు. అప్పుడు అంతర్గతమైనలోకమును బహిర్భాగమందుఁ బ్రకాశింపఁజేయును. సృష్టియం దంతయు ననుప్రవేశించి ఒకదానితోఁగూడ సంబంధములేక కేవలుఁడుగనేయుండును. కార్యము లొనర్చియు నకర్మియే. బింబరూపముతోఁ గేవలుఁడైనవాఁడు పరమాత్మ.

**24. శ్లో :** ఏకరాట్ = కేవలుడుగనుండి ప్రకాశించుచున్నవాఁడును, సుప్తశక్తిః = లయించియున్న శక్తితోఁగూడినవాఁడును, అసుప్తదృక్ = లయింపక, జాగృతమైన జ్ఞానముతోఁగూడినవాఁడును, ద్రష్టా = దర్శించువాఁడునునైయున్న, సః ఏషవా = ఆ యితఁడు, ఆత్మానం = తన్ను, అసంతం ఇవ = లేనివానినిగావలె, మేనే = తలఁచెను, దృశ్యం = దర్శింపఁదగినదానిని, న అపశ్యత్ = చూడలేదు.

**తాత్పర్యము :** సృష్టికిముందు నెట్టిస్వరూపముండునని వివరించుచున్నాఁడు సృష్టికిముందు జ్ఞానానందప్రకాశస్వరూపుఁడైన భగవంతుఁడొక్కఁడే యుండెను. జ్ఞానస్వరూపుఁడైన భగవంతుఁడొక్కఁడే యుండెను. జ్ఞానస్వరూపుఁడైనను తన జ్ఞానమునకు విషయముగా వేరుపదార్థ మేదియు లేకుండుటచేత ద్రష్ట యను ధర్మము ఈశ్వరునం దప్పుడు లేదు. కానఁదగిన పదార్థములుగా ఁబరిణమించెడు స్వశక్తియైన మాయ తనయందేలయించి యుండును. లయము, వికాసము రెండును లేవు. అతఁడెప్పుడును సద్రూపుఁడు. కాని దృశ్యము లేకుండుటచేత ద్రష్ట, దృశ్యము, దర్శనము - ఈ రీతిగా నున్న త్రిత్వ మప్పుడు లేదు. ఈ భావము యోగుల నిర్వికల్పసమాధిలో ననుభూత మగును. దీనిని వాక్కుతో వర్ణించుటకు వీలుగాదు.

**25. శ్లో :** సంద్రష్టుః = చక్కగా దర్శించెడు, ఏతస్య = ఇతని యొక్క, సదసదాత్మికా = కార్యకారణస్వరూపమైన, సవాశక్తిః = ఆ ప్రసిద్ధమైన శక్తి, మాయానామ = మాయయనుపేరుగలది, విభుః = ప్రభువైన పరమాత్మ, యయా = దేనిని స్వీకరించి, ఇదం = ఈ ప్రపంచమును, నిర్మమే = సృష్టించెనో.

**తాత్పర్యము :** కేవలుఁడుగా నున్న పరమాత్మ అనేకులుగాఁ గావలెనని యిచ్ఛించెను. ఈ యిచ్ఛయే వేదములలో "ఈక్షణం" అని చెప్పఁబడినది. దీనినే దర్శన మందురు.

ఎప్పుడు వీక్షించునో అప్పుడే ద్రష్ట - యని పేరు గల్గినది. ఈశ్వరుని యీ యీక్షణము ఆతని యందు లయించియున్న శక్తిని వికసింపఁజేయును. "ఇచ్ఛామాత్రం ప్రభో స్సృష్టిః" - ప్రభునైన పరమాత్మని సృష్టి యిచ్ఛతోనే యేర్పడినది. భగవంతున కిచ్ఛ యెప్పు డేర్పడెనో అప్పుడే సృష్టి యారంభమైనది. ఈశ్వరునియందు లయించియున్నది, ఇప్పుడు వికసించినదియు నైన యీ శక్తియే కారణమై కార్యమై యున్నది. అందుకే దీనికి సదసద్రూపమని పేరు. దీనినే మాయ యందురు. ఈ మాయను గ్రహించియే భగవంతుఁడు సృష్టికార్యము నొనర్చుచున్నాఁడు.

26. శ్లో : అధోక్షజః = ఇంద్రియవిషయముగాని యీశ్వరుఁడు, కాలవృత్యాతు = కాలవ్యాపారము చేత, గుణమయ్యాం = గుణస్వరూపిణియైన, మాయాయాం = మాయయందు, ఆత్మభూతేన = ఆత్మయొక్క అంశమైన, పురుషేణ = పురుషుని వలన, వీర్యవాన్ = వీర్యవంతుఁడైన యీశ్వరుఁడు, వీర్యం = తన వీర్యమును, ఆధత్తే = ఆధాన మొనర్చును.

**తాత్పర్యము** : ఏ పదార్థమునైనను రూపాంతర మొందింపఁజేయుశక్తి విశేషమునకు కాలమని పేరు. భూమిలో నొక విత్తును నాటినచోఁ గొన్ని దినములకది యంకురముగాఁ బరివర్తన మందును. తరువాత తీఁగగనో, చెట్టుగనో యభివృద్ధి యగును. దానిని యొక రూపమునుండి వేఱురూపమునకు మార్చుశక్తియే సర్వత్ర సర్వపదార్థములందును, సర్వరీతుల వ్యాపించియున్నది. దీనిని గాలశక్తియందురు. ఈశ్వరునందు లయించి యున్న శక్తి యొక్క ప్రథమావిష్కారమిదే. దీనిపై నేర్పడెడు సర్వవికారములకును నీ శక్తి మూలకందము. దీని వ్యాపారముతోఁ ద్రిగుణము లేర్పడును. అప్పు డీశక్తి గుణస్వరూపముగా భాసించును. గుణముల వికాసముతోఁ గూడిన యీ మాయయందు శక్తుఁడైన భగవంతుఁడు స్వాంశభూతమైన పురుషాంశముతో వీర్యము నాధాన మొనర్చెను. మాయనుండి క్రమముగా నొక్కొక్క తత్త్వమును వికసింపఁజేసెడు శక్తి విశేషమును భగవంతుఁడు మాయయందు నిక్షేపించినాఁడు, సాధారణముగా లోకమందు పురుషుఁడు దన వీర్యమును స్త్రీ యందు నిక్షేపించుటచే నా స్త్రీయందు సంతాన మేర్పడునట్లు - ఈశ్వరుని దృష్టితో మాయ నుండి యొక్కొక్క తత్త్వమును జనించుటకు ఆదికారణభూతమైన కాలశక్తి మొదటిదిగా వికసించినది. అది క్రమముగా ననేక గుణ పదార్థముల జన్మమున కాదికారణ మయ్యెను.

27. శ్లో : కాలచోదితాత్ = కాలము నుండి ప్రేరేపింపఁబడిన, అవ్యక్తాత్ = అవ్యక్తమునుండి, తతః = తరువాత, మహత్తత్త్వం = మహత్తు అను పేరుగల తత్త్వము, అభవత్ = ఏర్పడినది. విజ్ఞానాత్మా = విజ్ఞానమనెడు స్వరూపముతోఁ గూడినదియు, తమోనుదః = చీఁకటిని నశింపఁజేయునదియునైన యాతత్త్వము, ఆత్మదేహస్థం = తన శరీరమందున్న, విశ్వం = విశ్వమును, వ్యంజన్ = ప్రకాశింపఁ జేయునదిగా నయ్యెను.

**తాత్పర్యము** : ఈ రీతిగా నుండునని యీశ్వరవీర్యమును ధరించిన యాశక్తికి అవ్యక్తమని యాస్థితిలోఁ గల్పింపఁబడిన పేరు. స్త్రీ సంతానము, పురుషసంతానము అని తీర్మానించుటకు సాధ్యముగానిస్థితిలోనున్న పురుషవీర్యము, స్త్రీ గర్భమం దున్నట్లుగా నప్పుడు మాయాస్వరూపము నిర్ణయించుట కశక్య మగుటచేత దాని కవ్యక్తమని యప్పటి పేరు. ప్రథమప్రబుద్ధమైన కాలశక్తవ్యాపారముతోఁ దరువాత నవ్యక్తమైన యాశక్తినుండి మహత్తనెడు రెండవతత్త్వము జన్మించినది. దీనినే మహత్తత్త్వమందురు. మహత్తత్త్వమని యెందుకు పేరు? ఇఁకపై నేర్పడెడు సమస్త వికారములకును మూలభూతమైన దిదియే గనుక. దీని గర్భమందే యా శక్తు లన్నియు నిమిడియున్నవని భావము. ఆ వికారము లెన్నియని చెప్పుటకు సాధ్యముగాదు. అవి యనంతములు. 'తత్త్వం' అను శబ్దమునకు ఒకానొకవస్తువు యొక్క భావము లేక స్థితియని యర్థము. కనుక మొదలేర్పడిన యవ్యక్తమే యిప్పుడు మహత్తత్త్వమనెడు స్థితి నందినది. దీనికి బుద్ధితత్త్వమనియు నామాంతరము. దీనికిఁ గారణమేమనఁగా - దీని స్వరూపము, జ్ఞానము. అనఁగా విజ్ఞానమే దీని స్వరూపము. జ్ఞానము ప్రకాశరూప మైనది. జ్ఞానము, ప్రకాశము ఈ రెండు వాక్కులును భిన్నములుగా నున్నను వీనిచే బోధింపఁబడువస్తు వొక్కటే కనుక జ్ఞానము ప్రకాశము ఈ రెండును మహత్తత్త్వము యొక్క స్వరూపములని చెప్పవచ్చును. మహత్తత్త్వము తనయందున్న లోకమును బ్రకాశింపఁజేయు శక్తి గలది. ఆ లోకమును మరపింపఁజేసిన యంధకారము. నీ మహత్తత్త్వముఁ పోద్రోలి దానినిఁ బ్రకాశింపఁజేయును. అందుచేతనే 'తమోనుత్' - అను విశేషణమును జేర్చినది. అజ్ఞానరూపమైన యంధకారమును నశింపఁజేయునది అని యర్థము.

28. శ్లో : సః అపి = ఆ మహత్తత్త్వము, అంశగుణ, కాలాత్మా = అంశము, గుణములు, కాలము వీనితోఁజేరిన స్వరూపము గలదై, అస్యవిశ్వస్య = ఈ లోకము యొక్క, ఆత్మా = కారణభూతమై, భగవద్దృష్టిగోచరః = భగవంతుని దృష్టికి గోచరమై, సిసృక్షయా = సృష్టితాత్పర్యము కారణముగా, ఆత్మానం = తనను, వ్యాకరోత్ = వికారముగలదిగాఁ జేసికొనెను.

**తాత్పర్యము** : ఈ మహత్తత్త్వమందు నీశ్వరాంశమైన జ్ఞాన మున్నది. ఈ జ్ఞానరూపమునే చిదాభాసమని యందురు. ఇది లోకసృష్టికి నిమిత్త కారణము. సత్త్వాదులైన గుణములును నీ మహత్తత్త్వమం దుండు ననినాము. ఈ గుణములే ప్రపంచసృష్టి కుపాదానకారణము. గుణముల సామ్యస్థితికి భంగ మేర్పఱచెడు అనఁగా క్షోభము గల్గించెడు శక్తిస్వరూపమైన కాలము గూడ నీ మహత్తత్త్వమునఁ జేరియున్నది. అందువలన చిదాత్మ సత్త్వాదిత్రిగుణములు, కాలము - వీనియొక్క సముదాయస్వరూపమైన తత్త్వమే మహత్తత్త్వము. ఇదియే ఆపై నుండఁబోయెడు లోకమునకుఁ గారణమైనతత్త్వము. ఇది భగవంతుని సంకల్పస్వరూపమైన జ్ఞానమునకు విషయమై యుండును. దీనియం దంతర్భవించియున్న తత్త్వముల వికాసములకుఁ గారణమైన భగవంతుని సంకల్పము. దీనిలో వికారములను గల్గించును. అప్పు డాతత్త్వమున 'కహంతత్త్వ' మని పేరేర్పడును. దీనినే వేదాంతశాస్త్రములో 'నహంకార' మందురు. "ఈశ్వరుఁడు లోకములను సృష్టించుట కిచ్ఛించును" అను విషయము, ఈ తత్త్వముల వికాసములచే ననుమానింపఁ బడును. కనుక నీ తత్త్వముల యుత్పత్తి కీశ్వరుని సంకల్పము కారణమని చెప్పుదురు.

**29. శ్లో** : వికుర్వాణాత్ = వికారమునొందుచున్న, మహత్తత్త్వాత్ = మహత్తత్త్వమునుండి, అహంతత్త్వం = అహం అనెడు పేరు గల తత్త్వము, అజాయత = ఏర్పడెను, కార్యకారణకర్త్రాత్మా = కార్యము, కారణము, కర్త అనెడు వీని స్వరూపమై యున్న, భూతేంద్రియమనోమయః = భూతములు, ఇంద్రియములు, మనస్సు - ఇవి గూడ దీని స్వరూపమే.

**తాత్పర్యము** : పైనఁజెప్పిన రీతిగా నీశ్వరసంకల్పనిమిత్తముగా - వికారమునందిన మహత్తత్త్వమునుండి యహంకారతత్త్వమేర్పడెను. మహత్తత్త్వరూపమైన కారణము నుండి యేర్పడుటచే దీనిని గార్యమనియు నందురు. ఇఁక మీద నేర్పడఁబోయెడు తత్త్వములకుఁ గారణభూత మిదియే. అందుచే దీనికిఁ గారణతత్త్వమనియుఁ బేరు. దీనియందుఁ బ్రకాశించుచున్న జ్ఞానము, చిదాభాసము సర్వమునకును గర్తయై యుండుటచేత దీనిని 'కర్త' యనియుఁ బిలుతురు. కార్యమనెడు వ్యవహారమునకు నాకాశాదివస్తువులు విషయము లగుటచేత కార్యశబ్దము వలన భూతములను సూచించుట జరగినది. దీనినే "అధిభూత" మని యిఁకపై ఁబిలుచుట. కారణమనుటతో నింద్రియములను సూచించినాఁడు. అందుచేత నిఁక మీఁద వీని

'నధ్యాత్మ' మని పిలుతుము. మనస్సు ఇంద్రియములలో నధివసించుచున్న దేవతలను సూచించును. కనుక మహత్తత్త్వ మనునది భూతములు ఇంద్రియములు దేవతలు - వీరి సముదాయ స్వరూపము ; అధిభూతము, అధ్యాత్మము, అధిదైవము అను మూఁడు పేరులును వానికిఁ గారణములైన త్రివిధవికారములును నీరీతిగా నేర్పడినవి.

**30. శ్లో :** అహం = అహంతత్త్వము, వైకారికః = సత్త్వగుణమునుండి యేర్పడినది. తైజసః = రజోగుణసముద్భూతము, తమసః = తమః ప్రభవము, ఇతి త్రిధా = అని మూఁడు రీతులు, వికుర్వాణాత్ = వికారమును బొందిన, వైకారికాత్ = సత్త్వగుణభూయిష్ఠమైన, అహంతత్త్వాత్ = అహంతత్త్వమునుండి, మనః = మనస్సు, అభూత్ = ఏర్పడెను. యే దేవాః = దేవత లెవ్వరో వారు, యతః = దేని నుండి, అర్థాభివ్యంజనం = అర్థములజ్ఞాన మేర్పడునో -

**తాత్పర్యము :** అవతారిక : ఒకటేయైన యహంకారతత్త్వము భూతములు, ఇంద్రియములు, దేవతలు - ఇట్లుగా మూఁడు విధములైన పదార్థములకుఁ గారణమెట్లయ్యెనో వివరించుచున్నాఁడు. సాత్త్విక రాజసిక తామసిక మని యహంకారము మూఁడు రీతులు, సత్త్వాధిక్యముతో సాత్త్వికము. రజోగుణము యొక్క ఆధిక్యతతో రాజసికము, తమోగుణాధిక్యముతో తామసికము, సత్త్వాహంకారము నుండి దేవత లైరి. వారుండుట చేతనే శబ్దస్పర్శరూపరసగంధము లనెడు నర్థముల జ్ఞానమేర్పడినది. రాజసాహంకారము నుండి యింద్రియములు, తామసాహంకారమునుండి భూతములు నేర్పడినవి. ఈ రీతిగా నొక్కడైన యహంకారతత్త్వము త్రిగుణముల యాధిక్య నికృష్టత్వములతో ముత్తెఱఁగులై భూతేంద్రియ దేవతల యుత్పత్తికిఁ గారణమైనది.

**31. శ్లో :** జ్ఞానకర్మమయాని = జ్ఞానకర్మరూపములైన, ఇంద్రియాణి = ఇంద్రియములు, తైజసాన్యేవ = తైజసములే, తామసః = తామసమనెడు నహంతత్త్వము, భూతసూక్ష్మాదిః = భూతముల యొక్కయు, సూక్ష్మముల యొక్కయుఁగారణము, యతః = దేనినుండి, ఆత్మనః = బ్రహ్మయొక్క, లింగం = జ్ఞాపకమైన, ఖం = ఆకాశము, (ఏర్పడెనో) (జ్ఞానమునకును బ్రవృత్తికిని గారణభూతములైన జ్ఞానకర్మేంద్రియములు గూడ రజోగుణప్రధానములే. రాజసాహంకారమునుండి యేర్పడినవే యని యర్థము. ఆకాశాదులైన స్థూలభూతములును శబ్దాదులైన సూక్ష్మభూతములును తమ యహంకారమునుండి జన్మించినవి. శబ్దగుణమైయున్న యీ యాకాశమే బ్రహ్మమును బోధించెడు పరమతత్త్వము.

**32. శ్లో** : కాలమాయాంశయోగేన = కాలము, మాయ, అంశము - వీనితోఁ గూడిన, నభః = ఆకాశము, భగవద్వీక్షితం = భగవత్సంకల్పమునకు విషయభూతమైనదై. నభసః = ఆకాశము నుండి, స్పర్శం = స్పర్శమనెడి గుణము, అనుస్మృతం = ఏర్పడినది, వికుర్వత్ = వికారమును బ్రాపించిన, అది, అనిలం = వాయువును, నిర్మమే = నిర్మించెను.

**తాత్పర్యము** : అవతారిక : ఆకాశమనెడు కారణము నుండి యేర్పడెడు కార్యమును జెప్పుచున్నాఁడు. కాలశక్తి, పరిణామశక్తి, చిచ్ఛక్తి - వీనితో ఁగూడియున్న యాకాశము భగవంతుని సంకల్పమునకు విషయమైనప్పుడు దానినుండి స్పర్శ యేర్పడును. అది వికారము నందినప్పుడు వాయువుగా నయ్యెను.

**33. శ్లో** : వికుర్వాణః = వికారమును బ్రాపించిన, అనిలః అపి = వాయువుగూడ, నభసా = ఆకాశముతోఁ జేరుటచేత, ఉరుబలాన్వితః = గొప్పబలముచేఁ గూడినదై, రూపతన్మాత్రం = రూపతన్మాత్రముతోఁగూడినదియు, లోకస్య = లోకము యొక్క, లోచనం = ప్రకాశతత్త్వమునైన, జ్యోతిః = జ్యోతిస్సును, ససర్జ = సృష్టించెను.

**తాత్పర్యము** : వాయువు వికారమును జెందినప్పుడు ఆకాశయుక్త మయ్యెను. బలముతోఁగూడిన వాయువు నుండి రూపతన్మాత్ర యొక్క యుత్పత్తికిఁగారణమైన తేజస్సు ఏర్పడినది. ఇదియే లోకమును బ్రకాశింపఁ జేయును.

**34. శ్లో** : అనిలేన = వాయువుచేత, అన్వితం = కూడినట్టి, జ్యోతిః = తేజస్సు, పరివీక్షితం = ఈశ్వరుని సంకల్పమునకు విషయమై, వికుర్వత్ = వికారము నుబ్రాపించినదై, కాలమాయాంశయోగతః = కాలము, మాయ, అంశము - వీనితోఁ జేరుటచేత, రసమయం అంభః = రసస్వరూపమైన జలమును, ఆధత్త = ధరించినది.

**తాత్పర్యము** : ఈశ్వరసంకల్పము కాలమాయాంశములతోఁ జేరుటచేత జ్యోతిస్సు వికారమును బొందినదైరసమయమైన జలముగా నైనది.

**35. శ్లో** : జ్యోతిషా = తేజస్సు చేత, అనుసంస్పృష్టం = చేరినదియు, బ్రహ్మవీక్షితం = ఈశ్వరునిచేఁ గటాక్షింపఁబడినదియు, వికుర్వత్ = వికారము నంది నదియునైన, అంభః = నీరు, కాలమాయాంశయోగతః = కాలమాయాంశముల సంబంధముచేత, గంధగుణం = గంధమనెడు గుణముతోఁగూడినదై, మహీం = భూమిని, అధాత్ = సృష్టించెను.

**తాత్పర్యము** : తేజస్సుతోఁ గూడినదియు నీశ్వరునిచేఁ గటాక్షింపఁబడినదియు, కాలాదులతోఁగూడినదియునైన జలము గంధమనుగుణముతోఁ జేఁన భూమిని సృష్టించెను.

**36. శ్లో** : భవ్య! = ఓ శ్రేష్ఠుఁడా!, నభ ఆదీనాం = ఆకాశము మొదలైన, భూతానాం = భూతములమధ్యలో, అవరావరం = వెనుకవెనుకనున్నది, యత్ యత్ = ఏదేది కలదో, తేషాం = వానికి, పరానుసంసర్గాత్ = ఇతరములతోఁజేరుట చేత, యథాసంఖ్యం = క్రమముగా, గుణాన్ = గుణములను, విదుః = తెలియుదురు.

**తాత్పర్యము** : ఓ భవ్యుఁడవైన విదురా! సావధానముగా వినుము, భూతములమధ్యలో దేనినుండి యేదేది యేర్పడునో ఆక్రమము ననుసరించి గుణములు గూడ నుండునని తత్త్వవిదులు తీర్మానించినారు. ఈ రీతిగాఁ జూచినచో నాకాశము మొదటిది. దాని గుణము కేవలము శబ్దమే. దానినుండి వాయు వేర్పడెను. అందుచేత నాకాశగుణమైన శబ్దము దానిలో సంక్రమించును. వాయుగుణమైన స్పర్శమును ఏర్పడును. కనుక వాయువునకు గుణములు రెండు. వాయువునుండి యగ్ని గలుగును. శబ్ద స్పర్శ రూపములు, అగ్ని నుండి జలములు. దానిగుణములు నాలుగు శబ్దస్పర్శరూపరసములు, భూమి కైదుగుణములు శబ్ద, స్పర్శ, రూప, రస గంధములు.

**37. శ్లో** : విష్ణోః = విష్ణువు యొక్క, కలాః = అంశములును, కాలమాయాంశలింగినః = కాలము, మాయ, అంశము - వీని చిహ్నములు గలిగిన, ఏతే దేవాః = ఈ దేవతలు, నానాత్వాత్ = నానాత్వహేతువుగా, స్వక్రియా నీశాః = తమ వ్యాపారములందు శక్తిలేనివారై, ప్రాంజలయః = అంజలిబంధము నాచరించి, విభుం = భగవంతుని గూర్చి, ప్రోచుః = పలికిరి.

**తాత్పర్యము** : సర్వవ్యాపియైన భగవంతుని యొక్క యంశములనుండి యేర్పడిన వారును, కాలలక్షణమైన వికారము, మాయాలక్షణమైన విక్షేపము, భగవదంశలక్షణమైన చైతన్యము గలవారును, మహదాదితత్త్వములకు అభిమానులైన దేవతలు వేర్వేరుగా నుండుటచేత అనఁగా ఒకరితో నొకరు చేరక భిన్నభిన్నముగ నుండుటచేతఁ దామొనర్పఁదగిన కార్యమందు అనఁగా బ్రహ్మాండనిర్మాణమందు శక్తిలేనివారైరి. వారు తమ స్వామియైన భగవంతుని ముందు అంజలిబంధమును ఘటించికొని నిలిచినవారై యిట్లన్నారు. పరస్పరము గలియకుండుటచే వారి పరమోద్దేశమైన లోకసృష్టి నొనర్చుట కశక్తులైనారు. ఈ విషయమే యీ శ్లోకముచేత స్పష్టపఱచఁబడినది.

**38. శ్లో** : దేవా ఊచుః = దేవత లన్నారు, దేవ = ఓ స్వామీ!, ప్రపన్నతాపోపశమాతపత్రం = ఆశ్రయించినవారి యొక్క తాపముల నుపశమింపఁజేయు వెలిగొడుగుతో సమానమైన, తే పాదపద్మం = నీపాదపద్మమును గుఱించి, నమామి

= నమస్కరింతుము, యన్మూలకేతాః = ఏదాని మూలము నాశ్రయించిన, యతయః = యోగులు, ఉరుసంసారదుఃఖం = గొప్ప సంసార దుఃఖమును, అంజసా = ప్రయాసములేక, బహిః = బయటికి, ఉత్క్షిపంతి = పోద్రోలుదురో -

**తాత్పర్యము :** దేవతలన్నారు, స్వామీ! నిన్ను శరణుఁజొచ్చిన వారు త్రివిధతాపముల నుండి రక్షింపఁబడుదురు. నీ పాదపద్మచ్ఛాయ వారి నాతపత్రమువలె సర్వదుఃఖములనుండి రక్షించును. అట్టి నీపదయుగ్మమునకు నమస్కారము. నీపాదద్వయి నాశ్రయించి వివేకు లేమాత్రమును బ్రయాసములేక శీఘ్రముగ సంసారదుఃఖమునుండి తరింతురు. గొడుగును చేత ధరించినవారికి సూర్యతాప మంటనట్లుగా నీపాదముల నాశ్రయించినవారికి త్రివిధతాపముల యూసే యుండదు. అట్టి పాదపద్మముల నాశ్రయించిన వారమైన మా తాపములఁ దీర్చి యుద్ధరింపవలెనని సారము.

**39. శ్లో :** ఈశ అస్మిన్ భవే = ఈ సంసారమందు, తాపత్రయేన = మూఁడు విధములైన దుఃఖములచేత, అభిహతాః = సర్వత్ర యాక్రమింపఁబడి, బాధింపఁబడిన, జీవాః = జీవులు, ఆత్మన్ = ఆత్మ యందున్న, శర్మ = సుఖమును, యత్ ఋతే = దేని నాశ్రయింపకుండుటచేత, నలభంతే = పొందలేరు, అతః = అందుచేత, సవిద్యాః = విద్య చేతఁ గూడియున్న, తవ అంఘ్రిచ్ఛాయాం = నీ పాదచ్ఛాయను, హే భగవన్ = ఓ భగవంతుఁడా!, ఆశ్రయేమ = ఆశ్రయింతుము.

**అవతారిక :** భగవత్పాదముల నాశ్రయించిన యోగులు సంసారదుఃఖమును దరింతురని పై శ్లోకమందుఁ జెప్పఁబడినది. అట్లుసేయనివారికి, ఆత్మానందము లభింపదని యీ శ్లోకముతోఁజెప్పుచున్నాఁడు.

**తాత్పర్యము :** దేవా! ఈ సంసారమందు నీ పాదపద్మముల నాశ్రయింపని జీవులను ఆధ్యాత్మికాదితాపములు నాల్గువైపులఁ జుట్టుముట్టి పలురీతుల బాధించును. అందుచేత నాత్మానుభవమందున్న పరమానందము వారి యనుభవమునకు రాదు. కనుక స్వరూపానందము ననుభవింపఁజేయు నాత్మజ్ఞానము దేనినుండి భక్తులకు లభించునో అట్టి నీపాదపద్మములనీడను మే మాశ్రయింతుము. "దేని నాశ్రయించిన వారికి సుఖము సిద్ధించునో" - అని చెప్పినది యన్వయక్రమము. "దేని నాశ్రయింపని వారికి సుఖము సిద్ధింపదో" - అనునది వ్యతిరేకక్రమము. ఒక విషయమును గట్టిగాఁ జెప్పవలసివచ్చినప్పు డన్వయవ్యతిరేకమార్గములతో దానిని వచించుట శాస్త్రపద్ధతి, అట్లు చెప్పినచో నా విషయము సర్వసంపన్న మగును. కనుక భగవత్పాదభజనమే ఆత్మానందము సిద్ధించుట కుత్తమమార్గమని తెలిపినట్లైనది.

**40. శ్లో :** ఋషయః = ఋషులు, అనఁగా మంత్రద్రష్టలైనవారు, వివిక్తే = ఏకాంతమందు, తే = నీ యొక్క, ముఖపద్మనీడైః = తామరపువ్వునకు సమానమైన నీ ముఖము అను వాసస్థానముతోఁగూడిన, ఛందస్సుపర్ణైః = వేదము లనెడు పక్షుల సహాయముచేత, యత్ = దేనిని, మార్గంతి = వెదకుదురో, తీర్థపదః = పరిశుద్ధమైన సారముతోఁగూడిన, యస్య = ఎవని యొక్క, పదం = చరణమును, అఘమర్షోదసరిద్వరాయాః = పాపహరమైన జలముగల నదులలో శ్రేష్ఠమైన గంగ యొక్క, పదం = ఉత్పత్తి స్థానమో, తత్ = దానిని, ప్రపన్నాః = శరణుఁబొందినాము.

**తాత్పర్యము :** భగవత్పాదము నాశ్రయింపవలె నన్నచో దానిని గూర్చిన జ్ఞానముండవలెనుగదా! ఆ జ్ఞానము లేక దాని నాశ్రయించుట సాధ్యము గాదు. అందుచే భగవత్పాదమును గూర్చి యెవ్వ రేవిధముగా నెఱిఁగిరో యను విషయమును గూర్చి యిక్కడ ప్రస్తావించుచున్నాఁడు. జనసంచారములేని యేకాంతశుద్ధములైన స్థానములందుండి మనస్సును, ఇంద్రియములను నిర్జించి ధ్యానమార్గముతో మంత్రద్రష్టలైన ఋషులు నీ ముఖపద్మమే వాసస్థానముగ స్వీకరించియున్న వేదములనెడు పక్షులసాహాయ్యము నవలంబించి త్వత్పాదపద్మముల నన్వేషించి తెలిసికొందురు. అట్టి పరిశుద్ధమైన నీపాదములనుండి మూఁడున్నర కోటి తీర్థజలములకంటె నుత్కృష్టమైన గంగానది యుద్భవించినది. ఆ నీపరిశుద్ధమైన పాదమును మేము ప్రపన్నులమై యాశ్రయించితిమి. ఈ శ్లోకమందు వేదములను బక్షులకుఁ బోల్చినాడు. భగవన్ముఖమును నీడమన్నాఁడు. పక్షులు సాధారణముగా నొక్కొక్క గుంపుగా వసించును. తమనీడములనుండి బయలుదేరి యాహారాన్వేషణమునకై పలుదిక్కులఁ దిరుగును. తిరిగి తిరిగి మరలఁ దమ నీడములఁ జేరును. అట్లే వేదములు గూడ భగవన్ముఖమందు నిశ్వాస రూపముగా వసించును. కర్మ, భక్తి, జ్ఞానమను మార్గములలో సంచరించును. మరల భగవంతుని ముఖమందే లయించును. పక్షులు దా మనుసరించిన మార్గమందే మరల వెనుకకుఁ బోయినచో వాని గూండ్లు వానికి లభించును. అట్లే వేదవాక్యములయర్థవిచారమునకుఁ బరమప్రయోజనము మరల భగవత్పాదములను జేరుటయే.

**41. శ్లో :** శ్రద్ధయా = శ్రద్ధతోను, శ్రుతవత్యా = నిరంతరశ్రవణముతోను జనించినదైన, భక్త్యా = భక్తిచేతను, సమ్మృజ్యమానే = చక్కగా పరిశుద్ధ మొనర్పఁబడిన, హృదయే ధీరాః = మనస్సు నందు ధీరులైనవారు, యత్ = దేనిని, అవధార్య = ధ్యానించి, వైరాగ్య బలేన = వైరాగ్యబలముతో, దృఢీభూతమైన, జ్ఞానేన = పరమాత్మను గుఱించిన యనుభవరూపమైన జ్ఞానముగలవా రగుదురో, తే = నీ యొక్క, తత్ అంఘ్రిసరోజపీఠం = ఆ పాదకమల పీఠమును, వ్రజేమ = మేము ప్రాపింతుము.

**తాత్పర్యము :** శ్రద్ధతోఁ గథాశ్రవణ మొనర్చినపుడు భగవద్భక్తి యేర్పడును. దానితోఁ గామాదిదోషముల బలము తగ్గును. హృదయము పరిశుద్ధమై నిశ్చల మగును. అట్టి మనస్సు నందు పరమపురుషుని పాదములు ధ్యానించుకొలఁదియు విషయపరాఙ్ముఖత్వ మేర్పడును. దానితోఁ బరమజ్ఞానము సిద్ధించును. ఆ సిద్ధినందినవారే ధీరులు. వారు స్వరూపానందమందే మునిఁగియుందురు. అట్టి నీ పాదసరోజ పీఠమును మే మాశ్రయింతుము.

**42. శ్లో :** ఈశ! , విశ్వస్య = లోకము యొక్క, జన్మస్థితి సంయమార్థే = సృ[ష్టి] సంహారములకై, కృతావతారస్య = అవతారమును స్వీకరించియున్న, తేపదాంబుజం = నీపాదపద్మము, స్మృతం = స్మరింపఁబడినదై, స్వపుంసాం = తన భక్తులకు, అభయం = భయరహితమైన స్థానమును, ప్రయచ్ఛతి = ఇచ్చును, సర్వేవయం = మే మందఱమును, అట్టి పాదములను, శరణం వ్రజేమ = శరణము నందుదుము.

**తాత్పర్యము :** అవతారిక - భగవంతుని పాదపద్మము పరమపురుషార్థమైన మోక్షమును సిద్ధింపఁజేయును. కాని జ్ఞానమార్గముతో దానిని దెలిసికొనుట నుకరముగాదు. అందుచే నాపాదపద్మమును శరణుఁజొచ్చెద మను నభిప్రాయముతోఁబాటు భక్తిమార్గమును గూడఁ బ్రస్తావించుచున్నాఁడు.

**తాత్పర్యము :** ఓయీ పరమపురుషా! చూడఁబడుచున్నదియు, వినఁబడుచున్నదియు నగు సకలప్రపంచముయొక్క సృష్టించుట, రక్షించుట, సంహరించుట మొదలైన లీలలను జేయుటకై ఆయారూపములను ధరించి భూమియం దవతరించెడు ఏ నీపాదపద్మములను స్మరించుటచే నీ భక్తుల యొక్క జన్మాదిసకలక్లేశములును దీరిపోవునో ఆ నీ పాదములు భయరహితస్థానమైన పరమాత్మస్వరూపము ననుభవింపఁజేయును. అట్టి నీపాదపద్మములను శరణుఁజొత్తుము.

**43. శ్లో :** భగవన్! = పరమైశ్వర్యశాలీ!, సానుబంధే = అనుబంధములతోఁ గూడినదియు, అసతి = పరమార్థము గానిదియు నైన, దేహగేహే = శరీరమునందును, గృహమునందును, మమ= నాది, అహం = నేను, ఇతి = అనెడు, ఊఢదురాగ్రహాణాం = పాదుకొన్న దురాశతోఁగూడిన, పుంసాం = పురుషుల యొక్క, పుర్యాం = పట్టణమందు, అనఁగా హృదయమందు, వసతః అపి తే = వసించుచున్న వాఁ డవైనను నీ యొక్క, యత్ = ఏదైన, పదాబ్జం = పాదపద్మము, సుదూరం = ఎంతయో దూరమున నున్నదిగా నగునో, తత్పదాబ్జం = అట్టి నీ పాదమును, భజేమ = భజింతుము.

**తాత్పర్యము :** ఆసురీసంపత్తితోఁగూడి జన్మించినవారికి భగవత్పాదపద్మభజనము సిద్ధింప నేరదు. ఇఁక ఫలానుభవ మెక్కడనుండి వచ్చును? ఈ విషయమును స్పష్టీకరించుచు భగవంతుని శరణుఁబొందుచున్నారు. ఓ పరమాత్మా! పుత్రులు, మిత్రులు, కళత్రము లనెడు అనుబంధములతోఁ గూడినది శరీరము. దీనియందు నేను అనెడు జ్ఞానము ధనధాన్యాది యనుబంధములతోఁగూడిన గేహములందు నాది యనెడు దృఢభావ మెవ్వరి కుండునో వారి హృదయములందు నీవు వసించుచున్నను వారి యంతఃకరణములు మలినము లగుటచేత చాల దూరమందున్న వాని వలెనే భాసింతువు. వారు నిన్ను భజింపనొల్లరు. నీ పాదారవిందము వారి కప్రాప్యమై యుండును. అట్టి నీ పాదపద్మమును భక్తియుక్తచేతస్కులమై, మేము శరణుఁబొందుచున్నాము.

**44. శ్లో :** అసద్వృత్తిభిః = అసత్పదార్థములైన విషయముల ననుసరించి వ్యాపారములుగల, అక్షిభిః = ఇంద్రియములచేత, పరాహృతాంతర్మనసః = ఆకర్షింపఁబడిన మనస్సుతోఁగూడిన, యే = ఎవరు గలరో, పరేశ = పరుఁడైనవాఁడా!, ఉరుగాయ = గొప్పగా భక్తులచేఁ గీర్తింపఁబడువాఁడా! తే = వారు, పదన్యాసవిలాసలక్ష్మ్యాః = పదన్యాసవిలాసలక్ష్మి యొక్క సంబంధముగల, తాన్ = వారిని, న పశ్యంతి = చూడలేరు.

**తాత్పర్యము :** స్వామీ! నీవు బ్రహ్మాదుల కీశ్వరుఁడవు, భక్తులచే బహువిధములుగఁ గీర్తింపఁబడువాఁడవు. జ్ఞానమార్గమునకు త్రోవఁజూపు నీపాదముల నాశ్రయించిన భక్తులతోడి సంబంధ మెల్లవారికి సిద్ధింపదు. ఇంద్రియములను తుచ్ఛవిషయ సుఖములందు వర్తింపఁజేయువారికి నీపాదపద్మముల స్వరూపమై యున్న జ్ఞానానందములో నిరంతర నిమగ్నమైన భక్తుల దర్శనము దుస్సాధ్యము. ఎవరి మనస్సులందు విషయవైరాగ్యము జనించినదో వారే భగవంతుని గాంతురు. భక్తుల సంసర్గము లభించినంతమాత్రముచేత విషయసంసర్గము గలవారు కూడ భక్తులై పోదు రనుట సాధ్యముగాదు. విషయవైరాగ్యము లభింపనిది భక్తుల సందర్శనమే చిక్కదు గదా?

**45. శ్లో :** దేవ! తేకథాసుధాయాః = నీ కథ యనెడు నమృతము యొక్క, పానేన = పానముచేత, ప్రవృద్ధభక్త్యా = అభివృద్ధినందిన భక్తి నిమిత్తముగా, యేవిశదాశయాః = ఎవరు నిర్మలమైన యంతఃకరణము గలవారో, తే = వారు, వైరాగ్యసారం = వైరాగ్యమునకు సారమైన, బోధం = పరమార్థజ్ఞానమును, అంజసా = కష్టములేకుండ, ప్రతిలభ్య= పొంది, అకుంఠధిష్ణ్యం = నాశము లేని స్థానమును, అన్వీయుః = పొందిరి.

**తాత్పర్యము :** దేవా! అమృతము వలె నాస్వాద్యమైయున్న నీయవతారలీలాకథలను శ్రోత్రములమూలమున హృదయమునందుఁ బ్రవేశింపఁజేసికొనుటచే నీవిషయమందు పరమప్రేమనందుచున్నారు. దానితో తుచ్ఛవిషయము లందు వైరాగ్య మేర్పడును. దానితో జీవాత్మపరమాత్మల యొక్క స్వరూప బోధము గల్గును. దానితో వారు అనాయాసముగా నాశరహితమైన వైకుంఠస్థానము నందెదరు. కథాశ్రవణముతో, భక్తి,దానితో విషయవిరక్తి విరక్తితో జ్ఞానము, జ్ఞానముతోఁ బరమపురుషార్థమైన మోక్షము సిద్ధించునని సారము.

**46. శ్లో :** తథా = ఆ ప్రకారము, అపరేచ = ఇతరులైనట్టి, ధీరాః = ధీరులు, ఆత్మసమాధియోగబలేన = తమ మనస్సును నిగ్రహించుటకు పనికి వచ్చెడు యోగబలము వలన, బలిష్ఠాం = బలముగలిగినదైన, ప్రకృతిం = మాయను, జిత్వా = జయించి,పురుషం త్వాం ఏవ = సర్వేశ్వరుఁడవైన నిన్నే, విశంతి = ప్రవేశించుచున్నారు, తేషాం = వారికి, శ్రమః = ప్రయాసము, స్యాత్ = ఏర్పడును. తేసేవయా = భక్తి భరితమైన నీ సేవా భావముచేత, న శ్రమఃస్యాత్ = శ్రమ యేర్పడదు.

**తాత్పర్యము :** భక్తియోగముతో నీ పాదపద్మములను జేరుట సుకరము. ధీరులైన మఱికొందరు మనోనిగ్రహపరిపూరకమైన సమాధియోగబలముతో సర్వేశ్వరుఁడవైన నిన్నుఁ బొంద యత్నింతురు. కాని వారికీ మార్గమునఁ గ్లేశము మెండు. భక్తి మార్గమున నిన్నుఁ జేర యత్నించువారి కీ ప్రయాసము లేదు. అందుచేత నదియే సర్వుల కాశ్రయణీయమైనది. "అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భి రవాప్యతే" - అనెడు భగవద్గీతావచన ప్రకారము దేహాభిమానము పూర్తిగాఁ దొలఁగని జీవులకు అవ్యక్తోపాసన చాల కష్టమైనదని తెలియును.

**47. శ్లో :** తత్ = అందుచేత, తే వయం = నీ పాదపద్మములకు సంబంధించిన మేము, లోకసిసృక్షయా = లోకములను సృష్టించెడు కోర్కెతో, త్రిభిః = మూఁడుగుణములతో, ఆత్మభిః = ఆత్మ యొక్క అంశలతోను, త్వయా = నీ చేత, అనుసృష్టాస్స్మ= సృష్టింపఁబడితి మనుట ప్రసిద్ధము, సర్వే = మేమందఱమును, వియుక్తాః = భిన్నభిన్నముగనున్న వారము, తత్ = ఆ కారణముచేత, స్వవిహారతంత్రం = నీ క్రీడాస్థానమును, తే = ని న్నుద్దేశించి, ప్రతిహర్తవే = సమర్పించుటకొఱకు, నశక్నుమః = శక్తి గలవార మగుట లేదు.

**తాత్పర్యము** : భక్తితోఁగాని పురుషార్థము సిద్ధింప దనుట నిర్ణీతమైనది. అందుచే నీపాదపద్మముల నాశ్రయించినాము. లోకములను సృష్టింపవలెనను కోరికతో సత్త్వాదిగుణములతోను, నీ యంశములతోను, సర్వేశ్వరుఁడవైన నీవు మమ్ము సృష్టించితివి. గుణముల నానాత్వకారణముగా మేము పరస్పరము చేరలేక వేర్వేరుగనే యున్నాము. అందుకే నీకుఁ గ్రీడాస్థానమైన బ్రహ్మాండమును సృష్టించి నీకు సమర్పింపకున్నాము. మా జన్మసాఫల్యము మాకు సిద్ధింప కున్నది. కనుక నో స్వామీ! నీవు నీ జ్ఞానకళయైన లోచనమును బ్రసాదించి మా జన్మ సార్థక్యమునకుఁ దోడ్పడవలెను.

**48. శ్లో** : అజ! = జన్మరహితుఁడవైనవాఁడా, యావత్ = ఏ విధముగా, వయం = మేము, తే = నీకు, కాలే = సమయమందు, బలిం = బలిని, అనఁగా పూజోపకరణమును, హరామః = సమర్పింతుమో, యత్ర = దేనియందు, స్థితాః = ఉన్నవారమై, వయం చ = మేము, అన్నం = అన్నమును, అదామః = భుజింతుమో, యథా = ఎట్లు, తే ఇమే లోకాః = నీకు సంబంధించిన లోకములు, ఉభయేషాం = మన యిరువురకును, బలిం = పూజాద్రవ్యమును, హరంతః = సమర్పించుచున్నవై, అనూహాః = ఉదాసీనత లేనివై, అన్నం = అన్నమును, అదంతి = భక్షించును.

**అవతారిక** : ఏ విధమైన జ్ఞానము సామర్థ్యము సిద్ధింపవలెనో తెలుపవలె ననెడు ప్రశ్నకు సమాధానము.

**తాత్పర్యము** : పరమేశ్వరా! నీ పాదపద్మముల నారాధింపవలసిన సమయమందు పూజాద్రవ్యములను నీకు మే మర్పింపవలెను. మేమును జీవించుట కర్హమైన యన్నమును భుజింపవలెను. నీ సంబంధముతో నేర్పడెడు లోకములు నీకును మాకును నిర్విఘ్నముగా పూజాద్రవ్యములను సమర్పింపవలెను. ఏ విధమైన జ్ఞానము సామర్థ్యము మా కేర్పడినచో నీ కార్యములన్నియు ననాయాసముగా నిర్వహింపఁ బడుటకు సాధ్య మగునో ఆ విధమైన జ్ఞానమును క్రియాసామర్థ్యమును మా కనుగ్రహింపవలెను.

**49. శ్లో :** దేవ! = ఓ క్రీడాశీలివైన స్వామీ! , సాన్వయానాం = సానుబంధులైన, సురాణాం నః = దేవతలైన మాకు, ఆద్యుఁడవు నీవు, పురాణః = సదాతనుఁడవు, పురుషః = సర్వమందును వ్యాపించినవాఁడవు నీవు, కూటస్థః = వికారరహితుఁడవు నీవు, త్వం = అట్టివాఁడవైన నీవు, అసి = సర్వోత్కృష్టుఁడవుగా వెలుఁగుచున్నావు, అజః = జన్మరహితుఁడవైన, త్వం = నీవు, గుణకర్మయోనౌ = గుణములకును, కర్మములకును గారణమైయున్న,శక్త్యాం అజాయాం = శక్తిరూపమైన ప్రకృతి యందు, కవిం = విజ్ఞాన రూపమైన, రేతః = వీర్యమును, ఆదధే = ఆధాన మొనర్చితివి.

**తాత్పర్యము :** ఎందుకనఁగా సర్వులకును జనకుఁడవు నీవు. "ఈ విషయమును సూచించుచుఁ బ్రార్థించుచున్నాఁడు. అనుబంధులతోఁ గూడియున్న దేవతలమైన మాకు ముందున్న వాఁడవు నీవు. సదాతనుఁడవు నీవు. జన్మాది వికారములు లేని వాఁడవు. సర్వేశ్వరుఁడవు, గుణములకును కర్మలకును గారణమైన నీ శక్తి స్వరూపమైన మా యందు జ్ఞానస్వరూపమైన నీ వీర్యమును అనఁగా మహత్తత్త్వమును ఆధాన మొనర్చితివి. దాని నుండియే కదా మే మందఱము నేర్పడినాము. అందుచేతనే సర్వులకును జనకుఁడవు నీవు. జన్మాదివికారములు లేనివాఁడవు.

**50. శ్లో :** తతః = అందుచేత, సత్రమముఖాః = మహదాదులైన, వయం = మేము, యదర్థే = ఏ ప్రయోజనమునకై, బభూవిమ = ఏర్పడితిమో, ఆత్మన్ = ఆత్మస్వరూపుఁడవైయున్న, దేవ = ప్రకాశమానుఁడవైన వాఁడా! తే = నీకు, కింకరవామ = ఏమిసేయ గలము? యదనుగ్రహాణాం = ఎవనియనుగ్రహముతోఁ గూడిన, నః = మాకు, క్రియార్థే = ప్రవృత్తిని నిర్వహించుటకు, స్వచక్షుః = జ్ఞానమును, శక్త్యా = శక్తి విశేషముచేత, త్వం = నీవు, పరిదేహి = ఇమ్ము.

**తాత్పర్యము :** ఓ ఆత్మస్వరూపుఁడవైన దేవా! మహదాదితత్త్వములమైన మేము, ఏ కార్యనిర్వహణమునకై జన్మించితిమో నీకుఁ గ్రీడాస్థానమైన యా బ్రహ్మాండమును గల్పించుటకు మాకు శక్తి లేకున్నది. నీ యనుగ్రహమును మాపైఁ జిలికించుము. ఆ కార్యము మాచే నిర్వహింపఁబడవలయును. తత్కార్యమునకుఁ గావలసిన జ్ఞానము నీ శక్తిచేత మాకుఁ గల్పింపవలెను.

## శ్రీధరీయము

"పంచమే భగవల్లీలాం క్షత్త్రాపృష్టో మహామునిః,
ప్రోవాచ మహదాదీనాం సర్గం తైశ్చ హరేస్తుమ్ం".

"ఉక్త శ్చతుర్భి రధ్యాయైః క్షత్త్రా మైత్రేయసంగమః,
సంవాదస్తు తయోస్కంధ ద్వయేనాధనిగద్యతే".

"కౌషారవం పర్యపృచ్ఛద్గంగాద్వారే కృతక్రియమ్,
విదురః కృష్ణనిర్దిష్టం ముకుందం మనసాగతః".

పంచమాధ్యాయమందు మైత్రేయుని చేత విదురుఁడు ప్రశ్నింపఁబడినవాఁడై. మహదాదుల జన్మమును, హరిని గూర్చి తత్కృతమైన స్తుతిని వర్ణించుచున్నాఁడు. తొలి నాల్గధ్యాయములలో విదుర మైత్రేయ సమాగమము వర్ణింపఁబడినది. వారి సంవాదము రెండు స్కంధములతో జెప్పఁబడుచున్నది. మైత్రేయుఁడు గంగాద్వారమునం దుండెను. ఆతఁడు విదురునకు జ్ఞానోపదేశ మొనర్పవలెనని కృష్ణునిచే నిర్దేశింపఁబడినవాఁడు. హరిధ్యానపూర్వకముగా విదురుఁడు మైత్రేయునిట్లు ప్రశ్నించుచున్నాఁడు.

**1. శ్లో** : ద్యునద్యాః = గంగానది యొక్క, ద్వారి = ద్వారమందు, ఆసీనం = కూర్చున్న మైత్రేయుని (హరిద్వారమందు మైత్రేయుఁడుండెనని భావము) అతఁడు కర్మవ్యగ్రుఁడు గాఁడు. ఎందుకనఁగా నాతని బోధ మగాధమైనది. అగాధ మనఁగా నపరిచ్ఛిన్నమని యర్థము. జ్ఞానసిద్ధిని బరిపూర్ణముగా నందినవాఁడగుట వలన మైత్రేయునకుఁ గర్మకాండతో నిమిత్తము లేదని తాత్పర్యము. ఆతఁడు విదురుని సౌశీల్యాదిగుణములచేఁ బరితృప్తుఁడైనాఁడు. లేక యీ విశేషణమును మైత్రేయునకే యన్వయించి కొనవచ్చును. కరుణార్జవాదిగుణములు సంపూర్ణముగా నున్నవాఁడని యర్థము. పదునైదు శ్లోకములచేతఁ బ్రశ్నప్రకారమునే వివరించుచున్నాఁడు.

**2. శ్లో** : అన్యదుపారమం వా = సుఖప్రతికోటిరూపమైన దుఃఖము యొక్క విరతిగాని యేర్పడుట లేదు, లేక అన్యద్వా అని యన్వయము, సుఖభిన్నమైనది అని యర్థము. సుఖభిన్నమైనదేది? అనునాకాంక్ష వచ్చినప్పుడు ఉపారమం అనునది దానికే నిర్దేశము. ఎట్లన్వయించికొన్నను పిండితార్థమొక్కటే. ఆ కర్మలచేత, భూయః = మరల మరల

దుఃఖమునే యందుచున్నాఁడు. ఏవంవిధమైన సంసారమందు మా కనుష్ఠింపయోగ్యమైన దేది? దానిని సర్వజ్ఞుఁడవైన నీవే యుపదేశింపవలెనని తాత్పర్యము.

3. శ్లో : దైవాత్ = నిమిత్తమైన ప్రాచీనకర్మల నుండి, కృష్ణద్విముఖస్య = దైవాత్ అనునది అధర్మశీలస్య అనుదానికి అన్వయింప వచ్చును. అందుచేతనే, సుదుః ఖితస్య = దుఃఖములపాలైన జనుని యనుగ్రహముకొఱకు, భవ్యాని = పరోపకారశీలములైన, కృష్ణస్యభూతాని = మంగళకరములైన చిత్తవృత్తులుగల కృష్ణభక్తులు చరించుచుందురు. ఇతర కృత్యముల యం దభిలాషతోఁ గాదని తాత్పర్యము.

4. శ్లో : తత్ = అందుచేత, సాధువర్య! = సాత్త్వికులలో శ్రేష్ఠుఁడైనవాఁడా!, నః = మాకు, శం = సుఖరూపమైన, వర్త్మ = మార్గమును, ఆదిశ = తెల్పుము, ఏ మార్గముచే సమారాధితుఁడైన కృష్ణుఁడు శక్తిపరిపూతమైన మనస్సునం దున్నవాఁడై, సతత్త్వాధిగమం = ఆత్మపారోక్ష్యసహితమైన, పురాణం = అనాదియై, వేద ప్రమాణమైన జ్ఞానమును, యచ్ఛతి = దాన మొనర్చునో!

5. శ్లో : ఈ శ్లోకమునకు నెనిమిదవ శ్లోకమందలి వర్ణయ అను క్రియతో నన్వయము, త్ర్యధీశః = త్రిగుణ మాయానియంతయు, అందుచేతనే, ఆత్మతంత్రః = స్వతంత్రుఁ డు నైన, భగవాన్ = భగవంతుఁడు, యథా = ఏ ప్రకారముగాఁ బురుషరూపముతో, కృతావతారస్సన్ = అవతారమును గ్రహించినవాఁడై, యేకర్మల నొనర్చునో ఉత్తరార్ధముతో విశేషముగా నాకర్మలనే యడుగుచున్నాఁడు. నిరీహః = నిష్క్రియుఁ డును లేక నిస్స్పృహుఁడును నైన యని యర్థము. అట్టి భగవంతుఁడు ఈ విశ్వమును, అగ్రే = పూర్వమందు అనఁగా తొలుత, యథాససర్జ = ఎట్లు సృష్టించెను?, అస్యజగతః = ఈ జగత్తు యొక్క, వృత్తిం = జీవికను, సంస్థాప్య = సుస్థితముగా నొనర్చి, యథావిధత్తే = ఏ ప్రకారముగాఁ బాలించునో, తద్విధమునంతయు వర్ణింపుమని భావము.

6. శ్లో : పునః = మరల, సః = అతఁడు, నివృత్త వృత్తియై, స్వే = తనదైన, ఖే = హృదయాకాశమందు, ఇదం = ఈ సమస్త విశ్వమును, నివేశ్య = ఉంచి, గుహాయాం = యోగమాయ యందు, యథాశేతే = ఎట్లు శయనించుచున్నాఁడో, పునః = మరల, ఏతద్విశ్వమను ప్రవిష్టః = ఈ సమస్త విశ్వమం దనుప్రవేశించినవాఁడై, ఈ

కారణముచేతనే యోగేశ్వరుల కధీశ్వరుఁడైనట్టి ఏక ఏవ = ఒకఁడైనను, యథాబహుధా ఆసీత్ = బ్రహ్మాదిరూపము లతో నెట్లయ్యెనో, ఆ పద్ధతియును వివరింపుమని భావము.

7. శ్లో : పునస్సః = మరల నతఁడే, మత్స్యాద్యవతారభేదైః, క్రీడన్ సన్ = మత్స్యాద్యవతారభేదములచేతఁ గ్రీడించుచున్నవాఁడై, ద్విజగోసురాణాం క్షేమాయ = ద్విజులు, గోవులు, దేవతలు- వీరి క్షేమము కొఱకు,యథాకర్మాణి విధత్తే = కర్మల నెట్లు చేయుచున్నాఁడో వానినిఁగూడఁ జెప్పుమని భావము. అడుగుటలోనున్న యౌత్సుక్యమును ఆవిష్కరించుచున్నాఁడు, సుశ్లోకమౌళేః = పుణ్యకీర్తిమంతులైనవారి శిరస్సు వలె నాధిక్యముతో సర్వోపరి విరాజిల్లుచున్నట్టి, అనుశృణ్వతాం, అను అనుస్యూతముగా, ఎడతెగక యని యర్థము.

8. శ్లో : అధిలోకనాథః = లోకపాలాధిపతిః, లోకపాలసహితాన్ = లోకపాలకులతోఁ గూడ, లోకాన్ ఆ లోకాన్ = లోకాలోకపర్వతములను, వాని కవ్వలి భూములను, యైః తత్త్వభేదైః = ఏ తత్త్వ భేదములతో, అచీక్లపత్ = కల్పించెనో, యత్ర = ఏ లోకాలోకములందు, సర్వసత్త్వనికాయభేదః = అన్ని సత్త్వములు, వాని నికాయములు, వాని భేదములు, ప్రతీతః = ప్రసిద్ధుఁడైనవాఁడై, అధికృతః = తత్తత్కర్మాధికారులచేత నాశ్రయింపఁబడినవాఁడై.

9. శ్లో : ఆత్మయోనిః = స్వతస్సిద్ధుఁడైనవాఁడు. అట్టివాడై జగత్తులను, సృష్టించునారాయణుఁడు, ప్రజానాం = జీవుల యొక్క, ఆత్మా = స్వభావము, తత్కృతమైన కర్మము, దానిచే నేర్పడిన రూపము, తత్కృతమైన అభిధ అనఁగా పేరు - వీని భేదములను గల్పించెనో.

10. శ్లో : అవతారిక : మహాభారతమందు నీవు సర్వమును శ్రవణ మొనర్చితివి గదా! దానికి సమాధానము. పరాపరేషాం = పరులు త్రైవర్ణికులు. అపరులు శూద్రాదులు, వారి వ్రతములు, ధర్మములు, వ్యాసముఖమునుండి మాటిమాటికి విన్నాను. కృష్ణకథామృతౌఘము గూడ భారతమందే సూచితమైనది, తస్మాద్భృతే = ఆ భారతమందు వర్ణింపఁబడిన కృష్ణకథామృతౌఘశ్రవణమందుఁ దప్ప తక్కిన వర్ణాశ్రమ ధర్మములను వినుటలో మాకుఁ దృప్తి యేర్పడినది. తుచ్ఛసుఖావహములైన వానియూసింకఁజాలును. శ్రీకృష్ణకథామృతౌఘ శ్రవణమందు మాత్రము చాలుననుబుద్ధి జనింపలేదని భావము.

**11. శ్లో :** దానికి హేతువును జెప్పుచున్నాఁడు. తీర్థపదాభిధానాత్ = తీర్థపదుఁడైన శ్రీకృష్ణునకు సంబంధించిన, కథామృతౌఘాత్ = కథామృతప్రవాహము నుండి, కృష్ణకథ యెట్టిది? వః సత్రేషు = మా సమాజములందు, సూరులైన నారదాదులచేత ఈడ్యమానమైనది. అట్టి కృష్ణకథనుండి ఎవఁడు తృప్తుఁడగును? ఏ కృష్ణకథ కర్ణరంధ్రమునఁ బ్రవేశించి సంసారప్రదమైన పురుషుని గేహరతినిఁ బోఁద్రోలునో యట్టిదని యర్థము.

**12. శ్లో :** మహాభారతమునకుఁ గూడ గృష్ణకథావర్ణనమందే తాత్పర్య మనుచున్నాఁడు. తే సఖా, నీ స్నేహితుఁడైన, కృష్ణః = వేద వ్యాసమహాముని, నః = మాకు, భగవద్గుణాన్ = మోక్షధర్మములను "నారాయణీయము" మొదలైన యంశములతోఁ జెప్పఁబూనుకొన్నవాఁడై భారతమును వచించినాఁడు. అర్థకామాది వర్ణన మెందుకుఁ జేయవలసివచ్చినది? మానవ బుద్ధులను హరికథలందుఁ బ్రచోదన మొనర్చుటకు, యస్మిన్ భారతే = ఏ మహాభారతమందు ద్వారభూతములైన గ్రామ్య సుఖానువాదములచేత, నృణాం మతిః = నరుల మనస్సు, సునిశ్చితం = నిశ్చయ జ్ఞానపూర్వకముగా హరికథల యందుఁ బ్రవృత్త మగునో
"ఇతిహాససముచ్చయ" మం దిట్లున్నది.

> "కామినోవర్ణయన్ కామా లోభం లుబ్ధస్యవర్ణయన్,
> నరః కిం ఫల మాప్నోతి కూపేంధమివ పాతయన్".
>
> "లోకచిత్తావతారార్థం, వర్ణయిత్వాత్ర తే నతౌ,
> ఇతిహాసైః పవిత్రార్థైః పునరత్రైవ నిందితౌ".
>
> "అన్యథాఘోరసంసార బందహేతూ జనస్యతౌ,
> వర్ణయేత్సకథం విద్వాన్ మహాకారుణికో మునిః".

--- కాముకుల కామమును, లుబ్ధుని లోభమును వర్ణించి యేమి ప్రయోజనము? గ్రుడ్డివానిని బావిలోఁ ద్రోసినట్లు మానవుల నగాధములోఁ ద్రోయుటేగదా! అందుచే వ్యాసభగవానుఁడు లోకచిత్తము మోక్షధర్మ పరాయణ మగుటకు వాని పూర్వపక్షముగా వర్ణించి పవిత్రార్థములైన యితిహాసములను దానియందే సిద్ధాంతములుగా వర్ణించినాఁడు. అట్లు సేయకున్నచో నా వర్ణనము సంసార బంధహేతువే యగును. మహాకారుణికుఁడైన వ్యాసభగవానుఁ డట్లు సేయఁడు గదా!

**13. శ్లో :** హరికథయందు మతిప్రవేశమునకు ఫలమునుఁ జెప్పుచున్నాఁడు. ఇట్టి గుణములు గలిగిన కథలందు ఎవఁడు శ్రద్ధధానుఁడో వాని బుద్ధి భక్తియందే వివర్ధమానమై గ్రామ్యసుఖములందు విరక్తిని బెంచికొనును. దాని వలన గలుగు ఫలమేమి? హరికథల అనుస్మృతిచేత సుఖితుఁడైన యట్టివానికి సమస్తదుఃఖముల అప్యయ మనఁగా వినాశ మేర్పడును.

**14. శ్లో :** ఇట్టి గుణవిశిష్టమైన కథయం దెవ్వరి కాసక్తి లేదో వారిని గూర్చి దుఃఖపడుచున్నాఁడు. యే నరాః = ఏ మనుష్యులు, అవిదః = భాగవత తాత్పర్యము నర్థముజేసికొనఁజాలరో వారు శోచ్యులు, అట్టి వారిని గూర్చి దుఃఖింతును. ఎవరు తాత్పర్యమును దెలిసికొన్నను భగవత్కథలందు విముఖులో వారు శోచ్యులలో శోచ్యులు. వారిని గూర్చి చెప్పవలసిన దే మున్నది? అని భావము. ఇట్లుగా శోచ్యశోచ్యాన్ అను పదమును విభజించి యర్థకల్పనము సేయవలెను. దుఃఖించుటలో హేతువును జెప్పుచున్నాఁడు. అనిమిషమైన కాలము వారియాయుస్సును క్షీణింపఁజేయుచున్నది. వా రెట్టివారు? "వృథావాదగతిస్మృతీనాం" వ్యర్థములైన వాగ్దేహ మనోవ్యాపారముగలవారు.

**15. శ్లో :** అందుచేత - కౌషారవ = ఓ మైత్రేయా, అస్య విశ్వస్య శర్మదాతుః = ఈ సమస్త ప్రపంచమునకును రక్షారూపసుఖమును గల్పించువాఁడును, ఆర్తబంధోః = సంసారతాపము చేతఁ బరితప్తులైన వారికి బంధువును, తీర్థము వలెఁ బరిశుద్ధమైన కీర్తిగలవాఁడునునైన శ్రీహరియొక్క కథలయందు, సారభూతం = సారభూతమైనకథను, ఉద్ధృతీకరించి ఎట్లు పుష్పములనుండి మధుకరము తేనెలను సంగ్రహించునో యట్లుగా నని తాత్పర్యము.

**16. శ్లో :** విశేషించి శ్రీహరికథయే కథనీయ మనుచున్నాఁడు. విశ్వజన్మాద్యర్థము - పూర్వంగృహీతశక్తిః = పూర్వమే గ్రహింపఁబడిన శక్తిగలవాఁడైన, పరమాత్ముఁడే, పురుషేషు కృతావతారస్య = పురుషులం దవతారమును స్వీకరించివాఁడై, అతిపూరుషాణి = పురుషుల నతిక్రమించిన వర్తమానములు అనఁగా నన్నిరీతులఁ బురుషశక్తిని మించినవని భావము.

**17. శ్లో :** ఏవం = ఈ రీతిగా విదురునిచే నడుగఁబడిన మైత్రేయుఁడు, పుంసాం నిశ్శ్రేయసార్థాయ = పురుషుల నిశ్శ్రేయసము కొఱకై అడుగఁబడినవాడు.

**18,19. శ్లో :** పూర్వశ్లోకములో "బహుమానయన్" అన్నాఁడు. ఆ ప్రశ్న వేసినందుకు విదురు నాదరించెనని భావము. ఆ యాదరమునే శ్లోకపంచకముతోఁజెప్పుచున్నాఁడు. అధోక్షజాత్మనః = అధోక్షజుఁడే మనస్స్వరూపమైనవాఁడు, అనఁగా మహావిష్ణువే మనస్సునం దంతయు నాక్రమించికొన్నాఁడని భావము. ఆతని కీర్తిని ప్రసంగవశము చేత వ్యాపింపఁజేసెడి యీ ప్రశ్న ముదావహ మైనదని తాత్పర్యము. అనన్యభావేన ఈశ్వరః హరిః గృహీతః = అనన్యభావముతో నీ హృదయముచేతఁ గృష్ణుఁడు స్వీకరింపఁబడెననుటేదిగలదో, నైతచ్చిత్రం = అది విచిత్రముగాదు, ఎందుకనఁగా బాదరాయణవీర్యజే = నీవు వ్యాసముని వీర్యముచే జన్మించినవాఁడవు.

**20. శ్లో :** ఐనచో శూద్రత్వమెట్లు? లోకానుగ్రహత్వమెట్లు? ఈ విషయమును విశదీకరించుచున్నాఁడు. భ్రాతుః = విచిత్ర వీర్యుని యొక్క, క్షేత్రే = క్షేత్రముగా స్వీకరింపఁబడిన, భుజిష్యాయాం = దాసియందు యముఁడవు. నీవే జన్మించినావు.

**21. శ్లో :** భవాన్ = నీవు, భాగవతసమ్మతః = భగవంతునకు సమ్మతుఁడవు, ఎందువలన? నీకు జ్ఞానము నుపదేశించుటకు భగవంతుఁడు నన్నాదేశించినాఁడు. అందుచేత నని సంబంధము, ఈ శ్లోకమందలి 'చ' కారముచేత నిన్ను స్మరించుట మాత్రము చేతనే భగవంతుఁడు నీ కుపదేశమిచ్చినట్లే యని తాత్పర్యము.

**22. శ్లో :** యోగమాయోప బృంహితములైన విశ్వస్థిత్యాదులు విషయముగాగలిగిన భగవల్లీలలను నీకుఁ గ్రమముగా వర్ణింపఁబోవుచున్నానని తాత్పర్యము.

**23. శ్లో :** సృష్టిలీలలను వర్ణించుటకు దానికి ముందున్న యవస్థను జెప్పుచున్నాఁడు. ఇదం విశ్వమగ్రే = ఈ సృష్టికి పూర్వము. భగవానేకఏవాస = భగవంతుఁడొక్కఁడే యుండెను. ఎట్టివాఁడు? ఆత్మనాం = జీవులకు, ఆత్మా = స్వరూపుఁడు, విభుః = స్వామి, ఆత్మా = పరమాత్మ, భగవాన్ ఏక ఏవ ఆస = భగవద్భిన్నమైన ద్రష్టృదృశ్యాత్మకమైన దేదియు లేదని భావము. కారణాత్మకములుగా నవియున్నను, వానికి పృథక్ప్రతీతి లేదని పిండితార్థము. అనా నా మత్యుపలక్షితః = నానాద్రష్టృదృశ్యాది భేదములుగల బుద్ధులచేత గ్రహింపఁబడనివాఁడు, లేక నానామత్యుపలక్షితః = సృష్టితరువాత ననేకబుద్ధులచేఁ జూడఁబడువాఁడు. ఒంటిగానున్నవాఁడనుటెట్లు? ఆత్మేచ్ఛ అనఁగా మాయ. దానియనుగతి అనఁగా నంతర్లీనమైయుండుట. లేక ఆత్మయొక్క యేకాకిత్వావస్థానేచ్ఛను అనుసరించిన మాయ.

24. శ్లో : రెండు శ్లోకములతో మాయ యేర్పడిన విధమును జెప్పుచున్నాఁడు. స వా ఏషః = ఒంటిగానున్న పరమాత్ముఁడు, ద్రష్టాసన్ = చూచుచున్నవాఁడై, దృశ్యం న అపశ్యత్ = దృశ్యమును జూడలేదు. ఎందువలన? విరాజిల్లువాఁ డేకరాట్. అనఁగా ఒక్కఁడుగనే ప్రకాశించువాఁడు. అందుచేత, అసంతమివ ఆత్మానం మేనే = తన్ను లేని వానినిగాఁ దలఁచినాఁడు. ఎందుకు? అసుప్తదృక్ = ద్రష్టృత్వరూప ధర్మమున్నను దృశ్యము లేకపోవుటతో నా ధర్మము లేనట్లే యైనది. ఆ స్థితి యెందుకుఁ గలిగినది? సుప్తశక్తిః = తన మాయాదులైన శక్తులు సుప్తములై తన యందే అంతర్లీనము లైనవి.

25. శ్లో : సతః =ద్రష్టయైనపరమాత్మకు సాదృశ్యానుసంధానరూపమైన, పరాపరాత్మికా = కార్యకారణరూపమైన, యాత్మస్వరూపమును, అసత్ = అదృశ్యమానమైన, యాత్మస్వరూపమును, ఈ రెండింటికిని, ఆత్మా = మాయకు నాత్మస్వరూపములు. ఎందుకనఁగా నా రెండు అనుసంధానములును మాయతో నేర్పడునవే.

26. శ్లో : కాలవృత్త్యా = కాలశక్తిచేత, మాయాయాం గుణమయ్యాం = క్షుభిత గుణమైన మాయయందు, అధోక్షజః = పరమాత్మ, ఆత్మాంశభూతుఁడైన పురుషునిచేత. ఆ పురుషుఁడే ప్రకృత్యధిష్ఠాతృరూపుఁడు. వీర్యమనఁగా చిదాభాసము, ఆధత్త = ఉంచెను, వీర్యవాన్ = చిచ్ఛక్తియుక్తుఁడైనవాఁడు.

27. శ్లో : కాలచోదితాత్ = కాలప్రేరితమైన, తస్మాత్ = అవ్యక్తమైనయా మాయనుండి, మహత్తత్త్వం అభవత్ = మహత్తత్త్వము పుట్టెను. ఇందలి తత్త్వపదమును విసర్జించి మహచ్ఛబ్దమునకు లక్షణనిర్వచనము. అందుచేతనే "విజ్ఞానాత్మా" అని పుంలింగవిశేషణము. విజ్ఞానాత్మ యెట్లైనది? దానికి సత్త్వప్రధానత్వాత్ అని సమాధానము. సత్త్వప్రధానమగుటచేతనే విజ్ఞానాత్మయైనదని భావము. అది యేమిచేసినది? ఆత్మదేహస్థమైన విశ్వమును, ఉచ్చూనబీజము లోపలనున్న అంకురాదికమును వలెఁ బ్రకాశింపఁజేయుచున్నదని భావము. దానిచేతనే "తమోనుదః" అజ్ఞానరూపమైన చీఁకటిని బోఁగొట్టుచున్నది. సాత్వతతంత్రమం దిట్లున్నది.

"విష్ణోస్తు త్రీణి రూపాణి పురుషాఖ్యాన్యతోవిదుః,
ప్రథమం మహతోరూపం ద్వితీయం త్వంతసంస్థితమ్
తృతీయం సర్వభూతస్థం తాని జ్ఞాత్వా విముచ్యతే".

- విష్ణువునకు పురుషాఖ్యములైన మూఁడు రూపము లున్నవి. మొదటిది మహత్తత్త్వము, రెండవ దండసంస్థితము, మూఁడవది సర్వభూతస్థమైన రూపము. వీని నెఱిఁగిన మనుజుఁడు సంసారబంధ విముక్తుఁడు నగుచున్నాఁడు.

**28. శ్లో :** రెండున్నర శ్లోకములతో నహంకారోత్పత్తిని జెప్పుచున్నాఁడు. సఃఅంశః = చిదాభాసమైన నిమిత్తకారణము. గుణాః = గుణములు. ఇవి యుపాదాన కారణములు, కాలః = క్షోభకరమైన కాలము, తదాత్మా = దాని కధీనమైనది. ఇట్టిదైన మహత్తత్త్వమును భగవదృష్టిగోచరః = సర్వాధ్యక్షుఁడైన భగవంతుని దృష్టిగోచరమై, స్వయం = తన్ను, వ్యాకరోత్ = రూపాంతరము నందించికొనెను.

**29,30. శ్లో :** అహంకారలక్షణమును జెప్పుచున్నాఁడు. కార్యకారణకర్త్రాత్మా- కార్యము = అధిభూతము, కారణము = అధ్యాత్మము, కర్త = అధిదైవతము, వీనికి ఆత్మా = ఆశ్రయమైన యహంకారము, ఇట్లగుటలో హేతువు భూతేంద్రియమనోమయః = అయా వికారములు గల్గినది. మనశ్శబ్ద మిచ్చట దేవతలకుఁ గూడ నుపలక్షణము. ఈ యహంకారమునే స్పష్టీకరించుచున్నాఁడు, వైకారికః = సాత్త్వికాహంకారము, తైజసము = రాజసము, వైకారికాత్ = సాత్త్వికాహంకారమునుండి

**31. శ్లో :** దేవతలుగూడ వైకారికులే. ఎందుకనఁగా కార్యభూతులు. వీరి నుండి యింద్రియాధిష్ఠాతలైన, అర్థాదివ్యంజనమును, శబ్దాదిప్రకాశమును ఏర్పడుచున్నది. జ్ఞానేంద్రియకర్మేంద్రియములు రాజసములే. జ్ఞానమయములైనవానికి సత్త్వగుణముతోడి సంబంధము లేదు. అందుకే 'ఏవ' కారము, తామసాహంకారము. భూతసూక్ష్మస్య = సూక్ష్మభూతమైన శబ్దమునకు, ఆదిః = కారణము, యతశ్శబ్దాత్ = ఈ శబ్దము నుండి ఆత్మనః లింగం ఖం = ఆత్మకు సూచకమైన యాకాశ మేర్పడుచున్నది. ఆకాశము శబ్దగుణమని భావము. స్వగుణమైన శబ్దరూపముచేత నాత్మకు ప్రమాపన మగుచున్నది. హృదయాకాశస్వరూపమైనఁ గావచ్చును. లేక లింగ మనఁగా శరీరము, "ఆకాశ శరీరం బ్రహ్మ" అని శ్రుతి, కాలమాయాంత యోగేన కాలము, క్షోభకము, మాయ. తామసాంశమైన ప్రకృతి. అంశము చిదాభాసము, తామసాహంకారమునుండి యుద్భూతమైన నభస్సు సర్వాధ్యక్షుఁ డైన భగవంతునిచేత కాలాదిసముదాయముతోఁ గూడ వీక్షింపఁబడినదై వికారము నందుచున్నదని భావము.

**32, 33. శ్లో :** స్పర్శం వికుర్వత్ = స్పర్శరూపవికారము నందుచున్నదై, అనిలం = వాయువును, నిర్మమే = నిర్మించెను, ఈ రీతిగా సర్వత్ర తన్మాత్ర ద్వారా భూతోత్పత్తియని తెలియవలెను. నభస్సుచేఁ గూడినదియు, స్వయముగా ఉరుబలాన్వితమైనదియు నైన వాయువు.

34. శ్లో : ససర్జ = దేనిని? రూపతన్మాత్రమును, లోకస్యలోచనం = లోకప్రకాశకమని యర్థము, పరమేక్షితం = పరుఁడైన భగవంతునిచేఁజూడఁబడినదై, అని లేన = వాయువు చేత.

35. శ్లో : జ్యోతిః = అనఁగా నగ్ని, బ్రహ్మణా= భగవంతుని చేత, వీక్షితం = చూడఁ బడినదై, జ్యోతిషా = తేజస్సుచేత, అనుసృష్టం, అంభః = సృష్టింపఁబడిన నీరు.

36. శ్లో : ఆకాశాది పంచభూతముల యొక్క, పరావరం = పరమును, అపరమునునైన కార్యము చేత -

37. శ్లో : తేషాం = ఆ కార్యముల యొక్క, పరైః = కారణములచేత, అనుసంసర్గాత్ = అనుషంగమువలన, యథాసంఖ్యం = యథాక్రమం. యథాక్రమముగా యథాసంఖ్యముగా నుత్తరోత్తరము, అధికాన్‌గుణాన్ విదుః = అధికములైన గుణములని తెలిసికొందురు. ఆకాశమునకు శబ్దమొక్కటియే గుణము. దాని కితరములతో నన్వయము లేదు గనుక; వాయువునకు స్పర్శగుణము. ఆకాశాన్వయముతో శబ్దమును; తేజస్సునకు మూఁడుగుణములు - శబ్దస్పర్శరూపములు. నీటికి రసముతో నాల్గుగుణములు, భూమి కైదు గుణములు, ఈ దేవతలు మహదాదితత్త్వాభిమానులై, విష్ణోఃకలాః = విష్ణువున కంశభూతులు, కాలలింగముల వికారము మాయాలింగము విక్షేపము. అంశలింగము చేతన. వీనిచేఁ గూడికొన్నవారు కనుకనే కాలమాయాంశలింగినః.

38. శ్లో : నానాత్వాత్ = నానాత్వముతో, పరస్పరవిభిన్నములైన గుణములు గలిగి యుండుటచేత, పరస్పరసంబంధములేనివారై, స్వక్రియాయాం = బ్రహ్మాండ రచనయందు, అనీశాః = అశక్తులై, పరమేశ్వరం= పరమేశ్వరుని గూర్చి, ప్రపన్నాః = శరణాగతులైరి,"మిథస్స్పర్ధిష్ణవ్యో దేవాః = మిళంత స్త్రే పరస్పరమ్ విశ్వకర్మణ్యనీశాశ్చ నిర్విణ్ణా హరిమీడిరే'' అని భావము. అనఁగా తత్తదభిమాని దేవతలు పరస్పరసంబంధము లేని వార్తై, పరస్పరము స్పర్థించికొనుచుండిరి. వారు బ్రహ్మాండరచనయం దశక్తులై భగవంతుని శరణుఁజొచ్చిరి అని భావము.

39. శ్లో : ప్రపన్నులకు తాపోపశమమందు, ఆతపత్రం = గొడుగుతో సమానమైన, యెవనిపాదారవిందమును ఆశ్రయింతురో వారని యర్థము. యన్మూలకేతః = ఎవని పాద మూలము, నికేతము వలె తమ కాశ్రయమో అట్టివారు.

**40. శ్లో :** పాంథుఁడు స్వగృహమును బొంది మార్గశ్రమమును జెప్పునట్లు తమశ్రమమును వివరించుచున్న వారై తత్త్వాభిమానిదేవతలు పల్కుచున్నారు. విధాతః = స్వామిన్, అస్మిన్ భవే సంసారే = ఈ సంసార మందు, తాపత్రయేణ అధిగతాః జీవకోటయః = తాపత్రయముతో వేధింపఁబడిన జీవసమూహము, ఆత్మన్ = అంతఃకరణమందు, లుప్తసప్తమీ నిర్దేశము. ఈ సంసారమందు నీ పదపద్మస్మరణ లేనిదే జీవులు సుఖమందలేరని భావము. అందుచేత, సవిద్యాం =ప్రకాశమైన, జ్ఞానసహితమైన యని భావము. జ్ఞానసాధనమును జెప్పుచున్నాఁడు. సుధియః = పరిశుద్ధచిత్తులు, ముఖపద్మనీడైః = ముఖపద్మమే గూడుగాఁ గలిగిన ఛందస్సు పర్ణైః = వేదములనెడు పక్షులచేత, వివిక్తే = అసంగమైన మనస్సు నందు, యన్మార్గంతి = దేని నన్వేషించుచున్నారో, అఘమర్షోదసరిద్వరాయాః = అఘమర్ష = పాపనాశకమైన ఉదకముగలిగిన సరిత్తులయందు శ్రేష్ఠమైన గంగానది యొక్క, పదం = ఉద్భవ స్థానమైన, తీర్థపదస్తవ = తచ్చపదం, తీర్థపాదుఁడవైన నీ పాదమును, ప్రపన్నాః. కనుక గంగనుసేవించువారు గూడ, తదుద్భవస్థానమైన నీ పాదమును బొందుదు రని భావము. ఛందస్సుపర్ణైః = వేదములను పక్షులు- అనుట చేత, పక్షులెట్లు గూండ్ల నుండి అటనటఁ దిరిగి మరల గూడులనే ప్రవేశించునో వేదములును నీనుండి యుద్గతములై మరల నిన్నే చేరుచున్నవని భావము. ఇది దృష్టాంతము.

**41. శ్లో :** విషయాకృష్టచిత్తులకు తదన్వేషణ మెట్లు? హృదయే = మనస్సునందు కేవల హృదయమందు ధ్యానాసంభవము నాశంకించి హృదయవిశేషణము లతో విశదముగఁ జెప్పుచున్నాఁడు. శ్రుతవత్యా = శ్రవణపూర్వకమైన భక్తిచేత, సమ్మృజ్యమానే = సంబోధ్యమానమైన హృదయమునందు, అవధార్య = ధ్యానించి- దానినుండి యేర్పడిన వైరాగ్యమేబలముగాఁ గల జ్ఞానముచేత ధీరులైన కొందరు ముముక్షువులు నిశ్చలమైన మనస్సుగలవారై నిన్నుఁబొందెదరు. అట్టి నీయంఘ్రిసరోజపీఠమును శరణము నందుచున్నామని భావము.

**42. శ్లో :** భక్తానుగ్రహమును స్మరించుచు పల్కుచున్నాఁడు. మే మందరము నీశరణుఁజొచ్చుచున్నాము. ఎందుకనఁగా స్మృతమైన నీపదాంబుజము నీ భక్తుల కభయ మిచ్చుచున్నది.

**43. శ్లో :** అంతర్యామిస్వరూపముగా భగవంతుఁడు నిత్యసన్నిహితుఁడు. అట్టి వానిని గూర్చి యెక్కడో యున్నట్లుగా భావించుట దోషము గదా! దానికి సమాధానము. దేవా! ద్యోతనశీలుఁడవైన వాఁడా! సానుబంధే స్వోపకరణమైన, అసతి =

తుచ్ఛదేహమందు, నేను నాదను నహంకారములచేత, ఊఢదురాగ్రహాణాం = పొందఁబడిన దురాగ్రహము గలవారికి, పుర్యాం = స్వదేహమందు వర్తించుచున్నను నీ పదాబ్జము, సుదూరం = చాల దూరమం దున్నదో అట్టి నీ పాదమును శరణుఁ జొత్తుము.

**44. శ్లో :** హే పరేశ! = మాయను నియమించువాఁడా! అసద్వృత్తిభిః = బహిర్ముఖములైన, అక్షిభిః = ఇంద్రియములచేత, పరాహృత = దూరమందున్న, అంతస్థం మనః ఏషాం తే = అంతస్థమైన మనస్సుగలవారు, బహిర్ముఖములైన యింద్రియములనుండి దూరమైన మనస్సుగలవారని భావము. ఉన్మత్తులు వారితో సమాగమము కష్టము. వారినే వివేకించుచున్నాఁడు. నీపదన్యాసముల యొక్క విలాస మనఁగా ఉత్సవము. తత్సంబంధమైన శోభగలవారు. అనఁగా నిరంతరమును నీలీలకధినాధులతో శోభించుచున్నవారు. అట్టి నీ భక్తులను. భక్తులకు విశేషణము. అకారాంత శబ్దమునకు బహువచనము లేక ఇట్టివారుగానున్న నీ భక్తులు తమవలె నున్న వారినే వీక్షింతురని భావము. సత్సంగము లేనప్పుడు హరికథాశ్రవణ మేర్పడదు. అట్టిచో మనస్సునందున్నను దూరస్థితుఁ డవే యగుదువని భావము. ఇచ్చట లక్ష్మ్యాన్ = అని పాఠాంతరము గలదు. పథః = అనియును. అప్పుడు లక్ష్మ్యాన్ అనునది పథః అను శబ్దమునకు విశేషణము.

**45,46. శ్లో :** అథ = ఈ శబ్దమిచ్చట మార్గాంతరమును సూచించుచున్నది. అపరే = ఇతరులు, ఆత్మసమాధియోగబలేన = తమ యందు సమాధి అనఁగా మనస్థైర్యము; అదియే యోగము, ఉపాయము. దాని బలముచేత జ్ఞానయోగముతో నని తాత్పర్యము. నిన్నే పొందుచున్నారు. తేషాంశ్రమస్స్యాత్ = వారి కత్యంత శ్రమముతో మోక్ష మేర్పడుచున్నది. సేవయా = సేవతో, అనాయాసముగా మోక్షసిద్ధియని భావము. సేవయనఁగా సత్సంగరూపము; కథాశ్రవణాది రూపము. అప్పుడు మనస్సు, అహం, మమతాధిష్ఠానము గానేరదని తాత్పర్యము.

**47. శ్లో :** ఈ రీతిగ భగవంతుని స్తుతించి నాల్గు శ్లోకములతోఁ దమప్రార్థనను నివేదించుచున్నాఁడు. ఆద్యుఁడవైన స్వామీ! నీకు సంబంధించిన మేము లోకసృష్టచేత నీ నుండి సృష్టింపఁబడితిమి. సత్త్వాదులైన మాస్వభావములు పరస్పరవిరుద్ధములై మేమొక్కరము వేరొక్కరితోఁ గలియుట లేదు. అందుచేత నీవెందుకై మమ్ము సృష్టించితివో ఆ నీ క్రీడోపకరణమైన బ్రహ్మాండమును నీకు సమర్పించుటకు అశక్తులమై యున్నాము. కనుక నీవు దయాదృష్టితో మమ్ము వీక్షింపుమని చతుర్థశ్లోకమున కన్వయము.

**48. శ్లో :** తమ యసామర్థ్యమును ప్రతిబింబించుటకుఁ గార్యవైచిత్ర్యమును జెప్పుచున్నాఁడు. హే అజ! కాలే = భోజనకాలమందు తత్తదవసరమందు, బలిం = భోగమును, తుభ్యం హరామః = నీకు సమర్పించెదునట్లును, ఏ ప్రకారముగా మేమును అన్నమును భుజింతుమో అట్లును. అన్నమదామ = అనుటచేత, మా కన్నము మాత్రమే; ఐశ్యర్యముతో భోగానుభూతి నీకుఁ జెందినదే యనుచున్నాఁడు. మన ఉభయులకును, అనూహాః = నిర్విఘ్నముగా లేక నిస్సంశయముగా ననియు నర్థము. మన యిర్వురకును భోగము నొసఁగువారై యన్నమును భుజింతురో-

శ్రుతి :

> "తా ఏతా దేవతా స్సృష్టా అస్మిన్ మహత్యర్ణవే ప్రాప్తం
> తమశనా పిపాసాభ్యా మన్వవార్జత్ తా ఏవ మబ్రువ
> న్నాయతనం నః ప్రజానీహీతి యస్మిన్ ప్రతిష్ఠితా అన్నమదామేతి"

**49. శ్లో :** జనకుఁడవైన దాని వలన నీవు మాకును కార్యోపాధికులైన ఆ జీవులకును వృత్తిని గల్పించవలె ననుచున్నాఁడు. సాన్వయానాం= కార్యభూతులమైన మాకు లేక అన్వేతీత్యన్వయః. కారణము, కారణభూతులైన మాకని యర్థము. కూటస్థః అవిక్రియః పురుషః = అధిష్ఠాత, పురాణః = పురాతనుఁడైనవాఁడు, అట్టి వాఁడవైన నీవు, గుణానాం = సత్త్వాదుల యొక్కయు, కర్మణాం = జన్మాదులయు, యోనౌ = కారణభూతమైన, అజాయాం = జననరహితమైన, శక్త్యాం = మాయయందు, కవిం = సర్వజ్ఞమైన, మహత్తత్త్వరూపమైన రేతస్సును మొదట నుంచితి మని భావము.

**50. శ్లో :** హే ఆత్మన్= ఆత్మస్వరూపుఁడవైన వాఁడా! సత్త్రముఖాః = మహదాదులైన మేము, యదర్థే బభూవిమ = ఏ ప్రయోజనమున కేర్పడితిమి? మేము నీ కేమి యొనర్పవలెను? సృష్టి నొనర్పవలెనా? ఐనచోఁ జెప్పుచున్నాఁడు. త్వం = స్వచక్షుః , స్వీయమైన జ్ఞానమును, శక్త్యా చ సహ = శక్తితోఁగూడ, అస్మాకం పరిధేహి = మాకు దయసేయుము. ఎట్టివారికి త్వదనుగ్రహాణాం = నీ నుండియే యనుగ్రహము నాకాంక్షించుచున్నవారికి, త్వదనుగ్రహాణామనున దేకపదము. నీనుండి ప్రాప్తించిన జ్ఞానక్రియాశక్తులచేతనే మేము సృష్టింప శక్తుల మగుదుము. అన్యధా గానేరమని భావము.

## విజయధ్వజము

1. శ్లో : అచ్యుతభావశుద్ధః = అచ్యుతభావముచేత పరిశుద్ధుఁడు, తృప్తః అని పాఠాంతరము. అప్పుడు శ్రీహరిలీలయనెడు నమృతమును పానము చేయుటచేతనే జీవించువాఁడని యర్థము. కురూణాం ఋషభః = దీని వలన, సత్కులీనుఁడగుట చేత జ్ఞానోపదేశమున కర్హుఁడని తెలిపిన ట్లైనది. క్షత్తా ద్యునద్యాఃద్వారి = హరిద్వారమునందు, ఆసీనం, అగాధబోధం, సౌశీల్యగుణ + అతితృప్తం, మైత్రేయం, అభిసృత్య = గురుశుశ్రూషా ప్రకారముతో పొందినవాఁడై పప్రచ్ఛ అడిగెను.

2. శ్లో : అనుటతో ఎవరిని, దేనిని అనెడు రెండు ప్రశ్న లుదయించుచున్నవి. ఇచ్చట నేమని యడిగెను అని చెప్పక పోయినచో ప్రశ్నయే నిరర్థక మగుచున్నది. అందుకై ప్రశ్న ప్రకారమును వివరించుచున్నాఁడు. లోకః సుఖాయ కర్మాణి కరోతి తైః = సరిగా నొనర్పని యా కర్మలచేత, సుఖం న విందేతఃవా = ఇఁకను, అన్యదుపారమం = సుఖభిన్నమైన, దుఃఖనాశమైనను న విందేత = అయుక్త కర్మాచరణతో నెక్కువగా ననర్థమే ప్రాప్తించుచున్నదని చెప్పుచున్నాఁడు. భూయః తతః = ఆ రీతిగా సక్రమముగా నొనర్పఁబడని యజ్ఞాదికర్మలచేత, దుఃఖమేవ విందేత. కానిమ్ము. దానితో నాకేమిపని? అనుటకు సమాధానము. అత్ర = దుః ఖమును బోఁగొట్టుకొని సుఖమును బొందెడివిషయమునందు (అనఁగా మోక్షమును బొందుటకు) యత్ = ఎట్టికర్మములు, యుక్తం = సందేహరహితములుగా నంగీకృతములైనవి? తత్ కిం = ఆ కర్మలేవి? భగవాన్ నః వదేత్ = దీనినుండి సుఖప్రాప్తిదుఃఖనివృత్తి యీ రెండిటిని గూర్చి యడిగిరని భావము.

3. శ్లో : ఈ విషయమందు సుఖదుఃఖప్రాప్తినివృత్తులకు ఉపాయ మడిగినట్లైయైనది గాని శ్రీహరితత్త్వమును గూర్చి ప్రశ్నించినట్లు గాలేదు గదా! దానికిఁ జెప్పుచున్నాఁ డు. దైవాత్ = స్వతః జ్ఞానము లేకున్నను, ఉపదేశించు గురువులు చిక్కకుండుటచేతను, కృష్ణాద్విముఖస్య, అధర్మశీలస్య, సుదుఃఖితస్య = అతిశయముగా సాంసారికదుఃఖములకు వశుఁడైన, జనస్య, స్వరూపతః : ముక్తి యోగ్యులైన సజ్జీవుల, అనుగ్రహాయ = జ్ఞానోపదేశరూపమైన యనుగ్రహమును జూపుట కొఱకే, భవ్యాని, జనార్దనస్యభూతాని, భక్తులైన జీవులు, ఇహ చరంతి నూనం.

4. శ్లో : దీని చేత సిద్ధమైన దానిని జెప్పుచున్నాఁడు. సాధువర్య! సజ్జనులలో శ్రేష్ఠుఁడవైన మైత్రేయా! తత్ = జనుల ననుగ్రహించుటకే నీవు జీవించియుండుటచేత, యేన = ఏ మార్గముతో, సంరాధితః, భగవాన్ పుంసాం, భక్తిపూతే, హృది, స్థితస్సన్, స్వసత్త్వాధిగమం = తాను సర్వత్ర వ్యాపించినవాఁడు అను విషయమును దెలిపెడు, పురాణం = సంప్రదాయ క్రమముతో వచ్చిన, జ్ఞానం నియచ్ఛతి, అట్టి శర్మవర్త్మ = మోక్షమార్గమును, ఆదిశ = ఉపదేశింపుము, "జ్ఞానం సత్త్వాధిగమం" - అని శ్రీధరులు, "జ్ఞానం స్వసత్త్వాధిగమం" - అని విజయధ్వజులు.

5. శ్లో : మోక్షమార్గ మన్నచో శ్రీహరి సృష్టికర్తృత్వము మొదలైన గుణములు, కర్మములు - వీని విచారమే తప్ప వేరు విషయ మేదియుఁ గాదను నభిప్రాయము గలవాఁడై. యా సృష్టి మొదలైన వాని ప్రకారమును బ్రశ్నించుచున్నాఁడు. ఆత్మతంత్రః = త్రధీశః భగవాన్ కృతావతారః, యాని కర్మాణి కరోతి, తాని, వర్ణయ, చ= ఇఁకను, విరీహః = ఏ యాకాంక్షయు లేక, పరిపూర్ణుఁడైన శ్రీహరి, అగ్రే యథా ఇదం ససర్జ = సృష్టించెనో, ఆ ప్రకారమును జెప్పుము. తత్ = అట్లు సృష్టించిన జగత్తును, సంస్థాప్య = ధర్మసేతువునందుంచి, యథా, జగతః వృత్తిం= జీవికను, విధత్తే = దానినిఁ గూడఁ జెప్పుమని భావము.

6. శ్లో : పునః = ప్రళయకాలమందు, స్వేఖే = తన ఉదరాకాశమందు, గుహాయాం = గుహయందు, ఇదం = ఈ జగత్తును, నివేశ్య = ఉంచి, నివృత్తవృత్తిః = జగత్తు యొక్క సృష్టి మొదలైన కార్యములనుండి నివృత్తుఁడై, సఃయథా శేతే = ఆతఁడెట్లు శయనించునో, దానిని వర్ణింపుము. యోగీశ్వరాధీశ్వరః = యోగసిద్ధులైనవారికి అతిశయ నియామకుఁడని పిల్వఁబడెడు శ్రీహరి ఏకః, = ఒక్కఁడే, ఏతత్ = వైవిధ్యముతోఁగూడిన, సృష్టింపఁబడిన జగత్తునందు, అను ప్రవిష్టః = అంతర్యామిగాఁ బ్రవేశించి, బహుధా = అనాయాసముగా ననేక రూపములుగలవాఁడై, యథా ఆసీత్ = ఎట్లుండెనో, దానినిగూడ వివరింపు మని భావము.

7. శ్లో : జగత్తు యొక్క సృష్టి మొదలైన భగవత్కార్యములను గూర్చిన ప్రశ్నోత్తరముల కంటెను వేరువే రవతారములం దొనర్చెడు కార్యములను వర్ణించుట మొదలైన విషయములందు మనస్సు గొప్పగా నాసక్తమగుటచేత వాని నవశ్యము వర్ణింపవలెనను నభిప్రాయముతో మరల దానినే చెప్పుచున్నాఁడు. అవతారభేదైః క్రీడన్ ద్విజగోసురాణాంక్షేమాయ, కర్మాణి విధత్తే = ఇంతకు పూర్వము నీవు శ్రీహరి

కార్యములను గూర్చి విన్నావు. మరలఁ బ్రశ్నించుటలో నర్థమేమి? యని యాశంకించికొని విన్నదానితోఁ దృప్తి గలుగలేదు. విశేషముగాఁ దెలియవలెనను నిచ్ఛయే కారణమని నిశ్చయించుకొని చెప్పుచున్నాఁడు. సుశ్లోకమౌళేః చరితామృతాని శృణ్వతాం అపి, నః మనః, నతృప్యతి, "క్షేమాయ" యను చతుర్థీవిభక్తి చేత ద్విజ, గో, సురరక్షయే యవతారముఖ్యప్రయోజనమనియుఁ దక్కినది గాదనియుఁ జెప్పినట్లైనది.

8. శ్లో : బ్రహ్మ లోకమును సృష్టించునని ప్రసిద్ధము. "ధాతా యథాపూర్వ మకల్పయత్ " ఇత్యాదిశ్రుతు లున్నవిగదా! మఱి లోకసృష్టి భగవంతునిచే నయ్యెనని యెట్లు చెప్పుట? ఈ కారణము చేతనే ప్రశ్నించినది అని విదురుఁ డనుచున్నాఁడు. అధిలోకనాథః = లోకపాలకులకంటె నుత్తముఁడైన భగవంతుఁడు, యైః తత్త్వభేదైః = ఏ మహత్తత్త్వము మొదలైనవానిచేత, అలోకాన్ = పృథివ్యాది బ్రహ్మాండము యొక్క బయటనున్న యావరణములను, సహలోకపాలాన్ లోకాన్ అచీక్లపత్ = సృష్టించెనో, దానినిఁగూర్చి చెప్పుము, యత్ర = ఏ బ్రహ్మాండమందలి, సృష్టములైన లోకములందు, సర్వసత్త్వ నికాయ భేదః = సమస్తప్రాణి సమూహముల యొక్క దేవతలు, మనుష్యులు మొదలైన భేదము, అధికృతః= వారి వారి పదవికిఁదగిన యోగ్యతతో క్లుప్తమైనదో, ప్రతీతః ప్రత్యక్షానుమాన ఆగమము లనెడు ప్రమాణములచేతఁ దెలిసివచ్చిన ప్రకారమును జెప్పుము. ఇచ్చట తత్త్వభేదైః = అనుటచేత, మొదట బ్రహ్మాండమును సృష్టించి పిదప దానియందు లోకములను గల్పించెనని తెలియవలెను. పైన నా రీతిగనే చెప్పుచున్నాఁడు.

9. శ్లో : ఆత్మయోనిః = (1) తనకు ఁదానే కారణమైనట్టియు, (2) బ్రహ్మదేవునకుఁ గారణమైనట్టియు, విశ్వసృట్ = సమస్తవిశ్వమును సృష్టించెడు నారాయణః యేన, యే ప్రజానాం = జీవరాసుల యొక్క, ఆత్మకర్మరూపాభిధానేన = దేహము, ప్రభావము, చేష్టారూపమైన కర్మ, తెలుపు నలుపు మొదలైన యాకారవిశేషము, వీనిచేత వేర్వేరు పేరులతో, భిదాం = పరస్పరవ్యావృత్తిని, ఉత = కూడి, విధత్త = ఒనర్చెనో, ఏతచ్చ = దీనిని గూడ, హేవిప్రవర్య! నః వర్ణయ. పై శ్లోకములో సామాన్యముగాఁ దెలుపఁబడిన భేదమును ఇక్కడ విశేషణముగ వివరించినాఁడు. ఆత్మయోనిః అనుట చేత తానే యితరులచే సృష్టింపఁబడినవాఁడు. అట్లుండఁగా సమస్తమునకు దాను సృష్టికర్త యనుటెట్లు? అను సందేహముగూడ నివృత్త మయ్యెను.

**10. శ్లో :** భగవద్ జ్ఞానమున కుపకరించు విషయమునే ప్రశ్నింపవలెను. కనుక సృష్ట్యాదికార్యములను గూర్చి ప్రశ్నించుట యుక్తమే. కాని మనుష్యాది భేదజ్ఞానముతోఁ బ్రయోజనమేమి? అని యాశంకించుకొని అదిగూడ భగవద్జ్ఞానమున కుపయుక్తమగుటచేఁ బ్రశ్నించుట యుక్తమే యనుచున్నాఁడు. భగవాన్ పరాపరేషాం ఉత్తములైన బ్రహ్మాదులు తక్కువవారైన మనుష్యాదులు - వీరి యొక్క కృతాని చరిత్రలు, వ్యాసముఖాత్ = వేదవ్యాసుని నుండియే, అభీక్ష్ణం, మే = నా నుండి, శ్రుతాని, దానితో నేమి? అనఁగా వివరించుచున్నాఁడు, కర్ణసుఖావహానాం, తేషాం = ఆ దేవమనుష్యాదుల చరిత్రలను, ఋతేసతి = తాత్పర్యజ్ఞానముగలుగఁగా, కృష్ణ కథామృతౌఘాత్ = బ్రహ్మాదుల మహిమయు, శ్రీహరిమహిమనే యవలంబించియుండుట చేత వారిచరిత్రయు, భగవచ్చరిత్రయే యగును. అందుచే శ్రుతమైన యా భగవద్భక్తులు భగవంతుఁడు. వీరి చరిత్రలనెడు నమృతప్రవాహము చేత, నతృప్నుమః తృప్తి గలుగలేదు, శ్రీహరికథయే చెవుల కానందకరమైనది. ఇతరములు శ్రవణకఠోరములు. కనుక శ్రవణానందకరమైన యితరుల చరిత్ర లన్నపుడు వానిలో నడఁగియున్న శ్రీహరిచరిత్రయనియే యర్థము. ఇక్కడ 'ఋతే' అనునది అవ్యయము గాదు. 'ఋగతౌ' అనఁగాఁ దెలియుట అని ధాతువు. దానికృదంతరూపము - "ఋతం" అను పదము, దాని సప్తమీ విభక్తి "ఋతే" - యని తెలియవలెను. అది యవ్యయ మైనచో తేషాం అనుటకు బదులు తేభ్యః అని యుండవలెను. బ్రహ్మాది మనుష్యులచరిత్రను బ్రతిపాదించెడు భారతమును ఇతర గ్రంథములందు పొగడియుండుటయు నాపక్షమున దోషము గానేరదు. కనుక నిక్కడ ఋతే అను దానికిఁ దాత్పర్యజ్ఞాన మేర్పడఁగా అనియే యర్థముఁ జెప్పికొనవలెను.

**11. శ్లో :** ఈ కారణము చేతను శ్రీహరి గుణగణకథామృతముతో నిండిన భారతముతో నెవరికిఁ దృప్తి యగుటలేదని చెప్పుచున్నాఁడు.

యః = ఏ పవిత్ర పాదములైన శ్రీహరి, కర్ణనాడీం అను = శ్రవణముల ద్వారా, పురుషస్య = (హృదయం) యాతః (సన్) భయప్రదాం గేహరతిం, ఛినత్తి, తస్య సూరిభిః, వః, సత్రేషు, ఈడ్యమానాత్, తీర్థపదః అభిధానాత్ = కథను గూర్చి చెప్పెడు భావమునుండి, కః = భక్తిరసము నెఱిఁగిన యే మనుష్యుఁడు, తృప్నుయాత్?

**12. శ్లో :** ఏది మోక్షసుఖమునిచ్చుటకు సమర్థమో యట్టి శాస్త్రమునే యభ్యసింపవలెను, భారతము గ్రామ్యజనులకు సుఖమును గల్గించెడు కథలనే చెప్పుటచేత

పురుషార్థమున కుపయుక్తముగాదను శంకకు సమాధానము, భగవద్గుణానాం, వివక్షు: , తే సఖా, అపి, సర్వజ్ఞుఁడైన, కృష్ణః = వేదవ్యాసుఁడు, భారతం ఆహ, గుణములనేమో చెప్పఁదలఁచెను. కాని చెప్పలేదుగదా! ఎందుకనఁగా జనులు గ్రామ్యసుఖమును వర్ణించెడు కథనే గ్రహింపవలతురు. అనఁగా నుత్తరము చెప్పుచున్నాఁడు. యస్మిన్ = ఏ భారతమును శ్రవణ మననాదులతో నభ్యసించినచో, నృణాం = అధికారిచేతనుల యొక్క, మతి: గ్రామ్యసుఖానువాదై: = గ్రామ్యజనులకు సంతోషమును గల్గించెడు సుఖముల యనువాదమందు, నగృహీత = ఆసక్తముగాదు, (కింతు = మఱియేమనఁగా), హరే:కథాయాం గృహీత = ఆసక్త మగునో అట్టి భారతమునే యభ్యసింపవలెను.

"భారతాన్నపరం విష్ణో ర్మహిమావాచకం క్వచిత్,
భారతాన్న విరాగాయ భారతాన్న విముక్తయే".

అనెడు ప్రమాణముతో సత్యకాముఁడైన వేదవ్యాసుఁడు తాను జెప్పఁదలఁచికొన్న భగవద్గుణములనే భారతమునందుఁ జెప్పినాఁడు.

**13. శ్లో :** భారతము నుండి జనులు శ్రీహరికథనే తెలిసికొందురుగాక, దానినుండి గలుగు ఫలమేమి? అనఁగాఁ జెప్పుచున్నాఁడు. శ్రద్ధధానస్య పుంస: = వివర్ధమానాగ్రామ్యకథను వదలి భగవత్కథయందు అభివృద్ధిఁబొందిన, సా= ఆ, బుద్ధి, అన్యత్రవిరక్తింకరోతి. ఇది మొదటి ఫలము, రెండవ ఫలము భక్తి, మూఁడవ ఫలము ఉపాసనతో నేర్పడెడు అపరోక్షజ్ఞానము, నాల్గవది సమస్త సంసారదు:ఖములను దొలఁగించికొని, స్వరూపానందము ననుభవించెడు మోక్షము, దీనినే వివరించుచున్నాఁడు, హరే: = భగవంతుని యొక్క, నదానుస్మృతి నిర్వృతస్యసంతతస్మరణచే నేర్పడెడు అపరోక్షజ్ఞానముచేత అసంప్రజ్ఞాతసమాధిలో సుఖము ననుభవించెడు చేతనునకు, ఆశు సమస్తదు:ఖాత్యయం, ధత్తే = ఏర్పడెను.

**14. శ్లో :** శ్రీహరికథతోఁగాక దు:ఖనాశ మేర్పడదని చెప్పుచున్నాఁడు. శోచ్యశోచ్యాన్ = శోచింపఁదగినవారి యందును శోచ్యులైన, అవిద: = వైకుంఠుని కథలు తెలియని, అఘేన = విషయాసక్తిచేత, హరే:కథాయాం = శ్రీహరికథయందాసక్తిలేని, తాన్ ప్రతి = అట్టి జీవుల విషయమందు, అనుశోచే = పశ్చాత్తాపపడెదను, అనిమిష: = దేవ: కాలరూపియైన శ్రీహరి, వృథావాదగతిస్మృతీనాం =ప్రయోజనములేనివాదము, నిష్ప్రయోజనమైన జ్ఞానము, ప్రయోజనరహితమైన స్మరణము గల, తేషాం ఆయు: = వారి యాయుస్సును, వృథాక్షిణోతి = నిష్ప్రయోజనముగా ముగించును. తు=

శ్రీహరికథయందాసక్తి గలవారి యాయుస్సు వ్యర్థముగాదు. ఇచ్చట అనుశోచే అని ఆత్మనేపదప్రయోగము చేసిన దానివలన జీవుఁడు శోకమున కాశ్రయుఁడని తెలియుచున్నది. ఇది యసత్యముగాదని చెప్పుచున్నాఁడు.

**15. శ్లో :** తన ప్రశ్నను ముగించుచున్నాఁడు. ఆర్తబంధో: = దీనులకు బంధువైన, కౌషారవ! = మైత్రేయా!, తత్= హరికథావిముఖులు నిరర్థకమైన యాయుస్సు గలవారగుటచేత, శర్మదాతు: = సుఖరూపమైన మోక్షము నొసఁగెడి, తీర్థకీర్తే: = పుణ్యోదకములవలె పాపనాశకమైనకీర్తిగల, అస్యకథాసు, సారం, కథాం ఏవ = చరిత్రనే, పుష్పేభ్య:, ఇవ = వేరు వేరు పుష్పములనుండి సారభూతమైన రసమును సంగ్రహించుటవలె, ఉద్ధృత్య = సకల శాస్త్రములనుండియు సంగ్రహించి, న: శివాయ, కీర్తయ, ఏవ కారముతో హరికథదప్ప వేఱుకథ మంగళకరము గాదని తెలిపినట్లైనది.

**16. శ్లో :** ఆ కథ సారముగూడ సృష్టి మొదలైన శ్రీహరికథయే తప్ప వేఱుగాదని చెప్పుచున్నాఁడు. ప్రగృహీతశక్తి: = సృష్టించవలెనను దనయిచ్ఛాశక్తిని, వ్యక్తపఱచువాఁడై, ప్రకృతి సామర్థ్యమును వశపఱచికొన్నవాఁడై, విశ్వజన్మస్థితిసంయమార్థే = సమస్త జగత్తు యొక్క సృష్ట్యాదులకై, కృతావతార: = వాసుదేవుఁడు మొదలగు నవతారములతో వ్యక్తుఁడైన, స:, ఈశ్వర: = బ్రహ్మరుద్రాదులను నియమించెడు శ్రీహరి, అతిపూరుషాణి = బ్రహ్మదులు చేయలేనట్టి, యాని కర్మాణి, చకార, తాని మహ్యం కీర్తయ, ఈశ్వర: - అనుట చేత బ్రహ్మ సృష్టికర్త, ఈశ్వరుఁడు సంహారకర్త అనెడు భ్రాంతిని బోఁగొట్టినాఁడు.

**17. శ్లో :** మైత్రేయుఁడు విదురుని ప్రశ్న కుత్తరమిచ్చుటకై యారంభించెనని శుకబ్రహ్మ యనుచున్నాఁడు. ఏవం, క్షత్రా, పృష్టః భగవాన్ ముని:కౌషారవ:, తం, బహుమానయన్, పుంసాం = ముముక్షువుల యొక్క, నిశ్రేయసార్థాయ = మోక్షాది పురుషార్థసాధనముగా, ఆహ.

**18. శ్లో :** మైత్రేయుఁడు మెచ్చిన ప్రకారమును జెప్పుచున్నాఁడు సాధో! లోకాన్ సాధు, అనుగృహ్ణతా, అధోక్షజాత్మన: = ఇంద్రియాతీతరూపుఁడైన, ఆత్మన: = పరమాత్మయైన శ్రీహరియొక్క అనఁగా శ్రీహరియందే మనస్సుగలిగినట్టి అని యర్థము. కీర్తిం, వితన్వతా, త్వయా, సాధుపృష్టం.

**19. శ్లో :** ఈ విషయకమైన ప్రశ్న నీకు యోగ్యమైన దనుచున్నాఁడు. త్వయా ఈశ్వర:, హరి:, అనన్యభావేన, గృహీత:, యత్, ఏతత్= అనుటేది గలదో అది, క్షత్త: = బాదరాయణ వీర్యజే! త్వయి న చిత్రం.

**20. శ్లో :** దేవతయగుటచే నీవు శ్రీహరినిగూర్చి ప్రశ్నించిన దాశ్చర్యముగా దనుచున్నాఁడు. భ్రాతుః = వేదవ్యాససహోదరుఁడైన విచిత్రవీర్యుని యొక్క, క్షేత్రే = ఉపభోగమున కర్హురాలైన, భుజిష్యాయాం సత్యవతీ సుతాత్ జాతః = పుట్టిన, మాండవ్యశాపముతో పుట్టిన, భగవాన్, ప్రజాసంయమనః= ప్రజలను నియమించెడు, యమః= యమధర్మరాజే నీవైనదానివలన నిదేమియు నాశ్చర్యముగాదని తాత్పర్యము.

**21. శ్లో :** చ= ఇంకను, భగవాన్ వ్రజన్ = ఈ లోకము నుండి యవ్యక్తుఁడై, వైకుంఠమునకుఁ బోవుచున్నవాఁడై, జ్ఞానోపదేశాయ మాం ఆదిశత్ . అందుచేత నీవు, సానుగస్య = భక్తులతోఁగూడిన, భగవతః నిత్యం సమ్మతః,హి = ఇది శాస్త్రసిద్ధమైన మాట.

**22. శ్లో :** శ్రోతలను అభిముఖులనుగా నొనర్చికొనుటకై చెప్పఁదలఁచిన విషయమును బ్రతిజ్ఞ చేయుచున్నాఁడు. అథ = ఇక మీద, తే = యోగమాయోపబృంహితాః = భగవంతుని యొక్క స్వరూపసామర్థ్యముచేఁగూడిన, విశ్వస్థిత్యుద్భవాంతార్థాః జగత్సృష్ట్యాదులే ప్రయోజనముగాఁ గలిగిన భగవల్లీలాః, అనుపూర్వశః, వర్ణయామి. ద్వైతసంప్రదాయములో నిక్కడికి పంచమాధ్యాయమైపోయినది. తక్కిన శ్లోకములు షష్ఠాధ్యాయములోనివిగా లెక్కింపఁబడినవి. వారి పరిగణనము ననుసరించి పంచమాధ్యాయమందు నిరువది రెండుశ్లోకములు; షష్ఠాధ్యాయమం దిరువదితొమ్మిది. శ్రీధరాదులయభిప్రాయములో నీ శ్లోకము లన్నియు. బంచమాధ్యాయములోనివే. అందుచే ద్వైతు లిచ్చిన సంఖ్యనే యనుసరించుచున్నాను.

**1. శ్లో :** ఇదం, అగ్రే = ప్రత్యక్షసిద్ధమైన, సత్యమైన యీ ప్రపంచసృష్టికి మొదలు(అనఁగా లయకాలమందు), ఆత్మనాం = జీవులందఱకును,విభుః = ఆత్మా, సమస్త కర్మలను గ్రహించి వానికిఁ దగిన ఫలములనొసఁగెడువాఁడు, ఆత్మేచ్ఛానుగతః = తనస్వరూపభూతమైన, సృష్టింపవలె ననెడు నిచ్ఛచేఁ గూడినట్టియు, నానాశక్త్యుపలక్షితః = తనయధీనమైన నానాసాధనసామగ్రితో సహితుఁడైనట్టి, భగవాన్ = సర్వైశ్వర్యసంపన్నుఁడును, ఏకః = సమానాధికరహితుఁడును, స్వతంత్రుఁడునైన, ఆత్మా = పరమాత్మయైన విష్ణువు, ఆస = ఉండెను, హి = ఇది శాస్త్రసిద్ధము, నానాశక్త్యుపలక్షితః అనుట చేత సామాన్యజనుల యిచ్ఛవలె సాధనారహిత మగుటతో భగవదిచ్ఛగూడ వ్యర్థమే యను నాశంకను పరిహరించుచున్నాఁడు.

నానామత్యుపలక్షితః అను పాఠాంతరమందు "త దేవసౌమ్యఇదమగ్ర ఆసీత్", "అసదేవేదమగ్ర ఆసీత్" మొదలైన శ్రుతుల తారతమ్యము దెలియని నానావాదుల మతములందు వేరు వేరు రీతులుగాఁ దెలియఁబడిన అని యర్థ మొనర్పవలెను. అసత్ = (శూన్యము, లేక శూన్యసదృశము) ఉండెననుమతము. "సతోబంధుమసతి నిరుంధన్" - అనెడు నిట్టిశ్రుతుల వలె సంప్రదాయభిన్నమైన యభిప్రాయము.

**తాత్పర్యము :** శ్రీహరియే సమస్తజీవులకును అధిపతి. సమస్త కర్మఫలదాతయు నతఁడే. జీవుల ప్రయోజనమునకై సృష్టింపవలెనను తన యిచ్ఛ ననుసరించి తన యధీనములైన నానాసామగ్రుల నువయోగించి సృష్ట్యాదుల నొనర్చెను. సమానాధికరహితుఁడైన భగవంతుఁడు స్వతంత్రుఁడు. ప్రళయకాలమందుఁ గూడ నుండెను. దీనినే యజ్ఞానులు తమకుఁ దోఁచినట్లు చెప్పెదరు.

**2. శ్లో :** సమానాధికరహితుఁడై స్వతంత్రుఁడైయున్న శ్రీహరికి సృష్టింపవలెనను నిచ్ఛ యేర్పడినరీతిని జెప్పుచున్నాఁడు. తదా= ప్రళయకాలమందు, సుప్తశక్తిః = శ్రీహరియైన తనయందే యత్యంతము రతిగల భార్యయైన లక్ష్మిని బొందినట్టియు, అసుప్తదృక్ = కనులు మూసికొనని అనఁగా (అనుభవము తగ్గని) (యః అసౌ) ఏకరాట్ = తానొక్కఁడే, చక్రవర్తియైన శ్రీ మహావిష్ణువు, ద్రష్టా = సమస్తమును జూచెడు, సః ఏషః = శ్రుతిప్రసిద్ధుఁడైన శ్రీహరి, విశ్వం = జగత్తును, న అవశ్యత్ = సమస్తకార్యములును, మూల ప్రకృతియందు లీనమై యుండుటచేత కార్యరూపములుగా లేవని తెలిసెను. ఆత్మానం = జీవులసమూహమును, న సంతం ఇవ = అశక్తమైనదిగా తలఁచెను, ద్రష్టాయనుటచేత నతనికి చూచెడి శక్తిలేదు అనెడు నాశంకను బరిహరించినాఁడు. "నహి ద్రష్టు ర్దృష్టే ర్విపరిలోపో విద్యతే" - అనెడు శ్రుతి యీ విషయమందుఁ బ్రమాణమని, "వై" అను దానితోఁ దెలియఁ బఱచినాఁడు. దీనినే 'అసుప్తదృక్' - అనుదానితో వివరించినాఁడు. "ఆత్మానం" - అనునది జాత్యేకవచనము. జీవులు నిత్యు లగుటచే వారియసత్వమునకు 'అశక్తి' యనుటయే యర్థము. - "పరమాత్మా యతో జీవం మేనే సంత మశక్తతః" అనునదియుఁ బ్రమాణము. "పురుష ఆసీత్" - అనెడు శ్రుతి గూడ ప్రళయకాలమందు జీవు లున్నారనియే తెలుపుచున్నది. "శక్తి" అనుటకు భార్య అమనర్థము కోశములలోఁ గలదు. "సుప్తిస్తు ప్రకృతేః ప్రోక్తా అతీవ భగవద్రతిః" - అనెడు ప్రమాణముతో లక్ష్మి వేఱుగా నుండకపోవుటచేత ఆమె దర్శనముగూడ లేకుండెనని తెలిపిన ట్లైనది. శ్రీహరి కనులు మూసికొని యుండెననుటతో నాతఁ

డు ద్రష్టగా నుండలేదు అనెడు నాశంకను బరిహరించుటకే "అసుప్తదృక్" అని చెప్పఁబడినది. భాగవతమున నక్కడక్కడ 'కనులుమూసికొని యుండెను' - అను మాటకు తన యందుఁదప్ప వేఱుదానియం దాసక్తి లేనివాఁడై అని మాత్రమే యర్థము జెప్పికొనవలెను. "అనాస్థాఽన్యత్ర చ ప్రోక్తా విష్ణోశ్చక్షుర్నిమీలనం" - అను ప్రమాణమీ యర్థమునే స్థిరపఱచుచున్నది.

**తాత్పర్యము :** శ్రీహరి భార్యయగు లక్ష్మీదేవి గూడ నా ప్రళయకాలమందు పరమపురుషుని యం దత్యంత రక్తి గలదై బయటి కగుపడకయే యుండెను. పరమాత్మయుఁ గనులు మూసి కొనియుండలేదు. తనయందుఁదప్ప తక్కినదేని యం దాసక్తి లేనివాఁడుగ నుండెను. సర్వద్రష్టయు సర్వస్వామియునైన పరమాత్మకు "సమస్తకార్యములనుఁ గారణమందు లీనమైన వగుటచేత కార్యరూపముగా విశ్వము లేదని తెలియును. ఉన్న జీవరాసులు శక్తిరహితములై యుండుటతో అవియున్నను లేనట్లే యుండెనని గ్రహించెను.

**3. శ్లో :** శక్తి యొక్క పేరును జెప్పుచున్నాఁడు - హే మహాభాగ! (1) అతిశయమైన భాగ్యరూపము గల (2) అతిశయమైన ప్రకాశరూపమైన మోక్షమునందెడు నట్టి విదురుఁడా! విభుః యయా = ఏ చేతన ప్రకృతి యైన లక్ష్మీదేవిచేత జడప్రకృతిచేత, ఇదం = ఈ సత్యమైన ప్రపంచమును, నిర్మమే, ఏతచ్చసంద్రష్టుః = సమస్తమును సంపూర్ణముగాఁ జూచెడునట్టి శ్రీమన్నారాయణుని యొక్క, సదసదాత్మికా = (1) కార్యకారణములందు వ్యాపించిన (ఇది చేతన ప్రకృతి పరమైన యర్థము). (2) మహత్తత్త్వము మొదలైన కార్యకరణస్వరూపమైన (ఇది జడప్రకృతిపరమైన యర్థము), సా శక్తిః = ప్రళయకాలమందు శ్రీహరి సాయుజ్యమును బొంది క్రీడించెడు లక్ష్మీదేవియు, వై = ఇంకను జడప్రకృతియు, మాయానామ = సర్వప్రధానుఁ డగుటచేత, మయుఁడనిపించికొనెడు విష్ణువునకు సంబంధించిన దగుటచే మాయయని పిలువఁబడుచున్నది.

**తాత్పర్యము :** ఓ విదురా! శ్రీహరి జడ ప్రకృతి, దాని కభిమానినియైన చేతన ప్రకృతియైన లక్ష్మిని ఉపయోగించికొని సత్యమైన యీ ప్రపంచమును నిర్మించినాఁ డు. కార్యకారణములను వ్యాపించి శ్రీహరియొక్క భిన్నశక్తి యనిపించికొన్న లక్ష్మీదేవియు మహత్తత్త్వాది కార్యకారణము లనిపించికొన్న జడప్రకృతియు, "మాయ" యని పిలువఁబడును. సర్వప్రధానుఁడైన శ్రీహరికి మయుఁడని పేరు. అతనికి సంబంధించిన దగుటచే మాయ యనెడు నామము అన్వర్థమైనది.

4. శ్లో : జగన్నిర్మాణమును వివరించుచున్నాఁడు. - వీర్యవాన్! (1) అమోఘమైన వీర్యముగల (2) నపుంసకరూపములేని, అధోక్షజః = శ్రీహరి, ఆత్మభూతేన = తన మూల రూపమునుండి వ్యక్తమైన, పురుషేణ = "జగృహే పౌరుషం రూపం" అని ముందుఁ జెప్పిన పురుషరూపమునుండి కాలవృత్యాం = జీవుల యదృష్టమను ఫలమును పచన మొనర్చెడు కాలము నుండి, సృష్టిచ్ఛ మొదలైన వ్యాపారము గల (ఇది చేతన ప్రకృతి విషయము), కాలము నుండి క్షోభయనెడి వ్యాపారముగల (ఇది జడప్రకృతి విషయము), గుణమయ్యాం = క్రమముగా, సత్త్వరజస్తమో గుణములకు అభిమానిని యైన సత్త్వాదిరూపమైన, మాయాయాం = చేతన ప్రకృతియనిపించికొన్న లక్ష్మీదేవి యందు - జడప్రకృతియందు, వీర్యం = క్రమముగా రేతస్సును పరిణామమందెడు సామర్థ్యమును, ఆధత్త = ఉంచెను, తు= ఇవి రెండును, అత్యంత విలక్షణములైనవి. శ్రీహరికి నపుంసకరూపము లేదనుటలో "నైనం వాచా స్త్రియంబ్రువన్" నైన మస్త్రీ పుమాన్ బ్రువన్" - అనెడు శ్రుతియే ప్రమాణము. అమోఘవీర్యః - అనుటకు నితఁ డుంచిన వీర్యమునకు జగన్నిర్మాణసామర్థ్య మున్నదని యర్థము.

**తాత్పర్యము :** శ్రీహరికి నపుంసకరూపము లేదు. ఆతని వీర్యము జగత్తును సృష్టించు సామర్థ్యము గలది, ఇట్టి మూలరూపియైన నారాయణుఁడు తననుండి పురుషుఁ డను పేరుగల వాసుదేవరూపమును వ్యక్త మొనర్చెను. త్రిగుణాభిమానినియు, జీవుల యదృష్టఫలముల నొసఁగెడు కాలమునుండి ప్రేరితయై సృష్టి యొనర్పవలె ననెడు నిచ్ఛగల లక్ష్మీదేవియం దీవీర్యము నుంచెను. అట్లే రజస్తమోగుణాత్మకమైన జడప్రకృతియందు పరిణామమునందెడి సామర్థ్యమును వ్యక్త మొనర్చెను. పురుషనామక శ్రీహరి సమస్త జీవరాసుల కదృష్టసాక్షి. ఇతనిచే ప్రేరితయై పరిణామమునందెడి శక్తిని వ్యక్తపఱచికొన్న జడప్రకృతినుండి మహత్తత్త్వమనెడు జడము జన్మించెను. ఇదే బ్రహ్మదేవుని శరీరము.

5. శ్లో : లోకమందు వీర్యమును నిక్షేపించువారే కార్యమును నెరవేర్చుటలేదు కాని శ్రీహరి యట్టివాఁడు కాదు. ఎందుకనఁగా కార్యోత్పత్తిగూడఁ గన్పడుచున్నది అని చెప్పుచున్నాఁడు. - కాలచోదితాత్ = సకల జీవరాసుల యదృష్టసాక్షి యనిపించికొన్న పురుషనామకుఁడైన శ్రీహరినుండి సృష్టికుద్బోధకమైన కాలముచే ప్రేరితమైన, అవ్యక్తాత్ = అత్యంతసూక్ష్మమగుటచేత అవ్యక్త మనిపించికొన్న, తతః = శ్రీహరి నుండి పరిణామము నందెడు శక్తిని ధరించిన జడప్రకృతి నుండి మహత్తత్త్వం =

బ్రహ్మదేవుని శరీర మనిపించికొన్న మహత్తత్త్వము, అభవత్. శరీరాభిమానికి శరీరమునం దభిమానమును బుట్టింప కున్నచో శరీరసృష్టి వ్యర్థమేగదా! దానికి సమాధానము: ఆత్మదేహస్థం = తన శరీరమం దడఁగియున్న, విశ్వం = ప్రపంచమును, వ్యంజన్ = ప్రకాశపఱచునదై, తమఃనుదన్ = (1) నారాయణుని యనుగ్రహముతో నుండెడు జ్ఞానప్రకాశము చేత సూర్యునివలె నాకాలమందలి చీఁకటిని బోఁగొట్టి యుండువాఁడుగా, (2) శరీరప్ర యుక్తమైన కాంతి హీనత లేని వాఁడుగా (3) ఆత్మాభిమానము లేనివాఁడుగా, విజ్ఞానాత్మా = విజ్ఞాన స్వరూపుఁ డైన బ్రహ్మదేవుఁడు, తతః = అవ్యక్తమున కభిమానిదేవత యగుటచేత నవ్యక్త మని చెప్పఁబడెడు కూటస్థురాలైన రమాదేవినుండి, అభూత్ = వ్యక్తమయ్యెను, విజ్ఞానాత్మా = అనుట చేత నుత్పత్తికి ముందు బ్రహ్మకు జ్ఞానము నాశముగాలేదనియు సూచించిన ట్లైనది. తమోనుదన్ అనుటచేత జగద్వ్యక్తతకు నవసరమైన ప్రకాశమును గూడ సూచించిన ట్లైనది.

**తాత్పర్యము** : అవ్యక్తత్వాభిమానియైన రమాదేవినుండి బ్రహ్మ సృష్టింపఁబడెను. ఇతఁడు తనదేహ మనిపించికొన్న మహత్తత్త్వమందు అణఁగియున్న ప్రపంచమును వ్యక్తమొనర్చెను. ఇతఁడు విజ్ఞాన స్వరూపుఁడు. అజ్ఞానమను చీఁకటిని బోఁగొట్టువాఁ డు. సృష్టికిముం దీతని జ్ఞానము నశింపలేదు. ఇతఁడే జీవాభిమాని. సత్త్వాదిగుణములను నియమించు శక్తి గలవాఁడు.

**6. శ్లో** : అంశగుణకాలాత్మా = జీవులు, సత్త్వాదిగుణములు, కర్మలు ఫలించునట్లొనర్చెడు కాలము - వీని కభిమానియైన, సః అపి = ఆ మహత్తత్త్వాభిమానియైన బ్రహ్మయును, భగవద్దృష్టిగోచరస్సన్ = హరికటాక్షమునకు విషయువైనవాఁడై, అస్య విశ్వస్య సిసృక్షయా, ఆత్మానం = తనదనెడు నభిమానమునకు విషయమైన మహత్తత్త్వమును, వ్యాకరోత్ = పరిణామ మొందున ట్లొనర్చెను. వీని చేత ప్రపంచపంచీకరణము వివరించిన ట్లైనది. ఆత్మానం = అనుటకు చైతన్యమని యర్థ మొనర్పరాదు. ఎందుకనఁగా నది వికారరహితము. అందుచేతనే శరీరమైన మహత్తత్త్వమని యర్థ మొనర్పవలెను. 'కాలాత్మా' - అనుచోట నున్న ఆత్మన్ శబ్దము అభిమాని అనునర్థములో వాడఁబడినది. దేహమనెడు నర్థములో గాదు. "కాలజీవగుణాదీనాం అభిమానీచతుర్ముఖః" అనిప్రమాణము. కొన్నిచోటుల బ్రహ్మదేవునియంశమని పేర్కొనుట కద్దు. "సర్వజీవాభిమాని త్వా దంశఇత్యేవ చోచ్యతే" అని ప్రమాణము.

7. శ్లో : వికుర్వాణాత్ = పరిణామము నందిన, మహత్తత్త్వాత్ = మహత్తత్త్వమునుండి అభిమానియైన బ్రహ్మదేవునినుండి, కార్యకారణకర్త్రాత్మా = శరీరము, ఇంద్రియములు మనస్సు- వీని కాదికారణమైన, అందుచేతనే భూతేంద్రియ మనస్సుల కుత్పత్తిస్థానమైన, అహంతత్త్వం = అహంకారతత్త్వము, అజాయత = ఏర్పడెను. అహంకారతత్త్వమున కభిమానులైన గరుడ శేష రుద్రులు సృష్టింపఁ బడిరని యర్థము. "భూతం భూతాభిమానీ చ" అనెడు ప్రమాణము ననుసరించి జడమునుండి జడతత్త్వము పుట్టినదని అభిమానిదేవతనుండి తదభిమాని దేవత పుట్టినదని తెలియవలెను.

**తాత్పర్యము** : కర్మఫలకారణమైన కాలమున కభిమానియు, శ్రీహరి కటాక్షవిషయమున్నైన బ్రహ్మ ప్రపంచమును సృష్టింపవలెనను కోర్కెతో మహత్తత్త్వమునుండి యహంకారతత్త్వము జనించెను. ఇదే శరీరేంద్రియమనస్సులకు మూలకారణము. దీనినుండియే పంచభూతము లుత్పన్నము లైనవి. బ్రహ్మదేవుని నుండి యహంకారాభిమానులైన గరుడ శేషరుద్రాదులు సృష్టింపఁబడిరి. ఇఁకపై నిట్లే జడమునుండి జడము, అభిమానిదేవతనుండి తదభిమానిచేతనులు సృష్టింపఁ బడిరని తెలియవలెను.

8. శ్లో : భూతేంద్రియమనస్సులకుఁ గారణమైన యహంకారతత్త్వమునకు నామభేదములతో నేర్పడిన త్రైవిధ్యమును జెప్పుచున్నాఁడు. అహం అహంకారతత్త్వము వైకారిక తైజస తామసములని, త్రిధా = మూఁడు రీతులు. ఇప్పుడు ముప్విధములైన యహంకారమునుండి సృష్టి భేదమును జెప్పుచున్నాఁడు. ఆరవశ్లోకమందున్న "అంశగుణకాలాత్మా, భగవద్దృష్టి గోచరః" - అను రెండు సమాసములను ఇక్కడఁ గూడఁ జేర్చికొనవలెను. జీవులు, సత్త్వాదులు, కాలము- వీని ననుసరించి శ్రీహరిప్రేరణచేత, వికుర్వాణాత్ = వికారము నొందిన అహంతత్త్వమునుండి , వైకారికాత్ = వైకారికమను పేరుగల్గిన, మనః = మనస్సు, అభూత్.

**తాత్పర్యము** : ఈ యహంకారతత్త్వము వైకారిక , తైజస, తామసములని మూఁడు రీతులు. వైకారికాహంకారమునుండి మనస్సును, తదభిమానులైన యింద్ర, కాములును సృష్టింపఁబడిరి.

9. శ్లో : యతః = ఏ దేవతలనుండి, అర్థాభివ్యంజనం = విషయజ్ఞానము.

**10. శ్లో :** (భవతి) యే వైకారికాః దేవాః = ఇంద్రియాభిమానులైన వైకారికులను దేవతలు గలరో, తేచ = వారుగూడ, వైకారికాహంకారమునుండి పుట్టిరి. జ్ఞానకర్మమయాని = జ్ఞానప్రధానములైన శ్రవణాదులు, కర్మప్రధానములైన వాగాదులు ననెడు, ఇంద్రియాణిచ = జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములు, తైజసాన్యేవ = తైజసాహంకారమునుండియే పుట్టినవి. తామసాహంకారము, భూతసూక్ష్మాదిః = సూక్ష్మభూతము లనిపించికొన్న శబ్దాదులైన తన్మాత్రలకు - అనఁగా శబ్దాదులైన తన్మాత్రలు తామసాహంకారమునుండి పుట్టినవి. యతః = ఏ శబ్దతన్మాత్ర నుండి, ఆత్మనః = శ్రీహరికి, లింగం= గమకమైన, ఖం = అభూత్

**తాత్పర్యము :** వైకారికాహంకారము నుండి యింద్రియాభిమాను లనిపించికొన్న వైకారిక దేవతలు సృష్టింపఁబడిరి. తైజసాహంకారమునుండి వాగాది కర్మేంద్రియములు సృష్టములు. తామసాహంకారమునుండి శబ్దాదితన్మాత్రలు- అనఁగా సూక్ష్మభూతములు జన్మించెను. శబ్దము నుండి యాకాశము పుట్టెను. ఇదియే శ్రీహరికి గమకమైన ప్రమాణము.

**11. శ్లో :** కాలమాయాంశయోగేన = సృష్టికాలము, జడప్రకృతి, జీవాభిమానియైన బ్రహ్మ- వీని యొక్క సన్నికర్షమనెడు సంబంధముచేత, భగవద్వీక్షితం, తామసానుస్మృతం = తనకుఁగారణమైన తామసాహంకారముతోఁ గూడినట్టియు, అందుచేతనే, వికుర్వత్ = పరిణామమునందిన, నభః = స్పర్శం = స్పర్శ తన్మాత్రను, నిర్మమే. తతః, అనిలం = వాయువును సృష్టించెను.

**12. శ్లో :** పైనఁ జెప్పిన కాలాది సహకారికారణములచేతను, నభసా = తనకుఁ గారణమైన యాకాశముతోడను గూడుటవలన, ఉరుబలాన్వితః, వికుర్వాణః, అనిలః , అపి, రూపతన్మాత్రాం,ససర్జ. ఆ రూపమునుండి లోకస్య = ప్రపంచముయొక్క, లోచనం = ప్రకాశకమైన, జ్యోతిః = తేజస్తత్త్వము జన్మించెను.

**13. శ్లో :** కాలమాయాంశయోగతః = పరిణామము, ప్రకృతి, బ్రహ్మ యనెడు సహకారికారణములచేతఁగూడిన, పదవీక్షితం = శ్రీహరిచే వీక్షింపఁబడిన, వికుర్వత్ = పరిణామమునందుచున్న, అనిలేన = వాయువుచేత, అన్వితం = జ్యోతిః, రసమయం = రసతన్మాత్రమునకు కార్యమైన, అంభః అధత్త

**14. శ్లో :** పరిణామము ప్రకృతి బ్రహ్మ యనెడు సహకారి గుణములచేఁ గూడినట్టియు, శ్రీహరిచేత వీక్షింపఁబడి పరిణామమును బొందుచున్న, జ్యోతిషా = తేజస్సు చేత, అనుసంస్పృష్టం = కూడిన, అంభః, గంధగుణాం, మహీ అధాత్.

15. శ్లో : వైశేషికమతమందు శబ్దాదులు ఆకాశాదులవిశేషగుణములనియు, అవియే వాని లక్షణము లనియుఁ జెప్పఁబడినది. ఆ మతమును నిరాకరించుచున్నాఁడు. నభ ఆదీనాం భూతానాం = భూతముల మధ్యలో, పరాక్ = వెనుకటివాని నుండి, పరం = ముందున్నవి, యద్యత్ = ఏవేవి, భావ్యం, తేషాం = వానికి, పరానుసంసర్గాత్ = వెనుకటి భూతములసంబంధమువలన (కారణములు కార్యములందుఁ జేరుటవలన) యథాసంఖ్యం = క్రమముగా, గుణాన్ = శబ్దాదిగుణములను (వైశేషికాత్ ఇతరే), వైశేషికులకంటెను భిన్నమైన మతము ననుసరించువారు, విదుః = తెలియుదురు.

**తాత్పర్యము** : ఆకాశమునకు శబ్దము, వాయువునకు శబ్దస్పర్శములు, తేజస్సునకు శబ్దస్పర్శరూపములు, జలమునకు శబ్ద, స్పర్శ, రూప, రసములు, భూమికి శబ్ద, స్పర్శ, రూప, రస గంధము లనియు నర్థము.

16. శ్లో : బ్రహ్మాండము యొక్క యుత్పత్తి ప్రకారమును జెప్పుటకై మహత్తత్త్వాద్యభిమానులైన దేవతలు శ్రీహరిని స్తోత్ర మొనర్చి రని చెప్పుచున్నాఁడు. విష్ణోః కలాః, భిన్నాంశములైన, కాలమాయాంశలింగినః = కాలము, ప్రకృతి, జీవాభిమానియైన బ్రహ్మ- వీరు నిమిత్తముగా దేహమునందినట్టియు, నానాత్వాత్= విభిన్నులగుటచేత (ఒకరితోనొకరు చేరకుండుటచేత), స్వక్రియానీశాః= తమకార్యమైన బ్రహ్మాండోత్పత్తియందు సమర్థులుగాని, యేతే = పైనఁజెప్పిన మహత్తత్త్వాది తత్త్వాభిమానులైన బ్రహ్మాదులు, దేవాః ప్రాంజలయస్సంతః, విభుం, ప్రోచుః= స్తోత్ర మొనర్చిరి.

ఇచ్చట బ్రహ్మదేవునకు కాలము, జీవాభిమానియనెడు రెండు రూపము లున్నవని తెలియవలెను. దీనికిఁ బ్రమాణము -

"కాలజీవాభిమానేన రూపద్వంద్వ శ్చతుర్ముఖః"

17. శ్లో : స్తోత్రప్రకారమును వివరించుచున్నాఁడు. దేవ! యన్మూలకేతాః, యతయు, అంజసా, ఉరుసంసారదుఃఖం, బహిః, ఉత్క్షిపంతి, తత్ ప్రపన్నతాపోపశమాతపత్రం= వివిధతాపములను బోఁగొట్టెడు, తేపదారవిందం నతాస్మః = గొడుగు తాత్కాలిక తాపమునే పోఁగొట్టును. కాని శ్రీహరి పాదకమలము అనాదియైన సంసారదుఃఖమునే నాశ మొనర్చునను విషయమును యన్మూలకేతాః అనుదానితోఁ దెలిపిన ట్లైనది.

**18. శ్లో :** భగవన్ ఈశః= అణిమాదిపరిపూర్ణైశ్వర్యమే దేహముగాఁ గలిగినవాఁడా! అస్మిన్ భవే = ఈ సంసారమందు, తాపత్రయేణ = మూఁడు విధములైన తాపములచేత, అభిహతాః = సర్వరీతుల వేధింపఁబడిన, జీవాదియత్- బంధము నుండి ముక్తుఁడగుట కుపాయమైన నీ పాదారవిందములను, ఋతే = సేవింపక, ఆత్మన్ = తమ యందు, శర్మ = సుఖరూపమైన మోక్షమును, న లభంతే = పొందుటలేదో, అతః = ఆ కారణముచేత, తవ అంఘ్రిచ్ఛాయాంశవిద్యాం = బ్రహ్మవిద్య యొక్క యేకదేశమును, ఆశ్రయేమ = ఆశ్రయింతుము,

"బ్రహ్మవిద్యాహరేః ఛాయా తదంశో హి సురేష్వపి,

సర్వవిద్యాశ్రయఃప్రోక్తః ప్రధానాంశ శ్చతుర్ముఖః." అనెడు ప్రమాణము చేత జీవోత్తముఁడైన బ్రహ్మదేవుఁడే సర్వబ్రహ్మవిద్యకును సమర్థుఁడు. తక్కిన దేవత లందఱును వారి వారి తారతమ్యమునకుఁ దగినట్లుగా నంశములుగా బ్రహ్మవిద్యను గ్రహింతురు. పై శ్లోకమందు శ్రీహరి పాదారవిందములే సుఖకారణము లని చెప్పి యీ శ్లోకమందు తత్పాదములను సేవింపకున్నచో సుఖములేదని తెల్పుచున్నాఁడు. ఇట్లు చెప్పుటకు వ్యతిరేకన్యాయమనిపేరు. "ఛాయాంసవిద్యాం" - అని శ్రీధరుల పాఠము, "ఛాయాంశవిద్యాం" - అని విజయధ్వజాలు.

**19. శ్లో :** ఈ కారణము చేతఁగూడ జీవులకు శ్రీహరిజ్ఞానమే వారివారి యభీష్టము నందుటలో సాధనమనెడు నభిప్రాయముతో స్తోత్ర మొనర్చుచున్నాఁడు. ఋషయః = బ్రహ్మాదులైన జ్ఞానులు, వివిక్తే = ఏకాంతమందుండి, ముఖపద్మనీడైః = ముఖకమలమే తమకు నివసించు గూడుగానున్న, ఛందస్సు పర్ణైః = వేదములనెడు పక్షులచేత, యత్ = ఏ నీ పాదములను, మార్గంతి = వెదకుదురో, చ = ఇంకను, యత్ = దేనినుండి, అఘమర్షః = శరణన్నవారి యొక్క పాపములు నశించునో,చ = ఇంకను, యత్ = ఏ పాదములు, ద్యుసరిద్వరాయాః = గంగాదేవికిని, భూదేవికిని, పరంపదం = ముఖ్యమైన యాశ్రయమై యున్నవో, తత్ = అట్టి, తీర్థపదః = పవిత్రములైన పాదములుగల, తే = నీ యొక్క, పదం = పాదమును, ప్రపన్నాః = శరణుఁబొందియున్నాము.

"యచ్ఛాఘమర్షోద సరి ద్వరాయాః" - అని శ్రీధరుల పాఠము.

యచ్ఛాఘమర్ష్యో ద్యుసరిద్వరాయాః" - అని విజయధ్వజాలు.

"ఛందస్సుపర్ణైర్మునయః" అని శ్రీధరులు, "ఋషయః" అని విజయధ్వజాలు.

20. శ్లో : ఈ పాదములను బొందుటకు అవసరమైన సాధనమును జెప్పుచున్నాఁడు. ధీరాః = జ్ఞానులు, శ్రద్ధయా = శ్రద్ధచేతను, శ్రుతవత్యా = శాస్త్రార్థజ్ఞానపూర్వకమైన, భక్త్యాచ = భక్తి చేతను, సమ్మృజ్యమానే = చక్కగా శోధింపఁబడుచున్న, హృదయే = మనస్సునందు, యత్ = ఏ పాదములను, అవధార్య= నిలిపికొన్నవారై, వైరాగ్యబలేన = వైరాగ్యమే బలముగాఁగల, జ్ఞానేన, యత్, తే, అంఘ్రిసరోజపీఠం = పాదకమలములనెడు ఆసనమును, వ్రజంతి= పొందుదురో- అట్టి నీ పాదముల నాశ్రయింతుమని యన్వయము.

21. శ్లో : శ్రీహరియొక్క యవతారకార్యము లన్నియు లోకోపకారమునకే. స్వార్థమునకుఁ గాదని చెప్పుచున్నాఁడు. అందుచేత స్మరణమాత్రప్రీతుఁడైన పరమాత్మ భక్తుల యభీష్టములను నెరవేర్చునెడు నభిప్రాయముతో స్తోత్రముఁ జేయుచున్నాఁడు. - ఈశ! విశ్వస్యస్థితి సంయమార్థే, కృతావతారస్య = పురుషాదిరూపములను ధరించిన, తేపదాంబుజం, యత్ = ఏది, స్మృతం = స్మరించినంత మాత్రముననే, స్వపుంసాం = భక్తులగు నధికారిచేతనులకు, అభయం ప్రయచ్ఛతి, తత్ సర్వే శరణం వ్రజేమ.

22. శ్లో : వైరాగ్యముచేతనే వైకుంఠుని పాదములను బొందుటకు సాధ్యమను నభిప్రాయముతోఁ జెప్పుచున్నాఁడు. సానుబంధే = పుత్రాదిపరికరములతో నిండిన, అసతి = మోక్షప్రతిబంధకమైన, దేహగేహే = వేరు వేరు యోనులందును, గేహమునందును, మమ, అహం ఇతి = దేహమందు నేననియు, నింటియందు నాదనియు, ఊఢదురాగ్రహాణాం = దుష్టమైన యభిప్రాయముతోఁగూడిన, పుంసాం = జీవులకు, పుర్యాం = దేహమునందు, వసతోఽపి = వసించుచున్నను, యత్పదాంబుజం, సుదూరం, సర్వధా - జ్ఞానవిషయముగాదో, భగవన్, తే, తత్ పదాబ్జం భజేమ.

23. శ్లో : సమీపమందే యున్నను శ్రీహరిదర్శనము గానందులకుఁ గారణమేమి? దీనికి సమాధానము. హే పరేశ= సర్వోత్తమ నియామకుఁడైనవాఁడా! ఉరుగాయ = లక్ష్మీబ్రహ్మాదులచేత స్తోత్ర మొనర్పఁబడినవాఁడా, యత్ తే, న్యాసవిలాసలక్ష్మ్యాః = సమస్తకర్మములను భగవదర్పణ మొనర్చుట చేత సంతోషపడెడు సన్న్యాసుల దర్శనమునకు, పదం = (1) విషయమైన, (2) భూమిపై నడుగు పెట్టెడు విలాసకాంతి కాశ్రయమైన, పదం = పాదమును, న పశ్యంతి = చూచుట లేదు, నూనం = దీనిచేత, శ్రీహరిని పరమహంసాశ్రమమందున్నవారే వీక్షింతు రని చెప్పినట్లైనది.

ఇచ్చట పాదముల స్తోత్రము యుక్తముగాదను శంకను గూడ పరిహరించినట్లైనది, శ్రీధరులపక్షమందు "పదన్యాస విలాసలక్ష్మ్యాః" అనుటంతయు నొక్కటే సమాసము. పదం, న్యాసవిలాసలక్ష్మ్యాః అని విజయధ్వజులు.

**24. శ్లో** : ఈ రీతిగా, మహిమోపేతుఁడైన వైకుంఠుని యపరోక్ష జ్ఞానమునకు సాధనమైన యుపాసన రెండురీతులు. ఒకటి ధ్యానము; రెండవది వేదాంతశాస్త్రము యొక్క శ్రవణము, మననము మొదలైనవి, వీనిలో మొదటిది క్లేశసాధ్యము. రెండవది యెక్కువ క్లేశము లేకయే సిద్ధించునది. ఈ విషయమునే చెప్పుచున్నాఁడు. హే దేవ! తే. కథాసుధాయాః పానేన, ప్రవృద్ధభక్త్యా, యే, విశదాశయాః, తే, వైరాగ్యసారం = వైరాగ్యమునకు ఫలమైన, బోధం = నీ యపరోక్షమును, ప్రతిలభ్య = పొందినవారై, అంజసా = సరియైన మార్గముతో, అకుంఠధిష్ణ్యం = స్వల్పమును లోపములేని వైకుంఠము మొదలైన స్థానములుగల, అపరిచ్ఛిన్నరూపుఁడవైన, త్వా = నిన్ను, యథా = ఏ ప్రకారముగా, ఈయుః = చేరుదురో

**25. శ్లో** : తథా= అట్లే, అపరేచ = ఇతరులైన (యోగినః = యమనియమాది యోగాభ్యాసమం దాసక్తులైనవారు), ఆత్మసమాధియోగబలేన = శ్రీహరియం దే ఏకాగ్రమైన చిత్తమనెడు ధ్యానసామర్థ్యముచేత, బలిష్ఠా = వేరుసాధనచేత జయింపరాని, ప్రకృతిం = బంధనశక్త్యభిమానిని, జిత్వా = జయించి, ధీరాః = అపరోక్షజ్ఞానులై, పురుషం = పూర్ణమైన షడ్గుణములు గలవాఁడనిపించికొన్న, త్వాం ఏవ = నిన్నే, విశంతి = ప్రవేశింతురు, తేషాం = అట్టి యోగులకు, శ్రమఃస్యాత్ = ఆయాస మగును. తే సేవయా = నీ కథలను శ్రవణ మొనర్చుట మొదలగు సేవలతో, న తు = ఎప్పుడును, నాయాసము గలుగదు. సుఖమే యగుననుచున్నాఁడు. ఇచ్చట బంధకశక్తియైన ప్రకృతిని జయించుట శ్రీహరి యనుగ్రహము చేతనే సాధ్యమగుచున్నది యనుచున్నాఁడు. "వాయోశ్చప్రకృతేర్విష్ణోః జయోభక్త్యైవ నాన్యథా - అని దీనికి ప్రమాణము.

**26. శ్లో** : స్తోత్రముతో శ్రీహరిని బ్రసన్నునొనర్చికొని యిపుడు తమ యభీష్టమును నివేదించికొనుచున్నారు. తత్ = నీవు సజ్జనులందు దయాళు వగుటచేత, త్వయా = నీచేత, లోకసిసృక్షయా = ప్రపంచమును సృష్టింపవలెనను నిచ్ఛతో, త్రిభిః ఆత్మభిః = కాలము, మాయ, అంశము - ఈ మూఁడిటిచేత, యే = ఏ మేము, విసృష్టాః = విశేషముగా సృష్టింపఁబడితిమో, తే వయంఆ మేము, సర్వే, అద్య, వియుక్తాః = పరస్పరసంబంధము లేక వియుక్తముగ నున్నాము, తే, స్వవిహారతంత్రం = క్రీడాసాధనమైన, యత్ = ఏ బ్రహ్మాండము గలదో, తత్ = దాని యొక్క, ప్రతికర్తవే = సృష్టించుటకు, నశక్నుమః = సమర్థులము గాలేము.

27. శ్లో : (బహ్మాండసృష్టితో (ప్రయోజనమును జెప్పుచున్నాఁడు - హే అజ = ఓ స్వామీ! యావత్ = ఎంతవఱకు, బలిం = పూజను, (భక్త్యా) హరామః = భక్తితో నొనర్తుమో, అంతవఱకు (బహ్మాండమును సృష్టించి దాని యందుండి త్వద్విషయకమైన జ్ఞానమును, నిన్నుద్దేశించి యొనర్చెడు కర్మలనెడు బలిని (అనఁగా కానుకను), ఒప్పించి నిన్ను తృప్తిపఱతుము. యత్ర = ఏ (బహ్మాండమందు, స్థితః,వయం,కాలే = ఆయాసమయమందు, యథా = అన్నం దదామః, మామా కార్యములందు వ్యవహరింతుమో, తథా = అట్లు, ఉభయేషాం = మాకును నీకును, బలిం = పూజను, హరంతః = ఒనర్చెడు, తే ఇమే = ఈ, అనీశాః = మా(పేరణలేనిది (ప్రవృత్తు లగుటకు సామర్థ్యములేని, లోకః = జనులు, ఇహ = ఈ (బహ్మాండమందు, అన్నం = జ్ఞానకర్మలనెడు తమ కార్యములను, అదంతి = చేతురో (అనుభవింతురో), అట్టి (బహ్మాండమును, సృష్టింపుమని యైనను లేక అట్టి (బహ్మాండమును సృష్టించుటకు మేము సమర్థుల మగునట్లు ఒనర్పుమని అన్వయము.

**తాత్పర్యము :** మేము భక్తితో నీపూజ నొనర్ప నిశ్చయించినాము. (బహ్మాండమును నిర్మించి దానియందుండి త్వద్విషయకములైన జ్ఞానకర్మలను నిర్వహించుటే మేము నీ కిచ్చెడుకానుక. కనుక మేము మాకార్యములందుఁ (బవృత్తు లగునట్లు మమ్మనుగ్రహింపుము. మా (పేరణ లేనిదే (ప్రవృత్తు లగుటకు సామర్థ్యము లేని యీ జనులు గూడ (బహ్మాండమందు తమ తమ సాధనను నిర్వహించికొనునట్లనుగ్రహింపుము. దీనికై (బహ్మాండమును సృష్టింపుము.

28. శ్లో : నాకే మీరెందుకు విజ్ఞాపించికొనుచున్నారు? ఇతరుల నెందుకు వేడరు? దానికి సమాధానము: ఓ స్వామీ! సాన్వయానాం = సంతతిఁతోగూడిన, సురాణాం = దేవతలైన, నః, త్వం ఆద్యః = ఉత్పత్తికిఁ గర్తయైన తండ్రివి. అందుచే నీకే విజ్ఞాపించికొనుచున్నాము. త్వం = పురాణః, పురుషః= శ్రీమన్నారాయణుఁడవు, త్వం = కూటస్థః= వికారమందెడు పదార్థసమూహములందున్నను వికారము లేనివాఁడవు, దేవ! త్వం, కవిః = జరిగినదాని నెల్లను దెలిసినవాఁడవు, అజః = అందుచేత సామాన్యజనులవలె నీకు గర్భాధానాదికర్మలు సంభావితములుగావు. ఐనను నీవు గుణకర్మయోనౌ= సత్త్వాదిగుణములకు, అదృష్టరూపమైన కర్మకుఁ గారణమైన, అజాయాం = జననములేని, శక్త్యాం = భార్యయైనచిత్ప్రకృతియందు - జడప్రకృతియందు, రేతః = వీర్యమును (గర్భమును), సామర్థ్యమును, ఆదధే = ఉంచినవాఁడనైతివి. దీనిచేత శ్రీహరి జనకుని స్థానమం దున్నవాఁడని స్పష్టపఱచిన ట్లైనది. 'తు' - అనుటచేత చేతనము, జడప్రకృతి - వీని నడుమ చాల భేదమున్నదని సూచించిన ట్లైనది.

**29. శ్లో :** దేవ! ఆత్మన్. ఓ స్వామీ! తతః = ఆ ప్రకృతి నుండి, వయం, సత్త్వముఖాః = మహత్తత్త్వము మొదలగువాని కభిమానులమై, యదర్థే = ఏ బ్రహ్మాండనిర్మాణమునకై, బభూవిమ = సృష్టింపఁబడితిమో, తదర్థే = దాని కొఱకై, తే , కింకరవామ = ఏమి యొనర్తుము, నః = విముక్తులమై, అస్వతంత్రులమైయున్న మాకు, సః త్వం = స్వతంత్రుఁడవు, సర్వశక్తుఁడవు నైన నీవు, చక్షుః బ్రహ్మాండనిర్మాణమునకు ఆవశ్యకమైన యుపాయమును గూర్చిన న్యాయమును పరిదేహి. యదనుగ్రహేణ = ఏ జ్ఞానము యొక్క అనుగ్రహముతో, క్రియార్థే= బ్రహ్మాండనిర్మాణమందు, శక్తాః స్యామ.

**తాత్పర్యము :** దేవతలైన మా కందఱకును నీవే జనకుఁడవు. నీవు వికారములేని పూర్ణ పురుషుఁడవు. నీకుఁ దెలియని విషయము లేదు. జననము మొదలైనవి నీకు లేవు. ఇట్టి నీవు సత్త్వాదిగుణములకును, అదృష్టరూపమైన కర్మకును గారణమైన నీచిత్ప్రకృతియందు వీర్యమును స్థాపించితివి. ఆ ప్రకృతిచేతనే తత్త్వాభిమానులమైన మేము బ్రహ్మాండనిర్మాణమునకై సృష్టింపఁబడినాము. స్వతంత్రుఁడవు, సర్వశక్తుఁడవైన నీవు అస్వతంత్రులు, అశక్తులమైన మాకు మార్గమును జూపుము. నీవు చూపిన యనుగ్రహముచేతనే మేము బ్రహ్మాండమును నిర్మించుటకు శక్తుల మగుచున్నాము..

**ఇతి శ్రీ మద్భాగవతే, శతసాహస్రికాయాం, సంహితాయాం,**
**వైయాసిక్యాం, శ్రీ హయగ్రీవబ్రహ్మవిద్యాయాం,**
**యోగశాస్త్రే, తృతీయస్కంధే, పంచమోఽధ్యాయః.**

## శ్రీ పోతన్నగారు

వ. ఇట్లు గనుంగొనియమ్మునీంద్రుని పాదంబులకుం బ్రణమిల్లి, ముకుళితహస్తుండై యిట్లనియె. 'మునీంద్రా! లోకంబున సకలజనంబులు మనంబుల ఘనంబులగు సౌఖ్యంబు లందం దలంచి తత్ఫలప్రాప్తి హేతువులైన కర్మంబు లాచరించి దైవోపహతులై తత్కర్మంబులచేత నిష్ఫలారంభు లగుదురు. కర్మంబులు బంధకంబులును, దుఃఖహేతువులుం గాని సౌఖ్యదాయకంబులై పాప నివృత్తిఁ జేయనోప వది యట్లుండె. భూరి దుఃఖానుసారంబైన సంసార చక్రంబు నందుఁ బరిభ్రమింపుచుం గామవిమోహితులై పూర్వకర్మానుగతంబులైన శరీరంబులు దాల్చుచుం జచ్చుచు, మరలం బుట్టుచు నెంతకాలంబునకుఁ

బావనిమ్మృతిఁ గానక మాతృయౌవన వన కుఠారులై జనియించి వర్తించు మూఢాత్ములం బశుప్రాయుల రక్షించుకొఱకుఁగాదె నారాయణ వరాయణులైన మీ వంటి పుణ్యాత్ములు లోకంబునం జరియించుట. అదియునుంగాక. 181

మ. అవివేకానుగత స్వకార్య జలపూరా కీర్ణమై మిత్ర బం
ధువధూ పుత్ర జలగ్రహోగ్రయుతమై దుర్దాంతమైనట్టి దు
ర్భర పాథోధిఁ దరింపలేరు హరిసంబంధక్రియాలోల భా
గవతానుగ్రహ నావ లేని యధముల్ కారుణ్యసంధాయకా! 182

క. మునినాథ చంద్ర! ననుఁగై
కొని కాచు తలంపు బుద్ధిఁ గూడిన యేనిన్
వినుము మదీప్సిత మది నా
చనవునఁ గావింపుమయ్య సజ్జన తిలకా! 183

వ. అని వెండియు విదురుండు మైత్రేయుం జూచి మునీంద్రా! త్రిగుణాత్మక మాయా నియంత యగు భగవంతుండు స్వతంత్రుం డగుచు నవతరించి యెయ్యెయవతారంబులందు నే కర్మంబు లాచరించె నిష్క్రియుండగు నీశుండు మొదలం బ్రపంచంబు నే విధంబునం గల్పించె? నే పగిదిం బాలించె? మఱియు నీ విశ్వంబు నాత్మీయ హృదయాకాశ గతముం జేసి నివృత్త వృత్తి యగుచు యోగమాయయందు నెట్లు వసియించె? బ్రహ్మాండంబునందు నే లీల వర్తించె? నందు బ్రహ్మాదిరూపంబు లంబొంది బహు ప్రకారంబుల నెట్లు క్రీడించె? భూసుర గోసురాదులఁ బరిరక్షించుటకై మత్స్యాద్యవతారంబులు ధరియించి యెయ్యె ప్రయోజనంబులం దీర్చెఁ? బయోరుహ గర్భాండ కటాహాంతర్గతంబులై (లోకపాలనహితంబులైన లోకంబుల లోకాలోక పర్యంతంబుల బహిర్భాగంబుల నెయ్యె తత్త్వభేదంబుల నెత్తెఱంగునం బుట్టించె? నందుఁ బ్రతీతంబగు జీవకోటి యెవ్వనిం గొల్చి బ్రదుకు? జనులకుం గర్మ నామ రూప భేదంబు లెట్లు నిర్దేశించె? నింతయు నవిస్తరంబుగా వివరింపుము. ఉత్తమశ్లోకమౌళి మండనుండును, యోగేశ్వరేశ్వరుండును నైన పుండరీకాక్షుని చరిత్రశ్రవణంబునం గాని జన్మమరణాది సకల దుఃఖాకరంబులును, దుష్కర్మ ప్రాప్తంబులును నగు భవబంధంబులు దెగవని వెండియు నిట్లనియె. 184

**తరలము**

సతతమున్ సరసీరుహోదర సత్కథామృత పూరమున్
శ్రుతి పుటాంజలి చేత నిమ్ముల జుఱ్ఱియుం దనివోదు భా
రత కథామిష మూని విష్ణుఁ బరాశర ప్రియసూతి స
న్మతి నుతించిన చోట నమ్మునినాథ! నా మది నుబ్బుదున్. 185

క. ఇతర కథాకర్ణనముల
నతిహేయత నొందెఁ జిత్త మనఘాత్మ! రమా
పతి చరితామృత రతి సం
స్మృతి వేదన లెల్లఁ బాయఁజేయు మునీంద్రా! 186

తే. భూరివిజ్ఞాననిధులగు నారదాది
నిర్మలాత్ముల కయిన వర్ణింపరాని
హరికథామృత పానంబునందు విసివి
యొల్ల నను వాఁడెపో వెఱ్ఱిగొల్లఁ డనఘ! 187

వ. అదియునుం గాక 188

సీ. అరవిందనాభుని యపరావతారమై
జననమొందిన పరాశరసుతుండు
చతురవర్ణాశ్రమాచార ధర్మంబులు
రవణింప లోకవిడంబనంబు
లగు గ్రామ్యకథలు పెక్కర్థిఁ గల్పించుచు
హరికథావర్ణన మందులోన
నించుకించుక గాని యేర్పడఁ జెప్పమి
నంచిత విజ్ఞాన మాత్మనిలువ
తే. కున్నఁ జింతించి మఱి నారదోపదిష్టుఁ
డగుచు హరివర్ణనామృత మాత్మఁ గ్రోలి
విమల సుజ్ఞాననిధి యన వినుతి కెక్కి
ధన్యుఁ డయ్యెను లోకైకమాన్యుఁ డగుచు. 189

వ. కావున. 190

క. సరసిరుహోదరు మంగళ

చరితామృతమాత్మఁ గ్రోలు జనుఁ డితరకథా
గరళముఁ గ్రోలునె? హరి సం
స్మరణము జీవులకు నఖిల సౌఖ్యద మనఘా! 191

క. శ్రీవనితాధిప నామ క
థా విముఖుల కిహముఁ బరము దవ్వై పిదపం
బోవుదురు నరకమునకున్
వావిరి నే వారిఁ జూచి వగతు మునీంద్రా! 192

క. ఏ నరుఁడే నొకనిమిషం
బైన వృథావాదగతిని హరిపదకమల
ధ్యానానందుఁడు గాఁడే
నా నరునకు నాయు వల్పమగు మునినాథా! 193

చ. మృదుగతిఁ బువ్వుఁదేనియ రమించుచుఁ బానము సేయఁబాఱు ష
ట్పదమునుబోలి యార్తజన బాంధవు విశ్వభవస్థితి వ్యయా
స్పద మహితావతారుఁడగు పంకరుహోదరు నిత్యమంగళ
ప్రద గుణకీర్తనామృతముఁ బాయక గ్రోలెదఁ జెప్పవే దయన్. 194

క. అని విదురుఁడు మైత్రేయుం
డను మునినాయకుని నడిగె నని వేదవ్యా
సుని తనయుం డభిమన్యుని
తనయునికిం జెప్పి మఱియుఁ దగ నిట్లనియెన్. 195

వ. ఇట్లు విదురుండు మైత్రేయు నడిగిన నతం డతనిం గని యతిమృదు మధుర వచన రచనుండై యిట్లనియె. ననఘా! కృష్ణకథాశ్రవణ తత్పరుండవై నీవు నన్నడిగితివి గావున భద్రంబయ్యె. నీవు భగవద్భక్తుండవు గావున హరికథా సక్తుండవగుట చిత్రంబుగా దదియునుం గాక మాండవ్య శాపంబున సాత్యవతేయువలన భ్రాతృ క్షేత్రంబున శూద్రయోనిం బుట్టినట్టి ప్రజా సంయమనుండ వగు యముండవు. పరమజ్ఞాన సంపన్నుండవు. నారాయణునకుం బ్రియతముండవు గావునఁ గృష్ణుండు నిర్యాణకాలంబునం దన సన్నిధికిం జనిన నన్ను డాయం జీరి విజ్ఞానం బెల్ల నుపదేశించి నీకు నెఱింగింపుమని యానతిచ్చుటంజేసి యవశ్యంబు నీకు నెఱింగింతు దత్తావధానుండవై వినుము. 196

క. వనజాక్ష యోగమాయా

జనితం బగు విశ్వ జనన సంస్థాన వినా
శనముల తెఱఁ గెఱిఁగింపుచు
ననఘా! విష్ణుని మహత్త్వ మభివర్ణింతున్. 197

సీ. సకల జీవుల కెల్లఁ బ్రకట దేహము నాత్మ
నాథుండు పరుఁడు నానావిధైక
మత్యవలక్షణ మహితుండు నగు భగ
వంతుండు సృష్టిపూర్వంబునందు
నాత్మీయ మాయా లయంబు నొందిన విశ్వ
గర్భుఁడై తాన యెక్కటి వెలుంగు
పరమాత్ముఁ డభవుం డుపద్రష్ట యయ్యు వ
న్యంతరపరిశూన్యుఁ డగుటఁ జేసి

తే. ద్రష్ట గాకుండు, మాయా ప్రధానశక్తి
నతుల చిచ్ఛక్తి గలవాఁడు నగుచుఁ దన్ను
లేని వానిఁగఁ జిత్తంబులోనఁ దలఁచి
ద్రష్ట యగుఁదన భువన నిర్మాణ వాంఛ. 198

తే. బుద్ధిఁ దోఁచిన న మ్మహాపురుషవరుఁడు
కార్యకారణ రూపమై ఘనత కెక్కి
భూరి మాయాభిధాన విస్ఫురిత శక్తి
వినుతి కెక్కినయట్టి యవిద్య యందు. 199

క. పురుషాకృతి నాత్మాంశ
స్ఫురణము గల శక్తి నిలిపి పురుషోత్తముఁ డీ
శ్వరుఁ డభవుం డజుఁడు నిజో
దర సంస్థిత విశ్వ మపుడు దగఁ బుట్టించెన్. 200

సీ. ధృతిఁ బూని కాలచోదితము నవ్యక్తంబుఁ
బ్రకృతియు నను పేళ్లఁ బరఁగు మాయ
వలన మహత్తత్త్వ మెలమిఁ బుట్టించె మా
యాంశ కాలాది గుణాత్మకంబు
నైన మహత్తత్త్వ మచ్యుత దృగ్గోచ

ర మగుచు విశ్వనిర్మాణ వాంఛ
నందుటఁజేసి రూపాంతరంబునఁ బొంది
నట్టి మహత్తత్త్వమందు నోలిఁ

తే. గార్య కారణ కర్త్రాత్మ కత్వమైన
మహిత భూతేంద్రియక మనోమయ మనంగఁ
దగు నహంకారతత్త్వ ముత్పన్న మయ్యెఁ
గోరి సత్త్వరజస్తమోగుణక మగుచు. 201

వ. వెండియు రూపాంతరంబులం బొందుచున్న సాత్త్వికాహం కారంబు వలన మనంబును, వైకారిక కార్యభూతంబులైన దేవతా గణంబులును సంభవించె. ఇంద్రియాధిష్ఠాతలైన వానివలన శబ్దంబు పూర్వంబునఁ బ్రకాశం బగుటంజేసి జ్ఞానేంద్రియంబులైన త్వక్చక్షుఃశ్రోత్ర జిహ్వాఘ్రాణంబులును, కర్మేంద్రియంబులైన వాక్పాణిపాద పాయూపస్థలును, తైజసాహంకారంబున నుత్పన్నంబులయ్యెఁ. దామసాహంకారంబువలన శబ్ద స్పర్శరూప రసగంధంబు లుదయించె. నందు శబ్దంబు నిజగుణంబైన శబ్దంబు వలన నాకాశంబుఁ బుట్టించె. గగనంబు కాల మాయాంశ యోగంబునం బుండరీకాక్షు నిరీక్షణంబున స్పర్శతన్మాత్రంబు వలన వాయువుం గలిగించెఁ: బవనుండు నభోబలంబున రూపతన్మా త్రంబువలన లోకలోచనంబైన తేజంబు నుత్పాదించెఁ: దేజంబు కాల మాయాంశ యోగంబున నుత్తమశ్లోకుని విలోకనంబునఁ బవమానయుక్తం బగుచు రసతన్మాత్రంబువలన నంబువులం బుట్టించె సలిలంబు కాల మాయాంశ యోగంబునం బరమేశ్వరాను గ్రహంబుగలిగి తేజోయుక్తంబైన గంధగుణంబు వలనఁ బృథివిం గలిగించె: నందు గగనంబునకు శబ్దంబును, వాయువునకు శబ్దస్పర్శంబులును, దేజంబునకు శబ్దస్పర్శరూపంబులును, సలిలంబునకు శబ్దస్పర్శరూపరసంబులును, బృథివికి శబ్దస్పర్శరూప రసగంధంబులును, గుణంబులై యుండుఁ: గాల మాయాంశ లింగంబులు గలిగి మహదాద్యభిమానంబుల నొందిన దేవతలు విష్ణు కళాకలితు లగుదు: రట్టిమహదాదితత్త్వంబు లైక్యంబు సాలమిం బ్రపంచంబులు కల్పింప సమర్థంబులుగాక కృతాంజలులై యోగీశ్వరేశ్వరుండైన నారాయణు నిట్లని స్తుతియించె. 202

**దండకము :**

శ్రీనాథనాథా! జగన్నాథ! నమ్రైకరక్షా విపక్ష! క్షమా భృత్స హస్రాక్ష ! నీరేజపత్రేక్షణా! దేవదేవా! భవద్ధానవర్గానుతాపంబులం బావఁగా నోవు దివ్యాతపత్రంబునాఁ బొల్చు యుష్మత్పదాంభోజ మూలంబు పుణ్యాల వాలంబుగాఁ బొంది యోగీంద్రు లుద్దామ సంసార తాపంబులం బాయఁగా మీటి వర్తింతురో తండ్రి! యీశా! సమస్తాఘ నిర్ణాశ! యీ విశ్వమందెల్ల జీవుల్ భవోదగ్ర దుర్వార తాపత్రయాభీల దావాగ్ని చేఁ గ్రాఁగి దుఃఖాబ్ధిలోఁ దోఁగి యే కర్మమున్ ధర్మముం బొందఁగా లేక సంసారచక్రంబు నందుం బరిభ్రామ్యమాణాత్ములై యుందు; ర మ్మూఢచేతస్కులం జెప్పఁగా నేల? యో దేవ! విజ్ఞాన దీపాంకురంబైన మీ పాదపంకేరు హచ్ఛాయఁ బ్రాపింతు: మబ్జాక్ష! నన్మౌనినంఘంబు లైకాంతిక స్వాంతతం బేర్చి దుర్దాంత పాపౌఘనిర్ణాశ కాంబు ప్రవాహోభ్ర గంగా నివాసంబు గా నొప్పు నీ పాదయుగ్మంబు యుష్మన్ముఖాంభోజ నీడోద్గతం బైన వేదాండజ శ్రేణిచేతన్ గవేషించి సంప్రాప్తులై యుందు: రో నాథ! వైరాగ్యశక్తిస్ఫుట జ్ఞాన బోధా త్ములై నట్టి ధీరోత్తముల్ నిత్య నైర్మల్య భవ్యాంతరంగంబులం దే పరంజ్యోతి పాదాబ్జ పీఠంబు గీలించి కైవల్య సంప్రాప్తులై రట్టి నిర్వాణ మూర్తిం బ్రశంసింతు, మింద్రాది వంద్యా! ముకుందా! సమస్తంబుఁ గల్పింపఁ బాలింపఁ దూలింపఁగాఁ బెక్కు దివ్యావతారంబులం బొందు నీ పాద పంకేరుహ ధ్యాన పారీణ సుస్వాంతు లై యొప్పు భక్తాళికిన్ మోక్షదం బైన మీ పాద కంజాతముల్ గొల్తు; మీశా! రమాధీశ! పుత్రాంగనా మిత్ర సం బంధ బంధంబులం జెంది నిత్యంబు దుష్టక్రియా లోలురై దేహ గేహంబులం దోలి వర్తించు దుర్మానవ శ్రేణులం దంతరాత్ముండవై యుండియున్ దూరమై తోఁచు నీ పాదపద్మంబు లర్చింతు; మో దేవ! బాహ్యేంద్రియ వ్యాప్తి నుద్వృత్తు లై నట్టి మూఢాత్ము లధ్యాత్మ తత్త్వ ప్రభావాఢ్యులై నీ పదాబ్జాతవిన్యాస లక్ష్మీ కళావాసముం గన్న యయ్యుత్తమశ్లోకులం గానఁగాఁ జాల: రప్పుణ్యు లా దుష్టులం జూడఁగా నొల్ల రంభోధిరాట్కన్యకాకాంత! వేదాంత శుద్ధాంత సిద్ధాంతమై యొప్పు నీ సత్కథాపార చంచత్సుధాసారపూరంబులం గ్రోలి సౌఖ్యోన్నతిన్ సోలి,ధీయుక్తులై వ్రాలి, తాపంబులం దోలి, మోదంబులం దేలి, సంపన్నులై మన్న నిత్యప్రపన్నుల్ మహోత్కంఠతం బేర్చి వైకుంఠధామంబు నల్పక్రియాలోలురై కాంతు; ర ద్దివ్యవాసైక సంప్రాప్తికిం గోరుచున్నార; మో దేవ! వైరాగ్య విజ్ఞాన బోధాత్మ యోగక్రియారూఢి నంతర్బహిర్వ్యాప్తిఁ

జాలించి శుద్ధాంత రంగంబు గావించి హృత్పద్మవాసుండవై చిన్మయాకారవ్మైయున్న నీ యున్న తానంత తేజో విలాసోల్లసన్మూర్తిఁ జిత్తంబులం జేర్చి యానందలోలాత్మతం బొల్చు యోగీశ్వరశ్రేణికిం దావకీనాను కంపానులబ్దస్ఫుటజ్ఞానముం గల్గుటం జేసి యాయానముం జెంద రో దేవతాచక్రవర్తీ! సదానందమూర్తీ! జగద్గీతకీర్తీ! లసద్భూత వర్తీ! భవద్దానులై నట్టి మమ్మున్ జగత్కల్పనానక్త చిత్తుండవై నీవు త్రైగుణ్యవిస్ఫూర్తిఁ బుట్టించినం బుట్టుటే కాక నీ భవ్యలీలాను మేయంబుగా సృష్టినిర్మాణముం జేయ నే మెంతవారౌదు? మీ శక్తి యుక్తిన్ భవత్పూజ గావింతు; మట్లుండె నీ నత్కళా జాతులై నట్టి మమ్మెన్నఁగా నేల? యధ్యాత్మతత్త్వంబ వన్నం బరంజ్యోతి వన్నం బ్రపంచంబ వన్న న్నధిష్ఠాతవన్నన్ నదాసాక్షి వన్నన్ గుణాతీత! నీవే కదా పద్మపత్రాక్ష! సత్త్వాదిత్రైగుణ్య మూలంబు నా నొప్పు మాయా గుణంబందు నుద్యన్మహత్త త్త్వ మైనట్టి నీ వీర్యముం బెట్టుటం జేసి నీ వింతకుం గారణం బౌదు: వాయాయి కాలంబుల న్నీకు సౌఖ్యంబు లేమెట్లు గావింతు? మే రీతి నన్నంబు భక్షింతు? మెబ్బంగి వర్తింతు? మే నిల్కడ న్నుందు? మీ జీవలోకంబె యాధారమ్మైయుండి భోగంబులం బొందుచు న్నున్నయిక్కార్య సంధానులై నట్టి మాకుం జగత్కల్పనా నక్తికిన్ దేవ! నీ శక్తిఁదోడ్పాటు గావించి, విజ్ఞానముం జూపి, కారుణ్య సంధాయివై మమ్ము రక్షింపు లక్ష్మీమనః పల్వలక్రోడ! యోగీంద్ర చేతస్సరోహంస! దేవాదిదేవా! నమస్తే నమస్తే నమః. 203

**అర్థములు :**

181.వ. ప్రణమిల్లి = నమస్కరించి, ముకుళితహస్తుండై = మోడ్పఁబడిన చేతులుగలవాఁడై, తత్ఫలప్రాప్తి హేతువులు = మనస్సులలోఁ దా మాకాంక్షించిన ఫలములను బొందుటకుఁ గారణభూతములు, దైవ + ఉపహతులు = ప్రారబ్ధకర్మముచేత విఘ్నమొనర్పఁబడిన క్రియలు గలవారు, తత్ + కర్మంబులచేతన్, నిష్ఫల + ఆరంభులు = ఫలహీనములైన కార్యారంభములు గలవారు, సౌఖ్యదాయకములు = సౌఖ్యములనిచ్చునవి, అదియట్లుండెన్ = విషయాంతరమును జెప్పుట కిది ప్రారంభము, భూరి దుఃఖ + అమసారము = గొప్పదుఃఖముల

ననుసరించినది, పూర్వకర్మానుగతములు = పూర్వకర్మ ననుసరించినవి, పాపనిష్కృతి = పాపములనుండి విడుదల, మాతృయౌవన కుఠారులై = తల్లుల యౌవనమనెడువనమునకు గొడ్డలివంటివారై, పశుప్రాయులు = పశువుతో సమానమైన వారు, నారాయణ పరాయణులు = నారాయణునందే ఆసక్తిగలవారు.

**తాత్పర్యము** : హరిద్వారమందున్న మైత్రేయుని విదురుఁడు దర్శించినాఁడు. ఆయునకు నమస్కార మొనర్చి చేతులు జోడించి యిట్లనెను. "లోకములో జనులు సుఖములను బొందు నిచ్ఛతో వానిని సాధించుటకు హేతువులని తా మెంచిన కార్యము లొనర్తురు, కాని యవి ఫలింపనేరవు. కారణ మేమనఁగా వారు దైవోపహతులు, అనఁగా పూర్వజన్మప్రారబ్ధము వారి సత్కర్మములను గూడ పూర్తిగా నెరవేర నివ్వదన్నమాట. అందుకే వారొనర్చెడు కర్మలతో సుఖము ప్రాప్తింపకపోఁగా దుఃఖానుభూతిగూడ యేర్పడును. ఇట్లుగా వారొనర్చెడి కర్మలు సుఖహేతువులు గాకపోవుటయేగాక దుఃఖదాయకములుగూడ నగుచుండును. మానవుఁడు సుఖాసక్తితో నొనర్చెడి కర్మలు పుణ్యములను సంపాదించును. వాని ఫలముల ననుభవించుటకై మరల జన్మ. దానితో మరలఁ గార్యాచరణము, మరల దుఃఖము. ఇదియే చక్రభ్రమణము. పాపనిష్కృతి వాని కేర్పడదు. పుణ్యఫలము జన్మనివృత్తికిఁ గారణము గాదు. ఇట్లే వాఁడు దుఃఖబహుళమైన సంసారచక్రమునఁబడి క్రిందుమీదుగాఁ బరి భ్రమించుచుండును. అనేకములైన కోర్కెలు వానిని మొసళ్ళ వలె మ్రింగును. ఆ కోర్కెలతో జన్మపరంపరలు, ఇట్లుగా నెప్పుడును వానికి బాపనిష్కృతి యేర్పడనే యేర్పడదు. తల్లుల యౌవన వనములను ఖండించుటకు కుఠారములైన జన్మలతో వాఁడు పరిభ్రమించుచునే యుండుము. అట్టివాఁడు పశుప్రాయుఁడు. వాఁడు కృష్ణపరమాత్మనుండి విముఖుఁడై ప్రాచీనకర్మనిబంధితములైన యధర్మము లొనర్చుచు కాలము గడపుచుండును. తరించు మార్గము దోఁచక దుఃఖముల ననుభవించుచుండును. ఇట్టివారిని రక్షించుటకే భగవదంశభూతులైన భగవద్భక్తులు లోకమున సంచరించుచుందురు. ఓ మైత్రేయా! వారిలో నీ వగ్రగణ్యుఁడవు. "మాతుః కేవల మేవ యౌవనవనీ భేదే కుఠారావయం" అనెడు భర్తృహరి శ్లోకపాదమును పూర్తిగా వాడుకొన్నాఁ డమాత్యుఁడు.

**182. మ. అవివేక = అవివేకమును, అనుగత = అనుసరించిన, స్వకార్య =**

తనవనులనెడు, జలపూర = జలప్రవాహముచేత, ఆకీర్ణమై = వ్యాపించినదై, మిత్ర....యుతమై = మిత్రులు, బంధువులు, భార్యా పుత్రులు ననెడు, జలగ్రహోగ్రయుతమై = మొసళ్ళ చేత భయంకరముగాఁ గూడియున్నట్టిదై, దుర్దాంతమై = దాఁటరానిదై, దుర్భవ పాధస్ + ధి = (పాథోధి) దుష్టజన్మలను సముద్రమును, హరిసంబంధక్రియాలోల = హరికి సంబంధించిన కార్యము లొనర్చుటందే యాసక్తిగల, భాగవతానుగ్రహనావ = భగవద్భక్తుల యను గ్రహమనెడు వడవ, కళ్యాణ సంధాయకా= క్షేమములను గల్గించువాఁడా!

**తాత్పర్యము** : ఇది యమాత్యుల సొంతపద్యము. దుష్టములైన జన్మలను సముద్రములోఁ బోల్చుచున్నాఁడు. ఆ రూపకమును వివరింపఁబోవుచున్నాఁడు. దుష్టజన్మలను సముద్రములో నీరేమిటి? తాను కామప్రచోదితుఁడై తెరపి లేక యొనర్చెడి కర్మా కర్మలే జలము! ఇవన్నియు దాను సుఖము నందఁదలఁచి మానవుఁ డొనర్చును. అవి దైవోపహతములై దుఃఖహేతువులే యగును. వీనికిఁ గారణమేమి? అవివేకము. అవివేకముచేఁ బ్రేరేపింపఁబడిన స్వసుఖప్రాప్తిహేతువులని వాఁడెంచికొన్న నిరంతరకర్మలే ఆ సముద్రములోని జలము. అనేకములైన జలజంతువులు సముద్రములో నుండును. ఇక్కడి జలజంతువులు, మిత్రులు, బంధువులు, భార్య బిడ్డలనెడువారు. వీరందఱును సంతతము నోళ్ళు తెఱచుకొని భయంకరముగా వ్యాపించి యుందురు. ఈ సముద్రము దాఁటుట కసాధ్యమైనది. మఱి దీనిని దరించుట కుపాయమేమి? సద్భక్తుల యనుగ్రహ మనెడు నావయే. వారు గూడఁ గర్మ లొనర్తురు. ఆ కర్మ లన్నియుఁ దమసుఖము కొఱకైగాదు. భగవంతుని ముఖోల్లాసమునకై చేయుదురు. అట్టివారి యనుగ్రహ మను వడవ మాత్రమే మానవుని సంసారజలనిధిని దాఁటింప శక్తిగల దగుచున్నది. భగవద్భక్తుల యనుగ్రహ మెట్లు మార్చును? వారి సంకల్పము సాధకునకు బలము నిచ్చును. వారి సహవాసముతో దుష్టబుద్ధులు నశించును. ఒక్కొక్కసారి వారు దమసంపూర్ణాను గ్రహముచేత వీని ప్రారబ్ధముల నన్నిటిని అగస్త్యుఁడు సముద్రమునువలె త్రాగివేయుదురు. కనుక భాగవతానుగ్రహము సంసారమును దాఁ టుటకు సుఖకరమైన మార్గమని చెప్పినట్లైనది. కళ్యాణసంధాయకా! అనుట చేత నీ వట్టి భక్తులలో నగ్రగణ్యుఁడవని చెప్పుచున్నాఁడు. భగవద్భక్తు లెప్పుడును.

లోకముల కళ్యాణమునే వాంఛింతురు. తమ కపకారమొనర్చినవారికిఁ గూడ మంగళముగోరుటే వారి స్వభావము. భగవంతుఁడైనను దుర్మార్గులను శిక్షించును. కాని భగవద్భక్తు లెప్పుడును అట్లు శిక్షింపరు. వారు నిందలను అపకారములను సహించి యెదుటివారి హృదయములు పరిపక్వములు సేయుటకే ప్రయత్నింతురు. అందుచేత భాగవతులు భగవంతునికన్నను గొప్పవారని భక్తసంప్రదాయము వారందురు

183. కం. మునినాథచంద్ర! = మహర్షులలో నగ్రేసరుఁడైన వాఁడా, ననున్ కైకొని = నన్ననుగ్రహించి, కాచుతలంపు = రక్షించెడు నభిప్రాయము, బుద్ధిన్కూడిన యేనిన్ = బుద్ధిలో నేర్పడినచో, మత్ + ఈప్సితము = నాచేతఁగోరఁబడినదియు, వినుము, సజ్జన తిలక! = (సత్ + జనతిలక) సత్పురుషులలో శ్రేష్ఠుడా!, అదినా చనవునన్ = దానిని, నాయందు నీకుఁ గల యనుగ్రహవిశేషముతో కావింపుము = అయ్యా నెరవేర్పవలెను.

**తాత్పర్యము** : మహర్షులలో శ్రేష్ఠుడా! నా కోరికను నీకు విన్నవించుకొన్నాను. నన్ను రక్షింపవలెనను బుద్ధి నీ కున్నచో నా కోరికలు నెరవేర్చి నన్ను ధన్యుని గావింపుము.

184. వెండియున్ = మరల, త్రిగుణాత్మకమాయానియంత = త్రిగుణములే తన స్వరూపముగాఁ గల మాయను నియమించువాఁడు, "త్రిగుణమాయానియంతా" - అని శ్రీధరులు. స్వతంత్రుం డగుచున్ అవతరించి; ఆత్మతంత్రః - అనుటకు శ్రీధరుఁ డొనర్చిన వ్యాఖ్య, "స్వతంత్ర ఏవ" అని. ఏ యే యవతారంబులందున్, ఏయే కర్మంబులు ఆచరించెన్. నిష్క్రియుండగు నీశుండు - "నిరీహః" - అని మూలము. దానికి శ్రీధరులు "నిష్క్రియః నిస్పృహో వా" - అని రెండర్థములు చెప్పెను. అమాత్యులు నిష్క్రియుఁడనియే స్వీకరించినాఁడు, ఏ పగిదిన్ = ఏ రీతిగా, ఆత్మీయహృదయాకాశగతమున్ చేసి = ఈ ప్రపంచమును హృదయాకాశమునందు నిలిపికొని, నివృత్త వృత్తి అగుచున్ = నివృత్తమైన మనోవ్యాపారము గల వాఁడై, యోగమాయయందున్ = స్వకీయమైన యోగమాయలో, భూసుర గో సురాదులన్ = బ్రాహ్మణులు, గోవులు, దేవతలు - వీరిని పరిరక్షించుటకై, పయోరుహగర్భఅండకటాహ = బ్రహ్మాండమనెడు కటాహము యొక్క, అంతర్గతంబులై = లోనున్నవై, లోకాలోకపర్వతంబుల బహిర్భాగంబులన్ = చక్రవాళపర్వతములకుఁ

బైనున్న వానిని, ఏయే తత్త్వభేదంబులన్ = ఆకాశాదుల యే యే పరిమాణములతో, ప్రతీతము = ప్రసిద్ధము, జీవకోటి = జీవసమూహము, కర్మ నామ రూప భేదంబులు = కర్మములు, నామములు, రూపములు - వీని భేదములను, ఎట్లు నిర్దేశించెన్ = ఏ రీతిగా తీర్మానించినాఁడు. సవిస్తరంబుగాన్ = విపులముగా, జన్మమరణాది సకల దుఃఖాకరంబులు = జన్మము, మరణము మొదలైన సకల దుఃఖముల కాశ్రయమ్మైనవి, దున్+కర్మప్రాప్తంబులు = (దుష్కర్మ) పూర్వజన్మములం దొనర్చిన పాపములకు ఫలముగా సిద్ధించినవి. ఐన, భవబంధంబులు = సంసార బంధములు.

**తాత్పర్యము** : తన యాకాంక్షను జెప్పుచున్నాఁడు. మునీంద్రా! భగవంతుఁడు త్రిగుణాన్వరూపమ్మైన మాయను నియమించినాఁడు. అతఁడు ఆత్మతంత్రుఁడై తన దేహమును దానే నిర్మించికొని పురుషాద్యవతారములను గల్పించికొని ఆయా యవతారములలో నేయేకర్మ లొనర్చెనో వాని నన్నిటిని వివరింపుము. అతఁడు నిష్క్రియుఁడు, నిస్స్పృహుడు. అట్టి భగవంతుఁడు తొట్ట తొలుత నీ విశ్వము నెట్లు సృష్టించెను? దానికి జీవిక నెట్లేర్పఱచినాఁడు. దానినెట్లు పరిపాలించెను? మరల ప్రళయమునందు ఈ సమస్త విశ్వము హృదయాకాశము నందు విలీనము చేయునట్లు పరమాత్ముఁడు - "యథా పునస్స్వఖఇదంనివేశ్య " = అని శ్రీధరుఁడు. "నివృత్త వృత్తిః" - యను శబ్దము మూలము లోనిదే. ఏ కార్యమునందును బ్రవృత్తి లేనివాఁడని తాత్పర్యము. అతఁడు దనయోగమాయ యందు వర్తించెడు విధమెట్లు? "శేతే గుహాయాం అని మూలము. గుహాయాం యోగమాయాయాం - "యథాశేతే" - అని శ్రీధరులు వ్యాఖ్యానించిరి. తరువాత సృష్టింపఁబడిన యీ బ్రహ్మాండమందు అనుప్రవిష్టుఁడై యెట్లు క్రీడించినాఁడు? ఈ క్రీడ లన్నియు నతఁడు యోగీశ్వరాధీశ్వరుఁ డగుటచేతనే సిద్ధించినవి. మరల నొక్కఁడయ్యు నాతఁడు యోగశక్తి వలన బ్రహ్మాదిరూపములు ధరించి క్రీడించుచున్నాఁడు. అతఁడు క్రీడించువద్ధతి యెట్లు? ద్విజగోసురాదిక రక్షణకై మత్స్యాద్యవతారములు ధరించి ప్రపంచములోని కాతఁడు వచ్చును. వచ్చి యే యే ప్రయోజనముల నాతఁడు దీర్చెను? ఆతని సృష్టిలో లోకములు వలోకములు నున్నవి. లోకములు బ్రహ్మాండకటాహమున కంతర్గతము లైనవి. వానిలోనే లోక పాలకులున్నారు. చక్రవాళమునకు

బహిర్భూతములైన వాలోకములు. వానియందును, వీనియందును జీవులున్నారు. వీని సృష్టిప్రకార మెట్లు? వాని శరీర నిర్మాణములలో నెన్నియో భేధములున్నవి. అవి యేయే తత్త్వముల నెంతెంత పరిమాణముగాఁ జేర్చి సృష్టింపఁబడినవి. వాని జీవన ప్రకారము లేవి? అవి యెవ్వనిని గొలిచి బ్రదుకును? జీవులలోఁ గర్మభేదములున్నవి. నామ భేదము లున్నవి. రూపభేదములు గలవు. వీని నన్నిటి నాతఁ డెట్లు నిర్దేశించినాఁడు? వీని ప్రకారము లన్నియు వివరింపుము. పరమాత్ముఁడు ఉత్తమ శ్లోకులలో శ్రేష్ఠుఁడు. యోగీశ్వరేశ్వరుఁడు. అతని చరిత్ర శ్రవణముతోనే జన్మమరణాది దుఃఖములచేఁగూడిన భవబంధములు దెగును. ఈ భవబంధములు పూర్వజన్మల దుష్కర్మలతోఁ బ్రాప్తించినవి.

185. సరసీరుహ+ఉదర = ప్రపంచసూచకమైన పద్మము నాభియందుఁ గల భగవంతుని యొక్క, సత్+కథా = ఉత్తమములైన చరిత్ర లనెడు, అమృతపూరమున్ = అమృతప్రవాహమును, శ్రుతిపుట + అంజలిచేతన్ = చెవులనెడు అంజలులతో, ఇమ్ములన్ = సంతోషముగా, జుర్రినన్, తనివు + పోదు = తృప్తి యేర్పడదు. భారతకథామిషము + పూని = భారత కథయను నెపముతో, పరాశరప్రియసూతి = వ్యాసుఁడు, విష్ణున్ సన్మతిన్ నుతించినచోట = నారాయణుని నుతించినప్పుడు, సత్ + మునినాథ! = మునిశ్రేష్ఠా! నా మతిన్ ఉబ్బుదున్ = నా మనస్సులో సంతోషపడెదను.

**తాత్పర్యము** : ఓ మునిచంద్రా! భగవంతుని సత్కథ లనెడు నమృతము నెంతజుర్రినను దృప్తి గలుగుటలేదు. భారతకథా మిషములో నక్కడక్కడ వ్యాసభగవానుఁడు శ్రీ మహావిష్ణువునకు సంబంధించిన నారాయణీయము మొదలైన కథలను జెప్పినాఁడు. ఆ కథలు వచ్చిన చోట నా మనస్సున కెంతో సంతోష మయ్యేడిది.

186. ఇతరకథాకర్ణనములన్ = ఇతరకథలను వినుటచేత, చిత్తము అతిహేయుతన్ ఒందెన్ = మనస్సు చాల నీచత్వమును బొందినది, అనఘాత్మా, రమాపతి చరితామృతరతిన్ = భగవత్కథలనెడు నమృతమునందలి యాసక్తిచేత, సంసృతివేదనలు ఎల్లన్ = సంసారవేదన లన్నియు, పాయన్ చేయు = పోఁగొట్టుము.

**తాత్పర్యము** : ఇతరకథలను వినుటచేత మనస్సు నీచత్వమును బొందియున్నది. హరికథ లనెడు నమృత పానము చేత, నా సంసారదుఃఖములను బోఁగొట్టుము.

187. భూరివిజ్ఞానవిదులు = గొప్ప విజ్ఞానము నెఱిఁగినట్టి, నారదాది నిర్మలాత్ములకైనన్ = నారదుఁడు మొదలైన పవిత్రహృదయులకును, వర్ణింపన్ రాని = వర్ణించుటకు సాధ్యముగానట్టి, ఆ హరికథా + అమృతపానంబునందున్ = హరికథ లనెడు నమృతమును పాన మొనర్చెడి విషయమందు, విసిగి = విసుగుఁజెంది, ఒల్లన్ అనువాఁడెపో = తృప్తియైన దిఁక చాలు అనువాఁడే, వెట్టిగొల్లఁడు = వెట్టిగొల్లవానితో సమానుఁడు.

**తాత్పర్యము** : శ్రీ మహావిష్ణువునకు సంబంధించిన కథలను విజ్ఞానవిదులైన నారదాది మహామునులు గూడఁ బూర్తిగా వర్ణింపలేరు. వినుకొలఁది ననేక ప్రశ్నల నుద్భవింపఁజేయు విషయమిది. ప్రతి పదమందును నమృతపానమే. అట్టి హరికథామృతమును ద్రావి "తృప్తియైన దిఁకచాలు" నను వాఁడు వెట్టిగొల్లనితో సమానము.

188. అదియునుంగాక = అంతేకాక,

189. సీ. అరవిందనాభుని అపరావతారమై జననమొందిన పరాశరసుతుండు = ఉద్భవించిన పరాశరకుమారుఁడైన వ్యాసుఁడు, మహిన్, వర్ణాశ్రమాచార ధర్మముల్ తవణింపన్ = వర్ణములు, ఆశ్రమములు- వీనికి సంబంధించిన యాచారములు, ధర్మములు మొదలగువాని ననుసరించుటకు, లోకవిడంబనములునగు గ్రామ్యకథలు = లోకముల మనస్సుల నాకర్షించెడు ననేకములైన లౌకికగాథలు, పెక్కు అర్థిన్ కల్పించుచున్ = అనేకములు వర్ణించుచు, అందులోనన్ = వానిలో, హరికథావర్ణనము = హరికి సంబంధించిన కథల యావిష్కారము, ఇంచుకించుకకాని = కొంచెము కొంచెమైనను, ఏర్పడన్ చెప్పమిన్ = విస్తృతముగాఁ జెప్పకపోవుటచేత, అంచితవిజ్ఞానము = గొప్ప విజ్ఞానము, ఆత్మన్ నిలువకున్నన్ = మనస్సునందు నిలువకపోఁగా, చింతించి = తన కొఱఁతలను గూర్చి విచారించికొని, నారద + ఉపదిష్టుఁడు = నారదుని చేత బోధింపఁబడినవాఁడు, హరివర్ణన + అమృతమున్ = హరికథావర్ణనమను నమృతమును, ఆత్మన్ క్రోలి = మనస్సునందు ద్రావి, వినుతమజ్ఞాన విధియవన్ = గొప్ప

జ్ఞానమునకు నిధివంటి వాఁడని , వినుతికిన్ ఎక్కి = ప్రశస్తినంది, లోక + ఏకమాన్యుఁడగుచున్ = లోకమందు మహాగౌరవమునకుఁ బాత్రుఁడైనవాఁడై, ధన్యుఁడు + అయ్యెను = ప్రసిద్ధుఁడైనాఁడు.

**తాత్పర్యము** : శ్రీ మహావిష్ణువు యొక్క జ్ఞాన ప్రధానమగునవతారము వేదవ్యాసుఁడు. అతఁడు పరాశరుని కుమారుఁడు. వర్ణములు, ఆశ్రమములు వానియం దనుష్ఠింపఁదగిన యాచారములు-వీనిని స్థిరీకరించుటకై లోకహృదయముల నాకర్షించుటకు నాతఁ డెన్నియో గ్రామ్యకథలు చెప్పినాఁడు. అందు వర్ణింపఁబడిన కథలు, గ్రామ్యము లనఁగా ననాగరికములని యర్థము గాదు. మోక్షమున కంతగా సంబంధములేని వగుటచేఁ బరీక్షిత్తు దృష్టిలో గ్రామ్యకథ లైనవి. ఇట్టి వనేక విషయములు వ్యాసుఁడు కల్పించి చెప్పెను. వానిలో నా వ్యాసుని మనస్సునకు శాంతి చిక్కలేదు. అతఁడీ కొఱఁతకుఁ గారణ మేమని యెంతయో యోచించెను. ఇంతలో నారదమహర్షి వచ్చి విష్ణుకథలను వర్ణించినచో నీకు శాంతి చిక్కునని బోధించినాఁడు. వ్యాసమహర్షి యట్లే యొనర్చెను. దానితో నాతనికి మనస్సులో శాంతి నెలకొన్నది. తనివి దీర హరికథామృతమును జుఱ్ఱుకొనుటచే నాతని మనస్సు నివాతదీపము వలె నిశ్చల మయ్యెను. పరమ సుజ్ఞాని యని, ప్రపంచములో గొప్ప గౌరవము లభించినది. ఈ సీసపద్యమందు పోతనామాత్యుఁడు మూలము నుండి భేదించినాఁడు. మూలశ్లోకమిది -

**"మునిర్వివక్షు ర్భగవద్గుణాన్సః సఖాపి తే భారత మాహ కృష్ణః,**
**యస్మిన్ నృణాం గ్రామ్యసుఖాన్సఃనువాదైః మతిర్గృహీతానుహరేః కథాయామ్"**

- మోక్షసుఖమును గల్గించెడు హరికథలయం దాసక్తిగలుగుటకై గ్రామ్యకథలతోఁగూడిన భారతమును వ్యాసుఁడు వర్ణించినాఁడు. వానిని వినుటవలన హరికథలే మోక్షమునకు ముఖ్యమైన మార్గమను జ్ఞానము గలుగును. ఆ తరువాత మానవుఁడు హరికథలయందే యాసక్తిగలవాఁడగును. దాని క్రింది శ్లోకముగూడ నీ యర్థమునే పటిష్ఠముసేయుచున్నది. పోతనామాత్యుఁడు ఈ విషయమునే వివరించుటకుఁగా బోలు కథామార్గమునఁ జెప్పినాఁడు.

190. కావున

191. నరసిరుహోదరుమంగళచరితామృతమున్=శ్రీ మహావిష్ణువు యొక్క మంగళకరమైన చరిత్రలను నమృతమును, ఆత్మన్ గ్రోలు జనుఁడు = శ్రవణపుటములలో నించికొని పాన మొనర్చెడు మానవుఁడు, ఇతరకథాగరళమున్ = గ్రామ్యకథలనెడు విషమును, గ్రోలునె త్రావునా? జీవులకున్, హరి సంస్మరణము = వైకుంఠునిస్మరణ, అఖిలసౌఖ్యదము = సమస్తసౌఖ్యములను గల్గించునది.

**తాత్పర్యము** : భగవత్కథలనెడు నమృతపాన మొనర్చెడు మానవుఁడు ఇతరగ్రామ్యకథలనెడు విషమును ద్రావుట కిచ్ఛించునా? భగవంతుని స్మరణ జీవులకు సమస్తసౌఖ్యములను జేకూర్చునది. "గరళము" చాలపెద్దమాట. "విరక్తి మన్యత్రకరోతి పుంసాం" - అని మాత్రమే మూలము. తెనుఁగులోని తీవ్రమైన మందలింపు పోతనామాత్యుని మనస్తత్త్వమును దెలుపును.

192. శ్రీవనితాధిప = లక్ష్మీశ్వరుఁడైన విష్ణువు యొక్క, నామకథా విముఖులకున్ = మంగళకరమైన నామములందును, కథలయందును నాసక్తి లేని వారికి, ఇహమున్ పరమున్ దవ్వై = ఈ లోకమును పరలోకమును దూరమైపోవును, పిదపన్ = తరువాత, నరకమునకుఁ బోవుదురు, ఏన, వారిన్ వావిరిన్ చూచి = నేను వారిని వీక్షించి, వగతున్ = దుఃఖింతును.

**తాత్పర్యము** : భగవన్నామమునందును, కథలయందును, విముఖమైన చిత్తవృత్తి గల వారలకు, ఇహము లేదు. పరము లేదు. వారు మరణించిన తరువాత నరకమునకుఁబోవుదురు. అట్టివారిని జూచి నేను దుఃఖింతును. దీనికి మూల మిట్లున్నది - "తాన్ శోచ్యశోచ్యాన్ అవిదః అను శోచే, హరేః కథాయాం విముఖా నరా యే" - భాగవతతాత్పర్యము నర్థముచేసికొన లేనివారు శోచ్యులు. అర్థము చేసికొనియు నందుఁ బ్రవర్తింపనివారు శోచ్యశోచ్యులు, మొదటివారి కన్నను రెండవవారు ఎక్కువగా దుఃఖింపఁ దగిన వారని యర్థము.

193. ఏ నరుఁడు ఒక నిమునంబైనన్, వృథావాదగతినిన్ = శుష్కవాదములతో, హరిపదకమలధ్యానానందుఁడు = హరిపాద సంస్మరణముచేతఁ, గలిగెడు నానందముగలవాఁడు, కాఁడేన్ = కాకున్నచో, ఆ నరునకున్, ఆయువు అల్పమగున్.

**తాత్పర్యము** : ఏ మనుష్యుఁడు భగవత్పదకమలధ్యానముచేతఁ గలిగెడు నానందమును వదలి ఒక్క నిమునమును, వృథావాదములతోఁ గడపునో ఆ నిమేషము వానికి వ్యర్థమయినట్లే. ఆయుస్సులో నా నిమేషము వ్యర్థముగా తగ్గినట్లే. ఈ సందర్భములో మూలశ్లోకము తెనుఁగునకంటెను స్వారస్యముగా నున్నది.

"క్షిణోతి దేవోఽనిమిషస్తు తేషాం ఆయుర్వృథావాదగతిస్మృతీనాం" అని మూలము. నిత్యజాగరూకుఁడైన యముఁడు మానవుని యాయువునులోఁ గొనుటకు సర్వథా సన్నద్ధుఁడై యుండును. అట్టివాఁడు వీనికిఁ దెలియకయే యాయుస్సును హరించికొని పోవునని యర్థము. ఈ సొగసుఁ తెనుఁగులో రాకపోయినది. "వృథావాదగతిస్మృతీనాం" - అనుటయుఁ జాల నర్థపుష్టిగలిగిన మాట, వ్యర్థములైన వాదములు క్రియలు స్మృతులు గలిగినవారని యర్థము. ఈ పుష్టి తెనుఁగులో రాలేదు.

194. మృదుగతిన్ = లలితమైన పద్ధతితో, పూవుతేనియన్ = పుష్పరసమునందు, రమింపుచున్ = సంతోషమునందుచు, పానముసేయన్ పాఱు షట్పదమునున్ పోలి = త్రావుటకుఁ బరువెత్తు తుమ్మెద వలె, ఆర్తజనబాంధవున్ = దీనులకేక బంధువైనవాఁడును, విశ్వభవస్థితి వ్యయాస్పద మహితావతారుఁడు = జగత్తుల సృష్ట్యాదులకుఁ గారణభూతములైన గొప్పయవతారములుగల వాఁడును నైన, పంకరుహోదరు నిత్యమంగళప్రదగుణకీర్తనామృతమున్ = శ్రీ మహావిష్ణువు మంగళాస్పదమైన శోభనగుణశ్రవణమనెడు నమృతమును, పాయకక్రోలెదన్ = నిత్యసన్నిధానముగా ద్రావెదను, దయన్ చెప్పవే.

**తాత్పర్యము** : భగవంతుఁడు దీనజనశరణ్యుఁడు, సమస్తజగత్తుల సృష్టిస్థితి సంహారముల కాస్పదమైన గొప్పయవతారచరిత్రలు గలవాఁడు, వానికథలు నిత్యమంగళములను గల్గించునవి. అమృతముతో సమానమైన రుచిగలవి. అట్టి యా కథలను పూవులయందుఁబ్రాలి తేనెలతో రమించుచు వానిని

పానముచేసెడి తుమ్మెదలవలె నుత్సాహముతో నే మాత్రము వ్యవధానములేక గ్రహింతును. వానిని వర్ణింపుము. మూలమందు -
"హరేఃకథామేవ కథానుసారాం ఉద్ధృత్య పుష్పేభ్య ఇవార్త బంధో,
శివాయ నః కీర్తయ తీర్థకీర్తేః" - అని యున్నది.

పుష్పములనుండి తుమ్మెద సారమును గ్రహించునట్లుగా ననేకకథల నుండి హరికథలను విడదీసి నాకు వర్ణింపు మని భావము. ఈ సందర్భములో పోతనామాత్యుఁడు షట్పదవృత్తాంతమును బరీక్షిత్తున కన్వయించినాఁడు. మూలమున కంటె భిన్నమైన మార్గము.

195. అని ఈ రీతిగా, విదురుఁడు మైత్రేయుండను మునినాయకునిన్ అడిగెన్ అని = వేదవ్యాసుని తనయుండు అభిమన్యుని తనయునికిన్ చెప్పి మఱియున్ తగన్ ఇట్లనియెన్.

**తాత్పర్యము** : ఈ రీతిగా విదురుఁడు మైత్రేయు నడిగెనని శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజునకుఁ దెలిపెను.

196. అతిమృదు మధుర వచన రచనుండై = అతిలలితములైన వచనరచనగలవాఁడై, కృష్ణకథాశ్రవణ తత్పరుండవై = కృష్ణకథలను వినుటయం దాసక్తిగల వాఁడవై, భగవత్ + భక్తుండవు, హరికథా ఆసక్తుండవు = హరికథలయం దాసక్తి గల వాఁడవు, సాత్యవతేయువలనన్ = సత్యవతీకుమారుఁడైన వేదవ్యాసుని వలన, భ్రాతృక్షేత్రంబునన్ = తమ్ముఁడు విచిత్రవీర్యుని భుజిష్యయైన శూద్రస్త్రీయందు, ప్రజాసంయమనుఁడు = ప్రజలను నియమించువాఁడు, నిర్యాణకాలంబునన్ = అవ్యక్తుఁడగు సమయమందు, డాయన్ చేరి = దగ్గరకు రాఁబిలిచి, ఆనతి = ఆజ్ఞ, దత్త + అవధానుండవై = జాగ్రత్త గలిగి.

**తాత్పర్యము** : ఇట్లు విదురుఁడు మైత్రేయు నర్థించినాఁడు. అప్పుడు మైత్రేయుఁడు లలితపద విన్యాసముగా నిట్లనెను. విదురా! కృష్ణకథల యందలి నీ యాసక్తి నీకు మంగళకరమైనది. లోకములకును క్షేమ మొనగూర్చును. నీవు భగవద్భక్తుఁడవు. హరికథలయందు నీ కాసక్తి గలుగుటలోఁజిత్రము లేదు. మాండవ్యుని శాపముతో వ్యాసుని ద్వారా విచిత్రవీర్యుని భుజిష్యయైన దాసియందు జన్మించిన యమధర్మరాజవు

పరమజ్ఞాన సంపన్నుఁడవు, అందుచేత శ్రీమన్నారాయణునకు ప్రియమైన వాఁడవు. కృష్ణ పరమాత్మయవతారమును జాలించునపుడు నన్ను దగ్గరకుఁ బిలిచి విదురునకు జ్ఞానోపదేశ మొనర్పవలెనని యాదేశించినాఁడు. అందుచేత పరమజ్ఞానమును నీకు బోధింతును. జాగ్రత్తగలవాఁడవై వినుము.

197. వనజాక్ష = కృష్ణపరమాత్మ యొక్క , యోగమాయాజనితంబు = యోగమాయచేత జన్మించినది, అగు = అయిన, విశ్వజనన సంస్థానవినాశముల తెఱఁగు = సమస్త జగత్తుల నిర్మాణము, సంస్థానము, వినాశము - వీని పద్ధతిని, ఎఱిఁగింపుచున్ అనఘ, విష్ణునిమహత్త్వమున్ = శ్రీమహావిష్ణువు మాహాత్మ్యమును, అభివర్ణింతున్.

**తాత్పర్యము :** శ్రీ మహావిష్ణువు యొక్క యోగమాయచే జన్మించిన సమస్త ప్రపంచముల జన్మప్రకారము, పాలనము, సంహారము - వాని పద్ధతిని దెలుపుచు ఆతని లీలల నభివర్ణింతును, "యోగమాయోపబృంహితాః" "విశ్వస్థిత్యుద్భవాంతార్థాః" "భగవల్లీలాః"- "వర్ణయామి" అని మూలము.

198.సీ. సృష్టిలీలను వర్ణించుటకు మొదలు దాని పూర్వావస్థను దెలుపుచున్నాఁడు. సకల జీవులకు ఎల్లన్ ప్రకటదేహము = సమస్త జీవులకును స్వరూపభూతమైనవాఁడు. మూలము - "ఆత్మాత్మనాం" అని కలదు. ఆత్మనాం జీవానాం ఆత్మాస్వరూపం" - అని శ్రీధరులు. కనుక నిచ్చట దేహశబ్దమునకు స్వరూపార్థమునే = చెప్పవలెను. ఆత్మనాథుండున్ స్వామియైనవాఁడు, పరుఁడున్ పరమాత్మస్వరూపుఁడు, నానావిధైకమతి + ఉపలక్షణ మహితుండు, = అనేక విధములైన బుద్ధులచేత ననేక రూపములుగాఁ జూడఁబడెడు స్వరూపము గలవాఁడు. దీనికి మూలము - "నానామత్యుపలక్షితః" అని కలదు. ఇచ్చట నొక పద్ధతిలో నకార ప్రశ్లేషము. "అనానామత్యుపలక్షితః" - అని యప్పటి సమాసము. నానాదృష్టదృశ్యాదులైన బుద్ధులచేత నుపలక్షితుఁడు గానివాఁడని యర్థము. అనఁగా నేకాగ్రత లేక యొక్కటే స్వరూపమని భావింపక పలు వెంటలఁబోవు బుద్ధి. అట్టి బుద్ధికిఁ గన్పింపని వాఁడని తాత్పర్యము. అకారప్రశ్లేషము లేకయే మఱియొక యర్థము. అప్పుడు నానామత్యు పలక్షితః అగును. సృష్ట్యనంతరమం దనేక బుద్ధులతోఁ జూడఁబడెడువాఁ

డు. పై రెండు వ్యాఖ్యలును శ్రీధరునివి. పోతన రెండవ యర్థమునే స్వీకరించెను. సృష్టి పూర్వంబు నందున్ = సృష్టికి మొదలు, "ఆత్మేచ్ఛానుగతౌ" ఇచట నిచ్ఛయనఁగా మాయ. అది లయము నందఁగాఁ దనయోగమాయ తనయందే లయింపఁగా విశ్వగర్భుఁడై సమస్త విశ్వమును దనలోనే యున్నవాఁడై, తాన = తాను, ఎక్కటి వెలుంగున్ = ఒంటిగాఁ బ్రకాశించును. తన కంటె భిన్నమైన ద్రష్టగాని దృశ్యమును గాని లేకుండునని భావము. కారణాత్మకత్వముతో నన్నియు నున్నను కార్యాత్మకత్వముతో లేనందువలన వానికిఁ బృథక్ప్రతీతి లేదని భావము. పరమాత్ముఁడు అభవుండు = అభవుఁడు జన్మాది వికారరహితుఁడు ఉపద్రష్టయై చూచువాఁడైనను వస్త్వంతర పరిశూన్యుఁడు. తన కన్నను భిన్నమైన పదార్థములేనివాఁడు అగుటంజేసి = అగుట వలన, ద్రష్టకాకుండున్ = దృశ్యాభావమైన దాని వలన ద్రష్టృత్వములేనివాఁడై యుండును. మాయాప్రధానశక్తిన్ = మాయయనెడు ప్రధానమైన శక్తి వలన, అతులచిచ్ఛక్తి గలవాఁడున్ అగుచున్ = గొప్ప జ్ఞానశక్తి గలవాఁడై తన్నున్ లేనివానిగన్ చిత్తంబులోనన్ తలఁచి = తానున్నను లేనట్టి వానిగనే తలఁచి, భువన నిర్మాణవాంఛన్ = సమస్తప్రపంచముల నిర్మాణేచ్ఛచేత, ద్రష్టయగున్ = దర్శించువాఁడుగావలె ననెడి. సృష్టికిఁ బూర్వమందు సమస్త జీవుల కాత్మస్వరూపుఁడైన భగవంతు డుండెను. వాఁడే సమస్త జీవులకు నాత్మ. ప్రభువైనవాఁడు, స్వతంత్రుఁడు. బహుధా విచ్ఛిన్నమైన బుద్ధికిఁ గనపడనివాఁడు. సృష్ట్యనంతరము నానారూపములుగా నానాబుద్ధులకు భాసించెడువాఁడు, అట్టి భగవంతుఁడు సృష్టికి ముందుఁ దనయోగమాయ తనయందే లయింపఁగా నొంటివాఁడుగా నుండెను. సమస్త విశ్వములును దనగర్భమందే లీనమై యుండినవి. కారణములై దనయందు లీనమైయున్నను గార్యరూపములై బయటికి గన్పింపనందున వానివృథక్త్వము లేకుండినది. పరమాత్ముఁడు ద్రష్టగానున్నను దృశ్య మొక్కటియు నప్పుడు లేకుండెను. మాయా ప్రధానశక్తిచేతనే యాతఁడు ద్రష్టయగును. అట్టి మాయ తనయందే లీనమై యుండెను గదా! ఇక ద్రష్టృత్వమెక్కడ నుండి వచ్చును? కాని యాతని జ్ఞానము మాత్రము జాగృతముగనే యుండినది. "సుప్తశక్తిరసుప్తదృక్" అని మూలము. తాను

ద్రష్టయైనను దృశ్యము లేనిదాని వలన భగవంతుఁడు దన్ను లేని వానిఁగనే దలఁచెను ఎందువలన? వస్త్వంతరమే లేనిదానివలన. కాని యాతనికి తాను ద్రష్టగావలెనను నిచ్ఛయుండినది. ఆ యిచ్ఛచేత భగవంతుఁడు భువనములను నిర్మింపఁదలఁచినాఁడు.

199. బుద్ధిన్ తోఁచినన్ = బుద్ధియం దేర్పడఁగా, నా మహాపురుషవరుఁడు, కార్యకారణ రూపమై = కార్యమును గారణమును దానై, ఘనతకున్ ఎక్కి = కీర్తిని గని, భూరి మాయాభిధాన విస్ఫురిత శక్తిన్ = యోగమాయ యనెడు పేరుగల తన శక్తి. దానికే య విద్యయనియును పేరు.

**తాత్పర్యము** : పరమాత్మునకుఁ బ్రపంచమును నిర్మింపవలెనను గోర్కెపొడమినది. కార్యకారణరూపమ్మైన మాయ దనయందే లీనమ్మై యున్నదిగదా! దానికే యవిద్య యనియును నామాంతరము.

200. పురుషాకృతితో భగవంతుఁడు ఆత్మాంశగల తన శక్తిని మాయయందు నిలిపెను. అప్పుడు దనకడుపులో నున్న విశ్వమును సృష్టించినాఁడు. కాలశక్తిచేత క్షుభితగుణమైన మాయయందు ప్రకృత్యధిష్ఠాతృరూపమైన దన పురుషాంశచేత చిదాభాసమైన వీర్యమును నిలిపెనని భావము.

201. ధృతిన్వూని = దిట్టతనముతో, కాలచోదితము = కాలముచే ప్రేరేపింపఁబడినది, అవ్యక్తంబు = ఇట్టి దట్టిదని చెప్పరానిది. ప్రకృతియున్ అనుపేళ్ళన్ బరఁగున్ = ప్రకృతియు నను పేరుగల, మాయవలనన్ = మాయనుండి, మహత్తత్త్వమున్ ఎలమిన్ పుట్టించెన్ = మహత్తత్త్వమును సృష్టించెను, మాయాంశకాలాది గుణాత్మకంబు = మాయనిమిత్తకారణమైన చిదాభాసము, గుణములనెడు నుపాదానకారణము, క్షోభకరమైన కాలము వీని కధీనమ్మైన మహత్తత్త్వము, అచ్యుతదృగ్గోచర మగుచున్ = భగవంతునిచేఁ జూడఁబడినదై, విశ్వనిర్మాణవాంఛన్ అందుటన్ చేసి = విశ్వమును సృష్టింపవలెనను గోర్కె గలిగినదగుటచే, రూపాంతరంబునన్ పొంది, మహత్తత్త్వ మందున్ = కార్య కారణ కర్త్రాత్మకత్వము = కార్యము - కారణము - కర్త యనెడు గుణముల కాశ్రయమ్మై, భూతేంద్రియక మహోమయుమనంగన్ = భూతములు, ఇంద్రియములు, మనస్సు నను వీవికారములతోఁ గూడినదై, అహంకారతత్త్వ ముత్పన్నమయ్యెన్ =

అహంకారతత్త్వ మేర్పడెను. సత్త్వరజస్తమోగుణక అగుచున్ = సత్త్వాదిగుణములచే నది మూఁడు రీతులు. కాలప్రేరితమైన యా యవ్యక్తము నుండి మహతత్త్వ మేర్పడినది. ఈ యవ్యక్తమునకే మాయ, ప్రకృతి యని పేరు. ఈ మహత్తత్త్వము సత్త్వప్రధానమైనది. ఇది ఆత్మదేహస్థమైన విశ్వమును ఉచ్చూనమైన బీజము అంకురాదికమును వలెఁ బ్రకాశింపఁజేయుచున్నది. చీఁకటిని బోఁగొట్టుచు వికారమునందెను. ఇది విష్ణుస్వరూపమైనది. "విష్ణోస్తు త్రీణి రూపాణి పురుషాఖ్యాన్యతో విదుః, ప్రథమం మహతోరూపం ద్వితీయం త్వండసంస్థితం తృతీయం సర్వభూతస్థం తాని జ్ఞాత్వా విముచ్యతే" అని సాత్వతతంత్రము. ఇట్టి మహత్తత్త్వము నుండి యహంకారతత్త్వ ముత్పన్నమైనది. మహత్తత్త్వము మాయాంశకాలాది గుణాత్మకము. అంశ లనఁగా చిదాభాసనిమిత్త కారణము, గుణము, ఉపాదానకారణము, కాలము క్షోభకరమైనది, దానినుండి యహంకారతత్త్వ ముత్పన్న మయ్యెనని చెప్పఁబడినది. ఆయహంకారతత్త్వము కార్యకారణకర్త్రాత్మకమైనది. కార్యము అధిభూతము. కారణము ఆధ్యాత్మము. కర్త అధిదైవతము. వీని కాశ్రయమైనది యహంకారము. అది భూతేంద్రియ మనోమయమైనది. భూతములు జ్ఞానకర్మేంద్రియములు. మనస్సు వీనితోఁగూడినది. మనస్సు దేవతలకుఁ గూడ నుపలక్షణము, తత్తదింద్రియాభిమాని దేవతలన్నమాట, ఈ యహంకారము త్రిగుణాత్మకము.

202. రూపాంతరములు = వేఱు రూపములు, సాత్త్వికా హంకారంబు వలనన్ = వైకారికమని పిలువఁబడెడు సాత్త్వికాహంకారమునుండి మనంబునున్, కార్యభూతంబులైన దేవతాగణంబులున్ = కార్యములైన దేవతలు జన్మించిరి. ఇంద్రియాధిష్ఠాతలు = ఇంద్రియములందు నివసించువారు, వానివలనన్ = ఆ దేవతలనుండి శబ్దాదిప్రకాశ మేర్పడుచున్నది, జ్ఞానేంద్రియంబులైన త్వక్ = చర్మము, చక్షుః = కన్నులు, శ్రోత్ర = చెవులు, జిహ్వా = నాలుక, ఘ్రాణము = నాసిక, కర్మ + ఇంద్రియములు = వాక్ పాణి పాద పాయు ఉపస్థలు, ఇవి కర్మేంద్రియములు, తైజసాహంకారమునన్ ఉత్పన్నంబు లయ్యెన్ = రజోగుణపూరితమైన యహంకారము నుండి జన్మించెను. జ్ఞానమయము

లైనను నివి సాత్త్వికములుగావని యర్థము తామసాహంకారముచేత శబ్దస్పర్శ రూప, రస, గంధములనెడు భూతతన్మాత్రలు జన్మించినవి, శబ్దము తనగుణమైన శబ్దముతో నాకాశమును గల్గించెను. ఈ యాకాశము భగవంతునకు లింగము అనఁగా దేహము. "ఆకాశ శ్శరీరంబ్రహ్మ" - అని శ్రుతి. గగనంబు = ఆకాశము, కాలము = క్షోభకమైన కాలము, మాయ = తామసాంశమైన ప్రకృతి. అంశ మనఁగా చిదాభాసము, దీని సంబంధముతో పుండరీకాక్షునిరీక్షణమునన్ = భగవంతుని యవలోకనముచేతను, స్పర్శతన్మాత్రముతో నిబంధముగలిగి వాయువును జన్మింపఁజేసినది, పవనుండు = వాయువు, నభోబలంబునన్ = నభస్సుగుణమైన శబ్దముచేతను, రూపతన్మా త్రంబువలనన్, లోకలోచనంబులు = లోకమునందు సర్వ వస్తువులను బ్రకాశింపఁజేయునది తేజమును గల్గించెను, తేజము గూడ కాలమాయాంశయోగముతో నుత్తమశ్లోకుని, లోకనంబులు = భగవంతుని విలోచనములచేత, పవమానయుక్తంబు లగుచున్ = గాలిచేతఁ గూడికొని అనఁగా శబ్దస్పర్శరూపములతోడి రసతన్మాత్రంబువలనన్ = రసమనెడు తన్మాత్రచేఁ గూడికొన్న అంబువులం గలిగించెన్ = జలమును గలిగించినది, సలిలంబు = నీరు, కాలమాయాంశయోగంబునన్ = కాలము, మాయ, అంశ చిదాభాసము-వీవి సంబంధముచేత, తేజోయుక్తంబై = తేజస్సుతోఁ గూడికొన్నదై, గంధగుణంబువలనన్ = గంధమనెడు గుణముచేత పృథివిన్ కలిగించెన్ = భూమిని జన్మింపఁజేసెను, కనుక గగనమునకు శబ్దము గుణము, వాయువునకు శబ్దస్పర్శములు, తేజస్సునకు శబ్దస్పర్శరూపములు గుణములు. భూమి కైదుగుణములు. కాలమాయాంశలింగంబులన్ కలిగి = కాలము, మాయ, చిదాభాసము ననెడు చిహ్నములను గలిగి, మహదాద్యభిమానంబులనందిన దేవతలు మహదాదులు వేమనెడు నభిమానముగల దేవతలు విష్ణుకళాకలితు లగుదురు, విష్ణుకళలచేఁ గూడికొన్నవారు "ఏతే దేవాః కళా విష్ణోః" అని మూలము. ఐక్యంబు చాలమిన్ = ఐక్యత లేకపోవుటచేత, ప్రపంచంబులు గల్పింప సమర్థంబులు గాక = ప్రపంచసృష్టికి శక్తి లేనివై భగవంతుని ధ్యానించినారు.

**తాత్పర్యము :** వైకారిక మని పిలువఁబడెడు సాత్త్వికాహంకారము రూపాంతరము నందినది. అట్టి సాత్త్వికాహంకారము నుండి మనస్సేర్పడినది. కార్యభూతులైన దేవతులు గూడ గల్గినారు. వారింద్రియాధిష్ఠాతలు. వారిచేతనే శబ్దాదుల ప్రకాశ మేర్పడుచున్నది. తైజసమైన యహంకారముతో జ్ఞానేంద్రియములును, గర్మేంద్రియములును గల్గినవి. ఇవి జ్ఞానమయము లగుటచే సాత్త్వికాహంకారజనితము లని భ్రమింపరాదు. రాజసములైనవే, తామసాహంకారము నుండి భూతతన్మాత్రలైన శబ్దస్పర్శాదులు గలిగినవి. శబ్దము తనగుణమైన శబ్దముచేత నాకాశమును గలిగించెను. ఈ యాకాశము క్షోభకమైన కాలము, తామసాంశమైన ప్రకృతి, చిదాభాస మనెడు నంశము-వీనిచేఁ గూడికొని భగవద్వీక్షితమై స్పర్శతన్మాత్రతో వాయువును గల్గించినది. వాయువు శబ్దస్పర్శములఁ గూడినదై రూపతన్మాత్రయైన తేజస్సు నుద్భవింపఁజేసెను. ఈ తేజస్సే ప్రపంచమునందలి సకలపదార్థములను బ్రకాశింపఁజేయునది. సర్వత్ర తన్మాత్రల ద్వారానే భూతోత్పత్తియని తెలియవలెను. తేజస్సు కాలమాయాంశయోగముతో జలమును సృష్టించెను. భగవద్వీక్షితము వలననే సమస్తము నేర్పడెనని మఱవరాదు. రసతన్మాత్రతో జలములేర్పడెను. ఈజలము కాలమాయాంశ యోగముతో పరమేశ్వరానుగ్రహ యుక్తమై తేజస్సం యుక్తమై గంధగుణముతో పృథివిని జన్మింపఁజేసెను. కనుక నాకాశమునకు శబ్దము గుణము. వాయువునకు శబ్దస్పర్శములు, తేజస్సునకు శబ్దస్పర్శరూపములు, జలమునకు శబ్దస్పర్శరూప రసములు గుణములు. భూమి కైదు శబ్దస్పర్శరూపరసగంధములు. కాలలింగమైన వికృతియు మాయాలింగమైన విక్షేపమును, అంశలింగమైన చేతనము గలిగి మహదాద్యభిమానముగల దేవతలు విష్ణువునంశతో గూడినవారు. ఇట్టి మహదాదితత్త్వములు పరస్పరవిరుద్ధగుణములుగల వగుటచే నైక్యమును సాధించికొనలేక పోయినవి. అవి భగవంతు నిట్లు స్తుతించెను.

203 దండకము : నమ్రైకదీక్షావిపక్ష! = నమ్రులైన భక్తులను రక్షించుటందు విశేషాభిమానము గలవాఁడా!, క్షమాభృత్ = భూమిని పరిపాలించుటందు, సహస్రాక్ష! = అనేకములగు కన్నులు గలవాఁడా! అనఁగా జగత్తులను బరిపాలించుటందు నిత్యజాగరూకుఁడని యర్థము, నీరేజపత్ర + ఈక్షణా!

= పద్మలోచనా, భవత్ + దాసవర్గ = నీ భక్తుల తాపములను బోఁగొట్టెడి దివ్యమైన ఛత్రముతో సమానమైన పాదములు, పుణ్య + ఆలవాలము = సమస్త పుణ్యములకును పాదువంటిది, ఉద్దామ = తీవ్రమైన సంసారతాపములు, పాయఁగాన్ మీటి = ఓడిపోవునట్లు ఎగురఁగొట్టి - సమస్తఅఘనిర్ణాశ = పాపములను బోఁగొట్టువాఁడా! భవ + ఉదగ్ర దుర్వారతాపత్రయములు = సంసారము నాశ్రయించికొని యుండెడు త్రివిధ తాపము లనెడు దావాగ్ని, పరిభ్రామ్యమాణాత్ములు = తిరుగుచున్నట్టి మనస్సుగలవారు, విజ్ఞాన దీపాంకురము = విజ్ఞాన మనెడు దీపము, పంకేరుహము = పద్మము, ఐకాంతికస్వాంతత = తనయందే నిక్షిప్తమైన బుద్ధి, అభ్రగంగ = ఆకాశగంగ, ముఖాంభోజ నీడోద్గతము = ముఖమను గూడునుండి పుట్టినది, వేద + అండజశ్రేణి = వేదములను పక్షుల గుంపు, గవేషించు = వెదకు, సంప్రాప్తులు = పొందఁ బడినప్రాప్తిగలవారు, నిర్వాణ మూర్తి, మోక్షస్వరూపుఁడు, బాహ్య + ఇంద్రియవ్యాప్తిన్ = బాహ్యవిషయములందు వర్తించుటచేత, వేదాంత శుద్ధాంత సిద్ధాంతమై = వేదాంతములను సంతఃపురములకు సంబంధించిన కడపటి మాటయైన, నిత్యప్రపన్నుల్ = నిత్యమును శరణాగతి నందినవారు, అంతర్బహిర్వ్యాప్తిన్ = లోపలను బయటను వర్తించుపద్ధతిని, తావకీనము = నీ సంబంధమైనది, సత్త్వాదిత్రైగుణ్యమూలంబు = మూఁడుగుణములకుఁగారణమైనది, సంధానులు = కల్పించువారు.

**తాత్పర్యము** : స్వామి! నీవు భక్తరక్షైకతత్పరుఁడవు. లోకరక్షణమం దనేక లోచనములు గలిగి వర్తించువాడఁవు, పద్మపత్రలోచనుఁడవు, నీదాసవర్గముల యనుతాపములు పోఁగొట్టునట్టి యాతపత్రములు నీ పాదములు. అట్టి నీ పాదములను అనంతజన్మప్రవాహపుణ్యఫలములుగాఁ బొంది యోగులైనవారు త్రివిధతాపములను బోఁదట్టి వర్తింతురు. ఈ జగత్తునందు జీవులు తాపత్రయములనెడు నగ్నులతో వేధింపఁబడిన వారై, యే కర్మమును, ధర్మమును జేయనొల్లరు, సంసారచక్రమం దిట్లే శాశ్వతముగా జుట్టుచుందురు. వారు శోచ్యులు. మహాయోగులు ఐకాంతికమైన మనస్సుతో సమస్తపాపనిర్ణాశక గంగామూలమైన నీపాదములను నీ ముఖమనెడు నీడమునుండి గడ్డకు వచ్చిన వేదములను

పక్షులచేత గవేషింతురు. అనఁగా వేదములనెడు పక్షులు భగవదుద్గతములైన భక్తిజ్ఞానకర్మలనెడు మార్గములందుఁ జరించి మరల భగవంతునే జేరునని భావము. వైరాగ్యముచే నేర్పడిన జ్ఞానముతో గొప్పవారైనధీరులు నీ పాదములను బట్టి మోక్షము నందెదరు. సమస్త జగత్తుల యొక్క సృష్ట్యాదులకు నీవే మూలము. నీ వనేకదివ్యావతారము లెత్తెదవు. సమస్తజీవులం దంతర్యామివై వర్తింతువు. అట్లుండియు వారి మనస్సులు బాహ్యవిషయవ్యాసక్తములై యుండుటచేత దూరమం దున్నట్లే గన్పింతువు. బాహ్యేంద్రియవృత్తులతో సద్వృత్తులైయున్న మానవులు నిరంతరము నీపాదములను మనస్సునం దుంచికొన్న భక్తులను దర్శింపలేరు. నీసత్కథలు వేదాంతశుద్ధాంతసిద్ధాంతములు, నిరంతరము వానిని గ్రోలు పుణ్యాత్ములు అల్పప్రయాసముచేతనే వైకుంఠమును బ్రాపింతురు. యోగులు దమయింద్రియములను బాహ్యవ్యాప్తుల నుండి మరలించి నీమూర్తిని మనస్సులందు నిలిపికొని యానందమునఁ దేలియాడుచుందురు. అట్టివారికి నీదయచేత విజ్ఞానము ప్రాప్తించును. మేము నీ దాసులము. జగత్కల్పనాశక్తితో నీవు మమ్ము గల్పించితివి. నీ లీలల కాకరములైన జగత్తులను మేము సృష్టి చేయలేక యున్నాము. మా యందు నీశక్తిని నిక్షేపింపుము. అప్పుడు మేము ప్రపంచనిర్మాణదక్షుల మగుదుము. త్రిగుణాత్మకమైన మాయయందు నీ వీర్యమునుంచుటచే మహత్తత్త్వము జన్మించినది. అందుచేత నీవు సమస్తమునకును గారణభూతుఁడవు. నీ పూజావిశేషముగా మేమెట్లు కార్యము లొడఁగూర్ప గలమో యట్లు కరుణింపుము. లోకము నీకును మాకును బలిని సమర్పించునట్లు కార్యోన్ముఖమై వర్తింపఁగా ననుగ్రహింపుము. నీ తోడ్పాటు లేనిది జగత్తులను సృష్టింపలేము. లక్ష్మిమనస్సు అనెడు పల్వలమందుఁ గ్రీడించు నో యాదివరాహమూర్తీ! యోగుల మనస్సనెడు సరస్సులఁ గ్రీడించెడు హంసమా ! నీకు నమస్కారము.

**ఇది పుట్టపర్తి నారాయణ దాసకృత భాగవత**
**సుధాలహరి యందు పంచమాశ్వాసము**

# భాగవత సుధాలహరి
## తృతీయస్కంధము
## షష్ఠాధ్యాయము

**మైత్రేయ ఉవాచ -**

ఇతి తాసాం స్వశక్తీనాం సతీనా మసమేత్య సః,
ప్రసుప్తలోకతంత్రాణాం నిశామ్య గతి మీశ్వరః. 1

కాలంసంజ్ఞాం తతో దేవీం బిభ్రచ్ఛక్తి మురుక్రమః,
త్రయోవింశతితత్త్వానాం గణం యుగప దావిశత్. 2

సోఽను ప్రవిష్టో భగవాం శ్చేష్టారూపేణ తం గణమ్,
భిన్నం సంయోజయామాస సుప్తం కర్మ ప్రబోధయన్. 3

ప్రబుద్ధకర్మా దేవేన త్రయోవింశతికో గణః,
ప్రేరితోఽజనయ త్స్వాభి ర్మాత్రాభి రధిపూరుషమ్. 4

పరేణాఽఽవిశతా స్వస్మి న్మాత్రయా విశ్వసృగ్గణః,
చుక్షోభాఽన్యోన్య మాసాద్య యస్మిన్ లోకా శ్చరాచరాః. 5

హిరణ్మయ స్స పురుష స్సహ స్రపరివత్సరాన్,
అండకోశ ఉవాసాఽప్సు సర్వసత్త్వోపబృంహితః. 6

స వై విశ్వసృజాం గర్భో దైవకర్మాత్మశక్తిమాన్,
విశ్వభాజాఽఽత్మనా ఽఽత్మాన మేకధా దశధా త్రిధా. 7

ఏష హ్యాశేషసత్త్వానా మత్మాంశః పరమాత్మనః,
ఆద్యోవతారో యత్రాసౌ భూతగ్రామో విభావ్యతే. 8

సాధ్యాత్మ స్సాధిభూత శ్చ సాధిదైవ ఇతి త్రిధా,
విరాట్ప్రాణో దశవిధ ఏకధా హృదయేన చ. 9

స్మర న్విశ్వసృజా మీశో విజ్ఞాపిత మధోఽక్షజః
విరాజ మతప త్స్వేన తేజసై షాం వివృత్తయే. 10

అథ తస్యాఽభిత ప్తస్య కతి చాయతనా నిహ,
నిరభిద్యంత దేవానాం తాని మే గదత శ్శృణు. 11

తస్యాఽగ్నిరాస్యం నిర్భిణ్ణం లోకపాలోఽవిశ త్పదమ్,
వాచా స్వాంశేన వ క్తవ్యం యయాఽసౌ ప్రతిపద్యతే. 12

నిర్భిణ్ణం తాలువరుణో లోకపాలోఽవిశ త్పదమ్.
జిహ్వయాంశేన చ రసా న్యయాఽసౌ ప్రతిపద్యతే. 13

నిర్భిణ్ణే అశ్వినౌ నా సే హరే రావిశతాం పదమ్,
ఘ్రాణేనాఽంశేన గంధస్య ప్రతిప త్తి ర్యతో భవేత్. 14

నిర్భిణ్ణే అక్షిణీ త్వష్టా లోకపాలోఽవిశ త్పదమ్,
చక్షుషాంశేన రూపాణాం ప్రతిప త్తి ర్యతో భవేత్. 15

నిర్భిణ్ణా న్యస్య చర్మాణి లోకపాలోఽనిలోఽవిశత్,
ప్రాణేనాఽంశేన సంస్పర్శం యేనాఽసౌ ప్రతిపద్యతే. 16

కర్ణా వస్య వినిర్భిణ్ణౌ ధిష్ణ్యం స్వం వివిశు ర్దిశః,
శ్రోత్రేణాఽంశేన శబ్దస్య సిద్ధిం యేన ప్రపద్యతే. 17

త్వచ మస్య వినిర్భిణ్ణాం వివిశు ర్ధిష్ణ్యమోషధీః,
అంశేన రోమభిః కండూం యై రసౌ ప్రతిపద్యతే. 18

మేంఢ్రం తస్య వినిర్భిణ్ణం స్వధిష్ణ్యం క ఉపావిశత్,
రేతసాఽంశేన యేనాసా వానందం ప్రతిపద్యతే. 19

గుదం పుంసో వినిర్భిణ్ణం మిత్రోధిష్ణ్యం స్వ మావిశత్,
పాయునాఽంశేన యేనాఽసౌ విసర్గం ప్రతిపద్యతే. 20

హస్తా వస్య వినిర్భిణ్ణా వింద్ర స్స్వర్పతి రావిశత్,
వా ర్తయాఽంశేన పురుషో యయా వృత్తిం ప్రపద్యతో. 21

పాదా వస్య వినిర్భిణ్ణౌ స్వధిష్ణ్యం విష్ణు రావిశత్,
గత్యా స్వాంశేన గంతవ్యం యయాఽసౌ ప్రతిపద్యతే. 22

హృదయం చాస్య నిర్భిణ్ణం చంద్రమా ధిష్ణ్య మావిశత్,
మనసాఽంశేన యేనాఽసౌ విక్రియాం ప్రతిపద్యతే. 23

బుద్ధిం చాస్య వినిర్భిణ్ణాం వాగీశో ధిష్ణ్య మావిశత్,
బోధేనా౽ంశేన బోద్ధవ్యప్రతిపత్తి ర్యతో భవేత్. 24

ఆత్మాంన చాస్య నిర్భిణ్ణ మభిమానో౽విశ త్పదమ్,
కర్మణా౽ంశేన యేనా౽సౌ క ర్తవ్యం ప్రతిపద్యతే. 25

సత్త్వం చాస్య వినిర్భిణ్ణం మహాం ధిష్ణ్య ముపావిశత్,
చి త్తేనా౽ంశేన యేనా౽సౌ విజ్ఞానం ప్రతిపద్యతే. 26

శీర్ష్ణో౽స్య ద్యౌ ర్ధరా పద్భ్యాం ఖం నాభే రుదపద్యత,
గుణానాం వృత్తయో యేషు ప్రతీయంతే సురాదయః. 27

అత్యంతికేన సత్త్వేన దివం దేవాః ప్రపేదిరే,
ధరాం రజస్స్వభావేన పణయో యే చ తానను. 28

తా ర్తీయేన స్వభావేన భగవ న్నాభి మాశ్రితాః,
ఉభయో రంతరం వ్యోమ రుద్రపారిషదాం గణాః. 29

ముఖతో౽వ ర్తత బ్రహ్మపురుషస్య కురూద్వహ,
య త్తున్ముఖత్వా ద్వర్ణానాం ముఖ్యో౽భూ ద్బ్రాహ్మణో గురుః. 30

బాహుభ్యో౽వ ర్తత క్షత్రం క్షత్రియ స్తదనువ్రతః
యో జాత స్త్రాయతే వర్ణాన్ పౌరుషాన్ కంటకక్షతాత్. 31

విశో౽వ ర్తంత తస్యో ర్వో ర్లోకవృత్తికరీ ర్విభోః,
వైశ్య స్తదుద్భవో వార్తాం నృణాం య స్సమవ ర్తయత్. 32

పద్భ్యాం భగవతో జజ్ఞే శుశ్రూషాధర్మసిద్ధయే,
తస్యాం జాతః పురా శూద్రో యద్వృత్త్యా తుష్యతే హరిః. 33

ఏతే వర్ణా స్స్వధర్మేణ యజంతి స్వగురుం హరిమ్,
శ్రద్ధయా౽౽త్మవిశుద్ధ్యర్థం య జ్జాతా స్సహ వృత్తిభిః. 34

ఏత త్క్షత్త ర్భగవతో దైవకర్మాత్మరూపిణః,
క శ్శ్రద్దధ్యాదుపాకర్తుం యోగమాయా బలోదయమ్. 35

అథాపి కీ ర్తయామ్యంగ యథామతి యథా శ్రుతమ్,
కీ ర్తిం హరే స్స్వాం సత్కర్తుం గిర మన్యాభిధా సతీమ్. 36

ఏకాంతలాభం వచసోనుపుంసాం
సుశ్లోకమౌళే ర్గుణవాద మాహుః,
శ్రుత శ్చ విద్వద్భి రుపాకృతాయాం
కథాసుధాయా ముపసంప్రయోగమ్. 37

ఆత్మనోఽప్యాదికవినా మహిమాఽవసితోపి కిమ్,
సంవత్సరసహస్రాంతే ధియా యోగవిపక్వయా. 38

అహో భాగవతీమాయా మాయినా మపి మోహినీ,
యత్స్వయం చాత్మవర్త్మాత్మా న వేద కిముతాఽపరే. 39

యతోఽప్రాప్య న్యవర్తంత వాచశ్చ మనసా సహ,
అహం చాన్య ఇమే దేవా స్తస్మై భగవతే నమః. 40

ఇతి శ్రీమద్భాగవతే, మహాపురాణే, పారమహంస్యాం, సంహితాయాం,
తృతీయస్కంధే, షష్ఠోఽధ్యాయః.

**అర్థములు :**

**1-2. శ్లో :** ఉరుక్రమః సః ఈశ్వరః = గొప్పశక్తితోఁగూడిన యా ఈశ్వరుఁడు, ఇతి = ఈ ప్రకారము, అసమేత్య = ఒకటితో నొకటి కలియక, సతీనాం = ఉన్నట్టియు, ప్రసుప్తలోకతంత్రాణాం = ప్రసుప్తములైన లోకతంత్రముతోఁగూడినవియు నైన, తాసాం స్వశక్తీనాం = ఆ తన శక్తులయొక్క, గతిం = అవస్థను, నిశమ్య = చూచి, తదా = అప్పుడు, కాలసంజ్ఞాందేవీంశక్తిం = కాలమనుపేరుతోఁగూడిన దేవియైన శక్తిని, బిభ్రత్ = వహించినవాఁడై, త్రయోవింశతి తత్త్వానాం గణం = ఇరువదిమూఁడు తత్త్వముల సమూహమును, యుగపత్ = ఒక్కటే సారి, ఆవిశత్ = ప్రవేశించెను.

**తాత్పర్యము :** సమస్తమును నిర్వహించుటకు సమర్థమైన మహాశక్తిగల యా ఈశ్వరుఁడు ఒక్కదానితో నొకటి చేరక లోకసృష్టి కుపకరించెడి ప్రాణికర్మములు లోన ధరించియున్న మహత్తత్త్వాదులకు లోకనిర్మితిసామర్థ్యము సిద్ధింపకుండుటకుఁ గల కారణమును గమనించెను. కాలమను పేరుగల స్వశక్తిని ధరించి యా యిరువది మూఁడు తత్త్వములయం దేకకాలమందే ప్రవేశించినాఁడు. మహత్తత్త్వము, అహంకారతత్త్వము, పంచతన్మాత్రలు, పంచమహాభూతములు, జ్ఞానకర్మేంద్రియములు, మనస్సు - ఇవియే ఇరువదిమూఁడు తత్త్వములు.

3. శ్లో : అనుప్రవిష్టః = ఈ రీతిగా నేకకాలమందే ప్రవేశించిన, సః భగవాన్ = ఆ భగవంతుఁడు, సుప్తంకర్మ = లయించియున్న పూర్వకర్మమును, చేష్టారూపేణ = వ్యాపారశక్తితో, ప్రబోధయన్ = ప్రబోధించినవాఁడై, భిన్నంతంగణం = వేఱువేఱుగా నున్న యా సంఘమును, సంయోజయామాస = ఒకటిగాఁజేసెను.

తాత్పర్యము : క్రియాశక్తితో cగూడ నా యిరువదిమూఁడు తత్త్వములందును నొక్కసారిగానే ప్రవేశించిన భగవంతుఁడు ఆ తత్త్వములం దడఁ గియున్న ప్రాణుల జన్మాంతరకర్మవాసనలను ప్రబోధించినాఁడు. అనఁగా నాయాప్రాణుల కర్మఫలముల నిచ్చుటకుఁ బ్రేరేపించెనని యర్థము. వేఱువేఱుగానున్న యా తత్త్వముల నా భగవంతుఁడొక్కటిగాఁ జేర్చినాఁడు.

4. శ్లో : దైవేన = భగవంతునిచేత, ప్రబుద్ధకర్మా = ప్రబోధింపఁబడిన కర్మతోఁ గూడినదియు, ప్రేరితః = ప్రేరేపింపఁబడినదియు, త్రయోవింశతికః గణః = ఇరువదిమూఁడు తత్త్వముల సమూహము, స్వాభిః మాత్రాభిః = తమ తమ మాత్రలతో, అధిపూరుషం = విరాట్పురుషుని శరీరమును, అజనయత్ = జన్మింపఁ జేసినది.

తాత్పర్యము : ఈశ్వరప్రేరణతో తత్త్వాంతర్గతములైన ప్రాణులయదృష్టము ప్రబోధిత మైనప్పుడు ఆ యిరువది మూఁడు తత్త్వముల సమూహమును లోకాధిష్ఠానమైన విరాట్పురుషుని శరీరమును స్వమాత్రలతో జన్మింప cజేసెను.

5. శ్లో : స్వస్మిన్ = తన యందు (తత్త్వములలో), మాత్రయా = స్వాంశముచేత, విశతా = ప్రవేశించినట్టి, పరేణ = ఈశ్వరునిచేత, విశ్వసృగ్గణః = తత్త్వసమూహము, అన్యోన్యం = పరస్పరము, ఆసాద్య= కలిసికొన్నవై, చుక్షోభ = క్షోభించినవి, యస్మిన్ = దేనియందు, చరాచరాః = చరాచరములైన లోకములు, సంతి.

తాత్పర్యము : తత్త్వగణ మెట్లు విరాట్పురుషుని శరీరమును జన్మింపఁజేసినదో ఆ విషయమును వివరించుచున్నాఁడు. ఈశ్వరుఁడు స్వాంశముతో తత్త్వగణమునందుఁ బ్రవేశించినపుడే యా తత్త్వము లొకదానితో నొకటి చేరెను. అవి స్వాంశముతో విరాట్స్వరూపముగాఁ బరిణమించెను. ఆ స్వరూపమందే చరములు అచరములు నైన లోకము లంతర్భవించియుండెను.

6. శ్లో : అప్సు = జలమందున్న, అండకోశే = బ్రహ్మాండమందు, హిరణ్మయస్సపురుషః = స్వర్ణమయుఁడైన యా పురుషుఁడు, సర్వసత్త్వోపబృంహితః = సర్వప్రాణులతోఁ గూడినవాఁడై, సహస్రపరివత్సరాన్ = వేయేండ్లు, ఉవాస = వసించెను.

తాత్పర్యము : స్వర్ణమయుఁడైన సమష్టిపురుషుఁడు జలములందు లయించియున్న యా బ్రహ్మాండమందు తనయందు లీనమై యున్న సర్వప్రాణిసమూహముతోఁ బాటు సహస్రవర్షము లుండెను.

7. శ్లో : దేవకర్మాత్మశక్తిమాన్ = దేవశక్తి, కర్మశక్తి, ఆత్మశక్తి - వీనితోఁగూడిన, సవై = ఆ, విశ్వసృజాంగర్భః = ప్రసిద్ధుఁడైన విరాట్పురుషుఁడు, ఆత్మనా = తనచేతనే, ఆత్మానం = తన స్వరూపమును, ఏకధా = ఒకటిగను, దశధా = పదిగను, త్రిధా = మూఁడుగను, విబభాజ = విభజించెను.

తాత్పర్యము : సమష్టిపురుషుని యుత్పత్తిని జెప్పిన తర్వాత వాతనినుండి వ్యష్టిశరీరములు ఇంద్రియములు జన్మించెనని చెప్పఁదలఁచిన శుకాచార్యుఁడు సమష్టిపురుష శరీరవిభాగమును వివరించుచున్నాఁడు. ఆ సమష్టి పురుషునందు భగవంతునియంశయైన చిచ్ఛక్తియు, క్రియాశక్తియు, జీవరూపశక్తియు నంతర్భూతములై యున్నవి. ఈ లోకమందుఁ గన్పించు సర్వమును ఆ విరాట్పురుషునిలో లయించియున్నది. చిచ్ఛక్తిని, చైతన్యమును, క్రియాశక్తిని పంచప్రాణములు, వాని వ్యాపారములుగా బదిరీతులుగను, ఆత్మశక్తిని ఆధ్యాత్మిక, అధిదైవిక, అధిభౌతికములను మూఁడురీతుల నాతఁడు ప్రకాశింపఁజేసెను.

8. శ్లో : హి = దేనితో, ఏషః = అతఁడు, అశేషతత్త్వానాం = సకలప్రాణులయొక్క, ఆత్మా = ఆత్మయును, పరమాత్మనః = పరమాత్మయొక్క, అంశః = అంశమునైన, ఆద్యః అవతారః = మొదటి యవతారము, యత్ర = దేనియందు, అసౌ భూతగ్రామః = ఈ భూతసమూహము, విభావ్యతే = కన్పించుచున్నది.

తాత్పర్యము : పైనిఁ జెప్పినట్లుగా నీ మహాపురుషుఁడు ఒకటిగా పదిగా మూఁడుగాఁ బ్రకాశించెడు సామర్థ్యము నెట్లేర్పఱచి కొన్నాఁడు? దానినే వివరించుచున్నాఁడు. ఈ మహాపురుషుఁడే సకల వ్యష్టి జీవుల కాత్మయైనవాఁడు, పరమాత్మయంశమైన వాఁడు, అనగా సాధారణ జీవాత్మవంటివాఁడు గాదు. పరమాత్మ ప్రథమావతారము

స్థావరజంగమాత్మకమైయున్న యీ విశ్వము విరాట్పురుషుఁడనెడు నధిష్ఠానమందే నిలిచియున్నది. అందుచేతనే ముందుఁ జెప్పినట్లుగా ఒకటిగా, పదిగా, మూఁడుగాఁ గన్పడుటకు శక్తిగల దైనది.

9. శ్లో : సాధ్యాత్మః = ఆత్మనాశ్రయించి యున్న యింద్రియములతోఁగూడిన వాఁడును, సాధిభూతః = భూతముల నాశ్రయించియున్న దేహములతోఁ గూడినవాఁడును, సాధిదైవః = దేవతాసమూహముతోఁ గూడిన వాఁడును, దశవిధః = పదివిధములుగా నున్న, విరాట్ ప్రాణః = విరాట్స్వరూపుఁడైన ప్రాణము, హృదయేన = అంతఃకరణముతో, ఏకధా = ఒకవిధముగనే యున్న వాఁడు.

తాత్పర్యము : ఒకటిగా, పదిగా, మూఁడుగా విరాట్పురుషుఁడున్నాఁడు. ఈ విభాగమునే మఱియొక్కరీతిగా జెప్పుచున్నాఁడు. విరాట్పురుషుఁడు ఆత్మనాశ్రయించియున్న యింద్రియములతోను, భూతముల నాశ్రయించియున్న వ్యష్టిశరీరముతోను, దేవతాసమూహముతోను గూడియుండుటచేత సాధ్యాత్ముఁడు, సాధిభూతుఁడు, సాధిదైవమని మూఁడురీతులుగా నయ్యెను. ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము, నాగము, కూర్మము, కృకరము, దేవదత్తము ధనంజయము అని పదినామములు గల వాయ్వంశములతోఁగూడియుండుటచే పదివిధములుగ నయ్యెను. హృదయముచేఁగూడియుండుటచే నొకరీతిగా నైనాఁడు.

10. శ్లో : ఈశః = నియంతయైన, అధోక్షజః = భగవంతుఁడు, విశ్వసృజాం = మహత్తత్త్వాదుల యొక్క, విజ్ఞాపితం = ప్రార్థనము, స్మరన్ = భావించినవాఁడై, స్వేనతేజసా = తన తేజస్సు చేత, ఏషాం = వీని యొక్క, వివృత్తయే = వివిధ వృత్తిలాభము కొఱకై, విరాజం = విరాట్పురుషుని గురించి, అతపత్ = తలఁచెను.

తాత్పర్యము : సమస్త శక్తి స్వరూపుఁడును, సర్వాంతర్యామియునైన భగవంతుఁడు మహత్తత్త్వాదు లొనర్చిన ప్రార్థనను విన్నాఁడు. "మేము నీ పాదములకు బలిని సమర్పించికొను శక్తిగలవార మగుదుముగాక!" - అనుటయే యా ప్రార్థన. వారి విజ్ఞప్తి నాలకించిన పరమాత్ముఁడు ఆ మహత్తత్త్వాదులకు వివిధ వ్యాపారములను నడపించెడి సామర్థ్యమును ప్రదాన మొనర్చుట కొఱకై లోకసృష్టిసాధన భూతములైన మహత్తత్త్వాదులందు విరాట్పురుషుని సాన్నిధ్య ముండుఁగాక యని భావించికొనెను. ఈశ్వరుని యీ సంకల్పమునకే తపస్సని పేరు.

11. శ్లో : అథ = అనంతరము, అభితప్తస్య = ఆలోచించినట్టి, తస్య = ఆ విరాట్పురుషుని శరీరమందు, దేవానాం = దేవతలకు, కతి ఆయతనాని = ఎన్ని స్థానములు, నిరభిద్యంత = ఏర్పడినవో, గదతఃమే = వివరించునానుండి, తాని = వానిని, శృణు = వినుము

**తాత్పర్యము** : ఈశ్వరుని యాలోచనకు విషయముగానైన యా విరాట్పురుషుని శరీరమందు దేవతలు నివసించుటకై యెన్ని స్థానము లేర్పడినవో నేను వివరింతును వినుము.

12. శ్లో : తస్య = అతనికి, ఆస్యం = ముఖము, నిర్భిన్నం = ఏర్పడినది, లోకపాలః అగ్నిః = లోకములను బాలించెడు నగ్నిదేవుఁడు, పదం = ఆ స్థానమును, స్వాంశేన = తనయంశమైన, వాచా = వాక్కుతో, ఆవిశత్ = ప్రవేశించెను, అసౌ = ఈ వ్యష్టిజీవుఁడు, వక్తవ్యం = వచింపఁదగిన దానిని, కయా = దేనిచేత, ప్రతిపద్యతే = పొందుచున్నాఁడో.

**తాత్పర్యము** : ఆ స్థానములను వర్ణించుచు నాధ్యాత్మికాదివిభాగములను వివరించుచుఁ జూపించుచున్నాఁడు. సమష్టియని చెప్పఁబడుచున్నది లోకము. వ్యష్టి యనఁబడునది ప్రత్యేకవ్యక్తుల శరీరము. సమష్టియనులోకమే విరాట్పురుషుని శరీరము, ఈ సంగతిని మొదట నర్థము చేసికొనవలెను. తర్వాత వానియంశవిభాగములు, వాని యం దధివసించుచున్న దేవతలు, ఆ యంశములతో నడుపఁబడెడు కార్యములు స్పష్టముగాఁ దెలిసికొననగును. మొట్టమొదలు విరాట్పురుషునకు ముఖ మేర్పడినది. దానియం దగ్నియనఁబడెడు దేవత తనయంశమైన వాక్కుతోఁ బ్రవేశించినాఁడు. జీవుఁడా వాక్సహాయముతో దాను జెప్పఁదలఁచి కొన్న దానిని జెప్పును. "ఏర్పడినది" అని చెప్పఁబడిన ముఖము అధిభూతము. " దాని యందు వసించెను" - అని చెప్పుటచేత నదియే యధిష్ఠానమని చెప్పవలెను. దాని యందు వసించెను అని దేనిని గూర్చి చెప్పుదురో ఆ యగ్న్యాదులే దేవతలు. అందుచే దాని కధిదైవ మనిపేరు. దేవతాంశమని దేనినిఁ బిలుతుమో, వాగాదులైన యవియే యాధ్యాత్మములు. కనుక ముఖము అధిభూతము. అధిదైవ మగ్ని. అధ్యాత్మము వాక్కు. ఇట్లే పైన ఁగూడ నర్థమొనర్చికొనవలెను.

13. శ్లో : హరేః = విరాట్పురుషునకు, తాలు = తాలు వనెడు స్థానము, నిర్భిన్నం = ఏర్పడినది, లోకపాలః వరుణః = లోకపాలకుఁడైన వరుణుఁడు , అంశేన జిహ్వయా = స్వాంశమైన జిహ్వచేత, అవిశత్ = దానియందుఁ బ్రవేశించెను, యయా = దేని చేత, అసౌ = ఈ జీవుఁడు, రసం = రసమును, ప్రతిపద్యతే = పొందుచున్నాఁడో.

**తాత్పర్యము :** సాక్షాత్ శ్రీహరి స్వరూపుఁడుగా నుపాసింపఁదగిన విరాట్పురుషునకు తాలువను స్థానమేర్పడెను. లోకపాలకుఁడైన వరుణుఁడు తన కధిష్ఠాన యోగ్యమైన జిహ్వతో గూడ నందుఁ బ్రవేశించెను. జీవుఁడు జిహ్వతో మధురాదిరసముల సేవించును. ఇచ్చట నధిభూతము ముఖము. అధిదైవము వరుణుఁడు. అధ్యాత్మము జిహ్వ.

**14. శ్లో :** విష్ణోః = విరాట్పురుషుని యొక్క, నిర్భిన్నే = నిర్భిన్నములైన, నాసే = నాసిక యందు, అశ్వినౌ = అశ్వినీ దేవతలు, అంశేన ఘ్రాణేన = అంశమైన ఘ్రాణముతో, పదం = స్థానమును, ఆవిశతాం = పొందిరి, యతః = దేనినుండి, గంధస్య = గంధము యొక్క, ప్రతిపత్తిః = జ్ఞానము, భవేత్ = ఏర్పడునో.

**తాత్పర్యము :** విరాట్పురుషునకు నాసిక యేర్పడెను. ఆ స్థానమును అశ్వినీదేవతలు తా మధివసించుటకు యోగ్యమైనఘ్రాణముతోఁ బ్రవేశించిరి. ఆ యింద్రియము ద్వారా జీవులు సుగంధ దుర్గంధముల నాఘ్రాణించును.

**15. శ్లో :** విభోః అక్షిణీ = నేత్రములు, నిర్భిన్నే = ఏర్పడినవి, లోకపాలః = లోకపాలుఁడైన, త్వష్టా = సూర్యుఁడు, అంశేన చక్షుషా = అంశభూతమైన చక్షువుతో, ఆ విశత్ = ప్రవేశించెను. యతః = దేనినుండి, రూపాణాం = రూపముల యొక్క, ప్రతిపత్తిః = జ్ఞానము, భవేత్ = ఏర్పడుచున్నదో!

**తాత్పర్యము :** సర్వశక్తుఁడైన విరాట్పురుషునకు నేత్రము లేర్పడినవి. ఆ స్థానములను లోకపాలుఁడైన సూర్యుఁడు తనకు వసింపయోగ్యమైనదియు, దనయంశమునైన చక్షురింద్రియముతోఁ బ్రవేశించెను. ఈ స్థానముల సహాయముతో జీవునకు రూపజ్ఞాన మేర్పడును.

**16. శ్లో :** చర్మాణి = చర్మములు, నిర్భిన్నాని = ఏర్పడినవి, లోకపాలః అనిలః = లోకపాలకుఁడైన వాయువు, అంశేన ప్రాణేన = అంశభూతమైన ప్రాణముతో, అవిశత్ = ప్రవేశించెను, యేన = దేనితో, సంస్పర్శం = సంస్పర్శమును, అసౌ = ఈ జీవుఁడు, ప్రతిపద్యతే = పొందుచున్నాఁడో!

**తాత్పర్యము :** విరాట్పురుషునకు త్వక్కులు ఏర్పడినవి. లోకపాలకుఁడైన వాయువు స్వాంశములైన ప్రాణములతో త్వగింద్రియమును బ్రవేశించెను. అతని సహాయముతో జీవుఁడు మృదుత్వకాఠిన్యాదు లెఱుఁగును.

17. శ్లో : అస్యకరౌ వినిర్భిన్నౌ, ధిష్ణ్యం = వాసస్థానమును, దిశః = దిక్కులు, శబ్దస్య = శబ్దము యొక్క, సిద్ధిం = జ్ఞానమును.

**తాత్పర్యము** : విరాట్పురుషునకు గర్మ లేర్పడును. దిగ్దేవతలు తమయంశమైన శ్రోత్రేంద్రియముతోఁబాటు కర్ణములయందధివసించిరి. ఈ యింద్రియములతో శబ్దజ్ఞాన మేర్పడును.

18. శ్లో : అస్యత్వచం వినిర్భిన్నం, ఓషధీః = ఓషధులు, కండూం = నవను.

**తాత్పర్యము** : విరాట్పురుషునకు త్వగింద్రియ మేర్పడెను. ఓషధీ దేవతలు అంశభూతములైన రోమములతో త్వక్కునఁ బ్రవేశించిరి. ఆ రోమముల ద్వారా జీవుఁడు నవ మొదలైన వానిని భావించును. చర్మము లనియు, త్వక్కనియు వేర్వేరుగాఁ, బిలుచుచున్నాఁడు. ఆ చర్మ మందున్న రోమకూపములను చర్మమును వేర్వేరుగా సంకల్పించుకొని,

19. శ్లో : తస్య మేఢ్రం, వినిర్భిన్నం స్వధిష్ణ్యం కః = బ్రహ్మదేవుఁడు, ఉపావిశత్ = ఆశ్రయించెను. రేతసా = రేతస్సుతోఁగూడి, ఆనందం = ఆనందమును.

**తాత్పర్యము** : విరాట్పురుషునకు మేఢ్రమనెడు లింగస్థాన మేర్పడినది. ప్రజాపతియనెడు దేవత తనయంశమైన రేతస్సు యొక్క యుత్పత్తి స్థానమైన యుపస్థయనెడు నింద్రియమును బ్రవేశించెను. ఆ స్థానముతో జీవుఁడు రతిసుఖము ననుభవించుచున్నాఁడు.

20. శ్లో : పుంసః గుదం వినిర్భిన్నం లోకేశః మిత్రః = మిత్రుఁడనెడు దేవత, అవిశత్ = ప్రవేశించెను. పాయునా = గుదమనెడు నింద్రియముతో, విసర్గం = విసర్జనము.

**తాత్పర్యము** : విరాట్పురుషునకు గుదమనెడు స్థాన మేర్పడెను. లోకేశ్వరుఁడైన మిత్రుఁడనెడు దేవత తనయంశమైన పాయువుతో గుదమును బ్రవేశించెను. దీనితో జీవుఁడు మలవిసర్జన మొనర్చును.

21. శ్లో : అస్యహస్తౌ వినిర్భిన్నౌ , స్వర్పతిః = స్వర్లోకాధిపతియైన, ఇంద్రః = ఇంద్రుఁడు, అవిశత్, వార్తయా = వార్తయనెడు, వృత్తిం = ఉపజీవనమును.

**తాత్పర్యము** : విరాట్పురుషునకు హస్తము లేర్పడినవి. స్వర్లోకాధిపతియైన యింద్రుఁడు స్వాంశమైన వ్యాపారముతో హస్తములందుఁ బ్రవేశించినాఁడు. జీవుఁడీ హస్తముల వ్యాపారశక్తితో నుపజీవనమును సంపాదించికొన్నాఁడు.

**22. శ్లో :** అస్యపాదౌ వినిర్భిన్నౌ లోకేశః విష్ణుః స్వాంశేన గత్యా పురుషః , ప్రాప్యం = ప్రాపింపఁదగిన స్థానమును, ప్రపద్యతే = పొందును.

**తాత్పర్యము :** విరాట్పురుషునకు పాదము లేర్పడినవి. త్రిలోకాధిపతియైన విష్ణువు స్వాంశమైన గతితో నా కాళ్ళలోఁ బ్రవేశించినాఁడు. జీవుఁడీ గమనశక్తితో నా కాళ్ళలోఁ బ్రవేశించినాఁడు. జీవుఁడీ గమనశక్తితో బ్రాప్యమైన స్థానమును పొందును.

**23. శ్లో :** అస్య = దీనియొక్క, వినిర్భిన్నాం = ఏర్పడినదైన, బుద్ధిం = బుద్ధిని, వాగీశః = బ్రహ్మదేవుఁడు, అంశేన = తనయంశమైన, బోధేన = బోధతో, ధిష్ణ్యం = వాసస్థానమునుగా, ఆవిశత్ = ప్రవేశించెను, యతః = దేని నుండి, బోద్ధవ్య ప్రతిపత్తిః = విజ్ఞేయమైనదానిజ్ఞానము, భవేత్ = ఏర్పడును.

**తాత్పర్యము :** విరాట్పురుషుని బుద్ధియనెడు వాసస్థానమును బ్రహ్మదేవుఁడు ప్రాపించెను. అతఁడు స్వాంశమైన నిశ్చయజ్ఞానముతోఁ బ్రవేశించినాఁడు. దీనితో జీవుఁడు జ్ఞాతవ్యములైన విషయముల జ్ఞానమును బొందెను.

**24. శ్లో :** అస్య హృదయం నిర్భిన్నం, చంద్రమాః = చంద్రుఁడు, మనసా అంశేన, ధిష్ణ్యం, ఆవిశత్ యేన, అసౌ, జీవుఁడు, విక్రియాం = వికారమును, సంకల్ప, వికల్పములనెడు చలనమును, ప్రతిపద్యతే = పొందును.

**తాత్పర్యము :** విరాట్పురుషునకు హృదయ మేర్పడినది. ఆ స్థానమును చంద్రుఁడు స్వాంశమైన మనస్సుతోఁ బ్రవేశించినాఁడు. ఆ మనోనిమిత్తముగనే జీవునకు సంకల్పవికల్పాది వికారము లేర్పడుచున్నవి.

**25. శ్లో :** అస్య నిర్భిన్నం ఆత్మానం = వాని నిర్భిన్నమైన యహంకారమును, అభిమానః = అభిమానమైన రుద్రదేవుఁడు, పదం = స్థానముగా, ఆవిశత్ = ప్రవేశించెను, కర్మణా అంశేన = స్వాంశమైన కర్మతో, అసౌ = జీవుఁడు కర్తవ్యం = చేయఁదగినదానిని.

**తాత్పర్యము :** విరాట్పురుషునకు నే ననెడు నహంకార మేర్పడినది. రుద్రదేవుఁడు స్వాంశమైన కర్మ శక్తితోఁబాటు నా యహంకారమును వాసస్థానముగా నంగీకరించినాఁడు దానిచే జీవునకు దేహాద్యవయవము లందు నేను నేనను నభిమాన మేర్పడుచున్నది. ఆ యభిమానముతో నొక్కొక్క ప్రవృత్తి యందును బ్రవృత్తుఁడగును.

26. శ్లో : అస్య సత్త్వంచ వినిర్భిన్నం చిత్తేన అంశేన మహాన్ ధిష్ణ్యం ఆవిశత్ యేన, అసౌ విజ్ఞానం = విశేషజ్ఞానమును

**తాత్పర్యము** : విరాట్పురుషునకుఁ జిత్త మేర్పడెను. స్వాంశమైన చైతన్యముతో బ్రహ్మదేవుఁడు దానిని వాసస్థానముగా నంగీకరించినాఁడు. ఆ చైతన్యముతో జీవునకు విశేషజ్ఞాన మేర్పడును.

27. శ్లో : శీర్ష్ణం = శిరస్సునుండి, ద్యౌః = స్వర్గమును, పద్భ్యాం = పాదములనుండి, ధరా = భూమియు, నాభేః = నాభి నుండి, ఖం = ఆకాశమును, ఉదపద్యత = ఏర్పడినవి, గుణానాం = సత్త్వాదిగుణములయొక్క, వృత్తయః = వృత్తులు గల, సురాదయః = దేవాదులు, ప్రతీయంతే = ఉద్భవింతురు.

**తాత్పర్యము** : వ్యష్టి శరీరుని యింద్రియములు విరాట్పురుషుని యంశములే యని యిదివరకుఁ జెప్పఁబడినది. ఈ శ్లోకము మొదలుకొని దేవాదుల విభాగమును వారికి వసించుట కేర్పడిన స్థలభేదములును విరాట్పురుషుని యవయవవిశేషముల నుండియే యేర్పడినవని చెప్పుచున్నాఁడు.విరాట్పురుషుని శిరస్సునుండి స్వర్గమేర్పడెను. పాదముల నుండి భూలోక ముద్భవించినది. నాభిస్థానమునుండి స్వర్గమునకును భూమికిని మధ్యనున్న అంతరిక్షలోక మేర్పడినది. సత్త్వాదిగుణముల వృత్తులతోఁగూడిన దేవ మనుష్యాది ప్రాణివర్గములు ఈ స్థానమందే యుద్భవించును.

28. శ్లో : ఆత్యంతికేన = గొప్ప దృఢమైనట్టి, సత్త్వేన = సత్త్వగుణస్వభావముతో, దేవాః = దేవతలు, దివం = స్వర్గమును, ప్రపేదిరే = పొందినవారైరి, పణయః = నరులు ప్రవృత్తియందుఁ దాత్పర్యము గలవారు, తాన్ అను = వారి ననుసరించినవారును, రజస్స్వభావేన = రజోగుణస్వభావముచేత, ధరాం = భూమిని, ప్రపేదిరే = పొందిరి.

**తాత్పర్యము** : ఏ లోకము నేయే ప్రాణు లేయే కారణముతోఁబొందిరి అను విషయమును వివరించుచున్నాఁడు. సత్త్వాధిక్యతగల దేవత లాగుణము ననుసరించి సుఖభోగములు సిద్ధించు స్వర్గలోకమున జనించిరి. వేదోక్తములైన యాగాదికర్మలయందుఁ దాత్పర్యము గల రజోగుణప్రధానమైన ప్రవృత్తులు గల మనుష్యులును వారికి సాయ మొనర్చెడు పశ్వాదిప్రాణి వర్గమును వారి వారి కర్మానుసారముగా ఫలము లొసఁగుట కుపకరించెడు భూలోకమందు జన్మించిరి.

**29. శ్లో :** స్వభావము చేత, భగవన్నాభిం = భగవంతుని నాభిదేశమును, ఆశ్రితః = ఆశ్రయించినవారు, ఉభయోః = రెంటి యొక్క, అంతరం = మధ్యమందున్న, వ్యోమ = అంతరిక్షలోకమందలి, యే = ఎవ్వరు, రుద్రపారిషదాం = రుద్రుని పారిషదుల యొక్క, గణాః = గుంపులో,

**తాత్పర్యము :** మూఁడవది యైన తమోగుణాధిక్యముచేఁగూడిన స్వభావముగలవారు, భగవంతుఁడైన విరాట్పురుషుని నాభిస్థానము నాశ్రయించి జనించిరి. వారు స్వర్గ భూలోకముల మధ్యనున్న అంతరిక్షలోకము నాశ్రయించి వసింతురు. ఆ రుద్ర పార్షదులకే భూతప్రేతపిశాచాదులని పేరు.

**30. శ్లో :** కురూద్వహః పురుషస్య = విరాట్పురుషుని, ముఖతః = ముఖము నుండి, బ్రహ్మ = వేదము, అవర్త = ఏర్పడినది, యః బ్రాహ్మణః = ఏ బ్రాహ్మణుఁడు ఉన్ముఖత్వాత్ = ముఖము నుండి జనించుట వలన, వర్ణానాం = ...ములలో, ముఖ్యః = ముఖ్యుఁడు, గురుః = ఆచార్యుఁడుగా, అభూత్.

**తాత్పర్యము :** విరాట్పురుషుని ముఖము నుండి వేదము లేర్పడెను. ఆ వేదము నందు విధించిన పద్ధతిలోఁ గర్మానుష్ఠానము నొనర్చెడు బ్రాహ్మణుఁడును ముఖము నుండియే యుద్భవించెను అందుచేతనే వర్ణములలో నాతఁడు ముఖ్యుఁడు. ఇతర వర్ణముల కుపదేష్టగా నుండఁదగినవాఁడు.

**31. శ్లో :** బాహుభ్యాం = బాహువుల నుండి, క్షత్రం = పాలన వ్రతమును, తదనువ్రతాః = దాని ననుసరించుచున్న, క్షత్రియః = క్షత్రియుఁడును, అవర్తతాం = ఏర్పడిరి, పౌరుషః = పురుషశక్తి స్వరూపుఁడై, జాతః = పుట్టి, యః = ఎవఁడు, కంటకక్షతాన్ = శత్రుభయమునుండి, వర్ణాన్ = వర్ణములను, త్రాయతే = రక్షించునో,

**తాత్పర్యము :** విరాట్పురుషుని హస్తములనుండి పరిపాలించెడి ధర్మమును, ఆ ధర్మము ననుసరించెడి క్షత్రియులు నేర్పడిరి. పురుషశక్తి స్వరూపుఁడై జనించిన యా క్షత్రియుఁడు కంటకసమానులైన చోరాదిదుర్జనులనుండి సకల వర్ణములను సంరక్షించును.

**32. శ్లో :** విభోః అస్య = విభుఁడైన యాతని యొక్క, ఊర్వోః = తొడల నుండి, లోక వృత్తికరీ = లోకముయొక్క, ఉపజీవన హేతువులైన, విశః = వైశ్యుఁడును, అవర్తతాం = ఏర్పడిరి, యః = ఎవఁడు, నృణాం = మనుష్యులకు, వార్తాం = ఉపజీవనమార్గమును, సమవర్తయత్ = సంపాదించిపెట్టెనో

**తాత్పర్యము** : లోకముల ఉపజీవన హేతువులైన కృష్యాదివ్యవసాయములును వానిని నిర్వహించెడి వైశ్యులును, భగవంతుఁడైన విరాట్పురుషుని తొడల నుండి జన్మించిరి. ఆ వైశ్యులు లోకోపజీవన ద్రవ్యమును సమకూర్తురు.

**33. శ్లో** : భగవతః = భగవంతుని, పద్భ్యాం = పాదములనుండి, ధర్మసిద్ధయే = ధర్మసిద్ధికొఱకైన, శుశ్రూషాం = సేవాధర్మమును, తస్యాం = దానియందు ప్రవృత్తి గల, శూద్రః = శూద్రుఁడును, పురా = ముందు, జాతః = ఏర్పడెను, యద్వృత్త్యా = ఎవరివృత్తిచేత, హరిః = భగవంతుఁడు, తుష్యతే = సంతోషించునో!

**తాత్పర్యము** : కర్మసిద్ధి కుపకరించుచున్న సేవాధర్మము, దానియందు తత్పరుఁడై నాల్గవజాతి మొదటనే భగవంతుని పాదపద్మములనుండి జన్మించెను. నాల్గవజాతి చేయుచున్న సేవకు శ్రీహరి సంతోషించును.

**34. శ్లో** : ఏతే వర్ణాః = ఈ వర్ణములు, స్వగురుం హరిం = తమ గురువైన శ్రీహరిని, ఆత్మవిశుద్ధ్యర్థం = అంతఃకరణ పరిశుద్ధి కొఱకై, శ్రద్ధయా = శ్రద్ధతో, స్వధర్మేణ = స్వధర్మముతో, యజంతి = అర్చించుచున్నారు, వృత్తిభిస్సహ = వృత్తులతోఁగూడ, యత్‌జాతః = దేని నుండి యేర్పడెనో,

**తాత్పర్యము** : బ్రాహ్మణాదులను నీ నాల్గువర్ణములును, ఆశ్రమ వృత్తులతోఁబాటు వేనినుండి జన్మించిరో, వారి పాలకుఁడును, జనకుఁడును, హితోపదేష్టయునైన భగవంతుని శ్రద్ధతో వారివారి జన్మసిద్ధములైన కర్మలతోఁబాటు తమ యంతఃకరణ శుద్ధికై యారాధింతురు.

**35. శ్లో** : క్షత్తః = ఓ విదురుఁడా!, దైవకర్మాత్మరూపిణః = దైవమైన కాలము, కర్మయైన యదృష్టము, ఆత్మయైన స్వభావము- వీని స్వరూపభూతుఁడైన, భగవతః = భగవంతుని యొక్క, ఏతత్ యోగమాయాబలోదయం = ఈ యోగ మాయ యొక్క బలోదయమును, ఉపాకర్తుం = పూర్తిగా వర్ణించుటకు, కః = ఎవఁడు, శ్రద్దధ్యాత్ = శ్రద్ధగలవాఁడగును.

**తాత్పర్యము** : ఓ విదురా! కాలకర్మస్వభావ స్వరూపుఁడైన భగవంతుఁడు, యోగమాయ నుండి ఏర్పడిన యీ ప్రభావాతిశయము - వీనిని పూర్తిగా వర్ణించుటకు నెవఁడు శ్రమించును? ఎంత శ్రమించినను దానిని దెలిసికొనుట యసాధ్యము. అందుచేత నేకదేశముగనే చెప్పితిని.

36. శ్లో : అథాపి = ఐనను, అంగ ! = ఓ విదురా!, అన్యాభిధానసతీం = అన్యవిషయవ్యవహారముతో నశుద్ధమైన, స్వాంగిరం = నా వాణిని, సత్కర్తుం = పరిశుద్ధముగా నొనర్చికొనుటకు, హరేః కీర్తిం = భగవత్కీర్తిని, యథాశ్రుతం = నే విన్న పద్ధతి ననుసరించి, యథామతి = నా బుద్ధి శక్తి ననుసరించి, కీర్తయామి = కీర్తింతును.

**తాత్పర్యము** : ఓ విదురుఁడా ! భగవత్కీర్తిని సంపూర్ణముగా వర్ణించుట కెవ్వరికిని సాధ్యము గాదు. నా గురువు నా కెంత చెప్పెనో యా పద్ధతి ననుసరించి నా బుద్ధి శక్త్యనుసారముగఁ గీర్తింతును. కీర్తించుటలోని ముఖ్యోద్దేశము అన్యవిషయముల నభివర్ణించుటచే నపరిశుద్ధమైన నా వాక్కును పరిశుద్ధ మొనర్చికొనుటయే.

37. శ్లో : పుంసాం = పురుషుల యొక్క, వచసః = వాక్కునకు, శ్రుతేః = శ్రుతికిని, ఏకాంతలాభం = ముఖ్యమైన ప్రయోజనము, సుశ్లోకమౌళేః = కీర్తింపఁదగినవారిలో నుత్కృష్టుఁడైన హరియొక్క, గుణవాదం = గుణ కీర్తనమును, విద్వద్భిః = విద్వాంసులచేత, ఉపాకృతాయాం = వర్ణింపఁబడియున్న, కథాసుధాయాం = కథామృతమందు, ఉపసంప్రయోగం = సమర్పణమునని, ఆహుః = పలికిరి.

**తాత్పర్యము** : మనుష్యునకు వచశ్శక్తి సిద్ధించినందుకుఁ బరమ ప్రయోజనము పుణ్యశ్లోకుఁడైన శ్రీహరియొక్క భక్తవాత్సల్యాదిగుణములను గీర్తించుటయే. శ్రోత్రేంద్రియము లభించియున్నందులకు ముఖ్యఫలము విద్వద్వర్ణితమగు శ్రీహరికథామృతమును శ్రద్ధాపూర్వకముగఁబాన మొనర్చుటయే. ఈ రెండు విషయములును మహాపురుషులు బోధించినవే.

38. శ్లో : వత్స! ఆదికవినా = ఆదికవియైన బ్రహ్మచేత, సంవత్సరసహస్రాంతే = సహస్రవర్షములయవసానమందు, యోగవిపక్వయా = తపః పరిశుద్ధమైన, ధియా = బుద్ధిచేత, ఆత్మనః = పరమాత్మయైన హరియొక్క, మహిమా = మాహాత్మ్యము, అవసితః = తెలియఁబడినదా!

**తాత్పర్యము** : ఆదికవియైన బ్రహ్మదేవుఁడు శ్రీహరిమహిమను బూర్తిగా నెఱుఁగఁ దలఁచెను. అతఁడు సృష్టికర్త. సమస్త జ్ఞానమున కధీశ్వరుఁడు. ఆ బ్రహ్మదేవుఁడు వేయిసంత్సరములు యోగమును బట్టెను. ఆ యోగముతో మనస్సెంతయో పక్వమైనది. కాని యతనికిని హరిమహిమ సంపూర్ణముగా నవగతము గా లేదు. మఱి మా వంటి వారి విషయ మేమని చెప్పవలెను.

**39. శ్లో :** అతః = అందుచేత, భగవతః మాయా = భగవంతుఁడైన శ్రీహరి మాయ, మాయినా మపి = మాయాశక్తి గలవారిని గూడ, మోహినీ = మోహింపఁజేయునది, యత్ = ఎందుకనఁగా, ఆత్మాస్స్వయం = పరమాత్ముఁడైన శ్రీహరియు, ఆత్మవర్త్మ = తనమాయా విస్తృతిని, న వేద = తెలియలేఁడు, అపరే = ఇఁకఁదక్కినవారు, కిముత = ఏమి సమర్థులగుదురు?

**తాత్పర్యము :** ఆశ్చర్యకరమైన శక్తిని వహించియున్న బ్రహ్మాదులకును మోహము జనింపఁజేయునది పరమాత్ముఁడైన హరి యోగమాయాశక్తి. అది యపారమైనది. భగవంతుఁడు గూడఁ దనయోగమాయావిలాసము యొక్క యవధి నెఱుఁగలేఁడు. ఇఁకఁ దక్కినవారిమాట యేమి?' భగవంతుఁడే స్వమాయావిలాసము నెఱుఁగలేఁ డన్నపుడు ఆతని సర్వజ్ఞత్వమునకు భంగమేర్పడును గదా! యను శంక గలుగును. దాని కిది సమాధానము. ఒక వస్తువు ఏ విధముగా నుండునో ఆ వస్తువు నట్లే తెలిసికొనుటకే సర్వజ్ఞత యని పేరు. అపరిచ్ఛిన్నుఁడైన భగవంతుని యవధి యింతమాత్రమే యని యితరు లెఱిఁగినచో నాతఁ డపరిచ్ఛిన్నుఁడగుట పొసఁ గదు. అప్పుడు పరిచ్ఛిన్నుఁడే యగును. అపరిచ్ఛిన్నుఁడు పరిచ్ఛిన్నుఁడుగా నెఱుఁ గబడినచో నిఁక సర్వజ్ఞుఁడే యగును. కనుక స్వయముగాఁ బరిచ్ఛిన్నుఁడైన భగవంతునట్లే యెఱిఁగినవా రెవరో వారికే సర్వజ్ఞత్వమున్నదని యర్థము. అందుకే శ్రుతి యట్లన్నది. "యస్యామతం తస్యమతం మతంయస్య న వేద సః అవిజ్ఞాతం విజానతాం విజ్ఞాత మవిజానతాం" భగవంతుఁడిట్టి వాఁడను నభిప్రాయ మెవరికుండునో వారు తత్త్వజ్ఞులుగారు, "తెలిసితి"ననువాఁడును తెలియనివాఁడే. నాకుఁదెలియలే దను వాఁడే తెలిసినవాఁడు, జ్ఞానమునకు విషయముగాని వస్తువును దెలిసితినని చెప్పికొనువాఁడా పరమార్థమైన విషయమును దెలియనివాఁడు. జ్ఞానమే స్వరూపమైయున్న యాత్మతత్త్వము జ్ఞానవిషయము గానేరదని సారము.

**40. శ్లో :** వాచశ్చ = వేదవాక్కులును, అహం చ = నేనును, ఇమే అన్యేదేవాశ్చ = తక్కిన దేవతలును, అప్రాప్య = పొందరాక, మనసా సహ = మనస్సుతోఁ గూడ, యత్ = ఏ వస్తువు నుండి, నివర్తంతే = నివర్తింతురో, తస్మై భగవతే = అట్టి పరమాత్మునకు, నమః = నమస్కారము.

**తాత్పర్యము :** ఈ రీతిగా నెవరిచేతను జ్ఞాతవ్యము గాకపోవుటకుఁ గారణము వాఙ్మనస్సులకు విషయము గాకుండుటే. అందుచేత భక్తి మార్గముతో శరణుఁ జొచ్చుట యొక్కటే పరమాత్మను గొంచెమైనను అర్థముచేసికొనుటకు మార్గము

అనుచున్నాఁడు. వేదములును, మహాశక్తి గలిగిన మహర్షులును ఇంద్రియాధిష్ఠాన దేవతలైన బ్రహ్మాదులును ఎవ్వని స్వరూపము గుణము ఐశ్వర్యము మొదలైనవానినిఁ బరిపూర్ణముగా వర్ణించుటకును దెలియుటకును శక్తులు గారో అట్టి భగవంతునకు నమస్కారము. 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' - అనెడు నుపనిషద్వాక్యమును విశ్వసించి జ్ఞానముతోఁ దెలిసికొందుమను హఠమును వదలి శ్రవణ కీర్తన నమస్కారాదులతోఁగూడిన భక్తిమార్గమునే యనుసరింతుము. ఇదియే సరియైన పద్ధతి.

## శ్రీధరీయము

" షష్ఠేతై రీశ్వరావిష్టై స్సృష్టి మాహ విరాట్తనోః,
అధిదైవాదిభేదం చ తత్రైవ భగవత్కృతమ్."

"షష్ఠాధ్యాయమందు ఈశ్వరావిష్టములైన మహదాదులచేత విరాట్తను వేర్పడినవిధము చెప్పఁబడినది. అధిదైవాదిభేదములుగూడ వక్కాణింపఁబడినవి.

**1. శ్లో :** సః = ఈశ్వరుఁడు, అసమేత్య = ఒకదానిలో నొకటిచేరక, సతీనాం = ఉన్నట్టి, ప్రసుప్తలోకతంత్రాణాం = నష్టమైన విశ్వరచనారూపలోకతంత్రము గల్గినట్టి లేక ప్రసుప్తజీవోపకరణములైనట్టి స్వశక్తీనాం = మహదాదులస్థితిని, ని శామ్య = వీక్షించిన వాఁడై.

**2. శ్లో :** తదా = అప్పుడు, కాలసంజ్ఞాం = కాలముచేత నేర్పడెడు, ఉద్బోధముగలది లేక తన కార్యములను, కలయతి క్షోభయతి = కలిగింపఁజేసెడి, కాలసంజ్ఞగలిగిన ప్రకృతి, దేవీం = ద్యోతనశీలయైన దానిని, బిభ్రత్ = ధరించినవాఁడై, ఉరుక్రమః = పరమాత్మ, ప్రకృతితోఁజేరిన త్రయోవింశతితత్త్వముల గణమును, యుగపదావిశత్ = అంతర్యామి స్వరూపముతో నొకటే సారిగఁ బ్రవేశించినాఁడు.

**3,4. శ్లో :** చేష్టారూపేణ = క్రియాశక్తితోఁబాటు, తంగణం అనుప్రవిష్టః సః భగవాన్ = ఆ తత్త్వములలోఁ బ్రవేశించిన భగవంతుఁడు, సుప్తం = లుప్తమైన కర్మగలిగిన వాని క్రియను అనఁగా జీవుల సృష్టిని, ప్రబోధయన్ = ప్రేరేపించుచున్న వాఁడై, సంయోజయామాస, దేవేన = ఈశ్వరునిచేత. దీని చేతఁ బరమాత్ముఁడు సర్వనియంతయని తెలియుచున్నది. ప్రబుద్ధకర్మా = ప్రేరేపించఁబడిన

క్రియాశక్తిగలిగినట్టి, త్రయోవింశతికాగణః = ఇరువదిమూఁడుతత్త్వముల సంఘము దైవముచేఁబ్రేరేపింపఁబడినదై. మాత్రాభిః = తమ అంశలచేత, అధిపూరుషం = విరాట్స్వరూపుని, అజనయత్ = ఏర్పఱచెను.

5. శ్లో : ఆ జనన ప్రకారమును దెలుపుచున్నాఁడు. స్వస్మిన్నావిశతాపరేణ = = తమయందు దావేశించిన పరాత్పరునిచేత, విశ్వసృడ్గణః = విశ్వమును సృష్టించునట్టి తత్త్వసమూహము, అన్యోన్యం = పరస్పరసంక్రాంతమైన, మాంత్రయా = అంశముచేత, చుక్షోభ = పరిణత మయ్యెను. సర్వాత్మనా చేరుట కాదు అంశతోనే చేరుట. ఏ పరిణామమందు చరాచరము లేర్పడినవో.

6,7. శ్లో : అధిపూరుషుఁడని యెవఁడు చెప్పఁబడెనో, అండకోశే = బ్రహ్మాండ మధ్యమందు, అప్సుఅనుశాయిభిః = నీటియందు తనతోఁ బాటున్నట్టి, సర్వైః జీవైరుపబృంహితః = అనేక జీవులతోఁగూడినవాఁడై, సహస్రపరివత్సరాన్ = అనేకవర్షములు, ఉవాస = వసించెను, సః = దైవశక్తి, కర్మశక్తి, ఆత్మశక్తి యను నీ మూటిచేఁ గూడిన వాఁడును. విశ్వసృజాం = మహదాదుల యొక్క, గర్భః = కార్యరూపుఁడైన, విరాట్పురుషుఁడు, విశ్వభాజా ఆత్మనా = విశ్వాకారమైన ఆత్మచేత, ఆత్మానం = తన్ను, ఏకధా, దశధా, త్రిధాచ = ఒకఁడుగా, పదిగా, మూఁడుగా, విభక్తవాన్ = విభాగించికొనెను, దైవశక్తి అనఁగా జ్ఞానశక్తి. దీనిచే నొకటిగా విభాగించికొనిన నెట్లు? హృదయావచ్ఛిన్నమైన రూపముతో. కర్మశక్తి యనఁగా క్రియాశక్తి, దానిచేత, ప్రాణరూపేణ = ప్రాణస్వరూపముగా. ప్రాణాదులు పంచవాయువులు, నాగః కూర్మశ్చకృకరోదేవదత్తో ధనం జయః". ఇత్యంతర్భూతములు, దైవశక్తులు: ఇవి వృత్తిభేదముతో దశవిధము లగుచున్నవి. ఆత్మశక్తి యనఁగా భోక్తృశక్తి దీనితో అధ్యాత్మాది భేదములతో మూఁడుగా విభాగము.

8,9,10,11. శ్లో : ఈ రీతిగా విభాగ సామర్థ్యముగల యాతని శక్తియొక్క యుత్కర్షతను జెప్పుచున్నాఁడు. ఆదిభూతః = ఆద్యావతారుఁడైన, ఏషః = ఇతఁడు, పరమాత్మనః = భగవంతుని యొక్క, అశేష సత్త్వానాం = వ్యష్టిరూపములైన ప్రాణులకు, ఆత్మా - దానియంశమైన దానివలన, జీవుఁడాత్మయొక్కయవతారమని భావము. యత్రాంశే = ఏ యంశ మందు, భూతగ్రామః = సమస్త భూతసమాజమును, విభావ్యతే = భావింపఁబడుచున్నదో, "సనైవిశ్వసృజాంగర్భః"

- అనెడు పూర్వశ్లోకార్థమును వివరించుచున్నాఁడు. అధ్యాత్మములు ఇంద్రియములు. వానిచేఁగూడినవాఁడు సాధ్యాత్ముఁడు. విరాట్ అను శబ్దము ఈ శ్లోకమందన్ని యెడలను యోజన మొనర్చికొనవలెను, అధ్యాత్మాదిభేదమును విస్తరించుచున్నాఁడు. విశ్వసృజాం = తత్త్వముల యొక్క, విజ్ఞాపితం = ప్రార్థనమును, స్మరన్ = భావించినవాఁడై, వారి ప్రార్థనా విశేషమును "యావద్బలిం తేజ హరామ కాలే" అని పైనఁ జెప్పఁబోవుచున్నాఁడు. ఏషాం = ఈ తత్త్వముల యొక్క వివృత్తమే వివిధ వృత్తిలాభము కొఱకై, స్వేన తేజసా = తన చిచ్ఛక్తి చేత, అపతత్ = ఈ రీతిగాఁజేయఁబోదునని యాలోచించి కొన్నాఁడు. "యస్యజ్ఞానమయం తపః" - అని శ్రుతి, హ = అనునది ప్రసిద్ధిని దెలుపునది, ఆయతనాని = ఆస్యాదులు, దేవానాం = అగ్న్యాదులకు, మే = నా నుండి వినుమని యర్థము.

**12. శ్లో :** ఆయతనములనే వివరించుచున్నాఁడు. తస్య = ఆ విరాట్పురుషునకు మొదట, ఆస్యం నిర్భిన్నం = ముఖ మేర్పడినది, ఆ ముఖమును లోకపాలకుఁడైన యగ్ని, తత్పరం = ఆస్యప్రదేశమును,స్వాంశేన = తన శక్తియైన వాక్కు చేత, ఆవిశత్ = ప్రవేశించెను. అసౌ = జీవుఁడు, యయా = ఏ వాక్కుచేత, వక్తవ్యం ప్రతిపద్యతే = శబ్దమును నుచ్చరించుచున్నాఁడో,తయాసహ అనునది, ప్రతిచోట నన్వయించును. అగ్న్యాది ప్రథమాంతము అధిదైవతము, తృతీయాంతమైన వాగాదీంద్రియ మధ్యాత్మము, ప్రతిపత్తవ్య మధిభూతము. ఇట్లే పైన నూహింపవలెను.

**13. శ్లో :** తాలువు అధిష్ఠానము. జిహ్వా = రసనేంద్రియము

**14. శ్లో :** విరాట్పురుషునకు నాసాపుటము లేర్పడినవి. యతః = దేనిచేత మానవుఁడు గంధము నాఘ్రాణించుచున్నాఁడో.

**15. శ్లో :** త్వష్టా అనఁగా నాదిత్యుఁడు

**16,17. శ్లో :** ప్రాణేన = దేహవ్యాపియైన ప్రాణముచేత, త్వగింద్రియముచేత వని తాత్పర్యము.

**18. శ్లో :** చర్మ = చర్మమును, ఓషధీః = ఓషధులు, త్వగింద్రియమునకే, స్థానభేదముతో విషయద్వయత్వము కల్పితము, కండూః = స్పర్శ, త్వగ్భేదములలో నామభేదము, దేవతా భేదము, రెండవదానికే యున్నందున దానినే వ్యాఖ్యానించుట జరిగినది.

19. శ్లో : కః = ప్రజాపతి

21. శ్లో : స్వఃపతిః = స్వర్లోకాధిపతియైన యింద్రుఁడు, వార్తయా = క్రయవిక్రయాదిశక్తిచేత, వృత్తిం = జీవికను,

22. శ్లో : విక్రియాం = సంకల్పాదిరూపమైన వికారమును, ఆత్మానం = అహంకారమును, అభిమన్యతే అనేనేత్యభిమానః రుద్రుఁడు. అంశేనకర్మణా = అహంప్రకృతికమైన కర్మచేత, కర్తవ్యం ప్రతిపద్యతే.

26. శ్లో : సత్త్వం = బుద్ధి, చిత్తము - ఈ రెండిటికి నభేదముగా వాడఁబడినది. మహాన్ = బ్రహ్మదేవుఁడు, చిత్తేన అంశేన = చేతనచేత,

27. శ్లో : త్రైలోక్యము యొక్కయుత్పత్తిని జెప్పుచున్నాఁడు. యేషు = ద్యోరాదిలోకములందు, వృత్తయః = పరిణామములు, సురాదయః = దేవాదులు.

28. శ్లో : దాని ప్రకారమునే రెండుశ్లోకములతో వివరించుచున్నాఁడు. ఆత్యంతికేన = ఊర్జితమైన, సత్త్వేన = సత్త్వగుణముచేత, పణయః = "పణవ్యవహారే" - అని ధాతువు, మనుష్యులు. వారిని, అను = అనుసరించి యుండునవి గవాదులు. వీ రందరును భూమిపై నుందురని భావము. రుద్రపారిషదాం = రుద్రులకు పారిషదులైన, భూతానాం గణః = భూతముల సమూహము, తార్తీయాకేన = తృతీయమైన తమోగుణ ప్రభావము చేత, భగవన్నాభిరూపమైన, ద్యావాపృథువుల యొక్క, అంతరం = మధ్యమందున్న అంతరిక్షమును, ఆశ్రితాః = ఆశ్రయించిరి. అంతరిక్షమే భగవంతుని నాభియని యర్థము.

30. శ్లో : బ్రహ్మ = వేదము పురుషుని ముఖము నుండి జన్మించినది. భగవన్ముఖోదితమైన వేదము ననుసరించుటచేత బ్రాహ్మణుఁడు వర్ణములలో, ముఖ్యః = ముఖము వలె ప్రథమగణ్యుఁడుగా నయ్యెను. అతఁడే యుపదేష్టయుగా నైనాఁడు. అధ్యాపనాదులతో బ్రాహ్మణునకు వేదమే వృత్తి. ఆ వృత్తితోఁ బాటు విప్రుఁడు పరమేశ్వరుని ముఖము నుండి జన్మించెనని యర్థము. ఇట్లే పైని గూడ నర్థ మొనర్చికొనవలెను.

31. శ్లో : పాలనరూపమైన వృత్తికే క్షత్రమని పేరు. దాని ననుసరించువాఁడు క్షత్రియుఁ డు. అతఁడు బాహువులనుండి జన్మించెను. పౌరుషాన్ = పురుషుఁడైన విష్ణువు యొక్క అంశభూతులైన బ్రాహ్మణాదులను చోరాదుల నుండి రక్షించువాఁడు. కృష్యాది వ్యవసాయములు లోకవృత్తికి హేతువులు. జీవికాహేతువులని యర్థము.

వానికే విశములని పేరు. ఇక్కడ విభక్తి వ్యత్యయము ఛాందసము. వారు పరమాత్ముని యూరువుల నుండి జన్మించిరి. వారు జీవికారూపమైన కృష్యాదులకు ఆధారభూతులు. శుశ్రూష శూద్రులకు ధర్మము, ఆ ధర్మవృద్ధ్యర్థమైన యునికితో నాల్గవజాతి భగవంతునికి సంతోషమును గల్గించుచున్నది.

**34. శ్లో :** ఈ వర్ణములు పై ధర్మములచేత భగవంతు నారాధించుచున్నవి. ఇదియే వారి కుత్కృష్టమైన ధర్మము.

**35. శ్లో :** క్షత్తః = ఓ విదురా! దైవకర్మాత్మరూపిణః = కాలకర్మస్వభావశక్తులు గలిగిన భగవంతుని యోగమాయాబలముచే జన్మించిన యీ విరాడ్రూపము, ఉపాకర్తుం = సాకల్యముగా నిరూపించుటకు, కః శ్రద్ధధ్యాత్ = ఎవఁడిచ్ఛించును? ఇచ్ఛించుటయే దూరమైనప్పుడు నిరూపణ మసాధ్యమని వేఱుగాఁ జెప్పవలెనా? యని భావము.

**36. శ్లో :** ఓ విదురుఁడా! సత్యమిట్లున్నను భగవత్కీర్తిని వర్ణించుచున్నాను. యథాశ్రుతం = గురుముఖమునుండి నేను విన్నంతమాత్రము. దానినిఁ గూడఁ బూర్తిగాఁ జెప్పలేను. యథామతిం = నా బుద్ధి కందినంతవఱకు, యథామతిగాఁ గీర్తించుటలోఁ బ్రయోజనమేమి? దానినే చెప్పుచున్నాఁడు. అన్యాభిధా = శ్రీహరి వ్యతిరిక్తమైన యభిధానము. దానిచేత, అసతీం = మలినమైనట్టిది, స్వాం = స్వకీయమైన వాక్కును, సత్కర్తుం = పవిత్రీకరించుటకు

**37. శ్లో :** పూర్తిగాఁదెలియకున్నను యథామతిగాఁ గీర్తించుటలో వినుటలో గైవల్యప్రాప్తి ముఖ్యలాభ మనుచున్నాఁడు. ఏకాంతలాభం = సునిశ్చితమైన లాభము, శ్రుతేః = శ్రవణమునకు, ఉపాకృతాయాం = నిరూపితముకాఁగా, ఉపసంప్రయోగం = సన్నిధియం దర్పించుట.

**38. శ్లో :** జ్ఞానవాదమందు ఎక్కువ నిర్బంధము పనికిరాదు. కారణమే మనఁగా బ్రహ్మపదార్థము తెలిసికొనుట కగమ్యమైన దనుచున్నాఁడు. యోగవిపక్వమైన బుద్ధితో బ్రహ్మ తీవ్రతప మొనర్చినను నాతనిచేత హరిమహిమ పూర్తిగా నెఱుఁగఁబడినదా అని కాకువు. ఆతని మహిమావధి నెవ్వరు నెఱుగలేరని భావము.

**39. శ్లో :** యత్ = ఏ కారణముచేత, స్వయమపి ఆత్మాహరిః = స్వయముగా భగవంతుఁడే, ఆత్మవర్త్మ = తన మాయాగతిని- ఇంతమాత్రమేయని యెఱుఁగలేఁడు. అది యనంతమని భావము.

**40. శ్లో** : భగవంతుని మహిమఁబూర్తిగా ఁదెలిసికొనుటకు సాధ్యముగాని దగుటచే కేవలము నమస్కరించుచున్నాఁడు. యస్యజ్ఞానాయప్రవృత్తావాచోపి = ఎవని నెఱుఁగుటకుఁ బ్రయత్నించినవాక్కును, మనసా సహ తమప్రాప్యైవ న్యవర్తంత = మనస్సుతో ఁబాటు ఆతని నెఱుఁగలేక మరలెనో అనఁగా మనస్సు, వాక్కు- ఈ రెండును గూడ పరమాత్మ నెఱుఁగుట కశక్తము లైనవని భావము. అహం = అహంకారమున కధిష్ఠానదేవత యైన రుద్రుఁడును, 'చ' కారముతో బుద్ధ్యధిష్ఠాతయైన బ్రహ్మదేవుఁడును, ఇమే = ఇంద్రియాధిష్ఠాతలైన దేవతలును, అన్యే చ = తక్కిన యితరులును ఎవ్వరు నెఱుఁగ లేరని భావము.

## విజయధ్వజాలు

**1,2. శ్లో** : ఈ యధ్యాయమందు "తదన్యత్వం ఆరంభణశబ్దాదిభ్యః" అనెడు బ్రహ్మసూత్రాధికరణార్థమును వివరించుచున్నాఁడు. ఈ యభిప్రాయము తో మొదలు శ్రీహరి తత్త్వములందుఁ బ్రవేశించెననుచున్నాఁడు. ఈశ్వరః = సర్వనియామకుఁడైనట్టియు, ఉరుక్రమః = మహాసమర్థుఁడును, సః = అయిన పరమాత్మ,సమేత్య, అసతీనాం = సంయుక్తములుగా లేనట్టియు, "సతీనామసమేత్య" - అని శ్రీధరులు. ప్రసుప్తలోకతంత్రాణాం = లోకమును సృష్టించుశక్తి వ్యక్తముగా కుండునట్టి, స్వశక్తీనాం = తన యధీనము లగుటతో స్వశక్తు లనిపించికొన్న, తాసాం = ఆ తత్త్వాభిమానుల యొక్క, ఇతి = పైనిఁ జెప్పినట్లు, గిరం = మాటను, నిశమ్య = విని, యదా = ఎప్పుడు, ప్రవేష్టుం ఐచ్ఛత్ = ప్రవేశింపఁగోరెనో, తదా = అప్పుడు, కాలసంజ్ఞాం= కాలమను పేరుగల , శక్తిం = తన యధీనమైన శక్తిగల్గుటతో శక్తియనిపించికొన్న, దేవీం = లక్ష్మీదేవిని, బిభ్రత్ = ధరించినవాఁడై, యుగపత్ = ఒకటేసారి, త్రయోవింశతితత్త్వానాం = ఆకాశాదిపంచభూతములు, శబ్దాది తన్మాత్రలు, శ్రోత్రాదిదశేంద్రియములు, మనస్సు, అహంకారము, మహత్తత్త్వమనెడు నిరువదిమూఁడు తత్త్వముల, గణం, ఆవిశత్. "శబ్దాద్యానభ ఆద్యాశ్చమనో యుక్తేంద్రియాణిచ, అహంకారో మహాంశ్చైవ త్రయోవింశతి కో గణః" - అని ప్రమాణము. దేవతలు ఇంద్రియములు వీని కభేదదృష్టితో దేవతలను వేఱుగాఁ జెప్పలేదు. ఇరువది నాల్గవతత్త్వమే ప్రకృతి. దాని యందుఁ బ్రవేశించును. ఇంతకుముందే చెప్పితిని. ఈ ప్రకృతి యందును జడాంశమునే గ్రహించినచో నిరువది యైదవ తత్త్వము జీవుఁడు. ఇరువది యాఱవతత్త్వము లక్ష్మితో ఁగూడిన శ్రీ హరి యగును. లక్ష్మిని వేఱుగా ఁ బరిగణించినచో నిఱువది యేడవతత్త్వము

శ్రీ హరి యగును. ఈ యర్థమంతయును "ఉరుక్రమః" -అను శబ్దముచే సూచింపఁబడినది. తంత్ర మనఁగా సాధన, "తనుతే యేన కార్యం యత్తంత్రం సాధనముచ్యతే" - అని ప్రమాణము. శ్రీ హరి లక్ష్మిదేవితోఁగూడ తత్త్వములలోఁ బ్రవేశించెననుటకు "త్రయోవింశతి తత్త్వాని ప్రావిశద్రమయా సహ కాలాఖ్యయా స్వయం విష్ణుః శక్త్యాచ్ఛక్తిరూపయా" అని ప్రమాణము. ప్రవేశించెననుటతో నస్వతంత్రుఁడై యుండెనని యర్థముగాదు. ప్రవేశించుటయు స్వాతంత్ర్యముతోఁ గూడికొని యే యను నర్థము ఈశ్వరశబ్దము చేత సూచింపఁబడినది. శ్రీహరి కంటె భిన్నమైన స్వతంత్రసాధన యేదియును లేదనుటయే పైని జెప్పిన బ్రహ్మసూత్రాధి కరణములయొక్క అర్థము. "నిశామ్యగతిమీశ్వరః" అని శ్రీధరుల పాఠము. "నిశమ్య గతి మీశ్వరః " - అని విజయధ్వజులు.

**తాత్పర్యము** : విదురుఁడా ! శ్రీ హరి సర్వనియామకుఁడు. సర్వశక్తుఁడు. అతని యధీనమైన శక్తిగలవారు తత్త్వాభిమాని దేవతలు, వా రసంయుక్తులై, లోకసృష్టి కార్యమం దశక్తులై శ్రీహరిని స్తుతించిరి. వారిప్రార్థన నంగీకరించి యాతఁడు ఆ తత్త్వములందుఁ దాను బ్రవేశింపఁదలఁచెను. కాలనామ కురాలై తన విభిన్నశక్తియనిపించి కొన్న లక్ష్మీదేవితో పాటు మహత్తత్త్వాదులందు శ్రీహరి ప్రవేశించినాఁడు. ఆ తత్త్వముల శక్తులను వ్యక్త మొనర్చుటయే వాని ప్రవేశమునకుఁ బ్రయోజనము.

**3. శ్లో** : తత్త్వములందుఁ బ్రవేశించిన పరమాత్మయొనర్చిన దేదియో చెప్పుచున్నాఁడు. చేష్టారూపేణ = సర్వపదార్థముల శక్తిని వ్యక్త మొనర్చెడు చేష్టారూపముతో, అనుప్రవిష్టః = సత్త్వములను బ్రవేశించిన, సః భగవాన్ = స్వతంత్రుడైన శ్రీహరి, సుప్తం కర్మ = ప్రళయకాలమందు దీనిశక్తియు వ్యక్తముగాని, సృష్టికారణమైన యదృష్టమును, ప్రబోధయన్ = కార్యకారియగు నట్లుగాఁజేయువాఁడై, భిన్నం = విశ్లిష్టముగ నున్న, తం గణం = ఆ తత్త్వ సమూహమును, సంయోజయామాస = అంశములతో నొకటిగాఁ జేర్చెను.

"సర్వచేష్టక రూపేణ, స్వసామర్థ్యేన కేశవః,

తాని భిన్నాని తత్త్వాని యోజయామాస చాంశతః".

- అని ప్రమాణము. భగవంతుఁడు తనమనస్సు చేతనే, సమస్త బ్రహ్మాండమును సృష్టించుటకు శక్తుఁడు. ఐనను కార్యమొనర్చు మనుష్యుఁడు సామగ్రులనుంచికొని యుండవలె ననుట జ్ఞాపక మొనర్చుటకై యీ గణముల నొకటిగాఁ జేసెనని తాత్పర్యము.

4. శ్లో : ఏమి యొనర్చెనని చెప్పుచున్నాఁడు. - ప్రబుద్ధకర్మా = ఉన్ముఖమైన యదృష్టమున్న, దైవేన = పరమాత్మచేత, ప్రవిశ్య = ప్రవేశింపఁబడి, ప్రేరితః = కార్యమందుఁ బ్రేరేచఁబడిన, త్రయోవింశతికోగణః, స్వాభిః = తమ యొక్క, మాత్రాభిః = అంశలతో, వూరుషం అపి = పురుషనామకుఁడైన, బ్రహ్మ శరీరమగుటచేత పురుషశబ్దముచేతఁ బిలువఁబడెడి, బ్రహ్మాండమును, అజనయత్ = సృష్టించెను, "ఈశ్వరోదైవముద్దిష్టం సర్వస్యాపి ప్రభుత్వతః" - అనెడు ప్రమాణముతో దైవశబ్దము చేత శ్రీహరినే గ్రహింపవలెను. "మాత్రాభిరపిపూరుషం" అని విజయధ్వజుల పాఠము . "మాత్రాభిరధిపూరుషం" - అని శ్రీధరులు. ఆ పాఠమందు పురుషసూక్త వాచ్యమైన వస్తువు గల అని యర్థ మొనర్పవలెను.

5. శ్లో : దానినే స్పష్ట మొనర్చుచున్నాఁడు. - విశ్వసృగ్గణః = జగత్తును సృష్టించెడు నా తత్త్వసమూహము, స్వస్మిన్ = తన యందు, విశతా= ప్రవేశించిన, పరేణ = సర్వోత్తముఁడైన శ్రీహరిచేత, ప్రేరితః = ప్రేరేపింపఁబడినదై ,మాత్రయా = అంశలచేత, అన్యోన్యం ఆసాద్య = పరస్పరముపొంది, చుక్షోభ = బ్రహ్మాండాకారముగా వికారము నందెను, యస్మిన్ = ఏ బ్రహ్మాండమందు, చరాచరః , లోకః (ఉత్పన్నః)

6. శ్లో : మొదలు శరీరమందు శ్రీహరియే ప్రవేశించినాఁడు. ఆ తరువాత నా శరీరమందు భోగము ననుభవించెడు చేతనునిలోఁ బ్రవేశించెను. ఈ విషయమును దోపింపఁజేయుటకై వైకుంఠుని బ్రహ్మాండమును జెప్పుచున్నాఁడు. సః = ఎవని ప్రేరణచే, తత్త్వసమూహము బ్రహ్మాండమును సృష్టించినదో, అట్టి, హిరణ్మయః = జ్ఞానానందస్వరూపమైన, కరచరణా ద్యవయవములు గల, పురుషః = పురుషనామకుఁడైన శ్రీహరి, సర్వసత్త్వోపబృంహితః = ఎల్లజీవులతోఁ గూడినవాఁడై, సహస్ర పరివత్సరాన్ = దేవమానమైన సహస్రవర్షములు, అండకోశే = బ్రహ్మాండములోనున్న, అప్సు = నీటియందు అనఁగా శేషశయనమందు, ఉవాస = వసించెను, సర్వసత్త్వోపబృంహితః = అనుచోట ప్రళయమందు సమస్తచేతనులును సర్వోత్తమచేతనుఁడైన శ్రీహరిలో నైక్యమైనదను నాశంకను బరిహరించినాఁడు, ఇఁకను దేహములేని చేతనులు ప్రళయమం దెట్లుండిరి? అను నాక్షేపమునకుఁ గూడ నుత్తర మిచ్చినాఁడు. శ్రీహరి యుదరమందుండిరని తెలియవలెను.

7. శ్లో : సృష్టింప నిచ్ఛించిన భగవంతుఁడు బ్రహ్మాండములోపలనున్న నీటిలో బహుదీర్ఘకాలము వసించెనని చెప్పుటచేత సృష్టికథయే నిలిచి పోయినది గదా! యనెడు పరీక్షిత్తు మనస్సులోని సందేహమును బోఁగొట్టువాఁడై బ్రహ్మాండాంతర్గతుఁ

డైన శ్రీహరి పరాక్రమ విశేషమును జెప్పుచున్నాఁడు. దైవకర్మాత్మశక్తిమాన్ = బ్రహ్మాదిదేవతలకన్న నధికుఁడైనట్టియు జీవరాసుల సుఖదుఃఖాదిభోగములకు సాధనమైన యదృష్టము ఆత్మశక్తి యనిపించికొనెడి ప్రకృతి- వీనిచేత సర్వదా యుక్తుఁడైన, విశ్వసృజాం = జగత్తును సృష్టించుతత్త్వముల యొక్క, గర్భః = అంతర్యామియైన, సః = శేషపర్యంకశాయియైన వైకుంఠుఁడు, ఆత్మనా = ఇతరుల ప్రేరణలేని తన యిచ్ఛచేతనే, ఆత్మానం = బ్రహ్మదేవుని, విరాట్టనిపించికొనెడు శరీరమును సృష్టించి దాని యందుఁ బ్రవేశించి ఆ దేహము యొక్క హృదయాది భాగములకు నియామకుఁడైన తన్ను ఏకధా, త్రిధా, దశధా విబభాజవై. ఇది శాస్త్రప్రసిద్ధము. ఇట్లు చెప్పుటచేత బ్రహ్మాండము దన్ను విభాగించికొన్నది యని వ్యాఖ్యానించుట దోషదుష్టమని తెలిపినట్టైనది. అచేతనమైన బ్రహ్మాండమునకుఁ గ్రియాశాలిత్వము సాధ్యముగాదు.

8. శ్లో : విశ్వసృజాంగర్భః = అను మాట చేత బ్రహ్మాండమునే చెప్పవచ్చును. అదియే "సమస్తప్రాణులకు నాధారమైనది" అను మాట కనుగుణముగా నుండును. దానిని సృష్టించుట కొఱకే అభిమాని దేవతలయొక్కయు, తత్త్వముల యొక్కయు, సృష్టి చెప్పఁబడినది. అందుచేత పై శ్లోకమందుఁ జెప్పిన "అంతర్యామి" అనునర్థము సమంజసము గాదు-అను దానికి సమాధానము. ఏషః హి= ఎవఁడు, మహత్తత్త్వాదులను సృష్టించి అండసృష్టియందు వాని యస్వాతంత్ర్యమును బ్రకాశపఱచి వానిచేఁ బ్రస్తుతుఁడై వాని ననుగ్రహించుటకు చేష్టకరూపముతో లక్ష్మీసహితుఁడై వానియందుఁ బ్రవేశించి తదంశములను జోడించి బ్రహ్మాండరూపముగాఁ బరిణమించున ట్లొనర్చి దానియందుఁ బ్రవేశించి తదంతర్గతజలమందు సహస్రవర్షములు శేషశాయియై యుండి బ్రహ్మదేవుని యొక్క 'విరాట్' అని పిలిపించికొనెడు శరీరమును సృష్టించి తదింద్రియముల నియామకుఁడై వ్యక్తుఁడయ్యెనో అట్టి శ్రీహరి, అశేషతత్త్వానాం = సమస్త ప్రాణుల యొక్క, ఆత్మా = నియామకుఁడు, పరమాత్మనః = భగవంతునియొక్క, ఆత్మాంశః = స్వరూపాంశమే, ఆద్యః = మొదటిదైన, అవతారః = అవతారము. ఇట్టి మహిమగలవాఁడని చేర్చికొనవలెను, పైఁజెప్పిన విషయమందు నెక్కువ శ్రద్ధను గల్గించుటకై చెప్పుచున్నాఁడు. యత్ర = ఏ మొదటి పురుషావతారమందు, భూతగ్రామః = సమస్తప్రాణి సమూహము, విభావ్యతే = స్థితిని బొంది ప్రకాశించునో, హి = ఈ యర్థము ప్రసిద్ధమైనది. "ఆద్యోఽవతారో విష్ణోస్తు పురుషోనామకీర్తితః" ఇత్యాదులలో

నీ యర్థము ప్రసిద్ధమైయున్నది. అందుచేత నిక్కడ అండకోశమునకు సంబంధించిన యర్థము చెప్పరాదు. ఆత్మాంశః అనుట చేత "పురుషేణాత్మభూతేన" - అను చోటఁ జెప్పినట్లు పురుషుఁడనిపించికొన్న శ్రీహరినే గ్రహింపవలెను. " ఆద్యోఽవతారః అని చెప్పినది గూడ నీ విషయమునే సమర్థించుచున్నది. బ్రహ్మాండము శ్రీహరియవతార మనుట శాస్త్రసిద్ధముగాదు.

**9. శ్లో** : ఇంతకు ముందు ఏకధా దశధా త్రిధా అని పరమాత్ముఁడు దన్ను విభాగించికొన్న పద్ధతిని జెప్పినాఁడు. దానినే యిప్పుడు వివరించుచున్నాఁడు. ప్రాధాన్యమును జూపించుటకై ముందుఁ జెప్పినక్రమమును మార్చుచున్నాఁడు. విరాట్ = విశేషముగాఁ బ్రకాశించుటచేత విరాట్టనిపించికొన్న, ప్రాణః = ముఖ్యచేష్టకుఁ డగుటచేత ప్రాణమనిపించికొన్న బ్రహ్మదేవుని యొక్క యంతర్యామి యైన శ్రీహరి, సాధ్యాత్మం = అధ్యాత్మరూపముచేఁ గూడిన వాఁడని, సాధిదైవం = అధిదైవరూపముచేతఁ, గూడినవాఁడని, సాధిభూతం = అధిభూతముతోఁ గూడినవాఁడని, త్రిధా = మూఁడు విధములైనవాఁడు, దశవిధః = పదియింద్రియములతో పదిరూపములైనవాఁడు, హృదయేన చ = హృదయమందుండి ఒక రూపమైనవాఁడు, అధ్యాత్మాదిరూపముల విభాగము నిత్యమైనది. ఇంద్రియములు పండ్రెండని శ్రుతులయందుఁ జెప్పుటచేత పదియనుట ప్రాయికమని తెలియవలెను. జ్ఞానదృష్టితో హృదయ మొక్కటే అంతఃకరణదృష్టితో నాల్గురీతులు. "చ" అనుట చేత నీ విధమైన సంఖ్యావ్యత్యాసము. తత్ సృష్ట్వా తదేవానుప్రావిశత్ - అనెడు శ్రుతివలె యుక్తమని తెలియవలెను, ఇచ్చట ప్రాసంగికముగా "ప్రాణాదిపంచకంచైవ, తథానాగాది పంచకమ్, ఏవం తు దశధా ప్రాణాః అధ్యాత్మాదిత్రిధాభిదాః" అనెడు ప్రమాణముచేత ప్రాణాదులైన పదివాయువులును ప్రతి యొక్కటియు నధ్యాత్మరీతులతో ముప్విధములని తెలియవలెను. అధిభూతము రెండురీతులు, ప్రధాన వాయువు త్వగాత్మ అని. వీనికిఁ బ్రమాణము, "ప్రాణః ప్రథమజోయస్తు ప్రధానో వాయు రీరితః, త్వగాత్మాద్యాస్తు తత్పుత్రాః ద్విధా భూత ముదాహృతమ్".

**తాత్పర్యము** : ప్రళయకాల మందు సుప్తమైయున్న సృష్టికారణమైన యదృష్టమును కార్యోన్ముఖ మగునట్లు భగవంతుఁడొనర్చెను. విశ్లిష్టముగానున్న యీ తత్త్వ సమూహమును అంశములతో నొక్కటిగాఁ జేర్చినాఁడు. ఇట్లు శ్రీహరి ప్రవేశించి ప్రేరేపించుటతో నీ తత్త్వసమూహము కార్యోన్ముఖమైనది. తమ అంశములతో నవి

శరీర మగుటచేఁ బురుషుఁడని పిల్వఁబడెడు బ్రహ్మాండమును సృష్టించెను. ఇట్లు తత్త్వములు వికారము నంది బ్రహ్మాండమైన తర్వాత వానియందు చరాచరజగత్తు ఉద్భవించినది. జ్ఞానానందరూపియైన శ్రీహరి సమస్తజీవులతోఁ గూడినవాఁడై యా బ్రహ్మాండమునఁ బ్రవేశించినాఁడు. అతనికే పురుషుఁడని పేరు. బ్రహ్మాండాంతర్గతములైన జలములలో నాతఁడు దేవమానముతో నొక వేయి వర్షములు శేషశాయియై యుండెను. ఇతఁడు బ్రహ్మాదులకంటెను నత్యధికమైన శక్తిగలవాఁడు, జీవరాసుల భోగసాధనమైన యదృష్టమాతని నెల్లప్పు డనుసరించి యుండును. ప్రకృతియు నీతని శక్తి. ఇతఁడే తత్త్వములయంతర్యామి. శేషశాయియైన యితఁడు తన యిచ్ఛతో బ్రహ్మాదేహమును సృష్టించి దానిలోఁ బ్రవేశించినాఁడు. ప్రవేశించి దానియవయవములకు నియామకుఁడై ఒకటి, మూఁడు, పదిరీతులుగాఁ దన్ను విభాగించి కొనెను. ఈ శ్రీహరియే సమస్త ప్రాణులకును నియామకుఁడు. ఈ పురుషరూపము అతని స్వరూపాంశము. ఇదియే భగవంతుని మొదటియవతారము. ఇతని నాశ్రయించియే సమస్త ప్రాణులును దమ యునికిని బొంది ప్రకాశించిరి. విశేషప్రకాశము గల యితనినే "విరాట్టని" పిలుతురు. ముఖ్యచేష్టకుఁడైన యితనికి ప్రాణ మనియును పేరు. బ్రహ్మాండాంతర్యామియైన శ్రీహరి అధ్యాత్మాది రూపములతో మూఁడురీతు లైనవాఁడు. ఇంద్రియదృష్టితోఁ బదిరూపములు, బ్రహ్మహృదయమందుండి యేకరూపి యనిపించికొన్నవాఁడు.

**10. శ్లో :** "స్వామీ! బ్రహ్మాండమును సృష్టించు సామర్థ్యము నిమ్ము" అని తత్త్వాభిమాని దేవతలు వేడుకొన్న పద్ధతిని, ఒనర్చిన ప్రకారమును దెలుపుచున్నాఁడు. అధోక్షజః = ఇంద్రియాగోచరుఁడును, ఈశః = నియామకుఁడైన శ్రీహరి, విశ్వసృజాం = తత్త్వాభిమానులయొక్క, విజ్ఞాపితం = విన్నపమును, స్మరన్, ఏషాం = ఈ అగ్న్యాదుల యొక్క, వివృద్ధయే = ఆశ్రయస్థానముగా నగునట్లు విరాజం = బ్రహ్మదేవుని విరాడ్దేహమును బ్రవేశించి, దానిని, స్వేనతేజసా = తనసామర్థ్యముతో, అతపత్ = అవకాశము గల దానినిగా నొనర్చెను.

**తాత్పర్యము :** శ్రీహరి యింద్రియ గోచరుఁడుగాఁడు, తత్త్వాభిమానుల విన్నపము ననుసరించి వారియభివృద్ధికై వారి వారి యాశ్రయస్థాన మగునట్లుగా బ్రహ్మదేవుని శరీరమందు అవకాశమును గల్పించుకొనుచు వచ్చెను.

**11. శ్లో :** అవకాశకార్యమును జెప్పుచున్నాఁడు. అథ = ఇంతకుముందు, దేవానాం = (యాని) కతిచ = కొన్ని, ఆయతనాని, అభితప్తస్య = అవకాశమును బొందిన, తస్య = (సకాశాత్) ఆ బ్రహ్మదేహము నుండి నిరభిద్యంత = బయటికి వచ్చెనో,

తాని = వానిని, గదతః = చెప్పుచున్న, మే = నా నుండి, శృణు = వినుము "సోఽ ద్భ్య ఏవ పురుషం సముద్ధృత్యా మూర్ఛయత్తమభ్య తపత్తస్యాభితప్తస్య - ముఖంనిరభిద్యత".

**12. శ్లో :** శరీరావయవములలో ముఖమునకు ప్రాధాన్యమును దెలుపుటకై దాని యుత్పత్తిని తదభిమాన దేవత యొక్క అభిమానోత్పత్తిని దెలుపుచున్నాఁడు. - తస్య = మాటాడఁగోరిన యా బ్రహ్మాండాంతర్యామియైన శ్రీహరియొక్క ఆస్యం = ముఖమనెడు వాసస్థానమును (యత్) నిర్భిన్నం తత్ పదం = ఆ స్థానమును, లోకపాలః అగ్నిః వాచా స్వాంశేన ఆవిశత్. యయా = ఆ వాగింద్రియము చేత, అసౌ = బ్రహ్మశరీరమందున్న శ్రీహరి, వక్తవ్యం = వాగింద్రియవిషయమనెడు వ్యవహారమును, ప్రతి పద్యతే = తెలిసి వ్యవహరించును. "అగ్నిర్వాగ్భూత్వా ముఖంప్రావిశత్" అనెడు శ్రుతి ప్రమాణము.

**13. శ్లో :** హరేః తాలునిర్భిన్నం లోకపాలః వరుణః జిహ్వయా అంశేన ఆవిశత్ అసౌ = యయా రసాన్ ప్రతిపద్యతే.

**14. శ్లో :** శ్రీహరినాసాద్వారములు వివృతము లైనవి. వానియం దశ్వినీ దేవతలు ఘ్రాణేంద్రియముతోఁబ్రవేశించిరి. వీనితో శ్రీహరి గంధమును దెలియును.

**15. శ్లో :** అతని కన్నులు వివృతములైనవి లోకపాలకుఁడైన త్వష్ట దానిని చక్షురింద్రియముతోఁ బ్రవేశించెను. ఇది రూపములను జూచుట కుపయోగించును.

**16. శ్లో :** త్వగింద్రియస్థానములను వాయవ్యకోణాధిపతియైన వాయువు స్పర్శేంద్రియముతోఁ బ్రవేశించెను. దీనితో శ్రీహరి స్పర్శను దెలియును.

**17. శ్లో :** చెవులను దమ శ్రోత్రేంద్రియాంశముతో దిగ్దేవతలు ప్రవేశించిరి. వీనితో శ్రీహరి శబ్దము నెఱుఁగును.

**18. శ్లో :** చర్మము నోషధులు ప్రవేశించెను. వానియంశములు రోమములు. దీని నుండి శ్రీహరి కండువు నెఱుఁగును.

**19. శ్లో :** ఈ దేహము నుండి వ్యక్తమైన, స్వధిష్ణ్యం = తన యాశ్రయస్థానమైన, మేఢ్రం = గుహ్యేంద్రియమును, కః = దక్షప్రజేశ్వరుఁడు, రేతసా = గుహ్యేంద్రియము యొక్క అంశముతోఁ బ్రవేశించినాఁడు. దీనితో శ్రీహరి యానందమును బొందెను.

**20. శ్లో :** వ్యక్తమైన గుదము మిత్రుఁడు పాయ్వంశముతోఁ బొందెను. ఇది విసర్గ స్థానము.

21. శ్లో : వ్యక్తములైన కరములను, స్వర్గాధిపతియైన యింద్రుఁడు హస్తేంద్రియాంశముతోఁబొందినాఁడు. దీనితో నియామకుఁడైన శ్రీహరి "తీసికొనుట" మొదలైన వ్యాపారమును బొందెను.

22. శ్లో : వ్యక్తములైన పాదములను లోకపాలకుఁడైన విష్ణువు(జయంతుఁడు) దనయంశమై గమనసాధనమైన పాదేంద్రియముతోఁ బ్రవేశించినాఁడు. దీనితోఁ బురుషనామకుఁడైన శ్రీహరి పొందఁదగిన పదార్థమును బొందెను.

23. శ్లో : వ్యక్తమైన హృదయమును చంద్రుఁడు తనయంశమైన మనస్సుతోఁ బ్రవేశించినాఁడు. ఇది సంకల్ప వికల్పరూపహేతువు.

24. శ్లో : ఈ దేహమందు వ్యక్తమైన, ఆత్మానం = ఆత్మ (మనస్సు) వాహకనాడీ విశేషమును బృహస్పతి దనయంశయైన బుద్ధితోఁ బ్రవేశించినాఁడు. ఆ బుద్ధితో శ్రీహరి అనఁగా నతనిచే నియమితుఁడైన బ్రహ్మదేవుఁడు నిశ్చయజ్ఞానము నందినాఁడు. "ఆత్మనాడ్యాం తథాబుద్ధిః, తత్రస్థస్స బృహస్పతిః" - అను ప్రమాణముతో నిక్కడియాత్మశబ్దమునకు నాడియనియే యర్థము చెప్పవలెను.

25. శ్లో : ఈ దేహము నుండి వ్యక్తమైన యహంకారమను నాడీవిశేషమును, పదం = తనస్థానమును అభిమానః = అహంకారమనిపించికొన్న రుద్రుఁడు. తనయంశమైన "నేను కర్తను" - అను నభిమానముతోఁ బ్రవేశించినాఁడు. ఈ యభిమానముతో నా దేహనియామకుడైన శ్రీహరి (ఇంకను నతనిచే వియమితుఁడైన బ్రహ్మదేవుడు) కర్తవ్యమును బొందిరి.

26. శ్లో : ఈ దేహము నుండి వ్యక్తమైన తన వాసస్థానమైన సత్త్వమనెడువాడిని. మహాన్ = బ్రహ్మదేవుఁడు, చిత్తమను నంశముతోఁ బ్రవేశించెను. దీని నుండి యా దేహాంతర్యామియైన శ్రీహరి దేహాభిమానియైన బ్రహ్మము విజ్ఞానమును బొందిరి. హృదయమునకు సంబంధించిన నాడులు నూఱు మఱి యా నూటిలో వీనిని మాత్రమే చెప్పుటెందులకు? ఇది బ్రహ్మనాడి యొక్క యవాంతరములను దెలుపుటకే. వీనికి బ్రహ్మదేవుఁడు ముఖ్యాభిమాని. "అహంసత్త్వమితిద్వేధా బ్రహ్మనాడ్యాఅవాంతరమ్ కు కర్మనామా త్వహంకార స్త్వహం నాడ్యాం వ్యవస్థితః " " సత్త్వనాడ్యాం తథాచిత్తం అభిమానో హర స్తథా, అహం నాడ్యాం సత్త్వనాడ్యాం బ్రహ్మైవ వ్యవస్థితః".

**27. శ్లో :** అస్య శీర్ష్ణః ద్యౌః పద్భ్యాం ధరా, నాభేః,ఖం ఉదపద్యత, ఏషు = ఏ లోకములందు వసించు ప్రాణులలో, గుణానాం = సత్త్వాదిగుణముల యొక్క, వృత్తయః = వ్యాపారములైన, సుఖకర్మాదిప్రమాదములు, ప్రతీయంతే, తేషు = ఆ లోకములలో, సురాదయః = దేవతలు, అసురులు, మనుష్యులు, రుద్రపార్షదులు మొదలైనవారు, వసంతి.

**28. శ్లో :** దీనినే వివరించుచున్నాఁడు. ఔత్పత్తికేన సహజమైన (స్వభావసిద్ధమైన) సత్త్వేన = సత్త్వగుణముతో, దేవాః, దివంప్రపేదిరే, రజస్స్వభావేన పణయః. త్యాజ్యము, ఉపాదేయము ననెడు వ్యవహారము నొనర్చునట్టి మనుష్యులును, తాన్ అను = అనుసరించెడునవియును, ధరాం ప్రపేదిరే.

**29. శ్లో :** తార్తీయేన స్వభావేన, భగవన్నాభిం ఆశ్రితాః యే రుద్రపార్షదాః గణాః, ఉభయోః, ద్యులోక భూలోకముల యొక్క, అంతరం = మధ్యమందున్న, వ్యోమ = అంతరిక్షమును, ఆశ్రితాః = ఆశ్రయించిరి.

**30. శ్లో :** ఇప్పుడు బ్రాహ్మణాది వర్ణముల యుత్పత్తిని తదభిమానుల పుట్టుకను జెప్పుచున్నాఁడు. కురూద్వహః, పురుషస్య = బ్రహ్మయొక్క, అంతర్యామియైన వైకుంఠుని యొక్క, ముఖతః = ముఖము నుండి, బ్రహ్మ = బ్రాహ్మణజాతి, దాని కభిమానులైన బ్రాహ్మణులును, అవర్తత = జనించిరి, యత్ర = ఏ శ్రీహరి యందు, ఉన్ముఖత్వాత్ = ఆసక్తుఁడగుటచేత, బ్రాహ్మణః = బ్రహ్మజ్ఞాని, వర్ణానాం = తక్కిన మూఁడు జాతులకును, ముఖ్యః = శ్రేష్ఠుఁడైన, శ్రీహరితత్త్వము నుపదేశించువాఁడును, దాని నుండి యజ్ఞానమును బోఁగొట్టువాఁడును అగుచున్నాఁడు. ఇచ్చట "బ్రహ్మ" అనుటతో "బ్రహ్మభిమానీ తు భృగురజని, బ్రహ్మణోముఖాత్ క్షత్త్రాభిమానీతు యమః బ్రహ్మబాహ్వో రజాయత" మొదలైన ప్రమాణము లుండుటచేత పైఁ జెప్పిన వ్యాఖ్యానము సరియైనదే. పైశ్లోకమునందును నిట్లే యన్వయించి కొనవలెను. 'గౄ' అను ధాతువునకు శబ్దము,'పోఁగొట్టు' అను రెండర్థము లున్నందున దానికి రెండురీతులుగా నర్థముఁ జెప్పుటయైనది.

**31. శ్లో :** (పురుషస్య) బ్రహ్మంతర్యామియైన శ్రీహరి యొక్క, బాహుభ్యః ,క్షత్రం = క్షత్రియ జాతి, తదనువ్రతః = దాని ననుసరించియున్న, క్షత్రియః = క్షత్రియుఁడును, ఆ జాతి కభిమానియైన స్వాయంభువమనువును, ఆవర్తత = జన్మించిరి. జాతః, యః, క్షత్రియః, పౌరుషాత్, వర్ణాన్ కంటకక్షతాత్ = త్రాయతే. దీనిచేత క్షతాత్ త్రాయత ఇతి క్షత్రియః, అనుటను సూచించినట్లైనది.

32. శ్లో : విభోః తస్య = ఆ బ్రహ్మాంతర్యామియైన శ్రీహరి యొక్క, ఊర్వోః లోకవృద్ధికరీః విడీశః= వైశ్యులు, ఆ జాతి కభిమానయైన వాస్తు దేవతలు, అవర్తంత. తదుద్భవః = విష్ణుబ్రహ్మ, వాయువు, రుద్రుఁడు వీరి నుండి జన్మించిన, యః వైశ్యః = ఏ వైశ్యుఁడు (ఈ విషయమును దెలుపుటకే విశః అని బహువచనమును వాడినది) నృణాం, వార్తాం = వ్యవసాయము, పశుపాలన మొదలైన కార్యములను, సమవర్తయత్ = నిర్వహించెను. బ్రహ్మాదులైన కార్యములను, సమవర్తయత్ = నిర్వహించెను. బ్రహ్మాదుల నుండి పుట్టినట్లైనచో పైనిఁ జెప్పఁబోవు "యద్వృత్త్యా తుష్యతే హరిః" - అనుటెట్లు సంగత మగును? బ్రహ్మాదులయంతర్యామియైన శ్రీహరి నుండియే పుట్టుటచేత వీరి జాత్యుచితకార్యములతో శ్రీహరి పరితుష్టుఁడనుట యుక్తము.

33. శ్లో : భగవతః = బ్రహ్మదేవుఁడు, తదంతర్యామియైన శ్రీహరి వీరియొక్క, పద్భ్యాం, శుశ్రూషాకర్మసిద్ధయే, పురా = సృష్ట్యారంభమందు, తస్యాం = సేవానిమిత్తముగా, శూద్రః = శూద్రవర్ణమును తదభిమానియైన "కృతి" యనెడు దేవతయు, జాతః. యద్వృత్త్యా = ఆ శూద్రవర్ణమునకు హితమైన సేవావృత్తిచేత, హరిః = పరమాత్మ, తుష్యతే.

34,35. శ్లో : ఈ వర్ణచతుష్టయము స్వవిహితమైన కర్మ నొనర్చుటయే హరికిపూజ, దీనిచేతనే భగవంతుఁడు తుష్టుఁడగును. వేరుదానితోఁగాదని చెప్పుచున్నాఁడు. యత్ = వృత్తిభిస్సహ, జాతాః = నాల్గువర్ణములు జన్మించెనో, తత్, ఏతే వర్ణాః ఆత్మవిశుద్ధ్యర్థం శ్రద్ధయా స్వగురుం హరిం స్వధర్మేణ యజంతే. ఇట్టి శ్రీహరిమహిమను దెలుపుట కెవ్వరికిని సాధ్యముగాదు అనుచున్నాఁడు. క్షత్తః = విదురుఁడా ! దైవకర్మాత్మరూపిణః = దేవతలం దధికుఁడగుటతో దైవమనియు, సమస్తమునకు మూలకారణ మగుటతోఁ గర్మయనియు, వ్యాపకుఁ డగుటతో నాత్మయనియు, చెప్పఁబడెడు స్వభావముగల భగవతః గడచినట్టియు రాబోవునట్టియు అనంతబ్రహ్మాండములను సృష్టించెడు నిరవధిక సామర్థ్యముగల పరమాత్మ యొక్క (ఆకారణముచేతనే దైవమని కర్మమనియు ఆత్మయనియుఁ బిలువఁబడెడు), ఏతత్ యోగమాయాబలోదయం = స్వరూపశక్తి యొక్క సామర్థ్యప్రసారమును, ఉదాహర్తుం = దృష్టాంతసహితముగఁ జెప్పుటకు, కః = శ్రద్ధధ్యాత్ అనంతమగుటతో నెవరిచేతను సాధ్యముగాదని తాత్పర్యము. దైవశబ్దమునకు అదృష్టము అని యర్థము చెప్పరాదు".

"అధికత్వాద్దైవశబ్దోద్దైవతేష్వధికోయతః ,
దైవం హరిః కర్మమూలం కృతిరిత్యేవ భణ్యతే
వ్యాప్తత్వాదాత్మశబ్దశ్చ శ్రీపతిత్వాచ్చమాధవః. -అని ప్రమాణము.

36. శ్లో : శ్రీహరిమాహాత్మ్యమును వర్ణించుట కశక్తుఁడ నైనను సాధ్యమైనంత చెప్పెద ననుచున్నాఁడు. అంగ! ఓ విదురుఁడా! అథాఽపి అన్యాభిధాం స్వాంగిరం సతీం సంస్కర్తుం హరేః కీర్తిం యథాశ్రుతం యథామతి కీర్తయామి. స్వాం సంస్కర్తుం అని శ్రీధరుల పాఠము. త్వాం సంస్కర్తుం అని విజయధ్వజులు.

37. శ్లో : వాగాదీంద్రియములకు చరమప్రయోజన మిదే యనుచున్నాఁడు. పుంసః వచసః, సుశ్లోకమౌళేః, గుణవాదం, ఏకాంతలాభం = ముఖ్యమై సరియైన ప్రయోజనమని (ప్రేక్షావంతః = జ్ఞానులు)ఆహుఃచ. ఇంకను, శ్రుతేః = చెవులకు, విద్వద్భిః ఉపాకృతాయాః, వ్యాఖ్యాతమైన కథాసుధాయాః, సంప్రయోగః భక్తియుక్తమైన శ్రవణమే ఏకాంతలాభః. ఉత, ఇట్లే చక్షురాదీంద్రియములకును భగవద్రూపాదిసేవనమే ముఖ్యప్రయోజనమని తెలియవలెను. ఈ విషయమందు తంస్తోతారః పూర్వ్యాం యథావిధం - మొదలైన శ్రుతులు "యన్నామసకృచ్ఛ్రవణాత్, పుల్కసోఽపి విముచ్యతే" మొదలైన స్మృతులు ప్రమాణము.

38. శ్లో : (3 పాదములు) సర్వోత్తములైన జ్ఞాను లనఁబడెడు బ్రహ్మాదులచేత శ్రీహరి మహిమ సంపూర్తిగా వర్ణింపఁబడినది గదా! మఱి యాతని మహిమను సంపూర్తిగా వర్ణించుటకు సాధ్యముగాదను వచనము సంగత మెట్లగును? దానికి సమాధానము - "వత్స! ఆదినా కవినా = జ్ఞానులలో శ్రేష్ఠుఁడైన బ్రహ్మచేత, యోగవిపక్వయా = శమదమాద్యుపాయములచేత పరిపక్వమైన, ధియా = సకల శాస్త్రార్థములను దెలిసికొను బుద్ధిచేత, సంవత్సరసహస్రాంతే ఆత్మనః మహిమా అవసితః, తన యోగ్యతకుఁ దగినంతయే తెలిసికొనఁబడినది. అతః = అందుచేత, భగవతః మాయా, మాయినాం అపి = జ్ఞానులకును గూడ, మోహినీ = బుద్ధిని ముగ్ధముగా నొనర్చునది.

39. శ్లో : బ్రహ్మ తెలిసి కొన్నాఁడు గదా! అట్టిచో బ్రహ్మాదులకును మోహకరమెట్లు? వారికిఁ గూడ భగవంతుని గూర్చిన సంపూర్ణ జ్ఞానము అసాధ్య మనుచున్నాఁడు. ఆత్మవర్త్మ = భగవంతునికి సంబంధించిన జ్ఞానము నుపదేశించువారల కెల్లను ప్రథమాచార్యుఁడైన, ఆత్మా = బ్రహ్మదేవుఁడు, స్వయంచ = తానే (భగవతః

మాయాం) సర్వాత్మనా, న వేద ఇతియత్ అతః అపరే = మా వంటి వారు, కిముత? ఇచ్చట మాయాశబ్దమునకు మహిమయని యర్థము.

"మాయా తు మహిమా ప్రోక్తః ప్రాచుర్యేతుమయడ్వతః"

అని ప్రమాణము. బ్రహ్మరుద్రాదులును శ్రీహరిని సంపూర్తిగాఁదెలియలేరనుటకు "గుణపూర్తే రాత్మశబ్దో బ్రహ్మ వా నత్వతోహరః, అహం శబ్ద స్తథా ప్యేతౌ నజానీతో హరింపరమ్" - అని ప్రమాణము. దీనితోఁ దమతమయోగ్యతకుఁ దగినంతయనియు గుణ పూర్ణులైన అని యర్థము. 'అహం' అనఁగా నింద్రుఁడు.

**40. శ్లో :** ఇదేమియు నాశ్చర్యముగాదని చెప్పుచున్నాఁడు. - వాచః = అనంతవేదములకు నభిమానియైన లక్ష్మీదేవి రూపములు, మనసా = అనాదికాలమునుండి మనస్సుతో శ్రీహరిగుణరూపములనే ధ్యానించుచు సహవాగింద్రియముతో నిరంతరము వర్ణించుచు, అప్రాప్య = గుణవర్ణన యొక్క యంతమును బొందలేక అనఁగా గుణములన్నిటిని సమగ్రముగ వర్ణింపలేక, యతః = ఏ కారణము చేత, నివర్తంతే = అనంతగుణములతోఁ బరిపూర్ణుఁడని నిశ్చయించికొని యెప్పుడును దమకుఁ బరిచితములైన గుణములనే వర్ణించుకొనుట యందుఁ దృప్తిపడిరో, అహం = అహంకారతత్త్వమున కభిమానులైన గరుడ, శేష, రుద్రులు, ఇమే అన్యే దేవాః = ఇంద్రియాభిమానులైన యింద్రాది దేవతలు, చ = కూడ, యతః = శ్రీహరి మహిమను దెలియని వారగుటచేత, తస్మై = ఎవ్వరిచేతను సంపూర్తిగాఁ దెలియఁబడఁజాలని మహిమ గల, భగవతే నమః. వాచః అనెడు బహువచనము లక్ష్మీదేవియొక్క యనంతరూపములను దెలుపును. "శ్రీర్యత్ర రూపిణ్యురుగాయ పాదయోః కరోతి మానం బహుధా విభూతిభిః" అని ప్రమాణము. అహం శబ్దము అహంకారతత్త్వమును దెలుపును. "అహం త్రిధా" - అనుచోట నింతకుముందే యీ యర్థము చెప్పఁబడినది. ఇచ్చటి 'అహం' శబ్దమును మైత్రేయుఁ డని యన్వయింపరాదు. 'నివర్తంతే' అనెడు ప్రథమ పురుషప్రయోగము 'అహీన' (గుణములచేత హేయుఁడు కాఁడు) అనునర్థము చేత రుద్రుఁడు అహంశబ్దవాచ్యుఁ డగునని యింతకుముందే ప్రమాణమును జూపినాము. దాని నిచ్చట నన్వయించికొనవలెను.

**ఇతి శ్రీమద్భాగవతే, మహాపురాణే, అష్టాదశసహస్రి కాయాం, సంహితాయాం, శ్రీ హయగ్రీవబ్రహ్మవిద్యాయాం, తృతీయస్కంధే, షష్ఠోఽధ్యాయః**

## శ్రీ పోతన్నగారు

సీ. అనినఁ బ్రసన్నుఁడై హరి మహదాదుల
కన్యోన్యమిశ్రత్వ మందకున్న
కతమున నిఖిలజగత్కల్పనాశక్తి
వొడము కుండుటఁ దన బుద్ధి నెఱిఁగి
కై కొని కాలవేగమున నుద్రేకంబు
నొందిన ప్రకృతితోఁ బొంది నిజ బ
లము నిల్పి తా నురుక్రముఁడన సప్త విం
శతి తత్త్వములయందు సమత నొక్క

తే. పరి ప్రవేశించి యా తత్త్వభవ్యగుణము
నందు జ్యేష్ఠానురూపంబు లలరఁ జెంది
యొకటి నొకటిని గలయక యుండి విశ్వ
రచన మెఱుఁగని యాతత్త్వ నిచయమునకు. 204

వ. ఇట్లు విశ్వనిర్మాణ నిపుణత్వంబు నెఱుంగం జావుచు నన్నింటికి నన్యోన్యతం గల్పించి తన యనుగ్రహంబునం బ్రేరి తంబై కానంబడి క్రియాసామర్థ్యంబునం జెన్నొందిన తత్త్వవితా నంబు దేవప్రేరితం బయి స్వకీయంబు లగు నంశంబులచేతం బుట్టించిన విరాడ్విగ్రహంబై తత్త్వవితతి దమయందుఁ జెందిన పుండరీకాక్షుని కళాంశంబున నొకటి కొకటికి నైక్యంబు వాటిల్లి పరిణతంబై రూపాంతరంబునుం జెందె: నే తత్త్వంబుననేవియుఁ జరాచరలోక పుంజంబులు నిండియుండు నా హిరణ్మయంబైన విరాడ్విగ్రహంబు నొందిన పురుషుండు సర్వజీవ సమేతుండై యుండె నంత 205

క. జలముల లోపల విమ్మల
జలరుహజాతాండమందు సాహస్రాబ్దం
బులు విలిచెఁ గార్యరూపా
కలితంబగు నవ్విరాట్పుగర్భము వరుసన్. 206

తే. దైవకర్మాత్మ శక్తి వితానములను
దగిలి తనచేతఁ దనుఁ దాన దైవశక్తి
యగుచు వెలుఁగొందుచును బ్రకారాంతరమునఁ
దనువు వితతంబుగాని చైతన్య మొంది. 207

తే. రూపసంసక్తిఁ జేసి నిరూఢకర్మ
శక్తియును వృత్తిభేద సంసక్తి దశ వి
ధములు గలిగిన ప్రాణరూపమున నాత్మ
శక్తి భోక్తృత్వ మగుచున్న శక్తి కలిగి. 208

క. త్రివిధం బగుచును నాధ్యా
త్మ్య విభేదంబులను బాపి మఱి యధిభూతా
త్మ విరాడ్రూప మ్మగు నిది
వివిధప్రాణులకు నాత్మవిధమై మఱియున్. 209

క. జీవంబై పరమాత్మకుఁ
దావలమై యాదిమావతారంబగు న
ద్దేవుని గర్భంబున భూ
తావలితోడం బ్రపంచ మర్థిం దోఁచెన్. 210

వ. ఇట్లు దోఁచిన విరాట్పురుషుం డాధ్యాత్మి కాధిదై వికాధిభౌతికంబులను భేదంబులచేఁ బూర్వోక్త క్రమంబున వెలుఁగొందు ననుచు విదురునకు మైత్రేయుం డెఱింగించె నని చెప్పి వెండియు నిట్లనియె. 211

చ. హరి పరమాత్ము డీశుఁ డజుఁ డాఢ్యుఁ డనంతుఁడనంతమూర్తి
సాగర తనయాహృదీశుఁడు వికారవిదూరుఁడు నిత్యమంగళా
కరుఁడు కృపాపయోనిధి యకల్మష చిత్తుఁడు సర్వశక్తి తా
మరసవిలోచనుండు బుధమాన్య చరిత్ర పవిత్రుఁడిమ్ములన్.212

వ. ఇత్తెఱంగున నీశుండగు నధోక్షజుండు మహదాది తత్త్వంబుల మనంబుల ఘనంబులగు తలంపులు దా నెఱింగి యట్టితత్త్వంబుల వివిధవృత్తి లాభంబునకై స్వకీయ చిచ్ఛక్తిచే నిట్టులొనర్తునని చింతించి నిజకళాకలితంబగు విరాడ్విగ్రహంబునందు నగ్ని ప్రముఖంబగు దేవతావళి

కెల్ల నివానం బగుచుఁ గానంబడిన వైరాజపురుషుని యాస్యాద్య
వయవంబుల వినిపింతు దత్తావధానుండవై వినుము. 213

సీ. నరనుత, యా దివ్యపురుషోత్తముని పృథ
గ్భావంబు నొంది ముఖంబు వలన
భువనపాలకుఁడైన పవమాన సఖుఁడంత
రాత్మఁ డీశ్వరు నంశ మైన వాణి
కనయంబు ననుకూల మగుచు నిజస్థాన
మునఁ బ్రవేశించిన ముఖమునందుఁ
బరఁగు జీవుండు శబ్దము నుచ్చరించుఁ బృ
థగ్భావములగు నేత్రముల నినుఁడు

తే. చక్షురింద్రియ యుక్తుఁడై సరవిఁ జెంది
రూపవిజ్ఞాన మహిమ నిరూఢి నొందు
మఱియుఁ జర్మంబునను బవమానుఁ డీశ్వ
రాంశయై తత్త్వగింద్రియమందుఁ గూడి. 214

వ. నిజనివానంబు నాశ్రయించిన జీవుండు స్పర్శేంద్రియ గతుండగు. పృథగ్భావంబైన శ్రోత్రంబుల దిక్కు లచ్యుత కళాంశంబులగు. శ్రవణేంద్రియ యుక్తంబులై నిజస్థానంబులం బొందిన జీవుండు శబ్దజ్ఞాన గతుం డగు. వెండియుఁ దాలువు నిర్భిన్నం బయిన లోకపాలుండగు వరుణుం డందుఁ బ్రవేశించి రసనేంద్రియంబుచేఁ బ్రకాశించినం బ్రాణి రసంబులం గ్రహించెఁ, బరమేశ్వరుని నాసికేంద్రియంబు పృథగ్భావంబు నొంది యాశ్వినే యాధిష్ఠానంబై ఘ్రాణాంశంబు నొందిన జంతువు గంధగ్రహణ సమర్థంబయ్యె, వెండియు భిన్నంబయిన చర్మంబున నోషధులును బరమపురుషాంశంబు లయిన కేశంబులంగూడి నిజనివాసంబు నొందిన జీవుండు కండూయ మానుండగు, భిన్నభూతంబైన మేఢ్రంబునం బ్రజాపతి రేతంబున నిజస్థానంబు నొందిన జీవుం డానందంబునం బొరయు, భిన్నభావంబైన గుదంబున మిత్రుం డచ్యుతాంశంబును బొంది పాయువుం గూడి నిజాధిష్ఠానంబు నొందిన జీవుండు విసర్గంబుఁజెందు. వేఱువేఱైన బాహువులం ద్రిదశాధీశ్వరుండయిన

పురందరుండు క్రయవిక్రయాది శక్తియుక్తుండగుచు నిజస్థానంబు నొందిన జీవుండు వానిచేత జీవికం బొందు, మఱియుఁ బాదంబులు నిర్భిన్నంబులయిన విష్ణుండు స్వాపానంబు గై కొని గతిశక్తిం బొందిన జీవుండు గమనాగమ నార్హుం డయ్యె, వెండియు భిన్నభావంబయిన హృదయంబు మనంబుతోడం గలసి నిజాధిష్ఠానంబునం జంద్రుండు ప్రవేశించిన జీవుండు శరీరసంకల్పాది రూపంబగు వికారంబునుం బొందు, భిన్నభావంబైన యహంకారంబున నహంకృతి యుక్తుండై రుద్రుండు నిజస్థానంబుగా వసియించు, నా యహంకృతిచే శరీరి కర్తవ్యంబులు నడపు, బుద్ధి వాగీశ్వరావాసంబై హృదయంబుతోడం గలసి నిజాధిష్ఠానంబున బోధాంశంబుచే వెలింగిన శరీరి బోద్ధవ్యతం బొందు, భిన్నంబైన చిత్తంబు బ్రహ్మ వాసంబై చేతనాంశంబు నొందినఁ బ్రాణి విజ్ఞానంబునుం బొందు నట్టి విరాట్పురుషుని శీర్షంబున స్వర్గంబును, జరణంబుల వసుమతియు, నాభియందు గగనంబునుం గలిగె, సత్త్వాదిగుణపరిణామంబుల నమరులైరి, ఊర్జిత సత్త్వగుణంబున న ద్దేవతలు త్రిదివంబునుం బొందిరి, రజోగుణంబున మనుజులును గవాదులును ధరణిం బొందిరి, తామసంబున భూతాదులైన రుద్ర పారిషదులు ద్యావాపృథివ్యంతరంబగు వియత్తలంబునుం బొందిరి, ముఖంబువలన నామ్నాయంబు లుత్పన్నంబులయ్యె. వెండియు -215

క. ధరణీదివిజులు శ్రుతులును
నరవర! యమ్మేటి ముఖమునం బొడముట భూ
సురుఁ డఖిల వర్ణములకున్
గురుఁడున్ ముఖ్యుండు నయ్యె గుణరత్న నిధీ! 216

క. ధర బ్రాహ్మణాదికము ద
స్కర బాధలఁ బొందకుండఁ గైకొని కావం
బురుషోత్తము బాహువులన్
నరనాథకులంబు పుట్టె నయతత్త్వనిధీ! 217

కం. గణుతింపఁగఁ గృషిగోర
క్షణవాణిజ్యాది కర్మకలితంబుగ నా
గుణనిధి యూరువులందుం
బ్రణుతింపఁగ వైశ్యజాతి ప్రభవం బయ్యెన్. 218

తే. తివిరి సేవక ధర్మమ్మలై దేవదేవు
పదములను శూద్రసంతతు లుదయమ్మైరి
వీర లందఱుఁ దమతమ విహితకర్మ
మలరఁ జేయుచు జనకుండు నాత్మగురుఁడు. 219

కం. అగు సర్వేశుఁ బరాత్పరు
జగదేకప్రభుని పాదజలజాతంబుల్
దగిలి భజింతురు సతతము
నిగమోక్తిన్ భక్తియోగనిపుణాత్మకులై. 220

తే. మహిమ దీపింపఁ గాలకర్మ స్వభావ
శక్తిసంయుక్తుఁడగు పరేశ్వరుని భూరి
యోగమాయా విజృంభణోద్యోగ మెవ్వఁ
డెఱిఁగి నుతియింపఁగా నోపు నిద్ధచరిత! 221

చ అన్యకథానులాపము లహర్నిశముం బఠియించి చాల మా
లిన్యము నాత్మశోభన విలీనత నొందు మదీయ జిహ్వ సౌ
జన్యము నొందె నేఁడు హరిసద్గుణ దివ్య కథామృతంబు స
న్మాన్యచరిత్రమై నెగడు మద్గురు వాక్యపదంబుఁజెందఁగన్.222

మ. హరినామాంకిత సత్కథామృత రసవ్యాలోలుఁడై నట్టి స
త్పురుష శ్రేష్ఠుఁడసత్కథాలవణవాఃపూరంబుఁదాఁగ్రోలునే?
వరమందార మరంద పానకుతుకస్వాంత ద్విరేఫంబు స
త్వరమ్మైపోవునెచేఁదువేములకుఁదద్గంధానుమోదాత్మమై. 223

కం. హరి మహిమముఁ దన్నాభీ
సరసిజ సంజాతుఁడైన చతురాననుఁడుం
బరికించి యెఱుఁగఁ డనిన ని
తర మనుజులఁ జెప్పనేల తత్త్వజ్ఞనిధీ! 224

తే. శ్రుతులు దమలోన వివరించి చూచి పుండ
రీకలోచను నుత్తమ శ్లోక చరితు
నమర గణ వంద్యమాన పాదాబ్జ యుగళు
నెదకి కనుఁగొనలే వంద్రు విమల మతులు. 225

.కం. హరియుం దన మాయాగతిఁ
బరికించియుఁ గానఁడయ్యెఁ బరిమితి లేమిన్
మఱి మాయావిని మోహిని
చరితముఁ గనుఁ గొందు రెట్లు చతురాస్యాదుల్? 226

కం. ఆ దివిజాధీశుఁడు. మహ
దాదులు దిక్పతులుఁ, బంకజాసనుఁడున్, గౌ
రీ దయితుఁడు గనఁజాలని
శ్రీ దేవుని పదయుగంబుఁ జింతింతు మదిన్. 227

**అర్థములు :**

**204.** సీ॥ ప్రసన్నుఁడై = వారి ప్రార్థనతో దయఁగలిగినవాఁడై, మహదాదులకున్ = మహత్తత్త్వము మొదలైన వానికి, అన్యోన్యమిత్రత్వము = పరస్పర సఖ్యము, అందకున్నకతమునన్ = ఏర్పడకుండుట చేత, నిఖిలజగత్కల్పనాశక్తి= సర్వజగత్తులను సృష్టించెడి శక్తి, పొడమకుండుట = ఏర్పడకుండుట, కాలవేగమునన్ = కాలమను సంజ్ఞగల శక్తిచేత, ప్రకృతితోన్ పొంది = ఆ ప్రకృతి నాశ్రయించినవాడై, నిజబలమునిల్పి = తన వీర్యము నా ప్రకృతియందు బ్రవేశింపఁజేసి, ఉరుక్రముఁడనన్ = శ్రేష్ఠమైన క్రమము గల్గిన వాఁడనునట్లుగా, సప్తవింశతి తత్త్వముల యందున్ = ఇరువది యేడు తత్త్వము లను పంచభూతములు, తన్మాత్రలు, జ్ఞాన, కర్మాంగములు, మనస్సు, అహంకారము, మహత్తత్త్వము, ఇరువది నాల్గవతత్త్వము ప్రకృతి, ఆ ప్రకృతిలోఁ బ్రవేశించినది యిఱువదియైదవతత్త్వము. ఈ ప్రకృతిలో జడాంశమునే స్వీకరించిన యిరువది యైుదవతత్త్వము జీవుఁడు. లక్ష్మీసహితుఁడైన శ్రీహరి యిరువదియాఱవతత్త్వము. లక్ష్మీసహితుఁడుగాని హరి యిరువది యేడవతత్త్వము. పైనఁజెప్పినది ద్వైత సంప్రదాయము. ద్వైత సంప్రదాయములో పోతన్నగారికి సంబంధ మెంతయో తెలియరాదు. మూలమందు "త్రయో వింశతి తత్త్వానాం గణం" - అనియే కలదు. మఱి యీ పద్యమందలి "సప్తవింశతి" అనునది అచ్చు తప్పో లేక ద్వైతసిద్ధాంతమునే పోతన్న అనుసరించెనో లేక యీ భాగ మన్యపూరణమో

సరిగాఁదెలియుట లేదు. ఒక్క పరి = ఒక్కటే సారిగ, ఆ తత్త్వభవ్య గుణములందున్ ఆ తత్త్వముల శ్రేష్ఠమైన గుణములలో, జ్యేష్ఠ + అనురూపంబులు = వాని వానికిఁ దగినట్లుగా -

**తాత్పర్యము :** వారి ప్రార్థనతో శ్రీహరి సంతుష్టుడైనాఁడు. ఆ తత్త్వములు పరస్పరభిన్నములైన గుణములు గల వగుటచే నొకదానితో నొకటి చేరకుండుటచేత వానికి జగత్తులను సృష్టించెడి శక్తి యేర్పడలేదు. ఈ విషయమును బరమాత్ముఁ డెఱిఁగినాఁడు. అప్పుడు కలనంజ్ఞయు ద్యోతనశీలమునైన ప్రకృతిని దాను బొందినాఁడు.పొంది యా సప్తవింశతితత్త్వములలో నొక్కసారిగనే దాను బ్రవేశించినాఁడు. వాని వాని యోగ్యతకుఁ దగినట్లుగా నా తత్త్వముల యంశములను భగవంతుఁ డొకదానితో నొకటిఁ జేర్చెను.

**205.** విశ్వనిర్మాణనిపుణత్వంబునన్ = ప్రపంచమును నిర్మించుట యందలి చాతుర్యమును, ఎఱుంగన్ చూపుచున్ = స్పష్టముగా చూపుచు, అన్యోన్యతన్ కల్పించి = ఒకదానితో నొకటి చేరియుండెడిస్థితిని యేర్పఱచి, తన అనుగ్రహంబునన్ = తన దయచేత, క్రియాసామర్థ్యంబునన్ = కార్యము నొనర్చుటందలి శక్తిచేత, తత్త్వ వితానంబు = తత్త్వముల గుంపు, దేవప్రేరితంబై = భగవంతునిచేఁ బ్రేరేపింపఁబడినదై, విరాడ్విగ్రహంబై = విరాట్టను పేరు గల స్వరూపమును సృష్టించి, పుండరీకాక్షుని కలాంశంబునన్ = విష్ణువు కళచేత, పరిణతంబై = పక్వమైనదై, హిరణ్మయము = బంగారు రూపము గలది.

**తాత్పర్యము :** తన ప్రపంచనిర్మాణము గలియునట్లుగా భగవంతుఁడా తత్త్వముల కన్నిటికిని మైత్రి గల్పించినాఁడు. ఆతని యనుగ్రహవిశేషముచేఁ బ్రేరేపింపఁబడిన తత్త్వ సమూహమందుఁ గ్రియాసామర్థ్య మేర్పడెను. అప్పుడవి పరస్పరమేళనముచేఁ బరిణతములై వేరు వేరు రూపములు చెందినవి. ఆ రూపమునకే విరాట్పురుషుఁడని పేరు. ఆ పురుషుని యందు వాసుదేవుని కళాంశము చేరియుండినది. ఆ విరాడ్విగ్రహమందుఁ జరాచర లోకములు నిండియుండెను. హిరణ్మయమైన యా విగ్రహంబునొందిన పురుషుఁడు సర్వజీవసమేతుఁడై యుండెను.

**206.** జలరుహజాతాండమందున్ = బ్రహ్మాండమందున్న, జలముల లోపలన్ = జలములలో, కార్యరూపాకలితంబగునవ్విరాట్పుగర్భము = కార్యరూపముచేతఁగూడుకొన్న నా విరాట్పురుషుఁడు, ఇమ్ములన్, సాహస్రాబ్దంబులు నిలిచెన్ = దేవమానముతో వేయేండ్లు నిలిచినాఁడు.

**తాత్పర్యము** : బ్రహ్మాండములోపలి జలములలో నా విరాడ్దేహము కార్యరూపముచేఁ గూడినదై వేయి సంవత్సరములు వసించెను.

**207.** దైవకర్మాత్మశక్తివితానములనున్ తగిలి = దైవశక్తి, కర్మశక్తి, ఆత్మశక్తి అను మూటితోఁ గూడి కొనియున్న, తనుదానన్ = తనచేతఁదానే, దైవశక్తి యుగుచున్, వెలుఁగొందుచున్, మహదాదులకుఁ గార్యరూపమ్మైన భగవంతుఁడు, ప్రకారాంతరముననన్ = వేఱురీతిచేత, తనువు వితతంబుగాని చైతన్యంబు నొంది = శరీరము స్పష్టముగాని చైతన్యము నొందినవాఁడై.

**తాత్పర్యము** : ఈ పద్యమేమో స్పష్టముగా నా కన్వయముగా లేదు. దీనికి మూలశ్లోకమిది.

" సవైవిశ్వసృజాంగర్భో దైవకర్మాత్మశక్తిమాన్,
విశ్వభాజాత్మనాత్మానం । ఏకధా దశధా త్రిధా".

**208.** రూపసంసక్తిఁజేసి = హృదయా వచ్చిన్నమ్మైన చైతన్యముచేత, నిరూఢకర్మశక్తియునై - నిరూఢ = దృఢముగా నెలకొన్న, కర్మశక్తియునునై, క్రియాశక్తి, వృత్తిభేద సంసక్తిన్, పంచవాయువులునున్ వాని వృత్తి భేదములతో దశవిధములుగా నగుచున్నది. ఆత్మశక్తియనఁగా భోక్తృశక్తి.

**తాత్పర్యము** : విరాట్పురుషుఁడు హృదయావచ్ఛిన్నమ్మైన చైతన్యముచేత నిరూఢక్రియాశక్తియైనాఁడు. వాయువులు ఐదే. నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయములు. అవి వృత్తిభేదములచేత పదివిధము లగుచున్నవి. ఆత్మశక్తియనఁగా భోక్తృశక్తి. ఈ రీతిగా మూఁడు రీతులుగా నైనాఁడు.

**209.** త్రివిధంబగుచునున్ = మూఁడురీతులై, ఆధ్యాత్మ్య విభేదంబులనున్‌పాపి = ఆధ్యాత్మికాది విభేదములులేకను, అధిభూత ఆత్మవిరాడ్రూపంబగునిది = అధిభూతాది రూపములతోఁ గూడికొన్నయిది, వివిధ ప్రాణులకున్ = సమస్తజీవులకును, ఆత్మవిధమ్మై వెలయున్ = ఆత్మస్వరూపముగా నుండును.

**తాత్పర్యము** : ఇది త్రివిధమై యొప్పుచుండును.అధ్యాత్మాది విభేదములతో ముత్తెఱఁగులు. అధిభూతమైన యవతార మిది. వ్యష్టిసమష్టిరూపములకు సర్వములకు నాధారము. వ్యష్టిరూపములతో నాత్మస్వరూపముగా నుండును. అనఁగా జీవరూపుఁడుగా నుండును.

**210.** జీవంబై = జీవస్వరూపుఁడై, పరమాత్మకున్ తావలమై = పరమాత్ముని యంశభూతమై, ఆదిమావతారంబు = మొదటి యవతారము, అద్దేవుని గర్భంబునన్ = ఆ దేవుని స్వరూపములో, భూతావళితోడన్ = సమస్త ప్రపంచము, అర్థిన్, తోఁచెన్.

**తాత్పర్యము** : సమస్త వ్యష్టిరూపములకు నిది యాత్మ. పరమాత్ముని యంశము. ఇట్టి యా యాద్యావతారమందు సమస్త భూతములతోఁ బ్రపంచమేర్పడినది.

**211.** ఇట్లు తోఁచిన విరాట్పురుషుండు = ఈ రీతిగా నవతారమెత్తిన విరాట్పురుషుఁ డాధ్యాత్మికాదిభేదములతో ముందుఁ జెప్పఁబడినట్లుఁ బ్రకాశించుననుచు విదురునకు మైత్రేయుం డెఱింగించె నని చెప్పి శుకబ్రహ్మ తరువాత నిట్లనెను.

**212.** హరి పరమాత్ముఁడు, ఈశుఁడు. అనంతమూర్తి = అనంతములైన మూర్తులు గలవాఁడు, సాగరకన్యాహృదీశుఁడు, హృత్ + ఈశుఁడు, సముద్రకన్యయగులక్ష్మీదేవికి భర్త. వికారవిదూరుఁడు = త్రిగుణములతో నేర్పడెడు సమస్త వికారములకు దూరమైన వాఁడు, నిత్యమంగళ + ఆకారుఁడు = సమస్త శ్రేయములకును మూలమైనవాఁడు, అకల్మషచిత్తుఁ డు = నిష్పాపమైన మనస్సు గలవాఁడు, సర్వశక్తి = సమస్త శక్తులును గలవాఁడు, తామరసవిలోచనుఁడు = పద్మలోచనుఁడు, బుధమాన్యచరిత్ర పవిత్రుఁడు = బుధులచే గౌరవింపఁదగిన చరిత్ర గలవాఁడు.

**తాత్పర్యము** : భగవంతుఁడు పరమాత్ముఁడు, ఈశుఁడు. జన్మాది వికారములు లేనివాఁడు, అనంతములైన మూర్తులు గలవాఁడు, లక్ష్మీశుఁ డు. త్రిగుణజనితములైన వికారములు లేనివాఁడు. నిత్యకళ్యాణములు గలవాఁడు. బుధులచేఁ గౌరవింపఁదగిన పవిత్రచరిత్రగల వాఁడు.

**213.** అధోక్షజుండు = ఇంద్రియముల కగుపడనివాఁడు, మహదాది సత్త్వంబుల మనంబులన్ = మహదాదులయందు వివిధవృత్తి లాభమునకై = వారి జీవనమునకై, స్వకీయచిచ్ఛక్తిచేతన్ = తన జ్ఞానశక్తి చేత, నిజకళా కలితంబు = తన కళచేఁ గూడినది. అగ్ని ప్రముఖంబు = అగ్నిమొదలైన వారియొక్క, వైరాజ పురుషుఁడు = విరాట్పురుషుని యొక్క, ఆస్యాద్య వయవంబులన్ = ముఖము మొదలగు నవయవముల ప్రకారమును, దత్తావధానుండవై = శ్రద్ధగలవాఁడవై

**తాత్పర్యము :** ఇంద్రియముల కెఱుకపడని పరమాత్ముఁడు మహదాది తత్త్వములలోనున్న యూహల నెఱిఁగినాఁడు. వాని వివిధ వృత్తుల కొఱకు తన శక్తుల నే మొనర్తునని తన చిచ్ఛక్తిచే నాలోచించెను. ఆలోచించి తత్తదవయవాభిమానులైన అగ్న్యాదుల యొక్క వివిధవృత్తుల లాభమునకై కొన్ని పద్ధతుల నవలంబించినాఁడు.

**214.** పృథగ్భావంబునంది = వినిర్భిన్నమైనదే, పవమాన సఖుఁడు = అగ్ని దేవుఁడు, ఈశ్వరునంశమైన వాణికి = ఈశ్వరునంశమైన వాక్కునందు, ముఖమునందున్ వరఁగుజీవుండు = ముఖముననున్న జీవుఁడు, పృథగ్భావములగు = వేఱుతనమును బొందిన, నేత్రములన్ = కన్నులందు, చక్షురింద్రియయుక్తుఁడై = చక్షురింద్రియముతోఁగూడినవాఁడై, రూపవిజ్ఞానమహిమ = రూపములను దెలిసికొనెడి జ్ఞానము, చర్మములనున్ = చర్మములందు, పవమానుఁడు = గాలి, ఈశ్వరాంశమై = ఈశ్వరుని యంశచేతఁగూడినదై.

**తాత్పర్యము :** పై సందర్భమందు ఇట్లు వివరింపవలసియున్నది. సమష్టియనఁగా లోకము. వ్యష్టి యనఁగాఁ బ్రత్యేకమైన శక్తి. సమష్టియైన లోకము, విరాట్పురుషుని శరీరము. వ్యష్టియనునది జీవుని శరీరము. ఈ విషయము ముందుఁ దెలిసికొన్ననే క్రిందఁజెప్పఁబోవు విశేషవిభాగము లర్థమగును. ఆయా యవయవములయందు నివసించెడు దేవతలు, ఆ యంగములు నిర్వహించెడు కార్యములును సర్వమును నవగత మగును. విరాట్పురుషునికి మొదలు ముఖ మేర్పడినది. ఆ స్థానమందు అగ్నియనెడు దేవత తన యంశమైన వాక్కుతోఁ బ్రవేశించినది. జీవుఁడా వాక్కు సహాయముతో వక్తవ్యమైన విషయమును జెప్పును. ఇక్కడ ముఖము

అధిభూతము. దానికే యధిష్ఠాన మనియును బేరు. అభిమాని దేవత కవి యాశ్రయమ్మైనది గనుక అం దధివసించు నగ్న్యాదులు దేవతలు, అందుచే వారి కధిదైవములని పేరు. ఆ దేవతల యంశములని వేసినందుమో ఆ వాగాదుల కధ్యాత్మమని పేరు. కనుక అధిభూతము ముఖము, అధిదైవ మగ్ని, ఆధ్యాత్మము వాక్కు, ఇట్లే తక్కినవాని నర్థమొనర్చికొనవలెను. విరాట్పురుషునకు అక్షు లేర్పడినవి. ఆ స్థానములను లోకపాలకుఁడైన సూర్యుఁడు ప్రవేశించినాఁడు అతని యంశము చక్షురింద్రియము. ఇతని సహాయముతో జీవునకు రూప జ్ఞాన మేర్పడెను. విరాట్పురుషునకు త్వక్కు ఏర్పడినది. లోకపాలకుఁడైన వాయువు స్వాంశమ్మైన ప్రాణముతో త్వగింద్రియమును బ్రవేశించెను. దీని సాయముతో జీవుఁడు మృదుకాఠిన్యాదుల నెఱుఁగును.

215. స్పర్శేంద్రియుగతుండు = స్పర్శేంద్రియమును బొందినవాఁడు. వృథగ్భావంబులగు = వినిర్భిన్నములైనవి. శ్రోత్రంబులన్ = కర్ణములయందు. అచ్యుతకళాంశంబులు = అచ్యుతుని కళలు. శ్రవణేంద్రియ యుక్తంబులై = శ్రవణేంద్రియముచేఁ గూడికొన్నవై. నిజస్థానంబులన్ పొందినన్ = తమ స్థానములను బొందఁగా లోకపాలుండగు వరుణుండు అందున్ ప్రవేశించి రససేంద్రియంబుచేన్. ప్రవేశించినన్ తాలు వేర్పడినది. లోకపాలకుఁడైన వరుణుఁ డక్కడ ప్రవేశించెను. రసనేంద్రియమే యాతనియంశ. దానిచే జీవునకు రసజ్ఞాన మేర్పడినది. నాసికేంద్రియంబు = నాసాపుటములు. అశ్వినేయ + అధిష్ఠానంబై = అశ్వినీదేవతల కాధారమ్మై. ఘ్రాణాంశంబున్ పొందినన్ = ఘ్రాణమను తన యంశముచేత నాసికాద్వారముల నాశ్రయింపఁగా, ఇచ్చట నాసిక ఇంద్రియము. అశ్వినీకుమారులు దేవతలు. ఘ్రాణ మన్నది వారి యంశము. ఇట్లే తక్కిన చోటులఁ జూచికొనవలెనని వెనుకఁ జెప్పినాము. ఏర్పడిన చర్మమునందు ఓషధులు ప్రవేశించెను. వాని యంశములు రోమములు. త్వక్కుఇంద్రియము ఓషధులు దేవతలు, దీనిచేత మానవుఁడు కండువు నెఱుఁగును. త్వగింద్రియమునకు స్థానభేదత్వము చేత విషయద్వయత్వము. అట్లే మేఢ్రము భిన్నమైనది. ప్రజాపతి దానిని బొందెను. అతని యంశము రేతస్సు. దానిచే మానవుఁడు రత్యానందము నందును. గుదము భిన్నమైనది. మిత్రుఁ డనెడు దేవత వాయువను దన

యంశముతో దానినిఁబ్రవేశించెను. తత్ఫలముగా మలవిసర్జన మేర్పడుచున్నది. బాహువు లేర్పడినవి. ఇంద్రుఁడు వానినాశ్రయించిన దేవత. వార్త యన్నదే యాతని యంశము. క్రయవిక్రయాదులు జీవుని కార్యములు. పాదములు వినిర్భిన్నములు. విష్ణువు వానిలోఁ బ్రవేశించెను. గతియే వాని దానిచే యంశ జీవుఁడు గంతవ్యము నందుచున్నాఁడు. గమనాగమనము లతని క్రియలని భావము. హృదయము భిన్నమైనది. మనస్సుతోఁ గలసి చంద్రుఁడందుఁ బ్రవేశించెను. దానితో జీవునకు సంకల్పవికల్పము లేర్పడినవి. అహంకారము భిన్నమయ్యెను. అహంకృతితోఁ గూడినవాఁడై రుద్రుఁడందుఁ బ్రవేశించెను. ఆ యహంకారముతో జీవుఁడు కర్తవ్యములు నడపును. బుద్ధి యేర్పడినది. వాగీశ్వరుఁడు దాని నాశ్రయించినాఁడు. బోధ యాతని యంశము. అందుచే జీవుఁడు బోద్ధవ్యములను గమనించును. చిత్తము భిన్నమైనది. దీనిని మూలము సత్త్వమని పేర్కొన్నది. బుద్ధి, చిత్తము ఈ రెంటి కభేద ప్రతిపత్తితో నిట్లు నిర్దేశించుట జరగినది. దానిని బ్రహ్మదేవుఁ డాక్రమించెను. ఆతనియంశము చేతన. దానితో ప్రాణి విజ్ఞానము నందుచున్నాఁడు. విరాట్పురుషుని శీర్షము నుండి స్వర్గ మేర్పడినది. పాదముల నుండి భూమి, నాభి నుండి గగనము గల్గినది. ఉత్కృష్టమైన సత్త్వగుణముతో దేవత లైనారు. సత్త్వాదులైన గుణపరిణామము సురాదుల జన్మలకుఁ గారణ మైనది. రజోగుణము యొక్క యాధిక్యముతో మనుజులు భూమి నందిరి. వారి క్రియా కలాపముల కుపయోగకరములైన పశ్వాదులు గూడ ధరణియందే పుట్టెను. తామ సాధిక్యముతో భూమ్యాకాశముల మధ్య నున్న యంతరిక్షమున నున్న రుద్రపార్షదు లనఁ బడెడు భూతాదులు జన్మించెను. ముఖము నుండి వేదములు జన్మించెను.

**216.** నరవర! = పరీక్షిన్మహారాజా! వేదములును ఆ క్రియల ననువర్తించుచు వాని కాధారములైన బ్రాహ్మణులును పరమపురుషుని ముఖమునుండి పుట్టినారు, వైదికక్రియా కలాపములను నిర్వర్తించెడు నిమిత్తముగా బ్రాహ్మణుఁ డఖిలవర్ణములకును గురువుగా నైనాఁడు.

**217.** నయతత్త్వనిధీ! బ్రాహ్మణాదికమున్ = బ్రాహ్మణులు మొదలైనవారిని, తస్కరబాధన్ పొందకుండన్ = చోరాదులచేత బాధలు పడకుండ

**తాత్పర్యము** : వేదములను రక్షించు బ్రాహ్మణులు చోరాదులతో బాధలు పడకుండ వారిని రక్షించుటకై క్షత్రియులు పరమపురుషుని బాహువులనుండి యుద్భవించినారు.

**218.** కృషి....కలితంబుగన్ = వ్యవసాయము, గోవులను రక్షించుట, వ్యాపారము మొదలగు కార్యములతో, ఊరువులందున్ = తొడల నుండి, పరమేశ్వరుని యూరువుల నుండి వైశ్యులు జన్మించినారు. వారి వృత్తులు కృషి గో రక్షణాదులు.

**219.** సేవకధర్ములై = తక్కిన జాతులను సేవించుటయే ధర్మముగాఁ గలవారై , విహితకర్మము = తమ తమ జాతులకు విధించిన కార్యము, అలరన్ చేయుచున్ = ఆచరించుచు.

**తాత్పర్యము** : శూద్రులకు వారి పైజాతులను సేవించుట కర్తవ్యము. ఈ నాల్గవజాతి తక్కినవారి విహితకర్మములను సేవావృత్తితోఁ గా పాడుచుండిరి. అందుచే వీరు తక్కినవారి ధర్మములకు సంరక్షకులు. ఇది వారికి నీచత్వముగాదు, రక్షకత్వము.

**220.** తగిలిభజింతురు = గొప్ప యాసక్తితో సేవింతురు, నిగమోక్తిన్ = వేదానుసారముగా, భక్తియోగ నిపుణాత్మకులై = భక్తి యోగముతోఁ గూడినవారై.

**తాత్పర్యము** : ఈ వర్ణము లన్నియును వారి వారి ధర్మముల ననుష్ఠించుట చేతఁ బరమేశ్వరుని సేవింతురు. వారు తమ విహితధర్మముల ననుసరించుటయే భగవంతునకు వా రొనర్చెడి సేవ యని తెలియవలెను.

**221.** కాలకర్మస్వభావశక్తిసంయుక్తుఁడు = కాలము, కర్మము, స్వభావము ననెడు నీ శక్తులచేఁ గూడినకొన్న పరమేశ్వరుని యోగమాయా ప్రకారమును ఎవ్వఁడు సంపూర్ణముగా నెఱిఁగి నుతించుటకు శక్తి గల వాఁడగును? భగవంతుని యోగమాయకు ముప్విధములైన శక్తులున్న వని తాత్పర్యము. అవి కాలము, కర్మ, స్వభావము అనునవి. ఈ మూఁడు శక్తులతోఁగూడినదే భగవంతుని యోగమాయ. ఇతర దేవతల మాయలకును భగవంతుని యోగమాయకును గొప్ప భేద మున్నది.

222. అన్యకథానులాపములు = ఇతర విషయములకు సంబంధించిన కథలు, అహర్నిశమున్ = అనఁగా రాత్రింబగళ్ళు, ఆత్మశోభన విలీనత = తన సహజగుణము మరుగగుట, సౌజన్యమున్ =సుజనత్వమును, సన్మాన్యచరిత్రమై = గౌరవింపఁదగిన చరిత్రలు గల.

**తాత్పర్యము** : ఇతర విషయములకు సంబంధించిన కథలు, వర్ణించి, పఠించి, జిహ్వ మాలిన్యమును బొందినది. తన సహజగుణసార్థక్యమును బొందలేక పోయినది. నేఁడు హరిగుణకథాకథనముతో సార్థకమైనది.

223. హరినామాంకిత = హరినామముచేఁ గూడిన, సత్కథామృత = చక్కని చరిత్రలయొక్క, రసవ్యాలోలుఁడు = రసము నందునిమగ్నుడైనవాఁడు, అసత్కథాలవణవాః పూరంబు = ఇతరకథలనెడు ఉప్పునీటిని క్రోలునే = పానము సేయునా? వరమందార...ద్విరేఫంబు = కల్పవృక్షముల తేనెను గ్రోలుట యందాసక్తి గల తుమ్మెద, నేలవేములకున్ = నేలయందు ప్రాకెడి చేదుచెట్లకు, తద్గంధ + అనుమోదాత్మమై = దానిగంధముచే నాకర్షింపఁ బడినదై, పోవునే?

**తాత్పర్యము** : భగవంతునకు సంబంధించిన సత్కథలు వినుటయం దానక్తిగల సజ్జనుఁడు ఇతరకథల జోలికిపోఁడు. హరికథ లమృతము వంటివి. ఇతరకథ లుప్పు నీటి వంటివి. కల్పవృక్షమందలి తేనెలతో సంతోషపడెడి తుమ్మెద చేదు వాసనలుగలచెట్ల జోలికి పోవునా? వాని వాసనలు దాని నాకర్షించునా?

పై పద్యమంతయు నమాత్యునిదే యని చెప్పవచ్చును.

" ఏకాంతలాభం వచనో-నుపుంసాం

సుశ్లోకమౌళేర్గుణవాదమాహుః"

- అని మాత్రమే మూలము. వీని నాధారముగాఁ బోతన్న మనోహరమైన మత్తేభమును గూర్చినాఁడు. భక్తివిషయము వచ్చినపు డంతయు నాతఁడిట్లే విజృంభించును. "చేఁతివేము" - "నేలవేము" అని అకాడమీ ప్రతిలో పాఠభేదము లున్నవి. ఈ రెండు కూడ నాకర్థముగాలేదు. ఏదో చేదు చెట్టని వ్యాఖ్యానించినాను. చేదువేము గావచ్చునేమో! ద్విరేఫ మనఁగా

తుమ్మెద. రెండురేఫములు గలది యని యర్థము. తద్వాచకమైన భ్రమరమునందును రెండురేఫములున్నవి గదా! రెండు రేఫములచే జెప్పఁబడు ఒకానొక శబ్దముచేఁ జెప్పఁబడునదియని యర్థము. దీనిపై నలంకార శాస్త్రములో లక్షణానిరూపణములో నీ విచారమున్నది. ఆసక్తి గలవారు దానిని జూచికొనవచ్చును.

224. హరిమహిమను సంపూర్తిగా నాతని నాభికమలమునఁబుట్టిన బ్రహ్మయే యెఱుఁగలేఁడు. ఇఁక నితరుల విషయముఁ జెప్పనేల?

225. శ్రుతులు = వేదములు.

**తాత్పర్యము** : శ్రుతులు గూడఁదమలోఁ దాము విచారించికొన్నవి. వానికిని నాతని మహిమ మంతుచిక్కలేదు. పరమోత్తమ కీర్తియుక్తుఁడాతఁడు. సకల దేవతాస్తుత్యపాదాంబుజుఁడు. పరిశుద్ధమైన బుద్ధిగల మహర్షులకుఁ గూడ నాతని మహిమ దెలియరాదు.

226.కం. పరిమితిలేమిన్ = అవధి లేనందుచేత, హరియున్ తనమాయాగతిన్, పరికించియున్ = విమర్శించికొనియును, కానఁడయ్యెన్ = తెలిసికొనలేకపోయినాఁడు, చతురాస్యాదుల్ = బ్రహ్మ మొదలైనవారు.

**తాత్పర్యము** : నిరవధికమైనందుచేత నతఁడు తనయోగమాయాశక్తి యెంతటిదో తెలియలేకపోయినాఁడు. పరమేశ్వరునకే యర్థముగాని యోగమాయా ప్రభావమును జతురాస్యాదులెట్లు గ్రహింపనేర్తురు? "ఇది యాతని సర్వజ్ఞతకు లోపము కాదా?" ఈ విషయమును విజయధ్వజవ్యాఖ్యలో వివరించినాను. చూచికొనవచ్చును.

227. కం. భగవంతుని పాదముగళము మహిమను సంపూర్ణముగా నింద్రుఁ డెఱుఁగలేఁడు. మహదాదులకుఁ దెలియదు. దిక్పతులు గ్రహింపలేరు, బ్రహ్మకుఁదెలియదు. రుద్రుఁడూహింపలేఁడు. అట్టి యా పరమేశ్వరుని పాదయుగ్మమునకు నమస్కారము.

**ఇదు పుట్టపర్తి నారాయణ దాసవిరచిత**
**భాగవత సుధాలహరి యందు ఆఱవయధ్యాయము.**

# సప్తమోఽధ్యాయః

శ్రీశుక ఉవాచ

శ్లో. ఏవం బ్రువాణం మైత్రేయం ద్వైపాయన సుతో బుధః,
ప్రీణయన్నివ భారత్యా విదురః ప్రత్యభాషత. 1

విదుర ఉవాచ

శ్లో. బ్రహ్మన్! కథం భగవతః చిన్మాత్రస్యాఽవికారిణః,
లీలయా వాపి యుజ్యేర న్నిర్గుణస్య గుణాః క్రియాః. 2

క్రీడాయా ముద్యమోఽర్భస్య కామ శ్చిక్రీడిషాఽన్యతః,
స్వత స్తృప్తస్య చ కథం నివృత్తస్య సదాఽన్యతః. 3

అస్రాక్షీద్భగవాన్ విశ్వం గుణమయ్యాఽఽత్మ మాయయా,
తయా సంస్థాపయత్యేత ద్భూయః ప్రత్యభిధాస్యతి. 4

దేశతః కాలతో యోఽసా వవస్థాత స్స్వతోఽన్యతః,
అవిలుప్తావబోధాత్మా స యుజ్యేతాజయా కథమ్. 5

భగవానేక ఏవైష స్సర్వక్షేత్రే ష్వవస్థితః,
అముష్య దుర్భగత్వం వాక్లేశో వా కర్మ భిః కుతః. 6

ఏతస్మి న్మే మనో విద్వన్ ఖిద్యతేఽ జ్ఞానసంకటే,
తన్నః పరాణుద విభో కశ్మలం మానసం మహత్. 7

శ్రీశుక ఉవాచ

శ్లో. స ఇత్థం చోదితః క్షత్త్రా తత్త్వజిజ్ఞాసునా మునిః,
ప్రత్యాహ భగవచ్చిత్తః స్మయన్నివ గతస్మయః. 8

మైత్రేయ ఉవాచ

శ్లో. సేయం భగవతో మాయా య న్నయేన విరుధ్యతే,
ఈశ్వరస్య విముక్తస్య కార్పణ్య ముత బంధనమ్. 9

యదర్థేన వినా పుంసో మృషైవాత్మ విపర్యయః,
ప్రతీయేత ఉపద్రష్టుః స్వశిరశ్ఛే దనాదికః. 10

యథా జలే చంద్రమసః కంపాదిస్తత్కృతో గుణః,
దృశ్యతేఽసన్నపి ద్రష్టు రాత్మనోఽనాత్మనో గుణః. 11

స వై నివృత్తి ధర్మేణ వాసుదేవానుకంపయా,
భగవద్భక్తి యోగేన తిరోధత్తే శనై రిహ. 12

యదేంద్రి యోప రామోఽరాన్ దృష్టాత్మని పరే హరౌ,
విలీయంతే తదాక్లేశాస్సంసుప్తస్యే వ కృత్స్నశః. 13

అశేషసంక్లేశశమం విధత్తే, గుణానువాద శ్రవణం మురారేః,
కింవా పునస్తచ్చరణార విందపరాగ సేవా రతి రాత్మలబ్ధా. 14

విదుర ఉవాచ

శ్లో. సంఛిన్నస్సం శయో మహ్యం తవ సూక్తాసినా విభో!
ఉభయత్రాపి భగవ న్మనో మే సంప్రధావతి. 15

సాధ్వేత ద్వ్యాహృతం విద్వ న్నాత్మ మాయా యనం హరేః,
యద్భా త్యపార్థం నిర్మూలం విశ్వమూలం నయ ద్బహిః. 16

య శ్చ మూఢ తమో లోకే యశ్చ బుద్ధేః పరం గతః,
తా వుభౌ సుఖ మేధేతే క్లిశ్య త్యంతరితో జనః. 17

అర్థాభావం వినిశ్చిత్య, ప్రతీతస్యాప్య నాత్మనః,
తాం చాపి యుష్మచ్చరణ సేవయాఽహం పరాణుదే. 18

యత్సేవయా భగవతః కూటస్థస్య మధుద్విషః,
రతిరాసో భవే త్తీవ్రః పాదయో ర్వ్యసనార్దనః. 19

దురాపా హ్యల్పతపసా సేవా వైకుంఠ వర్త్మసు,
యత్రోపగీయతే నిత్యం దేవదేవో జనార్దనః 20

సృష్ట్వాగ్రే మహదాదీని, సవికారా ణ్యను క్రమాత్,
తేభ్యో విరా జ ముద్ధృత్య, త మను ప్రావిశ ద్విభుః. 21

య మాహు రాద్యం పురుషం సహస్రాంఘ్ర్యూరు బాహుకమ్,
యత్ర విశ్వ ఇమే లోకా స్సవికాసం సమాస తే. 22

యస్మిన్ దశవిధః ప్రాణః సేంద్రియార్థేంద్రియ స్త్రివృత్,
త్వయేరితా యతో వర్ణా స్తద్విభూతీ ర్వదస్వ నః. 23

యత్ర పుత్రైశ్చ పౌత్రైశ్చ నప్తృభి స్సహగోత్ర జైః,
ప్రజా విచిత్రాకృతయ ఆసన్ యాభి రిదం తతమ్. 24

ప్రజాపతీనాం సపతి శ్చక్లిపే కాన్ ప్రజాపతీన్,
సర్గాంశ్చై వాను సర్గాంశ్చ మనూన్ మన్వంతరాధిపాన్. 25

ఏతేషా మపి వంశ్యాంశ్చ వంశాను చరి తాని చ,
ఉపర్యధశ్చ యే లోకా భూమే ర్మిత్రాత్మ జాసతే. 26

తేషాం సంస్థాం ప్రమాణం చ భూలోకస్య చ వర్ణయ,
తిర్యఙ్మనుష్య దేవానాం సరీసృప పతత్రిణామ్. 27

వదనస్సర్గ సంవ్యూహం గార్భ స్వేదాండ జోద్భిదామ్
గుణావతారై ర్విశ్వస్య సర్గస్థిత్యప్య యాశ్రయమ్
సృజతః శ్రీనివాసస్య వ్యాచక్ష్వోదార విక్రమమ్. 28

వర్ణాశ్రమ విభాగాంశ్చ రూపశీలస్వ భావతః,
ఋషీణాం జన్మకర్మాణి వేదస్య చ వికర్షణమ్. 29

యజ్ఞస్య చ వితానాని యోగస్య చ పథః ప్రభో!
నైష్కర్మ్యస్యచ సాంఖ్యస్య తంత్రం వా భగవత్స్మృతమ్. 30

పాషండప థ వైషమ్యం ప్రతిలోమ నివేశనమ్,
జీవానాం గతయో యాస్తు యావతీర్గుణ కర్మజాః. 31

ధర్మార్థకామమోక్షాణాం నిమిత్తాన్యవిరోధతః,
వార్తాయా దండనీ తేశ్చ శ్రుత స్య చ విధిం పృథక్. 32

శ్రాద్ధస్య చ విధీన్ బ్రహ్మన్ పితౄణాం సర్గమేవ చ,
గ్రహనక్షత్ర తారాణాం కాలావయవసంస్థితిమ్. 33

దానస్య తప సో వాపి యచ్చేష్టా పూర్త యోః ఫలమ్,
ప్రవాసస్థస్య యో ధర్మో యశ్చ పుంస ఉతాపది. 34

యేన వా భగవాం స్తుష్యే ద్ధర్మ యోని ర్జనార్దనః,
సంప్రసీదతి వా యేషాం ఏతదాఖ్యాహి మేఽనఘ! 35

అనువ్రతానాం శిష్యాణాం పుత్రాణాం చ ద్విజోత్తమ!
అనాపృష్టమపి బ్రూయు ర్గురవో దీనవత్సలాః. 36

తత్త్వానాం భగవం స్తేషాం కతిధా సంప్రతి క్రమః
తత్రేమం క ఉపాసీర న్క ఉ స్విదనుశేరతే. 37

పురుషస్య చ సంస్థానం స్వరూపం వా పరస్య చ,
జ్ఞానం చ నైగమం యేన జ్ఞానం యద్గురు శిష్యయోః. 38
నిమిత్తాని చ తస్యైవ ప్రోక్తాన్యనఘసూరిభిః,
స్వతో జ్ఞానం కుతః పుంసాం భక్తిర్వైరాగ్య మేవ వా. 39
ఏతా న్మే పృచ్ఛతః ప్రశ్నాన్ హరేః కర్మ వివిత్సయా,
బ్రూహి మేఽంధస్య మిత్రత్వా దజయానష్ట చక్షుషః 40
సర్వే వేదాశ్చ యజ్ఞాశ్చ తపో జ్ఞానాని చానఘ,
జీవాభయ ప్రదానస్య న కుర్వీరన్ కళామపి. 41

శ్రీశుక ఉవాచ

శ్లో. స ఇత్థ మాపృష్ట పురాణ కల్పః కురుప్రధానేన ముని ప్రధానః,
ప్రవృద్ధహర్షో భగవత్కథాయాం సంచోదితస్తం ప్రహస న్నివాహ. 42

ఇతి శ్రీమద్భాగవతే, తృతీయస్కంధే, సప్తమోఽధ్యాయః.

అర్థములు :

1. శ్లో. ద్వైపాయన సుతః=వ్యాసపుత్రుడును, బుధః=జ్ఞానియునైన, విదురః = విదురుఁడు, ఏవం బ్రువాణం=ఇట్లు పలుకు చున్న, మైత్రేయం = మైత్రేయమహామునిని, భారత్యా=వాక్కుచేత, ప్రీణయన్నివ=సంతోషపఱచు చున్న వానివలె, ప్రత్యభాషత=బదులు పలికెను.

తాత్పర్యము : శుకబ్రహ్మ యన్నాఁడు. మాయాగుణ సాహచర్యము చే లీల గామాత్రమే భగవంతుఁడు సృష్ట్యాదుల నొనర్చునని వచించిన మైత్రేయుని గూర్చి వ్యాసపుత్రుఁడును, విద్యాంసుఁడు నైన విదురుఁడు. ప్రార్థనారూపమైన వాక్కుతో, ప్రీతిని జనింపఁజేయుచున్నవాఁడై యిట్లు పలికెను.

2. శ్లో. విదురుఁ డన్నాఁడు. చిన్మాత్రస్య=జ్ఞానస్వరూపుఁడును నిర్గుణస్య=గుణాతీతుఁడును, అవికారిణః=వికారరహితుఁడునైన, భగవతః =భగవంతునకు, లీలయా చ అపి=లీలగా నైనను, గుణాః క్రియాః =గుణకార్యము లైన క్రియలు, కథం యుజ్యేరన్=ఎట్లు పొసఁగు చున్నవి?

తాత్పర్యము: విదురుఁడన్నాఁడు. ఓ బ్రహ్మజ్ఞాని యైన మైత్రేయా! నా సంశయమునకు సదుత్తరముఁ బడయుటకై నీ సన్నిధానమునఁ బ్రశ్నించు చున్నాను. భగవంతుఁడు చిన్మాత్రుఁడు. జన్మాది వికారవిహీనుఁడు. వానికిఁ గారణమైన గుణములతోడి సంబంధములేని వాఁడు. ఇట్టి పరమాత్ముఁడు

గుణములకార్యములైన కర్మములను ఎట్లొనర్చును? లీలార్థమైనను జన్మాది వికారము లెట్లు పొందును? ఈ ఘటనములు పరస్పరవిరుద్ధములై తోఁచుచున్నవి గదా! గుణహీనునకు గుణములును జన్మాది రహితునకుఁ గర్మములును గలవన్నప్పుడు ఆ మాట తర్కసహముగా లేదు గదా! ఈ విరోధమును బరిహరించి నాకు సమగ్రముగా విషయమును దెలుపవలెను.

3. శ్లో. క్రీడాయాం=లీలయందు, ఉద్యమః=ఉత్సాహము, అర్భస్య= శిశువునకు, చిక్రీడిషా=క్రీడయందుఁ దాత్పర్యమును, అన్యతః=ఇతరము వలన నేర్పడుచున్నది. లేక-కామః=కోరికలోఁ గలుచున్నవి. స్వతః తృప్తస్య =తన స్వరూపానందముతో నిత్యతృప్తుఁడైనట్టియు, సదా=నిరంతరమును, అన్యతః=ఇతర పదార్థము నుండి, నివృత్తస్య=నివృత్తుఁడైన వానికి, కథం=ఎట్లు పొసఁగును?

అవతారిక : భగవంతుఁడు సృష్ట్యాది వ్యాపారములను లీలగా నొనర్చుననుటయు పొసఁగనేరదు. ఎందుకనఁగా శిశువులకుఁ గ్రీడయందుఁ బ్రవృత్తి యితరబాలురసంసర్గముతో నేర్పడును, లేక స్వయముగాఁ దమకే యున్న కామము నుండి కలుగును. ఈ రెండును భగవంతునకు లేవు, అతఁడు స్వరూపానందముతోనే నిత్యతృప్తుఁడు. అట్టివాని కన్యసంసర్గము లీలార్థముగనైనను ఏర్పడదు గదా!

4. శ్లో. గుణమయ్యా=గుణరూపిణియైన, ఆత్మమాయయా=తన మాయాశక్తి చేత, ఏతత్ విశ్వం=ఈ లోకమును, భగవాన్=ఈశ్వరుఁడు అస్రాక్షీత్=సృష్టించెను, తయా=ఆశక్తి, చేతనే, సంస్థాపయతి=నిలుకడగా నుండున ట్లొనర్చును, భూయః=మరల, ప్రత్యభిధాస్యతి=లయింపఁజేయును.

అవతారిక: భగవంతునకు సంబంధించిన సంశయమును బ్రశ్నించిన తరువాత జీవసంబంధమైన సంశయమును బ్రశ్నింపఁబోవుచున్నవాఁడై, జీవసృష్టిని గూర్చి యింతకు ముందుఁ జెప్పిన విషయము ననువదించుచు నారంభించుచున్నాఁడు. సర్వేశ్వరుఁడు సత్త్వాదిగుణరూపిణియైన తనమాయాశక్తిని బ్రకాశింపఁజేసి, దానిసాయముతో నీ కన్పించుచున్న చరాచరాత్మకసృష్టిని సృష్టించును. రక్షించును, ఆ తరువాత అవస్థితమైన క్రమమునకు విపరీతమైన పద్ధతితో నాయాకార్యములను కారణద్రవ్యము లందు లయింపఁజేయును, దానితో సంహార మేర్పడును, జీవసృష్టిని గూర్చి చెప్పిన దీ పద్ధతి యే గదా!

**5. శ్లో. దేశతః=దేశనిమిత్తముగను, కాలతః=కాలము నిమిత్తముగను, అవస్థాతః=స్వభావము నిమిత్తముగను, స్వతః=తనకుఁదానైన నిమిత్తము గను, అన్యతః=అన్యసంబంధ నిమిత్తముగను. యః అసౌ=ఏ భగవంతుఁడు,**

విలుప్తావబోధాత్మా=నశింపనిజ్ఞానమే స్వరూపముగాఁగలవాఁడో, సః=ఆ భగవంతుఁడు, అజయా=మాయతో, కథం యుజ్యేత=ఎట్లు సంబంధము గల వాఁడగును?

తాత్పర్యము: దేశము, కాలము, అవస్థ, స్వయముగా నున్న ఉదాసీనత - అన్యసంబంధము ఈ యైదుగుణములతోనే - జ్ఞానమునకు వినాశ మేర్పడును. వీనిలో నొక్కదానిలోను భగవంతునకు సంబంధములేదు. వాఁడు కేవల జ్ఞాన స్వరూపుఁడు, అట్టివానికి మాయాసంబంధ మెట్లేర్పడును?

6. శ్లో. ఏకః=కేవలుఁడైయున్న, ఏషః, భగవాన్ ఏవ=ఈ భగవంతుఁడే, సర్వక్షేత్రేషు=సమస్త శరీరములందును, అవస్థితః=వసించువాఁడుగ నున్నాఁడు. అముష్య=అట్టి పరమాత్మునకు, దుర్భగత్వం వా=అభాగ్యమో, కర్మభిః=కర్మలనిమిత్తముగానున్న, క్లేశః వా=క్లేశమో, కుతః=ఎట్లేర్పడెను?

అవతారిక: అంత మాత్రమేగాదు. సమస్త జీవులును, భగవంతుని స్వరూపములే. అట్టిచో జీవునకు జన్మమరణాది స్వరూపమైన సంసార మేర్పడుటకుఁ గారణము దెలియుట లేదు అనెడు సంశయమును దెలుపుచున్నాఁడు.

తాత్పర్యము : సర్వశరీరములందును జీవరూపముగాఁ బ్రకాశించు చున్నాఁడు గదా! ఎట్లు చూచిన నతఁడు గేవలుఁడే గదా! సత్యమిట్లుండఁగా భగవంతుఁడాస్వరూపానందము నుండి భ్రంశితుఁడయ్యెడు న భాగ్యము గర్మల లో నేర్పడెడు క్లేశమును వహించుటెట్లు?

7. శ్లో. విద్వన్=ఓ సర్వజ్ఞుఁడా! ఏతస్మిన్ అజ్ఞాన సంకటే=అజ్ఞాన రూపమైన యీ సంకట మునందు, మే మనః=నామనస్సు, ఖిద్యతే=దుః ఖించుచున్నది. నః=మాయొక్క, మహత్=గొప్పదైన, మానసంతత్ కశ్మలం=మనస్సునకు సంబంధించిన యీకశ్మలమును, పరాణుద = పోఁగొట్టుము.

తాత్పర్యము: మైత్రేయ మునీ! నీవు సర్వజ్ఞుఁడవు, సర్వసమర్థుఁడవు. ఈశ్వరుని యొక్కయు, జీవుని యొక్కయు, యథార్థస్థితిని దెలియలేక నామనస్సు దుఃఖపడుచున్నది, నాకు మాత్రమే గాదు, నా వంటి యనేకుల నిది బాధించుచున్నది. మా దృశుల యీ మనఃక్లేశము నీవంటివారి యుప దేశము చేత మాత్రమే పోవునట్టిది. దయచేసి నా ప్రశ్నకు సదుత్తర మీయవలెను.

8. శ్లో. శుకుఁడన్నాఁడు. తత్త్వజిజ్ఞాసునా=తత్త్వమును దెలిసి కొన వలెనను కుతూహలము గల, క్షత్రా=విదురునిచే, ఇత్థం=ఈ ప్రకారముగా,

చోదితః=ప్రశ్నింపఁబడిన, సః మునిః=ఆ ముని శ్రేష్ఠుఁడు, భగవచ్చిత్తః =భగవంతునందు నివేశింపఁబడిన మనస్సు గల వాఁడై, గతస్మయః =ఆశ్చర్యమును బొందని వాఁడై, స్మయన్ ఇవ=మందహాసము జేయుచున్న వానివలె, ప్రత్యాహ=బదులు పలికెను.

తాత్పర్యము : శుక బ్రహ్మ యన్నాఁడు. పరమాత్మ నెఱుఁగ వలెనను కోర్కితో విదురుఁడీ రీతిగాఁ బ్రశ్నించెను, మైత్రేయున కాశ్చర్యము దోఁపలేదు. ఎందుకనఁగా, విదురుని వంటి విజ్ఞానులకును సంశయము గల్గింపఁజాలినది భగవంతుఁ డనువర్తించుచున్న లీలా వ్యాపారము. ఈ విషయము మైత్రేయుఁడెఱుఁగును. కాని యీ విషయమునకు సమాధాన మెట్లారంభింపవలెనో యను కొనుచునే వచించుచున్నాఁడు.

9. శ్లో. విముక్తస్య=నిత్యముక్తుఁడైన - ఈశ్వరస్య=సర్వేశ్వరునకు, కార్పణ్యం=దైన్యమును, విముక్తస్య=ముక్తునకు, బంధనం ఉత=బంధనము గాని, నయేన=తర్కముతో, విరుధ్యతే ఇతి యత్=విరోధించుచున్నది అనుటేదిగలదో, సా ఇయం=ఆ యీస్థితి, భగవతః మాయా=భగవంతునకు సంబంధించిన యిచ్ఛాశక్తి యే.

తాత్పర్యము : మైత్రేయుఁడనుచున్నాఁడు. వికారరహితునకుఁ గ్రియ, గుణాతీతునకు గుణములు, స్వతస్సంతృప్తుఁడు, నేకాకియు నైన వానికి లీల, జ్ఞానస్వరూపుఁడైన వానికి, యజ్ఞాన రూపమైన మాయతోడి సంబంధము, భగవదంశభూతుఁడైన జీవులకు, స్వరూప భ్రంశముతో నేర్పడెడు దైన్యము, నిత్యముక్తునకు బంధము - ఇవి పరస్పర విరుద్ధములైన స్థితులు. వీనిని సమన్వయించి కొనుట యెట్టి వానికిని గష్టమే యగుచున్నది. కాని యిట్టి విరుద్ధములైన సంగతుల నన్యోన్యము సంఘటింపఁ జేయుటయే పరమాత్ముని యిచ్ఛారూపమైన మాయా స్వరూపము. ఆ భగవదిచ్ఛయే సర్వమునకును గారణము. యుక్తి విరోధము లేక పరస్పరము సంఘటించు విషయములలో నాశ్చర్య పడఁదగిన యవసర మే మున్నది? పరస్పరము సంఘటించుట శక్యమని, బుద్ధికిఁ దోఁచెడి కార్యములను యోజింపఁ జేయుటయే యీశ్వరేచ్ఛ యొక్క మహిమ.

10. శ్లో. అముష్య పుంసః=ఈ జీవాత్మునకు, ఆత్మవిపర్యయః =స్వభావవిపరీతావస్థ అనునది, యత్=ఏదిగలదో, అది, అర్థేన వినా= పరమార్థముతోఁగూడకయే, ఉపద్రష్టుః=స్వప్నమును జూచుచున్న వానికి, స్వశిరశ్ఛేదనాదికం=తన శిరచ్ఛేదము మొదలైనది, ప్రతీయతే=కనఁ బడుచున్నది గదా!

తాత్పర్యము : యథార్థముగాఁ జూచినచో జీవునకు జన్మమరణాది బంధములు లేవు. ఉండునట్లు గన్పించుట భ్రమమూలకము, అనఁగా భ్రమతోఁ గల్పిత మన్న మాట! ఆనందస్వరూపుఁడైన జీవునకు దుఃఖము గాని, నిత్యముక్తుఁడైన యీశ్వరునియంశమైన జీవునకు జన్మము గాని, మరణముగాని, సత్యమైనది గాదు. ఉన్నవిగా దోఁచుట మిథ్యావస్తువును సత్యవస్తువుగాఁ దోఁపింపజేఁయు భ్రాంతి యొక్క ప్రవృత్తి. స్వప్నమందు పురుషుని శిరచ్ఛేదమైనట్లు గన్పించుట-మరల శిరోదర్శనము-రెండును నయథార్థములే గదా! దేహేంద్రియ అంతఃకరణాదులతో తాదాత్మ్య సంబంధముగాఁ దోఁచెడు నొకానొక భ్రాంతి మాత్రమే యిది. అట్లే జీవునకు దేహాద్యభిమానము నిమిత్తముగా జన్మాది బంధక్లేశములుండు నంతే, యథార్థములు గావు.

11. శ్లో. జలే=నీటియందలి- కంపాదిః=చలనము మొదలైనవియు, తత్కృతః గుణః=దానిచే నేర్పడెడు గుణమును, చంద్రమసః=చంద్రుని యందు, అసన్ అపి=లేని వైనను, యథాదృశ్యతే=ఎట్లు గనుపడుచున్నదో, తథా=ఆ రీతిగా, అనాత్మనః గుణాః=ఆత్మభిన్నమైన దేహాదులగుణములు, ద్రష్టుః ఆత్మనః=జీవాత్మయందు, దృశ్యతే=కనుపించుచున్నవి.

తాత్పర్యము : జీవాత్మయందు లేని కార్పణ్యభావము, జీవున కున్నట్లుగాఁ దోఁచుటవలె నీశ్వరునందు ఎందుకుఁ గన్పించుట లేదు? ఈ యాక్షేపమునకు సమాధానముగా నీ శ్లోకము చెప్పఁబడుచున్నది. ఆకాశమందున్న చంద్రుఁడు జలమందు ప్రతిఫలించును. జలములోనున్న ప్రతిబింబమునకు తరంగాదులచే చలన వలనాదు లేర్పడును. తత్కృతమైన వికారములు ఆకాశమందున్న చంద్రునిలోఁ దోఁచుట లేదు, యథార్థముగఁ జూచినచో చలనాది ధర్మము చంద్రుని యందున్నది గాదు, జలమందున్నది. ప్రతిబింబమునకు జలసంబంధ ముండుట చేత, దాని ధర్మములు ప్రతిబింబచంద్రునందున్నట్లు దోఁచును. పరమార్థచంద్రునిలో నీ ధర్మము లేవియు లేవు. అట్లే శరీరేంద్రియములకున్న సుఖదుఃఖాది భావములు జననమరణాదులు శరీరాభిమానియైన జీవునకు యథార్థముగఁజూచినచో లేవు. కాని యున్నట్లుగాఁ దోఁచుచున్నవి అసంగుఁడైన యీశ్వరునకు ఈ విధమైన ధర్మములతోడి సంబంధమే లేదు. శరీరాభిమానమే సుఖదుఃఖాది కారణము.

12. శ్లో. స వై=ఆధర్మము, నివృత్తి, ధర్మేణ=నివృత్తి ధర్మము చేతను, వాసుదేవాను కంపయా=వాసుదేవుని కరుణావిశేషము చేతను, భగవద్భక్తి యోగేన= భగవంతునందున్న తీవ్రమైన భక్తి యోగము చేతను, ఇహ=ఈ ప్రపంచమందు, శనైః=మెల్లమెల్లఁగా, తిరోధత్తే=మాయ మగును.

తాత్పర్యము : అవతారిక : యథార్థ మిట్లున్నచో నీ విపరీత భావన తొలఁగుమార్గమేది? దానికి సమాధానము, తా నొనర్చెడి సకల వ్యాపారము లును భగవత్ప్రీత్యర్థమై తత్ఫలము లన్నియు భగవంతున కర్పించు నివృత్తి ధర్మముతో చిత్తాధిష్ఠాన దేవత యైన వాసు దేవునికరుణాకటాక్ష మీ జీవాత్మునకు సిద్ధించును. క్రమముగా పరమ ప్రేమలక్షణమైన భగవద్భక్తి యోగమును లభించును. అప్పుడు దేహేంద్రియాదులం దధ్యాసముతో నేర్పడిన యాత్మవిపర్యయభావము తొలఁగును. కనుక నోర్పుతో భక్తి యోగ సంస్థితికై పురుషుఁడు ప్రయత్నింప వలెను. అట్టి యోగమే సంసారశాంతికి నేకైక మార్గమని భావము.

13. శ్లో. ద్రష్టా=ద్రష్టతోఁగూడ ఇంద్రియోపరమః=ఇంద్రియముల య నుపరతియు, పరే ఆత్మని హరౌ=పరమాత్మయైన హరియందు, యదా= ఎప్పుడు ఏర్పడునో, తదా= అప్పుడు, సంసుప్తస్య ఇవ=సుషుప్తిలో మగ్నుఁ డైన వానికి వలె, క్లేశాః=క్లేశములు, కృత్స్నశః=పూర్తిగా, విలీయంతే=లయించి పోవును.

తాత్పర్యము : అవ=భక్త్యభివృద్ధి యేర్పడినచోఁగలుగులక్షణము లేవి? భక్తి నిమిత్తముగా క్లేశము లెప్పుడు సంపూర్తిగా నశించును? దీనికి సమాధానమును వివరించుచున్నాఁడు. దేహధర్మములను స్వధర్మములుగా నెంచి యభిమానించుచున్న జీవుఁడు ఇంద్రియముల సకల వ్యాపారములను సర్వక్లేశనాశ మొనర్చు పరమాత్మయైన శ్రీ హరియం దెప్పుడు సంపూర్తిగా సమర్పించునో, అప్పుడు సమస్త దుఃఖములును లేని వగును. సుషుప్తి యందున్న మనుష్యుఁడు సకల బాహ్యేంద్రియములను మఱచి నిద్రించును గదా! అట్లే భక్తి యందు నిమగ్నుఁడైన మనుజునకు అవిద్యాదులతో నేర్పడెడు నేసంకటమును నేర్పడదు. ఇది యే పరమభక్తిలక్షణము. దీనితో డనే సమస్త క్లేశనాశన మనుభవములోనికి వచ్చును. సుషుప్తి యం దున్న మనుష్యుఁడు జాగ్రదవస్థలోనికి వచ్చినప్పుడు మరల బాహ్యావస్థలకు సంబంధించిన సుఖదుఃఖాదులు పీడింప నారంభించును. కాని భక్తి యోగముతో నశించి పోయిన యవిద్యాదులు మరల జాగృతములు గానేరవు.

14. శ్లో. మురారేః=శ్రీహరి యొక్క, గుణాను వాద శ్రవణం=గుణముల ననువదించుట, వానిని వినుట యను కార్యములందలి ప్రవృత్తి, అశేషసంక్లేశశమం=సకలదుఃఖముల వినాశమును, ధత్తే=చేయుచున్నది, తచ్చరణారవింద పరాగ సేవారతిః=ఆ భగవంతుని యొక్క పాదపద్మ మకరందాను భవ తాత్పర్యము, ఆత్మలబ్ధా=మనస్సు నందు లభించినచో పునః కుతః=మఱి పైనేమి చెప్ప వలెను?

తాత్పర్యము : ముందుఁ జెప్పిన విషయమునే యింకను విస్తరించు చున్నాఁడు. భగవద్విషయమును వినుట, దానిని గానము చేయుట యింతమాత్రమునకే సమస్తక్లేశములును నశించును. ఆ భగవత్పాద పద్మము లందు వెలుఁగుచున్న మకరందము ననుభవించెడి స్థితి - మనస్సున కేర్పడినచో నింకక్లేశాదులఁగూర్చి తలపోయుటే మున్నది?

15. శ్లో. విభో=ఓ మైత్రేయా! తవ సూక్తాసినా=నీ మధురమైన వాక్కనెడు ఖడ్గము చేత, మహ్యం సంశయః=నాసంశయము, సంఛిన్నః=వేరుతోఁ బాటు ఖండింపఁబడినది, భగవన్, మే మనః=నామనస్సు, ఉభయత్ర అపి=రెంటివిషయమందును, సంప్రధావతి=చక్కగాఁ బ్రవర్తించుచున్నది.

తాత్పర్యము : విదురుఁడన్నాఁడు -"మైత్రేయమునీ! నీ యుపదేశమను ఖడ్గము చే నాసంశయము సమూలముగ నఱుకఁబడినది. ఈశ్వరుఁడు స్వతంత్రుఁడు. జీవుఁడు పరతంత్రుఁడు. ఈ రెండు విషయములును జక్కగా నా కవగతము లైనవి. ఈ రెంటి యందును నామనస్సు నిస్సంశయముగాఁ బ్రవర్తించుచున్నది.

16. శ్లో. విద్వాన్, హరేః=హరియొక్క, ఆత్మమాయాయనం = ఆత్మ మాయ విమోహము, విశ్వమూలం=విశ్వము యొక్క ఆదికారణమును, నయద్బహిః=భగవంతునితోఁ జేరక, నిర్మూలం=కారణము లేనిదియు, అపార్థం=అర్థము లేనిదియు గానై, ఆ భాతి=ప్రకాశించుచున్న దనుట, ఏతత్= ఏదికలదో, ఆ విషయము, సాధు వ్యాహృతం=స్పష్టముగాఁజెప్పఁబడినది.

తాత్పర్యము : ఓ మైత్రేయమునీ! భగవంతుని యంశమే జీవుఁడు. ఐనను వానిని మోహ మాక్రమించి కొనుచున్నది. ఆ మోహమున కవిద్యయు దానితో జీవునకున్న సంబంధమును గారణము. దేహాదులందలి యధ్యాసముతో మోహ మేర్పడు చున్నది. ఇదిదప్ప వేఱుకారణము లేదు. ఈ యధ్యాసముచే దేహధర్మములైన సుఖదుఃఖాదులు జీవధర్మములవలె భాసించుచున్నవి. ఇందుచేతనే లోకము కార్యోన్ముఖమై ప్రవర్తించును. వాస్తవమునకు శ్రీహరికంటె భిన్నమైన పదార్థమేదియులేదు. అట్లు వేఱుగాఁ గన్పించుటలోఁ గారణము శ్రీమహావిష్ణువుయొక్క మాయా విలాసమే.

17. శ్లో. లోకే=లోకమందు, మూఢతమః=అత్యంతము మూఢుఁడు, యః =ఎవఁడు గలఁడో, బుద్ధేః=బుద్ధినుండి, పరంగతః యః=అతిక్రమించి పోయిన వాఁడెవ్వఁడో, తావుభౌ=వారిర్వురును, సుఖం ఏధేతే=సుఖముగా జీవింతురు. అంతరితః జనః=వీరిర్వురికి నడుమనున్న జనుఁడు, క్లిశ్యతి=బాధపడు చున్నాఁడు.

తాత్పర్యము : అల్పజ్ఞతతో నాకు సంశయ మేర్పడినది. క్లేశము గూడ దానిచేతనే. ఈ విషయమును సూచించుచు లోకసంప్రదాయమును జెప్పు

చున్నాఁడు. ఓ మైత్రేయా! లోకమందు నిఱు తెఱఁగుల మనుష్యులున్నారు. ఒకనికి దేహాదులం దధ్యాసము గాఢమై యుండును. అందుచేత వాని మనస్సు విషయములందు నిర్నిబంధముగాఁ బ్రవేశించుచుండును. వీఁడు పరమ మూర్ఖుఁడు. ప్రకృతితత్త్వముకంటెను., భిన్నమైన పరమ పురుషుని బొందిన వాఁడు మఱియొక్కఁడు. ఇతఁడు పరమజ్ఞాని. ఈ యిరు తెఱఁగుల మనష్యులును సుఖముగనే జీవింతురు, వీరిద్దరికిని సంశయక్లేశాదులు లేవు. వారు సుఖులే కాని వీరి మధ్యలో నున్నవాఁడు అల్పజ్ఞుఁడు. వానినే సంశయక్లేశములు పీడించును. ఈ సంశయాదులతో వాఁడీలోకము నను భవింపఁడు. ఆత్మానందాను భవము సిద్ధింపదు. అందుచే ప్రపంచమును బూర్తిగా వదల లేఁడు. నానావిధములైన సంశయములు క్లేశములు పీడించును. వీనితో నేర్పడు చున్నది దుఃఖము. పరమమూఢుఁడీవిషయము నాలోచింపనే యాలోచింపఁడు. అల్పజ్ఞునకే సమస్తమును.

18. శ్లో. ప్రతీతస్య అపి=ఉండునట్లుగాఁ దోఁచుచున్నదైనను అనాత్మనః=ఆత్మభిన్న పదార్థము యొక్క, అర్థాభావం=సరియైన యర్థము లేనిదిగా, వినిశ్చిత్య=నిశ్చయించికొని, యుష్మచ్చరణ సేవయా=నీపాద సేవ చేత, తాంచ అపి=దానిని గూడ, అహం=నేను, పరాణుదే=పోఁగొట్టు కొందును.

తాత్పర్యము : భ్రమ నశించినది. ఐనను నే నిప్పుడు బాధితాను వృత్తి అనుస్థితి యం దున్నాను. అదిగూడ గురువైన నీకటాక్షముతో నశించి పోవును అను విషయమును సూచించుచు విదురుఁడు తనకు లభించిన సంతృప్తిని వెల్లడించుచున్నాఁడు. ఆత్మేతరములైన దేహాదులతో నాత్మకు సంబంధ మున్నట్లుగాఁ దోఁచుచున్నను దేహేంద్రియాదులకుఁ బరమార్థ సత్త లేదనెడు నుపదేశమును బలముగా విశ్వసించుట చేత జనన మరణ దుఃఖాదిసంబంధము జీవాత్మకు లేదని నిశ్చయించికొన్నను "యథార్థముగా సంబంధము లేని దేహేంద్రియాదులను అనువర్తించు చున్నాను" - అనెడు రీతిలో నేను ప్రస్తుత మున్నాను. నీ పాదయుగళము నింకను సేవించి యాప్రతీతిని గూడ నేను దాఁటి పోదును. గురు వొసఁగెడు నుపదేశమందు దృఢ విశ్వాసము గల వాఁడై మనన నిధి, ధ్యానములను నిరంతర మభ్య సించుచున్న వాఁడెవఁడో వానికి ఆత్మకు దేహాది సంబంధమున్నట్లుగా దోఁచెడి ప్రతీతి గూడ లేకుండఁబోవును. అపుడు జీవుఁడు ముక్తుఁడగును. అంతవఱకు గురూపాసన యొనర్పవలసినదియే యని సారము. యథార్థముగా దేహేంద్రియాదులతో సంబంధము లేదను జ్ఞాన మేర్పడినది కాని వ్యవహారము మాత్రము వానితోడి సంబంధ మున్న దాని వలెనే గన్పించుచున్నది. అనఁగా సుఖ దుఃఖాదులందలి వ్యామోహము పూర్తిగా

నశింపలేదు. ఇట్టి స్థితినే వేదాంత శాస్త్రములో "బాధితాను వృత్తి" యందురు, పరోక్షజ్ఞానమున్న వారి జీవిత మీ రీతిగా నుండును. అపరోక్ష జ్ఞాన మేర్పడినప్పుడు దీని యొక్క రేఖా మాత్ర ముండును. ఇచ్ఛ సంపూర్ణముగా నశించును. శరీరమున్నదని యితరులకుఁ దోఁచుట యే గాని శరీరధర్మ ము లొకటియు వానిని బాధింపవు. అట్లున్నను ప్రారబ్ధ ము నాశ్రయించి శరీరమేమో యుండును, ఈ రీతిలో నున్న జీవితమే జీవన్ముక్త స్థితి. గురు కృపతో నీ స్థితిని నేను క్రమముగాఁ బొందుదునని విదురుఁడు చెప్పిన దాని సారము. విదురుఁడీస్థితి నెప్పుడో పొందినాఁడు. ముముక్షువులకై ఈ వివరణ.

19. శ్లో. యచ్ఛేవయా=ఎవరి సేవ చేత, మధుద్విషః=మధువనురాక్షసుని సంహరించిన వాఁడును, కూటస్థస్య=వికారరహితుఁడునైన, భగవతః= భగవంతుని యొక్క - పాదయోః=పాద ములందు, వ్యసనార్దనః= సమస్తవ్యసనములను నశింపఁజేయునట్టి, తీవ్రః=బలమైన, రతిరాసః= ప్రేమోల్లాసము, భవేత్=ఏర్పడునో.

తాత్పర్యము : గురుపాదసేవతోఁ బూర్ణాను భవ మేర్పడు టెట్లో చెప్పుచున్నాఁడు. సద్గురువైన మీ సేవచేత దోషములను విశేషముగా నశింపఁజేయువాఁడును, కూటస్థః=బ్రహ్మమునైన భగవంతుని పాదపద్మ ములందు పరమప్రేమము నిర్విఘ్న ముగా నేర్పడును. తాపత్రయములను సమూలముగ నశింపఁ జేసి నిరంతరపరమానంద మొసఁగు సామర్థ్యము పరమ ప్రేమ లక్షణమైన భక్తికుండును. దానితో శోకాదులు సమూలముగా నశించి ఆనందాను భవముతో జీవన్ముక్తుని స్థితి సిద్ధించును.

20. శ్లో. వైకుంఠవర్త్మసు=వైకుంఠప్రాప్తికి మార్గభూతులైన వారి యొక్క, సేవా=భజనము, అల్పతపసః=అల్పమైన తపస్సుతోఁ గూడిన వారి చేత, దురాపా=పొందుటకు సాధ్యముగానిది, హి=ఈ విషయము ప్రసిద్ధము, యత్ర=ఎవ్వరియందు, జనార్దనః=అవిద్యను సమూలముగా నశింపఁజేయు, దేవదేవః=శ్రీహరి, నిత్యం=నిరంతరమును, ఉపగీయతే=కీర్తింపఁ బడుచున్నాఁడో.

తాత్పర్యము : పరమజ్ఞానులైన సద్గురువులు భగవత్ప్రాప్తికి మార్గము ను పదేశింతురు. అట్టి వారి సేవ అల్పమైన తపస్సు గలవారికి సిద్ధింపదు. వారి సన్నిధి ప్రాప్తించినచో జీవి తరించినట్లే. వారికూటమందు అవిద్యను బూర్తిగా నశింపఁజేసి స్వరూపానంద మొసఁగు దేవదేవుఁడైన శ్రీహరికథాగానము నిరంతరమును సాగుచుండును. వానిని బానమొనర్చెడి యదృష్టము జీవున కనాయాసముగాఁ గలుగును. ఈ సిద్ధితో సంసారక్లేశము క్రమముగా నశించి యానంద ప్రాప్తి యేర్పడును. ఇది మహాత్తైన జీవుని పుణ్య

విశేషమునకు ఫలము. అల్పమైన తపస్సు గల వారికి సజ్జనసంసర్గము దొరకుట కష్టమని పైఁజెప్పిన దానికి సారము.

21. శ్లో. అగ్రే=ఆదియందు, విభుః=పరమాత్ముఁడు, సవికారాణి= వికారములతోఁ గూడిన, మహదాదిభిః=మహదాదిక తత్త్వములను, అనుక్రమాత్=క్రమప్రకారముగా, సృష్ట్వా=సృష్టించి, తేభ్యః=వాని నుండి, విరాజం=విరాట్పురుషుని, ఉద్ధృత్య=ఉద్భవింపఁజేసి, తం అను ప్రావిశత్= అతని యం దనుప్రవేశించెను.

అవతారిక : ఈ రీతిగాఁ దన మనస్సులోని శంకను బరిహరించుటకై చెప్పిన సమాధానము నభినందించుచు వేరొకవిషయమును బ్రస్తావించుటకు సంకల్పించిన విదురుఁడు సృష్టికిముందు జరిగినట్టుగా మైత్రేయుఁడు వచించిన విషయమును దా నర్థమొనర్చి కొన్న పద్ధతిని సూక్ష్మముగాఁజెప్పుచున్నాఁడు.

తాత్పర్యము : సర్వత్ర వ్యాపించి యున్న పరిపూర్ణ స్వరూపుఁడు భగవంతుఁడు ఇంద్రియాదివికారములతోఁ గూడిన మహదాది తత్త్వములను దొట్టతొలుత సృష్టించినాఁడు. ఆ తత్త్వముల సమ్మేళనము నుండి విరాట్పురుషు నేర్పఱచెను. పిదప భగవంతుఁడా విరాట్పురుషునిలోఁ బ్రవేశించినాఁడు.

22. శ్లో. యం=ఎవనిని, సహస్రాంఘ్ర్యూరు బాహుకం=వేయి పాదములు, వేయికరములు, తొడలు వీనితోఁగూడిన, ఆద్యం పురుషం= మొదటి యవతారమని, ఆహుః=పలికిరో, యత్ర=ఎవనియందు ఇమే విశ్వలోకాః=ఈ సకలోకములును, సవికాశం = ఇరుకు లేకుండ, సమాసతే= సుఖముగా వసించు చున్నవో.

తాత్పర్యము : విరాట్పురుమనందుఁబ్రవేశించిన యా స్వరూపమునకు వేయిపాదములు, సహస్రోరువులు, వేయికరములు, ముఖములు. ఇతనినే యాద్యావతారమని శ్రుతులు ఘోషించుచున్నవి, ఈ విరాట్పురుమని యందే చరాచరములతోఁ గూడిన పదునాలులోకము లుండుట. ఇవి ఒకదానితో నొకటి సంఘర్షింపక సుఖకరమైనే యవస్థితిని బొందియున్నవి, ఈ విషయమును గూడ శ్రుతులే పల్కినవి. విరాట్పురుమని శరీరము - సృష్టి లోకము, దీనిని సూచించుటకే సహస్రబాహ్వాది విశేషణము లాతనికి వాడఁబడినవి.

23. శ్లో. యస్మిన్=ఎవనియందు, దశవిధప్రాణః= పదివిధములైన ప్రాణము, సేంద్రియార్థేంద్రియః=ఇంద్రియ విషయములు, ఇంద్రియములు - వీనితోఁగూడిన, త్రివృత్=త్రిగుణాత్మకమైన సకలమును, త్వయా=నీ చేత,

ఈరితాః=చెప్పఁబడినవో, యతః=ఎవని నుండి, వర్ణాః=వర్ణము లేర్పడినవో, తద్విభూతీః=ఆ విరాట్పురుషుని విభూతులు గూడ, నః=మాకొఱకు వదస్వ=చెప్పుము.

తాత్పర్యము : ఏ విరాట్పురుషుని యందు దశవిధములైన ప్రాణాది వాయు వికారములును, జ్ఞానకర్మేంద్రియములనెడు పదియును, శబ్దాదులైన పదివిషయములును, వీనీ చేఁగూడిన త్రిగుణాత్మకమైన సకలమును వసించునో అట్టి యా విరాట్పురుషుని నుండి యే బ్రాహ్మణాది వర్ణము లేర్పడెనని యింతకు ముందుఁజెప్పితివి. ఆ విరాట్పురుషుని పద్ధతుల నింకను విస్తరించి చెప్పవలెనని యాశ. తొట్టతొలుత మహదాది తత్త్వము లుత్పన్నములైనవి. అటుపై వాని సమ్మేళనము జరగినది. సమ్మేళనముతో విరాట్పురుషుని యుద్భవ మయ్యెను. తదనంతరమందు భగవంతుఁడు ప్రవేశించినాఁడు. అప్పుడు పురుషావతార మేర్పడినది. ఇదియే యాద్యమైన యవతారము. ఇంతవఱకు నేర్పడిన లీలకు సర్గమని పేరు. అటుపైఁగలిగిన బ్రహ్మాది దేవతల యుత్పత్తి రూపమైన లీలను విసర్గమందురు. ఈ విసర్గ రూపమైన లీలను విస్తరించి చెప్పవలెనని ప్రశ్న యొక్క సారము.

24.శ్లో. యత్ర=దేనియందు, పుత్రైశ్చ=పుత్రులతోను, పౌత్రైశ్చ=పౌత్రుల తోను. నప్తృభిః=పౌత్రపుత్రులతోను, గోత్రజైస్సహ=తమవంశమందు జన్మించిన వారితోను, విచిత్రాకృతయః=నానా విధములైన యాకృతులతోఁ గూడిన, ప్రజాః=ప్రజలు, ఆసన్=ఏర్పడిరో, యాభిః=ఏ ప్రజలచేత, ఇదం=ఈ సమస్త లోకమును, తతం=వ్యాప్తమై యున్నదో.

తాత్పర్యము : ఈశ్వరుని విభూతులందు, పుత్రులు, పౌత్రులు, వారి పుత్రులు, స్వగోత్రజులు - ఇట్లు నానావిధములైన యాకృతులతోఁ గూడిన ప్రజ లేర్పడిరి. వారితో లోకము పరి పూర్ణమైనది.

25. శ్లో. ప్రజాపతీనాంపతిః, సః=ప్రజాపతులకును పతియైన యతఁడు, కాన్ ప్రజాపతీన్=ఏయే ప్రజాపతులను, చిక్లిపే=కల్పించెనో, సర్గాన్ చ=సర్గములను, అనుసర్గాన్ చ=అనుసర్గములను, మనూన్= మనువులను, మన్వంతరాధిపాన్=మన్వంతరాధి పులను.

తాత్పర్యము : మరీచ్యాదులైన ప్రజాపతులకును ప్రజాపతియైన బ్రహ్మదేవుఁడు ఎవరెవరిని ప్రజాపతులనుగా నిశ్చయించెను? వారు సృష్టించిన తొమ్మిది విధములైన ప్రాకృత సర్గములను తద్భేదములైన అను సర్గములను స్వాయంభువు మొదలైన మనువులు ఆ మన్వంతరములలోఁ బరిపాలించిన రాజుల చరిత్రములను విస్తరించి చెప్పవలెను.

26,27,28. శ్లో. ఏతేషాం అపి=వీరి యొక్క, వంశాన్ చ=వంశములను, వంశ్యాను చరితాని చ=ఆయావంశము లందు జనించిన వారి చరిత్రలను, మిత్రాత్మజ=మిత్రాదేవి కుమారుఁడవైన మైత్రేయా! భూమేః=భూమి యొక్క, ఉపరి=పైనను, అధశ్చ=క్రిందను, యే లోకాః=ఏయేలోకములు, ఆసతే=ఉన్నవో, తేషాం=వాని యొక్క సంస్థాం=స్థితిని. ప్రమాణం చ=ప్రమాణమును, భూర్లోకస్య ప్రమాణం చ=భూర్లోక ప్రమాణము, వర్ణయ=వర్ణింపుము. తిర్యఙ్మానుషదేవానాం=తిర్యక్కులు,మనుష్యులు, దేవతలు వీరియొక్కయు, సరీసృప పతత్రిణాం=ప్రాకెడునవి పక్షులు మొదలైన వాని యొక్కయు, గార్భస్వేద ద్విజోద్భిజాం=గర్భము నుండి జన్మించినవి. చెమట నుండి పుట్టినవి, గ్రుడ్లనుండి యేర్పడినవి, భూమి నుండి యుద్భవించినవి-వీని యొక్క, సర్గ సంవ్యూహాం=సృష్టివిభాగమును, నః వద=మాకుఁదెల్పుము, గుణావతారైః=గుణ సన్నివిష్టములైన యవతారములలో, విశ్వస్య=లోకము యొక్క సర్గస్థిత్యప్యయాశ్రయం= సృష్ట్యాదుల కాశ్రయమై యున్న దానిని, సృజతః=సృష్టించుచున్న, శ్రీనివాసస్య=భగవంతుని యొక్క, ఉదార విక్రమం=సర్వ సాధకమైన పరాక్రమమును, ఆచక్ష్వ= చెప్పుము.

తాత్పర్యము : ఓమిత్రాదేవి కుమారుఁడవైన మైత్రేయా! వీరివంశములు వంశజుల చరిత్రలు - భూమికి - పైని క్రిందనున్న లోకముల విషయములు, లోకములు, వానిస్థితి భేదములు -వాని విస్తారము, భూలోక విస్తృతి మొదలైన విశేషములను వివరింపుము. గగన చరులైన జీవులు, మనుష్యులు, దేవతలు, సరీ సృపములు, పక్షులు, గర్భము నుండి, స్వేదము నుండి, గ్రుడ్ల నుండి, భూనిర్భేదనము నుండి జనించు వాని సృష్టి విభేదము, గుణావతారములతో లోకసృష్ట్యాదుల నడిపించు నట్టి శ్రీమహావిష్ణువు యొక్క సర్వసమర్థములైన పరాక్రమములను మాకు విస్తరించి చెప్పుము.

29,30,31,32,33,34,35. శ్లో. వితానాని=నడచెడు క్రమమును, పథః=మార్గములు, నైష్కర్మ్యస్య=ఫలకాంక్షలేని క్రియా స్వభావము, సాంఖ్యస్య=సాంఖ్యక్రమము. భగవత్ స్మృతం తంత్రం=భక్తి మార్గమును, పాఖండపథవైషమ్యం=నిరీశ్వర వాదము యొక్క దోషమును. ప్రతిలోమ నివేశనం=ప్రతిలోమ జాతుల తెఱఁగును, వార్తాయాః=కృష్యాదివ్యాపార పదతిని, దండనీతేః=దండనీతి పద్ధతిని, శ్రుతశ్చ=వేదోక్త కర్మపదతిని, పితౄణాం=పితృదేవతల యొక్క, ఇష్టాపూర్తయోః=యాగాదులు, తటాక నిర్మాణాదులు - వీని పద్ధతిని, ప్రవాసస్థస్య=దేశాంతర వాసియగు వాని ధర్మములు, ఆఖ్యాహి=వివరింపుము.

తాత్పర్యము : రూప శీల స్వభావములతో నేర్పడెడు వర్ణాశ్రమాది విభాగములను జెప్పుము. వాని వాని సంప్రదాయములను వివరింపుము.

రూపశీల స్వభావములను వ్యాఖ్యానింపుము, ఋషుల జన్మ కర్మములను దెల్పుము. వేదవిభాగమును వివరింపుము. యజ్ఞక్రమ మెట్టిది? యోగమార్గము లెట్టివి? ఫలకాంక్షారహితములైన కర్మస్వభావములను వివరింపుము.సాంఖ్య యోగ సంప్రదాయము, భక్తస్వరూపము, నిరీశ్వరవాదముతో దేశమందేర్ప డెడు క్షోభము, ప్రతిలోమజాతుల యుత్పత్తి- వీనిని వక్కాణింపుము. గుణ కర్మములతో జీవుల కేర్పడెడు స్వర్గనరకాదులను వివరింపుము, పురుషార్థ ములను, బరస్పర ఘర్షణము లేక సాధించి కొనెడు విధమును దెల్పుము. కృష్యాది విభాగములు, వాని మర్యాదలు, దండనీతి, శ్రాద్ధక్రమము, అర్యమాది పితృదేవతల యుద్భవము గ్రహనక్షత్రతారాదుల కారణముగా నేర్పడెడు కాలస్వభావము, జ్ఞానక్రమము తపస్సంప్రదాయము యాగాదులు వాపీకూపతటాకాదులు వీనీ నిర్మాణమునకు ఫలము, స్వదేశమును వీడి పోయిన వాని యాచారక్రమము, ఆ పద్ధర్మములు, ధర్మమునకు ఫల స్వరూపుఁడైన శ్రీహరి, యేధర్మములతో సంతోషించునో యట్టి పద్ధతి, యెవరిని ముఖ్యముగాఁ గటాక్షించునో వారి పద్ధతి - ఈ విషయము లన్నియు సమగ్రముగా నాకుఁ దెల్పుము.

36. శ్లో. ద్విజోత్తమ!=ఓ మైత్రేయా! అనువ్రతానాం=తన్నాశ్రయించి యున్న, శిష్యాణాం=శిష్యులకును, పుత్రాణాం చ=పుత్రులకును, దీన వత్సలాః=దీనులందుఁ దాత్పర్యము గల, గురవః=గురువులు, అనాపృష్టం అపి=ఒక విషయము నడుగకున్నను, బ్రూయుః=వారికి వారే చెప్పెదరు.

తాత్పర్యము : ఓ మైత్రేయా! నీవు సర్వజ్ఞుఁడవు. నీ కెక్కువగాఁ జెప్పవలసినది లేదు. తమ్మనుసరించు చున్న శిష్యులందును పుత్రులందును గురువులును తండ్రులును అమిత వాత్సల్యమును జూపెదరు. నిరంతరము వారి విజ్ఞానాభివృద్ధి యందే పిత్రాదుల దృష్టి యుండును. తెలిసికొన నావశ్యకమైన విషయమును వారిచేఁ బ్రశ్నింపఁబడకయు గురువు మొదలైన వారు తమకుఁ దామై యుపదేశించుటకు సన్నద్ధులై యుందురు.

37. శ్లో. భగవన్=ఓ మైత్రేయా! తత్త్వానాం తేషాం=తత్త్వముల గుంపు నందు, ప్రతి సంక్రమః=లయించుట, కతిధా=ఎన్ని రీతులుగా నుండును? తత్ర=వానిలో, కే=ఏవి, ఇమం=ఈ భగవంతుని, ఉపాసీరన్= ఉపాసించును, కే ఉస్విత్=ఏ యేవి. అను శేరతే=భగవంతుని తోఁబాటు లయించును.

తాత్పర్యము : సర్వజ్ఞుఁడవైన ఓ మునీ! పృథివి మొదలైన వాని యొక్క లయసంప్రదాయమెట్టు? ప్రళయమందు భగవంతునితోఁ బాటు ఏ యేతత్త్వములు లయించును? ఏ యేతత్త్వములు యోగనిద్రను సేవించెడు భగవంతు నుపాసించుచు నిల్చును?

39. పురుషస్య=జీవుని యొక్క సంస్థానం=తత్త్వమును, పరస్య=ఈ శ్వరుని యొక్క, స్వరూపం వా=స్వరూపమును, గురుశిష్య ప్రయోజనం=గురు

శిష్యుల సంప్రదాయమును బాలించుచున్నదైన, నైగమం=వేదముల నుండి యేర్పడెడు, జ్ఞానంచయత్=జ్ఞానమన్న దేదిగలదో (దానిని గూడఁజెప్పుమని భావము)

తాత్పర్యము : జీవుని తత్త్వమెట్టిది? ఈశ్వరుని స్వరూప మే విధము? గురుశిష్య సంప్రదాయమును బ్రతిష్ఠించి వారి యన్యోన్య మహిమను వర్ధింపఁజేయుట కు పకరించెడు వేదోక్తమైన జ్ఞాన మేవిధముది? ఈ విషయము లన్నియుఁ జెప్పుము.

39,40. శ్లో. అనఘ!=దోషరహితుఁడైనవాఁడా! తస్య=ఆ జ్ఞానమునకు, సూరిభిః=విద్వాంసులచేత, ప్రోక్తాని=చెప్పఁబడిన, నిమిత్తాని=కారణములను, పుంసాం=పురుషులకు, స్వతః=పరమార్థమైన, జ్ఞానం=జ్ఞానమును, భక్తిః=భక్తియును, వైరాగ్యం ఏవ వా=విషయ విరక్తియును, కుతః=ఎట్లేర్పడును! హరేః= విష్ణువు యొక్క, కర్మవివిత్సయా=కర్మములనుండి తెలిసికొనెడి కోరికతో, ఏతాన్ ప్రశ్నములను, పృచ్ఛతః=అడుగు చున్నట్టియు, అజయా=మాయ చేత, నష్టచక్షుషః=నశింపఁజేయఁబడిన, జ్ఞానము గలవాఁడను నైన, అజ్ఞస్య మే=అజ్ఞుఁడైన నాకు, మిత్రత్వాత్=హితకరమైన దానిని, బ్రూహి=చెప్పుము.

తాత్పర్యము : వేదము నుండి పొందఁదగిన జ్ఞానమును విద్వాంసు లక్కడక్కడ చెప్పిరి. ఆ చెప్పుటకుఁగారణ మేమి? జనులకుఁబరమార్థజ్ఞాన మెట్లేర్పడును? ఈశ్వర భక్తి యెట్లేర్పడును? విషయవైరాగ్య మేర్పడుటకుఁ గారణ మేది? శ్రీహరి సృష్ట్యాది స్వరూపములను దెలియుటకై నేనీ ప్రశ్నలను వేయుచున్నాను. మాయాశక్తితో నా జ్ఞానము నశించినది. నీ పాదపద్మములు నన్నను గ్రహించెడు బంధువుగాఁజిక్కినవి. దోషలేశమును లేక పరిశుద్ధుఁడ నైన నీవు నే నడిగిన ప్రశ్నలకు సమాధాన మిచ్చి యుత్తమ జ్ఞానమును నాకుఁ బ్రసాదింపవలెను.

41. శ్లో. సర్వే వేదాశ్చ=సమస్త వేదములు, యజ్ఞాశ్చ=యజ్ఞములు, తపోదానాని చ=తపోదానములు, అనఘ!=పాపరహితుఁడా! జీవాభయ ప్రదానస్య=జీవున కభయ మొసఁగెడు పదతిలో, కలాం అపి = అల్పాల్పమైన భాగమును గూడ, న కుర్వీరన్=పూరింపలేవు; పొందలేవు.

తాత్పర్యము : దోషరహితుఁడైన వాఁడా! సర్వవేదములను బఠించుట పఠింపఁజేయుట. సర్వయాగములను జేయుట, చేయుంచుట, సకల విధము లైన తపస్సు, దానము - వీనితో నేర్పడెడు ఫలమంతయు తత్త్వోపదేశముతో -జీవులకు సంసారభయమును దప్పించుటలో నేర్పడెడు పుణ్యములో - నల్పాల్పమును గూడఁ బోలవు. (కల యనఁగా - పదునాఱవ భాగము) అందుచే జ్ఞానాన్వేషినైన నాకు తత్త్వము నుపదేశించి సంసారభయమును

తొలఁగింపుము. "నాపృష్టఃకస్యచిద్బ్రూయాత్" - అను ధర్మ మున్నది. నేను తత్త్వాన్వేషినై నిన్నడిగితిని. కనుక - నీవు తత్త్వము నుపదేశించుట పరమ ధర్మ మనుచున్నాను.

42. శ్లో. కురుప్రధానేన=కురువంశశ్రేష్ఠుఁడైన విదురుని చేత, ఇత్థం=ఈ రీతిగా, ఆపృష్టపురాణ కల్పః=ప్రశ్నింపఁబడిన సకల పురాణ సారము గలిగినట్టి, ముని ప్రధానః=మునులలో శ్రేష్ఠుఁడైన, సః=ఆ మైత్రేయుఁడు - భగవత్కథాయాం=భగవచ్చరిత్ర యందు, సంచోదితః=చక్కగాఁ బ్రశ్నింపఁ బడినవాఁడును, ప్రవృద్ధహర్షః=ఎక్కువగా వర్ధింపఁబడిన సంతోషము గల వాఁడు నునై, ప్రహసన్నివ=చిఱునవ్వు నవ్వుచున్నవానివలె, తం=విదురుని గూర్చి, ఆహ=పలికెను.

తాత్పర్యము : శుక బ్రహ్మ యను చున్నాఁడు "కురు వంశశ్రేష్ఠుఁడైన విదురు నిచేత మైత్రేయుఁడీ రీతిగాఁ బ్రశ్నింపఁబడినాఁడు. మైత్రేయ మహాముని సకల పురాణ సారజ్ఞుఁడు. ఆతనికి విదురుని ప్రశ్నలతో గొప్ప సంతోష మేర్పడినది. కారణ మేమనఁగా నా ప్రశ్న లన్నియు హరిచరిత్రకు సంబంధించినవే. హరికథావర్ణనమున కవకాశము లభించినదని మైత్రేయు నకు గొప్ప సంతోష మేర్పడినది. ఆ సంతోషము మందహాస రూపముగాఁ బయలు పడెను. ఆతఁడు విదురునితో నన్నాఁడు ఈ సందర్భములో విదుర మైత్రేయుల సంవాదములోఁ జెప్పఁబడెడు విషయములు సూక్ష్మముగా సూచింపఁబడినవి.

# శ్రీధరీయము

శ్లో. సప్తమేసంశయచ్ఛేది ప్రతి నంద్యమునేర్వచః,
పునః క్షత్త్రాకృతానానా ప్రశ్నాః సమ్యగుదీరితాః.

సప్తమాధ్యాయమందు సంశయ వినాశక ములైన మైత్రేయుని వచనములను విదురుఁ డభినందించినాఁడు. అభినందించి మరల ననేక ప్రశ్నములు వేయుచున్నాఁడు.

1. శ్లో "అథతే భగవల్లీలా యోగమాయోపబృంహితాః" - ఇత్యాదులచేత "మాయాగుణములతో లీలామాత్రముగా భగవంతుఁడు సృష్ట్యాదుల నొనర్చుచున్నాఁ" డని మైత్రేయుఁ డన్నాఁడు. అవచనములు విని విదురుఁడా మునిని ప్రార్థనా రూపవాక్యములతో సంతోష పఱచుచున్నవానివలె పలుకుచు నాతని వచనాభిప్రాయములను సంపూర్తిగా గ్రహించి పైన ప్రశ్నించుచున్నాఁడు.

2. శ్లో. బ్రహ్మన్=ఓ మైత్రేయా! నిర్వికారుఁడైన వానికిఁ గ్రియలు నిర్గుణుఁడైన వానికి గుణములు లీలగా నైనను ఘటించు టెట్లు? ఈ ప్రశ్నతోఁ

ప్రయోజయోజన సద్భావము పరిహరింపఁబడుచున్నది. అంతే గాని వస్తువిరోధము గాదు.

3. శ్లో. అవతారిక : అర్భకుని వలె లీలగా సృష్టినొనర్చునందమా! అదియును గుదురనేరదు. వైషమ్యమున్న దనుచున్నాఁడు. ఉద్యమః =ఉద్యమయతి. ప్రవర్తయతేత్యుద్యమః=అనఁగాఁ బ్రవర్తింపఁజేయును, కామ మన్న మాట. అర్భకుఁడు గ్రీడయందుఁ బ్రవర్తించుటకుఁ గామము కారణము. అన్యతః=వస్త్వంతరము చేత అనఁగా నితరబాలకు లాడుకొనుచుండుట చేత వారినిఁజూచి యొక శిశువునకుఁ గ్రీడేచ్ఛ యేర్పడుచున్నది. ఈశ్వరుఁడు స్వతస్తృప్తుఁడు, ఆతనికిఁ గామ ముద్భవించుట కవకాశము లేదు. సదా నివృత్తుఁ డాతఁడు. అందుచే నన్యులతో సంబంధము గూడ నేర్పడదు. కనుక అసంగుఁడును అద్వితీయుఁడును నైన వానికి చిక్రీడిష యెట్లేర్పడునని ప్రశ్న.

4. శ్లో. స్మరన్ విశ్వసృజామీశో విజాపిత మధోక్షజః : " - ఇత్యాదుల చేత నవిద్యోపాధిగలిగిన జీవుని భోగార్థము ఈశ్వరుఁడు సృష్ట్యాదికము నొనర్చునని యర్థము. దానినిఁ గూడ నాక్షేపించుటకు నాయభిప్రాయము ననువదించు చున్నాఁడు. గుణమయ్యా=ఆత్మస్వరూపుఁడైన జీవునకుఁ గర్తృత్వ భోక్తృత్వాది మోహములను గల్పించు నే మాయగల దో ఆ మాయచేత నీ ప్రపంచమును సృష్టించెనని యర్థము, దీని కుపష్టంభకము గనే ప్రథమస్కంధమందు" మాయా సమ్మోహితో జీవః ఆత్మానం త్రిగుణాత్మకమ్, పరోऽపిమనుతేऽనర్థం, తత్కృతం చాభి పద్యతే".

అని చెప్పఁబడినది. ఇక్కడ గూడఁ అహో! భాగవతీమాయా - మాయినా మపి మోహినీ" - అన్నాఁడు సంస్థాపయతి=రక్షించును. ప్రత్యభిధాస్యతి. ప్రాతిలోమ్యముగాఁ దిరోహిత మొనర్చును. అనఁగాఁ గార్యద్రవ్యములను కరణ ద్రవ్యములందు లయింపఁజేయుచుఁబోవునని యర్థము, పాఠాంతరమందుఁ బ్రాతి లోమ్యముతో నాత్మ యందు ధరించునని యర్థము.

5. శ్లో. ఇదెప్పుడు ఘటించును? జీవున కవిద్యాశ్రయత్వ మున్నప్పుడు - అది యేర్పడదు గదా యనుచున్నాఁడు. దేశాదులచేత నవి లుప్తము గాని యవ బోధము గల వాఁడు జీవుఁడు. ఎందుకనఁగా వాఁడు బ్రహ్మ స్వరూపుఁడు. అట్టివాఁడు అవిద్యతో నెట్లు సంఘటితుఁడగును? దేశతః= జీవుని బోధమునకు - దీప ప్రభకువలె ప్రదేశాంతరముతో బాధ యేర్పడదు. అది సర్వగత మైనట్టిది. విద్యుత్తు వలె కాలముచే బాధింపఁబడదు. అనఁగా విద్యుత్తు నిర్ణీతకాలమందే యుండును. అట్టి స్థితి జీవుని జ్ఞానమునకు లేదు. అది నిత్యమైనది. నాశవస్థాతః=అవస్థాభేదము లో స్మృతికి వలె లోపము

లేదు. కారణ మేమనఁగా జీవునిజ్ఞాన మవిక్రియ మైనది. నస్వతః =స్వప్నమువలె స్వయముగా లోపమేర్పడుట లేదు. ఎందుకనఁగా జీవుని బోధ సత్యమైనది. న అన్యతః=ఇతరవస్తువులైన శిలాదుల చేత ఘటమునకు వలె దానికి వినాశము లేదు. అది యద్వితీయ మైనది. మఱి యిట్టి దానికి నవిద్యతో సంబంధ మెట్లేర్పడును? అని ప్రశ్న. ఇక్కడ 'అజ' యనఁగా నవిద్యయనియే యర్థము, మాయ యని గాదు. అవిద్య జ్ఞానముచే తిరోభూత మగుచున్నది, మాయ యటిదిగాదు.

6. శ్లో. అవతారిక=జీవుఁడు బ్రహ్మస్వరూపుఁడు. వానికి సంసార మేర్పడదనీ యాక్షేపించుచున్నాఁడు. సర్వక్షేత్రేష్వవస్థితః=అన్నిక్షేత్రముల యందుండి భోక్తయైనను వాస్తవమునకు జీవుఁడు చిద్రూపి. అందుచే నాతఁడు భగవంతుఁడే. బ్రహ్మకన్నను జీవుఁడు భిన్నుఁడు గాదు గదా! మఱి యిట్లుండఁగా అముష్య=జీవునకు, దుర్భగత్వం=ఆనందాది భ్రంశము కాని హేతుభూతములైన కర్మల చేతఁ గ్లేశము గాని యెట్లేర్పడును? వానికిఁ గర్మ సంబంధమే లేదుగదా! జీవునకుఁ గర్మసంబంధ మున్నదన్నచో నీశ్వరు నకుఁగూడ నాస్థితి యేర్పడవలసినదే.

7. శ్లో. అజ్ఞాన సంకటే=అజ్ఞానమను సంకటమును గూర్చి బాధపడు చున్నాఁడు దానిచే మనస్సు కశ్మలిత మైనది. అనఁగా మోహము నందినదని భావము. ఆ మోహమును, పరాణుద=పోఁగొట్టును.

8. శ్లో. చోదితః=ఆక్షేపణలచేతఁ బ్రేరేపింపఁబడిన వాఁడై, స్మయన్నివ= ఆశ్చర్యమును బ్రకటించుచున్న వాని వలె, వస్తుతస్తు గతస్మయః =ఆశ్చర్యము నొందని వాఁడై యని యర్థము.

9. శ్లో. భగవతః=అచింత్యశక్తి గల యీశ్వరుని యొక్క, సేయం మాయా=ఈ మాయ, నయేన=తర్కము చేత, విరుధ్యతే, ఇతియత్= విరోధమునే ప్రకటించుచున్నాఁడు. ముక్తస్య అవిద్యయాబంధనం=ముక్తుఁ డైన వానికి అవిద్యతోడి సంబంధము, కార్పణ్యం చ=దైన్యము.

10. శ్లో. యథార్థేన వినాఽపి=సత్యమైనది గాకున్నను అనఁగా సత్యముగా, స్వశిరశ్ఛేదన మేర్పడ కున్నను ఉపద్రష్టుః=స్వప్నమును సాక్షి భూతుఁడుగఁ జూచుచున్నట్టి, పుంసః=పురుషునకు, మమేదం శిరః ఛిన్నం ఇతి=నాతల ఖండింపఁబడినదనెడు జ్ఞానము, ఆత్మవిపర్యయః=కేవలము మృషయైనను సత్యము వలె ప్రతీయమాన మగుచున్నదో - అట్లని భావము. ఈ స్వప్నదృష్టాంతము జీవునకుఁ జెందినది.

11. శ్లో. అప్పుడీశ్వరునకుఁగూడ నీస్థితి తప్పదు గదా! దాని కుదాహర ణాంతమును జూపుచున్నాఁడు-జలే=నీటియందు ప్రతి బింబగతుఁడైన చంద్రునకు మాత్రమే జలోపాధి కృతమైన కంపాదు లేర్పడుచున్నవి. ఆ కాశస్థితుఁడైన చంద్రున కేర్పడుట లేదు. అట్లుగాక అనాత్మనః=ఆత్మభిన్న

మైన దేహాదుల యొక్క, ధర్మః=గుణము - అసన్నపి=వాస్తవమునకు లేక పోయిన ప్రతికిని, తదభిమానినః=ఆ దేహాదులం దభిమానము గల, ద్రష్టుః =భోక్తయైన, ఆత్మనః=జీవునకే యేర్పడును. ఈశ్వరున కేర్పడదని భావము.

12. శ్లో. ఈ శ్లోకములో తన్నివృత్త్యుపాయమును జెప్పుచున్నాఁడు. స వై=అనాత్మ సంబంధమైన యీ గుణము, నివృత్తి ధర్మాధికృతము చేత - అనఁగా నివృత్తి ధర్మము చేత గాని, వాసుదేవాను కంపచేతఁగాని, భగవద్భక్తి యోగముతో గాని, శనైః, తిరోధత్తే=తిన్నతిన్నగా నదృశ్య మగుచున్నది. శనైః అనుట చేత సాధనానుసారముగా నని సూచింపఁ బడినది.

13. శ్లో. అట్లైనచో సర్వానర్థనివృత్తి యేర్పడున దెప్పుడు? చెప్పుచున్నాఁడు. ద్రష్టాత్మని: అంతర్యామియైన, పరే హరౌ=పరమాత్మ యందు, ఉపరణః=ఉపరమము, ఎప్పు డేర్పడునో, ఇంద్రియోపరమః =ఇంద్రియముల నైశ్చల్య మెప్పుడు గలుగునో, తదనంతరమే, కృత్స్నశః =సంపూర్తిగా, క్లేశాః విలీయంతే=క్లేశములు నశించుచున్నవి. ఆ సర్వ క్లేశవినాశమందు దృష్టాంతమును జూపుచున్నాఁడు - సంసుప్తస్యేవ = నిదురించుచున్నవానికెట్లు సర్వేంద్రియ నైశ్చల్య మేర్పడునో అట్లని భావము. నిద్ర లేచిన తర్వాత ఆనైశ్చల్య ముండదు. అందువలన నీ శ్లోకమందలి ' యథా' శబ్దము ఇవార్థకము, అప్పుడు సర్వాత్మనా సాధర్మ్యము లేదు గదా!

14. శ్లో. భక్తి యోగముతోఁ గ్లేశని వృత్తి యెట్లేర్పడునో చెప్పు చున్నాఁడు. గుణానువాద శ్రవణం=గుణముల అనువాదమును, శ్రవణమును, అశేష సంక్లేశశమం=అశేషములైన సంక్లేశముల, శమం=వినాశమును, ఆత్మ లబ్ధా=మనస్సు నందు పొందఁబడినదై, శ్రవణ కీర్తన ములకంటెను సప్రేమధ్యానము లభించగా నేమి చెప్పవలె నని భావము.

15. శ్లో. ఇచ్చిన యుత్తరము నభినందించుచున్న వాఁడై, కృతార్థతను వెల్లడించుచున్నాఁడు. ఈశ్వరుఁడు చిద్రూపమునకంటె నభిన్నుఁడు. అట్టి ఈశ్వరునితో జగత్కర్తృత్వాది ధర్మముల కెట్లు పొత్తు? జీవునకు సంసార మెట్లేర్పడును? ఈ రెండు సంశయములు నా కుండినవి. అవిరెండును గూడ తవసూక్తం=నీ సోపపత్తికమైన వాక్యమను ఖడ్గము చేత, సంఛిన్నః=నఱుకఁ బడినవి. ఇప్పుడు నామనస్సు ఈశ్వర స్వాతంత్ర్యము జీపపారతంత్ర్య మనెడు రెండు విషయములందును, సంప్రధావతి=చక్కగాఁ బ్రవేశించు చున్నది. అనఁగాఁ జక్కగా నర్థమైన వని భావము. లేక అవి లుప్తమైన యవబోధస్వరూపుఁడైన యాత్మ - కవిద్యాబంధ మెట్లుకన్ని, వృత్తి యెట్లని సంశయము. ఉభయత్రాపి=బంధవిషయమందును మోక్ష విషయమందును నని భావము.

16. శ్లో. ఏ శ్రీహరి శక్తి గలదో ఆ శక్తి, ఆత్మమాయా=జీవవిషయకమైన మాయ - దాని యొక్క అయన మనఁగా - నాశ్రయము. దాని చేతనే దుర్భగత్వాదికము, ఆభాతి = కనుపించుచున్నది. దుర్భగత్వమనఁ గా నానందాది భ్రంశము. అదే యజ్ఞానము. ఏ రీతిగా నాభాసించుచున్నది? స్వశిరచ్ఛేదాదికము వలె నపార్థమయ్యును - యథార్థము వలెఁ గన్పించుచున్నది. విశ్వ మనఁగా దేహాది ప్రపంచము, దానికి మూలము బాహ్యమునందు లేదు. ఏ యీశ్వర తత్త్వము స్వయముగా - నిర్మూలమైనదో - ఆ యీశ్వరతత్త్వము నీకే స్పష్టముగ వ్యాఖ్యానింపఁబడినదని భావము.

17. శ్లో. అజ్ఞుఁడైన దాని వలన - నా కింతకు సంశయ ముండెనని చెప్పుచున్నాఁడు. యః మూఢతమః=దేహాద్యాసక్తుఁడైన వాఁడు, బుద్ధేః పరం=ప్రకృతికి పరుఁడైన యీశ్వరుని బొందిన వాఁడు - వారిర్వురును, సుఖముగా నుండెదరు. ఎందుకనఁగా వారికి సంశయక్లేశము లుండవు, ఎవఁడు సుఖదుఃఖాను సంధానము చేత - ప్రపంచ - అనంతరితుఁడో, స్వానందసం వేదనా భావముతో నీ ప్రపంచమును విడుచుట కెవ్వఁడు శక్తుఁడు గాఁడో - అట్టివాఁడు క్లేశము ననుభవించుచు న్నాఁడని భావము.

18. శ్లో. ప్రతీతస్యాపి అనాత్మనః=ప్రతీతము గా నుండు ప్రపంచమును అరాభావం వినిశ్చిత్య=" పదార్థము వేఱు - ప్రతీతిమాత్రమే యున్న"దని నిశ్చయించి=నేను ఆ ప్రతీతిని గూడ మీచరణ సేవచేత, పరాణుదే=పోఁగొట్టుకొందునని భావము.

19. శ్లో. తీవ్రః=దుర్వారమైనదై స్వాభావికమైన సంసారమును, అర్దయతి=నాశనము చేయుచున్నది, గావున వ్యసనార్దనము, ఇది రతిరాసః అనుటకు విశేషణము, మధువను రాక్షసుని సంహరించిన వాని యొక్క పాదముల యందలి రతిరాసము, అనఁగా ప్రేమోత్సవము. గొప్పవారి పాదసేవ దుర్లభమైనది. అట్టి మీ పాదసేవ నాచే పొందఁబడినదని భావము, వైకుంఠవర్త్మసు=వైకుంఠస్య=శ్రీమహావిష్ణువు యొక్క లేక వైకుంఠము యొక్క, వర్త్మసు=మార్గభూతులైన గొప్పవారి యందొనర్చెడి, పాదసేవా, అల్పతరసా=అల్పమైన తపస్సు చేత, దురాపా=దుర్లభమైనది, అట్లయ్యును నాచేఁబొందఁబడినది. అట్టి మహాత్సేవచేత, హరికథా శ్రవణము - తద్వారా శ్రీ హరి యందు ప్రేమ, దానితో దేహాద్యను సంధానము, క్రమముగా నశించుచున్నదని భావము.

21. శ్లో. అర్థాంతరము నడుగుటకు మూఁడు శ్లోకములలో మైత్రేయునిచేఁజెప్పఁబడిన విషయము నను వదించుచున్నాఁడు: సవికారాణి =వికారము లనఁబడెడు నింద్రియములచేఁగూడినట్టి మహదాదులను, విభుః =ప్రభువైన భగవంతుఁడు, అగ్రే=మొదట, అనుక్రమాత్ = సృష్ట్వా =

క్రమముగా సృజించి, తేభ్యః, ఉద్ధృతైః, తదంశైః=వానినుండి యుద్ధృతము లైన వాని యంశముల చేత, విరాజం సృష్ట్వా=విరాట్పురుషుని సృష్టించి, ఆ విరాట్పురుషుని యందు, అను ప్రావిశత్=ప్రవేశించెను.

22. శ్లో. విరాజపురుషుని విశేషముగా వర్ణించుచున్నాఁడు. ఇమే=ఈ, విశ్వే=సమస్తములైన, లోకాశ్చ=లోకములును, సవికాశం=ఇరుకు లేకుండ, ప్రకాశించుచున్నవో, దాని విభూతులను జెప్పుమని పై కన్వయము.

23. శ్లో. దశవిధ ప్రాణః=ప్రాణాదులైదు. నాగ, కూర్మ, కృకర, దేవదత్త ధనంజయము లైదు - ఈ విధముగా ప్రాణములు పది. సేంద్రియార్థేంద్రియః =అనుచోట - "ఇంద్రియ" - పునరుక్తి, తద్దేవతలను గూర్చి వాడఁబడినది, అర్థశబ్దము - వచనము - ఆదానాదికము మొదలైన వానినిఁదెలుపును. కనుక - ఇంద్రియైస్సహితః సేంద్రియః, అర్థ, స్సహితః సార్థః, ఇంద్రియ అధిదేవతాసహితః సేంద్రియః, అని సమాస పరికల్పనము చేయవలెను, ప్రాణము - సర్వ ఉపబృంహితమగుటచే దానికి సేంద్రియార్థేంద్రియః అనునది విశేషణముగాఁ జేయఁబడినది, అట్లే త్రివృత్=త్రివిధమైన ప్రాణము - దేనియం దున్నదో యని యన్వయము. ఇంతకు ముందు - నీ చేఁ జెప్పఁబడిన బ్రాహ్మణాది వర్ణములు దేని నుండి యుద్భూతము లైన వో తద్విభూతీః=దాని యొక్క విసర్గవాచ్యములైన బ్రహ్మాది విభూతులను గూర్చి నాకుఁజెప్పవలెనని భావము.

24. శ్లో. యాభిః=ఏ ప్రజల చేత, ఇదం విశ్వం=ఈ సమస్తప్రపంచమును, తతం=వ్యాప్తమైనదో, విచిత్రాః కృతయః=విచిత్రములైన యాకారములు గల, ప్రజాః=ప్రజలు, పుత్రాదిభిస్సహ=పుత్రాదులతోఁబాటు, యత్ర=దేని యందు, ఆసన్:ఉండిరో, తద్విభూతీర్వదస్వనః, అని వెనుక కన్వయము.

25. శ్లో. "ఏవమేతత్పురాపృష్టో మైత్రేయో భగవాన్ కిల" - అనెడు పరీక్షిత్తు ప్రశ్న కుత్తరముగా విదుర మైత్రేయ సంవాదము ప్రస్తావింపఁ బడినది. అందుచే విదురుఁడొనర్చిన ప్రశ్నలనే చెప్పుచున్నాఁడు. ఈ ప్రశ్నలు అధ్యాయనము ముగియువఱకున్నవి. కాన్ ప్రజాపతీన్=ఎవరిని ప్రజాపతులుగా నొనర్చెను. "నవవిధములైన సర్గములను, అను సర్గములను, వాని భేదములను వర్ణింపు మని యర్థము.

26. శ్లో. ఏతేషా మిత్యాది సార్థశ్లోక మొక వాక్యము. ప్రజాపతి, మను, మన్వంతరాధీపులయొక్క యుపాదానమును, వారి వంశములను, ఆ వంశము లకు సంబంధించిన చరిత్రలను, మిత్రాత్మజ=మిత్రాదేవి సుతుఁడవైన మైత్రేయా!

27. శ్లో. సర్గముల యొక్క, సంప్లూఖ్యహ మనఁగా సంవిభాగము, గార్భాండ స్వేదజోద్భిజాం=గర్భజములు - జరాయుజములు, అండజములు.

అండములనుండి గలిగిన వండజములు. ద్రవస్వేదముల నుండి జన్మించి నవి స్వేదజములు, ఉద్భిజములు.

28. శ్లో. గుణావతారైః=బ్రహ్మవిష్ణ్వాదుల చేత, సర్గస్థిత్యప్యయానాం =సర్గస్థిత్యప్యయాదుల యొక్క, సృజతః=నిర్మించుచున్నట్టి.

29. శ్లో. రూపం, లింగం, శీలం, ఆచారము, స్వభావము శమాది, యీ మూటిచేతఁగూడినదని యర్థము. స్వభావతః అను చోట తసిల్ ప్రత్యయము.

30. శ్లో. వితానాని=విస్తరములు, యోగస్య=యోగమాయాదుల యొక్కయు, భక్తి యోగము యొక్క, నైష్కర్మ్యస్య=జ్ఞానము యొక్కయు, దాని కుపాయమైన -సాంఖ్యము యొక్కయు మార్గములను, స్మృతం=భగవ న్నిర్మితమైన తంత్రమును,

31. శ్లో. పాషండుల యొక్క పంథాః=ప్రవృత్తి, అదేవైషమ్యము. ఈ పాషండులు రెండురీతులు. శివ పాషండులు, విష్ణు పాషండులు. ప్రతి లోమజులు వీరిలోఁ జేరరు, అందుచేత ప్రతిలోమ నివేశనమును వేఱుగాఁ జెప్పవలెనని తాత్పర్యము. వారి యాచారాదికమును వర్ణింపవలెనని భావము. జీవులగతు లెన్నిరీతులు? అవి గుణ కర్మజము లైనవి.

32. శ్లో. నిమిత్తాని=ఉపాయములు, అవిరోధతః=పరస్పర విరుద్ధములు గాక వ్రతము యొక్క పృథగ్విధానము వర్ణింపవలెను.

33. శ్లో. గ్రహాదుల కాల చక్ర సంస్థితిని వర్ణింపు మని భావము,

34. శ్లో. ప్రబలుఁడైన పురుషుని ధర్మమేది? ఆపద్ధర్మ మేది?

35. శ్లో. ఏ మార్గము చే భగవంతుఁడు సంతోషించును? యేషాం= యాదృశులైనవారి యొక్క ప్రవర్తనతోఁ బరమాత్ముఁడు హర్షించును?

36. శ్లో. నాచే నడుగఁబడని విషయమును గూడ నాకు యోగ్యమని నీవు తలఁచిన దానినిఁ జెప్పవలెనని భావము.

37. శ్లో. తేషాం=మహదాదితత్త్వముల యొక్క, ప్రతి సంక్రమః =ప్రళయము - ఎన్ని రీతులు? ఆ ప్రళయమందు విశ్రమించుచున్న రాజును, చామరగ్రాహిణుల వలె ఏతత్త్వములు సమీప మందున్నవై యుపా సించును? యోగనిద్రాసక్తుఁడైన వానితోఁ జేరి యేవి నిద్రించును?

38. శ్లో. జీవునితత్త్వమేది? పరమేశ్వరుని స్వరూప మెట్టిది? ఏయంశముతో వారిరువురి కైక్యము? నిగమములు, ఉపనిషత్తులు - వీనికి సంబంధించిన జ్ఞానమును గూడ వివరించి చెప్పుము,

39. శ్లో. తస్యైవ=ఉపనిత్తులకు సంబంధించిన జ్ఞానమునకు, నిమిత్తాని=సాధన ములను గూడ వర్ణింపుము. ఆ సిద్ధిగురువు లేక యేర్పడ

దను చున్నాఁడు. జ్ఞానాదిత్రికము - జ్ఞాన, భక్తి, వైరాగ్యము లన్నమాట, స్వయముగా సిద్ధింపవు.

40. శ్లో. హరేః=హరి యొక్క, కర్మ=లీలా కర్మమును దెలిసికొను నూహతో నడుగుచున్ననా ప్రశ్నలకు సదుత్తరము లిమ్ము, అజయా = మాయచేత, అమృష్టం=పరామృష్టమైన జ్ఞానచక్షువు గలిగి నట్టియు, దానిచే నంధుఁడనైన నా పాలికి నీవు మిత్రుఁడవు. అంధకారమును బోఁగొట్టు సూర్యుఁడవు, వేదాదులు సర్వమును జీవాభయ ప్రదాన పుణ్య మునకుఁ బోలవు.

41. శ్లో. పురాణకల్పః=పురాణప్రసిద్ధుఁడైన వాఁడు - ఆ పృష్ట పురాణకల్పః=ప్రశ్నలకు సదుత్తరమునకై ప్రశ్నింపఁబడిన మైత్రేయుఁడు, ముని ప్రధానః=మునులలో ప్రధానమైన వాఁడు, భగవత్కథాయాం సంశోధితః=భగవత్కథా కథనమందుఁ బ్రేరేపింపఁబడిన వాఁడు, ప్రవృద్ధ హర్షః=సంతోషాధిక్యము గల వాఁడు చిఱునవ్వుచున్నవానివలె విదురునిఁ గూర్చి పలికెను,

## విజయధ్వజము

1. శ్లో. శ్రీహరియు నీ హేయమైన శరీరములో జీవునితోఁబాటున్నను, జీవుని వలె నాతని సామర్థ్యము గనపడకుండుటయు, దుఃఖము ననుభవించుటయు నెప్పటికిఁ దటస్థపడదని నీ పైని జెప్పఁబోవు విషయములందు - విదురుఁ డొనర్చెడు ప్రశ్నల నీ యధ్యాయ మందుఁ జెప్పబోవు చున్నాఁడు. ద్వైపాయనసుతః=వేదవ్యాసుల యను గ్రహముతో జన్మించిన, బుధః=విజ్ఞాని యైన విదురుఁడు, ఏవం బ్రువాణం=పైనిఁ జెప్పినట్లుగా వచించుచుండెడి, మైత్రేయం=భారత్యా=భరతుఁడని పించికొనెడు, ముఖ్యప్రాణ దేవునకుఁబ్రియమైన మాటల చేత, ప్రీణయన్నివ =సంతోషపఱచుచున్న వాని వలె, ప్రత్యభాషత=బదులు వలికెను.

2. శ్లో. "కాలవృత్త్యాంతు మాయాయాం" = అనెడు నిత్యాదిశ్లోకముల చేత, నింతకు ముందు నిర్గుణుఁడైన శ్రీహరి సత్త్వాదిగుణములనెడు నుపాదానకారణములచేత జగత్తును సృష్టించునని చెప్పినాఁడు. ఆ విషయమందు విదురుఁడు ప్రశ్నించుచున్నాఁడు. హే బ్రహ్మన్!=శమదమాది గుణములతోఁగూడిన వాఁడా! మైత్రేయునకు విశేషణము, చిన్మాత్రస్య= జ్ఞానమే శరీరముగాఁగలిగినట్టి, నిర్గుణస్య=అకారణము చేతనే సత్త్వాది ప్రాకృత గుణరహితుఁడైనట్టియు, అందువలననే - అవికారిణః=వికార రహితుఁడైన, భగవతః=ఐశ్వర్యాదిగుణములచే నిండిన శ్రీహరికి, లీలయా

చ=క్రీడకొఱకైనను, అపి=ఐశ్వర్యాదుల చేతనైనను - గుణాః =సత్త్వాదిగుణములు, క్రియాః=వానినే కారణముగా నెంచికొని యొనర్చెడు సృష్ట్యాది కార్యములును - కథం=ఎట్లు, యుజ్యేరన్=పొందుపడును? ఎటును పొందు పడవని భావము. లీలయా=అనుటచేతఁ గ్రీడార్థమై యెవ్వఁడును ముండ్లు ద్రొక్కఁడు. వానిని దూరముగనే పరిహరించి కొనునని సూచించినట్లైనది. "అపి" - అనుటచేత, "నిరనిష్టో నిరవద్యః" - ఇత్యాది శ్రుతులు ప్రాకృత గుణరహితుఁడని చెప్పుట చేత ఐశ్వర్యము చేతఁగాని ప్రాకృతగుణవిశిష్టుఁడని చెప్పుట హేయమని తెలిపినట్లైనది. కాని శ్రీహరి ప్రాకృతగుణములను గారణములుగా నుంచి కొని సృష్ట్యాదుల నొనర్చుచుండుట చేత దీనిరహస్యమును దెలుపవలెనన్నదే యీ ప్రశ్న కభిప్రాయము.

తాత్పర్యము : పరమాత్ముఁడు జ్ఞాన స్వరూపుఁడు. ప్రాకృతగుణ రహితుఁడు. నిర్వికారుఁడు. ఇట్టి వానికి సత్త్వాదిగుణనిమిత్తకములైన సృష్ట్యాదికార్యము లెట్లొడఁగూడును? క్రీడార్థమై పరమాత్మ సృష్టి యొనర్చునని చెప్పుటకుఁగాదు. క్రీడచేత సుఖించువారు అపరిపూర్ణులు. అంతమాత్రమే గాదు క్రీడ కిచ్ఛింపవలెనన్నచో వేసరిక యుండవలెను, లేక తనకు సమానుఁడైన మరియొక్కఁ డుండవలెను. శ్రీహరి స్వతస్తృప్తుఁడు గదా! అతనికి సమానుఁడు మఱియొక్కఁడు లేదుగదా! ఈ రెండు కారణము లతో నాతనికిఁ గ్రీడేచ్ఛ యేర్పడదు. మఱి క్రీడ యెచ్చట నుండి వచ్చినది? పరిస్థితి యిట్లున్నను. నాతఁడు దనకధీనమైన ప్రకృతి నుపయోగించికొని దాని రజోగుణముతో సృష్టిని సత్త్వగుణముతో పాలనను, తమస్సుతో సంహారమును ఒనర్చుచున్నాఁడు. దీని రహస్యమును దెలిపి యనుగ్రహింప వలెనని భావము.

3. శ్లో. క్రీడార్థమై భగవంతుఁడు సృష్టించెననుటలో బాధయేమి? దానికి సమాధానము. క్రీడాయాం=ఆయాటయందుండెడి. ఉత్=సుఖము, అర్హస్య= పూర్ణమైన సుఖము లేనట్టి వానికి, యుక్తమైనది (యతః) తతః నఘటయతే= అందుచేత శ్రీహరి విషయమంది యన్వయించుట లేదు, కామంయథేష్టముగా - చిక్రీడిషా=ఆడుకొనవలెనను నిచ్ఛయు, అన్యతః=వేసరికతోను - లేక సమానస్కంధుఁడైన మఱియొక్క డున్నప్పుడో యేర్పడును. ఇవి రెండును - బరమాత్మయందుఁ దటస్థింపవు, స్వతః=శబ్దముమొదలైన విషయముల నుండి యేర్పడెడు - తృప్తి కోగాక స్వాభావికముగనే, తృప్తస్య=తృప్తికి విషయమైన యానంద సముద్రము నందు మునిఁగిన దాని చేతనే, నిర్వృతస్య=రోమాంచితమైన శరీరము గల దీనితోలేక సమానస్కంధుఁడైన మఱి యొక్కఁడున్నప్పుడో యేర్పడును. ఇవి రెండును బరమాత్మయందుఁ దటస్థింపవు. స్వతః=శబ్దము మొదలైన విషయముల నుండి యేర్పడెడు

తృప్తితోఁగాక స్వాభావికము గనే తృప్త స్య=తృప్తికి విషయమైన యానంద సముద్రము నందు మునిఁగిన దానిచేతనే, నిర్వృతస్య=రోమాంచితమైన శరీరము గల దీనితో వేసరిక లేదని తెలిపిన దైనది. సర్వాత్మనః="సదేవ సౌమ్య ఇదమగ్రఆసీత్" - ఆత్మావా ఇద మేక -"ఏకఏవాగ్ర ఆసీత్"- ఏకమే వాద్వితీయం" - ఇత్యాది శ్రుతుల చేత దీనితో వేసరిక లేదని తెలిపిన దైనది, సర్వాత్మనః="సదేవ సౌమ్య ఇదమగ్ర ఆసీత్: "ఆత్మావా ఇదమేక" - ఏవాగ్ర ఆసిత్" "ఏక మేవాద్వితీయం"- ఇత్యాది శ్రుతుల చేత సమానమైన మరియొక్క పురుషుఁడు లేని ఇచ్చట - సదా ఆత్మనః అని యైనను పద విభాగముఁ జేసి కొన వచ్చును అప్పుడు - సదానిర్వృతస్య ఆత్మనః అని యన్వయము. కనుక - (సమస్త గుణపూర్ణుఁడైన దాని వలన క్రీడచే నేర్పడెడు ప్రయోజనమున కవకాశమేలేదు) అట్టి పరమాత్మకు తు=మఱి యేరీతిగా నైనను, కథం=క్రీడించునిచ్ఛయే యేర్పడనప్పుడు క్రీడార్థమై-యనుట యెట్లు పొసఁగును? "ఉద్యతోऽర్థస్య"- అని విజయధ్వజులు "ఉద్యమో అర్భస్య" - అని శ్రీధరులు. "నిర్వృతస్య" - విజయధ్వజులు. నివృత్తస్య - శ్రీధరులు.

4. శ్లో. ఈ ప్రశ్న అడుగఁదగినదే కాని పరమాత్ముఁడు సత్త్వాది గుణములతో సృష్ట్యాదుల నొనర్చిన గదా ఈ ప్రశ్న సమకూడును? నిష్క్రియుఁడని - శ్రుతి యందుఁ జెప్పుట చేత - సృష్టించుట యే పొసఁగదు అని ప్రశ్నింతువా? దానికి సమాధానము. భగవాన్=పరమాత్ముఁడు - గుణమయ్యా=సత్త్వాదిగుణాత్మకమైన, ఆత్మమాయయా=తన యధీన మైన ప్రకృతి చేత, ఇదం=ఈ ప్రపంచమును, అస్రాక్షీత్=రజోగుణముతో సృష్టించెను, భూయః=ఏతత్ తయా=సత్త్వగుణరూపమైన ప్రకృతి చేత, సంస్థాపయతి=పాలించును, భూయః=తయా=తమోరూపమైన ప్రకృతి చేత - ఏతత్=ఈ జగత్తును, ప్రత్యభిధాస్యతి=సంహరించును, అందువలన గుణక్రియాసంబంధ మున్నట్లుగాఁదోఁచుటచే విదురునకీ సంశమ మేర్పడిన దని యభిప్రాయము.

5. శ్లో. యః=ఏ భగవంతుఁడు - దేశతః=దేశము నిమిత్తము గనో, కాలతః =కాలము చేతనో, అవస్థాతః జాగ్రదవస్థ మొదలైన వానిచే తనో -స్వతః =తనకుఁ దానుగనో, అన్యతః=ఇతరకారణము తోడను, అవి ముక్తావ బోధాత్మా=నష్టముగా నట్టి జ్ఞానమే స్వరూపముగాఁగలవాఁడు. అసౌ=అట్టి పరమాత్ముఁడు, అజయా=ప్రకృతి చేత, కథం సంయుజ్యేత=ఏ విధముగా సంసరము గల వాఁడగును? యుక్తితో నాలోచించినచోఁ ద్రిగుణాత్మకమైన ప్రకృతి సంబంధము పరమాత్మ కుండుటకు వీలు లేదు. కాని సంబంధము గన్పించు చున్నది. " -తుచ్ఛేనాభ్వపిహితం" - అనెడు శ్రుతి గూడ గలదు. ఈ రెండు కారణ ముల చేత విదురు నకు సంబంధ మేర్పడు చున్నది.

6. శ్లో. మతి యొక్క కారణము చేతను విదురుఁడు సందేహించుట కవకాశమున్నదని చెప్పుచున్నాఁడు. భగవాన్=నిరంతరమును నిరతిశయమైన యైశ్వర్యముతోఁ గూడిన శ్రీహరి, ఏషః=ఇతఁడు, ఏక ఏవ=ఒక్కఁడే, సర్వక్షేత్రేషు=ఐశ్వర్యహీనములైన, దుఃఖావృతములైన సమస్త దేహములందును, అవస్థితః=ఆ మాయాదేహాభిమానియైన జీవునితోఁ గూడ నుండును. అముష్య=ఇట్టి భగవంతునకు, కర్మభిః=కర్మప్రయుక్తమైన, దుర్భగత్వం=జీవునివలె నైశ్వర్యరహితుఁడుగా నుండుటతో నేర్పడెడుక్లేశో వా=అజ్ఞాన - అస్మిత - రాగ - ద్వేష - అభినివేశములను సాంసారిక దుఃఖములైనను, కుతః=ఎట్లేర్పడును? భగవంతుఁ డగుటచే సంభవించుట లేదు. అందుచేతనే విదురునకు సందేహమేర్పడినదని భావము.

7. శ్లో. యుక్తిపూర్వకమైన యీ సందేహమును జ్ఞానముతో నివారించికొనవచ్చును గదా! అని యాశంకించికొని దృఢమైన జ్ఞానము లేక పోవుటచే నీ సందేహము బహుళముగ నన్ను బాధించుచున్నది. దీనిని దామే పోఁగొట్టవలెను. విదురుఁడను చున్నాఁడు. బ్రహ్మన్=ఏతస్మిన్, జ్ఞానసంకటే= నిశ్చితమైన జ్ఞాన స్థితిలో, జ్ఞానము లేకుండుటచే, మే మనః, ఖిద్యతే, విభో! తత్=అందుచేత, నః=మాయొక్క మానసం=మనస్సునకు సంబంధించిన, మహత్ కశ్మలం=గొప్పమోహమును, పరాణుద = పోఁగొట్టుము. సజ్జనుఁడు దనయందున్న స్వల్పదోషమును గొప్పదిగా భావించును. యథార్థముగఁ జూచినచో విదురునకున్న యీ సందేహము అంత ప్రబలమైనది. అందుచేతనే బుద్ధికి సంబంధించిన అని చెప్పక మానసికమైన దనుచున్నాఁడు.

8. శ్లో. విదురుని ప్రశ్నకు సమాధాన మారంభించుచున్నాఁడు. ఇత్థం=తత్త్వజిజ్ఞాసునా=తత్ర, చోదితః=ప్రశ్నింపఁబడిన, సః మునిః=ఆ మైత్రేయుఁడు, గతస్మయః=అహంకారము లేనివాఁడై, భగవచ్చిత్తుఁడు గ, తం=ఆ శ్రీహరియందే మనస్సు నుంచి, స్మయన్నివ=చిఱునవ్వు చున్న వానివలె, ప్రత్యాహ=బదులు పలికెను:

9. శ్లో. దుఃఖమునకాకరమైన శరీరమందున్నను దుఃఖము మొదలైన దోషములు పరమాత్మకు సంబంధింపవు. దీనికిఁ గారణ మాతని నిరతిశయమైన మహిమయే యనుచున్నాఁడు. ఈశ్వరస్య=సదా ఐశ్వర్యవంతుఁడైన పరమాత్మకు, కార్పణ్యం=దైన్యమును, విముక్తస్య=నిత్యముక్తుఁడైన వానికి, ఉత=ప్రకృతి బంధనము గూడ, విరుధ్యతే=ముక్తికిని, ఆగమమునకును విపద్ధమైనది (ఇతి) యేన=అనెడు కారణము చేతనే (తత్) అది, న్యాయం= న్యాయముగా నుండును, ఎటనఁగా - సేయం=ఈ రీతిగా దుఃఖాదుల స్పర్శ లేకుండ నుండుటయే, భగవతః=సకలైశ్వర్య సంపన్నుఁడైన శ్రీహరి యొక్క, మాయా=మహిమ. ఇక్కడ కొంతమంది యీ రీతిగా నర్థముఁ జెప్పెదరు,

"ఏది ప్రమాణము. ముక్తి, ఈ రెంటితో సిద్ధమగునో అదే పరమార్థము, అనఁగా సత్యమైన వస్తువు. ఏది యా రెంటిచేతను సిద్ధముగా నున్నను శుక్తి యందు వెండివలె తోఁచునో, అది మాయ యనిపించికొనును "అనెడు నభిప్రాయమును మనస్సు నం దుంచికొని ప్రశ్న కుత్తర మిత్తురు. "ఏది న్యాయమునకు విరుద్ధమైనదో అదే భగవంతునిమాయ" - అనఁగా అనిర్వాచ్యమైన యవిద్య. ఈ శ్లోకమందు "ఇయం" అనుట చేత నందరి యనుభవము చేతను సిద్ధమైన దీనిని లేదని చెప్పుటకు సాధ్యము గాదని సూచించిన ట్లైనది.

ఈశ్వరస్య అనెడు భాగముతో న్యాయవిరోధమును సూచించినాఁడు. "ఈ యర్థము సరిగాదని" భగవతః అనుదాని చేత సూచించిన ట్లైనది. భగవంతుఁ డనఁగా సమస్తైశ్వర్యముఁ బొందిన వాఁడని యర్థము, ఈ యర్థము ప్రమాణ సిద్ధమైనదే. ఇట్టి వాఁడు కార్యము నొనర్పవలె నన్నచో దానికి మాయ యొక్క యగత్యమే లేదు. నిజమైన సృష్టి యొనర్పలేని వారు గదా మాయా సృష్టి నొనర్చునది? "అశక్తాః కస్య సృష్టౌహి" "మాయా సృష్టిం వితన్వతే" ఇంకను - "కథం దేహే పరో దేవో నలిప్యేతేహ బంధనైః" - కథం నదుఃఖీ నభవేత్, దుఃఖీ చేదీశ్వరః కుతః" "మహిమా పరస్యైష యదేహాసోన బాధ్యతే" - మొదలైన శ్లోకములకు విరుద్ధ మగుటతో - వారి యర్థము సరిగా దనవలెను. అంతేకాక వారు "అవిలుప్తావబోధాత్మా" - అనుట కవతరణిక నిచ్చుచు ప్రకృతి సంబంధమైన దేహముండుట చేత సామాన్య మనుష్యునకు వలె మాయాసంబంధము సంభవించునను నాశంక గూడ సరిగా దను చు" అలుప్తబోధరూపత్వాత్ నాऽసౌ ప్రాకృత దేహవాన్="అనెడు నర్థమును జెప్పినాఁడు. అందుచేత మాయాసృష్టికై ప్రకృత సంబంధ మేర్పడు ననుటయు సరికాదు. "యచ్చికేత సత్యమిత్తన్న మోఘం" అనెడు శ్రుతియుఁ బరమేశ్వరుని కార్యములు సత్యములనియే చెప్పుచున్నది. ఇటున్నను సృష్టి సత్యము గా దన్నచో నది సమంజసమైన యర్థము గా నేరదు. "నచసృష్ట్యాదికం భ్రాంతి, భ్రాంతివాదాపి దానవాః", అతో భ్రాంత్యాది సంబంధో నాస్యక్వచన యుజ్యతే"-

10. శ్లో. అట్లైనచో నెవరిభ్రాంతితో సంసార మేర్పడు చున్నది? అని యాశంకించికొని ప్రకృతి సంబంధముతో భ్రాంతియుక్తుఁడైన జీవునకు సంసార మేర్పడుచున్న దని యుదాహరణ పూర్వకముగాఁ జెప్పుచున్నాఁడు - అముష్య పుంసః=ఈ జీవునకు, ఉపద్రష్టుః=స్వప్న మును జూచువానికి, అర్థేన వినా=ప్రయోజనము లేకయే, స్వశిరచ్ఛేదనాదికః=స్వప్నములోఁదన తలను గత్తరించుట మొదలైన, ఆత్మవిపర్యయః=దేహధర్మములు మొదలైనవి లేనివైనను - ప్రతీయతే యథా=ఎట్లు గన్పించునో, ఆ రీతిగా నని- ముందటి శ్లోకముతో నన్వయము, ఇక్కడ తెలిసి కొనఁదగిన యంశమిది. ఈ జన్మమందుఁగాని - గడచిన జన్మయందుఁగాని దాను జూచిన లేక విన్న శిరచ్ఛేదనము మొదలైన విషయములు జీవుని మనస్సు నందు వాసనా

రూపములై యుణఁగియుండును, శ్రీహరి దనయిచ్ఛ నిమిత్తముగా నీవాసనలనే స్వప్నపదార్థములుగాఁ జూపించును. ఇవి ఆ కాలమందు మాత్రమే యున్నను సత్యములైనవే. ఈ పదార్థములు ఒక సమయమందే యున్నవి. వీనిని జాగ్రదవస్థలోని పదార్థములుగాఁ దెలియుట మాత్రమే భ్రాంతి. దీనికి ప్రయోజనము లేదని ముందే చెప్పితిమి. స్వప్నము నుండి సుఖ దుఃఖాను భవ మేర్పడుచున్నది. అందుచే నది యసత్యము గాదు "సూచకశ్చహిశ్రుతే రాచక్షతేచ. తద్విదః" - అనుసూత్రమం దీ విషయమునే చెప్పినారు. శ్రీహరి యిచ్ఛయే నిమిత్తకారణము. జీవుని మనస్సు నందున్న వాసనలే యుపాదాన కారణము. వీని నుండి పుట్టిన స్వప్నపదార్థములు అసత్యములగుటకు వీలులేదు. వైదికాధికారమును సూచించుటకై - "పుంసః " యను చున్నాఁడు. తన యధీనమైన జ్ఞానము గాకుండుటచే - "ఉపద్రష్టు" అన్నాఁడు.

11. శ్లో. వాసనా జన్యమైన స్వప్నము అస్పష్ట మగుటచే నీ యుదాహరణముతో సంసారము సత్యమని ప్రతి పాదించుటఁ గష్టమనుకొని మఱియొక యుదాహరణము నిచ్చుచున్నాఁడు. జలే, చంద్రమసః=చంద్రుని ప్రతి బింబమునకు, తత్కృతః=నీటిచలనముతో నేర్పడెడు, గుణః=కదలాడుట మొదలైనగుణములు, సన్ అపి=ఉన్నవే, ద్రష్టుః =చూచుచున్న మనుష్యునకుఁ జంద్రుని ప్రతిబింబ మందున్నట్లు - యథా దృశ్యతే=ఎట్లు భ్రాంతిలోఁగన్పడు చున్నదో, తథా=అట్లు, ఆత్మనః =జీవునకు, అనాత్మనః=దేహము యొక్క, గుణః=జననమరణాదిగుణములు, దృశ్యతే=ఈశ్వరేచ్ఛచేత, తత్త్వజ్ఞానము లేకుండుటచే "నేను జన్మించితిని, నేను మరణించితిని, నేనే స్వతంత్రుఁడను," ఈ మొదలైన భ్రాంతి యేర్పడు చున్నది, జీవుఁడు జ్ఞాన స్వరూపుఁడు. పరమాత్ముని యిచ్ఛచేత భగవంతుఁడు స్వతంత్రుఁడు నే నస్వతంత్రుఁడను అను జ్ఞాన మేర్పడక భ్రాంతుఁడై నేనే స్వతంత్రుఁడను అని భావించును, దీనితోనే సంసార మేర్పడును, ఎఱ్ఱని పూవు యొక్క సంపర్కముతో స్వచ్ఛమైన స్ఫటికమునకు రక్త వర్ణ సంబంధ మేర్పడు చున్నది. అట్లే ప్రకృతి సంబంధముతో నేర్పడెడు సంసారము గూడ సత్యమే. ఇది అనిర్వాచ్యమైన - అవిద్యతో నేర్పడినది గాదు. అసత్యమును గాదు "భ్రాంత్యా జీవస్యసంసారః" అనెడు ప్రమాణము గూడ దీనినే చెప్పుచున్నది.

తాత్పర్యము : జీవుడు ప్రకృతి బద్ధుఁడైన వాఁడు. స్వప్నమందుఁ దనశిరస్సును ఖండించినట్లును దనశరీరము నగ్గిపైవేసి నట్లును వాఁడు దృశ్యములను వీక్షించును. ఈ స్వప్నము జీవుని వాసన నుపయోగించికొని శ్రీహరిచే సృష్టింపఁబడిన పదార్థములచే నేర్పడినది. ఆ సంఘటనములు స్వప్నమందే గన్పించినను అవినిత్యము లే కాని వానితోడి సంబంధము మాత్రము భ్రాంతి. దీనికిఁ బ్రయోజనము లేదు. నీటి యందు చంద్రుని ప్రతి

బింబము చలించుచున్న దానివలెఁగన్పడును. చలనమున్నది నీటి యందు. కాని ఆ చలనము చంద్రుని ప్రతి బింబమందున్నట్లు దోఁచుట భ్రాంతి. ఈ రీతిగనే దేహధర్మములైన జననమరణములు భ్రాంతితో నేర్పడును. ఈ భ్రాంతి జీవుఁడు సంసారి యగుటకుఁ గారణము. దీనినే బంధ మందురు. ఇది సత్యమైనదే.

12. శ్లో. సంసారము సత్యమైనచో దాని సంబంధ మెప్పుడును బోవని దగుటచే జీవునకు మోక్షమే లేదు అను దానికిది సమాధానము ఇహ=జీవనమందుఁ గన్పించెడు, సః=సత్యమైన యీ బంధము, నివృత్తి ధర్మేణ=మోక్షకారణ ధర్మ మనిపించి కొనెడు నట్టి, భగవద్భక్తి యోగేన= భగవంతునం దనుష్ఠించెడు నిరతిశయమైన భక్తితో, జాతయా=ఏర్పడినట్టి, వాసు దేవానుకంపయా= శ్రీహరికనికరమైను ప్రసాదము చేత, - శనైః=బహు జన్మముల యంతమందు క్రమముగా నని భావము. తిరోధత్తే తిరోగమించును. వై=ఇది ప్రమాణ సిద్ధము. ఎట్లు=గరుడుని ధ్యానము చేత సత్యమైన విషము గూడ నాశమగు చున్నదో అట్లు - శ్రీహరికి సంబంధించిన జ్ఞానము చేత సత్యమైన సంసార బంధము గూడ నాశమగు చున్నది. శ్రీహరి యే స్వతంత్రుఁడు అను జ్ఞానము లేక నేనే స్వతంత్రుఁడను అను నభిమాన రూప భ్రాంతి చేత నీశ్వర జ్ఞానమునుండి దూర మగుట యుక్తమే" భ్రాంతిర్విదేహోభిమతి రీశజ్ఞానాద్వినశ్యతి".

13. శ్లో. పరే=సంసార కారణమైన పాపమును బోఁగొట్టు సామర్థ్యము గల, సర్వోత్తముఁడైన, హరౌ=పరమాత్ముడు, దృష్టాత్మని సతి=అపరోక్ష జ్ఞాన విషయమైన స్వరూపము గల వాఁడు కాఁగా, శ్రీహరి యొక్క యపరోక్ష జ్ఞానము సిదింపఁగా, యదా=ఎప్పుడు, ఇంద్రియోపరామోర్థః=ఇంద్రియము లన్నియు శ్రీహరి సమీపమందు రమించుటనెడు పురుషార్థ మనిపించి కొన్న మోక్షము సిద్ధించునో - తదా=అప్పుడు, సంసుప్తస్య ఇవ=గాఢ నిద్ర యందు మునిఁగిన వాని కేర్పడునట్లుగా, కృత్స్నశః=సమస్తములైన, క్లేశాః =దుఃఖములు, విలీయంతే=నశించును. జీవునకు నిద్రావసయం దెట్లు దుః ఖము లుండవో అట్లు - ముక్తావసయందే దుఃఖము గూడ నుండదు. "యదీంద్రియోపరమోఽథ" అని శ్రీధరులు. "యదీంద్రియోపరామోఽర్థః" అని విజయధ్వజులు.

14. శ్లో. క్లేశములు నశించునను విషయముతో - న్యాయమును జూపించు నెపముతో సులభోపాయమును సూచించు చున్నాఁడు. మురారేః=గుణాను వాద శ్రవణం". (1) గుణముల నను వాద మొనర్చుటతోఁ గూడిన శ్రవణ మననాదులును, (2) గుణాను వాద మొనర్చు భాగవతము మొదలైన సచ్ఛాస్త్రముల మననమును అశేష సంక్లేశశమం=విధత్తే, శాస్త్రాది శ్రవణమే సంక్లేశశమ మైనప్పుడు గుణవ్యాఖ్యానము క్లేశనాశకము గాక యుండునా? తప్పక యగును. ఇది సిద్ధమగుటతో వేఱుగాఁ జెప్పలేదు. ఆత్మలబ్ధా=

జీవుఁడు - సాధనమూలకముగా సంపాదించిన తచ్చరణా.... రీతిః=శ్రీహరి పాద కమలముల ధూళినే సేవించెడు యాసక్తి=(అనఁగా నుపాసన) కింవా=సమస్తక్లేశములను నాశమొనర్చునని వేఱుగాఁజెప్పవలెనా? పునః =నిస్సందేహముగాఁ బోఁగొట్టును. దీని చేత శ్రవణమున కంటెను మననము; దానికన్న వ్యాఖ్యానము; వ్యాఖ్యానమునకన్న నుపాసన - ఇవి ప్రబలములని తెలిపిన ట్లైనది. ఉపాయాంతరము లేదనియు సూచితము.

15. శ్లో. అవశ్యముగా నింకను దెలుపవలసిన విషయములందు మైత్రేయముని నున్ముఖునిగా నొనర్చుటకై విదురుఁడే చెప్పిన విషయము లందేమియుఁ గొఱతఁ లేదని తన సంతృప్తిని వెల్లడించు చున్నాఁడు. విభో తవ, సూక్తాసినా, మహ్యం=నాయొక్క, సంశయః=సందేహము, దుః ఖమయమైన దేహమం దుండుట చేత శ్రీ హరికిఁగూడ దుఃఖ మేర్పడ వలెను గదా! యనెడు నపార్థజ్ఞానము - (2) అజ్ఞానము, సంఛిన్నః=సంపూర్తిగా నశించినది. అన్యథాజ్ఞానము పోయినచో నిక పై గ్రంథముతో నేమి పని? అన్నచోఁజెప్పుచున్నాఁడు. ఉభయత్ర అపి=దేహమందేర్పడెడు నహంకార మమకారములందును శ్రీహరి యందును విపరీత జ్ఞానము లేకపోవుటచే ఇదియా! అదియా! అను సందేహమందును, మే మనః=నామనస్సు భగవన్! సంప్రధావతి. ఇక్కడ - సంశయమను పదము చేత - అన్యథాజ్ఞానము - లేక యజ్ఞానమని చెప్పవలెను. అటుగాకున్నచో ఉభయత్ర అని చెప్పుట పొసఁగదు. "శిచ్" ధాతువు నుండి యేర్పడిన సంశయ శబ్ద మీ యర్థము నిచ్చును. "స్వప్నస్త్వ జ్ఞాన శబోక్తో విపరీత మథాపి చ - "మే" అని చెప్పక మహ్యం అనుటతో నీ సంశయము చాలకాలము నిలుచునది గాదని చెప్పిన ట్లైనది.

తాత్పర్యము : విదురుఁడన్నాఁడు. మైత్రేయా! మీ శ్రేష్ఠములైన మాటలు నా యన్యథాజ్ఞానమును బరిహరించినవి. నా యజ్ఞానము పోయినది. కాని యింకను నామనస్సు సంశయము వెపునకే పరుగిడు చున్నది. మీరు అపరోక్ష జ్ఞానులు. శ్రీహరి మహిమ యతని సామర్థ్యమునే యాశ్రయించినది, అని చెప్పి నా సంశయమును బోఁగొట్టినారు. ఐనను కర్మాను సారముగఁ బ్రాప్తించిన దేహమే యాత్మయనెడు జ్ఞానము గూడ సంపూర్తిగఁబోలేదు. శ్రీహరికి సంబంధించిన జ్ఞానము గూడ లేదనుటకు వీలు లేదు. కనుక నీరెంటి మధ్యలో నాహృదయ మూగులాడు చున్నది.

శ్లో. విద్వన్=హరేః, ఆత్మమాయామనం=శ్రీహరిమహిమ - అతని స్వరూపే సామర్థ్యము నాశ్రయించి యుండునని - యద్వ్యాహృతం=ఏమి చెప్పితివో, తత్=సాధు, ఐనను, అపార్థం=ప్రయోజనహీన మైనదియు, నిర్మూలం=దేహమే యాత్మయనెడు జ్ఞానము, (మనిషి) ఆభాతి=విశ్వమూలం జగత్తునకు మూలకారణమైన బ్రహ్మవస్తువుగూడ - బహిః=అ జ్ఞానమునకు

బహిర్భూతముగాన, యత్=ఏ కారణముతో ఈ రెండును - మనస్సునకుఁ దోఁచుచున్నవో, తత్=ఆ కారణముతో - నేను అంతరిత ఇవ అస్మి=రెంటి నడుమ నూఁగులాడు చున్నవానివలె నున్నాను, ఇక్కడ - ఆత్మమాయా= అనిచెప్పుటచేత మాయాశబ్దమునకు - ఇంద్రజాలమని యర్థముగాదని సూచించున దైనది.

శ్లో. ఈ విషయమునే స్పష్టపఱచుచున్నాఁడు. లోకేయశ్చ=మూఢతమః =అత్యంత జ్ఞానవివేక శూన్యుఁడో, యశ్చ=బుద్ధేః, పరం=ప్రకృతికంటె నుత్తముఁడైన పరమాత్మను, గతః=తెలిసినవాఁడో, తావుభౌ=వారిరువు రును, సుఖమేధేతే=ఒకఁడు నిద్రించుచున్న వానివలెను, వేఱొకఁడు మత్తుని వలెను క్లేశహీనుఁడై యుండును. అంతరితః=వీరిమధ్యనున్న, జనః క్లిశ్యతి= స్వప్నమును జూచువాఁడు గ్లేశపడునట్లుక్లేశమునకు వశుఁడగును. నేనుగూడ నట్లే క్లేశపడుచున్నానని భావము. 17

నీవు సంశయ గ్రస్తులలో నొకఁడ వైనచో సంశయ పరిహారము గాకుండుటచే ముక్తుఁడగునట్లు లేదు. ఎవరుతత్త్వమందు సంశయ ముక్తులో వారందఱు నరకబాధాయుక్తులే అను ప్రమాణమున శంకించి "ఇది సాఱువా! పురుషుఁడా?" యని సందేహించువాఁడు ఆప్త వచనముతోనో తన ప్రయత్నముతోనో సంశయమును బోఁగొట్టుకొని "యిది సాఱువే. పురుషుఁడు గాదు" అను నిశ్చయమును బొందునట్లు నేనును మీపాదము లను సేవించి ప్రసన్నులైన మీనుండి దేహమందున్న అహంకార మమకారములను భ్రాంతితో నేర్పడిన జీవునిస్వరూపమును విచారించుచు దీనికి ప్రయోజనములేదని నిశ్చయించి యీ యుభయ విషయకమైన జ్ఞానమును బోఁగొట్టుకొని మోక్షకారణమైన జ్ఞానమును బొందెద ననునభిప్రాయముతోఁ జెప్పుచున్నాఁడు. అనాత్మనః=దేహ సంబంధముగా, ప్రతీతస్య అపి=మోహాత్మకముగాఁ గన్పడిన అహంకారమమకారములకు, అరాభావం=జీవుఁడు జ్ఞానస్వరూపియను విచారమును జేయుచుఁ బైన చెప్పిన మోహమునకుఁ బ్రయోజనము లేదనుటను, వినిశ్చిత్య=నిశ్చయించి, యుష్మచ్చరణసేవయా=మీపాద సేవచేత, అపి=ముఖ్యముగా, తాం=ఆ సంశయమును, పరాణుదే=పోఁగొట్టుకొందును, నిశ్చయజ్ఞానము నందెదను. పరాణుదే=అను ఆత్మనే పదప్రయోగముతోఁ దత్త్వ జ్ఞానముఁ మున్నను లేదని చెప్పుచున్నాఁడని సూచించుచున్నాఁడు. శూద్రుఁ డగుటచే విదురునకుఁ దత్త్వజ్ఞానమే లేదని చెప్పుట సరికాదు. "ద్రోణ ద్రౌణి నృపాః పార్థాః భీష్మో విదురసంజయౌ, మేచాన్యే తత్ర దేవాంశాః సమ్యక్ తత్త్వాపరోక్షిణః" అనుప్రమాణముతో విదురునకుఁ దత్త్వాపరోక్ష మున్నది. అట్లైనచో విదురుఁ డసత్యము చెప్పినట్లే గదా! ఈ శంకకు సమాధానము. ప్రశ్న యొనర్చిన దానికే యుత్తర మీవలెను. విననిదానికి నుత్తర మియ్యరాదు అనెడు న్యాయముచేత "విన్నదానినే చెప్పుచున్నాఁడను" అనున్యాయము

ననుసరించి చెప్పిన యసత్యముగూడ గుణమే యగుచున్నది. "ఆత్మనస్సు గుణాభావం వదతో నత్వసత్యతా, అపృష్టస్య ధర్మార్థం చ గుణాయైవ భవత్యపి!" అనిప్రమాణము. ఈ విధమైన యసత్యము గుణమే యగుచున్నది.18

శ్లో. సంసారవ్యథను బోఁగొట్టుటచే నారాయణపాద సేవయే ప్రయోజనకారి. ఆపాద సేవతోఁ బ్రయోజనమేమి? అని యాశంకించఁగూడ దనుచున్నాఁడు, యత్సేవయా=జ్ఞానుల సేవచేత, మధుద్విషః, కూటస్థస్య=(1) చేతనా చేతన పదార్థములను నియమించుచు, సర్వులలో నున్న (2)క్రోధాది వికారములకూడి దూరమైన, భగవతః పాదయోః=తీవ్రః వ్యసనాసక్తియనెడు క్రీడ, భవేత్. 19

శ్లో. పూర్వకృతమైన పుణ్యముచేతనే తమవంటివారి పాద సేవ దొరకును. పుణ్యవంతులు గాని వారికి దొరకుట లేదని చెప్పుచున్నాఁడు. యత్ర, నిత్యం, దేవదేవః జనార్దనః ఉపగీయతే=వైకుంఠ వర్త్మసు=శ్రీహరి జ్ఞానము నుపదేశించఁగల మహనీయులందు - సేవా, అల్పతపసః దురాపా=హి. ఇది నిశ్చయము. 20

శ్లో. విభుః, సవికారాణి=పదునాఱు వికారములచేతఁ గూడిన, మహదాదీని=మహదాదులను, సృష్ట్వా=అనుక్రమాత్; తేభ్యః=వానినుండి బ్రహ్మాండమును సృష్టించి దానియందు విరాజం=బ్రహ్మను- ఉద్ధృత్య=సృష్టించి, అనుప్రావిశత్=క్రమముగాఁ బ్రవేశించెను. తత్త్వము లందు మొదట ప్రవేశము. ఆ తరువాత - బ్రహ్మాండమందును - బ్రహ్మయందును బ్రవేశము, అని సూచించుటకే - "అను" అను శబ్ద ప్రయోగము. 21

శ్లో. సర్వత్ర=లోనను, బయటను వ్యాపించిన శ్రీహరి, పరిమితములైన పదార్థములలోఁ బ్రవేశించు టెట్లు? అని యాశంకించికొని ఆయావస్తువుల పరిమితినిబట్టి ఆయారూపమును గ్రహించుటచేత ప్రవేశము సుసాధ్యమని చెప్పుచున్నాఁడు. యం=ఏ బ్రహ్మాంతర్యామియైన శ్రీహరిని, ఆద్యం=మొదటి, సహస్రాంఘ్రూరుబాహుకం=అనంతములైన యవయవములు గల, పురుషం=వారివారి దేహములందు వసించునవి, అహుః=వేదాదులు చెప్పునో, యత్ర=ఏ బ్రహ్మాంతర్యామియైన శ్రీహరియందు,సవికారాః =వికారములచేతఁ గూడిన, ఇమే=పాతాళాదులైన, విశ్వే=సమస్తములైన, లోకాఃసమాసతే=ఆశ్రయము నందినవో, అట్టి శ్రీహరి ప్రవేశించెనని వెనుకకన్వయము. 22

శ్లో. యస్మిన్=ఏ బ్రహ్మాంతర్యామియైన పురుషునియందు, త్రివృత్=ఓజస్సహో బలరూపియైన, సేంద్రియార్థేంద్రి యః=శబ్దాది విషయములు, శ్రోత్రాది ఇంద్రియములు - వీనిచేఁగూడిన, దశవిధః=ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయములను పదివిధములైన, ప్రాణః=ప్రాణవాయువు (వర్తతే) యతః=ఏ పురుషుని నుండి,

వర్ణాః=బ్రాహ్మణాది వర్ణములు సృష్టింపబడెనని, త్వయా, తద్విభూతిః=ఆ వర్ణములవిభూతిని, ఆబ్రహ్మాండాంతర్యామి శ్రీహరి విభూతి రూపములను -నః వదస్వ. 23

శ్లో. యత్ర, విచిత్రాకృతయః=పరస్పర వ్యత్యాసమైన యాకారముగల, ప్రజాః అస్య యాభిః ఇదం, తతం విభుః=బ్రహ్మదేవుడు, విరజం=బ్రహ్మాండమును, ఉద్ధృత్య=నీటినుండి యెత్తి, దానియందుఁ బ్రవేశించెను. అనెడు అర్థమును జెప్పక అంతర్యామియైన శ్రీహరికి సంబంధించిన యర్థమునే యిందుకుఁజెప్పవలెను. "సృష్టి బ్రహ్మదేవునితో నైనదని ప్రసిద్ధిగదా ! "అన వచ్చును. కాని "బ్రహ్మాణం ప్రావిశద్విష్ణుః సహస్రాక్ష స్సహస్రపాత్" -అను ప్రవిశ్యబ్రహ్మాణం ప్రాణం దశవిధం తథా; ఇంద్రియాణీంద్రి యార్థాంశ్చ వర్ణాంశ్చైవాసృజద్ధరిః=అను నీరెండు ప్రమాణముల ననుసరించి పైనఁజెప్పినదే సరియైనదీ. బ్రహ్మ సృష్టించె ననుట శాస్త్రార్థము దెలియని ప్రజలలో నున్న ప్రసిద్ధి. దాని కన్నను ప్రమాణము ప్రబలమైనది గదా! 24

శ్లో. ప్రజాపతీనాం, పతిః, సః= బ్రహ్మాండాంతర్యామియైన శ్రీహరి, కాన్ ప్రజాపతీన్, మన్వంతరాధిపాన్, మనోన్ సర్గాంశ్చ. ఏవ=సృష్టిని, అనుసర్గాంశ్చ=అవాంతర సృష్టిని, చక్లృపే. 25

శ్లో. ఏ తేషాం అపి=వంశాంశ్చ, వంశాను చరితాని చ, హేమిత్రాత్మజ, భూమేః, ఉపరి, అధఃచ, యేలోకాలోకాః, ఆసతే, తేషాం, సంస్థాం, ప్రమాణంచ, భూలోకస్యచ=భూలోక ప్రమాణమును, వర్ణయ. 26

శ్లో. విశేషములేదు. 27

శ్లో. బ్రహ్మాంతర్యామియైన శ్రీహరి విభూతులను వర్ణించు మని చెప్పినాఁడు. ఇప్పుడా కోర్కినే విశేషముగాఁ బ్రార్థించు చున్నాఁడు. సర్గస్థిత్యప్యయాత్మనః విశ్వస్య=జగత్తు కొఱకై. ఆత్మానం=తన్ను, సృజతః =వ్యక్తమొనర్చికొను, శ్రీనివాసస్య, ఉదార విక్రమం=గుణావతారైః (1) జ్ఞానాది గుణములచేఁగూడిన (2) సత్త్వాది గుణనిమిత్తకమైన (3) వీర్యాది గుణములను బ్రకాశపఱచినట్టి. అవతారములచేత, ఆచక్ష్వ=సత్త్వాది గుణనిమిత్తక మనుటచేత "యదా యదా హి ధర్మస్య" అను గీతావాక్యాను సారముగా. ధర్మస్థాపనకై యవతారమని చెప్పినట్లైనది. లక్ష్మీయుక్తుఁడై యనుట చేత "ద్వావేతౌ నిత్యయుక్తౌ=అను శ్రుతి వాక్యమును సూచించి నాఁడు. ఈ పైశ్లోకములకు వర్ణయ అనుదానితో నన్వయము. 28

శ్లో. నైష్కర్మ్యస్య=మోక్షసాధనమైన, సాంఖ్యస్య=జ్ఞానసంబంధమైన, స్మృతం=భగవంతునిచే రచితమైన - తంత్రంవా=శాస్త్రమును. పాషండ పథ

వైషమ్యం=(1) పాషండుల మార్గము యొక్క ఉత్పత్తిని (2) పాపకారణమైన ధర్మముతో నేర్పడెడు బుద్ధివైషమ్యమును, ప్రతిలోమనివేశనం=ఉత్తమ వర్ణముల కన్యలను క్రింది జాతివారు పెండ్లాడుటయను ప్రతిలోమములను - 30 శ్లో. జీవస్య యాః=గుణధర్మజాః=సత్త్వాదిగుణములతో నేర్పడెడు, గతయః=మార్గములు, యావతీః=ఎన్నో, తావతీః=వానిని, అవిరోధతః =ఒకదానికొకటి విరోధము లేనట్లు, ధర్మాదులయొక్క, నిమిత్తాని = సాధనములను. 31

శ్లో. వర్తయాః, దండనీతేః, శ్రుతస్యచ, పృథక్ విధిం, శ్రాద్ధస్య, విధిం, పితౄణాం, సర్గం, ఏవ. 32

శ్లో. గ్రహనక్షత్రతారాణాం, కలావయవ సంస్థితం, 33

శ్లో. అనఘ! ఉత, ఆపది, పుంసః, ధర్మయోనిః, ఏషాం సంప్రసీదతి, ఏతత్=మే ఆఖ్యాత. 34

శ్లో. లేదు, 35

శ్లో. ప్రతిసంక్రమః మహత్తత్త్వాదుల ప్రళయము కతిథా=ఎన్ని రీతులు? తత్ర=ఆ ప్రళయకాలమందు - కే ఉపాసీరన్=కేస్విత్ అనుశేరతే. పురుషస్య పరస్య సంస్థానం చ, అవతారములు - చ, ఇఁకను. స్వరూపంవా=ఈ యవతారముల యందును స్వరూపావతారము లేవియనియు లేక - పురుషస్య=జీవుని యొక్క సంస్థానం=ప్రతి యొక్క విభిన్నత్వములను, పరస్య=ముక్తుని యొక్క, స్వరూపం వా=స్వరూపమును-చెప్పుము. 36,37

శ్లో. యత్ గురుశిష్య ప్రయోజనం, తత్=అట్టినైగమం=వేదాంత జన్యమైన, జ్ఞానం చ=జ్ఞానమును, ఇహ=ఈ శాస్త్రమందు, సూరిభిః, తస్య ప్రోక్తాని, చెప్పఁబడిన చో, సాధనములను వివరింపుఁడు. 38

శ్లో. పుంసాం స్వతః సాధనములేనిది, జ్ఞానం కుతః=ఎట్లేర్పడును ? హరేః=కర్మవివిత్సయా=కర్మములను దెలియు నిచ్ఛతో, పృచ్ఛతః మే=ఏతాన్ ప్రశ్నాన్=బ్రూహి. అజయా=ప్రకృతిచేత, నష్టచక్షుషః=యథార్థ జ్ఞానములేని, అంధస్య=అజ్ఞానియైన, మే, మిత్ర, త్వాత్, బ్రూహి. 39,40

శ్లో. అనఘ ! సర్వే=జీవాభయ ప్రదానస్య ఫలాని నకుర్వీరన్. 41

శ్లో. ఇత్థం=కురుప్రధానేన, ఆపృష్ట పురాణకల్పః, ముని ప్రధానః, సః భగవత్కథాయాం, సంశోధితః, ప్రవృద్ధహర్షః, ప్రహసన్నివ, తం=ఆహ.42

**ఇతి శ్రీ మద్భాగవతే, మహాపురాణే,**

**అష్టాదశసహస్రికాయాం సంహితాయాం,**

**పారమహంస్యాం, శ్రీ వైయాసిక్యాం, శ్రీహయగ్రీవబ్రహ్మ విద్యాయాం, తృతీయస్కంధే, సప్తమోఽధ్యాయః**

# సప్తమాధ్యాయము

కం. అని మైత్రేయుం డవ్విదు
రునకెఱిఁగించిన తెఱంగు రుచిరముగా న
ర్జున పౌత్రునకుఁ బరాశర
ముని మనుమం డెఱుఁగ జెప్పె ముదముదలిర్పన్. 228

వ. వెండియు నిట్లనియె. 229

కం. భూమీశ్వర! మైత్రేయ మ
హాముని విదురునకునట్లు హరి శుభగుణ లీ
లా మాహాత్మ్యముఁ జెప్పిన
నా మైత్రేయునకు విదురుఁ డనియెన్ మఱియున్. 230

కం. అగుణుండగు నీశ్వరునకు
జగదవనోద్భవ వినాశ సత్కర్మములుం
దగులీల లెట్లు లాతఁడు
సగుణుండై యుంటయెట్లు సౌజన్యనిధీ! 231

సీ. అన నర్భకుని గతి ననవుడు, మైత్రేయ
మునిఁజూచి విదురుఁ డిట్లనియె మఱల
బాలుఁడు గ్రీడావిలోల మానసమున
దీపించు లీలాను రూపుఁ డగుచుఁ
గానిచోఁ గామాను గతుఁడై రమించును
నర్భకుఁ డర్థి వస్త్వంతరమున
నర్భకాంతరమున నైనను బాల కే
ళీ సంగుఁ డగుచు నోలినిఁ జరించు

తే. హరియు నెపుడు నివృత్తుఁ డత్యంత తృప్తుఁ
డగుట వర్తించు టెట్లు గ్రీడాదులందు
మఱియుఁ ద్రిగుణాత్మకంబైన మాయఁ గూడి
యఖిల జగములు గల్పించె ననుట యెట్లు? 233

సీ. అమ్మాయచేత నీ యఖిలంబు సృజియించి
పాలించి పొలియించి పరమపురుషుఁ

డనఘాత్మ! దేశకాలావస్థలందును
నితరుల యందు నహీన మైన
జ్ఞానస్వభావంబుఁ బూని యా ప్రకృతితో
నెబ్బంగిఁ గలసెఁ? దా నేకమయ్యుఁ
గోరి సమస్త శరీరంబులందును
జీవరూపమున వసించి యున్న

తే. జీవునకు దుర్భగ క్లేశసిద్ధి యెట్టి
కర్మమున సంభవించెను? గడఁగి నాదు
చిత్త మజ్ఞాన దుర్గమస్థితిఁ గలంగి
యధిక ఖేదంబు నొందెడు ననఘచరిత! 234

వ. అది గావున సూరి జనోత్తముండ వైన నీవు మదీయమానసిక సంశయంబులు దొలగింప నర్హుండ వని విదురుండు మైత్రేయ మహామునీంద్రు నడిగెనని బాదరాయణ తనూభవుఁ డభిమన్యు నందనున కిట్లనియె. 234

కం. సరసిరుహోదరమంగళ
చరితామృత పానకుతుక సంగంబున ని
ర్భరుఁడగు విదురునకు మునీ
శ్వరుఁడగు మైత్రేయుఁ డనియె సజ్జనతిలకా! 235

చ. వినుము వితర్క వాదములు విష్ణుని ఫుల్లసరోజ పత్రనే
త్రుని ఘనమాయ నెప్పుడు విరోధము సేయుఁ బరేశు నిత్య శో
భనయుతు బంధనాదిక విపద్దశలున్ గృపణత్వ మెప్పుడే
ననయముఁ బొందలేవు విభుఁ డాద్యుఁ డనంతుఁడు నిత్యుఁ డౌటచేన్.236

వ. మఱియు. 237

చ. పురుషుడు నిద్రవోఁ గలలఁ బొందు సమస్త సుఖంబు లాత్మ సం
హరణ శిరోవిఖండనము లాదిగ జీవునికిం బ్రబోధమం
దరయఁగఁ దోఁచుచున్న గతి నాదిఁ బరేశుఁడు బంధనాదులన్
బొరయక తక్క నెట్లనుచు బుద్ధిని సంశయమందె దేనియున్.238

వ. అ వ్విధ మతనికిం గలుగ నేర దది యెట్లంటేని 239

చ. లలిత విలోల నిర్మలజల ప్రతి బింబిత పూర్ణచంద్ర మం
డలము దదంబు చాలన విడంబన హేతువు నొందియున్ వియ
త్తలమునఁ గంప మొందని విధంబున సర్వ శరీర ధర్మముల్
గలిగి రమించు నీశునకుఁ గల్గఁగ నేరవు కర్మబంధముల్. 240

వ. కావున జీవున క విద్యా మహిమంజేసి కర్మ బంధ నాదికంబు సంప్రాప్తం బగుంగాని సర్వ భూతాంతర్యామి యైన యీశ్వరునకుఁ బ్రాప్తంబు గా నేరదని వెండియు. 241

చ. నరునకు నాత్మ దేహజ గుణంబులఁ బాపఁగ నోపుఁ బంకజో
దర చరణార వింద మహిత స్ఫుట భక్తియ; యింద్రియంబు లీ
శ్వరవిషయంబులైన మది సంచిత నిశ్చల తత్త్వమైనచో
సరసిజ నేత్రు కీర్తనమె చాలు విపద్ధళలం జయింపఁగన్. 242

చ. హరి చరణార వింద యుగళార్చన సన్నుతి భక్తి యోగముల్
నిరతము గల్గువారె భవనీరజ గర్భుల కందరాని భా
సురపద మందుఁ జేరుదురు సూరి జనస్తవనీయ! యట్టి స
త్స్ఫురమల పూర్వజన్మ ఫలమున్ గణుతింపఁదరంబె యేరికిన్? 243

వ. అని చెప్పిన విదురుండు మైత్రేయుం గనుంగొని ముకుళిత హస్తుండును వినమిత మస్తకుండు నగుచుం దన మనంబున శ్రీ హరిం దలంపుచు వినయ యుక్త వచనరచనుండై యిట్లనియె. మునీంద్రా ! భవదీయ వాక్యంబులచేత నా మనంబున నారాయణుండు లోకైక నాథుం డెట్లయ్యె ననియు, శరీర ధారియైన జీవునికిఁ గర్మ బంధంబు లేరీతి సంభవించె ననియునుం బొడమిన సంశయంబు నేఁడు నివృత్తం బయ్యె. ఎట్లనిన లోకంబున కీశ్వరుండు హరియనియు జీవుండు పరతంత్రుం డనియును దలంపుదు. నారాయణభక్తి ప్రభావంబు ప్రాణి గోచరంబైన యవిద్యకు నాశనకారణంబనం దనరుచుండు. నారాయణుండు దనకు నాధారంబులేక సమస్తంబునకుం దాన యాధార భూతుండై విశ్వంబు వొదివి యందుఁదా నుండు తెఱంగెట్లు? శరీరాభిమానంబును బొంది యెవ్వఁడు మూఢ తముండై సంసార ప్రవర్తకుండగు. నెవ్వండు భక్తిమార్గంబునఁ బరమాత్ముండైన పుండరీ

కాక్షునిఁ జెందు. వీర లిద్దఱును (సంశయ క్లేశంబులు లేమింజేసి) సుఖానంద పరిపూర్ణులై యభివృద్ధి నొందు వా రగుదురు. (ఎవ్వండు సుఖదుఃఖాను సంధానంబుచే లోకాను గతుండగుచుం బ్రమోద వేదనంబుల నొందు నతండు దుఃఖాశ్రయుండగు) నారాయణ భజనంబు సమస్త దుఃఖనివారణం బగునని భవదీయ చరణ సేవా నిమిత్తంబునం గంటి ప్రపంచంబు ప్రతీతి మాత్రంబు గలిగియున్నది. అయిన నందుకుఁ గారణంబు లేకుండుటం జేసి దెలియని వాఁడనై వర్తింతు నని వెండియు. 244

కం. లలి నామదిఁ దలఁపుదు సుమ
తులు గొని యాడంగఁ దగిన తోయజనాభుం
డలవడఁ డల్పతపో నిర
తుల తలపోఁతలకు మిగుల దుర్లభుఁ డనియున్. 245

సీ. ఇంద్రియంబుల తోడ నెలమి నొప్పెడి మహ
దాదుల నితరేతరానుషంగ
ముగఁ జేసి, వానియం దొగి, విరాడ్దేహంబు
పుట్టించి యందుఁ జేపట్టి, తాను
వసియించు నాతఁడు వరల సహస్రసం
ఖ్యాతంబు లగు మస్తకాంఘ్రిబాహు
కలిత సత్పురునిగా బ్రహ్మవాదులు
పలుకుదు రా విరాట్పురుషునందు.

తే. భువనజాలంబు లలజడిఁ బొరయకుండు,
బ్రాణదశకంబు నింద్రియార్థములు నింద్రి
యాధిదైవతములు గూడ ననఘ! త్రివిధ
మగుచు విప్రాది వర్ణము లయ్యె నందు. 246

కం. ఇలఁ బుత్రపౌత్ర సంపద
గలిగిన వంశములతోడఁ గడుఁజోద్యముగా
లలిఁ బ్రజ లేగతిఁ గలిగిరి?
కలిగిన యా ప్రజలచే జగము లెట్లుండెన్? 247

కం. చతురత దీపించు ప్రజా
పతులకుఁ బతియనఁగ వెలయుఁ బద్మాపతి యే
గతిఁ బట్టించెను? స్రష్టృ
ప్రతతులచే నవవిధ ప్రపంచము మఱియున్. 248

తే. వాని భేదంబులును మను వంశములును
మనుకులాధీశ్వరులును దన్మనుకులాను
చరితములు, నే విభూతి నే జాడ దీని
నింతయును బుట్టఁజేసెనా కెఱుఁగఁబలుకుఁ 249

కం. ధరణికిఁ గ్రిందట మీఁదట
తరమిడి గల లోకములను, దత్తత్ స్థితులన్
వరుసలుఁ బరిమాణంబులుఁ
జిరకృప నెఱిఁగింపు నాకు సిద్ధచరిత్రా! 250

కం. సుర తిర్యఙ్నరరాక్షస
గరుడోరగ సిద్ధసాధ్య గంధర్వ నభ
శ్చరముఖ భవములు, మునికుం
జర గర్భ స్వేద జాండజంబుల తెఱఁగున్. 251

కం. త్రిగుణ ప్రధానకంబులు
నగు నవతారములు పూర్ణమై వెలసిన యా
జగదుత్పత్తి స్థితిలయ
నిగమముల విధంబు వాని నిలు కడలు దగన్. 252

కం. చక్రాయుధ సౌందర్య ప
రాక్రమ ముఖ గుణములును ధరామరముఖ వ
ర్ణక్రమములు నాశ్రమ ధ
ర్మక్రియలున్ శీలవృత్తమతభావములున్. 253

తే. యోగవిస్తారమహిమలు యాగములును
జ్ఞానమార్గంబులును, బరిజ్ఞానసాధ
నములునై యొప్పు సాంఖ్యయోగములు వికచ
జలజనయనస్మృతంబులౌ శాస్త్రములును. 254

సీ. పాషండమార్గంబు ప్రతిలోమకులవిభా
గములు జీవుల గుణకర్మములును,
పలుకులు గతులును గలిఁగెడి ధర్మమో
క్షములయందలి పరస్పరవిరోధ
ములులేని సాధనములు భూమిపాలక!
నీతివార్తలు దండనీతి జాడ
యును బృథగ్భావంబులును విధానములును
పితృమేధములును దత్పితృవిసర్గ

తే. గతులు దారాగ్రహంబులు గాలచక్ర
మున వసించిన నిలుకడలును దపంబు
దానములుఁ దత్ఫలంబులుఁ దనరు ప్రబల
ధర్మములు ప్రజ లొనరించెడి కర్మములును. 255

చం. వదలక భూజనావళికి వచ్చు విపద్దశ ధర్మముల్ సరో
జదళనిభాక్షుఁ డేగతిని సంతసమందెడు నెట్టివారిఁ బెం
పొదవఁగఁ గానవచ్చు గురువుల్ ప్రియశిష్యులు గొల్వ వారు స
మ్మదమునఁ గోరు ధర్మములు మానుగనెట్లటిఁ గింతు రిమ్ములన్.256

కం. విలయాదిభేదముల న
య్యలఘునిఁ బరమేశునెవ్వ రంచితభక్తిన్
గొలుతు రదెవ్వనితో ను
త్కలికన్ సుఖియించు జీవతత్త్వము మఱియున్. 257

కం. గోవిందుని రూపంబున
జీవబ్రహ్మలకు నైక్యసిద్ధియు నెట్లో
భావన నుపనిషదర్థం
బైవెలసెడి జ్ఞానమెట్టి దార్యస్తుత్యా! 258

తే. ఉచితమగునట్టి శిష్యప్రయోజనములు,
సజ్జనులచేత విజ్ఞానసాధనములు,
నేమిపలుకంగఁబడు వానినెల్ల మఱియుఁ
బొలుచు వైరాగ్యమునఁ దగు పురుషభక్తి. 259

తే. ఇన్నియుఁ దెలియ నానతి యిచ్చి నన్ను
నర్థి రక్షింపు యజ్ఞదానాది పుణ్య
ఫలము వేదంబుఁ జదివిన ఫలము నార్త
జనులఁ గాచిన ఫలముతో సమముగావు. 260

కం. అని విదురుఁడు మైత్రేయుని
వినయంబునఁ దెలియ నడుగు విధమెల్లను వ్యా
సునిసుతుఁ డభిమన్యుని నం
దనునకు నెఱిఁగించి మఱియుఁదగ నిట్లని యెన్. 261

అర్థములు

కం. అని= ఈ రీతిగా మైత్రేయుఁడు, అ వ్విదురునకున్, ఎఱిఁగించిన తెఱంగు,=తెలిపిన పద్ధతి, రుచిరముగాన్=స్పష్టముగా, ముదము దలిర్పన్= సంతోష మెలర్పఁగా, అర్జునపౌత్రునకున్=అర్జునుని మనుమనికి, పరాశరముని మనుమండు=శుకబ్రహ్మ, ఎఱుఁగన్ చెప్పెన్ 228

తాత్పర్యము : విశేషములేదు,

వ. వెండియు నిట్లనియె. 229

కం. భూమీశ్వర!=ఓ పరీక్షిన్మహారాజా! అట్లు=ఆ రీతిగా, మైత్రేయ మహాముని,విదురునకున్=హరిశుభగుణ, లీలామాహాత్మ్యమున్=శోభనము లైన గుణములతోఁగూడిన హరిలీలలగొప్పతనమును, చెప్పినన్ మఱియున్, ఆమైత్రేయునకున్, విదురుఁడు, అనియెన్. 230

తాత్పర్యము : విశేషము లేదు,

కం. సౌజన్యనిధీ!=అగుణుండగు ఈశ్వరునకున్=గుణరహితుఁడైన దైవమునకు, జగదవన+ఉద్భవ, వినాశసత్కర్మములున్=సృష్ట్యాది కర్మలును, తగులీలలు ఎట్లు=లీలలును ఎట్లేర్పడును? అతఁడు సగణుండైయుంట యెట్లు?=అతఁడు సగుణ స్వరూపుఁడై యుండుటయును ఎట్లు పొసఁగును? 231

తాత్పర్యము : విదురుఁ డనుచున్నాఁడు. మైత్రేయా! భగవంతుఁడు చిన్మాత్రుఁడు. అవికారి, నిర్గుణుఁడు. అట్టివానికి లీలగానైనను జగత్సృష్ట్యాది కార్యము లెట్లు సిద్ధించును?

సీ. అనన్=అనఁగా, అర్భకుని గతిన్ అనవుడున్=శిశువువలెనని యుత్తరముచెప్పఁగా, మైత్రేయమునిన్ చూచి, మరలన్ విదురుఁడు, ఇట్లనియెన్. బాలుఁడు, క్రీడావిలోలమానసమునన్=క్రీడయం దాసక్తి గల బుద్ధిచేత, లీలా+అనురూపుఁడగుచున్=లీలయం దాసక్తుఁడై, దీపించున్= ఒప్పును, కానిచోన్=అట్లుగాకున్నచో, కామానుగతుఁడై రమించును= కామమునకు, లోఁబడిన వాఁడై క్రీడించును, అర్భకుఁడు=శిశువు, అర్థిన్= కోర్కితో, వస్త్వంతరమునన్=భిన్నవస్తువునస్నైనను, అర్భకాంతర మున నైనను=వేఱు శిశువుతోనైనను, బాలకేళీసంగుఁ డగుచున్=బాలక్రీడయం దాసక్తిగలవాఁడై, ఓలిన్ చరించున్. హరియున్, ఎపుడున్, నివృత్తుఁడు= అత్యంత తృప్తుఁడు, అగుటన్, క్రీడాదులందున్ - వర్తించుట ఎట్లు? మఱియున్ త్రిగుణాత్మకంబైన మాయన్ఁగూడి, అఖిలజగములు=కల్పించెన్ అనుట యెట్లు ? 232

తాత్పర్యము : విదురుని పై ప్రశ్నలకు మైత్రేయుఁడు చెప్పిన సమాధానము. "అర్భకునివలె భగవంతుఁడు ప్రపంచములోఁ గ్రీడించును," - దానిపై విదురుఁడు ప్రశ్నించుచున్నాఁడు - 'అయ్యా! శిశువునకుఁ గ్రీడయందుఁ బ్రవర్తించుటకు హేతువు - కామము.' దానితో నాతఁడు లీలయందుఁ బ్రవర్తించును. వస్త్వంతరముచేతఁగాని, మఱియొకశిశువు చేతఁగాని బాలకుఁడు గ్రీడించును. ఈశ్వరునియం దీయుపమానము పొసఁగదు, కారణ మేమనఁగా భగవంతుఁ డెప్పుడును స్వతస్తృప్తుఁడు, అట్టివానికిఁ గామము జనించుటకే వీలులేదు, అన్యపదార్థము నుండి భగవంతుఁడు సదా నివృత్తుఁడు. అట్టివానికిఁ గ్రీడింపవలెనను నిచ్ఛ యెట్లు జనించును? పైఁగా త్రిగుణాత్మకమైన మాయతో నీ సమస్త జగత్తులను సృష్టించె నంటివి. ఆతనికి మాయాసంగముగూడ పొసఁగదు గదా !

సీ. ఆ+మాయచేతన్=ఈ యఖిలంబున్=ఈ కన్పించు ప్రపంచ మంతయు, పొలియించి=సంహరించి, దేశకాలావస్థలందును=దేశముచేతను, కాలముచేతను, అవస్థలచేతను, ఇతరులచేతను, అహీనమైన జ్ఞానస్వభావం బును పూని, అవిలుప్తమైనజ్ఞానమే స్వరూపముగాఁగలిగిన భగవంతుఁడు ఆ ప్రకృతితోన్ =ఎబ్భంగిన్, కలసెన్=తాన్, ఏకమయ్యున్=కేవలుఁడై, సమస్త శరీరంబులందున్, కోరి=ఇచ్ఛించి, జీవరూపమునన్=జీవ స్వరూపముచేత వసించియున్న యీశ్వరునకు, ఉన్నట్టి జీవ స్వరూపుఁడైన వానికి, దుర్భగక్లేశసిద్ధి=ఆనందాదిభ్రంశముగాని, క్లేశముగాని, ఎట్టికర్మము

నన్ సంభవించెను=ఏకర్మముతోనేర్పడెను, అజ్ఞానదుర మసిత్విన్=అజ్ఞాన ముతోఁగలఁగుచున్నదై, అనఘచరిత!=అధికఖేదంబునే ఒందెడున్, 233

తాత్పర్యము : ఓ మైత్రేయా! భగవంతుఁడు మాయ నాశ్రయించి యీ సమస్త జగత్తులను, సృష్ట్యాదుల నొనర్చునంటివి. ఇదియెట్లు పొసగును? ఆతఁడు సర్వకాలములందును అవిలుప్తమైన యవబోధమే స్వరూపముగాఁ గలవాఁడుగదా! ఆతని కవిద్యతో సంబంధమేర్పడెను !, దేశముతో నాతనికి దీపప్రభకువలె మార్పు గలుగదు, ఆతఁడు సర్వగతుఁడు, కాలముచేత విద్యుత్తునకు వలె మార్పులేదు, ఆతఁడు నిత్యుఁడు, అవస్థతో స్మృతికివలె తిరోధానము, ప్రత్యక్షము ఇత్యాదులు లేవు, ఎందుకనఁగా నాతఁ డవి క్రియుఁడు. స్వప్నమునవలె నాతని బోధ యెన్నడును తరుగుటలేదు పరమ సత్యస్వరూపుఁడు, ఘటాదులకువలె నాతనిజ్ఞానమునకు ఇతరవస్తువులతో వినాశములేదు. అది యద్వితీయము, మఱి యిట్లు నిరంతరజ్ఞానస్వరూపుఁ డైన భగవంతుఁడు అవిద్యా రూపమైన యజ్ఞానము నెట్లు పొందును? జీవుఁడు బ్రహ్మస్వరూపుఁడే యైన దానివలన నతనికి సంసారబంధము గూడ పొసఁగదుగదా! సర్వక్షేత్రములందును జీవ స్వరూపుఁడై భోక్తగా భగవంతుఁడున్నను నతఁడు నిరంతర చిద్రూపుఁడే గదా! వాస్తవమిట్లుండగా వాని కానందాది భ్రంశ మెట్లేర్పడును. కర్మ సంబంధమే లేదుగదా! హేతుభూతములైన కర్మల చేతఁగ్లేశ మెట్లు సంభవించును!

వ. సూరిజన+ఉత్తముండవు, ఐన నీవు, మదీయ=నా యొక్క, మానసిక సంశయంబులు, తొలఁగింపన్ అర్హుండవు, అని విదురుండు మైత్రేయ మహా మునీంద్రున్, అడిగెన్, బాదరాయణతనూభవుండు=శుకబ్రహ్మ, పరీక్షిత్తున కన్నాఁడు. 234

కం. సజ్జనతిలకా!=ఓ పరీక్షిత్తా! సరసిరుహోదర... సంగంబునన్= శ్రీమహావిష్ణువు యొక్క మంగళకరములైన చరిత్రములనెడు నమృతమును బాన మొనర్పవలెనను నాశతో, నిర్భరుఁడు=నిండినవాఁడు, 235

తాత్పర్యము : హరికథలను వినవలెనను నాసతో నిండిన వాఁడైన మైత్రేయుఁడన్నాడు.

వితర్కవాద ములు=కుత్సిత ములైన తర్కములు, ఫుల్లసరోజ పత్రనేత్రుని ఘనమాయన్=భగవంతుని మాయను గూర్చి, విరోధమున్ సేయున్=తర్కించును, నిత్యశోభనయుతున్=నిత్యమంగళములతోఁ గూడినవాఁడు, కృపణత్వము=దైన్యము, అనయమున్=నిరంతరము, 236

తాత్పర్యము : భగవంతుని మాయావిభవమును తర్కము లెప్పుడును విరోధించుచునే యుండును. తర్కములచే విరోధింపఁబడుట మాయా స్వభావమే. భగవంతుఁడు నిత్యమంగళములతోఁ గూడినవాడు. అట్టివానికి బంధనాదికము లైన విపద్దశలు గల్గనేరవు. దైన్యమును సంభవించుటకు వీలులేదు. ఎందుకనఁగా నాతఁడాద్యుఁడు, అనంతుఁడు, నిత్యుఁడు.

వ. మఱియును. 237

చం. నిద్రవోన్=నిద్రింపఁగా, కలలన్ పొందు, సమస్తసుఖంబులు, ఆత్మ సంహరణ శిరోవిఖండనములు,=తనమరణము, తనతల దెగవ్రేయుట మొదలైనవి, జీవునికిన్=ప్రబోధమందు=మేల్కొన్నపుడు, బంధనాదులన్ పొరయక=బంధనాదులందుఁదగుల్కొనక, తక్కుట, ఎట్లనుచున్=బుద్ధిని, సంశయమును అందెదేనియున్. 238

తాత్పర్యము : తర్కమునకుఁ జిక్కకుండుటయే మాయయొక్క స్వభావమని చెప్పితివి, మఱి ముక్తుఁడైన యీశ్వరునకు అవిద్యతోడి సంబంధ మెట్లు? దీనిని ఉదాహరణముతో సమర్థించుచున్నాఁడు, ఒకఁడు నిద్రించుచున్నాఁడు. ఆ కలలోఁ గొన్ని సుఖము లనుభవించును. తన మరణముగూడ నేర్పడినట్లు భావించును. స్వశిరః ఖండనాదికము నూహించును. ఇవన్నియు యథార్థముగ లేనివే, కాని స్వప్నసాక్షియైన పురుషునకు - "మమేదంశిరశ్ఛిన్నం" అనెడు జ్ఞాన మేర్పడినది, కాని యీ యేర్పడినదంతయు నసత్యమే. అట్లే జీవునకు ఆత్మవిపర్యయము కేవలము మిషయైనను ప్రతీయమాన మగును. అట్లే - జీవునకును - బంధనాదులు - ప్రతీయమానములగుట యని యుదాహరణము, దానిపైన ప్రశ్న, పురుషుఁడు నిద్రలేచిన తరువాతఁగూడ - స్వప్నములో నాతల ఖండింపఁ బడినది యనుజ్ఞాన ముండును గదా! అట్టిచో భగవంతునకు బంధ నాదికములతోడి సంబంధము పూర్తిగా లేకుండు ననుటయెట్లు? అందుకే వే ఱుదాహరణము నిచ్చుచున్నాఁడు,

వ. ఆ+విధము=ఆ తీరు 239

చం. లలిత విలోల ..... మండలము=జలములందుఁ బ్రతిబింబించిన చంద్రబింబము, తత్+అంబుచాలన విడంబనహేతువున్ ఒందియున్=జలా దులయందలి కంపాదిస్థితుల నందినను, వియత్తలమునన్=ఆకాశమందు, కంపమున్, ఒందని విధంబునన్=కంపింపనట్లు, సర్వశరీరధర్మముల్ గలిగి, రమించు నీశునకున్ కర్మబంధనములు గల్గనేరవు. 240

తాత్పర్యము : ఆకాశమందు చంద్రుఁడుండును. అతనిప్రతిబింబము నీటిలో నుండును, నీరు చలన వలనాదు లందును. ఆ ధర్మములు జలప్రతి బింబితుఁడైన చంద్రునిలోఁ గన్పించును, కాని యాకాశమందున్న చంద్రు నిలోఁ దోఁపవుగదా! ఇచ్చట నాకాశమందున్న చంద్రుఁ డీశ్వరుఁడు. జలప్రతిబింబితమైన చంద్రమండలము జీవుఁడు. దేహాదులకు సంబం ధించెడు సుఖదుఃఖములు తనవి యనుకొనుచున్నాఁడు. ఎందువలన? దేహాద్యభిమానము వలన. అందుచేత జీవున కేర్పడెడు సుఖదుఃఖములు ఈశ్వరునకుఁ జెందనేరవని తాత్పర్యము.

అవిద్యామహిమన్=అవిద్య యొక్క శక్తిచేత - కర్మబంధనాదికంబు, సంప్రాప్తంబగున్. 241

తాత్పర్యము : కనుక జీవునకు క్లేశాదికములు అవిద్యచే నేర్పడు చున్నవి. సర్వభూతాంతర్యామియై దేహాద్యభిమానము లేక యుండునీశ్వరు నకు - వానితోడి సంబంధము లేదని భావము.

చం. ఆత్మదేహజగుణంబులన్=ఆత్మ స్వభావముతో నేర్పడిన గుణములు అనఁగా - ననాత్మయైన దేహమందలి యభిమానముతో నేర్పడినట్టి గుణము లన్నమాట. పంకజోదర...భక్తియ=శ్రీమన్నారాయణ మూర్తియందుఁ గల్పింపఁబడిన భక్తియే, పాపఁగన్ ఓపున్=పోఁగొట్టును, ఇంద్రియంబులు, ఈశ్వర విషయంబులైనన్=ఈశ్వరుఁడే విషయముగాఁ గలవి యైనచో, మది=మనస్సు, సంచితనిశ్చల తత్త్వమైనచోన్=సంపాదించికొన్న నిశ్చలతత్త్వముగల దైనచో, విపత్+దశలన్=ఆపత్తులను, జయింపఁగన్, సరసిజనేత్రు కీర్తనయె చాలున్. 242

తాత్పర్యము : జీవునకు అనాత్మయైన దేహమునందలి యభిమాన ముతోఁ గ్లేశాదు లేర్పడునంటిమి. ఈ యవిద్యను బోఁగొట్టుటకు భక్తియే సాధనము. భగవంతునందు సమస్తవిషయముల నర్పించి. చాంచల్య విహీన మైన మనస్సుతో భగవంతుని నామసంకీర్తన మొనర్చినచో నదియే సమస్త విపత్తులను బోఁగొట్టుటకు శక్త మగును. ఇక్కడ మూలశ్లోక మిాక్రిందిది.

శ్లో. సవై నివృత్తి ధర్మేణ వాసుదేవానుకంపయా,
భగవద్భక్తి యోగేన తిరోధత్తే శనైరిహ.

ఇచ్చట శ్రీధరులు మూఁడుహేతువులను జెప్పెను. నివృత్తి ధర్మాను సరణము, వాసుదేవాను కంప, భక్తియోగము. శనైః అనఁగా సాధనాను

సారముగా నని యర్థము. పోతన్న యీ మాటిని భక్తికే చేర్చినాఁడు. ఆపైవచ్చు శ్లోకములోని భావమును గూడఁ గూడ గట్టికొని చెప్పినాఁడు.

చం. హరిచరణ ..... భక్తియోగముల్=హరిచరణారవిందయుగళ= భగవంతుని పాదములనెడు పద్మములదోయియొక్క, అర్చన=పూజనము, సన్నుతి=సంస్తుతించుటయనెడు నీ ధర్మములతోఁగూడిన భక్తియోగముల్ =భక్తియొక్క సంబంధములు, నిరతమున్=ఎల్లప్పుడును, కల్గువారె=కలయట్టి వారె, భవ, నీరజ గర్భులకున్=ఈశ్వరుఁడు, బ్రహ్మ మొదలైన వారికి, అందరాని=పొందుట కశక్యమైన, భాసురపదమందున్ చేరుదురు=ఉత్కృష్ట స్థానము నందెదరు, సూరిజనస్తవనీయ=జ్ఞానులచేఁ బొగడఁదగిన వాఁడా! అట్టి సత్పురుషుల పూర్వజన్మ ఫలమున్=అట్టివారి యొక్క పూర్వజన్మ పుణ్యమును, ఏరికిన్=ఎవ్వరికిని, గణుతింపన్, తరంబె=లెక్కపెట్టుటకు సాధ్యమా? 243

తాత్పర్యము : భగవత్పాదపద్మముల యర్చనము, స్తోత్రము, మొదలైన గుణములతోఁ గూడిన భక్తితోడి సంబంధ మే మానవుల కుండునో, వారు శివబ్రహ్మాదులకందరాని యుత్కృష్టమైన స్థానము నందెదరు. అట్టివారి పూర్వ పుణ్యములను లెక్కపెట్టుట కెవ్వరికిని సాధ్యముగాదు. దీనికి మూలశ్లోక మీ క్రిందిది.

**శ్లో. యదేంద్రి యోపరామోఽథ ద్రష్టాత్మని పరే హరౌ,**
**విలీయంతే యథాక్లేశాః సంసుప్త స్యైవ కృత్స్నశః.**

సర్వులయందును అంతర్యామి స్వరూపముగాఁ బ్రవర్తించుచుండెడి పరమాత్మయందు నెవ్వనికి ఇంద్రియనైశ్చల్య మేర్పడునో అట్టివాని సమస్త క్లేశములును నశించుచున్నవి. గాఢనిద్రలో నున్న వానికి సమస్తక్లేశములును దోఁపకుండునట్లుగా నని యుపమానము, కాని వాఁడు మేల్కొన్న తరువాతఁ దోఁచుచున్నవి గదా ! భక్తియోగాశ్రయముతో నట్లుదోఁచుట లేదుగదా ! అని పూర్వపక్షము. దీనికి శ్రీధరులు చెప్పిన సమాధానము శ్లోకమునందలి "యథా" అను శబ్దము - "ఇవా" ర్థకము పోతనామాత్యుఁడు ఈ శ్లోకము నాధారముగాఁ జేసికొని సహజమైన తనకల్పన మొనర్చెను. ఇంతమాత్రమే గాదు. దాని క్రింది శ్లోకముయొక్క భావమును గూడఁ గొద్దిగా జోడించి కొన్నాఁడు. ఆ శ్లోక మిది :

**శ్లో. అశేషసంక్లేశ శమం విధత్తే గుణానువాదశ్రవణం మురారేః,**
**కింవా పున స్తచ్చరణారవింద పరాగసేవారతి రాత్మలబ్ధా.**

వ. ముకుళితహస్తుఁడు=ముకుళింపఁబడిన హస్తములు గలవాఁడు, వినమితమస్తకుండు=వంచఁబడిన తలగలవాఁడు, వినయయుక్త వచన రచనుండై=వినయముతోఁగూడిన మాటలు గలవాఁడై, భవదీయ వాక్యంబుల చేతన్=నీ మాటల చేత, లోక+ఏకనాథుఁడు=సమస్త లోకములకును ముఖ్యమైన యధికారి, శరీరధారి=శరీరమును ధరించిన వాఁడు, కర్మ బంధంబులు=కర్మయొక్క బంధములు, నివృత్తం బయ్యెన్=తొలఁగి పోయినవి, పరతంత్రుఁడు=స్వాతంత్ర్యము లేని వాఁడు, ప్రాణిగోచరంబైన అవిద్యకున్=జీవులయం దగుపించెడి యజ్ఞానరూపమైన యవిద్యకు, తనరుచుండున్=ఒప్పుచుండును, ఆధారభూతుండు=ఆధారమైన వాఁడు, పొదివి=ఆక్రమించి, మూఢతముండై=అత్యంత మూర్ఖుఁడై, సంశయ క్లేశంబులు=సంశయమును, కష్టములును, సుఖదుఃఖ+అనుసంధానము=సుఖ దుఃఖముల ననుభవించుట, లోక+అనుగతుఁడు=లోకము ననుసరించిన వాఁడు, దుఃఖాశ్రయుఁడు=దుఃఖమునకు లోఁబడిన వాఁడు, ప్రతీతిమాత్రంబు="ఉన్నది" - యను కేవలజ్ఞానము, అయినన్, లేకుండుటన్ చేసి=లేకుండుట వలన, తెలియని వాఁడనై=అజ్ఞానినై. 244

తాత్పర్యము : విదురుఁడు మైత్రేయునితో నన్నాఁడు. అతఁడు కరములు జోడించి యుండెను. వినయముతో నాతని శిరస్సు వంచఁబడియుండెను. అతని మాట లత్యంత వినయముతో సురభిళములై యుండెను. - "ఓ మునిచంద్రా! నీ మాటలచేత నా హృదయమందున్న సందేహము తొలఁగినది. సమస్త ప్రపంచమునకును నారాయణమూర్తి యొక్కఁడే యేకైక నాథుఁడయ్యె ననియు, శరీరముధరించిన జీవునకుఁ గర్మబంధము లెట్లు ప్రాప్తించె ననియు నన్నుఁబీడించుచుండిన సంశయములు. నీ మాటలనెడు ఖడ్గముచేత నా సంశయములు ఖండింపఁబడినవి. జీవుని పారతంత్ర్యము స్పష్టముగ నా కరమైనది. ఈశ్వరుని స్వాతంత్ర్యమును అవగత మైనది. అవిలుప్తావ బోధాత్మకుఁడైన భగవంతున కవిద్యా సంబంధ మెట్లనియు, తన్నివృత్తి యెట్లనియు నాకుఁదెలిసినవి. నారాయణుని భక్తి జీవునియవిద్యను దొలఁగించును. నారాయణుఁడు తన కాధారమనుట లేక సమస్తమునకును నాధారభూతుఁడై విశ్వము నాక్రమించియున్న తెఱఁగు స్పష్టముగ నరమైనది. శరీరాభిమానముతో మూఢతముఁడై యెవఁడు సంసారమందే ప్రవర్తించునో వాఁడును సుఖి. ఎవ్వఁడు భక్తిమార్గముతో బుద్ధి నతిక్రమించి భగవదానందమందే లోలుఁడై యుండునో వాఁడును సుఖి. సుఖదుఃఖానుసంధానముచే నిరంతరమును లోకానక్తుండై ప్రమోదవేదనల ననుభవించువాఁడు దుఃఖాశ్రయుఁడే యగును. నారాయణుని భజనము సమస్త దుఃఖనివారక మైనదని నీచరణ ప్రసాదముచే గ్రహించినాను. కాని

ఇంకను సంశయలేశ మొకటి యున్నది. ప్రతీయమానమైన యీ సమస్త ప్రపంచమును లేనిదని నాకుఁ దెలియుచున్నది. కాని ప్రతీతిమాత్రముగా భాసించుచున్నది, ఇదియును గూడఁ దొలఁగి పోవలెనుగదా! ఆ ప్రతీతిని గూడఁదమచరణసేవయే పోఁగొట్టును.

కం. సుమతులు కొనియాడంగన్=తగిన, తోయజనాభుఁడు= జ్ఞానులచేఁ బొగడఁదగిన వాసుదేవుఁడు, అల్పతపోవృత్తుల తలపోఁతలకున్= అల్పమైన తపస్సుచేఁగూడిన వారి భావములకు, అలఁతులన్= అల్పప్రయత్నములచేత, మిగులన్ దుర్లభుఁడు అనుచున్=పొందుట కసాధ్యుడని, నామదిన్ తలఁపుదున్. మూలములో, "-అలవలనల్పతపో నిరతులు" - అని యున్నది, ఈ 'అలవలన్" - అనుశబ్దము నాకరమే గాలేదు. అలఁతులు అని మార్చినాను. అల్పతపో నిరతులు, అను దానికి బదులు - అల్పతపోవృత్తులు అనుపాఠము నాకు యుక్తముగాఁగన బడుటచే దానిని స్వీకరించినాను. 245

సీ. ఇంద్రియంబులతోడన్ ఎలమిన్ ఒప్పెడి మహదాదులన్=ఇంద్రియములతోఁగూడికొన్న మహత్తు మొదలైన వానిని, ఇతర అనుషంగముగన్ చేసి=పరస్పరముఁ జేరిన వానినిగా నొనర్చి, వానియందున్=వానిలో, విరాడ్దేహంబున్ పుట్టించి, అందున్ చేపట్టి=ప్రవేశించి, తానున్ వసియించున్ =ఆతఁడు, వరుసన్, సహస్ర సంఖ్యాతంబులు=అనేక సంఖ్యలుగల, మస్తక= శిరస్సులు, అంఘ్రి=పాదములు, బాహు=చేతులు - వీనిచేత, కలిత సత్పురుషునిగాన్=కూడుకొన్నవానినిగా, బ్రహ్మవాదులు పలుకుదురు=జ్ఞానులు చెప్పెదరు, ఆ విరాట్పురుషునందున్=ఆ విరాట్పురుషునిలో, భువన జాలంబులు=ప్రపంచములు, అలజడిన్=పొరయకుండున్=ఇరుకుగా లేక వసించును, ప్రాణదశకంబున్=ప్రాణాపానాదులైన పది వాయువులును, ఇంద్రియార్థములన్=ఇంద్రియములు, తదధి దేవతలును, అనఘ, త్రివిధ మగుచున్=మూఁడు రీతులైనదై, విప్రాది వర్ణములయ్యెన్=బ్రాహ్మణాది జాతులయ్యెను. 246

తాత్పర్యము : ఇంద్రియములతోఁగూడిన మహదాదుల నాతఁడు సృష్టించినాఁడు, "సవికారాణి" అని మూలము. అవి పరస్పరము గలియకుండ వానిని గలిపినాఁడు. కలిపి తదంశములతో విరాట్పురుషుని గల్పించెను. మరల వానియందే తాను బ్రవేశించినాఁడు. ఆతనికి సహస్ర మస్తములు, అంఘ్రులు, బాహువులు. ఇదేపురుషావతారము. ఈ సమష్టి పురుషునందే భువనజాలములు సంకోచము లేక వర్తించును. నాగాదులైన దశవిధప్రాణములు, ఇంద్రియములు - ఇంద్రియాధిదేవతలు - తద్విభూతులైన

బ్రాహ్మణాదివర్ణములు అన్నియు నేర్పడెను. ఈ యేర్పడినట్టి విభూతులను సమగ్రముగా వర్ణించె చెప్పుము.

కం. పుత్రపౌత్రాదులచేఁగూడిన వంశములతో బ్రజలెట్లీ ప్రపంచమున వర్తించిరి! అట్టిప్రజలచే నీజగత్తు లెట్లుండెను ? 247

కం. పద్మాపతి=నారాయణమూర్తి, స్రష్టృప్రతతులచేన్=ప్రజాపతుల చేత. 248

తాత్పర్యము : ప్రజాపతులకుఁ బతియైన శ్రీమహావిష్ణువు, ఎవ్వ రెవ్వరిని బ్రజాపతులనుగా సృష్టించెను! నవవిధములైన సర్గము లేవి ? వాని భేదములను వర్ణింపుము.

"తత్+మనుకుల అనుచరితములు, 249

తాత్పర్యము : మనువంశములు, మనుకులాధీశ్వరులు, వారివంశ చరిత్రము వీనినన్నిటిని ఏవిభూతిలోఁగల్గించినాఁడు! వానిని వర్ణింపుము.

కం. భూమిక్రిందను, మీఁదను, గల్గులోకముల స్థితులను - వాని క్రమములును, వాని పరిణామములును వర్ణింపుము, 250

కం. ఓమైత్రేయా! దేవతలు, తిర్యక్కులు, నరులు, మొదలైనవారి జన్మప్రకారములు, గార్భ, స్వేదజ, అండజముల తెఱఁగులు వర్ణింపుము. 251

కం. త్రిగుణప్రధానకములు=సత్త్వాదిగుణములు ప్రధానముగాఁ గలవి. నిగమముల విధంబున్=పద్ధతులును, వానినిలు కడలును=వాని స్థితులను. 252

తాత్పర్యము : సత్త్వాదిగుణములతోఁగూడినబ్రహ్మ విష్ణురుద్రాద్యవ తారములును, వానిక్రమములును జెప్పుము.

కం. చక్రాయుధుని సౌందర్యము పరాక్రమము మొదలైనవానిని బ్రాహ్మణాది వర్ణములను ఆశ్రమాదిధర్మములను శీలములును వృత్తములును వివరింపుము. 253

తే. యోగవిస్తారమహిమలు=యోగపద్ధతులు, పరిజ్ఞానసాధనములు నైయొప్పు సాంఖ్యయోగములు=జ్ఞానాశ్రయములైన సాంఖ్యాదులు, వికచజలజనయన=వికసించిన తామరలవంటి కన్నులుగల విష్ణువుచే సృజింపఁబడిన శాస్త్రములు వివరింపుము. 254

సీ. పాషండమార్గము, ప్రతిలోమకులములు విభాగములు, జీవుల గుణకర్మముల రహస్యములు, ధర్మమోక్షములకుఁబరస్పరము విరోధము లేని సాధనములు, దండనీత్యాదులు, తారాగ్రహాదులు, సమస్త విషయములను వివరింపుము.

భూజనావళికిన్=భూమియందలి మనుష్యులకు,విపత్+దశధర్మములు =ఆపద్ధర్మములు, 256

తాత్పర్యము : మానవుఁ డనుసరింపఁదగిన యాపద్ధర్మము లెట్టివి? భగవంతుఁ డెట్టికర్మలతో సంతోషించును? ఎట్టివారినీ రక్షించుటకు జాగరూకుఁడై యుండును! గురువులు ప్రియశిష్యుల కెఱిఁగించు పరమ ధర్మము లేవి?

కం. విలయాదిభేదములన్=ప్రళయాదులందు, అయ్యలఘునిన్=ఆ గొప్పవాఁడైన పరమేశున్=భగవంతుని, కొలుతురు ఉత్కలికన్= ఉత్కంఠతో. 257

తాత్పర్యము : ప్రళయ మెన్నిరీతులు? ప్రళయకాలమందుఁ బరమేశ్వరుని సేవించుచుండెడి తత్త్వము లేవి? నిద్రించుచున్న రాజును చామరగ్రాహిణుల వలె నెవ్వ రాతనికి సన్నిహితులై చరింతురు? అతనితోఁబాటు నిద్రించు తత్త్వములేవి?

కం. జీవబ్రహ్మలకున్=జీవునకును, బరమాత్మునకును, ఉపనిషదర్థంబై= ఉపనిషత్తులలోఁ జెప్పఁబడు నర్థమై. 258

తాత్పర్యము : జీవుని తత్త్వమేమి? పరమేశ్వరుని స్వరూప మెట్టిది ? ఏ యంశములో వారిర్వురకు నైక్యత? వేదములు, ఉపనిషత్తులు - ఇవి యుపదేశించెడి జ్ఞానప్రకార మెట్టిది?

శిష్యప్రయోజనము లేవి? జ్ఞానసాధనము లేవి? వైరాగ్యముతో సాధింపఁబడు పురుషునకు సంబంధించిన భక్తి యెట్టిది? 259

ఈ విషయము లన్నియు నాకు స్పష్టముగా వివరింపుము, యజ్ఞయాగాదులు చేయించిన ఫలమును, వేదమున చదివిన, చదివించిన ఫలమును, సంసార భయమునుండి నివర్తింపఁజేసి జ్ఞానోపదేశముతో - నార్తుని రక్షించెడి పుణ్యఫలములో కలాంశమును బోలవు. 260

ఈ రీతిగా విదురుఁడు మైత్రేయునడిగిన ప్రకారమంతయును శుకబ్రహ్మ పరీక్షిత్తునకుఁ జెప్పినాఁడు. ఆపై మఱియు నిట్లనెను.

ఇది పుట్టపర్తినారాయణదాస విరచిత

భాగవత సుధాలహరియందు సప్తమాధ్యాయము.

# అష్టమోఽధ్యాయః

మైత్రేయ ఉవాచ

శ్లో. సత్సేవనీయో బత పూరువంశో
యల్లోకపాలో భగవత్ప్రధానః,
బభూవిథేహాఽజితకీర్తిమాలాం
పదే పదే నూతనయస్యభీక్ష్ణమ్. 1

సోఽహం నృణాం క్షుల్ల సుఖాయ దుఃఖం
మహద్గతానాం విరమాయ తస్య,
ప్రవర్తయే భాగవతం పురాణం
యదాహ సాక్షాద్భగవాన్ ఋషిభ్యః, 2

ఆసీన ముర్వ్యాం భగవంత మాద్యం
సంకర్షణం దేవ మకుంఠసత్త్వమ్,
వివిత్సవ స్తత్త్వమతః పరస్య
కుమార ముఖ్యామున యోఽన్వపృచ్ఛన్. 3

స్వ మేవ ధిష్ణ్యం బహుమానయంతం
యం వాసుదేవాభిధ మామనంతి,
ప్రత్యగ్ధృతాక్షాంబుజకోశ మీష,
దున్మీల యంతం విబుధోదయాయ. 4

స్వర్ధున్యుదార్ద్రైః స్వజటాకలాపై
రుపస్పృశంతశ్చరణో పధానమ్,
పద్మం యదర్చంత్య హి రాజకన్యా
స్సప్రేమనానాబలిభి ర్వరార్థాః. 5

ముహు ర్గృణంతో వచనాఽను రాగ
సల త్పదేనాస్య కృతాని తద్జ్ఞాః,
కిరీట సాహస్ర మణి ప్రవేక
ప్రద్యోతి తోద్దామ ఫణా సహస్రమ్. 6

ప్రోక్తం కిలైత ద్భగవత్తమేన
నివృత్తధర్మాభిరతాయ తేన,
సనత్కుమారాయ సచాహ పృష్ట
స్సాంఖ్యాయనా యాథ ధృతవ్రతాయ. 7

సాంఖ్యాయనః పారమహంస్య ముఖ్యో
వివక్షమాణో భగవద్విభూతీః,
జగాద సోఽస్మద్గురవేఽన్వితాయ
పరాశరాయాఽథ బృహస్పతేశ్చ. 8

ప్రోవాచ మహ్యం సదయాళునోక్తో
మునిః పులస్త్యేన పురాణ మాద్యమ్,
సోఽహం తవైత త్కథయామి వత్స
శ్రద్ధాళవే నిత్య మను వ్రతాయ. 9

ఉదాప్లుతం విశ్వ మిదం యదాసీ
త్తన్నిద్రయా మీతదృఙ్మ్నీలయత్,
అహీంద్రతల్పేఽధిశయాన ఏకః
కృతక్షణ స్స్వాత్మ రతావహీనః. 10

సోఽంతశ్శరీరేఽర్పిత భూతసూక్ష్మః
కాలాత్మికాం శక్తి ముదీరయానః,
ఉవాస తస్మిన్ సలిలే పదే స్వే
యథాఽనలో దారుషురుద్ధ వీర్యః. 11

చతుర్యుగా ణాం చ సహస్ర మప్సు
స్వపన్ స్వయోదీరితయా స్వశక్త్యా,
కాలాఖ్యయాఽఽసాదిత కర్మ తంత్రో
లోకాన్ ప్రలీనాన్ దదృశే స్వదేహే. 12

తస్యార్థ సూక్ష్మాభి నివిష్ట దృష్టే
రంతర్గతోఽర్థో రజసా తనీయాన్,
గుణేన కాలానుగ తేన విద్ధ
స్సూష్యం స్తదాభిద్యత నాభి దేశాత్. 13

సపద్మకోశ స్సహసోదతిష్ఠ
త్కాలేన కర్మ ప్రతిబోధనేన,
స్వరోచిషా తత్సలిలం విశాలం
విద్యోతయ న్నర్క ఇవాత్మ యోనిః. 14

తల్లోకపద్మం స ఉ ఏవ విష్ణుః
ప్రావీవిశ త్సర్వగుణావభాసమ్,
తస్మిన్ స్వయం వేదమయో విధాతా
స్వయంభువం యం ప్రవదంతి సోఽభూత్. 15

తస్యాం సచాంభోరుహకర్ణికాయా
మవస్థితో లోక మపశ్యమానః,
పరిక్రమన్ వ్యోమ్ని వివృత్త నేత్ర
శ్చత్వారి లేభేఽనుదిశం ముఖాని. 16

తస్మా ద్యుగాంత శ్వసనావ ఘూర్ణ
మహోర్మిచక్రాత్సలిలా ద్విరూఢమ్,
ఉపాశ్రితః కంజ ము లోకతత్త్వం
నాత్మాన మద్ధా ఽ విద దాది దేవః. 17

క ఏష యోఽసా వహ మబ్జపృష్ఠ
ఏత త్కుతో వాబ్జ మనన్య దప్సు,
అస్తి హ్యధస్తా దిహ కించ నైత
దధిష్ఠితం యత్ర సతాఽనుభావ్యమ్. 18

స ఇత ముద్వీక్ష్య తదబ్జనాళ
నాడీ భి రంతర్జల మావివేశ,
నాఽర్వాగత స్తత్ఖరనాళనాభిం,
స వై విచిన్వం స్తదవిందతాఽజః. 19

తమస్య పారే విదు రాత్మ సర్గం
విచిన్వతోఽభూత్సు మహాం స్త్రినేమిః
యో దేహభాజాం భయ మీరయాణః,
పరిక్షిణో త్యాయు రజస్య హేతిః. 20

తతో నివృత్త్యాఽప్రతిలబ్ధకామః
స్వధిష్ణ్య మాసాద్య పున స్స దేవః,
శనై ర్జిత శ్వాస నివృత్త చిత్తో
న్యషీద దారూఢ సమాధి యోగః. 21

కాలేన సోఽజః పురుషాయుషాఽభి
ప్రవృత్త యోగేన విరూఢ బోధః,
స్వయం తదంతర్హృదయేవభాత
మపశ్యతాఽపశ్యత య న్నపూర్వమ్. 22

మృణాలగౌరాయత శేష భోగ
పర్యంక ఏకం పురుషం శయానమ్,
ఫణాతపత్రాయుత మూర్ధరత్న
ద్యుభిర్హతధ్వాంతయుగాంతతోయే. 23

ప్రేక్షాం క్షిపంతం హరితోపలాద్రే
స్సంధ్యాభ్రనీవేరు రురుక్మమూఒర్ధ్నః,
రత్నోదధారౌషధి సౌమనస్య
వన స్రజో వేణు భుజాంఘ్రిపాంఘ్రేః. 24

ఆయామతో విస్తరత స్స్వమాన
దేహేన లోకత్రయసంగ్రహేణ,
విచిత్రదివ్యాభరణాంశుకానాం,
కృతశ్రియో పాశ్రిత వేషదేహమ్. 25

పుంసాం స్వకామాయ వివిక్తమార్గై
రభ్యర్చితాం కామదుఘాంఘ్రి పద్మమ్,
ప్రదర్శయంతం కృపయా నఖేందు
మయూఖభిన్నాంగులి చారుపత్రమ్. 26

ముఖేన లోకార్తి హరస్మితేన
పరిస్ఫురత్కుండల మండితేన,
శోణాయితేనాధర బింబ భాసా
ప్రత్యర్హయంతం సునసేన సుభ్ర్వా. 27

కదంబ కింజల్క పిశంగ వాససా
స్వలంకృతం మేఖలయా నితంబే,
హారేణచానంతధనేన వత్స!
శ్రీ వత్స వక్షః స్థలవల్లభేన. 28

పరార్థ్యకేయూర మణిప్రవేక
పర్యస్త దోర్దండ సహస్రశాఖమ్,
అవ్యక్త మూలం భువనాంఘ్రిపేంద్ర
మహేంద్రభోగై రభివీతవల్కమ్. 29

చరాచరౌ కో భగవ న్మహీధ్ర
మహేంద్రబంధుం సలిలోపగూఢమ్,
కిరీటసాహస్ర హిరణ్య శృంగ
మావిర్భవ త్కౌస్తు భరత్నగర్భమ్. 30

నివీత మామ్నాయ మధువ్రతశ్రియా
స్వకీర్తిమయ్యా వనమాలయా హరిమ్,

సూర్యేందు వాయ్వగ్న్యగమం త్రిధామభిః
పరిక్రమ త్ప్రాథనికై ర్దురాసదమ్. 31

తర్హ్యేవ తన్నాభి సరస్సరోజ,
మాత్మాన మంభశ్శ్వసనం వియచ్చ,
దదర్శ దేవో జగతో విధాతా
నాతః పరం లోక విసర్గదృష్టిః. 32

స కర్మ బీజం రజసోపరక్తః
ప్రజా స్సిసృక్ష న్ని యదేవ దృష్ట్వా,
అస్తౌ ద్వీసర్గాభిముఖ స్త మీడ్య
మవ్యక్త వర్త్మ న్యభివేశితాత్మా. 33

ఇతి శ్రీ మద్భాగవతే, తృతీయస్కంధే, అష్టమోఽధ్యాయః

**అర్థములు :**

1. శ్లో. యత్=ఏ కారణము చేత, భగవత్ప్రధానః=భగవంతునే ప్రధానముగా నెంచికొని యున్న, లోకపాలః=లోకపాలకులలో నొకఁడైన, యముఁడు, ఇహ=ఈ వంశమందు, బభూవిధ=జన్మించితివో, అజితకీర్తి మాలాం=ఎవ్వరి చేతను జయింపరాని భగవంతుని కీర్తి యనెడు పంక్తిని, పదే పదే=మాటి మాటికిని, అభీక్ష్ణం=ఎక్కువ, నూతన యసి=క్రొత్త జేయుచున్నావో, (అందుచేత) పూరువంశః=పూరువు యొక్క వంశము, సత్సేవ నీయః=సత్పురుషుల చే నాశ్రయించుటకు యోగ్యమైనది.

తాత్పర్యము : విదురుని ప్రశ్న నభినందించుచు మైత్రేయుఁడను చున్నాఁడు. పూరువంశము సజ్జనులచే నాశ్రయింపఁదగిన యోగ్యత గలది. ఎందుకనఁగా నా వంశమందు అష్టదిక్పాలకులలో నొకఁడైనట్టి వాఁడవు, భగవంతునే సర్వాత్మనా గొలిచెడి వాఁడవు నైన యమధర్మరాజువు నీవు జనించితివి. నీ ప్రశ్నలతో భగవంతుని కీర్తి పరంపరలను మాటిమాటికిని నూత్నముగఁజేయుచున్నావు. నీ ప్రశ్నలు నా కెంతయో సంతోషమును గల్గించుచున్నవి.

2. శ్లో. సాక్షాత్ భగవాన్=సాక్షాత్తుగా నారాయణుఁడైన భగవంతుఁడు, ఋషిభ్యః=ఋషుల నుద్దేశించి, యత్ ఆహ=దేనినిఁజెప్పెనో, క్షుల్లసుఖాయ= తుచ్ఛమైన సుఖము కొఱకు, మహత్ దుఃఖం=గొప్ప దుఃఖమును, గతానాం= ప్రాపించియున్న, నృణాం=మనుష్యులకు, తస్య=దానియొక్క, విరమాయ= శాంతి కొఱకై, భాగవతం పురాణం=భాగవతమనెడు పురాణమును, సః అహః=ఆ నేను, ప్రవర్తయే=లోకమందు ప్రసిద్ధపఱచుచున్నాను.

తాత్పర్యము : విదురుని ప్రశ్నలకు సదుత్తరము సంప్రదాయాను సారముగా లోకమందుఁ బ్రచారములో నున్న భాగవత పురాణము ఈయ దగియున్నది. అందుచే నా భక్తి శాస్త్రమును నీకు వచింతునని ప్రతిజ్ఞ సేయు చున్నాఁడు. అల్పసుఖములకై యధికక్లేశములను భవించెడు, మనుష్యుల క్లేశోపశమనమున కుపకరించెడు భాగవతమును, భగవంతుఁడే ఋషుల కుపదేశించినాఁడు. సర్వసిద్ధాంతసారము భాగవతము. నీ ప్రశ్నల కుత్తరముగా నేనా శాస్త్రమునే యుపదేశింపఁబోవుచున్నాను.

3. శ్లో. ఉర్వ్యాం=భూమి యందు, ఆసీనం=అధిష్ఠించియున్న వాఁడును, భగవంతం=ఐశ్వర్య పూర్ణుఁడును, ఆద్యం=ఆదియందున్న వాఁడును, సంకర్షణం=ఆదిశేషుఁడను పేరు గల వాఁడును, అకుంఠసత్త్వం=మొక్కవోని జ్ఞానము గల వాఁడును నైన, దేవం=దేవుని గూర్చి, పరస్య=పరుఁడైన నారాయణ మూర్తి యొక్క, తత్త్వం=పరమార్థమును, వివిత్సవః=తెలిసికోను నాశగల, కుమారముఖ్యాః=కుమారుఁడు మొదలైన, మునయః=మునులు, అన్వపృచ్ఛన్=క్రమముగాఁ బ్రశ్నించిరి.

తాత్పర్యము : ఏ మునుల కేరూపముతో భగవంతుఁడు భాగవతము నుపదేశించెనో చెప్పుచున్నాఁడు. పరమపురుషుని తత్త్వమును గూర్చి స్పష్టముగాఁ దెలియవలెనని. యొక కాలమున సనకాదిమునుల కిచ్ఛ వొడ మినది. వారు ఆ విషయమును సర్వజ్ఞుఁడు, సర్వైశ్వర్యపరిపూర్ణుఁడు - సంకర్షణుఁడను పేరు గల యాదిశేషునిఁ బ్రశ్నించిరి.

4. శ్లో. స్వధిష్ణ్యం=తన కాశ్రయభూతునిగా, యం వాసుదేవాభిధం= ఏవాసు దేవునిని, ఆమనంతి=ఋషులు వర్ణించు చున్నారో అట్టివానిని, బహుమాన యంతం=ఎక్కువగా స్మరించుచున్న వాఁడును, విబుధో దయాయ=దేవోత్తముల యభివృద్ధి కొఱకు, ప్రత్యక్ధృతాక్షాంబుజ కోశం= ప్రత్యగాత్మ యందు నిమగ్నమైన నేత్రమనెడు తామర మొగ్గను. ఈ షదున్మీల యంతం=అల్పముగా వికసింపఁజేసి యున్నట్టియు, (సంకర్షణునిఁ బ్రశ్నిం చిరని వెనుక కన్వయము).

తాత్పర్యము : చిత్తమున కధిష్ఠాన దేవత యని ఋషు లెవ్వని నభివర్ణింతురో తన కాశ్రయమైన యా వాసుదేవుని నిరంతరమును మనసున నిల్పికొని యారాధించుచున్న వాఁడు సంకర్షణుఁడు. ఆ దేవునకు సనకాదు లకుఁ దత్త్వోపదేశమొనర్ప బుద్ధి వొడమినది, ధ్యానమం దర్ధనిమీలితములై యున్న నేత్రములను సనకాదుల వైపునకుఁ ద్రిప్పి యాతఁడు ఈ షద్వికసితములుగా నొనర్చెను.

5. శ్లో. అహిరాజకన్యాః=సర్పరాజ పుత్రికలు, సప్రేమ=ప్రేమతోఁ గూడియున్నట్లుగా, నానాబలిభిః=అనేకములైన పూజా సాధనములతో, వరార్థాః=భర్తృకాంక్షలతోఁ గూడిన వారై, యత్ పద్మం=ఏ తామర పూవును,

అర్చంతి=నిరంతరమును పూజింతురో, చరణోపధానం=పాదాశ్రయమై యున్నదానిని, స్వర్ధున్యుదార్ద్రైః=గంగాజలములచేఁదడిసి యున్న, స్వజటాకలాపైః=జటాభారములతో, ఉపస్పృశంతః=స్పృశించుచున్నవారై (ప్రశ్నించి రని యన్వయము)

తాత్పర్యము : అతని పాదపద్మములు ఒక సర్వసంపన్నమైన పద్మము పై నిలిచియున్నవి. అహిరాజకన్యలా పద్మమును నానాపూజా సాధనములతోఁ బూజించుచుండిరి. ఉత్తములైన భర్తలు దమకు లభింపవలెనని వారౌనర్చెడు నా పూజలు. అట్టి యాచరణాశ్రయమైనయా పద్మమును సనకాది దేవతలు గంగా జలార్ద్రములైన జటాభారములతో స్పృశించి సేవలు చెల్లించుచుండిరి, చెల్లించుచుఁబ్రశ్నించి రని భావము.

6. శ్లో. తత్ జ్ఞాః=జ్ఞానస్వరూపులైన యాబుమలు, అస్య=ఆ సంకరణుని యొక్క, కృతాని=కర్మములను, అనురాగస్ఖలత్పదేన= ప్రేమభారముచే తడఁబడుచున్న పదములు గలిగినట్టి, వచసా=వాక్కుచేత, ముహుః గృణంతః =మాటిమాటికిని స్తుతించుచున్న వారై, కిరీట సాహస్ర........ సహస్రం=కిరీట సహస్రములందున్న ఉత్తమరత్నములచే మిగులఁబ్రకాశించు సహస్ర పటములు గల వానిని.

తాత్పర్యము : సనకాదులు తత్త్వజ్ఞులు. అందుచేత నా సంకరణ మూర్తి యొక్క దివ్యకర్మలను, మనసారఁగీర్తించుచుండిరి, వారి వాక్కులు ప్రేమాధిక్యముతోఁదడబడుచుండెను. ఆయనకు సహస్రశిరస్సులు. వాని నలంకరించిన కిరీటములు. వాని రత్నప్రభలే సంకరణుఁడు ధరించిన పటములపైఁ బ్రతిఫలించుచుండెను. అట్టి యా మూర్తిని సనకాదులు ప్రశ్నించిరని మూఁడు శ్లోకములకును జేరి యన్వయము.

7. శ్లో. భగవత్తమేన=పరిపూర్ణజ్ఞానమూర్తియైన, తేన=సంకరణమూర్తి చేత, నివృత్తి ధర్మాభిరతాయ=నివృత్తి ధర్మమందాసక్తుఁడైన, సనత్కుమారాయ=సనత్కుమారుని కొఱకు, ఏతత్=ఈ భాగవతము, ప్రోక్తంకిల= ఉపదేశింపఁబడె ననుట ప్రసిద్ధము, అంగ=ఓ పూజ్యుఁడా! పృష్టః=అడుగఁబడిన, సః=ఆ సనత్కుమారుఁడు, ధృతవ్రతాయ=వ్రతయుక్తుఁడై, సాంఖ్యాయ నాయ=సాంఖ్యాయనుని గూర్చి, ఆహ=పలికెను.

తాత్పర్యము : నిరతిశయజ్ఞాన రూపుఁడైన సంకరణమూర్తి మోక్షధర్మ రతుఁడైన సనత్కుమారునకు భాగవత శాస్త్రము నుపదేశించెను. ఇది ప్రసిద్ధమైన విషయము. సాంఖ్యాయనుఁడు మహాముని. నసత్కుమారునకు భాగవత శాస్త్రము నుపదేశించెను. ఇది ప్రసిద్ధమైన విషయము. సాంఖ్యాయనుఁ డను మహాముని సనత్కుమారుని మరల నీ విషయమే ప్రశ్నించినాఁడు, సంఖ్యాయనుఁడు ధృతవ్రతుఁడు. ఉపదేశమున కర్హుఁడని యెంచిన సనత్కుమారుఁడు సాంఖ్యాయనునకు భాగవతము నుపదేశించెను.

8. శ్లో. పారమ హంస్య ముఖ్యః=పరమ హంసల ధర్మానుష్ఠాన మందుముఖ్యుఁడైన, సాంఖ్యాయనః=సాంఖ్యాయనుఁడు, భగవద్విభూతీః =భగవంతుని యైశ్వర్యములను, వివక్షమాణః=చెప్పుట కిచ్ఛగల వాఁడె, అన్వితాయ=శిష్యగణములతోఁగూడిన వాఁడైన, అస్మద్గురవే=నా గురువైన, పరాశరాయ=పరాశరునకును, అథ=తరువాత, బృహస్పతేశ్చ=బృహస్పతికిని, జగాద=చెప్పెను.

తాత్పర్యము : పరమహంస ధర్మానుష్ఠాతలందు ముఖ్యుఁడు సాంఖ్యాయనుఁడు. అతనికి భగవంతుని సృష్ట్యాదిలీలలు సమగ్రముగా వర్ణింపలేనను కోర్కి యుండెను. శిష్యులకుఁ గావలసిన సమగ్ర గుణములతోఁగూడిన వాఁడు పరాశరుఁడు. అతనికి సాంఖ్యాయనుఁడా విభూతుల నభివర్ణించెను. ఆ తరువాత బృహస్పతికిఁగూడ నుపదేశించినాఁడు.

9. శ్లో. పులస్త్యేన=పులస్త్యమహాముని చేత, ఉక్తః=చెప్పఁబడిన, సదయాళుః మునిః=దయగల యా ముని, ఆద్యం=ముఖ్యమైన, పురాణం=ఆ పురాణమును, మహ్యం=న న్నుద్దేశించి, ప్రోవాచ=పలికెను, వత్స!= శ్రద్దాళవే=శ్రద్ధతోఁగూడిన వాఁడును, నిత్యం అనువ్రతాయ=నిరంతరమును నన్నేను సరించి యున్న వాఁడవు నైన, తవ=నీకు, ఏతత్=దీనిని, సః అహం = ఆ నేను, కథయామి=చెప్పెదను.

తాత్పర్యము : పులస్త్యమహాముని వరదాన మనెడు ననుగ్రహామునకుఁ బాత్రుఁడైనాఁడు పరాశరుఁడు. అతఁడా పురాణమును దయామాత్రపూర్వకముగా నా కుపదేశించినాఁడు. నా స్నేహమునకు నీవు పాత్రుఁడవై యేకాంతమున నన్ను సేవించితివి. అందుకే దానిని నీ కుపదేశించితిని. పులస్త్యుఁడు పరాశరున కిచ్చిన వర మెట్టిది? పురాణాంతర మం దా కథ యిట్లున్నది. పరాశరుని తండ్రి శక్తి. అతనీ నొక రాక్షసుఁడు భక్షించి పోయెను. ఆ విషయము కుమారుఁడైన పరాశరునకుఁదెలిసినది. అతఁడు రాక్షసుల సమూల నాశనమునకై సత్రయాగ మారంభించినాఁడు, రాక్షసులు పులస్త్యుని సంతానము. కనుక నా ముని పరాశరసత్రయాగము నిలుపనెంచెను. ఆ పులస్త్యుఁడు పరాశరునితో" నీవు పురాణ సంహితను లోకమందుఁబ్రవర్తింపఁజేయు యోగ్యత గలవాఁడ వగుదువు. భగవంతుని పరమారతత్త్వము నీకు స్పష్టముగాఁదెలియును గాక!" అని వరమిచ్చినాఁడు. అందుచేఁబరాశరుఁడు పురాణకర్త యయ్యెను.

10. శ్లో. అహీంద్రతల్పే:శేషశయ్యపై, అధి శయానః=శయనించి యున్నవాఁడును, ఏకః=సహాయరహితుఁడును, స్వాత్మరతౌ=స్వాత్మరతియందు, కృతక్షణః=అవసరమును స్వీకరించిన వాఁడును, నిరీహః= ప్రవృత్తి రహితుఁడును నైన భగవంతుఁడు, యత్=ఎప్పుడు. నిద్రయా= నిద్రానుకరణముతో, న్యమీలయత్=కన్నులు మూసి కొని, ఆ మీలిత దృక్=అల్పముగాఁ దెఱచి కొని యున్న కన్నులు గలవాఁడుగా, ఆసీత్= ఉండెనో, తదా=అప్పుడు, ఇదం విశ్వం=ఈ ప్రపంచము, ఉదాప్లుతం= జలముల యందు మునిఁగి నదిగా, ఆసీత్=ఉండెను.

తాత్పర్యము : ఆదిశేషుని యుపదేశముతో భాగవతము పాతాళ లోకమున వ్యాప్తినందినది. పరాశరుఁడు ఆతని శిష్యులు భూలోకమునఁ బ్రవర్తింపఁ జేసిరి. బృహస్పతి స్వర్గమునఁ బ్రచార మొనర్చెను. సనత్కుమారాదులు స్వర్గమునకుఁ బైనున్న లోకములలోఁ బ్రచార మొనర్చిరి. ఈ సంప్రదాయములను సూచించిన తర్వాత సందర్భము ననుసరించి ప్రశ్నముల కుత్తరముఁ జెప్పఁబోవుచున్నవాఁడై మైత్రేయుఁడు విదురునితో ననుచున్నాఁడు. మహత్తత్త్వాదు లుత్పన్నములయ్యెను. అవి పరస్పరముఁ జేరుటతో బ్రహ్మాండ మేర్పడినది. ఈ విషయములు వివరింపఁబోవు చున్నవాఁడై దానికి ముందున్న ప్రళయా వస్థను సూచించుచున్నాఁడు. స్వరూపానందమందు రమింప నిచ్ఛించిన నారాయణ మూర్తి సృష్ట్యాదిలీలలను స్వల్పకాలము నిలిపి వేసినాఁడు. అతఁడు యోగనిద్ర నంగీకరించెను. నేత్రము లర్ధనిమీలితము లొనర్చి సర్వమును దన యందు లయింపఁ జేసికొనెను. కేవలుఁడై శేషశయ్యపై నిద్రాసక్తుఁడైనాఁడు. అప్పు డీ లోకమంతయు జలమయ మైనది. దీనికే నైమిత్తికప్రళయమని పేరు.

11. శ్లో. రుద్ధవీర్యః=లోపల నణఁచికొన్న శక్తితోఁ గూడిన, అనలః= అగ్ని, దారుని యథా=కొయ్యయం దెట్లుండునో, తథా=అట్లు, సః=ఆ భగవంతుఁడు స్వేతస్మిన్ సలిలే పదే=తన వాస స్థానమైన యా జలమందు, అంతశ్శరీరే=శరీరమధ్యమందు, అర్పిత భూతసూక్ష్మః=అణఁచి పెట్టికొన్న సూక్ష్మభూతములతోఁ గూడిన వాఁడై, కాలాత్మికాం శక్తిం=కాలస్వరూపమైన శక్తిని, ఉదీరయానః=ప్రేరేపించుచున్నవాఁడై, ఉవాస=వసించెను.

తాత్పర్యము : అవతారిక: నైమిత్తిక ప్రళయ మందు జీవరాసు లన్నియు నే స్థితి యందుండును? భగవద్వాసస్థాన మేది? దీనిని స్పష్టపఱచు చున్నాఁడు. సమస్త లోకమును జలమందు మునిఁగి పోయినది, దాని చేత సకల స్థూలవస్తువులును నీటి యందు లయించినవి, దేవ మనుష్యాది జీవరాసు లన్నిటిని భగవంతుఁడు తన శరీరమధ్యమం దణచి పెట్టికొన్న వాఁడై అప్పటి తనవాసస్థాన మైన జలమందు వసించెను. సృష్ట్యాది లీలల నన్నిటిని దనయందే యణఁచి యుంచి కొన్నాఁడు, పునస్సృష్టి కారంభింప వలసిన సమయ మేర్పడినప్పు డీ సూక్ష్మరూపమైన జీవరాశికి స్థూలశరీరము గల్పించుటకై మహదాదితత్త్వములను ప్రద్యోతింపఁ జేయుట కవసరమైన కాలమను పేరు గల శక్తిని ప్రబోధించెడి స్వభావము నంగీకరించియే యోగనిద్ర నవలంచించి యుండునది. ఈ స్థితిని స్పష్టపఱచుటకై యొక యుపమాన మును జెప్పుచున్నాఁడు. ప్రకాశము దాహకశక్తియుఁగల యగ్ని యా స్వరూపమును బ్రకాశపఱుపక అరణియంత ర్భాగమం దెట్లుండునో ఆ విధముగనే భగవంతుఁడును సృష్ట్యాది సామర్థ్యమును లోపల నణఁచి కొన్నవాఁడై యోగనిద్ర నొనర్చు చున్నాఁడని భావము.

12. శ్లో. చతుర్యుగాణాం సహస్రం=చతుర్యుగముల సహస్రము గడచు నంతకు, అప్సు=నీటియందు, స్వం=తనరూపమైన చిచ్ఛక్తితో పాటు,

స్వపన్=నిద్రించుచున్న పరమాత్ముఁడు, ఉదీరితయా=ప్రేరేపింపఁబడిన, కాలాఖ్యయా=కాలమను పేరు గల, స్వశక్త్యా=తన శక్తి చేత, ఆసాదిత కర్మ తంత్రః=స్వీకృతమైన కర్మ స్వభావముతోఁ గూడిన వాడై, స్వదేహే=తన శరీరమందు, ప్రలీనాన్=లయము నెందియున్న, లోకాన్=లోకములను, దదృశే=చూచెను.

తాత్పర్యము : స్వానందరూపమైన స్వరూపము తో భగవంతుఁడీరీతి చతుర్యుగ సహస్రముల కాలమం దాజలముల శయనించెను. ఆ సమయ మందు బ్రహ్మకొక్కరాత్రి ముగిసినది. పునస్సృష్టికాల మాసన్నమైనది. అప్పుడు దనయందు లయించియున్న సర్వజీవరాసులను బయటికిఁ దెచ్చుటకు సమర్థమైనకాలమను పేరుగల తనశక్తిని భగవంతుఁడు ప్రేరేపించినాఁడు. ఆ శక్తియావిర్భూతిచే పరమాత్మ మరల సృష్ట్యాది కర్మముల నంగీకరించెను, అప్పుడు భగవంతుఁడు తన యందు లయించియున్న చరాచరాత్మకములైన జీవరాసుల సూక్ష్మరూపములను వీక్షించినాఁడు.

13. శ్లో. అర్థసూక్ష్మాభిని విష్టదృష్టేః=భూత సూక్ష్మములందు - సమర్పింపఁబడినసంకల్పముతోఁగూడిన, తస్య=ఆ భగవంతుని యొక్క, అంతర్గతః=అంతర్భాగమం దున్నదియు, తనీయాన్=అత్యంతసూక్ష్మము నైన, అర్థః=భూతవర్గము, కాలానుగతేన=కాలశక్తితో యోజించియున్నదైన, రజసా గుణేన=రజోగుణముతో, విద్ధః=క్షోభింపఁజేయబడినదై, సూష్యన్= ఉత్పత్తిని బ్రాపించుటకు భావించుచున్నదై, నాభిదేశాత్=నాభినుండి, అభిద్యత=బయటికి వచ్చినది.

తాత్పర్యము : ఇప్పుడు లోక మేర్పడిన సంప్రదాయమును జెప్పుచున్నాఁడు. లోకసృష్టికుపకరించెడి భూతసూక్ష్మమందు-భగవంతుని సంకల్పశక్తి ప్రవేశించెను. అప్పుడు భగవంతుని యంతర్భాగమందున్న అత్యంత సూక్ష్మరూపమైన భూతసూక్ష్మ వర్గము కాలశక్తి చే క్షోభింపఁజేయఁబడిన రజోగుణముతోఁ బ్రేరేపింపఁబడినది. అప్పుడు అంకురావసను బొందుట కారంభించెను. భగవంతుని నాభీచక్రమును భేదించి కొని బయటికి వచ్చినది. భూమిలోపల లయించిన విత్తు శీతోష్ణములతోఁ బాకమునకు వచ్చినపు డంకురావసను బొంది భూమిని జీల్చికొని గడకు వచ్చుచున్నది. అట్లే భగవంతునీ తో లయించి తృప్తిని జెందుచున్న భూతసూక్ష్మము నాభీచక్రము నుండి బయటికి వచ్చి ప్రకాశింపఁ జొచ్చెను.

14. శ్లో. ఆత్మ యోనిః=ఆత్మనుండి యుద్భవించినదైన, సః పద్మకోశః =ఆ తామరమొగ, అర్క ఇవ=సూర్యుని వలె, స్వరోచిషా=తన కాంతిచేత, విశాలం=అంతటను వ్యాపించి యున్న, తత్సలిలం=ఆ జలము, విద్యోతయన్=ప్రకాశింపఁజేయుచున్నదై, కర్మప్రతి బోధనేన=జీవరాసుల యదృష్టము నుద్బోధించునట్టి, కాలేన=కాలము చేత, సహసా=అప్పుడే, ఉదతిష్ఠత్=బయటికి వచ్చెను.

తాత్పర్యము : అవతారిక : ఆ తామరస్వరూపమును వివరించుచున్నాఁడు. పరమాత్ముఁడైన నారాయణ మూర్తి యొక్క యంతర్భాగము నుండి నాభిచక్రమూలమున బయటికిఁ బ్రకాశించిన భూతసూక్ష్మరూపమైన యాతామర మొగ సకల జీవరాసుల యొక్క సమష్టి రూపమైన యొక దివ్యపద్మము. దాని నుండి ప్రసరించిన కాంతి సూర్యప్రభవలె సర్వతో వ్యాప్తమైయున్న కారణ జలము నెక్కువగాఁ బ్రకాశింపఁజేసెను. ఆ పద్మములో లయించియున్న జీవరాసుల యదృష్టరూపమైన కర్మము ఫలోన్ముఖముగ నౌనర్చ సంసిద్ధమై కాలశక్తి ప్రేరణతో నా పద్మము జలములపై వచ్చి నిలిచినది.

15. శ్లో. సర్వగుణ ప్రభాసం=సకలగుణములను ప్రకాశింపఁ జేయఁబోయెడి, తత్ లోకపద్మం=లోకస్వరూపమైన యా పద్మమును, సః విష్ణురేవ=ఆ మహావిష్ణువే, ప్రావీవిశత్=ప్రవేశించెను. ఉ=ఆశ్చర్యము, తస్మిన్=దాని యందు, స్వయం వేదమయః=స్వయముగా వేదాత్మకుఁడైన, సః విధాతా=ఆ బ్రహ్మదేవుఁడు, అభూత్=ఏర్పడెను, యం=ఎవనిని - స్వయంభువం=తనకుఁదానై యేర్పడిన వానినిగా, వదంతిస్మ=పెద్దలందురు.

తాత్పర్యము : సూర్యతుల్యమైన తేజస్సు ఆ పద్మమునకెట్లు గలిగినది? దానికిఁగారణము, భగవంతుఁడందులోఁ బ్రవేశించుట యే. ఇది భగవంతుని లీల. ఈ యర్థమునే "ఉ" అనెడు శబ్దముతో సూచించినాఁడు. ఇఁకనేర్పడఁబోయెడు సమస్తము యొక్క సూక్ష్మరూపము ఈతామరమొగ యగుటచేత నిది లోకపద్మమని నిర్దేశింపఁబడినది. ఈ పద్మ మెవని నుండి యేర్పడినదో ఆ విష్ణువే దాని యందుఁ బ్రవేశించినాఁడు. అందుచేతనే దానికంత ప్రకాశ మేర్పడినది. సకలమునకును సంబంధించిన జ్ఞానమే స్వరూపముగాఁ గల వాఁడగుటచేత వేదమయుఁడని చెప్పఁబడెడు బ్రహ్మదేవుఁడా పద్మము నుండి జన్మించినాఁడు. ఆ బ్రహ్మజన్మమునకు నింతకన్నను వేఱుకారణము గన్పడకుండుట చేత నతనికి స్వయంభువుడను పేరు గలిగినది. తొల్లటి కల్పము మణఁగిన సమయమందు శ్రీనారాయణునితో నేకీభూతుఁడుగా నున్న బ్రహ్మ - మహావిష్ణువు యోగనిద్రనుండి లేచిన సమయమందు పద్మము ద్వారా స్వయముగనే ప్రకాశించినాఁడు. ఈ కల్పమునకు పాద్మకల్పమని పేరు.

16. శ్లో. తస్యాం అంభోజకర్ణికాయాం:ఆ తామర సకర్ణికపైన, అవస్థితః సః=ఆ దేవుఁడు, లోకం:లోకమును, అపశ్యమానః=చూడనట్టివాఁడై, పరిక్రమన్=చుట్టును చూచు చున్న వాఁడై. వ్యోమ్ని=ఆకాశమందు, వివృత్త నేత్రః= ప్రసరింపఁజేయఁబడిన కన్నులు గలవాఁడై , అనుదిశః=దిక్కులననుసరించి, చత్వారిముఖాని=నాలుముఖములను, లేభే=పొందెను.

తాత్పర్యము : ఆ పద్మ మధ్య మందున్న బ్రహ్మదేవుఁడు పూర్వ సృష్టములైన లోకము లెక్కడున్న వని చూచినాఁడు. అవి కనపడలేదు,

కంఠనాళమును ద్రిప్పుచు నాలుదిక్కులకును చూపులను బ్రసరింపఁ జేసెను. నాలు వైపుల నొక్కసారే చూచుట కనువుగా ఆ సమయ మం దాత నికి నాలు ముఖము లేర్పడినవి.

17. శ్లో. యుగాంతశ్వసనావఘూర్ణజలోర్మిచక్రాత్=యుగాం తావసాన మందుండు పెదగాలులచేఁ జలించుచున్న తరంగ సమూహములతోఁ గూడిన, తస్మాత్ సలిలాత్=ఆ జలమునుండి, విరూఢం=ఉద్భవించినటి, లోకతత్త్వం=లోకము యొక్క సారాంశమై యున్న, కంజం=తామరను, ఉపాశ్రితః=ఆశ్రయించి యున్న, ఆదిదేవః=ఆద్యుఁడైన, యా దేవుఁడు, ఆత్మానం=తన్నుఁ గూర్చి, అద్ధా=చక్కగా, న అవిదత్=తెలిసికొనలేదు.

తాత్పర్యము : శ్రీనారాయణ మూర్తి నుపాసించుటతో నేర్పడిన జ్ఞానప్రకాశము నాశ్రయించియే బ్రహ్మకు లోకసృష్టిసామర్థ్య మేర్పడినది. స్వీయముగా వచ్చినది గాదు. ఈవిషయమును దెలియ పఱచుటకు బ్రహ్మ కేర్పడిన సమ్మోహమును వివరించుచున్నాఁడు. అది ప్రళయాంతము. బ్రహ్మాండముగ వీచుగాలులు. ఆ గాలులలో సముద్రపు నీరు - గగనమును దన్నుచు హోరెత్తించు చున్నది. ఆ సమయమందు తామరపైనున్న బ్రహ్మకు లోకతత్త్వస్వరూపమై యున్న యా తామరను గూర్చి కానీ, తన్నుఁ గూర్చి కాని పరిజ్ఞాన మేర్పడలేదు.

18. శ్లో. అబ్జ పృష్ఠే=తామరయందు, యః అసౌ=వసియించు చున్నటి, ఏష అహం=ఈ నేను? కః=ఎవ్వఁడను? అప్సు=జలమందు, అనన్యత్=మరి దేనితోను చేరక యున్న, ఏతత్ అబ్జం=ఈ పద్మము, కుతః వా=ఎచ్చట నుండి యేర్పడినది? అధస్తాత్ ఇహ=దీనిక్రింద, ఏతదధిష్ఠితం=దీని కధిష్ఠానముగా, కించన=ఏదో యొకటి, అస్తి హి=ఉండితీరవలెను, ఇది నిశ్చయము, యత్ర=దేనియందు, సత్=ఉండుచున్నదానినిగా, అనుభావ్యం=ఊహించి కావలెను.

తాత్పర్యము : ఆది దేవుఁడైన బ్రహ్మ కేర్పడిన మోహస్వరూపమును జెప్పుచున్నాఁడు. ఈ తామరె నాశ్రయించి యున్న నే నెవ్వఁడను? ఎచ్చటఁజూచినను జలమే కన్పడుచున్నది. ఈ జలములో నే యాలం బనమును లేదు. ఈ తామర యెట్లు నిలిచినది? ఈ పద్మము క్రింద దీని కధిష్ఠానమై యేదేని వస్తు వుండవలెను గదా! ఎందుకనఁగా ఆధారము లేని దాధేయ ముండదు. కార్యస్వరూపమై కన్పించుచున్న ప్రతి దానికిని యుత్పత్తి స్థానమైన యొక కారణ ద్రవ్య ముండునని బ్రహ్మ కేర్పడిన మొట్టమొదటి జ్ఞాన స్వరూపమని వివరింపఁబడినది.

19. శ్లో. సః=ఆ చతుర్ముఖుఁడు, ఇత్థం=ఈ ప్రకారము, ఉద్వీక్ష్య=విచా రించిన వాఁడై, తదబ్జనాళ నాడీభిః=ఆతామరనాళమందున్న ద్వారముల గుండా, అంతర్జలం=జలమధ్యమును, ఆవివేశ=ప్రవేశించెను, తత్తర నాళ నాభిం=ఆ తామెర దండమధ్యమందు, విచిన్వన్=వెదకిన వాఁడై, అజః= బ్రహ్మ, అర్వాగతః అపి=సకల భాగము లందును బ్రవేశించియుఁ గూడ, తత్=దానిని, న అవిందత=తెలియఁజాలఁ డయ్యెను.

తాత్పర్యము : ఈ రీతిగా నిశ్చయించి కొని బ్రహ్మ యా పద్మము యొక్క ద్వారము నుండి జలాంతర్భాగమందుఁ బ్రవేశించినాఁడు. దాని యుత్పత్తి స్థాన మేదని వెదకినాఁడు, ఎంత వెదకినను గన్పడ లేదు.

20. శ్లో. విదుర!=ఓ విదురుఁడా!, అపారే=అనంతమైన, తమసి=అంధ కారమందు, ఆత్మ సరం=తన్ను సృష్టించిన వానిని, విచిన్వత=వెదకుచున్న వానికి, సుమహాన్=ఎక్కువైన, త్రినేమిః=కాలము, అభూత్=అయ్యెను, యః =ఏ కాలము, దేహభాజాం=దేహధారులకు, భయం=భయమును. ఈ రయానః =కల్పించు చున్నదె, అజస్య=భగవంతునకు, హేతిః=అయుధమై, ఆయుః= అయుస్సును, పరిక్షిణోతి=నశింపఁజేయుచున్నదో.

తాత్పర్యము : ఓ విదురా! ఆ సమయమం దంధకారము అపారముగ నాక్రమించియున్నది, తన్ను సృష్టించిన వానిని వెదకు చున్న బ్రహ్మదేవున కెంతకాలము సెలైను? ఎంతకాలము చెల్లిన దనుటకు నూఱువర్షములు చెల్లెనని సూచించు చున్నాఁడు, ఏ కాలము ప్రాణులకు భయమును జనింపఁజేసి వారి యాయువును ఎంతలో గ్రసించుచున్నదో అంతకాలము చెల్లెనని యర్థము, "శతాయుః పురుషః" - అనెడు సూక్తి ననుసరించి. నూరువర్షములు చెప్పఁబడినది.

21. శ్లో. అప్రతిలబకామః=నెరవేరని కోర్కిగల బ్రహ్మదేవుఁడు, తతః =ఆకార్యము నుండి, నివృత్తః=మరలిన వాఁడై, సః దేవః=ఆ దేవుఁడు, పునః మరల, స్వధిష్ణ్యం=తన యధిష్ఠానమును, ఆసాద్య=పొంది, శనైః= మెల్లమెల్లఁగా, జితశ్వాస నివృత్త చిత్తః=శ్వాసమును జయించుట, చిత్తమును నిరోధించుట యను కార్యము లొనర్చి, ఆరూఢ సమాధి యోగః=సమాధి యోగము నాశ్రయించిన వాఁడై, న్యషీదత్=ఉండెను.

తాత్పర్యము : మరల బ్రహ్మదేవుఁ డన్వేషించెను. మరల నిరాశయే గల్గెను. అప్పు డాతఁ డాప్రయత్నమును వదలినాఁడు. వాస స్థానమైన కమలమును జేరెను. తనలోననే వెదుక వలెనని నిశ్చయించి కొన్నాఁడు శ్వాసములను గ్రమముగా నిరోధించినాఁడు. మనస్సును విషయాంతరముల నుండి మరల్చెను. తనకుఁ గారణమైన దానిని గన్గొనవలెనని దృఢభావముతో యోగమును బట్టినాఁడు.

22. శ్లో. పురుషాయుషాకాలేన=నూరు సంవత్సరములు, అభిప్రవృత్త యోగేన=అభ్యసింపఁబడిన యోగము చేత, నిరూఢబోధః=ఎదిగినట్టి జ్ఞానము గలవాఁడై, సః అజః=ఆ బ్రహ్మ, యత్=దేనిని, పూర్వం= అంతకుముందు, న అపశ్యత=చూడలేదో, తత్=దానిని, అంతర్హృదయే= హృదయమధ్య మందు, స్వయం=తనకుఁదానే, అవభాతం=ప్రకాశించు చున్న దానినిగా, అపశ్యత=చూచెను.

తాత్పర్యము : నూఱుసంవత్సరము లాతఁడా యోగము ననుష్ఠించినాఁడు. దానితో నాతఁడు తన్ను సృష్టించిన పరమపురుష నెఱుఁగుటకుఁ

దగిన యోగ్యతను సాధించికొనెను, ఇంతకు ముందుఁ బ్రయత్నించియుఁ దాను పొడగాంచ నేరని యా సత్యవస్తువు దన హృదయ మధ్య మందే యున్నది. బయట వెదకినచో లాభము లేదనియు, వెదుకవలసినది హృదయ మధ్యమందే యనియు - నీ పరమ రహస్యమును బ్రహ్మ గుర్తించెను. భగవత్సాక్షాత్కారమును నకుఁ గ్రియాకలాపము లేవియుఁ బనికి రావనియు, ధ్యాన మొక్కటె మార్గ మనియు నిందుఁ జెప్పబడిన దాని సారము.

23. శ్లో. ఫణాతపత్రాయుత మూర్ధరత్నద్యుభిః=ఫణములనెడు నాత పత్రములతోఁ గూడిన శిరమునందలి రత్నకాంతుల చేత, హతధ్వాంతయు గాంతతోయే=దట్టముగ వ్యాపించిన చీఁకటి సమసి పోయిన యుగాంతజ లమందు, మృణాల గౌరాయతశేషభోగపర్యంకే=పద్మనాళమువలె శుభ్రము, దీర్ఘమునైన శేష శయనమందు, శయానం=విశ్రమించియున్నట్టి, ఏకం పురుషం=కేవలుఁడైన పురుముని, అపశ్యత్=చూచెను.

తాత్పర్యము : బ్రహ్మ తన సమాధిలో హృదయ మధ్యమందుఁ జూచిన పరమపురుషుని స్వరూపమును తొమ్మిది శ్లోకములతో వరించు చున్నాఁడు. ఆది శేషునకు వేయితలలు,.అవి గొడుగుల వలె విస్తీర్ణములై యుండెను. ఆ శిరస్సులపై ననేకరత్నములు. ఆ రత్నముల కాంతి దిక్కులకుఁ బర్వుచు వ్యాపించి యున్న చీఁకటులఁ బోఁద్రోలు చుండెను. యుగాంత జలాంధ కారము ఆ రత్నచ్ఛాయలకు నిలువలేక తొలఁగి పోవుచుండెను. ఆతని శరీరము మృణాల గౌరము, బహువిస్తీర్ణమై యుండినది. అట్టి యాదిశేషుఁడను పర్యంకముపై కేవలుఁడుగా స్వామి శయనించి యున్నాఁడు. ఆ స్వామిని బ్రహ్మ దర్శించెను.

24. శ్లో. వేణు భుజాంఘ్రిపాంఘ్రైః=వేణువులవంటి భుజములు వృక్షములవంటి పాదములు, రత్నోదధారౌషధి సౌమనస్య వనస్రజః =జలధారలు - సౌరభ్యము గల వనపుష్పములు అను వీనితోఁ గూడినది. ఉరురుక్మమూర్ధ్నః=గొప్పదైన స్వర్ణము శిఖరములందుఁ గలది. సంధ్యాభ్రనీవేః=సంధ్యా కాలమేఘమను వస్త్రముతోఁ గూడినదియు నైన, హరి తోపలాద్రేః=మరకత పర్వతము యొక్క, ప్రేక్షాం=శోభను, క్షిపంతం= తిరస్కరించుచున్నవానిని (చూచెను).

తాత్పర్యము : శేషపర్యంకమందుఁ బవ్వళించిన యా మహాపురుముఁడు తనశోభతో మరకత పర్వతము యొక్క శోభను దిరస్కరించుచున్నట్లు బ్రహ్మదేవునకుఁ గన్పించినాఁడు. ఏయే భాగముతోఁ పర్వతము యొక్క యేయేయంశమును జయించెనో చెప్పుచున్నాఁడు. సంధ్యాకాలమేఘమనెడు వస్త్రము పర్వతమున కున్నది. స్వామి పీతాంబరమును ధరించినాఁడు. దాని శోభ సంధ్యాకాలశోభను దిరస్కరించుచున్నది. భగవంతుని కిరీటస్వర్ణ కాంతి పర్వతశిఖరస్థిత - స్వర్ణకాంతులను ధిక్కరించినది. కౌస్తుభము

పర్వతరత్నములఁదిరస్కరించినది. ముక్తాహారములు జలధారల నధఃకరించినవి. తులసీమాల పర్వత సౌరభ్యపుష్పములఁ దక్కువ పఱచినది. బాహువులు వేణువులను దిరస్కరించినవి, పాదములు పర్వతవృక్షములను దక్కువ పఱచినవి. ఇట్టి మహాపురుషుని బ్రహ్మ చూచెను.

25. శ్లో. ఆయామతః=దైర్ఘ్యము ననుసరించి, విస్తరతః=వైశాల్యమునను సరించియు, లోకత్రయసంగ్రహేణ=మూఁడులోకములను ఆక్రమింప సమర్థమైయున్న, విచిత్ర దివ్యాభరణాంశుకానాంకృత శ్రియా=విచిత్రములును, దివ్యములునునైన, యాభరణములు, వస్త్రములు- వీనితోఁ గూడియున్న,దైవ స్వమాన దేహేన=తన కనురూపమైన దేహముతోను, తత్స్వరూపశోభాంక్షిపంతం=ఆ పర్వతము యొక్క శోభను దిరస్కరించు చున్నట్టియు, అపాశ్రిత దేహవేషం=సంకల్పించిన వేషమును వహించినట్టి, ఈహా=ఇచ్ఛతోఁగూడిన వాఁడును.

తాత్పర్యము : అతని దేహము మూఁడు లోకములను నాక్రమింపఁ గలిగిన దైర్ఘ్యము గలది, విస్తారము గలది, నానా విధములైన యాభరణములు వస్త్రములు, వాని ముందు మరకత పర్వత శోభ యెక్కడనో యణఁగి పోవు చుండెను. సమస్తమహాలక్షణములు నా దేహమున కున్నవి, ఆ భగవంతుఁ డెప్పు డెట్టి దేహమును ధరింప సంకల్పించునో - తత్క్షణ మట్టి దేహము ప్రాప్తించును. అతని యిచ్ఛాశక్తి యట్టిది. అతని సంకల్పమే సమస్త కార్య సంపాదన క్షమము.

26. శ్లో. వివిక్త మార్గైః=పరిశుద్ధమైన మార్గము నాశ్రయించు, స్వకామాయ=తమ యభీష్ట ప్రాప్తికై, అభ్యర్చ్యతాం=సాదరముగాఁ బూజించుచున్న, పుంసాం=పురుషులకు, నఖేందు మయూఖ భిన్నాంగుళి చారు పత్రం=గోళ్లనెడు చంద్రకాంతుల చేత(కిరణముల చేత) - వికసితములై, మనోహారదళములతోఁ గూడిన, కామదుఘాంఘ్రిపద్మం=అభీష్టములను పితికెడు చరణపద్మమును, కృపయా=దయతో, ప్రదర్శయంతం=ప్రదర్శించు చున్న వానిని (చూచెను).

తాత్పర్యము : హింసాది దోషసంపర్కము లేని పరిశుద్ధమైన భక్తి మార్గము నవలంబించి భగవంతునిలో నైక్యమనెడు పరమ పురుషార్థమును బొందు కోర్కితోఁ బూజ యొనర్చెడు పురుషుల యభీష్టము నిచ్చునట్టియు, నఖములనెడు చంద్రకిరణముల స్పర్శచే వికసించిన వ్రేళ్లనెడు దళములతోఁ గూడినదియు, సర్వాభీష్ట ప్రదాన సమర్థమునైన తన పాదమును గరుణా నిమిత్తముగా, భక్తులకుఁ గన్పింపఁజేసెడు వానిని వీక్షించెనని భావము.

27. శ్లో. సునాసేన=మంచి నాసికతోను, సుభ్రువా=మనోహరమైన బొమలతోను, అధరబింబభాసా=దొండపండుతో సమానమగు నధరబింబము చేత, శోణాయితేన=ఎఱ్ఱనైనట్టియు, పరిస్ఫురత్కుండల మండి తేన=ఎక్కువగా శోభించెడి కర్ణాభరణములచే నలంకరింపఁబడినదియు, లోకార్తి

హారస్మితేన=లోకదుఃఖములను బోఁగొట్టెడు చిఱునవ్వుతోఁగూడినదియు నైన, ముఖేన=ముఖముతో, ప్రత్యర్హయంతం=భక్తుల నాదరించుచున్న వాఁడును.

తాత్పర్యము : అందమైన నాసిక, మనోహరములైన కనుబొమలు, పరమశోభనములైన కర్ణాభరణములు, దొండపండు వంటి పెదవి - వీనితోఁగూడినది స్వామి ముఖము. మూఁడు విధములైన తాపములను నిశ్శేషముగాఁ బోఁగొట్టున దాతని మందహాసము. దానితో నలంకరింపఁ బడిన ముఖముతో, భక్తుల నాదరించి యానందించువాఁడు భగవంతుఁడు.

28. శ్లో. వత్స!=ఓ విదురుఁడా! కదంబకింజల్కపిశంగవాససా= కదంబపుష్పకేసరములవలె పచ్చనైన పీతాంబరముతోను, మేఖలయా=ఒడ్డాణము తోను, నితంబే=నితంబస్థలము నలంకరించి, అనంతఘనేన= అమూల్యమైనట్టి, శ్రీవత్సవక్షస్స్థలవల్లభేన=శ్రీ వత్సమను మచ్చగల వక్షమం దెక్కువగాఁ బ్రకాశించెడు, హారేణ=ముత్యాలహారము చేత, స్వలంకృతం=చక్కగా నలంకరింపఁబడిన వాఁడును.

తాత్పర్యము : కదంబకింజల్కముల వలె పచ్చని కాంతి గల పీతాంబరము, స్వర్ణము నం దమూల్య రత్నములు పొదిగిన మేఖల -ఆ మేఖలతో నందమైన నితంబదేశము, శ్రీవత్సమనుమచ్చతో నలంకృతమైన వక్షము - దాని యందుఁ బ్రకాశించు ముత్యాల హారము.

29. శ్లో. పరార్ధ్య=సర్వోత్తమమైన, కేయూర=బాహుపురులు, మణి ప్రవేక=రత్నముల కాంతులతో, పర్యస్త=అలంకృతములైన, దోర్దండ= భుజములనెడు, సహస్ర శాఖం=అనేక బాహువులు గలట్టియు, అవ్యక్తమూలం=వ్యక్తము గాని మూలముతోఁ గూడినట్టియు, అహీంద్ర భోగైః=సర్పశ్రేష్ఠుఁడైన ఆది శేషుని అవయవముల చేత, అభినీతవల్కం= చుట్టఁబడిన స్కంధముతోఁ గూడిన వాఁడును. భువనాంఘ్రిపేంద్ర= లోకరూపమైన శ్రేష్ఠవృక్షమును, అపశ్యత్=చూచెను,

తాత్పర్యము : భగవంతుని చందన వృక్షముగా వర్ణించుచున్నాఁడు. ఉత్కృష్టములైన రత్నములు; అవి పొదిగిన బాహుపురులు, వానిచే నలంకృతములైన బాహువులను కొమ్మలు; ఎంతఁజూచినను బోధపడని మూలము; మూఁడు లోకముల యందును వ్యాప్తి; ఆదిశేషుని భోగపరివేష్ట నము - ఈ విశేషములతో భగవంతుఁడు చందనవృక్షము వలె నున్నాఁడు.

30. శ్లో. సలిలోపగూఢం=జలములతో నాక్రమింపఁబడిన వాఁడు, కిరీట సాహస్ర హిరణ్మయ శృంగం=అనేక కిరీటము లనెడు కరములు గల వాఁడు, అహీంద్ర బంధుం=సర్పబంధువు, అవిర్భవత్కౌస్తుభరత్నం = అంతర్భాగమున శోభించుచున్న కౌస్తుభరత్నము గల వాఁడు, చరాచరౌకో భగవన్మహీధ్రం=చరాచరవాసస్థానమైన భగవంతుఁడనెడు పర్వతమును.

తాత్పర్యము : ఇంతకు ముందొక శ్లోకముతో భగవంతుని పర్వత రూపము గా వర్ణించినాఁడు. ఇచ్చటఁగూడ ప్రకారాంతరముగనే వర్ణించు చున్నాడు. భగవంతుఁడను మహాపర్వతమును బ్రహ్మదేవుఁడు వీక్షించెను. పర్వతమునకును, భగవంతునకును నన్వయించెడి విశేషణము లీ శ్లోకములో వచ్చును. చరాచరాత్మకమైన లోకము ఇప్పుడు భగవంతునే యాశ్రయించి యున్నది. పర్వతమందును, పక్షిమృగాదులైన చరములును, వృక్షాద్య చరములును వసించును. పర్వతమందు సర్పములుండుటతో నది సర్ప బంధు వైనది. భగవంతుఁడును ఆదిశేషునకు బంధువు. మందరాది పర్వతములు సముద్ర వేష్టిత ములై యుండును. భగవంతుఁడు గూడ ప్రళయజలముచే నావృతుఁడు. అనేక కిరీటములు భగవంతుని శిరస్సు పై శోభించుచున్నవి. మేర్వాదుల కనేక స్వర్ణశిఖరములు. భగవంతుని వక్షస్సు పై కౌస్తుభరత్నము. పర్వతమునం దనేక రత్నములు. ఈ రీతిగ సాదృశ్యము నన్వయించి కొన వలెను.

31. శ్లో. ఆమ్నాయ మధుప్రవ్రత శ్రియా=వేదములనెడు తుమ్మెదల యొక్క శోభగలదియు, స్వకీర్తి మయ్యా=తన కీర్తి స్వరూపమునైన, వనమాలయా= వన మాలచేత, నివీతం=వ్యాప్తుఁడును, సూర్యేందు వాయ్వగ్న్యగమం= చంద్రుఁడు, వాయువు, అగ్ని - వీనిచేఁ బొందరాని వాఁడును, త్రిధామభిః =ములోకముల యందును తేజస్సుగలిగిన, పరిక్రమతా ధానికైః=నాలుదిక్కు లందును సంచరించుచున్న ఆయుధముల చేత, దురాసదం=పొందుట కశక్య మైన వానిని.

తాత్పర్యము :వేదములను తుమ్మెదలు, స్వకీర్తిని గానము చేయు చున్నవి. వానిచేఁ బరివేష్టింపఁబడిన వనమాల పాదముల వఱకు వ్రేలాడు చున్నది; అదియును నాతని కీర్తి వలెనే తెల్లగా నున్నది. సూర్యుఁడు, చంద్రుఁడు, వాయువు, అగ్ని - వీరి వ్యాపారములతో నా పరమపురుషునకే వికారమును గలుగుట లేదు. ములోకముల యందును వ్యాపింపఁదగినకాంతి విశేషముగల సుదర్శనాద్యాయుధములు మూర్తి మంతములై, రక్షార్థ మాత నికి నాలు దిక్కులందును దిరుగుచున్నవి. ఆ యా యుధము లెవ్వరి చేతను జయింపఁబడరానివి. అట్టి శ్రీహరిని బ్రహ్మ చూచెను.

32. శ్లో. తర్హి ఏవ=అప్పుడే, తన్నాభిసరస్సరోజం=అతని నాభియనెడు సరస్సు నందున్న తామరను, ఆత్మానం=తనను, అంభశ్చ=నీటిని, శ్వసనం చ=ప్రళయాంత వాయువును, వియత్ చ=ఆకాశమును, దదర్శ=బ్రహ్మ చూచెను, లోకవిసర్గ దృష్టిః=లోక మును సృష్టింపవలె నను సంకల్పముతోఁ గూడిన, జగతః విధాతా=లోకనిర్మాతయైన, దేవః=బ్రహ్మదేవుఁడు, అంతః పదం=వానినిఁగాక -తక్కిన వానిని, న దదర్శ=చూడలేదు.

తాత్పర్యము: పరమపురుషుని బ్రహ్మదేవుఁడెప్పుడు చూచెనో అప్పుడే యాతని నాభియను తటాకమందలి తామరను గాంచెను. దానియందున్న

తన్ను వీక్షించినాఁడు. ప్రళయ జలము, వాయువు, ఆకాశము - వీనినిఁగూడఁ జూచెను. లోకములను సృష్టింపలెనను వాసనతోఁగూడిన బ్రహ్మదేవుఁడు పై వానినిఁదప్ప నన్యములను గాంచలేదు.

33. శ్లో. రాజసా=రజోగుణముచేత, ఉపరక్తః=వ్యాప్తుఁడైన బ్రహ్మదేవుఁడు, ప్రజాః=ప్రజలను, సిసృక్షన్=సృష్టింప నిచ్ఛించిన వాఁడును, విసరాభిముఖం= విసరమం దభిముఖమైన సంకల్పముతోఁ గూడిన వాఁడును, అవ్యక్తవర్త్మని=వ్యక్తముగాని మార్గముతోఁగూడిన భగవంతునందు, అభివేశితాత్మా=స్థిరముగా నుంపఁబడిన యంతఃకరణముతోఁ గూడిన, సః=ఆ బ్రహ్మ, ఇయదేవ=ఇంతమాత్రమే, దృష్ట్వా=చూచి, కర్మబీజం=జగత్కారణమును, ఈడ్యం=స్తుతింప నర్హుఁడునైన, తం=ఆ భగవంతుని, అస్తౌత్=స్తుతించెను.

తాత్పర్యము : లోకసృష్టి యొనర్పవలెనను సంకల్పము బ్రహ్మకు జనించినది. వెంటనే రజోగుణ మాతని నావరించెను. ఆతఁడు నాభ్యమైన తామర - ప్రళయ జలము - వాయ్వాకాశములు వీనినిఁజూచినంతనే సమస్త జగత్తులకును గారణమైన భగవంతునందు మనస్సు నర్పించినాఁడు. తన కార్యమునకుఁదగిన శక్తి నిచ్చు పరమాత్ముఁడితఁడే యని బ్రహ్మకు నిశ్చయ మేర్పడినది, పొగడఁదగిన యా భగవంతు నిట్లు పొగడ నారంభించినాఁడు.

## శ్రీధరీయము

"అష్టమే సమభూద్బ్రహ్మా నాభేస్తు జల శాయినః,
సమీజానన్ జలేబిభ్య త్తపసాऽతోషయత భుమ్."

- అష్టమాధ్యాయమందు విష్ణువు నాభిపద్మము నుండి బ్రహ్మ జనించిన విధము తెలుపఁబడుచున్నది. తన యుత్పత్తిని గూర్చి తెలియని బ్రహ్మ తపస్సుతో భగవంతుని సంతోష పఱచుచున్నాఁడు.

1. శ్లో. శ్రోతయైన విదురుని మైత్రేయుఁ డభినందించుచున్నాఁడు - "లోకస్తు భువనేవనే"-లోకాన్ పాలయతీతి లోకపాలః=జనులను బరిపాలించునది. ఇది పూరువంశవిశేషణము. సత్సేవనీయః=సత్పురుషులు సేవింపఁదగినది. బత=హార్షారకము, భగవతధానః=భగవంతుఁడే ప్రధానముగాఁ గలిగిన నీవు ఏవంశమందు జనించితివో - అట్టి పూరు వంశము సత్సేవనీయమని యన్వయము. విదురుఁడు భగవతధానుఁడగు టలో హేతువును జెప్పుచున్నాడు. అజితకీర్తి మాలాం=శ్రీహరిచరిత్రపరం పరను, పదేపదే=ప్రతిక్షణమందును, నూతన యసి=క్రొత్తగాఁజేయు చున్నావు.

2. శ్లో. క్షుల్ల సుఖాయ=క్షణికమైన సుఖమునకు మహాదుఃఖమును బొందెడు జనుల దుఃఖ ప్రశమనార్థమై భాగవతము నారంభించు చున్నానని యర్థము.

3. శ్లో. ఆ భగవంతుఁ డెవ్వఁడు? తన తత్త్వ మాతఁ డే ఋషులకుఁ జెప్పెను? దానిని నీ వెట్లు పొందితివి? ఈ ప్రశ్నల నేడు శ్లోకములతో సమాధానించుచున్నాఁడు. ఉర్వ్యాం=పాతాళమందు, అకుంఠసత్త్వం= అకుంఠిత జ్ఞానము గలిగిన, సంకర్షణం=సంకర్షణుని నుండి, వాసుదేవతత్త్వమును వినఁగోరు వారై సనత్కుమార ప్రభృతులు వేడిరని తాత్పర్యము.

4. శ్లో. సంకర్షణస్వరూపమును వివరించుచున్నాఁడు. ఆమనంతి= మహాపురుషులు మనస్సుతో మనన మొనర్చుచున్నారు. పరమానంద స్వరూపమైన వాసు దేవతత్త్వమునకుఁ దానే యాశ్రయుఁడుగా నుండి నిరంతరమును ధ్యానించుచు అనుభవించుచున్న వాఁడని యర్థము, ప్రత్యక్ దృశం=అంతర్ముఖీకృతమైన నేత్రాంబుజకోశమును సనత్కుమారాదుల యభ్యుదయార్థమై వారి కభిముఖముగా కించిదున్మీలన మొనర్చుచున్న వాఁడు.

5. శ్లో. అహిరాజకన్యాః=నాగరాజకన్యలు, వరార్థాః=పతికామలై, నానాబలిభిః=నానావిధోపహారముల చేత, సప్రేమ=ప్రేమసహితముగా; సంకర్షణచరణోపధానమైన పద్మమును బూజించు చున్నారు. "చరణౌ ఉపధీయంతే అస్మిన్నితి - చరణోపధానం" - స్వరున్యుదకేన=ఆకాశగంగా జలము చేత ఆర్ద్రములైన జటాకలాపములతో చరణోపధానమును దాఁకు చున్న వారై అని యర్థము.

6. శ్లో. కృతానురాగముచేత స్ఖలించుచున్న పదములు గల వాక్కులతో సంకర్షణుని కర్మములను బొగడు చున్నవారై అని భావము. భాగవత శ్రవణార్థము వారు సత్యలోకము నుండి పాతాళమునకు వచ్చుచు నిరంతరమును గంగామధ్యము నుండి యే యవతీర్ణులగుదురని తాత్పర్యము. మణి ప్రవేకములనఁగా మణి శ్రేష్ఠములు. ఉద్దామఫణాసహస్రము - ఇచ్చటి `ఉద్దామ' శబ్దమునకు ధీరములై, యుదాత్తములైనవని భావము.

7. శ్లో. సంకర్షణుఁడు సనత్కుమారునకుఁ జెప్పెను. అతఁడు సాంఖ్యాయనునకును వివరించినాఁడు.

8. శ్లో. పారమహంస్య ముఖ్యః=పారమహంస్య ధర్మము ననుసరించు వారిలో శ్రేష్ఠుఁడు. వివక్షమాణః అనునది యాత్మనే పదము `బ్రూఞ్' - ఆదేశము గలి వచి ధాతువు ఉభయపది. అన్వితాయ - తన్నను గమన మొనర్చువాఁడు.

9. శ్లో. పరాశరుని తండ్రి నొకానొక రాక్షసుఁడు భక్షించెను. అతఁడు రాక్షససత్రమును జేయుట కుద్యుక్తుఁడైనాఁడు. పులస్త్యుఁడు వారించెను. తన సంతతి రక్షణముతో సంతోషించిన పులస్త్యుఁడు, నీవు పురాణవక్త వగుదువని వర మొసఁగినాఁడు.

10. శ్లో. ఇట్లు సంకర్షణుని నుండి ప్రాప్తించిన సంప్రదాయమును బ్రదర్శించి పద్మోద్భవమును గుఱించి చెప్పుచున్నాఁడు. విశ్వమంతయు ఉదాప్లుతం=ఏకార్ణవోదకమందు నిగ్నమైనది. అప్పుడు శేషపర్యంకమందు భగవంతుఁడు శయానుఁడు. అమీలితదృక్=అతిరోహితమైన చిచ్ఛక్తిగలవాఁడై, మాయా వినోదమును మాత్రమే పరిత్యజించి స్వరూపానందమందే యుండెను. అందుకే నిరీహః=నిష్క్రియుఁడై, ఏకః=కేవలుఁడై, నేత్రములను, న్యమీలయత్=మూసికొన్నవానివలె నుండెను.

11. శ్లో. కాలాత్మకమైన శక్తి ప్రేరేచుచున్న వాఁడై, అనలము దారువుల యందున్నట్లుగా రుద్ధవీర్యుఁడై యుండెనని తాత్పర్యము.

12. శ్లో. తనచిచ్ఛక్తితోఁ గూడిన పరమాత్ముఁడు యోగనిద్ర నంగీకరించిన వాఁడై పూర్వమే తన్ను ప్రబోధింపఁగా నియుక్తమైన కాలాఖ్యశక్తి చేతఁబొందింపఁబడిన క్రియా కలాపము గలవాఁడై తన దేహమందే లీనమై యున్న లోకములను జూచెను.

13. శ్లో. అర్థం= లోకసృష్టి కొఱకని తాత్పర్యము. సూక్ష్మాభినివిష్ట దృష్టేః- ఇదియే సృజింపఁదగినది యని యతినైపుణ్యముతోఁ గూడిన పరిజ్ఞాన చక్షువు గల భగవంతునకు అనఁగా - సృష్టికి సంబంధించిన సమస్త తత్త్వములును సూక్ష్మములై తనయందు లీనమైయున్నవి అని తాత్పర్యము. కాలాను సారిగా రజోగుణము వానినిఁ గదలించును. అవి యావిర్భవించుటకుఁ దయారుగ నున్నవి. తద్రూపమైన పద్మము నాభిదేశము నుండి గడ్డకు వచ్చెను.

14. శ్లో. కర్మము లనఁగా జీవాదృష్టములు. వానిని ప్రతి బోధించు కాలము చేత పద్మకోశము ఆవిర్భూతి నందినది. దాని ప్రకాశముతో సూర్యప్రకాశము చేతవలె జలములు భాసించినవి.

15. సర్వగుణావభాసం=జీవ ఉపభోగ్యములైన సమస్తములను బ్రకాశింపఁజేయు నా త్రిలోకాత్మకమగు పద్మ మావిర్భవించినది. దాని యందు విష్ణువు ప్రవేశించినాఁడు. అంతర్యామిగాఁ బ్రవేశించెనని యర్థము. "అవీవిశత్" అను చోట దీర్ఘము ఛాందసము. సఉఏషః- అను చోటఁగూడ సంధ్యభావ మార్షమే. విష్ణువు నుండి జనించిన పద్మము విష్ణుస్వరూపమే యని భావము, విష్ణువు చే నధిష్ఠించిన యా పద్మము నుండి అంతర్గత వేదమయుఁడైన బ్రహ్మ జనించినాఁడు. అనఁగా నాతనికి వేదప్రాప్తి అధ్యయన జనితముగాదని తాత్పర్యము. స్వయం భువం=తంద్రి కన్పడక పోవుట చే నాతనికి 'స్వయంభు' వని పేరు. పూర్వకల్పమందు నారాయణుని తోడాటు ఏకీభూతుఁడై లీన మయ్యెను. ఇప్పుడు మరల పరమ పురుషుఁడు గన్నులు దెఱచినప్పుడు పద్మము ద్వారా నావిష్కృతుఁ డైనాఁ డని తాత్పర్యము.

16. శ్లో. ఆ కల్పమందే చతుర్ముఖుఁడైనాఁడని చెప్పుచున్నాఁడు. పరిక్రమన్=పద్మమందే యున్నవాఁడై కంఠమును నాల్గు దిక్కులకు ద్రిప్పినాఁడు. అప్పుడు నాల్గు ముఖము లైనవి.

17. శ్లో. బ్రహ్మకు జ్ఞానక్రియాశక్తులు ప్రాప్తించుటయు లోకకర్తృత్వ మును స్వయముగా జనించినవి గావు. నారాయణోపాసనవల్లనే యేర్పడిన వని చెప్పుటకుఁ దొలుత నాతని నివెూహము ను జెప్పుచున్నాఁడు. యుగాంతశ్వసనము=ప్రళయకాలవాయువు. పద్మము నుండి పుట్టినను లోక పద్మమైన యా పద్మ స్వరూపమును స్పష్టముగాఁ దెలియలేకపోయినాఁడు.

18. తెలియనేరని బ్రహ్మయొక్క వితర్కమును జెప్పుచున్నాఁడు. నే నెవ్వఁడను? పద్మమేది? దీనికాధారమేది? అని యావితర్కము." - సోఽపశ్యత్ పుష్కర పర్ణం, తిష్ఠత్ సోఽమన్యత. అస్తినైతత్ యస్మిన్నిదమధితిష్ఠతీతి" - శ్రుతి.

19. శ్లో. బహిర్ముఖుఁడైన బ్రహ్మ కెంతకాలము గడచినను దత్త్వము దెలియలేదని రెండుశ్లోకములతోఁ జెప్పుచున్నాఁడు. బ్రహ్మదేవుఁడా పద్మము నాళము ద్వారా దాని యధిష్ఠానమును గానఁడయ్యెను. త్రినేమిః - అనఁగా కాలము; భూతాద్యవస్థాత్రయాత్మక మగుటచే దాని కా పేరు; కాలమునకు విశేషమును, జెప్పుచున్నాఁడు - "అజస్య హేతిః =శ్రీహరి యొక్క సుదర్శనాఖ్య ఆయుధమే కాలము. అదిజీవుల యాయువును గ్రహించు చున్నది. ఈ విషయముతో నూఱుసంవత్సరముల కాలము గతించెనని చెప్పినట్లైనది.

21. శ్లో. అంతర్ముఖుఁడై భగవంతుని దర్శించెనని రెండు శ్లోకము లతోఁ జెప్పుచున్నాఁడు. బహిర్ముఖమైన యన్వేషణమును నిలిపి, స్వధిష్ణ్యం=తన కాధారమైన పద్మమును సమీపించినాఁడు. జితశ్వాస నివృత్తచిత్తుఁడై సమాధినిబట్టి నాఁడు.

22. శ్లో. నూఱు సంవత్సరములు గడచెను. అంతకు ముం దెంత వెదకినను గాన్పింపని తత్త్వము మనస్సునందే తోఁచినది.

23. శ్లో. తొమ్మిది శ్లోకములతో భగవంతునిఁ జెప్పుచున్నాఁడు.

29. శ్లో. ఈ శ్లోకార్థము లన్నియు నింతకుముందే చెప్పఁబడినవి. విశేషమున్నచోట మాత్రమే చెప్పుచున్నాము. ఈ శ్లోకమందు స్వామిని పర్వతముతోఁ బోల్చినాఁడు, దీని కాధారమైన శ్రుతి యిట్లున్నది "కాండే భ్యస్స్వాహా, వల్శేభ్యస్స్వాహా, పుష్పేభ్య స్స్వాహా" భగవంతుని బ్రహ్మ యెప్పుడు చూచెనో సరోజము, తాను, ప్రళయ జలము, ప్రళయ కాలవాయువు, ఆకాశము - ఈ యైదింటిని మాత్రమే చూచినాఁడు. తక్కిన దేదియుఁ గన్పడ లేదని భావము.

33. శ్లో. రజసా=రజోగుణముచేత, ఉపరక్తః=కూడిన వాఁడై, అవ్యక్తవర్త్మని=మాయావిలాస మార్గము గల భగవంతునందు, అభినివేశితమైన చిత్తము గల వాఁడై, ప్రజాః సిసృక్షన్=ప్రజాసర్గమును జేయఁగోరి - యీ నాభి సరోజాది పంచపదార్థములచేతనే ప్రపంచమును సృష్టింపఁదలఁచిన వాఁడై, విసర్గాభి ముఖః=సృష్టి కుద్యుక్తుఁడై భగవంతుని స్తుతించెనని భావము.

# విజయధ్వజము

1. శ్లో. జీవులలో నుత్తముఁడైన బ్రహ్మదేవుని సృష్టిని జెప్పుటలో శ్రీహరి సర్వోత్త మత్వరూపమైన మహిమ నిశ్చిత మగును. అందుచేత ముముక్షువులీ మహిమను దప్పకఁ దెలియవలెనని యీ యధ్యాయమున నిరూపించుచున్నాఁడు. మొదలు ప్రశ్నల కుత్తర మిచ్చుచు విదురునిఁ బ్రశంసించుటతోఁ బాటు తన కీపురాణ ముపదిష్టమైన పద్ధతిని గూడఁ జెప్పుచున్నాఁడు. యస్మాత్, ఇహ, అజితకీర్తి మాలాం, పదేపదే, అభీక్ష్ణం, నూతన యసి తస్మాత్, భగవత ధానః=శ్రీహరియే సర్వోత్తముఁడని తెలిసికొన్న లోకపాలః నీ సాత్త్వికతచేత బ్రపంచమును రక్షించుచున్న, త్వం, యత్=ఏ పూరువంశమందు, బభూవిథ=జన్మించితి వో, సః పూరువంశః సత్సేవనీయః, బభూవిథ - అని పరోక్షార్థక లిట్ ప్రయోగముతో గర్భవాసాను భవము లోకవిడంబనార్థమని తెలిపినట్లైనది.

2. శ్లో. విశేషము లేదు.

3. శ్లో. ఉర్వ్యాం=అనఁగాఁ బాతాళము. త్రిలోకములను మనస్సునం దుంచి కొని ఉర్వీపదముతోఁ బాతాళమును జెప్పినాఁడు.

4. భగవదుపాసన దప్ప నితరవ్యాపారము లేదని యాదిశేషుని స్తుతించు చున్నాఁడు. పైశ్లోకమందు ఉన్మీలయంతం అను శబ్ద మున్నది. నాసాగ్రమును జూచుచు దిక్కులను జూడక ధ్యానముతోఁ గడుపవలె నని యున్నను నమస్కరించిన వారి ననుగ్రహింపవలెనని అప్పుడు మాత్రము కొద్దిగాఁ గన్నులు దెఱువ వలెననియు భావము.

5. శ్లో. ఏదో దారినిఁ బోవు వాఁడడిగినట్టుగాదు ప్రశ్నించుట. అవశ్య ముత్తరముఁ బడయవలయునని ప్రశ్న. ఈ విషయమునే చెప్పుచున్నాఁడు. అర్థమున విశేషము లేదు.

6. శ్లో. సాష్టాంగనమస్కారమును సూచించుచున్నాఁడు (1) తత్ జ్ఞః =నమస్కరించు రీతిని దెలిసిన, (2) శేషుని కర్మములను దెలిసిన.

7,8,9. శ్లో. ఏతత్=నేను చెప్పఁబోవు నీ భాగవతపురాణము, భగవత్తమేన=దేవతలలోఁ బూజ్యుఁడనిపించికొన్న, తేన=ఆ యాదిశేషుని

చేత, నివృత్తి ధర్మాభిరతాయ=పరమాత్మునకుఁ బ్రియమైన నిష్కామ ధర్మమందాసక్తుఁడైన, సనత్కుమారాయ= సనత్కుమారునకు, ప్రోక్తంకిల=పృష్టః, ప్రార్థించి యుపదేశమును బొందిన, సచ= ఆ సనత్కుమారుఁడు. ధృతవ్రతాయ=సాంఖ్యాయనునకు. ఆహ=పారమహంస్య ముఖ్యః సః=ఆ సాంఖ్యాయనుఁడు - భగవద్విభూతీః వివక్షమాణః=అన్వితాయ, అస్మద్గురవే=నాగురువైన పరాశరునకు, జగాద. అథ=బృహస్పతేశ్చ జగాద. పులస్త్యేన ఉక్తః=ఉపదేశింపఁబడిన, సః మునిః=ఆ పరాశరుఁడు, ఆద్యం పురాణం=పురాణశ్రేష్ఠమైన భాగవతమును, మహ్యం ప్రోవాచ, సః, అహం, నిత్యం అనువ్రతాయ. శ్రద్దాళవే, తవ ఏతత్ కథయామి. ఇక్కడ శేషుఁడు సనత్కుమారునకుఁ జెప్పిన పురాణమును నీకుఁ జెప్పుచున్నాను. అను విషయమును మాత్రముఁ జెప్పినచోఁ జాలియుండెడిది. కాని దీని నభ్యసించిన పురుషుల పరంపరతో విదురున కీ పురాణ శ్రేష్ఠత తెలిసి వచ్చుననియు, అందుచే దీనిని వినుటకు అత్యంతాసక్తుఁ డగుననియు. మైత్రేయుఁడీ పరంపరను జెప్పినాఁడు. ఈ సంప్రదాయమును చెప్పుట కిది యే మహాప్రయోజనము. శిష్యునకుఁ జెప్పిన విశేషములు - ఇట్టి యోగ్యత గలవారే భాగవతమున కర్హులని సూచించినవి.

10. శ్లో. ఇంతకుముందు పాద్మకల్పమును వినుమని చెప్పిన శుకుఁడు విదురుని ప్రశ్నకు మైత్రేయుఁ డిచ్చిన సమాధానముగా - నా పాద్మకల్పమును జెప్పుచున్నాఁడు. అసీహః=స్వాత్మరతౌ కృతక్షణః అహీంద్రతల్పే, ఏకః, అధిశయానః, యత్, మీలితదృక్, నిద్రయాన్యమీలయత్, తదా, ఇదం విశ్వం, ఉదప్లుతం, ఆసీత్.

11. శ్లో. ఉదరమందు జగత్తు నుంచి కొన్న శ్రీహరి యేమిచేసెనని చెప్పుచున్నాఁడు. యథా, అనలః, రుద్ధవీర్యః, దారుణి వసతి, తథా సః అంతః =దేహమందు, అర్పిత భూతసూక్ష్మః=(1) స్థూలమై - కార్యరూపమైన దేహములు లేకుండుటతో, భూతముల సూక్ష్మరూపముల నుంచి కొన్నవాఁడై - (2) శబము మొదలైన తన్మాత్రల రూపమందే, భూతము లుండుటచేత నారూపముతో సమస్త భూతముల నుదరమందు ధరించినవాఁడై, కాలాత్మికాం=(1) ప్రళయకాలమనెడు, శక్తిం=సామర్థ్యమును, (2) ప్రళయకాలమున కభిమానినియైన తన భార్యను, ఉదీరమాణః= సుఖమందుఁబ్రేరేఁచువాఁడై, పదే పదే=తనస్థాన మనిపించికొన్న, సలిలే=ప్రళయజలమందు, ఉవాస.

12. శ్లో. నిద్ర యొక్క అవధిని జెప్పుచున్నాఁడు. చతుర్యుగాణాం= సహస్రం, స్వపన్, అప్సు, ఉవాస, తయా, ఆ సృష్టికాలమును, ఉదీరితయా =ప్రేరితమైన, స్వశక్త్యా=తన శక్తిచేత, ఆసాదిత కర్మతంత్రః=సృష్టికై - అదృష్టమను సాధనమును స్థిరమొనర్చికొన్న వాఁడై, స్వదేహే= తన హృదయాకాశమందు, ఇమాన్ లోకాన్ అపి=ఈ త్రివిధ జీవరాసులను, అపశ్యత్=చూచి, సృష్టించుటకు నిర్ధరించి కొనెను. "తయా" అనెడు

ఏకవచనము చేత, భగవంతుని సృష్టి సంహారశక్తులలో భేదములేదని తెలిపినట్లైనది.

13. శ్లో. సృష్టియొనర్పఁదలఁచిన శ్రీహరిచేత, మొదట నొనర్పఁబడిన కార్యమును జెప్పుచున్నాఁడు. తదా=పరమాత్మ సృష్టింపవలెనని యిచ్ఛించినప్పుడు, ఆత్మసూక్ష్మాభినివిష్టదృష్టిః=తనయందున్న యోగులకు మాత్రమే గోచరించు నాకాశాది భూతములందును ఇంద్రియములందును - జీవులందును ప్రత్యక్షజ్ఞానము గల, తస్య నాభిదేశాత్, అంతరతః, తనీయాన్, అరః, గర్భోదకమనెడు జలభూతము, కాలాను గతేన=సృష్టి కాలమను శ్రీహరి శక్తిచే సంబద్ధమైన, రజసాగుణేన=రజోగుణము నుండి - (పృథ్వీ భూతము నుండి) విద్ధస్సన్=కూడినదై. శుష్యన్=కాలిచే ఘనీభావము నంది, అభిద్యత=భేదించికొని గడకు వచ్చెను. కాలానువిద్ధః, అనుటచేత - శ్రీహరియిచ్ఛయే ముఖ్యకారణమని చెప్పినట్లైనది. అంతిరతః, తనీయాన్, అనుటతో ఉదరము నందలి జలభూతమని సూచింపఁబడినది. ఆత్మసూక్ష్మము మొదలైన విశేషణములతో శ్రీహరి దాను సృష్టించు పదార్థముల సంపూర్ణజ్ఞానము గలవాఁడనియు సూచితము. అజ్ఞానిగాఁడని తెలిపినట్లైనది. "అభిద్యత" అనెడు భావేప్రయోగము చేత - శ్రీహరి స్వతంత్రుఁడని తెలిపినాఁడు. "ఉదంకం వాయునా శుష్యద్భిన్నం పద్మమ భూద్ధరేః" - అనెడు ప్రమాణ మీ యర్థమునే తెలుపుచున్నది.

14. శ్లో. చెప్పిన కారణము లనేకము లగుటతో దీనికి ముఖ్యకారణమేది? దాని పేరేది? దానికి సమాధానము. ఆత్మయోనిః=విష్ణువే ముఖ్యకారణముగాఁగల, సః పద్మకోశః=ఆ పద్మ కోశము, స్వరోచిషా=విశాలం, తత్సలిలం=ఆ ప్రళయోదకమును, అర్క ఇవ విద్యోతయన్, కర్మప్రతిబోధితేన=అదృష్టఫలమును బ్రేరేపించు. కలేన=సృష్టికలయను భగవచ్ఛక్తి చేత, ఈ రితః=ప్రేరేపింపఁబడినదై. సహసా=ఉదతిషత్=పదునాలు లోకములును అగునట్లు పెద్దగా విస్తరించెను. ప్రళయోదకము దప్ప వేఱు పదార్థమేదియుఁగన్పించుట లేదు. అందు చేతనే "సహసా" అను పదమును బ్రయోగించినాఁడు.

15. శ్లో. జడమైన పద్మము చేతన సంపర్కము లేనిది. సూర్యునివలెఁ బ్రకాశించు టెట్లు? మణ్యాదులలో శ్రీహరి యిచ్ఛచేత తేజః పుంజ పరిమాణములే హెచ్చుగ నుండుటతోఁ బ్రకాశమేర్పడవచ్చును. మరి యీ పద్మము, రజసా=పృథివీ పరమాణువులతోఁ బుట్టిన దనుట చేతఁ బ్రకాశమునకుఁ గారణము లేదు. మఱి ప్రకాశమెట్లేర్పడినది? దానికిఁ గారణము, సర్వగుణావభాసం=శబ్దాది సమస్తగుణములను దెలిసికొన్నట్టి, పృథివీతత్త్వవికారమైన, తత్=ఆ నాభినుండి పుట్టిన, లోకపద్మం=పదునాలు లోకములుగా విభాగమునందు కమలమును, నేః=ఎవనినుండి పద్మము వ్యక్తి

మయ్యెనో, ఆ విష్ణుః ఏవ=విష్ణువే, ఉ=మరియొక్క రూపముతో, ప్రావిశత్=ప్రవేశించెను, యం=ఏ బ్రహ్మదేవుని, స్వయం భువం=ప్రధానమైన శ్రీహరి నుండి పుట్టిన వాఁడని, వదంతిస్మ=జ్ఞానులందురో, సః వేదమయః=ఆ లక్ష్మీనారాయణులను వదలినచో, వేదములచేఁ బ్రతిపాద్యుఁ డనిపించి కొన్న, విధాతా=బ్రహ్మదేవుఁడు. తస్మిన్=ఆ పద్మమందుఁ బ్రవేశించిన, సయం=ప్రధానుఁడైన శ్రీహరి నుండి అభూత్=జన్మించెను, ఇట్టి "అజుఁ" డను శబ్దమునకు నర్థ మొనర్పవలెను. అ=అనఁగా విష్ణువు, అతని నుండి జన్మించిన వాఁడు. ఏష=అని చెప్పుటచేత శ్రీహరికిని పద్మము నందుఁ బ్రవేశించిన రూపమునకు స్వల్పము గూడ భేదము లేదని తెలియవలెను. పద్మమందున్న శ్రీహరినుండి బ్రహ్మ జనించె ననుటకు "పద్మసంస్థాదరే స్తత్ర బ్రహ్మాఽజని చతుర్ముఖః" అను వాక్యమే ప్రమాణము. వేదమయుఁడని బ్రహ్మను చెప్పుటతో, "హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే" - "యోవై బ్రహ్మాణం విదధాతి పూర్వం" - ఇత్యాదిశ్రుతుల యందుఁ జెప్పఁబడిన వారని తో పించినట్లైనది. కనుక పద్మము నుండి పుట్టిన వాఁడు బ్రహ్మ యని చెప్పు చోటులన్నిటను పద్మమందున్న శ్రీహరి నుండి పుట్టిన వాఁడని యే యర్థ మొనర్ప వలెను.

16. శ్లో. విష్ణువునకు "స్వభూః" అని పేరున్నది. అతఁడే నాభియందుఁ బుట్టిన పద్మములోఁ బ్రవేశించి నాఁడని చెప్పితిమి. కనుక పుట్టిన వాఁడు విష్ణువే యని యేల చెప్పరాదు? దానికి సమాధానము, తస్యాం, కర్ణికాయాం, అవస్థితః స, చ =ఆ బ్రహ్మదేవుఁడు, లోకం=(1)భూమి మొదలైన లోకములను, (2) తన్నుఁదప్ప ఇతరజనులను, అపశ్యమానః - వివృత్తనేత్రః, వ్యోమ్ని, పరిక్రమన్, అనుదిశం, ముఖానిలేభే. దీనిచేత పుట్టిన వాఁడు చతుర్ముఖ బ్రహ్మయే యని నిర్ధారిత మైనది.

17. శ్లో. యుగాంత .......... చక్రం=సలిలాత్=విరూఢం, లోకతంత్రం = లోకపుష్టికిఁగారణమైన, కంజం, ఉ=కమలమునే, అపాశ్రితః=ఆశ్రయించిన, ఆదిదేవః అవిదత్=అదా, ఆత్మానం=(1)తన్నును, (2)శ్రీహరిని, న అవిదత్=తెలియలేదు, ఇచ్చట అజ్ఞానమును జెప్పుట చేతఁ బుట్టినవాఁడు విష్ణువు గాదని తెలిపినట్లైనది. విష్ణువునకజ్ఞానము లేదు గదా! కనుక విష్ణువే బ్రహ్మగనయ్యెననుట సాంప్రదాయవిరుద్ధము,

18. శ్లో. బ్రహ్మసంశయరీతిని జెప్పుచున్నాఁడు. అసౌ=అబ్జపృష్ఠే (నిషణ్ణ) ఏషః. అహం, కః, అప్సు, అనన్యత్=ప్రధానమైన, ఏతత్, కుతోవా, కారణము లేనిది కార్యోత్పత్తిగాదు. పద్మము కార్యము, కనుక కారణ మేదియో బ్రహ్మ యుక్తితో నిశ్చయించి కొన్నాఁడని భావము. ఇహ=అధస్తాత్ కించన=పృథివి మొదలైన కారణముల కంటెను విలక్షణమైన వస్తువు, అస్తిహి. అత్ర=ఆ వస్తువునందు, ఏతత్=ఈకమలము,

అధిష్ఠితం=ఆశ్రయించి యున్నది, తక్కిన కారణము లేవియు నింకను బుట్ట లేదు గనుక, సతా=పర బ్రహ్మ వస్తువే, అనుభావ్యం=అనుభవ విషయమనీ భావింపవలెను. స బ్రహ్మైకచింతయత్, కుతోనుపద్మం బ్రహ్మాణ స్స్యాత్" - అనెడు శ్రుతియు నీ యర్థమునే దెలుపును. దీనితో బ్రహ్మదేవున కేర్పడిన యజ్ఞానము గూడ క్షణికి మైనదే. తక్కిన జీవులకు వలె స్వరూపమునకు సంబంధించినది గాదు. క్షణకాలము మేఘములతో సూర్యాచ్ఛాదనమని యర్థము.

19. శ్లో. ఇతం=ఈ రీతిగా, పరిశేషాను మానముతో, సః ఉత్ = పరబ్రహ్మవస్తువైన శ్రీహరిని గూర్చి, వీక్ష్య=ఆలోచించి, తదబ్జ నాళనాళీభిః =అంతరలం. ఆవివేశ, అర్వాక్=క్రిందికి, గతః సః, అజః తత్ఖరనాళనాళీః విచిన్వన్, తత్=కారణమైన పర బ్రహ్మను. న అవిందత=కన్నులతోఁజూడ లేదు. వై ఇది శాస్త్రసిద్ధము. "తస్యఉదితినామ" - అనెడు శ్రుతి చేత "ఉత్" అను పదమునకు బ్రహ్మయని యర్థము.

20. శ్లో. అపారే=తమసి=స్వరూపమునే మూయునట్టి మాయ యనెడు నంధకారము నందు, ఆత్మసర్గం, విచిన్వతః, యః, దేహభాజాం, భయం, ఈరయాణః, ఆయుః, పరిక్షిణోతి, సః, మహాన్, త్రినేమిః, అజన్య, హేతిః అభూత్.

21. శ్లో. స్వప్రయత్నముతో శ్రీహరి దర్శనము సాధ్యము గాదు. వాని యనుగ్రహముననే సాధ్యము, వాని యనుగ్రహము వానినిఁగూర్చి యొనర్చు తపస్సు చేతనే సాధ్యము. కనుక దానినే యొనర్తుమని నిశ్చయించి - బ్రహ్మ చేసిన యుపాసనా ప్రకారమును జెప్పుచున్నాఁడు. అప్రతిలబకషః "శ్రీహరిని బ్రత్యక్షముగాఁ జూడని, సః దేవః, తతః, నివృత్య, పునః, స్వధిష్ణ్యం, ఆసాద్య, శనైః, జితశ్వాస నివృత్తచిత్తః, ఆరూఢ సమాధియోగః =అసంప్రజ్ఞాత సమాధి యను ధ్యానమందు నిమగ్నుఁడై, పద్మకర్ణిక యను నాసనమందు, న్యషీదత్=ధ్యానమందు నిలిచెను. "పునః" శబ్దమునకు నిరంతరమను నర్థముండుటలో బ్రహ్మదేవుఁడు సదా తపోనిష్ఠుఁడని తెలియవలెను.

22. శ్లో. అభిప్రవృద్ధయోగేన, నిరూఢబోధః=అపరోక్షజ్ఞానమును బొందిన, సః, అజః, పురుషాయుషా కాలేన, యత్=దేనిని, పూర్వం, నఅపశ్యత. తత్, అంతర్హృదయే. అవభాతం=అనుగ్రహపూర్వకముగా, మనస్సునందుఁ బ్రకాశితమైన, స్వయం=ప్రధానమైన శ్రీహరిని, అపశ్యత= "అవభాతం" అనుటతో శ్రీ హరియను గ్రహము చేతనే యతనినిఁ జూచు టకు శక్యమని తెలిపినట్లైనది. "స్వయం" అనుటతోఁ దన కుత్పాదకమైన, ముందు "తస్మిన్ స్వయం" అనుచోటఁజెప్పిన సర్వోత్తమవస్తువునే చూచెనని భావము. "అపశ్యత" అనెడు ఆత్మనేపదప్రయోగముతో ఇదే బ్రహ్మయొక్క యిష్టదేవత యని చెప్పినట్లైనది.

23. శ్లో. ఇచ్చటి నుండి తొమ్మిది శ్లోకములతో శ్రీహరిని వర్ణించు చున్నాఁడు.

24. శ్లో. ధ్యానసౌకర్యమునకై శ్రీహరిని నీలపర్వతమునకుఁ బోల్చు చున్నాఁడు. సంధ్యాభ్రనీ వేః=సంధ్యామేఘములనే వస్త్రముగా నుండి న, ఉరురుక్మమూర్ధ్నః=అనేక సువర్ణమయశిఖరములు గల, రత్నోదధేః=రత్న ములకు సముద్రము వలె నాకరమైన, ఓషధిసౌమనస్య వనస్రజః=ఓషధు లనెడు పూవుల సమూహామే వనమాలగాగల, వేణుభుజాంఘ్రి పాంఘ్రేః =వెదురులే భుజములై, చెట్లే పాదములుగాఁగల, హరితోపలాద్రేః=నీలమణి మయ పర్వతముయొక్క, ప్రేక్షాం=సుందరమైనకాంతిని, క్షిపంతం=తిరస్క రించుచున్న శ్రీహరిని చూచెను. ఇక్కడ పర్వతమున కిచ్చిన విశేష ణములతో శ్రీహరిని పీతాంబరధారియనియు, స్వర్ణకిరీటాలంకృతుఁ డనియు, కౌస్తుభ రత్నధారి యనియు, వనమాలతోఁ గూడిన వాఁడనియు, దీర్ఘబాహువనియు, నమస్కరించు వానికి దుఃఖములను బరిహరించు పాదములు గలవాఁడనియు, నీలమణికాంతితోఁగూడిన దేహ మున్నవాఁ డనియుఁ జెప్పినట్లైనది.

25. శ్లో. లోకత్రయసంగ్రహేణ=ఆయామతః, విస్తరతః, దేహేన, విచిత్రదివ్యాభరణాంశుకానాం, కృతశ్రియా, ఉపాశ్రిత దివ్యవేషం.

26. శ్లో. స్వకామాయ, వివిక్తమార్గైః=లౌకికవైదికములనెడు, భిన్న మార్గములతో అభ్యర్చ్యతాం, పుంసాం, కృపయా, నఖేందు....... చారుభద్రం =కామదుఘాంఘ్రిపద్మం, ప్రదర్శయంతం "వివిక్తమార్గైః" - అనుటతో నుపాసనా మార్గములు భిన్నములని చెప్పినట్లైనది." స్వకీయాయ" అనుట చేత, నందరును నిష్కామోపాసనకులేగారనుట సూచితము. పాదములను గమలములతోఁ బోల్చుట-మందజనుల కొఱకు, స్వాభావికముగా భగవంతుని పాదపద్మములు - ఇతర పద్మములకంటెను విలక్షణమైనవి.

27. శ్లో. లోకార్తిహరస్మితేన=పరిస్ఫురత్........ మండితేన. అధరబింబ భాసా, సునసేన, సుభ్రువా, ముఖేన ప్రత్యర్హయంతం, "సుభ్రు" శబ్దము నపుంసకలింగమునఁగూడ నున్నదని తెలియవలెను.

28. శ్లో. కదంబ....... పిశంగ వాససా మేఖలయా. నితంబే స్వలంకృతం శ్రీవత్సవక్షస్స్థల వల్లభేన, అనంతఘనేన=అమూల్యమైన హారము చేత.

29. శ్లో. పరార్ధ్య....... శాఖం=అవ్యక్తమూలం=(1)త్రిగుణములనే పాదములందుఁబొందిన (2) ప్రకృతికిఁ గారణమైన, (3) మూలమునే దెలియని, అహీంద్ర........ వల్శమ్=భువనాంఘ్రిపేంద్రం.

30. శ్లో. అహీంద్ర బంధుం=సలిలోప గూఢం, కిరీటసాహస్ర హిరణ్య శృంగం, ఆవిర్భవత్కౌస్తుభరత్నగర్భం, చరాచరౌకో, భగవన్మహీధ్రం.

31. శ్లో. ఆమ్నాయ...... కీర్తిమయ్యా=వేదములను తుమ్మెదలకాశ్రయమైన, తనకీర్తి యనెడు వనములతో - కంఠేనివీతం, సూర్యేందు....... త్రిధామభిః=శ్రీహరిని వదలి యుండని ముక్తులైన, సూర్యుఁడు, చంద్రుఁడు, అగ్ని, వాయువు మొదలైన సమస్త దేవతలతోను, పరిక్రమత్పాధనికైః=ప్రదక్షిణ మొనర్చుచున్న లోకపాలకులతోను (వృతం) దురాసదంహరిం. అపశ్యత్. ముక్తుల చేతఁ బరివృతుఁ డనియు, దురాసదుఁడనియుఁ జెప్పుటచేత బ్రహ్మదేవుఁడు చూచిన వస్తువు నిత్యముక్తుఁడు, ప్రాకృతగుణ రహితుఁడు నైన వైకుంఠుఁడే దప్ప, అముక్తుఁడు - ప్రాకృత గుణయుక్తుఁడు నైన జీవుఁడు గాఁడని తెలియవలెను.

32. శ్లో. జగతః, విధాతా, దేవః=బ్రహ్మ, తర్హి ఏవ=శ్రీహరినిఁ జూచినంతనే నాభిసరస్సరోజం=ఆత్మానం, అంభః, శ్వసనం, వియచ్చ, దదర్శ. అందుచేత నా బ్రహ్మకు, లోకవిసర్గదృష్టిః (1) జ్ఞానముతోఁగూడిన మూర్తిని బొందిన సూర్యాదుల దర్శనము, (2) సృష్టి లేనప్పుడున్న ప్రళయోదకము మొదలైన వస్తువుల దర్శనము - అభూత్ అతః పరం, ఇవిదప్పఁ దక్కిన వాని దర్శనము న అభూత్, లేక లోకవిసర్గదృష్టిః జ్ఞానస్వరూపియై సృష్టి మొదలైన వ్యాపారములు లేనట్టియు అందుచేతనే ప్రాకృత గుణ సంబంధము లేని నిర్గుణపరబ్రహ్మదర్శనము, అతః పరం, న, దీనికంటెను వేఱు లేదు. ఇదే నిర్గుణ బ్రహ్మదర్శనమని యర్థము.

33. శ్లో. తా నెందుకు సృష్టింపఁబడెనో ఆ సృష్టికార్య మొనర్చుటకు శ్రీహరియను గ్రహము లేనిది సాధ్యము గాదు. అందుచేత భగవంతుని స్తుతించి యతనికృపాకటాక్షముతో జ్ఞానవీర్యముల నభివృద్ధి పఱచి కొని యతని సేవారూపమైన సృష్టికార్యము లొనర్తును అనెడు నభిప్రాయముతో శ్రీహరిని స్తుతించెనని చెప్పుచున్నాఁడు. రజసా=ఉపరక్తః విసర్గాభిముఖః, సః, ప్రజాః సిసృక్షన్, ఇయత్ ఏవ=సృష్టిసాధనములుగాఁ బైఁ జెప్పిన జలాదులను, దృష్ట్వా, అవ్యక్తవర్త్మని=పరబ్రహ్మమనెడు మార్గమందు, అభినివేశితాత్మా, స్వకర్మ బీజం=సృష్టిలోఁ దనకు నిమిత్త కారణమైన యదృష్టమును వ్యక్త మొనర్చెడు, ఈశం=సర్వనియామకుఁడైన, తం అస్తౌత్.

**ఇతి శ్రీమహాభాగవతే, శతసహస్రికాయం, సంహితాయం, వైయాసిక్యాం, శ్రీహయగ్రీవబ్రహ్మవిద్యాయాం, అష్టమోఽధ్యాయః.**

# అష్టమాధ్యాయము

చం. ఇలఁగల మానవావళికి నెల్లనుతింప భజింప యోగ్యమై
వెలసిన పూరువంశము పవిత్రము సేయఁగఁ బుట్టి సద్గుణా
కలిత యశః ప్రసూన లతికా తతికిం బ్రతివాసరంబు పెం
పలరఁగఁ బ్రోదివెట్టుదు గదయ్య! ముకుంద కథామృతంబునన్. 263

తే. అల్పతరమైన సుఖముల నందుచున్న
జనులదుఃఖంబు మాన్పంగఁ జాలునట్టి
పుండరీకాక్షు గుణకథాప్రోతమైన
వితత నిగమార్థ మగు భాగవతము నీకు. 264

వ. ఎఱింగింతు వినుమని యిట్లనియె. 265

సీ. అమ్మహాభాగవతామ్నాయ మొకనాఁడు
గెకొని పాతాళలోకమందు
నప్రతిహత బుద్ధియై వాసు దేవాఖ్యఁ
బొలుచు సంకర్షణ మూర్తి దివ్య
పురుషుఁడు దనుఁదాను బుద్ధిలోఁ జూచుచు
సలలితధ్యానముకుళిత నేత్రుఁ
డై సనందాభ్యుదయార్థంబు గను విచ్చి
చూచిన వారు సంస్తుతు లొనర్ప

గీ. నమరగంగావగాహనులై యహీంద్ర
కన్య లార్ద్రజటాబంధకలిత లగుచు
భర్తృవాంఛానుబుద్ధి నప్పరమపురుషుఁ
గదియనేతెంచి తత్పాదకమల యుగము. 266

కం. సేవించి భక్తితో నా
నావిధపూజోపహార నతినుతులను నా
దేవుని హృదయము వడసిరి
యావేళ సనందనాదు లమ్మహితాత్మున్. 267

మ. ఘనసాహస్రకిరీటరత్నవిలసత్కాంత ప్రసిద్ధ ప్రభా
జనితోదగ్రరుచి ప్రకాశిత ఫణాసాహస్రుఁడో దేవతా
వనదీక్షాచణు రూపకృత్యము లొగిన్ వాంఛన్ బ్రశంసించి వా
రనురాగ స్ఖలితోక్తు లొప్ప నడుగన్ హర్షించి యా దేవుఁడున్. 268

తే. భూరినిగమార్థసార విచార మగుచుఁ
దనరు నీ భాగవతము సాదరతఁ బలికె
నలినభవసూతియైన సనత్కుమార
కునకు నెఱిఁగించె సాంఖ్యాయనునకు నతఁడు. 269

కం. పరఁగ నతం డంతఁ బరా
శరునకు నుపదేశ మిచ్చె సన్మతి నతఁడున్
సురగురున కొసఁగె నాతఁడు
గర మరుదుగ నాకుఁజెప్పెఁ గైకొని యేనున్ 270

కం. నీ కిప్పుడు వివరించెద
నాకర్ణింపుము సరోరుహాక్షుండగు సు
శ్లోకుని చరితామృతపరి
షేకుఁడవై ముదము గదురఁ జెలఁగుము విదురా! 271

వ. ఇట్లు భగవత్ప్రోక్తంబును, ఋషిసంప్రదాయాగతంబును, పురుషోత్తమ స్తోత్రంబును, పరమ పవిత్రంబును, భవలతాలవిత్రంబును నైన భాగవత కథా ప్రపంచంబు శ్రద్ధాళుండవు, భక్తుండవు నగు నీకు నుపన్యసించెద వినుము. 272

సీ. అనఘ! యేకోదమైయున్నవేళ నం
తర్నిరుద్ధానల దారువితతి
భాతిఁ జిచ్ఛక్తి సమేతుఁడై కపట ని
ద్రాలోలుఁ డగుచు నిమీలితాక్షుఁ
డైన నారాయణుం డంబు మధ్యమున భా
సుర సుధాఫేన పాండుర శరీర
రుచులు సహస్రశిరోరత్నరుచులతోఁ
జెలిమి సేయఁగ నొప్పు శేషభోగ

తే. తల్పమునఁ బవ్వళించి యనల్పతత్త్వ
దీప్తిఁ జెన్నొందఁగా నద్వితీయుఁ డగుచు
నభిరతుండయ్యుఁ గోర్కులయందుఁ బాసి
ప్రవిమలాకృతి నానందభరితుఁ డగుచు. 273

తే. యోగమాయావిదూరుఁడై యుగసహస్ర
కాలపర్యంత మఖిలలోకములు మ్రింగి
పేర్చి మఱి కాలశక్త్యుప బృంహితమున
సమత సృష్టి క్రియాకలాపములఁ దగిలి. 274

కం. తనజఠరములోఁ పలఁదా
చిన లోకని కాయముల సృజించుటకును సా
ధనమగు సూక్ష్మార్థము మన
సునఁగని కాలానుగత రజోగుణమంతన్. 275

సీ. పుట్టించెఁ దదుణంబునఁ బరమేశ్వరు
నాభిదేశము నందు నళిన నాళ
ముదయించె మఱి యప్పయోరహముకుళంబు
గర్మబోధితమైన కాలమందుఁ
దనతేజమునఁ బ్రవృద్ధంబైన జలముచే
జలజాప్తుగతిఁ బ్రకాశంబునొందఁ
జేసి లోకాశ్రయస్థితి సర్వగుణ విభా
సితగతి నొప్పు రాజీవమందు

తే. నిజకళాకలితాంశంబు నిలిపె, దాని
వలన నామ్నాయ మయుఁడును వరగుణుండు
నాత్మయోనియు నైన తోయజభవుండు
సరవిఁ జతురాననుండు నా జనన మందె. 276

తే. అతఁడు దత్పద్మ కర్ణిక యందు నిలిచి
వికచలోచనుఁడై లోకవితతి దిశలు
నంబరంబును నిజచతురాననములఁ
గలయఁ బరికించి చూచుచుఁ గమల భవుఁడు. 277

చ. అలఘు యుగాంతకాల పవనాహత సంచల దూర్మిజాల సం
కలిత జల ప్రభూతమగు కంజముఁ దద్వనజాత కర్ణికా
తల మునను్న తన్ను విశద క్రియ గల్గిన లోకతత్త్వమున్
నలిఁ దెలియంగ నోపక మనంబునఁ జాల విచారమొందుచున్.278

వ. ఇట్లు వితర్కించె. 279

ఉ. ఈ జలమందు నీకమల మేగతి నుద్భవమయ్యె? నొంటినే
నీజలజాత పీఠమున నేగతి నుంటి? మదాఖ్య యెద్ది? నా
కీజననం బు నొందుటకు నెయ్యది హేతువు? బుద్ధిఁ జూడ నే
యోజ నెఱుంగ లేనని పయోరుహగర్భుఁడు విస్మితాత్ముఁడై. 280

కం. ఆ వనజనాళమూలం
బావనములలో న నర్థి నరయుట కొఱకై

యా వనజాతప్రభవుం
డా వనరుహనాళవివరమందభిముఖుఁడై 281

మ. అతిగంభీర విశాల వారినిధి తో యాంతర్నిమగ్నాంగుఁడై
చతురాస్యుం డురు దివ్యవత్సర సహస్రం బబ్జమూలంబు స
న్మతి నీక్షించియుఁ గానలేక, భగవన్మాయా మహత్వంబు వి
స్మృతి గావింప విభీతుఁడై మఱలఁ జేరెన్ దత్సరోజాతమున్. 282

తే. అట్లు గ్రమ్మఱఁజేరి య య్యబ్జపీఠ
మందు సాష్టాంగ యోగక్రియానురక్తిఁ
బవను బంధించి మహిత తపస్సమాధి
నుండి శతవర్షములు చనుచుండ నంత. 283

ఆ. అట్టి యోగజనితమైన విజ్ఞానంబు
గలిగి యుండి దానఁ గమలనయనుఁ
గానలేక హృదయ కమల కర్ణిక యందు
నున్న వానిఁ దన్నుఁ గన్నవాని. 284

మ. కనియె న్నిశ్చల భక్తి యోగమహిమన్ గంజాత గర్భుండు శో
భన చారిత్రు జగత్పవిత్రు విలసత్పద్మాకళత్రున్ సుధా
శనముఖ్యస్తుతిపాత్రు దానవచమూ జైత్రున్ దళత్పద్మనే
త్రు నవీనోజ్జ్వల నీలమేఘనిభ గాత్రున్ బక్షిరాట్పుత్త్రునిన్. 285

వ. మఱియు 286

చ. అలఘు ఫణాతపత్రనిచయాగ్రసమంచిత నూత్నరత్నని
ర్మలరుచిచే యుగాంత తిమిరంబు నడంచి యకల్మషోల్లస
జ్జలములఁ జేసి యందు నవసారసనాళ సితైక భోగముం
గలిగిన శేషతల్పమును గైకొని యున్న మహాత్ము నొక్కనిన్. 287

సీ. వరపీతకౌశేయ పరిధాన కాంతి సం
ధ్యాంబుదరుచి నిచయంబుగాఁగఁ
గమనీయ హేమసంకలిత కిరీటంబు
రమణ కాంచన శిఖరంబుగాఁగ
మానిత మౌక్తిక మాలికారుచి సాను
పతిత నిర్ఝర పరంపరలు గాఁగఁ
జెలువొందు నవతులసీదామకములు లా
లితతటౌషధీలతలు గాఁగ

తే. వరభుజంబులు నికట సవంశములుగఁ
బదము లంగణ పాదపప్రచయములుగ
లలిత గతి నొప్పు మరకతాచలవిడంబి
తాత్మదేహంబుగలుగు మహాత్ము హరిని. 288

వ. మఱియు, నపరిచ్ఛిన్నంబును, నిరుపమానం బును, నిఖిలలోకసంగ్ర హంబును, నతివిస్తారవర్తులాయామంబునునై, వివిధ విచిత్ర దివ్యమణి విభూషణంబుల నాత్మీయనిర్మలద్యుతిచేతం బ్రకాశంబు నొందంజేయు దివ్యదేహంబు దనర వివిధంబులగు కామంబు లభి లషించి విశుదంబైన వేదోక్త మార్గంబున భజియించు పురుషశ్రేష్ఠులకుఁ గామధేను వనం దగిన పాదపద్మయుగంబును, నళిక ఫలకలలితరుచి నిచయంబులకు నోటుపడి కృపాపాత్రుండై చంద్రుండు బహురూపం బులఁ బదసరోజంబుల నాశ్రయించెనన నొప్పు పదనఖంబులును, గమలాభూకాంతలకు నుపధాన రూపంబు లనందగి నీలకదళికాస్తం భంబుల డంబు విడంబించు నూరుయుగళంబును, గనక మణిమయ మేఖలాకలాపాభిరామంబు గదంబ కింజల్క శోభిత పీతాంబరాలం కృతంబునై విలసిల్లు కటిమండలంబును, శృంగారవాహినీ జలావర్తం బునాఁ బొలుపొందు నాభీవివరంబును, జఠరసిత నిఖిల బ్రహ్మాండ ముహుర్ముహురుద్భవకృశీభూతం బనం దగు మధ్యభాగంబును, మహిత ముక్తా ఫలమాలికా విరచిత రంగ వల్లీ విరాజితంబు, నవతులసీదామ కిసలయ తల్పంబుఁ గుసుమ మాలికాలంకృతంబు, ఘన సార కస్తూరికా చందన విలిప్తంబుఁ గౌస్తు భరత్నప్రదీప్తంబు, శ్రీ వత్సలక్షణలక్షి తంబునై యిందిరకుఁ గేళీ మందిరం బనం బొల్చు వక్షస్స్థలంబును, సుఖకేళీ సమారంభ పరిరంభణాంభోధిరాట్కన్యకా కరాంభోజ కీలితకనక మణికంకణ నికషం బులం బొలుపారు రేఖా త్రయ విరాజమాన కంబుకంధరంబును, సుమహితానర్ఘ దివ్యమణి ప్రభా విభాసిత కేయూర కంకణ ముద్రికాలంకృతంబులైన బాహువులును, సకలలోకార్తి నివారక దరహాస చంద్రికా ధవళితం బులై కర్ణకుండలమండన మణిమరీచులు నర్తనంబులు సలుపం దనరి నిదంబులగు చెక్కుటద్దంబులును, బరిపక్వబింబఫల ప్రవాళ పల్లవా ధరశోణాయితంబును, నఖిలభువన పరిపాలనంబునకు నేన చాలుదు నని వివాదించు నయన యుగళంబునకు సీమాస్తంభంబును, చంపక ప్రసూన రుచి విభాసంబును నగు నాసాదండంబును, గమలకుము దంబులకుం బెంపు సంపాదింపుచుఁ గరుణామృత తరంగి తాంగం బులై, కర్ణాంత విశ్రాంతంబులై చెలువొందు నేత్రంబులును, సలలిత శ్రీకారంబునకు నక్షరత్వంబు సార్థకంబయ్యె నననందగు కర్ణంబులును, నిక్షుచాపు చాపద్వయ రూపంబులం జూపట్టుభ్రూయుగళంబును,

నపరపక్షాష్టమీ శశాంకశంకాస్పద ఫాలఫలకంబును, నీలగిరీంద్ర శృంగ సంగత బాల మార్తాండమండల విడంబిత పద్మరాగమణి ఖచిత కాంచనకిరీటంబుచేఁ బొలుపారి సూర్యేందు పవనానల ప్రకాశంబులకు నవకాశంబు చూపక త్రిలోకవ్యాపక సమరంబులగు తేజోవిశేషంబులును, సంగర రంగంబుల దానవానీకంబుల హరింపంజాలు సుదర్శనాది దివ్య సాధనంబులచే దురాసదంబగు దివ్యరూపంబునుం గలిగి మఱియు. 289

ఉ. హారకలాప పుష్ప నిచయంబులఁ జంచదనర్ఘ రత్న కే
యూర కరాంగుళీయక మహోజ్జ్వలబాహు సహస్రశాఖలొ
ప్పారఁగఁ జూడనొప్పి భువనాత్మక లీల నదృష్టమూల వి
స్ఫారిత భోగవేష్టిత విభాసిత చందన భూరుహాకృతిన్. 290

మ. విలసత్కుండలిరాజ సఖ్యమున నుర్వీభృత్సమాఖ్యన్ సము
జ్జ్వలితో దార శిరోవిభూషణ సహస్రస్వర్ణకూటంబులన్
సలిలావాసతఁ జారు కౌస్తుభ విరాజద్రత్న గర్భంబునన్
నలినాక్షుండు గనుంగొనంగఁదగె మైనాకావనీభృద్గతిన్. 291

కం. వితతారజానజప
స్తుతి మకరందప్రహృష్ట శ్రుతిజాత మధు
వ్రతగణ పరివృత శోభా
గతకీర్తిప్రసవ మాలికలు గల వానిన్. 292

వ. కనుంగొని చతురాననుండు. 293

సీ. అనఘు సర్వేశ్వరు నాద్యంత శూన్యుని
ధన్యుని జగదేక మాన్యచరితు
దన్నాభిసరసీ కోద్భవ సరోజంబును
నప్పుల ననిలుని నంబరమును
మానిత భువన నిర్మాణదృష్టిని బొడ
గనె గాని-యితరము గాన లేక
యాత్మీయ కర్మ బీజాంకురమును రజో
గుణయుక్తుఁడగుచు నకుంఠిత ప్ర

తే. జాభి సరాభిముఖత నవ్యక్త మార్గుఁ
డైన హరియందుఁదన హృదయంబుఁ జేర్చి
యమ్మహాత్మునిఁ బరము ననంతు నభవు
నజు నమేయుని నిట్టని యభినుతించె. 294

**అర్థములు :**

263. చం. మానవ+ఆవళికిన్=జనసమూహమునకు, సద్గుణ....... తతికిన్=సద్గుణములచే సంపాదింపఁ బడిన కీర్తియనెడు పువ్వుఁదీవెలు గల తీవెలగుంపునకు, ప్రతివాసరంబున్=ప్రతిదినమును, ముకుంద కథామృతంబునన్=మోక్షము నొసఁగెడు భగవంతుని కథలను నమృతము చేత, ప్రోదివెట్టుదు గదయ్య=పోషింతువు గదా!

తాత్పర్యము : మానవుల కందఱకును స్తుతింపఁదగినట్టి పూరు వంశమున జన్మనెత్తితివి. నీ సద్గుణములతో గొప్పకీర్తిని సంపాదించి కొన్నావు. ఆ కీర్తియనెడు ప్రసూనములను బూచునట్టి నీ సద్గుణములనెడు తీగలను ప్రతి దినమును, హరికథ లనెడు నమృతమును బోసి పెంచు చున్నావు. నీవు ధన్యుఁడవు.

264. తే. అల్పతరము=చాల అల్పమైనది. గుణకథాప్రోతము= గుణములను గూర్చిన కథలచేతఁగూర్పఁబడిన, వితత నిగమార్థము=విస్తారమైన వేదముల సారము.

తాత్పర్యము : ప్రపంచములో మనుష్యులు అల్పములైన సుఖములకై నిరంతరము పరిశ్రమించుచు, మహాదుఃఖముల ననుభవించుచున్నారు. అట్టి వారి దుఃఖమును బోఁగొట్టఁగలిగిన పుండరీకాక్షుని గుణములతోఁగూడిన భాగవతమును నీకుఁజెప్పెదను. అది సర్వవేదములసారము.

265. వ. ఎఱిఁగింతు విను మని యిట్లనెను.

266. సీ. భాగవతామ్నాయము=భాగవతము వేదము, అప్రతి హత బుద్ధియై=అడ్డులేని ధ్యాన మొందింపఁబడిన బుద్ధిగలవాఁడై, దివ్యపురుషుఁడు =గొప్పదేవతయైన, సలలితధ్యాన ముకుళిత నేత్రుఁడు=ధ్యానముతో మూసిన కన్నులు గల వాఁడు, సనందాభ్యుదయారంబు=సనకాదులక్షేమము కొఱకై, అమర గంగావగాహనులై=గంగానదిలో స్నానమొనర్చిన వారై, అహీంద్ర కన్యలు=నాగ స్త్రీలు, ఆర్ద్ర జటాబంధకలితలు=తడసిన జటా బంధముతోఁ గూడికొన్న వారై, భర్తృవాంఛాను వృత్తిన్=భర్తగావలె నను కోర్కితో, కదియన్ ఏతెంచి=సమీపించి.

తాత్పర్యము : ఒకానొకనాఁడు భగవంతుఁడైన సంకర్షణుఁడు పాతాళములోఁదన కాధారభూతుఁడైన వాసు దేవుని ధ్యానించుచు ముకుళిత నేత్రుఁడై యుండెను. అప్పుడు భగవత్తత్త్వమును దెలియఁగోరిన వారై, సనకాదు లాతని సమీపించినారు. వారినిఁ గటాక్షించుటకై ధ్యాన నిమీలితములైన నేత్రముల నా సంకర్షణమూర్తి కొద్దిగాఁ దెఱచిచూచి నాఁడు. ఆకాశగంగ యందు స్నానముఁజేసి తడిసిన జటాబంధములతో నాగకాంత లాతని పాదపీఠమును నిరంతరమును భజించు చుందురు. ఎందు కనఁగా నాతని చరణ పీఠమును భజించినచోఁ దమకుఁ గావలసిన

యుత్కృష్టమైన వరులు ప్రాప్తింతురని వారి విశ్వాసము.

267. కం. పూజ+ఉపహార=పూజలు నైవేద్యములు, నతినుతులనున్=నమస్కారములు స్తోత్రములు.

తాత్పర్యము : ఈ రీతిగా వారాచరణపీఠమునకుఁ బూజలొనర్చి=వివిధములైన నైవేద్యములు సమర్పించి నుతులొనర్చి నమస్కరించిరి. అట్లు సంకరణుని సనకాదులు సమీపించిరి.

268. మ. ఘనసాహస్ర...... ఫణాసహస్రుఁడు=పెక్కు వేలకిరీటములందు వెలుఁగుచున్న రత్నముల కాంతిచేత నెక్కువగాఁ బ్రకాశించుచున్న వేయి ఫణములు గల వాఁడు, దేవతావనదీక్షా చణుఁడు=దేవతలను రక్షించు దీక్షలో సమర్థుఁడు, రూపకృత్యములు=రూపము, కార్యములు, అనురాగసలిత+ఉక్తులు=ప్రేమతో తొట్రువడుచున్న మాటలు.

తాత్పర్యము : అతనికి వేయి కిరీటములు, వానికిఁజెక్కిన రత్నములు. ఆ రత్నకాంతులతో నాతని వేయి పడగలును ఎక్కువగాఁ బ్రకాశించుచున్నవి. దేవతలను రక్షించుటయే దీక్షగాఁగలవాఁడతఁడు. సంకరణుని సమీపించిన సనకాదులు ఆ దేవుని రూపమును, ఆ తనకృత్యములను గొప్పగాఁ బ్రశంసించినారు. వారి మాటలు సంకరణుని యందలి ప్రేమచేఁ దడబడుచుండెను. అనంతరము వారు తమ కోరికను వివరించిరి.

269. తే. భూరి నిగమార్థసారవిచార మగుచున్=గొప్పవైన వేదముల సారమును గూర్చి చర్చించునది, నళినభవసూతి=బ్రహ్మదేవుని కుమారుఁడు.

తాత్పర్యము : వేద రహస్య సారమైన యీ భాగవతమును సంకరణుఁడు సనత్కుమారునకుఁ జెప్పెను. సనత్కుమారుఁడు బ్రహ్మకుమారుఁడు. అతఁడు సాంఖ్యాయనునకెఱిఁగించినాఁడు.

270. కం. సురగురునకున్=బృహస్పతికి.

తాత్పర్యము : సాంఖ్యాయనుఁడు పరాశరునకుఁ జెప్పెను. అతఁడు బృహస్పతి కుపదేశించెను. ఆ బృహస్పతి నాకు వివరించెను.

271. కం. ఆకర్ణింపుము=వినుము, సుశ్లోకుని చరితామృతము=ఉత్తమమైన కీర్తిగలవాని చరిత్ర మను నమృతము, దానిచేత, పరిషేకుఁడవై=అంతటను జిలుకఁబడిన వాఁడవై, ముదము గదురన్ చెలఁగుము.

తాత్పర్యము : దానిని నీకిప్పుడు చెప్పఁబోవుచున్నాను. పరమేశ్వరుని కథామృతముతోఁ బరిషిక్తమైన దేహము గల వాఁడవై ఓ విదురా! శాశ్వత సుఖమును బొందుము.

272. వ. భగవత్రోక్తము=భగవంతునిచేఁ జెప్పఁబడినది. ఋషిసంప్రదాయ+ఆగతము=ఋషిసంప్రదాయముతో వచ్చినది, భవలతాలవిత్రము=సంసారమను తీఁగను నఱకుటకు కొడవలి. కథా ప్రపంచంబు=

కథావిస్తారము.

తాత్పర్యము : ఈ భాగవతము భగవంతునిచేఁ జెప్పఁబడినది. ఋషిసంప్రదాయాగత మైనది. భగవంతునకు సంబంధించిన యొకటే స్తోత్రరూపమైనది. సంసారమను తీఁగను ఖండించుటకు కొడవలివంటిది. ఇట్టి విస్తారమైన భాగవత కథను నీ కిప్పుడు చెప్పెదను వినుము.

273. సీ. ఏ కోదకమైయున్న వేళన్=ఎచ్చటను జలమే వ్యాపించి యున్నప్పుడు, అంతర్నిరుద్ధ=లోపలదాచికొన్న, అనల=అగ్నిగల, దారు వితతిభాతిన్=కట్టెల గుంపువలె, చిచ్ఛక్తిసమేతుఁడై=జ్ఞానశక్తితోఁగూడిన వాఁడై, కపటనిద్రాలోలుఁడు=నటించుచున్న నిద్రగలవాఁడు, భాసుర=ప్రకాశించుచున్న, సుధాఫేన=అమృతపునురుగువలె, పాండురశరీరరుచులు=తెల్లని శరీరకాంతులు, సహస్ర శిరోరత్న రుచులతోన్=వేయియైన శిరఃకిరీటములకాంతితో, అనల్పతత్త్వదీప్తి=తక్కువ కాని తత్త్వముల కాంతితో, అద్వితీయుఁడు=తనకన్నను వేఱుపదార్థము లేని వాఁడు, అభినుతుం డయ్యెన్=అంతర్నిలీన శక్తులచే స్తుతింపఁబడిన వాఁడయ్యెను. ఆనంద భరితుఁడగు చున్=ఆనందముతో నిండిన వాఁడై.

తాత్పర్యము : ఎక్కడఁ జూచిన నొక్కటే జలము. ఆ జలమందు శ్రీమహావిష్ణువు ఆదిశేషునిపైఁబవ్వళించియున్నాఁడు. ఆ శేషుని శరీరము సుధాసముద్రపు నురుగులవలె తెల్లనైనది. అతఁడు ధరించిన వి సహస్రకిరీటములు. ఆ కిరీటములకుఁ జెక్కిన రత్నములు. కిరీటకాంతులును, తెల్లని దేహచ్ఛాయలును గూడి మాడి వేఱొకకాంతివిశేషమును గలించుచుండెను. భగవంతుఁడు వహించినది కపటనిద్ర. ఆతఁడు చిచ్ఛక్తి సమేతుఁడై యున్నాఁడు. లీలగాఁ గన్నులు మూసికొని యుండెను. అతని స్వరూపము లోపల నగ్నిదాగియున్న కట్టెవలె నున్నది. ఆతని కడుపునందే భూత సూక్ష్మము లున్నవి, ఎక్కడఁజూచిన నతఁడు దప్పమఱొక్కటి లేదు. ఆ స్వామి స్వానందమందే విలీనుఁడై యున్నాఁడు. నిరీహుఁడై యున్నాఁడు. "అహీంద్రతల్పే" - అని మాత్రమే మూలము. దానికిఁ బోతనామాత్యుఁడు అలంకారములతో మెఱుఁగు వెట్టినాఁడు. "యథాఽనలోదారుషురుద్ధవీర్యః " అని మూలము. వ్యాసుఁడు రుద్ధవీర్యమై దారువం దణఁగి యున్న యగ్నితో స్వామిని పోల్చినాఁడు. ఇతఁడు దారువితతితోఁబోల్చెను.

274. తే. యోగమాయావిదూరుఁడై=యోగమాయకు దూరమందున్న వాఁడై, యుగసహస్ర కాల పర్యంతము=వేయి యుగములవరకు - కాలశక్త్యుపబృంహితమునన్=కాలమను శక్తిని ప్రేరేపింపఁజేయుటతో, సమతన్=త్రిగుణముల సమత్వభావనతో.

తాత్పర్యము : శ్రీ మహావిష్ణువు యోగమాయ నంగీకరింపనివాఁడై యుగసహస్రకాలపర్యంత ముండెను. ఆతఁడు సమస్త లోకములను దన

జఠరమందిమిడ్చి కొని యుండెను. త్రిగుణము లప్పుడు సమముగా నున్నవి. ఆతఁడు కాలమను దనశక్తిని బ్రేరేచినాఁడు. త్రిగుణముల సామ్యావస్థ మారినది. ఆతఁడు సృష్టింప నెంచెను.

275. కం. జఠరము=కడుపు, లోకనికాయములు=లోకముల గుంపులు, సాధనమగు సూక్ష్మార్థము=సాధనములైన భూతసూక్ష్మములు, మనసునన్ కని=చూచి, కాలానుగత రజోగుణమున్=కాలముచే నేర్పడిన రజోగుణమును,

తాత్పర్యము : లోకములు కడుపు లోనే యుండెను. ఏ రీతిగా నున్నవి? సూక్ష్మములై యున్నవి. బీజాంకుర అణువులవలె నున్నవి, వాని నాతఁడు వీక్షించినాఁడు. ఇంతలో రజోగుణ మాక్రమించెను.

276. సీ. పుట్టించెన్=ఏర్పఱచెను, తద్గుణంబునన్=ఆ రజోగుణము చేత, అప్పయోరుహముకుళంబు=ఆ తామర మొగ్గ, కర్మబోధితమైన కలయందున్ =జీవాదృష్టము ప్రబుద్ధమైన సమయములో, జలజాప్తగతిన్=సూర్యుని వలె, లోకాశ్రయస్థితిసర్వగుణ విభాసితగతిన్=లోకము లుండుటకుఁ గారణమైన సర్వగుణములచేఁ గూడియున్నట్టి, రాజీవమందున్=పద్మమందు, నిజకళాకలిత+అంశంబున్=తనకళను, దానివలనన్=దాని చేత, ఆమ్నాయ మయుఁడునున్, వరగుణుండున్=గొప్పగుణములగలవాఁడు, ఆత్మయోని యున్=తనకుఁ దాన జన్మించిన వాఁడును, చతురాననుండునాన్ = నాల్గుముఖములు గల వాఁడని.

తాత్పర్యము : రజోగుణముతోఁ బరమేశ్వరుని నాభినుండి పద్మకోశ ముదయించెను. అప్పుడు. కాలశక్తి జీవుల యదృష్టమును బ్రబోధింపఁ జేసినది. పరమేశ్వరుని నాభి నుండి పుట్టిన పద్మము సూర్యుని వలె ప్రళయోదకమునంతయుఁ బ్రకాశింపఁ జేయుచున్నది. లోకావస్థితికిఁ గావలసిన సమస్తములైన గుణము లాపద్మమందుండెను. అప్పుడు శ్రీమహా విష్ణువు సుప్తములైన శక్తులతోనే అంతర్యామిగా లోకములకు సంకేతమైన యా పద్మమందుఁ బ్రవేశించినాఁడు. అప్పయోరుహకోశము నుండి వేదమ యుఁడును సమస్త సద్గుణకలితుఁడును ఆత్మయోనియునైన బ్రహ్మ జన్మిం చినాఁడు. ఆతఁడే చతుర్ముఖ బ్రహ్మ.

277. తే. తత్పద్మకర్ణిక యందున్=ఆ పద్మపు దిమ్మెపై, వికచలోచ నుఁడు=వికసించిన కన్నులు గలవాఁడు.

తాత్పర్యము : బ్రహ్మదేవుఁ డప్పుడు ఆ పద్మపు దిమ్మెపైఁ గూర్చున్నాఁడు. అతఁడు చక్కఁగాఁ గన్నులు దెఱచిచూచెను. లోక సమూహము, దిక్కులు, ఆకాశము, తన నాలుముఖములు మొదలగు వానిని జూచెను. "లోకమపశ్యమాన" అని మూలము. మఱి తెనుఁగులో లోక వితతిన్ అని గలదు. ఏదో పాఠాంతర ముండియుండును.

278. చం. అలఘు...... కంజమున్=గంభీరమైన యుగాంతవాయువు చేతఁ గొట్టఁబడిన చలించుచున్న తరంగములుగల జలమునఁ బుట్టిన పద్మము. తద్వనజాత=ఆ పద్మము యొక్క, కర్ణికాతలమునన్=దిమ్మెపైన, విశదక్రియగలినలోకతత్త్వమున్=స్పష్టమైన లోకరహస్యమును, తెలియంగన్ ఓపక=తెలియ లేక.

తాత్పర్యము : ప్రళయాంతమున గాలులు దురుసుగా వీచుచున్నవి. ఆ గాలులతో ప్రళయోదకతరంగములు బ్రహ్మాండముగ లేచుచుండెను. దానియం దొకపద్మము. దాని కర్ణికపై దాను, స్పష్టముగా నరము గాని లోకతత్త్వము. ఏదియు బ్రహ్మ కవగతము గా లేదు. ఆతఁడు మనస్సులో నెంతయో వితర్కించి కొన్నాఁడు.

279. వ. ఇట్లని వితర్కించి=విచారించి.

280. ఉ. ఉద్భవ మయ్యెన్=పుట్టినది, ఒంటిన్=ఒంటరిగా, మత్+ఆఖ్య=నా పేరు, ఏ+ఓజన్=ఏ రీతిగను.

తాత్పర్యము : ఈ జలమందుఁ బద్మమెట్లు పుట్టినది? నే నొంటిగా నీ పద్మమందెట్లున్నాను? నా పేరేమి? నా జన్మ హేతువేమి? నా కేమి యు నర్థమగుట లేదు.

281. కం. వనజనాళమూలంబు=ఈ పద్మపు బిసమూలము, ఆ వనములలోనన్=ఆ నీటిలో, అర్థిన్=ప్రేమతో, అరయుట కొఱకై=చూచుటకై, వనజాతప్రభవుండు=బ్రహ్మ, వనరుహనాళ వివరమందున్=ఆ పద్మనాళము యొక్క రంధ్రములో, అభిముఖుఁడై=ప్రయత్నమునకుఁ బూనుకొన్నవాఁడై.

తాత్పర్యము : ఈ పద్మమునకు మూల మేదియని యరయుటకై యా బ్రహ్మదేవుఁడు పద్మనాళము ద్వారా వెదకుట కారంభించినాఁడు.

282. మ. అతిగంభీర....... నిమగ్నాంగుఁడై=గంభీరమై, విశాలమైన సముద్రపు నీటి యందు మునిఁగిన వాఁడై, చతురాస్యుండు=బ్రహ్మ, సత్+మతిన్=మంచి బుద్ధితో, విభీతుఁడై=భయపడిన వాఁడై, తత్ సరోజాతమున్=ఆ పద్మమును.

తాత్పర్యము : ఆతఁడా సముద్రములో మునిఁగెను. వేయి దివ్యవర్షములు గడచినవి. 'గగవన్మాయ క్రమ్ముకొన్నది. ఏమియుఁ దోఁచలేదు. మరల నా పద్మమునకే వచ్చినాఁడు.

283. తే. క్రమ్మఱచేరి=మరల చేరి, అ య్యబ్జపీఠమందున్=ఆ పద్మ కర్ణికపైన, అష్టాంగయోగక్రియానురక్తిన్=ధ్యానధారణాదుల చేత, పవనున్ బంధించి=గాలి నడగించి.

తాత్పర్యము : మరల నాతఁడు పద్మపీఠికపైఁ గూర్చున్నాఁడు. అష్టాంగ యోగము ననుసరించి గాలిని గట్టి తపస్సమాధిలో నుండెను. నూఱు వర్షములు గడచినవి.

284. ఆ. యోగజనితమైన విజ్ఞానంబున్=యోగశక్తితో నేర్పడిన జ్ఞానమును, కమలనయనున్=శ్రీ మహావిష్ణువును, కానలేక=చూడలేక, హృదయకమల కర్ణికయందున్=పద్మపుదిమ్మెపైన.

తాత్పర్యము : ఇట్టి సమాధి నెంత సాధించినను భగవంతుని గాన లేకపోయెను. కడకు భగవంతుని దయతో హృదయపద్మకర్ణికయం దాతనిఁజూచెను.

285. మ. నిశ్చల భక్తి యోగమహిమన్=చలించని భక్తిచేత, కంజాత గర్భుఁడు, శోభనచారిత్రున్=మంగళములు గలిగించు చరిత్రగలిగి నట్టియు, విలసత్పద్మకళత్రున్=లక్ష్మీదేవి భార్యగా గలవాఁడు, సుధాశనముఖ్య స్తుతిపాత్రున్=దేవతాశ్రేష్ఠులచే పొగడఁబడినవాఁడును, దానవచమూ జైత్రున్=రాక్షససైన్యముల జయించు వాఁడును, దళత్పద్మ నేత్రున్=వికసించుచున్న కమలములవంటి కన్నులుగల వాఁడును, పక్షిరాట్పుత్రునిన్=గరుడవాహనుని-

తాత్పర్యము : కడకు నిశ్చల భక్తి యోగముతో బ్రహ్మ భగవంతునిఁ జూచెను. ఆ శ్రీమహావిష్ణువు మంగళకరమైన చరిత్ర గల వాఁడు. జగత్తులందుఁ బవిత్రుఁడు లక్ష్మీపతి. దేవతాముఖ్యులతోఁబొగడఁబడిన వాఁడు. రాక్షససంహారకుఁడు. వికసించెడికమలముల వంటికన్నులు గల వాఁడు. నీలమేఘనిభగాత్రుఁడు. గరుడవాహనుఁడు.

286. వ. మఱియు,

287. చ. అలఘు....... రుచిచేన్=గొడుగులతో సమానమైన ఫణామండలిపై ధరించిన కిరీటముల రత్నకాంతుల చేత, యుగాంతతిమిరంబున్=ప్రళయాంత మందున్న చీఁకటిని, అకల్మష+ఉల్లసత్+జలములన్ చేసి=మాలిన్యము లేనివై ప్రకాశించుచున్న నీటితో, నవ........ భోగమున్=నూతన పద్మనాళము తో సమాన శరీరము గల,

తాత్పర్యము : ఆ భగవంతుఁడు శేషశయనముపైఁ బవ్వళించి యున్నాఁడు. ఆ సంకర్షణుని శరీరము పద్మనాళము వలె తెల్లగా నుండెను. ఇచ్చటి 'సిత' శబ్దమునకు విమలమని యర్థము. ఆదిశేషునికి ఫణాసహస్రము. వాని పై రత్నకిరీటములు. ఆ రత్నముల కాంతి ప్రళయాంతమందున్న చీఁకటిని బోఁద్రోలుచుండెను.

288. సీ. వర=శ్రేష్ఠమైన, పీత=పచ్చని, కౌశేయపరిధానకాంతి=పైఁగప్పు కొన్న పట్టుగుడ్డకాంతి, సంధ్యాంబుదరుచినిచయంబు=సాయంకాలమునఁ బ్రకాశించు చున్న మేఘము యొక్క కాంతిపుంజము. కమనీయహేమ సంకలితకిరీటంబు=బంగారుచేఁగూడిన కిరీటము, రమణన్=అందముగా, కాంచన శిఖరంబు=బంగారుశిఖరము. మానిత=గౌరవింపఁదగిన, మౌక్తిక మాలికారుచి=ముత్యాలహారముల కాంతి, సానుపతిత=చరియలయందుఁ బడిన, నిర్ఝరపరంపరలుగాఁగన్=ప్రవాహములుగాను, నవతులసీ దామ కములు=తులసీహారములు, ఓషధీలతలు=ఓషధులు, వరభుజంబులు=శ్రేష్ఠములైన భుజములు, వంశములు=వెదుళ్లు, అంగణ=తనభూముల లోని, పాదపప్రచయములుగన్=చెట్లగుంపులుగా, మరకతాచలవిడంబిత=మరకతమయమైన పర్వతము చేతఁబోల్పఁబడిన.

తాత్పర్యము : శ్రీమహావిష్ణువు మరకతపర్వతమువలె నున్నాఁడు. ఆతఁడు ధరించిన పీతాంబరమే సంధ్యాకాలరుచుల నీను చున్నది. కిరీటమే కాంచన శిఖరము. ధరించిన ముత్యాల హారములు తటములలోఁ బడెడు ప్రవాహములు. తులసీహారములు పర్వతమందున్న ఓషధీలతలు. భుజములే సమీపమందున్న వెదుళ్లు. పాదములు అంగణమందున్న చెట్లగుంపు.

289. వ. అపరిచ్ఛిన్నము=కొలతకందనిది. నిరుపమానము=సాటిలేనిది. నిఖిలలోకసంగ్రహము=సమస్తలోకమును దనయం దిమిడ్చి కొన్న, వర్తుల=గుండ్రనైన. ఆయామము=దైర్ఘ్యముగలది. ఆత్మీయ=తనయొక్క, నిర్మల ద్యుతి=స్వచ్ఛమైన కాంతి, కామంబులు=కోరికలు, అళికఫలక=నుదుటి యొక్క, లలితరుచివిచయంబులతున్, ఓటువడి=ఓడి, ఉపధానములు=దిండ్లు, ఊరుయుగళము=తొడల జంట మేఖలాకలాప=ఒడ్డాణమను సొమ్ము వలె, అభిరామంబు=అందమైనది. కదంబకింజల్క శోభిత=కడిమి పూలకేసరములవలె, శోభిత=ప్రకాశించుచున్న, ఆ వర్తము=సుడి, జఠరస=కడుపునందున్న, ముహుర్ముహురుద్భవ=మాటిమాటికి జన్మించిన, కృశీభూత=చిక్కినది, మాలికావిరచిత=హారములచే నేర్పడిన రంగవల్లీవిరాజితంబు=ముగ్గులు గలది. కిసలయతల్పంబు=చిగురుటాకుల పాన్పు గలది. ఘనసార=పచ్చకర్పూరము, కేళీమందిరంబు=క్రీడాగృహము, సుఖకేళీ సమారంభ=క్రీడయందు, పరిరంభణ=కౌఁగిలించుటగల, అంభోధి రాట్కన్యకా=లక్ష్మీదేవి యొక్క, కీలిత=ఉంచఁబడిన, నికషములు=దాచు కొనుట, కంబుకంధరము=శంఖము వంటికంఠము, మణిమరీచులు=రత్న కాంతులు, నిద్ధంబులు=స్వచ్ఛమైనవి. శోణాయితము=ఎఱ్ఱనైనది. సీమాస్తంభము=సీమయందు నాటఁబడిన స్తంభము. కరుణామృత తరంగితాంగములు=కరుణారసముతోఁ గూడినవి. అక్షరత్వంబు=నశింప కుండుట, ఇక్షుచాపుఁడు=మన్మథుఁడు, శశాంకశంకాస్పద=చంద్రుఁడను

శంక గలుగఁజేయు, అవకాశంబుఁజూపక=అవకాశమొసఁగక, దురాసదము= అడ్డగింపరానిది.

తాత్పర్యము : పరమాత్ముని దివ్యరూపమును వర్ణించుచున్నాఁడు. అది యింత యని మితి వెట్ట రానిది. దానికి సాటియగు పదార్థము ప్రపంచమున లేదు. సమస్తలోకములను భరింపఁజాలినదియై యదీ యుండెను. అతి విస్తారము వర్తులము దీర్ఘమైనది. ఆ దివ్యరూపము. మణివిభూషణములు ధరించియుండెను. స్వామి శరీరకాంతి చేత నాతఁడు ధరించిన తొడవులకే కాంతి విశేష మబ్బుచుండెను. వివిధములగు కోరికలను గోరి వేదోక్తమైన మార్గముతోఁ దన్నుపాసించు పురుషశ్రేష్ఠులకుఁ గామధేనువుతో సమానమైన దాతని పద యుగ్మము. చంద్రుఁడతని నిటల కాంతులచే జయింపఁబడినాఁడు. జయింపఁబడి పరమాత్ముని దయకొఱకై యాతని పాదసరోజము లంటినాఁడు. ఆతని పాదనఖములు ఆ చంద్రబింబములవలె నుండెను. లక్ష్మీదేవియు భూదేవియు స్వామి తొడలపైఁ బవ్వళింతురు. అవి వారికి దిండవలె నుండెను. నీలవర్ణముగల యరటిచెట్ల బోదెలవలె నుండెను. ఆతని కటిమండల మున నున్నది మణిమయమేఖల. కడిమిపూల కేసరములతో సాటివచ్చు పీతాంబరము. శృంగార మను ప్రవాహములో నున్న సుడివంటి దాతని నాభి. స్వామి కడుపులో బ్రహ్మాండములున్నవి. అవి మరల మరల గడకు వచ్చుచు మరల నాతని యందే లీన మగుచుం డెను. ఈ నిరంతర పరిశ్రమచే నాతని నడుము చిక్కిపోయినట్లు సన్నగా నుండెను. ఆతని వక్షఃస్థలము లక్ష్మీదేవి విహరించు క్రీడామందిరమువలె నున్నది. స్వామి ధరించు ముత్యాల సరులే రంగవల్లులు. మధ్యలోనున్న తులసీదామములే కిసలయతల్పము. ఆ వక్షఃస్థలమను నింటి యందు వ్రేలాడఁగట్టిన పూదండలు, పచ్చకర్పూరము, కస్తూరి - వీనిచే నలంకరింపఁ బడినదది. కౌస్తుభమనురత్నదీపము. శ్రీవత్సమే యా యింటికి గుర్తు. చాల నద్భుతమైన రూపకము.

శంఖముతో సమానమైన దాతని కంఠము. దానిలో మూడు రేఖలు. అవి సుఖసమయములయందు లక్ష్మీ దేవికంకణముల యొఱపులుగా నున్నవి. ఆ బాహువులలో కేయూరములు కంకణములు. చెక్కుటద్దములు సమస్తలోకముల దుఃఖముల హరించు దరహాసములను చంద్రికలతోఁ గూడుకొన్నవి. కర్ణకుండల మణి మరీచులు నర్తనము సల్పుచున్నవి. ఆతని పెదవి పండిన దొండపండువంటిది. పగడము వంటిది. ఆ నాసా దండము సమస్త భువనములను బరిపాలించుటకు - "నేను చాలుదు. నేను చాలుద న"ని వాద మొనర్చికొనెడి నేత్రములను హద్దునందు నిల్పిన స్తంభము వలె నున్నది. స్తంభము నిల్పుట - 'ఈ చోటు నీవు దాటి రారాదు.

ఆ చోటు నీవు దాటి రా కూడదు' అని నియమించుటకు. సంపగి పూవు వంటి ముక్కు, చెవుల వఱకు వ్యాపించిన నేత్రములు, శ్రీకారముల వలె నున్న చెవులు, అది పరమపురుషుని చెవులగుటతో దానికి శాశ్వతత్వము సిద్ధించినది. అక్షరత్వమనుపదము శ్లిష్టము. మన్మథుని ధనుస్సులవంటి రెండు కనుబొమలు. అష్టమిచంద్ర శంక నుత్పాదించు ఫాలఫలకము. ఆ కిరీటము నీల పర్వత శిఖరము పైనున్న బాలమార్తాండమండలము నను కరించుచుండెను. ఆ కిరీటము పద్మరాగమయము. ఆ తేజము సూర్య చంద్ర పవన అనల ప్రకాశముల కవకాశ మీయనిది. అనఁగా నాతేజస్సు వీనిపై నాధారపడదని యర్థము. రాక్షస మర్దనక్షమములైన సుదర్శనాది దివ్యాయుధములు, వానితో నారూపము సమీపించుటకు సాధ్యము గాని దై యుండెను.

ఈ వచనము అద్భుతమైన యలంకారముతోఁ గూడిన పోతనామాత్యుని యమోఘమైన సృష్టి. వాడఁబడిన సమాసములు పేశలములై నోటి నుండి జారిపోవునట్లున్నవి. అర్థగాంభీర్యము సర్వవిస్మయావహము.

289. ఉ. హార నిచయంబులన్=హారములను పుష్పముల చేతను, చంచత్........ ఒప్పారఁగన్=ప్రకాశించుచున్న కేయూరములు, ఉంగరములు, వీనితోఁగూడిన బాహువులను కొమ్మలు, భువనాత్మకలీలన్=ప్రపంచము నంతయు నాక్రమించి కొన్నదై, అదృష్టమూల=మొదలుగన పడనిదై, విస్ఫారిత....... ఆ కృతిన్=ప్రకాశించు చున్న సర్పశరీరములచేఁబరివేష్టింపఁబడిన చందన వృక్షమువలె.

తాత్పర్యము : ఆతఁడు మహాచందనవృక్షము వలె నుండెను. ధరించిన ముత్యాలహారములే పుష్పములు. కేయూరాది భూషణవేష్టిత ములైన బాహువులే కొమ్మలు. మూలమును గనుఁగొనరాని చందనవృక్షము వలె నున్నాఁడు. ఇతనిమూలము గనుఁగొనుట గూడ సాధ్యముగాదు.

290. మ. కుండలిరాజసఖ్యమునన్=ఆదిశేషుని సంబంధముతోను, (సర్పశ్రేషముల సహవాసముతోను)ఉర్వీభృత్స మాఖ్యన్=ప్రపంచమును భరించెడు కీర్తితోను, (ఉర్వీధరమను పేరు తోను,) సముజ్జ్వలిత...... కూటంబులన్=ప్రకాశించుచున్న కిరీటములను బంగారు శిఖరములతోను, సలిలావాసతన్=నీటిలో నుండుటతోను, రత్నగర్భంబునన్=రత్నములు గర్భమునందుండుట తోను. మైనా కావనీభృద్గతిన్=మైనాకపర్వతమువలె.

తాత్పర్యము : భగవంతుని మైనాక పర్వతముతోఁబోల్చుచున్నాడు. అది సర్పరాజములతోఁగూడికొన్నది. ఇతఁడాదిశేషుని సంబంధము గల వాఁడు. కుండలి రాజ శబ్దమునకు రెండు విధముల సమాసము, కుండలినాం రాజానః=అనఁగా సర్పశ్రేష్ఠులు, కుండలినాంరాజా=సర్పరాజు -

ఆదిశేషుఁడు. భూమిని ధరించునవి యని కొండలకుఁబేరున్నది. నిజమునకు భూమిని ధరించునవి కులపర్వతములే యైనను అన్ని కొండలకును భూమిని భరించునవి యనియే సామాన్యముగాఁగవులు చెప్పెదరు, శ్రీ మహావిష్ణువు భూమిని భరించుచున్నాఁడు. మైనాకునకు బంగారు మయములైన యనేక శిఖరములు. ఇతనికిని శిఖరములవంటి బాహువులు. స్వామి ప్రళయజలములో నున్నాఁడు. మైనాకుఁడు గూడ నింద్రద్వేషముతో నీటిని దాటిరాఁడు. కౌస్తుభమనురత్నము గర్భమున గలవాఁడు స్వామి. పర్వతగర్భమందును రత్నము లుండును.

291. కం. వితతార్థ=గొప్ప అర్థముగల, జ్ఞాన=జ్ఞానము, జప=జపము స్తుతి=స్తోత్రము లనెడు, మకరందప్రహృష్ట=తేనెచే సంతసించిన, శ్రుతిజాత=వేదముల గుంపులను. మధువ్రత పరివృత=తుమ్మెదలతోఁగూడినదియు, శోభా+ఆగత కాంతితో నేర్పడిన కీర్తి, ప్రసవమాలికలు=కీర్తియను పూల మాలలు,

తాత్పర్యము : జ్ఞానులు వితతార్థములు గల జ్ఞానముతోఁ గొల్తురు. జపముతోఁ బూజింతురు. స్తోత్ర మొనర్తురు. ఇవియే తేనెలు. వీనితో శ్రుతిజాతమునకుఁదృప్తి యేర్పడినది. ఆ వేదములను తుమ్మెదలు స్వామి ప్రసవమాలికలను బరివేష్టించియున్నవి. ఈ శోభతోఁగూడికొన్న కీర్తితో సమానమైనవి యాతఁడు ధరించిన పూలదండలు,

**292. వ. కనుంగొని=చూచి, చతురాననుండు=బ్రహ్మదేవుఁడు,**

**293. సీ. ఆద్యంతశూన్యునిన్=ఆద్యంతములు లేని వానిని అప్పులన్=నీటిని, ఆత్మీయకర్మబీజాంకురము=తనపనికి బీజముతో సమానమైనది,** అకుంఠిత ప్రజాభి సరాభిముఖతన్=అడ్డులేని సృష్టికార్యము నొనర్పవలెనను సంకల్పముతో.

తాత్పర్యము : స్వామి అనఘుఁడు. సర్వేశ్వరుఁడు. ఆద్యంతశూన్యుఁడు. అతని నాభియందుద్భవించిన పద్మము నీరు - వాయువు - అంబరము - ఇవి మాత్రమే గనిపించినవి. రజోగుణము బ్రహ్మ నావేశించెను. అతఁడు అవ్యక్తమార్గుండైన శ్రీ హరియందు హృదయమును నిల్పెను. నిలిపి యా మహాత్ము నిట్లు స్తుతింప నారంభించినాఁడు.

**ఇది పుట్టపర్తి నారాయణ దాసవిరచిత**
**భాగవత సుధాలహరియందు అష్టమాధ్యాయము.**

# నవమోఽధ్యాయః

బ్రహ్మోవాచ

శ్లో. జ్ఞాతోఽసి మేఽద్య సుచిరా న్నను దేహభాజాం
న జ్ఞాయతే భగవతో గతి రిత్యవద్యమ్,
నాన్యత్త్వదస్తి భగవన్నపితన్నశుద్ధం
మాయాగుణవ్యతికరా త్త్వము రుర్విభాసి. 1

రూపం యదేత దవబోధరసోదయేన
శశ్వ న్నివృత్తతమసః సదనుగ్రహాయ,
ఆదౌ గృహీత మవతార శతైకబీజం
యన్నాభిపద్మభవనా దహ మావిరాసమ్. 2

నాతఃపరం పరమ యద్భవత స్స్వరూప
మానందమాత్ర మవికల్ప మవిద్ధవర్చః,
పశ్యామి విశ్వసృజ మేక మవిశ్వ మాత్మన్!
భూతేంద్రియాత్మక మదస్త ఉపాశ్రితోఽస్మి. 3

తద్వా ఇదం భువన మంగళ మంగళాయ
ధ్యానేస్మనోదర్శితం త్వదుపాసకానామ్,
తస్మై నమో భగవతేఽను విధేమ తుభ్యం
యోఽనాదృతో నరక భాగ్భి రసత్ప్రసంగైః. 4

యే తు త్వదీయ చరణాంబుజ కోశ గంధం
జిఘ్రంతి కర్ణవివరైః శ్రుతివాతనీతమ్,
భక్త్యా గృహీత చరణాః పరయా చ తేషాం
నాపైషి నాథ! హృదయాంబురుహాత్స్వ పుంసామ్. 5

తావ ద్భయం ద్రవిణగేహ సుహృన్నిమిత్తం
శోకస్స్పృహా పరిభవో విపులశ్చ లోభః,
తావన్మమేత్యస దవగ్రహ ఆర్తిమూలం
యావన్నతేంఘ్రి మభయం ప్రవృణీత లోకః. 6

దైవేన తే హతధియో భవతః ప్రసంగా
త్సర్వాశుభో పశమనా ద్విముఖేంద్రియా యే,
కుర్వంతి కామసుఖలేశలవాయ దీనా
లోభాభిభూత మనసోఽకుశలాని శశ్వత్. 7

క్షుత్తృట్త్రిధాతుభి రిమా ముహు రర్ద్యమానా
శ్శీతోష్ణ వాత వర్షై రితరేతరా చ్చ,
కామాగ్నినాఽచ్యుత! రుషా చ సుదుర్భరేణ
సంపశ్యతో మన ఉరుక్రమ సీదతే మే. 8

యావ త్పృథక్త్వ మిద మాత్మన ఇంద్రియార్థం
మాయా బలం భగవతో జన ఈశ పశ్యేత్,
తావన్న సంసృతి రసౌ ప్రతి సంక్రమేత
వ్యర్థాపి దుఃఖనివహం వహతి క్రియార్థా. 9

అహ్న్యాపృతార్తకరణా నిశి నిశ్శయానా
నానామనోరథధియా క్షణభగ్ననిద్రాః,
దైవా హతార్థరచనా ఋషయోఽపి దేవ!
యుష్మత్ప్రసంగవిముఖా ఇహ సంసరంతి. 10

త్వం భావ యోగపరిభావిత హృత్సరోజ
ఆస్సే శ్రుతేక్షితపథో నను నాథ పుంసామ్,
యద్యద్ధియా త ఉరుగాయ విభావయంతి
తత్తద్వపుః ప్రణయసే సదనుగ్రహాయ. 11

నాఽతి ప్రసీదసి తథోపచితోపహారై
రారాధిత స్సురగణై ర్హృది బద్ధకామైః,
యత్సర్వభూతదయయాఽ సదలభ్యయైకో
నానాజనే ష్వవహిత స్సుహృదంతరాత్మా. 12

పుంసా మతో వివిధకర్మభి రధ్వరాద్యై
ర్దానేన చోగ్రతపసా వ్రతచర్యయా చ,
ఆరాధనం భగవత స్తవ సత్క్రియార్థో
ధర్మోఽర్పితః కర్హిచి న్మ్రియతే న యత్ర. 13

శశ్వత్స్వరూపమహసైవ నిపీతభేద
మోహాయ బోధధిషణాయ నమః పరస్మై,
విశ్వోద్భవస్థితిలయేషు నిమిత్త లీలా
రాసాయ తే చక్రుమ హే నమ ఈశ్వరాయ. 14

యస్యావతారగుణ కర్మ విడంబనాని
నామాని యేఽసు విగమే వివశా గృణంతి,
తేఽనేక జన్మ శమలం సహసైవ హిత్వా
సంయాం త్యపావృత మృతం త మజం ప్రపద్యే. 15

యో వా అహం చ, గిరిశశ్చ విభు స్స్వయం చ
స్థిత్యుద్భవ ప్రళయ హేతవ ఆత్మ మూలమ్,
భిత్త్వా త్రిపాద్వవృధ ఏక ఉరుప్రరోహ
స్తస్మై నమో భగవతే భువన ద్రుమాయ. 16

లోకోఽవికర్మ నిరతః, కుశలేఽప్రమత్తః
కర్మణ్యయం త్వదుదితే భవదర్చనే స్వే,
య స్తావ దస్య బలవా నిహ జీవితాశాం
సద్య శ్ఛిన త్త్యనిమిషాయ నమోఽస్తు తస్మై. 17

యస్మాద్బిభేమ్యహ మపి ద్విపరార్ధ ధిష్ణ్య
మధ్యాసిత స్సకల లోకనమస్కృతం యత్,
తేపే తపో బహుసవోఽవరురుత్స మాన
స్తస్మై నమో భగవతేఽది మఖాయ తుభ్యం. 18

తిర్యఙ్మనుష్య విబుధాదిషు జీవయోని
ష్వాత్మేచ్ఛ యాత్మకృత సేతు పరీప్సయా యః
రేమే నిరస్తరతి రప్యవలబ్ధ దేహ
స్తస్మై నమో భగవతే పురుషోత్తమాయ. 19

యోఽవిద్యయాను పహతోపి దశార్ధ వృత్త్యా
నిద్రా మువాహ జఠరీకృతలోకయాత్రః,
అంతర్జలే హి కశిపు స్పర్శానుకూలాం
భీమోర్మి మాలిని జనస్య సుఖం వివృణ్వన్. 20

య న్నాభి పద్మభవనా దహ మాస మద్య
లోకత్ర యోపకరణో యదనుగ్రహేణ,
తస్మై నమస్త ఉదరస్థ భవాయ యోగ
నిద్రావసానవికసన్నళి నేక్షణాయ. 21

సోఽయం సమస్త జగతాం సుహృదేక ఆత్మా
సత్త్వేన యన్మృడయతే భగవాన్ భగేన,
తేనైవ మే దృశ మనుస్పృశతాద్యథాహం
స్రక్ష్యామి పూర్వవ దిదం ప్రణతప్రియోఽసౌ. 22

ఏష ప్రసన్న వదనో రమయాత్మ శక్త్యా
యద్యత్కరిష్యతి గృహీతగుణావతారః,

తస్మిన్ స్వవిక్రమ మిదం సృజతోఽపి చేతో
యుంజీత కర్మ శమలం చ, యథా విజహ్యామ్. 23

నాభిహ్రదా దిహ సతోఽంభసి యస్య పుంసో
విజ్ఞాన శక్తి రహ మాస మనంత శక్తే,
రూపం విచిత్ర మిద మస్య వివృణ్వతో మే
మారీరి షీష్ట నిగమస్యగిరాం విసర్గః. 24

సోఽసావదభ్రకరుణో భగవాన్ వివృద్ధ
ప్రేమస్మితేన నయనాంబురు హం విజృంభన్,
ఉత్థాయ విశ్వవిజయాయ చ నో విషాదం
మాధ్వ్యాగిరా పనయతా త్పురుషః పురాణః. 25

మైత్రేయ ఉవాచ

స్వసంభవం నిశామ్యైవం తపోవిద్యా సమాధిభిః,
యావన్మనో వచఃస్తుత్వా విరరామ స ఖిన్నవత్. 26

అథాభి ప్రేత మాలక్ష్య బ్రహ్మణో మధుసూదనః,
విషణ్ణ చేతస స్తస్య కల్పవ్యతికరాంభసా. 27

లోకసంస్థాన విజ్ఞాన ఆత్మనః పరిఖిద్యతః,
త మాహాగాధ యా వాచా కశ్మలం శమయన్నివ. 28

శ్రీభగవానువాచ

మా వేద గర్భ గా స్తంద్రీం సర ఉద్యమ మావహ,
తన్మ యాఽపాదితం హ్యగ్రే, యన్మాం ప్రార్థయతే భవాన్. 29

భూయ స్త్వం తప ఆతిష విద్యాంచైవ మదాశ్రయామ్,
తాభ్యా మంతర్హృది బ్రహ్మన్ లోకాన్ ద్రక్ష స్యపావృతాన్. 30

తత ఆత్మని లోక చ భక్తి యుక్త స్సమాహితః,
ద్రష్టాసి మా పరం బ్రహ్మ మయి జీవాంస్త్వమాత్మనః. 31

యదా తు సర్వభూతేషు దారుష్వగ్ని మివ స్థితమ్,
ప్రతిచక్షీత మాం లోకో జహ్యాత్తర్హ్యేవ కశ్మలమ్. 32

యదా రహిత మాత్మానం భూతేంద్రియగుణాశయైః,
స్వరూపేణ మయోపేతం పశ్యన్ స్వారాజ్య మృచ్ఛతి. 33

నానా కర్మవితానేన ప్రజా బహ్వీ స్సి సృక్షతః,
నాత్మావసీద త్యస్మిం స్తే వర్షీయాన్ మదను గ్రహః. 34

ఋషి మాద్యం న బధ్నాతి పాపీయాం స్త్వాం రజోగుణః,
య న్మనో మయి నిర్బద్ధం ప్రజాస్సం సృజతోఽపి తే. 35

జ్ఞాతోఽహం భవతా త్వద్య దుర్విజ్ఞేయోఽపి దేహినామ్,
యన్మాం త్వం మన్యసేఽయుక్తం భూతేంద్రి యగుణాత్మభిః. 36

తుభ్యం మద్విచికిత్సాయా మాత్మా మే దర్శితో బహిః,
నాళేన సలిలే మూలం పుష్కరస్య విచిన్వతః. 37

య చ్చకర్థాంగ మత్‌స్తోత్రం మత్కథాభ్యుదయాంకితమ్,
యద్వా తపసి తే నిష్ఠా స ఏష మదను గ్రహః. 38

ప్రీతోఽహ మస్మి భద్రం తే లోకానాం విజయేచ్ఛయా,
య దస్తౌషీ ర్గుణమయం నిర్గుణం మాఽను వర్ణయన్. 39

య ఏతేన పు మా న్నిత్యం స్తుత్వాస్తో త్రేణ మాం భజేత్,
తస్యాఽన్వహం ప్రసీదేయం సర్వకామవరేశ్వరః. 40

పూర్తేన తపసా యజ్ఞైర్దానై ర్యోగై స్సమాధినా,
రాద్ధం నిశ్శ్రేయసం పుంసాం మత్ప్రీతి స్తత్త్వవిన్మతమ్. 41

అహ మాత్మాఽఽత్మనాం ధాతః ప్రేష స్సన్ప్రేయసా మపి,
అతో మయి రతిం కుర్యా ద్దేహాది ర్యత్కృతే ప్రియః. 42

సర్వవేదమయేనేద మాత్మానాఽఽత్మాత్మ యోనినా,
ప్రజా స్సృజ యథా పూర్వం యాశ్చ మయ్యను శేరతే. 43

మైత్రేయ ఉవాచ

తస్మా ఏవం జగత్స్రష్టే ప్రధాన పురుషేశ్వరః,
వ్యజ్యేదం స్వేన రూపేణ కంజనాభ స్తిరోదధే. 44

ఇతి శ్రీమద్భాగవతే, మహాపురాణే, పారమహంస్యాం,
సంహితాయాం తృతీయస్కంధే, నవమోఽధ్యాయః.

## అర్థములు :

1. శ్లో. సుచిరాత్=చాలకాలమునకు, మే=నాచేత, అద్య=ఇప్పుడు, జ్ఞాతః అసి=తెలిసికొనఁబడిన వాఁడవైతివి, భగవతః గతిః=భగవతత్త్వము న జ్ఞాయతే=తెలిసికొనఁబడదు. ఇతి=అనుట, దేహభాజాం=శరీర ధారులకు. అవద్యం=దోషము, భగవన్! త్వదన్యత్=నీ కంటె వేఱైనది. న అస్తి=లేదు. అపి=ఐనను, తత్=అది, న శుద్ధం=పరిశుద్ధమైనది కాదు. మాయాగుణవ్యతికరాత్ =మాయాగుణముల అన్యోన్య సంబంధము కారణముగా, ఉరుః=అనేకుఁడవై. విభాసి ఇతియత్=ప్రకాశింతువను టేదిగలదో ఆ కారణము చేత,

తాత్పర్యము : బ్రహ్మ అన్నాఁడు ఇక్కడినుండి యిఱువది యొక్క శ్లోకములలో బ్రహ్మ స్తుతించును. భగవద్దర్శనముతో నేర్పడిన సంతోషమును భవింపలేని వారలపైఁగల సంతాపమును మొదటఁగన్పఱచుచున్నాఁడు. భగవన్! బహుకాల మొనర్పఁబడిన తపః ఫలముగా నిన్నుఁ గాంచెడు నదృష్టము నాకు లభించినది. నీదర్శనము పొందక పోవుటయే దేహధారులకు మహాదుర దృష్టము. నాచే వీక్షింపఁబడుచున్న సమస్త పదార్థములును నీ పాదపద్మముల రూపభేదములే. ఐనను అవి యొక్కటియుఁ బరమార్థమైనవి గావు. మాయాగుణముల యొక్క అన్యోన్య సంబంధము కారణముగా నీస్వరూపము బహురీతులుగాఁగన్పడుచున్నది. అందుచే నది నిర్గుణమును నిరతి శయమునైన రూపము గాదు. ఇప్పుడు లోకము లేదు గదా! మఱి యేపదార్థములు పరబ్రహ్మ నానారూపములుగా భాసించుచున్నవి అని, వినువారికి సందేహ మేర్పడవచ్చును. దానికి సమాధాన మిది. భగవదనుగ్రహము చేత బ్రహ్మకు త్రికాలజ్ఞాన మేర్పడినది. దాని ఫలమే యీ స్తుతి.

2.శ్లో. అవబోధరసోదయేన=జ్ఞానరసము యొక్క ప్రత్యక్ష తా కారణముగా, శశ్వన్ని వృత్తి తమసః=ఎప్పుడును అవిద్యాసంబంధము లేకుండునట్టి, తే, ఏతద్రూపం=ఈ రూపము, సదనుగ్రహాయ=సత్పురుషుల యనుగ్రహమునకై. ఆదౌ=మొదట, గృహీతం=స్వీకరింపఁబడినదియు, అవతారశతైక బీజం=అనేకావతారముల యొక్క మూలకారణమునై యున్నది. యన్నాభిపద్మభవనాత్=ఎవని నాభిపద్మమను భవనము నుండి - అహం=నేను, ఆవిరాసం=జన్మించితినో.

తాత్పర్యము : భగవత్స్వరూపము ప్రాకృతమైనది గాదు. సచ్చిదానంద స్వరూపమైనది అని చెప్పుచున్నాఁడు. స్వామీ! నిరంతరము ప్రవహించుచున్న జ్ఞాన ప్రవాహామే నీవు. అవిద్యయను నంధకారము

నిన్నెప్పు డంట లేదు. నీవు గ్రహించిన యీ స్వరూపము ఉపాసకులకు బీజరూప మైనది. నీ నాభి యందున్న పద్మ మనుభవనము నుండి గదా నేను జన్మించినది!

3.శ్లో. పరమ=సర్వోత్కృష్టుఁడైన వాఁడా! ఆనందమాత్రం=ఆనంద మాత్రమును, అవికల్పం=వికల్పరహితమును, అవిద్ధవర్చః= మఱవరాని చైతన్యముతోఁ గూడినదియు నైన, భవతః=నీయొక్క, స్వరూపం ఇతియత్= స్వరూప మేదిగలదో, అతః పరం=దీనికంటె నుత్కృష్టమైన దానిని, న పశ్యామి=నేను చూచుట లేదు, అనిత్యం=లోకవిలక్షణమును. విశ్వసృజం =లోకములకు నిమిత్త కారణమును నైన, భూతేంద్రియాత్మకం=భూతములు, ఇంద్రియములు వీనిస్వరూపమై యున్న, ఏకం=కేవలమైన, తే అదః రూపం=నీ యీ రూపమును, ఉపాశ్రితః అస్మి=ఆశ్రయించిన వాఁడనై యున్నాను.

తాత్పర్యము : ఓ పరమోత్కృష్టుఁడైన పరమాత్మ స్వరూపుఁడా! కేవలమైన యానందము - జాతి, వ్యక్తి మొదలైన భేదకల్పనములు లేనిది, అజ్ఞానలేశమును లేని చైత్యనముతోఁ గూడినదియు నైన నీ యీస్వరూపము నకు పరమైన దానిని నే నెక్కడను జూచుటలేదు. కనుక నీ యీస్వరూపము విలక్షణ మైనది. సమస్త లోకములకును నిమిత్త కారణము. భూతములు - ఇంద్రియములు వీని స్వరూపము - వీని కుపాదాన కారణమును గూడ. అటి నీరూపమును నే నాశ్రయించితిని. ఈ విధమైన యను భూతికి నీ యిచ్ఛాశక్తి యొక్కటే కారణము. అందుకే పరమ! అని సంబోధించినాఁడు, పర= ఉత్కృష్టమైన ఆత్మ-చైతన్య శక్తి యెవరి కుండునో వాఁడు పరమాత్మ.

4.శ్లో. భువన మంగళ, తే, ఉపాసకానాం=ఉపాసకులమైన నః=మా యొక్క, మంగళాయ=మంగళము కొఱకై, ధ్యానే=ధ్యానమందు, దర్శితం= చూడఁబడిన, ఇదం=ఈ రూపము, తద్వై=ఈ రూపమే, అసత్ప్రసంగైః=పనికి రాని ప్రసంగములతోఁ సంబంధము గల, నరకభాగ్భిః=నరకము ననుభవింపఁ బోవునట్టి వారిచేత, యః=ఎవఁడు, అనాదృతః=ఆదరింపఁబడఁడో, భగవతే తస్మై తుభ్యం=జ్ఞానపరిపూర్ణుఁడవైన ఆ నీకు, నమః అను, విధేమ=నమస్క రించు చున్నాము.

తాత్పర్యము : లోకములకు మంగళ స్వరూపుఁడవైన భగవంతుఁడా! ని న్నుపాసించు మాబోటివారలకు శ్రేయస్సును గలించుటకై ధ్యానావసర మందు నీరూపమును జూపించితివి. ఇది వేదచోదితమై, సచ్చిదానంద స్వరూపమైన పరమార్థస్వరూపము. నిషిద్ధములైన శబ్దాదివిషయము లం దెక్కువ అభినివేశము గల వారు, విషయాసక్తులైన వారు, వీరితో సంబంధము గల వారు నరక యోగ్యులు. వీరు నీ స్వరూపము నాదరింపరు. అట్టి పరిపూర్ణ జ్ఞాన స్వరూపుఁడవైన నీ పాదపద్మములకు నిరంతర నమస్కారము.

5. శ్లో. శ్రుతివాతనీతం=వేదములను వాయువుచేత సమీపమును బొందింపఁబడినట్టి, త్వదీయ చరణాంబుజ కోశగంధం=నీ పాదముల గంధమును, కర్ణవివరైః=శ్రోత్రద్వారములతో, యే తు=ఎవ్వరు, జిఘ్రంతి=వాసన జూచుచున్నారో, పరయా=ఉత్కృష్టమైన, భక్త్యా=ప్రేమచేత, గృహీతచరణః=గ్రహింపఁబడిన పాదములు గల, త్వం=నీవు, తేషాం స్వపుంసాం=అట్టి నీ కాదరపాత్రులైన వారియొక్క, హృదయాంబురుహాత్=హృదయ పద్మము నుండి, న అపైషి=ఎన్నటికిని దొలఁగవు.

తాత్పర్యము : అసత్సంగులు నరక భాక్కులగుదురని చెప్పిన తర్వాత భగవత్సంగులైన వారు భగవంతునితోఁ జేరెదరు. వారు కృతార్థు లగుదురని చెప్పుచున్నాఁడు. వేదమను వాయువు చేత సమీపమును బొందింపఁబడిన నీ పాదపద్మగంధమును శ్రోత్రములతో నెవ్వ రాఘ్రాణింతురో వారు పరమ భక్తితో నా పాదసంగము నెవ్వరును వదలరు. అట్టివారు నీస్వజనులు. వారి యందు నీ కరుణ యపారముగాఁ బ్రవహించును. అట్టి వారి హృదయాబ్జ ముల నుండి నీ వెన్నటికిని దొలఁగవు. పరమదయాళువు, భక్తపరిపాలకుఁడు నైన నీ కిదియే సముచితము.

6.శ్లో. లోకః=లోకము, అభయం=భయరహితమైన, తే అంఘ్రిం=నీ పాద పద్మమును, యావత్=ఎంతవఱకు, న ప్రవృణీత=శరణమును బొందదో, తావత్=అంతవఱకు, ఆర్తిమూలం=దుఃఖకారణమైన, మమ ఇతి అసదవ గ్రహః=నా దనెడు దుష్టమైన యభిమానము, విపులః లోభః=విపులమైన లోభము. పరిభవః=అవమానము, స్పృహా=కాంక్ష, ద్రవిణ గేహ సుహృన్నిమిత్తం=ధనము, గృహము, సుహృత్తులు - వీరితో నేర్పడెడు, శోకః=దుఃఖము భయము (ఏర్పడును)

తాత్పర్యము : పైఁజెప్పినట్లుగా భగవంతుని భజించెడు భక్తులకు ఫలమేమియో చెప్పుచున్నాఁడు. లోకమందున్న సర్వప్రాణులును భయావిష్టములైనవి. నీ పాదపద్మములు సర్వభయములను నశింపఁ జేయునవి. అట్టి నీ పాదపద్మములను సర్వాత్మనా శరణు బొందువఱకు వారికి భయనివృత్తిలేదు. అంతవఱకు వారిని ధనము, గృహము, మిత్రులు, బంధువులు - వీరిమూలము గానైన దుఃఖము, అభిమానము - దినదినాభివృద్ధి నందు లోభము - ఇవి పీడించుచునే యుండును, వీని వలన భయము, దేహాభిమానము తో నేర్పడు పరమదుఃఖము - ఇవన్నియుఁ బ్రాప్తించుచునే యుండును.

7. శ్లో. సర్వాశుభోపశమనాత్=సర్వములగు నశుభములను శమింపఁ జేయునదైన, భవతః ప్రసంగాత్=నీ సర్వశ్రేష్ఠమైన సంసర్గమునుండి, విముఖేంద్రియాః=విముఖములైన యింద్రియములతోఁ గూడిన వారు,

యే=ఎవరు గలరో, తే=వారు, దైవేన=ప్రారబ్ధమును బలవత్తమమైన దుర దృష్టము చేత, హతధియః=నిహతమైన బుద్ధితోఁ గూడిన వా రగుదురు. కామసుఖలేశలవాయ=కామములతో నేర్పడెడి సుఖలేశము యొక్క లవము కొఱకై, దీనాః=దీనులై, లోభాభిభూతమన సః=లోభముచేఁ గూడికొన్న మనస్సు గల వారై, శశ్వత్=మాటికిని, అకుశలాని=పాపములను, కుర్వంతి=చేయుదురు.

**తాత్పర్యము**: భగవద్భక్తుల జన్మ సఫలమైనదని చెప్పిన తర్వాత భక్తి హీనుల శోచ్యావస్థను జెప్పుచున్నాఁడు. నీ పాదపద్మములకు సంబం ధించిన కథలు వినుట, కీర్తించుట, భక్తజనుల సంగతి, వారి నాదరించుట - యీ ప్రవర్తన కారణముగా నీ పాదపద్మములు లభించినవి. ఈ మార్గము నను సరింపక శ్రోత్రాదులను ఇతరముల కప్పగించు వారు పరమశోచ్యులు. శ్రోత్రాదుల నితరముల కప్పగించుట చేత తాత్కాలిక సుఖలేశ మేర్పడును. ఇట్టి వారు జన్మాంతరసంచితమైన దురిత ఫలముగా నీనుండి దూర మగుదురు. వారి మనస్సు లెప్పుడును సుఖాభాసమున పరిభ్రమించుచు వివేక హీనులై క్రిందిదశలను బొందెదరు.

8.శ్లో. క్షుత్=ఆకలి, తృట్=దప్పి, త్రిధాతుభిః=వాతపిత్తకఫములు - వీనిచేత, అర్ద్యమానాః=దుఃఖపెట్టఁబడిన వారలు, శీతం=శైత్యము, ఉష్ణం=ఎండ, వాతం=గాలి, వర్షం=వాన, ఇతరేతరం=అన్యోన్యమున్న, కామాగ్ని=ఆశయనెడు నగ్ని, అచ్యుతరుట్=నశింపని కోపము, దుర్భరం= దుర్భరముగా, సంపశ్యతః=కాంచుచున్న, మే మనః సీదతి=శోకించుచున్నది.

**తాత్పర్యము : తన సృష్టి వరములు యొక్క దుఃఖమును జూచు** నప్పుడున్న సంతాపమును బ్రహ్మదేవుఁడు వర్ణించుచున్నాఁడు. ఓ మహా పరాక్రమశాలివైన దేవా! ఆకలి దప్పులు, శోకమోహములు, జరా మృత్యువులు ననెడు షడూర్మికలతోను, వాత పిత్తకఫములనఁ బడెడు త్రిధాతువులతోను, శైత్యాతపవాయు వర్షాదులతోను, నన్యోన్య సంబంధము గల భార్యా పుత్రాదులతోను, నాచే సృష్టింపఁబడిన యీ ప్రజలు నిరంతరమును బాధింపఁబడుచున్నారు. వీరిని జూచినప్పుడు నా హృదయ మెంతయో క్షోభించును. నీ పాదములను భజించి కృతార్థులగుటకు వారి ప్రారబ్ధ మడ్డము వచ్చుచున్నది. ఈ విచారము నన్ను నిరంతరమును బీడించును.

9.శ్లో. ఈశ! ఇంద్రియార్థమాయాబలం=ఇంద్రియములు, ఆకాశాది పదార్థములు-ఈ రీతిగాఁగనుపించెడు, పృథక్త్వం=భేద భావమును, భగవతః =భగవంతుని నుండి భిన్నముగా, యావత్=ఎంతవఱకు, జనః=లోకము, పశ్యేత్=చూచునో, తావత్=అంతవఱకు, దుఃఖనివహం=దుఃఖసమూహ

మును, వహతి=వహించుచున్నది. వ్యర్థ=నిష్ఫలమైన, క్రియార్థా=క్రియాఫల ముతోఁ గూడిన, అసౌ సంసృతిః=ఈ సంసారము, న ప్రతిసంక్రమేత= నశించుట లేదు.

తాత్పర్యము : ఆకలి దప్పులతో నేర్పడెడు దుఃఖములు శరీరమునకు సంబంధించినవి. అవి యాత్మను బాధింపవు, అవి ప్రాణధర్మములు, వానిలో నాత్మకు దుఃఖ మేమున్నది? ఈ పూర్వపక్షమునకు సమాధానము - ఓ యీశ్వరా! నీ యిచ్ఛాస్వరూపిణి యైన మాయ ఆకాశాది భూతములుగా, చక్షురాదీంద్రియములుగాఁ బరిణమించినది. వాని సంయోగముతో దేహము లేర్పడినవి. ఇవి యన్నియు నీకంటె భిన్నములైనవి యను విచారమే దేహభావన. ఎంతవఱకు ఈ దేహభావన లోకమున నుండునో అంతవరకు శరీరాదులందు ఆత్మాభిమానముతో జననమరణరూపమైన సంసారము నశింపదు. పుణ్యపాపరూపములైన కర్మములు తత్ఫలములు జీవులను వద లిపోవు. దానితో నాత్మ నిత్యానంద స్వరూపము గదా! దుఃఖ మెట్లేర్పడును అని వితర్కించి ఫలము లేదు, భక్తితో మాయ నశింపవలెను. అప్పుడే ఆత్మ యొక్క నిత్యానంద స్వరూపత్వము అనుభవమునకు వచ్చును. అంతవఱకుఁ గ్లేశమే ఫలము. కర్మముతో దుఃఖము నశింపదని సారము.

10.శ్లో. యుష్మత్ప్రసంగవిముఖాః=నీకు సంబంధించిన ప్రసంగము లందు తాత్పర్యము లేని వారైన, ఋషయః అపి=ఋషులు కూడ - అహ్ని=పగటియందు, అపృతార్థకరణాః=వ్యాపారావిష్టము లై దీనములైన యింద్రియములు గలవారును. నిశి=రాత్రులందు, నిశ్శయానాః= నిద్రించు చున్నవా రైనప్పటికిని, నానామనోరథధియా=అనేకములైన కోరికలతోఁ గూడిన బుద్ధి వృత్తుల చేత, క్షణభగ్ననిద్రాః=క్షణకాలమందే భంగింపఁబడిన నిద్రతోఁ గూడిన వారై, దైవా హతార్థరచనాః=దైవము చే నశింపఁజేయఁబడిన అర్థ సంపాద నావ్యాపారము గల వారై, ఇహ=ఈ ప్రపంచమందు, సంచరంతి=సంసారముతోఁ గూడిన వారై తిరుగు చున్నారు.

తాత్పర్యము : శాస్త్రాభ్యాసముతో నేర్పడిన సంస్కారము లేని వారు గదా ఈ ప్రకారము దేహాభిమానముతో సంసారావిష్టులగుదురు? శాస్త్రాదు లభ్యసించిన వారికి ఈ బాధ లేదుగదా! అనుటకు సమాధానము. వేదములు శాస్త్రములు చక్కగా నభ్యసించిన వారును, మంత్రద్రష్టలైన ఋషులైనను లాభము లేదు. కథాశ్రవణాది భగవద్భక్తి లేని వారు జన్మమరణాదులను భవింప వలసినదే. వారి మనస్సులు పగటి యందు కుటుంబభరణాదులందుఁ దాత్పర్యము గలవై దాని కుచితమైన పలు విధవ్యాపారము లొనర్చును. వానితో నింద్రియము లలతఁబొందును. రాత్రులందు విశ్రాంతికి శయనిం చినను బుద్ధి పలు విధములైన మనోరథములందు సంచరించును. అందుచే నిద్రపట్టదు, భార్యాదులకై ధనము సంపాదింపవలెనని యొనర్చెడు

ప్రయత్నములు ఎప్పుడో గాని సిద్ధింపవు. సాధారణముగా నిష్ఫలములే యగును. కనుక శాస్త్రాభ్యాస మున్నంత మాత్రముతో జ్ఞాన మేర్పడుటకల్ల. నీభక్తి యొక్కటే తరించుటకు మార్గము. దాని చేతనే సంసారనివృత్తి.

11.శ్లో. భావయోగం=భక్తియనునుపాయము, పరిభావితం=పరిశుద్ధార మైన హృత్సరోజే=హృదయపద్మమందు, శ్రుతేక్షిత పథః= శ్రవణముతోఁ దెలియఁబడిన, త్వం=నీవు, ఆస్సే=ఉన్నావు. నాథ! =ఉరుగాయ=అనేక విధములుగాఁ గీర్తింపఁ బడిన వాఁడా!, ధియా=బుద్ధితో, యత్ యత్ వపుః =ఏయే శరీరము, విభావయంతి=భావించుచున్నారో, సదనుగ్రహాయ=సత్పు రుషుల ననుగ్రహించుటకు, తత్తద్వపుః=ఆయారూపమును, ప్రణయసే= ధరించుచున్నావు.

తాత్పర్యము : భగవద్విముఖులైన వారికి నరక యోగము దప్పదు. భక్తులు భగవదనుగ్రహముతోఁ బరమానందము ననుభవింతురు. వారే కృతార్థులు. ఈ విషయమును స్పష్టపఱచుచు స్తుతించు చున్నాఁడు. ఓసర్వరక్షకా! శాస్త్రములయందనేక విధములుగాఁగీర్తింపఁబడిన పుణ్యమైన కీర్తి గలవాఁడా! భక్తులు భక్తియను నుపాయముతో నిన్నుఁ బొందఁ గోరుదురు, వారు నీకథాశ్రవణములతో నిన్నే శరణు జొత్తురు. వేరు పదతి నాశింపరు. అట్టి పరమ భక్తుల హృదయముల నుండి నీస్వరూప మెన్నఁడును దొలఁగదు. అదియే నీకు నివాసము. నీవి యనంతరూపములు. ఆరూపములందు దేని దేనిని భక్తులు దృఢభావములో సేవింతురో ఆ భక్తుల ననుగ్రహించుటకై యారూపముననే వారి ననుగ్రహింపను ప్రత్యక్ష మగుదువు. ఆ కన్పడిన దివ్య మంగళ విగ్రహమును వారు మనస్సులలో ధరింతురు. దీని కంటె నుత్తమమైనది మానవులకు సాధింపఁదగినది లేదు. వారి జన్మ ధన్యము.

12.శ్లో. నానాజనేషు=అనేక విధప్రాణులందు, అవహితః=ప్రవేశించిన వాఁడును, సుహృత్=స్నేహితుఁడును, అంతరాత్మా=సర్వాంతర్యామియు నైన, భవాన్=నీవు, అసదలభ్యయా=అసత్పురుషులచేఁబొందరానట్టి, సర్వభూతదయయా=సకల భూతముల యందలి దయతో, యథాప్రసీదసి= ఎట్లు తృప్తి నందెదవో, హృది=మనస్సునందు, బద్ధకామైః=కోరిక గల, సురగణైః=దేవతలచేత, ఉపచితోపచారైః=సంపాదింపఁబడిన ఉప చారములచేత. ఆరాధితః=ఆరాధింపఁబడినవాఁడవై, తథా=ఆ ప్రకారము, న అతి ప్రసీదసి=ఎక్కువగాఁదృప్తిఁజెందవు.

తాత్పర్యము : భక్తులయందు భగవంతునకుఁ గారుణ్య ముండునవి చెప్పినారు. కాని సకామ భక్తి కంటె నిష్కామ భక్తి ననుసరించువారి యందు భగవంతునకుఁ బరమప్రేమ యుండునని తెలుపుచున్నాఁడు. స్వప్రయో జనము నాశింపక పరులదుఃఖమును బోఁగొట్టవలెనను పరిశుద్ధమైన బుద్ధి

విచారమునకే దయ యని పేరు. సకల ప్రాణుల హృదయములందును అంత ర్యామిగా వసించుచున్న వాఁడును, వారి కాప్త బంధువునైన భగవంతుఁడు సర్వభూతదయను బ్రదర్శించుచు సర్వుల యందును బ్రకాశించు భగవంతుఁ డు పరమ ప్రేమలక్షణరూపమైన భక్తితో సేవించుచున్న భజన పరులనే ప్రేమతోఁ గటాక్షించును. ఆ రీతిగా సకామభక్తుల నాదరింపఁడు. వారొన ర్చెడు నానా విధోపచారములను అంగీకరింపఁడు. సర్వభూతములను సర్వాత్మనా ఆదరించుట, దాని నుండి స్వార్థమేదియుఁ గోరకుండుట - యిది యే నిష్కామభజన. పలు విధములైన నైవేద్యాదు లుంచి ఉద్దిష్టఫలమునకై ప్రార్థించుటే సకామ భజన. నిష్కామ భక్తులు భగవంతునకు పరమ సుహృత్తులు.

13.శ్లో. అతః=అందుచేత, పుంసాం=పురుషుల యొక్క, అధ్వరాద్యైః =యాగాదులైన, వివిధకర్మభిః=అనేక కర్మల చేతను, దానేన=దానము, ఉగ్రతపసా=కఠినతపస్సు, వ్రతచర్యయా=వ్రతానుష్ఠానము మొదలగువాని చేత, భగవతః తవ=సర్వైశ్వర్య పూర్ణుఁడవైననీ యొక్క, ఆరాధనం= పూజనము, సత్క్రియార్థః=ఉత్తమక్రియాఫలము, యత్ర=దేనియందు, అర్పితః =సమర్పింపఁబడిన, ధర్మః=క్రియ, కర్హిచిత్=ఏకకాలమందు, నహ్రియతే= నశింపదు.

తాత్పర్యము : సకామభక్తి నీ పరమ ప్రసన్నతకుఁ జాలదు. అందుచే వివేకులు నీ ముఖోల్లాసమునకే యాగాదు లాచరింతురు. దానము లొనర్తురు. కృచ్ఛ్రచాంద్రాయణాది తపము లొనర్తురు. ఏకాదశ్యాదు లాచరింతురు, నీయందు సమర్పింపఁబడిన కార్య మలౌకిక మైనను, లౌకిక మైనను - దాని ఫలము నశింపదు. భగవంతుఁడు సంతోషింపవలెనని యొనర్చెడు ప్రతి చిన్న పనియు ధర్మార్థకామమోక్షములను సంపన్నముగ సాధింప శక్తి గలది. ఏదైన ఫలము నాశించి యొనర్చెడి కర్మ దానిని మాత్రమే సాధించి - యూరకుండును. అందుచే వివేకవంతులు నీ ముఖోల్లాసము నకే సకలకర్మ లొనర్తురు. వారే కర్మ కుశలురైన వారు.

"యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,
యత్తపస్యసి కౌంతేయ! తత్కురుష్వ మదర్పణమ్."

"నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే,
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్."

అని భగవంతుఁడు తన పరమ భక్తుఁడైన యర్జునున కుపదేశించి నాఁడు. తుచ్ఛములైన కర్మఫలముల నాశించువాఁడు మూర్ఖుఁడు.

14. శ్లో. శశ్వత్ స్వరూపమహసాఏవ=నిరంతరము, ప్రకాశించెడు స్వరూపశోభతోనే, నిపీత భేదమోహాయ=నశింపఁజేయఁబడిన

భేదమోహాదులతోఁగూడిన వాఁడును, బోధధిషణాయ=చైతన్యమైన బుద్ధితోఁ గూడిన వాఁడును నైయున్న, పరస్మై=పరమాత్మునకు, నమః =నమస్కారము, విశ్వోద్భవస్థితిలయేషు=విశ్వోద్భవాదులందు, నిమిత్త లీలారసాయ=కారణభూతమైనలీల యనెడు రాసక్రీడగలిగిన, ఈశ్వరాయ= సర్వేశ్వరుఁడవైన, తే=నీకు, ఇదం నమః=ఈ నమస్కారమును, చకృమ= చేయుచున్నాను.

తాత్పర్యము : పరమానందస్వరూపుఁడైన భగవంతుని గూర్చి పూజాస్తోత్రాదు లొనర్చుటకుఁ దా నశక్తుఁడ నను నభిప్రాయమును సూచించుచు నాఱుశ్లోకములతో బ్రహ్మ భగవంతునకు నమస్కరించు చున్నాఁడు. స్వామి! పరమాత్ముఁడవైన నీకు మాటిమాటికి నమస్కారము. నీవు పురుషోత్తముఁడవు, నీవు గాని పదార్థ మున్నదనియు దేహమే యాత్మయనియు ననుకొనెడు భేదమోహాములు నిన్నెప్పు డాక్రమింపవు. ఎందుకనఁగా నీ స్వరూపమైన యానంద ప్రకాశములు సర్వదా యేకరూపములుగా నుండును. బోధ రూపమైన చైతన్యమే నీ బుద్ధి. జడరూపము గాదు. ప్రాకృత పురుషుల కంటెను విలక్షణము గా నున్న పురుషోత్తముఁడవైన నీకు మాటి మాటికి నమస్కారము. ప్రకృతి పరిణామముతో నేర్పడెడు సృష్ట్యాదులు నీ రాసలీలలు. ఆ ప్రకృతి పరిణామములు నీ చేతనే నియమింపఁబడుచున్నవి.

15.శ్లో. అసువిగమే=ప్రాణోత్క్రమణకాలమందు, యే=ఎవ్వరు, వివశాః =ఏశక్తి యు లేని వారయ్యును, యస్య=ఎవని యొక్క, అవతార గుణకర్మ విడంబనాని=అవతారములు, గుణములు, కర్మములు - వీనియనుకర ణములైయున్న, నామాని=పేరులను, గృణంతి=కీర్తించుచున్నారో, తే=వారు, అనేక జన్మ శమలం=అనేక జన్మములకు సంబంధించిన పాపములను, సహసా ఏవ=అప్పుడే, హిత్వా=పోఁగొట్టుకొన్న వారై, అపావృతం=మరుగు లేనిదియు, ఋతం=సత్యస్వరూపమునైన నిన్ను, సంయాంతి=పొందుదురు, అజం తం=అట్టి జన్మాదిరహితుఁడవైన నిన్ను, ప్రపద్యే=శరణందెదను.

తాత్పర్యము : ఏ కోరికయు లేని భగవంతునకు విశ్వసృష్ట్యాదిలీల లతో నేర్పడెడు ప్రయోజన మేమున్నది. ఈ శంకను బరిహరించుచు భగవం తుని శరణు బొందుచున్నాఁడు. భగవంతుని యవతారము, లోకసృష్ట్యాది లీలలు సర్వమును జీవుల నను గ్రహించుట కొఱకే. దేవకీనందనా! దాశరథే! ఇత్యాదు లాతని యవతారమును సూచించు పేరులు. సర్వజ్ఞా! భక్తవత్సల! ఇత్యాదులు ఆతని గుణ కీర్తనానామధేయములు. గోవర్ధనోద్ధరణ! మొదలగునవి కర్మములను దెలువు నామములు. వీనిలో వేనినైనను ప్రాణోత్క్రమణకాలమందు అవశుఁడయ్యు నెవ్వఁడు పల్కునో వాఁడు బహు జన్మ సంచితములైన పుణ్యపాపములను క్షణకాలమందే పోఁద్రోసి కొని

నాశరహితమైన పరమపదమును బ్రాపించును. అట్టి జన్మాది వికారములు లేని భగవంతుని శరణుఁబొందుచున్నను జీవానుగ్రహమునకై లీల లొనర్చెడు భగవంతుఁడే నాకు గతి.

16.శ్లో. ఏకః=కేవలుఁడైన, యః వా=ఎవఁడు, ఆత్మమూలం= తాను మూలమైయున్న ప్రధానమును, భిత్త్వా=భేదించికొని, త్రిపాత్=మూఁడు పాదములతోఁగూడిన వాఁడై, అహం చ=నేనును, గిరిశశ్చ=శివుఁడు, విభుః చ=సర్వవ్యాపియైన విష్ణువును గానై, స్థిత్యుద్భవప్రళయ హేతవః=స్థిత్యాది కారణులమై (ఐతిమో) ఉరుప్రరోహః=నానాశాఖలుగా నైన వాఁడుగా, వవృధే=వృద్ధిబొందెనో. భువనద్రుమాయ=లోకవృక్షస్వరూపమైయున్న, భగవతే తస్మై=భగవంతుఁడవై యున్న నీకు, నమః=నమస్కారము.

తాత్పర్యము : బ్రహ్మాదులతోఁ గదా సృష్ట్యాదు లేర్పడు చున్నవి? అప్పుడు నీ చేత సృష్ట్యాదు లగుచున్న వను టెట్లు పొసఁగును? ఈ శంకను బరిహరించుచు నమస్కరించుచున్నాఁడు. సృష్టికి బూర్వము భగవంతుఁ డొక్కఁడే యుండెను. ఆతఁడు గుణత్రయము నంగీకరించి బ్రహ్మాదులుగా మారి సృష్ట్యాదిలీల లొనర్చు చున్నాఁడు. తర్వాతఁగూడ శాఖోపశాఖలుగా ననంత రూపముల స్వీకరించు చున్నాఁడు. ఒకా నొక విత్తు అంకురమై, తర్వాత మూఁడు స్కంధములతోఁ గూడి పిదప ననేక శాఖలై మహా స్వరూపము నావిష్కరించు నట్లు ఏ కేవలుఁడైన భగవత్స్వరూపుఁడు బ్రహ్మాదులుగను, దేవమనుష్యాదులుగను జన్మించి లోకరూపవృక్షముగా నుండునో అట్టి నీకు నమస్కారము.

17.శ్లో. త్వదుదితే=నీచే నుపదేశింపఁబడినట్టి, స్వభవదర్చనే = స్వాత్మభూతమైన నీ పాద పద్మముల నర్చించుట యనెడు, కుశలేకర్మణి= ఉత్తమమైన కార్యమందు, ప్రమత్తః=మనస్సుం పనిదియు, వికర్మనిరతః =పాపవృత్తులందుఁ దాత్పర్యముగలదియునై, లోక=లోకము, యావత్ వర్తతే=ఎంత కాలముండునో, తావత్=అంతకాలము, అస్య=ఈ లోకము యొక్క, జీవితాశాం=జీవిత మందున్న తాత్పర్యమును, బలవాన్ యః= సర్వశక్తుఁడైన యెవఁడు, సద్యః ఛినత్తి=తత్క్షణమే పోఁగొట్టునో, అనిమిషాయ తస్మై=నిమేషరహితుఁడైన వానికి, నమః అస్తు=నమస్కారము.

తాత్పర్యము : కాల స్వరూపుఁడైన భగవంతునికి నమస్కరించు చున్నాఁడు. స్వామీ! ఈ లోకము నీచే నుపదిష్టమైన యుత్తమమైన యారాధనామార్గము నందుఁ బ్రవర్తింపదు. శరీరాభిమాన నిమిత్తముగా నేర్పడు విషయభోగాశలను దృప్తి పఱచుటకు నానావిధములైన కార్యము లొనర్చుటందుఁ దాత్పర్యముగలదిగా నుండును. ఇట్లుండఁగా కాలము హఠాత్తుగా వాని జీవితాశయముల నన్నిటిని గూలఁద్రోయును. నిమేషరహితుఁడుగను, కాలస్వరూపుఁడు గనునైయున్న నీకు నమస్కారము.

సంసారదుఃఖము నశించుటకును, పరమానందము ప్రాప్తించుటకును భగవదు పదిష్టమైన మార్గ మీ క్రిందిది -

**"యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,**
**యత్తపస్యసి కౌంతేయ! తత్కురుష్వ మదర్పణమ్."**

**"మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,**
**మామే వైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే."**

**"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః."**

భగవంతుఁడు చెప్పిన యీ యుపదేశము నాశ్రయించి యనుష్ఠించినచో జననమరణ ప్రవాహరూపమైన సంసారము నశించును. భగవత్ప్రాప్తి లభించును. ఇది యే దుఃఖనివృత్తి మార్గము. ఆనందస్వరూపమైన మోక్షమున కుపాయము. ఇట్టి వానిని కాలము భయపెట్టలేదు. తక్కిన వా రందరును కాలాధీనులే. ఇట్టి కాల స్వరూపుఁడవై జీవులను మోక్షమార్గమున నడపించు నీకు నమస్కారమని భావము.

18.శ్లో. సకలలోక నమస్కృతం=సమస్త లోకములచే నమస్కరింపఁబడుచున్నదైన, యత్=ఏ, ద్విపరార్ధ ధిష్ణ్యం=ద్విపరార్ధమని పిలువఁబడుచున్న కాలము వఱకుండెనో, దానిని, అధ్యాసితః=అధివసించుచున్న, అహం అపి=నేనుఁగూడ, యస్మాత్=ఎవని నుండి, బిభేమి=భయపడుచున్నానో, అవరురుత్స మానః=నిన్ను బొందుటకుఁగోరుచున్న వాఁడనై, బహుసవం=అనేక యాగములను, తపః=తపస్సును, తేపే=అనుష్ఠించితినో, అధిమఖాయ= యాగఫలదాతయైన, భగవతే తస్మై తుభ్యం=భగవంతుఁడవైన నీకొఱకు, నమః=నమస్కారము,

తాత్పర్యము : "కాలస్వరూపుఁడవైన నీ నుండి లోకము భయపడు చున్నదనుమాట యటుండనీ. నేనును కాలమునకు భయపడుచున్నాను గదా!" అని సూచించుచు నమస్కరించుచున్నాఁడు. స్వామీ! నాపదవి సర్వోత్కృష్టమైనది. సర్వులును నమస్కరించునది. కాని సర్వలోకమందు నా యునికి యెంతవఱకు? ద్విపరార్ధకాలమే. కనుక నేనుఁగూడ కాల స్వరూపుఁడవైన నిన్నుఁ గూర్చి భయపడవలసినదే. అందుకే అనేక యాగము లనుష్ఠించి బహుకాలము తపస్సొనరించి సర్వయాగఫల దాతవైన నిన్నుఁ బ్రాపించుటకె పరితపించుచున్నాను. నా యిచ్ఛ పరిపూర్తి యొనర్ప సమర్థుఁడవైన నీకు నమస్కారము.

19.శ్లో. ఆత్మేచ్ఛ యా=స్వేచ్ఛగా, ఆత్మకృతా సేతు పరీప్సయా=తనచే నిర్మింపఁబడిన మర్యాదలను సంరక్షించుకోరికతో, యః=ఎవఁడు, నిరస్తరతిః అపి=దేనియందును నాకాంక్షలేని వాఁడైనను, తిర్యఙ్మనుష్యవిబుధాదిషు=

పక్షులు, మృగాదులు, మనుష్యులు, దేవాదులు - అని యున్న, జీవయోనిమ=జీవోత్పత్తి స్థానములందు, అవరుద్ధదేహః=స్వీకరింపఁబడిన దేహము గలవాఁడై, రేమే=రమించునో, భగవతే = సర్వైశ్వర్య పరిపూర్ణుఁడును, పురుషోత్తమాయ=పురుషోత్తముఁడును నైన, తస్మై=అట్టి నీ కొఱకు, నమః=నమస్కారము.

తాత్పర్యము : కాలస్వరూపుఁడైన భగవంతునకు నమస్కరించి లోకరక్షార్థమై యనేకావతారములను స్వీకరింపఁబోనున్న పరమేశ్వరుని కారుణ్యమును స్మరింపుచు నమస్కరించుచున్నాఁడు. స్వామి! జీవానుగ్రహమునకై నీచే నిర్మింపఁబడిన మర్యాదలను సంరక్షించుటకై స్వేచ్ఛగా నీవు పక్షి మృగ దేవమనుష్యాదులందు అవతరింతువు. ఇవి యెల్లను జీవుల యందలి యనుగ్రహముతో నొనర్చెడివే. నీ కొక్కవిధమైన కోరికయు లేదు. స్వానందతృప్తుఁడవు. కాలకర్మ స్వరూపమైన యవిద్య నిన్నంటలేదు. ఐనను స్వేచ్ఛగా జగద్రక్షకై లీల లొనర్తువు. మత్స్య వరాహహంసాదులు తిర్యగవతారములు. రామకృష్ణ పరశురామాదులు మనుష్య యోనులయందలి యవతారములు. వామనహయగ్రీవాదులు దేవతలే. ఈ యవతారము లన్నియు లోకమర్యాదలను రక్షించుట కొఱకే. స్వార్థమునకై కాదు. నిత్యనిరుపమానందస్వరూపుఁడైన భగవంతునకు స్వార్థము లేదు. దేహమున్నను దానితోఁ బ్రాప్తించు నహంకారాదులు లేవు. అందుకే భగవంతుఁడు పురుషోత్తముఁడు.

20.శ్లో. దశారవృత్త్యా=ఐదువిధములుగానున్నది, అవిద్యయా = అవిద్యయను మాయచేత. అనుపహతః అపి=బాధింపఁబడని వాఁడైనను, జఠరీకృతలోకతంత్రః=ఉదరమునందుంచి కొన్న లోకములతోఁ గూడిన వాఁడై, యః=ఎవఁడు, భీమోర్మి మాలిని=భయంకరమైన అలల సముదాయము గల, అంతర్జలే=జలమధ్యమందు, అహికశిపు స్పర్శానుకూలం=శేషరూపుఁడైన శయ్య యొక్క స్పర్శ కనుకూలముగా, నిద్రాం =నిద్రను, జనస్య=జనులయొక్క, సుఖం=సుఖమును, వివృణ్వన్ = వివరించుచున్న వాఁడై, ఉవాహ=వహించెనో-

తాత్పర్యము : ఐదువిధములైన యవిద్య యను మాయ యెప్పుడును భగవంతు నంటదు. అంటకున్నను నాతఁడు సమస్త ప్రపంచములను జఠరమం దుంచికొన్నవాఁడై జలమధ్య మందు యోగనిద్రను వహించినాఁడు. ఆ జలము భయంకరమైన అలలుగలది. అట్టిజలములో నాదిశేషుని స్పర్శకనుకూలముగా శయనించినాఁడు. ఆ శయనించుటయు ఆ నిద్రయును లోకక్షేమమునకు వహించినవే.

21.శ్లో. ఈడ్య=స్తుతింప యోగ్యుఁడైన వాఁడా! యదనుగ్రహేణ ఎవ్వని యనుగ్రహము చేత, యన్నాభిపద్మభవనాత్=ఎవని నాభిసరో

జమను భవనము నుండి, లోకత్రయోపకరణః=మూఁడు లోకము లను భోగసాధన ములతోఁగూడిన, అహం=నేను, అసం=ఏర్పడితినో, ఉదరసభవాయ=ఉదరసములైన సమస్త ప్రపంచమును గల వాఁడును, యోగ నిద్రావసాన వికసన్న లీనేక్షణాయ=యోగనిద్రకడపట వికసించు చున్న తామర వలె విచ్చికొన్న కన్నులు గలవాఁడు నైన, తస్మై తే=అట్టి నీకు, నమః =నమస్కారము.

తాత్పర్యము : స్వామీ! త్రిలోకములను భోగసాధనములతోఁ గూడిననేను ఎవ్వని కరుణాకటాక్షములతో నాభియందున్న పద్మమను భవనము నుండి యుద్భవించితినో అట్టినీకు నమస్కారము. యోగని ద్రావసానమున తామరలు వోలె విచ్చికొన్న కనులతో జఠరసములైన లోకములను నన్నును గటాక్షించుచున్న దివ్యస్వరూపుఁడవైన నీ పాదములకు నమస్కారము.

22.శ్లో. సమస్త జగతాం=సర్వలోకములకును, సుహృత్=హితకరుఁ డును, ఆత్మా=ఆత్మయు, ఏకః=కేవలుఁడునైన, సః అయం భగవాన్=ఆయీ భగవంతుఁడు, సత్త్వేన భగేన=సత్త్వగుణమైన యైశ్వర్యముతో, యత్=దేనిని, మృడయతే=సుఖింపఁజేయుచున్నాఁడో, తేన ఏవ=దానిచేత, మేదృశం=నా ప్రజను. అనుస్పృశతాత్=స్పృశించుఁగాక! యత్=ఏ పరిసితిలో, అహం=నేను, ఇదం=ఈ జగత్తును. పూర్వవత్=మునుపటి వలె, స్రక్ష్యామి=సృజింతును, అసౌ=ఇతఁడు, ప్రణతప్రియః=నమస్కరించువారి యందు ప్రియము గలవాఁడు.

తాత్పర్యము : అభీష్టములైన పదార్థముల నొసఁగవలెనని బ్రహ్మ భగవంతుని ప్రార్ధించుచున్నాఁడు. సకల లోకమునకు హితకర్తయు నాత్మస్వరూపుఁడును, కేవలుఁడు నైన పరమాత్ముఁడు ఏ యే జ్ఞానము చేత లోకముల నానందింపఁజేయుచున్నాఁడో ఆ జ్ఞానమనెడు నైశ్వర్యమును నాకుఁ బ్రసాదించుఁగాక! నాచేమాత్రమే సృష్టింపఁబడుట కరమైన లోక సృష్టికై నేను నియోగింపఁబడినాను. భగవంతుఁడు సర్వసముఁడైనను దన్ను నమస్కరించు వారియందు వాత్సల్యమున్న వాఁడు. నేను సర్వాత్మనా భగవంతుని శరణుఁజొచ్చిన వాఁడను. కనుక జగత్సృష్టికిఁ గావలసిన జ్ఞానమును నైశ్వర్యమును నాకుఁబ్రసాదించుఁగాక!

23.శ్లో. ఆత్మశక్త్యా=తన శక్తియైన, రమయా=లక్ష్మీదేవిచేత, గృహీతగుణావతారః=గ్రహింపఁబడిన గుణావతారములతోఁగూడిన వాఁడును. ప్రపన్నవరదః=ప్రపన్నులకు వరము లొసఁగు వాఁడును, ఏషః =ఈ భగవంతుఁడు, యత్ యత్ కరిష్యతి=దేనిదేని నాచరించునో, తస్మిన్=దానియందు స్వవిక్రమం=భగవంతుని పరాక్రమముతోఁగూడిన, ఇదం=ఈ లోకమును, సృజతః=సృష్టించుచున్న, మే చేతః=నామనస్సు,

యుంజీత = యోజించును గాక, యథా=ఎట్లు, కర్మశమలం=కర్మచే నేర్పడెడు దోషమును, విజహ్యాం =నేను వదలుదునో-

తాత్పర్యము : సృష్టిసామర్థ్య మేర్పడవలెనని ప్రార్థించిన పిదప ఉచ్ఛ నీచసృష్టులతోఁ బాప మేర్పడునో యని శంకించికొని దాని నివృత్తి కొఱకై మార్గమును బ్రార్థించుచున్నాఁడు. ఆత్మశక్తియైన లక్ష్మీదేవితోఁబాటు సర్వజ్ఞత్వాదిగుణములను విడువక పక్షిమృగాదులందు భగవంతుఁ డేయే యవతారములను గ్రహించునో వాని యందెల్లను భగవంతుని పరాక్రమమే ప్రకాశించుచున్నది. అట్టి రూపములను అనుకరించెడు జీవరాసులను నేను సృష్టింపఁబోవు చున్నాను. ఆ సృష్టిలోఁ గర్మజన్యమైన దోషము నాకు సంక్రమింపకుండుఁగాక! సంక్రమింపకుండు పదతిలో నామనస్సు నాతఁడే నడపించుఁగాక! భగవతేరణతోఁ గర్మము నొనర్పఁబోవుటచే నా కతఁడు ప్రసాదించెడి దివ్యజ్ఞానముతోఁ బుణ్యపాపములు న న్నావరింపకయే పోవును. భగవతేరణతోఁ గర్మ నొనర్చు చున్నానను బుద్ధి నన్నెప్పుడును వదలకుండును గాక! ఆకర్మ లన్నిటిని భగవత్ప్రసాదమునకే నేను వినియోగింతును.

24.శ్లో. అంభసి=నీటియందు, సతః=శయించినట్టి, అనంతశక్తేః= అనంతమైన శక్తితోఁగూడిన, యస్య పుంసః=ఏ పురుషునియొక్క, నాభిహ్రదాత్=నాభియను హ్రదము నుండి - (అగాధస్థానము నుండి) విజ్ఞాన శక్తిః =విజ్ఞానశక్తితోఁగూడిన, అస్య, విచిత్రం=నానావిధమైన, ఇదం రూపం=ఈ రూపమును. వివృణ్వతః=విస్తరింపఁబోవుచున్న, మే=నాకు, నిగమస్య గిరాంవిసర్గః=వేదవాక్కుల యుచ్చారణము, మారీరిషీష్ట=మఱచి పోకుండుఁగాక!

తాత్పర్యము : మహత్తైన సృష్టిక్రియయందుఁ బ్రవర్తించునాకు వేద విస్మృతి యేర్పడకుండుఁగాక యనుచున్నాఁడు. ప్రళయజలమందు శయనించిన యనంతశక్తియైన భగవంతుని నాభిహ్రదము నుండి నేను జన్మించితిని. విజ్ఞానశక్తిస్వరూపమై చిత్తమునకభిమానియైన నేను ఆ భగవంతుని దేవమనుష్యాది విచిత్రరూపములను బ్రదర్శింపఁబోవు సృష్టికార్యమందు నిమగ్నుఁడను గాఁబోవుచున్నాను. సర్వజ్ఞతా సాధనమైన వేదముల విస్మృతి నాకెన్నఁ డేర్పడకుండుఁగాక!

25.శ్లో. అదభ్రకరుణః=గొప్పకారుణ్య విశేషముతోఁగూడినవాఁడును, పురాణః పురుషః=పురాణపురుషుఁడునైన, సః అసౌ భగవాన్=ఆ భగవంతుఁడు, ఉత్థాయ=లేచి, వివృద్ధప్రేమస్మితేన=వృద్ధిఁబొందిన ప్రేమతోఁగూడిన మందహాసముతో, నయనాంబురుహం=నీరజసదృశమైన నేత్రమును, విజృంభన్=వికసింపఁజేసిన వాఁడై, విశ్వవిజయాయ=లోకముల

యుద్భవమునకై, యేర్పడిన, నః విషాదం=మావిషాదమును, మాధ్వ్యా గిరా=మధురమైన వాక్కు చేత, అపనయతాం=పోఁగొట్టును గాక!

తాత్పర్యము : బ్రహ్మ యీ విధముగాఁ బ్రార్థించి భగవంతుని సంభాషణమును వినఁగోరుచున్నవాఁడై నమస్కరించుచున్నాఁడు. అనంతకరుణానిధియు పురాణ పురుషుఁడు నైన, యీ భగవంతుఁడు పరమప్రేమను సూచించుచున్న మందహాసముతో తామర కనుఁగులైన కన్నులు విచ్చిలోకముల నెటు సృజింపవలెనను ఖేదముతో బాధపడుచున్న నా మనస్సును తీయని తన మాటలతో సంతోష పెట్టుఁగాక! అట్టి కారుణ్యమును నాయందుఁ బ్రదర్శించుఁగాక!

26.శ్లో. స్వసంభవం=తనకు జన్మకారణమైన తండ్రిని, ఏవం నిశమ్య = ఈ విధముగా నిరీక్షించి, తపోవిద్యాసమాధిభిః=తపస్సు, ఉపాసన, సమాధి మొదలైన వానితో, యావన్మనోవచః=ఎంతవఱకు మనస్సునకును వాక్కునకును శక్తి యుండునో అంత వఱకును, స్తుత్వా=స్తుతించి, సః=ఆ బ్రహ్మ, ఖిన్నవత్=అలసిన వానివలె, విరరామ=విరమించికొనెను.

తాత్పర్యము : మైత్రేయుఁడనుచున్నాఁడు. తన యుత్పత్తికిఁ గారణమైన పరమేశ్వరుని వీక్షించి శరీరక్లేశమును సహించునదైన తపస్సు, జ్ఞానకారణముగా నేర్పడిన భక్తి, దర్శనమిచ్చిన భగవంతుని పైనున్న యేకాగ్రభావన - వీనియన్నిటి సమాహారముగా మనస్సునకు వాక్కునకు నెంతమేరకుఁదోఁచునో యంతవఱకు బ్రహ్మను స్తుతించినాఁడు. కాని యెంత వినుతించినను భగవద్గుణముల కవసానము గన్పించుట లేదు. బ్రహ్మదేవుఁడలఁతనందిన వానివలె విరమించి కొన్నాఁడు. లోకమం దొకపని చేయుచున్న వారొక కార్య మెంతకు ముగియకుండుటచే నడుమనే యలసి పోయి యా పని నుండి విరమింతురు. అది తమచే సాధ్యము గాదని భావింతురు, అట్లుగా నున్నది బ్రహ్మస్థితి. బ్రహ్మ భగవత్స్తుతిలో ప్రాకృతుని వలె నైనాఁడు.

27,28.అర్థము : అథ=అనంతరము, మధుసూదనః=నారాయణమూర్తి, బ్రహ్మణః=బ్రహ్మయొక్క, అభిప్రేతం=అభిప్రాయమును, అన్వీక్ష్య = తెలిసికొని, తేన కల్పవ్యతికరాంభసా=ఉండవలసిన సమస్త పదార్థమును నశింపఁజేసిన యీ జలము నుండి, విషణ్ణచేతసం=విషాదముతోఁ గూడిన మనస్సు గలవాఁడు గను, ఆత్మనః=తాను హేతువుగా, లోకసంస్థానవిజ్ఞానే = ప్రాప్తింపవలసిన లోకనిర్మాణమునకు ఆవశ్యకమైన విషయజ్ఞానమందు, పరిఖిద్యతః=ఎక్కువగా ఖేదపడుచున్నవాని, కశ్మలం=ఖేదమును, శమయన్నివ=పోఁగొట్టు చున్నవానివలె. అగాధయా వాచా=అర్థగంభీరమైన వాక్కుతో, తం ఆహ=అతనిని గూర్చి యిట్లు పలికెను.

తాత్పర్యము : బ్రహ్మయభిప్రాయమును భగవంతుఁ డెఱిఁగినాఁడు. కల్పావసాన మందున్న యీ జలము లందుఁదా నుద్భవించి ఖేదము

నొందుటకు ముందే తాను ప్రేరేపఁగా బ్రహ్మ దేవునిలో లోకములను నిర్మింపవలెనను కోర్కి జనించినది. కాని దానికి మార్గము దోఁపలేదను ఖేద మాతని నావరించినది. దానిని సంపూర్తిగా నశింపఁజేయవలెనను కారుణ్యముతో నర్థగంభీరమైన వాక్కుతోఁ జతుర్ముఖునితో నిట్లన్నాఁడు.

29.శ్లో.వేదగర్భ=వేద మంతర్భాగమందున్నవాఁడా! తంద్రీం= అలతను, మాగాః=పొంద వలదు. సర్గే=సృష్టియందు, ఉద్యమం= ప్రయత్నమును - ఆవహ=చేయుము. భవాన్=నీవు, మాం=నా నుండి, యత్=దేనిని, ప్రార్థయతే= ప్రార్థించుచున్నావో, తత్=దానిని, మయా=నాచేత అగ్రే=ఇంతకు ముందే, ఆపాదితం=నీకు సంపాదించి పెట్టఁబడినది.

తాత్పర్యము : ఓ బ్రహ్మదేవా! నీ యంతర్భాగమందే సమస్త విజ్ఞాన సముదాయస్వరూపమైన వేద మంతర్లీనమై యున్నది. నీ మనస్సు నందు క్షోభ పడకుము. లోకసృష్టికై పరిశ్రమింపుము. నన్నే విజ్ఞానమునకై ప్రార్థించుచున్నావో దాని నింతకు ముందే నీకు సంపాదించిపెట్టి యున్నాను.

30.శ్లో. బ్రహ్మన్, త్వం, తపః=తపమును, మదాశ్రయాం విద్యాం= నన్నాశ్రయించియున్న యుపాసనను, భూయః=ఇంకను, ఆ తిష్ఠ= అనుష్ఠింపుము. తాభ్యాం=ఆ రెంటితోను, అంతర్హృది=హృదయాంతర్భాగ మందు, అపా వృతాన్=మరుగు లేనట్టి, లోకాన్=లోకములను, ద్రక్ష్యసి= చూడఁగలవు.

తాత్పర్యము : నాచే నీయందు నిక్షేపింపఁబడిన జ్ఞానము నీకు స్పష్టముగా ననుభవములోనికి వచ్చుటకు ఒక్కటే మార్గ మున్నది. నన్ను గూర్చిన తపస్సు, ఉపాసనయును ఇంకను కొనసాగింపుము. అన్యో పాయముతో జ్ఞానప్రకాశ మేర్పడదు. ఈ రెంటి బలము చేత నీయంతర్భాగ మందు లయించియున్న లోకములు స్పష్టముగా నీకుఁగన్పింపఁగలవు.

31.శ్లో. బ్రహ్మన్, తతః=అనంతరము, భక్తి యుక్తః=నాయందు పరమప్రేమముగల వాఁడును, సమాహితః=ఏకాగ్రచిత్తమున్న వాఁడవునై, ఆత్మని=ఆత్మయందును, లోకే చ=లోకమందును, తతం మాం=వ్యాపించి యున్న నన్నును, మయి=నాయందు, లోకాన్=లోకములను, ఆత్మనః= జీవాత్మలను, త్వం ద్రష్టా అసి=నీవు చూడఁగలవాఁడ వౌదువు.

తాత్పర్యము : ఓ బ్రహ్మదేవా! లోకములను నీ హృదయాంతర్భాగ మందు చక్కగాఁగన్న తర్వాతఁగూడ నా యుపాసనను సాగింప వలసినదే. దాని శక్తితో నే కాగ్రచిత్తుఁడవైన నీవు నీయందును లోకములందును వ్యాపించి యున్న నన్నును, నాయందు నిలచి యున్నలోకములను, జీవాత్మ లను స్పష్టముగాఁ జూడఁగలవు. నీయందును లోకములందును నేను వ్యాపించియున్నానని, నాయందే లోకములును, జీవాత్మలు నున్నారనియు నీకు స్పష్టముగా గోచరించును.

32.శ్లో. దారుషు=కట్టెలయందు, అగ్నిః ఇవ=అగ్నివలె. సర్వభూతేషు =సమస్తభూతములందును, స్థితం మాం=ఉన్న నన్ను. యదా తు=ఎప్పుడు, లోకః=జనులు, ప్రతి చక్షీత=స్పష్టముగాఁదెలియుదురో, తర్హి ఏవ=అప్పుడే, కశ్మలం=పాపమును, జహ్యాత్=వదలు కొనును.

తాత్పర్యము : కర్మజన్యములైన పాపపుణ్యములు నన్ను బాధింపకుండుఁ గాక! యని బ్రహ్మదేవుఁ డొనర్చిన ప్రార్థన కుత్తరము. సమస్త భూతము లందును వసించియున్న సర్వులును, నాచేఁబ్రేరితు లగుట వలననే సర్వులును గర్మ లొనర్చుచున్నారు. ఈ విజ్ఞానము జనుల కెప్పు డనుభవమునకు వచ్చునో అప్పుడే వారికి పుణ్యపాపములతో సంబంధము తీరిపోవును. సర్వవ్యాపియైన నన్ను గమనించినప్పుడే నీకును గర్మబంధము దొలఁగును. నేను సర్వమందును వసించి యున్నను, నన్ను జనులు కనుఁగొనలేరు, ఎందువలన? సర్వకాష్ఠములం దగ్ని యుండనే యున్నది. కాని మథనాద్యుపాయములతోనే లోనున్న యగ్ని గడకు వచ్చును. అట్లే లోనున్న పరమాత్మని వీక్షింపవలె నన్నచో తపస్సు, భక్తి మొదలైన యుపాయముల నవలంబింపవలెను. అట్లు గాని నాఁడు నన్ను వీక్షింప సాధ్యము గాదు.

33.శ్లో. భూతేంద్రియగుణాశయైః=భూతములు, ఇంద్రియములు, గుణములు, అంతః కరణము - వీనిచేత, రహితం=సంబంధములేని, స్వరూపేణ మయా=స్వరూపమైన నాచేత, ఉపేతం=కూడికొన్నదియునైన, ఆత్మానం=ఆత్మను, యదా=ఎప్పుడు, పశ్యన్=చూచు వాఁడగునో, తదా= అప్పుడు, స్వారాజ్యం=స్వయముగాఁ బ్రకాశించుచున్న యాత్మను, ఋచ్ఛతి=సాధించును.

తాత్పర్యము : జీవాత్మ పరమాత్మ అని యున్న భేదభావమే సర్వదోషములకుఁగారణము. అభేదభావ మేర్పడినప్పుడే మోక్షమేర్పడుట. వాస్తవమునకు పృథివ్యాదులైన భూతములు, చక్షురాదీంద్రియములు, సత్త్వాదులైన గుణములు, తత్కార్యములైన యంతఃకరణము - వీనితో చైతన్యమున కెట్టి సంబంధమును లేదు. అధ్యాసముతో సంబంధమున్నట్లు గన్పించును. నాశరహితుఁడును, ప్రకాశసహితుఁడును నైన నే నొక్కఁడనే యుండు నది. ఇదే పరమార్థము, ఈ పరమార్థమే నేనను బోధ మేర్పడునో, అప్పుడు సమస్తబంధ నిర్ముక్తుఁడై జీవుఁడు ప్రకాశించును.

34.శ్లో. నానా కర్మవితానేన=అనేక కర్మవిస్తారము చేత, బహ్వీః ప్రజాః =బహుప్రజలను, సిసృక్షతః=సృష్టింపఁబోవుచున్న, తే ఆత్మా=నీ మనస్సు, అస్మిన్=ఈ సమయమందును. న అవసీదతి=క్షోభము నందదు. మదను గ్రహః=నా యనుగ్రహము, మహీయాన్=గొప్పగా నీయందున్నది.

తాత్పర్యము : జీవబద్ధములైన పుణ్యపాపకర్మముల ననుసరించి దేవమనుష్యాదులైన బహువిధప్రజలను సృష్టింపఁగోరుచున్న నీ చిత్తము ఈ ప్రళయ కాలమందు ఎట్లు క్షోభింపకున్నదో అట్లే యిఁకమీఁదఁగూడ మోహావిష్టము గాక యుండును. నీ శాంతావస్థ నాయనుగ్రహమేయని తెలియుము.

35.శ్లో. ప్రజాః=ప్రజలను, సంసృజతః అపి=సృష్టించినను, నీయొక్క మనః=మనస్సు, మయి=నాయందు, నిర్బరం యత్=ఎందుచే గట్టిగా బంధింపఁబడియున్నదో ఆకారణముతో, పాపీయాన్=గొప్ప పాపమునకుఁ గారణమైన, రజోగుణః=రజోగుణము, ఆద్యంఋషిం త్వాం=ఆద్యఋషివైన నిన్ను, న బధ్నాతి=బంధింప నేరదు.

తాత్పర్యము : సర్వజ్ఞానసాధన భూతమైన వేదము నీ నుండి తొలుత గడకు వచ్చెను. అందుచే నీవాద్యఋషివి. కనుక రజోగుణనిమిత్తముగా నీ మనస్సునకు చలనమో, పుణ్యపాప సంబంధమో ఉండ నేరదు. సృష్టికాలమందుఁ గూడ నీమనస్సు నాతోనే సంబద్ధమై యుండును.

36.శ్లో. భూతేంద్రియ గుణాత్మభిః=భూతేంద్రియ గుణాంతః కరణముల చేత, అయుక్తం=సంబంధము లేనట్టి, మాం=నన్ను, త్వం మన్యసే యత్=నీవు విచారించుచున్నావో, తత్=అందుచేత, అద్య=ఇప్పుడు, దేహినాం=దేహులకు, దుర్విజ్ఞేయః అపి=తెలిసి కొనుటకు సాధ్యము గాని వాఁడ నైనను, అహం జ్ఞాతః=నీచే నేను తెలిసి కొనఁబడినాను.

తాత్పర్యము : పృథి వ్యాదులు, ఇంద్రియములు, సత్త్వాదులు, అంతః కరణములు-వీనితో సంబంధములేని పరమానంద స్వరూపముగా న న్నెఱిఁగితివి. ఈ విధమైన జ్ఞానము దేహధారులకుఁ జాల దుర్లభమైనది.

37.శ్లో. మద్విచికిత్సాయాం=నన్ను గూర్చిన సంశయ మున్నప్పుడు, సలిలే=జలమందు, పుష్కరస్య=తామరయొక్క, నాళేన=దండము యొక్క, మూలం=మూలమును. విచిన్వతః=అన్వేషించుచున్న, తుభ్యం=నీకొఱకు, మే ఆత్మా=నాస్వరూపము, అబహిః=లోపలనే, దర్శితః=చూపింపఁబడినది.

తాత్పర్యము :నీవు నా నాభిపద్మము నుండి జన్మించినపుడు ఈతామరకేది యాశ్రయ మను శంక నీకు జన్మించినది, తన్నాళమూలమున నీవు బహుకాలము ఆధారమును శోధించితివి. కడకు నీ హృదయాంత ర్భాగమందే తత్స్వరూపము గోచరించినది. అది నా యనుగ్రహమే.

38.శ్లో. అంగ=వత్స! మత్కథాభ్యుదయాంకితం=నా కథాభ్యుదయ ముతో చిహ్నితమైన, మత్స్తోత్రం=నాస్తోత్రమును, చకర్థయత్=చేసితివను టేది గలదో అందుచేత, తపసి=తపస్సు నందలి, తే నిష్ఠా=నీశ్రద్ధ, యద్వా= ఏదిగలదో, సః ఏషః=అది, మదనుగ్రహః.

తాత్పర్యము : నీ కేర్పడిన యీ జ్ఞానము నీ తపస్సుతోఁ గలినదని భావింపకుము. మత్కథాచిహ్నితములైన స్తోత్రము లొనర్చుట, తపస్సు నందు నీకు శ్రద్ధ గుదురుట ఈ రెండును నాయనుగ్రహమే.

39.శ్లో. అహంప్రీతః=నేను సంతుష్టుఁడనైతిని. తే భద్రం అస్తు=నీకు మంగళ మగును గాక! నిరుణం మా=గుణాతీతుఁడైన నన్ను, లోకానాం= లోకముల యొక్క, విజయేచ్ఛయా=పాలనాతాత్పర్యముతో, గుణమయం= గుణమయుఁడనుగా, అనువర్ణయన్=వర్ణించుచు, అస్తౌషీఃయత్=ఎందుచేత స్తుతించితివో.

తాత్పర్యము : వాస్తవమునకు నేను గుణాతీతుఁడను. కాని లోక పాలనమునకై గుణముల నంగీకరించితిని. ఈ విషయమును నీ వెఱిఁగి నన్ను గుణమయునిగా భావించుచు స్తోత్ర మొనర్చితివి. నాతత్త్వమును నీవు చక్కగా నెఱిఁగితివని నాకు సంతుష్టియేర్పడినది. నీకు మంగళ మగుఁగాక!

40.శ్లో. ఏతేన స్తోత్రేణ=ఈ స్తోత్రముతో, యః పుమాన్=ఏ పురుషుఁడు, నిత్యం=అనుదినమును, మాం భజేత=నన్ను భజించునో, సర్వకామవరేశ్వరః =సర్వకామములను జిలికెడు నట్టి నేను, తస్య ఆశు=శీఘ్రముగా, సంప్రసీదేయం=సంతుష్టినందిన వాఁడ నగుదును. ఈ స్తోత్రముతో నన్నెవ్వఁడు స్తుతించునో వానికి నేను శీఘ్రముగఁ బ్రసన్నుఁడ నయ్యెదను. వాని సకలాభీష్టములను సిద్ధించును కనుక నీ మనోరథము తప్పక సిద్ధించునని భావము.

41.శ్లో. పూర్తేన=పూర్తముచేతను, తపసా=తపస్సుతోను, యజ్ఞైః =యాగాదులతోను, దాన యోగసమాధినా=దానయోగ సమాధులతోను, పుంసాం=పురుషుల చేత,రాద్ధం=సంపాదింపఁబడిన, నిశ్రేయసం=శ్రేయస్సు, మత్ప్రీతిః=నా ప్రీతి యేయని, తత్త్వవిదాంమతం=తత్త్వవేదుల యభిప్రాయము.

తాత్పర్యము : నా భజనము సకలాభీష్ట సాధకము. కాని నిష్కామ భక్తియే పరమపురుషార్థమును సాధించును. పూర్తములు, తపస్సు, యజ్ఞాదులు, దాన యోగసమాధులు - వీని యన్నిటికిని ఫలము మత్ప్రీతిసంపాదనమే. ఇది యే తత్త్వవేత్తల యభిప్రాయము.

42.శ్లో. ధాతః అహం=నేను, ఆత్మనాం=సర్వజీవులకును, ఆత్మా= ఆత్మస్వరూపుఁడను, ప్రేయసాం=అతి ప్రియములైన వానిలో, ప్రేష్ఠస్సన్= పరమ ప్రేమకు విషయీభూతుఁడను, అతః=అందుచేత, మయి రతిం కుర్యాత్=రతి నొనర్పవలెను. యత్కృతే=దేని వలన, దేహాదిః=దేహాదులు, ప్రియః=ప్రియమైనదో,

తాత్పర్యము : నేనే సర్వభూతముల కాత్మస్వరూపము. వారిపరమ ప్రేమకు విషయీభూతుఁడను గూడ నేనే. నావలననే దేహాదులు జీవులకుఁ

ప్రియము లగుచున్నవి. అందుచే నాయందు రతి నొనర్చుటయే స్వాభావికమైన ధర్మము.

43.శ్లో. సర్వవేదమయేన=సర్వవేదమయుఁడును. ఆత్మ యోనినా=స్వయంభూతుఁడైన, ఆత్మనా=ఆత్మనుండి, ఆత్మత్వం=నీ వాత్మస్వరూపుఁడవై, యుద్భవించితివి. యాః ప్రజాః=ఏ ప్రజలు, మయి, అనుశేరతే=శయించియున్నారో, తాః ప్రజాః=ఆ ప్రజలను, యథాపూర్వం=ఇంతకు ముందు వలెనే, సృజ=సృష్టిసేయుము.

తాత్పర్యము : బ్రహ్మ సంతాపమును దీర్చి సంతోషపఱచిన యనంతరము సృష్టిసేయ నాజ్ఞాపించు చున్నాఁడు. నానుండి నీ వుద్భవించితివి. అందుచే సర్వజ్ఞాన నిధానమైన వేదమే నీ స్వరూప మైనది. నీ జ్ఞానమున కెప్పుడును వినాశ మేర్పడదు. పూర్వకల్పమం దొనర్చిన సృష్టి కార్యమం దెక్కువ శ్రమింపవలసినది లేదు. నాయందు లయించి యున్న జీవాత్మలకు - వారు సుఖదుఃఖానుభవములకు సరిపోవునట్టి శరీరనిర్మాణ రూపమైన సృష్టికర్మము నారంభింపుము.

44.శ్లో. ప్రధాన పురుషేశ్వరః=ప్రధానమైన మాయ, జీవాత్ములు - వీని కీశ్వరుఁడైనట్టియు, కంజనాభః=నాభ్యమైన పద్మము గల భగవంతుఁడు, జగత్స్రష్టే=లోకసృష్టికర్తయైన, తస్మై=బ్రహ్మదేవునకు, ఇదం వ్యజ్య=దీనిని బోధించి, స్వేన రూపేణ= తన నిజరూపములో, తిరోదధే=అంతర్భూతుఁడైనాఁడు.

తాత్పర్యము : మైత్రేయుఁడన్నాఁడు. మాయను జీవులను నియమించువాఁడును, బ్రహ్మదేవునకుఁ గారణభూతమైన పద్మమును నాభి నుండి. వెలయించిన వాఁడును నైన పరమాత్ముఁడు, లోకసృష్టి కనురూపమైన మార్గమును బ్రహ్మకు బోధించి స్వరూపముతో తిరోహితు డయ్యెను.

## శ్రీధరీయము

"నవమే తపసా తుష్టం దృష్ట్వా నారాయణస్త్వజః,
అస్తౌదేకార్ణవే సీదన్ లోకసర్గ చికీర్షయా."

బ్రహ్మ తప మొనర్చెను. దానితో నారాయణుఁడు తృప్తిపడినాఁడు. అతనినిజూచి లోకములను సృష్టింపవలెనను నిచ్ఛతో బ్రహ్మదేవుఁడు స్తోత్ర మొనర్చెను. ఆ కథయే యీ యధ్యాయములో వచ్చును.

1. శ్లో. భగవత్ జ్ఞానముతోఁ దనకుఁగలిగిన కృతార్థతను వెల్లడించుచున్నవాఁడై. ఆ జ్ఞానములేని యితరులను గూర్చి చింతించుచు నమస్కరించు చున్నాఁడు. సుచిరాత్=చాలకాల ముపాసించుట చేత, అద్య,

మే=నా చేత, జాతోऽసి, దేహభాజాం=మానవుల పెద్ద దోషమిదే, ఏది? భగవంతుఁడవైన నీతత్త్వమును దెలియకుండుట. ఎందుకనఁగా సత్య స్వరూపుడ వగుట చేత నీవే తెలిసికొన నరుఁడవు. తక్కినది కాదు.ఎందుకు? అసత్య మగుటవలన. ఓ భగవంతుఁడా! నీకన్న భిన్నమైనది లేదు. ఒకవేళ యున్నదిగా భాసించుచున్నను అది శుద్ధ సత్త్వమైనది కాదు. లేనిదానికి ప్రతీతి యెట్లు? దీనికి సమాధానము. మాయాగుణవ్యతికరాత్=వ్యతికర మనఁగా క్షోభ. దానిచేతనే నీవు ఉరుః=బహురూపుఁడుగా ప్రకాశించు చున్నావు.

2.3. శ్లో. అవతారిక: నీకుఁగూడ నాతత్త్వము స్పష్టముగాఁదెలియదు. ఎందుకనఁగా నీ విప్పుడు చూచిన తత్త్వము గుణాత్మకమైనదే. నిర్గుణమైన బ్రహ్మమే సత్యము. రెండుశ్లోకములతో దానికి సమాధానము. అవబోధర సోదయేన=చిచ్ఛక్తిరసము యొక్క ఆవిర్భావము చేత, శశ్వత్=నిరంతరమును, నివృత్తం తమః యస్మాత్=నివృత్తమైన తమోగుణముగల నీ యొక్క యీరూపము - నీవు స్వతంత్రముగనే యుపాసకుల యనుగ్రహము నకై స్వీకరించితివి. శుద్ధ సత్త్వాత్మకమైన యవతారశతమునకు బీజ మిదే. బీజమని సూచించుటకై గుణావతారబీజత్వమును జెప్పుచున్నాఁడు. నీదైన నాభిపద్మ భవనాత్=నాభిపద్మమను భవనమునుండి నే నావిర్భవిం చినాను. అందుచే నీ రూపము కన్నను పరమైనదానిని జూచుట లేదు అని ఉత్తరత్ర సంబంధము. హే పరమ! హే ఆత్మన్! అవిదవర్చః= అనావృత ప్రకాశ మైనదియు, అందుచేతనే, అవికల్పం=నిర్భేదమును, దానివలననే, ఆనంద మాత్రం=ఇట్టి భగవంతుని యే స్వరూప మున్నదో దానికంటెను భిన్నమైన దానినిఁజూచుటలేదు. ఎందుకనఁగా నీ స్వరూపమే నిర్గుణమైనది గూడ. అందుచేతనే నీయీరూపము నాశ్రయించినాను. ఎందుకు? చూచుట కిదియే యోగ్య మగుటచేత. ఉపాసింపఁదగిన వానిలో నిదియే ముఖ్య మైనది. ఎందుచేత? సమస్త విశ్వమును సృష్టించున దిదే. ఆ కారణముచేతనే, అవిశ్వం=విశ్వమునకంటె వేఱైనది, భూతేంద్రియాత్మకం = భూతములకును, ఇంద్రియములకును, ఆత్మా=కారణభూత మైనది.

4. శ్లో. ఐనను నీస్వరూపము సోపాధిక మగుటచేత అర్వాచీనమేకదా! దానికి సమాధానము. భువనమంగళ!=ఉపాసకులైన మాయొక్క మంగళముకొఱకై ధ్యానమందు నీచేత ననిర్గుణమైన స్వరూపమే చూపఁ బడినది. ఇచ్చట "స్మ" అనునది యదరకము. ఎందుచేత చూపఁబడినదో అని యర్థము. అవ్యక్త మార్గము గలిగిన నిర్గుణ బ్రహ్మమునందే అభినివేశితమైన చిత్తముగల మాకు సోపాధికమైన యీ దర్శనము యుక్తము కాదుగదా! కాని యీ రెంటికిని భేదములేదని యర్థము, అట్టినీకు నమస్క రించుచున్నాము. నరక భాక్కులైన జనులచేత నీ వాదరింపఁబడవు. నీ యందు భక్తిని బ్రదర్శింపరు. కనుకనే వారు నరక యోగ్యులని భావము.

5. శ్లో. ఆదరముతో నిన్నుఁ గొల్చువారు కృతార్థులని మూఁడు శ్లోకములతోఁ జెప్పుచున్నాఁడు. శ్రుతివాతనీతం=వేదములను గాలులచేత ప్రాప్తమైన నీ కథాశ్రవణము నెవ్వ రాదరింతురో అట్టి వారి హృదయము నుండి నీ వెన్నఁడును దొలఁగవని భావము.

6. శ్లో. దీనిచే నేర్పడు ప్రయోజనమేమి? చెప్పుచున్నాఁడు. ద్రవిణ గేహ, సుహృత్తులు విద్యమాను లగుచుండఁగా వారినుండి భయ మేర్పడుచున్నది. అదితొలఁగిపోగా శోకము, శోకానంతరము మరల స్పృహ, దానినుండి పరిభవము. మరల విపులమైన లోభము. ఆశ, యేదో యొకరీతి మరల నవిప్రాప్తింపఁగా నార్తికే మూలము లగుచున్నవి. భయశోకాదులకుఁ గారణము లగుచున్నవి. "నాది" యను భావము, ఈ పదార్థములయం దుండరానిది. ఎంతవఱకవి బాధించును! ముక్తి ప్రదములైన నీ పాదముల నాశ్రయింప నంతవఱకు. నీ పాదముల నాశ్రయించినంత మాత్రముతో భయాదులు నివృత్తము లగుచున్నవి. అవియెదుటఁ బ్రకాశించినప్పు డేమిచెప్పవలెనని భావము.

7. శ్లో. ఎవరు నిష్కాము లయ్యును ని న్నాశ్రయింప కుందురో వారు నరక భాజను లగుదురని యింతకుముందుఁ జెప్పఁబడినది. ఇప్పుడు భగవత్కథావిముఖులై కామ్యకర్మ పరాయణులైన మనుష్యులు అతిమందులని చెప్పుచున్నాఁడు. దైవేన హతధియః=దౌర్భాగ్యముచేత బుద్ధి తొలఁగిన వారు. అందుచేతనే సర్వాశుభోపశమనాత్=సర్వదుఃఖనివారక మైన, శ్రవణకీర్తన రూపమైన నీ ప్రసంగమునుండి విముఖములైన యింద్రియములు గలవారు. అట్టివారు నికృష్టులైన పురుషులు. ఎందుకు? అనఁగా వీరిమనస్సు లోభముచే పరాభూతమైనది. అందుచేతనే దీనులై కామసుఖస్య=అనఁగా - భోగము యొక్క అత్యంతలేశమునకు అకుశలములైన కర్మలందు మాటి మాటికిని బ్రవర్తించుచున్నారు.

8. శ్లో. వారి యకుశలత్వమునే ప్రదర్శించుచున్నాఁడు. త్రిధాతవః= వాతపిత్త శ్లేష్మములు, క్షుధాదిభిః=శీతాదులచేతను, "శీతోష్ణవాతవర్షైః" అనుచోట ఛందోభంగ మార్షము. వాతజలదైః=అని మార్చుకొన్న చో బాధ యుండదు, సుతరాం=ఎక్కువగా దుస్సహమైన కామాగ్నితోను, ఇతరేతరాత్=అన్యోన్యమని యర్థము. అచ్యుతయా=అవిచ్ఛిన్నమైన కోపముతోను, అర్ద్యమానాన్= పీడింపఁబడువారు. అట్టి యీ ప్రజలను జూచి నా మనస్సు దుఃఖించు చున్నదని భావము.

9. శ్లో. ఈ సంసార మపరమార్థ మంటివి. మఱిదీని కొఱకు దుఃఖ మెందుకు? చెప్పుచున్నాఁడు. ఓ భగవంతుఁడా! ఇంద్రియార్థరూపమైన మాయాధిక్యముతో నేర్పడునదే పృథక్త్వము. అదే దేహాది భావము. ఈ దేహాదిభావము మానవున కెంత వఱకుండునో అంత వఱకును గ్రియా

ఫలములు వానిని దగుల్కొనియే యుండును. అంతవఱకు వ్యర్థమైనను ఈసంసారము వానినుండి తొలఁగుట లేదు. తత్ఫలముగా జనుఁడు దుఃఖము ననుభవించుచున్నాఁడు.

10. శ్లో. నీవన్నది యవివేకుల మార్గము. వివేకులు ముక్తులేగదా! వారికి భక్తితో నేమిప్రయోజనము? వారికిఁ గర్తవ్యము లేదుగదా! దానికి సమాధానము. ఆపృతాని=వ్యాపృతములు, ఆత్తకరణాః=క్లిష్టములైన యింద్రియములు గలవారు. ఆపృతార్థకరణులకు రాత్రులయందావిషయ లేశముగూడ నుండదు. ఎందుకనఁగా నిశ్శయానులు ఐనను అనేక వాంఛలతోఁ గూడిన స్వప్న దర్శనములతో వారినిద్రలు భంగింపఁబడును. వారు మనోరథములను సంపాదించి కొనుటకై నానాప్రయత్నములొనర్తురు కాని అవి యెప్పుడును సిద్ధింపవు. మాటి మాటికి నపజయమే వారిని వరించును. కనుక వారు, ఋషయః=వివేకులైనను, నీ శ్రవణకీర్తనాది రూపమైన ప్రసంగమునకు విముఖులై యుందురు. ఆ విముఖత్వమే సంసారహేతువు.

11. శ్లో. ఈ రీతిగా భక్తులకు సంసార నివృత్తిని వచించి అభక్తుల సంసారనివృత్తిని జెప్పుచున్నాడు. శ్రుతేక్షిత పథాత్-శ్రుతేన=శ్రవణము చేత, ఈక్షితః పంథాః యస్య సః. శ్రవణ మూలముగా నేర్పడిన భక్తియోగము చేత శోధితమైన మనస్సునందు నిరంతరము వసింతువు. శ్రవణము లేకున్నను నీభక్తులేయేస్వరూపముతో నిన్నుపాసింతురో వారి ననుగ్రహించుటకై ఆయా రూపములతో వారికి దర్శన మొసఁగుదువని భావము.

12. శ్లో. నిష్కామ భక్తులకు నీ వతిసులభుఁడవు. కామాసక్తులకుఁ గాదనుచున్నాఁడు. ఏకః=ప్రియుఁడగుటలో నిది హేతువు, అద్వితీయుఁడని యర్థము. ఉపాసింపఁదగిన వారిలో ముఖ్యుఁడు అనియు నర్థాంతరము. "నానాజనేష్వవహితః" అనేకులయందున్నవాఁడు. అందుచేతనే అంతరాత్మ తత్కారణముననే సుహృత్. అట్టినీవు భక్తుల కలభ్యమానమైన, సర్వభూతదయ యా=సర్వభూతముల యందలి దయచేత, ఎంతగా ప్రసాదాభిముఖుఁడగుచున్నావో అంతగా కోరికలు పెట్టికొన్న దేవతల యొక్క, ఉఱ్ఱితైరుపచారైః=గొప్పపుష్పోప చారాదులచేత నెక్కువగా సంతుష్టుఁడవుగావని యర్థము.

13. శ్లో. కామములతోఁ గొల్చువారికి భగవత్ప్రసాద మెక్కువ లభింప దంటివి. అందుచేఁ గామపూరణము క్రియల కుత్తమమైన ఫలముగాదు. భగవత్ప్రీణనమే సర్వోత్తమఫలము. కామసంయోగ మవాంతరఫలము. ఐనచో సకామభక్తి నెందుకుఁ జెప్పుచున్నారు? ప్రరోచనార్థము, అధ్వరాదులచేతను, దానాదులచేతను నీ యారాధనమే సత్క్రియార్థము, సన్ఛాసౌప్రియార్థశ్చ=అని సమాసము. శ్రేష్ఠమైన క్రియాఫలమని భావము. శ్రేష్ఠత్వమందు హేతువేమి? నీయందర్పింపఁబడిన యర్థ మెప్పుడును

నశింపదు. కర్హి చిత్ అనుచోట ఛందో భంగ మార్షము. కామార్థమైన ధర్మము కోరిన కామములనిచ్చి నశించుచున్నది.

14. శ్లో. అందుచేతనే నిన్నే యాశ్రయింతు మను చున్నాఁడు. శశ్వత్=సర్వకాలమును, స్వరూపమహసా ఏవ=స్వరూప చైతన్యము చేతనే, నిరస్త భేద భ్రమాయ=నశింపఁజేయఁబడిన భేదభ్రమ గలిగినటియు, బోధధిషణాయ=బోధవే విద్యాశక్తిగాఁ గలట్టియు, లేక బోధవే యాశ్రయముగాఁ గలిగి నట్టి నీకు నమస్కారము. దానికి హేతువును జెప్పుచున్నాఁడు. విశ్వము యొక్క ఉద్భవాదులకు నిమిత్తమైన నీ మాయా లీలా విలాసములు; వానితో రాసముగలవాఁడు. రాస మనఁగా నిచ్చట క్రీడ. అందుచేతనే ఈశ్వరాయ=నియంతయైన నీకు మాటి మాటికిని నమస్కార మని దాని భావము.

15. శ్లో. నామగ్రహణ మాత్రముతో కైవల్యము నిచ్చెడు ననుగ్రహమును వ్యంజింపఁజేయుచున్నవాఁడై నమస్కరించు చున్నాఁడు. అవతారాదుల విడంబనము, అనుకరణము - ఏనామముల యందుఁగలదో వానిస్మరణము భావము.. "దేవకీనందనా" దు లవతారవిడంబన నామములు. సర్వజ్ఞ భక్తవత్సలేత్యాదులు గుణవిడంబనములు. గోవర్ధనోద్ధరణాదులు కర్మవిడంబనములు. వీనిని, అసువిగమే=ప్రాణోత్క్రమణ కాలమందు, వివశా అపి=వివశులైనను, ఎవ రుచ్చరింతురో వారు అనేక జన్మార్జితమగు శమలమును తత్క్షణమే పోఁగొట్టుకొని, అపావృతం=నిరస్తావరణమైన, ఋతం=బ్రహ్మను, సంయాంతి=పొందుచున్నారు. అట్టి మహిమగల నీకు నమస్కార మని భావము.

16. శ్లో. గుణావతారకర్మములను బ్రదర్శించుచు నమస్కరించు చున్నాఁడు. యః, ఏకః=కేవలుఁడైన నీవు, త్రిపాత్=బ్రహ్మాదులైన మువ్వురు, పాదాః=ఎవ్వనికి స్కంధభూతములో ప్రత్యేకముగా, గురవః=పెద్దలైన, ప్రరోహాః=శాఖోపశాఖలు గలవాఁడవై, మరీచ్యాది మన్వాది రూపములు గలవాఁడవైయని భావము. వవృధే=అభివృద్ధిఁజెందితివో, అట్టి భువనాకార ద్రుమ స్వరూపుఁడవైన నీకు నమస్కారము. ఆ వృక్షము, ఆత్మమూలం= ఆత్మయే మూలముగాఁ గలది. అట్టి ప్రధానమను ప్రకృతిని భేదించికొని గుణత్రయ రూపముగా విభాగించి నేనును, శివుఁడును నీవుగానె ప్రకాశించు చున్నామని యర్థము. ఇట్లగుట యెందుకు? స్థిత్యుద్భవప్రళయ హేతవః =స్థిత్యాదుల కొఱకు.

17. శ్లో. ఈ రీతిగా గుణావతారకర్మ విడంబనమును జెప్పి అతఁడే కాలాఖ్యరూపుఁడని అతని కర్మమును రెండు శ్లోకములతోఁ జెప్పు చున్నాఁడు. వికర్మనిరతః=విరుద్ధధర్మములం దాసక్తిగలదై, అయం లోకః= కుశలేప్రమత్తః, కుశలే=హితమైనట్టిది, స్వే=ఆత్మీయమైనట్టి, అనఁగా కేవల

మాత్మకే సంబంధించినదని భావము. త్వదుదితే=నీచేతనే సాక్షాత్తుగాఁ జెప్పఁబడినది. అట్టి భగవదర్శన రూపమైన కర్మయందు ప్రమత్తమైనదై అనఁగా నిక్షేపింపఁబడని మనస్సుగలదై, యావద్వర్తతే=ఎంత వఱకు వర్తించు చున్నదో, తావత్=అంత వఱకు, నీప్రపంచము యొక్క యాలోక మందలి జీవితాశను, బలవాన్ యః=బలవంతుఁడైన యే పరమపురుషుఁడు, సద్యశ్ఛినత్తి=హఠాత్తుగా భేదించు చున్నాఁడో, తస్మై అనిమిషాయ కాలాయ నమః=నిత్య జాగృతుఁడవై, కాలస్వరూపుఁడవైన నీకు నమస్కారము. భగవద్గీతయందు భగవంతునిచే సాక్షాత్తుగా నిర్వచింపఁ బడిన ధర్మము లీక్రిందివి -"

**"యత్కరోషి, యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,**
**యత్తపస్యసి కౌంతేయ! తత్కురుష్వ మదర్పణమ్."**

18. శ్లో. లోకముకథ యట్లుండనీ. నాయవసగూఢ నట్లేయున్నదను చున్నాడు. ద్విపరార్ధకాలముండెడునట్టి స్థానము నాది. సకలలోక నమస్కృత మైనదియు. అట్టిస్థానమును, అధ్యాసితః=అధిష్ఠింపఁజేయఁ బడిన, అహమపి=నేనుఁగూడ, కాలాఖ్యమైన, త్వత్తః=నీనుండి, బిభేమి= భయపడుచున్నాను. స్వసంభవం=నా ప్రాదుర్భూతికిఁ గారణమైన నిన్నే, అవరురుత్సమానః=పొందవలెనను కోర్కిగలవాఁడనై, తేపే=తపమొనర్చి తిని. ఆత్మనేపద మార్గము, ఎట్లు? బహుసవః=అనేకములైన యజములతో నిన్ను సంతోషపెట్టుచున్నవాఁడనై, లేక అనేకవరములు తపస్సొనరించు చున్నవాఁడనై, అధిమఖాయ= మఖాదికర్మాధిష్ఠాతవైన నీకు నమస్కారమని వెనుకకన్వయము. ఇప్పుడాయాకాలములందు జరుగఁబోయెడి భావిలీలావ తారములను వర్ణించుచున్నాఁడు. నిరస్తరతిః= కేవలము స్వానందాను భవముచేతనే - విషయాంతరాపేక్ష లేకయుండు వాఁడు. అట్టివాఁడవైన నీవు, తిర్యగాది జీవయోనిషు=తిర్యగాదులైన జీవయోను లందు, ఆత్మేచ్ఛయా= స్వేచ్ఛతోనే, అనఁగా భగవంతుని దేహములు గర్మాను బద్ధములు గావని యర్థము. ఉపలబ్ధ దేహః=పొందఁబడిన దేహములు గలవాఁడవై, ఆత్మీకృతసేతు పరిప్సయా=నీచే నిర్మింపఁబడిన కర్మముల మర్యాదలను. రక్షింపవలెనను కోర్కితో, రేమే=రమించెదవు, భావ్యర్థమందు"లిట్" ప్రయోగము.

నిరస్త విషయ సుఖుఁడగుట చేతనే పురుషోత్తముఁడవు,
ఉపాధిధర్మ సంస్పర్శ మాతనికి లేదు. అందుకే భగవద్గీతలో -

**"యస్మాత్ క్షర మతీతోఽహం అక్షరాదపి చోత్తమః,**
**అతోఽస్మిలోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః"** అని చెప్పఁబడినది.

20. శ్లో. ఇప్పుడు కనబడుచున్న రూపమునే రెండుశ్లోకములతో వర్ణించుచున్నాఁడు. జఠరీకృతలోక యాత్రః=కడుపులో విలీనమైన లోకయాత్రగలవాఁడు అనఁగా లోకస్థితిగలవాఁడని యర్థము. "దశారాః" పదియందరము ఐదు. ఈ పంచపర్వములకును పైనిఁజెప్పఁబోవుచున్నాఁడు. అట్టి పంచవృత్తులచేతఁ గూడినది యవిద్య. అదియే నిద్రాహేతువు. ఆ పంచ పర్వములచేతను అనుపహతుఁడైన వాఁడు పరమాత్మ, భీమోర్మిమాలిని= భయంకరములైన అలలసమూహము గలిగిన, అంతర్జలము, అహిరేవ కశిపుశ్శయ్యా=ఆదిశేషుఁడనియెడి పాన్పు. ఆతని స్పర్శ కనుకూలమైన యోగనిద్ర. అట్టి నిద్రను వహించిన నీకు నమస్కారమని పైకన్వయము. ఇచ్చటి ఛందోభంగ మార్షము. ఇచ్చట నిద్రాణుఁడైన అవివేక మానవుని యొక్క సుఖ మిట్లుండునని చూపించుచు వాని నపహసించు చున్నవాని వలె నని భావము, అనేక కష్ట బహుళమైన సంసారమందు నలఁగుచునే యజ్ఞానావిష్టుఁడై పరమాత్మను గనుఁ గొనుటకుఁ బ్రయత్నింపక యున్నవాఁడు నిద్రాళువు. ఈ విషయమును ధ్వనింపఁజేయుటకే అంతర్జలాది విశేషణము లివ్వఁబడినవి. లేక పూర్వకల్పమందు అలసిపోయి నిద్రించుచున్న యుదరస్థములైన లోకములకు విశ్రామసుఖమును విస్తరించుచున్నవాఁడై అని యర్థము..అప్పుడు పరోపకారమునకై దుస్సహమైన యవస్థను గూడ ననుభవింపుచున్నాఁడని తెలుపుటకై విశేషణములు.

21. శ్లో. లోకత్రయోపకరణః=లోకత్రయమే ఉపకరణముగాఁ గలవాఁడు, లేక సృష్ట్యాదిద్వారముగా లోకత్రయమున కుపకరించువాఁడు; అట్టినేను నాభిపద్మమే నా భవనము, తస్మాత్=నీ నాభిపద్మమను భవనము నుండి ఎవని యనుగ్రహమున నేర్పడితినో అట్టి - ఉదరస్థభవాయ = ఉదరస్థితమైన సంసారముగల, సంసారమనఁగాఁ బ్రపంచము. ఎవని యోగనిద్రావసాన మందు వికసించుచున్న నళినమువలె నీక్షణము గలదో, అట్టి పరమాత్మునకు నమస్కారమని యన్వయము. ఈ రీతిగా స్తుతించి మరల నాలుశ్లోకములతోఁ బ్రార్థించుచున్నాఁడు; అతఁడే సమస్త జగత్తులకును సుహృత్తు. అతడే కేవలుఁడు. అతఁడే ఆత్మ, అంతర్యామిగా నున్నవాఁడు అంతమాత్రమేగాదు, ప్రణతప్రియః=తన్ను స్తుతించువారి యందుఁ బ్రియమగుచూడ్కి గలవాఁడు. నే నన్ననో ప్రణతుఁడను. ఇతరుఁడను గాను. ఈ విశిష్టగుణములచేఁ గూడిన వాఁడే భగవంతుఁడు. అతఁడే, సత్త్వేన= జ్ఞానముచేతను, భగేన=ఐశ్వర్యముచేతను ఈ ప్రపంచమును, మృడయతే= సుఖింపఁజేయుచున్నాఁడు. అట్టి తన జ్ఞానముచేత, నన్ను లోకసృష్టియందు శక్తిగలవానినిగా నొనర్చి తన జ్ఞానమును నా ప్రజ్ఞయందు యోజింపఁ జేయునుగాక!

22. శ్లో. ప్రసన్నవదన ఏవ=క్లేశము నెంత మాత్ర మనుభవింపనివాఁడై, గృహీత గుణావతారః=గుణకర్మలతోఁ గూడిన యవతారము లను గ్రహించినవాఁడై, ఆత్మశక్త్యా= తన యిచ్ఛాశక్తియైన రమాదేవితోఁ గూడి, యద్యత్కరిష్యతి=దేని దేనిని జేయుచున్నాఁడో, ఆ సర్వమును నాకు స్ఫురించునుగాక! యని భావము. స్వవిక్రమం=విష్ణువే ప్రభావముగాఁ గలిగిన అనఁగా శ్రీమహావిష్ణువు ప్రభావమునే యభివ్యంజించుచున్న యని యర్థము. అట్టి విశ్వమును బరమేశ్వరుని యాజ్ఞతో సృష్టించుచున్న నా మనస్సు నిరంతర మాతని యందే లగించియుండునుగాక! దానిచేతనే, కర్మశమలం=గుణకర్మవైషమ్యరూపమైన యీ లోకసృష్టితో నేర్పడెడు, పాపం=పాపమును, విజహ్యాం=తొలఁగించి కొనుచున్నాను.

24. శ్లో. అంభసిసతః=నీటియందున్న యెవరినాభిహ్రదమునుండి నేను జన్మించితినో, అనంతశక్తేః=మహత్తత్త్వాదికములైన యనంతశక్తులు గలవాఁడును, చిత్తమున కభిమానదేవతయునైన భగవంతుఁడు ఈ లోకమును సృష్టించునప్పుడు తదాధారభూతమైన వేదోచ్చారణమును నా నుండి తొలఁగింపకుండుఁగాక! "హలాంతం బ్రహ్మవర్చసం" అను న్యాయముతో నానుండి తొలఁగింపకుండుఁగాక! యని భావము. అదభ్ర కరుణః=అనల్పమైన దయగలవాఁడు. వివృద్ధమైన ప్రేమచేఁగూడుకొన్న స్మితముతో నాకు వికాసమును గలించుచు విశ్వవిజయోద్భవాయ= సమస్తసృష్టి విజయమును ఇందలి 'చ' కారముచేత నా కనురూపమైన ప్రయోజనమును గూడఁగల్గించుచున్నవాఁడై అని యర్థము.

26. శ్లో. ఏవం స్వసంభవం=తన కుద్భవకారణమైన భగవంతుని సమాధ్యాదులచే సంపాదింపఁబడిన మనోవచస్సులతో నెంత వఱకుఁ జెప్పవచ్చునో యంత వఱకుఁ జెప్పి పరిశ్రాంతునివలె నూరకయైనాఁడని భావము. కల్పవ్యతికరాంభసా=ప్రళయోదకముచేత, విషణ్ణచేతసః=విష ణ్ణమైన మనస్సుగలవాఁడు.

28. శ్లో. లోకసంస్థాన విజ్ఞానమందు ఖిన్నుఁడై యున్నవాఁడు.

29. శ్లో. వేదగర్భ!=బ్రహ్మన్, తంద్రీంమాగాః, సరే ఉద్యమం కురు. ఇంతకు ముందు ఆ జ్ఞానమును నీకు దయచేసితినని చెప్పుచున్నాఁడు.

30. శ్లో. ఐతే ఆ జ్ఞానము నాకెందుకు స్పష్టముగా గోచరించుట లేదు. అపావృతాన్=ఇఁకమీఁద స్పష్టముగా నీకు లోకములును వానిని సృష్టింపవలసిన విధానమును కనపడును.

31. శ్లో. భక్తియుక్తుఁడవై సమాహితుఁడవై యుండుము. నీవు నాయందు లోకమును, లోకమందు నన్నును, నాయందున్న జీవరాసులను - స్పష్టముగాఁ జూచెదవు.

32. శ్లో. నీకు నాదర్శనముతో సర్వతః మోహము నశించును. ఆ ముఖ్యాజ్ఞానని వృత్తికాఁగా భూతాదిరహితమైన ఆత్మను, శుద్ధమైన జీవపదార్థమును - ఈ రెండితో నేకీభూతమైన నన్నుఁ జూడఁగలవు. అప్పుడే నీకు స్వారాజ్యప్రాప్తి.

35. శ్లో. తన యనుగ్రహస్వరూపమును జెప్పుచున్నాఁడు. ప్రజలను సృష్టించుచున్న నీ మనస్సెప్పుడును నాయందు బద్ధమైయుండును. ఇంద్రియములచేతను తత్త్వాదులైన గుణములచేతను, అహంకారాదులచేతను వియుక్తుఁడవుగా నిన్ను నీవు భావింతువు. అప్పుడు రజోగుణము నిన్నంటదు. నీవు పద్మనాళమునుండి నన్ను వెదకితివి. అప్పుడు బయట నాస్వరూపము గన్పింపలేదు. అప్పుడు మత్కథాభ్యుదయాంకితమైన స్తోత్రమొనర్చితివి. తపస్సుఁ జేసితివి. ఈ రెండును నాయనుగ్రహములే. గుణమయుఁడుగా నేను గన్పించుచున్నను, నిరుణుఁడుగనే నన్ను భావించి వర్ణించితివి. పూర్తాదుల ఫలము నా యనుగ్రహమే. అహంకారోపాధికములైన జీవులకు నేనే యాత్మ. ప్రేమింపఁదగిన వారిలో శ్రేష్ఠుడను నేనే. నా చేతనే దేహాదులందు జీవునకు ఉదాసీనత యేర్పడుచున్నది. నా రూపమును దర్శించినందుచే నీవు కృతార్థుఁడవే ఐనను మతియార్థమై లోకసృష్టి నొనర్పుము. "ఈ మాటలు వచించి పద్మనాభుఁడు తిరోధానమయ్యెను.

# విజయధ్వజము

1. శ్లో. మే=నాకు, సుచిరాత్ నను=తపస్సు మొదలైన అనునయ సేవచేత, అద్య, జాతః=జ్ఞానమునకు విషయముగా అసి. దేహభాజాం= కర్మానుగుణముగా దేహమును బొందు జీవులకు, భగవతః గతిః, న జ్ఞాయతే, ఇతియత్=తెలియదను టేదిగలదో అది, అవద్యం నను=తప్పేగదా! అవ్యక్త స్వభావుఁడవైన నీవు భక్తి మొదలైన సాధన సామగ్రులతో గోచరుఁడవగుదువని భావము. ఐనచో ప్రతియొక్కరు శ్రీహరి యొక్క యపరోక్షము నేల పొందరు? అనఁగా జీవులకు శ్రీహరి రూపము దెలియుటలే దనుటేది గలదో, అత్ర=ఈ విషయమందు, అవద్యం=వారి వారి పాపమే, నను=కారణముగదా! ఇచ్చట "దేహభాజాం"=అనెడు షష్ఠీప్రయోగముచేత శ్రీహరి స్వామి యనియు, జీవు లాతని భృత్యు లనియు జీవేశ్వరులకుఁగల సంబంధము దెలుపఁబడినది. ఇట్టి జ్ఞానము లేకుండుట చేతనే శ్రీహరి గోచరుఁడుగాఁడని యర్థము.

భగవన్ త్వత్=నీకంటెను, అన్యత్=భిన్నమైన జీవజడాత్మక ప్రపంచము, అస్తి=ఉన్నది. అపి=ఐనను, న=స్వతంత్రముగా లేదు.

అందుచేతనే, తత్=నీ కంటెను భిన్నమైన సమస్త జగత్తును, అశుద్ధం తు=దోషయుక్త మైనదే. యత్=ఏ కారణముచేత, మాయాగుణవ్యతికరాత్ (జాతేషు) ప్రకృతి యొక్క సత్త్వము మొదలైన గుణముల వికారముచేఁబుట్టిన మహత్తత్త్వము మొదలైన వానిలో, ఉరుః=అంతర్యామి రూపములతో, బహుసంఖ్యాకుఁడవై విభాసి=నీయందు భేదము లేకున్నను బహు రూపములుగాఁ బ్రకాశింతువో ఆ కారణము చేత, త్వం శుద్ధః=నీవు నిర్దోషుఁడవు. శ్రీహరిని జూడకుండుటకుఁ దమకన్న భిన్నమైన పదార్థము లేకుండుటయే కారణమని చెప్పరాదు. అతనికంటె భిన్నమైన లక్ష్మి, బ్రహ్మ మొదలైన జగత్తున్నది. కాని వారు అస్వాతంత్ర్య మనెడు దోషముచేఁ గూడినవారు. " ద్రవ్యం కర్మ చ కాలశ్చ" అను శ్రుతి గూడ స్పష్టముగా వీరి యునికి శ్రీహరి యధీన మని తెలుపుచున్నది. సదోషమైన జగత్తు నిర్దోషుఁడైన శ్రీహరిని సంపూర్తిగాఁ దెలియనేరదు. కాని భక్తి మొదలైన సామగ్రిని సంపాదించికొన్నచో యోగ్యతానుగుణముగా శ్రీహరియపరోక్ష జ్ఞానము తానే యగును. అతఁడు బహురూపియైనను. రూపములందు భేదము లేనివాఁడు. స్థానభేదముతో భేదమున్నట్లు దోఁచు నంతే. దాని కిదియే ప్రమాణము,

"ఏకోపిసాన నానాత్వా న్నానేవ హరిరీర్యతే,
సర్వాంతర్యామి న స్తస్య న భేదో విద్యతే క్వచిత్."

2. శ్లో. పైనిఁ జెప్పిన కారణముల చేత శ్రీహరి స్వరూపము వాఙ్మనస్సులకు సర్వథా విషయము గాదనుట తప్పని చెప్పుచున్నాఁడు. అవబోధరసోద యేన=అపరోక్షజ్ఞాన రసాతిశయముతో, శశ్వత్=ఎప్పుడును, నివృత్తతమసః=ప్రకృతి సంపర్కములేని (తవ) యదేతత్=ఏ యీ అవతార శతైకబీజం=మత్స్యాద్యనంతావతారముల వ్యక్తికిఁ గారణమైన, సదను గ్రహాయ=ముక్తి యోగ్యుల ననుగ్రహించుటకె, ఆదౌ=అనాదికాలము నుండియు, గృహీతం=స్వీకరించిన, మన్నాభిపద్మ భవనాత్, అహం, ఆవిరాసం.

3. శ్లో. హేపరమ! యత్=ఏ యీరూపము, ఆనంద మాత్రం=సచ్చిదా నందములతో నిండియున్నదో, అవికారం=ఆరు విధములైన వికారములు లేని దైనదో, అందుచేతనే, అవిద్ధవర్చః=అడులేని సామర్థ్యముగల, భవతః స్వరూపం=స్వరూపమే యైనదో, యత్=దేనిని, అతః పరం=దీనికంటె వేరైన, నిరుణవస్తువును, న, ఇతి, పశ్యామి, ఏది? విశ్వసృజం=జగత్తును సృష్టించునదో, ఏకం=స్రష్ట వేరొకఁడు లేనిదో, అవిశ్వం=ప్రపంచముక కంటెను విలక్షణ మైనదో, ఆద్యం=సర్వమునకు గారణభూత మైనదో, **భూతేంద్రియాత్మకం=భూతేంద్రియములందు వ్యాపించియున్న, తే, అదః =ఈ రూపము, (పైశ్లోకమందున్న పదము), ఉపాశ్రితః అస్మి=అప**

రోక్షముతోఁ జూచుచున్నాను. కనుక వాఙ్మనస్సులకు గోచరుఁడే గాఁడనుట సత్యము గాదు. సామాన్యులకు గోచరుఁడుగాడని యర్థము. అధికారిచేతనులు వారి వారి యోగ్యతాను సారము వీక్షింతురు. ఈ రూప మనాది యనుటకు "అనాదినిత్యా దవ్యక్తాత్, తస్మాజ్జజ్ఞే చతుర్ముఖః" అనుటయు, నిర్గుణ మనుట యీ రూపమునే యనుటకు "తత్ జ్ఞానానందైక మాత్రం, న తతః పరమం క్వచిత్" అనుటయుఁ బ్రమాణము. పైనిఁజెప్పిన యుక్తులతో- 1. ప్రకృతి యొక్క గుణముల వికారములైన పదార్థములందున్న శ్రీహరికి, అజ్ఞానము మొదలైన దోషము లెందుకు లేవు? 2. ఉదాసీనుఁడు అద్వితీయుఁడునైన శ్రీహరి వేఱురూపము నెందుకు గ్రహించెను? 3.వికారము నందెడు సృష్టములైన పదార్థములను సృష్టించెడు శ్రీహరి వికారరహితుఁడను టెట్లు? అను నీమూఁడు ప్రశ్నలకును సమాధాన మిచ్చిన ట్లైనది. అదః=అనుపదము చేత "పూర్ణ మదః పూర్ణ మిదం" అనెడు శ్రుతిని సూచించినాఁడు. సర్వవ్యాపి యని చెప్పుటతో వాని జ్ఞాన విషయమైన రూపమున కిప్పుడు కనపడుచున్న రూపమునకు భేదము లేదని చెప్పిన ట్లైనది.

4. శ్లో. ఈ విషయము నేనొక్కఁడనే కనుగొన్నది కాదు, నీ యనుగ్రహముతో నితరులు గూడ నిన్నుఁజూచుచున్నారు. అందుచే నిన్నుఁ దెలియుటయే సాధ్యము గాదను మాట సరిగా దను నభిప్రాయముతోఁ జెప్పుచున్నాఁడు. ధన్యాత్మనః=(1)జ్ఞానస్వరూపియైన (2)వారి వారి జ్ఞానమునకుఁ దగిన రూపముగల, తే ఉపాసకానాం=భువన మంగళ మంగళం, యత్ ఇదం, రూపం, దర్శితం తుభ్యం, యః, అసత సంగైః, నిరయ భాగ్భిః అనాదృతః తస్మై భగవతే, నమః, అనువిధేమ. ఈ మాటలచేత "దుర్జేయాహిహరేః గతిః" - అను వచనములు తమో యోగ్యులైన మానవుల యందే వర్తించునవని తెలియవలెను. "వై" అనుటతో సాధన సంపత్తితో శ్రీహరి యపరోక్ష మగునని చెప్పిన ట్లైనది.

5. శ్లో. పూజాకాలమందు యక్షప్రత్యక్ష మెట్లో అట్లే శ్రీహరి ప్రత్యక్షముగూడ. అది సాక్షాత్కారము గాదు. అందుచేతనే యవేద్యమని చెప్పిన ట్లైనది. ఈ ప్రశ్నకు సమాధానము. "తు" - ఉపాసకులు మూఁడు రీతులు, వారిలో, యే=అంతరుపాసకులను మహనీయులు కర్ణవివరైః, శ్రుతి వాతనీతం, చరణాంభోజకోశగంధం=నీక్షీరాబ్ధిగతమైన మూలరూపమను కమలముకుళమునకు, వ్యక్తరూపమును, జిఘ్రంతే=సాక్షాత్తుగాఁ జూచి యనుభవింతురో, తేషాం స్వపుంసాం హృదయాంబురుహాత్ పరమా=వారి వారి యోగ్యతకుఁ దగిన సర్వాతిశయమైన, భక్త్యా గృహీతచరణః=న అపైషి". ఉత్తమానాంతుపాదేన సర్వంరూపం తు కథ్యతే" - అను ప్రమాణముచేత పాదపర్యాయమైన చరణ శబ్దముచేత శ్రీహరి రూపమనియే

యర్థము. "హ్యాది వ్యక్తం తుయద్రూపం హారేర్గంధస్స ఉచ్యతే" - అను ప్రమాణముతో గంధ మన్నచో వ్యక్తరూపమని యర్థము, గంధశబ్దమునకు తేజమనునర్థముఁ జెప్పికొని పురుషోత్తముని రూపములకు భేదములనుఁ జెప్పరాదు. గంధమునకు, గంధముగల పదార్థమునకు భేదము లేనందుచేత శ్రీహరి రూపములకు భేదములేదని సూచించినాఁడు. ఈ శ్లోకముతో శ్రీహరిని వశపఱచి కొనుటకు భక్తియే ప్రధాన సాధనమని చెప్పినట్లైనది.

6. శ్లో. లోకః=నిన్న పరోక్షించికొనెడు యోగ్యతగల అధికారిచేతనులు, యావత్ తే, అభయం, అంఘ్రిం, నప్రవృణీత, తావత్, ద్రవిణగేహ సుహ్యాన్నిమిత్తభయం, శోకః, స్పృహా, పరిభవః, విపులలోభశ్చ, (వర్తంతే) ఆర్తి మూలం, మమ, ఇతి, అసదవగ్రహః, తావత్, వర్తతే.

7. శ్లో. దైవేన, తే, హతధియః, యే, ఏతయోః, యోగ్యులైన జనులు, సర్వాశుభప్రశమనాత్, భవతః, ప్రసంగాత్, విముఖేంద్రియాః, దీనాః, లోభాభిభూతమనసః=దురాశతో నిండిన, సతవృత్తిగల మనస్సులేనట్టివారై కామసుఖ లేశ లవాయ, అకుశలాని, కుర్వంతి, తైః న జ్ఞాయతే.

8. శ్లో. శ్రీహరిని దెలిసినచో సమస్తమును దెలియ నగును. అనెడు శ్రుతిని విచారించినచో నిన్నుఁదెలిసి కొనుటకు సాధ్యమే గాదనుమాట అత్యంతసాహసయుక్తము అని సూచించుటకై బ్రహ్మ, దుర్ జ్ఞానము యొక్క ఫలము ననుభవించు జనులపై కనికరమును జూపు నెపముతో ముముక్షువైనవాఁడు సమీచీనమైన జ్ఞానమును సంపాదించి కొనవలెను. దానికై అన్నిటికంటెముందు వైరాగ్యమును సాధించి కొనవలె నని చెప్పుచున్నాఁడు హే అచ్యుత! ఉరుక్రమ! క్షుత్, తృట్, త్రిధాతుభిః, శీతోష్ణవాతవరైః, చ, ఇతరేతరాన్, సుదుర్భరేణ, కామాగ్నినా, రుషా, చ, ముహుః, అర్ద్యమానాః ఇమాః ప్రజాః, సంపశ్యతః, మే మనః, సీదతే.

9. శ్లో. జీవులు మూఁడు రీతులు. ముక్తియోగ్యులు, నిత్యసంసార యోగ్యులు, తమో యోగ్యులు. వీరిలో ముక్తి యోగ్యులకు వైకుంఠుని మహిమ దెలియ సాధ్యముగాదు. అన్నచో వారికి సంసారనివృత్తి యెప్పుడు? దీనికి సమాధానము. ఈశ! అయం జనః, జీవులైన తమ యొక్క, ఇంద్రియార్థం= ఇంద్రియములకు విషయమైన శబాదుల యనుభవమునకై, పృథక్త్వం= ధ్యానింతును. చూతును, విందును మొదలైన ఈ విభాగ రూపమైన, మాయా బలం=భగవదిచ్ఛా బలమును అనఁగా భగవదిచ్ఛతో నేర్పడెడు కార్యమును, పశ్యేత్=చూతురో, తావత్=అప్పుడు, వ్యర్థా అపి=అత్యంతిక ప్రయోజన రహిత మైనను, క్రియార్థా=ధర్మాది కార్యములే ప్రయోజనముగాగల, దుః ఖనివహం, వహతి=దుఃఖపరంపర కాశ్రయమైన, సంసృతిః=సంసారము, ప్రతిసంక్రమేత చ=నాశముఁబొందియే తీరును, "చ" - శబ్దము

ముక్తియందును, నీవిధమైన విభాగమును జూతు రనుటను సూచించును. ఇక్కడ పృథక్త్వముగా వ్యావహారిక మని పించికొన్న అనిర్వచనీయమైన భేదమని యర్థము సేయరాదు.

"ధ్యాయే, మంస్యే, తథా పశ్యే, శృణోమీతి విభక్తతా,
జీవస్య తు హారేరిచ్ఛా, బలాదింద్రియ భుక్తయే."

అనెడు ప్రమాణాను సారము హరియొక్క, యిచ్ఛాశక్తితో నైనదని తెలియవలెను, 'పశ్యేత్' అని శ్రీహరి మహిమను జూడవలెనని చెప్పుటతో నిక్కడఁజెప్పిన మాయ శ్రీహరియిచ్ఛయేగాని యనిర్వచనీయమైన యవిద్యగాదు. మాయాశబమునుకు, శ్రీహరియిచ్ఛ - లేక శక్తి, లక్ష్మి, శైవలి యని పిలువఁబడెడు బంధకశక్తి యని జడప్రకృతియని యర్థము లున్నవి. సందర్భానుసారముగా నన్వయింపవలెను. దీనికి ప్రమాణము - "జ్ఞేయత్వం దుర్ఘటస్యాపి ఘటనాధిక శక్తితా, అభేద ఈశ్వరేణాపి సృష్ట్యాదావంతరం గతా" "ఉచ్చైత మస్యాస్సామాయా, హారేరిచ్ఛాథవా బలం" - మోక్షమునకై తెలియఁదగినది, దుర్ఘటమును ఘటింపఁజేయునది, అధికశక్తిగలది. శ్రీహరికంటె భిన్నముగానిది, సృష్ట్యాదికార్యములందు అత్యంత ముఖ్యసాధనమైనది అనురీతిగా మాయను జెప్పినచో నామాయ శ్రీహరి యిచ్ఛ లేక సామర్థ్యమనియే తెలియవలెను.

"భగవత్తంత్రతా యస్యాస్తద్వార్యాత్వంసురూపతా,
ఉచ్చైత మాయా సాతు శ్రీః దోషయుక్తా జడాస్మృతా."
"పరిణామినీచ యస్యాస్తు దోషాః చేతనతా తథా,
శైవలీనామ సా మాయా జగద్బంధాత్మికా సదా."

"ఈశ" అను సంబోధనము శ్రీహరికి అఘటన ఘటనాసామర్థ్యమున్నదని సూచించుచున్నది. కనుక శ్రీహరి సామర్థ్యమును అపరోక్షీకరించి కొన్నపుడు ముక్తి యగునని యర్థము.

10. శ్లో. నిత్యసంసారులు సంసారమందుఁ జిక్కుకొనెడు పద్ధతిని జెప్పుచున్నాఁడు. దేవ! యుష్మత్ప్రసంగవిముఖాః ఋషయః అపి ఋషుల వంశమందుఁ బుట్టి యున్నను, గొందఱు జీవులు- నిశి=అజ్ఞానమందు, నిశ్శయానాః=అహ్నిహృతార్థకరణాః=శబ్దాదులచే నాకర్షింప బడిన యింద్రియములు గలవారై, నానామనోరథధియః=క్షణభంగనిద్రాః=క్షణక్షణమునకును భంగింపఁబడిన నిద్రగలవారై, దైవాత్=కర్మాను ష్ఠానము లేకుండుటతో, దైవాను గ్రహాశూన్యులై, హతార్థవచనాః=మోక్షము మొదలైన అభీష్టార్థసిద్ధి లేనివారై, ఇహ భూలోకము, స్వర్గము, నరకము మొదలగు వానియందు, సంసరంతి.

11. శ్లో. "మాయాబలం పశ్యేత్" అని ముందు శ్రీహరి సామర్థ్యము యొక్క అపరోక్షమును జెప్పినాఁడు. అట్టి యపరోక్ష జ్ఞానము లభించుటకు గావలసిన సాధనమును జెప్పుచున్నాఁడు. పుంసాంనాథ=పురుషోత్తముఁడా! ఉరుగాయ=బ్రహ్మాదులచేతఁబరిపూర్ణుఁడని స్తోత్రమొనర్పఁబడెడువాఁడా! సచ్ఛ్రుతేక్షిపథాః=లోకమాన్యులై శ్రేష్ఠులైన గురువుల నుండి విన్న శాస్త్రము చూపించిన విమలభక్తి మొదలైన మార్గములు గలవాఁడగుట చేత, త్వద్భావ..... హృత్సరోజాః నీవిషయకమైన భక్తియోగముతో సువాసితమైన మనస్సనెడు కమలము గలవాఁడె అనఁగా, సద్గురుముఖము నుండి విన్న శాస్త్రశ్రవణముతో నేర్పడిన భక్తిచేతఁ బరిశుద్ధమైన మనస్సు మొదలైన యింద్రియములు గల, యే=ఏ ముక్తియోగ్యులైన జీవులున్నారో, యద్యద్వపుః=ఏ నీ యొక్క ఆకారములను నను=ఇష్టమైనట్లు, తమ తమ యోగ్యతకుఁదగినట్లుగా, జ్ఞానానందాది గుణపూర్ణుఁడవని, ధియావిభావయంతి=బుద్ధితో భావింతురో, తదనుగ్రహాయ, తత్తద్వపుః, ప్రణయసే=నను, అనుదానిచేత "యాదృశో భావితస్త్వీశః, తాదృశో జీవ ఆభవేత్" "తం యథా యథోపాసతే తథైవ భవతి" అనెడు వాక్యములను బ్రమాణముగా సూచించినదైనది. ఈ రెండు శ్లోకములతో నీ విషయమును జెప్పినదైనది. సద్గురువుల ముఖమునుండి సచ్ఛాస్త్రములను విని భగవద్భిన్నమైన విషయములందు వైరాగ్యమును సంపాదించినచో శ్రీహరి యందు భక్తి యేర్పడును. దాని చేత వారి వారి యోగ్యతకుఁదగినట్లు శ్రీహరి గుణముల ననుసంధాన మొనర్చెడు నుపాసనయు, దానితో శ్రీహరి యపరోక్షమును సిద్ధించును. దాని వలనదాఁ నొనర్చు కార్యము లన్నియు వైకుంఠుని యిచ్ఛాశక్తి యొక్క కార్యములే యను జ్ఞాన మేర్పడును. దానితో "శ్రీహరి యవేద్యుఁడు" అనెడు నజ్ఞానము నశించును. " తద్భావయోగ పరిశోధిత హృత్సరోజే" అని శ్రీధరులు, "పరిభావిత హృత్సరోజాః" అని విజయధ్వజులు, "ఆస్నే శ్రుతేక్షిత పథః=" అని శ్రీధరులు, "యే సచ్ఛ్రుతేక్షిత పథ" - అని విజయధ్వజులు.

12. శ్లో. పైన - "ధియా యద్య ద్వి భావయంతి" అని చెప్పుటతో విషయాసక్తులే యుపాసన యొనర్తురను తప్పు టర్థము స్ఫురించుచున్నది. అట్టి సకామోపాసన మోక్షవిరోధి యగుటచే దాని నొనర్పరాదని చెప్పుచున్నాఁడు. ఏకః=ఇతరులకు వారి వారి సేవకుఁ దగినట్లుగా ఫల మొసఁగుచున్నను, ఒక్కటే స్వభావము గలిగిన వాఁడును, నానాజనేష్వవహితః=ఎల్లజీవుల శరీరములందును చేష్టాప్రదుఁడుగా భాసించుచున్న అంతరాత్మా=సమస్త జీవులలో నున్నను, వారి దుఃఖాదులతో సంబంధము లేక సుఖ స్వరూపుఁడుగా నున్నట్టియు, అందుచేతనే సుహృత్=జీవులకు నిర్హేతుకబంధువైన, యః త్వం అసదలభ్యయా, సర్వభూతదయయా=

యోగ్యులైన సమస్త జీవులందును జూపించెడి దయచేత, సురగణైః=హ్మాది ఆరాధితః, యథా=అతిప్ర సీదతి=మోక్షకారణమైన యత్యర్థప్రసాదమును జూపింతువో, సః త్వం, హ్మాది, బదకామః, ఉపచితోపహారైః, ఆరాధితః,అపి, తథా న, అతిప్రసీదతి, అతి=అని చెప్పుటచేత మంత్రము, గురువు, దేవత=వీరి యందున్న వాఁడవై పూజకుఁదగిన యల్పఫలమునొసఁగినను, మోక్షరూప ఫలము నొసఁగు నంతటి యనుగ్రహము చేయవని చెప్పినట్లైనది.

> "ఆరాధితో యోబ్రహ్మాద్యైః భక్తిజ్ఞానదయాదిభిః,
> కిం తస్యకాముకజనైః కృతయా పరిచర్యయా."

అను ప్రమాణము ఈ యర్థమునే సూచించుచున్నది.

13. శ్రీహరి యనుగ్రహమునకుఁ గారణము గేవలనిష్కామో పాసనయేగాదు. ఆ పూజాఫలము భగవంతునకర్పించునదిగా నుండవలెను. అతః=నీ యత్యర్థప్రసాదము మోక్షకారణ మగుటచేత, పురుషైః=ఏ యధికారిచేతనులచేత, యత్ర=ఏ యజ్ఞాది కార్యములందు, భగవతః=స్వామియైన, తవ సత్రియార్థః=పూజాప్రయోజనరూపమైన యదృష్టమనెడు, ధర్మః= ధర్మము, యత్ర=ఏ నీయందు, కర్హిచిత్=ఏ ప్రకారముతోనైనను, అర్పితః =అర్పితముగా, నక్రియతే, తేషాం పుంసాం, అధ్వరాద్యైః, వివిధకర్మభిః, తవ, ఆరాధనం, న (ప్రసాదజనకం)

14. శ్లో. హరితత్త్వము దెలియుటతో నేర్పడెడు "శ్రీహరి యవేద్యుఁడు - "అను నీ సంసారరూపమును బోఁగొట్టుకొనవలె నన్నచో - శ్రీహరి నుపాసింప వలెను. దానిలో వానిగుణముల ననుసంధాన మొనర్పవలెనని చెప్పుచున్నాఁడు. శశ్వత్=స్వరూపమ, హసాఏవ=తన సామర్థ్యముచేతనే ఇతరుల యుపదేశములేనిదే, ని పీత భేదమోహాయ=ఆఖు విధములైన భేదమోహము (అన్యథాజ్ఞానము)లేనట్టి, బోధధిషణాయ=అప్రాకృత జ్ఞానాత్మకమైన బుద్ధిగల, పరస్మై, తే, నమః=ప్రపంచ సృష్ట్యాదులందు నిమిత్తమైన, లీలా=శృంగారచేష్టలకు, ఆరామాయ=ఉద్యానమువలెనున్న, ఈశ్వరాయ తే నమః. " శశ్వత్" అనుటచే జీవులకువలె నెప్పుడును భేద మోహము లేదని చెప్పినాఁడు. స్వరూపమహసా" అనుట యితరుల యుపదేశ మక్కఱలేదని తెలుపుచున్నది. "బోధధిషణాయ" అను పదము ప్రాకృతబుద్ధి యగుటతో భేదమోహ మేర్పడవచ్చునను నా శంకను నివారించు చున్నది. "పరస్మై" అనుట కాలప్రకృతు లతని కధీనములని సూచించు చున్నవి. దానితో నుత్తముఁడును, విలక్షణుఁడు, కాలప్రకృతు లతో నుపద్రవములేనివాఁడు. వానికి వశులైన కర్మ బద్ధ జీవుల కంటె నుత్తముఁడు. చక్రమహే=అనెడు భూతకాలప్రయోగము అనేక జన్మముల

పుణ్యరాశిగా భగవద్దర్శన మైనదని తెలుపు చున్నది. ఆఱుభేదమోహాము లేవి? = 1. శ్రీహారి 2.అతని కన్నవేఱు నియామకుఁడున్నాఁడని తెలియుట 3. అతనికిని అతని యవతారములకును భేద మెన్నుట - 4. జీవులను స్వతంత్రులుగా ననుకొనుట - 5. స్వామి జీవ భావమున నుండెనని భావించుట. 6. జీవేశ్వరులకు జడమునకు భేదములేదని యనుకొనుట. ఈ భేదమోహాము లెప్పుడును శ్రీహారి కేర్పడవు వాని యనుగ్రహాముతో నితరులైన యధికారిచేతనులకును ని వి క్రమముగా నశించును.

"ఈశస్యాపూర్ణతాజ్ఞానం విష్ణోరన్యస్యచేశతా
భేదస్తస్యావతారేషు జీవస్యేశత్వ మేవ చ"

తథా జీవత్వ మీశస్య జడాభేద స్తయో రపి
భేదమోహ ఇతిప్రోక్తః స సదా న హరేః క్వచిత్
అన్యేషాం తత్ప్రసాదేన శనైర్యాతి సతా మపి.

15. శ్లో. శ్రీహారి యవతారములు అవేద్యము లనుట గూడ సరిగాదు. మూల రూపములకు వలెనే యవతారములకును మోక్షాదు లొసఁగు సామర్థ్యమున్నదను నభిప్రాయముతో ననుచున్నాఁడు. లేక శ్రీహారికి - అవతారభేదమోహాము లేనట్లే అతని భక్తులకును తదనుగ్రహాముచే నావిధమైన భేదమోహ ముండదని సూచించుచు స్తోత్ర మొనర్చు చున్నాఁడు. యే, అనువిగమే, వివశాః - భక్తితో ప్రాప్తమైన యభ్యాసబలముతో, శ్రీహారి యనుగ్రహాముతో, యస్య, అవతార గుణకర్మవిడంబనాని, గృణంతి, తే, నైకజన్మశమలం హిత్వా, సహసైవ=బలమైన ప్రతిబంధకముతో నా కాలమందు ముక్తి లేకున్నను కాలాంతరమందు నిశ్చయమైనట్టియు, అపావృతం=త న్ననుసరించి యుండెడునట్టియు, మాయారహితమై శుద్ధమైనట్టియు, ఋతం=సృష్ట్యాదులందు వికారము లేనట్టియు, అజం సంయాంతి తం=భక్తి ప్రాప్యుఁడైన శ్రీహారిని, ప్రపద్యే.

"యే భక్త్యా వివశా విష్ణోః నామమాత్రైకజల్పకాః,
తేऽపి ముక్తిం వ్రజంత్యాశు కిముత ధ్యాయిన స్సదా."

అనెడు ప్రమాణము కైముత్యన్యాయముతో మోక్షమును స్థిరపఱచుచున్నది.

16. శ్లో. సృష్టి సంహారములకు బ్రహ్మయునీశ్వరుఁడును నుండఁగా శ్రీహారియే సృష్ట్యాది రూపమైన క్రీడావిలాసముల కాశ్రయుఁడనుటెట్లు పొసఁగును? అనెడు నీసంశయమును బరిహారించుటకుఁజెప్పుచున్నాఁడు. త్రిపాత్=అనంతాసనము, వైకుంఠము, క్షీరసముద్రము - (శ్వేతద్వీపము)నను

మూఁడు ప్రదేశములందును వ్యక్తుఁడై యుండెడు, ఏకః=ముఖ్యుఁడైన శ్రీహరి, ఆత్మమూలః=నారాయణుఁడే మూలకారణముగా నున్న, యో వా=ఏ, విభుః=సమర్థుఁడైన, స్వయం=విష్ణువును, అహం చ=నేనును, అనఁగా నాయం దంతర్యామియై యున్న బ్రహ్మనామకుఁడైన వాఁడును, చ, గిరిశః, ఈశ్వరుని యంతర్యామియైన ఈశ్వరనామకుఁడును, స్థిత్యుద్భవ ప్రళయహేతవః=క్రమముగా సృష్టిస్థితిసంహారములకుఁ గారణభూతులై, భూత్వా=అవతరించి, ఉరుప్రరోహః=సృష్టించెడు పదార్థములు నానా విధము లగుటచేత వానిలో, నంతర్యామియని యనేకరూపములు గలవాఁడై, వవృధే=వ్యక్తుఁడైనాఁడో, తస్మై భగవతే=అట్టి వికారరహితుఁడైన ఐశ్వర్యము మొదలైన గుణములే దేహముగాఁగల, భువనద్రుమాయ=జగత్తనెడు వృక్షమున కాశ్రయ భూతుఁడైన శ్రీహరికి, నమః=నమస్కారము - చెట్టుతోడి సామ్యమును జెప్పినది కేవల యభివృద్ధిని సూచించుటకే. అంతేగానీ దాని వలెనే వికారము నొందువాఁడని యభిప్రాయము గాదు అందుకే "భగవతః" - అను విశేషణము "వై" అనుటతో నీప్రమాణమును సూచించు చున్నాఁడు.

"బ్రహ్మాదిభావో విష్ణోస్తు తన్నియామకతాభవేత్,
మత్స్యాదితా స్వభావస్తు నాన్యథా క్వచిదిష్యతే."

18. శ్లో. కొంతకాలము మాత్రమే యుండెడు నేనుఁగూడ కాలాంతార్యామికి భయపడుచున్నాను. తక్కినవారు భయపడుటలో నాశ్చర్య మేమి? అందుచేత కాలాంతర్యామియైన భగవంతుని యనుగ్రహము, పుణ్యమును అవశ్యము సంపాదనీయములు. ఈ విషయమును దెలుపుఁ గాలాంతర్యామిని స్తోత్ర మొనర్చు చున్నాఁడు. యత్=ఏ, సకలలోకనమస్కృతం= ద్విపరార్థధిష్ణ్యం=బ్రహ్మదేవుని నూరు వర్షముల కుండెడు 'సత్య' మను స్థానమందు, అధ్యాసితః, అహం అపి - యస్మాత్=ఏ కాలరూపియైన ఈశ్వరునినుండి, బిభేమి=బహుతపః, ముక్తిలో నానందవృద్ధిని గలించెడు పూర్ణజ్ఞానమును, అవరురుత్సమానః=పొంద నపేక్షించి, తపః=వైకుంఠుని యొక్క గుణోపసంహారమైన యుపాసనను, తేపే=సల్పితినో, తస్మై=అట్టి విసఖాయ=తనకార్యమం దితరుల యపేక్షలేని, భగవతే=సమస్తైశ్వర్యవంతుఁడైన, తుభ్యం, నమః.

19. శ్లో. తిర్యగ్జంతువుల యోనులు జ్ఞానలోపమునకుఁగారణములు, అట్టియోనులయం దవతరించినను జ్ఞానానంద పరిపూర్ణుఁడైన భగవంతుఁడు ఇతరుల కసాధ్యములైన పరాక్రమముల నావిష్కరించుచు క్రీడించును. అందుచే నతని యనుగ్రహమైనచో నతనికి సంబంధించిన జ్ఞానము సులభము కాని, కొందఱు శ్రీహరి యవేద్యుఁడని దురాగ్రహమును గన్న

ఋతు రను నభిప్రాయముతో శ్రీహరిని స్తుతించుచున్నారు. ఆత్మేచ్ఛయా = ఆత్మకృతసేతుపరీప్సయా, యః, తిర్యగ్జంతువులందు, మనుష్యులందు, దేవతలందు జన్మించి, అనిరస్తరతిః=తక్కువగాని జ్ఞానానందములు గలవాఁడై, అపి తు=తిర్యగ్జన్మలందే, జ్ఞానము గళితముగానప్పుడు తక్కిన యవతారములలోఁ జెప్పవలసిన దేమని భావము. అందుచేతనే ఉపలబ్ధ కాష్ఠః=ఎల్లప్పుడును నానందానుభవముచేత నిరతిశయుఁడై యుండునో, తస్మై భగవతే పురుషోత్తమాయ, నమః. ఆనందానుభవము లోపించు టచేతనే గదా? దుఃఖము లోపించునది! అదెప్పుడును లోపింపకుండుటచే దుఃఖము రానేరాదని భావము.

20. శ్లో. పరమాత్మునకు అత్యంత శ్రమముతో నేర్పడెడు నిద్రమొదలైన వుండుటచేత నాతనిని దెలియుట చాలకష్టమనెడు వాదమున కుత్తరము. దశార్ధవృత్యా=ఐదు పద్యములతోఁ గూడిన, అవిద్యయా=అజ్ఞానముతో, అనుపహతః అపి=బాధితుఁడు గాకున్నను, యః=జఠరీకృతలోకయాత్రః సన్, జనస్య సుఖం, వివృణ్వన్, భీమోర్మిమాలిని, జలే అంతః=అధి కశిపుస్పర్శానుకూలం. నిద్రాం, ఉవాహ. అట్టి నీకు నమస్కార మని యన్వయము. అవిద్యచేత బాధితుఁడుగాఁడని చెప్పుటతో "బ్రహ్మ యొక్కఁడే. అవిద్యతో నాక్రమితుఁడై సంసారమందుఁదగుల్కొని విద్యతో ముక్తుఁడగు "నను నభిప్రాయము సరిగాదని చెప్పినట్లైనది. "జనుల సుఖమును వివరించుచు" అని చెప్పుటతో నా యోగనిద్రయు నితరుల ప్రయోజనముకొఱకే యని సూచితము. స్వప్రయోజనార్థముగాదు. అతని నిద్రయనుటకేవలము కన్నులు మూసికొనుటయే. అంతేగాని ఇంద్రియములు దమకార్యములనుండి నివృత్తము లగుటగాదు.

21. శ్లో. మదనుగ్రహేణ=యన్నాభిపద్మభవనాత్, అహం, ఆవిరాసం, అద్య, యదనుగ్రహేణ, లోకత్రయోపకరణః, ఆసం, తస్మై, ఉదరస్థభవాయ= సంహారకర్త యనిపించికొన్న రుద్రునిగూడ నుదరమునందు ధరించు నట్టియు, -(రుద్రునిగూడ సంహరించినట్టి) యోగనిద్రా....... ఈక్షణాయ, తే నమః. లోకత్రయసృష్టికి బ్రహ్మసహకారి యనుటచేత శ్రీహరియే ముఖ్యసృష్టి కర్త యనియు బ్రహ్మ అముఖ్య సృష్టి కర్త యనియుఁ దెలిపినట్లైనది. రుద్రునిఁగూడ సంహరించు ననుటతో వైకుంఠుఁడే సంహా రమునకుఁ గర్త. ఇట్లు చెప్పుటతో బ్రహ్మ రుద్రులు గూడ, నారాయణుని యవతారమే యనువాదము నిరాకరింపఁ బడినది. యోగనిద్రావసాన మందుఁ గన్నులు దెఱచు ననుట అజ్ఞానులదృష్టితోఁ జెప్పఁబడినది. శ్రీహరి నిత్యజాగృతుఁడని తెలియవలెను. కనుక శ్రీహరిని దెలిసికొనుటకు సాధ్యము గాదనుమతము నిరాకృత మైనది.

22. శ్లో. ఇప్పుడు తన యిష్టార్థమును బ్రార్థించుచున్నాఁడు. సః= నానుండి తెలియఁబడిన, అయం సమస్త జగతాం సుహృత్, ఏకః, ఆత్మా= సర్వోత్తముఁడైన హృషీకేశుఁడు, ప్రణతప్రియః, అసౌ, భగవాన్=అతఁడు, తన స్వరూపమైన పరాక్రమముచేత, విశ్వం మృడయతే=జగత్తును, గాపాడును. తేనైవ=ఆ సామర్థ్యముచేతనే, యథా ఇదం=ఈ జగత్తును, పూర్వవత్ స్రక్ష్యామి. తథా దృశం=జ్ఞానమును, మే అనుస్మృశతాం. "సుహృత్" మొదలగు విశేషణములచేత వానినే వరములకై యుపాసించు టరమని సూచించుచున్నాఁడు, "ప్రణతప్రియః" అనుటతో వరదానమునకు నమస్కారమే ప్రధానమని చెప్పినట్లైనది. దీనితో శ్రీహరి తృప్తి కితర పదార్థముల యపేక్షలేదని సూచితము. ఆత్మ శబ్దమునకు శ్రీహరియే ముఖ్యార్థము.

"ఆత్మశబ్దస్య ముఖ్యార్థో విష్ణు రేక స్సనాతనః,
సందోహాదేహమనసః బుద్ధి ర్జీవాస్స్వయం తథా."

"బ్రహ్మో ప్యముఖ్యః, క్రమశః, ఉత్కర్షో ఽప్యాత్మతాభవేత్" అనుట ప్రమాణము.

23. శ్లో. ప్రపన్న వరదః=గృహీతగుణావతారః, (1)తన నియామకత్వమునకు లోఁబడిన సత్త్వాదిగుణములను బ్రకాశింపఁజేయునట్టి (2) తన నుండి ప్రకాశితములైన జ్ఞానాది గుణములుగల హయగ్రీవాద్యవతారములు గలిగినట్టి, ఏషః=ఆత్మశక్త్యా=(1)తన స్వరూప భూతమైన సామర్థ్యమునుండి (2)తన భార్యయైన లక్ష్మితోఁ గూడుకొన్న వాఁడై, యద్యత్=ఏయే పరాక్రమములను, కరిష్యతి=తస్మిన్ స్వవిక్రమే=ఆ పరాక్రమములందు, యథా=దీనిచేత, శమలం=పాపకరమైన కర్మ చ= దైత్యాదులను సృష్టించుటచే నేర్పడిన పాపమును, విజహ్యాం=తథా ఇదం=ఈ జగత్తును, సృజతః అపి=సృష్టించుచున్నను, మే చేతః యుంజీత= స్మరణకుఁగారణమైన, జ్ఞానమున్న దానినిగాఁ జేయుఁగాక! యోగ్యతకుఁ దగినట్లు వృద్ధిని బొందని దానినిగా ప్రవృద్ధముగా నొనరించుఁగాక! కర్మశమలం=అనుటతో, జ్ఞానమునకుఁబాపము ప్రతిబంధకమన్నట్లైనది. శ్రీహరి యాజ్ఞయని దెలిసి పాపులను సృష్టించినను బాపములేదు. శ్రీహరియే హయగ్రీవాద్యవతారములను ధరించెనని చెప్పుటతో నా రూపములనుండి యేర్పడెడు జ్ఞానము దీనితోఁగూడఁగల్గునని సూచించి నాఁడు.

24. శ్లో. వేదార్థతాత్పర్యములను దెలియనిది వేదప్రతి పాద్యమైన వస్తువు యొక్క స్వరూపస్వభావములు దెలియవు. అందుచేత వేదార్థ జ్ఞానముగూడ నష్టము గాకుండుఁగాక! యని ప్రార్థించుచున్నాఁడు.

ఇహాం=ఈ ప్రళయకాలము యొక్క, అంభసి, తతః, యస్య అనంతశక్తేః, నాభిహ్రదాత్, విజ్ఞానశక్తిః=విశిష్టజ్ఞాన సామర్థ్యముగల, అహం, ఆసం, అస్య, రూపం=ప్రతిమ, అనిపించి కొనెడు విచిత్రం=అనేక రీతులు గల, ఇదం=ఈ జగత్తును, వివృణ్వతః, మే నిగమస్యగిరాం, విసరః, విశిష్టమైన నిశ్చయ మనిపించికొన్న విష్ణువే సర్వోత్తముఁడను జ్ఞానము, మారిరిషీష్ట=నష్టముగాకుండుఁగాక!

25. శ్లో. శ్రీహరి యనుగ్రహము చేతనే తనయభీష్టము సిదించు చుండఁగా సంభాషణతో నింకను ఎక్కువ విశ్వాసము గలుగునని యెంచి సృష్టివిషాదమును బోఁగొట్టుమని ప్రార్థించు నెపముతో సంభాషణ నపేక్షించుచున్నాఁడు.యః, అసౌ అదభ్రకరుణః పురాణః పురుషః, భగవాన్=సః, విశ్వవిజయాయ=జగత్సృష్టికార్యము సుగమముగా నడచుట కనుకూలించునట్లు, ఉతాయ=శేషశయనమునుండి లేచి, వివృద్ధప్రేమః, తేన సః, నయనాంబురుహం, విజృంభన్=మాధ్వ్యా=తేనెవంటి, గిరా, వేదగర్భ!= ఓయీ బ్రహ్మ, నీవు భయపడవలదు. సృష్టికార్యమందుఁ బ్రవృత్తుఁడవగు మనెడు మాటతో, నే మనో విషాదం, అపనయతాం.

26. శ్లో. ఏవం సః, స్వసంభవం, నిశామ్య, యావన్మనో వచః, స్తుత్వా, ఖిన్నవత్ విరరామ, విద్య యనఁగా మంత్రరూపమైన నిష, శ్రీహరిగుణము లనంతములు. ఎంత వర్ణించినను ముగియవు. అందు చేతనే బ్రహ్మకుఁదృప్తి లేక పోయినది.

27. 28. శ్లో. అథ, మధుసూదనః, తేన, కల్ప వ్యతికరాంభసా, విషణ్ణ చేతసః, ఆత్మనః=తన యొక్క, లోకసంస్థాన విజ్ఞానే=లోకముల అవయవముల నిర్మాణమునకు సంబంధించిన విశేషజ్ఞానమందు, పరిఖిద్యతః =తృప్తిలేని బుద్ధిగల, బ్రహ్మణః అభిప్రేతం, ఆలక్ష్య, కశ్మలం=అతనికైన జ్ఞానసంకటమును, శమయన్ ఇవ, అగాధయా వాచా, తం, ఆహ.

29. శ్లో. వేదగర్భ, తంద్రీం=లోకనిర్మాణఖేదమును, మాగాః, సర్గే, ఉద్యమం, ఆవహ, భవాన్, యత్=ఏ లోకసృష్టిజ్ఞానమును, ప్రార్థయతే= ప్రార్థించుచున్నావో, తత్, అగ్రే=ముందే, మయా, చోదితం=తపస్సుచేయు మనెడు మాటచేఁ బ్రేరేపఁబడిన హి=ఈ ప్రార్థనగూడ, నాసంకల్పమునఁ గలిగినదే!

30. శ్లో. భూయశ్చ=తపః=నాగుణగణముల యాలోచనారూపమైన ధ్యానమును, ఆతిష్ఠ చ, మదాశ్రయాం, విద్యాం, ఏవ=భక్తి యనెడు నిషనుగూడ, అతిష్ఠ అంతర్హృది. అపావృతాన్=సమస్తములైన వివరములతోఁగూడిన, లోకాన్ ద్రక్ష్యసి.

31. శ్లో. భక్తియుక్తః, సమాహితః, త్వం తతః, యోగేన=ధ్యానముచేత, ఆత్మని=హృదయమందు, తతం=వ్యాపించియున్న, సర్వగుణపూర్ణుఁ

డైయున్న, మాం, ద్రష్టాసి=హృదయగతుఁడైన పరమాత్ముని యందు లోకములు చూడవచ్చుననుటకుఁబ్రమాణము.

"దేహే దేహే హరిస్తస్మిన్ సర్వేలోకాః ప్రతిష్ఠితాః,
అంగుష్ఠమాత్రేపిపరే పరశక్త్యతోవిభుః."

32. శ్లో. ఇటు సృష్టింపఁబడబోవు లోకముల విషయము దెలిసికొనెడు యోగము నుపదేశించి బ్రహ్మ సర్వులకును గురువైన దానివలన అతనిచే నుపదిష్టమయ్యెడు జ్ఞానము ముక్తికారణ మగుటలో ముక్తి యోగ్యులైన జీవుల కుపకారకమైన యాజ్ఞానము నుపదేశించుచున్నాఁడు. లోకః=ముక్తి యోగ్యులైన జీవులు, యదా, సర్వభూతేషు, దారుషు, అగ్నిరివ, స్థితం, మాం=అసంగుఁడైన నన్ను, ప్రతిచక్షీత=హృదయములం దంగుష్ఠ మాత్రుఁడుగ నున్నను, సమస్తలోకములతోఁగూడిన వానినిగా నన్నుఁ బ్రతియొక్కరియందును జూచునో అప్పుడే, కశ్మలం=జీవేశ్వరులొక్కటి యను నజ్ఞానముతోఁబ్రాప్తమైన దుఃఖమును, జహ్యాత్.

33. శ్లో. యదా, ఆత్మానం=జీవుని భూతేంద్రియగుణాశ్రయైః =భౌతికములైన యింద్రియములు, గుణములు వీనితో, రహితం=లేని వాని నిగను, దేహమునకంటె భిన్ననిగను, స్వరూపేణ=హృదయమందుండి జీవునకు జీవుఁడనైయున్న బింబరూపుఁడైన, మయా=నాచేత, ఉపేతం పశ్యన్=చూచునో, తదా, స్వారాజ్యం= స్వరూపానందానుభవ రూపమైన మోక్షమును, ఋచ్ఛతి=దేహమే జీవుఁడను నజ్ఞానమును వదలి దేహమున కంటె భిన్నుఁడైన జీవుఁడు హృదయమం దున్నాఁడనియు, వానికి ముక్తి ప్రదుఁడుగా బింబరూపియై శ్రీహరి గలఁడనియు తత్పాదములను సేవించుచు జీవుఁ డుండుననియుఁ దెలిసికొన్నప్పుడు మోక్షప్రాప్తి. ఇందుకుఁబ్రమాణము-

"త్యక్త్వా దేహాద్యాత్మభావం జీవరూపే హృదిస్థితే,
దృష్ట్వాత్మభావం తం చాపి హరి పాదాబ్జసంస్థితమ్"
"యదాపశ్యత్యాపరోక్ష్యాత్ తదా ముక్తిం వ్రజత్యసౌ."

34. శ్లో. యత్ మదను గ్రహః, వర్ధీయాన్, తత్, నానాకర్మ విపాకేన, బహ్వీః=అనేకరీతులైన ప్రజలను, సిసృక్షతః, తే, ఆత్మా, న, అవసీదతి.

35. శ్లో. యత్, ప్రజాః, సృజతః, అపి, తే మనః, మయి, నిర్భరం, తత్, ఆద్యంబుషే, త్వాం, పాపీయాన్, రజోగుణః, న, బధ్నాతి.

36. శ్లో. శ్రీహరియందు మనస్సుంచి కొన్నదాని ఫలమును జెప్పు చున్నాఁడు. యత్, మాం భూతేంద్రియగుణాత్మభిః=భూతేంద్రియములు,

మూఁడు ప్రాకృత గుణములు, మనస్సు, బుద్ధి - వీనియొక్క, యుక్తం= నియామకునిగను, వానితోఁగూడిన వానినిగను, మన్యసే=తెలియుదువో, వానిస్వరూపుఁడను నజ్ఞానమును జెందెదవో, తత్, దేహినాం, దుర్విజ్ఞేయః అపి=అహం, అద్య, భవతా, జ్ఞాతఃతు=పదార్థములను సరిగాఁదెలియుటయే శ్రీహరి యనుగ్రహమునకుఁ గారణము. భూతేంద్రియగుణమనస్సులకు స్వామి నియామకుఁడని తెలియుటయే సరియైన జ్ఞానము.

**"భూతేంద్రియ మనోబుద్ధి త్రిగుణాదిషు సర్వశః,**
**యుక్తం నియామకతయా, పశ్యన్ జానాతి కేశవమ్."**

37. శ్లో. విశేషము లేదు.

38. శ్లో. విశేషము లేదు.

39. శ్లో. లోకానాం=జీవుల యొక్క, విజయేచ్ఛయా=సృష్టియనెడు విజయమునందలి యపేక్షతో, గుణమయం=సర్వజ్ఞత్వాది గుణపూర్ణుఁడైనట్టియు, నిర్గుణం=ప్రాకృతగుణ రహితుఁడైన, మాం, అనువర్ణయన్ భవాన్, యత్, అస్తౌషి, తత్, అహంప్రీతః, తే, భద్రం, అస్తు.

**"సార్వజ్ఞాదిగుణై ర్యుక్తం సత్త్వాదిగుణ వర్జితమ్,**
**యో జానాతి హరిం తస్య ప్రీతో భవతి కేశవః."**

అని ప్రమాణము.

40. శ్లో. యః పుమాన్, ఏతేన స్తోత్రేణ, తవ, భజేత్, తస్య, సర్వకామవరేశ్వరః, అహం. సంప్రసీదేయం - బ్రహ్మదేవుఁడుఁదానొనర్పఁబోయెడు సృష్టి విషయకమైన కోర్కితో నీ స్తోత్రమును జెప్పెను. ఇది నిష్కామముగాదు. మరి హరిప్రీతి యెట్లగును?

**ఆధికారిక దేవానాం స్వాధికారాభికామనమ్,**
**భవతి ప్రీతయే విష్ణోః భక్త్యాదేరపి యస్సదా.**

అనుట ప్రమాణము.

41. శ్లో. అన్ని పురుషార్థములకును నా ప్రీతియే ఉత్తమమైన ఫలమనుచున్నాఁడు. పూర్తేన తపసా, యజ్ఞైః, దానైః, యోగైః, సమాధినా, పుంసాం మత్ప్రీతిః, నిశ్రేయసం=మోక్షమునందును, రాజ్యం, సంతోషజనకము, తత్త్వవిన్మతం, 'రాజ్యం' అనుటతో మోక్షమందు రంజన మొనర్చునది

శ్రీహరి ప్రీతియే యని యర్థము. "ముక్తస్యాపి హరేః ప్రీతిః సర్వతోऽప్యను రాజతే" అని ప్రమాణము.

42. శ్లో. ముక్తిలోఁ బ్రధానకారణము శ్రీహరి యనుగ్రహమే యన్నను భక్తిగూడ కారణ మనుచున్నాఁడు. అహం ఆత్మనాం ఆత్మా, అంతర్యామీ, అందుచేతనే ప్రేయసాం, అపి, అత్యంతప్రియమైన దేహము, ఆత్మ - వీనికన్నను, సన్=శస్తమైన, ప్రేష్ఠః=ప్రియతమవస్తువు దేహాదిః, యత్కృతే= ఏ స్వాత్మ కొఱకై, ప్రియః=ప్రీతికరమైనదో " యీ యాత్మకు ఈ దేహము ప్రియమగుఁగాక! అని, నా చేతనే యేర్పఱుపఁబడిన నియమముచేత, నేనే దేహాదుల కంటెను బ్రియుఁడను". అతః మయి, రతిం, భవాన్, కుర్యాత్.

"సర్వతోऽపి ప్రియో హ్యాత్మా, తస్యాऽపి ప్రియతాం హరిః,
ఆపాదయతి యత్తస్మాత్ స్వాత్మనోऽపి ప్రియో హరిః.

అని ప్రమాణము.

43. శ్లో. సర్వవేదమయేన, ఆత్మయోగినా, నానుండి సృష్టింపఁబడిన, ఆత్మనా=దేహముచేత, ఆత్మా=బ్రహ్మవైన త్వం, యాః=ఏ జీవులు, మయి=నాయుదరమందు, అనుశేరతే=లీనమై యున్నారో, తాః, అట్టి ఇమాః ప్రజాః=జీవులను, యథాపూర్వం సృజ. చ=మఱెవ్వరికిని నధికారము లేకుండు టతో నీవే సృష్టింపుము. లేక రుద్రాదులును సృష్టింతురు గాక!

44. శ్లో. ఏవం, జగత్స్రష్టా=జగత్తునకు ముఖ్యసృష్టికర్తయైన ప్రధానపురుషేశ్వరః, కంజనాభః, ఇదం=బ్రహ్మదేవుని మనస్సునందు సన్నిహితమైన రూపమును, వ్యజ్య=వ్యక్తముగాఁ గన్పడునట్లు చేసి, స్వేనరూపేణ తిరోదధే.

ఇతి శ్రీమద్భాగవతే, మహా పురాణే, అష్టాదశసహస్రికాయాం
సంహితాయాం, వైయాసిక్యాం, శ్రీహయగ్రీవబ్రహ్మ
విద్యాయాం నవమోऽధ్యాయః.

# నవమాధ్యాయము

సీ. నలినాక్ష! మాయాగుణవ్యతికరమునఁ
జేసి కార్యంబైన సృష్టిరూప
మునఁ బ్రకాశించు నీ ఘనరూపవిభవంబు
రూపింప దేహధారులకు దుర్వి
భావ్యంబు దలపోయ భగవంతుఁడవు నైన
పద్మాక్ష నీస్వరూపంబుకంటె
నన్య మొకటి సత్యమై బోధకంబైన
యదిలేదు కాన నీయతులదివ్య

తే. మయిన రూపంబు నాకుఁ బ్రత్యక్ష మయ్యె
నదియుఁగాక వివేకోదయమునఁ జేసి
వరద! నీరూప మజ్ఞానగురుతమో ని
వారకం బయ్యె నాకు శశ్వత్ప్రదీప! 294

కం. ఘనసత్పురుషానుగ్రహ
మునకై యమితావతార మూలం బగుచున్
దనరెడి నీరూపము శో
భనమగు భవదీయనాభి పద్మము వలనన్. 295

కం. జననం బందిన నాచే
ననయము మొదలనె గృహీత మయ్యె జగత్పా
వన! నీదు సుస్వరూపము
ఘనరుచిరంబై స్వయంప్రకాశక మగుటన్. 296

వ. మఱియు జ్ఞానానంద పరిపూర్ణమాత్రంబును, ననావృత ప్రకాశంబును, భేదరహితంబును, ప్రపంచ జనకంబును, భూతేంద్రియాత్మకంబును, నేకంబును నైన రూపంబు నొందియు నెందునుం బొడగాననట్టినిన్ను నాశ్రయించెద. అదిమునుంగాక జగన్మంగళ స్వరూపధరుండవై నీ యుపాసకులమైన మా మంగళంబుల కొఱకు నిరంతరధ్యానంబుచేత నీదివ్యరూపంబునం గానంబడితివి. ఇట్టి నీవు నిరయభాక్కులై నిరీశ్వర వాదంబునం జేసి, కుతర్కంబులు ప్రసంగించు భాగ్యరహితులచేత నాదృతుండవు గావు. మఱియునుం గొందఱు గృతార్థులైన

మహాత్ములు భవదీయ శ్రీచరణారవింద కోశగంధంబు వేదమారుతా నీతం బగుటంజేసి తమ తమ కర్ణకుహారంబులచేత గ్రహించుదురు. వారల హృదయ కమలంబులందు భక్తి పారతంత్ర్యంబున గృహీత పాదారవిందంబులు గలిగి ప్రకాశింతువు. అదియునుంగాక ప్రాణులకు ద్రవ్యాగార సుహృన్నిమిత్తంబైన భయంబును దన్నాశనిమిత్తంబైన శోకంబును, ద్రవ్యాది స్పృహాయును దన్నిమిత్తంబైన పరిభవంబును మఱియు నందుఁదృష్ణయును నది ప్రయాసంబున లబ్ధంబైన నార్తియు దదీయంబైన వృథాగ్రహంబును, నీ శ్రీపాదార విందంబులందు వైముఖ్యం బెంతకాలంబు గలుగు నంతకాలంబును బ్రాప్తంబు లగుంగాని మాన; వాత్మనాయకుండవగు నిన్ను నాశ్రయించిన భయనివృత్తి హేతువగు మోక్షంబు గలుగు. మఱియుం గొందఱు సకలపాపనివర్తకంబైన త్వదీయ నామస్మరణ కీర్తనంబులందు విముఖులై కామ్యకర్మ ప్రావీణ్యంబునంజేసి నష్టమతులై యింద్రియ పరతంత్రులై యమంగళంబులైన కార్యంబులు సేయుచుందురు. దానంజేసి వాతాదిత్రిధాతు మూలంబైన క్షుత్తృడాదులచేతను, శీతోష్ణవరవాతాది దుఃఖంబులచేతను, నతిదీర్ఘంబైన కామాగ్నిచేతను, నవిచ్ఛిన్నంబగు క్రోధంబుచేతను, దప్యమానులగుదురు. వారలంగనిన నాచిత్తంబు గలంకంబొందు. జీవుండు భవదీయమాయా పరిభ్రామ్యమాణుండై యాత్మ వేఱని యెప్పుడు దెలియునంతకాలంబు నిరర్గకంబైన దుస్తరంబైన సంసారసాగరంబు దరియింపంజాలకుండు. సన్మునీంద్రులైనను భవదీయ నామ స్మరణంబు మఱచి యితరవిషయాసక్తులై రేని వారలు దివంబులందు వృథాప్రయత్నులై సంచరింపుచు, రాత్రి నిద్రాసక్తులై స్వప్నగోచరంబైన బహువిధసంపదలకు నానందింపుచు శరీరపరిణామాది పీడలకు దుఃఖింపుచు, ప్రతిహతంబులైన యుద్యోగంబుల భూలోకంబున సంసారులై వర్తింతురు. నిష్కామధర్ములై మిమ్ము భజియించు సత్పురుషుల కర్ణమార్గంబులం బ్రవేశించి భవదీయ భక్తియోగ శోభితంబైన హృత్సరోజ కర్ణికాపీఠంబు వసియింపుదువు. అదియునుం గాక. 297

**వరయోగీంద్రులు యోగమార్గముల భావంబందునేనీ మనోహారరూపంబు దలంచి యేగుణ గణధ్యానంబు గావింతు ర ప్పురుష శ్రేష్ఠ పరిగ్రహంబునకునై పొల్పారఁ దద్ధ్యాన గోచరమూర్తిన్ ధరియింతు గాదె పరమోత్సాహుండవై మాధవా!298**

**తే.** **అరయనిష్కామ ధర్ము లైనట్టి భక్తు**
**లందు నీవు ప్రసన్నుండ వైన రీతి**

హృదయముల బద్ధకాములై యెనయు దేవ
గణములందుఁ బ్రసన్నత గలుగ వీవు. 299

చ. అరయ సమస్త భూతహృదయంబులయందు వసించి యేకమై
పరఁగిన యంతరాత్మ సఖిభావసుధర్ముఁడవున్ బరాపరే
శ్వరుఁడవునై తనర్చుచును సజ్జనదుర్లభమైన యట్టి సు
స్థిరమగు సర్వభూతదయచేఁబొడగానఁగవత్తు వచ్యుతా! 300

మ. క్రతుదానోగ్ర తపస్సమాధి జపసత్కర్మాగ్ని హోత్రాఖిల
వ్రతచర్యాదుల నాదరింప వఖిలవ్యాపార పారాయణ
స్థితినొప్పారెడి నీపదాబ్జయుగళీ సేవాభి పూజా సమ
ర్పితధర్ముండగు వాని భంగి నసురారీ! దేవచూడామణీ! 301

తే. తవిలి శశ్వత్స్వరూప చైతన్యభూరి
మహిమచేత నపాస్త సమస్తభేద
మోహుఁడ వఖిల విజ్ఞానములకు నాశ్ర
యుండవగు నీకు మ్రొక్కెద నో రమేశ! 302

కం. జననస్థితి నిలయంబుల
కనయంబును హేతుభూతమగు మాయా లీ
లను జెంది నటన సలిపెడు
ననఘాత్మక! నీ కొనర్తు నభివందనముల్. 303

సీ. అనఘాత్మ! మఱి భవదవతారగుణకర్మ
ఘనవిడంబన హేతుకంబులైన
రమణీయమగు దాశరథివసుదేవ కు
మారాది దివ్య నామంబు లోలి
వెలయంగ మనుజులు వివశాత్ములై యవ
సానకాలంబున సంస్మరించి
జన్మ జన్మాంతర సంచితదురితంబుఁ
బాసి కైవల్యసంప్రాప్తు లగుదు

తే. రట్టి దివ్యావతారంబు లవధరించు
నజుఁడవగు నీకు మ్రొక్కెద ననఘచరిత!
చిరశుభాకార! నిత్యలక్ష్మీ విహార!
భక్తమందార! దుర్భవభయ విదూర! 304

తరలము జననవృద్ధి వినాశహేతుక సంగతిం గల యేను నీ
వును హరుండుఁ ద్రిశాఖలై మనువుల్ మరీచి ముఖామరుల్
ఒన రనందుపశాఖలై చెలువొంద నింతకు మూలమై
యనయమున్ భువనద్రుమాకృతివైన నీ కిదె మ్రొక్కెదన్. 305

మ. పురుషాధీశ! భవత్పదాబ్జయుగళీ పూజాది కర్మక్రియా
పరతం జెందని మూఢచిత్తునిఁ బహుప్రాయున్ మనుష్యాధమున్
జరయు న్నంతము నొందఁజేయు నతి దక్షంబైన కాలంబు ద
ద్గురుకాలాత్ముఁడవైన నీకు మది సంతోషంబునన్ మ్రొక్కెదన్. 306

సీ. సర్వేశ! కల్పాంత సంస్థితమగు జల
జాతమం దేను సంజనన మంది
భవదీయ సు స్వరూపముఁ జూడ నరసించి
బహువత్సరములు దపంబు సేసి
క్రతుకర్మములు పెక్కు గావించియును నినుఁ
బొడగానఁగా లేక బుద్ధి భీతిఁ
బొందిన నాకు నిప్పుడును నిర్హేతుక
కరుణచే నఖిలలోకైకవంద్య

తే. మాన సతత ప్రసన్న కోమలముఖాబ్జ
కలిత భవదీయ దివ్యమంగళ విలాస
మూర్తి దర్శింపఁగలిగె భక్తార్తి హరణ
కరణ! తుభ్యం నమో! విశ్వభరణ! దేవ! 307

సీ. అమర తిర్యఙ్మనుష్యాదిచేతన యోను
లందు నాత్మేచ్ఛచేఁ జెందినటి.
కమనీయ శుభమూర్తి గలవాఁడవై ధర్మ
సేతు వనంగఁ బ్రఖ్యాతి నొంది
విషయ సుఖంబుల విడిచి సంతత నిజా
నందానుభవ సమున్నతి దనర్తు
వదిగాన పురుషోత్తమాఖ్యఁ జెన్నొందుదు,
వట్టి ని న్నెప్పుడు నభినుతింతు

తే. నర్థి భవదీయ పాదంబు లాశ్రయింతు
మహితభక్తిని నీకు నమస్కరింతు

భక్తజనపోషపరితోష! పరమపురుష!
ప్రవిమలాకార! సంసారభయవిదూర! 308

సీ. తలకొని పంచభూతప్రవర్తకమైన
భూరిమాయాగుణ స్ఫురణఁజిక్కు
వడక లోకంబులు భవదీయ జఠరంబు
లో నిల్పి ఘనసమాలోలచటుల
సర్వంకషోర్మి భీషణవార్ధి నడుమను
ఫణిరాజ భోగతల్పంబునందు
యోగనిద్రారతి నుండఁగ నొకకొంత
కాలంబు చనఁగ మేల్కనిన వేళ

తే. నలఘు భవదీయ నాభితో యజమువలన
గణఁగి ములోకములు నుపకరణ ములుగఁ
బుట్టఁజేసితి వేతుల విభూతి మెఱసి
పుండరీకాక్ష! సంతత భువనరక్ష! 309

కం. నిగమస్తుత! లక్ష్మీపతి!
జగదంతర్యామి వగుచు సర్గము నెల్లన్
దగు భవదైశ్వర్యంబున
నగణిత సౌఖ్యానుభవము నందింతు గదే! 310

సీ. జలజాక్ష! యెట్టి విజ్ఞాన బలంబునఁ
గల్పింతు వఖిలలోకంబు లోలి
నతజనప్రియుఁడవు నా కట్టి విజ్ఞాన
మర్థిమైఁ గృపసేయు మయ్య వరద!
సృష్టినిర్మాణేచ్ఛఁ జెంది నాచిత్తంబు
దత్కర్మకౌశలత్వమును గలిగి
యును గర్మవైషమ్యమును బొందుకతమున
దురితంబుఁ బొరయక తొలఁగునట్టి

తే. వెరవు నా కెట్లు గలుగు న వ్విధము దలఁచి
కర్మవర్తను నను భవత్కరుణ మెఱసి
తగఁ గృతార్థునిఁజేయవే! నిగమవినుత!
సత్కృపామూర్తి! యో దేవచక్రవర్తి! 311

చ. భవదుదరప్రభూతమగు పద్మమునందు వసించి యున్న నే
నవిరళతావకీన కలితాంశమునం దనరారు విశ్వమున్
దవిలి రచింపుచున్ బహువిధంబులఁ బల్కెడి వేదజాలముల్
శివతరమై ఫలింపఁ గృపజేయము భక్తఫలప్రదాయకా! 312

చ. అని యనుకంప దోఁప వినయంబునఁ జాఁగిలిమ్రొక్కి, చారులో
చనసరసీ రుహుం డగుచు సర్వజగత్పరి కల్పనారతిం
దనరిన నన్నుఁ బ్రోచుటకుఁ దా నిటు సన్నిధియైన యీశ్వరుం
డనయము నాదు దుఃఖము దయామతిఁ బాపెడు నంచు నమ్రుఁడై. 313

కం. వనరుహసంజాతుఁడు నె
మ్మనమున హరిఁ గాంచె ననుచు మైత్రేయమహా
ముని ఘనుఁడగు విదురునకున్
వినయంబున నెఱుఁగఁ జెప్పి వెండియుఁ బలికెన్. 314

మ. వనజాతప్రభవుండు కేవలతపోవ్యాసంగుఁడై పద్మలో
చను గోవిందు ననంతు నాథ్యుఁ దన వాక్శక్తిన్ నుతింపన్ సుధా
శన వంద్యుండు ప్రసన్నుఁడై నిఖిల విశ్వస్థాపనాలోకనం
బునఁ జూచెన్ విలయప్రభూత బహువాః పూరంబులన్ ప్రేల్మిడిన్. 315

తే. అటు పొడగని యార్తుడైనట్టి పద్మ
భవుని వాంఛిత మాత్మ దీర్పంగఁ దలఁచి
యతని మోహాని వారకమైన యట్టి
యమృత రసతుల్య మధుర వాక్యముల ననియె. 316

చ. తలకొని నీ యొనర్చు పని దప్పి మదిం దలపోయ దుఃఖముం
దలఁగుము నాదు లీలకుఁ బ్రధానగుణంబగు సృష్టికల్పనం
బలవడఁ జేయు బుద్ధి హృదయంబునఁ జొన్పి తపస్సమాధి
నిష్ఠల నతిభక్తులన్ నన్నుఁ బ్రసన్నునిఁ జేయుము చెందుకోరికల్. 317

కం. నీ వొనరించు తపో వి
ద్యావిభవ విలోకనీయమగు నీసృష్టిన్
గావింపుము లోకంబుల
లో వెలిఁగెడి నన్నుఁ గందు లోకస్తుత్యా! 318

కం. నాలోని జీవకోటులు
వాలాయము నీకుఁ గానవచ్చు నిపుడు నీ

వాలోకింపుము దారు వి
లోలహుతాశనుని కరణి లోకస్తుత్యా! 319

సీ. నలు వొప్ప నఖిలజీవుల యందుఁ గల నన్నుఁ
దెలిసి సేవింపుము నలినగర్భ!
భవదీయ దోషముల్ పాయును భూతేంద్రి
యాశయ విరహితమై విశుద్ధ
మైన జీవుని విమలాంతరాత్ముఁడ నైన
నను నేకముగఁ జూచు నరుఁడు మోక్ష
పదమార్గ వర్తియై భాసిల్లు బ్రహ్మాండ
మందున వివధ కర్మానురూప

తే. పదతులఁ జేసి పెక్కురూపముల నొందు
జీవ తతి రచియించు నీచిత్త మిపుడు
మత్పదాంబుజ యుగళంబు మరగియున్న
కతన రాజసగుణమునఁ గలుగ దఘము. 320

కం. విను మదియుఁ గాక ప్రాణుల
కనయము నెఱుగంగ రాని యనఘుఁడఁ దేజో
ధనుఁడఁ బరేశుఁడ నీచే
తను గానంబడితి నిదె! పితామహా! కంటే! 321

వ. మఱియు భూతేంద్రియ గుణాత్ముం డనియు, జగన్మయుండని యు, నన్ను నీచిత్తంబునందుఁ దలంపుము. తామరసనాళ వివరపథంబు వెంటంజని జలంబులోనం జూడం గోరినట్టి మదీయ స్వరూపంబు 322

కం. నీ కిప్పుడు గానంబడె
నాకులకును నురగపతి పినాకులకైనన్
వాక్రువ్వం దలపోయను
రాకుండు మదీయరూప రమ్యత్వంబుల్. 323

కం. కావున మచ్చారిత్ర క
థావిలసితమైన సుమహితస్తవము జగ
త్పావనము విగతసంశయ
భావుడవై బుద్ధి నిలుపు పంకజజన్మా! 324

కం. సగుణుఁడనై లీలారము
జగములఁ గల్పింపఁ దలఁచు చతురుని నన్నున్
సగుణునిగా నుతియించితి
తగ సంతస మయ్యె నాకుఁ దామరస భవా! 325

కం. ఈ మంజుస్తవరాజము
నీ మనమునఁ జింతదక్కి నిలుపుము భక్తిన్
ధీమహిత! నీమనంబునఁ
గామించిన కోర్కు లెల్లఁ గలుగుం జుమ్మీ. 326

కం. అనుదినమును ద్రిజగ త్పా
వనమగు నీమంగళస్తవముఁ బఠియింపన్
వినినను జనులకు నేఁబొడ
గనఁబడుదు నవాప్తసకల కాముఁడ నగుచున్. 327

తే. వన తటాకోపనయన వివాహ దేవ
భవన నిర్మాణ భూమ్యాది వివిధ దాన
జప తపో వ్రత యోగ యజ్ఞముల ఫలము
మామక స్తవఫలము సమంబు గాదు. 328

కం. జీవావళిఁ గల్పింపుచు
జీవావళిలోనఁ దగ వసింపుచుఁ బ్రియ వ
స్త్వావళిలోపలఁ బ్రియ వ
స్త్వావళినై యుండు నన్ను ననిశముఁ బ్రీతిన్. 329

కం. తలఁపుము మత్త్రితికినై
కలిగించితి నిన్ను భువనకారణ! నాలో
పల నణఁగి యేక మై ని
శ్చలగతి వసియించియున్న జగముల నెల్లన్. 330

తే. తగ నహంకార మూలతత్త్వంబు నొంది
నీవు పుట్టింపు మనుచు రాజీవభవుఁడు
వినఁగ నానతియిచ్చి య వ్విష్ణుఁ డభవుఁ
డంత నంతర్హితుం డయ్యె ననఘ చరిత! 331

## అర్థములు

సీ. నలినాక్ష, పద్మాక్ష, వరద! శశ్వత దీప!=ఇవన్నియు భగవంతునకు విశేషణములు. మాయాగుణ వ్యతికరమునన్‌చేసి=మాయాగుణముల యొక్క, క్షోభముచేత, కార్యంబైన సృష్టిరూపమునన్=నీచే నిర్మాణమైన సృష్టిస్వరూపముతో, దేహధారులకున్=జీవులకు, దుర్విభావ్యంబు= ఊహింపరానిది, బోధకము=జ్ఞానస్వరూపము, వివేక+ఉదయము=వివేక మేర్పడుట, అజ్ఞానగురు తమోనివారకము=అజ్ఞానమను గొప్ప చీఁకటిని బాఱఁద్రోలునది. 294

తాత్పర్యము : పద్మములవంటి కన్నులు గలవాఁడా! మాయాగుణములతో నేర్పడెడు సంబంధముచేత నీ వనేకరూపములుగాఁ బ్రకాశింతువు. నీచే నిర్మింపఁబడిన కార్యమైన సృష్టిరూపముగను వెలుఁగొందుచున్నావు. అనేక రూపములుగా భాసించు నీరూపవిభవము దేహధారి యెవ్వఁడును జెప్పలేఁడు. నీవే తెలిసికొన నరుఁడవు, నీవు గన్పఱచిన యీ రూపమున కంటెను సత్యమై బోధకమైన దన్యము లేదు. నీ దివ్యస్వరూపము నాకుఁ బ్రత్యక్ష మైనది. వివేకోదయముగూడ నేర్పడినది. నీ రూపమును నా యజ్ఞానమను చీఁకటిని బూర్తిగాఁ బోఁద్రోలినది.

కం. సత్పురుషాను గ్రహామునకై నీరూపము దనరెను. 295

తాత్పర్యము : సత్పురుమల ననుగ్రహించుటకై యీ యవతారమును గ్రహించితివి. ఇది యనేకావతారములకు మూలమైనది. ఈ రూపము నుండియే నీ నాభిపద్మమునుండి నేను జన్మించినాను.

కం. జగత్పావన ! జననం బందిన నాచేన్=పుట్టువును స్వీకరించిన నాచేత, స్వయంప్రకాశ మగుటచేత - 296

తాత్పర్యము : నీ నాభిపద్మమునుండి పుట్టిన వెంటనే నా కుత్పత్తి స్థానమైన నీ స్వరూపమును గమనించితిని. నీ స్వరూపము స్వయం ప్రకాశక మైనది.

వ. జ్ఞానానంద పరిపూర్ణ మాత్రంబు నున్=పరిపూర్ణ ములైన జ్ఞానానందములు స్వరూపమైనది, అనావృత ప్రకాశమున్=ఆవరింపఁబడని ప్రకాశము గలది, భేదరహితము, ప్రపంచ జనకము=ప్రపంచము నేర్పఱచునది, భూతేంద్రియాత్మకంబు=భూతములు ఇంద్రియములు వీనిస్వరూప మైనది, జగత్+మంగళ స్వరూప ధరుఁడు=లోకములకు మంగళములఁ గలిగించు స్వరూపము గలవాఁడు, నిరయభాక్కులు=నిరయమును బొందువారు, ఆదృతులు=ఆదరింపఁబడినవారు, వేదమారుత+ ఆనీతంబు=వేదములను గాలిచేఁ దీసికొనిరాఁబడినది, కర్ణకుహరంబులు=

కర్ణద్వారములు, తన్నిమిత్తము=అదియే కారణముగాఁ గలది, వృథా+ఆగ్రహము=వ్యర్థమైన ఆసక్తి, వైముఖ్యము=విముఖత్వము, పాపనివర్తకము=పాపములను బోఁగొట్టునది, త్రిధాతుమూలము=వాతపిత్తశ్లేష్మముల ననుసరించునది, అవిచ్ఛిన్నము=ఎడతెగనిది, తప్యమానుఁడు=తపింపఁజేయఁబడినవాఁడు, పరిభ్రామ్యమాణుఁడు=తిరుగుచున్నవాఁడు, ప్రతిహతములు=అపజయములు నివారింపఁబడినవి. నిష్కామధర్ముఁడు=కోరికలు లేక ధర్మముల ననుసరించువాఁడు, కర్ణికా పీఠంబునన్=దిమ్మెయను పీఠమున. 297

తాత్పర్యము : దేవా ! నీస్వరూపము జ్ఞానానంద పరిపూర్ణమైనది. కేవల ప్రకాశమాన మైనది. ఏ భేదమును లేనిది. సర్వప్రపంచములును నీనుండియే కలిగినవి. పంచభూతములును ఇంద్రియములును నీవే. ఇట్టిరూపము గలవాఁడ వైనను, కేవలుఁడవై దేహధారులదృష్టి కగపడకుందువు. మేము నీ యుపాసకులము. అందుచే మాయందలి యనుగ్రహముతో జ్ఞానమునందీ రూపమున దర్శనము నిచ్చినావు. ఇట్టినిన్నుఁ గొందఱు కుతర్కములతో నాదరింపరు. వారు నరకమును బొందునట్టివారు. మఱి కొందఱు నీవు వేదములచే బ్రతిపాదింపఁబడుట వలన వేదములను గాలిచేఁగొనిరాఁబడిన నీచరణ కోశగంధమును చెవులతో నాఘ్రాణింతురు. అనఁగా వేదప్రతిపాదితుఁడవైన నిన్నెఱుఁగుటకు వేదములందుఁ జెప్పఁబడిన నీ కథలను శ్రద్ధగా విందురని భావము, ఇట్టివారిహృదయములలో నీవు వారి భక్తికి లోఁబడిన వాఁడవై యెప్పుడును బ్రకాశించుచుందువు. ప్రాణులకు ద్రవ్యము, ఇల్లు, మిత్రులు - వీనిమూలమున భయము లేర్పడును. ఇవెప్పుడు నశించునోయని శోకము. ద్రవ్యములందాశ. దానిని సంపాదించుటలో ననేకములైన పరిభవములు. ఆ ద్రవ్యాదులందు విపరీతమైన తృష్ణ. అతికష్టముతో నది ప్రాప్తమైనప్పుడు విపరీతమైన యార్తి. దానియందు 'నాది' ను తీవ్రమైన యాకాంక్ష. నీపాదములందు వైముఖ్యము. ఇవన్నియు నాయావస్తువులందు వ్యర్థమైన యాశ లుంచి కొనునంతవఱకును వీడిపోవు.

ఆత్మనాయకుండవైన నీయం దాశ పెంచికొన్నప్పుడు సకలభయ నివృత్తి యగును. మోక్షము గలుగును. మఱికొంద ఱున్నారు, వారు సకల పాపములను బోఁగొట్టెడి నీ నామస్మరణము - వీనియందు బుద్ధిఁజొనుపరు. కామ్యకర్మములు సాధించికొనుటందే లోలుపులై యుందురు. వారింద్రియములకు లోఁబడినవారు. తమకోరికలను దీర్చికొనుట కనేకములైన యమంగళ కార్యము లొనర్చుచుందురు. వాతాది మూలమైన యాకలి దప్పులు వారినిఁ బీడించును. చలి, యెండ, గాలి, వాన - వీనితో వారు బాధింపఁబడుదురు. కామాగ్నితో దహింపఁ బడుదురు, కోరికలు

దీఱనప్పుడు. క్రోధము. దీనితో వారు నిత్యతప్యమాను లగుదురు. వారిని జూచినప్పుడు నామనస్సు బాధపడును. జీవులు నీమాయతో నాక్రామితులై. సంసారమునఁ దిరుగుచుందురు. ఆత్మ దేహమేయను భావము వానికెంతవఱకుండునో అంతవఱకును దుస్తరమైన సంసారమును దాట నేరఁడు. మహారులైనను నీనామస్మరణమును మఱచినప్పుడు వారి కీబాధ తప్పదు. ఇతరవిషయములు వారి నాక్రమించును. వానిని సాధించికొనుటకుఁ బగటి పూటఁబరిశ్రమింతురు. కాని వారిప్రయత్నములు ఫలింపవు. రాత్రులందుఁ దాము వివిధ సుఖము లందినట్లు స్వప్నములు. వానితో క్షణికమైన యానందము. వయస్సు గడచుకొలఁదియు శరీరము మాఱును. ఆ మార్పులతో వారికి దుఃఖము. వారిప్రయత్నములు ఫలింపకుండుటచేత మనస్సులో వేధ. దీనితో సంసారమునఁ జిక్కి తపించుచుందురు. కోరిక లేవియు లేక నిన్ను భజించువారు ధన్యులు. వారిశ్రోత్రములను మార్గము నుండి నీవు ప్రవేశించి భక్తియోగముతోఁగూడికొన్న వారిహృదయములను పద్మములపై నిరంతరమును బ్రకాశించుచుందువు.

మ. వరయోగీంద్రులు=శ్రేష్ఠులైన నిష్కామభక్తులు, యోగమార్గములన్=యోగమార్గములచేత, ఏకమనోహరరూపంబున్=ఏనీ సుందర రూపమును, ఏనీ సుందరీ గుణధ్యానంబున్=ఎట్టి నీయొక్క గుణములను గూర్చిన ధ్యానమును, కావింతురు=చేయుదురో, అప్పురుషశ్రేష్ఠ పరిగ్రహంబునకునై=అట్టి పురుష వర్యులయందు నీకున్న యనుగ్రహముచేత, పరమోత్సాహుండవై=వారు ధ్యానమందు నిలిపికొన్న మూర్తిని ధరించి, సాక్షాత్కారమిచ్చెదవు.

తాత్పర్యము : పరమయోగులైనవారు యోగమార్గములతో నిన్నుపాసింతురు. వారు నీరూపమును హృదయమందు ఏగుణములుగల దానినిగా - నేస్వభావముగలదిగా భావింతురో అట్టిరూపమునే ధరించి నీవు వారికి ధ్యానగోచరుఁడవౌదువు. ఆ స్వీకరించుట స్వేచ్ఛగానే యగును, నీకుఁబరమభక్తులందుఁగల యనుగ్రహ మట్టిది. 298

గీ. నిష్కామధర్ములు=ఏకోరికయులేక భగవద్ధర్మముల నాచరించువారు, బద్ధకాములు=కోర్కులు గలుగు వారు.

తాత్పర్యము : ఏ కోరికయును గోరక, కేవలము నీముఖోల్లాసము కొఱకై ధర్మము లాచరించు వారియందు నీవు పరమప్రసన్నుఁడవయ్యెదవు. మనస్సులందుఁ గోరికలతో నిన్నుఁ బూజించు దేవగణములందు నీకా ప్రసన్నత యేర్పడదు, 299

చం. అంతరాత్మ=అంతర్యామి, సఖిభావసుధర్ముఁడవు=సఖ్య భావమను గొప్పబుద్ధి గలవాఁడవు. తలర్చు=వెలుఁగొందు, అసజ్జన దుర్లభము=దుర్మార్గులచేఁ బొందరానిది, సుస్థిరము=శాశ్వత మైనది. పొడగానఁగన్ వత్తువు= సాక్షాత్కార మిత్తువు.

తాత్పర్యము : స్వామీ ! నీవు సమస్త భూతములందును వసించు నంతర్యామివి. కేవలుఁడవు. జీవులకు సత్యమైన సుహృత్తువు నీవే. సమస్తదేవతలకంటె నుత్తముఁడవు నీవు. మానవులు సర్వభూతముల యందును గన్పించు దయచే వశుఁడ వయ్యెదవు. 300

మ. దేవచూడామణీ! అసురారీ! క్రతువు=యజ్ఞములు, దానములు, ఉగ్ర+తపస్+సమాధి=ఉగ్రమైన తపస్సుచే సాధింపఁబడెడు సమాధి, అగ్నిహోత్ర=అగ్నియందు హోమించుట, అఖిల వ్యాపారపారాయణస్థితిన్=సమస్త వ్యాపారములకును జరమసీమయైనట్టి, సేవా+అభిపూజా=ఎక్కువగా సేవించుటను పూజయందు, సమర్పిత ధర్ముఁడు=సమర్పింపఁబడిన సకలధర్మములును గలవాఁడు.

తాత్పర్యము : దేవా ! నిరంతరము నీపూజయను నుత్తమధర్మమందు నిమగ్నుఁడై యున్నవాఁడే సర్వోత్తముఁడు. అటివానిపై నీకు శ్లాఘాపాత్రమైన ప్రసన్నతాభావ ముండును. వానికి నీవు వలచినటుగా సకాములై క్రతువులు దానములు తపస్సులు మొదలగున వొనర్చెడి వారినిఁ బ్రేమింపవు. 301

తే. రమేశ=లక్ష్మీవల్లభుఁడా!, శశ్వత్స్వరూప=ఎన్నఁడును వదలని రూపమైన, చైతన్యభూరిమహిమచేతన్=ఇచ్ఛాశక్తియొక్క గొప్ప మహిమచేత, అపాస్త=తొలగింపఁబడిన, సమస్తభేద మోహుఁడవు = భేదజ్ఞానముతో నేర్పడెడు సమస్త మోహములు గలవాఁడవు. అఖిల విజ్ఞానములకు నాశ్రయుండవు=సమస్త జ్ఞానములకు నాధారమవు.

తాత్పర్యము : స్వామీ ! అపురూపమైన నీ యిచ్ఛాశక్తి నిన్నెప్పుడును వదలదు. భేదబుద్ధితో నేర్పడెడు మోహము నిన్నెప్పుడు నంటదు. సమస్తజ్ఞానమునకును నీవే యాధారమవు. అట్టినీకు నమస్కారము. "స్వరూపమహాసైవ" అని మూలము. స్వరూపభూతమైన చైతన్యశక్తిచేత అని శ్రీధరులు. "శశ్వత్స్వరూప" మనుపదము మూలములోనిదే. 302

కం. మాయాలీలనున్=మాయచే నేర్పడెడు క్రీడలకును - అభివందనము=నమస్కారము.

తాత్పర్యము : సృష్ట్యాదులకు హేతుభూతమైనది నీ రూపము. ఆమాయ యేర్పఱచెడు లీలలతోఁ బాటు నీవును నటన మొనర్తువు, అట్టి నీకు నమస్కారము. 303

సీ. అనఘాత్మ! చిరశుభాకార! నిత్యలక్ష్మీవిహార! భక్తమందార! దుర్భయభయవిదూర=చెడ్డవైన జననమరణములతో నేర్పడెడు భయమునకు దూరముగ నుండువాఁడా! ఇవన్నియు భగవంతునకు విశేషణములు. ఇన్ని విశేషణములతో బ్రహ్మకు భగవంతుని యందుఁగల భక్త్యావేశము వెల్లడి

యగుచున్నది. భవదవతార=నీయవతారముల యొక్క, గుణకర్మ=గుణముల కార్యములయొక్కయు, విడంబనహేతుకములు=విలాసములకుఁ గారణ భూతములైన దాశరథీ! దశరథ కుమారుడు, వసుదేవకుమార, ఆది దివ్య నామంబులు=మొదలైన పేరులు, వివశాత్ములై=తమ ప్రయత్నము లేమి యుఁ జెల్లనివారై, సంస్మరించి=తలఁచి, పాచి=పోఁగొట్టుకొని.

తాత్పర్యము : స్వామీ! నీ యవతారము లనంతములు. వానిగుణము లును కర్మలును అనంతములే. ప్రాణోత్క్రమణకాలమందు మానవుఁడు వివశుఁడై యుండును. వానియత్నము లేవియుఁజెల్లవు. అప్పుడు ప్రధానము లైన నీ యవతార గుణకర్మములను వ్యంజింపఁ జేసెడి నామములను వివశుఁడయ్యును స్మరించెడు వానియొక్క జన్మజన్మ సంచితములైన పాపములు ఆ క్షణమందే తొలఁగిపోవును. "దాశరథీ!" ఇత్యాదులు గుణములు దెలిపెడివి. రాముఁడు ధర్మావతారుఁడు గదా! వసుదేవ కుమారా! ఇత్యాదులు పరమాత్ముని గర్మములను దెలిపెడునవి. దేవకీదేవి నను గ్రహించి యామెయందు జన్మించుట ఉదారమైన కర్మముగదా ! ఓ స్వామీ యిట్టి యనంతావతారముల కాశ్రయమైన నీకు నమస్కారము.
304

కం. త్రిశాఖలై=మూఁడుకొమ్మలై, మనువులును, మరీచిముఖామరుల్ =మరీచిమొదలైన దేవతలును, ఉపశాఖలు=చిన్నకొమ్మలు, ద్రుమాకృతివి=చెట్టుఆకారముతో నున్నవాఁడవు.

తాత్పర్యము : దేవా ! నీవే సమస్త ప్రపంచములకును మూలమైన మహావృక్షము. సృష్టిస్థితి సంహారములకుఁ గారణమైన త్రిమూర్తులును నీ శాఖలు. ఈ వృత్తమందు మొదటిపాదములోఁ గ్రమాలంకారము. మను మరీచ్యాదులు నీ యుపశాఖలు. నీ మూల మెఱుఁగరానట్టిది, ఇట్టి జగత్కారణ మహావృక్షమైన నీకు నమస్కారము. 305

మ. పురుషాధీశ=పురుషోత్తమ ! = భవత్పదాబ్జయుగళీ = నీ పాదముల జంట యొక్క, పూజాది కర్మక్రియాపరతన్=పూజమొదలైన కర్మలయందలి యాసక్తిని, పశుప్రాయున్=పశుసమానుని.

తాత్పర్యము : పురుషోత్తమా! నీ పాదపద్మములకు నిరంతరమును బూజయొనర్చుటయను నుత్తమకర్మ మం దాసక్తిలేని మనుష్యుఁడు పశుప్రాయుఁడు, మనుష్యులలో నధముఁడు. అట్టివానిని జరయును గాలమును శీఘ్రముగ నంతము నొందఁజేయును. కాలము సర్వసమర్థమైనది. కాలస్వరూపమే నీవు. అట్టి నీకు నమస్కారము. 306

సీ. ఈజలజాతము=పద్మము, అర్చించి=కోరుకొని, క్రతుకర్మములు = యాగాదులు, పొడగానఁగాన్ లేక=చూడనేరక, నిర్హేతుక కరుణచేన్=కార ణములేకయే కలిగిన దయచేత, అఖిలలోకైకవంద్యా మానమున్= సమస్త

లోకములచేతను వందన మొనరింపఁబడుచున్న, సతతప్రసన్న నిరంతరమును=ప్రసన్నతాభావముతోఁగూడిన, కోమలముఖాబ్జ కలిత=కోమలముఖ పద్మముచేఁగూడిన, దివ్యమంగళ విలాసమూర్తిన్=జగన్మంగళమైన విలాసములు గల విగ్రహమును, భక్తార్తి హరణకరణ=భక్తులకు దుఃఖములను బోఁగొట్టు కర్మములు గలవాఁడా! తుభ్యం నమః=నీకొఱకు నమస్కారము. విశ్వభరణ!=సమస్త ప్రపంచములను భరించు వాఁడా!

తాత్పర్యము : స్వామీ! కల్పాంతమం దెచ్చటఁజూచినను నీరే యావరించినది. అట్టియెడ నీ నాభిపద్మమునుండి నేను జన్మించితిని. నీ స్వరూపము నా కగుపింపలేదు. దానిని దర్శించుటకై యనేకసంవత్సరములు తీవ్రతరమైన తప మొనర్చినాను. యజ్ఞయాగాదు లెన్నో చేసినాను. ఐనను నీదర్శనమే గాలేదు. నాబుద్ధిని భయ మాక్రమించినది. వివశుఁడనై నిన్ను ధ్యాన మొనర్చుచు నూరక కూర్చుంటిని. నిర్హేతుకమైన నీ యనుగ్రహముచే నీ దర్శనము నాకు లభించినది. నీవు సమస్తలోకములతో వంద్యమానుఁడవు. నిత్యప్రసన్నమైన కోమలముఖాబ్జము నీది. నీ విగ్రహము జగన్మంగళము. అట్టి నీ రూపమును నాకుఁ జూపితివి. భక్తులబాధలను దొలఁగించు శ్లాఘనీయ కార్యములుగల యో స్వామీ ! నీకు నమస్కారము. 307

సీ. అమరతిర్యఙ్మనుష్యాది చేతనయోనులందున్=దేవతలు, పశువులు, మానవులు మొదలైన చైతన్యము గలిగిన శరీరములందు, ఆత్మేచ్ఛచేన్=కేవలము నీయిచ్ఛయే కారణముగా, ధర్మసేతువు=ధర్మములకుఁ గట్టవంటివాడు, విషయసుఖంబులు విడిచి=విషయములం దాసక్తి వదలుకొని, సంతత నిజానందానుభవమునన్=నిరంతరము నీ స్వరూపమునందే నిమగ్నుఁడవై, పురుషోత్తమాఖ్యన్=పురుషోత్తముఁ డను పేరుతో, భక్తజనపరితోష=భక్తజనులను పోషించుటే గొప్పసంతోషముగాఁగలవాఁడా! ప్రవిమలాకార! పరిశుద్ధమైన యాకారము గలవాఁడా! సంసారభయవిదూర=సంసార భయములకు దూరముగ నున్న వాఁడా!

తాత్పర్యము : దేవాదిదేవా ! నీవు దేవతలందును తిర్యగ్యోనులందును మనుష్యులందును జన్మింతువు. ఆ జన్మించుటలో నీకు నీచోచ్చ భావములు లేవు. కేవలము నీయిచ్ఛ చేతనే జననము నందెదవు. ఎందుకీ జన్మలు! నీచేతనే యేర్పఱుపఁబడిన ధర్మములను సంరక్షించుట కొఱకు, నీ యానందము కొఱకు. విషయాంతరాపేక్ష లేదు. నీ స్వానందమందే నిత్యమును నీవు రమించుచుందువు. స్వామీ! నీ కొక్కనికే పురుషోత్తముఁడని పేరు. ఇట్టి నీ పాదములను సమాశ్రయించుచున్నను, భక్తితో నీకు నమస్కరించుచున్నాను. భక్తులకు రక్షించుటే నీకు మహానందము. నీ యాకారము పరిశుద్ధమైనది. అత్యంతవిమలమైనది. ని న్నాశ్రయించిన వానిని సంసార భయమే లంటవు. నీవు దానికి దూరముగ నుండు వాఁడవు. 308

సీ. పంచభూతప్రవర్తకము=ఆకాశాది పంచభూతములను బ్రవర్తింపఁ జేయునది. భూరి=ఎక్కువైన, మాయాగుణస్ఫురణన్=మాయాగుణ ప్రవృత్తితో, చిక్కువడక=వికారము లందక, భవదీయ జఠరంబులోన్ = నీకడుపులో, సర్వంకష=సమస్తము నాక్రమించికొనెడు, ఊర్మి= అలలుగల, భీషణ వారినడుమనున్=భయంకరమైన సముద్రపు నడుమ, ఫణిరాజ భోగ=ఆదిశేషుని శరీరమనెడు, తల్పంబుపైని=శయ్యపైన, ఉపకరణములుగన్=సాధనములుగా.

తాత్పర్యము :మాయ పంచభూతములను బ్రవర్తింపఁజేయునది. స్వామీ! నీ వట్టి మాయకు లోఁబడక లోకములను నీ యుదరమందు నిలిపికొని సమస్త ప్రపంచముల నాక్రమించి, అలలచే భయంకరమైన సముద్ర మధ్యమందు ఫణిరాజతల్పముపైఁ బవ్వళించితివి. ఆ యోగనిద్ర కొంతకాలము చెల్లినది. తర్వాత నీ నాభికమలమునుండి నన్ను జన్మింపఁజేసితివి. నీ సృష్టికి లోకముల నుపకరణములుగా నొనర్చినావు, స్వామీ! నీ పరమ విభూతికి నమస్కారము. 309

వ. నిగమస్తుత=వేదములచేఁ బొగడఁబడిన వాఁడా! లక్ష్మీపతి= జగదంతర్యామి వగుచున్=జగత్తునందు వ్యాపించిన వాఁడవై, సర్గమున్ ఎల్లన్=సృష్టియంతటికిని, అగణితసౌఖ్యానుభవమున్=అనంతసౌఖ్యముల అనుభూతినీ, అందింతుగదే !=కల్గఁజేతువు గదా!

తాత్పర్యము : వేదములచేఁ బొగడఁబడిన వాఁడా ! లక్ష్మీపతీ ! నీవు సమస్త సృష్టియం దంతర్యామి రూపముగా నున్న వాఁడవు. సృష్టికి సమస్త సౌఖ్యము లందింతువు. 310

సీ. ఓలిన్=క్రమముగా, నతజనప్రియుఁడవు=భక్తితో వినయమును జూపుచు నమస్కరించువారికిఁ బ్రియుఁడవైన నీవు, సృష్టినిర్మాణ+ఇచ్ఛ= సృష్టిని నిర్మింపవలెనను కోర్కి, తత్కర్మకౌశలత్వమును=ఆకార్యమునకుఁ గావలసిన ప్రాచుర్యమును, కర్మవైషమ్యము=కార్యము నందలి హెచ్చుతగ్గులు, భవత్కరుణన్=నీదయతో-

తాత్పర్యము : స్వామీ! పుండరీకాక్షా! నిన్నుఁగొలుచు వారి కత్యంత ప్రియుఁడవు. ఏవిజ్ఞానబలముతో నీవు సమస్తలోకముల సృష్టించియు వానియం దనాసక్తుఁడవై పుణ్యపాపములతో సంబంధములేక యుందువో అట్టి విజ్ఞానమును నాకుఁ గృపసేయుము, నీ సంకల్ప బలముననే. నాకు జగత్తులను గల్పింపవలెనను కోర్కి జనించినది. దానికిఁ గావలసిన చాతుర్యముగూడ నేర్పడినది. కాని యొకందుకు బాధపడుచున్నాను. నాసృష్టి నీచోచ్చభావములతో ననేకములుగా నుండఁబోవును. వానినుండి పుణ్యపాపములు నాకు సంక్రమించునేమో యనుభయము నన్నుఁబీడించు

చున్నది. ఆ పుణ్యపాపముల భయము న న్నెట్టు పొరయకుండునో ఆ యుపాయము నెఱిఁగింపుము. నీయాజ్ఞచే లోకసృష్టినొనర్చుచున్న నన్నుఁ గృతార్థునిగా నొనర్పుము. 311

చం. భవదుదరప్రభూతము=నీ కడుపునందుఁబుటినది, అవిరళ= నిరంతరమైన, తావకీన=నీకు సంబంధించిన, కలిత అంశమునన్=సంక్ర మించిన యంశముచేత, తవిలి రచింపుచున్=ఆసక్తితో సృష్టింపుచు, శివతరమై ఫలింపన్=మంగళకరముగా ఫలించునట్లు- 312

తాత్పర్యము : స్వామీ ! నీ నాభిపద్మమునుండి జనించిన నేను నీ యంశముతోఁదనరారు సృష్టినొనర్పఁబోవుచున్నాను. ఆ సృష్టి నీయాజతో నేర్పడున దగుటతో నత్యంతము ఇష్టముగా నొనర్తును. సమస్తసృష్టికిని వేదములే ప్రమాణములు. నిరంతరము వేదాధ్యయనముతోనే నాసృష్టి చెల్లును. ఆ నా వేదాధ్యయనము మంగళకరమై ఫలించునట్లు దయసేయుము.

చం. అని=ఈ రీతిగా, వినయంబునన్, చాఁగిలిమొక్కి=వినయముతో నమస్కరించి, అనుకంపతోఁపన్=దయ వెలడియగునటుగా, చారులోచన సరసీరుహుండు+అగుచున్=మనోహరమైన నయన పద్మములు గలవాఁడై, సర్వజగత్పరి కల్పనారతిన్=సమస్త ప్రపంచమును సృష్టించు నాసక్తితో, తనరిన నన్నున్=కూడికొన్న నన్ను, ప్రోచుటకు=రక్షించుటకు, తాన్=తాను, ఇటు=ఈ రీతిగా, సన్నిధియైన యీశ్వరుఁడు=సాక్షాత్కార మొసఁగిన భగవంతుఁడు, అనయమున్=నిరంతరమును, నాదు దుఃఖమున్, దయా మతిన్, పాపెడిన్=పోఁగొట్టుఁగాక, అనుచున్ నమ్రుఁడై.

తాత్పర్యము : బ్రహ్మ భగవంతునకు వినయముతో నమస్కరించి నాఁడు. స్వామి కరుణతో నందమైన కన్నులు గలవాఁడై జగత్పరికల్పనా రతితో నున్న నాకు దర్శన మొసఁగినాఁడు. నా సమస్త దుఃఖములను దయతోఁ బోఁగొట్టునుగాక! 313

కం. వనరుహసంజాతుఁడు=బ్రహ్మ, నెఱ+మనమునన్=నిండు మనస్సునందు, హర్షించెన్=సంతోషించెను.

తాత్పర్యము : బ్రహ్మ యీ రీతిగా భగవంతుని స్తుతించి మనస్సున నెక్కువ సంతోషించెనని మైత్రేయుఁడు విదురునకెఱిఁగించెను. 314

మ. వనజాత ప్రభవుండు=బ్రహ్మ, కేవలతపో వ్యాసంగుఁడై= తపస్+వ్యాసంగుఁడు=తపమునందే మునిఁగినవాఁడు, వాక్+శక్తిన్=తన మాటలశక్తిచేత, నుతింపన్=స్తుతింపఁగా, సుధాశనవంద్యుండు=దేవతలచే, నమస్కరింపఁబడెడు వాఁడైన భగవంతుఁడు, ప్రసన్నుండై=దయగలవాఁడై, నిఖిల విశ్వస్థాపన=సమస్త ప్రపంచమును నిలుపవలెనను నభిప్రాయముతో, విలయప్రభూత=ప్రళయకాలమందుఁబుట్టిన, బహు వారిపూరంబులన్= గొప్పనీటి ప్రవాహములను, వ్రేల్మిడిన్ చూచెన్=వెంటనే చూచెను.

తాత్పర్యము : నాభిపద్మమందు జన్మించిన బ్రహ్మ తపస్సును బట్టిన వాఁడై శ్రీమహావిష్ణువును దర్శించెను. ఆతఁడు పరమాత్మను దనవాక్శక్తితో నుతించినాఁడు. దేవతలచేఁ బూజింపఁబడిన పరమాత్ముఁడు ఆతని యెడఁ బ్రసన్నుఁ డయ్యెను. విశ్వముల నెక్కడ నిలుపవలెనను నాలోచనలతో ప్రళయజలమును ప్రభువు చూచినాఁడు. 315

తే. పొడగని=చూచి, పద్మభవుని వాంఛితము=బ్రహ్మకోరికను, మోహనివారకము=మోహమును బోఁగొట్టునది. అమృతరసతుల్య=అమృతముతో సమానమైన, మధురవాక్యములన్=తీయని మాటలచేత, అనియెన్.

తాత్పర్యము : ఆ రీతిగఁ జూచి బ్రహ్మకోరిక దీర్పఁదలఁచిన వాఁడై - యాతని మోహమును బోఁగొట్టు నమృతమువలె తీయనైన మాటలతో నిట్లనెను. 316

చ. తలకొని=ప్రారంభింపఁబోవునట్టి, నీ యొనర్చు పనిని=నీవు చేయవలసినపనిని తప్పి=వదలి, మదిన్ తలపోయు దుఃఖమున్ తలఁగుము =మనస్సు విక్లబత్వముతో చింతఁజేయుటచే నేర్పడెడు దుఃఖమును వదలుము. సృష్టికల్పనంబు=సృష్టిని నిర్మించుట -

తాత్పర్యము : బ్రహ్మదేవా ! సృష్టినిర్మాణ కార్యమునకుఁ దొడఁగుట యిప్పటి నీ కర్తవ్యము. దానిని వదలి యేవేవో చింతలతో దుఃఖింపకుము. నాలీలలకుఁ బ్రధానమైన యాధారము సృష్టి. ఆలోకసృష్టిని జేయుము. ఆ నిశ్చల భావమును మదిలోఁ బూనుము. తపస్సు, స్తోత్రము, భక్తి - వీని మూలమున నీవు నన్నెంత యుపాసింతువో అంతంతగా నీకోరికలు సిద్ధించుచుఁబోవును. 317

కం. తపో విద్యా విభవ విలోకనీయము=తపస్సుచేతను, ఉపాసన చేతను మాత్రమే చూడఁదగినది. అట్టి నాస్వరూపము ప్రపంచమున బ్రతి పదార్థము నందును నీకు సాక్షాత్కరించును.

తాత్పర్యము : బ్రహ్మదేవా! మరల తపమునకుఁ బూనుము, నాయుపాసనను గావింపుము, ఈ రెంటిచేతను స్పష్టముగాఁ బ్రపంచమున నన్నుఁగందువు. 318

కం. జీవకోటులు=జీవులసమూహములు, దారువిలోలహుతాశను కరణిన్=దారువులందు గుప్తముగానున్న యగ్నిని వలె, ఆలోకింపుము= చూడుము. లోకస్తుత్య!=లోకములచేఁబొగడఁదగినవాఁడా !

తాత్పర్యము : దారువులందు గుప్తముగానున్న యగ్నివలె నాయందే జీవకోటు లన్నియు నున్నవి. అవినీకుఁ గానవచ్చును. చూడుము. 319

సీ. వలనొప్పన్=స్పష్టముగా, అఖిలజీవులయందున్=సమస్త ప్రాణు లందును, నలినగర్భ=బ్రహ్మదేవా, భవదీయదోషములు=నీ సమస్త దోషము లును, భూతేంద్రియాశయ విరహితమైన=భూతములు, ఇంద్రియములు, మనస్సు - వీనినుండి విడివడినదై, విశుద్ధమైన=పరిశుద్ధమైనట్టి, విమలాంత రాత్ముఁడను=అంతర్యామి స్వరూపుఁడను. ఐన నన్నున్=ఐనట్టి నన్ను, ఏకముగన్=కేవలముగ, చూచునరుఁడు, భాసిలున్=ప్రకాశించును. వివిధ కర్మాను రూపపద్ధతులన్=అనేక విధములైన జీవాదృష్టము యొక్క పద్ధతులకుఁదగినట్లుగా.

తాత్పర్యము : ఓ బ్రహ్మదేవా ! సమస్త జీవులందున్న వాఁడను నేనే. ఇట్లుగాఁ దలఁచి నన్ను సేవింపుము. అప్పుడు నీ కే పాపము లంటవు. భూతములు, ఇంద్రియములు, మనస్సు- వీనినుండి సంబంధము వద లుకొన్నదై పరిశుద్ధమైన జీవుని యాత్మయందు నే నంతరాత్మగాఁ బ్రకాశించుచున్నాను. ఇట్లుగా నన్నుఁ దెలియువాఁడు ఖండితముగ మోక్షమునందును. నీ వికమీఁద వివిధములైన జీవుల కర్మల ననుసరించి నీచోచ్చభావములతో సృష్టి నొనర్పఁ బోదువు. నీమనస్సు నిరంతరము. నాపదాంబుజములందు లగ్నమై యుండుటచే సృష్టికార్యములతో నేర్పడెడు రజోగుణము నిన్నంటలేదు. 320

కం. ప్రాణులకున్=జీవులకు, ఎఱుగంగన్‌రాని యనఘుఁడన్ = కనపడనట్టి నేను, తేజోధనుఁడన్=తేజమే ధనముగాఁగల వాఁడను.

తాత్పర్యము : అందరియందు నే నంతర్యామిగా నుందును. కాని ప్రతియొక్కరును నన్నుఁగనలేరు. వారిహృదయములు పరిశుద్ధములు గాకుండుటయే కారణము. అట్టినేను నీచే నిప్పుడు గనుఁగొనఁబడినాను.321

వ. భూతేంద్రియగుణాత్మ్మండనియున్=భూతములు, సత్త్వాది గుణములు, ఇంద్రియములు, అహంకారము - వీనిచేఁగూడికొన్న వాఁడు, జగత్+ మయుడు=లోకస్వరూపుఁడు, తామరసనాళము=పద్మనాళము, వివరపథము=రంధ్రముయొక్క మార్గము. 322

తాత్పర్యము : బ్రహ్మదేవా ! భూతములు, ఇంద్రియములు, సత్త్వాది గుణములు - వీనినన్నిటిని నన్నుఁగా నెఱుంగుము. లోకస్వరూపుఁడను నేనే. పద్మనాళమూలమున జలములలోనికిఁ జొరఁబారి యచ్చటను బయటను నీవు నన్నుఁ జూడఁగోరితివి. కాని -

కం. నాకులు=స్వర్గవాసులు, ఉరగపతి=శేషుఁడు, పినాకి=శివుఁడు, వాక్రువ్వన్=మాటలతోఁ జెప్పుటకును, తలపోయనున్ = చింతించుటకు నున్, రాకుండు=సాధ్యముగానటి, మదీయరూపరమ్యత్వంబు = నా రమ్యమైనరూపము, నీకున్ ఇప్పుడున్, కానంబడియెడిన్.

తాత్పర్యము : నీ తపస్సుతోఁ బ్రీతుఁడనై నేను నాస్వరూపమును జూపితిని. దేవతలు శేషుఁడు ఈశ్వరుఁడు - ఎవ్వరేఁగాని నా స్వరూపము మాటలతోఁ జెప్పలేరు, మనస్సుతోఁ దెలుపలేరు. 323

కం. పంకజజన్మా=బ్రహ్మదేవా! కావునన్, మత్చారిత్ర కథావిలసితము=నాచరిత్రము, కథలు వీనిచేఁ గూడిన, సుమహితస్తవము=గొప్ప స్తోత్రమును, విగతసంశయభావుఁడవై=ఏ మాత్రమును సందేహము లేనివాఁడవై, బుద్ధిన్ నిలుపుము=మనసున నుంచుము. 324

తాత్పర్యము : నీ విప్పు డొనర్చిన స్తోత్రము నా పవిత్రములైన కథలతో చరిత్రలతోఁ గూడికొన్నది. సంశయములు వదలి దీనిని నిరంతరము నీ మనస్సున నిలిపికొనుము.

కం. లీలార్థము=లీలకొఱకు, సగుణుఁడనై=సత్త్వాదులు స్వీకరించిన వాఁడనై, అగుణునిగాన్=నిర్గుణునిగా, తామరసభవ=తామరయందు బుట్టిన వాఁడా!

తాత్పర్యము : నేను గుణాతీతుఁడను. లోకములను సృష్టించుటకై సత్త్వాదులను గ్రహించితిని. ఈ రహస్యము నీ వెఱిఁగి నన్ను నిర్గుణునిగనే స్తుతించితివి. మనస్సునకు సంతోషమైనది. 325

కం. ఈ మంజుస్తవరాజము=అందమైన యీ స్తోత్రమును, ధీమహిత= బుద్ధితో గొప్పవాఁడా!, కామించిన కోర్కులు=కోరిన కోరికలు.

తాత్పర్యము : అందమైన నీ స్తోత్రము నీ బుద్ధిలో నిలిపికొనుము. దీనితో సర్వకామములును సిద్ధించును. 326

కం. అనుదినమునున్, త్రిజగత్పావనము=మూడులోకములను బవిత్రముగా నొనర్చునది, పఠియింపన్=చదివినను, నే, పొడఁగనఁబడుదున్ = నేను గన్పింతును.

**తాత్పర్యము** : ఈ స్తోత్ర మనుదినమును బఠించువారలపై నా యనుగ్రహ మేర్పడును. వారియన్ని కోరికలును దీర్తును. "సర్వకామ వరేశ్వరః" - అవాప్త సకలకాముఁడని తెనుఁగు. ఈ రెంటికిని బొత్తు కుదురుట లేదు. 327

తే. వనము లేర్పఱచుట, చెరువులు ద్రవ్వించుట, వివాహములు, ఉపనయనములు సేయించుట, గుడులు గట్టించుట, భూదానము, తపము, వ్రతములు - వీనితో నేర్పడెడు ఫల మీ స్తోత్రమును బఠించిన దానితో సమానము గాదు. దీనికి మూలము - "**పూర్తేన తపసా యజ్ఞైః దానైర్యోగైః స్సమాధినా | రాద్ధం నిశ్రేయసం పుంసాం మత్ప్రీతిస్తత్త్వవిన్మతమ్**" - అని కలదు. యజ్ఞయాగాది సర్వములకును నాప్రీతియే పరమఫలమని యర్థము. తెనుఁగులోని యర్థము భిన్నముగ నున్నది. 328

కం. ప్రియవస్త్వావళిలోపలన్=ప్రియములైన వస్తువులలో -

**తాత్పర్యము** : జీవులను సృష్టించుచు, జీవులలో నంతర్యామినై యుందును. ప్రియములైన వస్తువులకంటెను బ్రియుఁడను. నన్ను నిరంతరము భజింపుము.

కం. భువనకారణ=ప్రపంచోత్పత్తికిఁ గారణమైన వాఁడా! నిశ్చలగతిన్=స్థిరముగా.

**తాత్పర్యము** : భువననిర్మాణమునకై నిన్నుఁ బుట్టించితిని. భువనములన్నియు నాలో సూక్ష్మభూతములుగ నుండనే యున్నవి. నా ప్రీత్యర్థమై వానిని భావించికొమ్ము. యథాపూర్వముగ నీకు గోచరించును. 330

తే. అహంకారమూల తత్త్వంబున్=అహంకారమనుతత్త్వమును. రాజీవభవుఁడు=బ్రహ్మ, అంతర్హితుఁడయ్యెన్=కన్ను మరగి పోయెను.

**తాత్పర్యము** : బ్రహ్మదేవా! నాయానతితో మూలతత్త్వమైన యహంకారమును గ్రహింపుము. గ్రహించి భూతములను సృష్టింపుము. ఇట్లు బ్రహ్మకు బోధించి విష్ణు వంతర్హితుఁడయ్యెను. 331

**ఇది పుట్టపర్తినారాయణదాసవిరచిత**

**భాగవతసుధాలహరిలో నవమాధ్యాయము.**

# దశమోఽధ్యాయః

విదుర ఉవాచ

అంతర్హితే భగవతి బ్రహ్మా లోకపితామహః,
ప్రజాః స్ససర్జ కతిధా దైహికీ ర్మానసీ ర్విభుః. 1

యే చ మే భగవన్ పృష్టా స్త్వమద్ధా బహువిత్తమః,
తాన్ వదస్వాఽఽనుపూర్వ్యేణ ఛింధి న స్సర్వసంశయాన్ 2

శ్రీశుక ఉవాచ

ఏవం సంబోధిత స్తేన క్షత్త్రా కౌషారవో మునిః,
ప్రీతః ప్రత్యాహ తాన్ ప్రశ్నాన్ హృదిస్థానేవ భారత 3

మైత్రేయ ఉవాచ

విరించోఽపి తథా చక్రే దివ్యం వర్షశతం తపః,
ఆత్మ న్యాత్మాన మావేశ్య యథాఽఽహ భగవా నజః 4

త ద్విలోక్యాబ్జసంభూతో వాయునా యదధిష్ఠితః,
పద్మ మంభశ్చ తత్కాల కృతవీర్యేణ కంపితమ్. 5

తపసా హ్యేధమానేన విద్యయా చాత్మసంస్థయా,
వివృద్ధ విజ్ఞానబలో న్యపాద్వాయుం సహాంభసా. 6

తద్విలోక్య వియద్వ్యాపి పుష్కరం యదధిష్ఠితః
అనేన లోకాన్ ప్రాగ్లీనాన్ కల్పితాఽస్మీ త్యచింతయత్ 7

పద్మకోశం తదావిశ్య భగవత్కర్మచోదితః,
ఏకం వ్యభాంక్షీ దురుధా త్రిధా భావ్యం ద్విసప్తధా 8

ఏతావాన్ జీవలోకస్య సంస్థాభేద స్సమాహృతః,
ధర్మస్య హ్యనిమిత్తస్య విపాకః పరమేష్ఠ్యసౌ. 9

విదుర ఉవాచ

యదాత్థ బహురూపస్య హరే రద్భుత కర్మణః,
కాలాఖ్యం లక్షణం బ్రహ్మన్ యథావర్ణయ నః ప్రభో ! 10

మైత్రేయ ఉవాచ

గుణవ్యతికరా కారో నిర్విశేషోఽప్రతిష్ఠితః,
పురుష స్తదుపాదాన మాత్మానం లీలయాఽసృజత్. 11

విశ్వం యద్ర బ్రహ్మ తన్మాత్రం, సంస్థితం విష్ణుమాయయా,
ఈశ్వరేణ పరిచ్ఛిన్నం కాలేనాఽవ్యక్తమూర్తినా. 12

యథేదానీం తథాఽగ్రే చ పశ్చాద ప్యేత దీదృశమ్,
సర్గో నవవిధ స్తస్య ప్రాకృతో వైకృతశ్చ యః. 13

కాల ద్రవ్యగుణై రస్య త్రివిధః ప్రతిసంక్రమః,
ఆద్యస్తు మహత స్సర్గో గుణవైషమ్య మాత్మనః. 14

ద్వితీయ స్త్వహమో యస్తు ద్రవ్యజ్ఞానక్రియాత్మకః,
భూతసర్గ స్తృతీయస్తు తన్మాత్ర ద్రవ్యశక్తిమాన్. 15

చతుర ఐంద్రియస్సర్గో యస్తు జ్ఞానక్రియాత్మకః,
వైకారికో దేవసర్గః పంచమో యన్మయం మనః. 16

షష్ఠస్తు తమస స్సర్గో, యస్త్వబుద్ధికృతః ప్రభోః,
షడిమే ప్రాకృతాః సర్గా వైకృతా నపి మే శృణు. 17

రజోభాజో భగవతో లీలేయం హరిమేధసః,
సప్తమో ముఖ్యసర్గస్తు షడ్విధ స్తస్థుషాం చయః. 18

వనస్ప త్యోషధిలతా స్త్వక్సారా వీరుధో ద్రుమాః,
ఉత్స్రోతస స్తమః ప్రాయా అంతస్స్పర్శా విశేషిణః. 19

తిరశ్చా మష్టమస్సర్గస్సోఽష్టావింశద్విధో మతః,
అవిదో భూరితమసో ఘ్రాణజ్ఞా హృద్యవేదినః. 20

గౌ రజో మహిషః కృష్ణ స్సూకరో గవయో రురుః,
ద్విశఫాః పశవ శ్చైత అవిరుష్ట్రశ్చ సత్తమ! 21

ఖరోఽశ్వోఽశ్వతరో గౌర శ్శరభ శ్చమరీ తథా,
ఏతే చైకశఫాః క్షత్తః శృణు పంచనఖాన్ పశూన్. 22

శ్వా సృగాలో వృకో వ్యాఘ్రో మార్జార శ్శశ శల్యకాః
సింహాః కపి ర్గజః కూర్మో గోధా చ మకరాదయః. 23

కంక గృధ్రబక శ్యేన భాజభల్లూక బర్హిణః,
హంససారస చక్రాహ్వా కాకోలూకాదయః ఖగాః. 24

అర్వాక్స్రోతస్తు నవమ స్సర్గ ఏక విధో నృణామ్,
రజోఽధికాః కర్మపరా దుఃఖే చ సుఖమానినః. 25

వైకృతాస్త్రయ ఏవైతే దేవసర్గశ్చ సత్తమ,
వైకారికస్తు యః ప్రోక్తః కౌమారస్తూభయాత్మకః. 26

దేవసర్గశ్చాష్టవిధో విబుధాః పితరోఽసురాః,
గంధర్వాప్సరస స్సిద్ధా యక్షరక్షాంసి చారణాః. 27

భూతప్రేతపిశాచాశ్చ విద్యాధ్రాః కిన్నరాదయః,
దశైతే విదురాఖ్యాతా స్సర్గా స్తే విశ్వసత్కృతాః. 28

అతః పరం ప్రవక్ష్యామి వంశాన్ మన్వంతరాణి చ,
ఏవం రజః ప్లుత స్స్రష్టా కల్పాదిష్వాత్మ భూ ర్హరిః. 29

సృజత్యమోఘసంకల్ప ఆత్మైవాఽఽత్మాన మాత్మనా,
గుణవ్యత్యయ ఏతస్మి న్మాయావిత్వా ద్దధీశితుః. 30

న పౌర్వాపర్య మిచ్ఛంతి నద్యాం భ్రామ్యద్ర ఛమేరివ,
దేవాసురాదయః క్షత్తః కల్పేఽస్మిన్ యే ప్రకీర్తితాః,
త ఏవ నామరూపాభ్యాం ఆస న్మన్వంతరాంతరే. 31

అర్థములు :

1. శ్లో. భగవతి=అంతర్హితే=భగవంతుఁడంతర్హితుఁడు కాఁగా, విభుః, సర్వసమర్థుఁడైన, లోకపితామహః=లోకముల కాదిపితయైన బ్రహ్మదేవుఁడు, దైహికీం=దేహమునుండి యుద్భవించినవియు, మానసీః=మనస్సునుండి జన్మించినవియు నైన, కతిధాః ప్రజాః=ఎన్నెన్ని విధములైన ప్రజలను, ససర్జ=సృష్టించెను.

తాత్పర్యము : విదురుఁడడుగుచున్నాఁడు. పదియవ యధ్యాయమందు విదురునకిచ్చుచున్నవాఁడై మైత్రేయుఁడు పదివిధములైన సృష్టిభేదములను వివరించుచున్నాఁడు. ఓ విదురా ! జ్ఞానస్వరూపుఁడైన నారాయణమూర్తి బ్రహ్మదృష్టినుండి యంతర్హితుఁడైన తర్వాత సర్వలోకములకును నాదిపిత యైన బ్రహ్మ దేహమునుండి మనస్సునుండి యెన్ని విధములైన సృష్టులను గావించెను?

2. శ్లో. బహువిత్తమః=సర్వజ్ఞుఁడ వైనవాఁడా! భగవన్, త్వయి=నీ యందు, యే అర్థాః=ఏ విషయములు, మే=నాచేత, పృష్టాః=అడుగఁబడినవో, వానినన్నిటిని, అనుపూర్వ్యేణ=క్రమముగా, వదస్వ=చెప్పుము, నః=మా యొక్క, సర్వసంశయాన్=సకలసంశయములను, ఛింది=నశింపఁజేయుము.

తాత్పర్యము : ఓ సర్వజ్ఞుఁడవైన మైత్రేయా ! నే నింతకుముందు నిన్నే యే ప్రశ్న లడిగితినో వానియన్నిటికిని క్రమముగా నుత్తరముల నొసఁగి నా సంశయములను నశింపఁజేయుము.

3. శ్లో. తేన క్షత్త్రా=ఆ విదురునిచే, ఏవం=ఈ విధముగా, సంబోధితః= అడుగఁబడిన, కౌషారవః మునిః=మైత్రేయుఁడు, ప్రీతః=సంతుష్టుఁడై, భార్గవ!=ఓ శౌనకుఁడా! హృదిస్థాన్=హృదయమందున్న, తాన్ ప్రశ్నాన్=ఆ ప్రశ్నలను గూర్చి, ప్రత్యాహ=బదులువల్కెను.

తాత్పర్యము : సూతుఁడన్నాఁడు. ఓ శౌనకమునీ ! విదురునిచే నీ రీతిగా పృచ్ఛింపఁబడిన శౌనకముని హృదయస్థితములైన విదురుని ప్రశ్నల కుత్తరము లారంభించినాఁడు.

4. శ్లో. అజః=జన్మాది రహితుఁడైన, భగవాన్=నారాయణుఁడు, యత్ అహ=దేనిని పలికెనో, విరించః అపి=బ్రహ్మయును, ఆత్మని=పరమాత్మ యందు, ఆత్మానం=మనస్సును, ఆవేశ్య=స్థిరముగా నిల్పుకొని, దివ్యం వర్షశతం=నూరుదివ్య వర్షములు, తథా తపశ్చక్రే=ఆ రీతిగాఁదప మొనర్చెను.

తాత్పర్యము : మైత్రేయుఁ డన్నాఁడు. జన్మాది వికారములు లేక నిత్యానందస్వరూపుఁడైయున్న నారాయణమూర్తి యుపదేశించిన పద్ధతి ననుసరించి బ్రహ్మ పరమాత్మయం దేకాగ్రమగు మనస్సుంచి నూరు దివ్య వర్షములు తపించెను.

5,6. శ్లో. అబ్జసంభూతః=బ్రహ్మ, యత్ అధిష్ఠితః=దేనియందధి వసించి యుండెనో, తత్పద్మం అంభః చ=ఆ తామరయు జలమును, తత్కాల కృత వీర్యేణ=ఆకాలమం దేర్పడిన శక్తితోఁగూడిన, వాయునా=గాలిచేత, కంపితం =చలిత మైనదానినిగా, విలోక్య=చూచి, ఏధమానేన=వృద్ధిని బొందుచున్న, తపసా=తపశ్శక్తిచేతను, ఆత్మసంస్థయా=తన యాత్మ యందున్నట్టి,

విద్యయా చ=ఉపాసనచేతను, వివృద్ధవిజ్ఞాన బలః=అభివృద్ధి చెందిన విజ్ఞానబలముతోఁ గూడినవాఁడై, అంభసా సహ=జలములతోఁ గూడ, వాయుం=వాయువును, న్యపాత్=త్రాగెను.

తాత్పర్యము : బ్రహ్మ కధిష్ఠానమైన పద్మమును, దాని కాధారమైన జలమును కల్పకాలమం దేర్పడిన గొప్పశక్తితోఁగూడిన వాయువుచేత వేగముగాఁ జలితము లగుచుండెను. బ్రహ్మ వానిని జూచినాఁడు. తా ననుష్ఠించిన తపముచేతను, అనుసరించిన యుపాసనచేతను గొప్పబలము గలిగిన గొప్పవిజ్ఞాన శక్తితోఁగూడిన బ్రహ్మ ఆ కారణ జలమును వాయువును దన యంతర్భాగమం దణఁచికొన్నాఁడు.

7. శ్లో. యత్ అధిష్ఠితః=దేని నధిష్ఠించెనో, తత్పుష్కరం=ఆ తామరను, వియద్వ్యాపి=ఆకాశమందు వ్యాపించియున్న దానినిగా, విలోక్య=చూచి, ప్రాక్లీనాన్=ముందే లయించియున్న, లోకాన్=లోకములను, అనేన= దీనితో, కల్పితాస్మి ఇతి=కల్పింతు నని, అచింతయత్=విచారించెను.

తాత్పర్యము : జలము లేనప్పుడు తా నధివసించియున్న తామర యొక్కటే యిప్పుడు మిగిలియున్నది. ఆపద్మ మాకాశమంతయు నావరించి యున్నది. అది యంత పెద్దదిగా నుండెను. అంతకు ముందే లోకములన్నియు నీ తామర యందు లీనములై యున్నవి. దీనినుండి నేను లోకములను సృజింతునని బ్రహ్మ నిశ్చయించికొన్నాఁడు.

8. శ్లో. భగవత్కర్మచోదితః=భగవత్కార్యమందుఁ బ్రేరేపింపఁబడిన బ్రహ్మ, తదా=అప్పుడు, పద్మకోశం=ఆ తామరమొగ్గను, ఆవిశ్య=ఆవేశించి, ద్విసప్తధా=పదునాలుగను, బహుధా=అనేకరీతులుగను, భావ్యం=ఏర్పడు టకు యోగ్యమైన, ఏకం=ఒక్కటైన యా పద్మమును, త్రిధా=మూఁడుగా, వ్యభాంక్షీత్=విభాగించెను.

తాత్పర్యము : నారాయణమూర్తి నిర్వహింపవలసిన లోకసృష్టి కార్యమును దన్నొనర్పుమని భగవంతుఁడాదేశించినాఁడు. అపు డాతఁడు ఆ పద్మకోశమును మూఁడుగా విభాగించెను. ఆ తామర యెంతయో పెద్దది. దానిని మరల పదునాల్గుభాగము లొనర్చినాఁడు. అంతతోఁ బోక యనేకముగ విభాగించెను.

9. శ్లో. జీవలోకస్య=జీవలోకముయొక్క, సంస్థాభేదః=రచనా విశేషము, ఏతావాన్=ఇంతమాత్రముగా, సమాహృతః=చెప్పఁబడినది, అసౌ పరమేష్ఠీ అనిమిత్తస్య=నిష్కామముగా ననుసరించిన, ధర్మస్య=ధర్మము యొక్క, విపాకః=పరిపాకము.

తాత్పర్యము : జీవలోకముల భోగస్థానములు ఈ మూఁడు లోకముల యం దంతర్భూతములై యున్నవని పెద్ద లందురు, ఈ రీతిగా సకలజీవుల

కును సుఖదుఃఖముల నొసఁగుటలోఁ బర్యాప్తమైన యీ త్రిలోక నిర్మాణ సామర్థ్యము బ్రహ్మ కెట్లు సిద్ధించినది? నిష్కామముగా భగవంతుని ప్రసన్నత కొఱకె తెలియఁబడిన ధర్మముయొక్క ఫలపరిపాకమే నిష్కామోపాస్తికిఁ బ్రతీకయై, బ్రహ్మదేవుఁడు దానితో త్రిజగన్నిర్మాణ సామర్థ్యము బ్రహ్మకు భగవదనుగ్రహముచే నేర్పడినది.

10. శ్లో. అద్భుతకర్మణః=అద్భుతములైన కర్మ లొనర్చు వాఁడును, బహురూపస్య=అనేకరూపములుగా భాసించు వాఁడును నైన, హరేః=హరియొక్క, కాలాఖ్యం=కాలమను పేరుగల, లక్షణం=స్వరూపమును, ఆత్తయత్=ఏమని చెప్పితివో, బ్రహ్మన్=మాకొఱకు, యథావర్ణయ=అర్థమగునట్లు వివరింపుము.

తాత్పర్యము : విదురుఁడన్నాఁడు మైత్రేయా! కాలమునుగూర్చి, అక్కడక్కడ కొద్దిగా వివరించితిని. దానితోఁ గాలస్వరూపము సమగ్రముగాఁ దెలియలేదు. దానిస్వరూపమును స్పష్టపఱుపుము. ఓ మునీ! భగవంతుఁ డద్భుత కార్యము లొనర్చువాఁడు. అనంత స్వరూపము లున్నవాఁడు. అతనియొక్క కాలమనుస్వరూపమును గూర్చి స్పష్టముగా లక్షణమునకు నిర్వచన మివ్వవలెను.

11. శ్లో. గుణ వ్యతికరాకారః=గుణముల సమ్మేళనము నిమిత్తముగా నాకృతిని దాల్చినదియు, నిర్విశేషః=విశేషము లేనిదియు, అప్రతిష్ఠితః=పర్యవసానముతోఁగూడనదియు, పురుషః=పురుషుఁడు, తదుపాదానం=దానియుపాదానముతోఁగూడిన, ఆత్మానం=తన్ను, లీలయా=లీలగా, అసృజత్=సృష్టించెను.

తాత్పర్యము : విదురునిచే నిట్లడుగఁబడిన మైత్రేయుఁడు కాలముయొక్క సామాన్యరూపమును జెప్పుచున్నాఁడు. విశేషరూపమును మఱియొకసారి చెప్పును. సత్త్వాదిగుణములు దమసామాన్యావస్థలపేక్షించి యొకదానితో నొకటి చేరుటకుఁ గారణ మేదియో దానినే కాలమందురు. గుణముల వైషమ్యములకుఁ గాలము గారణమగుటతో దాని ననుమానింపవలసినదే గాని ప్రత్యక్షముగాఁ జూచుటకు వీలుకాదు. ఇంద్రియములచేఁ దెలిసికొన యోగ్యమైన విశేషము కాలమందు లేదు. అందుచేత దానికవసానమును లేదు. అవసానము లేకుండుటచే నాదియును లేదు. ఆద్యంతరహితమైన దానిని నిమిత్తకారణముగా స్వీకరించిన యీశ్వరుఁడు దన్నే విశ్వరూపముగా సృష్టించికొన్నాఁడు. లోకములసృష్టికిఁ గారణమని చెప్పుటకు వేఱు పదార్థము లేకుండుటచేఁ - గాలమే యుపాదానకారణమని చెప్పవలెను.

12. శ్లో. విష్ణుమాయయా=విష్ణువుయొక్క మాయచేత, సంస్థితం=సంహరింపఁబడిన, విశ్వం=లోకము, బ్రహ్మతన్మాత్రం=బ్రహ్మ స్వరూపమైన,

ఈశ్వరేణ=ఈశ్వరునిచేతను, అవ్యక్తమూర్తినా=అవ్యక్త మూర్తి యైన, కాలేన=కాలముచేత, పరిచ్ఛిన్నం=వేఱుగాఁబ్రకాశింపఁజేయఁబడినది.

తాత్పర్యము : ఈశ్వరుని సంకల్పమైన మాయాశక్తిచే సంహరింపఁబడిన. బ్రహ్మస్వరూపము లోకము, సద్రూపముగా నుండెను. ఈ శ్వరుఁడనెడుకర్త, కాలమను నుపాదానకారణముతో సద్రూపముగానున్న విశ్వమును బ్రహ్మతత్త్వమునుండి భిన్నమైన దానినివలెఁ బ్రకాశింపఁజేసినాఁడు. కాలస్వరూప మవ్యక్తము. ఇంద్రియగ్రాహ్యము గాదు.

13. ఏతత్=ఇది, ఇదానీం యథా=ఇప్పు డెట్లున్నదో, అగ్రేచ తథా=భావిలోఁగూడ నట్లే యుండును. పశ్చాచ్చ=ఇంతకుముందును, ఈదృశం=ఈప్రకారమే, సృష్టిః=సృష్టి, నవవిధః=తొమ్మిదిరీతులు, యః=ఏది, ప్రాకృతః=ప్రకృతికార్యమో, వైకృతః=వికృతికార్యమో, అస్య=దీనిని, ప్రతిసంక్రమః=ప్రళయము, కాలద్రవ్యగుణైః=కాలద్రవ్యగుణములచేత, త్రివిధః=మూఁడు రీతులు,

తాత్పర్యము : కాల మాద్యంతములు లేనిదని చెప్పినాఁడు. కాలము నుండి యేర్పడెడు కార్యస్వరూపమైన విశ్వముగూడ నాద్యంతములు లేనిదే. ఈ లోకమిప్పు డెట్లు గన్పించుచున్నదో ప్రళయమునకుముందుఁగూడ నట్టే యుండెను. తదనంతరము గూడ నట్టేయుండును. విశ్వము నిత్యమైనది, దీని సృష్టి తొమ్మిదిరీతులు. ప్రాకృతవైకృతులని మొదలు రెండు భేదములు. తరువాత ప్రాకృతసృష్టిలో నాఱురీతులు. వైకృతసృష్టిలో మూఁడు భేదములు. ప్రాకృతవైకృతములుగా మాఱిన యేదిగలదో ఉభయాత్మకమైన యది ప్రత్యేకముగా నొక్కభేదము గలది. ఇట్లుగా నీ విశ్వము పదిరీతులు. ప్రళయము మూఁడు విధములు. కాలముతో నేర్పడు నాశము, ద్రవ్యముతో నేర్పడు నాశము, గుణకృతమైన వినాశము. కాలముతో నగునది నిత్య ప్రళయము. ద్రవ్యము అనఁగా అగ్న్యాదులు, వీనితోడిది నైమిత్తిక ప్రళయము. గుణములతో నేర్పడునది ప్రాకృతిక ప్రళయము.

14. శ్లో. ఆత్మనః=ఆత్మనుండి, గుణవైషమ్యం=విషమావసను ప్రాప్తించిన మూఁడుగుణములు కారణముగా ప్రకృతికేర్పడిన వికారభేదము, మహతః= మహత్తత్త్వముయొక్క, సర్గః=ప్రకాశము, ఆద్యః=మొదటిది, అహమః=అహంకారముయొక్క సర్గము, ద్వితీయః=రెండవది, యత్ర=దేని యందు, ద్రవ్యజ్ఞానక్రియోదయః=ద్రవ్యములయొక్కయు జ్ఞానేంద్రియ కర్మేంద్రియముల యుత్పత్తి.

తాత్పర్యము : పదివిధములైన సృష్టులను విస్తరించుచున్నాఁడు. పరమాత్మనుండి కాలశక్తి నిమిత్తముగా సత్త్వాదిగుణములకు సామ్యావస్థ దప్పినది. ఒకదానితో నొకటి చేరినది. ఆ చేరుటతోఁగల్గిన ప్రకృతికేర్పడిన

వికారమే మొదటిసర్గము. దీనికి మహత్తత్త్వమని పేరు. కనుక మహత్తత్త్వము యొక్క యుత్పత్తి మొదటి సర్గము. రెండవదైన ప్రకృతి వికారమునకు అహంకారతత్త్వమని పేరు. దీని నహంకారసృష్టియని పిలుతురు. దీని నుండియే పంచభూతములును జ్ఞానేంద్రియ కర్మేంద్రియములును నేర్పడినవి.

15. శ్లో. ద్రవ్యశక్తి మాన్=ద్రవ్యములను జనింపఁజేయుశక్తి గలిగిన, తన్మాత్రాః=శబ్దాదులెదు, యః తు=ఏదగునో, అది, తృతీయః=మూఁడవదైన, భూతసర్గః=భూతసర్గము, జ్ఞానక్రియాత్మకః=జ్ఞానము ప్రవృత్తి ఈ రెంటిని గల్గించు, ఐంద్రియః సర్గః=ఇంద్రియ సర్గము, చతుర్థః=నాల్గవది.

తాత్పర్యము : శబ్దాదు లైదింటికి తన్మాత్రలని పేరు. వీనినుండి ఆకాశాదిభూతము లేర్పడెను. ఆకాశాది ద్రవ్యములకు భూతములని సామాన్యనామధేయము. భూతసృష్టి మూఁడవది, నేత్రాదీంద్రియముల ద్వారా, రూపాదిజ్ఞాన మేర్పడును. వాగాదులతో వచనాదు లుండును. ఈ రీతిగా జ్ఞానకర్మల కాధారమైన యింద్రియసృష్టి నాలవది. వైకారికః=సాత్త్వికాహంకారమునుండి యేర్పడెడు, దేవసర్గః=దేవసృష్టి, పంచమః=ఐదవది, మనః=మనస్సు, యన్మయం=దీనిస్వరూపమే, అబుద్ధికృతః=ఆవరణముతోఁగూడినట్టి, తమసః=తమోగుణముయొక్క, సర్గః=సర్గము, షష్ఠః=ఆఱవది.

తాత్పర్యము : అహంకారము మూఁడు విధములు. సత్త్వగుణ ప్రధానమైన యహంకారమే యింద్రియాభిమానులైన దేవతల సర్గము. దానికి సంబంధించినదే మనస్సు. ఈ సర్గ మైదవది. జీవులకు స్వరూపావబోధము లేకుండఁజేసెడు అవిద్యా సృష్టి ఆఱవది, భగవంతుని యనుగ్రహముతో నీకీ యవిద్యయంటలేదు. అందుకే ప్రభో! అని సంబోధన.

17. శ్లో. ఇమేషట్=ఈ యాఱును, ప్రాకృతాః=ప్రకృతినుండి యేర్పడెడు, సర్గాః=సృష్టులు, వైకృతాన్ అపి=వైకృతములుగూడ, మే=నానుండి, శ్రుణు=వినుము, రజోభాజః=రజోగుణము ననుసరించి యున్నవి, హరిమేధసః=హరించి పోయెడి స్వభావము గలవియైన, భగవతః= భగవంతుని యొక్క, ఇయం లీలా=ఇదిలీలా మాత్రము.

తాత్పర్యము : పైనిఁజెప్పిన యాఱుసర్గములును సంకల్ప మాత్రముతో ప్రకృతినుండి భగవంతుఁ డేర్పఱచిన సర్గములు. సమష్టివికారస్వరూపమయ్యును రజోగుణ మంగీకరించియున్నను జీవుల సంసారక్లేశములను బరిహరించుటకు నిశ్చయించికొన్న బ్రహ్మదేవుని లీలారూపములైయున్న సర్గములను వివరింతును వినుము.

శ్లో. ముఖ్యసర్గస్తు=భక్ష్యపదార్థ సృష్టి, సప్తమః=ఏడవది, తస్థుషాం=స్థావరముల యొక్క, యః=ఏ సర్గము గలదో అది, షడ్విధః=ఆఱురీతులు.

వనస్పత్యోషధీ లతాః=వనస్పతులు, ఓషధులు, లతలు, త్వక్ సారాః =బలముండిన చర్మముగల, వీరుధః=కందములు, ద్రుమాః=చెట్లు మొదలైనవి.

తాత్పర్యము : ఏడవది - భక్ష్యపదార్థముల సృష్టి, దీనికి స్థావర సృష్టి యనియు పేరు. ఇది యాఱురీతులు, పూలులేక ఫలించునవి వనస్పతులు, మొలచి పుష్పించి - ఫలించినప్పుడు - నశించునవి ఓషధులు, వరి - గోధుమ మొదలైన ధాన్యములు, వీనిలోఁజేరును, బలమున్న వేఱుదాని నాశ్రయించి బ్రదుకునవి లతాదులు. బలముగల తోలున్నవి - కందమూలాదులు, వీనికి వీరుధములని పేరు, పుష్పించి - ఫలించునవి ద్రుమములు, ఈ రీతిగా స్థావరము లాఱువిధములు.

19. శ్లో. ఉత్+స్రోతసః=పైభాగమునకు వ్యాపించెడు, ఆహార సంచారము గలవి. తమస్+ప్రాయః=అవ్యక్తమైన చైతన్యము గలవి, అంతస్స్పర్శాః=అంతర్భాగమందు స్పర్శనాబోధగలవి, విశేషిణః=బహువిధ విశేషములతోఁగూడినవి. తిరశ్చాంసర్గః=తిర్యక్కుల సృష్టి, అష్టమః=ఎనిమిదవది, సః=అది, అష్టావింశద్విధః=ఇఱువదియెనిమిది రీతులుగా, మతః =నిర్ణీతము.

తాత్పర్యము : తిర్యక్సర్గము భక్షణ పదార్థమును క్రిందినుండి ముఖముద్వారా పైకిఁదీసికొనును. వాని చైతన్య మవ్యక్తము. స్పర్శజ్ఞానము మాత్రమే వాని కున్నది. ఆ వరములో ననేక భేదములు, ఈ తిర్యక్సర్గ మెనిమిదవది. ఇది యిఱువది యెనిమిది రీతులు.

20. శ్లో. అవిదః=జ్ఞానములేని, భూరితమసః=ఎక్కువ అజ్ఞానము గలవి, ఘ్రాణజ్ఞాః=వాసనఁజూచి తెలియునవి. హృద్యవేదినః=దీరానుసంధానము లేనివి, గౌః=ఆవు, అజః=మేక, మహిషః=దున్న, కృష్ణః =కృష్ణమృగము, సూకరః=పంది, గవయః=పశువువలెనే యుండు నొకయరణ్య మృగము, రురుః=ఎక్కువ కొమ్ములుగల జింకవంటి జాతి.

తాత్పర్యము : వానికి నేడు రేపు మొన్న యను జ్ఞానములేదు. ఆహారాదులే వానిధర్మము. తద్భిన్నమైన జ్ఞానము లేదు. సాధారణముగా క్రోధ స్వభావము గలవి. ఇష్టమైన పదార్థమును వాసనచూచి తెలిసికొనునవి. సుఖదుఃఖాదుల జ్ఞానము వానికి చాలకాలముండదు. ఆవు మేక మొదలైన వీ జాతిలోనివే.

21. శ్లో. ద్విశఫాః=రెండుగిట్టలు గలిగిన, అవిః=గొఱ్ఱె, ఉష్ట్రః=ఒంటె, ఖరః=గాడిదె, అశ్వః=గుఱ్ఱము, అశ్వతరః=కంచరగాడిద, రెండు గొరిజలు గలవి. మఱికొన్ని జంతువులు గాడిద, గుఱ్ఱము మొదలైనవి. వీనియందు మనుష్యుఁడు కరుణ గలిగి యుండవలెనని భగవంతుని నిర్ణయము.

22. శ్లో. ఏతే=వీనిలో, ఏకశఫాః=ఒకటే గొరిజ గలవి కొన్ని యున్నవి, పంచనఖాః=ఐదుగోళ్లుగల, పశూన్ శ్రుణు=జంతువులను వినుము,

శ్వా=కుక్క, సృగాలః, వృకః, వ్యాఘ్రః, మార్జారః, కుందేలు, ముండపంది మొదలైనవి, పై శ్లోకములోని గాడిద మొదలు చమరీమృగము వరకున్నవి ఏకశఫమృగములు. ఐదుగోళ్లుగల జంతువులలో కుక్క పులి మొదలైనవి చేరును.

23. శ్లో. సింహము, కోఁతి, ఏనుఁగు, తాబేలు, ఉడుము, మకరము, మొదలైనవి. పంన్రెండు రీతులు. వీనియన్నిటికిని 'పంచనఖములు' అని పేరు. అట్టియిఱువదియేడు జాతుల మృగములు భూమిపైఁదిరుగును. మకర మొకజాతి మత్స్యము. ఈ జాతిలో చేరినవి జలచరములు. కంకము, గృధ్రము మొదలైనవి. భూచరములు. ఈ రీతిగా తిర్యగ్వర్గము ఇరువది యెనిమిది రీతులు.

శ్లో. హంసము సారసము చక్రవాకములు మొదలగునవి పక్షులు. వీనిసంచార మాకాశమే యైనను భూమియందుఁగూడ దిరుగుటచే వీనిని భూచరముల క్రిందనే లెక్కఁగట్టి నాఁడు. అర్వాక్ స్రోతః తు=ఆహారము ముఖమునుండి గ్రహించెడు, నృణాం, సర్గః=మనుష్యులసృష్టి, నవమః =తొమ్మిదవది, ఏకవిధః=ఒకేవిధమైనది.

25....29. శ్లో. రజోధికః=రజోగుణ మెక్కువగా నున్నవారు, కర్మ పరాః =క్రియాశీలురు, దుఃఖే చ=దుఃఖమునందుఁగూడ, సుఖమానినః= సుఖమున్నదనుకొను వారు, ఏతేత్రయః=ఈ ముగురును వికృతసృష్టికి లోబడినారు. వైకారికాస్తు=సాత్త్వికసరముగా, యః ప్రోక్తః=ఏదియింతకు ముందుఁజెప్పఁబడినదో అది యని యన్వయము, కౌమారస్తు=సనత్కుమారాదుల సరము, ఉభయాత్మకః=రెండురీతులది, దేవసరశ్చ=దేవసరము, అష్టవిధః=ఎనిమిది రీతులు, ఏతేదశ=ఈ పదివిధములైన సృష్టియు, విశ్వసృట్కృతాః=బ్రహ్మచే నిర్మింపఁబడినవి, సర్గాః తే ఆఖ్యాతాః=ఇవినీకుఁ జెప్పఁబడినవి. అతః పరం=ఇఁకమీద, వంశాన్=వంశములు, మన్వంతరాణి చ=మన్వంతరములను, ప్రవక్ష్యామి=చెప్పఁబోయెదను, ఏవం=ఈ రీతిగా, హరిః=విష్ణువు, రజః ప్లుతః=రజోగుణముతోఁగూడినవాఁడై, అత్రభూరిస్రష్టా=తననుండి యేర్పడిన చతుర్ముఖ బ్రహ్మస్వరూపుఁడై, కల్పాదిషు=కల్పాదులందు, అమోఘసంకల్పః=సత్యమైన సంకల్పము గలవాఁడై, ఆత్మా ఏవ=పరమాత్ముఁడే, ఆత్మనా=తానైన ఉపాదాన ద్రవ్యముతో, ఆత్మానం=తన్ను, సృజతి=సృష్టించి కొనును.

తాత్పర్యము : మనుష్యుల సాధారణ ధర్మమును జెప్పుచున్నాఁడు. వీరు రజోగుణము నాశ్రయించిన వారు. అందుచేతనే క్రియాశీలురు. దుఃఖమునందుఁగూడ సుఖమును భావించువారు. ఇప్పుడు చెప్పిన మూఁడు సరలును వైకృతములు. దేవసరముగూడ వైకృతమే. సనత్కుమారాది సరము ఉభయాత్మకము. ప్రాకృతవైకృతరూపమైనది. దేవసర్గ మెనిమిదిరీతులు. విబుధ పితృ రాక్షసులు గంధర్వాప్సరసలు, యక్షరక్షస్సులు, భూతప్రేత

పిశాచులు, సిద్ధచారణ విద్యాధరులు, కిన్నరకింపురుషులు, విదురా! ఈ పది విధములైన సృష్టియు బ్రహ్మకు సంబంధించినవి, ఇఁకమీఁద వంశము లను మన్వంతరములను జెప్పఁబోయెదను.

ఈ రీతిగా స్వేచ్ఛగా రజోగుణము నంగీకరించి కల్పాదియందు బ్రహ్మగా నేర్పడెడు తానే యైన యుపాదాన నిమిత్తకారణములతో లీలగాఁ దన్నుఁదానే బహురూపములుగా నేర్పఱచికొనును. భగవంతుఁడు సర్వ సంకల్పుఁడగుటచే తానే ఉపాదాననిమిత్త కారణము లగుటెట్లని శంకింప రాదు.

## శ్రీధరీయము

శ్లో. దశమే కాలసంప్రశ్నం ప్రతివక్తుం తదుద్భవః,
ప్రాకృతాది విభాగేన సర్గస్తు దశధోచ్యతే.

పదియవ యధ్యాయమందు - కాలమును గూర్చిన ప్రశ్న కుత్తరము చెప్పుటకై కాలముయొక్క యుద్భవమును, ప్రాకృతాది విభాగములతో పదిరీతులైన సృష్టిక్రమమును జెప్పుచున్నాఁడు.

1. అద్ధా=తత్త్వముగా, అనఁగా సత్యముగానని యర్థము, వదస్వ= చెప్పుము, నా ప్రశ్నములను ఉత్తరరూపముతోఁ జక్కగాఁ బ్రకాశింపఁజేయు మని తాత్పర్యము.

3. శ్లో. ఏవం=ఈ రీతిగా, సంబోధితః=ప్రార్థింపఁబడిన వాఁడైన కౌషారవుఁడు విదురుఁడడిగిన ప్రశ్నలు మైత్రేయుని హృదయమందే యున్నవి. అందుచే వాని నాతఁడు మఱచి పోలేదు. వానికి సరియైన యుత్తరము లీయఁబోవుచున్నాఁడని తాత్పర్యము.

4. శ్లో. ఆత్మని=శ్రీమన్నారాయణునియందు, ఆత్మానం=మనస్సును, ఆవేశ్య=ఉంచి, బ్రహ్మదేవుఁడు తప మొనర్చెనని భావము.

5. శ్లో. అబ్జసంభూతః=శ్రీమహావిష్ణువు నాభియందున్న పద్మము నుండి జన్మించిన బ్రహ్మదేవుడు, యదధిష్ఠితః=ఏ పద్మము నాశ్రయించి యున్నాఁడో, కర్తరిక్త ప్రత్యయము, తత్పద్మం అంభశ్చవిలోక్య=ఆ పద్మమును, నీటిని విలోకించిన వాఁడై ఆ పద్మమును, నీరును ఎటువంటివి? తత్కాలకృత వీర్యేణ=ప్రళయకాలమందు వీర్యమును పుంజుకొన్న వాయువుచేఁగంపింపఁబడినవి.

6. శ్లో. విలోకనానంతరము వీటితోఁబాటు ఆ వాయువును న్యపాత్= త్రాగినవాఁడయ్యెను, పా పానే, అని ధాతువు. బ్రహ్మదేవునకు

విశేషణములు చెప్పుచున్నాఁడు. ఏధమానేన=అభివృద్ధిని బొందుచున్న, తపసా=తపస్సుచేతను, ఆత్మసంస్థయా=ఆత్మయందున్న, ఉపాసనా బలముచేతను, వివృద్ధవిజ్ఞానబలః=వివృద్ధమైన విజ్ఞానబలము గలవాఁడు, బహువ్రీహిసమాసము.

7. శ్లో. పుష్కరం=పద్మము, ప్రాగ్లీనాన్=ఇంతకుముందు లీనములై యున్న, త్రిలోకాన్=ముల్లోకములను, కల్పితాऽస్మీత్యచింత యత్=కల్పించితి నని యూహించికొన్నాఁడు.

8. శ్లో. భగవత్కర్మచోదితః. భగవతా=భగవంతుఁడైన నారాయణు నిచేత కరణీయమైన కర్మయందు, చోదితః=నియోగింపఁబడిన వాఁడై, తదా=అప్పుడు, పద్మకోశం ఆవిశ్య=పద్మకోశమం దావేశించిన వాఁడై, ఆ యొక్క పద్మమునే, త్రిధా=లోకత్రయరూపముగా, వ్యభాంక్షీత్=విభాగించెను. ఒక్కటైన కమలముకుళముతో లోకత్రయ సృష్టి యెట్లయ్యెనను సందేహమును నివారించుటకై దాని వైశాల్యమును వివరించుచున్నాఁడు. ద్విసప్తధా=పదునాలు భాగములుగను, అనఁగా చతుర్దశలోకములుగా నా పద్మముకుళవే యయ్యెనని భావము. ఉరుధా=ఇఁకను ననేక ప్రకారములుగా నయ్యెనని విభాగించుచున్నాఁడు. అది అంతపెద్దదిగా, దానితో త్రిలోకీ కరణము విచిత్రముగాదని నిరూపించుచున్నాఁడు.

9. శ్లో. త్రిలోకములుగనే విభాగించుటకుఁ గారణమును జెప్పుచున్నాఁడు. ఏతావాన్=త్రిలోకీరూపమైన జీవలోకముయొక్క రూపమే, జీవలోక మనఁగా జీవులలోకము. అనఁగా భోగస్థానము. ఇది ప్రతి దినమును దృశ్యమానమగుచున్నది. సంస్థాభేదమనఁగా రచనా విశేషము, సమాహృతః=ఉక్తమైనది, బ్రహ్మదేవుఁడు గూడ-జీవుఁడే గనుక నతనికి సంబంధించిన బ్రహ్మలోకమునందుఁగూడ ప్రత్యహమును సృష్టియేందు కుండదు? దీనికిఁ గారణమును జెప్పుచున్నాఁడు. హి=ఏ కారణముచేత, అనిమిత్తస్య=నిష్కామమైన, ధర్మస్య=ధర్మమునకు, విపాకః= ఫలరూపుఁడైన వాఁడు, అసౌ=ఈ బ్రహ్మదేవుఁడు. అనఁగా నిష్కామధర్మము యొక్క ఫలపరిపాకమే బ్రహ్మదేవుఁడని తాత్పర్యము, ఇది యుపలక్షణము. ఇతరలోకములందున్న జనులు కామ్యకర్మ లొనర్తురు. అందుచేత నాలోకములకు ప్రతికల్పమును ఉత్పత్తి వినాశము లేర్పడును. మహః ప్రభృతులైన లోకములు ఉపాసనాసముదిత నిష్కామఫలరూపములు. అందుచే వానికి ద్విపరార్ధ పర్యంతము నాశము లేదు. అచ్చటనున్న వారికి సామాన్యముగా ముక్తి యబ్బినట్లే యని భావము. కాలభేదముచేత లోకసృష్టిభేదము.

10. శ్లో. మైత్రేయుని సమాధానమును విన్నవాఁడై కాలమును గూర్చి తెలిసికొనఁదలఁచిన విదురుఁడు మరల నడుగుచున్నాఁడు. కాలాఖ్యమైన పదార్థమునకు లక్షణమును జెప్పితివి. ఆ కాలమెట్లు గల్పింపఁబడుచున్నది? దానిస్థూల సూక్ష్మస్వరూపము లేవి? ఈ విషయమును స్పష్టముగా నాకెఱిఁగింపుము. ఈ యధ్యాయమందుఁ గాలము యొక్క సామాన్య స్వరూపము చెప్పఁబడుచున్నది, విశేషవివరణ ఉత్తరాధ్యాయములో వచ్చును.

11. శ్లో. గుణానాం వ్యతికరః=అనఁగా మహదాదుల పరిణామము, దీనిచేతనే కాల మేర్పడుచున్నది, ఏకాదశస్కంధమందు "గుణవ్యతికరః కాలః, స్వభావస్సూత్ర మేవచ" అని చెప్పఁబోవుచున్నాఁడు. ఈ కాలము నిర్విశేషము. అప్రతిష్ఠితము ఆద్యంతశూన్యమని యర్థము. దీనిని జూపించుటకే ఉత్తరార్థముతో నీశ్వరుఁడు కాలమును నిమిత్తముగా నొనర్చికొని సృష్టియొనర్చునని చెప్పుచున్నాఁడు. ఉపాదీయతే=నిమిత్తతయా స్వీక్రియతే ఇత్యుపాదానం నిమిత్త భూతముగా స్వీకరింపఁబడుచున్నది. ఆ కాలము దేనియందు నిమిత్తముగా స్వీకరింపఁబడుచున్నదో అట్టి తన్ను విశ్వస్వరూపముగా సృష్టించెను. తనకంటె భిన్నమైనది సృజింపఁదగిన దేదియు లేకుండుటచేత నిది కేవలము వస్తుకథనము మాత్రమే. నిమిత్త భూతమైన కాలముతో సృష్టించె ననుటయే వివక్షితమైన యర్థము.

తనకన్నను వ్యతిరిక్తమైన సృజ్యాభావమును జూపించుచుఁ గాలమునకు సృష్టినిమిత్తత్వమును వివరించుచున్నాఁడు.

12. శ్లో. విష్ణుమాయచేత, సంస్థితం=సంభృతమైనట్టి, బ్రహ్మ=బ్రహ్మ స్వరూపమైన యే విశ్వము గలదో, అది కర్తయైన విశ్వేశ్వరుని చేత, కాలేన పరిచ్ఛిన్నం=కాలముచేత విభాగింప (మితము) పెట్టఁబడినదై, పృథక్= వేరుగా, ప్రకాశితం=ప్రకాశితమై, అవ్యక్తమూర్తినా=అవ్యక్తమైన స్వరూపము గల కాలముచేత పరిచ్ఛిన్నమై యని వెనుక కన్వయము, నిర్విశేషం దర్శితం= నిర్విశేషముగాఁ జూపఁబడినది.

13. శ్లో. కాల మప్రతిష్ఠితం=దీనిని సమర్థించుటకు విశ్వప్రవాహము గూడ అప్రతిష్ఠితమే యనుచున్నాఁడు. ఇదానీం యథావిశ్వమేతదస్తి= ఇప్పుడీ విశ్వ మెట్లున్నదో, తథా అగ్రే చ-పూర్వమప్యాసీత్=ఇంతకుముందుఁ గూడ నట్లే యుండెను. పశ్చాదపీదృశం భవిష్యతి=ఇఁక ముందుఁగూడ నిట్లే యుండఁబోవును. ఈ రీతిగా సామాన్యస్వరూపముతోఁ గాలమును నిరూపించి విశేషముగా నిరూపింపఁబోవుచున్నవాఁడై కాలనిమిత్తకమైన సర్గమునకు పూర్వోక్తములైన భేదముల ననువదించుచున్నాఁడు.

విశ్వసర్గము తొమ్మిదిరీతులు. ప్రాకృతము, వైకృతము అని దానిరీతులు రెండు. పదవది కౌమారసర్గము. ఇది ప్రాకృతము వైకృతముగూడ.

14. శ్లో. సర్గమునకుఁగాలముతో త్రైవిధ్యమును, ప్రళయస్వరూపమును జెప్పుచున్నాఁడు. కాలముచేతనే ప్రతిదినము నేర్పడెడు ప్రళయము సుషుప్తి. ద్రవ్యము యొక్క సంకరణముచే నేర్పడునది నైమిత్తిక ప్రళయము. తమ కార్యములను గ్రసించునట్టి గుణములతోఁ గలునది ప్రాకృతికప్రళయము, అట్లే ముప్విధములైన సర్గములను విస్తరించి చెప్పుచున్నాఁడు. ఇది యీ యధ్యాయము ముగియు వఱకుండును. మహత్తు యొక్కసర్గము మొదటిది. దీని లక్షణమేమి? ఆత్మనః శ్రీహరేః సకాశాత్ గుణానాం వైషమ్యం=ఆత్మ స్వరూపుఁడైన హరినుండి యేర్పడిన గుణముల వైషమ్యమే మహత్తత్త్వ లక్షణము.

15. శ్లో. అహమహాః=అహంకార సర్గము రెండవది. ఇది మూఁడురీతులు ద్రవ్యజ్ఞానక్రియాత్మకములు. దీనిని పైనీ చెప్పఁబోవును. భూతసర్గము మూఁడవది. తన్మాత్రః=పంచతన్మాత్రలు. అనఁగా సూక్ష్మ భూతసర్గము. ద్రవ్యశక్తి మహాభూతోత్పాదక మైనది.

16. శ్లో. జ్ఞానక్రియాత్మకః=జ్ఞానకర్మేంద్రియాత్మకమైన యింద్రియముల సర్గము. జ్ఞానేంద్రియములైదు. కర్మేంద్రియము లైదు. ఇది నాల్గవసృష్టి. దేవసర్గము వైకారికము. మనస్సు తన్మయ మైనది.

17. తమస్సర్గః=పంచపర్వములు గల్గిన అవిద్య యొక్కసృష్టి, అబుద్ధికృతః=అబుద్ధియనఁగా జీవుల యావరణము, విక్షేపమును. ఈ రెంటినీ జేయునది యని తాత్పర్యము. ఇట్టి తమస్సర్గ మాఱవది, ఇది మే=మత్తః= నానుండియే యేర్పడినది.

18. శ్లో. హరిమేధసః=యద్విషయకమైన బుద్ధి సంసారమును హరించునో అది హరిమేధ, భగవంతుని లీల యన్నమాట. తస్థుషాం= స్థావరముల యొక్క, సర్గః=సృష్టి

19. శ్లో. స్థావరముల సృష్టి యాఱువిధము లన్నాఁడు. దానిని వివరించుచున్నాఁడు. పుష్పము లేకయే ఫలించు అశ్వత్థ, ఉదుంబర-పనస న్యగ్రోధాదులు-వనస్పతులు. ఏవి పుష్పించి ఫలపాకాంతముగా నుండునో వ్రీహి-యవ, ముద్గాదు లోషధులు. "వర్షస్యరేతో ఓషధయః, ఓషధీనాంరేతోఽన్నం" అని శ్రుతి. ఏవి పుష్పాంతములుగాని, ఫలపాకాంతములుగాని వైయుండి ఆరోహణానపేక్షములో అవి లతలు. మాలతీమల్లికా కారవల్లీ బృహత్యాదులు. కారవల్లి అనఁగా కాకర. బృహతి అనఁగా గుమ్మడి. త్వక్సారాః=చర్మమందే సారములు గలవి. వేణువులు మొదలైనవి. వీరుధము లనఁగా లతలే యైనను కాఠిన్యముతో ఆరోహణాన పేక్షములు. ద్రుమాః

=పుష్పములు ఫలములు గలవి. చూతపున్నాగాదులు. వీని సాధారణ లక్ష ణమును జెప్పుచున్నాఁడు. ఉత్స్రోతసః=ఊర్ధ్వముఖముగా నెదుగునవి. తమఃప్రాయాః=అవ్యక్త చైతన్యములు, అంతస్స్పర్శాః= స్పర్శమాత్ర జ్ఞానము గలవి. ఆ స్పర్శజ్ఞానము గూడ లోపలనే. బయట తాకినప్పుడు స్పర్శజ్ఞానములేదని యర్థము. విశేషిణః=అవ్యవస్థిత పరిణామాద్యనేక భేదములు గలవి.

20. శ్లో. తిర్యక్సృష్టి ఎనిమిదవది. ఇది పదునెన్మిది రీతులు. అవిదః =నిన్న నేఁడు అను జ్ఞానము లేనివి, భూరితమసః=ఆహారాదిజ్ఞానమాత్ర నిష్ఠులు, ఘ్రాణజ్ఞాః=వాసనజూచి మాత్రమే తెలియునవి. హృద్యవేదినః = దీరానుసంధానము లేనట్టివి, "అథేతరేషాం పశూనా మశనాయాపిపాసే ఏవాభిజ్ఞానం న విజ్ఞాతం వదంతి విదుః శ్వస్తనం నలోకాలోకౌత ఏతావంతో భవంతి. యథా ప్రజ్ఞం హి సంభవాః" అని శ్రుతి.

21. శ్లో. అష్టావింశతి భేదములను జెప్పుచున్నాఁడు. గవాదులు తొమ్మిదియు ద్విశఫము లైనవి.

22. శ్లో. శ్వాదులు గోధమువఱకును పంఁడ్రెండు పంచనఖములు. ఇవన్నియు భూచరములు. ఇవి యిఱువదియేడు. మకరాదులు జలచరములు. ఇఱువదినాలుగు, కంకాదులు ఖచరములు, ఇవి అభూచరములతో జేర్పఁబడి యొక్కభూచరములుగనేర్పడినవి, ఇట్లన్నియుఁబదునెనిమిదిరీతులు. వీనిలో కృష్ణ రురు గవయాదులైన మృగవిశేషములు అంతర్భూతములు. తక్కిన తిర్యక్కులును యథా సంభవముగాఁజేరును.

25. శ్లో. అర్వాక్స్రోతః=అధ - ఆహారసంచారములు గలవి అర్వాక్ స్రోతస్సులు. హ్రస్వత్వ మార్షము. ఈ మానవసృష్టి ఏకవిధము. వీరు రజోధికులు. కర్మపరులు. దుఃఖమునందును సుఖము భావించువారు.

26. శ్లో. ఏవ, ఈ ముగ్గురే వైకృత సృష్టి. ఈ ఏవకారము అన్యమావర్తకము కౌమారసర్గము. వైకృతముగాదనీ తాత్పర్యము. అది ఉభయాత్మక మైనది. కుమారులు దేవత్వమనుష్యత్వముతోఁ బూజ్యులైన వారు. దేవసర్గము వైకారికమని ముందే చెప్పఁబడినది. కౌమారసర్గము వైకృతము. దానికంటెను కొద్దిగా తక్కువ యని భావము.

27. శ్లో. ఈ వైకృతమైన దేవసర్గము ఏడురీతులు. విబుధాదులు మూఁడు భేదములు. గంధర్వాప్సరస లోకజాతి. యక్షరక్షస్సు లోకజాతి, సిద్ధచారణ విద్యాధరు లొక్కతెఱఁగు. అది శబ్దముచేత నశ్వముఖాదులైన కింపురుషాదులు ఒక్కజాతి. ఈ సర్వవిషయములును వింశాధ్యాయ మందు స్పష్టముగా వచ్చును.

# విజయధ్వజము

ఈ యధ్యాయ మందు తొమ్మిది రీతులైన సృష్టిని జెప్పుటతో భగవంతుని నిరతిశయ మహిమను వర్ణించుచున్నాఁడు. మొదలు మైత్రేయుని విదురుఁడు ప్రశ్నించె నని శుకాచార్యుఁడు పరీక్షిత్తునకుఁదెల్పుచున్నాఁడు.

1. శ్లో. భగవతి అంతర్హితే లోకపితామహః=లోకమునకు రెండవ వాఁడైన తాత అనిపించుకొన్న, విభుః=బ్రహ్మ, కతిధా, దైహికీః, మానసీః, ప్రజాః, ససర్జ.

2. శ్లో. బహువిత్తమ=శ్రీహరి మహిమను దెలిసిన వారిలో శ్రేష్ఠుఁడవైన భగవన్! త్వయి మే, యే, అర్థాశ్చ, పృష్టాః, తాన్, అను పూర్వ్యేణ వదస్వ నః సర్వసంశయాన్ ఛింది.

3. శ్లో. భార్గవ=ఓ శౌనక మునీ! అథ, కేన, క్షత్త్రా ఏవం సంబోధితః కౌషారవః మునిః ప్రీతః హృదిస్థాన్=విదురుని మనస్సు నందున్న, తాన్ ప్రశ్నాన్=ఆ ప్రశ్నలకు, ప్రత్యాహ=ఉత్తరమును దెలిపెను.

4. శ్లో. మరల తపస్సొనరింపుము " అని శ్రీహరి యిచ్చిన యాజ్ఞను బ్రహ్మదేవుడు పరిపాలించిన క్రమములో దెలుపుచున్నాఁడు. భగవాన్ అజః =జనన రహితుఁడైన శ్రీహరి యథా, ఆహ, తథా, విరించోఽపి, ఆత్మని, ఆత్మానం, ఆవేశ్య, దివ్యం=దేవమానముతో, వర్షశతం, తపః, చక్రే.

5,6.శ్లో. అబ్జసంభూతః,యత్=ఏ కమలము, (ఆత్మనా)అధిష్ఠితం= తత్పద్మం, తత్కాలకృత వీర్యేణ=ప్రళయకాలప్రయుక్తమై వేగము గల వాయునా కంపితం, అంభశ్చ=నీరుకూడ వాయువుచేత క్షుబ్ధమైన దానినిగా, విలోక్య, ఏధమానేన, తపసా, ఆత్మసంస్థయా,=శ్రీహరికే సంబంధించిన, విద్యయా చ=విద్యతోను, వివృద్ధ విజ్ఞానబలః. సన్, సహాంభసా. వాయుం, న్యపాత్, వేరుతోఁగూడ వృక్షమును నాశ మొనర్చునట్లు నాశమొనర్చె నని భావము.

7. శ్లో. "సృష్టింపు" మని శ్రీహరిచే నాజ్ఞాపింపఁబడిన బ్రహ్మ సంహారమునకుఁ బూను కొన్నాఁడు గదా! అని యోశంకించి రాఁబోవు సృష్టికి ప్రళయ జలవాయువులు ప్రతి బంధకము లగుటచే వానిని ద్రావుట సముచితమేయన్న యభిప్రాయముతోఁజెప్పుచున్నాఁడు. ఏ కమల మందుఁ గూర్చొని యుండెనో, తత్=అట్టి. వియద్వ్యాపి=ఆకాశము వలె చాల పెద్దదైన, పుష్కరం=కమలమును, విలోక్య, అనేన=ఈ కమలము చేత, ప్రాక్=గడచిన కల్పమందు, లీనాన్=శ్రీహరి యుదరమందు లీనమైయున్న, లోకాన్= లోకములను, కల్పితాస్మి=సృష్టింతును. ఇత్యచింత యత్=అని యాలోచించెను.

8.శ్లో. ఒకటే పద్మము నుండి మూఁడు మొదలైన సంఖ్యలతోఁగూడిన లోకరచనె యెట్లైనది? దానికి సమాధానము. తదా, కర్మచోదితః=(1) పదు నాలు లోకములను సృష్టించెడు నదృష్టముతోఁ బ్రేరితుఁడై, (2) సృష్టింపఁ బడిన ప్రజల కర్మకు నియామకుఁడైన భగవంతునిచేఁ బ్రేరేపింపఁ బడిన వాఁడై, భగవాన్=జ్ఞానవైరాగ్యభక్త్యాదిగుణములచే పూర్ణుఁడైన భగవంతుఁడు, పద్మకోశం ఆవిశ్య=ఆకమలము నందుఁ బ్రవేశించి, ఏకం=ఒక్కటిగా నున్న యా పద్మమును, త్రిధా=భూమి, అంతరిక్షము, స్వర్గములను మూఁడు విధములుగా, భావ్య=ఒనర్చి వానినే, ద్విసప్తధా=పదునాలులోకములుగను, ఉరుధా=బహుసంఖ్యాకములు గాను, వ్యభాంక్షీః= విభాగించెను.

9. శ్లో. జీవలోకస్య=జీవులు వసించు ప్రపంచము యొక్క, సంస్థాభేదః =వ్యవస్థావిభాగము, సమాసతః=సంక్షేపముగా, ఏతావాన్ ఏవ=ఇంతే "సమాహృత" అని శ్రీధరులు, దీనినిఁగూడ బ్రహ్మదేవుఁడు స్వశక్తితో నొనర్ప లేదని చెప్పుచున్నాఁడు. పరమేష్ఠినః=బ్రహ్మయొక్క, అనిమిత్తస్య=శ్రీహరి ప్రీత్యర్థమై యొనర్పఁబడిన, ధర్మస్య=తపస్సుమొదలైన ధర్మకార్యముల యొక్క, విపాకః=విశిష్ట ఫలమని తెలిసికొమ్ము, నిర్నిమిత్తముగా నేదియు నుండదు గనుక, "అ - ఇతిబ్రహ్మ", అనెడు శ్రుతి ననుసరించి శ్రీహరిప్రీతి కొఱకై యొనర్పఁబడిన, తపస్సని యర్థముఁజెప్పితిమి. బ్రహ్మ హరి ప్రీత్యర్థమై తప మొనర్పఁబడెనని ముందే చెప్పితిమి గదా!

10.శ్లో. హరిమహిమను గూర్చి ప్రశ్నించిన విదురుఁడు మైత్రేయుఁడు వేఱుకథా ప్రసంగముతో - నా కథను ముగించునేమో అను భయముతోఁ బ్రశ్నించుచున్నాఁడు. బ్రహ్మన్ ప్రభో! బహురూపస్య=అనంతరూపియు, అద్భుతకర్మణః=ఆశ్చర్యకరమైన కర్మల నొనర్చెడు, హరేః, కాలాఖ్యం=కాల మనెడు, లక్షణం=స్వరూపమును, యత్=దేనిని, ఆత్థ=చెప్పితివో, తత్=దానిని, నః=మాకొఱకై, యథా=సరిగా, వర్ణయ. లక్షణం అనుదానికి స్వరూపమని యర్థముఁజెప్పుట కోశసమ్మతమే.

11.శ్లో. కాలము సర్వమునకునుఁ బ్రకాశక మగుటచే ముఖ్యమైనది. అందుచే నా కాలస్వరూపమును వివరింపఁబోవుచున్నవాఁడై జగత్తు యొక్క సృష్టి స్థితి సంహారములకై రజస్సు సత్త్వము తమస్సు - అను గుణములను స్వీకరించిన శ్రీహరి యొక్క మూఁడు రూపములు వ్యక్తమైన స్థితిని జెప్పు చున్నాఁడు. ప్రళయమునందు గుణములను జూచుచున్న, గుణవ్యతికరాకారః =ప్రాకృతగుణముల వికార విశేషమును అతిశయముగా నొనర్చెడి, నిర్విశేషః =వికారరహితుఁడైన, అప్రతిష్ఠితః=వేరొక్క దాని నాశ్రయించి యుండని, పురుషః=పూర్ణగుణుఁడైన శ్రీహరి, తదుపాదానం=అప్రాకృత గుణముల స్వీకారమునకుఁగర్తలైన, బ్రహ్మ, విష్ణు - ఈశ్వరు లనెడు, మూఁడు రూపముల

చేత, ఆత్మానం=తన్ను, లీలయా=అనాయాసముగా, అసృజత్=వ్యక్తపఱచి కొనెను. "స భగవాన్ కస్మిన్ ప్రతిష్ఠితః స్వే మహిమ్ని" అనెడు శ్రుతి శ్రీహరి వేరు దాని నాశ్రయించికొని యుండుట లేదని తెలుపుచున్నది.

12. శ్లో. పరమాత్మ యీరూపములను వ్యక్త పఱచికొనుటలో స్వప్రయోజన మేమియు లేదు. మఱి యితరుల యే ప్రయోజనములకై యాతఁ డీరూపములను వ్యక్త పఱచికొన్నాఁడు అనుట ను వివరించుచున్నాఁడు. విశ్వం, బ్రహ్మ, తన్మాత్రం=బ్రహ్మనామకుఁడైన శ్రీహరిరూపము చేత జాతము, రక్షితమునై యున్నది. విష్ణుమాయయా=విష్ణువనెడు రూపసామర్థ్యముతో, సంస్థితం=తమ తమ యధికారములందు వ్యవస్థ నెలకొల్పుచున్నది. అవ్యక్త మూర్తినా=కన్ను మొదలైన ఇంద్రియములతోఁ దెలియఁబడని, కాలేన=సర్వసంహారక మగుటతో కాలమని పిలువఁబడెడు, (మృత్యు) ఈశ్వరేణ=శ్రీహరియొక్క రుద్రుఁడనెడు రూపముతో, పరిచ్ఛిన్నం=సంహారమందు చున్నది. వై=ఈ విషయ మందు శ్రుతి యే ప్రమాణము. శ్రీహరి చతుర్ముఖబ్రహ్మను సృష్టించి చతుర్ముఖుఁడై యందుఁ బ్రవేశించి బ్రహ్మనామకుఁడై సృష్టికొఱకు రజోగుణమును స్వీకరించును. ఇతరరూపమందుఁ బ్రవేశింపక స్వయముగనే విష్ణువనెడు నామము ధరించి రక్షణమునకై సత్త్వగుణము నందును, పంచముఖుఁడైన ఈశ్వరుని సృష్టించి తానందుఁ బ్రవేశించి సంహారములకై తమోగుణమును స్వీకరించును. దీనికిఁ బ్రమాణము. "అథ త్రయీ యావత్ప్రకృతిః సత్త్వం రజస్తమ ఇతి, తాం నారాయణః, పర్యపశ్యత్యనన్య ప్రతిష్ఠితః. తం వా, ఏన మాహుః పురుష ఇతి" పూర్వో హ్యేష భవతి, సత్రేధా బభూవైషా. గుణానాముపాదానాయ, విష్ణుర్వా వసత్యస్య, రజసో బ్రహ్మశో నామతమసః, స ఆవివేశ బ్రహ్మ, బ్రహ్మణం చతుర్ముఖం, ఈశ ఈశానం పంచముఖం, యో వా. ఈశ ఈశాన మావివేశ తం కాలఇత్యాచక్షతే" (సౌకరాయణశ్రుతి.)

13. శ్లో. ప్రపంచము త్రికాలములందు న బాధ్యము. సత్యమైనది, ఈ విషయ మనుమానముతో సిద్ధమగును. దానినే చెప్పుచున్నాఁడు. ఇదానీం =సృష్టికాలమందు, యథా=ఎట్లు? అర్థక్రియాకారి యగుట చేత (ప్రయోజన కారి యగుటతో) సత్యత అనుభవసిద్ధమై యున్నదో, తథా=అట్లు, అగ్రే= సృష్టికి మొదలు, ప్రళయ కాలమందును, పశ్చాదపి = తరువాతను, ఏతత్=ఈ జగత్తు, ఈ దృశం=సత్యమైన దనియే, అనుమాన ప్రమాణముతోఁ దెలియ వలెను. తస్య=ఈ ప్రపంచము యొక్క, యః=ఏ, సర్గః=సృష్టి, ప్రాకృతః =బ్రహ్మాండమునకు బయటిదనియు, వైకృతశ్చ = బ్రహ్మాండమునకు లోపలి దనియు రెండురీతులుగా నున్నదో, ఆ సృష్టి, నవవిధః=తొమ్మిది రీతులు గలది, కొందరు పైరెండు శ్లోకముల నిట్లు వ్యాఖ్యానింతురు" తదుపాదానం= అవ్యక్త స్వరూపమైన జ్ఞానమే, కార్యమున కధికరణముగానున్న.

ఆత్మానం=తన్నే, అసృజత్=చేతనము మఱియు నచేతనము గా సృష్టించెను. అనఁగా నంతకు ముందు లేనట్టి యాకాశాదులను సృష్టించె నని యర్థము. ఇట్లు సృష్టింపఁబడిన ప్రపంచము సత్యము గాదు. ఎందుకనఁగా విశ్వం=ఆకాశాదిప్రపంచము ప్రళయమందు బ్రహ్మతన్మాత్రం=బ్రహ్మముగ మాత్రమే యుండెను. సంస్థితం=నష్టమై యుండెను. విష్ణుమాయయా-వ్యాప్తుఁడైన బ్రహ్మయొక్క, అవ్యక్త లక్షణమైన మాయతోను, ఈశ్వరుఁడైన బ్రహ్మతోను పరిచ్ఛిన్నం=విషయముగాఁ జేయఁబడియుండెను.

అవ్యక్తమూర్తినా=కన్ను మొదలైన వానితోఁ దెలియఁబడని స్వరూపముగల, కాలేన=జ్ఞానస్వరూపమైన సాక్షిచైతన్యము చేత విషయముగా నొనర్పఁబడినది. అందుచే మూఁడు కాలములందును లేనిదగుట వలన అసత్యమని యర్థ మొనర్తురు. ఇది సరికాదు. జగత్తు సత్యమనియే యీ శ్లోకము చెప్పుచున్నది. దీనియందును యథా=ఎట్లు, ఇదానీం=ఇప్పుడు కారణభూతమై చైతన్యమును (ఆరోపితమై అనఁగా జ్ఞానవిషయమై ఆకాశాదికార్యము దెలియఁబడుచున్నదో, తథా=అట్లే, అగ్రే=ప్రళయకాలమందును, సత్యభూతమైన చైతన్యము కారణముగను, అకాశాది ప్రపంచము కార్యముగను, అనుమానముతోఁ దెలియఁబడు చున్నది. అటైనచో నీ యుదాహరణము జగత్తు మూఁడు కాలములందును లేదని తెలుపుటకే చెప్పఁబడినది అని యర్థమెందుకు సేయరాదు? అట్లర్థమొనర్చుట ప్రమాణ విరుద్ధము" -

"సృష్టిశ్చ ప్రళయశ్చైవ సంసారో ముక్తి రేవ చ,
దేవర్షి ప్రభృత యో లోకాః లోకాభూరాదయస్త థా"
"అనాద్యనంత కాలీనాః, సర్వదైక ప్రకారతః,
జగత వాహ స్సతో౽యం, నైవ మిథ్యాకథంచన"
"ఏత్వేతదన్యథాబ్రూయుః సర్వహంతార ఏవ తే"

అనెడు ప్రమాణము జగత్తు ప్రవాహ రూపమై సత్యమైనదని తెలుపుచున్నది. సృష్టి తొమ్మిది రీతు లనుటయు జగత్తు సత్యమనుట యే తెలుపును. ఇంద్రజాలము వంటిదైనచో తొమ్మిది సంఖ్యకేనిలుచుట యేల? ఎంతసంఖ్య యైనను గావచ్చును. ప్రకృతి వికృతి అని చెప్పుట తో జగత్తు అనిర్వాచ్య మైన మాయతో నేర్పడినది అని వ్యాఖ్యానింపరాదని తెలిపిన ట్లైనది.

"అవ్యక్తాద్యాః పృథివ్యంతాః సర్గాః ప్రకృతయ స్స్మృతాః,
తదుపాదానకః సర్గః, ప్రాకృతః పరిక్షృతే"
"అండంతు వికృతం జ్ఞేయం తజ్జోవైకృత ఉచ్యతే" -

- అనెడు ప్రమాణము ప్రాకృతవైకృత సృష్టిని దెలుపుచున్నది. `చ' - అనుటతో జగత్తు మాయామయ మైనచోఁ బరిణామము గన్పింపక పోవలెను గదా! అనెడు హేతువును గూడ సూచించు చున్నాఁడు. మాయా వాదులు - "మాయ యనఁగాఁ దనస్వరూపమును వదలక వేరొక్క పద్ధతితోఁ గన్పడుట" అని వ్యాఖ్యానింతురు. పరిణామము ఈ లక్షణమునకు విరుద్ధ మైనది..

14.శ్లో. ప్రపంచ మసత్యమని చెప్పువారికి మూఁడు కాలముల యందును జగత్తు లేనటుగాఁ దోఁచును. ఈ జ్ఞానము జగత్సత్య వాదము నకు బాధ. బాధతోఁ గూడికొన్న జ్ఞానమునకు వెలలేదు. ఇది తర్క సమ్మతము, అందుచేతఁ బ్రపంచము సత్యముగాదని యందురు. కాని యీ విధమైన బాధ లేకుండుటచేఁ బ్రపంచము సత్యమేయని యీ శ్లోకములోఁ జెప్పుచున్నాఁడు. అస్య=ఈ జగత్తునకు, ప్రతి సంక్రమః=ప్రళయమనెడు వినాశము, కాల, ద్రవ్య గుణములతో నేర్పడుటచేత, త్రివిధః=మూఁడు విధములైనది. కాల నిమిత్తక ప్రళయ మనఁగా శతవరానంతరము మానవున కేర్పడు వినాశము. కుండ మొదలగునవి చూరీలు చూరులు గానై నాశమగును. దీనికి ద్రవ్యనిమిత్తక నాశమని పేరు. అభివృద్ధమైన సత్త్వగు ణముతోఁ దామసము నశించును. ఇటే యెక్కు వైన తమోగుణముతో సత్త్వగుణకార్యమైన సుఖము పోవును. అటే కొన్ని సమయములలో నతిశయించిన రజోగుణముతో సాత్త్వికతామసములు రెండును నశించును. కొన్ని యెడల సత్త్వగుణముతో రాజస తామసములు నాశ మగును. దీనికి గుణ నిమిత్తకమైన లయమని పేరు. ఈ విధమైన లయమును జెప్పుట చేత జగత్తు మూఁడు కాలములందును లేదని చెప్పుటకు వీలు లేదు. లేని దానికి నాశ మెట్లు ప్రాప్తించును? కనుక నాశమునకు ముందు ఉన్నదనియే యొప్పికొనవలెను. కనుక త్రికాలముల యందును లేదని చెప్పుటకు సాధ్యపడదు.

ప్రాకృతవైకృతసృష్టులలో ప్రాకృతసృష్టిని గూర్చిఁ జెప్పఁ బోవుచున్నాఁడు. ఆత్మనః=శ్రీహరినుండి యేర్పడెడు, గుణవైషమ్యం= గుణముల విషమావస్థయనెడు, మహతః=చతుర్ముఖ బ్రహ్మదేహము, మఱియు తదభిమానము గల మహత్తత్త్వము యొక్క, సర్గః తు=సృష్టి, ఆద్యః =ప్రాకృతసృష్టిలో మొదటిది. తామసస్యపదార్థస్య, సత్త్వంహి లయ కారణం, సాత్త్వికస్య తమస్త్వేవ తయోరపి రజఃక్వచిత్"గుణతోఽయం లయః ప్రోక్తః ద్రవ్యతస్తు విరోధినా, కాలతః కాలసంఖ్యాకో లయస్సర్వస్య వస్తునః " అను ప్రమాణము జగత్తునకు మూఁడు విధములైన నాశమును దెల్పు చున్నది. గుణములు దమసామ్యస్థితిలో నుండుటకు గుణసామ్యమని పేరు, ఇట్లున్న కాలము - ప్రళయ మనిపించికొనును, గుణముల కా సామ్యస్థితి చెడుటయే సృష్టి. తమోగుణము నకంటెను రజస్సు రెండింత లైనది. దాని

కంటెను సత్త్వము శుద్ధమైనది. అనఁగా రజస్తమస్సులతో మిశ్రము గానిదన్నమాట. తక్కిన రెండు గుణముల రాసులును నటివి గావు. రజోరాశియందు మూఁడు గుణములు నుండును. రజోగుణములో నూఱవ భాగము సత్త్వగుణము. దానిలో నూటిలో నొక భాగము తమోగుణము రజోరాశిలోఁజేరి యుండును. ఇట్లే తమోరాశియందును మూఁడు గుణము లున్నవి. తమస్సుకంటెను పదింతలు సత్త్వగుణము. పదునొకండవ భాగము రజోగుణము. ఇట్లు మూఁడు గుణము లుండును. ఇదే గుణముల నిజస్థితి. ప్రళయమందు రజస్సు పదునొకండుభాగములై పదిభాగములతో సత్త్వ గుణములోఁజేరిపోవును. ఒక్కభాగము తమస్సులోఁజేరును.ఇది గుణముల సామ్యావస్థ. ఇట్లు మూలసత్త్వ గుణముతోఁజేరిన పదిపాళ్లు రజోగుణము. మూల తమోగుణముతోఁజేరినచో గుణవైషమ్యము. అప్పుడే మహత్తత్త్వ ముత్పన్న మగును. దీనినే కేవల సత్త్వమని పిలుతురు. అనఁగా ప్రళయమని మూలసత్త్వగుణముతోఁ జేరిన మూలరజోగుణము. మూల తమస్సుతోఁ జేరిన రజస్సు. మూలరజస్సులోనున్న స్వాభావికమైన రజోగుణము. ఇట్లు మూఁడు పాళ్ళు రజస్సు. ఒక భాగము తమస్సు. ఇటు నాలుభాగముల సంయోగముతోఁ బుట్టినదే గుణవైషమ్య మను మహత్తత్త్వము. ఇదియే బ్రహ్మదేవుని దేహము. దీనికిఁ బ్రమాణము,

"తమసో రజస్తు ద్విగుణం రజసస్సత్త్వ మేవ చ,
పరిమాణత ఏవం స్యుః త్రయః ప్రకృతిజాః గుణాః.
తత్ర సత్త్వం, కేవలం స్యాత్, రజస్యాపి శతాధికమ్,
సత్త్వం రజశ్శతాంశం స్తు తమస్తత్రప్రకీర్తితమ్.
తమస్యపి తథా సత్త్వం తమసస్తు దశోత్తరమ్,
తద్దశాంశేన తు రజో మూలజం యద్రజస్తు తత్.
విలయే దశాంశత స్సత్త్వ ఏకాంశేన తమస్యపి,
మిశ్రితం భవతి హ్యేతాం సామ్యావస్థాం విదుర్బుధాః.
యదా తు తద్రజస్సర్వం తమసా సహ సంగతమ్,
తదా త్వాహుర్మ హత్తత్త్వం తచ్చతుర్భాగ సంభవమ్.
తత్ర త్రిభాగో రజస ఏకాంశస్తమసస్తథా,
తదాహు ర్బ్రహ్మణో రూపం గుణవైషమ్యనామకమ్.
తదేవం కేవలం సత్త్వం ఇతరాపేక్ష యా భవేత్,
శ్రీర్మూలసత్త్వంవిజ్ఞేయా, భూర్మూలం రజ ఉచ్యతే.
మూలం తమస్తథా దురా మహాలక్ష్మీస్త్రిమూలకా,
గుణేభ్యో గుణమూలాచ్చ యోఽతిత స్సజనార్దనః."

15.శ్లో. రెండవసృష్టిని జెప్పుచున్నాఁడు. అహమః=అహంకార తత్త్వము యొక్క, సర్గః ద్వితీయః, తత్ర, ఆ అహంకార తత్త్వసృష్టియం దాకాశాది భూతద్రవ్యములు, శ్రోత్రాది జ్ఞానేంద్రియములు, వాగాది కర్మేంద్రియములు, మనస్సు - వీని యభిమాని దేవతలు వీరందఱును జన్మింతురు. తృతీయః=మూఁడవది యైన, భూతసర్గః=ఆకాశము మొదలైన పంచభూతముల సృష్టి, తన్మాత్రద్రవ్యశక్తిమాన్=శబ్దాదులైన తన్మాత్రల స్వరూపమగుటచే నదే శక్తిగాఁ గలిగినది. ద్రవించెడు శక్తిని గూడఁ బొందినది. మూల రజస్సు యొక్కయు, తమస్సు యొక్కయు, రజస్తమో గుణముల చేఁగూడిన మహత్తత్త్వమే బ్రహ్మదేవుని దేహము. దానిని పదునొకండు భాగములు చేసి పది భాగములు సత్త్వము, ఒకభాగము రజస్సు. ఈ రజోగుణము యొక్క పదునొకండవభాగము తమస్సు. ఇటి తమస్సు నుండి పుట్టినదే యహంకారము. దీని కభిమాని యని పిలిపించి కొనునదే యహంకార తత్త్వము. ఇట్లు మహత్తు నుండి యహంకారసృష్టి. ఇది మఱల మూఁడు రీతులు. దీని యందును సత్త్వము పదిభాగములు. రజస్సు ఒక భాగము. దాని పదునొకండు భాగములలో నొకభాగము తమస్సు. ఈ తమోంశము నుండి తామసాహంకారము, రజోంశము నుండి తైజసాహంకారము. సత్త్వాంశము నుండి వైకారికాహంకారము ఏర్పడును. ఈ తామసాహం కారము నుండి యాకాశాదుల సృష్టి. తైజసము నుండి యింద్రియముల సృష్టి. వైకారికము నుండి దేవతల దేహసృష్టి. దీనికిఁ బ్రమాణము-

> "యద్రజో మూల రజసి మూలే తమసి యద్రజః,
> తమశ్చ మూలే తమసి మహత్తత్త్వం తదాత్మకమ్.
> దశాంశా స్తత్ర సత్త్వం స్యుః ఏకాంశో రజ ఏవ తు,
> తద్దశాంశం తమో జ్ఞేయం అహంకార స్తదాత్మకః.
> సరుద్రస్తామసో జ్ఞేయో, విరించా పేక్ష యైవ తు,
> ఇతరా పేక్షయా సత్త్వం సత్త్వాద్యాస్త ద్వ యస్యతు.
> తత్తమోంశాత్సా త్త్వికాంశః, మన ఆద్యాః ప్రకీర్తితాః,
> రజసోంశాత్వింద్రియాణి తామ సోంశాశ్చఖాదయః."

16.శ్లో. జ్ఞానక్రియాత్మకః=జ్ఞానకర్మేంద్రియ రూపమైన, యః=ఏ, ఇంద్రియస్సర్గః=ఇంద్రియసృష్టిగలదో అది చతుర్థః=నాల్గవది, మనః యన్మయం=ఏవైకారికాహంకారతత్త్వము నుండి జన్మించి తత్స్వరూపమని పించికొన్నదో ఆ వైకారికః దేవసర్గః=ఇంద్రియ ప్రేరకులై యతి వికారము నందుట చేత వైకారికులను పేరుగల దేవతల సృష్టి పంచమః. ఇక్కడ

పైశ్లోకములందును ఈ శ్లోకమందును జెప్పఁబడిన నాలుగు "తు"కారముల చేత నీవిషయములు సూచితములైనవి. భూతములలో ద్రవణశక్తి యుండుట చేత ద్రవ్యశక్తి గలది. శబ్దాది తన్మాత్రల స్వరూపము లగుటతో తన్మాత్రశక్తిగలవి. వాగాది కర్మేంద్రియములు క్రియాశక్తిగలవి, శ్రోత్రాదులు జ్ఞానేంద్రియములు. మనస్సు రెండు విధములైన శక్తులు గలది. దేవతలు జ్ఞానశక్తి యున్న వారు. ఈ మూటికిని మూలభూతమైన యహంకారము మువ్విధములైన శక్తి నంది యుండును. మనుష్యుల కంటెను దేవతలు సాత్త్వికులు. తత్త్వాభిమానిదేవతలు హెచ్చు సాత్త్వికులు, వారికంటె నధిక సత్త్వగుణముగలవాఁడు రుద్రుఁడు. అతని కంటె సాత్త్వికుఁడు బ్రహ్మ. వీరిర్వురకును వికారులను పేరు లేదు. తక్కిన యింద్రాదులు ఇంద్రియ రూపముగా వికారము నందుటచే వైకారికులు. జ్ఞానగుణముతో నధికు లగుటచే తైజసులు, ఇంద్రియములకు వికారులుగ నొందుటకు సాధ్యమేగాదు. ఐనను వానికి వైకారికములను పేరు లేదు. విద్యాయోగ్యమైన బ్రాహ్మణ కులమందుఁబుట్టిన యజ్ఞానినే మూర్ఖుఁడందురు. అంతే గాని జ్ఞానయోగ్యత లేని యితరకుల మందుఁ బుట్టిన వానినే మూర్ఖుఁ డనరు. జ్ఞానము స్వల్ప వ్యవహితమగుటచే భూతములకు తామసములని పేరు. పూర్ణ జ్ఞానము గలవాఁడు శ్రీహరి యొక్కఁడే.

17.శ్లో. ప్రభోః=సమర్థుఁడైన బ్రహ్మదేవుని నుండి, యః=షషః, సర్గః, అబుద్ధికృతస్తు=శ్రీహరి యందే మనస్సుంచికొని చేయఁబడినదిగానైనదో, సః=ఆసృష్టి, **తమసః తు=అవిద్యకు** సంబంధించినదే. **తమస్సు, మోహము మహామోహము తామిస్రము అంధతామిస్రము** - అనెడు నైదువిధముల యవిద్యను సృష్టించినాఁడు. **ఇమే=పైనిఁజెప్పిన, షట్=ప్రాకృతాః సర్గాః=** బ్రహ్మాండము బయటి సృష్టులు (**మయా కథితాః**)**మే=నానుండి** పచ్యమానాన్=చెప్పఁబడఁబోవునట్టి, వైకృతాన్=బ్రహ్మాండములోని సృష్టులు, శృణు, బ్రహ్మదేవుఁడు సర్వకాలము లందును పరమాత్మయందే నివిష్టమైన మనస్సు గలవాఁడు. కాని తమోగుణ మాబుద్ధిని హరించు నేమోయని యాతని భయము. అందుకే ప్రత్యేకముగా "అబుద్ధికృతః" అనుట. శ్రీహరి యందలి బుద్ధి యనెడు 'ఏవ' కారముతో బ్రహ్మసదా శ్రీహరి యందే బుద్ధిగలవాఁడని సూచితమైనది, మొదటి 'తు' శబ్దము నుండి భూతముల తామసాంశముతో నవిద్య బ్రహ్మదేవుని చేత సృష్ట మైనదని సూచింపఁ బడినది. దీనికిఁ బ్రమాణము.

**"అబుద్ధి పూర్వమివ తు బ్రహ్మణో హరిబుద్ధితః,**
**తామసానాం తు భూతానాం సహస్రం సత్త్వ భాగినామ్.**
**శతాంశ రజసాం ఏక తమసాం సర్వవేదినామ్,**
**కేవలస్తామసో యోऽంశః సోऽవిద్యా పంచపర్వికా.**

జాతాఽతి కృష్ణా తద్దేహో ద్దైత్య రక్షః పిశాచకాః,
అబుద్ధి పూర్వక స్తస్య ప్రాదుర్భూతస్తమోమయః.
తమో మోహో మహా మోహా స్తామిస్రో హ్యంధ సంజ్ఞితః,
అవిద్యా పంచపర్వై ష్షా ప్రాదుర్భూతా మహాత్మనః.
పంచ పర్వాత్వ విద్యా తు భూతేభ్యో హరిణా పురా,
మద్ధృతా బ్రహ్మణిక్షిప్తా సాపునస్తేన నిస్సృతా.
"తత్స్సృష్టత్వ జ్ఞాపనాయ తస్మాత్సా తామసామతా."

18.శ్లో. ఈ ప్రాకృతవైకృతసృష్టులను వినుటతో ఫలమేమి? అని యాశంకించికొని ఇవి యన్నియు శ్రీహరి క్రీడావిశేషము లగుటచే వీని శ్రవణమునకు ముక్తి యే ఫలమని చెప్పుచున్నాఁడు. రజోభాజః=సృష్టికొఱకై రజోగుణమును బ్రవర్తించున ట్లొనర్చిన, హరిమేధసః=జాజ్వల్యమానమైన బుద్ధిగల, భగవతః=ఇయం ఈ సృష్ట్యాదియైన లీలా=లీల, స్వప్రయో జనమునకై కాదు. యోగ్యులైన పురుషులకు ముక్తి యొసఁగుట కొఱకే యీ క్రీడ. బ్రహ్మపరముగా నన్వయించినచో హరిమేధసః=శ్రీ హరియందే బుద్ధిగల చతుర్ముఖుని క్రీడయని యర్థము. దీని చేత అబుద్ధికృతః =ముందు శ్లోకములో వాడిన పదమును వివరించిన ట్లైనది. శ్రీహరి యనుగ్రహముతో నొనర్చుటచే బ్రహ్మకు ఈ సృష్టికార్యము శ్రమజనకము గాదని లీలా పదముతోఁ దెల్పిన ట్లైనది. ఈ స్రష్టృత్వాదిగుణములు శ్రీహరి యందే ముఖ్యముగా నుండును. "వీతే గుణాః, హరేస్సమ్యక్ స్వాతంత్ర్య విషయాస్సదా" అని ప్రమాణము. యః=తస్తుషాం=స్థావరముల యొక్క ముఖ్యః సర్గః =ముఖ్యస్రోత మనిపించి కొనెడు సృష్టి గలదో (సః) సప్తమః=సః తు, షడ్విధః =స్థావరములు - నేమముగా నొక్కచోటనే యుండుటచే. ప్రాయికముగాఁ బరోపకార మొనర్చి యుత్తమదశనందును. అందుచేత వీనికి ముఖ్యస్రోతములని పేరు.

"స్థాస్ను భిర్నియ మాన్ముఖ్యాస్థి తేర్గతి రవాప్యతే,
ప్రాయః పరోపకర్తృత్వా త్తేషాం ముఖ్యస్రోత స స్తతః"

అని ప్రమాణము,

19.శ్లో. స్థావరముల ఆరురీతులను జెప్పుచున్నాఁడు. వనస్పతులు ఓషధులు, లతలు, త్వక్సారములు, వీరుధములు, ద్రుమములు. వీని వివరణ మింతకు ముందే జరిగినది. ఇవి ఉత్ స్రోతసః=పైకియాహారమును దీసి కొనును. తమఃప్రాయాః=ఎక్కువగా నజ్ఞానముగలవి. అంతస్స్పర్శాః= తాకినచో లోపలజ్ఞానము గలుగును, విశోషిణః=నేల నుండి పెరికి వేసినచో

నశించునవి. తమః ప్రాయః అనుట కల్పవృక్షాదుల కజ్ఞానము లేదని తెలుపుటకు. ఉత్ స్రోతసః అనుదానికి పైకిఁబోవునవి అనునర్థముఁ జెప్పరాదు. మోక్షాధికారులైన దేవతలకు మాత్రమే ఊర్ధ్వగాములని పేరు. ఉత్ స్రోతసః అను శబ్దము దేవతలకును స్థావరములకును వర్తించును, దేవతలను జెప్పునప్పుడు ఉత్తములు అని యర్థముఁ జెప్పవలెను. స్థావరములను జెప్పునప్పుడు ఎత్తుగాఁ బెరుగుటలో ముఖ్యమైనవి అని యనవలెను. దీనికి ప్రమాణము"

'నియమాదూర్ధ్వగం తారో దేవా మోక్షైక భాగినః,
ఊర్ధ్వస్రోతస ఇత్యేవం తస్మాత్తే పరికీర్తితాః.
ఊర్ధ్వ ఇత్యేవ యస్తూచ్య తమ ఏవాభిధీయతే,
ఊర్ధ్వస్రోతసఏతస్మాత్ దేవా ఏవ నతత్పరః
ఉచ్ఛబ్ద ఉచ్యమాత్రేపి తస్మాత్ స్థాస్నుమ భణ్యతే."

20.శ్లో. యః అష్టమః. తిరశ్చాంసరః. సః, అష్టావింశద్విధః మతః. ఈ తిర్యగ్జంతువులు, అవిదః=కార్యాకార్య వివేకము లేనివి. భూరితమసః=నేను నాదను భావము శరీరమందు మాత్రమే గలవి. ఆహార నిద్రలందుఁదప్ప వేరు విషయము లందు జ్ఞానము లేనివి. హృదివేదినః=హృదయమందు జ్ఞానము గలవి. శాస్త్రీయ జ్ఞానము లేనివని తాత్పర్యము. ఈ స్వభావము, స్థావరములు తిర్యగ్జంతువులు - ఈ రెంటికిని జెల్లును. వీని భేదములు ఇరువది యెనిమిదని చెప్పినారు. పైన కొన్నిటి నధికముగాఁ జెప్పినను యజ్ఞమున కుపయోగ పడునను నభిప్రాయముతోను సమానమైన ప్రాణులను ఆయాగుంపులలోఁ జేర్చికొనవలెనను నభిప్రాయముతోను జెప్పఁబడినదని తెలియవలెను. దీని నుండి చేసిన ప్రతిజ్ఞకే లోపమును రాదు ఇందుకు ప్రమాణము.

"అష్టావింశద్విశేషణ యజ్ఞేషూపకృతం యతః,
తిరశ్చాంతావదేవ స్మాద్భణ్యతే శాస్త్రవేదిభిః.
అష్టావింశత్త ధానాస్తు తిరశ్చాం యాస్తు జాతయః,
యో యస్య సదృశస్త్వన్యః సతత్రాంతర్గతో భవేత్.
జల జాంతర్గతా స్సర్వాః కీటాద్యా యాశ్చ జాతయః,
తేషాం జలప్రధానత్వాత్ శరీరస్య తు సర్వశః"

21,22,23,24.శ్లో. సత్తమ=గౌః అజః, మహిషః కృష్ణః=జింక, సూకరః గవయః, రురుః=దుప్పి, అవిః, ఉష్ట్రః, ఇమేచ పశవః, ద్విశఫాః, క్షత్తః! ఖరః, అశ్వః, అశ్వతరః, గౌరః, శరభః, చమరీ ఏతే చ ఏకశఫాః, పంచనఖాన్ పశూన్

శృణు, శ్వా సృగాలః వృకః, వ్యాఘ్రః, మార్జారః, శశః, శల్యకః. ఇంకను సింహము, కోతి, ఏనుగు, తాబేలు, గోద, మొసలి మొదలైనవి ఐదు గోళ్లు గలవి. కంకము, గృధ్రము, శ్యేనము, బాసము, భల్లూకము, నర్తించుపక్షి, బర్హి, హంస, మొదలైనవి. వీనిలో తాబేలు మొదలైనవి జలజంతువులు. ఇది యిరువది ఏడవ భేదము. పక్షులు మొదలైనవి యిరువది యెనిమిదవది. తాబేలు జల జంతువులలోఁ జేరియున్నను పంచనఖమని తెలుపుటకు మరలఁ జెప్పఁబడినది. ఆయా ఆకారములతో సృష్టింపఁబడిన ప్రాణులను సృష్టి కర్తను స్మరించి - మననసేయునధికారి మరల సృష్టికిరాడు. శాస్త్రము ప్రసిద్ధములైన విషయములను స్మరణార్థము అప్రసిద్ధ విషయములను జ్ఞానార్థము తెలుపునని తెలియవలెను. దీనికిఁ బ్రమాణము -

"తత్తదాకారసం యుక్తాన్ సృజ్యాన్ స్రష్టారమేవ చ,
యస్సదా సంస్మరేద్యోగీ న స భూయోఽభిజాయతే."
ఉచ్యతే సుప్రసిద్ధం చ స్మరణార్థం చ కుత్రచిత్,
అప్రసిద్ధం జ్ఞాపనార్థం ద్విధా శాస్త్రవచస్మృతమ్.

25.శ్లో. నవమః, నృణాం, అర్వాక్ స్రోతః, అధోగతిని బొందువారి సృష్టి, ఏకవిధం=ఒకవిధము, తు, ఐనను, రెండు విధములు గలది, అసురులు మొదలైన వారి సృష్టి యొకటి, మనుష్యసృష్టి రెండవది. వారిలో మనుష్యులు - రజోధికాః=భౌతికమైన రజోభాగము నుండి పుట్టిన వారగుటచే, రజోగుణమం దాసక్తులు. అందుచేతనే కర్మపరాః,=ఏదో యొక పనిని చేయుచుండువారు. అసురులు మొదలైన వారు. దుఃఖే చ=సుఖమానినః= సుఖమను విపరీతజ్ఞానము గల వారు. అనఁగా నన్ని విషయము లందును అన్యథా జ్ఞానమే అసురుల లక్షణము. చ, శబ్దముతో మనుష్యులు. యథార్థ, అయథార్థజ్ఞానములు రెండును గలవారని యర్థము. యథార్థజ్ఞానమున్న వారు అధోగతికిఁ జెందిన వారని యేలఁ చెప్పవలసి వచ్చినది? తెలిసినను శుభప్రయత్నమునకుఁ బూనుకొనని వారుగనుక తమోగుణముచే నాచ్ఛన్నమై రజస్సుతోఁ బుట్టిన వారు. భూరితమసః=అని యింతకు ముందుఁజెప్పఁబడినారు. ఇది యసురులకుఁగూడ లక్షణమని తెలియవలెను. ప్రమాణము.

"రజో నిష్ఠాస్తమోనిష్ఠాః ద్వేధాఽర్వాక్స్రోతసస్మృతాః,
అసురాద్యాస్తమోనిష్ఠాః మానుషాస్తు రజోధికాః."

"దేవతలు సర్వథా యథార్థ జ్ఞానులు. అసురులు అన్యథాజ్ఞానులు. మనుష్యులకు రెండు విధములైన జ్ఞానము లుండును.

"ప్రాయోఽధోగమనం యస్మాత్త యత్నేన వినా భవేత్,
అర్వాక్స్రోతస ఇత్యేవ మానుషాః పరికీర్తి తాః."

అనెడు ప్రమాణముతో మనుష్యుల కధోగతి నియమముగాదని తెలియవలెను. తిర్యక్కులు స్థావరములు బుద్ధి పూర్వకముగా మనుష్యులు అసుర రాక్షస పిశాచాదులు వీ రందరికిని అర్వాక్ స్రోతస్సులని యే పేరు కాని నియతముగా నర్వాక్ స్రోతస్సులు అసురులే,

"తిరశ్చాం స్థావరాణాం చ బుద్ధి పూర్వ ప్రవర్తినామ్,
అసురాణాం రక్షసాం చ పిశాచానాం తథైవ చ."
"అర్వాక్ స్రోతస్త్వ ముద్దిష్టం నియ మాదసురాధినామ్"

దీని చేత జీవులు ముక్తి యోగ్యులు తమో యోగ్యులు మిశ్రులు నని మూఁడు రీతులని తెలియవలెను.

26.శ్లో. సత్తమ! ఏతే=ఈ స్థావర తిర్యక్, మనుష్య సృష్టులనెడి, త్రయ ఏవ=వైకృతాః=బ్రహ్మాండము లోపలి సృష్టులు, దేవ సర్గశ్చ=దేవతల సృష్టియు నింతే, తు=ఐనను, వైకారికః దేవసర్గః ప్రోక్తః, సః=అది, కౌమారః తు, బ్రహ్మాండము లోపలి సృష్టియు నగును. అందుచే నుభయాత్మకః= ప్రాకృతవైకృతములను రెండు వేదములును దేవతలకుఁజెందునని భావము. బ్రహ్మాండము బయట సృష్టింపఁబడిన దేవతలను మరల బ్రహ్మాండము లోపలఁగూడ సృష్టించుటచే వా రు భయాత్మకులు. కౌమారమనఁగా వైకృతమని యర్థము. కౌ=భూమిపైన, మా=నిర్మాణమును, అర=పొందిన వాఁడు. ప్రమాణము-

"కౌమారంతీతి కౌమారాః దేవానా మండ జోద్భవాః,
వైకారికానాం జననాత్ ప్రాకృతో వైకృతశ్చ సః." ఇత్యాది.

27-28.శ్లో. దేవతలసృష్టి యెనిమిది రీతులు. వీరిలో దేవతలు పితరులు అసురులు గంధర్వులు మొదలైన వా రందఱుఁ జేరినారు. విదురా! విశ్వసృట్కృతాః=బ్రహ్మదేవునిచేఁ జేయఁబడిన, ఏతే దశసర్గాః=దేవతల యొక్క, ప్రాకృత వైకృతములు రెండును జేరిన పది సృష్టులు, తే కథితాః సర్వజ్ఞులైన - (తమతమ యోగ్యతకుఁదగిన) దేవతలు, తత్పూజ కర్తులైన నృత్యగాన కారులు మొదలైన వారు. దేవతలలో నెన్మిదిరీతులు. 'చ' శబ్దముతో మరి కొందరుఁగూడ నంతర్భావము. సర్వజ్ఞులైనదేవతలు నూఱు మంది, పితరులు ముప్పది మంది, యసురులు రెండు నూర్లు, గంధర్వులు మరియు నప్సరసలు ఏబది మంది, యక్షరాక్షసులు ముప్పది మంది, చార ణులు నూఱు మంది, సిద్ధులు తక్కిన ముప్పది మంది - వీరు మాత్రమే

ఊర్ధ్వస్రోతస్సులు. అనఁగా నియతముగా ముక్తి నందినవారు. తక్కిన వారు అర్వాక్ స్రోతస్సులు. కాని వీరందఱికిని దేవతలని యే పేరు. బ్రహ్మాండము లోపల జన్మించెడి దేవతలకు సత్త్వరజస్తమోగుణముల తో నుత్పత్తి. ఇది వారి వారి యోగ్యతాను సారముగ ననేక రీతులు. వివరమును భాగవత తాత్పర్యము నుండి తెలిసి కొన వచ్చును. శాపాది దోషములతో దేవతలు భూమి యందు జన్మించినను వారి వారి భూతగుణస్వభావముతో దేవత్వ అసుర త్వాదులను దెలియవలెను,

29. శ్లో. మూల సృష్టి పరమాత్మ నుండియే యగుఁగాక! మన్వంతరాదు లలో నయ్యేడు అవాంతరసృష్టి వేరు వారిచే నెందుకుఁ గారాదు? అని యాశంకింప రా దను చున్నాఁడు. - అతః పరం=వంశాన్, మన్వంతరాణి చ, ప్రవక్ష్యామి, ఏవం, రజః ప్లుతః=రజస్సు మొదలైన గుణముల మధ్య నుండియు గుణ స్పర్శ లేని, స్రష్టా=ఆత్మ భూః, అమోఘ సంకల్పః, హరి, ఆత్మనా=తన యిచ్ఛచేతనే, ఆత్మ ఇవ=స్వతంత్రుఁడయిన తానే, ప్రకృతిని ఉపాదాన కార ణముగా నుంచి కొని దేవతల దేహములను సృష్టించి తన్నియామకుఁడై, ఆత్మానం=తన యనేకరూపములను కల్పాదిషు=బ్రహ్మకల్ప దినకల్ప మన్వంతరాదులందు, సృజతి=వ్యక్త మొనర్చును. స్రష్టా, అనుటతో బ్రహ్మాదులు ద్వారమంత్రులేయని తెలియవలెను. ఆత్మభూః అనుటతో నింద్రాదులం దొక్కఁడు గాదని సూచితము. హరిః అనుటతో బ్రహ్మ గాదు, రజఃప్లుతః=అనుటకు రజోగుణముతో వికారము నొందిన వాఁడై అని యర్థముఁ జెప్పరాదు. ప్రమాణము -

**"గుణాప్లుతో హరిర్నిత్యం గుణానాం మధ్యగో యతః,**
**అనహం వేదనాత్తస్య గుణాసంస్పర్శ ఏవ చ."**

శ్రీహరి తన యనేకరూపములను వ్యక్త మొనర్చినాఁడనుటకుఁ బ్రమాణము

**"సృష్ట్వా దేవాది దేహాన్ స ఆత్మానం బహుధాఽకరోత్,**
**తన్ని యంతృత యాఽఽత్మానం ప్రకృతిం దేహభేదతః."**

ఒక్కఁడే కర్మముఁ గర్తయు నగుటెట్లు? అను శంకాపరిహారమునకు ఈ ప్రమాణమును వినియోగించికొనవలెను,

**"కర్తా చ కరణం చైవ కర్మచైవ స్వయం హరిః,**
**ఆత్మనో బహుధా భావే ప్రకృతేస్తు స్వతంత్రతాః**
**- "ఈ యభిప్రాయముతోనే అమోఘసంకల్పః" అనునది.**

30.శ్లో. అట్లైనచో నీ సృష్టికి మొదలెప్పుడు? ఈ ప్రశ్న కవకాశము లేదని యుదాహరణముతో నిరూపించుచున్నాఁడు. అధీశితుః=మా యా విత్యాత్ః=ఇచ్ఛతోనే నియత మగుటచేత, ఏతస్మిన్=గుణ వ్యత్యయే= గుణవ్యతికర రూపమైన సృష్టి యందు, యథా=నద్యాంభ్రామ్యత్ భ్రమేః =సుడిమొదలైన వానికి, ఎట్లో అట్లు, పౌర్వాపర్యం మొదలు ఆతరువాత, అను దానిని విపశ్చితః,=జ్ఞానులు, న ఇచ్ఛంతి=ఇచ్ఛించుట లేదు. అనఁగా సృష్టి స్థితి ప్రళయములు చక్రాకారముగా నగుచుండునపుడు దీనికి మొద లెప్పుడని చెప్ప సాధ్యము గాదని యర్థము.

31.శ్లో. ఈ కల్పమందు సృష్టింపఁబడిన దేవతలు మొదలైన వారి యొక్క నామరూపములకు భిన్నులైన వారు రాఁబోవుకల్పమందు సృష్టింపఁ బడుదు రనెడు భ్రాంతిని పోఁగొట్టుచున్నాఁడు. అస్మిన్ కల్పే, యేయేదేవతలు అసురులు మొదలైన వారు, ప్రకీర్తితాః=ఏ నామరూపములతోఁ బిలువఁ బడుదురో, మన్వంతరాంతరే=మరియొక్క కల్పమందును, తే ఏవ=వారే, నామరూపాభ్యాం=ఆసన్=అయ్యెదరు. ఈ బ్రహ్మ కల్పమం దున్నట్లుగనే, బ్రహ్మ, ఇంద్రుఁడు వాయువు, మొదలైన నామరూపములు గల దేవతలు రాఁబోవు కల్పమందుఁగూడ నుందురని తెలియవలెను. కాని అపదవులకు వచ్చెడు జీవులు మాత్రము భిన్నులుగా నుందురు. పూర్వకల్పమందలి జీవులు ముక్తులైనచో వేఱు యోగ్యతగల జీవు లాపదవులకు వచ్చి నామ రూపములతో కార్యమును సల్పుదురు. దినకల్పమందు ఇంద్రాది పదవులలో నుండు జీవులే తర్వాతి దినకల్పమందును ఇంద్రాది పదవులలో నుందురు. ప్రతి దిన కల్పమందును పదునాలుగు మన్వంతరములకు అగును. ఆయా మన్వంతరములలో ఏ నామరూపముల దేవత లుందురో రాఁబోవుదిన కల్పము లందలి ఆయా మన్వంతరములందు అవే నామరూపములు గల దేవతలు మొదలైన వారు సృష్టింపఁబడుదురు,

ఇతి శ్రీమద్భాగవతే, మహా పురాణే అష్టాదశ
సహస్ర సంహితాయాం, పారమహంస్యాం, వైయాసిక్యాం,
శ్రీహయగ్రీవ బ్రహ్మవిద్యాయాం,
తృతీయస్కంధే దశమోఽధ్యాయః.

# దశమాధ్యాయము

కం. అని చెప్పిన మైత్రేయునిఁ
గనుఁగొని విదురుండు వలికెఁ గడు ముద మొప్పన్
జననుత! నలినదళాక్షుఁడు
సనినం బద్మజుఁడు దేహసంబంధమునన్. 332

కం. మానససంబంధంబును
బూనిన యీ సర్గమెట్లు పుట్టించె? దయాం
భోనిధివై నా కింతయు
మానుగ నెఱిఁగింపుమయ్య మహితవిచారా! 333

వ. అనవుడు నమ్మునివరేణ్యుండు విదురున కిట్లనియె. పుండరీకాక్ష వరదాన ప్రభావంబునం బంకజాసనుండు శతదివ్యవత్సరంబులు భగవత్పరంబుగాఁ దపంబు గావించి తత్కాలవాయువుచేఁ గంపితం బగు నిజనివాసంబైన పద్మంబును, వాయువును, జలంబులను గనుంగొని యాత్మీయ తపశ్శక్తిచేత నభివృద్ధిం బొందిన విద్యాబలంబున వాయువు బంధించి తోయంబులతోడ నొక్కతోయంబ సమస్తంబునుం గ్రోలి యంత గగనవ్యాపియగు జలంబును గనుంగొని. 334

ఉ. వారిజసంభవుండు బుధవంద్యుఁడు చిత్తమునం దలంచె దై
త్యారిఁ బయోవిహారి, సముదంచితహారి, నతాఖిలామృతా
హారి, రమాసతీ హృదయహారి, నుదారి, విదూర భూరి సం
సారి, భవప్రహారి, విలసన్నుతసూరి, నఘారి నయ్యెడన్. 335

తే. అట్లుదలఁచి సరోజజుఁ డంబుజమును
గగన తలమునఁ జూచి యా కమలకోశ
లీనమైయున్న లోక వితానములను,
నొయ్యఁ బొడగని హరిచే నియుక్తుఁడైన. 336

తే. వానిఁగాఁ దన్నుఁ దలఁచి య వ్వనరుహంబు
లోపలికిఁ బోయి మున్నందులోన నున్న
ముజ్జగంబులఁ జూచి యిమ్ముల సృజించె
మఱి చతుర్దశ భువనముల్ మహిమఁజేసి. 337

కం. పరగ సుధాశన తిర్య
గ్నర వివిధస్థావరాది నానాసృష్టి
స్ఫురణ నజుం డొనరించెం
బరువడి నిష్కామధర్మ ఫలరూపమునన్. 338

వ. ఇట్లు భువనంబులఁ బద్మజుండు గల్పించె నని మైత్రేయుండు విదురున కెఱింగించిన. 339

కం. విదురుఁడు దురితావని భృ
ద్భిదురుఁడు మునివరునిఁ జూచి ప్రియము మనమునన్
గదురగ నిట్లని పలికె న
తి దురంతంబైన విష్ణుదేవుని మహిమన్. 340

తే. అమరె భువనంబు లతని కాలాఖ్యతయును
గణుతిసేయు తదీయలక్షణము లర్థి,
నాకు నెఱిఁగింపు మయ్య వివేకచరిత!
యనిన మైత్రేయుఁ డవ్విదురునకు ననియె. 341

సీ. ఆద్యంత శూన్యంబు నవ్యయంబును నగు
తత్త్వమింతకు నుపాదాన మగుట
గుణవిషయములు గైకొని కాలమును మహా
దాదిభూతములుఁ దన్నాశ్రయింపఁ
గాలాను రూపంబుఁ గైకొని యీశుండు
దన లీలకై దనుఁ దా సృజించెఁ
గర మొప్ప నఖిలలోకములందు దానుండుఁ
దనలోన నఖిలంబుఁ దనరుచుండు

తే. గాన విశ్వమ్మునకుఁ గార్యకారణములు
దాన యమ్మహాపురుషుని తనువువలనఁ
బాసి విశ్వంబు వెలియై ప్రభాస మొందె
మానితాచార! యీ వర్తమానసృష్టి. 342

కం. తెఱఁగొప్ప నఖిల విశ్వముఁ
బురుషోత్తము మాయవలనఁ బుట్టుం బెరుఁగున్
విరతిం బొందుచు నుండుం
గరమర్థిన్ భూతభావికాలములందున్. 343

వ. అట్టి సర్గంబు నవ విధంబు, అందు ప్రాకృతవైకృతంబులు గాలద్రవ్యగుణంబులను త్రివిధంబులగు భేదంబులచేతఁ బ్రతిసంక్రమంబు లగుచు నుండు, అందు మహత్తత్త్వంబు ప్రథమ సర్గంబు. అది నారాయణ నకాశంబున గుణవైషమ్యంబు నొందు. ద్రవ్య జ్ఞాన క్రియాత్మకంబైన యహంకారతత్త్వంబు ద్వితీయసర్గంబు, శబ్ద స్పర్శ రూప రస గంధంబులను పంచతన్మాత్ర ద్రవ్యశక్తి యుక్తంబైన పృథివ్యాది భూతసర్గంబు మూఁడవదియై యుండు. జ్ఞానేంద్రియం బులైన త్వక్చక్షుః శ్రోత్ర జిహ్వాఘ్రాణంబులుఁ, గర్మేంద్రియంబులైన వాక్పాణి పాదపాయూ వస్థలు, నను దశవిధేంద్రియ జననంబు చతుర్థ సర్గంబు. సాత్త్వికాహం కార జనితంబైన సుమనోగణ సర్గం బైదవ సర్గంబై యొప్పు. అది మనోమయంబై యుండు. జీవలోకంబునకు నబుద్ధికృతంబులైన యావరణ విక్షేపంబులంజేయు తామస సర్గం బాఱవదై యుండు. ఇయ్యాఱు నీశ్వరునకు లీలార్థంబులైన ప్రాకృత సర్గంబు లయ్యె. ఇఁక వైకృతసర్గంబు నేడవది మొదలుగాఁగలుగు నవి వినిపింతు వినుము. పుష్పోత్పత్తి రహితంబులై ఫలించెడు నశ్వత్థోదుం బర పనస న్యగ్రోధాదు లయిన వనస్పతులును, పుష్పితంబులై ఫలపాకాంతంబులైన వ్రీహి యవ ముద్గాద్యోషధులును, నారోహణా నపేక్షంబులైన మాలతీ మల్లికాదిలతలును, త్వక్సారంబులైన వేణ్వాదు లును, కఠినీభూతమూలంబులున్ శిఖావిస్తృతంబులున్నగు లతావిశేష రూపంబులైన వీరుధంబులును, పుష్పవంతంబులై ఫలప్రాప్తంబులగు చూతాదిద్రుమంబులును, నవ్యక్త చైతన్యంబులు, నూర్ధ్వస్రోతంబులు, నంతస్స్పర్శంబులు, తమఃప్రాయంబులునై స్థావరంబులగు నీయాఱు నేడవసర్గం బయ్యె. ఎనిమిదవ సర్గంబు తిర్యక్సర్గంబు. ఇది యిరువదియె నిమిది భేదంబులు గలిగి శ్వస్తనాది జ్ఞాన శూన్యంబులై యాహారాది జ్ఞాన మాత్రనిష్ఠంబులై, ప్రాణంబు వలన నెఱుంగందగిన వాని నెఱుంగుచు, హృదయంబున దీర్ఘానుసంధాన రహితంబులై వర్తించు ద్విశఫలంబులు గల వృషభ మహిషాజ కృష్ణ సూకరోష్ట్ర, గవయ రురు మేష ముఖర నవకంబును, నేకశఫంబుగల ఖరాశ్వా శ్వతర గౌర శరభ చమర్యాది షట్కంబును పంచనఖంబులుగల శునక, సృగాల, వృక,

వ్యాఘ్ర, మార్జార, శశ, శల్యక, సింహ, కపి, గజ, కూర్మ, గోధా ముఖ భూచర ద్వాదశకంబును, మకరాది జలచరంబులును, గంక గృధ్ర బక, శ్యేన భాస భల్లూక, బర్హి హంస సారస చక్రవాక కాకోలూకాది ఖేచరంబులు నయ్యె. అర్వాక్స్రోతంబై యేక విధంబగు మానుష సర్గంబు రజోగుణ ప్రేరితంబై కర్మకరణ దక్షంబై దుఃఖంబందును సుఖంబుగోరు. ఇది తొమ్మిదవ సర్గం బనందగు. ఈ త్రివిధ సర్గంబులు వైకృతంబులనంబడు. ఇంక దేవసర్గంబు వినుము. అదియు నెనిమిది తెఱంగులు గలిగియుండు. అందు విబుధ పితృ సురాదులు మూఁడును, గంధర్వాప్సరస లొకటియు, యక్షరక్షస్సు లేకంబును, భూతప్రేత పిశాచంబు లొకటియు, సిద్ధచారణ విద్యాధరు లేకంబును, గిన్నర కింపురుష లొకటియునుంగా దేవసర్గం బయ్యె. ఇట్టి బ్రహ్మనిర్మితంబులైన దశవిధ సర్గంబులు నెఱింగించితి. ఇంక మనువులం దంతరంబుల నెఱింగించెద. కల్పాదులయందు నీ ప్రకారంబున స్వయంభూతుండును, నమోఘసంకల్పుండును నగు నప్పుండరీకాక్షుండు రజోగుణ యుక్తుండై, స్రష్ట యగుచు స్వస్వరూపంబైన విశ్వంబు నాత్మీయ సామర్థ్యంబునం గల్పించె. అ య్యీశ్వరుని మాయా వ్యాపారంబులచే నీ సృష్టియందు నద్యావర్తంబులంబడి భ్రమించుచున్న మహీరుహంబులంబోలెఁ బూర్వాపరభావంబు లెఱుంగంబడకుండు. ఈ కల్పంబు నందుండు దేవాసురాదులు ప్రతిమన్వంత రంబునందును నిట్ల నామ రూపంబులచే నిర్దేశింపంబడుదురు. మఱియు నిందొక విశేషంబు నెఱింగించెద. ఏ మన్నను కౌమారసర్గం బనునది దేవ సర్గాంతర్భూతం బయ్యును బ్రాకృత వైకృతోభయాత్మకంబై దేవత్వ మనుష్యత్వ రూపంబైన సనత్కుమారాది సర్గం బనంబడె, అమోఘ సంకల్పుం డైన పుండరీకాక్షుండు దనుఁదాన యిట్లు విశ్వభేదంబు గల్పించె అని మైత్రేయుండు విదురునకుఁజెప్పి కాలలక్షణం బెఱింగించువాఁడై యిట్లనియె.

332. ముదము=సంతోషము, జననుత=జనులచేత, కొనియాడఁబడువాఁడా!, నళినదళ+అక్షుఁడు=తామరరేకులవంటి కన్నులుగలవాఁడు, పద్మజుఁడు=కమలము నుండి జన్మించినవాఁడు (బ్రహ్మ).

333. సర్గము=సృష్టి, దయా+అంభోనిధివై=కృపాసముద్రుఁడవై, మానుగన్=చక్కఁగా,మహితవిచారా=గొప్ప ఆలోచనలుగలవాఁడా,

తాత్పర్యము : అని పలికిన మైత్రేయ మహర్షిని చూచి విదురుఁడు మిక్కిలి సంతోషముతో ఇట్లన్నాఁడు. దొడ్డ తలంపులుగల మైత్రేయ మహామునీ! విష్ణుదేవుఁడంతర్ధానమైన తరువాత దేహసంబంధము, మనస్సంబంధముగల ఈ సృష్టిని బ్రహ్మ యెట్లు చేసినాఁడు? నీవు గొప్ప తలంపులు గలవాఁడవు. కృపాసముద్రుఁడవు. నాకు ఈ విషయమంతయు విశదముగ తెల్పుము.

334. ఆ+మునివరేణ్యుఁడు=మునులలో శ్రేష్ఠుఁడగు మైత్రేయుఁడు, పుండరీక+అక్ష వరప్రభావమునన్=పద్మ పత్రములవంటి నేత్రములు గల నారాయణుఁడు వరమిచ్చుట వలన ఁగలిగిన మహిమచేత, పంకజ+ఆసనుండు=బ్రహ్మదేవుఁడు, కంపితము=చలింపఁ జేయఁ బడినది. నిజనివాసము=తానుండు చోటు, ఆత్మీయ తపశ్శక్తి= తనయొక్క తపోబలము, తోయంబులు=నీళ్ళు, ఒక్క తోయంబు+అ= ఒక్కసారిగా, క్రోలి=త్రాగి, గగనవ్యాపి=ఆకాశమందు వ్యాపించినది.

తాత్పర్యము : నారాయణుఁ డనుగ్రహించిన వరప్రభావము వలన బ్రహ్మదేవుఁడు నూరు దివ్య సంవత్సరములు ఆ భగవంతుని గూర్చి తపము చేసినాఁడు. అప్పుడు వీచిన పెనుగాలి చేత చలించిన నిజనివాసమైన పద్మమును, నీటిని అతఁడు చూచినాఁడు. తన తపశ్శక్తి వలన వృద్ధి చెందిన ఉపాసనా బలముతో వాయువును నిరోధించినాఁడు. జలము లన్నింటిని ఒక్కసారిగా త్రాగివైచినాఁడు. పిదప గగనమంతట వ్యాపించి యున్న జలమును చూచినాఁడు.

335. వారిజ సంభవుండు=పద్మమునుండి పుట్టినవాఁడు (బ్రహ్మ), బుధవంద్యుఁడు=పండితులచే నమస్కరింపఁదగినవాఁడు, చిత్తము= మనస్సు, దైత్య+అరి=రాక్షసులకు విరోధి (నారాయణుఁడు), పయో విహారి=జలములందు విహరించువాఁడు, సముదంచిత హారి= ఒప్పిదములైన హారములు గలవాఁడు, నత+అఖిల+అమృత+ఆహారి= అమృతమును ఆరగించు సమస్త దేవతలచే నమస్కరింపఁ బడువాఁడు, రమా సతీ హృదయహారి=లక్ష్మీదేవి మనస్సును హరించువాఁడు, ఉదారి=ఉదారస్వభావుఁడు, వితరణశీలి, విదూరభూః సంసారి=సంసార దుఃఖములను దూరము చేయువాఁడు. భవప్రహారి=పుట్టుకలను నిర్మూలించువాఁడు, విలసత్+నుత+సూరి= విద్వాంసుల పొగడ్తలచే విలసిల్లువాఁడు. అఘ+అః=పాప విరోధి, ఆ+ ఎడన్=అక్కడ.

తాత్పర్యము : పండిత వంద్యుఁడగు బ్రహ్మదేవుఁడు రాక్షసులకు శత్రువైన వాఁడును, జలములందు విహరించువాఁడును, సుందరములైన హారములు ధరించిన వాఁడును, సకల దేవతలచే నమస్కరింపఁ బడువాఁడును, లక్ష్మీదేవి చిత్తమును హరించు వాఁడును, ఉదార స్వభావుఁడును, పుట్టుకలను పోకార్చువాఁడును, విద్వాంసుల పొగడ్తలచే విలసిల్లు వాఁడును, కలుషములను హరించు వాఁడును అగు శౌరినప్పుడు తన మనస్సులో స్మరించినాఁడు.

336, 337. సరోజజుఁడు=పద్మమునుండి పుట్టినవాఁడు (బ్రహ్మ), అంబుజము=పద్మము, కమలకోశలీనము=తామర మొగ్గలో అణఁగినది, లోక వితానములు=జగముల సమూహములు, ఒయ్యన్=తిన్నగా, నియుక్తుఁడు=నియమింపఁబడినవాఁడు, వనరుహము=నీటఁ బుట్టినది (పద్మము), మున్ను=పూర్వము, ముజ్జగంబులు=మూడు జగములు, ముల్లోకములు (స్వర్గ మర్త్య పాతాళములు) చతుః+దశ భువనములు పదు నాల్గు లోకాలు -- భూలోకము, భువర్లోకము, సువర్లోకము, మహర్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము -- అను నీ సప్త సంఖ్యాకములైన లోకాలు ఊర్ధ్వలోకములు. అతలము, వితలము, సుతలము, రసాతలము, మహాతలము, తలాతలము, పాతాళము -- అను నేడును అధోలోకములు.

తాత్పర్యము : ఆ విధముగ విధాత శ్రీహరిని స్మరించి ఆకాశమునందు పద్మమునుజూచి ఆపద్మ కోశమున అణఁగియున్న లోక సమూహములను తిన్నగా కనుగొన్నవాఁడై తన్ను నారాయణునిచే లోక సృష్టికార్యమునకు నియమింపఁబడినవానిగా భావించి ఆ కమల కోశములోనికి ప్రవేశించినాఁడు. అంతకుముందే అందున్న ముల్లోకములను చూచినాఁడు. తదుపరి తన తపో మహిమవల్ల పదునాల్గు లోకాలను చక్కగా సృజించినాఁడు.

338. సుధా+అశన=అమృతము ఆహారముగాగల దేవతలు, తిర్యక్=పశువులు, పక్షులు, నర=మానవులు, వివిధ=పలురకములైన, స్థావర+ఆది=కదలని పర్వతారణ్యములు మొదలైన, అజుఁడు=బ్రహ్మ.

తాత్పర్యము : బ్రహ్మదేవుఁడు ప్రతిఫల మాశింపక నిజధర్మమైన సృష్టి కార్యమును నిర్వర్తించినాఁడు. అతఁడు దేవతలను, మనుజులను, పశువులను, పక్షులను, స్థావరములైన పర్వతా రణ్యాదులను సృష్టించి నాఁడు.

339. భువనములు=లోకములు.

తాత్పర్యము : ఈ రీతిగా బ్రహ్మ లోకములను సృష్టించినాఁడని మైత్రేయుఁడు విదురునకుఁదెల్పినాఁడు.

340, 341. దురిత+అవనిభృత్ భిదురుఁడు=పాపములనెడి పర్వతములకు వజ్రాయుధము వంటి వాఁడు, కదురఁగన్ అతిశయించఁగా, కాల+ఆఖ్యతయున్=కాలమనెడి నామమును, గణుతి చేయు=లెక్కించు, వివేకచరిత=జ్ఞానయుక్తమైన నడవడి గలవాఁడా!

తాత్పర్యము : పాపము లనెడు పర్వతములకు వజ్రాయుధము వంటి వాఁడైన విదురుఁడు మునిశ్రేష్ఠుఁడగు మైత్రేయుని జూచి తన మనసులో ప్రీతి నెలకొనఁగా ఇట్లన్నాఁడు. అపరిమితమైన విష్ణుమహిమ వల్లనే లోకములు వెలుఁగొందుచున్నవి. కాలస్వరూపుఁడైన ఆ మహనీయుని లక్షణము లెట్టివో ప్రీతితో నాకు తెల్పుము. అనఁగా విని మైత్రేయుఁడు విదురున కిట్లన్నాఁడు.

342. ఆది అంత శూన్యంబు=మొదలు, తుద లేనిది, అవ్యయంబు= నశింపనిది, ఉపాదానము=కారణ విశేషము ఘటోత్పత్తికి మట్టి ఉపాదాన కారణము, కుమ్మరి నిమిత్త కారణము. ఇట్లే విశ్వ నిర్మాణమునకు ఉపాదాన నిమిత్త కారణములు రెండును సర్వేశ్వరుఁడైన శ్రీమన్నారాయణుఁడే. గుణ విషయములు=సత్త్వ రజస్తమస్సులు గుణములు, విషయములనఁగా ఇంద్రియార్థములైన శబ్ద స్పర్శ రూప రస గంధములు, మహత్+ఆది+భూతములు మహత్తు మున్నుగాఁ గలిగిన పంచ భూతములు, అఖిలము=సమస్తము, తనరుచున్+ఉండున్=ఒప్పుచుండును, తనువు=శరీరము, మానిత+ ఆచార=ఆదరింపఁబడిన ఆచారము గలవాఁడా!

తాత్పర్యము : ఆదరింపఁబడిన ఆచారముగల విదురా! వినుము. ఆద్యంతములు లేనిది, అవ్యయమునగు పరబ్రహ్మ తత్త్వమే ఈ జగత్సృష్టికి మూలకారణము. సత్త్వరజస్తమో గుణములు, ఇంద్రియార్థములనఁదగు శబ్ద స్పర్శరూప రస గంధములు, కాలము, మహత్తు మున్నుగాఁగల పృథివ్యాపస్తేజోవాయు రాకాశములనెడు పంచ భూతములు తన్నాశ్రయించఁగా ఆ కాలమునకు అనుగుణమైన రూపు ధరించి ఈశ్వరుఁడు తన వినోదమునకై తన్ను దాను సృష్టించు

కొనుచున్నాఁడు. ఆతఁడు తన లీలకై సృజించిన సమస్త లోకములందు తానుండును. సమస్త లోకములు ఆతనియందుండును. కనుక ఈ ప్రపంచమునకు కార్యము, కారణము అను రెండును ఆతఁడే యగుచున్నాఁడు. ఆ పరమేశ్వరుని శరీరము నుండి విడివడి ఈ విధముగా ఈ వర్తమాన సృష్టి విలసిల్లుచున్నది.

343. అఖిలవిశ్వము=సమస్త ప్రపంచము, విరతి=వినాశము.

తాత్పర్యము : పద్ధతి ప్రకారము సమస్త విశ్వము పురుషోత్తముఁడైన నారాయణుని మాయచేత పుట్టుచు, పెరుగుచు, గిట్టుచున్నది. భూతకాలమున ఇట్లే జరిగినది. భవిష్యత్కాలమందును ఇట్లే జరుగఁ గలదు.

344. సర్గము=సృష్టి, నవవిధము=తొమ్మిది రకములు, ప్రాకృత వైకృతంబులు=ప్రకృతి నుండి వికృతినుండి యేర్పడునట్టి సృష్టులు, ప్రథమసర్గంబు=తొలిసృష్టి, నారాయణసకాశంబునన్=నారాయణుని మ్రోల, గుణ వైషమ్యము=గుణభేదము, ద్వితీయ సర్గంబు=రెండవసృష్టి, పంచతన్మాత్రలు జ్ఞానేంద్రియములైన చర్మము, కన్ను, చెవి, నాలుక, ముక్కు అనెడు ఐదింద్రియముల ధర్మములైన శబ్ద స్పర్శ రూప రస గంధములు, పృథివీ+ఆది=భూమి మున్నగు, భూత సర్గంబు= పంచభూతముల సృష్టి, వాక్ పాణి పాద పాయు+ఉపస్థలు వాక్కు చేతులు, కాళ్లు, మూత్రద్వారము, మలద్వారము అను నైదును కర్మేంద్రియాలు, చతుర్థ సర్గము=నాల్గవ సృష్టి, సాత్త్విక+అహంకార జనితము=సాత్త్వికమైన అహంకారమునుండి కలిగినది, సుమనో గణ సర్గంబు=దేవతా సమూహము యొక్క సృష్టి, లీలా+అర్థంబులు= వినోదము కొఱకైనవి, అశ్వత్థ=రావి, ఉదుంబర=మేడి, పనస=పనస, న్యగ్రోధ+ఆదులు=మఱ్ఱి మొదలైనవి. వనస్పతులు=పూలుపూవక ఫలించునవి, ఫలపాక+అంతంబులు=ఫలించిన వెంటనే నశించునవి, వ్రీహి+యవ+ముద్గ+ఆది+ఓషధులు=వరి, గోధుమ, యవలనెడు ధాన్యము, పెసర మున్నగు ధాన్యములు, త్వక్సారములు=బలమున్న తోలుగలవి, గట్టి బెరడు గలవి, వేణు+ఆదులు=వెదురుగడలు మొదలైనవి, కఠినీభూత మూలంబులు=గట్టి వేళ్లు గలవి, వీరుధంబులు= పొదలు, చూత ఆది ద్రుమంబులు=పుష్పించి ఫలించునట్టి మామిడి మొదలగు వృక్షములు, అవ్యక్త చైతన్యంబులు=వ్యక్తముగాని

జ్ఞానముగలవి, ఊర్ధ్వస్రోతంబులు=పైకెగఁబ్రాకునవి, అంతస్స్పర్శం బులు=అంతర్భాగమందు స్పర్శనా బోధగలవి, తిర్యక్ సర్గము=భక్షణ పదార్థమును క్రిందినుండి ముఖముద్వారా పైకి తీసికొను జంతుసృష్టి, శ్వస్తనాది జ్ఞాన శూన్యంబులు=నిన్న నేడు రేపు అనెడు జ్ఞానము లేనివి, ఆహార+ఆది జ్ఞానమాత్రనిష్ఠంబులు=ఆహారము గైకొనుపాటి జ్ఞానము మాత్రమే కల్గినవి, ఘ్రాణము వలనన్=మూచూచుట వల్ల, హృదయంబునన్ మనస్సులో, దీర్ఘ+అనుసంధాన రహితంబులు= చాలకాల ముండని సుఖ దుఃఖాదులు గలవి, ద్విశఫంబులు=రెండు గిట్టలు గలవి, వృషభ=ఎద్దు, మహిష=దున్నపోతు, కృష్ణసారము=నల్ల చారలుగల యిఱ్ఱి, సూకర=పంది, ఉష్ట్ర=ఒంటె, గవయ=పశువువలె నుండు ఒక అడవి మృగము, రురు=పెక్కు కొమ్ములున్న లేడిజాతిదగు దుప్పి, మేష=మేక, ముఖర=మొదలైన, నవకంబు=తొమ్మిది, ఏకశఫము=ఒకే గిట్ట, ఖర=గాడిద, అశ్వ=గుఱ్ఱము, అశ్వతర=కంచర గాడిద, గౌర=గౌరమృగము ఏకశఫముగల ఒక జాతి జంతువు, శరభ= మీఁగండ్ల మెకము, చమరీ+ఆది షట్కము=సవరపు మెకము మొదలుగాఁగల ఆరు, పంచనఖంబులు=ఐదుగోళ్లు, శునక=కుక్క, సృగాల=నక్క, వృక=తోడేలు, వ్యాఘ్ర=పెద్దపులి, మార్జార=పిల్లి, శశ= కుందేలు, శల్యక=ఏదు పంది (ముళ్ల పంది), కపి=కోతి, గజ=ఏనుగు, కూర్మ=తాబేలు, గోధాముఖ=ఉడుము మొదలైన, భూచర ద్వాదశకంబు=నేల మీఁద తిరుగు జంతువులు పండ్రెండును, మకర+ ఆది=మొసలి మొదలైన, జలచరంబులు=నీటిలో తిరుగునవి, కంక= రాబందు, గృధ్ర=గ్రద్ద, బక=కొంగ, శ్యేన=డేగ, భాస=కోడి, భల్లూక=ఎలుగుబంటి, బర్హి=నెమలి, సారస=బెగ్గురుపక్షి, చక్రవాక= జక్కవ పిట్ట, కాక=కాకి, ఉలూక=గ్రుడ్లగూబ, ఖేచరంబులు=ఆకసమున విహరించునవి, అర్వాక్ స్రోతంబు=ఆహారము ముఖమునుండి గ్రహించునట్టి, మానుష సర్గంబు=మానవసృష్టి, రజోగుణప్రేరితము= రజోగుణముచేత పురికొల్పఁబడినది, కర్మకరణ దక్షము=కర్మలాచ రించుటకు సమర్థమైనది. దేవసర్గము=దేవతాసృష్టి, స్వయం భూతుండు= తనకు తానుగా అవతరించినవాఁడు, అమోఘ సంకల్పుఁడు=వ్యర్థము గాని తలంపులుగలవాఁడు, స్రష్ట=సృష్టిసల్పు వాఁడు, నదీ+ఆవర్తంబులు=నదులందలి సుడి గుండములు, మహీరుహము=వృక్షము, పూర్వ+ అపరములు=ముందు వెనుకలు, దేవ+అసుర+ఆదులు=వేల్పులు రక్కసులు మున్నగువారు.

తాత్పర్యము : అట్టి సృష్టి తొమ్మిది విధములు. ఆ తొమ్మిదింటిలో ప్రాకృత వైకృత సృష్టులు కాల ద్రవ్య గుణములనెడు ముప్విధములైన భేదములచేత ప్రతి సంక్రమము లగుచుండును. అందు తొలిసృష్టి మహత్తత్త్వము. అది నారాయణుని సకాశమున గుణవైషమ్యము పొందుచున్నది. ద్రవ్యజ్ఞాన క్రియాత్మకమైన అహంకార తత్త్వము రెండవసృష్టి. శబ్దస్పర్శ రూప రస గంధము లనెడు పంచతన్మాత్రల యొక్క ద్రవ్యశక్తితోఁగూడిన నీరు, నిప్పు, నేల, గాలి, ఆకాశము అను పంచ భూతముల సృష్టి మూఁడవది. జ్ఞానేంద్రియములైన చర్మము, కన్నులు, చెవులు, నాలుక, ముక్కు, కర్మేంద్రియములైన వాక్కు, చేతులు, కాళ్లు, మూత్రద్వారము, మలద్వారము అను నీ పది యింద్రియముల జననము నాల్గవసృష్టి. సాత్త్వికాహంకారమువలన కల్గిన దేవతాసమూహసృష్టి ఐదవది. ఇది మనోమయమై యొప్పును. ప్రాణివర్గమునకు అజ్ఞానకృతములైన ఆవరణ విక్షేపములను కలుగఁ జేయునది తామససృష్టి. ఈ సృష్టి ఆరవది. ఈ యారును భగవంతుని లీలకొఱకైన ప్రాకృత సృష్టులు.

ఇక ఏడునుండి ఆరంభమగు వైకృతసృష్టులెట్టివో వినిపించెదను వినుము. పూలుపూవక ఫలించునట్టి రావి, అత్తి, మఱ్ఱి మొదలైన వృక్షములును, పూచి ఫలించిన వెంటనే నశించెడు వరి, గోధుమ, యవలు, పెసలు మొదలుగు నోషధులు, ఆరోహణా నపేక్షములగు మాలతి, మల్లె మొదలగు తీగలు, గట్టిబెరడు గల్గిన వెదురు మున్నగునవి, దృఢమైన వేళ్లు గల్గి నేలపై చక్కగ వ్యాపించెడు లతా విశేషములైన పొదలు, బాగుగ పుష్పించి పండ్లనిచ్చు మామిడి మున్నగు తరువులు, అవ్యక్త చైతన్యము గలవై, పైకెదుగుచు, తమోమయములై, తాకినచో లోపల మాత్రమే స్పర్శ జ్ఞానము గలవై ఉన్న తావునుండి కదలని చెట్టు చేమలు అనునవి ఆరును ఏడవసృష్టి. ఇక తిర్యక్కులు ఎనిమిదవసృష్టి. ఈ తిర్యక్కుల సృష్టి ఇరువదెనిమిది భేదములు గలిగి యున్నది. నేడు, రేపు అను జ్ఞానములేనివై, ఆహారము నిద్ర మున్నగు వానియందు తప్ప వేఱు విషయములందు జ్ఞానము లేనివై, వాసన వలన తెలియఁ దగినవానిని తెలియుచు సుఖ దుఃఖ విషయములందు మనసులో దీర్ఘానుసంధానము లేనివై చీలిన గిట్టలుగల ఎద్దు, దున్న, ఎనుము, మేక, జింక, పంది, ఒంటె, గవయము, దుప్పి, పొట్టేలు

మొదలైన ఈ తొమ్మిదియు, చీలని గిట్టలుగల గాడిద, గుఱ్ఱము, కంచరగాడిద, గౌరమృగము, శరభము, సవరపు మెకము ఈ యాఱును, ఐదు గోళ్లుగల కుక్క, నక్క, తోడేలు, పెద్దపులి, పిల్లి, కుందేలు, ముళ్లపంది, సింహము, కోతి, ఏనుఁగు, తాబేలు, ఉడుము ఈ పండ్రెండును, మొసలి మొదలగు జలచరములును, రాబందు, గ్రద్ద, కొంగ, డేగ, కోడి, ఎలుగుగొడ్డు, నెమలి, హంస, బెగ్గురుపక్షి, జక్కవ పిట్ట, కాకి, గ్రుడ్లగూబ మొదలగు గగనచరములును చేరి ఎనిమిదవ సృష్టి. తొమ్మిదవది మానవసృష్టి. ఇది రజో గుణముతో పురికొల్పఁబడి కర్మాచరణమందు సామర్థ్యముగల్గి దుఃఖమునందును సుఖమును వాంఛించుచుండును. ఈ మూఁడు సృష్టులు వైకృత సృష్టులు.

ఇక దేవతా సృష్టిని గూర్చి చెప్పెదను వినుము. ఈ దేవతాసృష్టి యెనిమిది విధములు. వీనిలో విబుధులు, పితృదేవతలు, సురాదులు ముత్తెఱఁగు, గంధర్వులు, అప్సరసలు ఒక తెఱఁగు. యక్షులు, రాక్షసులు ఒక తెఱఁగు. భూత ప్రేత పిశాచులు ఒక తెఱఁగు. సిద్ధులు, చారణులు, విద్యాధరులు ఒక తెఱఁగు. కిన్నరులు, కింపురుషులు ఒక తెఱఁగు. ఇట్లు దేవసర్గము అష్ట విధము. ఈ రీతిని బ్రహ్మచే నిర్మితములైన పదివిధములైన సృష్టులను తెల్పితిని. ఇంక మనువులను, మన్వంతరములను గూర్చి తెల్పెదను. కల్పారంభములందు ఈ విధముగా తనకుతానై అవతరించిన వాఁడును, సత్య సంకల్పుఁడును అయిన కమలలోచనుఁడు రజోగుణముతోఁ గూడినవాఁడై, సృష్టికి కర్తయై తనస్వరూపమైన ప్రపంచమును తన నేర్పుకొలఁది కల్పించుచున్నాఁడు. ఆ పరమేశ్వరుని మాయా ప్రభావమువలన ఈ సృష్టియందు ఏటి సుడిగుండములలో జిక్కి గిరగిర తిరుగు చెట్లవలె ముందు వెనుకలు గోచరించవు. ఈ కల్పమందుండు దేవతలు, రాక్షసులు మున్నగు వారు అట్లే ప్రతి మన్వంతర మందును నామ రూపములు గల్గి ప్రవర్తించుచుందురు. ఇందొక విశేషమున్నది. తెల్పెద నాకర్ణింపుము. దేవ సర్గములో చేరినదైనను కౌమార సృష్టి అనునది ప్రాకృత వైకృతములనెడు ఉభయ సృష్టుల స్వభావముగలది. అమోఘ సంకల్పుఁడైన శ్రీమన్నారాయణుఁడు తనకుఁ దానై ఈ లాగున భేదయుక్తమైన విశ్వమును సృజించెనని మైత్రేయుఁడు విదురునకుఁ దెల్పి కాల లక్షణ మెఱిఁగించువాఁడై ఇట్లన్నాఁడు.

# ఏకాదశోऽధ్యాయః

మైత్రేయ ఉవాచ

చరమ స్సద్విశేషాణా మనేకాసంయుత స్సదా,
పరమాణు స్స విజ్ఞేయో నృణా మైక్య భ్రమో యతః. 1

సత ఏవ పదార్థస్య, స్వరూపావస్థితస్య యత్,
కైవల్యం పరమ మహా నవిశేషో నిరంతరః. 2

ఏవం కాలోऽప్యనుమిత స్సౌక్ష్మ్యే స్థౌల్యే చ సత్తమ,
సంస్థాన భుక్త్యా భగవా నవ్యక్తో వ్యక్తభు గ్విభుః. 3

స కాలః పరమాణుర్వై యో భుంక్తే పరమాణుతామ్,
సతో విశేషభుగ్యస్తు స కాలః పరమో మహాన్. 4

అణుర్ద్వౌ పరమాణుస్స్యాత్త్రసరేణు స్త్రయోऽణవః,
జాలార్క రశ్మ్యవగతః ఖమేవాను పతన్నగామ్. 5

త్రసరేణు త్రికంభుంక్తే యః కాల స్సాత్రుటి స్స్మృతా,
శత భాగస్తు వేధస్యతై స్త్రిభిస్తు లవ స్స్మృతః. 6

నిమేష స్త్రిలవో జ్ఞేయ ఆమ్నాత స్తేత్రి యః క్షణః,
క్షణానాం చ విదుః కాష్ఠాం లఘుతాం, దశపంచ చ. 7

లఘూనివై సమామ్నాతా దశపంచ చ నాడికా,
తే ద్వే ముహూర్తః ప్రహరః షడ్యామ స్సప్త వా నృణామ్. 8

ద్వాదశార్ధ పలోన్మానం చతుర్భి శ్చతురంగుళైః,
స్వర్ణమాషైః కృతచ్ఛిద్రం యావత్ప్రస్థం జ లప్లుతమ్. 9

యామాశ్చత్వార చత్వారో మర్త్యానా మహనీ ఉభే,
పక్షః పంచదశాహాని శుక్లః కృష్ణశ్చ మానద. 10

తయో స్సముచ్చయో మాసః పితౄణాం త దహర్నిశమ్,
ద్వౌ తా వృతు షడయనం దక్షిణం చోత్తరం దివి. 11

ఆయనే అహనీ ప్రాహు ర్వత్సరో ద్వాదశ స్స్మృతః,
సంవత్సరశతం నౄణాం పరమాయు ర్నిరూపితమ్. 12

గ్రహర్క్ష తారా చక్రస్థః పరమాణ్వాదినా జగత్,
సంవత్సరావసానేన పర్యేత్య నిమిషో విభుః. 13

సంవత్సరః పరివత్సర ఇడావత్సర ఏవ చ,
అనువత్సరో వత్సరశ్చ విదురైవం ప్రభాష్యతే. 14

యస్సృజ్య శక్తిమురుధోచ్ఛ్వసయన్ స్వశక్త్యా
పుంసోఽభ్రమాయ దివిధావతి భూతభేదః,

కాలాఖ్యయా గుణమయం క్రతుభి ర్వితన్వం
స్తస్మై బలిం కురుత వత్సర పంచకాయ. 15

విదుర ఉవాచ

పితృదేవమనుష్యాణా మాయు ర్మాన మిదం స్మృతమ్,
పరేషాం గతి మాచక్ష్వ యే స్యుః కల్పాద్బ హిర్విదః. 16

భవాన్హి వేదకాలస్య గతిం భగవతో నను,
విశ్వం విచక్షతే ధీరా యోగరాద్ధేన చక్షుషా. 17

మైత్రేయ ఉవాచ

కృతం త్రేతా ద్వాపరం చ కలిశ్చేతి చతుర్యుగమ్
దివ్యై ర్ద్వాదశభి ర్వర్షై స్సావధానం నిరూపితమ్. 18

చత్వారి త్రీణి ద్వేచైకం కృతాదిషు యథాక్రమమ్,
సంఖ్యాతాని సహస్రాణి ద్విగుణాని శతాని చ. 19

సంధ్యా సంధ్యాంశయో రంతర్యః కాల శ్శతసంఖ్యయోః,
తమేవాహు ర్యుగం తద్‌జ్ఞా యత్ర ధర్మో విధీయతే. 20

ధర్మ శ్చతుష్పా న్మనుజాన్ కృతే సమనువర్తతే,
స ఏవాఽన్యే ష్వధర్మేణ వ్యేతి పాదేన వర్ధతా. 21

త్రిలోక్యా ద్యుగ సాహస్రం బహి రాబ్రహ్మణో దినమ్,
తావత్యేవ నిశా తాత య న్నిమీలతి విశ్వసృట్. 22

నిశావసాన ప్రారబ్ధ లోకకల్పో నువర్తతే,
యావద్దినం భగవతో మనూ న్భుంజం శ్చతుర్దశ
స్వం స్వం కాలం మను ర్భుంక్తే సాధికామేక సప్తతిమ్ 23

మన్వంతరేషు క్రమశః తద్వంశ్యా ఋషయ స్సురాః,
భవంతి చైతే యుగప త్సురేశా శ్చాను యే చ తాన్. 24

ఏష దైనందిన స్సర్గో బ్రాహ్మ స్త్రైలోక్య వర్తనః,
తిర్యఙ్నృ పితృదేవానాం సంభవో యత్ర కర్మభిః. 25

మన్వంతరేషు భగవా న్బిభ్ర త్సత్త్వం స్వమూర్తిభిః,
మన్వాదిభి రిదం విశ్వమవత్యుదిత పౌరుషః. 26

తమోమాత్రా ముపాదాయ ప్రతి సంరుద్ధ విక్రమః,
కాలేనానుగతాశేష ఆస్తే తూష్ణీం దినాత్యయే. 27

త మేవాన్వపి ధీయంతే లోకా భూరాదయ స్త్రయః,
నిశాయా మనువృత్తాయాం నిర్ముక్త శశిభాస్కరమ్. 28

త్రిలోక్యాం దహ్యమానాయాం శక్త్యా సంకర్షణాగ్నినా,
యాంత్యూష్మణా మహర్లోకా జనం భృగ్వాద యోఽర్దితాః. 29

తావ త్త్రి భువనం సద్యః కల్పాన్తైధిత సింధవః,
ప్లావయం త్యుత్కటాటోప చండవాతేరితోర్మయః. 30

అంత స్సతస్మిన్ సలిల ఆస్తేఽనంతాసనో హరిః
యోగ నిద్రామీలితాక్షః స్తూయమానో జనాలయైః. 31

ఏవంవిధై రహోరాత్రైః కాలగత్యో పలక్షితైః,
అపక్షిత మివాస్యాఽపి పరమాయుర్వయశ్శతమ్. 32

యదర్ధ మాయుష స్తస్య పరార్ధ మభిధీయతే,
పూర్వః పరార్ధో ఽపక్రాంతో హ్యపరోఽద్య ప్రవర్తతే. 33

పూర్వస్యాఽఽదౌ పరార్ధస్య బ్రాహ్మో నామ మహానభూత్,
కల్పో యత్రాభవద్బ్రహ్మ శబ్ద బ్రహ్మేతి యం విదుః. 34

తస్యైవాంతేచ కల్పోఽభూద్యం పాద్మమభిచక్షతే,
యద్ధరేర్నాభి సరస ఆసీల్లోక సరోరుహమ్. 35

అయం తు కథితః కల్పో ద్వితీయ స్యాపిభారత,
వారాహ ఇతి విఖ్యాతో యత్రాఽఽసీ త్సూకరో హరిః. 36

కాలోఽయం ద్విపరార్ధాఖ్యో నిమేష ఉపచర్యతే,
అవ్యాకృత స్యానంతస్య హ్యనాదే ర్జగదాత్మనః. 37

కాలోఽయం పరమాణ్వాది ద్విపరార్ధాంత ఈరితః,
నైవేశితుః ప్రభు ర్భూమ్న ఈశ్వరో ధామ మానినామ్. 38

వికారై షోడశై ర్యుక్తో విశేషాదిభి రావృతః,
అండకోశో బహి రయం పంచాశత్కోటి విస్తృతః. 39

దశోత్తరాధికై ర్యత్ర ప్రవిష్టః పరమాణువత్,
లక్ష్యంతేంతర్గతా శ్చాన్యే కోటిశో హ్యండరాశయః. 40

తదాహు రక్షరం బ్రహ్మ సర్వకారణ కారణమ్,
విష్ణోర్ధామ పరం సాక్షా త్పురుషస్య మహాత్మనః. 41

ఇతి శ్రీమద్భాగవతే, తృతీయస్కంధే, ఏకాదశోఽధ్యాయః.

1. సద్విశేషాణాం=సత్తుయొక్క విశేషములకు, చరమః=కడపటిది, అనేకః=అనేకమయ్యును, సదా=నిరంతరమును, అసంయుతః=యోజింపనిదై యున్నదిగను ఉండెడిది, యః=ఏదిగలదో, సః=అది, పరమాణుః=పరమాణువని, విజ్ఞేయః=తెలియవలెను. యతః=దేనినుండి, నృణాం=మనుష్యులకు, ఐక్యభ్రమః=ఐక్యభ్రమ ఏర్పడుచున్నదో.

తాత్పర్యము : పదునొకండవ అధ్యాయమందు కాలముయొక్క స్థూలసూక్ష్మరూపములను మైత్రేయుడు విదురున కుపదేశించుచున్నాఁడు. కాలమునుండి పరిచ్ఛేదించుటకు యోగ్యమైన వస్తువుయొక్క సూక్ష్మతను, స్థూలతను తొలుత నిరూపించుటకై సమస్త పదార్థములయందును అవయవరూపముగా నుండెడి పరమాణువు యొక్క లక్షణమును చెప్పుచున్నాఁడు.

కార్యరూపేణ కన్పించుచున్న సకలవస్తువులయందును అంశములుగా కనబడుచున్న వియు, విభజించుటకు సాధ్యముకానంత సూక్ష్మముగానున్న అవసానాంశము ఏది గలదో అది యనేకము ఐనను అట్టి పరమాణువులు పరస్పరము యోజింపకున్నచో కార్యములు సాధింప సమర్థములు కానేరవు.

వీని పరస్పర సంయోజనము వలననే కార్యోత్పత్తి ఏర్పడు చున్నది. అందుకే జనులకు సమస్త వస్తువులందును విభజింప యోగ్యమైన అవయవము ఉన్నదను బోధ మేర్పడు పదార్థము లన్నియు అవయవులు. వాని అవయవములు పరమాణువులు, దానిస్వరూపము విభజింపరానంత సూక్ష్మమైనది. అందుచేత అదే పరమ పదార్థముల యొక్క అవసాన విభక్త వస్తువు.

2. స్వరూపావస్థితశ్చ=స్వరూపమును గ్రహించియున్న; సతః= కార్యరూపమైన; పదార్థస్య=వస్తువుయొక్క ; యత్కైవల్యం=ఏ ఐక్యముక లదో; అవిశేషః=విశేషము లేనిదియు; నిరంతరః=భేదములేనిదియునైన అది, పరమమహాన్=గొప్ప మహత్తయిన స్వరూపముతోఁగూడినది;

తాత్పర్యము : సూక్ష్మరూపము లయిన పరమాణువులు అనేకములు పరస్పరము కలిసికొన్నపుడు వస్తువు లేర్పడును. అట్టి వస్తుసంచయమే ప్రపంచము. కార్యరూపముతో గన్పించునది; నాశమును బ్రాపింపక యుండునది అయిన ఆ ఆకృతియొక్క ఐక్య మేది గలదో అదే ఈ కన్పించు చున్న ప్రపంచము. జాతి, వ్యక్తి అనెడు భేదకల్పన పరమాణువుల ఐక్యముతో అవయవియందు గన్పించు భేదముతోఁ గన్పింపబడినవే కాని పరమాణువు రూపముగా వీనికి భేదము లేదు. ఈ రీతిగాఁ గన్పించుచున్న ప్రపంచము కాలపరిచ్ఛేద్యమైన వస్తువు యొక్క స్థూలరూపము. పరమాణువు దాని సూక్ష్మరూపము.

3. సత్తమ=సత్పురుషులలో శ్రేష్ఠమైన వాఁడా, ఏవం=ఈ ప్రకారము, కాలః అపి=కాలము గూడ, సౌక్ష్మ్యే=సూక్ష్మభావమందు, స్థౌల్యే=స్థూలభావ మందును; అనుమితః=అనుమానింప బడుచున్నది; భగవాన్=భగవంతుని శక్తిస్వరూపమును; అవ్యక్తః=అవ్యక్తమును అయిన; విభుః=సమర్థుఁడు, సంస్థానభుక్త్యా=అవయవ భుక్తినిమిత్తముగా, వ్యక్తభుక్=వ్యక్తస్థితిని ప్రపంచమును భజించును.

తాత్పర్యము : కాలపరిచ్ఛేద్యములైన వస్తువుల స్థూల సూక్ష్మ గుణముల నాస్పదముగాఁ జేసికొని కాలమందుఁ గూడ స్థూల, సూక్ష్మ, భావములుండునని గమనింపవలసి వచ్చును. ఈ భేదజ్ఞానము స్థూల బుద్ధులకు తోఁచదు, నీవు సూక్ష్మ బుద్ధి గలవాఁడవు. అందుకే సత్తమ అను విశేషణము. ఓ సత్తముఁడవైన విదురా! అప్రత్యక్షమైయున్న కాలము ఈశ్వరునియొక్క శక్తి. ఈశ్వరశక్తితో కూడుకొన్న దనుటయే దాని స్వరూపము. కాని అది యింద్రియములకు విషయము గాదు. సూక్ష్మమైన పరమాణువునందు వ్యాపించియున్న రూపమును సూక్ష్మమని మహత్తయిన ప్రపంచముమందు వ్యాపించియున్న రూపమును స్థూలమనియు తద్విదులు పేర్కొందురు. పరమాణువు మొదలుకొని ప్రపంచము వరకున్న పదార్థముల

ఉత్పత్తి స్థితిలయ కారణము కాలము. అందుచేతనే దానికి ఈశ్వరీయమైన శక్తి యని పేరు. అది సర్వమును సృష్టించి, రక్షించి, నశింపఁజేయుటకు సమర్థమైన శక్తి గలది.

4. యః=ఏది, పరమాణుతాం=పరమాణుభావమును; భుంక్తే=పొందుచున్నదో; సః కాలః=ఆ కాలము; పరమాణుః వై=పరమాణువే యగుచున్నది; యః తు, విశేషభుక్=విశేషమును పొందుచున్నదో; సః కాలః=ఆ కాలము; పరమః మహాన్=మహత్తు;

తాత్పర్యము : ప్రపంచమందున్న వస్తువులయందు పరమాణువు వ్యాపించెడు సమయమును పరమాణువైన కాల మందురు. ఆ పరమాణువుల సంయోగముతో నేర్పడెడు విశేషరూపమందు వ్యాపించియుండెడు కాలమును మహత్తయిన కాల మందురు. సూర్య గతి ననుసరించి లోకమందు కాలము నిరయించబడుచున్నది. అందుకే సూర్యునకు కాలస్వరూపుడైన ప్రత్యక్షేశ్వరుడని పేరు. సూర్యుఁడు పరమాణువును అతిక్రమించు సమయము నకు పరమాణుకాలమని పేరు. పంద్రెండురాశులుగా విభజింపఁబడియున్న సమస్త భువనమును అతిక్రమించెడు కాలమును సంవత్సర మందురు. ఇట్టి సంవత్సరములు అనేకములు గడచుచో మన్వంతరములు, యుగములు నేర్పడుచున్నవి

5. ద్వౌపరమాణూ=రెండు పరమాణువులు; అణుః=అణు వగును; త్రసరేణుః=మూఁడుపరమాణువుల సంయోగమే త్రసరేణుః; జాలార్కరశ్మ్యవగతః=గవాక్షమందు వ్యాపించియున్న సూర్య కిరణప్రకాశముచేత తెలిసికొనఁబడెడు; ఖం ఏవ=ఆకాశమునే; అనుపతన్=వ్యాపించినదై; అగాత్=ఇది ప్రవర్తించును.

తాత్పర్యము : రెండు పరమాణువులు చేరినచో నొకయణువు. దీనిని వ్యాపించుటకు సూర్యునకు పట్టుకాలమునే అణు వందురు, మూఁడు పరమాణువులు చేరినచో త్రసరేణువు. దీని నతిక్రమించెడు కాలమును త్రసరేణు వందురు. పరమాణువు, అణువు ఈ రెండు నతి సూక్ష్మములైనవి. అందుచేత నేత్రవిషయములు గావు. త్రసరేణువును మనము దర్శించ వచ్చును, గవాక్షమందు సూర్యకిరణము ప్రవేశించినపుడు ఆకిరణముతో పాటు పైకిబోవుచున్నట్లు కన్పించెడి ఏధూళికలదో దానిని త్రసరేణు వను కొనవలెను. ఈ త్రసరేణువును దాటుటకు సూర్యునకుఁబట్టు కాలమునకే త్రసరేణు వందురు.

6. త్రసరేణుత్రికం=మూఁడు త్రసరేణువులను; యఃభుంక్తే=దాటుట కెంతపట్టునో; సఃకాలః=ఆకాలమును; త్రుటిః స్మృతః=త్రుటి యనుపించుకొను; శతభాగఃతు=నూరుత్రుటులతో కూడిన యంశము; వేధఃస్యాత్=వేధ యనిపించుకొను; వేధైఃత్రిభిః=అట్టి నూటితో; లవఃస్మృతః=లవము ఏర్పడును.

తాత్పర్యము : మూఁడుత్రసరేణువులను అతిక్రమించుటకుఁబట్టు కాలము త్రుటి. నూరుత్రుటులకాలమువేధ. మూఁడు వేధల సమావేశము లవము.

7. త్రిలవః=మూఁడు లవములకాలము; నిమేషః=నిమునము అని, జ్ఞేయః=తెలియవలెను; తేత్రయః=మూఁడు నిమునములు; క్షణః=క్షణము; పంచక్షణాన్=అయిదు క్షణములను; కాష్ఠాంవిదుః=కాష్ఠయందురు; కాష్ఠాః దశపంచ=పదునైదు కాష్ఠలు; లఘుః=లఘువు.

తాత్పర్యము : మూడులవములు ఒక్కనిమేషము. మూఁడు నిమేషము లొక్కక్షణము. అయిదుక్షణము లొక్క క్రౌష్ఠ. పదునైదు కాష్ఠలు లఘువు.

8. దశపంచలఘూని=పదునైదు లఘువులు, నాడికాః ఆమ్నాతాః= నాడికయనబడు; తేద్వే=రెండు నాడికలు; ముహూర్తః=ఒక ముహూర్తము; షట్ సప్తవా=ఆరో, ఏడో నాడికలు; నృణాం=మనుష్యులకు; ప్రహరః యామః=ప్రహరము లేక యామ మగును.

తాత్పర్యము : పదునైదులఘువులు నొకనాడిక, రెండునాడికలు ముహూర్తము. ఆరో, ఏడో నాడికలు మనుష్యలోకమందు నొక ప్రహరము లేక యామము. ఈ యామము పగటియందు నాలవభాగము; ఆరో, ఏడో నాడికలు చెల్లినచో యామ మనుట. దివసముల యొక్క వృద్ధిక్షయములను జూపుటకై చెప్పఁబడినది. రెండుముహూర్తములకును సంధ్యలని పేరు. వానితో సంబంధము లేక చెప్పెడు సంఖ్యా ప్రకారమునకు నాల్గు యామము లందురు. ఒకదివసము నాల్గుయామములు.

9. ద్వాదశార్ధపలోన్మానం=ఆరు పలముల తూకము గలపాత్ర; చతుర్భిః అంగులైః=నాలుగువ్రేళ్ళ పొడవుగల; స్వర్ణమాషైః=స్వర్ణమాషము లతో; కృతచ్ఛిద్రం=ద్వారమున్నదిగా నొనర్చి; యావత్ ప్రస్థంజ్వల ప్లుతం =ఎప్పుడు వానినుండి నీరు క్రిందికి పడునో; సః కాలః నాడికా=ఆ కాలము నకు నాడిక యనిపేరు

తాత్పర్యము : నాడికను నిర్ణయించుటకు మార్గమును జెప్పు చున్నాఁడు. ఆరు పలముల బలమున్న చెంబుతీసికొనవలెను. వానికి రెండు రంధ్రములు వేయవలెను. ఒకవైపు నాలు గంగుళముల పొడవుగల బంగారుతోఁ జేయఁబడిన ములికితో ద్వారము నేర్పరచి నీరు పోయవలెను. ఆ ద్వారముగుండా నీరు లోనికిఁబోయి ఆ పాత్రము జలములో మునుఁగు నంతటి కాలమునకే నాడిక యనిపేరు.

10. చత్వారః చత్వారః యామాః=నాలుగు నాలుగు యామములు; మర్త్యానాం=మనుష్యులకు; ఉభే అహని=పగలును, రాత్రియు నగును; పంచదశ అహాని=పదునైదు దినములు; పక్షః=ఒక పక్షము. శుక్లః, కృష్ణః చ=శుక్ల, కృష్ణ పక్షము లనిపేరు.

తాత్పర్యము : నాలుగు యామములు చేరిన నొక్కపగలు, నాలుగు యామములు రాత్రి. ఇట్లుగా పదునైదు రేపవళ్లు చేరినచో నొక పక్షమగును, ఈ పక్షములు రెండురీతులు. శుక్ల కృష్ణ పక్షములు.

11. తయోః సముచ్చయః=ఆరెంటి సముచ్చయము, మాసః=మాసము. తత్తే=ఆ రెండు పక్షములు, పితౄణాం=పితృదేవతలకు, అహర్నిశం=రాత్రి పగలౌను. ద్వౌ=ఈరెండు మాసములు, ఋతుః=ఋతువు, షడయనమ్=ఈ ఆరు ఋతువులకు ఒక్క ఆయనమని పేరు. దక్షిణం ఉత్తరం చ = దక్షిణోత్తరాయనములు.

తాత్పర్యము : రెండు పక్షము లొక మాసము. ఇది పితృదేవతల కొక్కదినము. రెండు మాసము లొక్క ఋతువు. ఆరు ఋతువులు కూడిన దొక్క అయనము. దక్షిణాయనము, ఉత్తరాయనము.

12. అయనే=రెండు అయనములు, దివ్యహనీ=స్వర్గమునందు ఒక దినమని, ప్రాహుః=అందురు. ద్వాదశః=పంద్రెండు మాసములు, వత్సరః =సంవత్సరమని, స్మృతః=చెప్పబడినది. సంవత్సర శతమ్=నూరు వత్స రములు, నృణాం=మనుష్యులకు, పరమాయుర్నిరూపితమ్=పరమాయువని నిశ్చయింపఁబడినది.

తాత్పర్యము : రెండు అయనములు చేరి స్వర్గవాసులకు ఒక దినము. పంద్రెడు మాసము లొక సంవత్సరము. నూరు సంవత్సరములు మానవ జీవిత పరమావధి.

13. గ్రహర్క్షతారాచక్రస్థః=గ్రహములు, నక్షత్రములు, తారలు అనెడి ఈ చక్రమందున్న, అనిమిషః విభుః=నేత్రనిమీలనము లేని భగవంతుడు. సంవత్సరావసానదినః=సంవత్సరము యొక్క కడపట, పరమాణ్వాదినా= పరమాణ్వాదియైనకాలము ననుసరించి, జగత్ పర్యేతి=లోకములు చుట్టును.

తాత్పర్యము : గ్రహనక్షత్ర తారాచక్రస్థుడై కాలస్వరూపుఁడు సూర్యుఁడు ఒక సంవత్సరమనెడి కాలమునందు పరమాణువు మొదలు కొనియున్న కాలముగా లోకమును చుట్టి సంచరించును.

14. ఏవం ప్రభాష్యతే=ఇట్లు చెప్పఁబడును.

తాత్పర్యము : ఈ కాలమునకు సంవత్సరము పరివత్సరము ఇడా వత్సరము అనువత్సరము వత్సరమను భిన్న భిన్నములైన నామధేయములు. సూర్యాది గతిభేదములే నామభేదములకు కారణము. ఈ లోకమును సూర్యుఁడు చుట్టివచ్చు మేరకు సంవత్సరమని పేరు. బృహస్పతి ఒకసారి ప్రపంచమును చుట్టివచ్చుటకు పట్టుకాలము పరివత్సరము. ముప్పది దినము లొక మాసము. ఇట్లు పంద్రెండు మాసములు గడువగా ఇదా వత్సరము. నక్షత్రము సూర్యుని చుట్టివచ్చుకాలము సంవత్సరము. సౌరమాన ప్రకారము ఒక వర్షమందు ఆరుదినములు పెరుగును. చాంద్రమానము ప్రకారము

ఆరుదినములు తగ్గును. ఈ భేదములను సరిపెట్టుటకై అనువత్సరము. ఈ రీతి ఐదువత్సరములు గడువగా రెండు మాసములు అధికమాస మగును. మరల నారంభమగునది వరము. కొందరి అభిప్రాయములో ఇదియే నామభేదము లేర్పడుటకు కారణము.

15. భూతభేదః=భూతములకు వికారము కల్పించునట్టి, యః=ఎవఁడు, కాలాఖ్యయా=కాలమనెడి పేరుగల, స్వశక్త్యా=తనయొక్క శక్తిచేత, గుణమయం=గుణమయమని,

క్రతుభిః=యాగములతోపాటు, విచిన్వన్=ఎక్కువచేయుచున్నవాఁడై, సృజ్యశక్తిం=సృజ్యములైన భూతముల యొక్క శక్తిని, ఉరుధా=అనేక రీతులుగా, ఉచ్ఛ్వసయన్=ఉద్బోధింపఁజేయుచున్నవాఁడై, పుంసః=పురుషుని యొక్క, అభ్రమాయ=భ్రమ నివృత్తి కొఱకు, దివి=ఆకాశమందు, ధావతి= సంచరించును, వత్సర పంచకాయ=ఐదు పేరులతో కూడిన వత్సరము, తస్మై=వానికొఱకు, బలింహరత=సమర్పింతురు గాక.

తాత్పర్యము : కాల స్వరూపము నిర్ణయించిన అనంతరము కాలబోధ నుండి నివృత్తిని సాధించుటకు కాలస్వరూపుఁడై సూర్యమండలము నందు వసించెడి శ్రీమన్నారాయణుని పూజింపవలెనని ఉపదేశించుచున్నాఁడు. భూతములయందు బాల్యయౌవన వార్ధక్యాది భేదములు కన్పించుటకు కారణ మెవ్వడు, కాలమను పేరుగల తనశక్తితో భూతముల యాయువును ప్రతినిమిష మపహరించువాఁడై యున్నవాడై నాడు. కనుక మానవుఁడు కాలము ఆయువు నశించకముందే పరమపురుషార్థము సాధించుకొనవలెను. విషయాసక్తియందు నిమగ్నుఁడై పలురీతుల సంచరించు మనుష్యునకు తన యాయుస్సును గూర్చి అనుదినము సూర్యుఁడు జ్ఞాపకము చేయుచున్నాఁడు. అట్లే మానవుఁడు పురుషార్థములు సాధించుటకు కారణములైన యాగాదులకు కాల నిర్దేశముతో తోడ్పడుచున్నాఁడు. వాఁడే సూర్యమండలస్థుఁడైన నారాయణుఁడు. వానికి మన సర్వధర్మములను సమర్పించవలెను. అనఁగా నిష్కామ కర్మమూలకముగా ఆరాధింపవలెనని అర్థము. సకామునకు స్వర్గప్రాప్తి. నిష్కామునకు మోక్షప్రాప్తి. ఈ రీతిగ ఫలభేదములు కల్పించుచు సూర్యుఁడు ప్రకాశించుచున్నాఁడు. అతఁడు సస్యసంరక్షకుడు. సూర్యమండలాంతర్గతుఁడై నారాయణునిచే ప్రకాశించుచున్నాఁడని మన భావన యుండవలె. ప్రత్యక్షముగా కనఁబడుచున్న సూర్యుఁడు నారాయణునకు ప్రతీక. ఇట్లు పూజింపనివారు కృతఘ్నులు. ఐదు నామములుగల సంవత్సరము ప్రవర్తింపించుచున్న వాఁడు వాఁడే. కాల స్వరూపుఁడైన వాఁడే ఈ లోకమున జ్ఞానము భోగము మొదలైన విషయములకు సర్వేశ్వరుఁడు.

16. పితృదేవమనుష్యాణాం=పితరులు దేవతలు మనుష్యులు - వీరి యొక్క, పరం ఆయుః=పరమాయువు, ఇదం స్మృతం=ఇదియని చెప్పఁబడిన,

కల్పాత్ బహిః=మూఁడులోకముల యొక్క అవతలియందున్న, విదః హి=జ్ఞానులెవ్వరు, పరేషాం=ఉత్కృష్టులైన వారియొక్క, గతిం= ఆయుస్సును, ఆచక్ష్వ=చెప్పుము.

తాత్పర్యము : విదురుఁడన్నాఁడు. పితరులు దేవతలు మనుష్యులు వీరి పరమాయుస్సు నూరువర్షము లంటిరి. ఈ మూఁడు లోకములకు బహిర్భూతులై ఉత్కృష్టులైన జ్ఞానులయొక్క ఆయుర్మాన మెట్టిదో చెప్పవలెను.

17. కాలస్య=కాలస్వరూపుఁడైన, భగవతః=భగవంతునియొక్క, గతిం=స్వరూపమును, భగవాన్=తమరు, ననువేద=తెలిసిన వారు కదా. ధీరాః=విషయవిరక్తులు, యోగరాద్ధేన చక్షుషా=యోగాభ్యాసముచేత సిద్ధించిన జ్ఞానచక్షువుచేత, విశ్వం=సమస్తమును, విచక్షతే=చూడఁ గలుగుచున్నాఁడు.

తాత్పర్యము : కాలస్వరూపుఁడైన భగవంతుని తత్త్వము మీరెఱుఁ గుదురు. ఎందుకనఁగా మీరు పరమ భగవద్భక్తులు. యోగాభ్యాసము చేత చిత్తశుది మీ కేర్పడినది. అట్టి యోగులు వారి జ్ఞానేత్రములతో ఇంద్రియముల కవిషయములైన సమస్తమును వీక్షింతురు. కనుక మీయట్టి వారికి కాలస్వరూపము కరతలామలకము.

18, 19. సావధానం=అవధానముతో కూడినది అనగా మఱవరానట్టి యుగసంధి, దివ్యైః=దేవతల యొక్క కాలనిర్ణయము ననుసరించియున్న, ద్వాదశభిః వర్షైః=పండ్రెండు వర్షములతో అనఁగా పండ్రెండువేల సంవత్సరములతో, చతుర్యుగం=నాలుగు యుగములును, నిరూపితం= నిరూపింపఁబడినది. చత్వారి=నాలుగు, త్రీణి=మూఁడు, ద్వే చ=రెండు, ఏకం=ఒకటి, సహస్రాణి=సహస్రములు, ద్విగుణాని శతాని చ=వానికి రెండింతలై నూరువర్షములు, కృతాదిషు=కృతాది యుగములందు సంఖ్యాతాని= సంఖ్యాతములు.

తాత్పర్యము : అవతారిక. మూఁడు లోకములకు బహిర్భూతులైన జ్ఞానుల ఆయుస్సు నిరూపించుటకు యుగాది కాలజ్ఞానము ఆవశ్యకము. కనుక దానిని నిరూపించుచున్నాను. మైత్రేయుఁడనుచున్నాఁడు. ఓయి ! విదురా ! కృతత్రేతా ద్వాపర కలియుగములని యుగములు నాలుగు. దేవతల మానము ననుసరించి ఈ నాలుగు యుగములకును పండ్రెండువేల సంవత్స రములు. పండ్రెండువేల దివ్యవర్షములు గడచినచో నాలుగు యుగము లొకసారి గడచినట్లు. కృతయుగమునకు నాలుగు వేల దివ్యవర్షములు. ఆద్యంతములందున్న సంధ్యాంశములు ఎనిమిది నూర్లు అపుడు కృత యుగము నాలుగు వేల ఎనిమిది నూర్ల దివ్యవర్షములు. మూఁడు వేల దివ్య వర్షములు త్రేతాయుగ ప్రమాణము. సంధ్యాంశములు రెండును చేరి అనఁగా

ఆద్యంతములందలి వన్నమాట, ఆరునూర్ల దివ్య వర్షములు. ద్వాపర యుగము దివ్యవర్షములు రెండువేలు. సంధ్యాంశములు నాలుగు నూరు. కలియుగము వేయి వరములు. సంధ్యాంశములు ఇన్నూరు. ఇటు పంద్రెండు వేల దివ్యవర్షములు గడచినచో నాలుగు యుగము లొకసారి చుట్టును.

20. శత సంఖ్యయోః=నూరు సంవత్సరములతో కూడిన, సంధ్యాంశయోః=సంధ్యాంశముల యొక్క, అంతరేణ=మధ్యమందున్న, యః కాలః=ఏకాలము కలదో, తద్జ్ఞాః=విద్వాంసులు, తం ఏవ=దానినే, యుగం ఆహుః =యుగమని యందురు. యత్ర=దేనియందు, ధర్మః=విశేషమైన ధర్మము, విధీయతే=విధింపబడుచున్నదో.

తాత్పర్యము : అవతారిక ఆద్యవసాన భాగములను సంధ్యాంశములుగా భిన్నముగా చెప్పుట ఎందు కనుటకు కారణమును వివరించుచున్నారు. సంధ్యాంశములు రెండు రీతులు. యుగాది, యుగావసానము. ఈ రెండు నూరువరముల నూరు సంఖ్యలతోడి సహస్రములతో నున్నవి మాత్రము యుగవరము. వీనినే జ్ఞానులు యుగమందురు. ఎందుకనగా ఆ కాలమందు మాత్రమే విశేషముధర్మములు విధింపఁబడును. సాధారణ ధర్మములందు భగవత్కథాశ్రవణాదులు సంధ్యాంశలయందు అనుష్ఠింపఁబడును. విశిష్ట ధర్మములు మాత్రమే యుగ కాలమందు ఆచరింపఁబడును. అందుకే సంధ్యాంశలు విడదీసిరి. కనుక కృతయుగ మనఁగా నాలుగు వేల దివ్య వరములు తక్కిన ఎనిమిది నూర్లవరములు. సంధ్యాంశలు. వాని యందు విశిష్టధర్మాచరణము జరుగదని తాత్పర్యము.

21. చతుష్పాద్ధర్మః=నాలుపాదములతో కూడిన ధర్మము, కృతే=కృత యుగమునందు, మనుజాన్=మనుష్యులను, అనువర్తతే=అనుసరించును, సయైవ=ఆ ధర్మమే, అన్యేషు=ఇతర యుగములందు, వర్ధతా పాదేన=వృద్ధి చెందుచున్న పాదముతో, వ్యైతి=తక్కువగును.

తాత్పర్యము : కృతయుగమందు ధర్మము నాలుపాదములతో నడచును. ఇదియే సంపూర్ణధర్మము. దీనిని ప్రజలనుసరింతురు. త్రేతయందు మూఁడుపాదములు. ఒక్కపాదము నధర్మ మాక్రమించును. ద్వాపరము నందు రెండుపాదములు. కలియుగమందు ఒక్కటి. కనుక వివేకవంతులగు పురుషులు తమధర్మము నతిజాగ్రత్తగా రక్షించుకొనవలెను. ధర్మము క్షీణించుట యుగస్వభావము కదా! అటి యెడ ఎట్టి వివేకవంతుఁడైనను మానవుఁడేమిచేయును అను తర్కము పనికిరాదు. ఇట్లు ఉదాసీనత వహించినచో మనుష్యుఁడు ధర్మభ్రష్టుఁడగుటకు ఎన్నో మార్గము లగుపడును.

22. త్రిలోక్యాః యుగసాహస్రం=త్రిలోకములకు సంబంధించి వేయి యుగములు, బహిః ఆబ్రహ్మణః=వీనికి బయటనున్న లోకములలో - బ్రహ్మ లోకము వరకు, తాత!=వత్స! తావతీఏవ=అన్ని యుగములే, నిశా=రాత్రి,

యత్=ఏపగటి యందు, విశ్వసృట్=బ్రహ్మ, సృష్టించు, నిమీలతి=రాత్రి యందు నిద్రించును-

తాత్పర్యము : త్రిలోకములకు సంబంధించి వేయి చతుర్యుగములు గడువగా వానికి బహిర్భూతములైన మహర్లోకాదులందు ఒక పగలగును. అంతమేరకే రాత్రి. ఈ రాత్రియందు లోకకర్త నిదురించును.

23. నిశావసానే=రాత్రియొక్క అవసానమందు, ఆరబ్ధః=ఆరంభింపఁ బడిన, లోకకల్పః=లోకసృష్టి, అనువర్తతే=అనువర్తిత మగును, భగవతః =బ్రహ్మదేవుని యొక్క, యావదినం=పగలు సంక్రమించునంతకాలము, చతుర్దశమనుః=పదునల్వురు మనువులు, భుంజన్=భూమిని భుజింతురు. ఏక సప్తతిం=కొద్దికాల మధికముగా నున్న డెబ్బది యొక్క యుగములు, స్వం స్వం కాలం=వాని వానికాలముగా, మనుః భుంక్తే=ప్రతిమనువును అనుభవించును.

తాత్పర్యము : బ్రహ్మదేవుని రాత్రికాలమునకు ప్రళయమని పేరు. రాత్రి గడచిన వెనుక బ్రహ్మదేవుఁడు మరల సృష్టికార్యమనువర్తించు. మనమొక్క పనిచేయునపుడు మధ్యలో నిలిపి కొంతసేపు విశ్రమించి మరల కార్యము నారంభించి పూర్తిచేయునటన్న మాట. ఈ వ్యాపారము కల్పావసానము వఱకు సాగును. బ్రహ్మదేవుని పగలైన వేయిచతుర్యుగము లందు పదునల్వురు మనువులు రాజ్యము లేలెదరు. కనుక ఒక్కొక్క మనువు కాలము డెబ్బది యొక్క యుగములకు పైచిలుకు.

24. మన్వంతరేషు=మన్వంతరములందు, మనవః=మనువులు తద్వంశ్యాః=వారివంశమం దుద్భవించిన వారు, ఋషయః=ఋషులును, సురాః=దేవతలును, తాన్ అను=వారిననుసరించెడు. సురేశాశ్చ= దేవేంద్రు లును, యే=ఎవరు కలరో వారు, యుగపదేవచ భవంతి=ఏకకాలమందే జన్మింతురు.

తాత్పర్యము : మన్వంతరములందు మనువులు తద్వంశజులు ఋషులు దేవతలు దేవేంద్రాదులు వారి యనుచరులైన గంధర్వాదులు వీరందరు ఏకకాలమందే జన్మింతురు. ఒక్క మనువు రాజ్యమేలిన కాలము తీరి మరియొక్క మనువు కాల మారంభ మగునంతవరకును మన్వంతరమని పేరు. మొదటి మనువు స్వాయంభువుడు. రెండవవాడు వంశభవుడు. భూమి యందలి వేరు వేరు అంశలను పాలించుచున్న మనుపుత్రుడు తద్వంశజుడు. సప్తర్షులు దేవతలు దేవేంద్రుడు గంధర్వాదులు వీరందరితో చేరియున్న యొకకాలము మన్వంతరము. ఈ మన్వంతరమందు భగవంతుని యవతారము గూడనుండును. అవతారము మన్వంతరములో తనకిష్టమైనపుడు వచ్చును. తక్కిన వారు ఏకకాలమందే జన్మింతురు. వీరందరు చేరి రాజ్యము నేలుదురు.

25. ఏషః=ఇది, త్రైలోక్యవర్తనః=త్రిలోకముల ఉత్పత్తితో కూడినది, బ్రాహ్మః=బ్రహ్మదేవునికి సంబంధించినదియు, దైనందినః=పగటియందేర్పడెడు, సర్గః=సృష్టి, యత్ర=దేనియందు, కర్మభిః=స్వకీయ కర్మలతో, తిర్యక్ నృపితృదేవానాం=తిర్యక్కులు, మనుష్యులు పితరులు దేవతలు వీరియొక్క, సంభవః=ఉత్పత్తి ఏర్పడునో.

తాత్పర్యము : బ్రహ్మదేవుని పగటి వేళలం దెల్లను అనువర్తించు ఈ సృష్టిత్రిలోకముల యుత్పత్తితో కూడినదే. బ్రహ్మదేవుని కొక్కపగలు గడచినపుడు త్రిలోకములు నాశన మగును. రాత్రిగడచి పగలు ఆరంభించినపుడు మరల ఆవిర్భావము. దీనికే దైనందిన సృష్టియని భావము. దిన మంతయు జరగు చుండెడిదని తాత్పర్యము. దీనిలో వారి వారి కర్మాను సారముగా పశుపక్ష్యాదులు మనుష్యులు, పితరులు, దేవతలు వీరంద రుద్భవింతురు, నశింతురు.

26. స్వమూర్తిభిః=తనశరీరములతో, సత్త్వం=సత్త్వగుణమును, బిభ్రత్=ధరించు వాఁడై, భగవాన్=జ్ఞాన స్వరూపుఁడైన పురుషోత్తముఁడు, మన్వాదిభిః=మన్వాదులతో పాటు, ఉదిత పౌరుషః=తనయొక్క విలాసముల మాహాత్మ్యమును గోచరించుచున్న వాఁడై, మన్వంతరేషు= మన్వంతరము లందు, ఇదం విశ్వం=ఈ లోకమును, అవతి=రక్షించును.

తాత్పర్యము : అన్ని మన్వంతరములందును భగవంతుఁడు సత్త్వగుణ ప్రధానమైన శరీరమును ధరించి వచ్చును. ఆ శరీరగ్రహణము స్వేచ్ఛతో కూడినదే. అతఁడు మన్వంతరాధిపతులతో చేరి తన యసాధారణ పరాక్రమ మును ప్రదర్శించును. లోకమందు ధర్మమును నిలుపును. ఆ యవతారము ప్రత్యక్షముగనున్నది కావచ్చును. లేక ఆవేశావతారము గావచ్చును.

27. తమోమాత్రాం=తమోగుణమునే, ఉపాదాయ=స్వీకరించి, ప్రతి సంరుద్ధ విక్రమః=ప్రతిసంహరించు కొనఁబడిన వ్యాపారము కలవాఁడై, కాలేన=కాలముతో, అనుగతాశేషః=తనయం దడఁగియున్న సర్వసృష్టితో కూడినవాఁడై, దినాత్యయే=దివసావసానమందు, తూష్ణీం ఆస్తే=నిర్వ్యాపారుఁడై యుండును.

తాత్పర్యము : బ్రహ్మ యొక్క దైనందిన వ్యాపారమును వివరించిన పిదప రాత్రియందున్న ఆతని సితిని చెప్పుచున్నాఁడు. రాత్రియందు తమోగుణమును స్వీకరించి విశ్వసరాభిముఖమైన ప్రవృత్తిని నిలుపును. సకలమును తనయందు లయింపచేసి కొనుటకు కాలశక్తి కూడ సహకరించును. సమస్త మును తనయందు లీన మొనర్చుకొని యాతఁడు నిద్ర నందును.

28. భూరాదయః=భూమి మొదలైన, త్రయః లోకాః=మూఁడు లోకములును, నిర్ముక్త శశిభాస్కరం=నిశ్చేష్టులైన శశిభాస్కరులతో పాటు, నిశాయాం అనువృత్తాయాం=రాత్రి యనువర్తించు కాలమందు, తమేవ=ఆతనినే, అపిధీయంతే=అనుసరించి లయించును.

తాత్పర్యము : ఆరాత్రి యందు భూర్భువ స్స్వర్లోకములును వాని కాంతిసంపదల నిచ్చుచున్న సూర్యచంద్రులును నక్షత్రాదులును భగవంతుని యంతర్భాగమున లయించును.

29. శక్త్యా=శక్తిస్వరూపమైన, సంకర్షణాగ్నినా=ఆదిశేషముఖాగ్నిచేత, త్రిలోక్యాం=మూఁడు లోకములును, దహ్యమానాయాం=దహింపఁబడుచున్న వగుచుండఁగా, ఊష్మణా=వేడిచేత, అరితాః=పీడింపబడినటి, భృగ్వాదయః=భృగువు మొదలైన మహరులు, మహర్లోకాత్=మహర్లోకము నుండి, జనం=జనర్లోకమును గూర్చి, యాంతి=పయనింతురు.

తాత్పర్యము : త్రిలోకములును నశించు పద్ధతిని వివరించుచున్న వాఁడై వానికి బహిర్భూతులైన భృగ్వాది సిద్ధుల యొక్క తత్కాల పరిస్థితిని వివరించుచున్నాఁడు. త్రిలోకములు నశింపబోయెడిపరిస్థితి యేర్పడినపుడు ఆదిశేషుని ఫణములనుండి అగ్నిజ్వాల లుద్భవిల్లి యూర్ధ్వ ముఖముగా ప్రవర్తించును. అప్పుడా యుష్ణము భరింపరానిది. దానిలో ముల్లోకములు భస్మీభూతములగును. ఆ జ్వాలలు మహర్లోకము వరకు వ్యాపించును. అపుడు అచ్చటనున్న సిద్ధులు ఆ లోకమునుండి జనర్లోకమును చేరెదరు.

30. ఉత్కటాటోప చండవా తేరి తోర్మయః=ఆ గాలియొక్క ఆటోప ముత్కటమైనది. ఆ క్షోభముతో సముద్ర తరంగము లుత్తాలములై మహాకాయము లేచును. కల్పాంతేధితసింధవః=సముద్రము లూర్ధ్వ ముఖములై మహాకాయములగును. లగును. తావత్ సద్యః=అప్పుడు హఠాత్తుగా, త్రిభువనం=ముల్లోకములు. ప్లావయంతి=మునిఁగిపోవును.

తాత్పర్యము : అప్పటి వాతములు ప్రచండముగ వీచును. సముద్రము లున్మాదముగా క్షోభించును. క్షోభించి ముల్లోకముల నవి జలములతో నించును. సమస్తమును జలమ యమై పోవును.

31. తస్మిన్నంతస్సర్వే=ఆ జలమధ్యమందు, సః అనంతాసనః హరిః =ఆదిశేషుఁ డనెడి పాన్పుపై పవళించిన నారాయణుఁడు, యోగ నిద్రా నిమీలితాక్షః=యోగనిద్రతో మూసికొన్న కన్నులు కలవాఁడై, జనాలయైః =జనర్లోకమందున్న భృగ్వాదులచేత, స్తూయమానః=స్తుతింపఁబడు చున్నవాఁడై, ఆస్తే=ఉండును.

తాత్పర్యము : ఆ కల్పాంత జల మధ్యమందు ఆదిశేషుఁడను శయ్య, ఆ శయ్యపైనున్న నారాయణుఁడు. ఆతనిది యోగనిద్ర. ఆ కన్నులు నిద్రా నిమీలితములు. స్వరూపానందమునే యనుభవించుచుండును. జనలోకమందున్న సనకాది మహర్షులాతని స్తుతించుచుందురు.

32. కాలగత్యా=కాలగతిచేత, ఉపలక్షితైః=ఉపలక్షింపఁబడిన, ఏవం విధైః=ఈ రీతిగానున్న, అహోరాత్రైః=రేపవళ్ళచేత, అస్యాపి=ఈ బ్రహ్మ యను దేవతకును, పరమాయుః=సంపూర్ణమైన యాయుస్సు, వయశ్శతం= నూరువర్షములు, అపక్షీణం ఇవ=క్రమముగా నపక్షీణ మగునట్లుండును.

తాత్పర్యము : పరమాణువు మొదలుకొని సంవత్సరము వఱకున్న లెక్క ప్రకారము యుగములు వేయి. చతుర్యుగ పరిమాణమైన కాలము బ్రహ్మకొక్క పగ లంటిమి. రాత్రికూడ అంతే. మనుష్యుని ఆయువు కంటె బ్రహ్మయాయువు హృదయమునకే అందనంత పెద్దది. ఆతని పరమాయుస్సైన నూరువర్షములు కూడ క్రమముగా క్షయించియే పోవును.

33. తస్య=ఆ బ్రహ్మయొక్క, ఆయుషః=ఆయువుయొక్క, అర్ధంయత్=అర్ధభాగము ఏదికలదో అది, పరార్ధం=పరార్ధమని, అభిధీయతే=పిలువఁబడుచున్నది. పూర్వః పరార్ధః=ఆద్యమైన పరార్ధము, అపక్రాంతః=గతించినది. అపరః=రెండవదియైన పరార్థము, అద్య=ఇప్పుడు, ప్రవర్తతే=ప్రవర్తించుచున్నది.

తాత్పర్యము : బ్రహ్మదేవుని యొక్క ఆయుస్సులో అర్ధభాగమునకు పరార్ధ మని పేరు. ఇప్పటికి మొదటి పరార్థము గతించినది. రెండవ పరార్థమే జరుగుచున్నది.

34. పూర్వస్య పరార్ధస్య=మొదటిదైన పరార్ధము యొక్క, ఆదౌ=ఆదియందు, బ్రాహ్మః నామ=బ్రాహ్మమను పేరుగలి, మహాన్ కల్పః=మహాకల్పము, అభూత్=ఉండెను. యత్ర=దేనియందు, బ్రహ్మ అభవత్=బ్రహ్మదేవుఁడేర్పడెనో, యం=ఎవనిని, శబ్ద బ్రహ్మేతి విదుః=శబ్ద బ్రహ్మయని అందురో.

తాత్పర్యము : బ్రహ్మయొక్క దివసావసానము లందంతయు ప్రళయమౌనని చెప్పితి. ఆ ప్రళయముల నన్నింటిని నిరూపించుట యశక్యము. అందుచే కొన్నింటిని మాత్రమే వివరింతును. ఇచటనుండి మూఁడు శ్లోకములు ప్రళయముల నామధేయములను వివరించుచున్నాము. మొదటి పరార్ధము యొక్క ఆరంభమునందు బ్రాహ్మకల్ప ముండెను. అపుడే శబ్దమయ బ్రహ్మమైన వేద మేర్పడెను. అందుచే దానికి బ్రాహ్మకల్పమని పేరు.

35. తస్యైవ=దానియొక్క, అంతే చ=కడపట, కల్పః అభూత్=మఱి యొక్క కల్ప మేర్పడెను. యం=దేనిని, పాద్మం కల్పం=పాద్మకల్పమని, అభిచక్షతే=విద్వాంసు లందురో, యత్=దేనియందు, హరేః=హరియొక్క, నాభిసరసః=నాభిసరస్సునుండి, లోకసరోరుహం=లోకమయమైన పద్మము, ఆసీత్= ఏర్పడినదో.

తాత్పర్యము : మొదటిదైన పరార్ధము ముగియునప్పుడు మరియొక్క కల్పముండును. దానికి పాద్మకల్ప మనీ పేరు. దాని యందు శ్రీహరియొక్క నాభియను సరస్సునందు లోకమయమైన సరసీరుహ మేర్పడినది. దానిం బట్టియే అది పాద్మకల్పమైనది.

**36. భారత=ఓ పరీక్షిన్మహారాజా! అయంకల్పస్తు=ఈ కల్పము, ద్వితీయస్య ఆదౌ=రెండవ పరార్ధము యొక్క మొదటి యందు, కథితః=చెప్పబడిన,**

వారాహః ఇతి=వారాహమని, విఖ్యాతః=సుప్రసిద్ధమైనది. యత్ర= దేనియందు, హరిః=హరి, సూకరః ఆసీత్=వరాహావతారిమెత్తెనో.

తాత్పర్యము : రెండవ పరార్ధము యొక్క మొదటి దానికి వారాహ కల్పమని పేరు. దానియందు భగవంతుఁడగు శ్రీహరి వరాహరూప మెత్తినాడు.

37. ద్విపరార్ధాఖ్యః=రెండవ పరార్ధమని పిలువఁబడుచున్న, అయంకాలః=ఈ కాలము, అనాదిః=ఆది అంతములేని, అనంతస్య=అంత మనుటయు లేని, జగదాత్మనః=జగత్స్వరూపుఁడైన, అవ్యాకృతస్య=అక్షర పరబ్రహ్మకు, నిమేషః ఉపచర్యతే=ఒక నిమేషము ఉపచరించునో.

తాత్పర్యము : అక్షర పరబ్రహ్మకు ఆద్యంతములు లేవు. ఆతఁడు జగత్స్వరూపము. ఈ పరార్ధకాలము ఆతనికొక్క నిమేషము. బ్రహ్మదేవుని యొక్క పరమాయువు వరకున్న కాలము గణించునట్లుగా అక్షర పరబ్రహ్మయొక్క ఆయువును గణింతమను కొనక, జగదాత్ముఁడైన అక్షర పరబ్రహ్మ ఆద్యంత రహితుఁడని చెప్పిరి. కనుక ఆతని ఆద్యంత మెవ్వరు చెప్పరైరి.

38. పరమాణ్వాదిః=పరమాణువు మొదలుగా, ద్విపరార్ధాంతః= ద్విపరార్ధము తుదిగానున్న, ఈ కాలము, ధామమానినాం=గృహాదుల యందు అభిమానము గలవారిని, ఈశ్వరః=నియమించుచున్న, అయంకాలః =ఈ కాలము, భూమ్నః=పరిపూర్ణ బ్రహ్మము, ఈశితుః=నియమించుటకు, నప్రభుః=సమర్థము కాదు.

తాత్పర్యము : కాలస్వరూపము పరమాణువు మొదలుకొని ద్వితీయ పరార్ధము అంతముగాగల ఈకాల స్వరూపుఁడే ఈశ్వరుఁడు. ఇది దేహగేహాభి మానము కల వారి నందరిని నియమించును. కాని పరిపూర్ణ బ్రహ్మమును నియమింపలేదు. కాలశక్తి నతిక్రమించి యున్నదని తెలయవలెను.

39. వికారైః సహితః=ప్రకృతి యొక్క వికారములతో కూడి నదియు, యుక్తైః దశోత్తరాదిభిః=విశేషాదిభిః ఆవృతః=అన్యోన్యము మేళనముచెంది పదికైపైగా ఉన్న విశేషాదులచేత చుటబడినదియు, బహిః=బయట, పంచాశత్కోటి విస్తృతః=ఏబదికోట్ల యోజనములు విస్తారము గలది యునైన, అయం అండకోశః=ఈ యండకోశము, యత్ర=ఎవనియందు, దేనియందు, పరమాణువత్=పరమాణువువలె ప్రవిష్టః=చేరియున్నదై, లక్ష్యంతే=చూడఁబడుచున్నదో, అంతర్గతా=లోపల నడగియున్న, కోటిశః అండరాశయః=కోటి అండరాశులు, లక్ష్యంతే=కన్పించుచున్నవి. మహాత్మనః పురుషస్య విష్ణోః=మహాపురుషుఁడైన విష్ణువు యొక్క, సాక్షాత్పరంధామ= ప్రత్యక్షమైన నామము, సర్వకారణం=సమస్త కారణములకు కారణమైన, అక్షరం బ్రహ్మ=అక్షర బ్రహ్మగా, తదాహుః=దానినిచెప్పుదురు.

అవతారిక : అక్షర పరబ్రహ్మము సర్వత్ర పరిపూర్ణమైయున్నది. అది కాలదేశ వస్తు పరిచ్ఛిన్నమైనది కాదు. ఈ విషయమును చెప్పుచున్నాడు. భూమ్యాది పంచభూతములు జ్ఞానేంద్రియములైదు, కర్మేంద్రియములైదు. మనస్సు వీనితో పదునొకండు ఇంద్రియములు, ప్రకృతి=మహత్తత్త్వము, అహంకారము, శబ్దాదులైన తత్త్వములన్నియు చేరి ఎనిమిది తత్త్వములు అన్నియుచేరి 24 తత్త్వములు, వీనిచేతనే సమస్తము స్వరూపమును గైకొనుచున్నవి. వీనితో కూడినదే అండకోశము. దాని వైశాల్యము ఏబదికోటి యోజనములు, దీని ననుసరించి ఉత్తరోత్తరాధికముగా మరికొన్ని అండకోశములు. ఏడావరణములు, ఇట్టి వనేకాండ కోశము లివియన్నియు ఆ అక్షర పరబ్రహ్మతో పోల్చినపుడు పరమాణువులు. ఇవియన్నియు ఆతని యందు పరమాణువువలెనే లయించును. సర్వకారణములకు కారణము వాఁడే. ఈ పరమపురుషుని అక్షర పరబ్రహ్మ యందురు. దీనికంటెను గొప్పది మరి యొకటి లేదు.

## విజయధ్వజ వ్యాఖ్య

(1) శ్రీహరి దేశకాల గుణములతో ననంతుడు. ఈ జ్ఞానమే మోక్షమునకు కారణము. ఈ విషయమే ఈ అధ్యాయమునందు చెప్పుచున్నాఁడు. విదురుఁడు కాలస్వరూపమును తెలియఁజేయవలెనని ప్రశ్నించుచున్నాఁడు. దాని కుత్తరమిచ్చుచు అణువైన కాలము యొక్క పరమాణు ద్రవ్య స్వరూపమును చెప్పుచున్నాడు. విశేషాణాం=పృథివి మొదలైన పరమ పదార్థము విశేషము. యొక్క చరమః (విశేషః)=ఏదికొన యైన విశేషము. మరలనేది సదా=నిరంతరము, అనేకసంహితః=అనేకములైన అవయవములతో చక్కగా కూడి ఉన్నదో, తు=దేవలోకమందున్న మనుష్యులు చాల సూక్ష్మమైన పదార్థమును చూడ సమర్థులై ఏ పరమాణువును - అంశములతో కూడి యున్నది అనుకొని తెలియలేరో అందుచేతనే, నృణాం=మనుష్యులైన కణాదులు మొదలైనవారు, యతః=ఏ సూక్ష్మ పదార్థమునుచూచి, ఐక్య భ్రమః =ఇది ఒక్కటే పదార్థము, అవయవ విశిష్టము కాదని భ్రమించిరో, సః తు=ఆ సూక్ష్మభాగము, పరమాణుః విజ్ఞేయః=పరమాణువను పేరుతో పిలువఁబడుచున్నదని జ్ఞాను లందురు. వైశేషికాది మతప్రవర్తకులైన కణాదులు మొదలైనవారు భ్రాంతు లగుటకు నాశ్చర్యము లేదని 'నృణాం' అనుపదముతో సూచించుచున్నాడు. విచారపూర్వకముగా నాలోచించినచో అదే పరమాణువుకాదు. కాని సామాన్యులకొఱకై దానిని ఔపచారికముగా పరమాణు వందురు. ఈ యర్థము 'విజ్ఞేయః' అను పదము చేత సూచింపఁబడుచున్నది. దీనికి ప్రమాణము.

**మనుష్యాదేవలోకేపి విశేషేణైవ దర్శనే,**
**అంశాంశిత్వ విశేషం తు యస్య ద్రష్టుంనశక్నుయుః.**
**చరమో విశేష ఇతితంమున యో్బ్రూయు రంజసా**
**పరమాణుస్సవిజ్ఞేయః కాణాద్యాద్యా నిరంశినమ్.**
**అనంతాంశయుత త్వేపి యంబ్రూయుర్భ్రాంతిదర్శనాత్,**
**తతోఽపి పరమాణు త్వం తదంశానాంతు యద్యపి,**
**అనంతత్వాద్వివేకార్థం యస్యోక్తా పరమాణుతా.**

(2) అణుపరిమాణమును చెప్పి మహత్పరిమాణమును చెప్పు చున్నాఁడు. స్వరూపావస్థితస్య=తనస్వరూపమునే ఆశ్రయించికొని యున్న, సత్పదార్థస్య=సత్ అనెడిపదము యొక్క ముఖ్యార్థమైన పరబ్రహ్మకు సంబంధించిన దేదైన యత్=ఏ కైవల్యము, యత్కైవల్యము=జగత్తు నావరించుట మొదలైన రూపములం దుదాసీనమై యున్నదో, తత్=అదియే, అవిశేషః=అట్టిరూపవిశేష రహితమైన, నిరంతరః=ప్రాదేశమాత్రము మొదలైన విశేష విశిష్టముకాని, పరమమహాన్=అన్నిటికంటె పెద్దదైన వస్తువు.

శ్రీహరి దేశకాలాభేదములతో అనంతుడు. వాని సమస్తరూపం ఇట్టిదే. కాని కొన్ని రూపములను కొన్ని ప్రదేశములందే యున్న వానినిగా చెప్పుట కలదు. శ్రీహరి అచింత్యాద్భుత మహిమ కలవాఁడైనను వ్యవహారమునకై వ్యాప్తి అవ్యాప్తిదోషములను తోపచేయును. కనుక అణువునందున్న పరమాత్మ స్వరూపమునకు సర్వవ్యాపకుడైన పరమాత్మకును భేదము లేదు. వాని సర్వ వ్యాప్తమైన స్వరూపమును 'నారాయణ, బ్రహ్మ శూన్యం' మొదలైన శబ్దములతో పిలుతురు. దీనికి కేవల భావమని యే పేరు. దీనికన్న దొడ్డదైన వస్తువు లేదు. ఆ శ్రీహరియే జగత్సృష్టికై పరమపురుషుఁడను స్వరూపమును స్వీకరించెను. ఇది నారాయణునిరూపమునకంటెను వ్యాప్తియందు తక్కువ. జగత్తునందు వ్యాపించి యున్న వాసు దేవస్వరూపము మూఁడవది. జగత్తునందు ప్రవేశించి యున్న నాల్గవరూపమే విష్ణువు. ఇట్లు దేశ ఆనంత్యమందు వ్యత్యాస మున్నట్లు తోపింపజేయుచున్నను కాలము గుణము వీనితో పరిచ్ఛేదము నెక్కడను సూచించలేదు. కనుక శ్రీహరి యొక్క నారాయణ స్వరూపము పరమమహత్తు. దీనికి ప్రమాణము-

**కాలకోటి విహీనత్వం కాలానంత్యం విదుర్బుధాః,**
**దేశ కోటి విహీనత్వం దేశానంత్యం తథైవ చ.**
**గుణానా నప్రమేయత్వం వస్త్వానంత్యం విదో విదుః,**
**అనంత్యం త్రివిధం నిత్యం హరేర్నాన్యస్య కేనచిత్.**

తస్య సర్వ స్వరూపే ష్వప్యానంత్యంతు త్రిలక్షణమ్,
తథాపి దేశతస్తస్య పరిచ్ఛేదోఽపి విద్యతే,
పరిచ్ఛేద స్తథావ్యాప్తిః ఏకరూపేఽపి యుజ్యతే.
తస్యాచింత్యాద్భుతైశ్వర్యాద్య వహోరాత్రమేవ చ,
గుణతః కాలతశ్చైవ పరిచ్ఛేదో న కుత్రచిత్.
వ్యాప్తత్వం దేశతోఽప్యస్తి పూర్వరూపేషు యద్యపి,
న చ భేదః క్వచిత్తేషా మణు మాత్రోఽపి విద్యతే.
తథాఽపి విద్యతేఽణుత్వం తస్మాద్దైశ్వర్య యోగతః

మొదలైన ప్రమాణములను భాగవత తాత్పర్యములందు చూడవచ్చును. పదార్థ మనఁగా పదము యొక్క ముఖ్యార్థమని అర్థము. "ముఖ్యాభిధేయస్త్వర్థః స్యాత్‌వాచ్య మన్యచ్ఛభణ్యతే" అనుట ప్రమాణము. శ్రీహరి అణువు నాశ్రయించి ఉన్నప్పుడు అణుపరిమాణముతోనే యుండవలెనుకదా? ఈ ఆశంక కుత్తరముగా "స్వరూపావస్థితస్య" అన్నారు. శ్రీహరి తాను తన మహిమ నాశ్రయించి యుండునే కాని వేరొక్కదాని నాశ్రయించి యుండఁడు. కైవల్య శబ్దముతో వాసుదేవున కంటెను వ్యాప్తమైన నారాయణ రూపమును చెప్పుచున్నాఁడు దీనియందు రూపవిశేషము సన్న ప్రదేశమందుండెడి ఖండత్వము మొదలైన గుణములు లేవని తెలుపుటకే ' అవిశేషః, నిరంతరః" మొదలైనవి. ఇట్టి యఖండరూపమే పరమ మహద్వస్తువు. ఈ సర్వత్రవ్యాప్తమైన రూపము కాలరూపమైన ప్రకృతితో చేరి సమవ్యాప్తమై యున్నను సర్వగతమని యే చెప్పవలెను. ఎందుకనగా కాలరూపిణియైన లక్ష్మి శ్రీహరి యొక్క అత్యంతాను గ్రహమునకు పాత్రురాలై యున్న ఆత్మ స్వరూపిణిగనే భావింపఁబడుచున్నది. దీనికే"స్వరూపావస్థితః" అనుపదముతో సూచించుచున్నాఁడు. తక్కిన మహత్తత్త్వము మొదలైన వాని యందున్న రూపము అన్యావస్థిత మనిపించు కొనును.

“దేవ్యా కాలాదిరూపిణ్యా స్థితం బ్రహ్మాఽపి సర్వగమ్,
ఉచ్యతేఽనన్యగం యస్మాత్ ఆత్మవత్సా హరేర్విభోః
మహదాదిగతం యత్తు తదన్యగతముచ్యతే.”

(3) చెప్పిన విషయమును కాలమునందును తోపింపజేయుచున్నాఁడు. సత్తమ=భక్తశ్రేష్ఠుఁడవైన విదురా, ఏవంవిధం=ఈ రీతిగనే, సౌక్ష్మ్యణే= పరమాణువైయుండుటను, సౌల్యే=పరమమహత్తుగా నుండుటను, కాలః అపి=కాలముకూడ, అనుమితః=కలా, మూర్తము మొదలైన వానిని తెలుపు శాస్త్రము. సాక్షిప్రత్యక్షము ఈ రెంటితో కూడి సరియైన కారణములతో

ఊహించిన జనులచే తెలియబడుచున్నది. ఇరుతెరగులైన కాలము మాత్రమేకాదు; దాని యం దంతర్యామియై ఉండి అదే పేరుగల శ్రీహరి నిగూర్చి తెలిసినవారు వారే. విభుః=సర్వవ్యాపకుఁడైన భగవాన్=శ్రీహరి, సంస్థాన భుక్త్యా=పరమాణువు పరమమహత్తు - ఈ రెంటి యందును నిలిచి అంతర్యామియై, అవ్యక్తః=అదృశ్యుఁడై, వ్యక్తభుక్=ఆయాకాలములందు సృష్టిస్థితి సంహారము లొనర్చువాఁడుగా, అనుమితః=తెలిసికొన బడినవాఁడు. అవ్యక్తభుక్ అనియు పదవిభాగము చేయవచ్చును. అనగా తనతో సమాన ధర్మముగల అవ్యక్తమనెడి ప్రకృతిని సృష్టిమొదలైన కార్యములందు ప్రవర్తింపఁజేయుచున్నవాఁడై యని యర్థము. 'అనుమా' అనుశబ్దమునకు జ్ఞానము ఊహ అను రెండర్థములును నిఘంటువులో ఉన్నవి. ఈ రెండర్థములను ఇక్కడ అన్వయించుకొన వచ్చును. పరమాణువు, పరమమహత్తు కాలములకు ప్రమాణమీ క్రిందిది.

"యావంతం దేవ లోకస్థో మానుషస్త్వవధారయేత్,
మహాప్రజ్ఞోదేవ జూకః సకాలః పరమాణుకః."

యజ్ఞాదుల నొనర్చి దేవతల యనుగ్రహముతో నైశ్వర్యమునంది దేవలోకములను చేరెను. ప్రజ్ఞాశాలియైన మనుష్యుఁడు తెలిసికొనుటకు సాధ్యమని సూక్ష్మకాలమునకు పరమాణు వని పేరు.

"సర్వాద్యైరనవచ్ఛిన్నః తదనంతర ఇత్యపి,
తథైవ పరమాణ్వాది విశేషాత్మాऽపి నోభవత్
పూర్వాపరాదిభేదేన సకాలః పరమో మహాన్."

అఖండమైన కాలమునకు పరమమహత్కాల మని పేరు. కాలాంతర్యామియైన శ్రీహరికి ఆయా పేరులు చెల్లుననుటకు ప్రమాణము.

"అణ్వాది కాల సంస్థాన భోక్తృత్వా త్పరమేశ్వరః,
అణ్వాది నామవాచ్యోऽసౌకాలశ్చేత్యభిధీయతే."

కాలమందు పరమమహత్తు అను పేరుతో పిలువఁబడినవాడగుటచేత స్థూలకాలాంతర్యామిత్వము శ్రీహరి కున్నంత మరెవ్వరికినీ లేదని తెలుపుటయైనది. దీనిచేత తారతమ్యముకూడ స్పష్టము.

"దేశతః కాలతశ్చైవ వస్తుతశ్చ త్రిధా హరేః
యథానంత్యం నచ్చాచాన్యస్య ప్రకృతేర్దేశ కాలతః.
తథా శబ్దస్యకాలస్య దేశానంత్యంచ కాలతః,
కాలశబ్దాత్మి కాశ్చైవ తథాపి తుహరేః సదా.

నాస్యాస్సామర్థ్యలేశోఽపి జ్ఞానానంద గుణేష్వపి,
జ్ఞేయస్తదవరోహా యః శేషవేంద్రహరాస్తతః
అవరాస్తత ఇంద్రాద్యాఃగుణైః సర్వైః నసంశయః"

ఇట్లు కాలవ్యాప్తి యందున్న తారతమ్యమును తెలియవలెను.

(4) సామాన్యముగా చెప్పినతరువాత విశేషముగా చెప్పుచున్నాఁడు. యః కాలః=ఏ కాలమును కాలాంతర్యామి యైన పరమాత్ముఁడును, పరమాణుతాం='చరమస్స ద్విశేషానాం' అనుశ్లోకమందు చెప్పిన విశేషములను భుంక్తే=పొంది యున్నవాఁడు, సః కాలః=ఆ కాలము కాలాంతర్యామి యైన శ్రీహరి, పరమాణుర్వై=పరమాణువనెడి పేరుతో శాస్త్రమునందు ప్రసిద్ధుఁడు. యః కాలః=ఏ కాలమును, కాలాంతర్యామియైన హరియు, సతః =సచ్ఛబ్దమునకు ముఖ్యవాచియైన పరబ్రహ్మ యొక్క అవిశేషభుక్=స్వరూపమునందే యుండెడి - "కేవల మనిపించుకొనెడు" భుంక్తే=పొంది యుండునో సః కాలః=ఆ కాల కాలాంతర్యామి యొక్క రూపము. పరమమహాః=పరమ మహత్ అనిపించుకొనును. పరమ మహదంతంతర్యామి యైన శ్రీహరి రూపమునకు దేశవస్తుగుణపరిచ్ఛేదము లేదు. ఎల్ల ప్రదేశములందును అన్నిటిని పొందువాఁడు. ఆతఁడు తన అచింత్యాద్భుత మహిమ నొక్కదానినే పొందికొని యుండెడి వాఁడు. ప్రమాణము -

"సర్వత్ర సర్వ భోక్తాఽపి విశేషాదేవ భోక్తృవత్
స్థితో హరి రచింత్యాత్మా నిజైశ్వర్యాదజో విభుః."

'కనుక' పరమ మహాన్' అని ముందు చెప్పెడి శ్రీహరి అఖండ రూపమునకు చెందిన విశేషణమునకు అఖండ కాలాంతర్యామియైన భగవద్రూపమని తెలియు చున్నది. 'సత్' అను దాని ముఖ్యార్థము పరమాణు కాలాంతర్యామి రూపము కాదు. మన్వంతర రూపకాలాంతర్యామి రూపము కూడ కాదు. ఆ పదార్థ పరకాలాంతర్యామి రూపమును కాదు. అఖండ మగుటచే అవయవ భేదముచే పరమహద్రూపము. ఇదే పరమమహాత్కాలాంతర్యామిగా ఉండునది. పరమాణువు పరమ మహత్పదార్థముల ఉత్పత్తి యగు కాలమునకు క్రమముగా ఆయా పేరులని కొంద ఱర్థము చెప్పిరి. అది యనుచితము.

(5) ఇప్పుడు పరమాణు పరమహాత్కాలముల మధ్యనున్న కాల అవయవములను వాని సంఖ్యకు తగినట్లుగా వాని పేరులను చెప్పుచున్నాఁడు. ద్వౌపమాణూ=రెండు పరమాణు కాలములు చేరి అణుః=ద్వ్యణుక మగును. త్రయః=ఆ ద్వ్యణుకములు మూఁడు చేరినచో, త్రసరేణుస్స్మృతః=త్రసరేణువనిపించుకొనును. ద్వ్యణుకమును యోగులు మాత్రమే చూడగలరు.

త్ర్యణుకమును యోగులు కాని వారుకూడ చూతురు "జాలార్క రశ్మ్యవగతః " గవాక్షమునుండి లోనికి ప్రసరించు సూర్యుని కిరణములచే తెలియఁ బడుచున్న ఖమేవ అనుపతన్=దృష్టికి గోచరముగా, అగాత్=అగును. ఇక్కడ అన్ని కాలఅవయవములయందు వానిలో నంతర్యామియై ఉండి ఆయా పేరు లతో పిలువఁబడుచు నాయాకాల పదార్థములను నియమించెను. సచ్చిదానంద రూపమైన అనంత మనిపించుకొనెడి శ్రీహరి రూపము లున్నవని తెలియవలె. ఆ రూపమునే నాతఁడను భవించును. ఈ విషయము " సర్వత్ర సర్వభోక్తా" అనెడి ప్రమాణము చేతనే సిద్ధించు చున్నది.

(6. 7.) మూఁడు త్ర్యణుకముల కాలమునకు త్రుటి యనిపేరు. తత్రభాగః =మూఁడుత్రుటులు మూఁడు వేధములు. మూడు వేధములు లవములు. మూఁడులవము లొక్కనిమేషము. వ్రేలితో చిటికె వేయునంత కాలము. మూఁడు నిమేషము లొకక్షణము. ఐదుక్షణము లొకకాష్ఠము. దశపంచ చ=పదునైదు. తాః=కాష్ఠములు ఒక లఘు వగును.

(8) పదునైదు లఘువులు ఒకనాడిక. తేద్వే=రెండునాడికలు ముహూర్తము. షట్=ఆరునాడికలు ప్రహరము, వా=అథవా, సప్త=ఏడు నాడికలుయామః=ఒక్కయామము. ఇది నృణాం=మనుష్యమానముతో చెప్పినది. పగలురాత్రులు కొంచెము ఎక్కువ తక్కువగా గోచరించు చుండు టచే వికల్పములు చెప్పినాఁడు.

(9) నాడికల స్వరూపము తెలుపుటకు నాడిక యొక్క లక్షణము వింగడించు చున్నాఁడు. ద్వాదశార్ధపలోన్మానం=ఆరుపలముల భారమున్న చతురంగుళైః=నాల్గంగుళములే మందముకల, చతుర్భిః=నాలుగైన, స్వర్ణమాషైః=మాష ప్రమాణమైన బంగారుశలాకవలె, నున్నదై, కృతచ్ఛిద్రం=నాల్గురంధ్రములు కలిగిన పాత్రను నీటియందుంచినచో, యావత్=ఎంతసేపటిలో, జలం=నీటిని, పిబేత్=రంధ్రమూలకముగా మునుఁగునో, అంతకాలమునకు నాడిక యని పేరు. నాలుగు కాకణికముల తూకమున వింశాంశమందు అదియే వీసము. నాల్గువీసము లొక్కమాషము. నాలుమాషముల తూకముగల బంగారమును నాల్గంగుళముల కడ్డీగా చేసినచో ఎంత దప్పముండునో అంత దప్పముగల నాల్గురంధ్రములున్న ఆరుపలముల భారమున్న పాత్రలో నిర్మలమైన సూర్యుని కిరణములతో కాచి వేడిగానున్న ప్రవాహనీరము లందుకొని, వసంత ఋతువునందలి ప్రయాగ గంగ నీటిలో పెట్టినచో పాత్రరంధ్రముద్వారా నీటిని లోన జొనుపుకొని మునిఁగి పోవునో అంతకాలమునకు నాడిక యనిపేరు - ప్రమాణము.

**"కాకిణికా చతుష్కంచ వింశాంశే త్వభిధీయతే,**
**కృష్ణలేత్యపి తంబ్రూయుః తైశ్చతుర్భిశ్చమాషకః.**

చతురంగుళ దీర్ఘేతు కృతే మాషచతుష్టయే,
యావాన్స్యాత్ పరిణాహేన తావద్ద్వారం విధీయతే.
ప్రస్థస్య నాడీ పాత్రస్య షట్పలస్య శుభే జలే,
భారాధిక్యేనోదకేన క్షిప్రం పూర్తి ర్భవిష్యతి,
అతిశైత్య కలం కేచ మాద్యే నైవతు పూరణమ్,
తస్మాద్వసంతకాలే చ ప్రయాగ సోదకేన చ
నాడీ శుద్ధిః పరీక్షాస్యాత్ అన్యథానైవ సంభవేత్.
నిర్మలేన సమోష్ణేన నిత్యం సూర్యాంశువారిణా,
ప్రవాహ కేనకార్యాస్యాత్ కాలశుద్ధి స్తదైవ తు."

(10) నాల్గు యామములు పగలు నాల్గు రాత్రి ఉభే అహని అనుటతో పగలు రాత్రు లని అర్థము. పదునైదు పగళ్ళు రాత్రులు పక్షము. ఇవి రెండురీతులు.

(11) ఇవి రెండు చేరిన ఒక మాసము. ఇట్లు మనుష్యుల యొక్క మాసము పితరుల కొక్కదినము. రెండుమాసము లొక్క ఋతువు. ఆరుఋతువు లొక్క అయనము. అయనములు రెండు, దక్షిణోత్తరాయనములు.

(12) పూర్వ శ్లోకమందలి దివి అనుశ్లోకమును చేర్చుకొనవలెను. ఈ రెండు అయనములను దేవలోకమునందు క్రమముగా రాత్రి పగళ్ళ పంద్రెండు మాసము లొకవర్షము. ఇట్టి నూరువర్షములు మనుష్యుల ఆయువు.

(13) గ్రహర్క్షతారాచక్రస్థ=గ్రహములు అశ్విన్యాదులు, ధ్రువుఁడు మొదలైన తారలు ఈ మండలి మందున్న, అనిమిషః=సమస్తజీవుల పుణ్యపాపకర్మములఁ జూచుచు నెప్పుడు సంచరించువాఁడు, నెప్పుడు వికాసమంది యుండెడివాఁడు, విభుః=శ్రీహరి, పరమాణ్వాదినా=పరమ సూక్ష్మకాలము మొదలుకొని, సంవత్సరావసానేన=సంవత్సరమే కొనగాఁగలిగిన కాలముచేత, జగత్=ప్రపంచమును, పర్యేతి=మరల మరల చుట్టును. దీనితో కాలము శబ్దముతో ముఖ్యముగా చెప్పఁబడువాఁడు పరమాత్ముఁడే యని చెప్పినట్లైనది.

"సర్వదా దర్శనాత్తస్య నిమిషత్వం విదుర్బుధాః,
సతతం గమనాద్వాపి కాల స్తస్య మహాత్మనః."

(14) ఆయాపేర్లుగల కాలమందుండుట చేతను వానిని నియమించుట చేతను, శ్రీహరి ఆయానామములతో పిలువఁబడునని చెప్పఁబడు చున్నాఁడు. సంక్రమణముతో నారంభమై ముగియు సౌరమానము యొక్క పంద్రెండుమాసములలో నుండు శ్రీహరికి సంవత్సరమని పేరు. బృహస్పతి పంద్రెండురాసులందు సంచరించు కాలములో పంద్రెండవ భాగమందుండు

రూపమును పరివత్సర మందురు. ఇరువదిఏడు నక్షత్రము లోకమానము. ఇట్లు పండ్రెండు మానములందుండు రూపము ఇడావత్సర మనిపేరు. తిథులు పండ్రెండు సారులు ఆవృత్తమై వానితో నేర్పడు పండ్రెండు మాసములలో నుండు రూపము అనువత్సరము. 360 పగళ్ళుగల కాలమందున్న రూపమే వత్సరము. ఇటు కాలాంతర్యామియైన శ్రీహరి ఆయాపేరులతో పిలువఁబడును. దీనికి ప్రమాణము -

15. వత్సరము మొదలైన పేరుల యొక్క ప్రయోజనమును చెప్పుచున్నాఁడు. యతః=ఈ కాలాంతర్యామి యైన శ్రీహరి, క్రతుభిః=తన ఇచ్ఛకు తగిన తన ప్రజలతో, కాలాఖ్యయా=కాలమని పిలువఁబడు, స్వశక్త్యా=తన యొక్క శక్తిచేత అనగా ప్రకృతిచేత, గుణమయం=సత్త్వాది గుణవికారమనెడు సృజ్యశక్తిం=సృష్టింపవలసినపదార్థముల స్వభావమును, ఉరుధా=అనేక ప్రకారముగా, ఉచ్ఛ్వసయన్=ప్రకటింప బోవుచున్నవాఁడై, వితన్వన్=పదార్థములను విస్తరింపచేయువాఁడై, పుంసః =సజీవుల యొక్క, అభ్రమాయ=అజ్ఞానమును పోఁగొట్టుటకు, భూతభేదః =ప్రాణుల యుందుండెడు తారతమ్య జ్ఞానము నొసఁగెడి శ్రీహరి, దివి ధావతి=సూర్యుని యందుండి వేగముగ సంచరించునో, తస్మై=అట్టి వత్సరపంచకాయ=వత్సరము, సంవత్సరము, అనువత్సరము, ఇడావత్సరము, పరివత్సరమనెడి ఐదురూపములుగల శ్రీహరికి, బలిం హరత=పూజనొనర్పుఁడు.

(16) ముందు చెప్పినవానిని ననువాద మొనర్చి ముందుచెప్పవలసిన వానినిగూర్చి విదురుఁడు ప్రశ్నించుచున్నాఁడు. ఇదం=ఇది వఱకు మీకుచెప్పినది పితరులు దేవతలు మనుష్యులు వీరి యొక్క, పరం = సంపూర్ణమైన, ఆయుః=ఆయుస్సుగా, స్మృతం=ప్రసిద్ధము. కానీ కల్పాత్=ఈ మూఁడు లోకములనుండి, బహిః=బయటనున్నట్టి మహర్లోకము మొదలగు వాని యందు, యే విదస్స్యుః=ఏజ్ఞాను లుందురో, పరేషాం=ఉత్తములైన ఆ జ్ఞానుల యొక్క, గతిం=స్థితిని, ఆచక్ష్వ=చెప్పుఁడు.

(17) చెప్పవలసిన విషయమందు మైత్రేయునకు జ్ఞానము గొప్పగా నున్న దనుచున్నాఁడు. ధీరాః=ధీరులు, యోగరాదేన=అష్టాంగ యోగములో సిద్ధినిఁబడసిన, చక్షుషా=జ్ఞాన చక్షువుచేత, విశ్వం=జగత్తును, విచక్షతే = తెలియుదురు. అట్టివారిలో నొకరైన, భగవాన్=పూజ్యుఁడవైన నీవు, కాలస్య=కాలాంతర్యామియైన, భగవతః=శ్రీహరి యొక్క, గతిం= గమనమును, వేదనను=తెలియుదురుకదా.

(18) మైత్రేయుఁ డనుచున్నాఁడు. మహర్లోకాదులలో నున్న వారి ఆయుస్సును చెప్పఁబోవుచున్నవాఁడై కృతాదులైన నాల్గు యుగములను వాని సంధికాలమును వాని పరిమాణమును చెప్పుచున్నాఁడు. దివ్యైః=

దేవతాసంబంధమైన, ద్వాదశసాహస్రైః=పండ్రెండు వేలసంవత్సరములు కృతాది నాలుయుగములని, సావధానం=అవధానపూర్వకముగా, నిరూపితం=నిరూపించబడినది.

(19) దీనినే విశద పఱచుచున్నాఁడు. యథాక్రమం=క్రమముగా, కృతాదిషు=కృతాది యుగములందు, చత్వారి=నాలుగు, త్రీణి=మూఁడు, ద్వే=రెండు, ఏకం=ఒక్కటి యైన సహస్రవర్షములు, సంఖ్యాతాని= చెప్పఁబడినవి. ద్విగుణాని=పైన చెప్పఁబడిన సంఖ్యలకు రెండింతలు అనఁగా ఎనిమిది, ఆరు, నాలుగు, రెండు, శతాని చ=నూరువర్షములు ముందు వెనుకలనున్న సంధ్యాకాలము. కలి యుగమునకు వెనుక నూరు, ముందు నూరు అనఁగా ఇన్నూరు వర్షములు సంధికాలము. ఇట్లే తక్కినవి.

(20) అట్లయినచో కృత త్రేతాది యుగములని ఏకాలమును పిలుతురు? దానికి సమాధానము -

శతసంఖ్య యోః=నూరుసంఖ్యలుగల, సంధ్యాంశయోః=ముందు వెనుకలనున్న సంధ్యాంశములను వదలిపెట్టి, అంతరేణ=మధ్య, యః కాలః = వేలలోగల ఏకాలము కలదో, యత్ర=ఏ మధ్యకాలమందున, ధర్మః=ఆయా యుగధర్మములు, విధీయతే=విహితములో, తమేవ=ఆకాలమునే తద్జ్ఞః= యుగపరిమితి నెరిగిన జ్ఞానులు, యుగం=సరియైన యుగమని, ఆహుః= పలికెను. అనఁగా కలియుగానంతరము వచ్చెడి నూరు వర్షములు సంధి కాలము. దానికి పైన 400 వర్షములు కృతయుగము ఒక సంధి కాలము. తరువాత 4000 ఏండ్లు కృతయుగము. తరువాత 400 వర్షములు కృత యుగా నంతరపు సంధికాలము. ఇట్లు నాలుగువేల ఎనిమిది నూర్ల మధ్యనున్న 4000 వర్షములకే కృత యుగమని పేరు. ఇట్లే తక్కినవానిని ఊహించకొనవలెను.

(21) కృతాదులందు చెప్పఁబడెడి ధర్మము ఏ యవయవములతో కూడియున్నది? అది ఉండెడి రీతి వివరించునది? కృతే=కృతయుగమందు, మనుజా నుద్దిశ్య=మనుష్యుల నుద్దేశించి, ధర్మః చతుష్పాత్=ధర్మము తపస్సు దయ శౌచము అను నాలుపాదములతో సమనువర్తతే. అన్యేష=ఇతరములందు పేరుకు తగినట్లు వర్ధతా=క్రమముగా పెరుగుచున్న, అధర్మేణ=తపస్సు మొదలగు వానికి విరోధియైన అధర్మముతో సఏవ=ఆధర్మమే, పాదేన=ఒక్కొక్క పాదముతో, వ్యైతి=తక్కువగు చున్నది.

(22) తత్రయేస్యుఃకల్పాద్బహిర్విదః=అని యడగిన ప్రశ్నకు ఉత్తర మొసఁగుటకు నారంభించుచున్నాఁడు. తాత!=విదుర! త్రైలోక్యాత్ బహిః= ముల్లోకములకు బయట, ఆ బ్రహ్మణః బహిః=బ్రహ్మలోకము పర్యంతమైన యుగసాహస్రం=వేయిచతుర్యుగములు, బ్రహ్మణః=బ్రహ్మకు, దినం=ఒక

పగలు, తావతీ ఏవ=ఆ వేయి చతుర్యుగములే, నిశా=బ్రహ్మకు రాత్రి, యత్=ఈ రాత్రివేళయందు, విశ్వసృట్=బ్రహ్మ, నిమీలతి = సృష్టికార్య మొనర్పక నిదురించుచున్నాఁడు.

(23) నిశావసానే=రాత్రి కొన యందు మరల, ఆరబ్ధః=బ్రహ్మచే నారంభింపఁబడిన లోకముల సృష్టిరూపమైన దినకల్పము, చతురశ=పదు నాలుగు, మనూన్=మన్వంతరములను భుంజన్=పొందినదై, భగవతః= బ్రహ్మదేవుని, దినం=పగలు యావత్స్యాత్=అగువరకును. అనువర్తతే= అనువర్తించును. 'భుంజన్' అని పులింగములో చెప్పుటచే యజ్ఞము మొదలైన రూపములో చెప్పఁబడిన శ్రీహరియే ముఖ్యభోక్త. దినము భోక్తయనుట ఔపచారికము.

(24) మనువు లనుభవించెడి మన్వంతర కాలమును చెప్పుచున్నాఁడు. మనుః=మనువు, సాధికామేక సప్తతిం=సుమారు పదునైదు లక్షల ఏబది వర్షములు ఎక్కువగా నున్న డెబ్బది యొక్క మహాయుగములను స్వం స్వం=తమ తమ, కాలం=కాలమును, భుంక్తే=అనుభవించును. మన్వంతరేషు= ఈ మన్వంతరములందు, మనవః=ఆయా మనువులు, తద్వంశ్యాః=ఆ వంశమందు పుట్టిన, ఋషయః=సప్త ఋషులు, సురాః సురేశాః=యే చ తాన్ అను=దేవతలు ఇంద్రుడు తదనుచరులైన గంధర్వాదులు, ఏతేయుగపద్భ వంతి=వీరందరు ఒక్క కాలమున నేగుదురు. మన్వంతర ప్రళయకాలము మొదటి మన్వంతరములో రెండు వేల వర్షములు. రెండవ దానినుండియు ఏడవ మన్వంతర పూర్తి వరకు ఒక్కొక్కదానికి వేయి వర్షములపైన ఐదునూరు. తక్కిన ఏడింటికి ఒక్కొక్కదానికి ఒక వేయి నాల్గునూర్ల వర్షములు. దీనికి ప్రమాణము -

> "యుగైక సప్తతే రూర్ధ్వం సారా ష్టాదశలక్షకమ్,
> వత్సారాణాం మనోర్భుక్తిః సహస్రం చతురుత్తరమ్
> శతానాం ప్రళయశ్చైవ పంచోత్తరమథాపిచ
> ఆద్యేషు షట్సు ప్రథమే ద్విసహస్రంప్రకీర్తితమ్."

(25) ఏషః=ఇది, బ్రాహ్మః=బ్రహ్మదేవుఁడొనర్చెడి, త్రైలోక్య వర్తనః= మూఁడు లోకములను ఆవృత్తి బొందించెడి, దైనందినః=బ్రహ్మదేవుని ప్రతిదినమునకు సంబంధించిన, సర్గః=సృష్టి, యత్ర=ఆ దిన కల్పములందు, కర్మభిః=వారి వారి కర్మానుసారముగా, తిర్యక్ నృపితృదేవానాం సంభవః =పిత్రాదులసంభవము.

(26) మన్వాదులు జగత్తును పాలించుటయు శ్రీహరి యనుగ్రహము తోనే అనుచున్నాడు. ఉదితపౌరుషః=నిరంతరము ప్రకాశింపఁబడిన పరాక్రమముగల, భగవాన్ స్వమూర్తిభిః=సత్త్వంబిభ్రత్=శ్రీహరి తన

యవతారములతో సత్త్వగుణమును స్వీకరించినవాఁడై, మన్వంతరేషు మూరిభిస్సహ ఇదం విశ్వం అవతి=మన్వంతరము లందు మన్వాదు లతోపాటు నెలకొని ఈ జగత్తును కాపాడుచున్నాఁడు.

(27) జగత్తును పాలించుట మాత్రమే శ్రీహరికి చేరెడిది. ప్రళయము కాదు అనెడి వారి సందేహమును పరిహరించుచున్నాఁడు. దినాత్యయే = బ్రహ్మదేవుని దినాంతమైన రాత్రియందు, భగవాన్ తమోమాత్రం ఉపాదాయ=భగవంతుఁడు తమోగుణ ప్రవర్తకములై కాలము సంకరణుఁడు రుద్రుఁడు మొదలైన రూపములను ధరించి, ప్రతి సంరుద్ధ విక్రమః=తన పరాక్రమము నుపసంహరించుకొన్నవాఁడై, కాలేన=కాలనామకుఁడైన బ్రహ్మదేవుని చేత, అనుగతః=అనుసరింపఁబడినవాఁడై, శేషే=దినకల్పము యొక్క ప్రళయోదకమందున్న శేషనిపైన, తూష్ణీం=జగద్వ్యాపారమును వదలి, ఆస్తే=నిదురించును. "దినాత్యయే=అనుటతో ఇది దినకల్ప ప్రళయమని తెలియవలెను. 'కాలేన' అను పదము బ్రహ్మదేవునితో అనునర్థమందు నుపయోగింపఁబడినది. దీనికి ప్రమాణము.

బ్రహ్మణా కాలనామ్నాతు సహ శేతే హరి ర్నిశి

(28) ఈ కాలమందు చరాచరజగత్తు నిశ్శేషముగా నాశనమగుటలేదు. అందుచే శ్రీహరి యొక్క నిద్ర తక్కిన వారి నిద్రవంటిదికాదు అను నభిప్రాయముతో నా నభిప్రాయమును తెలుపుచున్నాఁడు. లోకే నిర్ముక్త శశిభాస్కరే=లోకము, సూర్యచంద్ర రహితముకాఁగా బ్రహ్మదేవుఁడు నిద్రించినవాఁడుకాఁగా శ్రీహరి గర్భమును ప్రవేశించును. నిశాయాం అనువృత్తాయాం=బ్రహ్మదేవుని రాత్రివచ్చుచుండఁగా, భూరాదయః త్రయోలోకాః=భూమ్యాది లోకములు, తం అనువేద అనుయుంజంతే = అతనిని అనుసరించియే లీన మగును. అనువిధీయంతే=అనుపాఠములో నిదురించిన శ్రీహరి జతకు తామును సుప్తముగా చేయబడునని అర్థము.

(29) ఆ లయప్రకారమునే స్పష్టపరచుచున్నాఁడు. సంకర్షణాగ్నినా= సంకర్షణుని ముఖము నుండి బయలుదేరిన అగ్నితో, శక్త్యా=కాల్చు శక్తిచేత, త్రిలోక్యాందహ్యమానాయాం=ముల్లోకములు దహ్యము లగుచుండఁగా, యథా ఊష్మణా అర్దితాః=తాపతప్తులయిన, భృగ్వాదయః జనం యాంతి= మహార్లోకవాసులైన భృగ్వాదులు జనర్లోకమునకు వెళ్ళుదురు.

(30) తావత్కల్పాంతే ఉత్కటాటోపచండ తేరితోర్మయః=అప్పుడు దిన కల్పాంతమందు కోలాహలముతో కూడిన భయంకరమైన గాలితో పైకి లేపఁ బడిన అలలు గల, విషసింధవః=సంకర్షణుని ముఖమునుండి బయలుదేరిన విషముచే కూడిన సప్తసముద్రములు, సద్యః త్రిభువనం ప్లావయంతి= అప్పుడే ముల్లోకములను నీటిలో ముంచుచున్నవి.

(31) దినప్రళయ జలములో శ్రీహరి యుండురీతిని వివరించుచున్నాడు. సలిలే అంతః సః అనంతాసనః=ఆనీటిలో శేషశాయియైన ఈ విష్ణువు. యోగనిద్రామీలితాక్షః ఆస్తే=నిద్రఅనెడి నెపము చేత కనులు మూసినవాఁడై, జనాలయైః స్తూయమానః=జనలోకవాసులచేత పొగడఁబడినవాఁడై, ఆస్తే=ఉండును. అనంతాసనః=అనుటలో శ్రీహరి నిద్ర ఔపచారికమని తెలుపఁబడినది. ఈ ఉదాసీన భావన దినప్రళయ ప్రయుక్తమని తెలియుచున్నది.

(32) ఈ యహోరాత్రుల వర్ణనకు ప్రయోజనమేమి? వివరించుచున్నాఁడు. అస్యాపి=కాలగత్యా ఉపలక్షితైః=బ్రహ్మణో దినం=అని ప్రస్తుతుడైన బ్రహ్మకును సూర్యాంతర్యామియైన కాలనామకుఁడైన శ్రీహరి సంచారముచేత ఊహింపఁదగిన, ఏవం విధైః=పైన చెప్పినట్లున్న, అహోరాత్రైః=పగలురాత్రులచేత, వయశ్శతం=నూరువర్షముల వయస్సు, పరమాయుః=పూర్ణాయుస్సు, తథాऽపి=ఇంతైనను, అపక్షీతం ఇవ=మరల అపక్షీతమైనట్లుండును! అస్య అనుపదమునకు పరమాత్మకని అర్థముకాదు. వానికారూపమందును ఆయుఃపరిమితి లేదు. వాఁడనాది. అనంతుఁడు. అట్లే మధ్యముగూడలేదు. అందుకేవాఁడు నాశరహితుఁడని చెప్పఁబడుచున్నాఁడు. ప్రమాణము -

> "నాయుర్మానం భగవతః కస్మిన్ రూపేऽపివిద్యతే,
> అనాదిత్వా దమధ్యత్వాత్ అనంతత్వాచ్చ సోऽవ్యయః"

(33) ఇంతవరకు ఎంత ఆయుస్సు గడచినది ఈ విషయము చెప్పుటకు బ్రహ్మదేవుని ఆయుస్సు విభాగించుచున్నాఁడు. అస్య ఆయుషః యదర్ధం=ఇతని ఆయుస్సు యొక్క ఏ అర్ధభాగముకలదో అది పరార్ధము పరార్ధం=పరమని చెప్పఁబడెడి బ్రహ్మదేవుని వయస్సులో పూర్వార్ధముగా అభిధీయతే=చెప్పఁ బడుచున్నది. పూర్వః పరార్ధ అపక్రాంతః అద్య=పూర్వపరార్ధము గడచి పోయినది. రెండవ పరార్ధము జరుగుచున్నది.

(34) పూర్వస్య ఆదౌ బ్రాహ్మోనామ మహాన్కల్పః అభూత్=మొదటి పరార్ధము యొక్క మొదటి యందు బ్రహ్మమనెడి మొదటికల్పము. యత్ర=ఎక్కడ, యంశబ్దబ్రహ్మవిదుః బ్రహ్మో అభవత్=ఏ కల్పమందు ఎవనిని వేదప్రతిపాద్యుఁడని జ్ఞానులు తెలిసిరో ఆ బ్రహ్మదేవుఁడు మొట్ట మొదలు పుట్టినాడు. పాద్మకల్పమందు మొదలు పద్మముత్పత్తియే. అనంతరము బ్రహ్మ జన్మించినాఁడు. బ్రహ్మకల్పమందు శ్రీహరి నుండియే బ్రహ్మజనించెనని తెలియనగును.

(35) మొదటి పరార్థము యొక్క కడపటి కల్పమును చెప్పుచున్నాఁడు. తస్యైవఅంతేచ=ఆ ప్రథమ పరార్ధంతమందు యంపాద్మమభి చక్షతే=దేనిని పాద్మకల్పమని జ్ఞాను లందురో, సః కల్పః అభూత్=అది అయ్యెను. యత్=ఏ కల్పమందు, హరేః నాభి సరసః లోకసరోరుహం ఆసీత్=శ్రీహరినాభిసరోవరము నుండి లోకాశ్రయమైన కమలము జన్మించెనో.

(36) రెండవ పరార్థము యొక్క మొదటి దినకల్పమని చెప్పుచున్నాఁడు. భారత!=విదుర! ద్వితీయస్య అయం వారాహ ఇతివిఖ్యాతః కల్పః ప్రథితః= రెండవ పరార్థమునకు సంబంధించిన ఇప్పుడు ప్రవర్తించుచున్న కల్పము శ్వేత వరాహకల్పము. ఇటని జ్ఞానులందురు. యత్ర హారిః సూకరః ఆసీత్=ఈ కల్పమందే శ్రీహరి సూకరరూప మెత్తెను.

(37) శ్రీహరికి కాలనిబద్ధమైన ఆయుర్మానము లేదని ముందు చెప్పినాఁడు. ఇప్పుడు దానిని స్పష్టీకరించుచున్నాఁడు. ద్విపరార్థాఖ్యః అయంకాలః=రెండు పరార్థములుచేరి పరమని పిలువబడుచున్న ఈ కాలము. అవ్యాకృతస్య=నిమేషాది వికారములు లేమి అనంతస్య? దేశకాలగుణ పరచ్ఛిన్నత లేని, అనాదేః=కారణ రహితుఁడైన, జగదాత్మనః =జగత్స్వామియైన, హరేః=శ్రీహరికి, నిమేషః=రెప్పపాటు కాలముగా, ఉపచర్యతే=ఔపచారికముగా తెల్పఁబడుచున్నది. అవ్యాకృతాది విశేషణములతో శ్రీహరి కాలము నుండి తిరస్కృతులనెడి అజ్ఞానుల సందేహమును పరిహరించు చున్నాఁడు. అందుచేతనే నిమేషమన్నది. ఔపచారికమని తెలుపుచున్నాఁడు. పరిచ్ఛిన్నుఁడైనవాఁడు వికారియే యగును కదా అను సందేహము అనంత శబ్దముతో పరిహృతము. ఆకాశేనీ లిమావిధేతి అనునట్లు అనంతమైన దానికిని పుట్టుక ఉండవచ్చునను శంకను అనాది శబ్దముచే పరిహరించిరి. విచిత్ర జగత్తునందు శ్రీహరికికూడ నొకకారణ మెందు కుండకూడదన్న విశంకను జగదాత్మనః అనుటతో పరిహరించుచున్నాఁడు. 'హి' అనుటచేత "నాయుర్మానం భగవతః తస్మిన్ రూపి మివిద్యతే, అనాదిత్వాత్ అనుద్భుత్వాత్ అనంతత్వాత్ సోఽవ్యయః" అనెడి ప్రమాణముచే సూచితము.

(38) నిమేషమనుట కూడ నౌపచారికమనుదానిని సమర్థించు చున్నాఁడు. ధామమానినాం=లోకములందు నేను నాదియని అభిమానము కల బ్రహ్మాది చేతనులకు, ప్రభుః=ఉండెడిస్థితిని తప్పించి వేఱు స్థితిని ఇచ్చుటకు సమర్థుఁడైన, ఈశ్వరః=సర్వులను నియమించెడి, సః అయం= ప్రసిద్ధుఁడైన శ్రీహరి, ఈరితః పరమాణ్వాది=నీకు చెప్పిన పరమసూక్ష్మకాలము మొదలుకొని, ద్విపరార్ధాంతః=రెండు పరార్థములనెడి కాలము

కాలాభిమానినియైన శ్రీభూదుర్గా రూపిణియైన లక్ష్మియు, భూమ్నః=దేశకాల గుణపరిపూర్ణుఁడైన శ్రీహరికి, నైవ ఈశితుః=నియామకురాలు కాదు. అంతకారి కూడకాదు. అందుచేత కేవల సామాన్యజనులకు మనోగోచర మగుటకై నిమేషమనెడి ఔపచారిక ప్రయోగము, ప్రభుః ఈశ్వరః అను విశేషణముల నుపయోగించుటలో కేవల జడకాలమని చెప్పరాదు. కాలాఖ్యమైన చేతనులనే చెప్పవలెను. వారిలో సర్వసంహారకురాలైన దుర్గయే ముఖ్యకారక మనిపించుకొనును. ఆమెకు కూడ శ్రీహరిపై నెట్టి ప్రభావము లేదు. అందుచే శ్రీహరి అతిశయ మాహాత్మ్యము కలవాడు. జడకాలమే ప్రభువైనచో రాయి మొదలైన జడపదార్థములుకూడ ప్రభువులయ్యేడి ప్రమాదము ఉన్నది. ఇది లోకవిరుద్ధము. కనుక చేతనులనే చెప్పవలెను. కాలాభిమాని చేతనుల తారతమ్యమును మధ్వాచార్యులు భాగవత తాత్పర్యమందు స్పష్ట పరచినారు.

"యమః కాలో మానుషాణాం తస్య కాలస్సుదర్శనః,
తస్యాఽపిరుద్రః స్తత్కాలో బ్రహ్మదుర్గాపి తస్యతు
తస్యాని యామకో విష్ణుః పరః కాలస్య విద్యతే
కాలాభిమానినీ సైవ ప్రభుర్న జగదీశితుః
తస్యాః ప్రభుః స ఏవేకో విష్ణుస్సర్వేశ్వరేశ్వరః."

(39. 40.) ప్రకారాంతరముగా శ్రీహరి మహిమను చెప్పుచున్నాఁడు. పంచాశత్కోటి విస్తృతః అయం అండకోశః=పంచాశత్కోటి విస్తృతమైన ఈ అండకోశము అంతః=కొన షోడశైః వికారైః=దశేంద్రియములు భూతపంచకము మనస్సనెడి పదునా రుపాదాన కారణములలో, యుక్తః= కూడినది, బహిః=దాని బయట, దశోత్తరాధికైః=పై పైనపది పదికోట్లు హెచ్చెడి విశేషాదిభిః పృథివ్యప్తేజో వాయ్వాకాశ అహంకార మహత్తులు ప్రకృతి తత్త్వములు. వీనిలో పృథివీ తత్త్వము నూరుకోట్ల యోజన పరిమాణము కలది. తక్కినవి పదికోట్ల యోజన ప్రమాణము. ఆవృతః= ఆవరింపఁబడినది. ఇంత విస్తారమైన బ్రహ్మాండము, యత్ర ప్రవిష్టః పరమాణువత్ లక్ష్యతే=ఎవని దేహమందు ప్రవిష్టమై పరమాణువువలె కనిపించుచున్నదో, చ=ఇంకను అంతరతః=శ్రీహరి శరీరమును ప్రవేశించిన, అన్యే=ఇతర, అండరాశయః=బ్రహ్మాండరాసులు, కోటిశః=లక్ష్యంతే=చూడఁ బడుచున్నవి. ఇక్కడ బ్రహ్మాండము లనేకము లగుట రెండురీతులలో (1) శ్రీహరి రూపము లనేకములు. ఒక్కొక్క రూపమునందుండుటచేతను ఒక్కొక్క రోమ కూపమునలదుడుటచేతను శ్రీహరి తన సామర్థ్యములో ఒకే బ్రహ్మాండమును తన రూపములందు ధరించి యుండుటలో ఒకటి బ్రహ్మాండము అనేకములై ఉండును. స్వతహాగా అనేకము కాదు.

(2) గడచిన బ్రహ్మాండంబులు రాబోవు బ్రహ్మాండములు అసంఖ్యాకములు అందుచే ననేకములు. దీనికి ప్రమాణము -

**శరీరాణాం బహుత్వేన అతీతానాగతైస్తథా**
**అస్యైవ దేవకార్యేషు ప్రతి ప్రతిచదర్శనాత్**
**విష్ణుసామర్థ్యతోండానాం బహుత్వం నాన్యథాభవేత్**
**ఏకమండం బహుత్వేన ప్రత్యేకం రోమకూపకం**
**బ్రహ్మపశ్యత్తథాత్మానం హరేస్తేషు పృథక్పృథక్**

శబ్దాదులైన ఐదు తన్మాత్రలలో కూడి యుండుటలో పృథివీతత్త్వము నకే విశేషమని పేరు.

**పృథ్వీం విశేషఇత్యాహుః శబ్దాదీనాంబహుత్వతః,**
**సాసూక్ష్మత్వాద్వృణోత్యండం ద్విగుణాత్తు దశోత్తరా**
**అబాదయః ప్రకృత్యంతాః అష్టప్రకృతయః స్మృతాః.**

(41) పరమాణు పరమమహత్=ఈ శబ్దములకు ముఖ్యవాచ్యుఁడు శ్రీహరియే. పృథివ్యాదులుకాదు. ఈ యర్థమునే చెప్పుచున్నాఁడు. యం=బ్రహ్మాండాధారుఁడైన శ్రీహరిని, అక్షరం=నాశరహితుఁడని బ్రహ్మ= గుణపూర్ణుఁడని సర్వకారణకారణం=సర్వకారణకారణులైన బ్రహ్మాదుల కును కారణమని, ఆహుః=వేదములు చెప్పునో, తస్య మహాత్మనః=అంతటి పరమమహత్ పరిమాణముకల, సాక్షాత్పురుషస్య=అత్యంత అణుప రిమాణముకల జీవుల స్వరూప శరీరమందును, అత్యంత సూక్ష్మ రూపిణియైన లక్ష్మియందును ఉండుటచే పురుషుఁడని పించుకొన్న, విష్ణోః=శ్రీహరికి, అయం=ఈ పైనచెప్పిన బ్రహ్మాండములో, ధామ పరం=కేవలము గృహములై ఉండును. అందుచే గడచిన రాఁబోయెడి ఇప్పుడున్న అనంతుఁడు బ్రహ్మదేవుఁడు మొదలైన భాగవతోత్తములచేత శ్రీహరి సంపూర్ణముగా తెలియఁబడ నేరఁడు. ఆయుః=పరిమితి లేనివాఁడు. దేశకాల గుణములతో ననంతుడు. అనంతకాలస్వరూపుఁడు. ఇట్లు తెలియుటయే మోక్షసాధనము. ముముక్షువైన జీవి శ్రీహరి యందు సర్వోత్తమ భక్తిని ఆచరింపవలెను. అందుచే వాని సర్వోత్తమత్వజ్ఞానము అన్నిరీతులను సంపాదించుకొనవలెను.

**ఇతి శ్రీభాగవతే మహాపురాణే, తృతీయస్కంధే**
**ఏకాదశోఽధ్యాయః.**

# ఏకాదశాధ్యాయము

సీ. భువిఁ దన కార్యాంశమునకు నంతము నన్య
వస్తుయోగంబు నేవలన లేక
ఘట పటాదిక జగత్కార్యంబునకు నిజ
సమవాయ కారణత్వమునఁ బరఁగి
జాల సూర్యమరీచి సంగత గగనస్థ
మగు త్రసరేణు షడంశ మరయఁ
బరమాణు వయ్యెఁ దత్పరమాణువం దర్క
గతి యెంత తడవు దత్కాల మగును

తే. సూక్ష్మకాలంబు విను మది సూర్యమండ
లంబు ద్వాదశరాశ్యాత్మకం బనంగఁ
గలుగు జగమున నొకయేఁడు గడచి చనినఁ
గాల మెంతగు నది మహత్కాల మనఘ.! 345

వ. అందుఁ బరమాణు ద్వయం బొక్క యణువగు. అణుత్రితయం బొక్క త్రసరేణు వగు. అవి మూఁడుకూడ నొక్క త్రుటి యగు. ఆ త్రుటిశతం బొక్క వేధ యనం బరఁగు. అట్టివేధలు మూఁడు గూడ నొక లవం బనందగు. అవి మూఁడైన నొక్క నిమేషం బనం జను. నిమేషత్రయం బొక్క క్షణంబగు. తత్క్షణ పంచకం బొక్క కాష్ఠ యనంబరఁగు. అవి పదియైన నొక్క లఘువన నొప్పు. అట్టి లఘుపంచదశకం బొక్క నాడి యనం బరఁగు. అట్టి నాడికాద్వయం బొక్క ముహూర్తం బయ్యె. అట్టి నాడిక లాఱైన నేడైన మనుష్యులకు నొక్క ప్రహరం బగు. అదియ యామం బనం జను, దివస పరిమాణ విజ్ఞేయం బగు నాడికోన్మాన లక్షణం బెఱింగింతు. షట్పల తామ్రంబునం బాత్రంబు రచియించి చతుర్మాష సువర్ణంబునం జతురంగుళాయామ శలాకంబు గల్పించి దానం దత్పాత్రమూలంబున ఛిద్రంబు గల్పించి, తచ్ఛిద్రంబునం బ్రస్థమాత్రతోయంబు పరిపూర్ణంబు నొందు నంతకాలం బొక్క నాడిక యగు. యామంబులు నాలుగు సన నొక్క పగలగు. రాత్రియు నిప్ప గిదిని జరుగు. అట్టి యహర్నిశంబులు గూడ మర్త్యుల కొక దినంబగు. అవి పదియేనైన నొక్క పక్షం బగు. శుక్లకృష్ణ నామంబులం బరఁగిన పక్షంబులు రెండుఁగూడ నొక్కమాసంబగు. అది పితృదేవతలకు నొక్క దివసం బగు. అట్టి మాసంబులు రెండైన నొక్క ఋతువగు. షణ్మాసంబు లరిగిన నొక్కయయనం బగు. దక్షిణోత్తర నామంబులం

బరఁగిన యట్టియయనంబులు రెండుగూడి ద్వాదశ మాసంబు లయిన యొక్క సంవత్సరం బగు. అట్టి సంవత్సర శతంబు నరులకుం బర మాయువైయుండు. కాలాత్ముండును నీశ్వరుండును నైన సూర్యుండు గ్రహ నక్షత్ర తారాచక్రస్థుండై పరమాణ్వాది సంవత్సరాంతంబైన కాలం బునం జేసి ద్వాదశ రాశ్యాత్మకంబైన జగంబున సౌర బార్హస్పత్య సావన చాంద్ర నాక్షత్ర మానభేదంబులం గానంబడుచున్నవాఁడై సంవత్సర పరివత్సరేదావత్సరానువత్సర వత్సర నామంబుల సృజ్య మైన బీజాంకురముల శక్తింగాలరూపంబైన స్వశక్తిచేత నభిముఖం బుగాఁ జేయుచుం, బురుషులకు నాయురాది వ్యయంబులంజేసి విష యాసక్తి నివర్తింపం జేయుచుం, గోరికలు గల వారికి యజ్ఞముఖంబులం జేసి గుణమయంబులైన స్వరాది ఫలంబుల విస్తరింపం జేయుచు, గగనం బునం బరువువెట్టు వత్సర పంచక ప్రవర్తకుండగు మార్తాండు నకుం బూజగావింపుమని మైత్రేయుండు పలికిన విదురుం డిట్లనియె. 346

కం. నర పితృ సురపరమాయుః
పరిమాణము లెఱుఁగ నాకుఁ బలికితివి మునీ
శ్వర! యెఱిఁగింపు త్రిలోకో
పరిలోక విలోకనైక పరులగు వారిన్. 347

ఉ. పూనిన యోగ సిద్ధి దగఁబొందిన నేత్రయుగంబునన్ బహిర్
జ్ఞానము గలియుండి భువనంబులఁ జూచుచునుండు వారికిన్
మానుగఁ గల్గు కాలగతి నా కెఱిఁగింపు మునీంద్ర! నావుడు
న్నానయశాలి య వ్విదురు సాదరుఁడై తగఁజూచి యిట్లనున్. 348

సీ. జననుత! కృతయుగ సంఖ్య నాలుగువేల
దివ్యవర్షములు తదీయసంధ్య
లెనిమిది నూఱేండ్లు ను నగుఁ ద్రేతయు నబ్ద
త్రిసహస్రములును దదీయ సంధ్య
లాఱు నూఱేఁడులు నగు ద్వాపరము రెండు
వేల వత్సరముల వెలయు సంధ్య
లొలి నన్నూఱేఁడు లొగిఁ గలి యుగము స
హస్ర వర్షములు సంధ్యాంశ మరయ

తే. రెండు నూఱేఁడులును నిల్చి యుండుఁ జువ్వె,
యనఘ సంధ్యాంశ మధ్యంబునందు ధర్మ
మతిశయించును సంధ్యాంశమందు ధర్మ
మల్పమై కానఁబడుచుండు ననఘ చరిత!

వ. మఱియు ధర్మదేవత కృతయుగంబున నాలుగు పాదంబులును, త్రేతయందు మూఁడు పాదంబులును, ద్వాపరంబునం బాద ద్వయంబును, గలియుగంబున నేక పాదంబును గలిగి సంచరించు. నట్లగుటంజేసి 350

కం. పాద విభేదంబున మ
ర్యాదలును దఱుఁగు నధర్మ మాకొలఁదినె యు
త్పాదిల్ల వృద్ధిఁబొందు ధ
రా దివిజులు పాపబుద్ధి రతు లగుదు రిలన్. 351

సీ. భూర్భువస్స్వర్లోకమున కంటెఁ బొడువునఁ
గడునొప్పు సత్యలోకంబు నందు
నుండు బ్రహ్మకుఁ జతుర్యుగ సహస్రము లేఁగ
దివ మొక్కటియగు రాత్రియును నిట్ల
చన ధాత నిద్రవో జగము లణంగు మే
ల్కని చూడ మఱల లోకములు వుట్టుఁ
దద్దినంబునఁ జతురశమను లగుదు రం
దొక్కొక్క మనువున కొనర దివ్య

తే. యుగము లోలిని డెబ్బది యొక్కమాఱు,
సనిన మనుకాల మయ్యె; నమ్మను కులంబు
సురలు మునులును సప్తర్షు లరయ భగవ
దంశమునఁ బుట్టి పాలింతు రఖిల జగము. 352

కం. హరి పితృ సుపర్వ తిర్య
ఙ్నర రూపములన్ జనించి నయమున మన్వం
తరముల నిజసత్త్వంబునఁ
బరిపాలించును జగంబు పౌరుష మొప్పన్. 353

కం. క్రమమునఁ ద్రైవరిక స
రము సెప్పంబడె సరోజ గర్భుఁడు దివసాం
తమునఁ దమః పిహిత పరా
క్రముఁడై శయనించు నిద్ర గైకొని యంతన్. 354

సీ. ఆ రాత్రి భువనత్రయము తమః పిహితమై
భాను చంద్రులతో విలీనమైన
సర్వాత్ముఁడగు హరిశక్తి రూపం బయి
కణఁగి వెలుంగు సంకర్షణాగ్ని

భువనత్రయంబును దవిలి దహింప న
యయ్యనల కీలలఁ బొడమిన మహోష్మ
మలమినఁ గమలి మహర్లోకవాసులు
జనలోకమునకును జనుదు రపుడు

తే. విలయ సమయ సముత్కట విపులచండ
వాత ధూతోర్మిజాల దుర్వార వారి
భువనములు ముంచు న మ్మూఁడు భువనములను
దత్పయో రాశి మీఁదఁ బద్మావిభుండు. 355

ఉ. చారు పటీర హీర ఘనసార తుషార మరాళ చంద్రికా
పూర మృణాళ హార పరిపూర్ణ సుధాకర కాశ మల్లికా
సార నిభాంగ శోభిత భుజంగమ తల్పము నందు యోగ ని
ద్రారతిఁ జెంది యుండు జఠరస్థిత భూర్భువరాది లోకుఁడై. 356

కం. జనలోకనివాసకు ల
రిని వినుతింపంగ నతుల దివ్యప్రభచేఁ
దీనరుచు మీలిత నిజ లో
చనుఁడై వసియించు నతఁడు సముచితలీలన్. 357

వ. ఇవ్విధంబున. 358

సీ. కైకొని బహువిధకాల గత్యుపలక్షి
తములై యహోరాత్ర తతులు జరుగ
శత వత్సరంబులు జనులకుఁ బరమాయు
వైన రీతిని బంక జాసనునకుఁ
బరమాయు వగు శతాబంబులందుల సగ
మరిగిన నదియుఁ బరార మండ్రు
గానఁ బూర్వార్ధంబు గడచుటఁజేసి ద్వి
తీయ పరార్ధంబు దీని పేరు;

తే. గడఁగి పూర్వ పరార్ధాది కాలమందు
బ్రహ్మ కల్పాఖ్య నెంత యుఁ బరఁగునందు
బ్రహ్మ యుదయించుటం జేసి బ్రహ్మకల్ప
మనియు శబ్దాత్మక బ్రహ్మ మనియు నెగడు. 359

కం. విను మెన్నఁడు పంకజ నా
భుని నాభీ సరసి యందు భువనాశ్రయమై

తనరిన పద్మము వొడమును
ననఘా! యది పద్మకల్ప మన విలసిల్లున్. 360

వ. పూర్వ పరార్థాదినిం గలిగిన బ్రహ్మ కల్పంబుఁ జెప్పితి. నింక ద్వితీయపరార్ధంబు మొదల నెన్నఁడేని హరి సూకరాకారంబు దాల్చె నది వరాహకల్పం బనం దగు. అట్టి వరాహకల్పం బిపుడు వర్తమానం బగుచున్నది. వెండియు. 361

సీ. దీపింపఁ గాలస్వరూపుఁడై నట్టి పఁ
    ద్మాక్షు డనంతుఁ డనాది పురుషుఁ
డఖిల విశ్వాత్మకుఁ డగు నీశునకుఁ బర
    మాణ్వాది యుగ పరార్థాంత మగుచు
జరుగు నీ కాలంబు చర్చింప నొక్క ని
    మేషకాలం బయి మెలఁగుచుండుఁ
గాన నీశ్వరునకుఁ గర్తగాఁ జాల ది
    క్కాలంబు విను మదిగాక దేహ

తే. మంది రార్థాది కర్మాభి మానశీలు
రైన వారికి నాశ్రయం బగుటఁజేసి
యరయ హరి దద్గుణ వ్యతి కరుఁడు గాన
కాల మమ్మేటి కెన్నఁడుఁ గర్త గాదు. 362

వ. మఱియు షోడశ వికార యుక్తంబై పృథివ్యాది పంచభూత పరివృతంబై దశావరణంబులు గలిగి పంచాశత్కోటి విస్తీర్ణంబై బ్రహ్మాండ కోశంబు దనరుచుండు. 563

చ. హరి పరమాణు రూపమున నందు వసించి విరాజ మానుఁడై
సరి వెలుఁగొందు నిమ్ముల నసంఖ్యములైన మహాండ కోశముల్
నెఱిఁ దన యందు డింద నవనీరజ నేత్రుఁ డనంతుఁ డాద్యుఁ డ
క్షరుఁడు పరాపరుం డఖిల కారణ కారణుఁ డప్రమేయుఁడై. 364

కం. నిరతి శయోజ్జ్వల తేజః
స్ఫురణం దనరారు పరమపురుషుని విష్ణుం
బురుషోత్తము వర్ణింపను
సరసిజ భవభవులకైన శక్యమె చెపుమా! 365

ఇది పోతన్న ఆంధ్రమహాభాగవతము నందు
ఏకాదశాధ్యాయము.

345. ఆద్యంశమునకున్=మొదటి భాగమునకు, అంతమునన్=కడయందు, అన్యవస్తు యోగంబును=ఇతర వస్తువులతో సంబంధము, ఘటపటాదిక జగత్కారణమునకున్=ఘటము పటము మొదలైన వ్యవహారములకు మూలమైన వస్తుమయమైన జగతికి, సమవాయ కారణత్వము=సమవాయ కారణంబై యుండుటను, జాల=గవాక్షమందలి, సూర్య=సూర్యునియొక్క, మరీచి సంగతము=కిరణములలో కూడినది, గగనస్థము=ఆకాశములో నుండెడి, త్రసరేణువునందు, షడంశము=ఆఱవపాలు, తత్పరమాణువందు=ఆపరమాణవునందు, సూర్యగతిన్=సూర్యకిరణము ప్రసారమును, ద్వాదశ రాశ్యాత్మకంబు=ద్వాదశ రాసులయందు ప్రవేశించునది,

తాత్పర్యము : త్రసరేణువులోని షడంశము పరమాణువు. దానికి మొదటి భాగమునకు అంతములేదు. అన్యవస్తు సంయోగము లేదు. ఘటపటాది వ్యవహారమూలక ప్రపంచ కార్యమునకు అది సంవాది కారణము. ఇక్కడ కణాద మతమునే చెప్పుచున్నాఁడు. "గుణ గుణినో సమవాయః" "అవయవావయవినోః సమవాయః", "కార్యవ్యక్త్యోః సమవాయః" అనునది తార్కికుల పంథా గవాక్షములోనుండి లోనికి జొరవారు త్రసరేణువు యొక్క షడంశమునే పరమాణువందురు. దానియందు సూర్యకిరణము ప్రవేశించు నంత తడవు సూక్ష్మకాలము. సూర్యుఁడు పంద్రెండు రాసుల నొక్కపరి చుట్టివచ్చుటకు సంవత్సరము. అది గొప్ప కాలము. అనఁగా లెక్కించుటలో గొప్పకాలము.

346. పరమాణు ద్వయం=రెండు పరమాణువులు, అణుత్రితయం=మూఁడు అణువులు, త్రసరేణువులు మూఁడెనచో నొక్కత్రుటి, ఆత్రుటులు నూరైన ఒక్కవేధ. వేధలు మూఁడొక లవము. అవి మూఁడొక్క నిమేషము. నిమేషత్రయము=మూడు నిమేషము లొక్కక్షణము. క్షణపంచకము=ఐదు క్షణములు ఒక్క కాషము. అవి పదిఒక్కలఘువు. పదునైదు లఘువు లొక్కనాడి. రెండునాడిక లొకముహూర్తము. నాడికలు ఆరుగాని, ఏడుగాని ఒక్క ప్రహరము. దీనికే యామమని పేరు. దివసముల గమనింపదగిన నాడిక యొక్క ఉన్మానము=కొలపాత్ర, తామ్రము=రాగి, చతురంగుళ ఆయామ శలాకము=నాలుగంగుళముల ఒకకడ్డీ, ప్రస్థమాత్ర తోయము=ఒకసేరు నీరు. దానికొక్క నాడికయని పేరు. నాలుగు యామము లొక్కపగలు. పగలురాత్రి యిటు నడచును. రాత్రింబగళ్ళు నిట్లు నడచును. ఇవి పదునైదైన ఒక పక్షము. రెండు పక్షము లొకమాసము. ఇవి పితరుల కొక్క దినము. రెండు మాసము లొక్క ఋతువు. ఆరు మాసములు గడచిన ఒక్క అయనము. అయనములు రెండు దక్షిణోత్తరములు. ఇవి రెండు ఒక వర్షము. నూరు వర్షముల ఆయువు పరిపూర్ణము. సూర్యుఁడు చంద్ర నక్షత్ర తారాచక్రస్థుఁడై గ్రహములు

నక్షత్రములు ధ్రువాదితారాసౌర బార్హస్పత్య సావన చాంద్ర నాక్షత్ర మాస భేదములు. నాక్షత్ర=నక్షత్ర సంబంధమైన, ఈ మాసములకే సంవత్సర, పరివత్సర, ఇలా వత్సరాది నామములు. వీని వివరములు విజయధ్వజ వ్యాఖ్యలో చెప్పినాను. సూర్యుఁడు బీజాంకురముల యొక్క శక్తిని కాలాంతరములచేత ఫలాభిముఖ మొనర్చును. పురుషుల కాయువ్యయ మొనర్చును. కోరికలు గలవారికి యజ్ఞాదుల ద్వారా గుణమయములైన స్వర్గ ఫలముల నొసఁగును. ఇట్లుగా సూర్యుఁడు ఆకాశమున సంచరించుచు వత్సర పంచకమును కలిగించును.

347. త్రిలోక+ఉపరిలోక విలోకనైకపరులు=పృథివికి పైనున్న లోకములలో నివసించు వారని తాత్పర్యము.

348. పూర్ణయోగసిద్ధిన్=అనుసరించిన యోగముచేత, నేత్ర యుగంబుననన్=రెండు కన్నులతో, అనఁగా యోగసిద్ధిచేత సంపాదించిన జ్ఞానచక్షువుతో అని అర్థము, బహిర్జ్ఞానము=ముల్లోకములకు పైనున్న లోకమును చూచువారి విషయమందు కాలగతి ఎట్లు ప్రసరించునో దానిని గూర్చి చెప్పుమని యర్థము. నావుడున్ ఆ నయశాలి=నావుడున్నా నయశాలి =ఇక్కడ ద్రుతముపైనీ ద్రుతము, పోతన ఇట్టి ప్రయోగములను విరివిగా చేయును.

349. కృత యుగ సంఖ్య=నాలుగువేలు, తదీయ పూర్వాపర సంధ్యలు ఎనిమిది నూరేండ్లు. త్రేత=మూఁడువేల దివ్యవర్షములు. దాని పూర్వాపర సంధ్యలు ఆరునూరు సంవత్సరములు. ద్వాపరము రెండు వేల దివ్య వర్షములు. సంధ్యాంశములు నన్నూరేండ్లు. కలియుగము సహస్ర దివ్యవర్షము. సంధ్యాంశలు రెండునూరేండ్లు. సంధ్యాంశ మధ్యములో ననఁగా వేల వర్షములో నాయుగ ధర్మ మెక్కువగా నుండును. సంధ్యాంశమందు కొంత క్షీణించును. అనఁగా కృతయుగములో నాలుగువేల దివ్య వర్షములు ధర్మాతిరేకము. త్రేతలో మూడువేల దివ్యవర్షములు. ద్వాపరమందు రెండువేల వర్షములు. కలియుగమందు సహస్ర వర్షములు.

350. కృతయందు ధర్మము నాలుగుపాదములు. త్రేతలో మూడు. ద్వాపరమున రెండు. కలియుగమున నేకపాదము.

351. పాద విభేదంబుననన్=పాదముల భేదముచే, తఱుఁగున్=తక్కు వగును, ఆ కొలఁదియే=ఆ మేరకే, ఉత్పాదిల్లి=జన్మించి, ధరా దివిజులు= బ్రాహ్మణులు.

**తాత్పర్యము :** పాద భేదములతో ధర్మభేదము లేర్పడును. త్రేతయందు ఒక్క పాద మధర్మ మగును. ద్వాపరమున నర్ధము. కలియుగమున మూఁడు

పాదములు వృద్ధిపొందును. ధర్మమునకు పట్టుగొమ్మలైన బ్రాహ్మణులు అధర్మపరు లగుదురు.

352. భూర్భువ స్స్వర్లోకముల కంటెను సత్యలోకము పొడవైనది. బ్రహ్మ యచట నుండును. చతుర్యుగ సహస్రములు గడచినచో బ్రహ్మ కొక పగలు. రాత్రి పరిమాణము నింతే. పగటి యందు సృష్టిచేయును. అంతమేరకే యున్న రాత్రియందు నిదురించును. అపుడు జగత్తు లన్నియు లీనమై యుండు. మేల్కొన్నపుడు సృష్టి జరుగును. ఒక పనిని చేయుచు నడుమ కొంత విశ్రాంతి తీసికొని ఆకార్యముచేయుట సహజము. సృష్టిక్రమము నింతియే. సృష్టికార్యము మరల మొదటినుండియు జరుగునని యర్థముకాదు. దినాంతమునకు దినకల్పమని పేరు. బ్రహ్మదేవుని పగటియందు పదునల్వురు మనువులు వచ్చిపోవుదురు. ఒక్కొక్క మనువు కాలములో డెబ్బది యొక్క మారు చతుర్యుగములు చుట్టును. ఆమనుకాలమందు ఆతనికి తగిన దేవతలు మునులు సప్త ఋషులు భగవదంశముతో జన్మించి మనువునకు సహాయకులై ఉందురు.

353. ఒక్కొక్క మనువు కాలమునందును శ్రీహరి, పితృ=పితరులు, సుపర్వులు=దేవతలు. తిర్యక్కులు=సూకరాదులు నరరూపములతో జనించి తన సత్త్వగుణముతో లోకములను పరిపాలించును.

354. సరోజగర్భుఁడు=బ్రహ్మ, దివసాంతమునన్=పగలు గడచిన రాత్రికాలమందు, తమః పిహిత పరాక్రముఁడై=చీఁకటి చేత కప్పఁబడిన పురుషాకారము కలవాఁడై, శయనించును=పండుకొనును.

**తాత్పర్యము** : దినకాలము గడచిన మీఁద బ్రహ్మ నిదురించును. అప్పుడు సమస్తలోకములను చీఁకటి నాక్రమించు కొనును.

355. భువనత్రయము=ములోకములు, తమః పిహితము=చీఁకటి యందున్నది. భానుచంద్రులలోన్ విలీనము=సూర్యచంద్రులు కూడ వీలీన మని భావము. విలయసమయ=ప్రళయ కాలమందు, సముత్కట=రేఁగిన, విపుల=విశాలమైన, చండ=వేగవంతమైన, వాత=గాలిచేత, ధూత=కొట్టఁ బడిన, వీచి=అలలు, దుర్వార వార్ధి=అడ్డగింపరాని సముద్రము.

**తాత్పర్యము** : రాత్రి కాలమందు సమస్తమును చీఁకటి కప్పును. సూర్యచంద్రులు నుండరు. సర్వాత్ముఁడైన హరిమాత్ర ముండును. అపుడు సంకర్షణాగ్ని సమస్తలోకములను దహించును. దాని వేఁడిమికి మహర్లోక వాసులు బాధచెంది జనోలోకమున కేగుదురు. అటుతర్వాత బ్రహ్మాండముగా ప్రళయవాతములు వీచును. సముద్రము లుప్పొంగును.

భువనముల నన్నింటిని వార్ధుల జలములు ముంచును. ఆ జలములపై లక్ష్మీశ్వరుఁడైన భగవంతుఁడుండును.

356. పటీర=చందన, హీర=తెల్లని వజ్రము, ఘనసార=పచ్చ కర్పూరము. తుషార=మంచు, మరాళ=హంస, చంద్రికాపూర=వెన్నెల ప్రవాహము, మృణాళహార=బిసహారము, పరిపూర్ణ సుధాకర=రాకా చంద్రుఁడు, కాశ=రెల్లు, మల్లికాసార=మల్లెపూవుల ప్రవాహము, వీనితో, నిభ=సమానమైన, అంగ శోభిత=శరీరముతో శోభించు, భుజంగమ తల్పము=శేషశయ్య, జఠరస్థిత= కడుపులోనున్న, భూర్భువరాదిలోకుఁడై = భూర్భువరాది ప్రపంచములు కలవాఁడు.

తాత్పర్యము : ఆ కాలమందు స్వామి శేష శయ్యయందు పండి యుండును. ఆతని కడుపులో భూర్భువ రాదిలోకము లుండును. శేషుని శరీరమందు తెల్లని వస్తువు లన్నియు ఉపమానముగా చెప్పినాఁడు. విషయము లేనిచోట వినువారి కాసక్తి కలిగించుటకై పోతనామాత్యుఁడు ఇట్టి శాబ్దికములైన చమత్కారము లొనరించుచుండును.

357. జనలోక నివాసకులు=జనలోక మం దున్న వారు, అతుల= సాటి లేని, దివ్యప్రభ=గొప్పకాంతి, మీలిత నిజలోచనుఁడై=మూసికొన్న కన్నులు గలవాఁడై.

359. బహువిధ=అనేక విధములైన, కాలగతి ఉపలక్షితములై=కాలగతి చేత సూచింపఁబడినవై, పంకజాసనునకున్=బ్రహ్మకు.

తాత్పర్యము : కాలగతిచేత ఉపలక్షితములై రాత్రింబగళ్ళసమూహము గడువగా. ఆ గడచుటతో నిర్ణయింపఁబడిన సంవత్సర శతము మనుష్యులకు పరమాయుస్సు. బ్రహ్మదేవునకు కూడ ఆయుస్సు నూఱేండ్లు. కాని యాతని లెక్కవేఱు. సహస్ర చతుర్యుగములు గడచిన నొక్కపగలు. రాత్రియు నంతే. ఇట్లు శతవర్షములు గడచిన బ్రహ్మదేవుని ఆయువు పూర్తియగును. ఆతని ఆయువులో అర్ధభాగమునకు పరార్ధమని పేరు. మొదటి పరార్ధము గడచి రెండవ పరార్ధము జరుగుచున్నది. మొదటి కల్పము బ్రాహ్మకల్పము. ఈ కల్పమందు శబ్దాత్మకమైన వేదము బహిర్గత మగుటచే దీనికి బ్రాహ్మకల్ప మని పేరు.

360. పంకజనాభుఁడు=విష్ణువు, నాభిసరసి=బొడ్డు అనెడి సరస్సు, భువనాశ్రయము=ప్రపంచరూపమైనది.

తాత్పర్యము : శ్రీ మహావిష్ణువు యొక్క నాభిసరస్సు భువనమునకు సంకేతము. పద్మము జన్మించిన కల్పమునకు పాద్మకల్పమని పేరు.

361. పూర్వ పరార్థమందు జరిగిన బ్రాహ్మ పాద్మకల్పముల వివరించినాఁడు. ఇఁక ద్వితీయపరార్థము. దాని యం దొకప్పుడు హరి సూకరాకారమును ధరించెను. అందుచే దానికి వారాహ కల్ప మని పేరు. అదియే ఇప్పుడు జరుగుచున్నది.

362. భగవంతుడు కాలస్వరూపుఁడు. వానికి ఆద్యంతములు లేవు. అనాదియైన వాఁడు. పరమాణ్వాదియైన బ్రహ్మయాయుస్సు ముగియునంతకాలము ప్రభున కొక్కనిమేషము కనుక ఈశ్వరుని కాలము నూహింపలేము. నేను నాది యని అభిమానమున్న వారిని కాలము బంధించును. శ్రీహరి ఆ గుణములు లేని వాఁడు. అందుచే కాల మాతని బంధింపనేరదు. షోడశవికార యుక్తము=పదునారు వికారములతో కూడినది. జ్ఞానకర్మేంద్రియాలు పది, పంచభూతములు మనస్సు. బ్రహ్మాండమునకు పదియావరణములు, ఏబది కోట్ల విస్తీర్ణము.

364. నవ నీరజనేత్రుఁడు=క్రొత్తవైన పద్మములతో సమానమైన కన్నులు గలవాఁడు, అప్రమేయుఁడు=ఎవరి అంచనాలకు చిక్కనివాఁడు.

తాత్పర్యము : శ్రీహరి పరమాణు రూపముతో జగత్తునందు వసించును, సంఖ్యాతీతములైన బ్రహ్మాండము లాతని రోమకూపము లందుండును. సమస్త కారణములకు కారణ మాతఁడే. అతఁడిట్టివాఁడని చెప్పుటకు నెవ్వరికిని నసాధ్యము.

365. నిరతిశయ+ఉజ్జ్వల+తేజస్ఫురణన్=సాటిలేనిదై ఎప్పుడు గొప్పగా ప్రకాశించు తేజస్సు, సరసిజ భవ భవులకైనన్=సరసిజభవ, భవులు ద్వంద్వసమాసము. బ్రహ్మయు నీశ్వరుఁడును గూడ నీతని స్వరూపమును వర్ణింప లేరని యర్థము.

ఇది పోతన రచించిన తెనుఁగు భాగవతమునందు

ఏకాదశాధ్యాయము ముగిసినది.

T.T.D. Religious Publications Series No.753
Price : Rs.



సరస్వతీ పుత్ర, మహాకవి పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవారు అనంతపురం జిల్లా, చియ్యేడు గ్రామంలో 28-3-1914 లో జన్మించారు. వీరితండ్రి శ్రీనివాసాచార్యులు, తల్లి కొండమ్మ. పుట్టపర్తి నారాయణాచార్యులవారు కడప రామకృష్ణ హైయ్యర్ సెకండరీ స్కూలు ఉపాధ్యాయుడుగా పని చేశారు.

ఆచార్యులవారు సంస్కృతం, ఆంగ్లం, తమిళం, హిందీ, మొదలైన పద్నాలుగు భాషలను పుక్కిటబట్టిన విద్వత్తల్లజులు. ఆయన పెనుగొండ లక్ష్మి, సాక్షాత్కారం, శివతాండవం, పండరి భాగవతం, జనప్రియ రామాయణం, శ్రీనివాస ప్రబంధం మొదలైన పద్యద్విపద గేయరచనలు, మహాభారతోపన్యాసాలు, ప్రబంధనాయికలు వగైరా వచనరచనలు పదిపదులకు మించి రచించారు.

పుట్టపర్తి సాహితీ కృషినిమెచ్చి రసజ్ఞ సమాజం ఆయనకు ఎన్నో గౌరవపదవులు కట్టబెట్టింది. భారతప్రభుత్వం పద్మశ్రీ బిరుదంతో, శ్రీ వేంకటేశ్వర, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్ పట్టాలతో గౌరవించాయి

కేంద్రరాష్ట్ర ప్రభుత్వ సన్మానాలతోపాటు ఆచార్యులవారు కంచికామకోటి, శృంగేరి పీఠాధిపతుల సత్కారాలు అందుకొన్నారు. ఆయనకు ఢిల్లీ, కలకత్తా, పూనా, నాగపూర్, బెంగుళూరు, మద్రాసు, తిరువనంతపురం, అలంపూర్ వంటి పట్టణాలలో ఘన సన్మానాలు జరిగాయి. ఆంధ్రదేశంలో ఆయన పొందినన్ని సత్కారాలు మరేకవి పొందలేదు.

సరస్వతీ పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులవారు వ్యాసకృత సంస్కృత భాగవతం, దానికి తెలుగు అనువాదమైన బమ్మెరపోతన భాగవతం జతకలిపి చేసిన వ్యాఖ్యాన గ్రంథమే ఈ భాగవత సుధాలహరి. వారు భాగవతంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్కంధాలకు మాత్రమే వ్యాఖ్య సంతరించారు.

---

Published by Sri **K.V. Ramanachary, I.A.S.**, Executive Officer,
Tirumala Tirupati Devasthanams and printed at T.T.D. Press, Tirupati.